

## థైలీరియాను తరిమేద్దాం

- వ్యాధి సోకిన పశువులలో 90 శాతం మృత్యువాత
- పాడి సంపద సంరక్షణకు ప్రభుత్వం కంకణం
- రూ.600 ఖరీదు చేసే టీకా ఉచితంగా పంపిణీ
- జిల్లాకు 97,500 డోసులు మంజూరు

- 8లో

# వీడని వాన

**మన్యంలో ఎడతెరిపి లేకుండా వర్షం**

- జనజీవనానికి తీవ్ర అంతరాయం
- రహదారులు జలమయం
- వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన

చింతపల్లిలో వర్షం

**పాడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** మన్యంలో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనం అవస్థలు పడ్డారు. తుఫాన్‌ను తలపించేలా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో జీనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని దాదాపు ప్రతి మండలంలోనూ వర్షాలు కురుస్తున్నాయి. ఒడిశాను ఆనుకుని ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మిలిగిన మండలాల్లో ఒక మోస్తరుగా వానలు కొనసాగుతున్నాయి. తాజా వర్షాలు ఖరీఫ్ వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నాయి. అలాగే వర్షాలతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. మంగళవారం కొయ్యూరులో 29.6, చింతపల్లిలో 25.2, అనంతగిరిలో 24.7, జీకేవీధిలో 23.6, పెదబయలులో 22.6, పాడేరులో 22.5, డుంబ్రిగుడలో 22.1, అరకులోయలో 21.7, జి.మాడుగులలో 20.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముంచంగిపుట్టులో మంగళవారం రాత్రి వర్షం

### రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

**చింతపల్లి:** జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు మంగళవారం ప్రకటించారు. ఈ నెల ఆరో తేదీ వరకు పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 7 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ 74-89 శాతం ఉంటుందన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ సూచించారు. ముఖ్యంగా మట్టి ఇళ్లు, కచ్చా ఇళ్లల్లో ఉన్న వారిని పక్కా గృహాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాజ్‌వేలను గుర్తించి నివేదించాలని, కొట్టుకుపోయిన కాజ్‌వేల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, రెడ్ రిబ్బన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని కలెక్టర్ సూచించారు. వర్షాలు కురుస్తున్న ఈ తరుణంలో జలపాతాల వద్దకు వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం తరువాత నుంచి పర్యాటకులను జలపాతాల వద్దకు అనుమతించవద్దని ... మిగతా 8వ పేజీలో

# తేలిన ఇంజనీరింగ్ సీట్ల లెక్క

**ఉమ్మడి విశాఖలో 20,460**

**ఏయూలో 1,020**

- మరో 22 ప్రైవేటు కళాశాలల్లో 19,440...
- గడిచిన ఏడాది కంటే 2,370 సీట్లు పెరుగుదల

**విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల లెక్క తేలింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) రాష్ట్రంలోని ఇంజనీరింగ్ సీట్ల వివరాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని 24 కాలేజీల్లో 20,460 సీట్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొంది. ఇందులో ఆంధ్ర యూనివర్సిటీలోని రెగ్యులర్, మహిళా ఇంజనీరింగ్ కాలేజీల్లో కలిపి 1,020 సీట్లు ఉన్నాయి. మరో 22 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లలో 2025-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిర్వహించుకునేందుకు ఉన్నత విద్యాశాఖ అనుమతి ఇచ్చింది.

గడిచిన ఏడాదితో పోలిస్తే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది 18,090 సీట్లకు మాత్రమే ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది ఈ సీట్ల సంఖ్య 20 వేలు దాటింది. గత ఏడాదితో పోలిస్తే 2,370 సీట్లు పెరిగాయి. ఏయూలో గడిచిన ఏడాది 900 సీట్లలో ప్రవేశాలకు ఏఐసీటీఈ అనుమతి ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్య 1,020 సీట్లకు పెరిగింది. అంటే 120 సీట్లు పెరిగాయి. అలాగే, గడచిన ఏడాది 21 ప్రైవేటు కాలేజీల్లో 17,190 సీట్లు ఉండగా, ఈ ఏడాది మరో కాలేజీ పెరిగింది. మొత్తం 22 కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నట్టు వెల్లడించింది. గడిచిన ఏడాదితో పోలిస్తే 2,250 సీట్లు పెరిగాయి. ఈ నెలాఖరు నాటికి తొలి దశ ప్రవేశాలు పూర్తిచేయాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

# రెవెన్యూ సేవలపై కలెక్టర్ అసంతృప్తి

## సదస్సుల్లో సమస్యలు పరిష్కరించకపోవడంపై ఆగ్రహం

- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ అభిషేక్‌గౌడ

**పాడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో రెవెన్యూ సేవలపై కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సబ్ కలెక్టర్లు, 22 మండలాల రెవెన్యూ అధికారులతో పీజీఆర్ఎస్ వినతులు, మ్యుటేషన్లు, భూముల రీసర్వే, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రెవెన్యూ సదస్సులు జరిగి ఆర్నెళ్లు గడిచినా మ్యుటేషన్లు పరిష్కరించలేదని తహశీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ 368 రెవెన్యూ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. సచివాలయాల్లో రెవెన్యూ సేవలు ప్రజలకు సక్రమంగా అందడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సేవా సర్వీసెస్ వెబ్‌సైట్‌లో నేటికి పరిష్కరించాల్సిన వినతులు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లు ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. ప్రతి వారం సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బందితో రివ్యూ చేసి ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పాడేరు, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లలో సబ్ కలెక్టర్లు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. మ్యుటేషన్ల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియను ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. భూముల రీసర్వే పక్కాగా చేయించాల్సిన బాధ్యత తహశీల్దార్లపై ఉందన్నారు. రీసర్వే నిర్వహణలో భాగంగా 13 నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయడం లేదని రెవెన్యూ అధికారులను జేసీ ప్రశ్నించారు. అలాగే 13 నోటిఫికేషన్ జారీకి సాంకేతిక సమస్యలుంటే సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. పెదబయలు, జి.మాడుగల, మారేడుమిల్లి మండలాల్లో రీసర్వే 13 నోటిఫికేషన్ జారీపై జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, పీజీఆర్ఎస్ వినతులకు త్వరగా పరిష్కారం చూపాన్నారు. అర్జీదారులతో రెవెన్యూ అధికారులు మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వీఆర్‌వోలతో సమీక్షించాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మావతి, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, పాడేరు ... మిగతా 8వ పేజీలో

### బీజేపీ జాతీయ కౌన్సిల్‌లో ఇద్దరు గిరిజన నేతలకు స్థానం

- కురుసా ఉమామహేశ్వరరావు, పాంగి రాజారావుకు దక్కిన అవకాశం

కురుసా ఉమామహేశ్వరరావు

పాంగి రాజారావు

**పాడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇద్దరు గిరిజన నేతలకు జాతీయ కౌన్సిల్‌లో స్థానం కల్పించింది. ప్రస్తుతం బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కురుసా ఉమామహేశ్వరరావు, బీజేపీ అరకు జిల్లా మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావులను బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమించింది. పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు చెందిన సీనియర్ గిరిజన నేతలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంతో మన్యం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు పదవులు ఇచ్చిన బీజేపీ నేతలకు ఉమామహేశ్వరరావు, రాజారావు కృతజ్ఞతలు తెలపగా, వారిద్దరికి మన్యంలోని బీజేపీ నేతలు అభినందనలు తెలుపుతున్నారు.

# జోరుగా చోడి నాట్లు

**వర్షాలు అనుకూలించడంతో ముమ్మరంగా రాగుల సాగు**

- ఏజెన్సీలో సుమారుగా 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట
- సాగు విస్తీర్ణంలో వరి తరువాత స్థానం రాగుల పంటదే

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

**మన్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో చోడి(రాగులు) నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఏజెన్సీలో వరి సాగు తరువాత చోడి సాగుకే గిరిజనులు అధిక ప్రాధాన్యం ఇస్తారు. దీంతో ఏ గిరిజన పల్లెలో చూసినా చోడి నాట్లు వేస్తున్న పనుల్లో ఉన్న గిరిజనులే కనిపిస్తున్నారు.**

ఏజెన్సీ వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సుమారుగా 48 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేయగా, సుమారుగా 26 వేల హెక్టార్లలో చోడి పంటను పండిస్తుంటారు. రాగులను ప్రధాన ఆహార పంటగా గిరిజనులు సాగు చేస్తుంటారు. సాగునీటి సదుపాయం ఉన్న పల్లపు ప్రాంతాల్లో వరిని పండిస్తే, కాస్త మెట్ట, కొండ ప్రాంతాల్లో చోడి పంటను వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమి మెత్తబడడంతో గిరిజనులు తొలి దుక్కి పనులు పూర్తి చేసి, జోరుగా చోడి నాట్లు వేస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో నీటి తడి ఎక్కువ అవసరం లేని ప్రాంతాల్లో సైతం ఈ పంట పండుతుంది. దీంతో గిరిజనులు తమ గ్రామాలకు చేరువగా ఉన్న మెట్ట, కొండ ప్రాంతాల్లో చోడి సాగు చేస్తున్నారు. చోడిని పండించి, వాటిని పిండి చేసుకుని9 ఏడాదంతా గిరిజనులు నిల్వ చేసుకుంటారు. ఆ పిండితో జావ(అంబలి)చేసుకుని ప్రతి రోజు ఆహారంగా తీసుకుంటారు. తక్కువ ఖర్చుతో ఆహారం సమకూరడంతో పాటు చోడిలో పిండి పదార్థాలు, ఇనుము, తదితర పోషక విలువలు ఉండడంతో గిరిజనులకు ఆరోగ్యపరంగా మేలు చేస్తున్నది.

హుకుంపేట మండలం బోడిగపుట్టు గ్రామంలో చోడి నాట్లు వేస్తున్న గిరి రైతులు

నాట్లు వేసిన రాగుల చేను

**విభిన్న పద్ధతిలో చోడి నాట్లు**

గిరిజనులు చోడి నాట్లు వేసే విధానం సైతం విభిన్నంగా ఉంటుంది. ఎక్కడైనా భూమిని దున్నేసి, చక్కగా దమ్ముపట్టి నాట్లు వేయడం చూస్తుంటాం. కానీ గిరిజనులు అందుకు భిన్నంగా చోడి నాట్లు వేస్తారు. పంట భూమిని తొలుత మెత్తగా దున్నేస్తారు. దుక్కి పనులు పూర్తయ్యే నాటికి చోడి నారును సిద్ధం చేసుకుంటారు. ఇంటిల్లపాది పంట భూమి వద్దకు చేరుకుని పురుషులు వ్యవసాయ పని ముట్లతో పాయగా చేసి, ఆ పాయలో నాట్లు వేసి మట్టితో కప్పేస్తుంటారు. మహిళలు మడిలోని నారు తీసి నాట్లు వేసే ప్రదేశానికి తీసుకువస్తారు. ఇలా గిరిజనులు సంప్రదాయబద్ధంగా చోడి నాట్లు వేస్తుంటారు. అలాగే దుక్కి పనులు చేపట్టే అవకాశం లేని పెద్ద పెద్ద కొండ ప్రాంతాల్లో నేరుగా విత్తనాలనే చల్లేస్తుంటారు.

**రాగుల సాగుకు కానరాని సాయం**

ఏజెన్సీలో రాగులు సాగు చేసే గిరిజన రైతులకు ప్రభుత్వం ... మిగతా 8వ పేజీలో

పాడేరు మండలం ఉగ్గంగొయ్యి గ్రామంలో వృద్ధురాలికి పెన్షన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

## తొలి రోజు 91.49 శాతం పెన్షన్ల పంపిణీ

**జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 1,21,659 మంది**

- 1,11,484 మందికి నగదు అందజేత

**పాడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో సామాజిక పించన్ల పంపిణీ ప్రక్రియలో భాగంగా తొలి రోజు మంగళవారం 91.49 శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును అందించారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో మొత్తం 1,21,659 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.51కోట్ల 13 లక్షల 96 వేల 500 విడుదల కాగా, తొలి రోజు రాత్రి 8 గంటల సమయానికి 1,11,484 మందికి రూ.46 కోట్ల 78 లక్షల 97వేలు పెన్షన్ల సొమ్మును అందించారు. ఇంకా 10,175 మందికి అందించాల్సి ఉంది. దీంతో జిల్లాలో తొలి రోజు పెన్షన్ల పంపిణీ 91.49 శాతంగా నమోదైంది. తొలి రోజు పెన్షన్ పొందని లబ్ధిదారులకు బుధవారం అందజేస్తామని అధికారులు తెలిపారు. కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి పాడేరు మండలం లగిశపల్లి పంచాయతీ ఉగ్గంగొయ్యి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు పెన్షన్ సొమ్మును అందించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, సర్పంచ్ లకే పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### బంధవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

మృతి చెందిన విద్యార్థిని లక్ష్మి

**జి.మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బంధవీధి గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందింది. పాఠశాల యాజమాన్యం కథనం ప్రకారం.. సొలభం పంచాయతీ సారుబయలు గ్రామానికి చెందిన మర్రి లక్ష్మి(13) బంధవీధి ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం తరగతికి హాజరైంది. మధ్యాహ్నం విరామ సమయంలో తరగతి గదిలో కిందపడిపోయి స్పృహ కోల్పోయింది. వెంటనే నీళ్ల విరేచనం చేసింది. దీంతో ఉపాధ్యాయులు ప్రైవేటు వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. విద్యార్థిని మృతితో తల్లిదండ్రులు భాస్కరరావు, దీప్తీలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# పాకలో పాఠశాల

**శిథిలావస్థకు చేరిన మంగళపాలెం గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాల**

- శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో పాకను ఏర్పాటు చేసిన గ్రామస్థులు
- అందులోనే కొనసాగుతున్న చదువులు
- వర్షాలకు కారిపోతుండడంతో విద్యార్థుల అవస్థలు

పాకలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

**గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాకలో విద్యాభ్యాసం చేస్తూ అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల భవనం శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థుల కోసం గ్రామస్థులు కొన్నేళ్ల క్రితం పాకను నిర్మించారు. ప్రస్తుతం ఈ పాకలోనే ఉపాధ్యాయుడు విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు 40 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పాక కారిపోతోంది. అలాగే చల్లగాలులు వీస్తుండడంతో విద్యార్థులు చలికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు గ్రామస్థులు పలుమార్లు ఈ సమస్యను విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతూనే చదువులు సాగిస్తున్నారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి ఈ పాఠశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిలాస్థకు చేరిన మంగళపాలెం పాఠశాల

వేడుక ఏదైనా.. సందర్భం ఎటువంటిదైనా

- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్

మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9985411644

## బాలసదనంలో చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు

వైద్య పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

పాడేరురూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలసదనంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలసదనంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మంది చిన్నారులను డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడు, వైద్యులు టీఎన్.ప్రతాప్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వారిలో మెరుగైన వైద్య సేవలు పొందాల్సిన చిన్నారులను ప్రత్యేక అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈకార్యక్రమంలో వైద్య, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ హోమ్ పునఃప్రారంభం

గర్ల్ చిల్డ్రన్స్ హోం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెతన్య గర్ల్ చిల్డ్రన్ హోమ్‌ని నిర్వాహకులు పునఃప్రారంభించారు. ఉత్కల్ మైనారిటీ వీకెర్స్ సెక్షన్ డెవలప్‌మెంట్ సొసైటీ గత కొంత కాలంగా ఈ హోం నిర్వహిస్తూ అనాథ గిరిజన బాలికలకు భోజన వసతి కల్పించి విద్యను అందిస్తుంది. ఏడాది క్రితం మైదాన ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న హోంలో ఓ విందులో మిగిలిపోయిన ఆహారం బాలబాలికలకు పెట్టడంతో ఇద్దరు మరణించగా పలువురు అస్వస్థతకు గురైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనతో గిరిజన ప్రాంతంలో రిజిస్ట్రేషన్‌లేని హోంలను కలెక్టర్ మూసివేయించారు. తాజాగా కలెక్టర్ హోం నిర్వాహణకు అనుమతివ్వడంతో ఈ కేంద్రాన్ని మంగళవారం పునఃప్రారంభించారు.నిర్వాహకులు వసుపరితిమోతి, రాఘవరావు, నెల్లూరి ఆనందరావు, సుందరావు, ఆంటోని, పద్మాకరరావు, డేవిడ్, రమేశ్, దయానిది, జాన్‌మార్కు పాల్గొన్నారు.

## అల్లూరి జయంతికి సన్నాహాలు

డుంబ్రిగుడ, జూలై1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మన్యం వీరుడు అల్లూరి సీతరామరాజు జయంతికి ఏర్పాట్లు చేస్తు న్నట్టు ఆ సంఘం మండల అధ్యక్షుడు సూర్య ప్రకాశ్ తెలిపారు. మంగళవారం స్థానిక సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి స్ఫూర్తితో గిరిజన చట్టాలు, హక్కులపై నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు అరుణ్‌రాజ్, నవపూర్య తదితరులు పాల్గొన్నారు.

## పెదకోట హైడ్రో ప్రాజెక్టుపై జీవో తగదు: సీపీఎం

పాడేరురూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలం పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతులిస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సోమవారం జీవో 51 జారీ చే సిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అదానీ కంపెనీ ఆధ్వర్యంలో పెదకోట ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వైసీపీ ప్రభుత్వం బాటలు వేసిందని, అప్పట్లో ఆ చర్యలను వామపక్షాలతోపాటు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. గిరిజన ప్రాంతంలో సహజ సంపదలను అదానీ కంపెనీకి దారాధత్తం చేయవద్దని అప్పట్లో ఆం దోళన చేశాయన్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకించిన కూటమి నేతలు, తాజాగా జీవో జారీ చేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రత్యేక చట్టాలు, హక్కులను ఉల్లంఘించందని, నేడు కూటమి ప్రభుత్వం అదేబాటలో పయనిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## చింతపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా సీహెచ్ సీతామహాలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. తాజా బదిలీల్లో మూడేళ్లగా ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన యూఎస్‌వీ శ్రీనివాసరావుని అచ్యుతాపురం బదిలీ చేయగా, ఆయన స్థానంలో మాకవరపాలెంలోని సీతామహాలక్ష్మిని నియమించారు. ఈమేరకు ఆమె విధుల్లో చేరారు.

హుకుంపేట: కామయ్యపేట వెళ్లే రోడ్డుపై వరద నీరు

హుకుంపేటలో ప్రధాన రోడ్డు దుస్థితి

# వర్షాలతో రహదారులు ఛిద్రం

- గోతుల్లో నీరు చేరి బురదమయం
- గ్రామీణ ప్రాంత ప్రజలు అవస్థలు

హుకుంపేట జూలై 1 ఆంధ్రజ్యోతి: గత ఐదు రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు హుకుంపేట ప్రధాని రహదారి అధ్వానంగా మారింది. బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారింది. ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాల రద్దీతోపాటు సమీపంలో హస్టల్ విద్యార్థులు రాక పోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తీగలవలస పంచాయతీ కామయ్యపేట ప్రధాన రోడ్డు ఇదే పరిస్థితిలో ఉంది. గుంతలు, రాళ్ల తేలాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ మార్గంలో ప్రజలు, ఉద్యోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. తడిగిరి, తీగలవలస, మోట్టుజోరు మూడు పంచాయతీలకు ఇదే రహదారిలో ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నాంటారు. స్థానిక గిరిజనులు గతంలో వైసీపీ నేతలకు సమస్య విన్నవించినా పట్టించు లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి పాలనలోనైనా అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

### ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతగిరి: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా భారీ వీస్తున్న ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాలకు వెళ్లేమార్గమధ్యలోగల గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాల గిరిజనులు రాకపోలకు అవస్థలు తప్పడంలేదు.

## ముంచంగిపుట్టులో హై వోల్టేజీ సమస్య

- గృహోపకరణాలు ధ్వంసం
- వారం రోజులుగా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

హై వోల్టేజీతో కాలిపోయిన ఓ స్టేషనరీ షాప్‌లో కంప్యూటర్ ఎల్‌ఈడీ స్ర్కీన్, జిరాక్స్ మిషన్

ముంచంగిపుట్టు, జులై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత వారం రోజులుగా విద్యుత్ హై వోల్టేజీ సమస్య నెలకొంది. దీంతో పలు ఇళ్లు, షాప్‌ల్లో ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఇన్వెర్టర్లు, విద్యుత్ బల్బులు, ఎల క్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే హై వోల్టేజీతో స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని పూర్ణ స్టేషనరీ షాప్‌లో జిరాక్స్ మిషన్, కంప్యూటర్ సీపీయూ, ఎల్‌ఈడీ స్కీన్ కాలిపోయాయి. దీంతో సుమారు రూ. 30 వేలు నష్టం వాటిల్లినట్టు యజమాని పూర్ణ వాపోయాడు. అలాగే, ఫ్రెష్‌మార్ట్ షాప్‌లో రెండు ఫ్రిజ్‌లు, ఇన్వెర్టర్ కాలిపోయాయని. దీంతో సుమారు రూ. 60 వేలు నష్టం వచ్చిందని యజమాని దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రుత్విక ఫ్యాన్సీ షాప్‌లో ఇంటర్ నెట్ మోడెం, రెండు ట్యూబ్‌లైట్లు, మీగడ శంకరరావు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్, ఐదు విద్యుత్ బల్బులు, లక్ష్మి ఇంట్లో ఒక ఇండక్షన్ స్టౌ కాలిపోయాయి. అలాగే పలువురు ఇళ్లలోనూ ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. స్విచ్ బోర్డులు కాలిపోయాయని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూట్రల్ వైర్ తెగిపోవడంతో విద్యుత్ హై వోల్టేజీ సమస్య తలెత్తినట్లు తెలుస్తుంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి సరి చేయాలని కోరుతున్నారు. లేకుంటే స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## బ్యాంకింగ్ సేవలపై ప్రజల్లో అవగాహన: కలెక్టర్

ఆర్థిక కేంద్రీకృత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, జూలై 1(ఆంధ్ర జ్యోతి): ప్రజల్లో బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, బీమా పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 1 నుంచి 30 తేదీ వరకు జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 430 గ్రామ పంచాయతీల్లో ప్రజలకు బ్యాంకింగ్, ఇతర ఆర్థిక సేవలు, బీమా పథకాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాహిత్, ఎల్‌డీఎం మాతునాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి రవిశంకర్, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు పాల్గొన్నారు.

## విద్యా రంగంపై జగన్ విమర్శలు విడ్డూరం

- టీఎన్ఎస్ఎఫ్ నేత సత్యనారాయణ

మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నేత సత్యనారాయణ, తదితరులు

పాడేరురూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తన పాలనలో విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ అధినేత వైఎస్.జగన్ నేడు కూటమి పాలనలో విద్యారంగంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని టీఎన్‌టీయూసీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ అన్నారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ స్థానిక క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు చేపట్టి, వ్యవస్థను గాడిన పెడుతున్నారన్నారు. జగన్ హయాంలో ఈసెట్ కౌన్సెలింగ్ ఎన్నడూ సక్రమంగా నిర్వహించలేదని, కానీ, నేడు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ ప్రక్రియ సాగుతోందన్నారు. కానీ, జగన్ తప్పుడు ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నేతలు పాండురంగస్వామి, రామారావు, నాగేశ్వరరావు, కొండబాబు, అచ్చిబాబు, త్రినాధ్, తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి'

ఆస్పత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేత పాండురంగస్వామి

పాడేరురూరల్, జూలై 1(ఆం ధ్ర జ్యోతి): అనుకోని విధంగా ప్రాణాలు కోల్పోయిన జి.మాడుగుల మండలం బంధవీధి ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని మర్రి లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని టీడీపీ నియోజకవర్గ నేత పాంగి పాండురంగస్వామి కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థిని మర్రి లక్ష్మి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ కుటుంబనికి న్యాయం చేసేందుకు తాము కృషి చేస్తామని ఆయన తెలిపారు.అలాగే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## విద్యా రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: టీడీపీ డివిజన్ నేత

ముంచంగిపుట్టు, జులై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గిరిజన ప్రాంతంలోని విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు టీడీపీ పార్టీ డివిజన్ నేత పాండురంగస్వామి అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ కుమ్మరిపుట్టులోని పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆయన స్కూల్ బ్యాగ్, యూనిఫాం, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పాఠశాల, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అదే పంచాయతీ మాలిపుట్టు గ్రామంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శోభకోట సర్పంచ్ పలసీ శశి భూషణం నాయుడు, ఉపాధ్యాయులు నాగేష్, త్రినాధ్, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ గణపతి, హార్టికల్చర్ అసిస్టెంట్ చందు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### యూనిఫారాలు ధరించాలి

పెదబయలు: విద్యార్థులతో ఎంఈవో కృష్ణమూర్తి

పెదబయలు: విద్యార్థుల్లో క్రమశిక్షణ ఉట్టిపడేలా యూనిఫారాలను విద్యార్థులు తప్పకుండా ధరించాలని ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం సదుద్దేశంతో యూనిఫారాలను పంపిణీ చేస్తోందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తురకలవలస కాంప్లెక్స్ పరిధిలో గల అల్లంగిపుట్టు ప్రాథమిక పాఠశాలలో రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూ అడ్మిషన్లుంటే త్వరతిగతిన పాఠశాలకు చేర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రాపవుట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఘనంగా వైద్యుల దినోత్సవం

పాడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నేషనల్ డాక్టర్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య పితామహుడు బిదాన్‌చంద్ర రాయ్ చిత్రపటానికి జీఎంసీ ప్రిన్సిపల్, సిబ్బంది, వైద్య సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం గర్వించదగిన వైద్యుడై బిదాన్‌చంద్రరాయ్ జననం, మరణం జూలై ఒకటో తేదీన కావడంతో దానిని జాతీయ వైద్యుల దినోత్సవంగా పేర్కొంటూ ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు లక్ష్మీకుమారి, డాక్టర్ పాపారత్నం, ప్రొఫెసర్లు డాక్టర్ రాధ, శిరిషా, చంద్రమోహన్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొపెసర్లు, సీనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

**చింతపల్లి:** వైద్యులు సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి. ఇందిరాప్రియాంక అన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రిలో జాతీయ డాక్టర్స్ దినోత్సవం పురస్కరించుకుని వైద్యులు కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పనిచేసేందుకు ముందుకొచ్చిన వైద్యులను అభినందనీయులని కొనియడారు. ఈకార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారి నీలవేణి, డాక్టర్లు వాసవి, రుక్మిణి, భా రతి, లా వణ్య, అనుష, శ్రీలత ఉన్నారు.

బిదాన్‌చంద్రరాయ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎంసీ ప్రిన్సిపల్ హేమలతదేవి

**జెన్‌కో ఆస్పత్రిలో..**

సీలేరు: వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని జీకేవీధి మండలం సీలేరు ఏపీ జెన్‌కో ఆసుపత్రిలో మంగళవారం స్థానిక వైద్యాధికారులను అధికారులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ శ్రీనివాసరెడ్డి ముఖ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవ్య హెల్త్ సర్వీసెస్ వైద్యాధికార్లు ఆర్. ఆకాష్, జి. మృదుల, ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్ వల్లీకు ఈఈ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చింతపల్లిలో కేక్ కట్ చేసిన ఏరియా ఆస్పత్రి వైద్యులు

సీలేరు జెన్‌కో ఆస్పత్రిలో వైద్యులను సన్మానిస్తున్న అధికారులు

## ఏడు గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

సీలేరు స్విచ్‌యార్డులో జంపర్లను మార్చుతున్న జెన్‌కో సిబ్బంది

సీలేరు, జూలై 1 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు, పరిసర గ్రామాలకు మంగళవారం ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు. సీలే రులోని జలవిద్యుత్ కేంద్రం సమీపాన స్విచ్‌యార్డులోని 33/11 కేవీ విద్యుత్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అవతోంది. గత మూడు రోజులుగా ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ లైన్‌పై చెట్లు కొమ్మలు పడి స్విచ్‌యార్డులో 33/11 కేవీకి సంబంధించిన రెండు జంపర్ల కాలిపోయాయి. దీంతో సీలేరు పరిసర గ్రామాలకు ఉదయం ఏడున్నరన్నుంచి విద్యుత్ సరఫరా చిలిచిపోయింది. జెన్‌కో సిబ్బంది చెట్లు కొమ్మలు తొలగించి, కాలిపోయిన రెండు జంపర్లను మార్చి విద్యుత్ సరఫరాను మధ్యాహ్నాం రెండు గంటలకు పునరుద్ధరించారు. వర్షం కురుస్తుండంతో విద్యుత్ పునరుద్ధరణకు ఏడు గంటల సమయం పట్టినట్టు సిబ్బంది తెలిపారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర

చినలబుడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న దొన్నుదొర, అధికారులు

అరకులోయ, జూలై1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర అన్నారు. పెదలబుడు,చినలబుడు గ్రామ పంచాయతీల పరిధిలోని పలుగ్రామాల్లో పింఛన్లను దొన్నుదొర అధికారులతో కలిసి పంపిణీ చేశారు. వృద్ధులకు ప్రతీ నెలా 1 వతేదీన ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పింఛన్ల సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం రూ. వేలు పెన్షన్ ఇస్తే... కూటమి దానిని రూ. 4 వేలకు పెంచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 20వేల కిలో మీటర్లమేర రోడ్లకు మరమ్మతులు చేపట్టినట్టు చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధక్షుడు లకోయ్ మహదేవ్, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్‌బీ భీమరాజు, నాయకులు బోయి దామేదర్, పాంగి భరత్‌రాం, చందూ విజయనిర్మల, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్,బొరిబొరి లక్ష్మి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అరకులోయ మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో సుమారు 6367 పింఛన్లకు మంగళవారం సాయంత్రంనాటికి 90 శాతం పైగా పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఎ.లవరాజు తెలిపారు.

## ' లోకుల గాంధీ సేవలు మరువలేం'

శరభన్నపాలెంలో గాంధీ స్మారక మందిరంలో నివాలర్పిస్తున్న అభిమానులు, కుటుంబీకులు

కొయ్యూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) నిజాయితీ, నిస్వార్థంగా గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారానికి పాటుపడి అతి పిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లోకుల గాంధీ సేవలను మరువలేమని వక్తలు అన్నారు. లోకుల గాంధీ 50వ జయంతి వేడుకలను శరభన్నపాలెం, రత్నంపేట, కొయ్యూరు తదితర గ్రామాలలో నిర్వహించారు. శరభన్నపాలెంలో బీజేపీ మండల అధ్యక్షుడుడు సంపరి శివ, తో పాటు కుటుంబీకులు గాంధీ స్మారక మందిరం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. రత్నంపేటలో గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అరకు నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కుసిరెడ్డి శివప్రసాద్ సమకూర్చిన చీరలను వృద్ధులకు పంపిణీ చేశారు. కొయ్యూరులో నేతలు శరభయ్య, గాలి దేముడు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి విద్యార్థులకు స్వీట్సు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ ఏర్పాటు చేసిన ది తోడు ట్రస్టు ద్వారా చేసిన సేవలను వివరించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో గొలుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు గౌరినాయుడు, కార్యదర్శి రామదాసు, అల్లూరి జిల్లా ఉపాధక్షుడు చంద్రరావు, సామాజిక సేవకుడు అర్జున, నేతలు నగేశ్, శివ, అచ్చుతవాణి, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

**గూడెంకొత్తవీధి:** దివంగత లోకుల గాంధీ సేవలు మరువలేమని బీజేపీ మండలాధ్యక్షుడు కాకూరి శేఖర్ అన్నారు. మంగళవారం లోకుల గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. పేద గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకుల గాంధీ గిరిజన ప్రాంతంలో తొలి ఐఐటీ చదవిన విద్యార్థి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రీమల పాల్, ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి పాల్గొన్నారు.

## 'టూరిజంను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సహించం'

అనంతగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఏపీ టూరిజంను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే సహించేదిలేదని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు హెచ్చరించారు. పర్యాటక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులతో కలిసి మంగళవారం హరిత రిసార్ట్స్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఉన్న రిసార్ట్స్ తదితర వాటిని ప్రైవేటు వ్యక్తులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుందని, దీనిని విరమించుకోవాలని ఈ సందర్భంగా గంగరాజు డిమాండ్ చేశారు. గిరిజనులు ఉపాధికి గండి కొడితే సహించేదిలేదన్నారు. 1/70 చట్టం ఉంటుండగా.. ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, టూరిజం కార్మికులు విజయ్, బుద్ధరాజు, శ్రీను, సోమర పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తల బృందం

గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకి సన్నద్ధంకావాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి అన్నారు.మంగళవారం మొడిగెడ్డ గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, సామ, రాగి, జొన్న, కొర్రలు సాగుకు నాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పంట పొలాల్లో నాటుకున్న పచ్చిరొట్ట ఎరువుని భూమిలో కలిగియదున్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్ నాయక్, డాక్టర్ వెంకటేశ్, వ్యవసాయ అధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.

## రోగులకు అంబులెన్స్ సేవలు దూరం

గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివాసీ రోగులకు అంబులెన్సు సేవలు దూరమయ్యాయి. జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐటీడీఏ గత నెలలో కొత్త అంబులెన్సులు మంజూరు చేసింది. తాజాగా వారం రోజుల క్రితం వాహనాలు సర్వీసింగ్ కోసం మైదాన ప్రాంతాలకు తరలించారు. సర్వీసింగ్ పూర్తి చేసి రోజులు గడుస్తున్నా, బిల్లు చెల్లించక అంబులెన్సులు పీహెచ్‌సీలకు అప్పగించలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో రోగులను ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రికి తరలించాల్సి దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి సర్వీసింగ్ బిల్లు చెల్లించి పీహెచ్‌సీలకు అంబులెన్సులు అందజేయాలని వైద్య సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

## ప్రమాదకర స్థితిలో వంతెన



వంతర్భ సమీపంలో వంతెనను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రామారావు

పెదబయలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిముడుపల్లి పంచాయతీలో వంతర్భ గ్రామ సమీపంలో గల ప్రధాన వంతెన వరద నీటితో పొంగి ప్రవహిస్తూ ప్రమాద భరితంగా మారింది. ఈ స్థితిలో మంగళవారం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పాంగి రామారావు వంతెనను పరిశీలించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ పరిధిలో గ్రామాల ప్రజలు ఆ వంతెనపై రాకపోకలు చేయరాదని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన వంతెన ఏ సమయంలో కూలుతుందోనని అన్నారు. ఇప్పటికే వంతెన ఎత్తు వరకు నీరు చేరిందని తెలిపారు.

### వంతెన శిథిలంతో అవస్థలు

హుకుంపేట: హుకుంపేట- చింతవీధి సమీపాన వంతెన వర్షాలకు పాక్షికంగా శిథిలం కావడంతో ఈ మార్గంలోని సోభకోట, మోట్టుజోరు, తడిగిరి, తిగలవలస పంచాయతీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇదే రోడ్డులో నిత్యం కామయ్యపేటకు ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. అధికారులు స్పందించి రాకపోకలు అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

చీడికాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ/దేవరాపల్లి/మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో మంగళవారం కార్యకర్తల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వపరి పాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, అలాగే వారికి ఇంకా అందాల్సిన పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు చెప్పిన సమస్యలన్నీ రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ బాధ్యతను బూత్, గ్రామ కమిటీల ప్రతినిధులు కూడా తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశాల్లో పార్టీ మండల ఎన్నికల పరిశీలకులు కొల్లి శ్రీనివాసరావు, యేసుదాసు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, పెద్దాడ వెంకటరమణ, అద్దేపల్లి జగ్గారావు, మాజీ ఎంపీపీలు పోతల రమణమ్మ, కుచ్చు కళావతి, నాయకులు గండి ముసలినాయుడు, గండి లక్ష్మి, శరగడం శివ, గవిరెడ్డి జగన్నాథం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పాత్రునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శెట్టిపాలెం పాఠశాలను సందర్శించిన డీఈవో

డీఈవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం పాఠశాలను డీఈవో అప్పారావు నాయుడు మంగళవారం సందర్శించారు. 'నాడు వెల వెల-నేడు కళకళ' అని శీర్షికతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంపై 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 27న వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను, సర్పంచ్ అల్లు రామునాయుడు అభినందించారు. అలాగే వారికి పలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయరాలు తమ ఇద్దరు పిల్లలను ఇదే పాఠశాల్లో చేర్పడం ప్రశంసనీయమని, ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని డీఈవో కోరారు. కార్యక్రమంలో ఏంఈవో మూర్తి పాల్గొన్నారు.

## రోజంతా ముసురే..

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మంగళవారం తెల్లవారు నుంచి వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షం కాకపోయినా రోజంతా చిరుజల్లులతో అడపాదడపా మోస్తరు వర్షం పడింది. దీంతో రోడ్లు చిత్తడిగా మారాయి. వానలో తడుస్తూనే జనం తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

### నర్సీపట్నంలో...

నర్సీపట్నం రహదారిలో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం: పట్టణంలోని చుట్టు పక్కల ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ముసురు పట్టుకుంది. తెల్లవారు జాము నుంచి తెరిపివ్వకుండా తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యక్తగత పనుల మీద బయటకు వచ్చే వారంతా అసౌకర్యానికి గురయ్యారు. శివారు ప్రాంతాల్లో మట్టి రోడ్లు చిత్తడిగా తయారయ్యాయి.

## వైభవంగా మోదకొండమ్మ ఘటాల పండుగ

ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఘటాల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అమ్మవారిని పూలదండలతో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వర్షం పడుతున్నప్పటికీ భక్తులు ఘటాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఘటాలను సమర్పించి ముడుపులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## మోదకొండమ్మకు లక్ష పసుపు కొమ్ముల పూజ

పసుపు కొమ్ములతో చేసిన పూజ

మాడుగుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో కొలువైన మోదకొండమ్మకు మంగళవారం లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజ చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం వరకు పలువురు దంపతులు, భక్తులు సమర్పించిన పసుపు కొమ్ములతో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కూర్మవతారంలో జగన్నాథుడు

మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో జగన్నాథుడు మంగళవారం భక్తులకు వామనవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు పండా నూకరాజు స్వామివారిని వామనవతారంలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు.

## మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చీడికాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాకోట వెంకట సత్యనారాయణ ఆర్థిక సాయంతో కోలాట కళాకారులకు సౌండ్‌బార్‌ను మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో కోనాం జలాశయం కమిటీ వైస్ చైర్మన్ కె.చిన్నంనాయుడు, టీడీపీ నాయకులు మిస్కా రామరాజుయాదవ్, దొడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ

**కార్యక్రమంలో హుషారుగా పాల్గొన్న ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారులు**

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఓవైపు జోరుగా వర్షం కురుస్తున్నా మరోవైపు అదే స్థాయిలో సామాజిక పింఛన్ల పంపిణీ సాగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మంగళవారం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారుల పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందించారు.

చోడవరం మండలంలో వర్షం కురుస్తున్నా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆటంకం లేకుండా కొనసాగించారు. గోవాడ, నరసాపురం పంచాయతీలతో పాటు మండల కేంద్రంలోని తామరచెరువువీధి, వెలమవీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, కనిశెట్టి మత్స్యరాజు, ఏడువాక లక్ష్మణకుమార్, సకురు కోటేశ్వరరావు, డీవీ.అప్పారావు, జనసేన నేత అల్లం రామప్పారావు పాల్గొన్నారు.

### మాడుగులలో...

మాడుగుల రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ముకుందపురంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టతరంలో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎ.జగ్గారావు, పి.రమేశ్, ఉండూరు దేముడు, మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

### నర్సీపట్నంలో...

పింఛను పంపిణీ చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం: పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. వార్డులో మంగళవారం గడప గడపకు వెళ్లి రూ.4 వేలు పింఛను సొమ్ము లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థ లేకుండానే 98 శాతం పింఛన్లు పంపిణీ ఒక రోజులో పూర్తి చేసినట్టు చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం పింఛను రూ.4 వేలు ఇస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కొరుప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో మంగళవారం వర్షం కురుస్తున్నప్పటికీ ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. దిబ్బిడి గ్రామంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు. రూ.200 ఉన్న సామాజిక పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు

మాడుగుల: ముకుందపురంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

గుర్తు చేశారు. అలాగే వడ్డాది గ్రామంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదని, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో రూ.4 వేలు పింఛన్ అందిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్, సర్పంచ్ పి.మాణిక్యం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, నాయకులు ఎం.తాతీలు, కె.రవి, దేవర అప్పారావు, దొండా సాయి, తలారి శంకర్, ఎం.సూరిబాబు పాల్గొన్నారు

### రోలుగుంటలో...

రోలుగుంట: ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ నెల ఒకటో తేదీనే లబ్ధిదారులకు శతశాతం పింఛన్ల పంపిణీ నేరుగా ఇస్తున్నామని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర పేర్కొన్నారు. రాజన్నపేట, శరభవరం గ్రామాల్లో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన లబ్ధిదారులందరికీ నూతనంగా పింఛన్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు.

చోడవరంలో వర్షంలోనూ పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

### దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలో వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా ఇంటింటికీ ఉద్యోగులు, నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. మంగళవారం తెల్లవారు నుంచి ఈ కార్యక్రమం జరిగింది. గర్శింగి, బి.కింతాడ, తారువ, కలిగొట్లలో నాయకులు సూర్యనారాయణ, కడింనాగేశ్వరరావు, అల్లు శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న బత్తుల తాతయ్యబాబు

# ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించండి

» జడ్పీ సీఈవో నారాయణమూర్తి

మేడివాడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సీఈవో నారాయణమూర్తి

రావికమతం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) నారాయణమూర్తి ఆదేశించారు. మండలంలోని మేజరు పంచాయతీ మేడివాడలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. అలాగే గ్రామంలో పలు వీధులను సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో మేడివాడలో 70 శాతం ప్రజలు క్లాప్ మిత్రలు ఇళ్లకు రావడం లేదని తెలిపారని ఆయన వెల్లడించారు. ఇకపై ఇటువంటి వ్యతిరేకత లేకుండా పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది చూసుకోవాలని ఆయన సూచించారు. పంచాయతీకి చెందిన ఆరుగురు క్లాప్ మిత్రలు మూడు జట్లుగా విడిపోయి ఇంటింటికీ చెత్త సేకరించాలని, దాన్ని సంపద తయారీ కేంద్రానికి తరలించాలని చెప్పారు. అనంతరం సంపద కేంద్రం పనితీరును ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా గ్రామంలో ఏమాత్రం పారిశుధ్యం లోపించకూడదని, ఎప్పటికప్పుడు తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శి పి.దాలినాయుడును ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రపు నాగవెంకటలీలా, ఈవోపీఆర్డీ సీతారామస్వామి పాల్గొన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం వైద్యుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.సతీశ్, ట్రెజరీ అధికారి రామారావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు శర్మ వైద్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రముఖ వైద్యులు రాజశేఖర్, అధికారి గోపాలరావు, వంశీకృష్ణ, నాగేశ్వరరావు, రేడియాలజిస్ట్ డాక్టర్ అల్లు రమ్య, చిన్న పిల్ల వైద్యులు లక్ష్మీకాంత్‌ను శాలువ కప్పి జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు గోపి, కాళ్ల నాయుడు, ఏవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో..

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో మంగళవారం జాతీయ డాక్టర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్ కేక్ కట్ చేశారు. వైద్యులు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు విష్ణుప్రియ, హిమబిందు, రేష్మ, రవికుమార్, విజయలక్ష్మి, హెడ్‌నర్సు జయంతి, ల్యాబ్‌టెక్నిషియన్ సూర్యశంకరరావు, రమేశ్‌నాయుడు, సౌందర్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది..

మాడుగుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు, సాగరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి వ్యవసాయ రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి విజేత, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు సౌజన్య, సత్తిబాలు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున సాగు చేసే పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. విత్తన మార్పిడి, నారు మడులు తయారు చేసుకోవడం, పలు యాజమాన్య పద్ధతులు గురించి వారు అవగాహన కల్పించారు. అనంతరం వరినారు మడులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అనసూయ, ఎంపీఈవో లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## ములకలాపల్లిలో దుర్గమ్మకు పూజలు

దేవరాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లిలో దుర్గమ్మ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు పాకల కామేశ్వరరావు శర్మ పూజలు చేయించారు. గ్రామస్థులు ఉదయం నుంచి పూజలు చేసి అనంతరం అన్న సమారాదన నిర్వహించారు.

## ఈవోపీఆర్డీగా బాలదొర

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈవోపీఆర్‌డీగా బాలదొరను నియమించినట్టు ఎంపీడీవో ఛాయిసుధా తెలిపారు. ఈవోపీఆర్‌డీగా పనిచేసిన సీతామహాలక్ష్మి చింతపల్లికి బదిలీ కావడంతో సోమవారం రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో ఈవో బాలదొరకు బాధ్యతలు అప్పగించినట్టు ఎంపీడీవో చెప్పారు. ప్రస్తుతం ఆయన మాకవరపాలెం, తామరం గ్రామ సచివాలయాలకు ఈవోగా పనిచేస్తున్నారు.

## విత్తన శుద్ధి తప్పనిసరి

కె.కోటపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరి నారుమడులు వేసుకునే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారి సోమశేఖర్ చెప్పారు. వారాడ, సంతపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తనశుద్ధిని బీజామృతంతో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బాబీ మాస్టారుకు అభినందన సభ

బాబీ మాస్టారు దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి నుంచి విరమణ పొందిన జీఎస్ రవిశంకర్‌కుమార్ (బాబీ మాస్టారు) దంపతులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు ఘనంగా సత్కరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అభినందన సభకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి బాబీ మాస్టారు సూచనలు, సలహాలు అవసరమన్నారు. ఆయన 300 సన్మాన పత్రాలు రాశారని తెలిపారు. ఎన్నో కార్యక్రమాల ముందుండి నడిపించారని కొనియాడారు. ఉపాధ్యాయులు అంటే మేధావి వర్గానికి చెందిన వారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అధ్యయనం చేసి తన దృష్టికి తీసుకువస్తే లోపాలు సరిదిద్దడానికి ప్రయత్నం చేస్తానన్నారు. అనంతరం ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ రామారావు, పీఆర్‌టీయూ, వాకర్స్ క్లబ్, సిటీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు మాస్టారును సన్మానించారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, ఎంఈవో తలుపులు పాల్గొన్నారు.

## కొండపాలెంలో విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్

రోలుగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాలెం పాఠశాలలో మంగళవారం రిటైర్డ్ హెచ్‌ఎం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. 39 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ విరమణ పొందిన ఈశ్వరప్రసాద్ పాఠశాలలోని ఐదు తరగతుల విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేశారు. చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశారపు రాము, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసిన గల్లా

మాధవ్‌ను శుభాకాంక్షలు తెలుపుతున్న గల్లా

రావికమతం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ నియామకమైన మాధవ్‌ను ఆ పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరరావులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు గుటాల చిన్నతో కలిసి విజయవాడలో నిర్వహించిన మాధవ్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రలో కార్యకర్తలను పేరు పెట్టి పిలవగల సాన్నిహిత్యం మాధవ్‌కు ఉందని వారు పేర్కొన్నారు.

## మూగజీవాలకు నట్టల నివారణ టీకాలు

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మసాగరం, అమలాపుం, మునిసిపాలిటీలోని బలిఘట్టంలో పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు మంగళవారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 180 గొర్రెలు, 520 మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాంబాబు తెలిపారు. గొర్రెలు, మేకలు పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.పుష్ప, పి.సురేశ్ పాల్గొన్నారు.

## నేడు నేత్ర వైద్య శిబిరం

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ క్లబ్ ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ చైర్మన్ పోతల ప్రకాశరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని ఆయన చెప్పారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## మోడల్ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయుల నియామకం

గొలుగొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మోడల్ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయులు ప్రభుత్వం నియమించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జోగంపేట, గొలుగొండ, కొత్త మల్లంపేట, చోద్యం, ఏఎల్.పురం, కృష్ణాదేవిపేట, కొంగశింగి, చీడిగుమ్మల, ఎర్రవరం, కొత్తఎల్లవరం, గుండుపాల, పాకలపాడు గ్రామాల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. అధిక శాతం మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో చేరేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలి

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరినారు వేసే మందు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.అప్పారావు చెప్పారు. పాపయ్యపాలెం, పైడిపాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో విత్తనం వేయడానికి పది నుంచి 12 రోజుల ముందు బాగా దున్ని, కలుపులేకుండా చేసుకొని చదును చేయాలని చెప్పారు. నారు తీయడానికి వారం రోజుల ముందు ప్రతీ ఐదు సెంట్ల మడికి 800 గ్రాముల 3జి కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నీటి నిల్వలు తొలగించాలి

గొలుగొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాల సీజన్‌కావడంతో తొట్టేల్లో నీటి నిల్వలు తొలగించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలకు తడకూడదని, వేడిచేసిన నీటిని తాగాలని ఆయన చెప్పారు. అలాగే దోమల కుట్టకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీలా, హెచ్‌వీ, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో బీమా పథకాలు

» డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మునగపాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ సేవల్లో భాగంగా తక్కువ ప్రీమియంతో పలు బీమా పథకాలు అందుబాటులోకి వచ్చినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ కె.సచిదేవి పేర్కొన్నారు. మండలంలో నాగులాపల్లిలో మంగళవారం గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సభ్యులకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష, బీమా యోజన, ప్రమాద బీమా, ప్రధాన మంత్రి జీ వన్ జ్యోతి తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్ 30 గడవుతో ఈ బీమాలో నమోదు కావాలన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం సత్యనారాయణ, వెలుగు ఏపీఎం వై.బాలరాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# థైలీరియాను తరిమేద్దాం

**వ్యాధి సోకిన పశువులలో 90 శాతం మృత్యువాత**

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంకరజాతి పశువులకుసంక్రమించే థైలీరియా వ్యాధి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా రూ.600 ఖరీదు చేసే టీకాను ఉచితంగా పశువులకు వేస్తుంది. మంగళవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15వ తేదీ వరకు ఈ వ్యాధి నిరోధక టీకాను సంకరజాతి పశువులకు వేయనుంది.

- పాడి సంపద సంరక్షణకు ప్రభుత్వం కంకణం
- రూ.600 ఖరీదు చేసే టీకా ఉచితంగా పంపిణీ
- జిల్లాకు 97,500 డోసులు మంజూరు

### 70 శాతం పశువులకు టీకా వేయాలని లక్ష్యం

జిల్లాలో 1.9లక్షల సంకర జాతి పశువులు ఉండగా, 70 శాతం పశువులకు ఈ టీకాలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నర్సీపట్నం డివిజన్‌కు 24,800 డోసులు, అనకాపల్లి డివిజన్‌కు 72,700 డోసులు చొప్పున మొత్తం అనకాపల్లి జిల్లాకు 97,500 డోసులు మంజూరు చేసింది. మూడు నెలలు దాటిన ఆడ, మగ సంకరజాతి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు పశువైద్య నిపుణులు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు.

### వ్యాధి సోకి ఏడాదికి రెండు వేల పశువులు మృతి

థైలీరియా వ్యాధి వలన ఏడాదికి రెండు వేల సంకర జాతి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఈ వ్యాధి సోకిన పశువులలో 90 శాతం చనిపోతున్నాయి. వ్యాధి నివారణకు వేల రూపాయలు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఒక్కోసారి పాడి సంపదను కోల్పోవల్సి వస్తుంది.

### ఇవీ వ్యాధి లక్షణాలు..

థైలీరియా వ్యాధి సంకర జాతి పశువులలో గోమార్లు, పిరుదులు కుట్టడం వలన వస్తుంది. విపరీతమైన జ్వరం, సరిగా మేత మేయక పోవడం, దవడ కింద గగ్గలు వాపు, నీరసించిపోవడం, పాలు దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు వ్యాధిసోకిన పశువుల్లో కనిపిస్తాయి. వ్యాధి వలన చూడి కట్టిన పశువులలో గర్భస్రావం జరగవచ్చు. ఈ వ్యాధి సాధారణ చికిత్సకు లొంగేది కాదు. వారం రోజుల పాటు సెలైన్లు ఎక్కించి, ఖరీదైన యాంటి బయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. వైద్యానికి రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. చికిత్స అనంతరం పశువు కోలుకోవడానికి మూడు నెలలు పడుతుంది. దీంతో పాడి రైతు తీవ్రంగా నష్టపోతాడు. పాడి దిగుబడి తగ్గి పోయి ఆర్థికంగా చితికి పోతాడు. పాడి రైతు నష్ట పోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టీకాను ఉచితంగా పంపిణీ చేస్తుంది.



థైలీరియా నివారణకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న టీకాలు

### పశువులకు టీకా ఎంతో మేలు



థైలీరియా టీకా కార్యక్రమం ఈ నెల 15 తేదీ వరకు కొనసాగుతుంది. రైతులు తమ పశువులకు వేయించుకోవాలి. మూడు నెలలు దాటిన ఆడ, మగ సంకర జాతి పశువులకు తప్పకుండా ఈ టీకాల వేయిస్తే థైలీరియా వ్యాధి సోకదు. **డబ్ల్యూ.రాంబాబు,** ఏడీ, పశు సంవర్ధక శాఖ, నర్సీపట్నం

# కోటవురట్ల మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ

- త్వరలోనే నిరుద్యోగ భృతి అమలు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో హోం మంత్రి అనిత

బీకేపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి అనిత.., పింఛన్ లబ్ధిదారు ఇంటి వద్ద ఆమె కలిసి టీ తాగుతున్న దృశ్యం

కోటవురట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని బీకేపల్లిలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. వారితో మాట్లాడి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ 492 ఎకరాల ప్రభుత్వ భూముల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమను నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ఇందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నక్కపల్లిలో టాయ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో 25 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. సంక్షేమ ఫలాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ప్రతి గ్రామంలో నిరుద్యోగ భృతికి ఎంతమంది అర్హులు ఉన్నారో గుర్తించాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలోనే నిరుద్యోగ భృతి వస్తుందని స్పష్టం చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, తహసీల్దార్ తిరుమల బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, వేచలపు జనార్ధన్, ఎలమంచిలి ప్రకాష్, ఎస్.రాయవరం మండల నాయకుడు అబద్ధం, మాజీ ఎంపీపీ వినోద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలపై కలెక్టర్ అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, 22 మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

### రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

అధిక దిగుబడులు సాధించి ఆదాయం పెంచడమే లక్ష్యంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వారి అవసరాల మేరకు రైతులకు పంట రుణాలు అందించాలని, మల్బరీ సాగును విస్తరించాలన్నారు. అందుబాటులో ఉన్న రిజర్వాయర్లలో చేప పిల్లల పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్మించిన ఫారం పాండ్స్‌లో చేపల పెంపకం చేపట్టాలని, దానిపై ఎంపీడీవోలు అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఈ సీజన్‌లో చేపల పెంపకానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కాఫీ రైతులు పార్చిమెంటు కాఫీ తయారీకి ప్రణాళికలు రూపొందించాలని ఉద్యానవనాధికారులను ఆదేశించారు. కాఫీ రైతులకు మిరియాల శుద్ధి యంత్రాలు, బేబీ పల్పర్లు పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జీడి తోటల పునరుద్ధరణ పనులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా జీడి తోటలు విస్తరణ చేయాలని, వై.రామవరం మండలంలో అవకాడో పండ్ల తోటలు పెంచాలని సూచించారు. జిల్లాలో 2 వేల ఎకరాల్లో మైక్రో ఇరిగేషన్ సదుపాయాలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈ నెల పదో తేదీ నాటికి పశువులకు వ్యాక్సినేషన్, గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చింతూరు ఐటీడీఏ పరిధిలో డెయిరీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్.నందు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, హౌసింగ్ పీడీ బి.బాబు నాయక్, సీపీవో పీవీఎల్.ప్రసాద్, పశు సంవర్ధకశాఖ డీడీ వి.జయరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లాలోని 22 మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# సకాలంలో సామాజిక పింఛన్లు పంపిణీ

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను జిల్లాలో సక్రమంగా, సకాలంలో పంపిణీ చేయాలని కలెక్టర్ వి జయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి 81వ వార్డు నూకాలమ్మ దేవాలయం వీధిలో పలువురి లబ్ధిదారుల ఇళ్లకు మంగళవారం ఉదయం వెళ్లి పింఛన్లను పంపిణీ చేసి వారితో మాట్లాడారు. ప్రతి నెలా పింఛన్ సరిగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. దీంతో వారు సకాలంలో అందుతోందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు కె.శచీదేవి, సహాయ పథక సంచాలకులు వై.సంతోష్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

81వ వార్డు నూకాలమ్మ దేవాలయం వీధిలో వృద్ధుడుకి పింఛన్ అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

# క్యాప్టివ్ పోర్టుపై కదలిక

**డీఎల్‌పురం కేంద్రంగా నిర్మాణం**

- స్థలాన్ని పరిశీలించిన జపనీస్ బృందం

నక్కపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీలు సంయుక్తంగా భారీ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆమోదం కూడా లభించింది. స్టీల్‌ప్లాంట్‌కు అనుగుణంగా డీఎల్‌పురం తీరం వద్ద క్యాప్టివ్ పోర్టును నిర్మిస్తారని ప్రచారం జరిగింది. ఈ మేరకు మంగళవారం జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్, ఆర్సెలర్ మిట్టల్ కంపెనీల ప్రతినిధుల బృందం డీఎల్‌పురం గ్రామంలో పర్యటించింది. ప్రైవేట్ రంగంలో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీకి తొలి విడతగా 2,260 ఎకరాల భూములు అవసరమని గుర్తించారు. ఉక్కు పరిశ్రమ ఉత్పత్తులు, మరికొన్ని ముడిసరుకుల రవాణా, ఇతర అవసరాల కోసం ఈ పరిశ్రమలు క్యాప్టివ్ పోర్టును నిర్మించుకోవలసి వుంది. అందుకే ఈ బృందం డీఎల్‌పురం తీర ప్రాంతాన్ని, భౌగోళిక పరిస్థితులను పరిశీలించింది. నక్కపల్లి తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణారావు వారి వెంట వున్నారు. స్టీల్‌ప్లాంటు నిర్మాణం కోసం కేటాయించిన భూముల్లోనే క్యాప్టివ్ పోర్టు కోసం కావలసిన భూములను ఈ కంపెనీలు తీసుకుంటాయని తెలిసింది.

క్యాప్టివ్ పోర్టు కోసం డీఎల్‌పురం తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జపనీస్ ప్రతినిధుల బృందం

# పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా

- 625 ఫోన్‌లను బాధితులకు అందజేసిన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పదో విడత మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. రూ.1.20 కోట్ల విలువైన 625 ఫోన్‌లను రికవరీ చేసి ఎస్పీ తుహిన్ సిన్హా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 5,600 మొబైల్ ఫోన్లు పోయినట్టు ఫిర్యాదులు నమోదు కాగా, 3,336 మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. రికవరీ చేసిన ఫోన్ల విలువ రూ.5.27కోట్లు ఉంటుందని చెప్పారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఫోన్‌లను కనుగొని రికవరీ చేయడం జరిగిందన్నారు. మొబైల్ మిస్సింగ్‌పై ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి రికవరీ చేస్తున్నట్టు వివరించారు. మొబైల్ రికవరీలో విశేషంగా కృషి చేసిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు, ఐటీ కోర్ ఎస్‌ఐ బి.సురేష్‌బాబు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ రికవరీ మేళా మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

## జోరుగా చోడి నాట్లు

... 5వ పేజీ తరువాయి

వ్యవసాయ శాఖ సంపూర్ణంగా ఎటువంటి ప్రత్యేక సాయం చేయక పోయినా గిరిజనులు మాత్రం తాము పండించిన పంట నుంచే కొంత మేరకు విత్తనాలు సమకూర్చుకుని, వాటిని పొదుపు చేసుకుని చోడి సాగును ప్రతి ఏడాది చేపడుతున్నారు. చిరు ధాన్యాల జాబితాలో ఉన్న చోడి పంటకు ప్రభుత్వపరంగా ప్రత్యేక సాయం అందించడంతో పాటు ఆ పంట అంతరించిపోకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే ఎటువ ంటి ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగించకుండా సంప్రదాయబద్ధంగా, సేంద్రీయ విధా నంలో సాగు చేసే చోడి పంటను ఏజెన్సీలో మరింతగా అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

## చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : చీటింగ్ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. అనకాపల్లిలోని మైక్రో ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌లో చాలా మంది డిపాజిట్లు కట్టారు. డిపాజిట్ల గడువు ముగిసినా తిరిగి ఖాతాదారులకు డబ్బులు చెల్లించలేదు. రూ.11 లక్షల వరకు డిపాజిట్‌దారులకు నగదు చెల్లించకుండా కంపెనీని మూసివేశారు. దీంతో 2015 జనవరి 20వ తేదీన అనకాపల్లికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా విశాఖపట్నంలోని ఆరిలోవ ప్రాంతంలో ఉంటున్న కంపెనీ ద్వారకానగర్ యూనిట్ మేనేజర్ బాబు మహంతిని సోమవారం రాత్రి అరెస్టు చేసి, మంగళవారం కోర్టుకు తరలించినట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

## వీడని వాన

... 5వ పేజీ తరువాయి

తహశీల్దార్లను ఆయన ఆదేశించారు.

### వైద్యశాఖ అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. తాజా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఆయన పీహెచ్‌సీ వైద్యులతో నిర్వహించిన జూమ్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు, ఇతర రోగాలు ప్రబలే అవకాశాలున్నాయని, ఈ క్రమంలో గ్రామాల్లోని పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని డాక్టర్లకు సూచించారు. పీహెచ్‌సీల్లోని వైద్యులు తమ పరిధిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రస్తుత వాతావరణంలో ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.

### చింతపల్లిలో..

**చింతపల్లి:** మండలంలో వర్షం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా తేలికపాటి వర్షం కురుస్తున్నది. గిరిజన రైతుల వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతున్నది. లోతుగెడ్డ వారపు సంతకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షం కారణంగా క్రయ, విక్రయాలు సరిగ్గా సాగలేదు. సంతకు వచ్చే వర్తకులు, వినియోగదారుల సంఖ్య కూడా తగ్గింది. కాగా వర్షం వల్ల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

### ముంచంగిపుట్టులో..

**ముంచంగిపుట్టు:** గత వారం రోజులుగా వర్షం వీడడంలేదు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. నాలుగు రోడ్ల కూడలిపై పలు చోట్ల వర్షపు నీరు ప్రవహించింది. మారుమూల గ్రామాల్లో వాగులు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహించాయి. వర్షం కారణంగా జనం ఇళ్లకే పరిమితమయ్యారు.

## క్రైం... crime news

### ఏలేరు కాలువలో వృద్ధురాలి మృతదేహం

కశింకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరకాం గ్రామంలో గల ఏలేరు కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం మంగళవారం లభ్యమైందని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈమె వయస్సు సుమారు 60 నుంచి 70 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. చామనఛాయ రంగులో ఉందని వివరించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని ఆయన కోరారు.

ఏలేరు కాలువలో గుర్తించిన గుర్తు తెలియని మృతదేహం

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి పిసినికాడ పంచాయతీకి చెందిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. బీఆర్టీ కాలనీలో ఉంటున్న కూండ్రపు లక్ష్మణరావు (36) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో నిద్రపోయే ముందు విద్యుత్ బోర్డుకు ఫ్యాన్ ప్లగ్ తగిలిస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య నాగమణి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలావుంటే, మృతుని కుటుంబ సభ్యులను జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ పరామర్శించారు.

### రోడ్డు ప్రమాదంలో రావికమతం వాసి మృతి

రావికమతం, జూలై1 (ఆంధ్రజ్యోతి) :తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా రావికమతానికి చెందిన ముక్కా నాగేశ్వరరావు (53)మృతి చెందాడు. కడియం నర్సరీలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో తన వాహనంలో కడియం నుంచి రాజమండ్రి వస్తుండగా మార్గం మధ్యలో హుకుంపేట డీ మార్టు వద్దకు వచ్చేసరికి వ్యాన్ టైర్ పంచర్ అయింది. దీనిని మార్చేందుకు వ్యాన్‌ను రోడ్డు పక్కన పెట్టి, ఆ సమీపంలో ఉన్న మరో వాహనం నుంచి జాకీని తీసుకోస్తుండగా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతనికి భార్య సత్యవతి, కుమారుడు హేమంత్, కుమార్తె మౌనిక ఉన్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

ముక్కా నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

### 107 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం 107 కిలోల గంజాయితో స్థానిక పోలీసులకు పట్టుబడ్డారు. ఏఎస్‌ఐ నాగేశ్వరరావుకు ముందుగా అందిన సమాచారం మేరకు పట్టణ శివారు గౌరీపట్నం వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఇంతలో ఏజెన్సీ ప్రాంతం నుంచి సిల్వరు రంగు కారు వస్తుండగా, దానిని ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జితేందర్, వాహిద్ అమీద్‌లు కారును కొద్ది దూరంలో నిలిపివేసి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న 107 కిలోల గంజాయితో పాటు, కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఏఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

నిందితులను చూపుతున్న పోలీసులు

### మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ

కశింకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలోని బజారు వద్ద మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు తెంచుకుపోయిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. కశింకోట గ్రామంలో భవానీ కాలనీకి చెందిన చదరం సత్యవతి బజారు వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఇంతలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి ఆమెను బెదిరించి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకుపోయారు. బీధితురాలి ఫిర్యాదు మేరకు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

తాడు తెంచుకుని బైక్‌పై పరారవుతున్న దుండగులు (సీసీ పుటేజీలో నమోదు)

## ఖరీఫ్‌కు అనుకూలంగా వర్షాలు

- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ శ్రీలత

అనకాపల్లి అగ్రికల్చర్ జూలై1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌కు ఈ వర్షాలు అనుకూలమని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీలత తెలిపారు. మంగళవారం ఇక్కడ జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని వివరించారు. వరిపైరు వేసుకునే రైతులకు ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. రైతులు ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204, బీపీటీ 3291, ఎంటీయూ 1262, ఎంటీయూ 1318, ఎంటీటీయూ 1224 వంటి రకాలను సేకరించాలన్నారు. మొలక శాతం చూసుకొని, ఎకరానికి 25 నుంచి 30 కిలోల విత్తనాలను ఐదు సెంట్ల నారుమడిలో విత్తుకోవాలని సూచించారు. అలాగే పొడి విత్తనం అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ మూడు గ్రాములు, దుంప నారుమడికి అయితే కిలో విత్తనానికి, కార్బెండిజిమ్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ కిలో విత్తనానికి పది గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. వర్షాల కారణంగా కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరాకు 80 నుంచి 100 గ్రాములు చొప్పున 20 నుంచి 25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4 నుంచి 7 రోజులలో వేసుకోవాలని శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే ఎద వరిలో కలుపు సమస్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పెండిమిథాలిన్ సీఎస్ 38.7 700 మిల్లీ లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి వరి విత్తిన రెండు రోజులలోపు పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న, కంది వంటి పైరులను విత్తుకోవచ్చునని, రాగి నారును నాటుకోవచ్చునని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణ మూర్తి, వి.గౌరీ,బి.భవానీ, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 70.00 |
| లైవ్ ధర | 90.00 |
| విత్ స్కిన్ | 150.00 |
| స్కిన్ లెస్ | 160.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 585 |
| విజయనగరం | 589 |
| శ్రీకాకుళం | 589 |

CLASSIFIEDS

**CHANGE OF NAME**

I, **BHEEMARA SETTY SRI VARA LAKSHMI** (New Name) W/o. Bheemara Setty Krishna Sai Adinarayana previously called Bheemarasetty Vara Lakshmi (Old Name), Resident of 5-150/1/3/GF, Kaushiki Arcade, Teachers Layout, Sujathanagar, VSKP-530051. Now changed my name from Bheemarasetty vara lakshmi To **BHEEMARA SETTY SRI VARA LAKSHMI**. Hence forth will be called as **BHEEMARA SETTY SRI VARA LAKSHMI** for all purpose.

**FLAT FOR SALE**

అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK Flat, **52** లక్షలకే అమ్మకమునకు కలదు
Contact : **9866321992**
AJV_241292

**దస్తావేజులు పోయినవి**

నేను **NISHEK BATHULA** S/o. వెంకటరమణ, డో.నెం.4-55-2/5, లాసెన్స్‌బే కాలని, విశాఖపట్నం కాపురస్తుడను. నేను తేది 05-05-2025న బాలయ్య శాస్త్రీ లేవుట్ నుండి అక్కయ్యపాలెం మార్గమధ్యలో బైక్‌లో వెళ్తుండగా నా ఇంటి స్థలం తాలూకు దస్తావేజు నెం. **1462/2023, 2170/2023**రు గల దస్తావేజు పడిపోయినవి. దొరికినవారు ఈ ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు : **8790573192.**
AJV_241690

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

## థైలీరియాను తరిమేద్దాం

- వ్యాధి సోకిన పశువులలో 90 శాతం మృత్యువాత
- పాడి సంపద సంరక్షణకు ప్రభుత్వం కంకణం
- రూ.600 ఖరీదు చేసే టీకా ఉచితంగా పంపిణీ
- జిల్లాకు 97,500 డోసులు మంజూరు

- 8లో

# వజ్రాల కొండను మింగేస్తున్నారు

## అక్రమార్కుల బరి తెగింపు

నక్కవానిపాలెం ఎన్టీఆర్ కాలనీ(జగనన్న కాలనీ)ని ఆనుకుని ఉన్న వజ్రాల కొండను తవ్వేసిన దృశ్యం

- దర్జాగా రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లతో అక్రమ తవ్వకాలు
- వాహనాల రాకపోకల కోసం ప్రభుత్వ భూములను ఆక్రమించి రోడ్లు
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు

సబ్బవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):

**మండలంలోని అసకపల్లి గ్రామంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా ఉంది. అక్రమార్కులు దర్జాగా రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి తరలించేస్తున్నారు. వజ్రాల కొండను గుల్ల చేసేస్తున్నారు. రెవెన్యూ, గనులు, విజిలెన్స్ అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.**

అసకపల్లి గ్రామం సర్వే నంబరు 1లో 203.68 ఎకరాల్లో వజ్రాల కొండ ఉంది. ఈ కొండకు ఒక పక్క న్యాయ విశ్వవిద్యాలయం ఉంది. మిగతా మూ డు పక్కల కొండవాలు ప్రాంతంలో నక్కవాని పాలెం, ఎర్రవానిపాలెం గ్రామాలకు ఆనుకొని గతంలో జగనన్న కాలనీలకు ఇచ్చారు. రూరల్ స్కీమ్ ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, అర్బన్ స్కీమ్(పీఎంఏవై) ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ కాలనీలకు ఆనుకొని కొండవాలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఇష్టాను సారంగా స్థానికుల సహకారంతో కొంత మంది గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమ తవ్వకాలపై మీడియాలో పలు కథనాలు వస్తున్నా అవేమీ పట్టించుకోకుండా ఆక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఈ కాలనీలకు ఆనుకొని కొండవాలు ప్రాంతంలో దర్జాగా రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లతో తవ్వి డంపర్లతో తరలించుకుపోతున్నారు. స్థానికంగా కొంత మంది అడ్డుకున్నా దౌర్జన్యం చేస్తున్నారు. న్యాయ విశ్వవిద్యాలయం సమీపంలో ఎన్టీఆర్ కాలనీ(గతంలో జగనన్న కాలనీ)లో భారీగా ... మిగతా 8వ పేజీలో

ఎర్రవానిపాలెం రక్షిత మంచినీటి పథకం వద్ద అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతం

# తేలిన ఇంజనీరింగ్ సీట్ల లెక్క

ఉమ్మడి విశాఖలో
20,460
ఏయూలో
1,020

- మరో 22 ప్రైవేటు కళాశాలల్లో 19,440...
- గడిచిన ఏడాది కంటే 2,370 సీట్లు పెరుగుదల

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల లెక్క తేలింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) రాష్ట్రంలోని ఇంజనీరింగ్ సీట్ల వివరాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని 24 కాలేజీల్లో 20,460 సీట్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొంది. ఇందులో ఆంధ్ర యూనివర్సిటీలోని రెగ్యులర్, మహిళా ఇంజనీరింగ్ కాలేజీల్లో కలిపి 1,020 సీట్లు ఉన్నాయి. మరో 22 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లలో 2025-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిర్వహించుకునేందుకు ఉన్నత విద్యాశాఖ అనుమతి ఇచ్చింది.

గడిచిన ఏడాదితో పోలిస్తే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది 18,090 సీట్లకు మాత్రమే ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది ఈ సీట్ల సంఖ్య 20 వేలు దాటింది. గత ఏడాదితో పోలిస్తే 2,370 సీట్లు పెరిగాయి. ఏయూలో గడిచిన ఏడాది 900 సీట్లలో ప్రవేశాలకు ఏఐసీటీఈ అనుమతి ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్య 1,020 సీట్లకు పెరిగింది. అంటే 120 సీట్లు పెరిగాయి. అలాగే, గడచిన ఏడాది 21 ప్రైవేటు కాలేజీల్లో 17,190 సీట్లు ఉండగా, ఈ ఏడాది మరో కాలేజీ పెరిగింది. మొత్తం 22 కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నట్టు వెల్లడించింది. గడిచిన ఏడాదితో పోలిస్తే 2,250 సీట్లు పెరిగాయి. ఈ నెలాఖరు నాటికి తొలి దశ ప్రవేశాలు పూర్తిచేయాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ హైస్కూల్‌లో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

# ప్రైవేటును వీడి ప్రభుత్వ బడి బాట

## ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పది శాతం విద్యార్థుల సంఖ్య పెంచాలని సర్కారు ఆదేశం

- విద్యాశాఖాధికారుల స్పెషల్ డ్రైవ్
- ఆశాజనకంగా ప్రవేశాలు
- ఈ నెలాఖరు వరకు చేరికలపై దృష్టి

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రతి పాఠశాలలో అదనంగా పది శాతం విద్యార్థుల సంఖ్య పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రతి క్లస్టర్ పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్లను వీడి పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు.**

మాకవరపాలెం మండలం శెట్టిపాలెంలో కొత్తగా చేరిన విద్యార్థులతో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు (ఫైల్)

జిల్లాలో 1,396 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 221 ఉన్నత పాఠశాలలు, 55 ప్రాథమికోన్నత పాఠశాలలు, 206 మోడల్ స్కూల్స్, మిగిలినవి ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో అదనంగా పది శాతం విద్యార్థుల సంఖ్య పెంచాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా, పాఠశాలల పునఃప్రారంభం సమయంలో ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ఉండడంతో టీచర్లు దీనిపై దృష్టి పెట్టలేకపోయారు. వాస్తవానికి జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు సుమారు 18 వేల మంది విద్యార్థులను అదనంగా చేర్చుకోవలసి ఉంది. అయితే అనకాపల్లి మండలం మామిడిపాలెం ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 250 మంది విద్యార్థులకు కొత్తగా ప్రవేశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఆ పాఠశాలలో 165 మంది విద్యార్థులకు కొత్తగా ప్రవేశాలు కల్పించారు. ఇందులో 45 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి చేరినవారే కావడం ... మిగతా 8వ పేజీలో

కోటవురట్ల మండలం బీకేపల్లిలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న హోం మంత్రి అనిత

## చేసిన అభివృద్ధిని చెబుదాం

### నేటి నుంచి ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమం

- సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ప్రజాభిప్రాయం తెలుసుకుందాం
- టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో హోం మంత్రి అనిత

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభమవుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. మంగళవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం వద్ద టీడీపీ నియోజకవర్గం ముఖ్య నేతలు, బూత్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా ... మిగతా 8వ పేజీలో

# జిల్లాలో ముసురు

## రోజంతా తేలికపాటి వర్షపు జల్లులు

- గ్రామీణ ప్రాంతంలోని మట్టి రహదారులు బురదమయం
- వాహనచోదకుల ఇబ్బందులు

చోడవరంలో వర్షం

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి/న్యూస్ నెట్‌వర్క్):

**జిల్లాలో మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. కొన్ని మండలాల్లో కొద్దిసేపు ఒక మోస్తరు వర్షం కురిసింది. అనకాపల్లి, గొలుగొండ, రాంబిల్లి, సబ్బవరం, కె.కోటపాడు మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి జల్లులు పడ్డాయి.**

ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, కృష్ణాదేవిపేట, మాకవరపాలెం, ఎలమంచిలి, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చీడికాడ, చోడవరం, మాడుగుల, రావికమతం మండలాల్లో రోజంతా చినుకులు పడుతూనే ఉన్నాయి. అచ్యుతాపురంలో మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం వరకు ఒక మోస్తరు వర్షం పడింది. ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ముసురుతో కూడిన వర్షం పడుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి రహదారులు బురదమయంగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చినుకులు పడుతుండడంతో పనులపై బయటకు వచ్చేవారు గొడుగులు, రైన్ కోట్‌లు పట్టుకొని రావాల్సిన పరిస్థితి నెలకొంది. ముసురు వాతావరణం మరో రెండు రోజులు కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ వర్షాలు పొలం దుక్కి పనులకు అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అచ్యుతాపురంలో వర్షం

కృష్ణాదేవిపేట పార్కులో పనులను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అధికారులు

## అల్లూరి జయంతి ఏర్పాట్ల పరిశీలన

- పార్కును సందర్శించి అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచనలు
- 4న ఘనంగా నిర్వహించాలని ఆదేశం

కృష్ణాదేవిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఈ నెల 4న స్థానిక అల్లూరి పార్కులో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం సాయంత్రం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో జరుగుతున్న పనులను నర్సీపట్నం ఆర్డీవో రమణ, పర్యాటకశాఖ మేనేజర్ మనోరమ, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇప్పటికే పార్కులో, సమాధుల మందిరంలో విద్యుత్ అలంకరణతో పాటు ప్రహరీ గోడ, భవనాలు, నూతనంగా నిర్మిస్తున్న నాలుగు పగోడాల టైల్స్ మరమ్మతులు, రంగులువేసే పనులను పరిశీలించి అధికారులు, స్థానిక నాయకులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించి ఈ నెల 4న ఉదయం అల్లూరి జయంతి సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలీ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అల్లూరి వేషధారణతో నాటకం, పూలతో సమాధుల ముస్తాబు, సభా వేదిక వద్ద ఏర్పాట్లు చేయాలని ... మిగతా 8వ పేజీలో

## నరసింహావతారంలో జగన్నాథుడు

స్థానిక శ్రీకేశవస్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహావతారంలో ఉన్న జగన్నాథుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

- చోడవరం/ ఆంధ్రజ్యోతి

నరసింహావతారంలో జగన్నాథస్వామి

# హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

## విధి నిర్వహణలో అలక్ష్యంపై చర్యలు

- బీసీ బాలికల కాలేజ్ వసతి గృహంలో సీసీ కెమెరాల ఏర్పాటు

పాయకరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):

స్థానిక బీసీ బాలికల కాలేజి వసతి గృహం వార్డెన్ గంగా భవానినీ ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. ఈ వసతి గృహాన్ని హోం మంత్రి అనిత సోమవారం రాత్రి తనిఖీ చేసి హాస్టల్ నిర్వహణ పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భోజనం అధ్వానంగా ఉండడం, వార్డెన్ అందుబాటులో లేకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంపై హోం మంత్రి సీరియస్ అయ్యారు. దీనిపై విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్పీ, నర్సీపట్నం డీఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సీఐ జి.అప్పన్న మంగళవారం వసతి గృహాన్ని పరిశీలించి ఆ భవనం చుట్టూ నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అలాగే హాస్టల్ విద్యార్థినుల సెల్‌ఫోన్లలో శక్తి టీమ్ సిబ్బంది ద్వారా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించడంతో పాటు యాప్‌ను ఉపయోగించడంపై అవగాహన కల్పించారు.

పాయకరావుపేట బీసీ బాలికల కాలేజి వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన దృశ్యం

## ప్రజలకు అభివృద్ధిని వివరించాలి

▸▸ మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

సమావేశంలో మాట్లాడుతున్న చలపతిరావు

అచ్యుతాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు అన్నారు. మంగళవారం స్థానిక ఓ కల్యాణమండపంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలుఅమలు చేస్తున్నారు. వీటిని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 65 లక్షల మందికి పెన్షన్ పంపిణీ, ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ. 15 వేలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, యువతకు డీఎస్సీ ద్వారా 16347 పోస్టుల భర్తీకి చర్యలు ఏడాదిపాలనలోనే చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇబ్బందులను ప్రజలకు తెలియజేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఇంకా మిగిలిన హామీలను అమలు చేయనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకులు బొండా జగన్నాధం, రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుడు పీలా తులసీ రామ్, లాలం భరత్, పెంటకోట విజయ్, గొర్లె నానాజీ, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, భీమరశెట్టి శ్రీనివాస రావు, ఆడారి జానకి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాగ్‌లు, పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేస్తున్న మంజు

మునగపాక జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ తరహాలో సంక్షేమ పథకాలపై ఫొటోలు వ్యామోహం కూటమి నేతలకు లేదని మాజీ ఎంపీపీ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు పేర్కొన్నారు. మండలంలో తిమ్మరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం బ్యాగ్‌లు, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంపు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాజేశ్వరి,రాము, కూటమి నాయకులు బి.వి.రమణ, పెంటకోట అప్పారావు, దొడ్డి భాస్కరరావు, బి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో యువకుడి అరెస్టు

రాంబిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో మండలంలోని వైలోవ గ్రామానికి చెందిన బద్దిస్వామి (20)ని మంగళవారం అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టుకు తరలించినట్టు స్థానిక సీఐ నరసింగరావు తెలిపారు. సదరు యువకుడు ప్రస్తుతం మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. 16 సంవత్సరాల బాలికను ప్రేమించి, పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. బాధిత బాలిక పిర్యాదు మేరకు అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

## బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా రమాకుమారి

ఎలమంచిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబరుగా ఎన్నికైనట్లు ఆమె అనుచరులు సుందరపు బాబ్జీ తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అధినాయకులు ఈమేరకు ప్రకటించారని తెలిపారు. రమాకుమారికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంపై ఆమె వర్గీయుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమానికి ఎలమంచిలి నుంచి బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఎంపికైన మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

## జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఎంపీపీ బోదెపు గోవింద్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజక వర్గంలోని పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు ఈ సందర్భంగా గోవింద్ తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలందించాలని జగన్ సూచించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గోవింద్ అనుచరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీపీ గోవింద్

## హోం మంత్రి అనిత దృష్టికి అరటి గెలల మార్కెట్ స్థల వివాదం కేసు

పాయకరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) పాయకరావుపేట పంచాయతీ పరిధిలో ఉన్న అరటి గెలల మార్కెట్ స్థల వివాదం కేసును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్లినట్టు వార్డు సభ్యురాలు నారపురెడ్డి పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ని ఆనుకుని పంచాయతీ ఆధీనంలో ఉన్న సర్వే నం.99/1, 99/2, 99/2ఎ, 99/2బిలోని సుమారు 1.83 ఎకరాల స్థలం తమదంటూ మదనపల్లి సుభద్ర 2016లో కోర్టులో కేసు వేయగా, 2018లో కేసును కోర్టు కొట్టి వేసిందన్నారు. సదరు వ్యక్తి మరలా విశాఖపట్నం జిల్లా కోర్టును ఆశ్రయించారన్నారు. ఈ నేపథ్యంలో పై సర్వే నంబర్లలోని స్థలంలో ప్రభుత్వం అన్నా క్యాంటిన్ నిర్మిస్తుండడంతో, పనులు ఆపమని గత నెలలో పంచాయతీకి లాయర్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. దీన్ని పరిశీలించాలని హోం మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లినట్టు వార్డు సభ్యురాలు పద్మావతి తెలిపారు.

హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యురాలు పద్మావతి

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తామని, వినియోగాదారులు గమనించాలని ఆయన కోరారు.

# ఎన్నికల హామీలు అమలు

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా రంజకంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పులపర్తి, గూండ్రుబిల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు కూటమి నేతలు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొన్నాబత్తుల నాగేశ్వరావు పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. పెన్షన్లపెంపుతో పాటు గ్యాస్ సిలిండర్లు ఉచితం, తల్లికి వందనం తదితర ఎన్నో బృహత్తర పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి తీసుకువచ్చి పెన్షన్లు అందచేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ పాల్గొన్నారు. పోతురెడ్డి పాలెంలో సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, యర్రవరంలో కరణం రవి, ముప్పిన కృపారావు, పురుషోత్తపురంలో టీడీపీ నేత నాయుడు తదితరులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు.

### పేదలకు అండగా ప్రభుత్వం

రాంబిల్లి: కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరక్టర్ ధూళి రంగనాయకులుతో కలిసి మండలంలోని మర్రిపాలెం, కుమ్మరాపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు — పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సేనాపతి నాగేశ్వరావు, మర్రిపాలెం, మురకాడ టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు మంచాల అచ్చిబాబు, బద్ది సత్యారావు,ఎంపీటీసీ సభ్యులు తాతాజీ, పలువురు టీడీపీ నాయకులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

మునగపాక: మండల వ్యాప్తంగా వర్షం పడుతున్నా పింఛన్ పంపిణీ విజయవంతంగా జరిగిందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. మండల వ్యాప్తంగా 8,295 మందికిగాను 7,939 మందికి పంపిణీ చేసినట్టు చెప్పారు. 356 మంది ఇళ్ల వద్ద లేకపోవడంతో అందజేయలేకపోయినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో పాటు కూటమి నాయకులు ఆడారి మంజు, దాడి ముసిలినాయుడు, ఆడారి గణేష్, శరగడం యోగినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగన్నాథస్వామి ఉత్సవాలు

మునగపాకలో శ్రీజగన్నాథస్వామిని దర్శించుకున్న భక్తులు

మునగపాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో జగన్నాథస్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇంద్రద్యుమ్న హాలులో అన్న బలరాముడు, సోదరి సుభద్రతో కలిసి ప్రత్యేక పూజలందుకుంటున్న జగన్నాథస్వామి మంగళవారం వామనావతారంలో దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాలకు భారీగా తరలి వస్తున్నారు.

## వైభవంగా దుర్గాలమ్మ అమ్మవారి జాతర

అచ్యుతాపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పవరం గ్రామంలో మంగళవారందుర్గాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులను చెల్లించారు నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా , ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆయన సోదరుడు జనసేన పార్టీ నాయకులు సుందరపు సతీష్‌కుమార్‌తో కలిసి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్

## భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలి

రాంబిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని, పెండింగ్ క్లైమ్‌లు చెల్లించాలని, సంక్షేమ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, నాయకులు చందక రామకృష్ణ, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు శీరం రాంబాబు, పలు రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

### దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

అచ్యుతాపురం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టర్‌ని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పుచేస్తున్నాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సోమునాయుడు, మణికంఠ, రాజాన అప్పల నాయుడు, అచ్చి నాయుడు, సూర్యనారాయణ, అప్పలసూరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు లోకనాథం

## ఘనంగా టీడీపీ నేత వెంకటేశ్ జన్మదిన వేడుకలు

నక్కపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ జన్మదిన వేడుకలు మంగళవారం నక్కపల్లిలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, వెంకటేశ్ అభిమానులు తరలివచ్చారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి వెంకటేశ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గం టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, ఏజెర్ల వినోద్‌రాజు, లాలం కాశీనాయుడు, అమలకంటి అబద్ధం, కురందాసు నూకరాజు, వైబోయిన రమణ, కొప్పిశెట్టి బుజ్జి, జానకి శ్రీను తదితరులు వెంకటేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నానేపల్లి రాఘవులు,అడపా గణేశ్, గోవింద్, పిక్కి శ్రీనివాసరావు, పిక్కి రాంబాబు, పిక్కి సత్తియ్య, గంగరాజు, కోదండరావు, మడదారాంబాబు, అప్పలరాజు,వాసుపల్లి శివ, వేగి సత్య, రెడ్డి వరహాలుబాబు, దార్ల కృష్ణ, ప్రగడ బుజ్జి, పెదపూడి శంకరరావు, ఎరుపిల్లి అప్పలరాజు, సూరకాసుల గోవింద్, పెదబోదిగల్లం సర్పంచ్ షేక్ మున్నీషా బేగం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకటేశ్ బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న హోం మంత్రి అనిత

## ఎంఈవో జోషి సేవలు అభినందనీయం

కోటవురట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో జోషి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించిన సేవలు అభినందనీయమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఎంఈవో జోషి ఉద్యోగ విరమణ, జన్మదిన వేడుకలు సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మంత్రి మాట్లాడుతూఅంకితభావంతో విధులు నిర్వర్తించిన ఉద్యోగికి ఎల్లప్పుడూ ప్రజలు, ఉన్నత అధికారుల్లోనూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఎంఈవో జోషి తన అంకితభావంతో విద్యా వ్యవస్థలో ఆదర్శనీయులుగా నిలిచారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అప్పలనాయుడు మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో పనిచేసిన జోషి తన బాధ్యతలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సహజమని, విశ్రాంత జీవితం కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ జోషి ఎంఈవోగా రెండేళ్ల అంకితభావం పనిచేసిన అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. పీఆర్‌టీయూ జిలాఅధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు జోషి సేవలను ఆదర్శవంతంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావు, టీడీపీ నేత జానకి శ్రీనివాసరావు, సర్పంచ్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సత్యాడదాసు, ఆర్.ప్రతాప్‌కుమార్, సంగీతరాజ్, పి.డేవిడ్, లోవరాజు తదితరులు జోషి దంపతులను ఘనంగా సన్మానించారు.



ఎంఈవో జోషిని సన్మానిస్తున్న మంత్రి అనిత, డీఈవో అప్పలనాయుడు

## కాశీవిశ్వనాథంకు నేతల అభినందనలు

బొంది కాశీవిశ్వనాథంను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన టీడీపీ నాయకుడు బొంది కాశీవిశ్వనాథంకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. పాయకరావుపేటలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు కాశీవిశ్వనాథంను ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ సంప్రదాయ మత్స్యకారుల అభ్యున్నతికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్.రాంబాబు, కె.వెంకటేశ్వరరావు, జి.కృష్ణప్రసాద్, వి.అప్పారావు, ఇసరపు అప్పలరాజు, దువ్వి శ్రీనివాస్, ఎ.శ్రీను పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించాలి

పాయకరావుపేట రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పంటలను వేసుకునే ముందు రైతులు భూసార పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ సూచించారు. మండలంలోని పెదరాంభద్రపురం, గుంటపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనాల సేకరణ, విత్తన శుద్ధి, వరిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను ఈ సందర్భంగా రైతులకు ఆయన వివరించారు. భూసార పరీక్ష ద్వారా పొలంలోని మట్టిలో పోషక పదార్థాల లభ్యతను తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగమణి, వ్యవసాయ సిబ్బంది వందన, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## అందుబాటులో బీమా పథకాలు: డీఆర్‌డీఏ పీడీ

సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సచిదేవి

మునగపాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ సేవల్లో భాగంగా తక్కువ ప్రీమియంతో పలు బీమా పథకాలు అందుబాటులోకి వచ్చినట్టు డీఆర్‌డీఏ పీడీ కె.సచిదేవి పేర్కొన్నారు. మండలంలో నాగులాపల్లిలో మంగళవారం గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సభ్యులకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష, బీమా యోజన, ప్రమాద బీమా, ప్రధాన మంత్రి జీ వన్ జ్యోతి తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్ 30 గడవుతో ఈ బీమాలో నమోదు కావాలన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం సత్యనారాయణ, వెలుగు ఏపీఎం వై.బాలరాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సహకార దినోత్సవం

.తోటాడ ఎంపీఎఫ్‌సీ గోదాం ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మునగపాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార దినోత్సవంను మండలంలో నాగులాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వమించారు. దీనిలో భాగంగా తోటాడలో ఉన్న బహుళ ప్రయోజక సేవా కేంద్రం (ఎంపీఎఫ్‌సీ) గోదాం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి వి.జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో లాభాలు బాటలో నడుస్తున్న సంఘాల్లో నాగులాపల్లి ఒకటన్నారు. రైతు ప్రయోజనాలే లక్ష్యంగా సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మళ్ల స్వామి, అనకాపల్లి ఆవకాలువ సంఘం చైర్మన్ ఆడారి ఆనందసన్యాసినాయుడు, దొడ్డి రమేష్, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి: ఏవో

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి సుమంత

రాంబిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సి.సుమంత అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని దిమిలి, పంచదార్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, రాగి, సజ్జల, జొన్నలు, కొర్రలు తదితర చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తిచూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భీజామృతం కషాయాలు తయారీ, పిఎండిఎస్ కిట్లు ప్రాముఖ్యత ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి శిరీష, వీఏఏలు సరోజిని, మేఘన, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ

అచ్యుతాపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన కూటమి నాయకులతో కలిసి ఉప్పవరంలో పర్యటించారు . అనంతరం గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయ యంత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఏడీఈ జాహ్నవి, ఏవో మోహనరావులు మాట్లాడుతూ రైతులకు విత్తనశుద్ది డెమో చేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లవుడు లోవరాజు, గొన్నాబత్తుల నాగేశ్వారావు, భాస్కరరావు, ఏఈవో దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో ముసురు వాతావరణం

అచ్యుతాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో మంగళవారం ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఒక మోస్తరు వర్షం పడింది. ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు సాయంత్రం వరకు పడుతూనే ఉన్నాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధి పనులకు వెళ్లే వారంతా తడుస్తూనే చేరుకున్నారు. రోడ్డుపక్కన చిరువ్యాపారులు వ్యాపారాలు సాగక ఇబ్బందులు పడ్డారు. గ్రామీణ ప్రాంత రహదారులు చిత్తడిగా మారాయి. ముఖ్యంగా సెజ్‌లో గల పలు కర్మాగారాలకు విధులకు వెళ్లే కార్మికులు అవస్థలు పడ్డారు.

## నారుమడి యాజమాన్యంపై అవగాహన

కౌలు రైతుకు సాగుదారు హక్కు పత్రం అందిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉప్పలం గ్రామంలో మంగళవారం నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారిణి సౌజన్య మాట్లాడుతూ నారు విత్తిన పది రోజుల తరువాత నారులో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలుగాని, లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా క్లోర్‌పైరిఫాస్ 2.0 మిల్లీలీటర్లు కలిపి పిచకారీ చేయాలన్నారు, అంతేకాకుండా నాట్లు వేయడానికి ఏడు రోజుల ముందు నారులో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను తక్కువ నీటిలో కలిపి పిచకారి చేసుకోవాలన్నారు. కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రాలు పొందాలని ఏవో సూచించారు. అనంతరం ఇప్పటికే జారీ చేసిన పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ, చల్లపల్లి తాతబ్బాయి, రైతు సేవ కేంద్రం సిబ్బంది కె కుమార్, రైతులు పలువురు పాల్గొన్నారు.

## శెట్టిపాలెం పాఠశాలను సందర్శించిన డీఈవో

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం పాఠశాలను డీఈవో అప్పారావు నాయుడు మంగళవారం సందర్శించారు. 'నాడు వెలవెల-నేడు కళకళ' అని శీర్షికతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంపై 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 27న వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను, సర్పంచ్ అల్లు రామునాయుడు అభినందించారు. అలాగే వారికి పలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయరాలు తమ ఇద్దరు పిల్లలను ఇదే పాఠశాల్లో చేర్చడం ప్రశంసనీయమని, ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని డీఈవో కోరారు. కార్యక్రమంలో ఏంఈవో మూర్తి పాల్గొన్నారు.

## బాలికోన్నత పాఠశాలలో 110 మంది చేరిక

పాఠశాలలో చేరిన విద్యార్థినులతో ఉపాధ్యాయ సిబ్బంది

కశింకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులకు ఉపాధ్యాయులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ ఏడాది మొత్తం 110 మంది విద్యార్థినులు చేరినట్టు చెప్పారు. వీరందరిపై మరింత దృష్టి సారించి సత్ఫలితాలు సాధనకు కృషిచేస్తామని చెప్పారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆచంట రవి, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపాలెంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

డెంగ్యూపై అవగాహన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

కశింకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్.సుమ, డాక్టర్ బి.మంజూష సూచించారు. జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, పి.శివరామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'రామకాసు సేవలు అభినందనీయం'

రామకాసును సత్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్ తదితరులు

సబ్బవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా వీరశైవ సంఘం అధ్యక్షుడిగా, సబ్బవరం, కోటపాడు మండలాల్లో వీఆర్వోగా సబ్బవరపు త్రినాథ రామకాసు ఆదర్శవంతమైన సేవలందించారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రామకాసు పదవీ విరమణ చేసిన సందర్భంగా సోమవారం రాత్రి ఇక్కడ ఏర్పాటైన సన్మాన సభలో ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లతో పాటు పలు గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు పైల శ్రీనివాసరావు, గండి రవికుమార్, అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

### సమావేశాలు, ఆందోళనలకు అనుమతి తప్పనిసరి : సీఐ

అనకాపల్లి టౌన్, జూలై1 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పోలీసుల అనుమతులు లేకుండా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎటువంటి సేవా కార్యక్రమాలు, ర్యాలీలు, దీక్షలు, నిరసన కార్యక్రమాలు, రాజకీయ, సామాజిక, మతపరమైన సమావేశాలు, ఉత్సవాల నిర్వహణకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో లేదా భవన సముదాయాల్లో ఏదైనా కార్యక్రమాలు తలపెట్టాలనుకుంటే పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను సంప్రదించి తద్వారా జిల్లా ఎస్పీ, డీఎస్పీల అనుమతి పొందాలన్నారు. ఇలా అనుమతి పొందిన అనంతరం పోలీసు శాఖ నిబంధనల ప్రకారం ఆయా కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ప్రజలంతా పోలీసులకు సహకరించాల్సిందిగా సీఐ విజ్ఞప్తి చేశారు.

## '9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి'

కొత్తూరు/పరవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల తొమ్మిదో తేదీన జరగనున్న సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. మంగళవారం సంపతిపురం పంచాయతీ మామిడిపాలెం గ్రామంలో తాపీ మేస్త్రీల సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సహజ, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఇచ్చే బీమా పరిహారం పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు సిహెచ్ అప్పలరాజు, కార్యదర్శి మారేడిపూడి సత్యనారాయణ, నాయకులు గుమ్మల నాగేశ్వరరావు, సత్తిబాబు, గణేష్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పరవాడ లంకెలపాలెంలోని మురా కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు విఘాతం కల్పించేలా చర్యలు చేపట్టడం దారుణమన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో సమ్మె చేస్తున్నట్టు చెప్పారు. కార్మికులకు పని భద్రత కల్పించడంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, మురా కార్మిక నాయకులు దాసరి దేముడు, కె.వెంకటరావు, శ్రీను, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే వైద్యుల ధ్యేయం కావాలి

▸▸ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్

వైద్యుల దినోత్సవంలో కలెక్టర్ విజయకృష్ణన్, డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ తదితరులు

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యమే ధ్యేయంగా అంకిత భావంతో ప్రజలకు వైద్య సేవలందించాలని వైద్యాధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో ప్రత్యేకమైనదన్నారు. ప్రజారోగ్య క్షేమం కోసం ప్రతి వైద్యాధికారి, వైద్యులు కృషి చేయాలని కోరారు. ముందుగా వైద్యులందరికీ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలను ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్యారోగ్య పర్యవేక్షణ అధికారి డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**'డెంగ్యూ నివారణ అందరి బాధ్యత'**

అనకాపల్లి కలెక్టరేట్ : డెంగ్యూ వ్యాధి నివారణ మాసంగా జూలై నెలను పాటించాలని, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో జాతీయ డెంగ్యూ మాసోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచడం, తాగునీటి నిల్వలు, చెత్త తొలగించడం, దోమల వృద్ధి నిరోధక చర్యలు తీసుకోవడం వంటి అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా మలేరియా అధికారి కె.వి.దొర, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన 44 వాహనాలపై కేసులు నమోదు

▸▸ రెండు వాహనాలు సీజ్ ▸▸ రూ. 97,480 జరిమానా

స్కూల్ బస్సు రికార్డులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖాధికారులు

అనకాపల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మోటార్ వాహన నిబంధనలను ఉల్లంఘించిన పలు విద్యా సంస్థలకు చెందిన బస్సులపై మంగళవారం జిల్లా రవాణా శాఖాధికారి గోపిశెట్టి మనోహర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహన సామర్థ్య ధ్రువీకరణ లేకపోవడం, ప్రథమ చికిత్స కిట్ లేకపోవడం, సీటింగ్ పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లడం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం వంటివి చేసిన 44 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు మనోహర్ తెలిపారు. ఫిట్‌నెస్, పర్మిట్ లేకుండా నడుపుతున్న రెండు స్కూల్ వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోలపై కూడా కేసులు నమోదు చేశామన్నారు. ఈ డ్రైవ్‌లో మొత్తం రూ. 97,480ల జరిమానాలు విధించామన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు ఏవీ రమణ, కాశీవిశ్వనాథ్, ఏఎంవీఐ దీపాకావ్య తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ఏడాది పాలనలో విజయాలపై ఇంటింటి ప్రచారం

▸▸ టీడీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పిలుపు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలపై ఇంటింటి ప్రచారం చేపట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనకాపల్లిలో ని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో సంక్షేమ పథకాలు, పారిశ్రామిక ప్రగతి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ శాఖల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికార సభ్యులు ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## అన్నదాతలకు అండగా ప్రభుత్వం

▸▸ విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే 'పంచకర్ల'

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

పరవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. ఖరీఫ్ సీజన్ సందర్భంగా నియోజకవర్గస్థాయి వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఇక్కడ చేపట్టి మాట్లాడారు. అన్నదాతలకు అవసరమైన వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేశామన్నారు. వారం రోజుల్లోగా రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.20 వేలను మూడు విడతల్లో వారివారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని వెల్లడించారు. వ్యవసాయ రంగ పనిముట్లను రాయితీపై అందిస్తామన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్.సుబ్రహ్మణ్యం, పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యవసాయశాఖాధికారులు ఎం.రమాదేవి, పోతల సత్యనారాయణ, సీహెచ్.చంద్రావతి, ఏఈవోలు ఎంఎస్‌మూర్తి, బాలరాజు, రమణ, మాజీ ఎంపీపీ పైల జగన్నాథరావు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, కూటమి నాయకులు చింతకాయల ముత్యాలు, బుగిడి రామగోవింద రావు, మొల్లేటి సన్యాసినాయుడు, వియ్యపు చిన్న, దేవర రాముడు, రెడ్డి శ్రీనివాసరావు, వర్రి పరదేశినాయుడు, పైల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పంచకర్ల పరవాడ బీసీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

# ఖరీఫ్‌కు అనుకూలంగా వర్షాలు

▸▸ రాగల ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం

▸▸ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ శ్రీలత

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌కు ఈ వర్షాలు అనుకూలమని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీలత తెలిపారు. మంగళవారం ఇక్కడ జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని వివరించారు.

**వరిపైరు వేసుకునే రైతులకు సూచనలు**

వరిపైరు వేసుకునే రైతులకు ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. రైతులు ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204, బీపీటీ 3291, ఎంటీయూ 1262, ఎంటీయూ 1318, ఎంటీయూ 1224 వంటి రకాలను సేకరించాలన్నారు. మొలక శాతం చూసుకొని, ఎకరానికి 25 నుంచి 30 కిలోల విత్తనాలను ఐదు సెంట్ల నారుమడిలో విత్తుకోవాలని సూచించారు. అలాగే పొడి విత్తనం అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ మూడు గ్రాములు, దంప నారుమడి అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున లేదా సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ కిలో విత్తనానికి పది గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలన్నారు.

**కలుపు సమస్య పెరిగే అవకాశం**

వర్షాల కారణంగా కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందువల్ల పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరాకు 80 నుంచి 100 గ్రాములు చొప్పున 20 నుంచి 25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4 నుంచి 7 రోజులలో వేసుకోవాలని శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే ఎద వరిలో కలుపు సమస్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పెండిమిథాలిన్ సీఎస్ 38.7 700 మిల్లీ లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి వరి విత్తిన రెండు రోజులలోపు పిచికారీ చేయాలన్నారు.

**మొక్కజొన్న, కంది వంటి వాటిని విత్తుకోవచ్చు**

మొక్కజొన్న, కంది వంటి పైరులను విత్తుకోవచ్చునని, రాగి నారును నాటుకోవచ్చునని శాస్త్రవేత్తలు సూచించారు. 120 రోజులు వయస్సు గల చెరకు పైరులో మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని, వంట ఎదుగుదలను బట్టి మొవ్వులో ఎనిమిది ఆకులు ఉండి జడ చుట్టూ వేసుకునేటట్టు ఆకులను తొలగించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణం లో చెరకు పైరులో మొవ్వు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కార్బెండజిమ్ ఒకగ్రాము లేదా మాంకోజెబ్ మూడు గ్రాముల లీటరునీటికి కలిపి తెగులు ఉధృతిని బట్టి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్తలు కె.వి.రమణ మూర్తి, వి.గౌరి,బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

## సందడిగా పింఛన్ల పంపిణీ

కశింకోటలో పింఛన్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

పరవాడలో పింఛన్ పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

పీలా వెంకటరెడ్డి నాయుడు వీధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న జగదీష్

81వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం వాడవాడలా పండుగ వాతావరణంలో జరిగింది. ఉదయం నుంచి చినుకులు పడుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమున్నా ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర 81వ వార్డులోని లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు 81వ వార్డు పరిధిలోని పీలా వెంకటరెడ్డినాయుడు వీధిలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పార్టీ నాయకులు చదరం శివప్రసాదరావు, కొణతాల బాబూరావు, పెంటకోట శివరామ్, బొద్దేడ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యర్రా వారివీధి, పిళ్లావారి వీధి, నెయ్యిల వీధిలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సురేంద్ర, నాగజగదీశ్వరరావు, రత్నాకర్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్మోహనరావు, కోడూరు శ్రీనాథ్, బోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

**కశింకోటలో...**

కశింకోట : మండల కేంద్రమైన కశింకోటలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఇక్కడ పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా అందజేశారు. అనంతరం పింఛన్లు సరిగా అందుతున్నాయా లేదా అని వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి గోపి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, తాకాశి కృష్ణ, జగన్నాథం, దాసరి బాబు, పెదపాటి కళ్యాణి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

**పరవాడలో...**

పరవాడ : మండల కేంద్రం పరవాడలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, టీడీపీ నాయకులు అట్టా సన్యాసి అప్పారావు, పైల బుజ్జి, పైల చిన అక్కునాయుడు, కేఆర్‌కే రాజు, పైల కృష్ణ, వర్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో వామనావతారంలో జగన్నాథస్వామి

## వామనావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి టౌన్/ కశింకోట, జూలై 1 (ఆంధ్ర జ్యోతి) : జగన్నాథ రథోత్సవం నేత్రపర్వంగా సాగుతోంది. ఇందులో భాగంగా అనకాపల్లి గవరపాలెం సతకంపట్టు పెద్ద వద్ద గల ఇంద్రద్యుమ్న మందిరం, కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత స్వామివారు మంగళవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు విశేష అలంకరణలు చేపట్టి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఘనంగా వారాహి సిరిజ్యోతి పూజ

విశేష అలంకరణలో వారాహి అమ్మవారు

సబ్బవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో సిరిజ్యోతి పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు జరిపారు. రాత్రికి రుద్ర సహిత వారాహీ హోమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## నేత్రపర్వంగా బంగారమ్మ పండుగ

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అసకపల్లిలో బంగారమ్మ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. వైసీపీ నేత గండి రవికుమార్, గ్రామ పెద్దలు కాపుశెట్టి శేషుబాబు, నీలవేణి, సర్పంచ్ దెబ్బడ ప్రసాదరావు, బలిరెడ్డి కనక రాజు, సురేష్, దుప్పి దుర్గాలు, దాడి సత్యనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

### నలుగురు డీటీలకు తహసీల్దార్లుగా ఇన్‌చార్జి బాధ్యతలు

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నలుగురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల బదిలీపై అనకాపల్లి, పరవాడ, కశింకోట, మునగపాక మండలాలకు కొత్తగా తహసీల్దార్లను నియమించినా వారు విధుల్లో చేరలేదు. దీంతో ఆయా మండలాల్లో రెవెన్యూ పరమైన సేవలు అందించడంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ ప్రస్తుతం ఆయా మండలాల్లోని పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

### చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : చీటింగ్ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. విశాఖ జిల్లాలోని మైక్రో ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌లో చాలా మంది డిపాజిట్లు కట్టారు. డిపాజిట్ల గడువు ముగిసినా తిరిగి ఖాతాదారులకు డబ్బులు చెల్లించలేదు. రూ.11 లక్షల వరకు డిపాజిటర్లకు నగదు చెల్లించకుండా కంపెనీని మూసి వేశారు. దీంతో 2015 జనవరి 20వ తేదీన అనకాపల్లికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా విశాఖపట్నంలోని ఆరిలోవ ప్రాంతంలో ఉంటున్న కంపెనీ ద్వారకానగర్ యూనిట్ మేనేజర్ బాబు మహంతిని సోమవారం రాత్రి అరెస్టు చేసి, మంగళవారం కోర్టుకు తరలించినట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

### శారదా కాలనీలో పార్కుకు పరికరాల వితరణ

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శారదా కాలనీలోని పార్కుకు వ్యాయామానికి ఉపయోగపడే పరికరాలను మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వితరణగా అందజేశారు. రోటరీ పీడీజీ సూర్యారావు సతీమణి గుర్తుగా రూ.లక్ష విలువ చేసే పరికరాలను రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కాండ్రేగుల మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు సరిపల్లి రాజేష్, సీహెచ్.సూర్యనారాయణరెడ్డి, ఆనందరావుతో పాటు కె.రామవరావు, శ్రీనివాస పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలసదనంలో చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు

వైద్య పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

పాడేరురూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలసదనంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలసదనంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మంది చిన్నారులను డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడు, వైద్యులు టీఎన్ ప్రతాప్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వారిలో మెరుగైన వైద్య సేవలు పొందాల్సిన చిన్నారులను ప్రత్యేక అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈకార్యక్రమంలో వైద్య, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ హోమ్ పునఃప్రారంభం

గర్ల్స్ చిల్డ్రన్స్ హోం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెత్‌న్య గర్ల్ చిల్డ్రన్ హోమ్‌ని నిర్వాహకులు పునఃప్రారంభించారు. ఉత్కల్ యూనివర్సిటీ వికెడ్స్ సెక్షన్ డెవలప్‌మెంట్ సొసైటీ గత కొంత కాలంగా ఈ హోం నిర్వహిస్తూ అనాథ గిరిజన బాలికలకు భోజన వసతి కల్పించి విద్యను అందిస్తుంది. ఏడాది క్రితం మైదానప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న హోంలో ఓ విందులో మిగిలిపోయిన ఆహారం బాలబాలికలకు పెట్టడంతో ఇద్దరు మరణించగా పలువురు అస్వస్థతకు గురైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనతో గిరిజన ప్రాంతంలో రిజిస్ట్రేషన్ లేని హోంలను కలెక్టర్ మూసివేయించారు. తాజాగా కలెక్టర్ హోం నిర్వాహణకు అనుమతివ్వడంతో ఈ కేంద్రాన్ని మంగళవారం పునఃప్రారంభించారు.నిర్వాహకులు వసుపరి తిమోతి, రామవరావు, నెల్లూరి ఆనందరావు, సుందరావు, ఆంటోని, పద్మాకరరావు, డేవిడ్, రమేశ్, దయానిధి, జాన్‌బాబు, పాల్గొన్నారు.

## అల్లూరి జయంతికి సన్నాహాలు

డుంబ్రిగుడ, జూలై1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు సూర్య ప్రకాశ్ తెలిపారు. మంగళవారం స్థానిక సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి స్ఫూర్తితో గిరిజన చట్టాలు, హక్కులపై నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు అరుణ్‌రాజ్, నవపుర్వ తదితరులు పాల్గొన్నారు.

## పెదకోట హైడ్రో ప్రాజెక్టుపై జీవో తగదు: సీపీఎం

పాడేరురూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలం పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతులిస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సోమవారం జీవో 51 జారీ చేసిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అదానీ కంపెనీ ఆధ్వర్యంలో పెదకోట ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వైసీపీ ప్రభుత్వం బాటలు వేసిందని, అప్పట్లో ఆ చర్యలను వామపక్షాలతోపాటు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. గిరిజన ప్రాంతంలో సహజ సంపదలను అదానీ కంపెనీకి దారాధత్తం చేయవద్దని అప్పట్లో ఆం దోళన చేశాయన్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకించిన కూటమి నేతలు, తాజాగా జీవో జారీ చేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రత్యేక చట్టాలు, హక్కులను ఉల్లంఘించందని, నేడు కూటమి ప్రభుత్వం అదేబాటలో పయనిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## చింతపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా సీహెచ్ సీతామహాలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. తాజా బదిలీల్లో మూడేళ్లగా ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన యూఎస్‌వీ శ్రీనివాసరావుని అచ్యుతాపురం బదిలీ చేయగా, ఆయన స్థానంలో మాకవరపాలెంలోని సీతామహాలక్ష్మిని నియమించారు. ఈమేరకు ఆమె విధుల్లో చేరారు.

హుకుంపేట: కామయ్యపేట వెళ్లే రోడ్డుపై వరద నీరు

హుకుంపేటలో ప్రధాన రోడ్డు దుస్థితి

# వర్షాలతో రహదారులు ఛిద్రం

- గోతుల్లో నీరు చేరి బురదమయం
- గ్రామీణ ప్రాంత ప్రజలు అవస్థలు

హుకుంపేట జూలై 1 ఆంధ్రజ్యోతి: గత ఐదు రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు హుకుంపేట ప్రధాని రహదారి అధ్వానంగా మారింది. బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారింది. ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాల రద్దీతోపాటు సమీపంలో హస్టల్ విద్యార్థులు రాక పోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తీగలవలస పంచాయతీ కామయ్యపేట ప్రధాన రోడ్డు ఇదే పరిస్థితిలో ఉంది. గుంతలు, రాళ్లు తేలాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ మార్గంలో ప్రజలు, ఉద్యోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. తడిగిరి, తీగలవలస, మోట్టుజోరు మూడు పంచాయతీలకు ఇదే రహదారిలో ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగులు రాక పోకలు సాగిస్తున్నాంటారు. స్థానిక గిరిజనులు గతంలో వైసీపీ నేతలకు సమస్య విన్నవించినా పట్టించు లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి పాలనలోనైనా అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

### ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతగిరి: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా భారీ వీస్తున్న ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాలకు వెళ్లేమార్గమధ్యలోగల గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాల గిరిజనులు రాకపోలకు అవస్థలు తప్పడంలేదు.

## ముంచంగిపుట్టులో హై వోల్టేజీ సమస్య

- గృహోపకరణాలు ధ్వంసం
- వారం రోజులుగా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

హై వోల్టేజీతో కాలిపోయిన ఓ స్టేషనరీ షాప్‌లో కంప్యూటర్ ఎల్‌ఈడీ స్క్రీన్, జిరాక్స్ మిషన్

ముంచంగిపుట్టు, జులై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత వారం రోజులుగా విద్యుత్ హై వోల్టేజీ సమస్య నెలకొంది. దీంతో పలు ఇళ్లు, షాప్‌ల్లో ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఇన్వెర్టర్లు, విద్యుత్ బల్బులు, ఎల క్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే హై వోల్టేజీతో స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని పూర్ణ స్టేషనరీ షాప్‌లో జిరాక్స్ మిషన్, కంప్యూటర్ సీపీయూ, ఎల్‌ఈడీ స్కీన్ కాలిపోయాయి. దీంతో సుమారు రూ. 30 వేలు నష్టం వాటిల్లినట్టు యజమాని పూర్ణ వాపోయాడు. అలాగే, ఫ్రెష్‌మార్ట్ షాప్‌లో రెండు ఫ్రిజ్‌లు, ఇన్వెర్టర్ కాలిపోయాయని. దీంతో సుమారు రూ. 60 వేలు నష్టం వచ్చిందని యజమాని దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రుత్విక ఫ్యాన్సీ షాప్‌లో ఇంటర్ నెట్ మోడెం, రెండు ట్యూబ్‌లైట్లు, మీగడ శంకరరావు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్, ఐదు విద్యుత్ బల్బులు, లక్ష్మీ ఇంట్లో ఒక ఇండక్షన్ స్టౌ కాలిపోయాయి. అలాగే పలువురు ఇళ్లలోనూ ఎలక్ట్రానికి వస్తువులు దెబ్బతిన్నాయి. స్విచ్ బోర్డులు కాలిపోయాయని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూట్రల్ వైర్ తెగిపోవడంతో విద్యుత్ హై వోల్టేజీ సమస్య తలెత్తినట్లు తెలుస్తుంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి సరి చేయాలని కోరుతున్నారు. లేకుంటే స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## బ్యాంకింగ్ సేవలపై ప్రజల్లో అవగాహన: కలెక్టర్

ఆర్థిక కేంద్రీకృత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, జూలై 1(ఆంధ్ర జ్యోతి): ప్రజల్లో బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, బీమా పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 1 నుంచి 30 తేదీ వరకు జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 430 గ్రామ పంచాయతీల్లో ప్రజలకు బ్యాంకింగ్, ఇతర ఆర్థిక సేవలు, బీమా పథకాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాహిత్, ఎల్‌డీఎం మాతునాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి రవిశంకర్, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు పాల్గొన్నారు.

## విద్యా రంగంపై జగన్ విమర్శలు విడ్డూరం

- టీఎన్ఎస్ఎఫ్ నేత సత్యనారాయణ

మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నేత సత్యనారాయణ, తదితరులు

పాడేరురూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తన పాలనలో విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ అధినేత వైఎస్.జగన్ నేడు కూటమి పాలనలో విద్యారంగంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని టీఎన్‌టీయూసీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ అన్నారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ స్థానిక క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు చేపట్టి, వ్యవస్థను గాడిన పెడుతున్నారన్నారు. జగన్ హయాంలో ఈసెట్ కౌన్సెలింగ్ ఎన్నడూ సక్రమంగా నిర్వహించలేదని, కానీ, నేడు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ ప్రక్రియ సాగుతోందన్నారు. కానీ, జగన్ తప్పుడు ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నేతలు పాండురంగస్వామి, రామారావు, నాగేశ్వరరావు, కొండబాబు, అచ్చిబాబు, త్రినాధ్, తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి'

ఆస్పత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేత పాండురంగస్వామి

పాడేరురూరల్, జూలై 1(ఆం ధ్ర జ్యోతి): అనుకోని విధంగా ప్రాణాలు కోల్పోయిన జి.మాడుగుల మండలం బంధవీధి ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని మర్రి లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని టీడీపీ నియోజకవర్గ నేత పాంగి పాండురంగ స్వామి కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థిని మర్రి లక్ష్మి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ కుటుంబానికి న్యాయం చేసేందుకు తాము కృషి చేస్తామని ఆయన తెలిపారు.అలాగే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# విద్యా రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: టీడీపీ డివిజన్ నేత

ముంచంగిపుట్టు, జులై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గిరిజన ప్రాంతంలోని విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు టీడీపీ పార్టీ డివిజన్ నేత పాండురంగస్వామి అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ కుమ్మరిపుట్టులోని పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆయన స్కూల్ బ్యాగ్, యూనిఫాం, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అదే పంచాయతీ మాలిపుట్టు గ్రామంలో పించన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శోభకోట సర్పంచ్ పలసీ శశి భూషణం నాయుడు, ఉపాధ్యాయులు నాగేష్, త్రినాధ్, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ గణపతి, హార్టికల్చర్ అసిస్టెంట్ చందు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### యూనిఫారాలు ధరించాలి

పెదబయలు: విద్యార్థులతో ఎంఈవో కృష్ణమూర్తి

పెదబయలు: విద్యార్థుల్లో క్రమశిక్షణ ఉట్టిపడేలా యూనిఫారాలను విద్యార్థులు తప్పకుండా ధరించాలని ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం సదుద్దేశంతో యూనిఫారాలను పంపిణీ చేస్తోందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తురకలవలస కాంప్లెక్స్ పరిధిలో గల అల్లంగిపుట్టు ప్రాథమిక పాఠశాలలో రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూ అడ్మిషన్లుంటే త్వరతిగతిన పాఠశాలకు చేర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రాపవుట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఘనంగా వైద్యుల దినోత్సవం

పాడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నేషనల్ డాక్టర్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య పితామహుడు బిదాన్‌చంద్ర రాయ్ చిత్రపటానికి జీఎంసీ ప్రిన్సిపల్, సిబ్బంది, వైద్య సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం గర్వించదగిన వైద్యుడై బిదాన్‌చంద్రరాయ్ జననం, మరణం జూలై ఒకటో తేదీన కావడంతో దానిని జాతీయ వైద్యుల దినోత్సవంగా పేర్కొంటూ ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు లక్ష్మీకుమారి, డాక్టర్ పాపారత్నం, ప్రొఫెసర్లు డాక్టర్ రాధ, శిరీషా, చంద్రమోహన్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

**చింతపల్లి:** వైద్యులు సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి. ఇందిరాప్రియాంక అన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రిలో జాతీయ డాక్టర్స్ దినోత్సవం పురస్కరించుకుని వైద్యులు కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పనిచేసేందుకు ముందుకొచ్చిన వైద్యులను అభినందనీయులని కొనియడారు. ఈకార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారి నీలవేణి, డాక్టర్లు వాసవి, రుక్మిణి, భా రతి, లా వణ్య, అనుష, శ్రీలత ఉన్నారు.

బిదాన్‌చంద్రరాయ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎంసీ ప్రిన్సిపల్ హేమలతదేవి

### జెన్‌కో ఆస్పత్రిలో..

సీలేరు: వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని జీకేవీధి మండలం సీలేరు ఏపీ జెన్‌కో ఆసుపత్రిలో మంగళవారం స్థానిక వైద్యాధికారులను అధికారులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ శ్రీనివాసరెడ్డి ముఖ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవ్య హెల్త్ సర్వీసెస్ వైద్యాధికార్లు ఆర్. ఆకాష్, జి. మృదుల, ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్ వల్లీకు ఈఈ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చింతపల్లిలో కేక్ కట్ చేసిన ఏరియా ఆస్పత్రి వైద్యులు

సీలేరు జెన్‌కో ఆస్పత్రిలో వైద్యులను సన్మానిస్తున్న అధికారులు

## ఏడు గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా



సీలేరు స్విచ్‌యార్డులో జంపర్లను మార్చుతున్న జెన్‌కో సిబ్బంది

సీలేరు, జూలై 1 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు, పరిసర గ్రామాలకు మంగళవారం ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు. సీలే రులోని జలవిద్యుత్ కేంద్రం సమీపాన స్విచ్‌యార్డులోని 33/11 కేవీ విద్యుత్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. గత మూడు రోజులుగా ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ లైన్‌పై చెట్లు కొమ్మలు పడి స్విచ్‌యార్డులో 33/11 కేవీకి సంబంధించిన రెండు జంపర్ల కాలిపోయాయి. దీంతో సీలేరు పరిసర గ్రామాలకు ఉదయం ఏడున్నరన్నుంచి విద్యుత్ సరఫరా చిలిచిపోయింది. జెన్‌కో సిబ్బంది చెట్లు కొమ్మలు తొలగించి, కాలిపోయిన రెండు జంపర్లను మార్చి విద్యుత్ సరఫరాను మధ్యాహ్నాం రెండు గంటలకు పునరుద్ధరించారు. వర్షం కురుస్తుండంతో విద్యుత్ పునరుద్ధరణకు ఏడు గంటల సమయం పట్టినట్టు సిబ్బంది తెలిపారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర

చినలబుడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న దొన్నుదొర, అధికారులు

అరకులోయ, జూలై1 (ఆంధ్రజ్యోతి): పెదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర అన్నారు. పెదలబుడు,చినలబుడు గ్రామ పంచాయతీల పరిధిలోని పలుగ్రామాల్లో పింఛన్లను దొన్నుదొర అధికారులతో కలిసి పంపిణీ చేశారు. వృద్ధులకు ప్రతీ నెలా 1 వతేదీన ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పింఛన్ల సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం రూ. వేలు పెన్షన్ ఇస్తే... కూటమి దానిని రూ. 4 వేలకు పెంచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 20వేల కిలో మీటర్లమేర రోడ్లకు మరమ్మతులు చేపట్టినట్టు చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా రాష్ట్రాభ్యిద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధక్షుడు లకోయ్ మహాదేవ్, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్‌బీ భీమరాజు, నాయకులు బోయి దామేదర్, పాంగి భరత్‌రాం, చందూ విజయనిర్మల, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్,బొరిబొరి లక్ష్మి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అరకులోయ మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో సుమారు 6367 పింఛన్లకు మంగళవారం సాయంత్రంనాటికి 90 శాతం పైగా పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఎ.లవరాజు తెలిపారు.

## ' లోకుల గాంధీ సేవలు మరువలేం'

శరభన్నపాలెంలో గాంధీ స్మారక మందిరంలో నివాళులర్పిస్తున్న అభిమానులు, కుటుంబీకులు

కొయ్యూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) నిజాయితీ, నిస్వార్థంగా గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారానికి పాటుపడి అతి పిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లోకుల గాంధీ సేవలను మరువలేమని వక్తలు అన్నారు. లోకుల గాంధీ 50వ జయంతి వేడుకలను శరభన్నపాలెం, రత్నంపేట, కొయ్యూరు తదితర గ్రామాలలో నిర్వహించారు. శరభన్నపాలెంలో బీజేపీ మండల అధ్యక్షుడుడు సంపరి శివ, తో పాటు కుటుంబీకులు గాంధీ స్మారక మందిరం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. రత్నంపేటలో గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అరకు నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కుసిరెడ్డి శివప్రసాద్ సమకూర్చిన చీరలను వృద్ధులకు పంపిణీ చేశారు. కొయ్యూరులో నేతలు శరభయ్య, గాలి దేముడు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి విద్యార్థులకు స్వీట్సు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ ఏర్పాటు చేసిన ది తోడు ట్రస్టు ద్వారా చేసిన సేవలను వివరించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో గొలుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు గౌరినాయుడు, కార్యదర్శి రామదాసు, అల్లూరి జిల్లా ఉపాధక్షుడు చంద్రరావు, సామాజిక సేవకుడు అర్జున, నేతలు నగేశ్, శివ, అచ్చుతవాణి, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

**గూడెంకొత్తవీధి:** దివంగత లోకుల గాంధీ సేవలు మరువలేమని బీజేపీ మండలాధ్యక్షుడు కాకూరి శేఖర్ అన్నారు. మంగళవారం లోకుల గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. పేద గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకుల గాంధీ గిరిజన ప్రాంతంలో తొలి ఐఐటీ చదవిన విద్యార్థి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రీమల పాల్, ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి పాల్గొన్నారు.

## 'టూరిజంను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సహించం'

అనంతగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఏపీ టూరిజంను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే సహించేదిలేదని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు హెచ్చరించారు. పర్యాటక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులతో కలిసి మంగళవారం హరిత రిసార్ట్స్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఉన్న రిసార్ట్స్ తదితర వాటిని ప్రైవేటు వ్యక్తులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుందని, దీనిని విరమించుకోవాలని ఈ సందర్భంగా గంగరాజు డిమాండ్ చేశారు. గిరిజనులు ఉపాధికి గండి కొడితే సహించేదిలేదన్నారు. 1/70 చట్టం ఉంటుండగా.. ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, టూరిజం కార్మికులు విజయ్, బుద్దరాజు, శ్రీను, సోమర పాల్గొన్నారు.

## ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తల బృందం

గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకి సన్నద్ధంకావాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి అన్నారు.మంగళవారం మొడిగెడ్డ గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, సామ, రాగి, జొన్న, కొర్రలు సాగుకు నాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పంట పొలాల్లో నాటుకున్న పచ్చిరొట్ట ఎరువుని భూమిలో కలిగియదున్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్ నాయక్, డాక్టర్ వెంకటేశ్, వ్యవసాయ అధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.

## రోగులకు అంబులెన్స్ సేవలు దూరం

గూడెంకొత్తవీధి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివాసీ రోగులకు అంబులెన్సు సేవలు దూరమయ్యాయి. జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐటీడీఏ గత నెలలో కొత్త అంబులెన్సులు మంజూరు చేసింది. తాజాగా వారం రోజుల క్రితం వాహనాలు సర్వీసింగ్ కోసం మైదాన ప్రాంతాలకు తరలించారు. సర్వీసింగ్ పూర్తి చేసి రోజులు గడుస్తున్నా, బిల్లు చెల్లించక అంబులెన్సులు పీహెచ్‌సీలకు అప్పగించలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో రోగులను ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రికి తరలించాల్సి దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి సర్వీసింగ్ బిల్లు చెల్లించి పీహెచ్‌సీలకు అంబులెన్సులు అందజేయాలని వైద్య సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

## ప్రమాదకర స్థితిలో వంతెన



వంతర్భ సమీపంలో వంతెనను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రామారావు

పెదబయలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిముడుపల్లి పంచాయతీలో వంతర్భ గ్రామ సమీపంలో గల ప్రధాన వంతెన వరద నీటితో పొంగి ప్రవహిస్తూ ప్రమాద భరితంగా మారింది. ఈ స్థితిలో మంగళవారం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పాంగి రామారావు వంతెనను పరిశీలించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ పరిధిలో గ్రామాల ప్రజలు ఆ వంతెనపై రాకపోకలు చేయరాదని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన వంతెన ఏ సమయంలో కూలుతుందోనని అన్నారు. ఇప్పటికే వంతెన ఎత్తు వరకు నీరు చేరిందని తెలిపారు.

### వంతెన శిథిలంతో అవస్థలు

హుకుంపేట: హుకుంపేట- చింతవీధి సమీపాన వంతెన వర్షాలకు పాక్షికంగా శిథిలం కావడంతో ఈ మార్గంలోని సోభకోట, మోట్టుజోరు, తడిగిరి, తిగలవలస పంచాయతీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇదే రోడ్డులో నిత్యం కామయ్యపేటకు ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. అధికారులు స్పందించి రాకపోకలు అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

చీడికాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ/దేవరాపల్లి/మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో మంగళవారం కార్యకర్తల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వపరి పాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, అలాగే వారికి ఇంకా అందాల్సిన పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు చెప్పిన సమస్యలన్నీ రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ బాధ్యతను బూత్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశాల్లో పార్టీ మండల ఎన్నికల పరిశీలకులు కొల్లి శ్రీనివాసరావు, యేసుదాసు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, పెద్దాడ వెంకటరమణ, అద్దేపల్లి జగ్గారావు, మాజీ ఎంపీపీలు పోతల రమణమ్మ, కుప్పు కళావతి, నాయకులు గండి ముసలినాయుడు, గండి లక్ష్మి, శరగడం శివ, గవిరెడ్డి జగన్నాథం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పాత్రునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శెట్టిపాలెం పాఠశాలను సందర్శించిన డీఈవో

డీఈవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం పాఠశాలను డీఈవో అప్పారావు నాయుడు మంగళవారం సందర్శించారు. 'నాడు వెలవెల-నేడు కళకళ' అని శీర్షికతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంపై 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 27న వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను, సర్పంచ్ అల్లు రామునాయుడు అభినందించారు. అలాగే వారికి పలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయురాలు తమ ఇద్దరు పిల్లలను ఇదే పాఠశాల్లో చేర్చడం ప్రశంసనీయమని, ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని డీఈవో కోరారు. కార్యక్రమంలో ఏంఈవో మూర్తి పాల్గొన్నారు.

## రోజంతా ముసురే..

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మంగళవారం తెల్లవారు నుంచి వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షం కాకపోయినా రోజంతా చిరుజల్లులతో అడపాదడపా మోస్తరు వర్షం పడింది. దీంతో రోడ్లు చిత్తడిగా మారాయి. వానలో తడుస్తూనే జనం తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

### నర్సీపట్నంలో...

నర్సీపట్నం రహదారిలో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం: పట్టణంలోని చుట్టు పక్కల ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ముసురు పట్టుకుంది. తెల్లవారు జాము నుంచి తెరిపివ్వకుండా తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో స్కూల్ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యక్తగత పనుల మీద బయటకు వచ్చే వారంతా అసౌకర్యానికి గురయ్యారు. శివారు ప్రాంతాల్లో మట్టి రోడ్లు చిత్తడిగా తయారయ్యాయి.

## వైభవంగా మోదకొండమ్మ ఘటాల పండుగ

ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఘటాల పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అమ్మవారిని పూలదండలతో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వర్షం పడుతున్నప్పటికీ భక్తులు ఘటాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఘటాలను సమర్పించి ముడుపులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## మోదకొండమ్మకు లక్ష పసుపు కొమ్ముల పూజ

పసుపు కొమ్ములతో చేసిన పూజ

మాడుగుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో కొలువైన మోదకొండమ్మకు మంగళవారం లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజ చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం వరకు పలువురు దంపతులు, భక్తులు సమర్పించిన పసుపు కొమ్ములతో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కూర్మవతారంలో జగన్నాథుడు

మాడుగుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో జగన్నాథుడు మంగళవారం భక్తులకు వామనవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు పండా నూకరాజు స్వామివారిని వామనవతారంలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు.

## మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చీడికాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాకోట వెంకట సత్యనారాయణ ఆర్థిక సాయంతో కోలాట కళాకారులకు సౌండ్‌బార్‌ను మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో కోనాం జలాశయం కమిటీ వైస్ చైర్మన్ కె.చిన్నంనాయుడు, టీడీపీ నాయకులు మిస్కా రామరాజుయాదవ్, దొడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ

**కార్యక్రమంలో హుషారుగా పాల్గొన్న ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారులు**

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఓవైపు జోరుగా వర్షం కురుస్తున్నా మరోవైపు అదే స్థాయిలో సామాజిక పింఛన్ల పంపిణీ సాగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మంగళవారం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారుల పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందించారు.

చోడవరం మండలంలో వర్షం కురుస్తున్నా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆటంకం లేకుండా కొనసాగించారు. గోవాడ, నరసాపురం పంచాయతీలతో పాటు మండల కేంద్రంలోని తామరచెరువువీధి, వెలమవీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, కనిశెట్టి మత్స్యరాజు, ఏడువాక లక్ష్మణకుమార్, సకురు కోటేశ్వరరావు, డీవీ.అప్పారావు, జనసేన నేత అల్లం రామప్పారావు పాల్గొన్నారు.

### మాడుగులలో...

మాడుగుల రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ముకుందపురంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టతరంలో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎ.జగ్గారావు, పి.రమేశ్, ఉండూరు దేముడు, మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

### నర్సీపట్నంలో...

పింఛను పంపిణీ చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం: పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. వార్డులో మంగళవారం గడప గడపకు వెళ్లి రూ.4 వేలు పింఛను సొమ్ము లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ లేకుండానే 98 శాతం పింఛన్లు పంపిణీ ఒక రోజులో పూర్తి చేసినట్టు చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం పింఛను రూ.4 వేలు ఇస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కొరుప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో మంగళవారం వర్షం కురుస్తున్నప్పటికీ ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. దిబ్బిడి గ్రామంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు. రూ.200 ఉన్న సామాజిక పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు గుర్తు చేశారు. అలాగే వడ్డాది గ్రామంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదని, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో రూ.4 వేలు పింఛన్ అందిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్, సర్పంచ్ పి.మాణిక్యం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, నాయకులు ఎం.తాతీలు, కె.రవి, దేవర అప్పారావు, దొండా సాయి, తలారి శంకర్, ఎం.సూరిబాబు పాల్గొన్నారు

మాడుగుల: ముకుందపురంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

### రోలుగుంటలో...

రోలుగుంట: ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ నెల ఒకటో తేదీనే లబ్ధిదారులకు శతశాతం పింఛన్ల పంపిణీ నేరుగా ఇస్తున్నామని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర పేర్కొన్నారు. రాజన్నపేట, శరభవరం గ్రామాల్లో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన లబ్ధిదారులందరికీ నూతనంగా పింఛన్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు.

చోడవరంలో వర్షంలోనూ పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

### దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలో వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా ఇంటింటికీ ఉద్యోగులు, నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. మంగళవారం తెల్లవారు నుంచి ఈ కార్యక్రమం జరిగింది. గర్సింగి, బి.కింతాడ, తారువ, కలిగొట్లలో నాయకులు సూర్యనారాయణ, కడింనాగేశ్వరరావు, అల్లు శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న బత్తుల తాతయ్యబాబు

# ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించండి

» జడ్పీ సీఈవో నారాయణమూర్తి

రావికమతం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) నారాయణమూర్తి ఆదేశించారు. మండలంలోని మేజరు పంచాయతీ మేడివాడలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. అలాగే గ్రామంలో పలు వీధులను సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో మేడివాడలో 70 శాతం ప్రజలు క్లాప్ మిత్రలు ఇళ్లకు రావడం లేదని తెలిపారని ఆయన వెల్లడించారు. ఇకపై ఇటువంటి వ్యతిరేకత లేకుండా పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది చూసుకోవాలని ఆయన సూచించారు. పంచాయతీకి చెందిన ఆరుగురు క్లాప్ మిత్రలు మూడు జట్లుగా విడిపోయి ఇంటింటికీ చెత్త సేకరించాలని, దాన్ని సంపద తయారీ కేంద్రానికి తరలించాలని చెప్పారు. అనంతరం సంపద కేంద్రం పనితీరును ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా గ్రామంలో ఏమాత్రం పారిశుధ్యం లోపించకూడదని, ఎప్పటికప్పుడు తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శి పి.దాలినాయుడును ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రపు నాగవెంకటలీలా, ఈవోపీఆర్డీ సీతారామస్వామి పాల్గొన్నారు.

మేడివాడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సీఈవో నారాయణమూర్తి

## ఘనంగా వైద్యుల దినోత్సవం

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం వైద్యుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.సతీశ్, ట్రెజరీ అధికారి రామారావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు శర్మ వైద్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రముఖ వైద్యులు రాజశేఖర్, అధికారి గోపాలరావు, వంశీకృష్ణ, నాగేశ్వరరావు, రేడియాలజిస్ట్ డాక్టర్ అల్లు రమ్య, చిన్న పిల్ల వైద్యులు లక్ష్మీకాంత్‌ను శాలువ కప్పి జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు గోపి, కాళ్ల నాయుడు, ఏవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో..

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో మంగళవారం జాతీయ డాక్టర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్ కేక్ కట్ చేశారు. వైద్యులు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు విష్ణుప్రియ, హిమబిందు, రేష్మ, రవికుమార్, విజయలక్ష్మి, హెడ్‌నర్సు జయంతి, ల్యాబ్‌టెక్నిషియన్ సూర్యశంకరరావు, రమేశ్‌నాయుడు, సౌందర్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది..

మాడుగుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరు, సాగరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి వ్యవసాయ రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి విజేత, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు సౌజన్య, సత్తిబాలు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున సాగు చేసే పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. విత్తన మార్పిడి, నారు మడులు తయారు చేసుకోవడం, పలు యాజమాన్య పద్ధతులు గురించి వారు అవగాహన కల్పించారు. అనంతరం వరినారు మడులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అనసూయ, ఎంపీఈవో లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## ములకలాపల్లిలో దుర్గమ్మకు పూజలు

దేవరాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లిలో దుర్గమ్మ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు పాకల కామేశ్వరరావు శర్మ పూజలు చేయించారు. గ్రామస్థులు ఉదయం నుంచి పూజలు చేసి అనంతరం అన్న సమారాదన నిర్వహించారు.

## ఈవోపీఆర్డీగా బాలదొర

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈవోపీఆర్‌డీగా బాలదొరను నియమించినట్టు ఎంపీడీవో ఛాయిసుధా తెలిపారు. ఈవోపీఆర్‌డీగా పనిచేసిన సీతామహాలక్ష్మి చింతపల్లికి బదిలీ కావడంతో సోమవారం రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో ఈవో బాలదొరకు బాధ్యతలు అప్పగించినట్టు ఎంపీడీవో చెప్పారు. ప్రస్తుతం ఆయన మాకవరపాలెం, తామరం గ్రామ సచివాలయాలకు ఈవోగా పనిచేస్తున్నారు.

## విత్తన శుద్ధి తప్పనిసరి

కె.కోటపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరి నారుమడులు వేసుకునే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారి సోమశేఖర్ చెప్పారు. వారాడ, సంతపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తనశుద్ధిని బీజామృతంతో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బాబీ మాస్టారుకు అభినందన సభ

బాబీ మాస్టారు దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి నుంచి విరమణ పొందిన జీఎస్ రవిశంకర్‌కుమార్ (బాబీ మాస్టారు) దంపతులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు ఘనంగా సత్కరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అభినందన సభకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి బాబీ మాస్టారు సూచనలు, సలహాలు అవసరమన్నారు. ఆయన 300 సన్మాన పత్రాలు రాశారని తెలిపారు. ఎన్నో కార్యక్రమాల ముందుండి నడిపించారని కొనియాడారు. ఉపాధ్యాయులు అంటే మేధావి వర్గానికి చెందిన వారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అధ్యయనం చేసి తన దృష్టికి తీసుకువస్తే లోపాలు సరిదిద్దడానికి ప్రయత్నం చేస్తానన్నారు. అనంతరం ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ రామారావు, పీఆర్‌టీయూ, వాకర్స్ క్లబ్, సిటీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు మాస్టారును సన్మానించారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, ఎంఈవో తలుపులు పాల్గొన్నారు.

## కొండపాలెంలో విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్

రోలుగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాలెం పాఠశాలలో మంగళవారం రిటైర్డ్ హెచ్‌ఎం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. 39 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ విరమణ పొందిన ఈశ్వరప్రసాద్ పాఠశాలలోని ఐదు తరగతుల విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేశారు. చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశారపు రాము, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసిన గల్లా

మాధవ్‌ను శుభాకాంక్షలు తెలుపుతున్న గల్లా

రావికమతం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ నియామకమైన మాధవ్‌ను ఆ పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరరావులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు గుటాల చిన్నతో కలిసి విజయవాడలో నిర్వహించిన మాధవ్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రలో కార్యకర్తలను పేరు పెట్టి పిలవగల సాన్నిహిత్యం మాధవ్‌కు ఉందని వారు పేర్కొన్నారు.

## మూగజీవాలకు నట్టల నివారణ టీకాలు

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మసాగరం, అమలాపురం, మునిసిపాలిటీలోని బలిఘట్టంలో పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు మంగళవారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 180 గొర్రెలు, 520 మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాంబాబు తెలిపారు. గొర్రెలు, మేకలు పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.పుష్ప, పి.సురేశ్ పాల్గొన్నారు.

## నేడు నేత్ర వైద్య శిబిరం

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ క్లబ్ ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ చైర్మన్ పోతల ప్రకాశరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని ఆయన చెప్పారు. ఈ శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## మోడల్ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయుల నియామకం

గొలుగొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మోడల్ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయులు ప్రభుత్వం నియమించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జోగంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట, చోద్యం, ఏఎల్.పురం, కృష్ణాదేవిపేట, కొంగశింగి, చీడిగుమ్మల, ఎర్రవరం, కొత్తఎల్లవరం, గుండుపాల, పాకలపాడు గ్రామాల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. అధిక శాతం మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో చేరేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలి

మాకవరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరినారు వేసే ముందు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.అప్పారావు చెప్పారు. పాపయ్యపాలెం, పైడిపాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో విత్తనం వేయడానికి పది నుంచి 12 రోజుల ముందు బాగా దున్ని, కలుపులేకుండా చేసుకొని చదును చేయాలని చెప్పారు. నారు తీయడానికి వారం రోజుల ముందు ప్రతీ ఐదు సెంట్ల మడికి 800 గ్రాములు 3జి కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నీటి నిల్వలు తొలగించాలి

గొలుగొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాల సీజన్‌కావడంతో తొట్టెల్లో నీటి నిల్వలు తొలగించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలకు తడకూడదని, వేడిచేసిన నీటిని తాగాలని ఆయన చెప్పారు. అలాగే దోమల కుట్టకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీలా, హెచ్‌వీ, తదితరులు పాల్గొన్నారు.

# థైలీరియాను తరిమేద్దాం

వ్యాధి సోకిన పశువులలో 90 శాతం మృత్యువాత

- పాడి సంపద సంరక్షణకు ప్రభుత్వం కంకణం
- రూ.600 ఖరీదు చేసే టీకా ఉచితంగా పంపిణీ
- జిల్లాకు 97,500 డోసులు మంజూరు

నర్సీపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంకరజాతి పశువులకుసంక్రమించే థైలీరియా వ్యాధి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా రూ.600 ఖరీదు చేసే టీకాను ఉచితంగా పశువులకు వేస్తుంది. మంగళవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15వ తేదీ వరకు ఈ వ్యాధి నిరోధక టీకాను సంకరజాతి పశువులకు వేయనుంది.

### 70 శాతం పశువులకు టీకా వేయాలని లక్ష్యం

జిల్లాలో 1.9లక్షల సంకర జాతి పశువులు ఉండగా, 70 శాతం పశువులకు ఈ టీకాలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నర్సీపట్నం డివిజన్‌కు 24,800 డోసులు, అనకాపల్లి డివిజన్‌కు 72,700 డోసులు చొప్పున మొత్తం అనకాపల్లి జిల్లాకు 97,500 డోసులు మంజూరు చేసింది. మూడు నెలలు దాటిన ఆడ, మగ సంకరజాతి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు పశువైద్య నిపుణులు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు.

### వ్యాధి సోకి ఏడాదికి రెండు వేల పశువులు మృతి

థైలీరియా వ్యాధి వలన ఏడాదికి రెండు వేల సంకర జాతి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఈ వ్యాధి సోకిన పశువులలో 90 శాతం చనిపోతున్నాయి. వ్యాధి నివారణకు వేల రూపాయలు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఒక్కోసారి పాడి సంపదను కోల్పోవల్సి వస్తుంది.

### ఇవీ వ్యాధి లక్షణాలు..

థైలీరియా వ్యాధి సంకర జాతి పశువులలో గోమార్లు, పిరుదులు కుట్టడం వలన వస్తుంది. విపరీతమైన జ్వరం, సరిగా మేత మేయక పోవడం, దవడ కింద గగ్గలు వాపు, నీరసించిపోవడం, పాలు దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు వ్యాధిసోకిన పశువుల్లో కనిపిస్తాయి. వ్యాధి వలన చూడి కట్టిన పశువులలో గర్భస్రావం జరగవచ్చు. ఈ వ్యాధి సాధారణ చికిత్సకు లొంగేది కాదు. వారం రోజుల పాటు సెలైన్లు ఎక్కించి, ఖరీదైన యాంటి బయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. వైద్యానికి రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. చికిత్స అనంతరం పశువు కోలుకోవడానికి మూడు నెలలు పడుతుంది. దీంతో పాడి రైతు తీవ్రంగా నష్టపోతాడు. పాడి దిగుబడి తగ్గి పోయి ఆర్థికంగా చితికి పోతాడు. పాడి రైతు నష్ట పోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టీకాను ఉచితంగా పంపిణీ చేస్తుంది.



థైలీరియా నివారణకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న టీకాలు

### పశువులకు టీకా ఎంతో మేలు

థైలీరియా టీకా కార్యక్రమం ఈ నెల 15 తేదీ వరకు కొనసాగుతుంది. రైతులు తమ పశువులకు వేయించుకోవాలి. మూడు నెలలు దాటిన ఆడ, మగ సంకర జాతి పశువులకు తప్పకుండా ఈ టీకాల వేయిస్తే థైలీరియా వ్యాధి సోకదు. **డబ్ల్యూ.రాంబాబు**, ఏడీ, పశు సంవర్థక శాఖ, నర్సీపట్నం

## కోటవురట్ల మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ

- త్వరలోనే నిరుద్యోగ భృతి అమలు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో హోం మంత్రి అనిత

బీకేపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి అనిత.., పింఛన్ లబ్ధిదారు ఇంటి వద్ద ఆమె కలిసి టీ తాగుతున్న దృశ్యం

కోటవురట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని బీకేపల్లిలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. వారితో మాట్లాడి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ 492 ఎకరాల ప్రభుత్వ భూముల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమను నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ఇందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నక్కపల్లిలో టాయ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో 25 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. సంక్షేమ ఫలాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ప్రతి గ్రామంలో నిరుద్యోగ భృతికి ఎంతమంది అర్హులు ఉన్నారో గుర్తించాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలోనే నిరుద్యోగ భృతి వస్తుందని స్పష్టం చేశారు. అర్హులైన వారికి మూడు సెంట్ల స్థలంలో పక్కా గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీకేపల్లి, రామచంద్రపాలెం పరిధిలో 131మంది లబ్ధిదారులకు అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన పట్టాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, తహసీల్దార్ తిరుమల బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, వేచలపు జనార్ధన్, ఎలమంచిలి ప్రకాష్, ఎస్.రాయవరం మండల నాయకుడు అబద్ధం, మాజీ ఎంపీపీ వినోద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో సామాజిక పింఛన్లు పంపిణీ

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను జిల్లాలో సక్రమంగా, సకాలంలో పంపిణీ చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి 81వ వార్డు నూకాలమ్మ దేవాలయం వీధిలో పలువురి లబ్ధిదారుల ఇళ్లకు మంగళవారం ఉదయం వెళ్లి పింఛన్లను పంపిణీ చేసి వారితో మాట్లాడారు. ప్రతి నెలా పింఛన్ సరిగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. దీంతో వారు సకాలంలో అందుతోందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు కె.శచీదేవి, సహాయ పథక సంచాలకులు వై.సంతోష్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

81వ వార్డు నూకాలమ్మ దేవాలయం వీధిలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

## క్యాప్టివ్ పోర్టుపై కదలిక

డీఎల్‌పురం కేంద్రంగా నిర్మాణం

- స్థలాన్ని పరిశీలించిన జపనీస్ బృందం

నక్కపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీలు సంయుక్తంగా భారీ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆమోదం కూడా లభించింది. స్టీల్‌ప్లాంట్‌కు అనుగుణంగా డీఎల్‌పురం తీరం వద్ద క్యాప్టివ్ పోర్టును నిర్మిస్తారని ప్రచారం జరిగింది. ఈ మేరకు మంగళవారం జపాన్‌కు చెందిన నిప్పల్ స్టీల్, ఆర్సెలర్ మిట్టల్ కంపెనీల ప్రతినిధుల బృందం డీఎల్‌పురం గ్రామంలో పర్యటించింది. ప్రైవేట్ రంగంలో నిర్మించనున్న ఉక్కు ఫ్యాక్టరీకి తొలి విడతగా 2,260 ఎకరాల భూములు అవసరమని గుర్తించారు. ఉక్కు పరిశ్రమ ఉత్పత్తులు, మరికొన్ని ముడిసరుకుల రవాణా, ఇతర అవసరాల కోసం ఈ పరిశ్రమలు క్యాప్టివ్ పోర్టును నిర్మించుకోవలసి వుంది. అందుకే ఈ బృందం డీఎల్‌పురం తీర ప్రాంతాన్ని, భౌగోళిక పరిస్థితులను పరిశీలించింది. నక్కపల్లి తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణారావు వారి వెంట వున్నారు. స్టీల్‌ప్లాంటు నిర్మాణం కోసం కేటాయించిన భూముల్లోనే క్యాప్టివ్ పోర్టు కోసం కావలసిన భూములను ఈ కంపెనీలు తీసుకుంటాయని తెలిసింది.

క్యాప్టివ్ పోర్టు కోసం డీఎల్‌పురం తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జపనీస్ ప్రతినిధుల బృందం

## పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా

- 625 ఫోన్‌లను బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పదో విడత మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. రూ.1.20 కోట్ల విలువైన 625 ఫోన్‌లను రికవరీ చేసి ఎస్పీ తుహిన్ సిన్హా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 5,600 మొబైల్ ఫోన్లు పోయినట్టు ఫిర్యాదులు నమోదు కాగా, 3,336 మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. రికవరీ చేసిన ఫోన్ల విలువ రూ.5.27కోట్లు ఉంటుందని చెప్పారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఫోన్‌లను కనుగొని రికవరీ చేయడం జరిగిందన్నారు. మొబైల్ మిస్సింగ్‌పై ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి రికవరీ చేస్తున్నట్టు వివరించారు. మొబైల్ రికవరీలో విశేషంగా కృషి చేసిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు, ఐటీ కోర్ ఎస్ఐ బి.సురేష్‌బాబు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ రికవరీ మేళాలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

## చేసిన అభివృద్ధిని చెబుదాం

... 5వ పేజీ తరువాయి

సంక్షేమ కార్యక్రమాలు, పలు అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బూత్ ఇన్‌చార్జులపై వుందన్నారు. 2014-19 మధ్య నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే, 2019 నుంచి 2024 వరకూ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసం సృష్టించిందన్నారు. మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ప్రగతి బాట పడుతోందన్నారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటవుతుందని, త్వరలో బొమ్మల పరిశ్రమ కూడా రాబోతోందని చెప్పారు. నియోజకవర్గంలో 55 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించబోతున్నామని చెప్పారు. తల్లికి వందనం, దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, పెన్షన్ల సొమ్ము పెంపు వంటి పథకాలు ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై వుందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా సేకరించాలని చెప్పారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, లింగన్న నాయుడు, అమలకంటి అబద్దం, చించలపు పద్దు, పార్టీ సీనియర్ నాయకులు ఏజెర్ల వినోద్‌రాజు, కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీ బస్సుల్లో చార్జీల తగ్గింపు

- నేటి నుంచే అమలు
- ఆర్టీసీ ఆర్ఎం

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఏసీ బస్సుల చార్జీలు పది శాతం మేర తగ్గించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. రీజియన్‌లో అమరావతి, నైట్ రైడర్, ఇంద్ర కేటగిరీల్లో 16 ఏసీ సర్వీసులు ఉన్నాయి. ఇవి విశాఖ నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏసీ సర్వీస్‌లకు డిమాండ్ తగ్గింది. సగటు ఆక్యుపెన్సీ రేషియో 60 శాతానికి మించడం లేదు. ఈ విషయాన్ని రీజియన్ అధికారులు రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. చార్జీల్లో పది శాతం రాయితీ ఇస్తే ఆక్యుపెన్సీ రేషియో పెరిగే అవకాశం ఉందని సూచించారు. ఈ మేరకు దూర ప్రాంతాలకు తిరిగే ఏసీ సర్వీసుల టికెట్లలో పది శాతం రాయితీ ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ తగ్గింపు బుధవారం నుంచి అమలులోకి వస్తుందని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

## వజ్రాల కొండను మింగేస్తున్నారు

... 5వ పేజీ తరువాయి

తవ్వకాలు జరుపుతుండడంతో అక్కడ నిర్మించిన ఇళ్లు ప్రమాదంలో పడ్డాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడడంతో అక్కడ అధికారులు నిఘా పెట్టారు. దీంతో స్థానికంగా కొంత మంది సహకారంతో ఎర్రవాని పాలెం వాటర్ ట్యాంక్ వద్ద, జగనన్న కాలనీ వద్ద అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు. వర్షాలు కురుస్తున్నా డంపర్ల రాకపోకలకు వీలుగా ఉండడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపులేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రానికి దగ్గరగా కొండ ఉండడంతో పాటు ఇక్కడ నాణ్యమైన గ్రావెల్ లభ్యం కావడంతో తవ్వకాలు ఆగడం లేదని చెబుతున్నారు. వెంచర్లు, రోడ్లకు ఇక్కడ గ్రావెల్ అనుకూలంగా ఉండడంతో బాగా డిమాండ్ ఉన్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బరి తెగించి ఇక్కడ నుంచి గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అనకపల్లి గ్రామానికి ఆనుకొని ఏర్పాటవుతున్న లేఅవుట్లకు వెళ్లేందుకు ప్రభుత్వ భూములను సైతం పూడ్చేసి రోడ్లు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, గనులు, విజిలెన్స్ అధికారులు స్పందించి ఇక్కడ గట్టి నిఘా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

CLASSIFIEDS

**CHANGE OF NAME**

I, **BHEEMARA SETTY SRI VARA LAKSHMI** (New Name) W/o. Bheemara Setty Krishna Sai Adinarayana previously called Bheemarasetty Vara Lakshmi (Old Name), Resident of 5-150/1/3/GF, Kaushiki Arcade, Teachers Layout, Sujathanagar, VSKP-530051. Now changed my name from Bheemarasetty vara lakshmi To **BHEEMARA SETTY SRI VARA LAKSHMI**. Hence forth will be called as **BHEEMARA SETTY SRI VARA LAKSHMI** for all purpose.

**FLAT FOR SALE**

అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK Flat, 52 లక్షలకే అమ్మకమునకు కలదు Contact : 9866321992

AJV_241292

**దస్తావేజులు పోయినవి**

నేను **NISHEK BATHULA** S/o. వెంకటరమణ, డో.నెం. 4-55-2/5, లాసెన్స్‌బే కాలని, విశాఖపట్నం కాపురస్థుడను. నేను తేది 05-05-2025న బాలయ్య శాస్త్రీ లేవుట్ నుండి అక్కయ్యపాలెం మార్గమధ్యలో బైక్‌లో వెళ్తుండగా నా ఇంటి స్థలం తాలూకు దస్తావేజు నెం. **1462/2023, 2170/2023**రు గల దస్తావేజు పడిపోయినవి. దొరికినవారు ఈ ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు : **8790573192**.

AJV_241690

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు. చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093


crime news

## ఏలేరు కాలువలో వృద్ధురాలి మృతదేహం

ఏలేరు కాలువలో గుర్తించిన గుర్తు తెలియని మృతదేహం

కశింకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరకాం గ్రామంలో గల ఏలేరు కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం మంగళవారం లభ్యమైందని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈమె వయస్సు సుమారు 60 నుంచి 70 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. చామనఛాయ రంగులో ఉందని వివరించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని ఆయన కోరారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి పిసినికాడ పంచాయతీకి చెందిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. బీఆర్టీ కాలనీలో ఉంటున్న కూండ్రపు లక్ష్మణరావు (36) వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో నిద్రపోయే ముందు విద్యుత్ బోర్డుకు ఫ్యాన్ ప్లగ్ తగిలిస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య నాగమణి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఇదిలావుంటే, మృతుని కుటుంబ సభ్యులను జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ పరామర్శించారు.

## రోడ్డు ప్రమాదంలో రావికమతం వాసి మృతి

ముక్కా నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

రావికమతం, జూలై1 (ఆంధ్రజ్యోతి) :తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా రావికమతానికి చెందిన ముక్కా నాగేశ్వరరావు (53)మృతి చెందాడు. కడియం నర్సీరీలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో తన వాహనంలో కడియం నుంచి రాజమండ్రి వస్తుండగా మార్గం మధ్యలో హుకుంపేట డీ మార్టు వద్దకు వచ్చేసరికి వ్యాన్ టైర్ పంచర్ అయింది. దీనిని మార్చేందుకు వ్యాన్‌ను రోడ్డు పక్కన పెట్టి, ఆ సమీపంలో ఉన్న మరో వాహనం నుంచి జాకీని తీసుకొస్తుండగా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతనికి భార్య సత్యవతి, కుమారుడు హేమంత్, కుమార్తె మౌనిక ఉన్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

## 107 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

నిందితులను చూపుతున్న పోలీసులు

చోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం 107 కిలోల గంజాయితో స్థానిక పోలీసులకు పట్టుబడ్డారు. ఏఎస్ఐ నాగేశ్వరరావుకు ముందుగా అందిన సమాచారం మేరకు పట్టణ శివారు గౌరీపట్నం వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఇంతలో ఏజెన్సీ ప్రాంతం నుంచి సిల్వరు రంగు కారు వస్తుండగా, దానిని ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జితేందర్, వాహిద్ అమీద్‌లు కారును కొద్ది దూరంలో నిలిపివేసి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న 107 కిలోల గంజాయితో పాటు, కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

## మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ

తాడు తెంచుకుని బైక్‌పై పరారవుతున్న దుండగులు (సీసీ పుటేజీలో నమోదు)

కశింకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలోని బజారు వద్ద మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు తెంచుకుపోయిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. కశింకోట గ్రామంలో భవానీ కాలనీకి చెందిన చదరం సత్యవతి బజారు వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఇంతలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి ఆమెను బెదిరించి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకుపోయారు. బీధితురాలి ఫిర్యాదు మేరకు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

## అల్లూరి జయంతి ఏర్పాట్ల పరిశీలన

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కె.దుర్గేష్, కొల్లు రవీంద్ర, ఎంపీలు సీఎం రమేశ్, కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర అధికారులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాస్, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, చోద్యం సర్పంచ్ గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, లగుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటును వీడి ప్రభుత్వ బడి బాట

... 5వ పేజీ తరువాయి

విశేషం, అదేవిధంగా నక్కపల్లి, మాకవరపాలెం మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఆశాజనకంగా ఉన్నాయి. కొన్ని మండలాల్లో ప్రవేశాలు తక్కువగా ఉన్నప్పటికీ ఈ నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు.

### నెలాఖరు వరకు స్పెషల్ డ్రైవ్

ప్రైవేటు స్కూళ్ల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ ఈ నెలాఖరు వరకు జరుగుతుంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటాం.

- గిడ్డి అప్పారావు నాయుడు, డీఈఓ, అనకాపల్లి

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 70.00 |
| లైవ్ ధర | 90.00 |
| విత్ స్కిన్ | 150.00 |
| స్కిన్ లెస్ | 160.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 585 |
| విజయనగరం | 589 |
| శ్రీకాకుళం | 589 |

# ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 2 జూలై 2025

# నేడే.. తొలి అడుగు

● నెల రోజులు ప్రజల్లో టీడీపీ
● ఇంటింటికీ మంత్రులు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు
● ఏడాదిలో జరిగిన మంచి గురించి చెప్పేందుకు..
● వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు
● 'సుపరిపాలనలో.. తొలి అడుగు' పేరిట కార్యక్రమం

అనంతపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లనున్నారు. 'సుపరిపాలనలో.. తొలి అడుగు' పేరిట బుధవారం నుంచి ప్రజల వద్దకు వస్తున్నారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలు, సూపర్ సిక్స్ అమలు, సమస్యల పరిష్కారం గురించి వివరించేందుకు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. వీటితోపాటు ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఐదేళ్ల పాలనలో చేసిన విధ్వంసాన్ని ప్రజలకు గుర్తు చేయాలని నిర్ణయించారు. చేసిన, చేయబోయే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి, 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగనున్నారు.

### ఎందుకంటే..?

'సుపరిపాలనలో... తొలి అడుగు' అజెండాను సీఎం చంద్రబాబు ప్రజా ప్రతినిధులకు అందజేశారు. ప్రజలకు ఏ అంశాల గురించి వివరించాలో దిశానిర్దేశం చేశారు. స్థానిక అంశాలు, ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, హామీల అమలు ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని ఎమ్మెల్యేలకు సూచించారు. 2014-19మధ్య అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించని కారణంగానే 2019లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్న విషయాన్ని టీడీపీ అధిష్టానం గుర్తించింది. వచ్చే ఎన్నికల్లో అలా జరగకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

### ప్రధాన అజెండా ఇదే..

● వైసీపీ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినింది. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ కంపెనీలు

(మిగతా 6వ పేజీలో...)

## విజయవంతం చేయాలి: వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం: 'సుపరిపాలనలో తొలి అడుగు'ను అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వం ఏడాదిలో ఎన్నో పథకాలను ప్రజలకు అందించిందని అన్నారు. 2014-2019లో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి చెప్పుకోలేక 2019 ఎన్నికల్లో చాలా నష్టపోయామని అన్నారు. కొత్త ప్రభుత్వంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చామని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని అన్నారు. మత్స్యకార భరోసా కింద రూ.250 కోట్లు అందించామని తెలిపారు. రాష్ట్రంలో 204 అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

## ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయం

జీఎస్టీ ఏసీ సాగి సుందర్‌రాజు

అనంతపురం కలెక్టరేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లలో అధికారులు, ఉద్యోగుల పని తీరు ప్రశంసనీయమని సెంట్రల్ గూడ్స్ సర్వీస్ టాక్స్(జీఎస్టీ) అసిస్టెంట్ కమిషనర్ సాగి సుందర్ రాజు అన్నారు. నగరంలోని జీఎస్టీ కార్యాలయంలో 8వ జీఎస్టీ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అధికంగా పన్ను చెల్లించిన పలు సంస్థల ప్రతినిధులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. తిరుపతి కమిషనరేట్ పరిధిలో అనంతపురం రెవెన్యూ డివిజన్ 2024-25 సంవత్సరానికి అత్యధికంగా రూ.4,888 కోట్ల ఆదాయం సమకూర్చిందని అన్నారు. పన్ను వసూళ్లలో ప్రోత్సాహం సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత బత్తల ఇంటిపై సీబీఐ దాడులు

రాత్రి వరకూ కొనసాగుతున్న తనిఖీలు

మెడికల్ కాలేజీల నుంచి లంచం కేసులో..

(వివరాలు మెయిన్‌లో)

బత్తల ఇంటి బయట పోలీసులు, వైసీపీ నాయకులు.. జగన్‌తో బత్తల

## ఆయనో రకం ఈయనో రకం..!

ప్రభుత్వ శాఖల్లో ఇద్దరు అధికారుల వికృత చేష్టలు

ప్రసవ సమయం అన్నా కనికరించని వైనం

- అర్ధరాత్రి పూట మహిళా ఉద్యోగులకు ఫోన్లు
- కూచొని కబుర్లు చెప్పకపోతే వేధింపులే
- తీవ్ర ఇబ్బంది పడుతున్న కిందిస్థాయి సిబ్బంది

బుక్కరాయసముద్రం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొందరు శాడిస్టు అధికారుల తీరుతో మండలంలో ఉద్యోగం చేయలేకపోతున్నామని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారని, మహిళా ఉద్యోగుల పట్ల వికృత చేష్టలు ఎక్కువయ్యాయని మండలంలో జోరుగా చర్చ జరుగుతోంది. గెజిటెడ్ హోదా గల ఆ అధికారులు వంకరబుద్ధితో మహిళా సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...

● ఓ సచివాలయ మహిళా ఉద్యోగి 9 నెలల నిండు గర్భిణి. పురిటి నొప్పులు వచ్చే సమయం. అయితే ఆ శాడిస్టు అధికారి మాత్రం 'నీకు సంబంధించి పని మొత్తం రికార్డు నాకు ఇవ్వాల్సిందే' అని పట్టుబట్టాడు. 'సార్..! నాకు రేపు డెలివరీ డేట్ ఇచ్చారు. వచ్చే స్థితిలో లేను. ఆస్పత్రికి వెళ్లాలి' అని ఉద్యోగి విన్నవించారు. 'అలా అయితే ఉద్యోగానికి రాజీనామా చెయ్, లేదంటే నీపైన చర్యలకు సిఫారసు చేస్తా' అని ఆ అధికారి హూంకరించాడు. ఏమి చేయలేని స్థితిలో ఆ మహిళా ఉద్యోగి తన భర్త సాయంతో వచ్చి సంబధించిన రికార్డు, మిగిలిన పనుల వ్యవహారం ఆ అధికారికి అప్పగించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి అడ్మిట్ కాగా మరుసటి రోజు మధ్యాహ్నం ఆమె ప్రసవించారు. మానవత్వం మరిచిన ఆ అధికారి శాడిజానికి ఇదొక మచ్చుతునక.

● మరో ఘటనలో మండలంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి కి అర్ధ రాత్రి 12 గంటల సమయంలో ఫోన్ చేసి శాఖకు సంబంధించిన పని, రికార్డు గురించి తక్షణం ఆన్‌లైన్‌లో పెట్టాలని ఒత్తిడి చేశాడు. 'సార్ ఈ సమయంలో అడిగితే ఎలా? రేపు ఉదయం ఇస్తా' అని ఆమె సమాధానం ఇచ్చారు. 'అయితే నీపైన ఉన్నతాధికారులకు రిపోర్టు రాస్తా. ఏ టైంలో అడిగినా ఇవ్వాలి. లేదంటే రాజీనామా చేసి వెళ్లిపో' అంటూ గద్దించాడు. ఇలా వేళకాని వేళలో ఫోన్లు చేసి వేధిస్తే, ఇంట్లో ఏమి సమాధానం చెప్పాలని మహిళా ఉద్యోగులు వాపోతున్నారు.

● ఆ అధికారి ఫోన్ చేసిన సమయంలో ఉద్యోగులు లిఫ్ట్ చేయకపోతే ఇక వారికి అరగంటసేపు వాయింపే. తర్వాత ఉద్యోగులు మహిళలైనా, పురుషులైన సారీ చెప్పి బతిమాలితే గాని సారు శాంతపడరని సమాచారం.

### ఈయనకు కబుర్ల పిచ్చి

ఇక మరో అధికారి మహిళా ఉద్యోగులు, లబ్ధిదారుల పట్ల వికృతంగా ప్రవర్తిస్తారని తెలిసింది. ఆ శాఖలో ప్రస్తుతం ప్రభుత్వానికి సంబంధించి ఎలాంటి పని లేదు. ఖాళీగా ఉండటంతో ఓ గెజిటెడ్ అధికారి మహిళా ఉద్యోగులను తన వద్దకు పిలిపించుకుంటారు. వారు గంటల తరబడి ఆయనకు కబుర్లు చెప్పాలట. లేదంటే అడ్డదిడ్డమైన మాటలతో వేధిస్తారని సమాచారం. ఆయన తీరుతో మహిళా లబ్ధిదారులు కూడా ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. టీడీపీ నాయకులు రాజకీయంగా ఒత్తిడి తెచ్చి ఏరికోరి ఈ అధికారిని మండలానికి తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన వికృత చేష్టలను చూసి తలలు పట్టుకుంటున్నారు. ఆయన్ను బదిలీ చేయించాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భాగమైన మండలంలో ఇలాంటి అధికారుల తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డాక్టర్ వృత్తి గౌరవప్రదమైనది: డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో డాక్టర్ వృత్తి గౌరవప్రదమైనదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. డీఎంహెచ్ఓ కేక్‌ను కట్ చేసి, ప్రసంగించారు. వైద్యులు చిత్తశుద్ధితో సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఓ గిరిజ మనోహర్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ సురేందర్‌రెడ్డి, డీఎస్ఓ మహ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, గంగాధర్, హెచ్ఈఓ నాగరాజు, కిషోర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

కేక్‌ను కట్‌చేస్తున్న డాక్టర్ ఈబీ దేవి

## గణాంకాలే అభివృద్ధికి సూచికలు: డీఎస్ఓ

అనంతపురం వైద్యం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏ రంగం అభివృద్ధికైనా గణాంకాలే సూచికలని జిల్లా గణాంక అధికారి(డీఎస్ఓ) మహ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (హెచ్ఎంఐఎస్) గురించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు మంగళవారం శిక్షణ ఇచ్చారు. డీఎస్ఓ విభాగం అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ లక్ష్మీనరసమ్మ, డీపీఏ సురేఖ, ఎంపీహెచ్ఈఓ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్ఓ మహ్మద్‌రఫీ

## సార్.. జీతాలు ఇప్పించండి

కలెక్టర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల వినతి

ఉరవకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న తమకు 14 నెలలుగా జీతాల్లేవని సీపీ డబ్ల్యూఎస్ పథకం కార్మికుల యూనియన్ నాయకుడు మల్లికార్జున కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పీఎఫ్ కూడా 18 నెలలుగా జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ కోసం వెలిగొండకు మంగళవారం వచ్చిన కలెక్టర్‌ను కార్మికులు కలిశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

### క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలి

మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఉరవకొండలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మండల అధికారులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, మండల ప్రత్యేకాధికారి కుష్బూకొఠారి, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏపీడీ సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్ పాల్గొన్నారు.

● ఉరవకొండ మండలంలోని వెలిగొండలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని రేషన్‌షాపును తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రంలో అదనపు తొట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అక్కడ మొక్కలు నాటారు. తాగునీటి సమస్యపై మహిళలు.. కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఈకి ఆదేశించారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

## గడువులోపు లక్ష్యాలను చేరాలి

సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖల అధికారులతో మంగళవారం నెలవారీ సమీక్ష నిర్వహించారు. మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్తగా ఎదిగేలా తోడ్పాటు అందించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ నిర్వహణ, పర్యవేక్షణ తదితర అంశాల గురించి ఆరా తీశారు. అంబేడ్కర్ భవన్ పక్కనున్న స్థల సమస్యపై నివేదిక ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించారు. జిల్లా సైనిక సంక్షేమశాఖ ద్వారా 35 మంది దాకా మాజీ సైనికులు భూమి కోసం దరఖాస్తు చేసుకున్నారని, తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గుంతకల్లులో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో మాజీ సైనిక కుటుంబం 15 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న చుక్కల భూమి సమస్యను పరిష్కరించామని తెలిపారు. హిజ్రాలకు గుర్తింపు కార్డు మంజూరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల వారి ఆగడాలపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిని అరికట్టేందుకు ఎస్పీకి ప్రత్యేక లేఖను సమర్పించాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారికి సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న షాపుల అద్దెలపై నివేదిక ఇవ్వాలని, చెల్లించని వారిని ఖాళీ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రామసుబ్బారెడ్డి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, బీసీ సంక్షేమశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, మైనార్టీ కార్పొరేషన్ అధికారి జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న దళిత రైతులు

## రీసర్వే మోసంపై రైతన్నల ఆగ్రహం

విడపనకల్లులో రాస్తారోకో

తహసీల్దార్ కార్యాలయం మూసి ఆందోళన

విడపనకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రీసర్వే పేరుతో చేసిన మోసంపై దళిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలో మంగళవారం ఆందోళనకు దిగారు. మండలంలోని కరకముక్కల గ్రామానికి చెందిన రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు 47వ జాతీయ రహదారిపై బైఠాయించి, నినాదాలు చేశారు. వారు మట్లాడుతూ.. టీడీపీ హయాంలో 2003-2004లో వెలుగు సంఘాల్లోని ఎస్సీ మహిళలకు దేవదాయ భూమిని కొనుగోలు చేసి, ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేయించి, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చిందన్నారు. 20 ఏళ్లకుపైగా సాగు చేసుకుంటున్న ఎస్సీల భూములను రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో వాటిని దేవదాయ భూములుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. దీంతో జీవనాధారం కోల్పోతున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. రాస్తారోకో వద్దకు పోలీసులు, రీసర్వే తహసీల్దార్ ప్రసాద్ అక్కడికి చేరుకుని, వారితో మాట్లాడారు. ప్రయాణీకులు ఇబ్బందులు పడతారని తెలపడంతో రాస్తారోకో విరమించి, తాహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. అధికారులను బయటకు పంపి, కార్యాలయానికి తలుపులు వేశారు. ఇన్‌చార్జి తాహసీల్దార్ చంద్రశేఖరయ్య.. రైతులతో చర్చించారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామనీ, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

## మేడమ్‌ను డిస్టర్బ్ చేస్తున్నారు..

ఆధార్ సెంటర్‌ను ఖాళీ చేయండి..!

జడ్పీ ఆవరణలో ఆధార్ సెంటర్‌ను ఖాళీ చేయాలని సీఈఓ నోటీసులు జారీ చేశారు. భవనానికి మరమ్మతులు చేయాల్సి ఉందని ఒక కారణం చూపించారు. ఆధార్ టోకెన్ల కోసం చైర్ పర్సన్ గిరిజమ్మను ప్రజలు వేళగాని వేళలో డిస్టర్బ్ చేస్తున్నారని ఇంకో కారణం చూపించారు. ఆధార్ కేంద్రం పని దినాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకూ సేవలు అందిస్తుంది. ప్రస్తుతం మధ్యాహ్నం వరకే దీన్ని నిర్వహిస్తున్నారు. వచ్చినవారికి వచ్చినట్లు సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ముందస్తు టోకెన్లు ఇచ్చిన ఆనవాళ్లు లేవు. నగర నడిబొడ్డు, అనుకూల ప్రాంతంలో ఉన్న ఈ ఆధార్ కేంద్రాన్ని ప్రజలతోపాటు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం వినియోగించుకుంటున్నారు. భవనానికి మరమ్మతులు ఉంటే తాత్కాలికంగా సేవలను ఆపేయొచ్చు. లేదే వేరే భవంతిలోకి మార్చవచ్చు. అంతేగాని, ఏకంగా ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. 2012 నుంచి ఇక్కడ ఆధార్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న మరమ్మతులను సొంత ఖర్చులతో చేయించుకునేందుకు తాము సిద్ధమని నిర్వాహకులు అంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన అద్దెను నెల నెలా చెల్లిస్తున్నామని అంటున్నారు. జడ్పీ సీఈఓ ఇచ్చిన నోటీసులకు కలెక్టర్ దృష్టికి తీసుకువెళుతున్నట్లు సమాచారం.



It is informed that, the DYEE, PRI Sub Division-I, Ananthapuramu has specified the condition of the building in his report and informed that, the leakages are observed in roof slab and dampness in walls also. Hence it is to be rectified immediately by vacating the Aadhar Centre for making necessary repairs to the slab and walls of the building in view of public safety.

Further, in the reference 3rd cited above, Hon'ble Chair Person, Zilla Praja Parishad, Ananthapuramu has informed that, the public has been approaching for tokens in late night also after working hours and disturbing the Chair Person in her Quarters.

In these circumstances, it is informed that, make alternative arrangements immediately to shift the Aadhar Service Centre, where it is convenient and **vacate the Aadhar Service Centre within 20 days after receipt of this notice duly clearing dues, if any** to take up necessary repairs to the slab and walls, so as to strengthen and improve the span of the building.

జడ్పీ చైర్‌పర్సన్‌ను ప్రజలు ఇబ్బంది పెడుతున్నారని నోటీసుల్లో పేర్కొన్న సీఈఓ

- ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

## తొలి రోజు 95.45 శాతం

# పింఛన్ల పంపిణీ

అనంతపురం అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం తొలి రోజు 95.45 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ నెలకు జిల్లాలో 2,77,192 మంది పింఛన్ దారులకు రూ.123.47 కోట్లు విడుదల చేశారు. తొలి రోజు సాయంత్రం 6 గంటల దాకా 2,65,178 మందికి రూ.117.85 కోట్ల సొమ్మును పంపిణీ చేశామని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు.

## ఇసుక తరలిస్తే ఊరుకోం!

● స్పష్టంచేసిన నిదనవాడ రైతులు, గ్రామస్థులు
● తవ్వకాలను అడ్డుకుని.. అక్కడే వంటావార్పు
● మూడు టిప్పర్లు, రెండు ఎక్స్‌కవేటర్ల సీజ్

ఇసుకను తరలిస్తున్న వాహన డ్రైవర్లతో వాగ్వాదం చేస్తున్న నిదనవాడ రైతులు

శింగనమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే ఊరుకునేది లేదని మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు స్పష్టం చేశారు. మంగళవారం గ్రామ సమీపాన నదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. మూడు టిప్పర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్నారు. అక్కడే వంటావార్పు ద్వారా నిరసన తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు పెద్దవడుగూరు మండలంలోని చిత్రచేడు వద్ద పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. అక్కడ కాకుండా నిదనవాడ సమీపాన పెన్నానదిలో అక్రమంగా ఇసుక తవ్వి, తరలిస్తున్నారు. ఇదివరకే రెండుసార్లు నిదనవాడ వాసులు.. తవ్వకాలను అడ్డుకున్నా.. అధికారులు వాహనాలకు సీజ్ చేయడంతో సరిపెట్టారు. 15 రోజులుగా పెద్దఎత్తున నది నుంచి ఇసుక తరలిస్తుండడంతో మంగళవారం నిదనవాడ వాసులు, రైతులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న శింగనమల సీఐ కౌలుట్లయ్య, తహసీల్దార్ శేషారెడ్డి, ఎస్ఐ విజయ్‌కూమార్ ఘటనా స్థలానికి చేరుకుని, రైతులతో మాట్లాడారు. నదిలో ఇసుక తరలిస్తే.. వ్యవసాయ బోర్లలో నీరు అడుగంటి, జీవనాధారం కోల్పోతామని రైతులు ఆవేదన చెందారు. ఇసుక తరలింపును అడ్డుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు పట్టుకున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను పోలీసులకు అప్పగించారు. వాటిని పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు.

పెన్నానదిలో ఇసుక తవ్వే ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్న నిదనవాడ రైతులు, గ్రామస్థులు

శిథిలావస్థకు చేరిన నింబగల్లు హెడ్‌రెగ్యులేటర్ షట్టర్లు

కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పూడిక

కోతకు గురైన కాలువగట్టు

# మరమ్మతులైనా చేయండి

## ఏళ్లు గడిచినా పూర్తికాని ఆధునికీకరణ పనులు

**కాలువలో పేరుకుపోయిన మట్టి, బండరాళ్లు.. ప్రశ్నార్థకంగా హెచ్చెల్సీలో నీటి పారుదల**

ఉరవకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టి ఒకటిన్నర దశాబ్దాల కాలం దాటినా ఏమాత్రం ముందుకు సాగడం లేదు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టింది. అయితే ఏళ్లు గడిచినా ఆరో ప్యాకేజీలో పనులకు మోక్షం కలగలేదు. కొద్దివరకు పనులు చేసి వదిలేశారు. ఈక్రమంలోనే భారీ వర్షాల వల్ల ఏర్పడిన కోతలతో కాలువ అధ్వానంగా మారింది. గత పాలకులు ఎవరూ ఈ ఆధునికీకరణ పనుల గురించి పట్టించుకోలేదు. కాలువలో పూడిక పెరిగిపోవడంతో నీరు ముందుకు పారడం ప్రశ్నార్థకంగా మారింది. కాలువలో పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పెరిగిపోయాయి. హెచ్చెల్సీ ఆరో ప్యాకేజీలో 183వ కి.మీ నుంచి 189కి.మీ వరకూ పనులు నిలిచి పోయాయి. ఇంద్రావతి డీప్ కట్ వద్ద ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హెచ్చెల్సీ గట్టు కోతకు గురైంది. నింబగల్లు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం వల్ల కాలువలోకి మట్టి కొట్టుకు వచ్చింది. ఇది నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. హెచ్చెల్సీకి ఉన్న షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి. షట్టర్లకు ఉన్న రాళ్లు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేస్తే సాగునీరు పారే అవకాశముంది. ఇంద్రావతి వద్ద డీప్‌కట్‌లో అడ్డంగా పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి.

● ఈ విషయంపై హెచ్చెల్సీ ఏఈ నజీరుద్దీన్‌ను వివరణ కోరగా కోతకు గురైన కాలువగట్లు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీకి నీళ్లు వచ్చేలోపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



### నేడు అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీవీఈఓ గురుప్రసాద్ ప్రకటనలో తెలిపారు. స్టాక్ మేనేజ్‌మెంట్, డెయిరీ కోర్సులకు లెక్చరర్లు అవసరమన్నారు. ఇందుకు వెటర్నరీ, డెయిరీ సైన్స్ చదివినవారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల వారు బుధవారం ఉదయం 10.30 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని డీవీఈఓ తెలిపారు.

### నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించనున్నట్లు ఏపీసీ శైలజ వెల్లడించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న కేజీబీవీఎస్‌ఓలు, సీఆర్‌టీలు, ఐఈఆర్‌టీలు, ఆపరేటర్లు, ఇతర బోధనేతర సిబ్బంది నుంచి మ్యూచువల్స్, రిక్వెస్ట్ బదిలీలకు దరకాస్తులు స్వీకరించామన్నారు. వాటిని పరిశీలించి తుదిసీనియార్టీ జాబితాను తయారుచేసి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆ జాబితాలో పేర్లున్న వారందరికీ బుధవారం ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. సీనియారిటీ లిస్టులో అదనపు పాయింట్లు పొందిన అభ్యర్థులు అందుకు సంబంధించిన స్పౌజ్, మెడికల్, డెత్, లీగల్ సర్టిఫికెట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఏపీసీ తెలిపారు.

### ప్రతి నెలా స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

**కలెక్టర్ వినోద్‌కుమార్**

అనంతపురం కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్, మున్సిపల్, డ్వామా, జడ్పీ తదితర శాఖల అధికారులతో మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఓడీఎఫ్ ప్లస్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సాస యాప్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, ఇంకుడు గుంతలు, స్వచ్ఛత, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, అన్న క్యాంటీన్లు, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీ పేదల సేవలో ప్రభుత్వ కార్యక్రమాలు, 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, 30న సివిల్ రైట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నెలలో మూడు కార్యక్రమాల ద్వారా 36 గ్రామాలను కవర్ చేయాలని అన్నారు. ప్రతి నెలా నియోజకవర్గంలోని ఒక గ్రామానికి తాను వెళతానని అన్నారు.

### చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు (గైరంగాలు) టన్ను గరిష్టంగా రూ.28,200 అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలకు విక్రయాలు జరిగాయన్నారు. ఇక సీజనల్ రకం కాయలు టన్ను గరిష్టంగా 16వేలు, కనిష్టంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 792 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

# నేడే.. తొలి అడుగు

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రానికి వచ్చాయి.

● దేశంలోని ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా హామీ మేరకు... రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల పింఛన్లు అందజేస్తున్నారు.

● సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం ప్రారంభించారు. దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. మెగా డీఎస్సీలో భాగంగా 16,347 టీచర్ పోస్టు భర్తీకి చర్యలు చేపట్టారు.

● మత్స్యకార భరోసా, రూ.5కే అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం, అల్పాహారం. అర్చకులకు, నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేల చొప్పున ఆర్థిచేయూత అందిస్తున్నారు. పాస్టర్లు, ఇమామ్‌లు, మౌజన్లకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అమలు చేస్తున్నారు. పీ-4 ద్వారా నిరుపేదలకు ఆర్థిక చేయూతనందించి, ఆ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

● ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నారు. అగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు.

● కరువు జిల్లా అనంతకు జీవనాడి అయిన హంద్రీనీవాను పూర్తిచేసి, ప్రతి ఎకరానరికీ సాగునీరు అందించేందుకు ఏకంగా రూ.3,800 కోట్లు బడ్జెట్లో కేటాయించారు. హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇదే నెలలో పనులన్నీ పూర్తిచేసి, ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించనున్నారు.

#### ఎవరెవరు ఎక్కడెక్కడ..?

● ఉరవకొండ ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడేరు మండలం జయపురంలో 'తొలి అడుగు' వేస్తారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగరంలోని 39వ డివిజన్‌లో లక్ష్మీనగర్ రామాలయం నుంచి ప్రారంభిస్తారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శెట్టూరు మండలం పెరుగు పాళ్యం నుంచి, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు గుమ్మఘట్ట మండలం కేపీ కుంట నుంచి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆత్మకూరు మండలం ముట్టాల నుంచి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గార్లదిన్నె నుంచి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కసాపురం నుంచి తొలి అడుగును ప్రారంభిస్తారు.

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత గోరంట్ల మండలం

కొలింపల్లిలో తొలి అడుగు ప్రారంభిస్తారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అమడగూరు మండలం కసముంద్రంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మడకశిర మండలం చందకచర్లలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలో ప్రారంభిస్తారు. హిందూపురంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ శ్రేణులు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ధర్మవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పిలుపునిచ్చారు.

## అర్హత ఉంటే.. హాస్టల్ సీటు

**బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి**

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి బీసీ సంక్షేమ హాస్టల్‌లో సీటు ఇస్తామని డీడీ కుష్బూ కొఠారి తెలిపారు. ప్రస్తుతం హాస్టళ్లలో అడ్మిషన్లు జరుగుతున్నాయనీ, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాస్టళ్ల మెరుగుకు తీసుకోబోతున్న చర్యలపై డీడీతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

**ప్రశ్న: జిల్లాలో ఎన్ని బీసీ హాస్టళ్లు ఉన్నాయి?**

**డీడీ:** జిల్లావ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ హాస్టళ్లున్నాయి. పట్టణాలు, నగరాల్లోని హాస్టళ్లలో చేరడానికే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మండల స్థాయిలోని కొన్ని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఆరింటిలో 50 మందికన్నా తక్కువగా పిల్లలు ఉన్నారు. అక్కడ అడ్మిషన్లు పెంచడానికి వార్డెన్లు, సిబ్బంది ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడతాం.

**ప్ర: హాస్టళ్లలో చాలినంత మంది సిబ్బంది ఉన్నారా?**

**డీడీ:** జిల్లాలో 55 హాస్టళ్లు ఉంటే 35 మందివార్డెన్లు మాత్రమే ఉన్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమీప హాస్టళ్ల వారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న: మెనూ నిబంధనల మేరకు భోజనం అందిస్తున్నారా?**

**డీడీ:** మెనూ తప్పనిసరిగా అమలు చేస్తున్నాం. హాస్టళ్లకు ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తోంది. దీంతో ఆ ఏడాది నుంచి అన్నం మరింత నాణ్యతగా, రుచిగా ఉంటోంది.

**ప్ర: బోగస్ పిల్లలను చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి కదా..?**

**డీడీ:** గతంలో అలాంటివి జరగి ఉండొచ్చేమోగానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. హాస్టల్‌లో ఉంటున్న ప్రతి విద్యార్థి ప్రతిరోజు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది. అలాంటపుడు బోగస్ విద్యార్థులను చూపించే అవకాశమే ఉండదు.

**ప్ర: వార్డెన్లు స్థానికంగా ఉండరనే విమర్శలున్నాయి. దీని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?**

**డీడీ:** వార్డెన్లు స్థానికంగానే ఉండాలి. ఇదే విషయం పదేపదే చెబుతున్నాం. కొందరు అలా ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్న విషయం వాస్తవమే. వారిపై ప్రత్యేక నిఘాఉంచుతాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# పెద్దారెడ్డిని ప్రజలే రానివ్వడం లేదు

**భూములు, ఇళ్లు, ఇసుక అన్నీ దోచేశారు..**

**రికార్డులు, ఆధారాలూ పంపుతా.. చూడండి**

**ఐదేళ్లు నాపై, నా కొడుకుపై అనేక అక్రమ కేసులు పెట్టారు: జేసీ ప్రభాకర్ రెడ్డి**

అనంతపురం క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డిని ప్రజలే తాడిపత్రికిలోకి రానివ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దారెడ్డి పెద్ద కొడుకు ఒక రోగ్ అని, తాడిపత్రిని దోచేసి నాశనం చేశారంటూ మండిపడ్డారు. గత ఐదేళ్లు తనపై, తన కొడుకుపై కేసులు పెట్టి జైళ్లకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ ఉంటే జుట్టు, లేకుంటే కాళ్లు పట్టుకునే చందంగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. మంగళవారం ఆయన అనంతపురంలోని తన గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేతలకు తాను వ్యతిరేకం కాదన్నారు. నాడు తన అన్న దివాకర్ రెడ్డి శిష్యులుగా ఉన్న వారు ప్రస్తుతం వైసీపీలో ఉన్నారన్నారు. గత ఐదేళ్లలో చట్టాలను పక్కన బెట్టి తమపై కేసులు పెట్టారన్నారు. తనను 130 రోజులు, తన కొడుకు జేసీ అశ్మిత్ రెడ్డిని 75 రోజులు జైల్లో పెట్టారన్నారు. గత ఐదేళ్లలో కేతిరెడ్డి పెద్దారెడ్డి చేయని అరాచకం లేదన్నారు. తన ఉన్న ఇళ్లు 6 సెంట్లు ఫ్రాడ్ చేసి రిజిస్ట్రర్ చేయించారని, కోటమికుంట్లలో వందల ఎకరాల భూ అక్రమాలు జరిగాయన్నారు. రైతులు సోలార్‌కు ఇస్తే... వాటిని కన్వర్షన్ చేసిన తర్వాత కూడా అక్రమంగా పాసు పుస్తకాలు చేశారంటూ మండిపడ్డారు. తనకు గన్‌మెన్ కూడా లేరన్నారు. పెద్దారెడ్డి ప్రైవేటు గన్‌మెన్‌ను కూడా పెట్టుకున్నాడన్నారు. తననెవరూ చంపలేరనీ, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న పెద్దారెడ్డి ట్రై చేసేలా ఉన్నాడన్నారు. సూర్యప్రతాప్‌రెడ్డి లేకుంటే.. పెద్దారెడ్డి జీరో అన్నారు. తనను ముండమోపి అంటూ పెద్దారెడ్డి అంటున్నారనీ, ఆయన ఏ జెండర్ కూడా తెలియడం లేదన్నారు. ఆయన డాంకీ, క్రాస్ బ్రీడ్‌లా ఉంటాడనీ, అలాగే తింటాడంటూ ఎద్దేవా చేశారు. పెద్దారెడ్డి సారా కూడా కాచారని, ఇసుక అమ్మడంతోపాటు అనేక అక్రమాలు చేశాడన్నారు. తనకు ఆ అవసరం లేదనీ, మీసం మెలేసి బతుతున్నానంటూ మీసం తిప్పుతూ తెలియజేశారు. పెద్దారెడ్డికి ఇదే లాస్ట్ వార్నింగ్ అంటూ హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

# వారిని వదిలేసి.. నాపై నిందలా..!

**ఈ-స్టాంపులపై నేనే ఫిర్యాదు చేశా**

**టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీచౌదరి**

అనంతపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వారిని వదిలేసి, తనపై నిందలు వేయడం తగదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీ చౌదరి పేర్కొన్నారు. ఈ-స్టాంపుల వ్యవహారంలో అధికారులకు తానే ఫిర్యాదు చేశానన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రప్ప అలియాస్ బాబు మీ-సేవలో అవినీతికి పాల్పడుతూ ఈ-స్టాంప్‌లలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తనకు సమాచారం అందిందన్నారు. దీనిపై ఎర్రప్ప అలియాస్ బాబును ఫోన్‌ద్వారా విచారించానన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు సైతం తన వద్ద ఉన్నాయన్నారు. ఆ విషయంలో తప్పు.. మీసేవ బాబును ఎప్పుడూ సంప్రదించలేదని తెలిపారు. ఇదే విషయంపై తాను స్టాంపులు, రిజిస్ట్రేషన్నల శాఖకు వివరణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై బాబుకు సంబంధించిన మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారన్నారు. ఈ కక్షతోనే తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అసలైన బాధ్యులను వదిలేసి తనపై వేధింపులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వ్యక్తులను వదిలేసి కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తనపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఘటనపై మరోసారి ఆడిట్ నిర్వహించి, నిజానిజాలు నిగ్గు తేల్చాలనీ, వాటిని ప్రజలకు తెలియజెప్పాలని కోరారు.

మాట్లాడుతున్న మారుతీచౌదరి

# కుళ్లాయిస్వామికి నిత్యపూజ నివేదన

**భక్తులతో కిక్కిరుస్తున్న గూగూడు**

నార్పల, జూలై 1(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామికి మంగళవారం నిత్య పూజ నివేదన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తాదులు కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అధికారులు క్యూలైన్లు కూడా ఏర్పాటు చేయడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాలు చేసేందుకు నీరు కూడా లేదని వాపోయారు.

#### గూగూడు ఉత్సవాలపై డ్రోన్ నిఘా

అనంతపురం క్రైం(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలపై డ్రోన్ నిఘా ఉంచనున్నట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తవాలు ఆద్యంతం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల పరిసరాల్లో భక్తుల తాకిడిని పర్యవేక్షిస్తామన్నారు. ట్రాఫిక్, నేరాలను నియంత్రిస్తామన్నారు.

కొలువుదీరిన కుళ్లాయిస్వామి, గూగూడు కుళ్లాయిస్వామి దేవాలయం డ్రోన్ వ్యూ..

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సర్పసూక్త క్షీరాభిషేకం చేశారు. ఆకుపూజ, అలంకరణ, అర్చన, మహానైవేద్య సమర్పణ, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. కల్యాణ కట్టపై శ్రీవల్లీదేవసేనతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

# మొద్దు నిద్ర..!

**ఎస్కేయూ ఆవరణలో తొలగించిన మొద్దులు, చెట్ల కొమ్మలు**

● నెలలు గడుస్తున్నా తరలించకుండా నిర్లక్ష్యం

● విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్న వైనం

● పట్టించుకోని అధికారులు

కుప్పలు.. తెప్పలుగా తొలగించిన చెట్ల మొద్దులు

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎండిపోయిన మొద్దులను చూసి ఇదేదో కట్టెల డిపో అనుకుంటే పొరబడినట్లే. ఇది ప్రతిష్ఠాత్మక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆవరణం. క్యాంపస్‌లో ఎండిపోయిన భారీ వృక్షాలను కొట్టేసి, వేర్లతోసహా పెకలించారు. విద్యుత్ లైన్లను అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సైతం నెలల క్రితం తొలగించారు. వాటిని వర్సిటీ ఆవరణలో అలాగే వదిలేశారు. అవి పూర్తిగా ఎండిపోయాయి. వాటిలోకి విషపురుగులు చేరుకుని, ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. దీనిపై నిత్యం అక్కడే తిరిగే వేలాది మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు. వాటిని వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్ తరలించకుండా నెలలుగా అక్కడే వదిలేశాడు. కొన్ని మొద్దులతో షెడ్ల కింద వంటావార్పు కూడా చేశారు. అయినా వర్సిటీ అధికారులు వాటిని తరలించే ప్రయత్నాలు చేయరు. మొద్దునిద్ర వీడరు.

#### వర్సిటీ పునఃప్రారంభం నాటికి తొలగించేస్తాం

వర్సిటీ ఆవరణలో ఎండిపోయిన వృక్షాలు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాం. వాటిని అటవీశాఖ అధికారుల అనుమతితో బహిరంగ వేలం నిర్వహించాం. వేలంలో దక్కించుకున్నవారు వాటిని తరలించడంలో జాప్యమవుతోంది. ప్రస్తుతం వర్సిటీకి సెలవులు. పునఃప్రారంభమయ్యే నాటికి వాటిని తొలగించేలా చర్యలు చేపడతాం.

- రవిప్రసాద్‌రావు, వర్సిటీ ఎస్టేట్ అధికారి

ఇంజనీరింగ్ విభాగం సమీపంలోని వాహనాల పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటైన పొయ్యి

# సారు.. రిటైర్డ్ హర్ట్..!

● బదిలీలు ముగియకనే ఎస్ఈ ఉద్యోగ విరమణ
● త్రిశంకు స్వర్గంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

అనంతపురం న్యూ టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఇంజనీరింగ్ అసిసెంట్ల బదిలీలకు కొత్త చిక్క వచ్చిపడింది. బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సిన పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ గతనెల 30న ఉద్యోగ విరమణ చేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈఈకి ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించినా.. ఆయన కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి దాపురించింది. ప్రక్రియ మధ్యలో ఆయన ఏ నిర్ణయమూ తీసుకోలేక సతమతమవుతున్నట్లు తెలిసింది. బదిలీల ప్రక్రియ జూన్ 30వ తేదీకి పూర్తిచేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మొత్తం ప్రక్రియ అప్పటివరకు ఎవరు ఎస్ఈగా ఉంటే వారే పూర్తిచేయాల్సి ఉంటుంది. గతనెల 30వ తేదీ వరకు అన్నీ తానై ఎస్ఈ జమీర్ అస్లాం బదిలీల ప్రక్రియ చేపట్టారు. ప్రక్రియ ముగియకనే అదేరోజు ఉద్యోగ విరమణ పొందారు. ఈఈ ప్రభాకర్ రెడ్డికి ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు. బదిలీల మధ్యలో ఆయన ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతున్నారని తెలిసింది. సిఫార్సులపై ఒత్తిళ్లు వస్తుండటంతో సమాధానాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. మంగళవారం కూడా బదిలీల జాబితా ఫైనల్ కాలేదు. బుధవారం కూడా ఇదే పరిస్థి కొనసాగితే జాబితా తయారు కావడం కష్టమేనన్న ప్రచారం జరుగుతోంది. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో టెన్షన్ నెలకొంది. ప్రక్రియ ఎప్పుడు ముగుస్తుందో, కోరుకున్న ప్లేస్‌లు దక్కుతాయో, లేవోనని ఆందోళన చెందుతున్నారు. ఎస్ఈ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

# ఉద్యోగి బిజీనెస్..!

పని దినాల్లోనూ వ్యాపారాలు

చికెన్ సెంటర్‌లో కూర్చున్న వెలుగు ఉద్యోగి

లేపాక్షి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వోద్యోగి విధులను పక్కనబెట్టి, వ్యాపారాల్లో బిజీ అయిపోయాడు. స్థానిక వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చికెన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడుపుతున్నాడు. పనిదినాల్లో సైతం అక్కడే ఉంటున్నాడు. దీంతో మండల ప్రజలు విస్తుపోతున్నారు. కార్యాలయంలో సమావేశాలకు టీలు, టిఫిన్లు ఉద్యోగి హోటల్ నుంచే తీసుకెళ్లాలని హుకుం జారీ చేస్తున్నాడు. మహిళా గ్రూపు సభ్యులకు సైతం త్వరగా రుణాలు ఇచ్చేలా చూస్తానంటూ మాయమాటలు చెబుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఉద్యోగులు ఆడిందే ఆటగా తయారైందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**పనిదినాల్లో వ్యాపారాలు చేస్తే చర్యలు: రామిరెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్**

పనిదినాల్లో వ్యాపారాలు నిర్వహిస్తూ విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించినపుడు టీ, టిఫిన్లు ఒకేచోట తీసుకురావాలన్న నిబంధనలు లేవు. అలా ఒత్తిడిచేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

# ఏడాదిగా ఇన్‌చార్జే దిక్కు

యల్లనూరుకు రెగ్యులర్ తహసీల్దార్ ఏడీ..?

భూ సమస్యలతో ప్రజల అవస్థలు

తహసీల్దార్ కార్యాలయం

యల్లనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంవత్సర కాలం నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో రెగ్యులర్ తహసీల్దార్ బదిలీ కావడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జ్ పాలనే సాగుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే తహసీల్దార్‌గా నాగరాజును నియమించినప్పటికీ ఆయన పది రోజులు పని చేసి, దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాడు. అప్పటినుంచి పుట్లూరు తహసీల్దార్‌కే ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫాక్షన్ మండలం కావడంతో రెగ్యులర్ తహసీల్దార్ లేక భూ వివాదాలు జటిలమవుతున్నాయి. తహసీల్దార్ పోస్టుతోపాటు సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. మండలంలో సుమారు 40 రేషన్ షాపులు ఉన్నాయి. ఏదో ఒక గ్రామంలో నిత్యావసర సరుకుల సమస్య తలెత్తుతూ ఉంది. గత కొంతకాలంగా ఈ పోస్టుకు కూడా ఇన్‌చార్జ్ దిక్కయ్యారు.

**దీర్ఘకాలంగా పెండింగ్‌లో సమస్యలు**

మండలంలో అనేక రెవెన్యూ సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. రీసర్వేలు జరిగిన గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. సర్వే జరిగిన గ్రామాల్లో ఒకే సర్వే నెంబర్‌లోని పూర్తి విస్తీర్ణ భూమిని విభాగాలు చేయాల్సి ఉండగా అలాగే ఉంచారు. దీంతో రైతుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. రీసర్వే జరిగిన కాచర్లగుంట గ్రామంలో రైతు చంద్రశేఖర్‌రెడ్డికి సంబంధించిన భూమి కొనుగోలు రిజిస్టర్‌లో ఉన్నప్పటికి దాన్ని ప్రభుత్వ భూమిలోకి చేర్చారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆన్‌లైన్‌లో భూమి నమోదు కాకపోవడంతో రైతు బ్యాంకులో తీసుకున్న పంట రుణాన్ని రెన్యువల్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో వడ్డీ ఎక్కువ పెరిగిపోతోందని రైతు వాపోతున్నాడు. ఇలాంటి సంఘటనలు మండల వ్యాప్తంగా చాలా ఉన్నాయి. మండలంలో రెవెన్యూ సమస్యలు తరచూ తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరించే అధికారిని నియమించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జిల్లా అధికారులను కోరారు. అయినా ప్రయోజనం శూన్యం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మూడేళ్లు జేఎన్‌టీయూలో.. చివరి ఏడాది స్వీడన్‌లో..!

● జేఎన్‌టీయూలో స్వీడన్ బ్యాచ్ కోర్సు
● 10 వరకు దరఖాస్తు గడువు

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో స్వీడన్ బ్యాచ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఆ మేరకు 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను ఇటీవల ప్రారంభించింది. బీటెక్ మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూ కళాశాలలో చదవాల్సి ఉంటుంది. చివరి సంవత్సరం స్వీడన్‌లో పూర్తిచేసేందుకు అవకాశం కల్పించింది. అక్కడే ఎంటెక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ కోర్సు ప్రవేశానికి ఈనెల 10వ తేదీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావు సూచించారు. మొత్తం 30సీట్లు ఉంటాయన్నారు. 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ చదివినవారు అర్హులన్నారు. జేఈఈ మెయిన్స్, ఏపీ, తెలంగాణ ఎంసెట్, తత్సమాన ప్రవేశ పరీక్షలో ర్యాంకు వచ్చి ఉండాలన్నారు. జేఈఈ మెయిన్స్ విద్యార్థులకు 50శాతం కేటాయిస్తామన్నారు. ఎంసెట్ విద్యార్థులకు 50 శాతం సీట్లు ఉంటాయన్నారు. వివరాలకు 8008802558, 9989944533, 9441889732 నంబర్లలో, జేఎన్‌టీయూలోని డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ విభాగంలో సంప్రదించవచ్చన్నారు. జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని వీసీ వివరించారు.

## రేపు ప్రైవేటు పాఠశాలల బంద్

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై అధికారుల నియంత ధోరణిని నిరసిస్తూ ఈనెల 3వ తేదీన ప్రైవేటు పాఠశాలల బంద్ పాటిస్తున్నట్లు ఆ యాజమాన్యాల సంఘం వెల్లడించింది. ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుసుమాపుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవిశంకర ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాయుడు, నగర అధ్యక్షడు శశిభూషణ్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అధికారులు.. వివిధ కారణాలతో షోకాజ్‌లు ఇవ్వడం, గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం చేస్తున్నారన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు నిర్ణయించామన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను బంద్ చేసి, నిరసనకు సంఘీభావం తెలపాలని వారు కోరారు.

మూలన పడేసిన తలుపులు

# ఇంటి గుట్టు..!

మూలన పడిన వాకిలి ఫ్రేమ్‌లు

వైసీపీ రంగుల డబ్బాలు

వైసీపీ హయాంలో జగనన్న ఇళ్లు, లేఅవుట్లు, కాలనీలు అంటూ హంగామా చేశారు. ఏకంగా ఊర్లే కడతామంటూ ప్రగల్భాలు పలికారు. అన్ని కట్టాం.. ఇన్ని కట్టాం అంటూ కాకిలెక్కలు చెప్పారు. క్షేత్రస్థాయిలో మాత్రం చాలాచోట్ల ఇళ్ల నిర్మాణాలే మొదలవలేదు. కొన్నిచోట్ల పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో జగనన్న కాలనీల్లో కంపచెట్లు పెరిగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకనే తలుపులు, వాటి ఫ్రేమ్‌లు, వైసీపీ జెండా రంగులు, జగనన్న ఫొటోతో స్టిక్కర్లు సరఫరా చేశారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు మాత్రం ముందుకు కదలలేదు. దీంతో అప్పట్లో తెప్పించిన ఇంటి నిర్మాణ సామగ్రి మొత్తం మూలనపడేశారు. విడపనకల్లులోని ఓ గోదాములో జగనన్న ఇళ్ల సామగ్రిని మూలనపడేశారు. వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణాలు ఎలా సాగాయోనని చెప్పడానికి తుప్పు పట్టిపోతున్న ఈ సామగ్రే నిదర్శనం. జగనన్న ఇల్లు కట్టుకుంటే అందుకు అవసరమైన తలుపులు, వాకిలి ఫ్రేమ్‌లు, వైసీపీ రంగుల డబ్బాలు, ఆ ఇంటికి స్టికర్లు ప్రభుత్వమే అందిస్తుంది. మండలంలోని ఏ జగనన్న కాలనీలోనూ ఇంటి నిర్మాణాలు పూర్తికాలేదు. దీంతో చేసేదిలేక మండలానికి వచ్చిన ఇళ్ల సామగ్రిని మండలకేంద్రంలోని ఓ గోడౌన్‌లో దించి వదిలేశారు.

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు

# వైసీపీ సమావేశానికి వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హనుమంతరాయుడు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి వెళ్తూ సర్పంచ్ భర్త హనుమంతరాయుడు (39) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పట్టణంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం కంటైనర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయలపల్లి వైసీపీ మద్దతు సర్పంచ్ దుర్గమ్మ భర్త హనుమంతరాయుడు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో పట్టణంలోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైసీపీ విస్తృత సమావేశానికి బయల్దేరాడు. పట్టణంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కంటైనర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు.. ప్రమాదస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హనుమంతరాయుడుకు కుమారుడు ఉన్నాడు. సర్పంచ్ భర్త మృతిచెందడంతో బోయలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## రైలులో ప్రయాణికుడి మృతి


ప్రయాణికుడి మృతదేహం

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22157) రైలులో గుర్తు తెలియని ప్రయాణికుడు మరణించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మంగళవారం తెలిపారు. రైలులోని దివ్యాంగుల బోగీలో చనిపోయిన ప్రయాణికుడి వివరాలు తెలియరాలేదన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో మరణించినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. సంబంధీకులు గుంతకల్లు జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

# వైసీపీ కార్యకర్తలకూ సంక్షేమ పథకాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో అర్హులైన వైసీపీ కార్యకర్తలకూ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ముద్దుల మావయ్య, మేనమామ అంటూనే పిల్లల తల్లులను మోసం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాళ్యంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. మంత్రికి గ్రామస్థులు పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు వస్తున్నాయా అని ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది చిన్నారులుంటే అంతమందికీ రూ.13వేలు చొప్పున తల్లికి వందనం అందించిన ఘనత టీడీపీకే దక్కిందని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అందించడానికి ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని అన్నారు. రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా, అర్హులైన వైసీపీ కార్యకర్తలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనివిధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ఉచిత ఇసుక, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. వెంకటగిరిపాళ్యం నుంచి కోన మల్లికార్జున దేవాలయం వరకు, మక్కాజిపల్లి తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు సందర్శించారు. తల్లికి వందనం, యూనిఫాం, పుస్తకాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, టీడీపీ మండల కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వర ప్రసాద్, మాజీ ఎంపీపీ కేశవయ్య పాల్గొన్నారు.

# బళ్లారి లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు

హగరి వద్ద సిగ్నల్ లింక్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు-బళ్లారి సెక్షన్‌లో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. మోటార్ ట్రాలీలో బయలుదేరి డీఆర్ఎం, ఇతర అధికారులు ఈ సెక్షన్‌లోని హగరి వద్ద 17-బీ సిగ్నల్ పాయింట్‌ను పరిశీలించారు. రైల్వే గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా కమ్మీల కొలతలు, సిగ్నళ్ల వద్ద విద్యుత్ ఓల్టేజీ కనిష్ఠ, గరిష్ఠ స్థాయిలను పరిశీలించారు. డీఆర్ఎం మాట్లాడుతూ.. సిగ్నల్ లింకుల వద్ద భద్రతాప్రమాణాలను ఇంజనీరింగ్, సిగ్నలింగ్, టెలీకమ్యూనికేషన్స్ శాఖలు సంయుక్తంగా తనిఖీచేయాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే ఆపరేటింగ్, ఇంజనీరింగ్, సిగ్నలింగ్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీసీ ఓవరాక్షన్..!

ఎవరితో చెప్పుకుంటారో.. చెప్పుకోండి..
ఆ స్థానం మీకు ఇచ్చేదే లేదు..
మహిళా డిజిటల్ అసిస్టెంట్‌తో దురుసు ప్రవర్తన

అనంతపురం న్యూటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజనాయుడు సీసీ.. ఓ మహిళా డిజిటల్ అసిస్టెంట్ పట్ల మంగళవారం దురుసుగా ప్రవర్తించారు. బదిలీల్లో తనకు కేటాయించిన స్థానాన్ని మరొకరికి ఇవ్వడంతో సమస్యను విన్నవించుకునేందుకు డీపీఓ కార్యాలయానికి వచ్చిన డిజిటల్ అసిస్టెంట్ పట్ల దురుసుగా ప్రవర్తించారు. బదిలీల్లో భాగంగా మెరిట్ ప్రాతిపదికన ఓ డిజిటల్ అసిస్టెంట్‌కు అనంతపురం రూరల్ మండలంలోని కురుగుంట కేటాయించారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండటంతో సదరు డిజిటల్ అసిస్టెంట్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. స్పౌజ్, మెడికల్ కేటగిరీలో ఆ స్థానాన్ని మరొకరికి కేటాయించారు. ఆ విషయాన్ని మెరిట్ ప్రాతిపదికన ముందుగా కేటాయించిన మహిళకు సమాచారం అందించారు. దీంతో ఆమె మంగళవారం డీపీఓ కార్యాలయానికి వచ్చి తనకు ఏస్థానం ఇస్తారని అడిగారు. డీపీఓ నాగరాజనాయుడు అందుబాటులో లేకపోవడంతో ఆయన సీసీగా కొనసాగుతున్న డిజిటల్ అసిస్టెంట్‌ను ఆరాతీశారు. తోటి డిజిటల్ అసిస్టెంట్ అన్న కనికరం లేకుండా తానే డీపీఓ అన్న రీతిలో సీసీ.. సదరు ఉద్యోగిపై చిందులు వేసినట్లు తెలిసింది. 'ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోండి.. ఆ స్థానం మీకిచ్చేది లేదు' అని దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా.. అక్కడే ఉన్న ఉన్నతాధికారులు వారించకపోవడం గమనార్హం.


ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.


## ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన బీటెక్ సెమిస్టర్ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు మంగళవారం విడుదల చేశారు. బీటెక్ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ రెండో (ఆర్20) సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్19) (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, ఒకటో సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ రెండో సెమిస్టర్ (ఆర్19), రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ (ఆర్15), ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ (ఆర్19), (ఆర్15) పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ కంట్రోలర్ శివ కుమార్ పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు ఎంపిక

జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా వాసులు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించారు. నగరంలోని ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన సాద్విన్, ఆర్యన్, మోహన్‌కృష్ణ, నూర్ అబ్దుల్లా, దుర్గావిహాన్ యాదవ్, జస్వంత్‌రెడ్డి, బాబాఫకృద్దీన్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో చైత్ర, ముక్తామిహిక, వీక్ష ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన వారు ఈనెల 5వ తేదీ నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించే మినీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥7382114647

AJA- 237876

**ఉచిత విద్యావకాశాలు**

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజీఓథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ :9030661651.

AJA- 237875

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

# చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

● పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచిన ఘనత ఆయనదే
● ఎమ్మెల్యే పరిటాల సునీత ● బుక్కచెర్లలో పింఛన్ల పంపిణీ

వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే ప్రజల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో మంగళవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. తర్వాత అక్కడే గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచింది చంద్రబాబేనని తెలిపారు. గతంలో మంచానికి పరిమితమైనవారికి రూ. 5 వేలు మాత్రమే వచ్చేవని చంద్రబాబు సీఎం అయ్యాక రూ. 15 వేలు ఇస్తున్నారని అన్నారు. ప్రజాసంక్షేమం ఆయనతోనే సాధ్యమనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈనెలలోనే అన్నదాత సుఖీభవ పథకం అమలవుతుందన్నారు. ఆగస్టులోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, ఎంపీటీసీ సభ్యులు జాఫర్, రవి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గంగలకుంట రమణ, కిష్టా తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ సభ్యత్వ బీమా పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లిలో టీడీపీ కార్యకర్త ఆదినారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇందుకు గాను పార్టీ సభ్యత్వ బీమా కింద రూ. 5లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మృతుడి భార్య అరుణమ్మకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న కార్యకర్త కుటుంబానికి టీడీపీ సభ్యత్వ కార్డు ఆదుకుందని తెలిపారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయలేని రీతిలో టీడీపీ కార్యకర్తలకు ఆదుకుంటోందని అన్నారు. అనంతరం బీమా సొమ్మును మృతుడి కుమార్తె స్వాతి పేరుతో డిపాజిట్ చేయించారు. టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

● సీఎం కోరిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సీఎంను కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ నియోజకవర్గమైన శింగనమల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సీఎం చంద్రబాబును కోరారు. విజయవాడలో మంగళవారం ఆమె సీఎంను కలిసి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## తొలి అడుగును విజయవంతం చేద్దాం: దగ్గుపాటి

పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): తొలిఅడుగు-ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బుధవారం నుంచి నెలరోజుల పాటు అందరం ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దామన్నారు. అదేవిధంగా జగన్, వైసీపీ నేతలు చెబుతున్న అపద్ధాలను తిప్పికొట్టాలని సూచించారు. నగరంలో 292 బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్ ఇన్‌చార్జి దీనికి బాధ్యత వహించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డోర్ టు డోర్ వెళదాం..

మాట్లాడుతున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం క్రైం: ఏడాదిలోనే 90 శాతం హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని, ఇంటింటికీ వెళ్లి చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరాం పిలుపునిచ్చారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నెల రోజుల పాటు డోర్ టు డోర్ వెళదామన్నారు. ప్రతి బూత్‌లో నిత్యం 50 కుటుంబాలను కలుద్దామన్నారు. ప్రభుత్వం వచ్చాక చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియద్దామని తెలిపారు.

### 'సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి'

శింగనమల, జూలై 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశం అనే కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. నియోజకవర్గంలో గార్లదిన్నె మండలకేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమపథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుల చేశారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● లేకుంటే చలో అమరావతి చేపడతాం
● సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ హెచ్చరిక

నిరసన తెలుపుతున్న సీఐటీయూ మున్సిపల్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో చలో అమరావతి కార్యక్రమాన్ని చేపడతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాయకులు, కార్మికులతో కలిసి మంగళవా రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కళ్లకు గంతులు కట్టుకుని మోకాళ్లపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, నగర అధ్యక్షుడు వెంకట నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న 13వేల మందికి పైగా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీసవేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో ప్రజలకు సేవలందిస్తున్న కార్మికుల పట్ల కాలయాపన చేయడం తగదన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల నాలుగో తేదీన చలో అమరావతిని చేపట్టనున్నట్లు హె చ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నాయకులు ఓబుళపతి, మురళీ, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విరమించి.. విధుల్లోకి రండి

● మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కమిషనర్ సూచన

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరిస్తాం...సమ్మె విరమించి విధుల్లోకి హాజరుకావాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం చెవిలో పువ్వులు పెట్టుకుని దీక్ష చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరాన్ని కమిషనర్ బాలస్వామి సందర్శించారు. కార్మికుల సమస్యలను విన్న ఆయన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని.. సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, నాయకులు సూర్యనారాయణ, పుల్లయ్య, నూర్‌బాషా, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ కళాశాలకు సీట్లు కేటాయింపు

అనంతపురంరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): 2025-26విద్యా సంవత్సరానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం సీట్ల కేటాయింపు జరిపింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని జిల్లాల వారిగా ఇంజనీరింగ్ కళాశాలలకు సీట్లను సంఖ్యను వెలువరించింది. ఉమ్మడి అనంత జిల్లాలో రెండు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలు, 11ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. ఇందులో జేఎన్‌టీయూ, ఎస్కేయూ ప్రభుత్వ కళాశాలలు కాగా వీటికి 960సీట్లు.. 11ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలకు 6780సీట్లు ఉన్నట్లు పేర్కొంది. మొత్తంగా ఉమ్మడి అనంత జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 7740సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## పొగాకు వినియోగం ప్రాణాంతకం: డీఎంహెచ్ఓ

పొగాకు వ్యతిరేకంగా సంతకం చేస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, జూలై1(ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురికావాల్సి వస్తుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా మంగళవారం స్థానిక డీఎంహెచ్ఓ ఆఫీస్‌లో సంతకాల సేకరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈబీ దేవి తొలి సంతకం చేసి మాట్లాడారు. పొగాకు వినియోగంతో అనారోగ్యానికి గురికావడమే కాకుండా పర్యావరణమూ కాలుష్యమవుతుందని అన్నారు. కనుక ఎవరూ వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. పొగాకు వినియోగిస్తే కలిగే నష్టాలపై ప్రజలకు 21రోజులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఇందులో మండల విద్యాశాఖాధికారులు వారి పరిధిలో పొగాకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టాలని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డీఐఓ డాక్టర్ యుగంధర్, ఏఓ గిరిజ మనోహన్, మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజు, గంగాధర్, పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, ఎస్సీడీ సిబ్బంది పాల్గొన్నారు.

### వైద్యకళాశాల అభివృద్ధికి బాటలు

●డీఎంఈ స్థాయిలో ప్రణాళికలు

ప్రభుత్వ మెడికల్ కళాశాల

ఆంధ్రజ్యోతి స్పందన

అనంతపురం వైద్యం, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైద్యవిద్య కళాశాలల అభివృద్ధికి బాటలు పడనున్నాయి. నాణ్యమైన వైద్య విద్య బోధన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు, నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు, అడ్డంకులు తొలగించేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) స్థాయిలో ప్రణాళికలు రూపొందించనున్నారు. వైద్యవిద్య కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకునేరా? అనేదానిపై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'అనంత ఆశలు..!' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన రాష్ట్ర వైద్యవిద్య శాఖ అధికారులు కళాశాల వివరాలను సేకరించారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, ఎస్ఆర్, జేఆర్ ఇలా కేడర్ల వారిగా బోధన విభాగ ఖాళీ లు, భర్తీ అంశాలతో కూడిన వివరాలను స్పమర్పించినట్లు ప్రన్సిపాల్ షోరోన్ సోనియ మంగళవాం తెలిపారు. కళాశాల అభివృద్ధికి అ వసరమైన అన్నిరకాల విభాగాల అంశాలను అందజేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

## బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అఖిల భారతీయ బ్రాహ్మణ సంఘం నాయకులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం వారు కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు రాఘవేంద్రాచార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యశర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ బాధితుడికి పింఛన్ మంజూరు

రాప్తాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన డయాలసిస్ బాధితుడు బోగమల్లు కిష్టయ్యకు కొత్తగా పింఛన్ మంజూరైంది. కిష్టయ్య ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన్న ఆస్పత్రిలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి నవీన్ కలిసి రూ. 10 వేలు పింఛన్ సొమ్మును అందజేశారు. కష్ట కాలంలో పింఛన్ మంజూరు కావడంతో కిష్టయ్య ఆనందం వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓబిలేసు, చెన్నయ్య, డీలర్ ఎర్రెప్ప పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

అన్నేఫెర్రర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న పీఆర్ డీఈ

అనంతపురంరూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందని పంచాయతీ రాజ్ డీఈ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ అన్నే ఫెర్రర్ కాలనీలో మంగళవారం సర్పంచ్ శివశంకర్ ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. ఇందులో పంచాయతీ రాజ్ డీఈతో పాటు జేఈ వెంకటశేషయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. కాలనీ వాసులు పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆ సమస్యలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చరణ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

రాప్తాడు : గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేద్దామని రాప్తాడు టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు తెలిపారు. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద కట్టపై మంగళవారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇందులో సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. అలాగే అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అందరం కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, రమణారెడ్డి, సర్వేయర్ గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డిప్యూటీ ఈఈ శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. దీంతో ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని సంఘమిత్ర కాలనీ, మారుతినగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### హెచ్చెల్సీ ఎస్ఈగా విశ్వనాథ్‌రెడ్డి బాధ్యతలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై1(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఎస్ఈగా విశ్వనాథ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్ఈగా ఉన్న పురార్థన్‌రెడ్డి గత నెలాఖరున ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ బాధ్యతలను మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా ఉన్న విశ్వనాథ్ రెడ్డికి అప్పగించారు. హెచ్చెల్సీ కాలనీలో గల కార్యాలయంలో మంగళవారం ఆయన జలవనరుల శాఖ సీఈ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ ఎస్ఈ పెంచలయ్య, లోక్ డివిజన్ ఈఈ పార్థసారథి, ఇంజనీర్లు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

### రేపు మండల సర్వ సభ్య సమావేశం

రాప్తాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జగరనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమ య్యే కార్యక్రమానికి మండలంలోని అధికారు లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

### దరఖాస్తుల స్వీకరణ

కనగానపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కనగానపల్లి వైద్యాధికారి చెన్నారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. కనగానపల్లి, తూముచెర్లలో ఒక్కోపోస్టు ఖాళీగా ఉన్నాయని, ఇందుకు ఆయా గ్రామాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10తరగతి చదివిన మహిళలు అర్హులన్నారు. ఈ నెల 4వ తేదీ లోపల కనగానపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా అధ్యక్షుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్‌ను జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కలిశారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ నూతనంగా నియమితులయ్యారు. దీంతో విజయవాడలో మంగళవారం ఆయన్ను పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యమమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బంగారు మల్లారెడ్డి, నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, అంకాల్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఆంజ నేయులు, చంద్రకళ, వనగొంది విజయలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

శింగనమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా డెంగ్యూ నివారణపై అవగాహన కల్పిస్తూ తరిమెల గ్రామంలో మంగళవారం వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి పాఠశాల వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## 11 సీట్లు వచ్చినా బుద్ధి రాలేదు

● జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపాటు

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

అనంతపురం క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చినా కూడా వైసీపీ అధినేత జగన్‌కు బుద్ధి రాలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దుయ్యబట్టారు. నగరంలోని 46, 4, 37 డివిజన్లలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నగరపాలిక కమిషనర్ బాలస్వామితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతినెల 2.80 లక్షల మందికి రూ. 125 కోట్ల మేర పింఛన్లు అందుతున్నాయన్నారు. గత వైసీపీ పాలనలో జగన్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు మళ్లీ గాడిలో పెడుతున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. ఇప్పటికీ ప్రభుత్వంపై విషం కక్కుతూనే ఉన్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నగరంలో పెరిగిన పింఛన్ల పంపిణీ శాతం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ శాతం గత నెల కంటే ఈ నెల పెరిగింది. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి గత రెండు రోజులుగా నగరంలోని 74 వార్డుల సచివాలయ ఉద్యోగులు, నగరపాలక సంస్థ అధికారులను సమన్వయం చేస్తూ పింఛన్ పంపిణీ పక్కాగా చేయాలని సూచించారు. దీంతో నగరంలో మంగళవారం 22,402 మంది లబ్ధిదారులకు గాను 21,597మందికి పింఛన్ అందజేశారు.

### ఆన్‌లైన్ మోసం.. ఆలస్యంగా వెలుగులోకి

●పోలీసులకు న్యాయవాది ఫిర్యాదు ●కేసు నమోదు

చెన్నేకొత్తపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఓ న్యాయవాది మోసపోయారు. విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బసినేపల్లికి చెందిన న్యాయవాది వెంకటరామిరెడ్డికి ఐసీఐసీఐ బ్యాంకులో నాలుగు క్రెడిట్‌కార్డులు ఉన్నాయి. వాటికి సంబంధించి ఇన్సూరెన్స్ యాక్టివేట్ అయితే అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని, మీరు అందుకు సమ్మతమైతే యాక్టివేషన్ చేసుకోండి లేకపోతే డీ యాక్టివేట్ చేసుకోండంటూ సైబర్ నేరగాళ్లనుంచి మే 5వతేదీన ఫోన్‌కాల్ వచ్చింది. అందుకు ఆయన యాక్టివేషన్ అవసరం లేదని తెలిపారు. దీంతో మీ వాట్సాప్‌కు ఓ లింక్ పంపుతాం అందులో పూర్తి వివరాలు నమోదు చేయాలని తెలిపి లింక్ పంపించారు సైబర్ నేరగాళ్లు. అయితే పెళ్లి హడావుడిలో ఉన్న న్యాయవాది లింక్‌ను ఓపెన్ చేసి వివరాలను ఫోన్‌ద్వారా పంపించారు. దీంతో మే 6,7,8వ తేదీల్లో వరుసగా రూ.1.15లక్షలు క్రెడిట్ కార్డునుంచి మాయమయ్యాయి. దాదాపు 25 రోజుల తరువాత వెంకటరామిరెడ్డి తన క్రెడిట్ కార్డులను పరిశీలించగా జీరో బ్యాలెన్స్ ఉండాన్ని చూసి అవాక్కయ్యారు. మోసపోయానని గ్రహించి వినియోగదారుల సేవా కేంద్రంలో ఫిర్యాదు చేశారు. క్రెడిట్ కార్డు ద్వారా లావాదేవీలు జరిగాయని, పూర్తి వివరాల కోసం సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించాలని అక్కడి అధికారులు సూచించారు. బ్యాంకుకు వెళ్లి జరిగిన విషయాన్ని తెలపగా 3నెలలోపు మీ అమౌంట్ రీఫండ్ చేయించేలా చూస్తామని బ్యాంకు అధికారులు న్యాయవాదికి తెలిపారు. తర్వాత ఆయన 108ద్వారా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు స్థానిక పోలీసులకు పిర్యాదు చేయాలని సూచించారు. దీంతో న్యాయవాది పోలీసుస్టేషన్‌కు చేరుకుని జరిగిన ఆన్‌లైన్ మోసం గురించి ఫిర్యాదుచేశారు. పోలీసులు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు.

### నేటి నుంచి ఆందోళనలు: ఏఐఎస్ఎఫ్

అనంతపురంవిద్య, జూలై1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్‌తో బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 4200కోట్లకు పైగా రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదలచేయాలని డిమాండ్‌చేస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు చెప్పారు. నాయకులు మంజునాథ్, సమీర్, బాబ్జాన్, మణి తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా మైదానం అభివృద్ధికి సహకరిస్తా: సీఐ

శింగనమల, జూలై1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికి తీయడానికి శింగనమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల క్రీడా మైదానం అభివృద్ధికి సహకారం అందిస్తానని సీఐ కౌలుట్లయ్య తెలిపారు. కళాశాలలోని క్రీడా మైదానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడ క్రీడా మైదానం బా గానే ఉన్నా.. సౌకర్యాలు లేవన్నారు. మొదట సరైన ప్రహరీ నిర్మిస్తామని, తర్వాత మైదానంలో మట్టి తోలి లైవల్ చేసి క్రికెట్,వాలీబాల్ పిచ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో ఇక్కడ అసాఘింక కార్యాక్రమాలు జరగకుండా మైదానం చుట్టూ విద్యుత్ బల్బులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణసంక్షేమ డైరెక్టర్ ఆదినారాయణ, డీలర్ మాసూద్‌వలి, హాస్టల్ వార్డెన్ కల్పన పాల్గొన్నారు.

### ఐఎన్‌టీఎస్ఓలో శ్రీచైతన్య విద్యార్థినుల సత్తా

విద్యార్థినులతో ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ సమీనాఖాన్ తదితరులు

అనంతపురం విద్య, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గత నెలలో జరిగిన ఐఎన్‌టీఎస్ఓ పోటీ పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థినులు సత్తా చాటారు. శ్రీచైతన్య బాలికల రెసిడెన్సియల్ విద్యార్థినులు ఎస్టీఎస్ఓ విభాగంలో 45మంది, ఏటీఎస్ఓ విభాగంలో 35మంది, ఈటీఎస్ఓ విభాగంలో 51మంది, ఎంటీఎస్ఓ విభాగంలో 56మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సమీనాఖాన్ తెలిపారు. ప్రతిభ చాటిన ఆ విద్యార్థినులకు మంగళవారం విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి, టీచర్లు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

## వైభవంగా మల్లాలమ్మ జాతర

ప్రత్యేక అలంకరణలో మల్లాలమ్మ అమ్మవారు

అనంతపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మేదరి కులస్థుల కులదైవం మల్లాలమ్మ దేవి జాతర మంగళవారం వైభవోపేతంగా జరిగింది. స్థానిక సూర్యనగర్‌లోని మల్లాలమ్మ ఆలయంలో అర్చకులు ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిపారు. అనంతరం అమ్మవారి ప్రతిమను మేళతాలాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు, యువతులు బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

### ఇసుకను తలిస్తే.. ఉపేక్షించం

శింగనమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుకను ఎవరైనా అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్చరించారు. శింగనమల మండలం నిదనవాడ రాచేపల్లి ప్రాంతాల్లో గల పెన్నా నది నుంచి తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన వారు ఎలాంటి అనుమతుల లేకుండా ఇసుకను తరలిస్తుండడంపై నిదనవాడ గ్రా మస్థులు ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆమె శింగనమల నియోజకవర్గంలో పెన్నా పరివాహక ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఎంతటివారిపైన అయినా వెంటనే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు.

## శాకాంబరిగా అనంతేశ్వరి

శాకాంబరిగా దర్శనమిస్తున్న అనంతేశ్వరిమాత

అనంతపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : వారాహి నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరిమాత శాకాంబరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణాలు, మహిద్వీప వర్ణణ పఠించారు. అలాగే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కావాలంటే.. స్టోర్‌కు వెళ్లాల్సిందే..!

## ● పామిడిలో తూతూమంత్రంగా రేషన్ సరఫరా ● ఇబ్బందులు పడుతున్న వృద్ధులు

పామిడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల సరఫరా ఉత్తుత్తిదేనని తేలిపోయింది. వృద్ధులు స్టోర్ల వద్ద పడిగాపులు పడి సరుకులు తెచ్చుకుంటున్నారు. అర్హులైన రేషన్ లబ్ధిదారులకు క్రమం తప్పకుండా నిత్యావసరాలు పంపిణీ చేయాలని, వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి సరఫరా చేయాలని ప్రభుత్వం చౌకధాన్యపు డిపో డీలర్లు, అధికారులను ఆదేశించింది. పామిడిలో వృద్ధులకు నిత్యావసర సరుకుల సరఫరా నామమాత్రంగానే ఉంది. ఇందుకు 85 ఏళ్ల వృద్ధుడు దేవరపల్లి శ్రీరాములు ప్రభుత్వ చౌకధాన్యపు డిపోకు వచ్చి రేషన్ తీసుకోవడమే నిదర్శనం. పట్టణంలోని పామిడమ్మ గుడి సమీపాన దేవరపల్లి శ్రీరాములు, నారాయణమ్మ దంపతు లు నివాసం ఉంటున్నారు. ఈ వృద్ధ దంపతులు కిరాణషాపు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసర సరుకులను డీలర్లు ఇంటివద్దకు వచ్చి సరఫరా చేయకపోవడంతో స్టోర్ వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇంటి వద్దకు నిత్యావసర సరుకులు రాకపోవడంతో రెండుసార్లు ఆపరేషన్ జరిగినా.. ఆ వృద్ధుడే దగ్గరలో ఉన్న ప్రభుత్వ చౌకధాన్యపు డిపోకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అధికారులు, డీలర్లు తుంగలోకి తొక్కారని ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల అలసత్వానికి, స్టోర్ డీలర్ల నిర్లక్ష్యానికి ఈ సంఘటన అద్దం పడుతోంది. ఈ విషయంపై సీఎస్‌డీటీ కంబక్కను సంప్రదించగా ఆమె స్పందించ లేదు.

రేషన్‌షాపు వద్ద సరుకుల కోసం వేచి ఉన్న వృద్ధుడు శ్రీరాములు

**స్టోర్ వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నా**

నాకు దాదాపు 85 సంవత్సరాలు. చెస్ట్ క్యాన్సర్ వల్ల రెండుసార్లు ఆపరేషన్ చేయించుకున్నాను. నా భార్య నారాయణమ్మకు ఆరోగ్యం బాగోలేదు. గత నెలలోనూ స్టోర్ వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకున్నాను. ఈ నెలలోనూ స్టోర్ వద్దకు వెళ్లే సరుకులు తెచ్చుకున్నాను. నా కార్డు ఏ స్టోర్‌లో ఉందో తెలియదు, ఎవరిని అడిగినా సరైన సమాధానం రావడం లేదు. దీంతో దగ్గరలో ఉన్న స్టోర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నాను.

- దేవరపల్లి శ్రీరాములు, వృద్ధుడు, పామిడి

# తొలి అడుగును విజయవంతం చేద్దాం: కాలవ

రాయదుర్గం, జూలై 1(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు నిర్వహించే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి కలసి రావాలని పార్టీ శ్రేణులకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్‌తో పాటు ఎన్నికల పరిశీలకులు హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజులో కనీసం మూడు గంటలపాటు గ్రామాల్లో ప్రతి ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రజలతో మమేకమై కూటమి విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక చేయూత అందుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయటానికి అధిష్టానం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అందులో భాగంగా మండల స్థాయిలో కన్వీనర్, కో కన్వీనర్ల ఎంపికకు ప్రతి మండలానికి అధిష్టానం నియమించిన పరిశీలకులు వచ్చారన్నారు. అందరూ కలసికట్టుగా ఇద్దరి పేర్లను సిఫార్సు చేయాల్సి ఉంటుందన్నారు. తప్పనిసరిగా మండల కన్వీనర్లను మార్చాలని పార్టీ తీసుకొన్న నిర్ణయాన్ని అందరూ గౌరవించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కృష్ణకుమార్, కాలానాయక్, ఈటీసీ స్వామిదాస్, దళవాయి వెంకటనారాయణ, సాకే గంపన్న, మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగళ్లి రా జు, పొరాళ్ల పురుషోత్తం, టి. హనుమంతు, గాజుల వెంకటేశులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

## కాలుష్య కోరల నుంచి కాపాడండి

డి.హీరేహాళ్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఐరన్‌ఓర్ కర్మాగారాల నుంచి కాలుష్యకోరల్లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు, గ్రామస్థులు పేర్కొన్నారు. మండలంలోని పులకుర్తి, హిర్దేహాళ్, నేమకల్లు గ్రామాల పరిధిలో ధనలక్ష్మి ఐరన్ ఓర్ కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి మంగళవారం ఆర్డీఓ వసంతబాబు అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మూడు గ్రామాలకు సంబంధించిన సర్పంచులు, ప్రజలు, రైతులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా అధికారులు కర్మాగారానికి సంబంధించిన సమాచారాన్ని చదివి వినిపించారు. అనంతరం ఈ గ్రామాలకు సంబంధించిన రైతులు, ప్రజలు మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ కర్మాగారాలు ఏర్పాటు చేయడం వల్ల అధిక కాలుష్యంతో గ్రామస్థులు, రైతులు, పశువుల కాపర్లు చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, మునివేలు, రూరల్ సీఐ వెంకటరమణ, సర్వేయర్ రవితేజ, సభ్యులు పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : పరిశ్రమలు ఏర్పాటుకు ఎవరూ ఇబ్బందులు కలిగించరని, రైతులను ఆదుకునేలా పరిశ్రమలు ఉండాలని నేమకల్లు గ్రామ సర్పంచ్ పరమేష్, బీజేపీ నాయకుడు హీరోజీరావు, నేమకల్లు గ్రామ రైతు కురుబ శివారెడ్డి అన్నారు. మంగళవారం డి. హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామ పరిధిలో రూ. 560 కోట్లతో ధనలక్ష్మి ఐరన్ కర్మాగారం ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కాలుష్య నియంత్రణ ఎస్ఈ శివశంకర్ నాయక్, ఈఈ మునిప్రసాద్, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు హజరయ్యారు. స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చి.. ఫ్యాక్టరీ ప్రారంభమయ్యాక స్థానిక నిరుద్యోగులకు మొండిచేయి చూపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత్‌బాబు

### నీటిశుద్ధి ప్లాంట్ ప్రారంభం

కూడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు నీటి శుద్ధి ప్లాంట్‌ను ఎట్టకేలకు ప్రారంభించారు. నాడు-నేడు పథకం కింద మంజూరైన నీటిశుద్ధి పరికరం మరమ్మతులు చేయకపోవడంతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరస కథనాలు రావడంతో పాఠశాల చైర్మన్ పలక్కి ఎర్రిస్వామి, హెచ్‌ఎం రవిశంకర్ స్పందించి మరమ్మతులు చేయించారు. మంగళవారం చైర్మన్, హెచ్‌ఎంతోపాటు టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, బోయ ఎర్రిస్వామి, గంగాధర్, శివయ్య, రాముడు, తిరుపాల్ ప్రారంభించారు.

### వైద్య సిబ్బంది బదిలీ

యల్లనూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న పలువురు వైద్య సిబ్బంది బదిలీ అయినట్లు డాక్టర్ లోకేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. యల్లనూరు సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న శ్రీదేవి వెన్నపూసపల్లికి, అచ్యుతాపురంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న కాశీరాణి 85నిట్టూరుకు, అక్కడ పనిచేస్తున్న గౌరీ చుక్కలూరుకు బదిలీ అయ్యారన్నారు. అలాగే యల్లనూరు పీహెచ్‌ఈఎల్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న శ్వేత పెద్దవడుగూరుకు బదిలీ కాగా ఆమె స్థానంలో తిమ్మంపల్లిలో పనిచేస్తున్న దిలీప్ ఇక్కడకు వచ్చారన్నారు.

### ఘనంగా డాక్టర్స్ డే

ఉరవకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్ క్లబ్ యోగా సెంటర్‌లో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గంగాధర్, అర్జున్, హర్షవర్ధన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వేదమూర్తి, హర్షవర్ధన్, గణేష్ బాబు, ప్రభాకర్‌నాయుడు, మల్లికార్జున, సత్యన్న, జయకృష్ణ పాల్గొన్నారు.

**లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఏర్పాటు**

ఉరవకొండ లయన్స్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా వేదమూర్తి, కోశాధికారిగా హర్షవర్ధన్ ఎంపికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సత్కరించారు.

### రేషన్ తక్కువగా వేస్తే కఠిన చర్యలు

తాడిపత్రి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తక్కువ తూకాలు ఇస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై అధికారి మల్లేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ, పరిసర ప్రాంతాల్లో రేషన్‌కార్డు దారులకు సరైన తూకాలు వేయలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటికి అనుగుణంగా మంగళవారం పలుషాపు ల్లో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం డీలర్లతో మాట్లాడుతూ వారికి ఇచ్చిన కార్డు ప్రకారమే రేషన్ బియ్యాన్ని అందజేయాలని సూచించారు. అలాంటి సమస్య వచ్చినట్లయితే షాపును సీజ్‌చేస్తామన్నారు.

### టీడీపీ మండల కన్వీనర్‌గా మోహన్‌రెడ్డి

డి.హీరేహాళ్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ డి.హీరేహాళ్ మండల కన్వీనర్‌గా కాదలూరు మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. మంగళవారం రాయదుర్గంలోని సీతారామాంజనేయ కల్యాణమండపం నందు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అధ్యక్షతన మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు కాదలూరు మోహన్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డిని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరెడ్డి, నాగళ్లి రాజు పాల్గొన్నారు.

### వైద్యుల సేవలు చిరస్మరణీయం

యాడికి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోగులకు నిరంతరం చికిత్స అందిస్తున్న వైద్యుల సేవలు చిరస్మరణీయమని లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకొని మంగళవారం రాయలచెరువులో ప్రభుత్వ వైద్యులు దేవరాజన్, అప్పయ్యలను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు సూర్యనారాయణ, రంజిత్‌కుమార్, ఇస్మాయిల్, రామనాథ్, కులశేఖర్‌నాయుడు, సత్యరంగయ్య పాల్గొన్నారు.

డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

### కోనుప్పలపాడులో చోరీ

యాడికి, జూలై1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనుప్పలపాడులో ఒక ఇంటిలో దొంగలుపడి రూ.70వేలు విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితురాలు శివమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు సోమవారం కోనుప్పలపాడు గ్రామంలో శివమ్మ అనే మహిళ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత చూస్తే ఇంటిలో ఉన్న బంగారు కమ్మలు, మాటీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని తెలిపారు.

# వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కంబదూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ అధికారి మహేశ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కర్తనపర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలోనే తెగుళ్లను నివారిస్తే, పంట ఎదుగుదలకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా రైతులందరూ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు వెంటనే రైతు సేవ కేంద్రాల్లో పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● విడపనకల్లు: మొక్క జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఎమోమెక్టిన్ బెంజోయెట్, 4గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చే యాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలోని గడేకల్లు, డొనేకల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య మొక్క జొన్న పొలాలు చేరుకుని రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కైలాసనాథ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

●శెట్టూరు : మండల పరిధిలోని అడవిగొల్లపల్లిలో మంగళవారం వ్యవసాయ అధికారి వాసుకిరాణి, ఏఈఓ ఆంజనేయులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చునని తెలిపారు.

● రాయదుర్గం రూరల్ : రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ పద్మజ పేర్కొన్నారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రంలో ఏఓ అహ్మద్‌బాషా, ఏఈఓ మనోజ్‌కుమార్, బీమా అధికారులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి మహేశ్

## సంక్షిప్త వార్తలు

### ధాన్యం డబ్బు చెల్లించాలని ఆందోళన

ఉద్దేహాళ్ సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

బొమ్మనహాళ్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు నుంచి సేకరించిన వరి ధాన్యం డబ్బులు చెల్లించాలని మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ సొసైటీ వద్ద సీపీఐ నాయకులు, రైతులు ఆందోళన చేశారు. సీపీఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతుకు నగదు చెల్లించలేదని మండిపడ్డారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 280 మంది రైతుల నుంచి 64,227 బస్తాలు ధాన్యం కొనుగోలు చేసి పైసా కూడా రైతులకు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు తేజ, రామాంజనేయులు, పెద్దిరెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

### రైతుల సమస్యలను పరిష్కరించండి

పామిడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి తహసీల్దార్ షర్మిలను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన రైతు సమస్యలపై తహసీల్దార్‌తో చర్చించారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో రైతులకు ఎన్నో సమస్యలు తలెత్తాయన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలుపై తహసీల్దార్ షర్మిల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌చౌదరి, జయరాం, హనుమంతరెడ్డి, రాజు, రఘునాథ్‌రెడ్డి, శివ, పురుషోత్తం, శివారెడ్డి పాల్గొన్నారు.

### శాకాంబరిగా గంగాభవాని

పామిడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెస్తవీధిలోని గంగా భవాని(గంగమ్మ)శాకాంబరిగా మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసం తొలి మంగళవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించారు.

### పల్లె రహదారులను బాగు చేయండి

చాలవేముల రోడ్డులో కంకర ఏరి నిరసన తెలుపుతున్న నాయకులు

పుట్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రహదారులను బాగు చేయాలని సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చాలవేముల గ్రామానికి వెళ్లే దెబ్బతిన్న రహదారిలో మంగళవారం కంకరతేలిన రోడ్డులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. దెబ్బతిన్న రహదారుల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు, ప్ర జాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

### శ్మశానవాటికలో అపరిశుభ్రతపై చర్యలు తీసుకోండి

యాడికి, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో అపరిశుభ్రత వాతావరణం పెంపొందిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ పలువురు ముస్లింలు మంగళవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఖాజా, షెక్షావలి, ఖాదర్, సాదిక్‌వలి, మహబూబ్‌బాషా, ఫక్రుద్దీన్, మహబూబ్‌పీరా ఉన్నారు.

### కుందుర్పి ఏపీఓగా మురళీధర్

అనంతపురం అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండల ఉపాధి హామీ పథకం ఏపీఓగా మురళీధర్ నియమితులయ్యారు. యాడికి మండలం టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మురళీధర్‌ను డిప్యూటేషన్‌పై కుందుర్పి మండల ఏపీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు డ్వామా పీడీ సలీమ్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. మరో నాలుగు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

### సంక్షేమంలో క్రైస్తవులకు పెద్దపీట

రాయదుర్గం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి తొలి సంవత్సరంలోనే క్రైస్తవులకు పెద్దపీట వేసిందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాస్టర్లకు ఏడునెలల గౌరవవేతనం వేశారన్నారు. విదేశీవిద్య క్రైస్తవ పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు ఇస్తున్నారన్నారు. జెరూసలేం యాత్రకు సబ్సిడీ రూ. 60 వేలు ఇస్తున్నారని, అదే విధంగా వ్యాపారం చేసుకోవడానికి రూ. లక్ష సబ్సిడీ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్, బసవరాజు, హరి, సురేష్, సతీష్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ పోరాట ఫలితమే 'తల్లికి వందనం'

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): నెరవేర్చని హామీలపై వైసీపీ చేసిన పోరాటాల కారణంగానే ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలులోకి తెచ్చిందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న కల్యాణమండపంలో వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సంవత్సరకాలమైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. తాము చేసిన ఆందోళన కారణంగా తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించారన్నారు. వైసీపీ నాయకులు అనంత వెంకటరామిరెడ్డి, శైలజానాథ్ మాట్లాడుతూ.. వైసీపీ శ్రేణులపై ఎన్ని కేసులు పెట్టినా వెనక్కు తగ్గబోమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సతీశ్‌రెడ్డి, నరేశ్ కుమార్‌రెడ్డి, నైరుతిరెడ్డి, వీరా, గాది లింగేశ్వర బాబు, జింకల రామాంజనేయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

## త్వరలోనే బీటీపీ కాలువ పనులు: అమిలినేని


శీబాయిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీటీపీ కాలువ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శీబాయి గ్రామంలో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీపీ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి పనులు ప్రారంభిస్తామన్నారు. దాంతో పాటు కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కు కూడా నీళ్ల తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని అన్నారు.

**నేటి నుంచి పల్లెబాట**

ఈ నెల 2 నుంచి పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి ఏడాది కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేశారు.

### దేశంలోనే అత్యధికంగా పింఛన్: గుమ్మనూరు

పింఛన్ డబ్బు అందిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రికార్డు స్థాయిలో రూ. 4 వేల వృద్ధాప్య పింఛను పంపిణీ జరుగుతోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 32వ వార్డులో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని సమపాళ్లలో చేపట్టి సమర్థవంతంగా పరిపాలిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, బండారు రామన్నచౌదరి, కె. కృపాకర్, పత్తి హిమబిందు, ఫజులు, గుజరీ మహమ్మద్ ఖాజా, ఆనంత్ రెడ్డి, ఫ్రూట్ మస్తాన్, వై. సుధాకర్, రాయల్ వెంకటేశులు, మత్రునాయక్, వరలక్ష్మి పాల్గొన్నారు.

### పింఛన్ పేదలకు ఆర్థిక భరోసా: విప్

పింఛన్ పంపిణీ చేస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదల ఇల్లు గడవటానికి, కుటుంబ అవసరాలకు పింఛన్ ఆర్థిక భరోసా ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణం 29వ వార్డు పరిధిలో మంగళవారం పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఏ ప్రభుత్వం ఇవ్వనంత మొత్తాన్ని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ అమలు చేస్తోందన్నారు. కుటుంబ పోషణ నెలవారి మందులు ఇతరత్రా అవసరాలకు కుటుంబసభ్యులపై ఆధారపడాల్సిన పని ఉండదన్నారు. సంపాదించలేని స్థితిలోనూ కుటుంబంలో వారికి తగిన గుర్తింపు గౌరవం లభిస్తుందన్నారు.

### వాసవీ మాతకు శాకంబరి అలంకారం

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం శాకంబరి అలంకారాలను నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కన్యకాంబకు వివిధ కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి నాయకులు పాల్గొన్నారు.

### అవోపా ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

గుంతకల్లు పట్టణంలోని అవోపా సంఘం అధ్వర్యంలో మంగళవారం ఉదయం జాతీయ డాక్టర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్చూరి ప్రభాకర్, పత్తి వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, తదితర వైద్యులను కలసి ఘనంగా సన్మానించారు.

### చెస్‌లో ఐదుగురు బాలలకు రేటింగ్స్

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగ సమాఖ్య (ఎఫ్ఐడీఈ), అఖిల భారత చదరంగ సమాఖ్య (ఏఐసీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో విడుదల చేసిన చెస్ ఫలితాలలో గుంతకల్లు బాలలకు మంచి రేటింగ్స్ లభించాయని వారి శిక్షకులు అనిల్ కుమార్, రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంటుల్లో క్లాసిక్, రాపిడ్ విభాగాల్లో జునైరా (1401 రేటింగ్) బాలాజీ (1472), పునీత్ రెడ్డి (1472), రాఘవ (1478), కార్తీక్ (1493 రేటింగ్) సాధించారన్నారు. మంగళవారం ఫలితాలు విడుదలకాగా వారికి ఇంటర్నేషనల్ రేటింగ్స్ లభించాయని తెలియజేశారు.

### ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీభవ' అందించాలి

పెద్దవడుగూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి రైతుకు అందించడంతోపాటు కౌలురైతులకు కూడా వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు, కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందించాలన్నారు. సమావేశంలో నాయకులు రంగనాయకులు, హుస్సేన్‌పీరా, సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, రఘురామయ్య, మునేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమేశ్ నగర్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై వన్ టౌన్ పోలీసులు దాడిచేసి 11 మంది జూదరులను అరెస్టుచేశారు. మంగళవారం మధ్యాహ్నం హనుమేశ్‌నగర్ లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నరన్న సమాచారం రావడంతో పోలీసులు దాడిచేసి 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 22,560లు స్వాధీనపరచుకున్నారు.

● యాడికి : పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని మంగళవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.34,100 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, 8సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈరన్న తెలిపారు.

### మొహరం వేడుకలు ప్రారంభం

రాయదుర్గం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆత్మకూరు వీధిలో ఉన్న లడ్డువారి పీర్ల చావిడిలో మొహరం వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పీర్లను పూలతో అలంకరించి కొలువుదీర్చారు. స్వామివారికి చక్కెర చదివింపులు చేశారు.

**యల్లనూరు :** మొహరం వేడుకల్లో భాగంగా పాతపేటలోని దస్తగిరి స్వామి చావిడిలో పీరును మంగళవారం కొలువుదీర్చారు. వారంరోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ స్వామికి ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి.

రాయదుర్గంలో కొలువుదీరిన పీర్లు

# అత్తారింటికి వచ్చి వెళ్లినట్లు..

- శేషాచల కొండల్లోకి తమిళ స్మగ్లర్లు
- జోరుగా ఎర్రచందనం స్మగ్లింగ్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అత్తారింటికి వస్తున్నంత దర్జాగా జిల్లాలోని శేషాచల కొండల్లోకి తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు వస్తున్నారు. అడవుల్లోకి వచ్చి వెళుతున్నా పోలీసులు, అటవీ అధికారులు ఎవరూ అడ్డు చెప్పకపోవడంతో.. తమిళ స్మగ్లర్లు చెలరేగిపోతున్నారు. గతంలో ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు ఏ అర్ధ రాత్రో.. అటవీ సమీప గ్రామాల ద్వారా అడవిలోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికేవాళ్లు. తాము అడవిలోకి వచ్చిన విషయం పోలీసులు, అటవీ అధికారులకు తెలియకుండా ఉండేందుకు తమతో పాటు వంట సామగ్రి తీసుకెళ్లి.. అక్కడే వంట చేసుకునే వాళ్లు. ఎవరికంటా పడకుండా.. రాత్రుళ్లలో అడవి నుంచి బయటకు వచ్చేసేవాళ్లు. అయితే ప్రస్తుతం స్మగ్లర్లు రూటు మార్చేశారు. వారికి ఏం ధైర్యమో తెలియదు కానీ.. దర్జాగా అటవీ సమీప గ్రామాలు, మండల కేంద్రాల్లోని హోటళ్లకు వచ్చి తినేసి వెళుతున్నారు. హోటళ్లకు వచ్చి తిని అడవిలోకి వెళ్తున్న స్మగ్లర్లను పోలీసులు, అటవీ అధికారులు పట్టుకోలేకపోతున్నారు.

ప్రపంచంలో ఎక్కడా దొరకని ఎర్రచందనం ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల పరిధిలోని శేషాచల కొండల్లో మాత్రమే దొరుకుతుంది. బయట దేశాలలో ఈ ఎర్రచందనానికి విపరీతమైన గిరాకీ ఉండడంతో మన రాష్ట్రమే కాకుండా పక్కనే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు శేషాచల అడవులపైన పడ్డారు. 2014-19 వరకు తెలుగుదేశం ప్రభుత్వం ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టడానికి అనేక గట్టి చర్యలు తీసుకుంది. ఏకంగా గతంలో ఎన్నడూ లేనట్లు ఒక ఐపీఎస్ అధికారిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌కు అధికారిగా నియమించి స్మగ్లింగ్ నియంత్రణకు చర్యలు తీసుకుంది.

వాహనాలను తనిఖీ చేస్తున్న సుండుపల్లె పోలీసులు (ఫైల్)

ఈ నేపథ్యంలో గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు స్మగ్లర్లు, కూలీలు టాస్క్‌ఫోర్స్ పోలీసులపైకి తిరగబడడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో దాదాపు 10 మంది చనిపోయారు. అప్పట్లో ఈ సంఘటన సంచలనం కలిగించింది. దీంతో అప్పట్లో తమిళ కూలీలు, స్మగ్లర్ల బెడద దాదాపుగా తగ్గిపోయింది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు గేట్లు ఎత్తేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులకు కూడా ఈ స్మగ్లింగ్‌లో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు ఉన్న ఓ నాయకుడికి వైసీపీ ఎమ్మెల్యే టికెట్టు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం పోయి సంవత్సరం దాటుతున్నా ఎర్రచందనం స్మగ్లింగ్ మాత్రం ఆగడం లేదు.

### దర్జాగా హోటళ్లలో తింటూ..

గత శనివారం రాత్రి కొందరు ఎర్రచందనం స్మగ్లర్లు సుండుపల్లె మండల కేంద్రంలో ఉన్న ఓ హోటల్‌కు వచ్చి కడుపు నిండా తిన్నారు. అంతలో అక్కడికి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న ఓ హెడ్‌కానిస్టేబుల్ రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. చుట్టూ చీకటి కావడంతో పోలీసులకు దొరకకుండా క్షణాల్లో మాయమయ్యారు. అడవుల్లోకే వెళ్లి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే తర్వాత తాపీగా స్థానిక పోలీసులు రోడ్డు మీద వాహనాల తనిఖీ నిర్వహించడం విశేషం.

- అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న వీరబల్లి, సుండుపల్లె మండలాల నుంచి స్మగ్లర్లు ఎక్కువగా అడవిలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. సుమారు నాలుగు రోజుల కిందట సుండుపల్లె మండలంలోని రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె గ్రామపంచాతీల సమీపంలోని పింఛా, బాహుదా నదుల సమీపంలోని కావలిపల్లె బాహుదానది సమీపంలో పెద్ద సంఖ్యలో ఎర్రచందనం దుంగలు దొరికినట్లు సమాచారం. అయితే ఎర్రచందనం కూలీలు, స్మగ్లర్లు కానీ దొరకలేదు. నెల రోజుల వ్యవధిలో పెద్ద సంఖ్యలోనే ఎర్రచందనం దుంగలు దొరికినట్లు సమాచారం.
- పీలేరులో అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్, పీలేరు రేంజ్ సిబ్బంది ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 6 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఆరు వాహనాలను సీజ్ చేయడమే కాకుండా సుమారు టన్ను ఎర్రచందనం దొంగలు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకుచెందిన ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
- వీరబల్లి మండల పరిధిలోని గడికోట బీట్ చమురు డోన ప్రదేశంలో ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేశారు. గత నెల 17న తమిళనాడుకు చెందిన పలువురు ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా ప్రస్తుతం స్మగ్లర్లు అడ్డూ అదుపు లేకుండా ఎర్రచందనాన్ని తరలిస్తూనే ఉన్నారు. ఇకనైనా అటవీ అధికారులు, పోలీసులు ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు (ఫైల్)

## చెన్నామర్రిమిట్ట వద్ద ప్రమాద స్థలం పరిశీలన

ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కురబలకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హైదరాబాద్-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని చెన్నామర్రిమిట్ట వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. కర్ణాటకకు చెందిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా 12 మంది తీవ్రంగా గాయపడ్డ విషాదకర సంఘటన ప్రదేశాన్ని ఎన్‌హెచ్ డీఈ శివరాం, ఎంవీఐ శివలింగయ్య, రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు పరిశీలించారు. ప్రధానంగా అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, సిగ్నల్స్ లేకపోవడం తదితర కారణాలతో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. మలుపుల వద్ద వేగాన్ని నిరోధించడానికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు సూచిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

- ఆర్థిక సమ్మిళితత్వం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. ఈనెల 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఆర్థిక సమ్మిళితత్వంపై కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జరగబోయే ప్రచార కార్యక్రమాలను ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకుని ఆర్థిక సమ్మిళితత్వాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**సీఎం ఆదేశాలకూ దిక్కు లేదా?**
- ఒంటిమిట్ట అభివృద్ధికి బీజం పడేనా?
- టూరిజం సర్క్యూట్‌లో భాగమయ్యేనా?

6

## వీరభద్రాలయానికి రూ.20 లక్షలు

- 53 గ్రాముల బంగారం, కేజీ 800 గ్రాముల వెండి వస్తువులు
- హుండీలను లెక్కించిన అధికారులు

వీరభద్రాలయం హుండీ డబ్బులను లెక్కిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని వీరభద్రస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు ద్వారా రూ.20 లక్షల 68 వేల నగదుతో పాటు 53 గ్రాముల బంగారు నగలు, కేజీ 800 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం వీరభద్రాలయంలో జిల్లా దేవదాయ శాఖాధికారి విశ్వనాథ్ పర్యవేక్షణలో ఈ ఏడాది మార్చి 26వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు 95 రోజులకు ఆలయంలో గల పర్మినెంట్ హుండీలను లెక్కించారు. ఆలయంలోని శాశ్వత హుండీల ద్వారా రూ.19,55,945 ఆదాయం రాగా, నిత్యాన్నదాన హుండీ ద్వారా 1,12,888లతో కలిపి మొత్తం రూ.20,68,833 ఆదాయం వచ్చిందన్నారు. నగదుతో పాటు 53 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారం, కేజీ 800 గ్రాముల వెండి నగలు వచ్చాయన్నారు.

## నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వాలి

- ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

రాజంపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించినప్పుడే ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తెలిపారు. మంగళవారం రాజంపేట పట్టణ, మండల పరిధిలోని బోయనపల్లె, యల్లాగడ్డ, ఆకేపాడులోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు ఏ విధంగా ఆహారాన్ని అందిస్తున్నారనే అంశంపై సమీక్షించారు. ప్రతినెలా డిపోల నుంచి సరిపడా సరుకులు వస్తున్నాయా లేదా అనే విషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ వంద శాతం ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. గ్రామాల్లోని, వీధుల్లోని చిన్నపిల్లలు ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే విధంగా వారి తల్లులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సునంద, సూపర్‌వైజర్ రాణి, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన అంటే కూటమి ప్రభుత్వానిదే

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన అంటే కూటమి ప్రభుత్వానిదేనని, సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంతో ప్రజలకు మరింత సేవలందించే మంచి అవకాశం లభించిందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు.

మంగళవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిలో ప్రజా పాలన అంటే ఏంటో కూటమి ప్రభుత్వం చూపించిందని, భవిష్యత్‌లో మరింత మెరుగైన పాలన కోసం ప్రజల దగ్గరికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. అవినీతి పార్టీ అయిన వైసీపీలో చేరి ఆ వ్యక్తుల మధ్య కూర్చుని టీడీపీని విమర్శించడం సుగవాసి బాలసుబ్రహ్మణ్యంకు తగదని ఆయన హితవు పలికారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం కూటమి గాలి వీచినా రాజంపేటలో మీరు ఎందుకు ఓడిపోయారో అందరికీ తెలుసన్నారు. నువ్వు పార్టీ మారినా ఏ ఒక్క టీడీపీ కార్యకర్త మీ వెంట రాలేదని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లి రెడ్డయ్యానాయుడు, నందలూరు క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్, సిద్దవటం టీడీపీ యువ నాయకుడు రాజానాయుడు, టీడీపీ నాయకులు సుబ్రమణ్యంనాయుడు, మైనార్టీ నాయకుడు పీర్‌సాహెబ్ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య

చిన్నమండెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య వైద్య సిబ్బందికి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులతో పాటు రిపోర్టులను పరిశీలించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేయాలని, నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చిగున్‌గున్యా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున పట్టణాల్లో, గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది పర్యటించి నీరు నిల్వ లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించే విధంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి వారి సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతులపై అధికారులు ఎప్పటికప్పుడు విచారించి బాధితులకు సత్వరం న్యాయం చేకూర్చాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా వస్తున్న ఫిర్యాదులపై అధికారులు అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 10న మెగా పీటీఎం

- 2.50 లక్షల మంది తల్లిదండ్రులతో ఒకేరోజు సమావేశం
- సత్ఫలితాలిస్తున్న పీటీఎం కార్యక్రమం

మదనపల్లె టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడానికి బడికి పంపితేనే సరిపోదు.. వారి చదువు సామర్థ్యాలు, ప్రవర్తన, నడవడిక తదితర అంశాలను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు గమనిస్తూనే ఉండాలి. ఏడాదిలో ఒకరోజైనా వారి బిడ్డల కోసం కేటాయించి, చదువుతున్న బడికి వెళ్లి వారి బిడ్డల చదువు సామర్థ్యం, ఇతర అంశాలను టీచర్లను అడిగి తెలుసుకోవాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది డిసెంబరు 4వ తేదీ జిల్లా అంతటా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మంచి ఫలితాలు ఇవ్వగా, ఈ విద్యాసంవత్సరం కూడా ప్రభుత్వం మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జూలై 10వ తేదీ జిల్లా అంతటా ఈ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఒకేరోజు సమావేశాలు

జిల్లాలో మొత్తం 2731 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూళ్లలో 2,41,026 మంది విద్యార్థులు ఈ ఏడాది చదువుతున్నారు. జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం విద్యా పురోగతి కోసం ప్రజలను భాగస్వామ్యం చేయడానికి పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం)లు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద ఈ కార్యక్రమాలను జూలై 5వ తేదీ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పీటీఎం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



### మెగా పీటీఎంతో ఎన్నో ఉపయోగాలు

మెగా పీటీఎం కార్యక్రమాలతో నూతన ఒరవడి వస్తోందనే చెప్పవచ్చు. పీటీఎం వలన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య పాఠశాలల బంధాన్ని బలోపేతం చేయడానికి వీలవుతుంది. అదే విధంగా విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తన, సామాజిక సమస్యల గురించి ఎంత అవగాహన కల్పించుకుంటున్నారో తెలుసుకోవచ్చు. విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాలకు పీటీఎం కార్యక్రమం ఒక వారధిగా ఉంటుంది. విద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి పీటీఎం ఎంతో ఉపయోగపడుతుంది.

### మెగా పీటీఎం 2.0 కార్యక్రమాలు

మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను వారి తల్లిదండ్రులకు ఇస్తారు. ఈ కార్డులో విద్యార్థుల చదువు పురోగతిని తెలుసుకోవచ్చు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు నిర్వహించే బహిరంగ సమావేశాల్లో ఆ పాఠశాల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పనలో ఏవైనా లోపాలుంటే తెలుసుకోవచ్చు. వీటితో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సరదా ఆటలు, పాటల కార్యక్రమాలు నిర్వహించి అందరిలో స్నేహభావం పెంపొందిస్తారు. ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో డీఈవో సుబ్రహ్మణ్యం జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ మెగా పీటీఎం 2.0 కార్యక్రమం విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## కొలతలు తీయకుండానే బిల్లుల చెల్లింపు

- రూ.7.19 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు
- కొనసాగుతున్న సామాజిక బహిరంగ సభ

కూలీలు, ఉపాధి అధికారులను విచారిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

మదనపల్లె టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కొలతలు తీయకుండానే బిల్లులు చెల్లించినట్లు అధికారుల తనిఖీలో వెల్లడైంది. మదనపల్లె మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు నిర్వహించిన రూ.7.19 కోట్ల పనులపై మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో ఉపాధి హామీ కూలీలతో పాటు అధికారులను విచారించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఏడాది పొడవునా 14,659 ఉపాధి పనులు నిర్వహించారు. ఈ పనులపై గత నెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 11 మంది సభ్యులు గల సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించింది. గ్రామ పంచాయతీల వారీగా ఒక్కో డీఆర్పీ తనిఖీ నివేదికలను డ్వామా పీడీకి వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పలు ఉపాధి పనులకు కొలతలు తీయకుండానే బిల్లులు చెల్లించారని డీఆర్పీలు నివేదికలు అందజేశారు. ఉదయం నుంచి నిర్వహిస్తున్న బహిరంగ సభ రాత్రి అయినా కొనసాగుతుండటం, ఎక్కువ పంచాయతీలు ఉండటంతో వాటన్నింటిలో వెలుగు చూస్తున్న రికవరీల నివేదిక ఆలస్యమవుతోందని డ్వామా పీడీ తెలిపారు. ఇప్పటి వరకు అందిన నివేదికల ప్రకారం రూ.42 వేలు రికవరీకి ఆదేశించామని, అలాగే రూ.18,500 జరిమానా విధించామన్నారు. డీఆర్పీలు ఇచ్చిన నివేదిక ప్రకారం 48 ఉపాధి పనులపై ఏపీడీచే మరోసారి విచారణ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎస్టీఎం లోకేశ్వరరెడ్డి, ఎంపీడీవో తాజ్ మస్రూర్, పీఆర్ ఏఈ రమణ, ఏపీవోలు సుబ్రమణ్యం, చెన్నకేశవ, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ భారతి, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

# సీఎం ఆదేశాలకూ దిక్కు లేదా?

● ఒంటిమిట్ట అభివృద్ధికి బీజం పడేనా? ● టూరిజం సర్క్యూట్‌లో భాగమయ్యేనా?
● బ్రహ్మోత్సవాల సమయంలోనే టీటీడీ హడావుడి ● భక్తుల ఆందోళన

కోదండ రామాలయం



ఒంటిమిట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో టీటీడీ, టూరిజం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా గత ఏప్రిల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒంటిమిట్టను సందర్శించారు. కల్యాణం అనంతరం టీటీడీ ఛైర్మన్, ఈవో, అధికారులు, జిల్లా కలెక్టర్ తదితరులతో ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు.

ఒంటిమిట్ట ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారని, పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తిరుపతి, కాణిపాకం, తాళ్లపాక, గండికోట, ఒంటిమిట్ట, కాళహస్తితో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని టీటీడీ, టూరిజం అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్టలో వసతుల మెరుగుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

రామతీర్థం, లక్ష్మణ తీర్థాల యొక్క ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలన్నారు. రామాయణం, హిందూతత్వం విలువలను తెలిపే విధంగా పోతనగిరిపై శ్రీరామ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులందరికీ అన్న ప్రసాదం అందించేందుకు అన్నదాన భవనాన్ని నిర్మించాలన్నారు. ఒంటిమిట్టను టూరిజం సర్క్యూట్‌లో చేర్చడంలో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచడంతోపాటు, యాత్రికుల సౌకర్యాలను మెరుగుపరచడానికి ఒక ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఈ ఆదేశాలిచ్చి ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్నా అధికారుల్లో ఇప్పటివరకు చలనం లేదు. దీంతో కేవలం బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే టీటీడీ అధికారులు హడావుడి చేసి తర్వాత పట్టించుకోరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఆదేశాల అమలుకు నోచుకొనేలా పనులు త్వరగా పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

### అన్న ప్రసాద భవనాన్ని నిర్మించాలి

ఒంటిమిట్టలోని కోదండరామాలయం వద్ద నిత్యాన్నదాన భవనాన్ని నిర్మించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించి 2 నెలలు గడుస్తున్నా అధికారుల్లో చలనంలేదు. ఇప్పటికైనా పనులను వెంటనే ప్రారంభించాలి.

- రుద్రరాజు భానుప్రకాష్‌రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు

### ఆదేశాలు అమలు చేయాలి

బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించిన మేరకు అభివృద్ధి పనులపై. ఇప్పటివరకు అధికారులు దృష్టిసారించలేదు. వెంటనే పనులు ప్రారంభించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

- షేక్ అజుంతుల్లా, మండల కోఆప్షన్ మాజీ మెంబరు

# వివాహిత మృతి కేసులో వీడిన మిస్టరీ

● హత్యగా నిర్ధారించిన పోలీసులు
● భర్త, అతని సోదరి, తల్లి, అమ్మమ్మ అరెస్టు

నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ కృష్ణమోహన్, పీలేరు పోలీసులు

పీలేరు,జూలై1(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెలో ఆదివారం ఉదయం వెలుగు చూసిన హిందూజా అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆమె భర్త, అత్త, ఆడపడచు, భర్త అమ్మమ్మ, భర్తతో వివాహేతర సంబంధం కలిగిన మహిళ కలిసి హత్య చేశారని పోలీసులు తేల్చారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ కథనం మేరకు బందార్లపల్లెకు చెందిన వరంపాటి విజయశేఖర రెడ్డికి, బెంగళూరుకు చెందిన హిందూజాకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వివాహమైన రెండేళ్ల వరకు బాగా సాగిన వారి కాపురం, విజయభాస్కర రెడ్డికి ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగా చెడింది. హిందూజాను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలన్న లక్ష్యంతో అతను తన తల్లి శాంతమ్మ, సోదరి సునంద, అమ్మమ్మ అమ్మణ్ణమ్మతో కలసి వేధించేవాడు. అదనపు కట్నం తెమ్మని వేధించడమే కాకుండా శారీరకంగా హింసించేవాడు. ఈ నేపథ్యంలో గత శనివారం రాత్రి గ్రామస్తులందరూ బందార్లపల్లె సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో గంగ జాతరకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన వారు హిందూజా గొంతు నులిమి హత్య చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించేందుకు మృతదేహాన్ని బందార్లపల్లె సమీపంలోని ఓ బావిలో పడేశారు. అయితే, భయం వేయడంతో గుండెపోటుతో నిద్రలోనే కన్నుమూసిందని అందరినీ నమ్మించేందుకు ఆమె మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీసి ఇంటిలో పడుకోబెట్టారు. నిద్రలో తన భార్య కన్నుమూసిందని విజయశేఖర రెడ్డి తన స్నేహితులు, బంధువులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు, బంధువులకు వేర్వేరు కథనాలు చెప్పడంతో అనుమానం వచ్చిన హిందూజా తల్లి జీవనజ్యోతి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నిజం అంగీకరించారు. దీంతో పీలేరు పోలీసులు వారిని మంగళవారం రాత్రి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించిన పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్, వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# నిప్పంటించుకుని యువతి ఆత్మహత్య

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

కలికిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం లేని ఒక యువతి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు స్థానిక జగనన్న కాలనీకి చెందిన కందూరి యర్రయ్య కుమార్తె కందూరి చందన (23)కు ఆరోగ్యపరమైన సమస్యలున్నాయి మానసిక స్థిమితం కూడా లేదు. మంగళవారం తెల్లవారు జామున ఇంటినుంచి బయలుదేరి, నగరిపల్లె మార్గంలోని పెట్రోలు 5 లీటర్ల పెట్రోలు కొనుగోలు చేసింది. ఎస్టీ కాలనీ సమీపంలోని కలికిరి చెరువు వంకలోకి వెళ్లి ఒంటిపై పెట్రోలు పోసుకుని తగలబెట్టుకుంది. ఉదయం స్థానికులు ఆమె మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు జగనన్న కాలనీకి చెందిన చందనగా గుర్తించారు. ఆమె పెట్రోలు కొను గోలు చేసిన విషయం పెట్రోలు బంకులోని సీసీ కెమెరాలో నమోదైనట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కలికిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కలికిరి వాల్మీకిపురం సరిహద్దులోని యర్రావాండ్లపల్లె సమీపంలోని జాతీయ రహదారి టోల్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కలికిరి సర్పంచు యల్లయ్య కుమారుడు వినేష్ (28) తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న వినేష్‌ను టోల్‌గేట్ వద్ద కర్నాటకకు చెందిన బొలెరో వాహనం ఢీ కొంది. దీంతో మోటారు సైకిలు నుజ్జునుజ్జు కాగా, వాహనం కూడా బోల్తా పడింది. కలికిరి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. బొలేరో వాహనం డ్రైవరు పోలీసులకు లొంగిపోయాడు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసుల అదుపులో కంటైనర్

పోలీసుల అదుపులో ఉన్న కంటైనర్

కురబలకోట, జులై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, 12 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదానికి కారణమైన కంటైనర్ ఆపకుండా వెళ్లిపోవడంతో, దానిని పట్టుకునేందుకు పోలీసులు రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. కదిరి నుంచి పుంగనూరు వరకు సీసీ కెమెరాలను పరిశీలించి ప్రమాదానికి కారణమైన కంటైనర్ వాహనాన్ని గుర్తించారు. తమిళనాడుకు వెళుతున్న ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముదివేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ చెంగల్‌పట్టుకు చెందిన హరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

## చెన్నకేశవాలయ భూముల
# సాగు హక్కులు వేలం

● రూ.1.95 లక్షల ఆదాయం

చెన్నకేశవస్వామి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దతిప్పసముద్రం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సాగు హక్కుల వేలంతో మండలంలోని చెన్నకేశవాలయానికి రూ.1.95 లక్షల ఆదాయం చేకూరినట్లు ఈవో మునిరాజ్ తెలిపారు. మండలంలోని పోతుపేట, బూర్లపల్లె, పీటీఎం చెరువు కట్ట కింద ఆలయానికి 13 ఎకరాల భూమి ఉంది. పోతుపేట సమీపంలోని 7 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు దేవదాయ శాఖ అధికారులతో కుమ్మక్కై పదిహేనేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగు చేసుకుంటున్నారు. రెండు నెలల క్రితం ఆ భూమికి వేలం నిర్వహించగా, తాము పంట సాగు చేశామని కొద్ది సమయం కావాలని వేలాన్ని వాయిదా వేయించారు. దేవదాయ శాఖ అధికారులు వారికే వత్తాసు పలికారు. ఎట్టకేలకు మంగళవారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ వేలం నిర్వహించగా వైసీపీకి చెందిన బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి, టీడీపీకి చెందిన గూటం ఈశ్వరప్ప తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు రూ.1.65 లక్షలకు ఏడు ఎకరాల భూమిని ఏడాదిపాటు సాగు చేసుకునేందుకు గూటం ఈశ్వరప్ప హక్కులు దక్కించుకున్నారు. దీంతో భూమిలో ఉన్న పంటను తొలగించే వరకు తమకు సమయం ఇవ్వాలని, ఆ భూమిలో ఉన్న గుట్టలను తొలగించేందుకు ఖర్చు చేయడంతో ఫలసాయంలో తమకు వాటా ఇవ్వాలంటూ ఈశ్వరప్ప ఈశ్వరప్ప చేసిన డిమాండ్ చేశారు. దేవదాయ శాఖ అధికారులు సైతం వైసీపీ నాయకుల వైపే మొగ్గు చూపుతున్నారని, 20 ఏళ్లుగా దేవదాయ శాఖ అధికారులు మాముళ్లు తీపసుకుని వారికే అప్పచేప్పేందుకు సన్నాహాలు చేస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. పోతుపేట గ్రామం పిడుంవారిపల్లె వద్ద గల 2.35 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన మద్దిరెడ్డి రూ. 25,500 లకు దక్కించుకున్నారు. పీటీఎం వద్ద ఉన్న భూమిని అదే గ్రామస్తులు దక్కించుకున్నారు. లీజు ప్రాధిపదికన ఆలయానికి మొత్తం రూ 1.95 అక్షల ఆదాయం చేకూరినట్లు అధికారులు తెలిపారు.

# ఉద్యాన పరిశోధన కేంద్ర పనులు షురూ..

● భూమి చదును చేస్తున్న యంత్రాలు ● పరిశోధన విభాగాన్ని విభజిస్తూ కంచె ఏర్పాటు ● నూతన వంగడాల అభివృద్ధికి చర్యలు

ఉద్యాన పరిశోధన కేంద్రంలో వినియోగంలోకి తెచ్చిన భూమి

పరిశోధనల విభాగాన్ని విభజిస్తూ వేసిన ఫెన్సింగ్

బి.కొత్తకోట, జూలై1(ఆంధ్రజ్యోతి): నూతన వంగడాల సృష్టితో ఉద్యాన రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో బి.కొత్తకోట మండలంలోని బయప్పగారిపల్లి పంచాయతీలో నెలకొల్పిన ఉద్యానపంటల పరిశోధన కేంద్రం ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై ఉనికి కూడా కోల్పోయే దుస్థితి నెలకొంది. గత టీడీపీ హయాంలో 80 ఎకరాలను సేకరించి రైతులకు ఉపయోగకరంగా ఉండే నూతన వంగడాలను ఉత్పత్తి చేసి, ఉద్యాన రంగానికి ఊతమందించాలని ప్రభుత్వం భావించింది. అయితే, ప్రభుత్వం మారడంతో లక్ష్యం కూడా మారింది. పరిశోధనలు, వంగడాలు వగైరాలను పక్కన పెట్టి గత ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రాగానే ఈ పరిశోధన కేంద్రం పనుల్లో కదలిక మొదలైంది. డా.వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేసి, ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలను నియమించి నూతన వంగడాలపై పరిశోధనలను చేయించాలని ప్రభుత్వం భావించింది. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.మాధవి ఫిబ్రవరి 6న ఈ పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతానికి ఐదు ఎకరాలలో పరిశోధనలు మొదలు పెడతామని, అనంతరం విస్తరిస్తామని ప్రకటించారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా పరిశోధనలపై అడుగు ముందుకు పడక పోవడంపై ఆంధ్రజ్యోతిలో జూన్ 13న ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ? అన్న శీర్షికన కథనం వెలువడింది. దీనిపై ఉద్యానశాఖ అధికారులు స్పందించారు. అందుబాటులో ఉన్న నిధులతో భూమిని చదును చేయించారు. 2 బోర్లు వేయించారు. విద్యుత్ కనెక్షన్‌కు రుసుము చెల్లించారు. పరిశోధనలకు ఎంపిక చేసిన స్థలాన్ని వేరు చేస్తూ ఫెన్సింగ్ వేశారు. దీనిపై స్థానికంగా నియమితులైన శాస్త్రవేత్తలు ప్రతాప్, దత్తారెడ్డిలు మాట్లాడుతూ హార్సిలీహిల్స్ దిగువ భాగంలో ఉన్న ఈ పరిశోధన కేంద్రంలో త్వరలో పరిశోధనలు ప్రారంభిస్తామని, రైతులకు అధిక ఉత్పత్తులు, రోగనిరోధక శక్తితో కూడిన కూరగాయలు, పండ్ల వంగడాలను ఉత్పత్తి చేస్తామని తెలిపారు

# పోలీసు అధికారుల సేవలు మరువలేనివి : ఎస్పీ

● పదవీ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులకు సన్మానం

పదవీ విరమణ పొందిన అధికారులతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎన్నో త్యాగాలు చేసి సుదీర్ఘకాలం పోలీసుశాఖకు సేవలందించిన అధికారుల సేవలు మరువలేనివని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. జూన్ నెలలో పదవీ విరమణ పొందిన జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఎస్ఐ రెడ్డెయ్య, మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ పీ. శ్రీహరి, మదనపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ బీ.గణపతి, జిల్లా ఆర్మ్ రిజర్వు ఏఎస్ఐ ఎస్.గౌస్‌మొహిద్దీన్, మన్నూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఏ. శంకరయ్యను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు సమావేశ మందిరంలో ఎస్పీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో చేరి దశాబ్దాల తరబడి సమాజానికి సేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్, రామనాథ్‌హెగ్డే, డీఎస్పీలు ఎస్. మహేంద్ర, ఎంఆర్ కృష్ణమోహన్, ఎం.శ్రీనివాసులు, ఏవో జే.త్రినాథసత్యం, ఇన్‌స్పెక్టర్లు పీ. రాజారమేశ్, కే. రాజారెడ్డి, ఎం. చంద్రశేఖర్, ఎం. తులసీరాం, వీజే రామకృష్ణ, ఎం. పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు హాజరయ్యారు.

# దళితుడిపై దాడి కేసులో నిందితులను అరెస్టు చేయాలి

● పోలీస్ స్టేషన్ ఎదుట మాలమహానాడు ధర్నా

ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబీకులు

వాల్మీకిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ కోటపల్లెకు చెందిన చింతపర్తి గురునాథ్‌పై జూన్ 27న జరిగిన దాడిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని మాల మహానాడు అధికార ప్రతినిధి మల్లెల మోహన్, జిల్లా అధ్యక్షుడు శివయ్య తెలిపారు. గురునాథ్‌ను గ్రామ సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లి బోయపల్లెకు చెందిన భార్గవ్, అతని అనుచరులు 15 మంది కులం పేరుతో దూషిస్తూ దాడి చేశార ఆరోపించారు. ఈ విషయంపై కేసు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు, మాలమహానాడు నాయకులు గుండా మనోహర్, వెంకటస్వామి, శివారుపల్లె సుధాకర్, నాగార్జున, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో రసాభాస

● సిద్దవరంలో ఏకగ్రీవం, తొమ్మిది చోట్ల పోటీ

ఏకగ్రీవంగా ఎన్నికైన సిద్దవరం టీడీపీ గ్రామ కమిటీ సభ్యులతో ఎన్నికల పరిశీలకుడు దేవరింటి శ్రీనివాసులు

మదనపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి) నియోజకవర్గ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో మంగళవారం జరిగిన టీడీపీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా తెలుగు తమ్ముళ్లు గొడవపడ్డారు. దీంతో పోలీసుల బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఃమండలంలో మంగళవారం 10 గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. వాటిలో సిద్దవరం టీడీపీ గ్రామ కమిటీ మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకుడు దేవరింటి శ్రీనివాసులు తెలిపారు. తొమ్మిది చోట్ల పోటీ నెలకొందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించగా సిద్దవరం గ్రామ కమిటీ అధ్యక్షుడుగా సి. నాగమల్లప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె. రవి ఎన్నికైనట్లు తెలిపారు. గుర్రంవాండ్లపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీలో ఉండగా కోటకాడపల్లి గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి ఆరుగురు, శివపురం గ్రామ కమిటీ పదవికి పది మంది, వెలిగల్లు టీడీపీ గ్రామ కమిటీ పదవికి 14 మంది, బండమీదపల్లికి పదిమంది, ఎన్‌వోపల్లి టీడీపీ గ్రామ కమిటీ పదవికి ఆరుగురు, కలిచెర్ల ఏడుగురు, సి. గొల్లపల్లికి ఎనిమిది మంది, పెద్దమండ్యంకు 12 మంది పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. వెలిగల్లు బండమీదపల్లి, ఎన్‌వోపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో క్రమశిక్షణ వీడి దుర్భాషలాడుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణ నెలకొనడంతో పోలీసులు సర్దిచెప్పారు. మండలంలో 17 గ్రామ కమిటీలుండగా 6 గ్రామ కమిటీలు ఏకగ్రీవం కాగా 11 చోట్ల పోటీ నెలకొన్నట్లు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఇస్మాయిల్, గంగాధర, మనోహర్‌నాయక్, నటరాజ్‌నాయక్, రామాంజులు, రామకృష్ణారెడ్డి, ఆయా గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పెద్దమండ్యం, తంబళ్ళపల్లి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వర, స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా!

● రామానాయుని చెరువులో ఆగని తవ్వకాలు

రామానాయుని చెరువులో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

గుర్రంకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఇసుకాసురులు తుంగలో తొక్కేస్తున్నారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్ల తో ఇసుకను తవ్వి సిద్ధం చేస్తుండగా, పగటి వేళల్లో దానిని ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం మండలంలోని రామానాయుడి చెరువు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నవారికి, స్థానిక రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది.

గుర్రంకొండ మండలం తరిగొండ పంచాయతీ పరిధిలో రామానాయునిచెరువు ఉంది. ఈ చెరువులో ఇసుక మేటలు అధికంగా ఉన్నాయి. ఈ ఇసుకను కొన్ని నెలలుగా కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుకాసురులను మందలించి కట్టడిచేశారు. రెవెన్యూ అధికారులు చుట్టూ ట్రెంచ్ కొట్టించారు. దీంతో కొన్ని రోజులు ఇసుక అక్రమ రవాణకు అడ్డుకట్టపడింది. ప్రస్తుతం మండలంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు సిబ్బంది మారడంతో ఇసుకాసురులు మళ్లీ ఇసుక అక్రమ రవాణా ప్రారంభించారు. ప్రతి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో చెరువులో ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులే దర్శనమిస్తున్నాయి.ఈ విషయమై వారం రోజుల క్రితం తరిగొండలో ఇసుకాసురులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, పోలీసులకు తెలిపిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో మండల కేంద్రానికి వస్తున్న ఇసుక ట్రాక్టర్లు

### నేను ఏమీ చేయలేని పరిస్థితి...

రామానాయుని చెరువులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాట వాస్తవమే. ఇసుకాసురులకు నాయకుల అండదండలు ఉండడంతో మాపై తిరుగబడుతున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్లను విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్న ఏమీ చేయలేకపోతున్నాం.

- వెంకటరమణ, వీఆర్వో, తరిగొండ

# డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు

● రెండు నెలల్లో దాదాపు రూ.7కోట్లకు పైగా స్వాహా ● వాట్సప్ కాల్ కొత్త నెంబర్లతో వస్తే స్పందించవద్దు

కడప క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతూ డబ్బులను దోచేస్తున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలువురు బాధితులు దాదాపు రూ.7కోట్ల మేర డబ్బులు పోగొట్టుకున్నారు. దీన్ని బట్టి సైబర్ కేటుగాళ్లు ఏ విధంగా మోసాలకు పాలపడుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. పులివెందుల ప్రాంతానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి ఫోన్లు చేసి మీపై డ్రగ్స్ కేసు ఉందని... మిమ్మల్ని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు వస్తాయని చెప్పడంతో ఆ ఉద్యోగి భయపడి రూ.1.8 కోట్లు డబ్బులు పోగొట్టుకున్నాడు. చివరికి అవమానం భరించలేక చనిపోయాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి.

డిజిటల్ అరెస్టు అనేది ఒక సైబర్ మోసం. సైబర్ నేరగాళ్లు వీడియోకాల్స్ చేసి తాము పోలీసులమనో, దర్యాప్తు అధికారులమంటూ నమ్మిస్తారు. బ్యాంకు ఖాతా, సిమ్‌కార్డు, ఆధార్‌కార్డువంటివి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారంటూ బెదిరింపులకు పాల్పడతారు. విచారణ పూర్తయ్యేంత వరకు ఇక్కడ నుంచి కదలడానికి వీలు లేదంటూ కట్టడి చేస్తారు. డబ్బులు చెల్లిస్తే వదిలేస్తామని లేకపోతే మిమ్మల్ని అరెస్టు చేస్తే మీ ప్రాంతాల్లో అవమానాలకు గురి కావాల్సిందంటూ హెచ్చరిస్తారు. ఖాతాలో డబ్బులు జమ అయ్యాక విడిచిపెడతామంటారు. అలా ఎక్కడికీ వెళ్లనీయకండా ఒక రకంగా అరెస్టు చేసినట్లుగా నిర్బంధించడమే డిజిటల్ అరెస్టు అంటారు.

సాధారణంగా నకిలీ అరెస్టు వారెంట్లు, చట్టపరమైన చర్యల గురించి ప్రస్తావిస్తూ మోసాలకు పాల్పడుతుంటారు. ఫోను చేసి డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారంటూ వాట్సప్ ద్వారా మొదట కాల్ చేస్తారు. ఒకవేళ మీరు పట్టించుకోకపోతే ఆధార్ నెంబరుతో పాటు తొలుత హిందీ, మరియు ఇంగ్లీషు భాషల ద్వారా వివరాలు తెలుపుతారు. బ్యాంకు ఖాతా వివరాలు కూడా వారు మనకు తెలియకోకుండానే చెప్పగలరు. లైవ్ ఫొటో, అకౌంటు ఓపెన్ చేసి తరువాత మన బ్యాంకు ద్వారానే వీరు లోను పెట్టుకుంటారు.

### విద్యావంతులు, చదువుకున్న వారే ఎక్కువ

డిజిటల్ అరెస్టు కానీ ఏ ఇతర సైబర్ మోసాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం ఉద్యోగస్తులు, విద్యావంతులే ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా, టెక్నికల్‌గా పరిజ్ఞానం ఉన్నా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు. చివరికి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కేవలం ఈ రెండు నెలల వ్యవధిలోనే జిల్లాలో దాదాపు రూ.7కోట్ల మేర డబ్బులు పోగొట్టుకున్నారు.

### మోసపోయిన వారి వివరాలు..

● ఇటీవల పులివెందులకు చెందిన ఓ రిటైర్డ్ లెక్చరర్‌ను డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు అతని వద్ద నుంచి దాదాపు రూ.1.8 కోట్లు స్వాహా చేశారు. ఈ అవమానం భరించలేక ఆయన ప్రాణాలు కోల్పోయాడు.

● డిజిటల్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ ఇంజనీరు రూ.3.2 కోట్లు డబ్బులు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించారు. అలాగే గత నెల కడపకు చెందిన ఓ మహిళా కాంట్రాక్టరు సైబర్ మోసగాళ్ల వలలో పడి రూ.1.5 కోట్లు పోగొట్టుకుని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

బాధితులకు ఓటీపీ నెంబరు వస్తే ఆ ఓటీపీని తెలుసుకుని తరువాత లోను పద్ధతి ద్వారా డబ్బులు కాజేస్తారు. ఇప్పుడు ప్రస్తుతం డిజిటల్ అరెస్టు స్కాం సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వినియోగిస్తూ వస్తున్నారు.

### డిజిటల్ అరెస్టులకు భయపడవద్దు..

**- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్,**

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు వాట్సప్ వీడియో కాల్‌చేస్తే ఎవరూ భయపడాల్సిన పనిలేదు. వారి మాటలకు భయపడి డబ్బులు వేయవద్దు. సీబీఐ, ఎన్‌ఫోర్స్ మెంటు లాంటి సెంట్రల్ ఉద్యోగుల పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియోకాల్స్ చేస్తారు. కానీ దేశంలో అధికారులు ఎవరు కూడా వీడియోకాల్స్‌తో మాట్లాడరు. కొంత మంది సైబర్ నేరగాళ్లు డ్రగ్స్‌కు సంబంధించి అధికారుల పేర్లతో వీడియోకాల్ చేసి రూ.10లక్షలు, 20 లక్షలు డిపాజిట్ చేస్తే పూర్తి స్థాయిలో విచారించి.. మీ ప్రమేయం లేకపోతే డబ్బులు తిరిగి ఇస్తామని చెబుతారు. కానీ వారి మాటలు నమ్మవద్దు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మాత్రమే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తుంటారు. ఎవరైనా అధికా రులమంటూ వీడియోకాల్స్ చేస్తే తక్షణమే 1980 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేస్తే ఆ సైబర్ నేరగాళ్లను పట్టుకునే అవకాశం ఉంటుంది.

# శనగల వ్యాపారస్తులు మోసం చేశారు...

● డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు

డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కమలాపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో కష్టపడి శనగ పంట పండించి అమ్ముకుంటే.. డబ్బులు ఇవ్వాల్సిన వ్యాపారస్తులు మోసం చేశారంటూ మండల పరిధిలోని కోగటం గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ వారు మంగళవారం డిప్యూటీ తహసీల్దారు జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోగటం గ్రామానికి చెందిన ఎకిన్ బాషా, సతీష్, జిలానీ అనే ముగ్గురు శనగల వ్యాపారం చేసేవారన్నారు. వాళ్లు తమ వద్ద ఎంతో నమ్మకంతో శనగలు కొనుగోలు చేశారన్నారు. మొదట్లో శనగలు వేసిన రైతులకు బాండ్లు ఇచ్చి డబ్బులు తరువాత ఇస్తామని చెప్పడంతో నమ్మి మోసపోయామన్నారు. తరువాత డబ్బులు ఇవ్వాలని అడగ్గా అదిగో ఇదిగో ఇస్తామంటూ కాలయాపన చేశారన్నారు. ఇలా నాలుగేళ్లు కాలం గడిపారని.. ఇప్పుడు డబ్బులు ఇవ్వాలని గట్టిగా నిలదీస్తే.. డబ్బులు ఇవ్వకపోతే దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. దాదాపు రూ.6 కోట్లు ఎగ్గొట్టారని... అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని.. లేకపోతే ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కోగటం గ్రామానికి చెందిన కొందరు నాయకులు వ్యాపారస్తుల ఆస్తులను రాయించుకున్నారని.. తమకు మాత్రం డబ్బులు ఇవ్వకుండా దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. స్థానిక నాయకులు ఈ విషయం బయటకు రాకుండా నాలుగేళ్లుగా తొక్కి పెట్టారని.. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# రిమ్స్‌లో అన్నదాన సేవ

రిమ్స్‌లో అన్నదానం

అన్నదానం నిర్వహిస్తున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప సెవెన్ రోడ్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుళ్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదాన సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి రిమ్స్‌కు వైద్యం కోసం వచ్చే వారితో పాటు వారి సహాయకులు ఆకలితో ఇబ్బం దులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో గత సంవత్సరం నవంబర్ నుంచి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి వారం సుమారు 1000 భోజన పొట్లాలు, మనిషికి రెండు వాటర్ ప్యాకెట్లు పంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భోజనం ప్యాకెట్ ప్యాకింగ్, అన్నదాన వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్నారని తెలిపారు.

## ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, జులై 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు ఈనెల 12, 13, తేదీలలో (శని, ఆది) నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సింగం భాస్కర్‌రెడ్డి, సెక్రెటరీ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. 12వ తేదీ కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో అండర్-15, అండర్-17, విభాగాలకు చెందిన బాల, బాలికల ఎంపికలు జరుగనున్నాయన్నారు. 13వ తేదీ ఆదివారం ప్రొద్దుటూరు పట్టణ జార్జి క్లబ్‌లో అండర్-11, అండర్-13 బాల, బాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్‌లో విడివిడిగా పోటీలు నిర్వహించి తదుపరి జిల్లా జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 10వ తేదీ సాయంత్రం లోగా 9440107080 అనే నెంబర్‌కు పంపించాలని కోరారు. కాగా డబుల్స్ విభాగంలో పాల్గొనే వారు తమ పార్ట్నర్ పేరు తప్పనిసరిగా జతచేసి పంపించాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరు కావాల్సి వుంటుందన్నారు. సింగిల్స్ విభాగంలో మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడాకారులు, అలాగే డబుల్స్ విభాగంలో ప్రథమ విజేతగా నిలిచిన జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారన్నారు.

# అత్యాచారం కేసులో జీవిత ఖైదు

తిప్పాబతిని క్రిష్ణయ్య ఆలియాస్ ఓబులయ్య

కడప క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైలవరం పీఎస్ పరిధిలో 2022 సంవత్సరంలో ఓ వివాహితపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1,01,000లు జరి మానా విధిస్తూ కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్ కుమార్ తీర్పునిచ్చారు. వివరాలిలా.. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన తిప్పాబతిని క్రిష్ణయ్య అలియాస్ ఓబులయ్య అదే గ్రామానికి చెందిన మానసికస్థితి సరిగా లేని ఓ వివా హిత ఇంట్లో ఒక్కటే ఉండగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విష యం ఆమె భర్తకు తెలపడంతో 11.01.2022 తేదీ మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి మైలవరం పీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.రామక్రిష్ణ కేసు నమోదు చేసి జమ్మలమడుగు రూర ల్ సీఐ కొండారెడ్డికి అప్పగించారు. ప్రస్తుతం సదరు కేసు కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి రమేశ్‌కుమార్ ముందుకు విచారణకు రాగా నిందితుడు నేరస్తుడిగా నిరూపణ కావడంతో జీవిత ఖైదు మరియు రూ.1,01,000లను జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా నేరస్తుడికి శిక్షపడేలా చేసిన రూరల్ సీఐ గోపాల్ రెడ్డి, ఎస్ఐ శ్యాంసుందర్, అధికారులు, సంబంధిత కోర్టు కానిస్టేబళ్లు, సిబ్బంది ని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించారు.

# 10 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం

● 73 పరుగుల స్వల్ప ఆధిక్యంలో నెల్లూరు జట్టు

సాయిచరణ్, రెహన్, వరుణ్‌సాయినాయుడు, ధీరజ్‌కుమార్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, జులై 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా రెండవ రోజైన మంగళవారం అనంతపురం జట్టు తన ప్రత్యర్థి జట్టు చిత్తూరుపై 10 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగుర వేసింది. అలాగే నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 73 పరుగుల ఆధిక్యత సాధించింది.

**ఏసీఏ క్రికెట్ మైదానంలో...:** అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంత పురం జట్టు మొద టి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవ ర్లలో 5 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఇందులో రెహన్ 108 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా వుండగా ఓవర్‌నైట్ స్కోర్ 179 పరుగులతో తిరిగి రెండవరోజైన మంగళ వారం బ్యాటింగ్‌కు దిగి మొత్తంగా 58.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రెహన్ 163 పరుగులు సాధించారు. దీంతో అనంతపురం జట్టుకు 71 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. కాగా బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ సాయిచరణ్ 6 వికెట్లు సాధించడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 34.5 ఓవర్లలో కేవలం 99 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో అనంతపురం బౌలర్ వరుణ్‌సాయినాయుడు 7 వికెట్లు సాధించి చిత్తూరు జట్టు పతనాని కి కారకుడయ్యారు. దీంతో 28 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి కేవలం 4.2 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 29 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది.

**కేఓఆర్ఎం మైదానంలో..:** నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 69.3 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 129 పరుగులతో రెండవ రోజైన మంగళవారం బ్యాటింగ్‌కు దిగి మొత్తం 67.3 ఓవర్లలో 303 పరుగు లకు ఆలౌట్ అయింది. ఇందులో ధీరజ్ కుమార్‌రెడ్డి 70 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 71 పరుగుల స్వల్ప ఆధిక్యత లభిం చింది. కాగా నెల్లూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమ యానికి 38 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 144 పరుగులు చేసింది. ఇందులో రోహిత్ 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

# అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

హసీన (ఫైల్ ఫొటో)

పులివెందుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతబజార్‌కు చెందిన హసీన (45) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... మంగళవారం ఉదయం 6గంటల ప్రాంతంలో వివేకానంద పాఠశాల సమీపంలో దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని చుట్టుపక్కల గాలింపు చేపట్టగా ఓ మహిళ మృతదేహం కనిపించింది. అప్పటికే ఆ మృతదేహం ఉబ్బిపోయి కుళ్లిపోయే స్థితిలో దుర్వాసన వస్తోంది. మృతురాలి వివరాల కోసం పోలీసులు ఆరా తీసి గుంత బజార్‌కు చెందిన హసీనాగా గుర్తించారు. ఈమెకు వివాహం కాలే దు. ఒంటరి మహిళగా జీవిస్తోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు.

# 30 రేషన్ బియ్యం బస్తాలు పట్టివేత

ప్రొద్దుటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని ఆచార్లకాలనీ వద్ద అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 30 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ ఎస్ఐ హనుమంత్ తెలిపారు. మల్లా వీరాంజనేయులు అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఒక్కో బస్తా 48 కేజీల వంతున 30 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్న వీరాంజనేయులతో పాటు గోపాల క్రిష్ణ, దినకర్ అనే వ్యక్తులను కూడా అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ డీటీ మల్లికార్జున, ఎఫ్ఐ మహేంద్రా రెడ్డిలకు పోలీసులు అప్పగించారు.

# పోలీసుల అదుపులో దొంగలు

లింగాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటర్లు, స్టార్లర్లు, బిందుసేద్యం పరికరాలు, పలు రకాల ట్రాక్టర్ పరికరాలను రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఘటనలు వరుసగా కొద్ది రోజుల నుంచి లింగాల మండలం బోనాల గ్రామంలో చోటుచేసుకుంటున్నాయి. అయితే సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు పొలాల్లోకి వెళ్లి స్టార్టర్‌ను దొంగలించి ఇంటికి వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి గ్రామంలో రోడ్డుపై కిందపడ్డారు. ఈ సంఘటనను గమనించిన కొందరు గ్రామస్థులు మంగళవారం లింగాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై లింగాల స్టేషన్ బాధ్యతలను చూస్తున్న పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీ వల్లిని వివరణ కోరగా దొంగలు అదుపులో ఉన్న విషయం నిజమేనని.. వారిని విచారణ చేస్తున్నామని తెలిపారు.

## కడప ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో
# అరుదైన శస్త్రచికిత్స

శస్త్రచికిత్స అనంతరం తొలగించిన కణతి

కడప సెవెన్ రోడ్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసు పత్రిలో మంగళవారం రామాంజనేయులు (37) అనే వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. పులివెందుల మండలం తుమ్మలపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులుకు కడప ప్రభుత్వ సూపర్‌స్పె షాలిటీ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేసి అతని కుడి వైపు అడ్రినల్ గ్రంథిలో సుమారు పది సెంటీ మీటర్ల పరిమాణంలో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. దీన్ని ఫియోక్రోమోసైటోమా వ్యాధిగా గుర్తించారు. ఈ వ్యాధి వలన అనియంత్రిత రక్తపోటు, తీవ్రమైన గుండెదడ, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి చాలా అరుదైనది. సగటు ప్రతి పది లక్షల మందిలో ఐదుగురిలో మాత్రమే కనిపిస్తుంది. ఎండోక్రైనాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో యూరా లజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫె సర్ డాక్టర్ శ్రీదీప్, అనస్థీషియా విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సునీ ల్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర సమన్వయంతో గత మంగ ళవారం శస్త్రచికిత్సను (ఓపెన్ అడ్రి నలెక్టమీ) విజయవంతంగా నిర్వహిం చారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని ఐసీయూలో పరిశీలనకు ఉంచి, ఆరో గ్యస్థితి మెరుగుపడడంతో ప్రస్తుతం సాధారణ వార్డుకు తరలించారు. త్వరలోనే రామాంజనేయులును డిశ్చార్జి చేస్తామని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు గండి క్షేత్రంలో టెండర్లు

చక్రాయపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న శ్రావణమాసోత్సవాల సందర్భంగా బుధవారం సీల్డ్ టెండర్లు, బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమి షనర్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, చలువపందిళ్లు, బారికేడ్ల ఏర్పాట్లు, ఫొటోలు, వీడియోల రికార్డింగ్, స్వాగత ఆర్చీలు, ప్రత్యేక భజంత్రీల ఏర్పాట్లకు సంబంధించి సీల్డ్ టెండర్లు, దేవస్థా ఆవరణలో తాత్కాలిక అంగళ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకు నేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అలంఖా న్‌పల్లె వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు అలంఖాన్‌పల్లెకు చెందిన ఓబయ్య (55) సొంత పని నిమిత్తం మాచుపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి రాత్రి బైపాస్ రోడ్డు ద్వారా ఇంటికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వైద్యశిక్షణ సమీపంలోకి రాగానే రోడ్డు డివైడరుకు స్కూటరు ఢీకొనడంతో కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఘనంగా డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుకలు

డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి కేక్‌ను తినిపిస్తున్న రితేష్‌రెడ్డి, విజయమ్మ, అభిమానులు

బద్వేలుటౌన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీసీసీబీ కార్యాలయంలో మంగళవారం డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఆత్మీయులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అభిమానులు, స్నేహితులు శాలువాలతో సత్కరించి కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ రందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అభిమానులు, ఆత్మీయులు అనాథ శరణాలయం, ఆసుపత్రుల్లో పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్లు అరవ శ్రీనివాసులరెడ్డి, పల్లె శ్రీనివాసు లరెడ్డి, పల్లె రమేష్‌రెడ్డి, పాటూరి రాధాక్రిష్ణారెడ్డి, మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, వెంగల్‌రెడ్డి, రాయచూరి ప్రసాద్, శివయ్యస్వామి, రెడ్డెయ్య, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఒకే సం.లో టెన్త్, ఇంటర్**
ఒకే సంవత్సరంలో టెన్త్, ఇంటర్ పాస్ (APOSS 100%) ఓపెన్ ఇంటర్‌తో పాటు రెగ్యులర్ ఇంటర్ M.P.H.W., M.L.T., C.S.E. కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. సెల్ : 62815 10785
Ajc-245153

**ముస్లీం వివాహ సంబంధాలు**
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. **స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో,** నంద్యాల జిల్లా. సెల్: **87908 44959** (2వ సంబంధాలు కలవు)
AJL-236636

**CHANGE OF NAME**
RAHAMTHU MEAH SHAIK (old name) S/o. SHAIK JAFFAR SAB, R/o. D.NO.8/34, SAVAIPURA STREET, KADAPA, Y.S.R KADAPA DIST., A.P., INDIA-516001. Do hereby change my name to SHAIK RAMTHU MIYA (New Name), Hence forth then now I may be called as SHAIK RAMTHU MIYA.
AJC-245160

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్,షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: **7382114647.**
AJA- 237881

**ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి**

**యూనిట్ కార్యాలయం**
**9985411183**
**9985411189**

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

## తాగునీటి వ్యాపారం చేస్తే ఊరుకోం

అక్రమంగా బోరు వేసిన నీళ్ల వ్యాపారం చేస్తున్న వారిని అడ్డుకుంటున్న మహిళలు

రాయచోటి (కలెక్టరేట్), జూలై1(ఆంధ్రజ్యోతి): తాగునీటి వ్యాపారం చేస్తే ఊరుకునేది లేదని స్థానిక నరసింగనగర్ వాసులు హెచ్చరించారు. అక్రమంగా బోరు వేసి నీళ్ల అమ్ముకుంటున్న వారిని మంగళవారం అడ్డుకున్నారు. వివరాలు ఇవీ... రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులో గంగమ్మ గుడి వద్ద కొన్ని సంవత్సరాలుగా మంచినీళ్ల బోరు ఉండేది. ఆ బోరు నుంచి దాదాపు కొన్ని వందల కుటుంబాలకు నీటి సరఫరా అయ్యేది. అయితే ఇప్పుడు గంగమ్మ గుడి దగ్గర ఉన్న బోరుకు అతి దగ్గరగా వేరే వాళ్లు మరొక బోరు వేశారు. నీటిని ట్యాంకులకు పట్టి అమ్ముకుంటున్నారు. దీంతో గంగమ్మ గుడి దగ్గర ఉన్న బోరు ఎండిపోయింది. నరసింగనగర్‌లో ఉన్న ప్రజలందరికీ నీటి కొరత ఏర్పడింది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని నరసింగనగర్ వాసులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బోరు వేసి నీటిని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు పుస్తకాలు పంపిణీ

సిద్దవటం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలను పంపిణీ చేశామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య పేర్కొన్నారు. భాకరాపేట సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు మండలంలోని బంగారుపేట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ పీపీ-1, పీపీ-2 పుస్తకాలతో పాటు ఆదర్శాల, నవచేతన పుస్తకాలను పంపిణీ చేశామన్నారు.

## ప్రజాసంక్షేమమే కూటమి లక్ష్యం : ముక్కా

రాఘవరాజపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ముక్కా

రైల్వేకోడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కుడా చైర్మన్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం గ్రామంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. మహానాడులో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు.మినీ మహానాడులో తీర్మాణం చేసిన హామీలను నెరవేర్చేందుకు ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు. రైల్వేకోడూరు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నూతన అధ్యక్షుడికి అభినందన

పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికైన మాధవ్‌ను మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**రైల్వేకోడూరు:** విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రమాణస్వీకారానికి రైల్వేకోడూరు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. పులపుత్తూరి రామసుబ్బారెడ్డి, తోట శ్రీనివాసులు, సాయం శ్రీధర్, గడ్డం చంగల్‌రాజు, ముక్కా రూపేష్‌రెడ్డి, వాకచర్ల సుబ్బారావు, చంద్రశేఖర్, రెడ్డికృష్ణరాయల్, మనోహర్‌రెడ్డి పార్టీ కొత్త సారథిని ఘనంగా సన్మానించారు.

**రాయచోటిటౌన్:** మాధవ్ ప్రమాణస్వీకార మహోత్సవానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు హాజరై సత్కరించారు. మాధవ్ సారథ్యంలో రాష్ట్రంలో బీజేపీ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు కొత్తమాధవరంలో 'తొలి అడుగు'

ఒంటిమిట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండంలోని కొత్త మాధవరం, కొండమాచుపల్లె గ్రామాల్లో బుధవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌వి రమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం మండల మాజీ ఉపాధ్యక్షుడు నామాల వెంకటయ్య అల్పాహారం ఏర్పాటు చేశారన్నారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె, జూలై1(ఆంధ్రజ్యోతి): పంటలకు ధరలు లేక నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గున్నికుంట్ల గ్రామంలో సర్పంచ్ దండు నాగభూషణ్ రెడ్డి, రైతు క్రిష్టారెడ్డిలకు చెందిన మామిడి తోటలను సందర్శించారు. మామిడి రైతులకు ఎకరాకు రూ.20 వేలు పరిహారం చెల్లించాలన్నారు. వేరుశనగ, వరి టమోటా, కర్బూజ, దోస తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు.

# విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడు..?

● గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందేనా ? ● కూటమి ప్రభుత్వంపై గ్రామీణ ప్రజల ఆశలు

పూర్తయినా అందుబాటులోకి రాని రెడ్డివారిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్... సచివాలయంలో నిల్వ ఉంచిన మందులు

రైల్వేకోడూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడానికి గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. కొన్ని చోట్ల నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. నిధులు, సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి, భూసేకరణలో జాప్యం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ఈ క్లినిక్ నిర్మాణం ఆలస్యమవుతోంది. దీనివల్ల గ్రామీణ ప్రజలు సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారు. చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా కోడూరు, శెట్టిగుంట, అనంతరాజుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇది గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఆర్థికంగా, శారీరకంగా భారంగా మారుతోంది. ప్రభుత్వం ఈ క్లినిక్‌ల నిర్మాణం పూర్తి చేసి అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలను కల్పించాలి. అంతేకాకుండా నిర్మాణంలో జరుగుతున్న జాప్యానికి గల కారణాలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రాథమిక ఆరోగ్య సేవలు గ్రామీణ ప్రాంతాలకు చేరువవుతాయి. కోడూరు మండలంలో 21 హెల్త్ క్లినిక్‌లకు గత ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇందులో 19 పంచాయతీలకు శంకుస్థాపన చేశారు. కోడూరు-2, శెట్టిగుంట-2 పంచాయతీలకు అనువైన స్థలం లేకపోవడంతో భవనం మంజూరు కాలేదు. స్థల సేకరణ కారణంగా ఈ క్లినిక్‌ల నిర్మాణం ఆలస్యమవుతోంది. కోడూరు-1, ఓబనపల్లి-2, వెంకటరెడ్డిపల్లి, మైసూరివారిపల్లి పంచాయతీల పనులు ఇంకా మొదలుపెట్టలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నిధుల కొరత వంటి కారణాల వల్ల ఈ క్లినిక్‌ల నిర్మాణం జరగలేదు. బొజ్జవారిపల్లి, మాధవరంపోడు, ఓబనపల్లి-1, ఉర్లగడ్డపోడు, చియ్యవరం, గంగరాజుపోడు పంచాయతీల క్లినిక్‌లు ప్రారంభం అయినప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. కోడూరు- 3,4,5, వీవీఆర్ కండ్రిక, రెడ్డివారిపల్లి, శెట్టిగుంట-1, బుడుగుంటపల్లి, అనంతరాజుపేట-1 పంచాయతీల్లో క్లినిక్‌లు పూర్తయినప్పటికీ ఇంకా వైద్య అధికారులకు అప్పగించలేదు. కేవలం మండలంలో ఒకే ఒక పంచాయతీ అయిన అనంతరాజుపేట-2 మాత్రమే అధికారులకు అప్పగించారు.

**భవనాల వద్ద పిచ్చిమొక్కలు దర్శనం**

పూర్తి అయిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల వద్ద పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తున్నాయి. రాత్రి వేళల్లో పూర్తి అయిన క్లినిక్ భవనాల వద్ద మందు బాబులు హల్చల్ చేస్తున్నారు. పూర్తి అయిన భవనాలను వెంటనే వైద్య అధికారులకు అప్పగించాలి. పూర్తి కాకపోవడంతో వైద్య సిబ్బంది తమ సేవలను గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అసంపూర్తిగా ఉన్న విలేజ్ క్లినిక్‌లను పూర్తి చేసి వైద్య సిబ్బందిని నియమించి మందుల కొరత లేకుండా చూస్తే గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

## ఆపత్కాలంలో అపర బ్రహ్మలు వైద్యులు

వీరబల్లి, జూలై1(ఆంధ్రజ్యోతి):ఆపత్కాలంలో అపర బ్రహ్మలు వైద్యులు అని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మనీషాను వీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల కృషి వెలకట్టలేదన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు.

**రైల్వేకోడూరు:**పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు బ్రహ్మకుమారి, సాయి తదితరులను వైసీపీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మందల నాగేంద్ర, కోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య ఘనంగా సత్కరించారు.

**నందలూరు:** వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యుడు శరత్‌కమల్‌ను సత్కరించి అనంతరం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టీడీపీ నాయకులు కానకుర్తి వెంకటయ్య, షేక్ మౌలా, మట్టి బాబు, పఠాన్ మెహర్‌కాంత్, చుక్కా కొండయ్య, శివనరసింహులు, వైద్య సిబ్బంది శైలజా, సునీల్, పద్మావతి పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందజేత

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆటోడ్రైవర్లకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలకు నంబర్లను కేటాయించామన్నారు. ఆటో డ్రైవర్లు తమకు కేటాయించిన గుర్తింపు కార్డులను తప్పక ధరించాలని, యూనిఫాం వేసుకోవాలని, లేనిపక్షంలో జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరాయుడు, హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

## భూ సమస్యలు తక్షణమే పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లె, జూలై1(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్ మోహన్ మంగళవారం తహసీల్దార్ క్రాంత్‌కుమార్‌ను కోరారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి భూ సమస్యలు తీసుకెళ్లగా వాటిని గత తహసీల్దార్‌కు అప్పగించారని, తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్తరేషన్ కార్డులు అందించాలని, 60 ఏళ్లపైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామరాజు, ముక్తార్ అహ్మద్, కావలి ఆంజనేయులు, సయ్యద్ వసూద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

సంబేపల్లె, జూలై1(ఆంధ్రజ్యోతి): నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం కొండావాండ్లపల్లెలో తిమ్మసాని శ్రీనివాసులరెడ్డి అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి కూటమి ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రైతు కుటుంబం సభ్యులను ఆయన పరామర్శించారు.

## మున్సిపల్ కార్మికుల నిరసన

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కో రుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై 16 రోజుల పాటు నిరసన తెలిపామని, అందుకు సమ్మెకాలపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు.

## ఎస్‌బీఐ ద్వారా పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ పంపిణీ

పెనగలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇనుగోలు ధనమ్మ కుటుంబ సభ్యులకు మంగళవారం బెస్తపల్లెలోని ఎస్‌బీఐ ఓబిలిశాఖ బ్రాంచ్ ద్వారా రూ.2 లక్షలు పీఎంజేజేబీవై చెక్కును పంపిణీ చేసినట్లు పెనగలూరు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు నంబూరు లక్ష్మయ్య, హరిబాబు తెలిపారు. ధనమ్మ తన ఖాతా నంబరుకు యేడాదికి రూ.436 చొప్పున పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ చెల్లిస్తూ వచ్చిందన్నారు. ఇటీవల ఆమె మరణించడంతో ఆమె బిడ్డలు మైనర్‌లు కావడంతో ఆమె తండ్రి సుబ్బరాయుడికి చెక్కును అందజేశారన్నారు.

## పరిశ్రమలను పునఃప్రారంభించాలి

రైల్వేకోడూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మూతపడ్డ పరిశ్రమలను పునఃప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ రైల్వేకోడూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రూ.10,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెనగలూరు మండల కార్యదర్శి గానిగిపెంట ఆదినారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల రాధాక్రిష్ణ, బీకేఎం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, ఓబులవారిపల్లె మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, పెగనలూరు మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్పీ అశోక్‌కుమార్‌ను మంగళవారం మండల టీడీపీ నాయకులు కలిశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, టీడీపీ మండల నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

## దళితులకు భూములు పంపిణీ చేయాలి

రైల్వేకోడూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): నిరుపేద దళితులకు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రెవెన్యూ శాఖ కార్యాలయంలో తహసీల్దార్ అమర్‌నాథ్‌కు వినతిపత్రాలు అందజేశారు.

## నేటి నుంచి కొండయ్య పీరు మహోత్సవం

లక్కిరెడ్డిపల్లె, జూలై1(ఆంధ్రజ్యోతి): మొహరం పండుగను పురస్కరించుకొని నేటి నుంచి కొండయ్యస్వామి పీరు ఉత్సవం ప్రారంభం కానుంది. కస్తూరిరాజుగారిపల్లె గ్రామంలో ఎలంకూరి దేవదాసు కుటుంబం నుంచి కొండయ్యస్వామి పీరును మంగళవారం చీరె, సారె పూలభాష్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దక వెంకట్రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి సోదరులు, దర్బార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్లస్ టు పాఠశాలల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): ప్లస్ టు పాఠశాలల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయడంతో పాటు గతంలో అక్కడ పనిచేసిన ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇవ్వాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. మంగళవారం ఆయన విజయవాడలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు.అనంతరం మాట్లాడుతూ చాలా జిల్లాలో సబ్జెక్టులకు పదోన్నతుల కోసం 1.5 నిష్పత్తిలో సినియారిటీ జాబితా ప్రకటించినప్పటికీ పదోన్నతి కోసం చాలా మంది అభ్యర్థులు సుముఖంగా లేకపోవడంతో ఖాళీలు భర్తీ కాలేదన్నారు. మొదటి లిస్టు కాకుండా రెండవ లిస్టులో ఉన్న ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచి పదోన్నతులను భర్తీ చేయాలని కోరారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ రిలీవర్‌తో సంబంధం లేకుండా రిలీవ్ చేయాలని కోరారు. కడప జిల్లాలో 700 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నట్లు ప్రాథమిక సమచారం ఉందన్నారు. అయితే డీఎస్సీ ద్వారా కేవలం 217 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న కారణంగా సుమారు 500 ఖాళీలు ఒక జిల్లలోనే ఏర్పడే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలను ఉపాధ్యాయ నిమాయక పరీక్ష ద్వారా భర్తీ చేయాలన్నారు.

## 'టీఎన్‌టీయూసీ' నూతన అసోసియేషన్ ఏర్పాటు

నూతన కమిటీని ఎన్నుకుంటున్న జోనల్ స్థాయి నేతలు

రాయచోటిటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి):టీఎన్‌టీయూసీ కార్మిక పరిషత్ రాయచోటి డిపో నూతన అసోసియేషన్ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ జోనల్ సెక్రటరీ ఎం.పురుషోత్తం, జోనల్ గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, కడప డిపో గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు యాదవ్ సమక్షంలో నూతన కమిటీ 150 మంది కార్మికులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయచోటి డిపో అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, డిపో కార్యదర్శిగా ఎస్‌వై బాషా, చైర్మన్‌గా ఏఏ జలీల్, ట్రెజరర్‌గా టీవీ సంగమయ్య, అడిషనల్ డిపో కార్యదర్శిగా కే. నాగరాజా, చీఫ్ అడ్వైజర్‌గా రాజారావు, కన్వీనర్‌గా ఎస్ఎస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాసిర్ అహమ్మద్, ఎం.బాలనరసింహులు, పబ్లిసిటీ సెక్రటరీగా బీ. సునీల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎంకే వల్లి ఇంకా 20 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కమిషనర్

పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):రాజంపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని పట్టణంలోని సాయినగర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో కాలువలోని పూడికతీతను వెలికి తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం నీరు కాలువలో సాఫీగా పోయేందుకు చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నామన్నారు. అలాగే ప్రజలు కూడా బాధ్యతగా చెత్తను రోడ్లపై, కాలువలో వేయకుండా మున్సిపల్ కార్మికులకు అందించాలన్నారు. లేకుంటే వీధి చివరలో ఉన్న చెత్తకుండీలో వేయాలన్నారు.

## 'జన సురక్ష'తో పలు ప్రయోజనాలు

మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

లక్కిరెడ్డిపల్లె, జూలై1(ఆంధ్రజ్యోతి): జనసురక్ష వల్ల పలు ప్రయోజనాలు పొందవచ్చునని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో జన సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన సురక్ష పథకం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, మొబైల్ ఫోన్‌లో వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. బిట్స్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ బడ్జెట్ ప్లానింగ్, నామిని, డిజిటల్ ట్రాన్సాక్షన్‌పై వివరించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, డిజిటల్ ట్రాన్సాక్షన్ కౌన్సిలర్ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాక్సిన్ శిబిరం విజయవంతం

మాట్లాడుతున్న గుణశేఖర్‌పిళ్లై

చిన్నమండెం, జూలై1(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలో థైలేరియోసిస్ వ్యాధి నివారణకు సంబంధించి మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరం విజయవంతమైంది. ముఖ్య అతిథిగా జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై, ఉపసంచాలకుడు మాలకొండయ్య, శ్రీధర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ థైలేరియోసిస్ వల్ల పశువులకు జ్వరాలు, నలత, రక్తహీనత ఏర్పడే ప్రమాదం ఉంది. వ్యాక్సినేషన్ ద్వారానే దీన్ని పూర్తిగా నియంత్రించవచ్చునన్నారు. రాయచోటి డీఏహెచ్‌వో, డీడీ, ఏడీ, వీఏఎస్, వీరబల్లి డాక్టర్ గణేశ్, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

## అధునాతన పద్ధతులను అమలు చేయాలి

రామాపురం: నీలకంఠ్రావుపేటలో రైతులతో మాట్లాడుతున్న శివనారాయణ

రామాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అధునాతన పద్ధతులను అమలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సిబ్బందికి సూచించారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో మండల వ్యవసాయాధికారి నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రసుత్త ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న వేరుశనగ, కంది పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 25 రకాల పంటలు సాగు చేసి 365 రోజులూ భూమి పచ్చదనంతో ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, ఎంఏవోపై నాగమణి, నీలకంఠ్రావుపేట రైతులు పాల్గొన్నారు.

**డ్రోన్లతో మందుల పిచికారీ**

రైల్వేకోడూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): కూలీల ఖర్చు లేకుండా డ్రోన్లతో మందులను పిచికారీ చేసుకోవచ్చని రైల్వేకోడూరు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటరెడ్డిపల్లె పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు డ్రోన్లపై అవగాహన కల్పించారు.

**సేంద్రియ సేద్యం ఎంతో ప్రయోజనం**

గాలివీడు, జూలై1(ఆంధ్రజ్యోతి): సేంద్రియ మార్గం రాబోయే భవిష్యత్ వివిధ రకాల సాగుకు మార్గదర్శకమని జిల్లా డీపీఎం వెంకటమోహన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీలో సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేసిన పంటలను పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O.: 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M.: 99854 11184

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 2 జూలై 2025

## ఎంబీఏ అయితే హాస్టల్‌లో చేరాల్సిందే..

రాజధాని అమరావతి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి అక్కడ ఉన్న ఓ ప్రతిష్ఠాత్మక సంస్థలో ఎంబీఏలో చేరాడు. తొలి ఏడాదికి కోర్సు ఫీజు రూ.3.84 లక్షలకు సమ్మతిస్తూ ఆ విద్యార్థి రూ.10 వేలు అడ్మిషన్ ఫీజు చెల్లించాడు. ఇల్లు దగ్గరే కాబట్టి రోజూ కళాశాలకు వెళ్లి రావచ్చనుకున్నాడు. అయితే హాస్టల్‌లో చేరాలని, అందుకు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాను హాస్టల్‌లో చేరడమేమిటని ఆ విద్యార్థి వాపోతున్నాడు. డే స్కాలర్‌గా చదువుకుంటానని వేడుకున్నా వారు ఒప్పుకోలేదు. స్థానిక పెద్దలు ప్రశ్నించగా నిబంధనలు వర్తించవని యాజమాన్యం చెప్తోంది.

# హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

## రాజధాని విద్యార్థులపై.. ఫీజుల మోత

- స్థానికులైనా హాస్టల్‌లో ఉండాలని మెలిక
- డే స్కాలర్ ప్రవేశాలకు అంగీకరించని ఓ విద్యా సంస్థ
- తమ భూముల్లో సంస్థను నడుపుతూ ఇదేమిటని రైతుల ఆగ్రహం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇది రాజధాని అమరావతి పరిధిలోని ఈ ఒక్క విద్యార్థి పరిస్థితే కాదు.. అందరిదీ. తమ సమీపంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.. దూరాభారం తగ్గుతుంది. పిల్లలు ఇళ్ల నుంచి వెళ్లి చదువుకుంటారు అని భావించిన తల్లి దండ్రుల ఆశలు నిరాశగా మారాయి. అడ్మిషన్ల నుంచి ఫీజుల రాయితీ వరకు అన్యాయం జరుగుతుందోని పలువురు వాపోతున్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతులు ఇచ్చిన భూమిలో 100 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వం కారు చౌకగా ఆ విద్యా సంస్థకు ఇచ్చింది. విద్యా సంస్థ రావడం ద్వారా రాజధానిలోని విద్యా ర్థులకు, చుట్టుపక్కల జిల్లాల వారికి విద్యావకాశాలు పెరుగుతాయని భావించింది. అయితే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం మాటేమోగానీ ఇప్పుడు ఆ సంస్థ విద్యార్థుల నుంచి భారీగా ఆదాయాన్ని కోరుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. విద్యా సంస్థకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా హాస్టల్లోనే చేరాలని డిమాండ్ చేస్తోంది.గత ప్రభుత్వ హయాంలో కూడా ఫీజు రాయితీల విషయంలో సదరు విద్యా సంస్థ కఠినంగానే వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న ఒకరు రాజధానిలోని కొందరు విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వమని కోరగా, దాన్ని కూడా బుట్టదాఖలు చేసినట్లు రైతులు చెబు తున్నారు.

### పీ- 4 స్ఫూర్తికి దెబ్బ

ఇటీవల రాజధానిలోని ఓ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమానికి (మిగతా 8వ పేజీలో)

## హామీలెన్నో.. అమల్లో కొన్ని

- బాపట్లలో అదనపు సమ్మర్ స్టోరేజిట్యాంక్ నిర్మాణం ఏడాదిగా స్పష్టత లేదు. 2016లో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించినా మెయిన్ పైపులైన్ ఏర్పాటు చేయలేదు. చందోలు నుంచి పొన్నూరు వెళ్లే రోడ్డును పునర్ నిర్మిస్తామని ధ్వంసం చేసి వదిలేశారు. సూర్యలంక అభివృద్ధి పనులు కార్యరూపం దాల్చలేదు.

- చీరాలలో హ్యాండ్‌లూమ్ పార్కు నిర్మా ణం, ఎత్తిపోతల మరమ్మతులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నివేశన స్థలాలు, గృహాల మంజూరు కల్పన జరగాల్సి ఉంది.

- అద్దంకిలో అగ్రహారం భూముల సమస్యకు పరిష్కారం విషయంలో ఈ ప్రభుత్వంలోనూ రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ముంపు గ్రామాల సమస్య పరిష్కారం కొలిక్కిరాలేదు. కొరిశపాడు, భవనాసి రిజర్వాయర్ల పనులు కూడా అడుగు ముందుకు పడలేదు. నామ్ రోడ్డు బాధిత రైతులకు పరిహారం చెల్లింపులో తాత్సారం జరుగుతోంది.

- రేపల్లె పట్టణంలో వంద పడకల వైద్యశాలగా అభివృద్ధి హామీ అమలు కాలేదు. అరవపల్లి -లంకేవానిదిబ్బ, మోర్తోట -గంగడిపాలెం రహదారుల నిర్మాణం జరగలేదు. నిలిచిపోయిన టిడ్కో గృహాల నిర్మాణ పనులు చేపట్టలేదు. నిజాంపట్నం హార్బర్‌ను మరింత అభివృద్ధి ప్రతిపాదనల దశలో ఉంది.

- వేమూరు నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారుల దుస్థితిపై దృష్టి పెట్టలేదు. కొల్లూరు మండలం తాడిగిరిపాడులోని ఎత్తి పోతల పథకం పూర్తి కాలేదు. భట్టిప్రోలు మండలం ఓలే రు వద్ద చెక్‌డాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

- పర్చూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు. వాడరేవు - పిడుగురాళ్ల హైవే నిర్మాణ పనులు సాగుతున్నాయి. తీవ్ర ఆందోళనలో ఉన్న బర్లీ రైతులకు ఉపశమనం కలిగిస్తూ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టారు.

పెదపూడి-కూచిపూడి-అమృతలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి

చేసిన మంచిని వివరిస్తూ.. రాబోయే నాలుగేళ్లలో చేసే అభివృద్ధిని.. పనులను వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు పాలకులు ప్రజలను నేరుగా కలిసేందుకు సిద్ధమయ్యారు. కూటమి పాలనకు ఏడాది గడిచింది. గత వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలు తేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో గత వైసీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రజా పాలనకు తేడాలను వివరించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి బుధవారం నుంచి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేం దుకు నెల రోజుల కార్యక్రమం నిర్వహించేలా నేతలు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో నేతలతో పాటు కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజెప్పడంతో పాటు ప్రజల నుంచి సలహాలు స్వీకరించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 'చేసిన మంచి పనులు చెప్పుకోవాలి.. ఏ నాయకుడైనా ప్రజల్లోకి వెళ్లడానికి నామోషీపడకూడదు' అని చంద్రబాబు స్పష్టం చేయగా నేతలందరూ ప్రజలను ప్రత్యేకంగా కలిసేందుకు సమాయత్తమయ్యారు.

# ప్రజల చెంతకు.. పాలకులు

## నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు

- ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి
- ఇంటింటికీ టీడీపీ పేరిట కార్యక్రమాలకు శ్రీకారం
- ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలూ భాగస్వామ్యం
- చేసిన మంచి వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు జనంలోకి

బాపట్ల : ఉప్పరపాలెంలో నిర్మించి నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'సుపరిపాలనకు తొలి అడుగు' అంటూ ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రజలతో మమేకమవ్వడంతోపాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లేలా టీడీపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందించింది. ఈ ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గాల్లో చేపట్టబోయే పనులను ప్రజలకు వివరించి వారి స్పందన తెలుసుకోవడమే లక్ష్యంగా బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. చేసిన మంచి పనులను ప్రజలకు జెప్పాలని.. అదే సమయంలో (మిగతా 8వ పేజీలో)

## ఇసుక అక్రమ మైనింగ్‌పై.. ప్రభుత్వం చర్యలు

- వైసీపీ హయాంలో ఇసుక ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు సిద్ధం
- ఏపీ ఎస్‌పీసీ నివేదిక ఆధారంగా డీఎల్ఎస్‌సీ నిర్ణయం
- వివరణ ఆధారంగా తదుపరి చర్యలు

8

## ఏఎన్ఎంల కౌన్సెలింగ్ వివాదాస్పదం

- ఆన్‌లైన్ పేరుతో అన్యాయం అంటూ ఆరోపణలు
- మామూళ్లు ఇస్తే.. కోరుకున్న చోటు పదిలం?

## భూ ఆక్రమణలపై విచారణ

- కబ్జాకు గురైన భూ రికార్డుల పరిశీలన
- సమగ్ర విచారణ జరపాలి: చీఫ్ విప్ జీవీ

## మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

## ఇంజక్షన్ వికటించి బాలిక మృతి?

6

## గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

# చేతి కంది ధరలేక..!

- కంది రైతు కంట నీరు
- కొనుగోళ్లు నిలిపివేసిన మార్క్‌ఫెడ్
- మార్కెట్‌లో పతనమైన ధర
- అమ్ముకోలేక అన్నదాతల అగచాట్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పండించిన కంది పంటను అమ్ముకోలేక అన్నదాతలు అల్లాడుతున్నారు. వేలాది క్వింటాళ్ల నిల్వలు లోగిళ్లలోనే ఉండిపోయాయి. ప్రభుత్వం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేసింది. మార్కెట్‌లో ధర పతనమైంది. దీంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ కూడా చేతులెత్తేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. కంది కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### మార్కెట్‌లో ధర లేదు..

మార్కెట్‌లో కంది ధర పడిపోయింది. క్వింటా కందులు రూ 6,500 లోపే ఉందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించే పరిస్థితి (మిగతా 8వ పేజీలో)

# ఇంజనీరింగ్ సీట్లు 30,240

- ఉమ్మడి జిల్లా జాబితా విడుదల
- సెట్ అర్హత సాధించిన విద్యార్థులు 23,536
- అదనపు సీట్లు 6,700
- కౌన్సెలింగ్ ఆలస్యమైతే కళాశాలలకు నష్టం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ సీట్ల జాబితాను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. రెండు యూనివర్శిటీలు, 36 ఇంజనీరింగ్ కళాశాలల్లో 30,240 సీట్లు ఈ ఏడాది అందుబాటులోకి(ఇన్‌టెక్) రానున్నాయి. ఈ ఏడాది మేలో జరిగిన ఏపీ ఈఏపీ సెట్(ఎంసెట్) పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత నెల 8న విడుదలైన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 23,536 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తాజాగా సాంకేతి విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో సీట్లు 32,240 ఉన్నాయి. అంటే దాదాపు 6,700 సీట్లు అదనంగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

### కౌన్సెలింగ్ జాప్యం అయితే ఇబ్బందులే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ జాప్యం వల్ల భారీ స్థాయిలో సీట్లు (మిగతా 8వ పేజీలో)

## వారాహిదేవిగా శ్రీబగళాముఖి

పిట్టలవానిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారు శ్రీమత్స్య వారాహిదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని పసుపుకొమ్ములు, గజమాల, నాగవల్లి, పుష్పమాలలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీమత్స్య వారాహిదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు

## ఔషధాల అక్రమ నిల్వ కేసులో జైలు శిక్ష

నరసరావుపేట లీగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఔషధాలు నిల్వ చేసి, రికార్డులు నిర్వహించకుండా.. రసీదులు ఇవ్వకుండానే నేరం రుజువు కావడంతో.. పట్టణంలోని షడ్డి వెంకట మహేష్ కుమార్‌కు సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.55 వేల జరిమానా విధిస్తూ దిగువ కోర్టు విధించిన శిక్షను స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మంగళవారం యథావిధిగా ఖరారు చేసింది. నిందితుడు అక్రమంగా ఔషధాల నిల్వ ఉంచుకుంటూ.. 2016లో అప్పటి నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో 2020 జనవరి 21న నర్సరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శిక్ష ఖరారు చేస్తూ.. తీర్పునిచ్చారు. నిందితుడు తీర్పుపై జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు. అదనపు న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథావిధిగా కొనసాగించింది.

## ఇంజక్షన్ వికటించి బాలిక మృతి?

నరసరావుపేట లీగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద చెరువుకు చెందిన బేబీ ఆయేషా(5) అనే చిన్నారి ఓ ఆర్ఎంపీ ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత మృతి చెందడం ఆందోళనకు దారితీసింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. పెద్ద చెరువులోని ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నివసించే అఫ్వాద్ కుమార్తె ఆయేషా జ్వరంతో బాధపడుతోంది. పాపకు వాంతులు అవుతున్నాయని తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న పాస్టు ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకెళ్లారు. ఆర్ఎంపీ ఓ ఇంజక్షన్ ఇచ్చాడు. ఇంటికి వెళ్లిన తర్వాత పాప కడుపు నొప్పి వస్తుందని చెప్పడంతో.. గుంటూరు రోడ్డులోని ఓ చిన్న పిల్లల వైద్యశాలకు తీసుకెళ్లారు. పాప పరిస్థితి విషమంగా ఉందని లైఫ్‌లైన్ వైద్యశాలకు తీసుకెళ్లమని వైద్యులు రిఫర్ చేశారు. ఆ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే పాప చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పాప బంధువులు మృతదేహాన్ని పీఎంపీ వైద్యశాల వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి వచ్చి బందోబస్తు నిర్వహించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## 45,067 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,085 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,067 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,953 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | ఆర్మూరు | 9700 | 11000 |
| 334 | 9500 | 13000 | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| నెంబరు. 5 | 10000 | 13200 | 334 | 9500 | 12800 |
| 273 | 10000 | 12500 | నెంబరు. 5 | 10000 | 13300 |
| 341 | 10000 | 13500 | 341 | 10000 | 13300 |
| సూపర్ 10 | 9700 | 12400 | 4884 | 10000 | 12400 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | సూపర్ 10 | 9800 | 12800 |
| తేజ | 10000 | 13700 | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| షార్క్-1 | --- | --- | తేజ | 10000 | 13500 |
| బ్యాడిగి | 10000 | 12800 | బ్యాడిగి | 10000 | 12800 |
| సింజెంటా బ్యాడిగి | --- | --- | దేవనూరు డీలక్స్ | --- | --- |
| దేవనూరు డీలక్స్ | --- | --- | తాలుకాయలు | 4500 | 7000 |

# హామీలన్నీ నెరవేరుస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ● సిమెంట్ ఫ్యాక్టరీల బాధితులకు నష్టపరిహారం పంపిణీ

దాచేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్క హామీని నెరవేర్చుకుంటూ వస్తోందని, మరో నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, త్వరలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో మంగళవారం సెట్టినాడు, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీల వల్ల పంట నష్టం, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు నష్టపరిహారం, భూములు కోల్పోయిన రైతు కుటుంబాల వ్యక్తులకు ఉద్యోగ నియామక పత్రాలను ఎంపీ అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ లావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బాధితులకు ఉద్యోగ నియామక పత్రాలు, నగదు చెక్కులను పంపిణీ చేశారు. దీని కోసం 20 ఏళ్లగా ఎదురు చూస్తున్న బాధిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సభలో ఎంపీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. తాగునీటి హామీలో భాగంగా.. గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు నాగార్జున సాగర్ నుంచి నీరు అందించేందుకు రూ.1,200 కోట్లతో టెండర్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. గత 40 ఏళ్లుగా గురజాల నియోజక వర్గ ప్రజలతో తాను మమేకమై ఉన్నానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. తనకు ఓట్లు వేసినా.. వేయక పోయినా ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా 50 మందికి ఉద్యోగ నియామకాలు చేశామని తెలిపారు. ఫ్యాక్టరీల దుమ్మూ ధూళితో పంట నష్ట పోయిన రైతులకు, బ్లాస్టింగ్‌తో నివాస గృహాలు దెబ్బతిన్న 317 మంది బాధితులకు రూ.1,22,62,850 నష్ట పరిహారంగా చెల్లించినట్లు వెల్లడించారు. నష్ట పరిహారం పొందిన వారిలో 60 శాతం టీడీపీ వారేనని పేర్కొన్నారు. ఇంకా మరికొంత మందికి ఇప్పించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బాధితులకు నమూనా నగదు చెక్కు అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్‌బాబు

### మౌలిక వసతులు కల్పిస్తాం

సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములు ఇచ్చిన పెదగార్లపాడు, తక్కెళ్ళపాడు, తంగెడ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చిందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఇప్పటికే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నష్ట పరిహారం ఇప్పించామని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా ఇప్పించే అవకాశం కల్పిస్తామన్నారు.

## పిన్నెల్లి సోదరులకు హైకోర్టులో తాత్కాలిక ఊరట

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. గత మే నెల 24వ తేదీన వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల జంట హత్య కేసులో ఏ6, ఏ7గా పిన్నెల్లి సోదరులు ఉన్నారు. తమకు ముందస్తు బెయిల్ కావాలని మంగళవారం హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానంలో వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై వారం రోజులపాటు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

## తురకా కిశోర్‌కు 14 రోజులు రిమాండ్

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌కు 14 రోజులు రిమాండ్ విధించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో 2019లో టీడీపీ కార్యకర్త పాశం అమరయ్యపై దాడి చేసిన సంఘటనలో తురకా కిశోర్ నిందితుడు. దుర్గి పోలీసులు మంగళవారం గుంటూరు జిల్లా జైలు నుంచి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ వద్ద హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసుల తరుపున పిడుగురాళ్ల పీపీ వినయ్ వాదనలు వినిపించగా, కిశోర్ తరపున న్యాయవాది గుంజె వరప్రసాద్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్.. కిశోర్‌కు 14 రోజులు రిమాండ్ విధించడంతో దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ ఎస్కార్టుతో కిశోర్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

## పండగ వాతావరణంలో 'తొలి అడుగు' : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో సుపరిపాలనకు తొలి అడుగు ఇంటింటికీ ప్రచార కార్యక్రమం బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పింఛను నగదు ఒకేసారి రూ.4 వేలకు పెంచి 64 లక్షల మందికి ఒకటో తేదీనే ఇంటి వద్దకే వెళ్లి అందిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా దీపం-2 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ చేశామని పేర్కొన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 184.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 194.00 |

# వైసీపీని సమాజం నుంచి వెలివేయాలి : యరపతినేని

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ఇంటింటికి వెళ్లనున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు అమలు చేసే క్రమంలో.. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజా మద్దతు ఉందని పేర్కొన్నారు. ఇంటింటికి టీడీపీ శ్రేణులు వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని సూచించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయ్యిందని, తాలిబన్ల పాలనలా కొనసాగించారని మండిపడ్డారు. గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేయడమే కాకుండా.. ప్రతి నెలా 1న ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. రెంటపాళ్లలో జగన్ యాత్ర.. జనానికి మరణ యాత్రలా సాగిందన్నారు. జగన్ కారు కింద సింగయ్య మృతి చెందితే.. ఒక్కరైనా కారును నిలిపిన దాఖలాలు లేవన్నారు. పైగా రప్పా రప్పా.. పొట్టేళ్ల తలలను నరికినట్లు నరుకుతామంటూ ఫ్లెక్సీలు చేతబూని నినాదాలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలపై మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు యరపతినేని తెలిపారు.

# భూ ఆక్రమణలపై విచారణ

● కబ్జాకు గురైన భూ రికార్డుల పరిశీలన ● సమగ్ర విచారణ జరపాలి: చీఫ్ విప్ జీవీ

భూ రికార్డులను పరిశీలిస్తున్న సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ హరికృష్ణ, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పరిధిలో ఆక్రమణలకు గురైన భూములపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'కంటపడితే కబ్జా' అనే కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బ్రిడ్జి వద్ద గల తిమ్మాయపాలెం పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 721లో 3.14 ఎకరాల కుంట భూమి ఆక్రమణపై విచారణ చేపట్టాలని తహసీల్దార్ సురేష్‌నాయక్‌ను ఆదేశించారు. ఆర్ఐ హరికృష్ణ రెవెన్యూ సిబ్బందితో కుంట భూమిని సందర్శించారు. విచారణలో వెల్లడైన అంశాలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ సురేష్‌నాయక్ తెలిపారు. భూ కబ్జాలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆర్డీవో మధులతతో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమణలకు గురైన భూములను కాపాడాలని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, విచారణ చేయాలని ఆదేశించారు. లోకాయుక్తకు 2022లో అప్పటి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఇచ్చిన నివేదిక ఆధారంగా సమగ్ర విచారణ జరపాలని తెలిపారు. తిమ్మాయపాలెం రెవెన్యూలోనూ, గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి ఆనుకొని మార్కాపురం రోడ్డులోని బ్రిడ్జి వద్ద ఉన్న భూముల రికార్డులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే నంబరు 720/4లో 7.70 ఎకరాలు, 741/13లో 37.74 ఎకరాలు, 739/1లో 66 సెంట్లు, 717/5లో 1.78 ఎకరాల్లో చుక్కల భూమి ఉన్నట్లు లోకాయుక్తకు కలెక్టర్ నివేదిక ఇవ్వడం జరిగిందని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో జరిగిన తప్పిదాలను, అందుకు కారకులైన ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జీవీ ఆదేశించారు.

## గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాగుపాలెంలో ఓగేరు వాగు కొత్త బ్రిడ్జి వద్ద గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు అరకిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ పి. రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.హజరత్తయ్య, సిబ్బంది నిఘా పెట్టి దాసరి పవన్ సాయి (36), కటికల సింగయ్య (21), వేముల దుర్గా ప్రసాద్ (24)ను అదుపులోకి తీసుకున్నారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరిచగా.. రిమాండ్ విధించారు.

## మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.బాలశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి పరీక్ష రాయకుండా ఐదు, ఆరు, ఏడు ఎనిమిది తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు 871262 5039, 63020 18886 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

## వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ గోపిరెడ్డి

డాక్టర్ గోపిరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నేతలు

నరసరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ ప్రెసిడెంట్ పదవిపై నెలకొన్న ప్రచారానికి అధిష్ఠానం తెరదీసింది. మాజీ మంత్రి విడదల రజని, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్లు కూడా పరిశీలించినప్పటికీ గోపిరెడ్డి పేరును ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో నిందితుడిగా ఉండటంతో ఆయన పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గోపిరెడ్డిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైసీపీ నియమించింది. పార్టీ నేతలు, కార్యకర్తలు డాక్టర్ గోపిరెడ్డిని ఘనంగా సత్కరించి, ఆయనకు అభినందలు తెలిపారు. తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తానని, అన్ని నియోజకవర్గాల సమన్వయ కర్తల సలహాల మేరకు పార్టీని పటిష్టం చేస్తానని చెప్పారు.

# పింఛను సొమ్ము గోల్‌మాల్

● రూ.9.50 లక్షలు సొంతానికి వాడుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ● నాలుగు నెలల తర్వాత వెలుగులోకి

యడ్లపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడులో సామాజిక పింఛను నగదు గోల్‌మాల్ అయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రమైన యడ్లపాడు 1, 2 సచివాలయాల పరిధిలో చోటుచేసుకుంది. సచివాలయం 1 వెల్ఫేర్ అసిస్టెంట్ రెండవ సచివాలయానికి కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీని వెల్ఫేర్ అసిస్టెంట్‌కే అప్పగించారు. ప్రతి నెలా పింఛన్ పంపిణీ అనంతరం మిగులు నగదును 7వ తేదీ లోపు చలనా లేదా ఆన్‌లైన్, యూపీఐ ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలి. ఇలా అతని వద్ద నుంచి నాలుగు నెలల కాలంలో యడ్లపాడు-1 సచివాలయ పరిధిలో పంపిణీ కాని పింఛన్ల నగదు రూ.4,77లక్షలు, యడ్లపాడు-2 పరిధిలో రూ.4,73,500 కలిపి మొత్తం రూ.9,50,500 సొంతానికి వాడుకున్నట్లు అధికారులు తేల్చారు. ఉద్యోగి వాడుకున్న మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమచేయించేందుకు కసరత్తు చేస్తున్నారు. నిధులు జమకాని విషయాన్ని డీఆర్‌డీఏ అధికారులు ఎప్పటికప్పుడు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. ఈ విషయమై సదరు ఉద్యోగిని ప్రశ్నించగా తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో గతంలో చెల్లించిన చలానాలలో మార్పులు చేసి.. ప్రస్తుత నెలల్లో జమ చేసినట్లుగా చూపించేవాడు. సాంకేతిక లోపంతో డీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో కనిపించడం లేదని నమ్మించాడు. కొన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు వాస్తవంగా జమచేసినా అవి కూడా ఆన్‌లైన్‌లో కన్పించకపోవడంతో ఎంపీడీవోకు ఎలాంటి అనుమానం రాలేదు. నాలుగు రోజుల కిందట డీఆర్డీఏ అధికారులు చలానాలు తీసుకుని జిల్లా కార్యాలయానికి రావాల్సిందిగా సూచించారు. అక్కడ పరిశీలించగా.. సదరు చలానా నంబర్లు సరిపోలేదు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నిలదీయగా నగదు సొంతానికి వాడుకున్నట్లు అంగీకరించాడు.

### ఉద్యోగావకాశాలు

Wanted a well experienced Principal Wanted Eng. P.S. Social Staff for 8th to 10th. Contact : Sarojini Vidyalayas, Prathipadu & Pulladigunta, Guntur (Dt), Ph : 9491213407, 9542547509.
AJG-239200

High school Biology, Physics, Hindi, social, PET, computer operator and mother teachers. Sri Vidhya High School, NGGOs colony, Gnt. Cont : 9701022900
SSD-1476

గుంటూరు, నల్లపాడు రోడ్డులో గల శ్రీ నాగసాయి మందిర్‌లో స్వామి వారికి అర్చనాది కైంకర్యములు చేయుటకు అర్చకులు కావలెను. వసతి మరియు జీతము ఇవ్వబడును. వ్యక్తిగతముగా సంప్రదించవలెను. మేనేజర్: 93927 43225
AJG-239426

NK అగ్రో ఎక్స్‌పోర్ట్ Pvt.Ltd, తొడేళ్ళగూడెం గ్రా, దోర్నకల్ మం, మహబూబాబాద్ జిల్లాలో పని చేయుటకు చిల్లిపౌడర్ మెషినరీ ఆపరేటర్స్-3 No.s కావలెను. అర్హత : ITI / పాలిటెక్నిక్ డిప్లొమా (ఏదైనా బ్రాంచ్), మెషీన్ ఆపరేటర్‌గా 3 నుండి 4 సం.లు అనుభవము వుండాలి. సంప్ర॥ 9949976505, మెయిల్ : hr@nkexpo.com
AJG-238772

### ఉచిత జాబ్ ట్రైనింగ్

తెనాలిలోని వైష్ణవి విద్యా సంస్థలో 3 నెలలు ఉచిత హాస్టల్ వసతి, జాబ్ ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ప్లేస్‌మెంట్ ఇవ్వబడును. అర్హత : 10th పాస్ ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి సెల్ నెం : 9290769284, 9701399994
AJG-239363

### SHARES

షేర్ మార్కెట్ & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్, ఫండమెంటల్స్ & టెక్నికల్స్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యూలర్ / సండే బ్యాచ్) ఫ్యాకల్టి బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్, GNT, Cont : 98854 69566.
RK-620

### పోయినవి

### పాస్‌పోర్ట్ పోయినది

నా పేరున దెందుకూరి రాధామాధవి D/o దెందుకూరి రాధాకృష్ణమూర్తి, ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ A7485007 డేట్ ఆఫ్ పాస్‌పోర్ట్ జారీ 26-03-1999 Dae of Expiry 25-03-2009 గల పాస్‌పోర్ట్ పిట్టలవానిపాలెం నుండి గుంటూరుకి బస్‌లో వెళ్తుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికినచో ఈ అడ్రస్‌కు డి.నెం. 11-139,పిట్టలవానిపాలెం గ్రామం, మండలం, బాపట్ల జిల్లా-522329 నందు తెలియజేయగలరు. / పంపగలరని కోరుచున్నాము.
AJG-RPL

### స్థలం అమ్మకము

గుంటూరు, అమరావతి రోడ్డు రెడ్డిపాలెం హిమని నగర్, 2వలైను, సచివాలయం ప్రక్కన 300 గజాల దక్షిణం ఫేస్ స్థలం అమ్మబడును. 150 + 150 గజాలుగా కూడా అమ్మబడును. ఫోన్ : 63058 39392, 80991 47726
AJG-239429

### గోల్డ్ ఫైనాన్స్

### బంగారం కొనబడును

బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235545

### CHANGE OF NAME

I, GANGINENI VENKATESWARLU S/o Late KONDAIAH, aged 49 years, R/o D.No.1-55, Nuzendla Vill, Nuzendla Mdl, Palnadu Dist, AP, hereby state that my name as GANGINENI VENKATESWARLU mentioned in my Aaadhaar No.4492 8356 3323 and as VENKATESWARLU GANGINENI in my 10th class marks memo, both names belong to me.
AJG-239030

### పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

### సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

| | |
|---|---|
| గుంటూరు 1 టౌన్ | 97036 18725 |
| గుంటూరు 2 టౌన్ | 99854 01056 |
| తెనాలి | 99854 11202 |
| నరసరావుపేట | 99854 11206 |
| బాపట్ల | 99663 35084 |
| పిడుగురాళ్ల | 93909 05725 |
| మంగళగిరి | 93986 73618 |
| అమరావతి | 95027 86195 |
| పొన్నూరు | 97042 99094 |
| రేపల్లె | 99854 12254 |
| చిలకలూరిపేట | 91103 23914 |
| వినుకొండ | 99662 50266 |
| మాచర్ల | 88861 19952 |
| సత్తెనపల్లి | 97048 67908 |
| ప్రత్తిపాడు | 63004 34285 |

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్



### సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ

పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

**SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన**

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) మెసర్స్ ఆర్.బి ప్యాక్స్, ఎస్.నం.721, మెయిన్ రోడ్, పసుమర్రు గ్రామం, చిలకలూరిపేట, చిలకలూరిపేట మండలం, గుంటూరు-522616. నం.2) శ్రీమతి మేడికొండూరి రాధిక అలియాస్ హరీష, భర్త మేడికొండూరి రాంబాబు, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, కళామందిర్ సెంటర్ సమీపాన, చిలకలూరిపేట-522616. నం.3) శ్రీ మేడికొండూరి రాంబాబు, తండ్రి మేడికొండూరి రాఘవయ్య, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, కళామందిర్ సెంటర్ సమీపాన, చిలకలూరిపేట-522616 వారి నుండి 10.12.2024 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 09.12.2024 నాటికి రూ.36,98,005/- (రూపాయలు ముప్పై ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల ఐదు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టిన స్థిరాస్తి
(శ్రీమతి మేడికొండూరి రాధిక అలియాస్ హరీష, భర్త మేడికొండూరి రాంబాబుకు చెందిన ఆస్తి)

గుంటూరు జిల్లా, చిలకలూరిపేట సబ్ జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట మండలం, పసుమర్రు గ్రామ పంచాయతీ ఏరియాలో గల పసుమర్రు గ్రామ డి.నం.721 లోని భవిష్యత్తులో దానిపై నిర్మించబోయే నిర్మాణాలు మరియు ప్రస్తుత ఏదేని నిర్మాణంలో ఉన్న నిర్మాణాలతో పాటు 735.680 చ.గ.ల స్థలం, ఆస్తి యావత్తు. సరిహద్దులు: తూర్పు: మార్గం కొరకు వదిలివేయబడిన నడవ 12 అడుగులు- 209 లింకులు, దక్షిణం:సర్కార్ డొంక-80 లింకులు, పశ్చిమం: పల్లపు కృష్ణ భూమి-171 లింకులు, ఉత్తరం: కందిమల్ల నారాయణస్వామి భూమి-80 లింకులు.

**రిజర్వు ధర: రూ. 50,00,000/-**
(రూపాయలు యాభై లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

| రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది : | ప్రదేశం |
|---|---|
| 24-07-2025 | సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, 7-376/1, గాంధీపేట, ఎస్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616 టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148 |

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, 7-376/1, గాంధీపేట, ఎస్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 30.06.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN-L65110TN1904PLC001287.
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com



### ఎన్నికల ప్రకటన

| | | | |
|---|---|---|---|
| 1. | బ్యాంక్ పేరు | | : ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002 |
| 2. | ఎన్నికల తేది | | : 27-07-2025 (ఆదివారం) |
| 3. | మేనేజింగ్ కమిటీకి ఎన్నుకోబడే సభ్యుల సంఖ్య | | : 2 (ఇద్దరు) మాత్రమే ఒక ప్రొఫెషనల్ డైరెక్టర్ మరియు ఒక జనరల్ డైరెక్టర్ |
| 4. | మేనేజింగ్ కమిటి సభ్యుల పదవి కాలం | | : కాల వ్యవధి: 5 సంవత్సరములు - 07-08-2025 నుండి 06-08-2030 వరకు (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 లోని సెక్షన్ 21(3) ప్రకారం) |
| 5. | మేనేజింగ్ కమిటి సభ్యత్వానికి పోటీ చేయదలచిన అభ్యర్థులకు కావలసిన అర్హతలు | | : 1. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు కనీసం రెండు సంవత్సరాలు బ్యాంక్‌లో ఓటింగ్ సభ్యునిగా ఉండవలెను. 2. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు జరిగిన రెండు జనరల్ బాడీ సమావేశాలకు(2024 సం॥ మరియు 2025 సం॥) హాజరై ఉండవలెను. 3. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్ నెం.21 ప్రకారం ఎలాంటి అనర్హత కలిగి ఉండరాదు. |
| 6. | నామినేషన్ల స్వీకరణ | తేది<br>స్థలం<br>సమయం | : 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉదయం 9:00 గం॥ల నుండి మధ్యాహ్నం 01:00 గం॥ల వరకు |
| 7. | స్వీకరించిన నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>మధ్యాహ్నం 02:00 గం॥ల తరువాత |
| 8. | నామినేషన్ల పరిశీలన | తేది<br>స్థలం<br>సమయం | : ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి ఉ॥ 11-00 గం॥ల వరకు |
| 9. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 12-00 గం॥ తరువాత |
| 10. | నామినేషన్లు ఉపసంహరణ | తేది<br>స్థలం<br>సమయం | : ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 11. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల తుది జాబితా ప్రచురణ మరియు చిహ్నాల కేటాయింపు | తేది<br>స్థలం<br>సమయం | : ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 01-00 గం॥ తరువాత |
| 12. | పోలింగ్ తేది మరియు సమయం | తేది<br>స్థలం<br>సమయం | : ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>ఉ॥ 7.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 13. | ఓట్లు లెక్కింపు | తేది<br>స్థలం<br>సమయం | : ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>మ॥ 02-00 గం॥ల నుండి |
| 14. | ఫలితాల ప్రకటన | | : కౌంటింగ్ అయిన వెంటనే ది.27-07-2025 (ఆదివారం) |

తేది: 01-07-2025 (ఎం.వి.ఎస్. సతీష్ బాబు) ఎన్నికల అధికారి, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్థలం: గుంటూరు 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002, (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 క్రింద రిజిష్టర్ చేయబడినది, రిజిస్ట్రేషన్ నెం.431)

గమనిక: 1) ప్రతి అభ్యర్థి నామినేషన్ ఫీజు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) నామినేషన్ దాఖలు సమయంలో చెల్లించవలెను. 2) ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి అనర్హత కలిగి వుండకూడదు. 3) ఓటర్ల జాబితా ఎన్నికల అధికారి వద్ద అందుబాటులో ఉంటుంది. 4) ఓటర్ల జాబితా బ్యాంక్ యొక్క అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం: 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట నందు నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుంది.
గమనిక: 1) ఓటు వేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా బ్యాంక్ వారు జారీ చేసిన సభ్యత్వ నమోదు ఐడి కార్డు వంటి ఏదైనా ఆమోదించబడిన గుర్తింపు కార్డును ఓటరు తీసుకురావలెను.

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

## మంచి పనులు చేశాం.. ప్రజల్లోకి తీసుకెళతాం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక అనివార్యం
- వైసీపీ పాలనలో కాంట్రాక్టర్లకు రూ.12కోట్లు బకాయి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 150 కార్యక్రమాలు అమలు చేయటం జరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళుతానని చెప్పారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏడాది పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేయబోయే పనులు గురించి ఎమ్మెల్యే వేగేశన వివరించారు. వైసీపీ పాలనలో మున్సిపల్ కాంట్రాక్టర్లకు 12కోట్ల రూపాయల బకాయిలు పెట్టారన్నారు. దీనివల్ల అభివృద్ధి పనులు చేయటానికి కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదన్నారు. డ్రైనేజీలు అస్థవ్యస్థంగా మారాయన్నారు. వాటిని ఆధునీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పురపాలక సంఘానికి వచ్చే నిధులలో కొంత కాంట్రాక్టర్లకు ఇచ్చి పనులు ముందుకెళ్ళే విధంగా చూస్తున్నామన్నారు. పురపాలక సంఘానికి ఎన్నికలు జరగకపోవటం వల్ల నిధులు కూడా రావటం నిలిచిపోయాయన్నారు. గతంలో ఉన్న విధంగానే 34 వార్డులకు ఎన్నికలు జరిగేవిధంగా చూడాలనేది తన అభిప్రాయమన్నారు. విలీన గ్రామాలు కాకుండా ఎన్నికలు జరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఛైర్మన్ ఎన్నిక అనివార్యమని స్పష్టం చేశారు. పట్టణంలో తొలిగించిన విగ్రహాలు తిరిగి ఏర్పాటు చేసే విషయంపై కమిటీ ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. పట్టణాభివృద్ధికి స్పెషల్‌గ్రాంట్ కావాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

### ఏడాదిపాలనలో కొంత వెనుకబడి ఉన్నా..

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాజకీయపాఠాలు నేర్చుకున్నానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఏడాది పాలనలో తాను కొంత వెనుకబడి ఉన్నప్పటికి అవినీతి, అక్రమాలు లేనిపాలన అందిస్తున్నానన్నారు. గత పాలకులు చేసిన తప్పులు చేయటం లేదన్నారు. సూర్యలంక పర్యాటక కేంద్రం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.97 కోట్లు తీసుకురావటం జరిగిందన్నారు. అదనపు సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ ఏర్పాటు, శానిటరి సిబ్బంది పెంపుదల, ఉప్పర పాలెంలోని ఓవర్‌హెడ్‌ట్యాంక్ ప్రారంభం వంటి పనులపై దృష్టి సారిస్తానన్నారు. గత ప్రభుత్వ విధానం వల్ల ఇవి ఆలస్యమైనట్లు తెలిపారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌లు మున్సిపాలిటిని విధ్వంసం చేశారన్నారు. దీనిని సరిచేసి ప్రజాసంక్షేమం కోసం పాటుపడతామన్నారు. ప్రజలల్లోకి వెళ్ళి ఏడాది పాలనపై వివరిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు.

## ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలన తొలిఅడుగు- ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్‌లదే కీలక బాధ్యత అన్నారు. నియోజకవర్గంలోని 202 బూత్‌ల పరిధిలో విస్తృతంగా కార్యక్రమాలు జరగాలన్నారు. రోజుకు ఒక్కొక్క బూత్ ఇన్‌చార్జి 50 ఇళ్ళకు వెళ్ళాలని ప్రతి ఇంటి వద్ద మూడు నిమిషాలు సమయం కేటాయించాలన్నారు. ప్రజలు నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గత ఐదేళ్ళల్లో జరిగిన విధ్వంసం గురించి కూడా ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే నరేంద్రవర్మ కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు వై.భూపతిరావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రాయపూడి నాగమల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, మందపాటి ఆంద్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ, డీఎం హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు తదితరులు

## రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ వైద్య దినోత్సవం

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మలను ఘనంగా సత్కరించి సన్మానించారు. జన్మనిచ్చిన భగవంతుని రూపమే వైద్యులని ఆయన అన్నారు. అనంతరం డాక్టర్ సుజాత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శాంతి వైష్ణవి, డాక్టర్ సుజాత లక్ష్మీ, డాక్టర్ చల్లా రామ్మోహనరావు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మిండాల వెంకటేశ్వర్లు, డాక్టర్ హక్‌లను కలిసి సత్కరించి ఫ్రూట్స్ అందజేశారు. కార్యక్రమంలో డీవీ రమణబాబు, సుబ్బారావు, జాషువా, లావణ్య పాల్గొన్నారు.

### మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, మహిళా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.శరత్‌బోస్‌ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వెదుళ్ళపల్లిలోని గోకరాజు రామచంద్రరావు చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ జి.ఆంజనేయులను సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో మానవతా సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, కోశాధికారి కేశవులు, సూరిబాబు, మహిళా సమైక్య అధ్యక్షురాలు కె.పద్మజ, జి.శాంతారాం, తోట రామాంజనేయులు, మంజులత, వంశీ, కోట వెంకటేశ్వరరెడ్డి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాణదాతలు వైద్యులు : శివప్రసాద్

రేపల్లె, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఎంతో పవిత్రమైన వృత్తిలో ఉన్న వైద్యులుప్రజల ప్రాణాలను కాపాడుతూ వారికి దైవంగా నిలుస్తున్నారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక ఎంసీఏ హాలులో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైద్యసేవలు అందిస్తూ మృతి చెందిన వైద్యులు డాక్టర్ రాధాకృష్ణమూర్తి, రాజేశ్వరరావు, ప్రకాశరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు పేదలకు చేయూతనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. విద్యలో రాణించిన విద్యార్థులకు ఎంసీఏ తరుపున నగదు ప్రోత్సాహక బహుమతులు, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ వై.అశోక్, వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, గొట్టుముక్కల బాపారావు, సీనియర్ వైద్యులు డాక్టర్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఖాజీపాలెంలో గ్రామసభ

పిట్టలవానిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయంలో ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్న ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి దాసరి వెంకటశివకుమార్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని గ్రామాలలో వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో క్లాప్ మిత్రాలు పారిశుధ్యంపై దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వినియోగించుకునేందుకు రైతు సేవాకేంద్రాలలో వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు పాటించాలని సర్పంచ్ కె.అనూష ప్రసన్న అన్నారు. క్లాప్ మిత్రలకు యూనిఫామ్స్, షూస్ తదితర పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు దండు శ్రీనివాసరాజు, సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మున్నంగివారిపాలెంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

గోపాపురం గ్రామంలో దివ్యాంగుడికి ఇంటికెళ్ళి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, రాజశేఖరబాబు

# అభివృద్ధి, సంక్షేమం కూటమితోనే సాధ్యం

- ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు (చుండూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి పాలన ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని మున్నంగివారిపాలెంలో రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని విమర్శించారు. మండలంలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మున్నంగివారిపాలెంలో రూ.34 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందని, మరో కోటిన్నర రూపాయలతో రైల్వే ట్రాక్ మార్గంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదీప, తహసీల్దార్ నాగరాజారావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ మరియదాసు, సర్పంచ్ అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి జయపూర్ణకుమారి, టీడీపీ నాయకులు శివారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, ఎల్లారెడ్డి, వీఎస్‌కే ప్రసాద్, శ్రీమాన్, వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, జనసేన నాయకులు పోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందించిన ప్రభుత్వం

బాపట్లరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్‌ను ఒక్కసారిగా లబ్ధిదారులకు అందించింది తెలుగుదేశం ప్రభుత్వమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల మండలం మర్రిపూడి, పూండ్ల, గోపాపురం గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివస్వామిరెడ్డి, బాపట్ల తహసీల్దార్ షేక్ సలీమా, బాపట్ల టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, ఎంపీడీవో బాబురావు, పంచాయతీరాజ్ ఏఈ మోహనరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పేదకుటుంబాలవారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు అండగా నిలుస్తాయని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతాజయప్రకాష్ నారాయణ తెలిపారు. మండలంలోని నందిరాజుతోట గ్రామంలో మంగళవారం ఇంటింటికెళ్ళి పెన్షన్‌లు పంపిణి చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు, గ్రామపార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పట్టణంలోని 34వ వార్డులో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేశారు. నూరుశాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కర్లపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నల్లమోతువారిపాలెం గ్రామపంచాయతీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను వృద్ధులకు ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి మాడా శ్రీనివాసరావు, గ్రామ పార్టీ ఇన్‌చార్జి మునిపల్లి చిన్న, జనసేన పార్టీ ఇన్‌చార్జి గరిగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబుతో కలిసి లబ్ధిదారులకు మండల ప్రత్యేకాధికారిణి వి.విజయలక్ష్మి పెన్షన్‌లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్ తదితరులు

### అర్హులైన వారికి త్వరలో పెన్షన్‌లు : అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంత అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని 6, 7 వార్డుల్లో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పెన్షన్‌లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలందరికి పెన్షన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, త్వరలో దరఖాస్తులకు అనుమతులు ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు గోగినేని పట్టాభిరామారావు, జీవీ నాగేశ్వరరావు, మద్దుల అంకాలు, ఆంజనేయులు, షేక్ మొబీన్, ఆలపాటి వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

● వేమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో మంగళవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల ప్రత్యేక అధికారి అయిన ఆర్.జమీర్‌భాషా పరిశీలించారు. ఆయన గ్రామాల్లో పర్యటించి లబ్దిదారులతో పంపిణీ కార్యక్రమంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన వెంటనే వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

17 గ్రామాల పరిధిలో 7063 మంది లబ్ధిదారులు ఉండగా 6687 (94.68 శాతం) మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఇంకా 466 మందికి పెన్షన్లు అందించాల్సి ఉందని అందుబాటులో లేని కారణంగా బుధవారం కూడా వారికి స్వయంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

## బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా అన్నం సతీష్

అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌ను నియమించారు. త్వరలో జరిగే జాతీయ అధ్యక్ష ఎన్నికలో ఆంధ్రప్రదేశ్ తరుపున అన్నం సతీష్ పాల్గొంటారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎస్ మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా బాపట్ల జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్పల వెంకటరమణరావును కూడా జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ నియామకంపై హర్షం

చెరుకుపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పోకల వంశీనాగేంద్రమాధవ్ ఎన్నిక సందర్భంగా మండలంలోని బీజేపీ నేతలు గుళ్ళపల్లి శివాలయం దగ్గర ఆనందోత్సవాలతో మిఠాయిలు పంచుకున్నారు. ఆయన ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు పొన్నపల్లి సత్యనారాయణ, పెనుమత్సగౌతమ్, ఎ.పవన్, దామర్ల చంద్రబాబు, ఉడత శ్రీలక్ష్మీప్రసన్న, దామర్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల భద్రతకు జనసురక్ష పథకం : ఎంపీడీవో

కర్లపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనసురక్ష పథకం కుటుంబానికి ఆర్థికపరమైన భద్రతనిస్తుందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెంలోని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మేనేజర్ మానస అధ్యక్షతన జనసురక్ష పథకంపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ మాట్లాడుతూ జన సురక్ష పథకంలో 18 నుంచి 70 సంవత్సరాల వయసు వారికి పీఎంఎస్‌బీవై అనే పథకం రూ.20కే ప్రమాద బీమా అందిస్తుందన్నారు. 18 నుండి 50 సంవత్సరాల వారికి పీఎంజేజేబీవై అనే పథకం రూ.436 కు సహజ మరణ బీమా అందిస్తుందన్నారు. మేనేజర్ కేసాని మానస మాట్లాడుతూ ఖాతాలేని ప్రతి ఒక్కరు జన్‌ధన్ ఖాతా ఏర్పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, మేనేజర్ కె.మానస, సర్పంచ్ నక్కా లలితకుమారి, ఎల్‌డీఎం శివకృష్ణ, బెనర్జి, బ్యాంక్ సిబ్బంది అనిషా, భాను, శ్రీనివాసరావు, జగదీష్, గోపి, స్రవంతి, సందీప్, ప్రసాద్, మహేంద్ర, మమత, శ్రీను పాల్గొన్నారు.

### కాల్వలపైన ఏర్పాటు చేసిన దుకాణాలను తొలిగించాలి

కర్లపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఇసుకకాల్వపై గౌడపాలెం నుంచి కర్లపాలెం తెలగపాలెం రామమందిరం వరకు అక్రమంగా ఏర్పాటు చేసిన పలు రకాల చిన్న దుకాణాలన్నిటిని స్వచ్ఛందంగా తొలిగించాలని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సునీతలు దుకాణాల నిర్వాహకులకు సూచించారు. కర్లపాలెంలోని ఇసుక ఛానల్‌లో రైతులు మంగళవారం స్వచ్ఛందంగా కాల్వను తవ్విస్తుండగా కాల్వపై ఉన్న కొన్ని దుకాణాలను వారు సిబ్బందితో తొలిగించారు.

### సమాజ్‌వాదిపార్టీతోనే సామాజిక న్యాయం : మేదా

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సమాజ్‌వాదిపార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు అన్నారు. ఉత్తప్రదేశ్ మాజీముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ జన్మదిన వేడుకలను మంగళవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, విలియంబూత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్‌లివింగ్స్టన్,అంజుమన్ కమిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీంలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాండ్రు శరత్‌కుమార్, మోర్ల చిన వెంకటేశ్వరరావు, బత్తుల వీరయ్య, బోయన సూరిబాబు, దర్శి భాస్కరరావు, నాగరాజు, జాని పాల్గొన్నారు.

## సమ్మె నోటీసును అందజేసిన ఇంజనీరింగ్ కార్మికులు

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్ళపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి కమిషనర్ జి.రఘునాథరెడ్డికి సమ్మె నోటీసు అందించారు. యూనియన్ అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ వాటర్, పార్క్, వెహికల్ డిపో మెకానికల్‌లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్‌ప్లానింగ్, కంప్యూటర్ ఆపరేటర్స్ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.శరత్, హరిబాబు, అంకారావు, రత్నం, నాని, నిర్మల పాల్గొన్నారు.

● రేపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు స్కిల్డ్‌సెమి వేతనాలను అమలు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ కార్యదర్శి ఎన్.రవిబాబు అన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మోకాలుపై నిలుచుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారని ప్రభుత్వం చర్చలు జరిపి వేతనాలను పెంపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, నాయకులు డి.ప్రభాకరరావు, ఎన్.రవి, కె.రాఘవేంద్రరావు, శివ, అనూష పాల్గొన్నారు.

### బంగారు కుటుంబానికి అండగా ఉంటాం : కమిషనర్

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మంగళవారం పర్యటించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి4లో భాగంగా కమిషనర్ దత్తతు తీసుకున్న బంగారు కుటుంబాన్ని సందర్శించారు. ముదిగొండి సంధ్య, నాగరాజుల గృహానికెళ్ళి వారి కుటుంబ స్థితి గతులు గురించి ఆరాతీశారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా తనను స్వయంగా కలవాలని కమిషనర్ కోరారు. శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు నజీర్, కరుణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### అపరిశుభ్రంగా ఉన్న చెత్త తొలిగింపు

పిట్టలవానిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం గ్రామ సచివాలయంలో అపరిశుభ్రంగా ఉన్న చెత్త, ఎండిన చెట్ల కొమ్మలను గమనించిన మండల ప్రత్యేకాధికారిణి వి.విజయలక్ష్మి స్పందించి సచివాలయ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డిని వెంటనే తొలిగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్లాప్ మిత్రల ద్వారా వాటిని తొలిగించారు.

### పేకాటశిబిరంపై పోలీసులు దాడి

నగరం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలమవారిపాలెం సపోట తోటలో పేకాట నిర్వహిస్తున్న సమాచారంతో నగరం ఎస్ఐ బండ్లభాస్కర్, సిబ్బంది దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.32,200 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. నగరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రేపల్లె సబ్‌డివిజన్ అధికారి ఆవుల శ్రీనివాసరావు మాట్లాడుతూ అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### లారీలు ఢీ : ఒకరికి గాయాలు

చెరుకుపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కావూరు దగ్గర 216జాతీయ రహదారిలో మంగళవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొనడంతో లారీడ్రైవర్ గాయాలపాలయ్యాడు. మచిలీపట్నం నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ లారీ రోడ్డుపై ఆగి ఉండగా కాకినాడ నుంచి చెన్నై వెళ్ళుతున్న కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కంటైనర్ లారీ డ్రైవర్‌గాయపడ్డాడు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

## డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిమ్ ఏర్పాటు

రేపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు వ్యాయామం చేసుకునేందుకు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పబ్లిక్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. డిగ్రీ కళాశాలలో జిమ్‌ఏర్పాటు కోసం మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ప్రజలు ఆరోగ్యంగా జీవించాలనే ఉద్ధేశ్యంతో వ్యాయామ పరికరాలతో జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డిగ్రీ కళాశాల చుట్టూ వాకర్స్ ట్రాక్ ఏర్పాటు చేశామని ఐదేళ్ళ వైసీపీ పాలనలో వాటిని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ప్రజల కోరిక మేరకు వాకర్స్ ట్రాక్‌చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, కళాశాల సిబ్బంది

## నేడు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం

అమృతలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం నియోజకవర్గంలో బుధవారం ప్రారంభమవుతున్నట్లు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యాలయ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గ పరిధిలో తొలిగా మండల కేంద్రం అమృతలూరులో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బుధవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హజరై ఇంటింటా తిరుగుతారన్నారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు.

## ప్రత్యేక అవసరాలున్న పిల్లల్ని భవిత సెంటర్‌లో చేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న జోత్స్న

చెరుకుపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరుకుపల్లి మోడల్‌పాఠశాలలో గల భవిత సెంటరును జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఎం.జ్యోత్స్న మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లల విద్యాభివృద్ధి, హోమ్ బెస్డ్ ఎడ్యుకేషన్ గురించి తగు సూచనలిచ్చారు. చెరుకుపల్లి భవిత సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలు ఇంకా ఎవరైనా ఉంటే చేర్పించాల్సిందిగా సూచించారు. వీటితోపాటు మధ్యాన భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ డి.రాంబాబు, ఉపాధ్యాయులు బి.సాంబయ్య, నాయక్, ఎ.బాలాజీ, ఐ.అరుణకుమారి, ఐఈ రిసోర్స్ టీచర్స్ డి.రవీంద్రబాబు, టీవీ మహలక్ష్మి పాల్గొన్నారు.

## విత్తనాల మొలక శాతాన్ని గుర్తించాలి

వేమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగుకు వాడే వరి విత్తనాల మొలక శాతాన్ని ముందుగానే గుర్తించాలని మండల వ్యవసాయాధికారి ప్రేమ్ సాగర్ సూచించారు. మండలంలోని వరహాపురం, బలిజేపల్లి గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రాలను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు వెదపెట్టే రెండు మూడు రోజుల ముందుగానే మొలక శాతాన్ని కట్టుకోవాల్సి ఉందన్నారు. బస్తాల నుంచి 100 గింజలు తీసుకుని మొలక పెడితే దానిలో 80 నుంచి పైబడి విత్తనాలు మొలకెత్తితే మంచి విత్తనంగ పరిగణించి వెద పెట్టుకోవాలన్నారు. వరి విత్తనాలు రాయితీపై రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో వీఏఏ దీప్తి, రైతులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు, ప్రాముఖ్యతను వివరించారు. పెదలంకలో పసుపు పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కారంకి లక్ష్మీప్రసన్న, టి.అఖిల, వి.బుష్, విహెచ్‌ఎలు హిమబిందు, బి.సరిత, రైతులు పాల్గొన్నారు.

● బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతు కార్డుల కోసం ప్రతి రైతు నమోదు చేయించుకోవాలని ఏడీఏ కె.ధనరాజ్ తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం, అడవి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీఏ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతుకు మేలు చేకూరుతుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ వ్యక్తిగత పరికరాలు గురించి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.శారద, విస్తరణాధికారులు జి.శేషమ్మ, గ్లోరి పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నపల్లి, నడిపల్లి గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో వ్యవసాయశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, రేపల్లె ఎ.లక్ష్మీ మాట్లాడుతూరైతులందరూ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయసలహా, సాంకేతిక కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా మాట్లాడుతూ చౌడును తట్టుకునే మినీకిట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిజేశారు. మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూఖ్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా కౌలురైతుకార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రియాంక, బి.డి.రామకృష్ణ, వీఏఏలు, ఏపిసిఎన్‌ఎఫ్‌సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్.. రెండు సెంట్ల స్థలం

- పక్కనే ఉన్న ఆలయ స్థలం ఆక్రమణ
- విడిపించాలని గ్రామస్థుల ఆందోళన


ఆక్రమణకు గురైన భూమి

చెరుకుపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి శివారు ఆరుంబాక వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వే నంబరు 463లో రెండు సెంట్ల స్థలాన్ని గ్రామ ఉప సర్పంచ్ ఆక్రమించుకున్నాడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలాన్ని సుమారు వందేళ్ల క్రితం కామినేనివారిపాలేనికి చెందిన దాతలు కాటూరి వంశస్థులు బాటసారుల దాహార్తి తీర్చడానికి మంచినీళ్ల బావికి దానమిచ్చారు. కాలక్రమేణా ఆ బావి పూడిపోయి నిరుపయోగమైంది. గతంలో దాతలు విరాళమిచ్చిన ఈ స్థలంలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండేది. 216ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆలయాన్ని తొలగించారు. ఈ స్థలంలోనే ఆలయ పునఃనిర్మాణానికి దాతలు ముందుకొచ్చారు. దీని గురించి సమాలోచన చేస్తుండగానే.. గ్రామ ఉప సర్పంచ్ స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపార భవనాన్ని నిర్మించాడు. ఇక్కడ ఆలయ నిర్మాణం కోసం రెవెన్యూ డిపార్టుంట్‌కు అర్జీ పెట్టుకోగా.. సర్వే చేసి మార్కింగ్ కూడా ఇచ్చారు. ఆక్రమణదారుడిని దీనిపై ప్రశ్నించగా.. ఈ స్థలం తన కుటుంబ సభ్యుల పేరుమీద ఉందంటూ సమాధానం ఇచ్చారు. ఆక్రమణదారుడు తన స్థలం పక్కనే ఉన్న ఈ ఆలయ స్థలాన్ని ఆక్రమించుకున్నాడని గ్రామస్థులు మండిపడుతున్నారు. భక్తులు ఇప్పటికే ప్రభుత్వ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారులు తక్షణమే స్పందించి పరిస్థితి తీవ్రతరం కాకముందే ఆక్రమణదారుడి నుంచి స్థలాన్ని విడిపించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పటిష్టత ప్రశ్నార్థకం

ప్రాజెక్ట్ లోపలి భాగంలో గోడల దుస్థితి

● అమరావతి ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్‌కు లీకేజీల సమస్య ● భూగర్భ, మొదటి ప్రాంగణంలో వర్షపు నీరు ● ప్రారంభం నుంచి మరమ్మతులు శూన్యం ● దృష్టి పెట్టని పర్యాటక శాఖ

ప్రాజెక్ట్ ప్రారంభంలో స్లాబుకు పగుళ్లు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అమరావతిలోని ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్ నిర్మాణం 20 ఏళ్లు పూర్తిచేసుకుంది. కానీ, మరమ్మతులపై టూరిజం అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రాజెక్ట్ దిగువన ఉన్న నాలుగు వైపులా సొరంగ మార్గం, బుద్ధుని పీఠం దిగువన శిల్ప సంపదతో పర్యాటకులను ఆకర్షిస్తున్న గ్యాలరీ ప్రాంగణ స్లాబుకు లీకేజీల సమస్య ఏర్పడింది. వర్షపు నీరు కారి గోడలకు పగుళ్లు వస్తున్నాయి. రంగులు లేచిపోయి కళావిహీనంగా మారుతున్నాయి. బుద్ధుని విగ్రహం పీఠం చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో స్లాబుకు ఏర్పడిన లీకుల ద్వారా గ్యాలరీలోకి నీరు చేరుతోంది. అంతేగాక బుద్ధుని బొమ్మకు మోకాళ్ల ప్రదేశంలో చిన్న చిన్న పగుళ్లు రావడం జరిగింది. ప్రాజెక్టుపై అక్కడక్కడా చిన్న చిన్న మొక్కలు కనిపిస్తున్నాయి.

### ప్రారంభం ఇలా..

2004 ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జేఆర్ పుష్పరాజ్ ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీఆర్ మల్లికార్జునరావు పర్యవేక్షణలో 2006లో జరిగిన కాలచక్ర మహా సభలకు నిర్మాణం పూర్తి చేసుకుంది. బౌద్ధుల ఆరాధ్య దైవం దలైలామా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రారంభించారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని వారసత్వ కేంద్రంగా గుర్తించేలా అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా వారసత్వ నగరంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులోని కొంత నిధులతో ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు లైటింగ్, గ్రానైట్, స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ధ్యానబుద్ధ ప్రాజెక్ట్‌లో కొన్ని పనులు నిలిచిపోయాయి.

### పర్యాటక శాఖ నిర్లక్ష్యం..

ప్రాజెక్టు ప్రారంభం నుంచి పర్యాటకశాఖ సందర్శకులకు టికెట్ ద్వారా సందర్శనకు అవకాశం కల్పిస్తోంది. కానీ, ప్రాథమిక స్థాయిలో మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహించిందని స్థానికులు చెబుతున్నారు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ధ్యానబుద్ధ ప్రాజెక్ట్ భావితరాలకు భద్రంగా అందించే విధంగా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి, పటిష్టతకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రాజెక్ట్ మరమ్మతుల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని అంతర్జాతీయ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు.

### మరమ్మతులు చేపడుతాం: ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి రాజధానికి ఐకాన్‌గా ఉన్న ధ్యానబుద్ధ విగ్రహం, అమరావతి పర్యాటక ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద లీకేజీల విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విగ్రహ పరిసర ప్రాంతాలకు మరమ్మతులు చేసి అమరావతిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామన్నారు. అమరావతి అభివృద్ధి పై సీఎం చంద్రబాబుకు విన్నవించానని తెలిపారు.

లీకులతో దెబ్బతిన్న పీఠం దిగువ భాగం

# డబ్బుల్ ధమాకా మోసం!

## 'లుక్' యాప్‌తో టోకరా

▼ ఒక పద్ధతి ప్రకారం ఆఫర్లతో ఎర ▼ చివరిగా డిపాజిట్ నగదుకు డబుల్ బెనిఫిట్ ఆఫర్ ▼ నగదు జమకాగానే నిలిచిపోయిన యాప్ సేవలు ▼ తెనాలి, పరిసరాల్లోనే అధికంగా బాధితులు




యాప్‌లో ఒక రోజు సంపాదించిన సొమ్ము, ఖాతాలో ఉన్న నగదు చూపుతున్న దృశ్యం

తెనాలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మనిషి అమాయకత్వాన్ని, ఆశను క్యాచ్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఓ పద్ధతి ప్రకారం ఓ యాప్ ద్వారా యూజర్లకు ఆఫర్లు ద్వారా బహుమతులు ఇచ్చి.. డబుల్ పేమెంట్ అంటూ నగదు డిపాజిట్ చేయించుకుని ఒక్కసారిగా ఉన్నదంతా ఊడ్చేశారు. ఈ యాప్ ద్వారా మోసపోయిన బాధితుల సంఖ్య తెనాలి, పరిసర ప్రాంతాల్లోనే భారీగా ఉంది. రూ.కోట్లల్లోనే వీరంతా నష్టపోయినట్లు సమాచారం. అసలు వివరాల్లోకి వెళితే.. కొన్ని నెలల క్రితం ఫోన్లకు వచ్చిన లింకుల ద్వారా 'లుక్' యాప్‌ను చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్‌లో వచ్చే ప్రకటనలు చూసిన వారికి రూ.15

యాప్ ద్వారా చూపుతున్న నగదు

వంతున జమచేస్తామని యూజర్లకు ఆశ రేకెత్తించారు. దీంతో ఇక అదే పనిగా కొందరు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పేర్లు నమోదు చేసి చూడటం ప్రారంభించారు. యాప్ నిర్వాహకులు కొన్ని రోజులు యూజర్ల వాలెట్‌లోకి నగదు బదిలీ చేసి, విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. గొలుసు కట్టు విధానంలో మెంబర్‌షిప్‌లు చేయించిన యూజర్లకు... యాప్ నిర్వాహకులు కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, ఖరీదైన ఇళ్లు అంటూ బహుమతులు కూడా ప్రకటించారు. ఇందుకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు కొత్త ఆఫర్లు ప్రకటిస్తూ.. యూజర్లను పెంచారు. ఇది నమ్మి చాలా మంది తమ కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులను కూడా యాప్ మెంబర్లుగా చేర్చారు. మెంబర్‌షిప్‌లు పెరగడంతో.. యాప్ నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చార్జీలు పెట్టారు. సెక్యూరిటీ డిపాజిట్లు కింద నగదు జమ చేయించుకున్నారు. గత వారం క్రితం యాప్‌లో ఎంత డిపాజిట్ చేస్తే.. అంతకు డబుల్ అమౌంట్ ఇస్తామని ప్రకటించారు. దీంతో పలువురు రూ.20 వేల నుంచి రూ.2లక్షలు పైగా స్తోమతను బట్టి డిపాజిట్ చేశారు. అన్నట్లుగానే వారి వాలెట్‌కు నగదు వచ్చినట్లు చూపించింది. ఎంతో ఆశతో విత్ డ్రా చేసుకుందామని బ్యాంక్‌కు వెళితే.. నగదు రాలేదు. పైగా యాప్ సర్వీసులు గత బుధవారం నుంచి నిలిచిపోయాయి. దీంతో తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. ఓ ప్రైవేట్ వైద్యశాలలో పనిచేస్తున్న ఓ మహిళ తనకు ఆఫర్‌లో కారు రావడంతో.. పూర్తిగా నమ్మి పెద్ద ఎత్తున యాప్ ద్వారా నగదు డిపాజిట్ చేసి పూర్తిగా మోసపోయినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వారి వద్ద నగదు పంపిన వివరాలు మినహా ఏమీ లేకపోవడంతో.. తిరిగి తమ డబ్బులు ఎలా తెచ్చుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. వారు వాడే యాప్ చిరునామా పుణె, అమెరికా అంటూ చూపుతుండటంతో ఏం చేయలేని పరిస్థితి బాధితుల్లో నెలకొంది. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

# చేతి'కంది'..ధర లేక..!

(5వ పేజీ తరువాయి)

లేదంటున్నారు. కంది క్వింటా మద్దతు ధర రూ.7,550గా ఉంది. పత్తి పంట సాగు చేసి ఏటా నష్టపోతున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా కంది పెద్ద ఎత్తున సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం కంది సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేసింది. ప్రభుత్వ పోత్సాహం ఉండటంతో పాటు మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 66,273 ఎకరాల్లో కంది సాగు చేశారు. దిగుబడులూ ఆశాజనకంగా వచ్చాయి. అయితే.. మార్క్‌ఫెడ్ మొక్కుబడిగా కంది కొనుగోళ్లు చేసింది. రైతుల వద్ద వేలాది క్వింటాళ్లు నిల్వలు ఉన్నాయి. కందులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేరు. కంది పుచ్చే తత్వం అధికంగా ఉంటుంది. మార్కెట్‌లో విక్రయిద్దామంటే క్వింటా రూ.6,500 లోపే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కంది నిల్వలంటినీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. తమను అదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### దళారులు తక్కువకు అడుగుతున్నారు : గెల్లి యోగిరెడ్డి, తెలార్లపల్లి

కౌలుకు పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో దళారులు క్వింటా రూ.6,500కు కూడా కొనడం లేదు. ఎక్కువ కాలం ఇంటిలో కందులు నిల్వ చేయలేము. ప్రభుత్వం మద్దతు ధరకు రైతులు వద్ద ఉన్న కందులు కొనాలి.

# ఇంజనీరింగ్ సీట్లు 30,240

(5వ పేజీ తరువాయి)

మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది ముందుగానే నోటిఫికేషన్ జారి చేసి కౌన్సెలింగ్ ప్రారంభించారు. అయితే ఈ ఏడాది వేర్వేరు కారణాల వల్ల నోటిఫికేషన్ ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇందుకు మరో రెండు మూడు వారాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సాంకేతిక విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర జిల్లాల వైపు కూడా కొంతమంది వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భారీ సంఖ్యలో మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులందరూ.. కళాశాలలో చేరతారనే నమ్మకం కూడా లేదు. ప్రభుత్వం సత్వరం నోటిఫికేషన్ జారీ చేస్తే సీట్లు మిగులు తగ్గుతుందని యాజమాన్యాలు తొందరపడుతున్నాయి. కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే 30 శాతం ఉన్న యాజమాన్య కోటా సీట్లు భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటాలో ఇక్కడ కూడా కెమికల్, మెకానికల్ సీట్లు భర్తీ కాలేదు. ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసి విద్యార్థులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే ఏపీ ప్రభుత్వం ఇంకా ప్రక్రియ ప్రారంభం చేయకపోవడంపై యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సత్వరం నోటిఫికేషన్ జారీ చేసి, ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

# ప్రజల చెంతకు.. పాలకులు

(5వ పేజీ తరువాయి)

చేయలేకపోయిన పనులు ఎందుకు చేయలేదో వివరించాలని చంద్రబాబు ఇప్పటికే నేతలకు సూచించారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రేపోమాపో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరాలను అమలు చేయనున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నో కష్టనష్టాల కోర్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తీరును నేతలు ప్రజలకు వివరించనున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ఎలా సాగాలన్న దానిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నేతలకు మార్గనిర్దేశనం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కరపత్రాలు కూడా ఆయా నియోజకవర్గాలకు మంగళవారం చేరాయి. బుధవారం ఉదయం నుంచే ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పరిధిలోని ఇళ్ల బాట పట్టనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని, రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రజల ముందుంచాలనే ఆదేశాలు నేతలకు వెలువడ్డాయి. ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు సమస్యలు చెప్పుకుంటే వాటిని సావధానంగా విని పరిష్కారం కోసం కృషి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధిష్ఠానం సూచించింది. ఏడాది వ్యవధిలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఎన్నికలకు ముందు నేతలు ప్రధానంగా ఇచ్చిన హామీలు ఈ ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నేపథ్యంలో ప్రజల్లో చర్చకు రానున్నాయని, వాటిపై నేతలు కూడా సమగ్ర సమాచారం దగ్గర పెట్టుకోవాలని ఆదేశించింది. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. నెల రోజులు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, నేతలకు పిలుపిచ్చారు. కుటుంబ సాధికార సారథుల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### అక్కడక్కడ అసంతృప్తి

బిల్లుల మంజూరు.. పనులు.. నామినేటెడ్ పదవుల విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. మన ప్రభుత్వం వచ్చింది పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయన్న విశ్వాసంతో అప్పులు చేసి మరీ సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గోకులాల నిర్మాణం తదితర పనులను పెద్దఎత్తున చేశారు. అయితే ఆయా బిల్లుల అంశాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తే చూద్దాం.. చేద్దాంలే అంటున్నారని బాధిత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని, సొంతవారికి ఇలా మొండిచేయి చూపించడంపై నేతలు గుర్రుగా ఉన్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో రూ.154.46 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014 నుంచి 2018 వరకు టీడీపీ ప్రభుత్వం హయంలో కూడా పార్టీ నేతలు ఉపాధి పనులు చేసిన బిల్లుల చెల్లింపు నేటికి జరగలేదు. ఇలా పెద్ద ఎత్తున నష్టపోయిన నేతలు అసంతృప్తిలో ఉన్నారు. ప్రజాక్షేత్రానికి బయల్దేరిన ప్రజాప్రతినిధులు అసంతృప్తి నేతలపై దృష్టి సారించేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.

# హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

(5వ పేజీ తరువాయి)

హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచే పీ- 4 కార్యక్రమం అమలు జరగాలన్నారు. రాజధానిలో ఏర్పాటైన ప్రతి విద్యాసంస్థ గ్రామానికి నలుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఈ సూచన చేసి రెండు నెలలు కూడా కాక ముందే ఆ పక్కనే ఉన్న మరో విద్యా సంస్థ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక కోర్సుతో మొదలైన ఈ విధానం ఆ తర్వాత అన్ని కోర్సులకూ విస్తరిస్తుందేమోనని, అన్ని విద్యా సంస్థలు అదే వైఖరిని చేపడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

### స్థలాలు ఇచ్చిన రాష్ట్రానికి రాయితీ కరువు

రాజధానిలో విద్యా సంస్థ నిర్మాణానికి వందల ఎకరాలు స్థలం కారుచౌకగా ఇచ్చిన రాష్ట్ర విద్యార్థులకు ఆ విద్యా సంస్థలో రాయితీ లేదు. 1 నుంచి 23 ర్యాంకులు సాధించిన వారికి ఫౌండర్ స్కాలర్‌షిప్ కింద నూరుశాతం, 24 నుంచి 68 ర్యాంకులు సాధించిన వారికి 100 శాతం మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. 69 నుంచి 5000 మధ్య ర్యాంకులు వచ్చినవారికి 90 శాతం, 5,001 నుంచి 13,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 75 శాతం, 13,001 నుంచి 23,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 50 శాతం, 23,001 నుంచి 30,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 25 శాతం ఈక్విటబుల్ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. అయితే రిప్రజంటేటివ్ రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదు. అంటే 68వ ర్యాంకు తరువాత వచ్చిన ఏపీలోని ఏ విద్యార్థికి ఈ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ రాయితీ రావడం లేదు. దీంతో విద్యార్థులంతా మొత్తం ఫీజులు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

### ఇది న్యాయం కాదు : రాంబాబు, వెలగపూడి రైతు

రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని కూడా ఇలా హాస్టల్లో ఉండమని విద్యా సంస్థలు డిమాండ్ చేయడం న్యాయం కాదు. హాస్టల్లో ఉండాలా, వద్దా అనేది విద్యార్థి, అతడి కుటుంబం ఇష్టం. అదే ఊరి వారిని కూడా హాస్టల్లో ఉండమనడం మరీ విడ్డూరంగా ఉంది. విద్యా సంస్థ యాజమాన్యం దీనిపై ఆలోచించాలి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.

# ఇసుక అక్రమ మైనింగ్‌పై.. ప్రభుత్వం చర్యలు

● వైసీపీ హయాంలో ఇసుక ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు సిద్ధం ● ఏపీ ఎస్ఏసీ నివేదిక ఆధారంగా డీఎల్ఎస్‌సీ నిర్ణయం ● వివరణ ఆధారంగా తదుపరి చర్యలు

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-24 ఆర్థిక సంవత్సరాల మధ్యన జిల్లాలో జరిగిన ఇసుక అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఏపీ ఎస్ఏసీ) రీచ్‌ల వారీగా జరిగిన అక్రమ మైనింగ్‌పై ఇచ్చిన నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ మేరకు జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఈ అంశంపై చర్చించి, ఆ సమయంలో ఇసుక మైనింగ్‌కు ఏజెన్సీలుగా వ్యవహరించిన సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. నోటీసులకు సంబంధిత ఏజెన్సీలు స్పందించిన తర్వాత ఎంత మేరకు అయితే రెవెన్యూ నష్టం జరిగిందో అంత మొత్తం రికవరీ చేయాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా జిల్లా యంత్రాంగం నోటీసులు సిద్ధం చేస్తోంది.

### వైసీపీ నేతల కబంధ హస్తాల్లో..

ఇసుక రీచ్‌లను వైసీపీ హయాంలో సంబంధిత ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు తమ కబంధ హస్తాల్లోకి తీసుకొన్నారు. తొలుత ఇసుక రీచ్‌లన్నింటిని కేంద్రీకృతం చేశారు. ఒక సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి దాని నుంచి నెల వారీగా మామూళ్లను దండుకొన్నారు. ఆ తర్వాత ఆ సంస్థ సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. ఎన్నికల ఏడాదిన్నర ముందు అయితే మొత్తం రీచ్‌లు ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. ఒక్క పెదకూరపాడు నియోజ కవర్గంలోనే ప్రతి నెలా తాడేపల్లి క్యాంపు ఆఫీసుకు రూ.20 కోట్ల కప్పం కడుతుండేవారన్న ఆరోపణలను ప్రతిపక్షాలు అప్పట్లో చేశాయి.

### అనుకూలంగా నివేదికలు..

మరోవైపు వైసీపీలో తొలుత అంటకాగిన ఇద్దరు నేతలు ఆ తర్వాత విభేదాలు వచ్చి ఇసుక అక్రమ మైనింగ్‌పై సుప్రీం కోర్టు, ఎన్‌జీటీలో కేసులు దాఖలు చేశారు. అలా కేసులు వేశారని వాళ్లపై వైసీపీ నేతలు పీడీ యాక్టు కేసులు పెట్టించి.. జిల్లా నుంచి బహిష్కరించేలా చేశారు. అయినప్పటికీ ఆ నాయకులు భయపడకుండా పోరాడారు. అక్రమ మైనింగ్‌పై అప్పట్లో కలెక్టర్లను నివేదిక సమర్పించమని సుప్రీం కోర్టు ఆదేశిస్తే.. అందరూ ఒకేలా రిపోర్టు ఇచ్చారు. ఎలాంటి అక్రమ మైనింగ్ జరగలేదని చెప్పారు. అయితే ఇసుక మైనింగ్ విషయంలో ఎవరూ తప్పు చేయొద్దని శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా అన్ని వివరాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయని ఎంపీ బాలశౌరీ హెచ్చరించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అది మరుగున పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేపట్టింది. శాస్త్రీయంగా ఏపీ ఎస్ఏసీ ద్వారా సర్వే చేయించి అక్రమ మైనింగ్‌ని నిగ్గు తేల్చింది. దీనిపై ఎలాంటి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తుందోనన్న భయం వైసీపీ నేతల్లో నెలకొంది.

# బీటెక్, ఎంపీఈడీ పరీక్షలు ప్రారంభం

పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

పెదకాకాని, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (రెగ్యులర్), మూడో సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (సప్లమెంటరీ), ఎంపీఈడీ ద్వితీయ సెమిస్టర్ (రెగ్యులర్)పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం. సుబ్బారావు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ పరీక్షలు ఏఎన్‌యూ, బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో, ఎంపీఈడీ పరీక్షలు ఏఎన్‌యూతో పాటు నరసరావుపేటలోని కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్నాయని తెలిపారు.

## ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఆచార్య లింగరాజు

పెదకాకాని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఆచార్య చేబ్రోలు లింగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య లింగరాజు

# ఎండల తీవ్రత నుంచి ఉపశమనం

● చల్లబడిన వాతావరణం, పలుచోట్ల జల్లులు

ఒంగోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిని తలపించే రీతిలో ఉన్న ఎండల తీవ్రత నుంచి జిల్లా ప్రజలకు కాస్తంత ఉపశమనం లభించింది. జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడటంతో పాటు మంగళవారం చిరు జల్లులు పడ్డాయి. గతానికి భిన్నంగా ఈ ఏడాది రోహిణి కార్తెలో వర్షాలు కురిశాయి. అనంతరం వచ్చిన మృగశిర, ఆరుద్రకార్తెల్లో ఎండలు మండాయి. సాధారణంగా రుతుపవనాలు విస్తరణతో ఆరుద్రకార్తె (ఈ సమయం)లో వర్షాలు పడాలి. అయితే గత నెల 22 నుంచి ఆరుద్రకార్తె రాగా నెల ఖరు వరకు ఎండలు మండాయి. జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో 38 నుంచి 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగైదు రోజులు వేడిగాలులు కూడా వీచాయి. అప్పుడప్పుడు ఉక్కపోతతో ప్రజానీకం అవస్థలు పడ్డారు. అలాంటి వాతావరణం నుంచి సోమ, మంగళవారాల్లో మార్పు వచ్చింది. అత్యధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల దిగువకు రావడంతో పాటు మబ్బులు పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఒంగోలు అర్బన్ ప్రాంతంతో పాటు మద్దిపాడు, కొత్తపట్నం, ఎన్జీపాడు, సంతనూతలపాడు, వైపాలెం, దోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు, రాచర్ల, గిద్దలూరు, కేకేమిట్ట, జరుగుమల్లి, బీమకుర్తి, దర్శి, కనిగిరి, దొనకొండ ప్రాంతాల్లో వాతావరణం చల్లబడటంతో పాటు చిరు జల్లులు పడ్డాయి.

దీంతో దాదాపు నెల రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోత వాతావరణంతో అవస్థలు పడుతున్న జిల్లా ప్రజానీకం తాజా వాతావరణ పరిస్థితితో కాస్తంత ఉపశమనం పొందింది.

ఒంగోలులో కురుస్తున్న జల్లులు

# మిద్దె మచ్చు పైనపడి బాలుడు మృతి

ఇద్దరికి గాయాలు

కురిచేడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం పడమర నాయుడు పాలెం పంచాయతీ వల్లెల యానాది కాలనీలో మంగళవారం సరదాగా ఆడు కుంటుండగా విషాద చోటుచేసుకుంది. చెట్టు, మిద్దెలు ఎక్కి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు పాత మిద్దె మచ్చు కూలి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

కాలనీలో బొజ్జా అంకారావు, బొజ్జా మార్కెయ్య, బొజ్జా వెంకటేశ్వర్లు కుటుంబాలు నివాసం ఉంటున్నారు. అంకారావు కుమారుడు మహీధర్ (13) కుమారుడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. మధ్యాహ్నం పాఠశాల భోజన విరామ సమయంలో మహీధర్ తన స్నేహితులైన మల్లికార్జున, గంగా కార్తీక్‌తో కలిసి ఆటకు వెళ్లాడు. వారి నివాసం ఉంటున్న గృహాలకు దగ్గరలో సేతు వెంకయ్య 20 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసి ఉన్న గృహాన్ని గగలిచి వదిలేసి త్రిపురాంతకం మండలం వెళ్లాడు. ఆ ఇంటికి దగ్గరలో ఓ వేప చెట్టు కూడా ఉంది. ముగ్గురు స్నేహితులు చెట్టు ఎక్కి ఆడుకుంటూ నిర్మాణం ఆగిన ఇంటిపైకి ఎక్కాడు. మిద్దెకు శ్లాబ్ వేయకుండా మచ్చు మాత్రం నిర్మించి వదిలి వేశారు. ముగ్గురు పిల్లలు ఆడుకుంటూ మచ్చుమీద కూర్చొన్నారు. వీరి బరువుకు మచ్చు విరిగి పడింది. మచ్చు కింద మహీధర్ పడిపోగా, మల్లిర్జున, గంగాకార్తీక్‌లు చివరలో పడిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి ట్రాక్టరుతో కింద పడిన మచ్చును తొలగించారు. మచ్చు కింద పడిన మహీధర్ మృతి చెందగా మల్లికార్జున్, గంగా కార్తిక్ గాయపడ్డారు. కురిచేడు ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మల్లికార్జున్‌ను మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు. ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మహీధర్ మృతదేహానికి పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడి మృతితో మహీధర్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

# సంక్షోభంలోనూ మెరుగైన సంక్షేమం

● మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

● పొందూరులో అధికారులు, నాయకులతో కలిసి.. పింఛన్ నగదు పంపిణీ చేసిన మంత్రి

కొండపి(టంగుటూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గడిచిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా సంక్షోభంలోకి నెట్టినా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అన్ని సంక్షేమ కార్యక్రమాలను పేదలకు అందిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలంలోని పొందూరు గ్రామంలో ఆయన మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు కేంద్ర ప్రభుత్వం వాటా విడుదల చేసిన వెంటనే విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్టీవో లక్ష్మీ ప్రసన్న, టీడీపీ కొండపి నియోజకవర్గ పరిశీలకులు అడకా స్వాములు, టీడీపీ నాయకులు బెల్లం జయంతిబాబు, బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్ర కూటమి లక్ష్యం

ఆరోగ్య ఆంధ్ర కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. తూర్పు నాయుడుపాలెంలో మంగళవారం క్షయ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వామి మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ బరిపరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. టీబీ నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు.

# ప్రజల చెంతకు.. పాలకులు

(5వ పేజీ తరువాయి)

చేయలేకపోయిన పనులు ఎందుకు చేయలేదో వివరించాలని చంద్రబాబు ఇప్పటికే నేతలకు సూచించారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రేపోమాపో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరాలను అమలు చేయనున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నో కష్టనష్టాల కోర్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తీరును నేతలు ప్రజలకు వివరించనున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ఎలా సాగాలన్న దానిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నేతలకు మార్గదర్శకాలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కరపత్రాలు కూడా ఆయా నియోజకవర్గాలకు మంగళవారం చేరాయి. బుధవారం ఉదయం నుంచే ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఇళ్ల బాట పట్టనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని, రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రజల ముందుంచాలనే ఆదేశాలు నేతలకు వెలువడ్డాయి. ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు సమస్యలు చెప్పుకుంటే వాటిని సావధానంగా విని పరిష్కారం కోసం కృషి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధిష్ఠానం సూచించింది. ఏడాది వ్యవధిలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఎన్నికలకు ముందు నేతలు ప్రధానంగా ఇచ్చిన హామీలు ఈ ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నేపథ్యంలో ప్రజల్లో చర్చకు రానున్నాయని, వాటిపై నేతలు కూడా సమగ్ర సమాచారం దగ్గర పెట్టుకోవాలని ఆదేశించింది. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని పై టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. నెల రోజులు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, నేతలకు పిలుపిచ్చారు. కుటుంబ సాధికార సారథుల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

అక్కడక్కడ అసంతృప్తి

బిల్లుల మంజూరు.. పనులు.. నామినేటెడ్ పదవుల విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. మన ప్రభుత్వం వచ్చింది పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయన్న విశ్వాసంతో అప్పులు చేసి మరీ సీసీ రోడ్లు, డ్రైయిన్లు, గోకులాల నిర్మాణం తదితర పనులను పెద్దఎత్తున చేశారు. అయితే ఆ బిల్లుల అంశాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తే చూద్దాం.. చేద్దాంలే అంటున్నారని బాధిత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని, సొంతవారికి ఇలా మొండిచేయి చూపించడంపై నేతలు గుర్రుగా ఉన్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో రూ.154.46 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014 నుంచి 2018 వరకు టీడీపీ ప్రభుత్వ హయంలో కూడా పార్టీ నేతలు ఉపాధి పనులు చేసిన బిల్లుల చెల్లింపు నేటికి జరగలేదు. ఇలా పెద్ద ఎత్తున సమస్యలతో నేతలు అసంతృప్తిలో ఉన్నారు. ప్రజాక్షేత్రానికి బయల్దేరిన ప్రజాప్రతినిధులు అసంతృప్త నేతలపై దృష్టి సారించేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.

## ఇంజనీరింగ్ సీట్లు 30,240

(5వ పేజీ తరువాయి)

మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది ముందుగానే నోటిఫికేషన్ జారీ చేసి కౌన్సెలింగ్ ప్రారంభించారు. అయితే ఈ ఏడాది వేర్వేరు కారణాల వల్ల నోటిఫికేషన్ ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇందుకు మరో రెండు మూడు వారాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సాంకేతిక విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర జిల్లాల వైపు కూడా కొంతమంది వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భారీ సంఖ్యలో మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులందరూ.. కళాశాలల్లో చేరతారని నమ్మకం కూడా లేదు. ప్రభుత్వం సత్వరం నోటిఫికేషన్ జారీ చేస్తే సీట్లు మిగులు తగ్గుతుందని యాజమాన్యాలు తొందరపడుతున్నాయి. కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే 30 శాతం ఉన్న యాజమాన్య కోటా సీట్లు భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటాలో ఇక్కడ కూడా కెమికల్, మెకానికల్ సీట్లు భర్తీ కావడం లేదు. ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసి విద్యార్థులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే ఏపీ ప్రభుత్వం ఈ ప్రక్రియ ప్రారంభం చేయపోవడంపై యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సత్వరం నోటిఫికేషన్ జారీ చేసి, ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

(5వ పేజీ తరువాయి)

హజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచే పి- 4 కార్యక్రమం అమలు జరగాలన్నారు. రాజధానిలో ఏర్పాటైన ప్రతి విద్యాసంస్థ గ్రామానికి నలుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఈ సూచన చేసి రెండు నెలలు కూడా కాక ముందే ఆ దిశగా ఉన్న మరో విద్యా సంస్థ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక కోర్సుతో మొదలైన ఈ విధానం ఆ తర్వాత అన్ని కోర్సులకూ విస్తరిస్తుందేమోనని, అన్ని విద్యాసంస్థలు అదే వైఖరిని చేపడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

స్థలాలు ఇచ్చిన రాష్ట్రానికి రాయితీ కరువు

రాజధానిలో విద్యా సంస్థ నిర్మాణానికి వందల ఎకరాలు స్థలం కారుచౌకగా ఇచ్చిన

## హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

రాష్ట్ర విద్యార్థులకు ఆ విద్యాసంస్థలో రాయితీ లేదు. 1 నుంచి 23 ర్యాంకులు సాధించిన వారికి ఫౌండర్ స్కాలర్‌షిప్ కింద నూరుశాతం, 24 నుంచి 68 ర్యాంకులు సాధించిన వారికి 100 శాతం మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. 69 నుంచి 5000 మధ్య ర్యాంకులు వచ్చినవారికి 90 శాతం, 5,001 నుంచి 13,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 75 శాతం, 13,001 నుంచి 23,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 50 శాతం, 23,001 నుంచి 30,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 25 శాతం ఈక్విటబుల్ రిప్రజెంటేషన్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. ఈక్విటబుల్ రిప్రజెంటేటివ్ రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదు. అంటే 68వ ర్యాంకు తరువాత వచ్చిన ఏపీలోని ఏ విద్యార్థికి ఈ రిప్రజెంటేషన్ స్కాలర్‌షిప్ రాయితీ రావడం లేదు. దీంతో విద్యార్థులంతా మొత్తం ఫీజులు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇది న్యాయం కాదు

రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని కూడా ఇలా హాస్టల్లో ఉండమని విద్యా సంస్థ డిమాండ్ చేయడం న్యాయం కాదు. హాస్టల్లో ఉండాలా, వద్దా అనేది విద్యార్థి, అతడి కుటుంబం ఇష్టం. అదే ఊరి వారిని కూడా హాస్టల్లో ఉండమనడం మరీ విడ్డూరంగా ఉంది. విద్యా సంస్థ యాజమాన్యం దీనిపై ఆలోచించాలి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.

: రాంబాబు, వెలగపూడి రైతు

## చేతి'కంది'..ధర లేక..!

(5వ పేజీ తరువాయి)

లేదంటున్నారు. కంది క్వింటా మద్దతు ధర రూ.7,550గా ఉంది. పత్తి పంట సాగు చేసి ఏటా నష్టపోతున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా కంది పెద్ద ఎత్తున సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం కంది సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేసింది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో పాటు మార్కెట్‌లో ధర ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 66273 ఎకరాల్లో కంది సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. అయితే.. మార్క్‌ఫెడ్ మొక్కుబడిగా కంది కొనుగోళ్లు చేసింది. రైతుల వద్ద ఇంకా క్వింటాళ్ల నిల్వలు ఉన్నాయి. కందులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేరు. కంది పుచ్చే తత్వం అధికంగా ఉంటుంది. మార్కెట్‌లో విక్రయిద్దామంటే క్వింటా రూ.6,500 లోపే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కంది నిల్వలన్నీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దళారులు తక్కువకు అడుగుతున్నారు

కౌలుకు పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో దళారులు క్వింటా రూ.6,500కు కూడా కొనడం లేదు. ఎక్కువ కాలం ఇంటిలో కందులు నిల్వ చేయలేము. ప్రభుత్వం మద్దతు ధరకు రైతులు వద్ద ఉన్న కందులు కొనాలి.

- గెల్లి యోగిరెడ్డి, తెల్లాపల్లి

## సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

● పీడీసీసీ బ్యాంకు చైర్మన్ సీతారామయ్య

చీమకుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కోరారు. మంగళవారం చీమకుర్తి సహకార బ్యాంకును, మండలంలోని కేవీపాలెం సొసైటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారోత్సవాలను పురస్కరించుకుని ఆయా సొసైటీల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. బ్యాంకు శాఖ పనితీరును పరిశీలించారు. రైతులకు బ్యాంకు, సొసైటీ ద్వారా మరింత సేవ చేసి వారి అభిమానాన్ని చూరగొనాలన్నారు. ఉద్యోగుల కు పలు సూచనలు చేశారు. కేవీపాలెంలో సాధారణ సమావేశానికి ఆయన హాజరయ్యారు.

## ఆటోను ఢీకొన్న మోటార్‌సైకిలిస్టు

బాధితుడ్ని వైద్యశాలకు తరలింపునకు ఏర్పాట్లు చేసిన మంత్రి రవి

గాయపడ్డ యువకుడిని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న మంత్రి రవి

మేదరమెట్ల,జూలై1(ఆంధ్రజ్యోతి): ఆటోను మోటారుసైకిలిస్టు ఢీకొన్న ఘటన రాదినగాళం- మేదరమెట్ల రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు కు చెందిన ఇన్నర్ల శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ సమయంలో దైవాలరావూరులో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని మేదరమెట్ల వైపు వెళ్తున్న మంత్రి రవికుమార్ ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఆగి క్షతగాత్రుడు శ్రీకాంత్‌ను వైద్యశాలకు తరలించేందుకు 108 కు ఫోన్ చేశారు. వాహనం అక్కడకు వచ్చి శ్రీకాంత్‌ను తీసుకు వెళ్ళేంతవరకు రవికుమార్ అక్కడే ఉండి పర్యవేక్షించారు. మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

ఇసుక రవాణా చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

చినగంజాం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, సోన పోరంబోకు భూములలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకొంటామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎస్ఐ శీలం రమేష్‌లు హెచ్చరించారు. చినగంజాం గ్రామ సర్వే నెంబరు 829లోని సోన పోరంబోకు భూములలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న ప్రదేశాన్ని వారు మంగళవారం పరిశీలించారు. సోన పోరంబోకు భూములలో అక్రమ ఇసుక రవాణా జరుగుకుండా కట్టలు(బ్రిండ్) వేయించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములలో అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు, అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎ బందారు దానియేల్, పోలీసులు పాల్గొన్నారు.

## శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ల క్షలాది మందికి జీవనాధారం అయిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే సాగు, తాగునీరు సంబంధించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుం డా గాబోయే మార్కాపురం జిల్లాలో శ్రీశైలం, సున్నిపెంటలను కలపాలని గొడ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మార్కా పురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటులో భాగంగా జరుగుతున్న అనేక విషయ సేకరణలో శ్రీశైలం, సున్నిపెంట లాంటి ప్రాంతాలను మార్కాపురంలో కలపాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## నాలుగు ట్రక్కుల వరిగడ్డి అందజేత

పశు గ్రాసం అందజేస్తున్న దాతలు

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ సమీపంలోని హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో ఉన్న ఆవులకు మంగళవారం గోపాలపురానికి చెందిన శింగమనేని నాగేశ్వరరావు, కోయ సాంబశివరావులు నాలుగు ట్రక్కుల వరిగడ్డిని అందజేశారు. మైలవరానికి చెందిన బీమని లక్ష్మయ్య, సుబ్బారావు పశుగ్రాసానికి నగదు ఇచ్చారు. పొన్నగంటి ఈశ్వరయ్య ముందుకు వచ్చారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు, వాసు గురుస్వామి, వినుకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సులభతరంగా రేషన్ పంపిణీ

అవీఐఏ

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణం ద్వారా రేషన్ సరుకులు సులభతరంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొంగళవీడు రోడ్డులో చౌకధరల దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.గతంలో ఆటోల ద్వారా రేషన్ పంపిణీ వలన పలుచోట్ల ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియక పనులు మానుకుని మరీ వేచి చూసేవారన్నారు. ఆ ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేదలకు రేషన్ పంపిణీ సక్రమంగా అందించాలన్న ఉద్దేశ్యంతో డీలర్ల ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు రేషన్‌దుకాణం వద్ద బియ్యం తీసుకునేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణ, కౌన్సిలర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

## 4న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

మార్కాపురం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పవన్‌కళ్యాణ్ ఈనెల 4న మార్కాపురం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రానికి సమాచారం రావడంతో మంగళవారం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ త్రివినాగ్ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ గ్రామం వద్ద శిలాఫలకం ఆవిష్కరణ, జలజీవన్ మిషన్ పథకం లో మంజూరైన పనులను పవన్‌కళ్యాణ్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. పట్టణ శివారు ప్రాంతంలోని బోడపాడు రోడ్డులో గల ప్లాట్లలో హెలీప్యాడ్ స్థలాన్ని, మార్కెట్ యార్డులో సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, నాయకులు పాల్గొన్నారు. బుధవారం కలెక్టర్ అన్సారియా స్థలాన్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.

## పంట సాగుదారు చట్టంతో చక్కని ప్రయోజనం

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పంట సాగుదారు చట్టంతో కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. చీరాల, వేటపాలెం మండలాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా ఈ పథకం ద్వారా ప్రతి కౌలురైతుకు బ్యాంకు ద్వారా ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు. భూ యజమాని సాగులేని కౌలుదారులకు సహకరించాలన్నారు. తద్వారా యజమానులకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల కోటేశ్వరరావు, డీఈఆర్‌సీ ప్రతినిధి భగవాన్‌దాస్, సెక్రటరీ భారతి, లలిత, ప్రభుత్వ శాఖల సిబ్బంది, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ

డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే నిర్వహణ

డాక్టర్ ఫణీంద్రబాబును సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ నూతన అధ్యక్షుడిగా కూరపాటి శివవరప్రసాద్‌రావు, కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక క్రాంతి నర్సింగ్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఫణీంద్రబాబు, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మచౌదరి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ ఫణీంద్రబాబు, డాక్టర్ భాగాలక్ష్మిలను సన్మానించారు. అకౌంటెంట్స్‌డే సందర్భంగా కోట శ్రీనివాసకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చప్పిడి వీరయ్య, మందూరి మురళీసుధాకర్, మలాది శ్రీనివాసరావు,అబ్బూరి హరిప్రసాద్, చామర్తి వెంకట సుబ్బారావు, మహ్మద్‌రఫీ, లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, దేవలపాలెన, జ్యోతి చం ద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచం ద్రమూర్తి, డాక్టర్ బాజీవలి, సంకా బాబు, ఊటుకూరి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యులకు రోటరీ సభ్యుల సత్కారం

మార్టూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): జాతీయవైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను పూలమాలలతో, శాలువాలు కప్పి సత్కరించారు. ఆస్పత్రిలో వైద్యులుగా పనిచేస్తున్న ఆశోక్‌రెడ్డి, విష్ణుతేజ, కిషోర్ కుమార్, సాయి ప్రసాదరావు, గార్గేయు, సిద్దార్థ, సుబ్రహ్మణ్యంలను రోటరీ సభ్యులు సత్కరించారు. అనంతరం రోగులకు రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, ఖజ్జూర అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రవేటు వైద్యులు వి శ్రీనివాసరావు తదితరులను సత్కరించారు. అంతేకాకుండా జాతీయ చార్టర్ అకౌంట్సు దినోత్సవం సందర్భంగా కె రాకేష్, వనజ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఆర్ అంకమ్మచౌదరి, మాజీ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, షేక్ కాజాహుస్సేన్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీకి 97శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు మంగళవారం 96శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. గత నెల 20న వాయిదా పడినపరీక్షను నిర్వహించారు. జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో జరిగా 1015 మందికి 973మంది హాజరు కాగా 42మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 581మందికి 551, మధ్యాహ్నం సెషన్‌లో 434మందికి 422 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో పేర్కొన్నారు.

## 8 కిలోలు గంజాయి పట్టివేత

● నిందితుడి అరెస్టు

ఒంగోలు క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో గల ఏబీఎం కాలేజి కాంపౌండ్ వాల్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎలీనా తెలిపారు. మంగళవారం నిర్వహించిన తనిఖీలలో భాగంగా చిత్తూరు జిల్లా నగరి మండలానికి చెందిన ఎస్.మణిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అనకాపల్లి నుంచి నగరికి గంజాయి తీసుకెళుతుండగా ఒంగోలులో రైలు దిగడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు పి.రవిఆంజనేయులు, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

## అవీ..ఇవీ..

### ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

గుంటుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

బల్లికురవ. జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు సరైన అవగాహనతో ముందుకు వెళ్లాలని ఏవో పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గుంటుపల్లి, బల్లికురవ గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ రైతులు ప్రణాళిక ప్రకారం వ్యవసాయం చేపట్టా లన్నారు. భూసార పరీక్షలు చేయించుకొన్న రైతులు వాటి ద్వారా వచ్చిన రిపోర్టుల ప్రకారం పంటలు సాగు చేసుకోవాలన్నారు. రైతులకు మినికంది విత్తనాల కిట్‌లు త్వరలో ఉచితంగా అందజేయనున్నట్లు తెలి పారు. సమావేశంలో ఏఈవో మౌలాలి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు మంత్రి చేతుల మీదుగా డ్రోన్ పంపిణీ**

బల్లికురవ మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ చేతుల మీదుగా వైదన గ్రామ రైతులకు డ్రోన్ పరికరాన్ని అందజేస్తామని ఏవో పి. శ్రీనివాసరావు తెలిపారు.

### పొగాకు సాగు చేయవద్దు

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి): రైతులు ఈ ఏడాది పొగాకు పంటసాగు చేయవద్దని అద్దంకి ఏడీఏ ఎప్రాయం అన్నారు. మండలంలోని వెంపరాల, చక్రాయపాలెంలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకును ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలన్నారు. రైతులు ప్రత్యామ్నాయంగా అపరాల సాగు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు పంటసాగు ధృవీకరణ పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొ ్రపాటి వెంకటకృష్ణ, శేషయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపాలి

● రైతులకు ఏవో భాస్కరరావు సూచన

ఎదుబాడు(పర్చూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులు బర్లీ పొగాకు సాగుచేయవద్దని ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్న, జొన్న పంటలపై మొగ్గుచూపాలని వ్యవసాయాధికారి కె.భాస్కర్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని ఎదుబాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు రైతుల సమస్యపై ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుడుతోందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ ఏవిధంగా చేసుకోవాలని అన్న అంశంపై రైతులకు వివరించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వై.శ్రీకాంత్, ఎంపీఈవో లావణ్య సర్పంచ్ ఆళ్ల వెంకట్రావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

### రసాయన రహిత సాగుకు సిద్ధం కావాలి

పంగులూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రసాయన రహిత సాగు చేసేందుకు రైతులు సిద్ధం కావాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్న పంటను రైతులతో కలసి పరిశీలించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు, పచ్చిరొట్ట పంటల సాగు చేపట్టి పూతదశలో భూమిలో కలియదున్నాలన్నారు. తద్వారా భూసారం పెరుగుతుందని సూచించారు. పంటల బీమా పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధూళిపాళ్ల నారాయణస్వామి, వ్యవసాయ సహాయకురాలు శివాని పాల్గొన్నారు.

### పత్తి రైతులు బీమా నమోదు చేయించుకోవాలి

మాట్లాడుతున్న పర్చూరు ఏడీఏ ప్రవీణ

యద్దనపూడి, (మార్టూరు) జూలై1: ఆంధ్రజ్యోతి): పత్తిసాగు చేసే రైతులు పంటల బీమా నమోదు చేయించుకోవాలని పర్చూరు ఏడీఏ ప్రవీణ అన్నారు. మంగళవారం ఆమె యద్దనపూడి మండలంలోని యద్దనపూడి, యనమదల గ్రామాలలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిపంటసాగుచేసే రైతులు బ్యాంక్ రుణం తీసుకుంటే బ్యాంక్ లోనే బీమా ప్రీమియం తీసుకుంటారన్నారు. ఒక వేళ బ్యాంక్ రుణం తీసుకోని రైతులు మరియు కౌలు రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీ సేవా సెంటరులో ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.1900 బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. అందుకు తుదిగడువు ఈ నెల 15 వరకు తుది గడువన్నారు. ఏవో కుమారి మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పత్తి, శనగ, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న పంటలను సాగుచేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వీఏఏ వినయ్, నరేంద్ర, ఏఈవో మధుప్రియరైతులు సంగు చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు కేంద్రం ఏర్పాటుపై హర్షం

● ఆత్మస్థైర్యం నింపిందంటున్నరైతులు ● మండలంలో 1212 మంది సాగు

వరుసలో ఉంచిన పొగాకు బేళ్ళతో రైతులు

పంగులూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు మార్కెట్ యార్డ్‌లో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో 1212 మంది రైతులు గత వ్యవసాయ సీజన్‌లో వేల ఎకరాలలో నల్లబర్లీ సాగు చేశారు. రైతుల వద్ద ఇంచుమించు 47,108 క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉన్నట్లు అధికారులు అంచనావేశారు. రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు జరగకపోవడంతో కష్టాలలో ఉన్న పొగాకు రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తమకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రారంభించడం బర్లీ పొగాకు రైతులలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. బర్లీ సాగుకు రైతులను ప్రోత్సహించిన కంపెనీ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి స్థైర్యం కోల్పోయిన రైతులకు ఈ కొనుగోలు కేంద్రాలు ధైర్యాన్ని నింపాయి. రైతువద్ద ఉన్న ఆఖరి పొగాకు బేలువరకు కొనుగోలు చేసి రైతును ఆదుకుంటామని, అండగా ఉంటామని ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు భరోసా ఇవ్వడంతో రైతులలో పొగాకు అమ్ముకోగలమనే నమ్మకాన్ని పెరిగింది. సోమ, మంగళ వారాలలో కొనుగోలు కేంద్రానికి పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చిన రైతులు తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

**ప్రభుత్వం కొనకుంటే కోలుకొనే పరిస్థితి లేదు**

గత ఏడాది పొగాకు సాగు ఆశాజనకంగా ఉండడం, కొనుగోలుకు కంపెనీలు ఇచ్చిన భరోసాతో ఐదెకరాలలో నల్లబర్లీ సాగు చేశా. సాగును ప్రోత్సహించిన కంపెనీలు కొనుగోలుకు ముందుకురాలేదు. ఈ తరుణంలో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే కోలుకొనే పరిస్థితి లేదు.

**వై.పరుశురాం, రైతు, రాచపూడి, కొరిశపాడు మండలం**

**ప్రభుత్వ చర్యలతో జీవితంపై ఆశలు చిగురించాయి**

పొగాకు సాగు విషయంలో కంపెనీలు చెప్పిన మాటలు నమ్మి 11 ఎకరాలలో నల్లబర్లీ సాగు చేపట్టా. పంట చేతికందే సమయానికి కంపెనీ ప్రతినిధులు పంట కొనుగోలు చేయకుండా ముఖం చాటేశారు. అప్పుల బాధలు భరించలేక పొగాకు అమ్మకాల కోసం కంపెనీ చుట్టూ తిరగని రోజులేదు. కంపెనీ మాటలు నమ్మి మోసపోయానని అర్థమైంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకురావడం నాకు జీవితాన్ని ఇచ్చినట్లు అయ్యింది.

**కౌలురైతు నాయపాము రఘురాం, చందలూరు**

# పీహెచ్‌సీలో భయం భయం

**ఆరోగ్యకేంద్రం నలువైపులా దట్టంగా ఉన్న పిచ్చిమొక్కలు**

పీహెచ్‌సీ చుట్టూ దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

బల్లికురవ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్రతి నెల పరిశుభ్రం చేయిస్తున్నామని చెబుతున్న క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్దఎత్తున పిచ్చి మొక్కలు పెరిగిన అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో వైద్యం కోసం వచ్చే రోగులు దట్టంగా ఉన్న పిచ్చి చెట్లను చూసి భయాందోళన చెందుతున్నారు. వైద్యశాలలోనే ఇలా ఉంటే అంటువ్యాధులు ప్రబలవా..? అని వారు ప్రశ్నిస్తున్నారు.

బల్లికురవ మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. వైద్యశాల నలువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పాటు గోడలపైకి కూడా చెట్లు ఎగబాకాయి. దీంతో పీహెచ్‌సీలో దోమల బెడద కూడా అధికంగా ఉందని రోగులు వాపోతున్నారు. వైద్యశాల మాత్రం లోపల చాలా శుభ్రంగా ఉందని బయటకు వస్తే చూట్టుతా పనికి రాని పిచ్చి మొక్కలు చిట్టడవిని తలపించేలా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. వైద్యశాల ఆవరణ మెత్తం పారిశుధ్య పనులు చేయించాలని లేకుంటే ముందు ముందు భారీ వర్షాలు పడితే వైద్యశాలకు వచ్చే రోగులకు అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని వారు అంటున్నారు. అధికారులు కూడా ప్రతి నెల ఒక గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తున్నామని చెబుతున్న ఎక్కడ అమలు కావడం లేదని ఫోటోలు తీసి పంపడమే కాని క్షేత్రస్థాయిలో ఎక్కడ సరిగా పనిచేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో రోడ్లవెంబడి కూడా చెత్త రోజురోజుకు పేరకు పోతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ గోడలపై ఎగబాకిన పిచ్చిమొక్కలు

# పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

ఇసుకదర్శిలో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు,జూలై1(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, పేద కుటుంబాలలోని మహిళలకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1వ తేదీనే పించన్లు పంపిణీ చేస్తూ అండగా నిలుస్తున్నారని, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం 1వ తేదీ కావడంతో మండలంలోని అన్నిగ్రామాలలో అధికారులు పెన్షనుదారుల ఇంటికి వెళ్లి వారికి పెన్షన్లను అందజేశారు. దీనిలో భాగంగా మండలంలోని ఇసుకదర్శి గ్రామంల అధికారులతో కలిసి పెన్షను దారుల ఇంటికి వెళ్లి వారికి పెన్షన్ నగదును అందజేశారు. గ్రామంలోని అర్హులైన వారికి త్వరలోనే కొత్త పెన్షన్లును ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రతి నెలా 1వతేదీ ప్రజలకు పెన్షన్లను అందచేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలపై నాయకులతో మాట్లాడారు. ఆయన వెంట పెన్షన్లు పంపిణీలో పాల్గొన్న పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణ చేతుల మీదగా కొంతమందికి పెన్షన్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, పాలెపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**

పర్చూరు : విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు, కారంచేడు ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టిన జీవీ.చౌదరి, ఖాదర్‌బాషా మంగళవారం మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరిని మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ నేరనియంత్రణలు, చోరీలు, శాంతిభద్రతల నిర్వహణలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

## పచ్చిరొట్ట పంటల సాగుకు రైతులు మొగ్గు

● భూములలో తగ్గిపోతున్న సేంద్రియ కర్బనం

పచ్చిరొట్టగా మినుమును కలియదున్నుతున్న రైతు

అద్దంకి,జూలై 1(ఆంధ్రజ్యోతి): పంట భూములలో సేంద్రియ కర్బనం నానాటికి తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పచ్చిరొట్ట పైర్ల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సాహకంగా రైతులకు రాయితీపై పచ్చిరొట్ట పంటల విత్తనాలు అందజేస్తోంది. అత్యధిక శాతం భూములలో ఏటా ఒకేరకమైన పంట సాగు చేపడుతున్నారు. దీంతో సమతుల్యత లోపించే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో పచ్చిరొట్ట పంటలు సాగుచేసి దుక్కిలో కలిసి పోయేలా దున్నుతున్నారు. పచ్చిరొట్ట ఎరువులుగా మారే మినుము, జీలుగ, పెసర, జనుము తదితర పంటలు సాగు చేస్తున్నారు. తద్వారా కాంప్లెక్స్ ఎరవుల వినియోగం తగ్గే అవకాశం ఉంది. రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఏవో వెంకటకృష్ణ తెలిపారు.

## ఘనంగా ఎస్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవం

చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్ రాజేష్

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఎస్‌బీఐ(మెయిన్), ఎస్‌బీఐ(ఏడిబి) శాఖలలో నిర్వహించారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో చీఫ్ మేనేజర్ రాజేష్ కేక్ కట్ చేశారు. ఖాతాదారులు ఇద్దరు మృతిచెందిన నేపథ్యంలో ఆ కుటుంబసభ్యులకు రెండు లక్షల రూపాయల చొప్పున బీమా పరిహారం చెక్కులు అందజేశారు. కార్య క్రమంలో వసంతకుమార్, అరవింద్, నరశింహరావు, రవితేజ, మస్తాన్‌రావు, పార్వతి, కిరణ్‌కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బల్లికురవకు మంత్రి రవికుమార్ రాక

పంపిణీకి సిద్ధంగా ఉన్న తోపుడు బండ్లు

బల్లికురవ. జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నేడు బల్లికురవ గ్రామంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా బల్లికురవ గ్రామంలో ఇంటింటికి మంత్రి రవికుమార్ తిరిగి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలు తెలియజేయనున్నారు. అనంతరం చిరువ్యాపారులకు మంత్రి రవికుమార్ చేయుతతో తయారు చేయించిన తోపుడు బండ్లను అయన పంపిణీ చేయనున్నారు.

## చెత్త తొలగింపునకు చర్యలు

రోడ్డు వెంబడి ఉన్న చెత్తను యంత్రంతో తీయిస్తున్న అధికారులు

బల్లికురవ. జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం బల్లికురవ నుంచి చెన్నుపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో పెద్దగుంటను తీయించి గ్రామంలో ఉన్న చెత్తను గోతిలో ట్రాక్టర్ల ద్వారా తెచ్చి పడవేయించారు. గ్రామంలో ఎక్కడ చెత్త అనేది కనిపించకుండా చర్యలు చేపడతామని ప్రజలు కూడా తమకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుమతి, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న, డిజిటల్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై ఇంజనీరింగ్ కార్మికులు నిరసన

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

చీరాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం చీరాల మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మోకాళ్లపై నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిమటా వీరస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనబాట పట్టినట్లు వివరించారు. సమానపనికి సమాన వేతనం అందించాలని, గత ప్రభుత్వ హయాంలో 17 రోజుల సమ్మెకు సంబంధించిన జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సురేష్, చాంద్‌బాషా, కొండయ్య, కాంతారావు, క్రాంతి, విశ్వేశ్వరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై జనార్ధన్

పందిళ్లపల్లి(చీరాల), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : యుక్తవయసు విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని వేటపాలెం ఎస్సై జనార్ధన్ అన్నారు. మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 'సమాజంలో మోసపూరిత అంశాలు - అప్రమత్తం'పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీనేజీలో యువత ఆకర్షణకు లోనుకాకూడదన్నారు. ఈక్రమంలో తల్లిదండ్రులు శ్రమించి విద్యాబుద్ధులు నేర్పేందుకు పాటుపడుతున్న సమయాలను గుర్తుచేసుకుని భద్రంగా ఉండాలన్నారు. సామాజిక మధ్యమాలకు వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితరాలతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు 1930ను సంప్రదించి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటోను వెనుక నుంచి ఢీకొన్న కారు

మార్టూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న టాటాఏస్ వాహనాన్ని వెనుకనుంచి కారు ఢీకొన్న ఘటన జాతీయరహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం వేకువజామున చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవరు కొమెరా రవి, కారు డ్రైవరు మండరం రేవంత్‌లు గాయపడ్డారు. మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన ఆటో ఉలవపాడు వెళుతుండగా, నెల్లూరుజిల్లా, బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన కారు ముందువెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. ఘటనలో డ్రైవర్లు ఇద్దరు గాయపడడంతో 108 వాహనంలో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా హైవేపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలను సిబ్బంది తొలగించారు. పోలీసులు విచారిస్తున్నారు.

## బధిర విద్యార్థులకు స్వీట్లు పంపిణీ

స్వీట్లు అందజేస్తున్న కరూర్ వైశ్యబ్యాంక్ మేనేజర్ కేశవబాబు, సిబ్బంది

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): కరూర్ వైశ్యబ్యాంక్ 109వ ఆవిర్భావ దినోత్సవము సందర్భంగా స్థానిక శింగరకొండ రోడ్డు లోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కేశవబాబు, పాఠశాల నిర్వాహకులు పూనూరి ఆరోగ్యం, సురేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం

అద్దంకి, జూలై1(ఆంధ్రజ్యోతి): అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

## అద్దంకి ఎంఈవో-2గా శ్రీనివాసరావు బాధ్యతలు

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి):అద్దంకి ఎంఈఓ2 గా ఏ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ2 గా విధులు నిర్వహించిన సుధాకరరావు సోమవారం ఉద్యోగ విరమణ చేయటం తో ఇంకొల్లు ఎంఈఓ 2 గా ఉన్న శ్రీనివాసరావు కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు ను ఏపిటీఎఫ్, యుటిఎఫ్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |

# నేటినుంచి ఇంటింటికీ టీడీపీ

- సుపరిపాలనలో తొలి అడుగు పేరిట కుప్పంలో ప్రారంభించనున్న జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు
- నెల రోజులపాటు జనం బాట పట్టనున్న అధికార పార్టీ నేతలు

చిత్తూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు సుపరిపాలనలో తొలి అడుగు పేరిట నేటి నుంచీ జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. బుధవారం నుంచీ అధికార పార్టీ నేతలు నెల రోజులపాటు జనం బాట పట్టనున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం సాయంత్రం శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లెలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సుమారు రెండు గంటల పాటు గ్రామంలో ఉండి, ఇంటింటికీ వెళ్తారు. గడచిన ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయనున్నారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టి ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచేందుకు కృషి చేయనున్నారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్ విదేశీ పర్యటనలో వున్న దృష్ట్యా ఆయన మినహా మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు, నేతలు ఇంటింటికీ వెళ్ళి జనంతో మమేకం కానున్నారు. పాడైన రోడ్లు బాగుపడడం, కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం, పెరిగిన సంక్షేమ పెన్షన్ మొత్తాలు, తల్లికి వందనం, ఉచిత వంట గ్యాస్ వంటి పథకాల అమలు నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ధైర్యంగా జనంలోకి వెళ్ళగలిగే వాతావరణం నెలకొనివుండడంతో పార్టీలో ఉత్సాహపూరిత వాతావరణం కనిపిస్తోంది.

### తొలి ఏడాదిలో చేసిన పనులివీ

ఇప్పటికే జిల్లాలో సామాజిక పెన్షన్లను పెంచి 2.66 లక్షల మందికి నెలకు రూ.122 కోట్లను అందిస్తున్నారు. మహిళలకు ఉచిత సిలిండర్ పథకాన్ని ప్రారంభించి రూ.40.53 కోట్లను ఖర్చు చేశారు. ఇటీవల తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించి జిల్లాలోని 2.60 లక్షల మంది పిల్లలకు రూ.338 కోట్లను అందించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలతో పాటు జిల్లాలో రహదారుల మరమ్మతులు, అభివృద్ధి.. గోకులం షెడ్ల నిర్మాణం.. మామిడి రైతులకు సబ్సిడీ.. సీసీ రోడ్ల నిర్మాణం.. వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. వీటన్నింటి గురించి ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు అవగాహన తెచ్చుకుని.. ఇంటింటికి వెళ్లి వివరించాల్సి ఉంటుంది.

### ఏ ఎమ్మెల్యే ఎక్కడ పాల్గొంటారంటే..

ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి వి.కోట మండలం కొంగాటం గ్రామంలో బుధవారం ఉదయం పర్యటించనున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ బుధవారం ఉదయం 8 గంటలకు చిత్తూరు నగరంలోని ఎం.అగ్రహారం నుంచి ప్రారంభించి, మురకంబట్టు, చవటపల్లె, దొడ్డిపల్లె, కట్టమంచి ప్రాంతాల్లో సాయంత్రం వరకు పర్యటిస్తారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఉదయం 7 గంటలకు బంగారుపాళ్యం మండలంలోని సంక్రాంతిపల్లె నుంచి ప్రారంభించి, ఐరాలలోని వడ్రాంపల్లె, తవణంపల్లెలోని తెల్లగుండ్లపల్లె, పూతలపట్టులోని కమ్మగుట్టపల్లె, యాదమరిలోని తెల్లార్లపల్లెల్లో పర్యటిస్తారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విజయపురం మండలం పన్నూరు గ్రామంలో పర్యటించనున్నారు. పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పులిచెర్ల మండలం కల్లూరులో పాల్గొననున్నారు.

## ప్రభుత్వ, రాజకీయ సమన్వయం

- నేడు, రేపు చంద్రబాబు కుప్పం పర్యటన

# సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

కుప్పం/శాంతిపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితంగా కనిపించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన మారింది. రాజకీయ వర్గాలతో సమన్వయం చేసుకుంటూ మారిన షెడ్యూల్ ప్రకారం ఆయన బుధవారం మధ్యాహ్నం శాంతిపురం మండలం చేరుకుని, గురువారం సాయంత్రం తిరుగు ప్రయాణం కానున్నారు. తొలిరోజున టీడీపీ కార్యక్రమమైన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని తిమ్మరాజుపల్లెలో ప్రారంభించనుండగా, రెండవ రోజైన గురువారం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొనడంతోపాటు అధికార, రాజకీయ వర్గాలతో సమావేశం కానున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డులోని హెలిప్యాడ్‌కు బెంగళూరునుంచి చేరుకుంటారు. ఇక అక్కడినుంచి బయలుదేరి ఏపీ ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతారు. పంపిణీలు చేసిన అనంతరం స్వగృహం ఉన్న శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ తిమ్మరాజుపల్లె చేరుకుని 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా ముందుగానే నిర్ణయించిన 26 ఇళ్లకు వెళ్లి, వారిని పలకరించి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తారు. కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటారు. రాత్రికి స్వగృహంలో బస చేస్తారు. మళ్లీ గురువారం ఉదయం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం స్వగృహంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తారు. అదయ్యాక టీడీపీ క్యాడర్‌తో సమావేశమై రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తారు. సాయంత్రం చంద్రబాబు తిరుగు ప్రయాణమవుతారు.

### సీఎం పర్యటన ఇలా...

**నేడు**

- 12.40 పీఎం - తుమ్మిశి రోడ్డులోని హెలిప్యాడ్‌కు చేరిక
- 12.50 పీఎం- 01.30 పీఎం - రిజర్వ్‌డ్
- 1.30 పీఎం - 3.00 పీఎం - తుమ్మిశి మోడల్ స్కూల్ సమీపంలో సభ
- 3.00 పీఎం -4.00 పీఎం - వివిధ కంపెనీలతో ఎంఓయూలు, స్టాల్స్ సందర్శన
- 4.35 పీఎం- 7.00 పీఎం - తిమ్మరాజుపల్లెలో ఇంటింటి ప్రచారం.
- 7.05 పీఎం - కడపల్లె స్వగృహం చేరిక, రాత్రి బస

**రేపు**

- 10.35 ఏఎం- 12.05 పీఎం - కుప్పం ఏరియా ఆస్పత్రిలో డీఐఎన్‌సీ ప్రారంభం
- 12.15 పీఎం -1.30 పీఎం - స్వగృహంలో అధికారులతో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష
- 1.30 పీఎం - 2.30 పీఎం - రిజర్వ్‌డ్
- 2.30పీఎం -4.00 పీఎం -టీడీపీ శ్రేణులతో సమావేశం
- 4.10 పీఎం - తుమ్మిశి రోడ్డులోని హెలిప్యాడ్‌కు చేరుకునితిరుగు ప్రయాణం.

స్థానిక ఎమ్మెల్యే కూడా అయిన చంద్రబాబు, గతంలో రెండు పర్యటనలకు వచ్చినప్పుడు ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితమవడం టీడీపీ శ్రేణుల్లో ఒకింత అసంతృప్తికి కారణమైంది. ఈసారి కూడా సీఎంగా మాత్రమే ఆయన వస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితమవుతున్నారన్న ప్రచారం జరిగింది. కడా ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల ఏర్పాట్లకోసం జిల్లా అధికార యంత్రాంగం హడావుడి ఎక్కువైంది. కేవలం అధికారుల కార్యక్రమంగానే రెండుమూడు రోజుల నుంచి కనిపిస్తోంది. పార్టీ క్యాడర్ కానీ, నాయకులను కానీ పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇది క్యాడర్‌లో ఒకింత అసహనానికి కారణమైంది. అంతేకాక నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ పరంగా ఉన్న 12 క్లస్టర్ల ఇన్‌చార్జులను మార్చి, కొత్తవారిని నియమిస్తూ సోమవారం జాబితా విడుదలైంది. ఉన్నపళంగా అందరినీ మార్చివేయడాన్ని సీనియర్లు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ మొత్తం వ్యవహారం పార్టీ క్యాడర్‌లోని అసంతృప్తి అధినేత చంద్రబాబు దృష్టికి వెళ్లినట్లుంది. ఈ నేపథ్యంలోనే కుప్పం పర్యటన షెడ్యూల్, రెండు రోజులకు విస్తరించడమే కాక, పార్టీ శ్రేణులతో సమావేశాలను చేర్చుకుంటూ దిశ మార్చుకుందని పార్టీ వర్గాలంటున్నాయి.

### టీడీపీ క్యాడర్‌లో సమన్వయంకోసమే

## నిబద్ధతతో రోగులకు సేవలు

సమావేశంలో పాల్గొన్న పీఈఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు తదితరులు

కుప్పం, జులై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు రోగుల సేవలో నిబద్ధత కనబరచాలని కుప్పంలోని పీఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు అన్నారు. పీఈఎస్ వైద్య కళాశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల వైద్య రంగంలో చేసిన సేవల గురించి వివరించచారు. తమ సంస్థ నుంచి 2,665 యుజీ, 894 పీజీ వైద్య నిపుణులు విజయవంతంగా పట్టభద్రులయ్యారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, సూపరింటెండెంటు డాక్టర్ కె.సుబ్రమణ్య, గిరిశంకర్, డీసీబీ బ్యాంక్ మేనేజర్లు వివిధ విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

**పలమనేరు** : డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం పలమనేరులో డాక్టర్ సుశీలను హ్యూమన్‌రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ నాయకులు మధుమోహన్‌రావు, రాజారెడ్డి ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాలుగా పలమనేరులో అతి తక్కువ ఫీజు తీసుకొంటూ పేదలందరికీ డాక్టర్ సుశీల వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు. మంగళవారం క్లీనిక్‌లో ఆమెకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంగవరం,జూలై01(ఆంధ్రజ్యోతి): కారు,ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు....పలమనేరు రాధాకృష్ణ వీధిలో ఉంటున్న షేక్‌మస్తాన్ (44), మరో బాలిక రితిక(16)తో కలసి ద్విచక్రవాహనం పై జాతీయ రహదారిపై గంగవరం సమీపంలో ఆపోజిట్ రోడ్డులో వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో మస్తాన్‌కు తీవ్రగాయాలై మృతిచెందాడు. రితికకు తీవ్ర గాయాలయ్యాయి. పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

### విద్యార్థికి తీవ్ర గాయాలు

గాయపడిన అరుణ్

పుంగనూరు రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. మంగళం పంచాయతీ జెట్టిగుట్లపల్లెకు చెందిన అరుణ్‌కుమార్ స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వచ్చి స్కూల్ బ్యాగు పాఠశాలలో పెట్టి రోడ్డు దాటుతుండగా ఓ ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తరలించారు.

## వైసీపీ దుస్థితిని గుర్తెరిగి మసలుకోవాలి

● టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ కంచర్ల హితవు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం/శాంతిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలతో సాగించిన వైసీపీకి ఎన్నికల్లో ప్రజలు ఏ విధంగా బుద్ధిచెప్పారో గుర్తెరిగె మసులు కోవాలని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్ టీడీపీ శ్రేణులకు హితవు పలికారు. మంగళవారం రామకుప్పం, శాంతిపురం మండలాల పార్టీ పదాధికారులకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. నియంతృత్వ, రాక్షస పాలనతో వైసీపీ పట్టిన దుస్థితిని గుణపాఠంగా తీసుకోవాలన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం నుంచి అందదండలు అందేలా చూడాలన్నారు. ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు పలు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, గ్రామాల్లో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతోందన్నారు. వీటిపై సుపరిపాలనలో తోలి అడుగు అనే కార్యక్రమాన్ని పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. గురువారం నుంచి ఇంటింటా తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చెర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, .సురేష్‌బాబు, టీడీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, నేతలు చంద్రశేఖర్, మునస్వామి, పట్రనారాయణాచారి, ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు, నాగరాజు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. శాంతిపురం మండలం చీమనపల్లెలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి :చల్లా

టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

సోమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గడచిన ఏడాది కాలంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సోమల ఏఎంసీ మార్కెట్ యార్డులో నియోజక వర్గం స్థాయి టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో వర్గ విభేదాలు లేకుండా పనిచేద్దామన్నారు. ప్రభుత్వ పథకాల గురించి బుధవారం నుంచి ఇంటింటికీ తిరిగి తెలియజేయాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. అనంతరం బూత్, క్లస్టర్ నాయకులకు టీడీపీ యాప్‌లపై అవగాహన కల్పించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నాయకులు ఉయ్యాల రమణ, వెంకటరమణ, మాధవరెడ్డి, శ్రీకాంత్, రెడ్డిప్రసాద్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ప్రతినిధులకు జిల్లా స్థాయి పదవులు

డాక్టర్ శివ-వరదారెడ్డి

పుంగనూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): పుంగనూరు లయన్స్‌క్లబ్‌లో సేవలు అందించిన ఇద్దరికి జిల్లా స్థాయి పదవులు లభించినట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధి డాక్టర్ శివ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లో అందించిన సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ జిల్లా అబాసిడర్‌గా పుంగనూరుకు చెందిన డాక్టర్ శివ, లయన్స్‌క్లబ్ జిల్లా హెల్త్ క్యాంపు చైర్మన్‌గా వరదారెడ్డిలను లయన్స్ గవర్నర్ ఆశ్వర్థనారాయణ ఎంపిక చేశారన్నారు. వారిని పుంగనూరు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రఘుపతి, కేశవరెడ్డి, అమరావతి సురేశ్, ముత్యాలు తదితరులు అభినందించారు.

## ఆపన్నులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

పింఛన్ల పంపిణీలో ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆపన్నులకు అండగా నిలుస్తోందని టీడీపీ రామకుప్పం మండలం అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు రామకుప్పం, మిట్టపల్లెల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సీతాపతి, రాజసింహా, విజయ్‌కుమార్‌రెడ్డి, నందారెడ్డి, టీవీరవి, నియాజ్, అవినాశ్, పద్మనాభరెడ్డి, సుబ్రీ పాల్గొన్నారు.

## బీజేపీ కొత్త సారథిని కలిసిన పుంగనూరు నేతలు

పుంగనూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను పుంగనూరు బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయవాడలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుంగనూరు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై ఆయన ఆరా తీసినట్లు తెలిపారు. నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, జగదీశ్‌రాజు తదితరులు ఉన్నారు.

## ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

చౌడేపల్లె, జూలై1(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు మంగళవారం.సోమల మండలం నంజంపేటకు చెందిన అమ్మవారి భక్తులు బోయకొండకు వెళ్లి గంగమ్మను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో స్థానిక జూనియర్ కాలేజి సమీపంలోని మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఇందులో ఉన్న రమణ, విజయ్, ఆహ్మద్‌బాషాలకు గాయాలయ్యారు. వీరిని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు.






కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారితో తల్లి

## పసివాడి ప్రాణం నిలిపిన నారా లోకేశ్

మదనపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే లివర్ సమస్యతో బాధపడుతున్న ఆరు నెలల చిన్నారికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. వైద్య సాయం అందించి ప్రాణాలు నిలిపారు. పలమనేరుకు చెందిన జగదీష్ కుమారుడైన ఆరు నెలల గజ్జల దీపూ నాయుడు లివర్ సమస్యతో బాధపడుతున్నాడు.పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తున్న జగదీశ్ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో కుమారుడికి చికిత్స అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ నిరుపేద కుటుంబం ఆర్థికసాయం కోసం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసింది. దీంతో ఎమ్మెల్యే వారిని పిలుచుకెళ్లి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విషయాన్ని వివరించడంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. చిన్నారి వైద్య చికిత్సకు రూ.15 లక్షలు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరు చేశారు. చిన్నారి పరిస్థితి చూసి ఆపదలో చలించి ఆర్థికసాయం అందించిన మంత్రి నారా లోకేశ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## గిట్టుబాటు ధరలేదని మామిడి రైతు మనస్తాపం

తవణంపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేదని మామిడి చెట్లను నరికేశాడో రైతు. ఈ సంఘటన తవణంపల్లె మండలంలో మంగళవారం జరిగింది. సరకల్లు గ్రామానికి చెందిన రమేష్‌బాబుకు ఒకటిన్నర ఎకరా మామిడితోపు వుంది. పంట దిగుబడి బాగా వచ్చినా ధరలు పతనమవడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన తండ్రి హయాంలో నాటిన 47 ఏళ్ల నాటి చెట్లను నరికేశాడు.

## వరసిద్ధుడి సేవలో టీటీడీ అదనపు ఈవో

వెంకయ్య చౌదరికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. డీఈవో సాగర్‌బాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బోల్తాపడ్డ పోలీసు జీపు

### మద్యం తాగిన హోంగార్డు వేగంగా నడపడమే కారణమన్న స్థానికులు

బోల్తాపడ్డ జీపు వద్ద స్థానికులు

పాలసముద్రం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మలుపు వద్ద మంగళవారం పోలీసు జీపు అదుపు తప్పి బోల్తాపడింది. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప సీఎం బందోబస్తు నిమిత్తం కుప్పానికి వెళ్లారు. ఈ క్రమంలో హోంగార్డు మహేష్ ఫూటుగా మద్యం తాగి, పోలీసు జీపును వేగంగా నడుపుతూ మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి బోల్తా కొట్టించాడు. స్థానికులు గమనించి జీపు నుంచి హోంగార్డును వెలుపలకు తీశారు. ఎస్ఐ లేని సమయంలో పోలీసు జీపు తీసుకోవడం, మద్యం తాగి నడపడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదడుగుల దూరంలోని విద్యుత్ స్తంభాన్ని జీపు ఢీకొని ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

## ఏనుగుల గుంపు దాడిలో పంటల ధ్వంసం

ధ్వంసమైన మామిడిచెట్టు

కల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. పాళెం పంచాయతీలో సోమవారం ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. రైతులకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు అటవీ విభాగం ప్రాంతంలోని ఎగువచలం నుంచి బయలుదేరిన 17 ఏనుగులు కోటపల్లి చేరుకున్నాయి. రైతులు హరి, బాబునాయుడుకు చెందిన పశుగ్రాసాన్ని ఇవి ధ్వంసం చేశాయి. రైతులు శ్రీనివాసులు, గోపి, మురళీమోహన్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. కట్టకిందపల్లిలోని రైతు మదుబాబు నాయుడికి చెందిన అరటిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. మరో వైపు గుంపు నుంచి ఒంటరి ఏనుగు జూపల్లి చేరుకొని రైతు శ్రీరాములుకు చెందిన అరటిచెట్లను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు చింతలవంక వద్దకు చేరుకున్నాయి. పంటలను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు కూడా అడవిలోని ఏనుగుల గుంపులో కలిసిపోయినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

## జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 2025 నేషనల్ అవార్డులకు ఆన్‌లైన్ ద్వారా అర్హులైన టీచర్ల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు డీఈవో వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల టీచర్లు ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## వీధిదీపాలు, తాగునీటి సరఫరా నిలిపివేత

నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు

పలమనేరు, జూలై1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కార్యాలయం ముందు మంగళవారం కూడా కాంట్రాక్టు ఇంజినీరింగ్ ఉద్యోగులు ధర్నా చేశారు. మంగళవారం నుంచి మున్సిపాలిటీ పరిధిలో వీధిదీపాలు, తాగునీటి సరఫరా నిలిపివేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్‌ను వివరణ కోరగా తాము చర్చించి వీధిదీపాలు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఒప్పించాన్నారు. వారు ఆందోళన కొనసాగిస్తున్నారని ఖాదర్‌మొహిద్దీన్ తెలిపారు.

# 'ఇంటింటికీ టీడీపీ' విజయవంతం చేద్దాం

- పార్టీలో కష్టపడేవారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయి
- ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న సుపరిపాలనకు తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. పేదలు లేని సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఏడాదిలోనే అద్భుతమైన వృద్ధి రేటును సాధించడం చంద్రబాబు సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి పదవులు వెతుక్కొంటూ వస్తాయని స్పష్టం చేశారు. కొత్తగా నియమించిన చిత్తూరు నగరంలోని క్లస్టర్ ఇన్‌చార్జిల వివరాలను బుధవారం ప్రకటిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్, రాంప్రసాద్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, గిరినాయుడు, నేతలు చంద్రప్రకాష్, సుబ్రహ్మణ్యం నాయుడు, కోదండయాదవ్, కాజూరు బాలాజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నగరంలో నేటి కార్యక్రమాల వివరాలు

'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు 1వ వార్డు యం.అగ్రహారం, 9.30 గంటలకు 2వ వార్డు మురకంబట్టు, 11గంటలకు 50వ వార్డు టి.చవటపల్లె, మధ్యాహ్నం 3 గంలలకు 3వ వార్డు దొడ్డిపల్లె, సాయంత్రం 5 గంటలకు 4వ వార్డు కట్టమంచిలో కార్యక్రమం నిర్వహించనున్నారు.

### కార్యకర్తల కోసం సహాయ నిధి ఏర్పాటు

మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాజీ పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసి, ఆర్థికంగా చితికిపోయి, అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను నాయకులు ఆదుకోవాలని సూచించారు. ఇందుకోసం చిత్తూరు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల నిధి ఏర్పాటు చేసి.. వారికి ఆర్థిక సాయం అందించి అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ఇందుకోసం తన వంతుగా సహాయనిధికి రూ.10 లక్షలు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. తర్వాత ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ తాను, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కలసి రూ.50లక్షలు ఇస్తామని ప్రకటించారు. గుడిపాల మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఈ ఆర్థిక సాయం కోసం కార్యకర్తలు తమ ఇబ్బందులను సీల్డు కవరులో పార్టీ కార్యాలయంలో సమర్పిస్తే, కమిటీ పరిశీలించి సాయం చేస్తారని నేతలు పేర్కొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తదితరులు

కుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరిశీలించారు. తుమ్మిశి మోడల్ స్కూల్ ఎదురుగా సభావేదికతోపాటు, డుంకుమానుపల్లెలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వెళ్లి పనులను పర్యవేక్షించారు.కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ కూడా అధికార యంత్రాంగంతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభించనున్న కడపల్లె పంచాయతీ తిమ్మరాజుపల్లెలో కూడా వీరు పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పంపిణీ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

### 3 కంపెనీలతో ఎంవోయూలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్సీ శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. సీఎం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. బుధవారం ముఖ్యమంత్రి తుమ్మిశి మోడల్ స్కూల్ వద్ద బహిరంగ సభలో పాల్గొంటారని, పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తారని, వివిధ శాఖల ద్వారా వివిధ పథకాలపై బ్యాంకులు మంజూరు చేసిన సబ్సిడీ రుణాలు లబ్ధిదారులకు అందజేస్తారని, ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై సైకిళ్ళు, సబ్సిడీ మీద అందిస్తున్న ఎలక్ట్రిక్ సైకిళ్ళు పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ కూడా ఉంటుందన్నారు. అంతేకాక ఏస్ ఇండస్ట్రీస్, ఈ రాయిస్, ఎస్వీఎఫ్ సోయా బీన్స్ కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకుంటారని చెప్పారు. ఆ కంపెనీలలో ఏస్ ఇండస్ట్రీస్ పాల ద్వారా మెడిసిన్స్ ఉత్పత్తి చేసే సంస్థ కాగా, ఎస్వీఎఫ్ సోయా బీన్స్ అనేది గింజల ద్వారా ఆహార ఉత్పత్తుల తయారీ కంపెనీ అని, ఈ రాయిస్ అనేది ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కంపెనీ అని పేర్కొన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

# పోలీసుల దిగ్బంధంలో తిమ్మరాజుపల్లె

తిమ్మరాజుపల్లెలో కిక్కిరిసిన పోలీసు బలగాలు

శాంతిపురం , జూలై 1 (ఆంధ్రజ్యోతి):శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ తిమ్మరాజుపల్లె గ్రామ పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగృహం నిర్మించుకుని, గృహప్రవేశం కూడా చేశారు. ఈ నేపథ్యంలో సొంత గ్రామమైై పోయిన తిమ్మరాజుపల్లెలోనే బుధవారం ఆయన తెలుగుదేశం తలపెట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన 'సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. చుట్టుపక్కలున్న 26 గృహాలను సందర్శించి ప్రజలను పలుకరించనున్నారు. ఈ నేపథ్యంలో తిమ్మరాజుపల్లెను మంగళవారం పోలీసులు పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. సుమారు వందకు పైగా పోలీసు బలగాలు ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టాయి. చంద్రబాబు వెళ్లనున్న ఇళ్లన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాయి. పోలీసు అధికారులు గ్రామంలో భద్రతాపరమైన ఆంక్షలు విధించారు. మరో వైపు కలెక్టర్ సుమిత్ కుమార్ గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా కార్యక్రమం సాఫీగా జరిగిపోయేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## 95 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరులో లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సెంట్రల్/చిత్తూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ తొలిరోజైన మంగళవారం 95.02శాతం జరిగింది. 2,64,932 మందికిగాను 2,51,750 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మిగిలిన 13,182 మందికి బుధవారం అందజేయనున్నారు.

### లబ్ధిదారుల ముఖంలో సంతోషం : ఎంపీ, ఎమ్మెల్యే

పింఛను సొమ్ము అందుకుంటున్న లబ్ధిదారుల ముఖంలో సంతోషం కనిపిస్తోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని సీఎంటీ రోడ్డులో పలువురు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమానంగా అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు



విజయపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలం పాతార్కాడు సమీపంలోని ఇళ్లత్తూరు రోడ్డు వద్ద గతనెల 23వ తేదీన జరిగిన తమిళనాడు అరుబాంక్కం గ్రామానికి చెందిన వెంకటేశ్వరన్(57) హత్య కేసులో నిందితులు వెంకటేశన్ కుమారులు ప్రభు(38), సేతుపతి(34)లను అరెస్టు చేశారు. వీరిని మంగళవారం కోర్టుకు తరలించినట్టు సీఐ భాస్కర్ తెలిపారు. నేరం చేయడానికి ఉపయోగించిన ట్రాక్టర్‌ను, సెల్‌ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు ఛేదించి పరారీలోని నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ రంగా, ఏఎస్ఐ గోవిందరాజులు, సిబ్బంది దామోదరం, నరేష్, ఏళుమలై, మణివాలన్, గోపి, అయ్యప్పలను సీఐ అభినందించారు.

## పెరిగిన టమోటా ధరలు

- 15కిలోల బాక్సు రూ.450

సోమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరల పెరుగుదల రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. మంగళ వారం 15కిలోల బాక్సు ధర రూ.450కి చేరుకుంది. పుంగనూరు, పలమనేరు, కోలారు, వడ్డిపల్లె టమోటా మార్కెట్‌ల్లో నాలుగు నెలలు పాటు బాక్సు రూ.60 నుంచి రూ.100 మాత్రమే పలికింది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో టమోటా రైతులు నష్టాలపాలయ్యారు. ఎకరా సాగుకు రూ. 2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కనీసం రవాణా, కోత కూలీలు రాకపోవడంతో కోతలే ఆపేశారు. పశువులకు మేతగా వదిలేశారు. ఈక్రమంలోనే 15 రోజులుగా రూ. 150, రూ.200, రూ.300కు చేరుకుని శనివారం నుంచి క్రమంగా రూ.200, 300, 450కి చేరుకుంది. ఏప్రిల్‌లో నాటు వేసిన తోటల్లో కాయలు దిగుబడులు వస్తున్నాయి. దిగుబడులు తగ్గడంతో కొందరు రైతులు మాత్రమే ప్రస్తుత ధరలతో లాభపడుతున్నారు.చీడపీడలు, ఊజీ ఈగలు, పండు ఈగల ఉధృతి అధికంగా ఉండటంతో సగం పంట మాత్రమే మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం డిల్లీ, గుజరాత్, వెస్ట్ బెంగాల్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు ముఖ్య పట్టణాలకు రవాణా జరగడంతో ధరలు ఆశాజనకంగా మారాయి.

## 'భిక్షాటన' పదాన్ని తొలగించడాన్ని స్వాగతిస్తున్నాం

### దాసరి రిజర్వేషన్ పోరాట సమితి

చిత్తూరు సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దాసరుల కుల ధ్రువీకరణ పత్రంలో భిక్షాటన అనే పదాన్ని తొలగించడాన్ని స్వాగతిస్తున్నామని దాసరి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి రవి తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో జారీచేసే కుల ధ్రువీకరణ పత్రంలో దాసరులకు భిక్షాటన అనే పదాన్ని చేర్చేవారని, అది తమ మనోభావాలను దెబ్బతీసేలా ఉండడంతో సీఎం చంద్రబాబు దాన్ని తొలగించేలా చర్యలు చేపట్టడం హర్షణీయమని తెలిపారు. నేతలు వెంకటరమణ, సుబ్బయ్య, జయచంద్ర, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువపత్రాల సృష్టికర్తపై ఫోర్జరీ కేసు

ఐరాల(కాణిపాకం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం బొమ్మసముద్రానికి చెందిన ఓ వ్యక్తిపై ఫోర్జరీ కేసు పెడుతున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి మంగళవారం తెలిపారు. బొమ్మసముద్రం గ్రామంలో భూ వివాదంలో గ్రామానికి చెందిన సాంబశివనాయుడు తన పేరుతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించినట్లు పేర్కొన్నారు. సర్వే నెంబరు 817లో గుడి స్థలం ఉందన్నారు. ఈ సర్వే నెంబరుతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి.. వీఆర్వో, సర్వేయర్ సంతకాలను కూడా ఫోర్జరీ చేశాడన్నారు. ఈ పత్రాల్లో గుడి స్థలం, వెనుక వైపు ఉన్న ఇల్లు, పవన్‌కుమార్ ఆవులు కట్టే స్థలాన్ని చేర్చాడన్నారు. ఈ నేపథ్యంలో సాంబశివనాయుడిపై కాణిపాకం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ తెలియజేశారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

మాధవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు

చిత్తూరు సెంట్రల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్‌ను మంగళవారం విజయవాడలో జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, అట్లూరి శ్రీనివాసులు, తులసీనాథ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుమార్, లిఖిష్, రాజేంద్రన్ తదితరులున్నారు.

## ఓపెన్ స్కూల్లో అడ్మిషన్లు ప్రారంభం : డీఈవో

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)లో 2025-26 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలోని సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో వరలక్ష్మి, స్టేట్ కోఆర్డినేటర్ నరసింహారావు మాట్లాడుతూ.. 14 ఏళ్లు నిండినవారు టెన్త్‌లో, 15 ఏళ్లు నిండినవారు ఇంటర్‌లో ఈనెలాఖరు వరకు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని చెప్పారు. ఏడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## 'ఎఫ్‌సీ' బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించొద్దు: సీపీఐ

సమావేశంలో ప్రసంగిస్తున్న నాగరాజు

చిత్తూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) ఇచ్చే బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ఉండగా.. చిత్తూరు నుంచి ఎక్కడో 18 కిలోమీటర్ల దూరంలోని నలగాంపల్లె వద్ద ప్రైవేటువారికి ఎఫ్‌సీలిచ్చే బాధ్యతలను అప్పగించడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కారణంగా డీజిల్, పెట్రోల్, టోల్‌గేట్ ఫీజులు వంటి అదనపు ఖర్చులు ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు గోపీనాథ్, మణి తదితరులు పాల్గొన్నారు.

## స్పాంజ్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

### కారణం తెలియడం లేదన్న యజమాని

సంఘటన స్థలంలో ఉన్న సామగ్రి - కాలిన వాహనం

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్పాంజ్‌లు, కమ్మీలు, తదితర సామగ్రి ఉన్న గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదానికి కారణం తెలియడం లేదని యజమాని సుధాకర్‌రెడ్డి తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లెకి సమీపంలో ఈ గోడౌన్ ఉంది. సోమవారం యథావిధిగా పనులు ముగించుకుని యజమానికి ఇంటికెళ్లాడు. మంగళవారం వేకువజామున గోడౌన్‌నుంచి కాలిన వాసన వస్తోందని కాపలాగా ఉండే గురవయ్య యజమానికి సమాచారం ఇచ్చాడు. ఆయనొచ్చేసరికి సామగ్రి, సీసీ కెమెరాలు, వాహనం కూడా కాలిపోయింది. రూ.కోటి వరకు నష్టం జరిగి ఉండవచ్చని సుధాకర్‌రెడ్డి చెబుతున్నాడు. ఈ విషయమై వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నాడు. పూర్తి వివరాలు పోలీసు విచారణయ్యాక తేలనుంది.

## 24 ఇంజనీరింగ్ కళాశాలల్లో 23వేల సీట్లు

చిత్తూరు సెంట్రల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు అవకాశాలు మెండుగా లభించనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటుకు సంబంధించి 24 ఇంజనీరింగ్ కళాశాలల్లో 23,715 సీట్లు కేటాయించారు. ఒక్కో కళాశాలకు సరాసరి 988 సీట్ల కేటాయింపులు జరిగాయి. మూడు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలకు 1,080 సీట్లు, మిగిలిన 21 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు 22,635 సీట్లు కేటాయించారు.


ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

**CHANGE OF NAME**
I, MUPPALLA GURU YAMINI (Old Name) W/o MUPPALLA VASUDEVA RAJU R/o D.NO:6/163, Balaji Nagar, Near Sangam Theater, Old GNT Road, GUDUR - 524101, TIRUPATI DIST, ANDHRA PRADESH. I Changed my name to MUPPALLA YAMINI. Henceforth, I will be known as MUPPALLA YAMINI.
AJT - 1395

**CHANGE OF NAME**
I,PARACHURU HRUSHEEKESAVULU (Old Name), S/o. KRISHNAMA NAIDU PARACHURU.R/o.D.No.11-28,Gollavanigunta,TN Palem, Tirupati Urban Mandal, TIRUPATI Dist, A.P. HEere by changed my name as PARUCHURI HRUSHIKESAVULU (New Name)
AJT - 400

**PLOTS FOR SALE**
అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సంప్ర: 91145 61456.
AJT - 1394

**CHANGE OF NAME**
I,PARACHURU SULOCHANA (Old Name), W/o. HRUSHEEKESAVULU PARACHURU, R/o. D.No. 11-28,Gollavanigunta,TN Palem, Tirupati Urban Mandal, TIRUPATI Dist, A.P. Here by changed my name as PARUCHURI SULOCHANA( New Name)
AJT - 399

**WANTED**
Wanted teachers for Higher class All Subjects and Computers Teacher,Hostel CooK, for a Reputed School in S.N Puram, Tirupati, Attractive Salary, Cell: 92908 98331,70138 81383.
AJT - 1393

**వెంటనే కావలెను**
లేసర్ మెషిన్ ఆపరేటర్, ఎంబ్రాయిడరీ మెషిన్ ఆపరేటర్, ఇన్వెంటరీ మేనేజర్, డేటా ఎంట్రీ, అర్హత : 10th Pass ప్రత్యేకమైన నైపుణ్యాలు అవసరం లేదు. పూర్తిస్థాయి ఉద్యోగం. మరిన్ని వివరాలకు సంప్ర. Darshan Dresses, Cell : 9505751243 / 9440250863.
AJT - 239882

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237881

**పాఠకులకు ముఖ్యగమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దీని ద్వారా కలిగే నష్టాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

## డెంగ్యూపై అవగాహనా ర్యాలీ

మానవహారంగా ఏర్పడ్డ వైద్యసిబ్బంది, విద్యార్థులు

రామకుప్పం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో మంగళవారం విజలాపురంలో వైద్యసిబ్బంది, స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు డెంగ్యూ మాసోత్సవాన్ని పురస్కరించుకుని డెంగ్యూ జ్వరంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. డెంగ్యూ జ్వర కారకాలు, నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, చికిత్సపై వైద్యాధికారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎం ప్రమీళ, ఎంసీహెచ్‌పీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జూలై1: ప్రైవేటు బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం పాతబోలుకు చెందిన గంగాద్రి సోమవారం ద్విచక్రవాహనంలో వస్తుండగా రేగడకాల్వ వద్ద ఓపాఠశాల బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన గంగాద్రిని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ● కారును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని కథనం మేరకు..మదనపల్లెకు చెందిన బాలాజీ మేస్త్రీ పనులు చేసుకుంటాడు. మంగళవారం ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి పలమనేరుకు వెళుతుండగా ముందు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలాజీనిప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకారం

పుంగనూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): శుభారాం డిగ్రీ ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. గత ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఉద్యోగ విరమణ కావడంతో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పజేప్పిట్లు ఆయన తెలిపారు. అనంతరం కాలేజీ అధ్యాపకులు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు

## ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల వివాదంలో జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన వైనమిది. బాధితుల కథనం మేరకు వివరాలు... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చాంద్‌బాషా కుమారుడు ముజీబ్ పిల్లలు వీధిలో ఆడుకుంటున్నారు. పొరుగింటికి చెందిన నరుషా, జంగిల్‌బాషా పిల్లలు వీరితో గొడవపడ్డారు. ఈక్రమంలో ముజీబ్, అతని భార్య తస్లీమాలపై దాడి చేసి గాయపరిచారు. వీరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



## 'సీమ'కు నీటికోసం సీఎం కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర

రాయలసీమకు నీరందించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్న ఆయన తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరు ఇచ్చేలా సీఎం ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికి స్వామి ఆశీస్సులు కావాలని వేడుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రముఖ వయోలిన్ వాయిద్య కళాకారిణి కుమారి కన్యాకుమారి, ప్రముఖ నృత్యకళాకారిణి అనంద శంకర్ జయంత్, తెలంగాణ ఎమ్మెల్యే బసవరాజు సారయ్య, ఆస్ట్రాలజర్ వేణుస్వామి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కుమారి కన్యాకుమారి - ఆనంద శంకర్ జయంత్

## సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,730**

**తలనీలాలు సమర్పించినవారు: 28,940**

# రామాపురం @ కందగడ్డ ఊరు

● 50 ఏళ్లకుపైగా ప్రధాన సాగు ఇదే

**కందగడ్డ పండిస్తారే ఆ ఊరు పేరేమిటి? ఎప్పుడైనా ఆ గ్రామం పేరు గుర్తురాకపోతే ఇలా అడిగితే చాలు.. ఠక్కున రామాపురం అని చెబుతారు. రామచంద్రాపురం మండలంలోని ఈ గ్రామం కందగడ్డ సాగుకు పెట్టింది పేరు. 50 ఏళ్లుగా కందసాగులో అధిక దిగుబడి సాధించి రైతులు లాభాలబాట పట్టారు.**

**- రామచంద్రాపురం, ఆంధ్రజ్యోతి**

రామచంద్రాపురం మండలం రామాపురం.. తిరుపతికి అతి సమీపంలో ఉందీ గ్రామం. ఇక్కడ జల వనరులు తక్కువగా ఉండటంతో ఎన్నో ఏళ్ల కిందటే తిరుపతి మార్కెట్‌లో వ్యాపారం చేసేవారు. ఈ గ్రామంలో 70 ఏళ్ల క్రితమే సుబ్బారెడ్డి, సైదారెడ్డి అనే వారు తమిళనాడు నుంచి కందగడ్డ విత్తనం తెచ్చి సాగు చేశారు. దీంతో పాటు పలు వాణిజ్యవ్యాపారుల వైపు రైతులు దృష్టి మరలిచారు. కందతోటను ఏప్రిల్, మే నెల మధ్య నాటాలి. ఎకరా సాగుకు 72 కిలోలవి 25 నుంచి 30 బస్తాలు కావాలి. విత్తనం బస్తా ధర రూ.1,700 నుంచి రూ.2వేలు వరకు ఉంటుంది. దున్నకం, ఎరువులు, మందులు, కూలీలు అన్ని కలిపి ఎకరా సాగుకు లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంట ఐదు నెలల నుంచి ఆరునెలల్లోపు తీయాలి. ఒకవేళ అనుకోని అవాంతరాలు ఎదురైనా రెండు నుంచి మూడు నెలలు భూమిలో ఉన్నా చెడిపోయే పరిస్థితి లేదు. తక్కువ నీటితో సాగయ్యే కంద మొండిపంట. పెద్దగా చీడపీడలు అంటవు. ఎకరా తోట 250 నుంచి 300 బస్తాలు దిగుబడి ఇస్తుంది. ఎకరా కందతోటలో అన్నిపోను రూ.3లక్షలు మిగులుతుందని రైతులు చెప్పారు. రామాపురంలో ఎన్నో ఏళ్లుగా 50 మంది రైతులు ఏటా కందసాగులో మంచి లాభాలు గడిస్తున్నారు. నీటి ఆధారం లేని గ్రామం కావడంతో పేదరికం ఎక్కువగా ఉండేది. ఎపుడైతే వాణిజ్యపంట సాగుతో మంచి లాభాలు గడించి లక్షాధికారులు అయ్యారు. మండలంలోనే రామాపురం ధనిక గ్రామంగా మారింది.

### కంద.. మొండిపంట

అన్ని పంటల్లాగా కంద నీర్పుడు దశకు వచ్చినా అప్పటికపుడు తీయాల్సిన పరిస్థితి లేదు. భూమిలో కొంతకాల్వ నిల్వ ఉన్నా చెడిపోయే పరిస్థితి ఉండదు. పెద్దగా చీడపీడలు ఆశించవు. రైతుకు మంచి లాభాలిచ్చే కంద.. మొండి పంట.

- రంజిత్

రామాపురంలో సాగు అవుతున్న కంద తోటలు

### 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం

మాకున్న రెండు ఎకరాల్లో.. కుటుంబం 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం. ఎకరా కందసాగుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. నల్లరేగడి భూమి అయితే మంచిదిగుబడి ఇస్తుంది. సంక్రాంతి సీజన్‌లో 70 కిలోల బస్తా ధర రూ.2వేల నుంచి రూ.3వేలు పలుకుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.3లక్షలు మిగులుతాయి. మాగ్రామమంతా కందసాగే చేస్తున్నాం.

- కె.మునిరామిరెడ్డి

## నకిలీలను నమ్మి మోసపోవద్దు

● భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం, బస, ఆర్జిత సేవల కోసం నకిలీ వ్యక్తులను నమ్మి మోసపోవద్దని టీటీడీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా భక్తులను కోరింది. పెద్దింటి ప్రభాకరాచార్యులు పేరుతో వైష్ణవ యాత్రాస్ అనే ఫేస్‌బుక్ పేజీని నడుపుతున్న ఓ వ్యక్తి శ్రీవారి అభిషేకం, ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కల్పిస్తామంటూ మోసం చేస్తున్న అంశం టీటీడీ దృష్టికి రావడంతో ఈ హెచ్చరిక చేసింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. టికెట్ల పేరుతో భక్తులను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## టీటీడీ చైర్మన్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

తిరుమల, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రీవారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఫొటో సహా ఎక్స్ ఖాతాలో చంద్రబాబు పోస్ట్ చేశారు.

చంద్రబాబు ఎక్స్‌లో పెట్టిన పోస్టు

## డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు వాయిదా పడ్డాయి. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు జూలై 7 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల వాయిదాను విద్యార్థులు గమనించాలని అధికారులు కోరారు. కొత్త షెడ్యూల్‌ను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని మీడియా డీన్ ప్రొఫెసర్ వీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

అవార్డు అందుకుంటున్న ఇసుజు ప్రతినిధులు

## 'ఇసుజు' పరిశ్రమకు ఎక్స్‌లెన్స్ అవార్డు

సత్యవేడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని కార్ల తయారీ పరిశ్రమ ఇసుజుకు ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్‌టీ) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆవరణలో 'సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత'పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడు సంస్థల్లో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి సీజీఎస్‌టీ కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్.దినకర్ సమక్షంలో గుంటూరు సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా పరిశ్రమ ప్రతినిధులు అవార్డును అందుకున్నారు. ఇసుజు మోటార్స్‌తో పాటు అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, టీటీఈ ఎలక్ట్రానిక్స్, ఎంఎస్‌ఆర్ ప్రాజెక్ట్స్, పీవీఎస్ కెమికల్స్, లక్కీఫోర్‌యూ ఎగ్జిమ్స్ అండ్ మినరల్స్ తదితర సంస్థలు ఈ అవార్డులు అందుకున్నాయి.

## క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షలో తిరుపతి విద్యార్థినికి ఫస్ట్ ర్యాంకు

● ఏపీలో విజయవాడ కేంద్రంగా తొలిసారిగా కోర్సు ప్రారంభం

త్రిపుర గవర్నరు ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ నుంచి ప్రవేశపత్రాన్ని అందుకుంటున్న శిరీష

తిరుపతి రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల (రఘునాథరిసార్ట్)కు చెందిన కంబాల వాణి, రాము దంపతుల కుమార్తె శిరీష ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నిర్వహించిన ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు రాగా.. ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభ చాటి మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. కాగా, రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా నడిచే ఇండ్లాస్ ఆస్పత్రిలో ఈ ఏడాది తొలిసారిగా ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ కోర్సు ప్రారంభించారు. ఈ కోర్సులో ప్రవేశానికి 12మంది విద్యార్థులు అర్హత సాధించగా..వీరిలో తిరుపతికి చెందిన శిరీష ఫస్ట్‌ర్యాంకుని సాధించారని పేర్కొన్నారు. మంగళవారం త్రిపుర గవర్నరు డాక్టర్ ఎన్.ఇంద్రసేనరెడ్డి, రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతులమీదుగా అడ్మిషన్ లెటర్‌ని ఆమె అందుకున్నారు. జైపూర్‌లోని మణిపాల్ వర్సిటీలో ఈమె ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సు చేశారు.

## తిరుపతి- అకోలా మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుపతి- అకోలా మధ్య నడుస్తున్న వారాంతర ప్రత్యేక రైళ్లను జూలై 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేది వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం తిరుపతి నుంచి అకోలాకు ప్రత్యేక రైలు(07605) బయలు దేరుతుందన్నారు. అకోలాలో ఈ ప్రత్యేక రైలు(07606) ప్రతి ఆదివారం బయలుదేరి రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న కారణంగా ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంచుతున్నామని పేర్కొన్నారు.

## ముగ్గురు నిందితుల అరెస్టు

● 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో నేరాలు, ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను శ్రీకాళహస్తి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వండలూరు కండ్రిగకు చెందిన ముత్తం మణిమారన్, తిరుపతి జిల్లా వెంకటగిరి కోళ్లఫారానికి చెందిన మారి మాణిక్యం, శ్రీకాళహస్తి ఏనుగుల గుంటకు చెందిన కొట్టంబేడి రాజా ముఠాగా ఏర్పడ్డారు. కొంత కాలంగా తమిళనాడుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల తొట్టంబేడు, రేణిగుంట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి సమీపంలోని నంది రెస్టారెంటు వద్ద అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వీరు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్టు చేసి.. 140 గ్రాములు బంగారు నగలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింహమూర్తి, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

## భూసేకరణ, నిర్మాణ పనులను

# త్వరితగతిన పూర్తిచేయండి

అధికారులతో వర్చువల్‌గా సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలిసి నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులతో వర్చువల్‌గా సమీక్షించారు. శ్రీకాళహస్తి-నడికుడితో పాటు పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులను పూర్తిచేయాలని, భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాగరమాల కింద చేపట్టిన ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులను నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని ఆర్డీవోలకు సూచించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఏడీబీ రోడ్డు పనులనూ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్‌రెడ్డి, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ వైద్యసేవలో డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఎన్టీఆర్ వైద్యసేవలో రక్తపరీక్షలు, చికిత్సలు, ఆర్థోపెడిక్ విషయంలో రోగులను తప్పుదోవ పట్టించి అనధికారికంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి కొన్ని ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తున్నాయని.. అలాంటివి పునరావృతం కాకుండా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శివకుమార్, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'జనసురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి జనసురక్ష బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో జనసురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే బీమా పథకాల గురించి తెలపడమే దీని ఉద్దేశ్యమన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.2లక్షల వరకు లబ్ధిదారులకు జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అటల్ పెన్షన్ యోజననూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తిరుమలలో మరో కియాస్క్ ప్రారంభం

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల సౌకర్యార్థం మరో కియాస్క్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వితరణగా అందించిన ఈ మిషన్‌ను ఆ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్(బీ అండ్ వో) దినేష్ గులాటి ప్రారంభించారు. ఈ కియాస్క్ ద్వారా లడ్డూ కొనుగోళ్లతో పాటు విరాళాలు అందజేయవచ్చు.

కియాస్క్‌ను ప్రారంభిస్తున్న దినేష్ గులాటి

## ఇంజనీరింగ్‌లో 23,715 ఇన్‌టేక్‌కి అనుమతి

తిరుపతిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 2025-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ బ్రాంచీలలో ఇన్‌టేక్ అనుమతి వివరాలను పాత జిల్లాల వారీగా వెల్లడించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 1080 (ఇన్‌టేక్), 21 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో 22,635 చొప్పున 24 కళాశాలల్లో మొత్తం 23,715 ఇన్‌టేక్ కేటాయించినట్లు తెలిసింది.

పాడుపడిన భవనంలో గంజాయి తీసుకుంటున్న యువకులు

## గంజాయి తీసుకుంటూ డ్రోన్‌కు చిక్కిన యువకులు

తిరుచానూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పెద్ద చెరువులో పాడుపడిన భవనంలో కొందరు గంజాయి తీసుకుంటున్నట్లు గుర్తించిన పోలీసులు నిఘా పెట్టారు. పోలీస్ ఈగల్ టీం, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం డ్రోన్‌తో డ్రైవ్ నిర్వహించగా, ఆ భవనంలో నలుగురు యువకులు గంజాయి తీసుకుంటుండటం బయట పడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. వీరిలో బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది.

## మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

సిద్దమ్మ మృతదేహం

బాలాయపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను భర్త హత్య చేసిన ఘటన బాలాయపల్లి మండలం అంబలపూడి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు.. బాటా వెంకటేశ్వర్లు తన భార్య సిద్దమ్మతో కలసి అంబలపూడిలోని సురేష్‌కు చెందిన మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. ఇటీవల సిద్దమ్మ వెళ్లిపోవడంతో నచ్చజెప్పి కాపురానికి తీసుకొచ్చాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో సిద్దమ్మను వెంకటేశ్వర్లు హతమార్చాడు. తన భార్యను హత్య చేశానని స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి, ఎస్‌ఐ గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## గోవిందుడి పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో బుధవారం జరిగే పుష్పయాగం కోసం మంగళవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం తిరువీధుల్లో సేనాధిపతి విష్వక్సేనుడి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో అర్చకులు మన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఇక, బుధవారం ఉదయం 9.30-11.30గంటల మధ్య శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు. సాయంత్రం 6-7గంటల మధ్య ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించే ఊంజల్ సేవను రద్దు చేశారు.

సేనాపతి ఊరేగింపు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పునీత్ తేజకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సిటీ/తవణంపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలం కార కాంపల్లె గ్రామానికి చెందిన ప్రకాష్ కుమారుడు పునీత్ తేజకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.82,000 చెక్కును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం చిత్తూరులోని తన కార్యాలయంలో అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం పునీత్ దరఖాస్తు చేసుకోగా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే పూతలపట్టుకు చెందిన లోకనాథ్ గుప్తాకు రూ.1,46,260, బంగారుపాళ్యం మండలం తుంబకుప్పంకు చెందిన విరాజికి రూ.31,084 చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి, గాలి దిలీప్, భాస్కర్‌నాయుడు, మోహన్‌నాయుడు, చిట్టెమ్మ, అమరేంద్రనాయుడు, సునీల్ కుమార్, సుధాకర్‌నాయుడు ఎన్‌వీ జయప్రకాష్ నాయుడు, ఎన్‌పీ ధరణి నాయుడు, చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ల సేవలు అభినందనీయం

పచ్చికాపల్లం పీహెచ్‌సీలో వైద్యులకు సన్మానం

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ల సేవలు అభినందనీయమని పీఎంఏ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా పచ్చికాపల్లం పీహెచ్‌సీలోని డాక్టర్లు కృష్ణ చైతన్య, చెంగారెడ్డికి సత్కారం చారు. నాయకులు మధు, మురళీ పాల్గొన్నారు.

**తవణంపల్లె:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారులు ప్రియాంక, మోహన వేలులను సత్కరించారు. వారితో కేక్ కట్ చేయించారు. వైద్య సిబ్బంది, ఏఏ ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కల తొలగింపు

బంగారుపాళ్యం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న శవపరీక్ష గది ముందు కొంతకాలంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీన్ని గమనించిన మొగిలీశ్వరనగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు బీసీ రవీంద్రనాయుడు తన సొంత ఖర్చులతో ఎక్స్‌వేటర్ సాయంతో మంగళవారం ఆ పిచ్చి మొక్కలను తొలగించారు.

## ఇళ్ల వద్ద మురుగు నిల్వ ఉండకూడదు

మానవహారంలో పాల్గొన్న జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్

గంగాధరనెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్ద మురుగు నిల్వ లేకుండా చేస్తే దోమలను నివారించవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్ తెలిపారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా గంగాధరనెల్లూరులో హైస్కూల్ విద్యార్థులు, వైద్యసిబ్బందితో కలిసి మంగళవారం పురవీధుల్లో ర్యాలీ, బస్టాప్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్, గురుప్రకాష్, సీహెచ్‌వో కృష్ణయ్య, సూపర్‌వైజర్లు సంపత్, భగవతి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** మండలంలోని పచ్చికాపల్లంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు కృష్ణచైతన్య, చెంగారెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు డెంగ్యూపై అవగాహన కల్పించారు.

**పూతలపట్టు:** ఉన్నతపాఠశాల ఆవరణలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది లక్ష్మీప్రసాద్, ధర్మేంద్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

పూతలపట్టు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం నుంచి ఇతర మండలాలకు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను, ఇతర మండలాల నుంచి పూతలపట్టుకు వచ్చిన ఉపాధ్యాయులను యూటీఎఫ్ మండల శాఖ మంగళవారం ఎంఆర్సీ భవనంలో సన్మానించింది. యూటీఎఫ్ జిల్లా నాయకులు రెడ్డెప్ప నాయుడు, బాషా, నాగరాజు, చంద్ర, గిరి, వడివేలు, యోగేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

మాధవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న చిట్టిబాబు, శేషాద్రి కుమార్ తదితరులు

వెదురుకుప్పం/చిత్తూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్‌ను మంగళవారం విజయవాడలో కలిసి పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో.. జిల్లా ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు తదితరులున్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం

● ఔట్‌సోర్సింగ్ కార్మికుల హెచ్చరిక

చిత్తూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రతను కల్పించాలని ఔట్‌సోర్సింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. వీరు చేస్తున్న సమ్మె మంగళవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామ్మూర్తి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వంతమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా న్యాయం చేయకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘ నేతలు శివకుమార్, శివప్రసాద్, వెంకటేష్, హరికృష్ణ, డియా తదితరులు పాల్గొన్నారు.

## నరికేసిన మామిడి చెట్లను పరిశీలించిన అధికారులు

నరికేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్ఐ రామచంద్ర

పెనుమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం గ్రామంలోని పద్మనాభకు చెందిన 150 మామిడి చెట్లను నరికేసిన విషయం తెలిసిందే. నరికేసిన చెట్లను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్ఐ రామచంద్ర, మండల సర్వేయర్ చిరంజీవులు మంగళవారం పరిశీలించారు. ఇరుపార్టీలవారిని తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను తీసుకురావాలని సూచించారు. ఆ తర్వాత అది ఎవరిభూమి అనేది తేలుస్తామన్నారు.

## 'విజ్ఞానసుధ'లో నేడు మెగా జాబ్‌మేళా

చిత్తూరు సెంట్రల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చైర్మన్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టార్‌టెక్, క్యాస్‌మ్యాక్స్, ఫాక్స్‌కాన్ వంటి కంపెనీలు 2025 జాబ్ డ్రైవ్‌లో పాల్గొంటున్నాయన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేల్రాంబట్టి రోడ్డు

# 30 ఏళ్ల కల నెరవేరింది/ రోడ్డు బాగుపడిందంటూ వేల్రాంబట్టివాసుల ఆనందం

గుడిపాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నంగమంగళం పంచాయతీ వేల్రాంబట్టి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలతో నిండిపోవడంతో బాగు చేయాలని 30 ఏళ్లుగా స్థానికులు విన్నవిస్తూనే వచ్చారు. వర్షం కురిసినప్పుడల్లా నంగమంగళం నుంచి వేల్రాంబట్టి గ్రామానికి వెళ్లడానికి జనం తీవ్ర ఇక్కట్లు పడేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్డు మరమ్మతులకు బదులు.. ఏకంగా తార్ రోడ్డు వేయడంతో తమ 30 ఏళ్ల కల నెరవేరిందని వేల్రాంబట్టివాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రజలకు వైసీపీ అరాచకాల నుంచి విముక్తి

గంగాధరనెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో వైసీపీ అరాచకాల నుంచి ప్రజలకు విముక్తి లభించిందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. గంగాధరనెల్లూరులో మంగళవారం మండల టీడీపీ నేతలతో కలిసి 'సుపరిపాలనకు తొలి అడుగు- ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబునాయుడు, రమునాథ నాయుడు, దేవసుందరం, స్వామిదాస్, జ్యోతిరెడ్డి, హరిష్‌యాదవ్, మునిరాజులయాదవ్, గిరిబాబురెడ్డి, సోమశేఖరెడ్డి, ప్రసాద్ నాయుడు, జ్యోతియాదవ్, రుపేంద్రరెడ్డి, జయచంద్రారెడ్డి, శాంతకుమార్, శివప్రసాద్, కృష్ణయ్య, జాన్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరంగరాజపురం:** ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో

### టీడీపీ నాయకులు

టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నేతలు నిరంజన్‌రెడ్డి, గుండమనేని రాజశేఖర్ నాయుడు, బాలాజీ నాయుడు, ఎస్. కుమార్, జయరాజ్, భాస్కర్ నాయుడు, చంద్రబాబు నాయుడు, పవన్, లోకేష్, ఫైనేని ధనంజయులు, బాబు నాయుడు, సూరిరెడ్డి, మణి, రామిరెడ్డి, నోమేశ్వర్‌రెడ్డి, ఢిల్లీ పాల్గొన్నారు.

**పెనుమూరు:** టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నేతలు షణ్ముగవర్మ, బాలాజీ, భాస్కర్, చిరంజీవిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, యాగమానాయుడు, తులసీనాయుడు, రాజగోపాల్‌నాయుడు,గంగాధరం, గుర్రప్పనాయుడు,

సమావేశంలో ప్రసంగిస్తున్న రుద్రయ్యనాయుడు

అశోక్, పరమేశ్వరరెడ్డి, పంగులూరి సురేష్, ఏకాంబరం,హనుమంతనాయుడు, దుర్వాసులు నాయుడు, చంద్రబాబు, రాజేష్, హరి, అమరనాథ్, జయప్రకాష్, రామచంద్రారెడ్డి,దొరస్వామి పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** ఎమ్మెల్యే థామస్ విదేశీ పర్యటనలో ఉండటంతో కార్యక్రమాన్ని నిర్వహించడానికి పార్టీశ్రేణులు మంగళవారం సమావేశం నిర్వహించారు. బుధవారం నుంచి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు.

టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమనాయుడు, జయశంకర్ నాయుడు

## ద్రౌపది అమ్మవారి ఊరేగింపు

ద్రౌపది అమ్మవారు - భక్తులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నేత వాసుదేవరెడ్డి

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాల సందర్భంగా ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు. తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకం రవియాదవ్, ప్రధాన కార్యదర్శి బి.గౌతమ్ రాజు, ఉపాధ్యక్షుడు కెరవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆరిసాల యాదవ్ పర్యవేక్షించారు. కాగా, మంగళవారం రాత్రి ఆలయ ఆవరణంలో ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.

## టీటీడీ చైర్మన్ కృషితో పేద భక్తులకు దర్శనాల్లో ప్రాధాన్యం: టీడీపీ

కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గంగాధరనెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కృషితో పేద భక్తులకు శ్రీవారి దర్శనాల్లో ప్రాధాన్యం లభించిందని టీడీపీ నేతలు అన్నారు. టీటీడీ చైర్మన్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని గంగాధరనెల్లూరులో మంగళవారం నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దాసిన్ని ప్రసాద్‌నాయుడు, కొట్రకోన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడి నరసింహులునాయుడు, మండల టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మునిరాం చంద్రబాబునాయుడు, పూలపల్లెకు చెందిన టీడీపీ నేత బొల్లిని మురళీనాయుడు తదితరులు కలిసి బారీకేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

## కూటమి ప్రభుత్వంలో పేదలకు ఆసరా: టీడీపీ

పింఛను సొమ్ము అందజేస్తున్న ధనుంజయ యాదవ్

విజయపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పేదలకు ఆసరా లభిస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయ యాదవ్ అన్నారు. మంగళవారం విజయపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచనల మేరకు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది వ్యాస్, ప్రభు, టీడీపీ నాయకులు జయరామరాజు, శ్రీనివాసులురాజు, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ తప్పనిసరిగా చేయాలని వెదురుకుప్పం ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. మంగళవారం సంతబైలు గ్రామపంచాయతీలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు. కార్యదర్శి ఉమాశంకర్, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, సంతబైలులో సామాజిక పింఛన్ల పంపిణీని ఎంపీడీవో తనిఖీ చేశారు.

## పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన

విద్యార్థినులకు సూచనలిస్తున్న సీఐ విక్రమ్

నగరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని పల్లిపట్టు రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టంతోపాటు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను సీఐ విక్రమ్ తెలియజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. కార్వేటినగరం మండలం కత్తెరపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(68) స్థానిక కృష్ణాపురం జలాశయం లష్కర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఆదివారం స్వగ్రామంలో బైక్‌లో వెళ్తుండగా కుక్క అడ్డు వచ్చి బోల్తా పడ్డాడు. గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

## ఆరుగురు జూదరుల అరెస్టు

చిత్తూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పేకాడుతున్న ఆరుగురిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. గంగన్నపల్లె సమీపంలోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు మంగళవారం రాత్రి సమాచారం అందింది. ఆ ఇంటిపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8,600 సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

### లాటరీ టికెట్ల విక్రేత కూడా..

లాటరీ టికెట్లు విక్రేతను కూడా రెండో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పిళ్లయార్ కోయిల్ వీధికి చెందిన మురగన్.. సామిరెడ్డివీధి నగర్‌లో లాటరీ టికెట్లు అమ్ముతున్నాడని పోలీసులకు తెలియడంతో దాడి చేశారు. అతడి వద్ద నుంచి రూ.8,850, కొన్ని లాటరీ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

## 14 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 14మందికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. 14మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్టు గుర్తించి, కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. పరిశీలించిన జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 14 మందికి రూ.1.40 లక్షల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

## 6న గురు పౌర్ణమి పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ ఆశ్రమంలో ఈనెల 6వ తేదీన సాయంత్రం గురుపౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు సిద్ధి సమాధియోగా చిత్తూరు శాఖ నిర్వాహకుడు నరేంద్ర కుమార్ తెలిపారు. తవణంపల్లె మండలం అరగొండ శివగిరి ఆశ్రమ పీఠాధిపతి అప్రమేయానంద గిరి స్వామి హాజరవుతారని పేర్కొన్నారు. నగరవాసులు పాల్గొనాలని కోరారు.

# మా బడి మాకు కావాల్సిందే

### అధికారులకు తేల్చి చెప్పిన యనమలమంద కాలనీవాసులు

వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ బాబు

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'మా పిల్లల్ని ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు పంపించం. మాకు తెలియకుండానే పాఠశాలను స్థాయి తగ్గించారు. మేం అప్పట్లో కూడా అంగీకరించలేదు. ప్రభుత్వానికి అనుకూలంగా వారే రాసి నివేదికలు పంపించారు' అంటూ మంగళవారం యనమలమందకు చేరుకున్న అధికార బృందానికి కాలనీవాసులు తేల్చి చెప్పారు. విద్యార్థులు బడికెళ్లకుండా తమ తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలుపుతున్న నేపథ్యంలో మంగళవారం వెదురుకుప్పం తహసీల్దార్ బాబు, ఎంఈవో దామోదరం, జనసేన నాయకుడు డాక్టర్ యుగంధర్ పొన్న అక్కడికి చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో చర్చించారు. ఈ క్రమంలో స్థానికులు పైవిధంగా స్పందించారు. అయితే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగిస్తే పక్కనే ఉన్న భూమిని కొనిస్తామని, ఆ స్థలంలో పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు భూమిని కొని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంఈవో ఇస్తామన్న ప్రతిపాదనపై లేని చేసి.. భవన వసతి కల్పనకు చర్యలు తీసుకుంటామని పరోక్షంగా భరోసా ఇచ్చారు. కాగా, ప్రభుత్వ నిబంధనల మేరకే పిల్లలను తరలించామని విద్యా శాఖ, తల్లిదండ్రుల, యాజమాన్య కమిటీ, హెచ్ఎం నిర్ణయం ప్రకారమే నివేదికను ప్రభుత్వానికి పంపించామని ఎంఈవో చెబుతున్నారు. ఈ పాఠశాల నుంచి 6,7,8 తరగతి విద్యార్థులను ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాపింగ్ చేశామన్నారు. ప్రస్తుతానికి ఇది ప్రాథమిక పాఠశాల మాత్రమేనని, ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే ముందుకెళ్తామని తెలియజేశారు. ఇదిలా ఉంటే.. బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆ గ్రామానికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సంక్షిప్తంగా..

### తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి

పాలసముద్రం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలకు ఎంపీడీవో సతీష్ సూచించారు. మంగళవారం పాలసముద్రం బీసీ కాలనీలో చెత్త సేకరణను ఆయన పరిశీలించారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

గుడిపాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సంగీత అన్నారు. మంగళవారం వసంతాపురం, పేయనపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి సన్మానం

విజయపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్లపాటు పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయుడు రవిని మంగళవారం సన్మానించారు. హెచ్ఎం వెంకటరాజు, విద్యాకమిటీ చైర్మన్ సురేష్‌రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు సూరబ్బ, చెంచమ్మ, మునిలక్ష్మి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా గుండాలమ్మ జాతర

గుండాలమ్మకు పూజలు చేస్తున్న లావణ్య

చిత్తూరు కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అశోక్‌పురంలో మంగళవారం గుండాలమ్మ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు మురుగేషన్, రవిశంకర్‌నాయుడు దంపతులు తొలి పూజ చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, అంబలి నైవేద్యం సమర్పించారు. పూజల్లో గుడిపాల మండల గుండు జాతర వంశ పారంపర్య ధర్మకర్త సికే లావణ్య, ప్రముఖ సామాజిక కార్యకర్త పార్సారథి నాయుడు, దుర్గాంబ ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్ సీకే విశ్వనాథ్, మండి సుధ, డీకే బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

చిత్తూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరదప్పనాయుడు నగరపాలక పాఠశాల నన్నపాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు మాజీ కౌన్సిలర్ పార్థసారధినాయుడు మంగళవారం రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

వెదురుకుప్పం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వెలిసిన దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ● కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

### రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

గుడిపాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గుడిపాల గ్రామీణ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పీఆర్ ఏఈ ప్రసాద్‌నాయుడు తెలిపారు. 30 గ్రామాల సీసీ రోడ్లకు రూ.2.30కోట్లు, మరో 20 పనులకు రూ.6.16 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు మంగళవారం పేర్కొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు
జనహృదయనేత, చిత్తూరు జిల్లా
సీనియర్ శాసనసభ్యులు , మాజీ మంత్రివర్యులు
శ్రీ ఎన్.అమరనాథరెడ్డి గారికి
హార్థిక జన్మదిన శుభాకాంక్షలు
మీరు ఇలాంటి పుట్టినరోజులు,
మరెన్నో జరుపుకోవాలని ..
మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని
భగవంతున్ని ప్రార్థిస్తూ...
శ్రీ ఎన్.అమరనాథరెడ్డి గారు
శాసనసభ్యులు, పలమనేరు
మాజీ మంత్రివర్యులు
Kishore Musunuri
Managing Director
Yuvaraj Naidu
Director
Varun Marpuri
Director
Vishnu Kakarla
Director
Sanjay
Director
DWARAKAMAI BUILDERS & DEVELOPERS PVT LTD
DWARAKAMAI'S BUILDERS DEVELOPERS PVT LTD
Bengaluru, Karnataka

హార్థిక జన్మదిన శుభాకాంక్షలు
అనునిత్యం ప్రజా సేవకై పరితపించే నాయకులు
రాయలసీమ సింహం, పలమనేరు ప్రజల ఆరాధ్య నాయకులు,
మాజీ మంత్రివర్యులు, పలమనేరు శాసనసభ్యులు
శ్రీ ఎన్.అమరనాథ రెడ్డి గారికి
హార్థిక జన్మదిన శుభాకాంక్షలు.
ఆ కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి
కృపాకటాక్షాలతో
ఇంకా మరిన్ని
జన్మదినోత్సవాలు
జరుపుకోవాలని
ఆకాంక్షిస్తూ..
శ్రీ ఎన్.అమరనాథ రెడ్డి
మాజీ మంత్రివర్యులు,
ఎమ్మెల్యే, పలమనేరు
ఎ.ఎం. రంగనాథ్
మండల పార్టీ అధ్యక్షులు
వి.కోట
బి.ఆర్. రాంబాబు
జిల్లా అధికార ప్రతినిధి,
క్లస్టర్ ఇన్‌చార్జ్, వి.కోట
వి.కోట మండల తెలుగుదేశం పార్టీ ఆత్మీయ కుటుంబ సభ్యులు
బి.ఎం.సుబ్బన్న
మాజీ మండల ఉపాధ్యక్షులు
ఈశ్వర్
మండల పార్టీ ప్రధాన కార్యదర్శి
పి.ఆర్. ధీరజ్
మండల తెలుగు యువత అధ్యక్షులు, వి.కోట
కె.ఆర్.శభరీష్
జిల్లా యువత కార్యవర్గ సభ్యులు
ఎం.సోమశేఖర్
మండల మాజీ కార్యదర్శి
ఎం.జె.చంద్ర శేఖర్ రెడ్డి
మాజీ రెస్కో డైరెక్టర్
సి.విశ్వనాథ్
మాజీ జడ్‌పిటిసి
శివకుమారి
తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు
డి.ఎన్.కుమార్
మండల బి.సి.సెల్ అధ్యక్షులు
నాసీర్
మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు
హరినాథ్ రెడ్డి
యూనిట్ ఇన్‌చార్జ్
విశ్వనాథ రెడ్డి
యూనిట్ ఇన్‌చార్జ్
విశ్వనాథ్
సర్పంచ్
ఎ.ఆర్.నాగరాజ్
మండల బి.సి.సెల్ ఉపాధ్యక్షులు, కాంట్రాక్టర్
సుబ్రమణ్యం శెట్టి
మాజీ ఎంపిటిసి
యూనిట్ ఇన్‌చార్జ్
బి.ఆర్.సతీష్
మాజీ సర్పంచ్
రామ్మూర్తి ఆచారి
మాజీ ఎం.పి.టి.సి.
యూనిట్ ఇన్‌చార్జ్
ఎం.సి.క్రిష్టప్ప
మాజీ ఎం.పి.టి.సి.
భక్తవత్సలం
మాజీ ఎం.పి.టి.సి.
యాసీర్
మాజీ ఎం.పి.టి.సి.
నారాయణ స్వామి
మాజీ ఎంపిటిసి
వెంకటరామప్ప
ఎ.ఎం.సి. మాజీ డైరెక్టర్
బి.ఎం.ఆర్.భాస్కర్
మండల టిడిపి సీనియర్ నాయకులు
మురుగేష్
మండల కమిటీ ఇన్‌చార్జ్
లక్ష్మణ్
మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు
జనార్ధన్‌రెడ్డి
జిల్లా తెలుగుయువత కార్యదర్శి
యూనిట్ ఇన్‌చార్జి
కోదండరెడ్డి
ఐటిడిపి మండల అధ్యక్షులు
యూనిట్ ఇన్‌చార్జి
కే.శవరెడ్డి
యూనిట్ ఇన్‌చార్జి
సుధాకర్ రెడ్డి
టీడీపీ సీనియర్ నాయకులు
గుణశేఖర్
మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు
రాము (LIC)
యూనిట్ ఇన్‌చార్జ్
ముకుంద
పట్టణ పార్టీ మాజీ కార్యదర్శి
రామచంద్ర
టీడీపీ సీనియర్ నాయకులు
కొంగాటం
కె.సురేంద్ర
మండల వాణిజ్య విభాగ మాజీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్
విశేశ్వర్‌రావు
టీడీపీ సీనియర్ నాయకులు
దివాకర్ రెడ్డి
మాజీ ఎం.పి.టి.సి.
సాదాత్
టీడీపీ సీనియర్ మైనారిటీ నాయకులు, వి.కోట
ఎస్.కె. ఇక్బాల్
సీనియర్ టీడీపీ మైనార్టీ నాయకులు
షేక్ ఉమ్మర్
మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి
గౌస్‌పీర్
యూనిట్ ఇన్‌చార్జ్
చంద్రశేఖర్
మాజీ సర్పంచ్,
ముదరందొడ్డి
దామోదర్
సర్పంచ్
ముదరందొడ్డి
సతీష్
తెలుగుయువత
దాసార్లపల్లె
అమరేంద్ర
తెలుగుయువత
పత్రపల్లె
నరేష్
తెలుగుయువత
దాసార్లపల్లె
చందు
తెలుగు యువత
గంధారమాకులపల్లె
వెంకటరమణ
నెర్నపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు
గుణశేఖర్ రెడ్డి
తెలుగు యువత
శంకర్ సి.ఎం.
తెలుగు యువత
నాగరాజ్ కె.జి.
తెలుగు యువత
బూత్ కన్వీనర్
చంద్రబాబు పి.సి.
టీడీపీ సీనియర్ నాయకులు
దానమయ్యగారిపల్లె
మణికంఠ
తెలుగు యువత
సుబ్బారెడ్డి
పెద్దబరిణేపల్లి
పార్టీ అధ్యక్షుడు
సుబ్రమణ్యం గౌడ్
మాజీ ఎం.పి.టి.సి.
ఉదయ్ రాజు
తెలుగు యువత
గుమ్మిరెడ్డిపల్లి
ఇక్బాల్
తెలుగుయువత
మైనార్టీనాయకులు
పి.ఎం.జ్యోతీశ్వర్
పంచాయతీ పార్టీ
ప్రధాన కార్యదర్శి
ఎం.శివ, M.A., P.hd.,
టిడిపి సీనియర్ నాయకులు
రాంబాబు
మాజీ ఎం.పి.టి.సి.
జి.రఘు
మండల ఎస్.టి.సెల్ అధ్యక్షులు

జన్మదిన శుభాకాంక్షలు
TELUGU DESAM PARTY
నిగర్వి, నిరాడంబరుడు,
అకుంటిత దీక్షాపరులు,
జిల్లా ప్రజల
ఆరాధ్యనాయకులు,
ప్రజా సంక్షేమం
కోసం పరితపిస్తున్న
మా మామయ్య,
పలమనేరు శాసనసభ్యులు
గౌ॥ శ్రీ నూతనకాల్వ
అమరనాథరెడ్డి గారికి
హృదయపూర్వక
జన్మదిన
శుభాకాంక్షలు.
శ్రీ ఎన్. అమరనాథరెడ్డి గారు
పలమనేరు శాసనసభ్యులు
గువ్వల రమేష్‌రెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు,
చౌడేపల్లె మండలం, పుంగనూరు నియోజకవర్గం, చిత్తూరుజిల్లా

రొంపిచెర్ల జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు కలిసికట్టుగా పనిచేయాలని ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్య అన్నారు. మంగళవారం బొమ్మయ్యగానిపల్లె పాఠశాలలో బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం హైమావతి, ఉపాధ్యాయులు చిన్నరెడ్డెప్పనాయుడు, రమేష్, వెంకటనారా

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం

యణ, రంగారెడ్డిలను శాలువలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆఫీజుల్లా, కళ్యాణి, జాఫర్, గుర్రప్ప, శుభాకర్, స్వర్ణలత, సంపూర్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

**● ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ**

**సోమల:** మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అమరేంద్రకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుర్రంకొండ జూనియర్ కళాశాల నుంచి ఈయన బదిలీ వచ్చారు. ఇక్కడి ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు పుంగనూరు బాలికల జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్రను అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులందరికీ పింఛన్లు

పుంగనూరు రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మంగళం, ఏటవాకిలి పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భర్తలు మృతిచెందిన, భార్యలు మృతి చెందిన వారికి నూతనంగా 80 మందికి పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు.

**95.01 శాతం మందికి పెన్షన్ల పంపిణీ**

పలమనేరు, జూలై1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో మంగళవారం ఈనెలకు సంబంధించిన సామాజిక పెన్షన్లను 95.01 శాతం మందికి అందజేసినట్లు మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్ తెలిపారు.సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందజేశారన్నారు. మిగిలిన లబ్దిదారులకు బుధవారం అందజేస్తారన్నారు.

**చౌడేపల్లి మండలంలో..**

**చౌడేపల్లె** : సామాజిక పింఛన్లు 95 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లీలా మాధవి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. అన్ని పంచా యతీల్లోనూ స్థానిక నాయకులతో కలిసి అధికారులు పెన్షన్లను పంపిణి చేశారన్నారు. మండలంలో 6479 మందికి గాను ఒక్కరోజులోనే 6183 మందికి పంపిణి చేసినట్లు ఆమె వివరించారు.





మీకు నేనున్నా.. : పింఛనుదారుడు పోసిబాబు భుజంపై చేయి వేసి నడచివెళుతున్న సీఎం

పంట పండింది : పంట నష్టపరిహారం చెక్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

బాగా చదువుకోండి : పీ4లో దత్తత ఇస్తున్న అమ్మాయిలతో సీఎం

సీఎంకు కలెక్టర్ ప్రశాంతి జ్ఞాపిక

# జనంతో..సీఎం!

మీ పాలన భేష్ : చంద్రబాబుతో రూ.లక్ష విరాళం ఇచ్చిన వృద్ధురాలు

సూపర్ సార్ : బాబుకు జ్ఞాపిక ఇస్తున్న మార్గదర్శి కాశీ విశ్వనాథరాజు

మా అబ్బాయిని చూడండి సార్ : బాబుకు విన్నవిస్తున్న దివ్యాంగుడి తండ్రి

## దేవుడింతే ఇచ్చాడు.. ఇది మా ఖర్మ.. అనే ఆలోచన మానేయాలి!

సీఎం చంద్రబాబునాయుడు కొవ్వూరు నియోజకవర్గ పర్యటన ఆసక్తికరంగా సాగింది. గతంకంటే భిన్నంగా ఆయన మాటల్లో మార్పు కనిపించింది. పేదల సేవలో..అనే కార్యక్రమానికి వచ్చిన ఆయన నిజంగా పేదలతో మమేకమయ్యారు. పేదలు ఆత్మ గౌరవంతో, విశ్వాసంతో ఆలోచనలు పెంచుకోవాలని , దేవుడింతే ఇచ్చాడు.ఇది మాఖర్మ, నిత్యం కష్టపడడమే మా బతుకు అనే ఆలోచనలు చేయడం మానేయమని పిలుపునిచ్చారు. అంతేకాదు చర్మకార పింఛను దారుడైన పోసిబాబును కొవ్వూరు మండలం ధర్మవరంలో కారులో ఎక్కించుకుని తాళ్లపూడి మండలం మలకపల్లి వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. కారులో పక్కనే కూర్చోపెట్టుకుని వృత్తి, జీవన స్థితిగతులపై ఆరాతీశారు. ఆయన ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చారు. పోసిబాబు మాదిగ డప్పు తీసుకుని ఎలా కొట్టాలో అడిగి కాసేపు డబ్బు వాయించారు. అతని భుజంపై చేయి వేసి వీధిలో నడిచి వెళ్లారు. మరో పింఛన్‌దారుడి బిడ్డను ఎత్తుకుని ఆడించారు. సభానంతరం అనేక మంది సమస్యలు విని అందరికీ అండగా ఉంటానని చెప్పడంతో ప్రజలంతా ఆనందపడ్డారు.

- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

## పేదల సేవలో చంద్రబాబు

- మలకపల్లిలో జనంతో మమేకం
- పీ4లో ఇద్దరు అమ్మాయిల దత్తత
- కొవ్వూరుకు వరాల జల్లు
- సీఎంను చూసేందుకు జనం క్యూ

రాజమహేంద్రవరం/కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గేర్ మార్చారు.. జనంలోనే ఉంటున్నారు.. జనం బాధలు వింటున్నారు..అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.. మీకు నేనున్నానంటూ పేదలకు భరోసాగా నిలుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో మంగళవారం మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేర జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాళ్లపూడి గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు ఉదయం 9 గంటలకే సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. సీఎం చంద్రబాబు మలకపల్లి ప్రజల కోసమే తాను వచ్చానని చెప్పడంతో మలకపల్లి మరింత మురిసిపోయింది. ముందుగా చర్మకారుడు పోసిబాబు ఇంటికి నేరుగా వెళ్లి రూ.4 వేలు పింఛన్ అందజేశారు.అతను తయారుచేసే చెప్పులు, టోపీలు చూశారు. ఒక టోపీ, ఒక చెప్పుల జత తీసుకుని రూ.5 వేలు ఇచ్చారు. గ్రామంలో మరో మహిళలకు పింఛన్ అందజేశారు. అక్కడే ఒక చిన్నపిల్లను ఎత్తుకుని ముద్దాడారు. తల్లితో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమమే పీ4.. సమాజం మీకు ఎంతో ఇచ్చింది. అందులో కొంత తిరిగివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ4) ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తానన్నారు. సమాజంలో 10 శాతం ఉన్నతమైన, ఆదర్శవంతమైన కుటుంబాల నుంచి సమాజంలో దిగువన ఉన్న 20 శాతం మంది ప్రజలను దత్తత తీసుకునే బృహత్తర కార్యక్రమం పీ4 అని చెప్పారు. సంపన్నులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని మూడు దశల్లో ఆ కుటుంబానికి అండగా నిలబడి ఉన్నతికి తవంవంతుగా బాధ్యత తీసుకోవాలన్నారు. 2029 నాటికి పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దేశంలో ఏపీలోనే ఎక్కువ మొత్తంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రగతి తదితర అంశాలను వివరించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు ప్రథమస్థానం ఇవ్వడం జరిగిందన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని గతంలో 150 పడకల ఈ ఆస్పత్రిని అభివృద్ధి కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను శుద్ధిచేసి తాగునీరుగా అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విన్నవించారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారు. అడినవన్నీ ఇచ్చారు.. వెంటనే వరాల జల్లు కురిపించారు.

## రెండున్నర గంటలు ఆలస్యంగా భోజనం

రాజమహేంద్రవరం : చంద్రబాబు సాధారణంగా మధ్యాహ్నం 1-2 గంటల మధ్య భోజనం ముగిస్తారు. ఆయన కారవాన్‌లోనే భోజనానికి ఓ 15 నిమిషాలు సమయం తీసుకుంటారు. మలకపల్లి సభకు ఆయన 11 గంటలకు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించక 2 గంటలకు చేరుకున్నారు. అప్పటికే కారవాన్‌లో భోజనాన్ని సిద్ధం చేశారు. కానీ ప్రజలు వేచి చూస్తున్నారంటూ ఆయన నేరుగా సభా వేదికపైకి చేరుకున్నారు. సభ ముగిసేసరికి సుమారు సాయంత్రం 4 గంటలు దాటింది. సభ ముగిసిన తర్వాత ప్రజల వినతులు, ఫొటోల అనంతరం ఆయన కార్యకర్తల సమావేశ ప్రాంగణానికి 4.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పుడు కారవాన్‌లో భోజనం ముగించుకొని 5 గంటలకు సమావేశానికి వెళ్లారు.

## పోలీసుల ఓవరాక్షన్..

**కొవ్వూరు :** సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసులు అతిచేశారు. ఎవరినీ సీఎం చంద్రబాబు చెంతకు వెళ్లనీయకుండా సుమారు కిలోమీటర్ దూరంలోనే బందోబస్తు నిర్వహించారు. మల్లకపల్లిలో 2 వేల మందికి సరిపడా వేదికను సిద్ధం చేయగా అంత మందినీ తనిఖీ చేసి లోపలకు అనుమతించారు.. చంద్రబాబు కాన్వాయ్ వస్తుంటే జనాన్ని పక్కకు తోసేశారు.. దీంతో సభకు వచ్చిన జనం అసహనం వ్యక్తంచేశారు. పార్టీ కార్యకర్తల సమావేశం వద్దా ఇదే పరిస్థితి కనిపించింది. ఎంపిక చేసిన వారిని మాత్రమే లోపలకు అనుమతించారు. దీనిపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

చంద్రబాబే మా విక్టరీ : మలకపల్లిలో మహిళల అభివాదం

బాబును చూద్దామని : గుంపులుగా నడచి వెళుతున్న మహిళలు

సాయం చేస్తారని..

ఎదురుచూపులు : కాపవరంలో చంద్రబాబు రాకకు చూస్తున్న నాయకులు

అంతా ఓకేనా..

మంత్రి నిమ్మలతో శేషారావు, సుబ్బరాయచౌదరి, కుడుపూడి సత్తిబాబు తదితరుల మాటామంతీ

## మీ పాలన బాగుంది సార్..

సీఎం చంద్రబాబుతో చర్మకారుడు పోసిబాబు

సీఎం నారా చంద్రబాబునాయుడు తన కారులో తన పక్క సీటులో ఓ సామాన్య చర్మకారుడిని కూర్చోపెట్టుకుని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరం నుంచి తాళ్లపూడి మండలం మలకపల్లిలోని అతడి ఇంటివరకూ వెళ్లారు. 2 కిలోమీటర్ల మేర పయనించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ ఆసక్తికరంగా ఉండడం గమనార్హం. ముఖ్యమంత్రి చంద్రబాబు మలకపల్లిలో స్వయంగా పింఛను పంపిణీ చేయడానికి, పీ4 కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ప్రజావేదిక మీద ప్రసంగించడానికి మంగళవారం వచ్చిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కారులో వస్తూ కొవ్వూరు మండలం ధర్మవరంలో ఓ కిరాణా కొట్టువద్ద ఆగారు. సరుకులు కొంటున్న వ్యక్తి వద్దకు వెళ్లి నీపేరేంటి? ఏంచేస్తున్నావ్ అని అడిగారు.?

చర్మకారుడు పోసిబాబు కుటుంబానికి పింఛన్ మంజూరు పత్రం అందజేస్తున్న సీఎం

- **చర్మకారుడు :** నా పేరు సనమండ్ర పోసిబాబు అండి. చర్మకారుడిని. చెప్పులు కుట్టుకుని కుటుంబానికి పోషించుకుంటున్నా. సామాను కొనుక్కోవడానికి వచ్చా.
- **సీఎం :** మీకు పింఛన్ ఇస్తున్నాం కదా?
- **పోసిబాబు :** అవును అయ్యగారు.. మీరే అప్పట్లో రూ.వెయ్యిచ్చారు.ఇవాళ రూ.4 వేలు ఇస్తున్నారు.ఆనందంగా ఉందండి.
- **సీఎం :** వయసు..ఆరోగ్యం ఎలా ఉంది..?
- **పోసిబాబు :** నా వయసు 55 అండి. కాళ్ల నొప్పులు ఇబ్బంది పెడుతున్నాయి సార్.కిడ్నీలో చిన్న ఫాల్ట్ కూడా ఉంది.
- **సీఎం :** పాలన ఎలా ఉంది..?
- **పోసిబాబు :** మీరు బాగా చేస్తున్నారు. వైఎస్ఆర్ వల్ల చాలా ఇబ్బందులు పడ్డాం. నాకు మీరు గతంలో ఇల్లు ఇచ్చారు. మీరు మారాక మధ్యలో ఆగింది. వైసీపీలో సాయం చేయలేదు. అది అలానే ఉండిపోయింది.
- **సీఎం :** చదువుకోవాలనిపించలేదా?
- **పోసిబాబు :** నేను ఇంటికి పెద్దకొడుకునండి, మూడో తరగతి చదివించి..రోజుకు రూ.3లకోసం గేదెలు మకాం పెట్టించారు.
- **సీఎం :** నేను ఒకటో తేదీన పేదల సేవలో.. ప్రజలకు అండగా ఉండాలని చెబుతున్నా,నీ అభిప్రాయం?
- **పోసిబాబు : మనల్ని** చంద్రబాబు నాయుడుగారు బాగా చూస్తున్నారు అనే ఆలోచన ప్రజల మనసులో కలిగింది. వైఎస్ ఆర్‌కు వేసినా ఏమీ లేదని ఇవాళ ప్రజలు తెలుసుకున్నారండి.
- **సీఎం :** ధనవంతులు పేదలకు దత్తత తీసుకుని సాయం చేస్తే ఎలా ఉంటుంది.?
- **పోసిబాబు :** చాలా బాగుంటుంది. అభివృద్ధి చెందుతారు.
- **సీఎం :** నేనింకా బాగా చేయాలని ఆలోచిస్తున్నా.అందరినీ పైకి తీసుకురావాలన్నదే నా లక్ష్యం..

- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

### వ్యాపారం ఎలా ఉంది..

ధర్మంలో కిరాణా కొట్టు యజమానితో చంద్రబాబు సంభాషించారు. రోజుకు ఎంత వ్యాపారం చేస్తావని అడగ్గా.. నాలుగు-ఐదు వేలు చేస్తానని యజమాని చెప్పారు. సరుకు ఎక్కడి నుంచి తెస్తావంటే.. రాజమండ్రి నుంచి తెస్తానని చెప్పగా ఏఏ రకాలు ఉంటాయని ఆరా తీశారు.బిల్లు చేసే విధానంతో అమ్మితే సులభంగా ఉంటుందని సలహా ఇచ్చారు. తర్వాత కొట్టు యజమాని కుటుంబీకులతో కలసి ఫోటో,సెల్ఫీ తీసు కున్నారు. ఇపుడు బెదిరింపులేమీ లేవు కదా, వ్యాపారం బాగా చేసుకోండని చెప్పి వచ్చేశారు.

పార్టీని ఇబ్బందుల్లో పెడితే
## సహించను
కార్యకర్తలతో సీఎం భేటీ
7




# ఐటీఐతో ఉపాధికి భరోసా

- పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు
- స్కిల్ హబ్ ద్వారా ఎన్నో ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు ప్రభుత్వ, 39 ప్రైవేట్ ఐటీఐలు
- వాటిల్లో మొత్తం 13 ట్రేడ్లు
- జూలై 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

ఉపాధికి భరోసా ఇచ్చే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరితే తక్కువ సమయంలో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చు. పాలిటెక్నిక్ డిప్లొమా, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి వచ్చినా ఐటీఐకి డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. ఐటీఐ పూర్తిచేసిన వారికి పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు ఉండడంతో ఈ కోర్సుల పట్ల ఆసక్తి చూపే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఐటీఐ పూర్తయిన తర్వాత పాలిటెక్నిక్ డిప్లొమా రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉంది. ఐటీఐ పాసైతే వివిధ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ఈ కారణంగా ఐటీఐ చదివేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఐటీఐలో ప్రవేశం చాలా కష్టంగా ఉండేది. అప్పట్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారు సైతం ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు ఇష్టపడేవారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సీటు సాధించాలంటే గగనమే. 10-15 ఏళ్ల క్రితం ఐటీఐ కోర్సులకు డిమాండ్ పూర్తిగా తగ్గింది. అయితే తాజాగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఐటీఐ చదివిన వారికి ఉద్యోగావకాశాలు వస్తుండడంతో క్రమేణా పూర్వవైభవం సంతరించుకుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జూలై 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అప్లికేషన్, ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐల్లో జూలై 17వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకుంటేనే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అర్హులవుతారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా తయారుచేసి సీట్లను భర్తీ చేస్తారు.

కాకినాడ జిల్లాలో కాకినాడ, జగ్గంపేటల్లో రెండు ప్రభుత్వ, 12 ప్రైవేట్, తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో ఒక ప్రభుత్వ, 12 ప్రైవేట్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 15 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి.

బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. రెండేళ్లు, ఏడాది కాలపరిమితితో కూడిన ఐటీఐ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

2022-23లో 436 మంది విద్యార్థులకు 263 మంది ప్లేస్‌మెంట్ సంపాదించారు. 2023-24లో 463 మంది విద్యార్థులకు 436మంది, 2024-25లో 415 మందికి ప్రస్తుతానికి 364 మంది ఉద్యోగాలు సాధించారు.

**ఫిట్టర్:** ఇది ఎవర్‌గ్రీన్. రెండేళ్ల కోర్సు. ఇతర కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నా దీంట్లో మాత్రం సీట్లు నిండిపోతాయి. ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయి. కౌన్సెలింగ్‌లో తొలి ఆప్షన్‌గా దీనినే ఎంచుకుంటారు.

**ఎలక్ట్రికల్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. ఎలక్ట్రికల్ విభాగంతో సంబంధం ఉన్న కోర్సు ఇది. దీనిని పూర్తి చేసిన వారికి ట్రాన్స్‌కో, జెన్‌కో. ఏపీఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. ప్రైవేట్ సెక్టార్లో కూడా మంచి అవకాశాలొస్తున్నాయి.

**డ్రాఫ్ట్‌మెన్ సివిల్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. నిర్మాణ రంగంలో అవకాశాలు ఎక్కువ. వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగాలు పొందొచ్చు. ఈ కోర్సు పూర్తిచేసిన వారు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

**మోటారు మెకానిక్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. మోటారు రంగంలో స్థిరపడేందుకు అవకాశముంటుంది. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలుంది. మోటారు రంగానికి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. స్వయం ఉపాధి దిశగా ఈ రంగాన్ని ఎంచుకుని అద్భుతాలు సృష్టించిన వారు ఉన్నారు.

**ఇన్‌స్ట్రుమెంట్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. దీనిని పూర్తిచేస్తే పరిశ్రమల్లో ఆటోమెషీన్ల వద్ద ఉద్యోగాలు కల్పిస్తారు. దీంతో డిమాండ్ బాగానే ఉంది.

**డీజిల్ మెకానిక్:** కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే. డీజిల్‌తో సంబంధం ఉన్న అన్ని విభాగాల్లో ఉద్యోగం పొందేందుకు అవకాశముంది. ముఖ్యంగా ఆర్టీసీ గ్యారేజీలో.

**కంప్యూటర్స్:** కోర్సు కాలపరిమితి ఏడాది. పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులు. ఏ రంగంలో రాణించాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాల్సిందే. కంప్యూటర్ ఆపరేటర్లుగా హార్డ్‌వేర్ ఉద్యోగాలు పొందే వీలుంది.

**కటింగ్ అండ్ టైలరింగ్:** ఈ కోర్సు కాలపరిమితి ఏడాది మాత్రమే. మహిళలకు కటింగ్, టైలరింగ్ సంబంధించి తర్ఫీదు ఇస్తారు. తద్వారా వారు స్వయం ఉపాధి పొందే అవకాశముంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రుణాలు ఇచ్చి ఈ కోర్సు పూర్తి చేసిన వారిని ప్రోత్సహిస్తున్నాయి.

**ఎలక్ట్రానిక్ మెకానిక్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. టీవీలు, సెల్‌ఫోన్లు రిపేర్ చేయడంలో శిక్షణ ఇస్తారు. ఇందులో ప్రావీణ్యం పొందితే సొంతంగా తమ కాళ్లపై నిలబడటమే కాకుండా మరికొంతమందికి ఉపాధి కల్పించవచ్చు.

**వెల్డర్:** ఏడాది కోర్సు పూర్తిచేసిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. అరబ్ దేశాల్లో ఉద్యోగావకాశాలు అధికం.

**బ్రిడ్జి కోర్సుతో పాలిటెక్నిక్**

ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా పైచదువులు కొనసాగించవచ్చు. ఇది పూర్తి చేసిన తర్వాత ప్రవేశపరీక్ష ద్వారా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.

## మార్కులే ప్రాతిపదిక

**ఎం.వేణుగోపాలవర్మ, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్**
**కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్**

పదో తరగతిలో మార్కుల ప్రాతిపదికన రూపొందించిన మెరిట్ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తాం. ఐటీఐ కోర్సులు చదివిన అభ్యర్థులకు ఉపాధి గ్యారంటీగా లభిస్తుంది. పరిశ్రమల్లో ప్రాధాన్యంతో పాటు విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. నాణ్యమైన సంస్థలు, పెద్దపెద్ద కంపెనీలు కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. శిక్షణ అనంతరం అప్రెంటిస్ మేళాలు, మెగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు చూపిస్తున్నాం. అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలను తర్వాత ప్రకటిస్తాం.

### ఐటీఐ చదువుతుండగానే ప్లేస్‌మెంట్

**సుందరపల్లి వంశీసత్యకృష్ణ**

నాన్న డ్రైవర్. చదువు త్వరగా పూర్తిచేసి ఆయనకి సహాయపడాలనుకున్నా. ఐటీఐ ద్వారా అయితే త్వరగా ఉద్యోగం వస్తుందని ఇనుస్ట్రుమెంట్ మెకానికల్ రెండు సంవత్సరాల కోర్సులో చేరాను. అనుకున్నట్టే రెండో సంవత్సరంలో ఐటీఐలో ఈ నెల 13న నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పోల్‌మాన్ ఇనుస్ట్రుమెంట్స్ కంపెనీ (హైదరాబాద్)లో ఉద్యోగానికి ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది.

### అమ్మ, నాన్న ఎంతో సంతోషించారు: చిలుకోటి బన్నీ

నాది తొండంగి మండలం బెండపూడి. అమ్మ, నాన్న కూలి పనులు చేస్తూ నన్ను చదివించారు. వారి కష్టాన్ని చూడలేక త్వరగా ఉద్యోగం సంపాదించాలనుకున్నా. కొంతమంది ఇచ్చి సలహా మేరకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సులో చేరాను. సెకండియర్ చదువుతుండగా ఏప్రిల్ 26న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎల్అండ్‌టీ చెన్నై బ్రాంచ్‌కి సెలెక్ట్ అయ్యాను. పరీక్షలు పూర్తయ్యాక రెండు నెలలు ట్రైనింగ్ ఇచ్చి నెలకి రూ.16వేల జీతంతో ఉద్యోగమిచ్చారు. అమ్మ, నాన్న చాలా సంతోషించారు.

### టాటా కంపెనీలో ఉద్యోగమొచ్చింది

**పాలిక ప్రేమ్‌భవానీమూర్తి, రామచంద్రపురం**

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ రెండో సంవత్సరం హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాను. మే 7న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం పొందాను. పరీక్షల అనంతరం ఒక నెల ట్రైనింగ్ ఇచ్చారు. వసతి, భోజన సౌకర్యం, ట్రాన్స్‌పోర్టు ఇచ్చి నెలకి రూ.12వేలు బేసిక్‌తో ఉద్యోగం పొందాను.

### క్యాంపస్ ఇంటర్వ్యూలో సత్తా చాటాను

**చదల జాన్ డేనియల్ సతీష్‌చంద్ర, మైలవరం, అల్లూరి జిల్లా**

తండ్రిలేని నన్ను అమ్మ ఎంతో కష్టపడి చదివించింది. త్వరగా జీవితంలో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో ఐటీఐలో చేరాను. మే 28న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సత్తా చాటాను. బక్లౌ హోషన్ (తిరుపతి)లో ఉద్యోగం సంపాదించాను. అమ్మ చాలా సంతోషించింది.

### ఒక సంవత్సరం చదువుకే ఉద్యోగం

**ఎలుగుబంటి సత్యమణికంఠ**

ఐటీఐ చదివితే ఉద్యోగం త్వరగా వస్తుందని సలహా మేరకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో వన్ ఇయర్ కోర్సు డీజిల్ మెకానిక్ తీసుకున్నాను. మే 28న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణి ఇంజన్ వాల్వ్స్ (హైదరాబాద్) కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకి రూ.14,700 బేసిక్‌తో ఉద్యోగం సంపాదించాను. చాలా హ్యాపీగా ఉంది.

### ఎల్అండ్‌టీ కంపెనీకి ఎంపికయ్యాను

**దూడ రాజ్‌కుమార్**

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో డాక్యుమెంట్ సివిల్ రెండో సంవత్సరం చదువుతున్నాను. జూన్ 4న ఎల్అండ్‌టీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచాను. ఆ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. త్వరగా ఉద్యోగం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

వీరబాబును సత్కరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

## ఆక్వారిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరబాబు

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆక్వారిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడకు చెందిన బాబు ఎక్వేరిస్ట్ అధినేత, టీడీపీ బీసీ విభాగం జిల్లా నాయకుడు చొల్లంగి వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ పాత పోస్టాఫీసు వీధిలోని హోటల్ గ్రీన్‌పార్క్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం రాష్ట్ర అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చొల్లంగి వీరబాబు, గౌరవాధ్యక్షుడిగా నాగవర్మ, ఉపాధ్యక్షుడిగా కొవ్వూరి విమలాబాబు, కార్యదర్శిగా బొల్ల బంగారాజు, సంయుక్త కార్యదర్శిగా తాతపూడి రంగారావు, కోశాధికారిగా మీర్ జమీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, విశిష్ట అతిథిగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడలి ఈశ్వరి, గౌరవ అతిథిగా మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.కృష్ణారావు హాజరయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. మత్స్య శాఖ అభివృద్ధి అధికారి గోపి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, అసోసియేషన్ కోర్ కమిటీ సభ్యుడు రవి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి (బాబు)

## డీసీసీబీకి పూర్వవైభవం తీసుకొస్తా: చైర్మన్ తుమ్మల బాబు

కాకినాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకొస్తానని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. డీసీసీబీ సమావేశ హాలులో మంగళవారం ఆయన అధ్యక్షతన ఆప్కాబ్ అధికారులతో సమావేశం జరిగింది. ఆప్కాబ్ సీజీఎం ఎన్.వెంకటరత్నం బృందంతో బ్యాంకు పురోభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆప్కాబ్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు, రాయితీలు కల్పించాలని అధికారులను కోరారు. బ్యాంకు నిరర్థక ఆస్తులను తగ్గించాలని, డిపాజిట్లను పెంచాలని, కొత్త రుణాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు. రైతులకు అందుబాటులో సొసైటీలు పని చేస్తాయని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో ప్రవీణ్‌కుమార్, సీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

## శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం రూ.31.66 లక్షలు

పెద్దాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం తెరిచి లెక్కించారు. 104 రోజులకు రూ.31,66,081 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ అధికారి వి.ఫణీంద్రకుమార్. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది లావణ్య, హరిబాబు, తుని, అనపర్తిలకు చెందిన శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

## నేడు జడ్పీ సమావేశం

కాకినాడ సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కాకినాడ జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరగనుంది. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించనుండగా మంత్రులు, ఎమ్మెల్యేలు జడ్పీటీసీలు, ఎంపీపీలు విచ్చేయనున్నారు. ఏర్పాట్లను జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు పర్యవేక్షించారు.

# పవన్ నిధులు తెస్తే మాకేంటి!

- డిప్యూటీ సీఎం పనులు ప్రతిపాదిస్తే అంగీకరించాలా
- మా ప్రతిపాదనలు పెట్టాల్సిందే
- అజెండాపై సంతకం చేయని చైర్‌పర్సన్
- కాకినాడ కలెక్టర్‌కు చేరిన గొల్లప్రోలు నగర 'పంచాయితీ'

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని నిధులు తీసుకుని పనులు ప్రతిపాదిస్తే నగర పంచాయతీ పాలకవర్గం మోకాలడ్డుతోంది. తాము ప్రతిపాదించిన పనులు పెట్టకుంటే అజెండాపై సంతకం చేసేది లేదని చైర్‌పర్సన్ తేల్చిచెప్పడంతో కౌన్సిల్ సమావేశమే జరగలేదు. ఈ 'పంచాయితీ' కాస్తా కాకినాడ జిల్లా కలెక్టర్ వద్దకు చేరింది.

గొల్లప్రోలు పట్టణంలో నెలకొన్న సమస్యలపై పలు వినతులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన పేషీ అధికారులను పంపి పరిశీలన చేయించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన పనులను తక్షణం చేపట్టేందుకు వీలుగా పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చి పిఠాపురం పట్టణానికి రూ.3 కోట్లు, గొల్లప్రోలు నగర పంచాయతీకి రూ.కోటి ప్రత్యేక నిధులుగా మంజూరు చేయించారు. వీటితో గొల్లప్రోలులోని వివిధ ప్రాంతాల్లో 27 రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రతిపాదించారు. ఇప్పుడు ఈ పనులను ఆమోదించేందుకు వైసీపీ మెజార్టీ ఉన్న గొల్లప్రోలు నగర పంచాయతీ పాలకవర్గం ఆది నుంచీ ఆటంకాలు సృష్టిస్తోంది. మే 29న సాధారణ, అత్యవసర సమావేశాల్లో ఈ పనులను టేబుల్ అజెండాగా తీసుకువచ్చారు. అప్పుడు వైసీపీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు సంతకం చేయకుంటే కమిషనరు కనకారావు తనకున్న విచక్షణాధికారంతో టేబుల్ అజెండా ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించలేదు. కొంత సమయం తీసుకుని అప్పుడు చర్చిద్దామంటూ వాయిదా వేశారు.

నగర పంచాయతీ నెలవారీ కౌన్సిల్ సమావేశాల నిర్వహణలో భాగంగా జూన్‌లో సాధారణ సమావేశం నిర్వహణకు వివిధ అంశాలతో పాటు గత అత్యవసర సమావేశంలో టేబుల్ అజెండాగా తీసుకురాగా వాయిదా వేసిన కోటి రూపాయల అభివృద్ధి పనుల అంశాన్ని కలిపి కమిషనరు... చైర్‌పర్సన్ సంతకం కోసం పంపారు. అయితే తాము ప్రతిపాదించిన పనులే పెట్టాలని, లేకుంటే అజెండాపై సంతకం చేసేది లేదని చైర్‌పర్సన్ స్పష్టం చేసి అజెండాను హోల్డ్‌లో పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన నిధులకు ఆయనే పనులు ప్రతిపాదించారని అధికారులు చైర్‌పర్సన్‌కు వివరించారు. అయినప్పటికీ తమకే మెజార్టీ ఉందని, తాము చెప్పిన పనులే పెట్టాలని, డిప్యూటీ సీఎం అయినా మాకు లెక్కేంటి అనే రీతిలో వైసీపీ పాలకవర్గం ఉండడంతో ప్రతిష్టంభన ఏర్పడింది.

చైర్‌పర్సన్ అజెండాను తిరస్కరించడంతో జూన్‌లో జరగాల్సిన గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం జరగలేదు. అజెండా అంశాలను ఆమోదించి లేదా తిరస్కరించి తనకు పంపలేదని కమిషనరు చెప్తున్నారు. దీంతో పవన్‌కల్యాణ్ పట్టణాభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చి రెండున్నర నెలలు గడుస్తున్నా ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి ఏర్పడింది. పక్కనే ఉన్న పిఠాపురం పురపాలక సంఘంలో పవన్ తెచ్చిన రూ.3కోట్లతో వైసీపీ మెజార్టీ ఉన్నా కౌన్సిల్ సమావేశంలో పనులు ఆమోదించడం, టెండరు పిలవడం జరిగిపోయాయి. ఇక్కడ మాత్రం పనులు జరగకూడదనే రీతిలో గొల్లప్రోలు వైసీపీ పురపాలకుల తీరు ఉందని జనసైనికులు, కూటమి నేతలు మండిపడుతున్నారు. కాగా ఈ మొత్తం వ్యవహారంపై కలెక్టరుకు నివేదిక పంపినట్టు కమిషనరు కనకరావు చెప్తున్నారు. దీంతో పనుల 'పంచాయితీ' కలెక్టర్ కోర్టుకు చేరింది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

## మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు: ఏడీ

అంతర్వేది, జూలై 1(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని మత్స్యశాఖ ఏడీ హర్షవర్ధన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సఖినేటిపల్లి మండలం పల్లిపాలెంలో మత్స్యకారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈదురుగాలులు, అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు.

## తమలపాకుల అలంకరణలో సత్తెమ్మతల్లి



ముమ్మిడివరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మ తల్లిని మంగళవారం తమలపాకులతో అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## వైద్య విద్యార్థినికి గోల్డ్‌మెడల్

జీజీహెచ్(కాకినాడ), జూలై 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో సామాజిక వైద్య శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫస్టియర్ చదువుచున్న డాక్టర్ ఉజితను బంగారు పతకం వరించింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో జూన్ 27నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. రంగరాయ వైద్య కళాశాల నుంచి సామాజిక వైద్యవిభాగం హెచ్‌వోడీ డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీదేవి, పీజీ విద్యార్థులు హాజరయ్యారు. పేపర్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డాక్టర్ ఉజితకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం దక్కింది. ఆమెను మంగళవారం ఆర్ఎంసీలో ప్రిన్సిపాల్ ఎ.విష్ణువర్ధన్ అబినందించారు.

# సర్కారు బడిలోకి ఉపాధ్యాయుడి బిడ్డ



కుమార్తెను రాజమహేంద్రవరంలోని చున్నీలాల్ జాజు కార్పొరేషన్ పాఠశాలలో చేర్పిస్తున్న శ్రీనివాస్

**కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్కూల్ టీచర్**

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల చుట్టూ తిరిగి లక్షలకు లక్షలు ఫీజులు కట్టి మరి సీట్ల కోసం ఎదురుచూసే తరుణంలో వాటిని కాదని తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదువుకోవాలని ఒక ఉపాధ్యాయుడు తలంచాడు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ చున్నీలాల్ జాజు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చింతపల్లి శ్రీనివాస్ తన కుమార్తె మేరిగ్రేస్‌ను 8వ తరగతిలో తన పాఠశాలలోనే చేర్చారు. గతంలో ఇదే ఉపాధ్యాయుడు నాగరాజా మునిసిపల్ పాఠశాలలో పనిచేసినప్పుడు అక్కడ 7వ తరగతిలో చేర్పించారు. ఇప్పుడు చున్నీలాల్‌కు ఆయన బదిలీ కావడంతో తన కుమార్తెను ఈ పాఠశాలకు మార్చుకున్నారు. చిన్నపాటి ప్రైవేట్ ఉద్యోగం చేస్తేనే తమ పిల్లలను బ్రాండ్ ఇమేజ్ ఉన్న పాఠశాలలో చేర్పించి చదించే నేటి కాలంలో ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదువుకోవాలని శ్రీనివాస్ ఈ నిర్ణయం తీసుకోవడం పలువురిని ఆలోచింపజేస్తోంది. ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను పెంచుతుంది. ఈ నేపథ్యం లో శ్రీనివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కూడా బాగున్నాయని, ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగం రాకముందు తాను ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశానని, అందువల్ల తనకు తేడా తెలుసునన్నారు.

### సబ్జెక్‌పై పట్టు వస్తుంది

మాది రామచంద్రపురం దగ్గర కాపవరం గ్రామం. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదువుకున్నాను. నా కుమార్తె కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతానని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధనతో సబ్జెక్‌పై పట్టువస్తుంది. తనలో కాన్ఫిడెన్స్ వుంది. పదో తరగతిలో పాఠశాలకు మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది.

-శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు.

# దాట్ల మరిన్ని సామాజిక రచనలు చేయాలి

**రీజెన్సీ అధినేత జీఎన్ నాయుడు**



దేవదానంరాజును సత్కరిస్తున్న జీఎన్ నాయుడు

యానాం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యానాంకు చెందిన ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మరిన్ని సామాజిక స్పృహ కలిగిన రచనలు చేయాలని రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు అన్నారు. ఉగాదినాడు సీఎం చంద్రబాబు నుంచి కళారత్న పురస్కారం అందుకున్న కవి, కథకుడు, చరిత్రకారుడు దాట్ల దేవదానంరాజును నాయుడు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజు గతంలో యానాం పూర్వవైభవం కోసం అనేక సూచనలు చేశారని, సాహిత్య రంగంలో మరిన్ని సామాజిక అంశాలతో రచనలు చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అకాంక్షించారు. రాజును చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు, చింతా కొండలరావు కూడా అభినందించారు.

# అక్రమ తవ్వకాలు జరిపితే క్రిమినల్ చర్యలు

- ర్యాంపుల్లో తవ్వకాలను డ్రోన్‌లతో పరిశీలిస్తున్నాం: ఆర్డీవో శ్రీకర్
- మానేపల్లిలో రెండు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం

పి.గన్నవరం, జులై 1(ఆంధ్రజ్యోతి): ర్యాంపుల్లో ఇప్పటివరకు జరిగిన మట్టి, ఇసుక తవ్వకాలను డ్రోన్‌ల ద్వారా పరిశీలిస్తున్నామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. ఏ ర్యాంపులో ఎంతమేర అనుమతులు ఉన్నాయో, తవ్వకాలు ఎంతమేర జరిగాయో పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ర్యాంపులను మంగళవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు.నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు జరిపిన వారిపై మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసులు అందించి జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఈనెల 1వ తేదీ నుంచి అక్టోబరు 15వరకు ఏవిధమైన ఇసుక, మట్టి తవ్వకాలు జరిపినా సంబంధిత వ్యక్తులపై ప్రభుత్వ నిబంధనలు అనుసరించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో ర్యాంపుల్లో ఉన్న బాటలను, నదీపాయలపై ఉన్న అడ్డుకట్టలను తొలగించే విధంగా స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అనంతరం మండలంలోని ఊడిమూడి, వైవీపాలెం, మానేపల్లి, కందాలపాలెం ర్యాంపులను ఆయన పరిశీలించి ర్యాంపుల్లో బాటలను తొలగించాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవికి సూచిం చారు. అలాగే ర్యాంపుల పరిధిలో ఉన్న వీఆర్వోలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ర్యాంపులను పరిశీలించాలని ఆదేశించారు. ఇది లావుండగా మానేపల్లి మట్టి ర్యాంపు తనిఖీల్లో భాగంగా ర్యాంపు పరిసరాల్లో ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లను ఆర్డీవో స్వాధీనం చేసుకు న్నారు. సంబంధిత వాహనాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆధీనంలో ఉంచినట్టు తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న ట్రాక్టర్ల యజమానులను ఉద్దేశించి ఒక ట్రక్కు ఇసుక కోసం బయటకు వస్తే వాహనాలు బయటకురావని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంట స్థానిక వీఆర్వోలు ఎం.నాగన్న, ఎన్.రత్నకుమారి, సిబ్బంది ఉన్నారు.

## పొగడ్తలు వినడానికి రాలేదు...
# పార్టీని బాగుచేయడానికి వచ్చా

● కొవ్వూరులో కొత్తరోజులకు శ్రీకారం చుట్టండి ● బహునాయకత్వాన్ని ఒప్పుకోను ● టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం

మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కొవ్వూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'కష్టపడిన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోను. కార్యకర్తలు నేను చెప్పినట్టే చేయండి. మీ పొగడ్తలు వినడానికి రాలేదు. పార్టీని బాగు చేయడానికి వచ్చాను. పార్టీల్లో ఇబ్బందులు సృష్టించే వాళ్లను దూరం పెడతా, కొవ్వూరులో పాత రోజులు మరిపోండి. కొత్త రోజులకు శ్రీకారం చుట్టండి. సింగిల్ వాయిస్ ఉండాలి. ఎమ్మెల్యే, ద్విసభ్య కమిటీ ఒకేమాటగా ఒకేతాటిపై నడవాలి. కొవ్వూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడతా. గీత దాటితే ఉపేక్షించేది లేదు. ఇక్కడ ఏం జరుగుతుందో అంతా నాకు తెలుసు. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వివరాలను సేకరిస్తూనే ఉన్నాం' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలోని ఏఎంసీ గొడౌన్ల వద్ద మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ 'పార్టీలో లీడర్‌షిప్ చూసి ఓట్లు వేస్తారు. నాయకుడు చేసే ప్రతి పనిని, సంక్షేమాన్ని ఇంటింటికి తెలియజేయాలి. ఓటు బ్యాంకు పెంచాలి. టీడీపీకి బలం బీసీ వర్గాలు. 144 కులాలు ఉన్నాయి, చిన్న కులాలకు మైక్రో లెవిల్ గుర్తింపు ఇవ్వాలి. నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోషల్ మీడియా విషయంలో 225 ర్యాంకు. ఫేస్‌బుక్‌లో 2,432 పోస్టులు పెట్టారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడి పోస్టులతో ఇది సమానం. యూట్యూబ్ చానల్ లేనేలేదు. ఇంకా సోషల్ మీడియాలో స్పీడప్ కావాలి. కులాల వారీగా నాయకత్వం చెక్ చేసుకోండి' అని చంద్రబాబు చెప్పారు. డమ్మీ లీడర్లను పెట్టుకుంటే పార్టీ డమ్మీ అయిపోతుందన్నారు. వాయిస్ ఉండే నాయకులను పెట్టుకోవాలన్నారు. పబ్లిక్ ఒపీనియన్ సేకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో బహునాయకత్వాన్ని ఒప్పుకునేది లేదన్నారు. అచ్చిబాబు ఉన్నారు. ద్విసభ్య కమిటీ ఉంది. బయట నియోజకవర్గాల్లో నాయకులు ఎక్కడా ఇంటర్ఫియర్ అవ్వడానికి వీల్లేదన్నారు. అలా చేస్తే వారిని కట్ చేస్తానన్నారు. ఎమ్మెల్యేకి చెబుతున్నాను అందరిని కలుపురండి అని. జవహర్‌కు గౌరవం ఎస్సీ కమిషన్ చైర్మన్ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 8 వేల నుంచి 9 వేల బూత్‌లలో మనకు మెజారిటీ రాలేదని, 10 వేలు మెజారిటీ వచ్చి ఉంటే 175కి 175 సీట్లు మనకు వచ్చేవన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చినా నాయకులకు గౌరవం దక్కడం లేదని, అధికారులే ఎంజాయ్ చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే మాట కలెక్టర్ వినడం లేదన్నారు. కొవ్వూరు మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానికంగా ఉండడం లేదని, మీరు సెంట్రల్ జైల్లో ఉండగా నిరాహార దీక్ష చేశానని చెబుతుండగా సీఎం చంద్రబాబు అతడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొవ్వూరు జాతకం 45 సంవత్సరాలుగా నాకు తెలుసు. గ్రూపులు ఈ నియోజకవర్గంలో ఇప్పటి నుంచే ఉండడంలేదన్నారు. నిజమైన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోనన్నారు. గ్రూపు రాజకీయాలు వద్దన్నారు. అయితే కొంతమంది కార్య కర్తలను సమావేశంలోకి అనుమతించక పోవడం తో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎస్.రాజీవ్‌కృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, పొట్రు శ్రీనివాసరావు, నామాన పరమేష్, కొఠారు వెంకట్రావు, మద్దిపట్ల సురేష్, గొరిజాల సురేష్, చావా శ్రీనివాసరావు, బొల్లిన శివ నాగేంద్ర, గెల్లా సురేష్, కొత్తపల్లి ఆశిష్‌లాల్, వరిగేటి కాంతరాజు, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, ఎరుబండి వెంకట్రావు, 3 మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సిగాచి ఫ్యాక్టరీలో ప్రమాదం
# చాగల్లు యువతి మృతి

జయలక్ష్మీ ప్రసన్న (ఫైల్)

చాగల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన పోలిశెట్టి జయలక్ష్మీప్రసన్న (22) హైదరాబాద్‌లోని సిగాచి కెమికల్స్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందింది. ఆమె బీ ఫార్మసీ పూర్తిచేసి ఫ్యాక్టరీలో కెమిస్టుగా పనిచేస్తోంది. ఉద్యోగంలో చేరి 2 నెలలు గడవకుండానే మృతిచెందడంపై తల్లిదండ్రులు బోరున విల పిస్తున్నారు. తండ్రి పోలిశెట్టి శ్రీనివాసరావు తాపీమేస్త్రీ. తల్లి రామలక్ష్మి ఆశ కార్యకర్త. మృతురాలు పెద్దమ్మాయి కాగా, చిన్న మ్మాయి ప్రభుకుమారి బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఘటనా స్థలానికి తల్లిదండ్రులు చేరుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మోటార్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి

సీతారామ రాజు (ఫైల్)

తునిరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని 16వ జాతీయ రహదారి చేపూరి వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందాడు. తేటగుంట గ్రామానికి చెందిన దంతులూరి వరహాసీతారామరాజు (43) మంగళవారం మోటార్‌సైకిల్‌పై తుని నుంచి తేటగుంట వస్తుండగా చేపూరి వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 సిబ్బంది ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాముకాటుకు వ్యక్తి మృతి

చాగల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం నందిగంపాడుకు చెందిన ఆత్కూరి పెద్ద సత్యనారాయణ (51) పాముకాటుకు మంగళవారం మృతిచెందాడు. పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఫుడ్ కమిటీ సభ్యుల ఆగ్రహం

### అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్‌కు షోకాజ్ నోటీసులు

శంఖవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇలాంటి భోజనాన్ని మీ పిల్లలకు పెడతారా అని ఫుడ్ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో మంగళవారం ఫుడ్ కమిటీ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్, లక్ష్మిరెడ్డి పర్యటించారు. నెల్లిపూడి 2, శంఖవరం4 అంగన్‌వాడీ పాఠశాలలను పరిశీలించి రికార్డుల్లో తేడాలను గమనించారు. హాజరుపట్టీని పరిశీలించి తరచుగా తనిఖీ నిర్వహించని సూపర్‌వైజర్లు రజనీ, అరుణశ్రీకు షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా నోడల్ అధికారి జెస్సీ ఫ్లోరెన్స్‌ను ఆదేశించారు. స్టాక్‌లలో తేడా ఉన్నందున నెల్లిపూడి పాఠశాల టీచర్‌కు నరాల భూలక్ష్మికి షోకాజ్ ఇవ్వాలని సీడీపీవో పి.వెంకటలక్ష్మికి తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేసి విద్యాశాఖ సిబ్బందిని ప్రశ్నించారు. అల్లూరి సీతారామరాజు ఏజన్సీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పదిలోపే భోజనం పాఠశాలకు వస్తుందని పలువురు తెలపడంతో దీనిపై నివేదిక పంపాలన్నారు. డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో ఎస్వీ రమణ, సూపర్‌వైజర్లు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా నెల్లిపూడిలో అంగన్‌వాడీ రిజిస్టర్లు పరిశీలిస్తున్న సభ్యులు

# సీఎం కారులో చర్మకారుడు

### సరుకులు కొనిచ్చిన ముఖ్యమంత్రి
### చెప్పుల జత, టోపీకి రూ.5వేలు

పోసిబాబు తయారుచేసిన చెప్పును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. మలకపల్లిలో చర్మకారుడు పోసిబాబు ఇంటికి వెళ్లి చర్మకారదారులకు ఇచ్చే పింఛను ఇవ్వాల్సి ఉంది. అయితే పోసిబాబు ధర్మవరంలోని ఓ షాపు వద్ద ఉండడం గమనించిన యంత్రాంగం సీఎంకు చెప్పగా..ఆ దుకాణం వద్ద కారు ఆపి పోసిబాబును కారులో ఎక్కించుకొని తన పక్క సీటులో కూర్చోబెట్టుకున్నారు. అక్కడి నుంచి మలకపల్లికి 2కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకూ కుటుంబ నేపథ్యం, స్థితిగతులు, వృత్తి జీవితం తదితర విషయాలపై పోసిబాబును ఆరా తీశారు. ఒక్కసారిగా సీఎం చంద్రబాబు కారు ఎక్కడమే కాకుండా ఆయన పక్కనే కూర్చొని రెండు కిలోమీర్లు ప్రయాణించడంపై పోసిబాబు సంతోషం వ్యక్తం చేశాడు. ఎంతో ఉన్నతాధికారులకు సైతం దక్కని అవకాశం తనకు దక్కిందని, ఎంతో అదృష్టమంటూ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. పోసిబాబును తీసుకుని అతడి ఇంటికి వెళ్లి పింఛను అందజేసి యోగక్షేమాలు అడిగారు. పోసిబాబు డప్పును తీసుకొని దరువు వేశారు. దీంతో ఆ కుటుంబం మరింత మురిసిపోయింది. పోసిబాబు తయారు చేసిన చెప్పులు, టోపీని చంద్రబాబు ముచ్చటపడి కొనుగోలు చేశారు. వాటి నిమిత్తం రూ.5 వేలు పోసిబాబుకు చెల్లించారు. గ్రామంలో చర్మకార పింఛను పొందుతున్న వ్యక్తి పోసిబాబు ఒక్కడే కావడం గమనార్హం. అంతకు ముందు కొండా వెంకటేశ్వరరావు జనరల్ స్టోర్‌కి వెళ్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కష్టసుఖాలపై ఆరా తీశారు. అనంతరం గెడ్డం కృష్ణ దుర్గా ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందజేశారు. అక్కడే తల్లి ఒడిలో ఉన్న పసిపాపను దగ్గరకు తీసుకొని ముద్దాడారు. దారి పొడవునా ఉన్న ప్రజలను చూస్తూ అభివాదం చేశారు.

### మురిసిన మలకపల్లి

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలంలో మలకపల్లి ఓ చిన్న గ్రామం. వివిధ విభాగాల్లో 783 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులు ఉన్నారు. ఈ గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. అదీ ఆరు అడుగుల సందులోకారు వెళ్లడానికి కూడా కాస్త ఇబ్బందిగా ఉండే పరిస్థితుల్లో ఎస్సీ పేటలోకి సీఎం వెళ్లడం, పింఛన్లు ఇవ్వడం ఇదే మొదటి సారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. ప్రస్తుతం రబీ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా జనం ఉదయం 9గంటలకే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎక్కువగా మహిళలే ఉన్నారు. ప్రజల కోసమే తాను వచ్చానని సీఎం చెప్పగా మలకపల్లి మురిసిపోయింది.

# 1500 మందితో బందోబస్తు


సీఎం చంద్రబాబు కాన్వాయ్ వద్ద పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా సుమారు 1500 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ మళ్లింపు ఎక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 600 మంది పోలీసులను ప్రత్యక్షంగా విధుల్లో వినియోగించగా.. మిగతా వాళ్లను మఫ్టీలో నిఘా పెట్టారు. డ్రోన్, రోప్, స్పెషల్ పార్టీలను రంగంలోకి దింపారు. వాతావరణ కారణాల వల్ల పర్యటనలో ఎలాంటి మార్పులు జరిగినా దానికి అనుగుణంగా భద్రత కల్పించడానికి ప్లాన్లు ముందుగానే సిద్ధం చేశారు. బందోబస్తును తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ నిరంతరం స్వయంగా పర్యవేక్షించారు.

### ఒకే పుష్పం.. భిన్నంగా స్వాగతం

సీఎం స్థాయి వ్యక్తులు వచ్చినపుడు జిల్లా ఉన్నతాధికారులు, నేతలు విమానాశ్రయానికి వెళ్లి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలకడం పరిపాటి. కానీ ఈసారి సీఎం చంద్రబాబు వచ్చినపుడు భిన్నంగా ఒక పుష్పంతోనే మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ తదితర నేతలు మలకపల్లిలోని వేదిక వద్దకు ఒక ప్రైవేటు మినీ వ్యాన్‌లో వచ్చారు. వారి గన్‌మ్యాన్‌లను కూడా అనుమతించలేదు. సీఎం ఎస్ఎస్‌జీ భద్రతలో ఉన్నారు. దీంతో భద్రతాపరంగా పలు జాగ్రత్తలను సీఎం కార్యాలయం నుంచి సూచించినట్లు తెలుస్తోంది.

# మోటార్‌సైకిల్, ఆటోను ఢీకొన్న కారు

### ఇద్దరికి తీవ్ర గాయాలు

దెబ్బతిన్న కారు

దెబ్బతిన్న ఆటో

గొల్లప్రోలు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెళ్తుండగా మోటార్‌సైకిల్, ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడకు చెందిన వెంకటరమణ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి కేదారిశెట్టి విష్ణువర్ధన్ ఇటీవల కొత్త కారు కొనుగోలు చేశాడు. తన స్నేహితుడు మందారపు అభిషేక్‌తో కలిసి విశాఖపట్టణంలో కారు సర్వీసింగ్ చేయించేందుకు కాకినాడ నుంచి మంగళవారం బయ లుదేరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో వెళ్తుండగా అడవిపుంత నుంచి వస్తున్న మోటార్‌సైకిల్‌ను, ఆపై రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆటోను ఢీకొన్నారు. ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న చేబ్రోలుకు చెందిన ఓరుగంటి అప్పలరాజు, కర్రి చక్రంకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని తొలుత పిఠాపురం తదనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. హైవే పోలీసులు, గొల్లప్రోలు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

నల్లజర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అచ్చన్నపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపల్లి చెందిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపల్లి వెళ్తుండగా వారి బైక్ అదుపు తప్పి పడిపోయారు. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఎలక్ట్రికల్ షాపులో చోరీ

### క్యాష్ కౌంటర్‌లో రూ.70వేలతో పరారీ

షాపులో సీసీ కెమెరా దృశ్యం

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దుకాణ యజమానిని ఏమార్చి గుర్తు తెలియని వ్యక్తి క్యాష్ కౌంటర్‌లోని సొమ్మును తస్కరించి పరారయ్యాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ షాపు వద్దకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. దుకాణ యజమానిని ఎలక్ట్రికల్ సామాన్లు కావాలని అడగగా యజమానికి లోపలకు వెళ్లాడు. ఇది గమనించిన ఆగంతకుడు క్యాష్ కౌంటర్‌లోని రూ.70 వేలకు పైగా నగదును తీసుకుని పరారయ్యాడు. షాపు యజమాని, ఇతరులు వెంటపడినప్పటికి దొరకలేదు. చోరీ దృశ్యాలు షాపులోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా షాపు నిర్వాహకులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 'ఉమ్మడి తూర్పు గోదావరి'తో
# బీవీ పట్టాభిరామ్‌కు అనుబంధం

### రామచంద్రపురంలోని కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం
### కాకినాడలో డిగ్రీ విద్య పూర్తి
### ఇంద్రజాలకుడిగా ప్రదర్శనలు
### కాకినాడలో వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహణ

విద్యార్థులు, తల్లిదండ్రులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న పట్టాభిరామ్ (ఫైల్)

రామచంద్రపురం(ద్రాక్షారామ)/కార్పొరేషన్(కాకినాడ), జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు బీవీ పట్టాభిరామ్ మృతితో గోదావరి జిల్లాల్లోని ఆయన సన్నిహితులు, ఆయన శ్రేయోభిలాషుల్లో విషాదం నెలకొంది. ఆయనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. పట్టాభిరామ్ నెల్లూరు జిల్లాలో జన్మించినప్పటికీ.. ఆయన తండ్రి బీవీ సత్యనారాయణ కాజులూరు మండలం శీల గ్రామంలో జన్మించినట్టుగా సమాచారం. ఆయన వృత్తి రీత్యా వేర్వేరు ప్రదేశాల్లో ఉండాల్సి వచ్చింది. దీంతో ఆయన తండ్రి సత్యనారాయణ అప్పటి తూర్పుగోదావరి జిల్లా.. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం మండలం చెల్లూరు సర్వారాయ సుగర్స్‌లో ఇంజనీర్‌గా పనిచేసేవారు. దీంతో ఆయన కుటుంబం రామచంద్రపురంలో నివాసం ఉండేది. ఈ నేపథ్యంలో పట్టాభిరామ్ బాల్యం అంతా ఇక్కడే సాగింది. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించారు. దీంతో కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాల పూర్వవిద్యార్థిగా బీవీ పట్టాభిరామ్‌ను 2009లో రామచంద్రపురంలో పూర్వవిద్యార్థుల సంఘం సత్కరించింది. ఆయన, ప్రముఖ గేయ రచయిత దివంగత అదృష్టదీపక్ ఇద్దరూ క్లాస్‌మేట్స్. కాకినాడ పీఆర్ కాలేజీలో డిగ్రీ.. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఏ చదివారు. పట్టాభిరామ్‌కు కౌమారదశలో కాలి వైకల్యం కలిగింది. దీంతో ఆయన ఆత్మన్యూనతా భావానికి గురికాగా దాన్ని జయించి తనని తాను ఇంద్ర జాలికుడిగా, రచయితగా తీర్చిదిద్దుకున్నారు. డిగ్రీ చదవుతున్న సమయంలో ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబార్‌రావు వద్ద మంత్రజాల విద్యలో మెళకువలు నేర్చుకున్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో అనేక స్టేజీలపై ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవారు. వ్యక్తిత్వ వికాస నిపుణిడిగా పలుమార్లు కాకినాడలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

### ప్రజలను జాగృతం చేస్తూ కార్యక్రమాలు

అదృష్టదీపక్‌తో పట్టాభిరామ్

పట్టాభిరామ్ ఇంద్రజాల విద్యతో చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలన్ని జోడించి ప్రభుత్వ పథకాలు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలపై ప్రచారం కల్పించారు. వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన రెండురెళ్ల ఆరు లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. పలు పత్రికల్లో వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు. పలు పర్యాయాలు రామచంద్రపురంలో ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు.

# రాచపల్లి అరుణాచల క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యేల బృందం


కాకినాడ జిల్లా రాచపల్లిలో బసవేశ్వరుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచల క్షేత్రం జిల్లాకే ఒక మణిహారం అని ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభరాజా, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప కొనియాడారు. రాచపల్లి అడ్డరోడ్డు వద్ద రమణ సేవాశ్రమ ప్రాంగణంలో ఉన్న అపీత కుచాంబ సమేత అరుణాచల దేవస్థానాన్ని మంగళవారం ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. అరుణాచలేశ్వర స్వామి అపీత కుచాంబ అమ్మవార్లను, బసవేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 7న ఈ ఆలయంలో భక్తగ్రేసర్లు మహాశివభక్తులైన 63 నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలతోపాటు దక్షిణా మూర్తి, సూర్యభగవాన్, అయిగ్రీత, కాళభైరవ, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణాచలమాధవి, ఆలయ వ్యవస్థాపకులు స్వామిరమణానంద ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో నిర్వాహక కమిటీ ఆహ్వాన మేరకు ఎమ్మెల్యేలు ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రతిష్ఠించే నాయినార్ల విగ్రహాలను, పల్లకిలను, ఆధ్యాత్మిక వేదిక, ఇతర ఏర్పాట్లను ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది.

# 'హెలికాప్టర్లను అందుబాటులో ఉంచండి'

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

కూనవరం/వీఆర్‌పురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూనవరం 1986 నుంచి 2006 వరకు వచ్చిన వరదల్లో ప్రజలకు ఆహారం సరఫరా, అత్యవసర రోగులను భద్రాచలం తరలించేందుకు అప్పటి ప్రభుత్వాలు హెలికాప్టర్లను ఉపయోగించేవని ఇప్పుడు కూడా అవి అందుబాటులో ఉండేలా చూడాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు ప్రజలు సూచించారు. రాబోయే వరదల దృష్టిలో పెట్టుకుని అల్లూరి జిల్లా కూనవరంలో ప్రజలతో పీవో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో చిన్న లాంచీలు ఉపయోగిస్తే ప్రతి గ్రామంలోకి వెళ్లి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించవచ్చన్నారు. ఒక్క కోతలగుట్టలోనే కాకుండా ప్రతి సచివాలయంలో బఫర్ స్టాక్‌తో పాటు నిత్యావసర వస్తువులు ఉంచాలన్నారు. వరదల సమయంలో తాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆసుపత్రుల్లో అన్ని మందులు ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీవో మాట్లాడుతూ ప్రజల సూచించిన ప్రతి సమస్యను పరిష్కారిస్తామని హామీఇచ్చారు. వరదల సమయంలో తాను కోతుల గుట్టలోని కలెక్టర్ బంగ్లాలో అందుబాటులో ఉంటానని తెలిపారు. బాధితుల కోసం వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తానని ఎటువంటి సమస్య వచ్చిన ఆ గ్రూపులో తెలియచేస్తే వెంటనే సమస్యను పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్య కూనవరం మేజర్ పంచాయితీ ఈవో సురేష్ పాల్గొన్నారు. వీఆర్‌పురం మండలం రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో పీవో వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

## వెళ్తోంది యుద్ధ ట్యాంకర్
# వార్‌కు కాదు!

కొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండిపై యుద్ధ ట్యాంకర్ వెళ్లడం ఏమిటని ఆశ్చర్యపోకండి. ఈ ట్యాంకర్‌ను కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన యువకుడు పంపన నాగేంద్ర చెక్కతో తయారు చేశాడు. కాకినాడ బీచ్‌పార్క్‌లో సందర్శకుల వీక్షణ కోసం ఏర్పాటు చేసేందుకు సుమారు 20రోజులు శ్రమించి తీర్చిదిద్దాడు. మంగళవారం బీచ్‌పార్క్‌లో ఏర్పాటు చేసేందుకు వెంకట రాపురం నుంచి గోర్స పండూరు మీదుగా బీచ్‌రోడ్డుకు ఎడ్లబండిపై ట్యాంకర్‌ను తరలించారు. దీంతో ఆ దారిలో పలువురు ఆశ్చర్యంగా తిలకించారు.

## గోదావరి.. శబరి
# సంగమం.. అద్భుతం

కూనవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాసిక్‌లో పుట్టిన గోదావరి నది ఒడిశా రాష్ట్రంలోని తూర్పు కనుమల్లో సింకరం కొండల శ్రేణుల నుంచి ప్రవహించే శబరి నది అల్లూరి జిల్లా కూనవరం వద్ద సంగమంగా ఏర్పడతాయి. ఈ రెండు నదులు ఇక్కడ కలిసిన సుమారు కిలోమీటరు వరకు వేరువేరుగా ప్రయనిస్తాయి. గోదావరి నీళ్ల నీలం రంగులోను, శబరి నీళ్ల ఎరుపు రంగులోను ప్రవహిస్తాయి. 2 నదులు నిత్యం ఇలాగే ప్రవహించినా వర్షాకాలంలో మాత్రం వేరువేరుగా ప్రవహిస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తాయి.

కూనవరంలో వేరు వేరు రంగుల్లో కనిపిస్తున్న శబరి, గోదావరి నీళ్లు

ఆంధ్రజ్యోతి AJ క్లాసిఫైడ్స్

కావలెను

కాకినాడ మెయిన్ రోడ్డులో Jewelary & Textiles షోరూంలో పనిచేయుటకు సిబ్బంది కావలెను. Qly. Inter Salary 16 వేలు, డిగ్రీ 18వేలు, డేటా ఎంట్రీ సిస్టమ్ ఆపరేటింగ్‌లో అనుభవం కలవారు కావలెను. శాలరీ రూ.22,000/- మరియు కాకినాడలో ఒక ఇంట్లో వంట మరియు ఇంటిలో పనులు చేయుటకు 35 సం॥ల లోపు ఆడ వంట మనిషి కావలెను. జీతం రూ.20వేలు కాకినాడ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సెల్: 6301943220, 8008440189

AJD:

వధువు కావలెను

37 సం॥గల ఆర్థికంగా బాగా స్థిరపడిన డైవర్స్ (రెడ్డి) వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు వున్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు నో డౌరీ సెల్: 6301943220, 8008440189

AJD:

4 Lines CLASSIFIED Rs.230/- Only

# సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/కోరుకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం మలకపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసేందుకు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు మధురపూడి ఎయిర్‌పోర్టులో మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. నేరుగా మలకపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు చేరుకోవాల్సి ఉండగా వాతావరణం బాగోక పోవడంతో ప్రత్యేక విమానంలో మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కెడ్జిబిటిఐ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్. చంద్రబాబును మనస్ఫూర్తిగా పలికారు. అనంతరం చంద్రబాబు కాన్వాయ్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరుతుండగా అక్కడకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి అప్పారావును చూసి వాహనం ఆపి పలుకరించారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన చంద్రబాబు మలకపల్లి వెళ్లారు.

### చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం మలకపల్లి పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మలకపల్లిలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో వీరిద్దరు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి నియోజకవర్గ అభివృద్ధిపై చంద్రబాబుతో చర్చించారు.

# స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రతిఘటించాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గృహాలకు ప్రస్తుతం ఉన్న కరెంట్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు రంగం సిద్ధమైందని, దీన్ని ప్రజలు ప్రతిఘటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వినియోగదారులపై భారం మోపేందుకు అదానీ, శిరిడీ సాయి కంపెనీల సిబ్బంది రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని వినియోగదారుల ఇళ్లకు వెళ్లి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకోకపోతే కరెంట్ కట్ చేస్తామని బెదిరిస్తున్నట్టు తమకు సమాచారం ఉందని, ఈ విధానం మానుకోవాలని కోరుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనపుడు ఆనాడు ప్రతిపక్ష పార్టీ నేతగా నారా లోకేశ్ స్మార్ట్ మీటర్ బిగిస్తే దాన్ని బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారని, ఆయన పిలుపును స్ఫూర్తిగా తీసుకుని విద్యుత్ వినియోగదారులు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నగర కమిటీ సభ్యులు లావణ్య, చింతలపూడి సునీల్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్రాధ్యక్షుడికి ఎమ్మెల్యే నల్లమిల్లి శుభాకాంక్షలు

మాధవ్‌ను ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, శుభాకాంక్షలు చెబుతున్న కడియం నాయకులు

అనపర్తి/కడియం, జూలై 1(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పోకల వంశీ నాగేంద్ర మాధవ్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కడియం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్నిక అనంతరం బాధ్యతలు స్వీకరించిన మాధవ్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, కడియం మండలాధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీలో కుల, మతాలకు అతీతంగా పదవులు లభిస్తాయని, దీనికి నిదర్శనమే మాధవ్ ఎన్నిక అని నల్లమిల్లి అన్నారు.

### ఎస్సీ మోర్చా నాయకుల హర్షం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా సీనియర్ నేత పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషదాయకమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్‌బాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేశారని, కష్టపడిన వారికి బీజేపీలో గుర్తింపు వుంటుందన్నారు. మాధవ్ ఎన్నిక పట్ల ఎస్సీ మోర్చా నాయకులు పి.యుగంధర్, జేకేవీ, ఎంటీవీ.కుమార్, వీ.గిరిజన్ బాబు, పి.దర్గ హర్షం వ్యక్తం చేశారు.

# ఏఐఈఈఏ ప్లాటినం జూబ్లీ వేడుకలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మోరంపూడి జంక్షన్ వద్ద ఎల్ఐసీ డివిజనల్ ఆఫీస్ ఆవరణలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఈఈఏ) ప్లాటినం జూబ్లీ ఆవిష్కరణ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మాధ్యూస్ యూనియన్ పతాక ఆవిష్కరణ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎమ్.కోదండరామ్ మాట్లాడుతూ ఎల్ఐసీ జాతీయకరణలో ప్రముఖ పాత్ర పోషించిన బీమా ఉద్యోగుల సంఘం 1950లో ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకలు సంవత్సరం పాటు కొనసాగుతాయని తెలిపారు. అలాగే ఈ నెల 9న జరిగే దేశ సార్వత్రిక సమ్మెలో ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొననున్నట్టు చెప్పారు. ప్లాటినం జూబ్లీ లోగో ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ శిరీష, యూనియన్ నాయకులు ఎ.సుబ్బారావు, సత్యదేవ, పీఎస్ఎన్ రాజు, ఈశ్వరరావు, బి.శ్రీను, పట్నాయక్, శిరీష్‌కుమార్, సాయిబాబా, తాత్కాలిక ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ క్యాంపులో ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 22 నుంచి జూలై 1వ తేదీ వరకూ జరిగిన ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్ క్యాంపులో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల నుంచి మొత్తం 42 మంది ఎన్‌సీసీ కేడెట్లు ఈ క్యాంపులో పాల్గొన్నారని తెలిపారు. డ్రిల్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, సోలో సింగింగ్ వంటి అంశాల్లో ప్రథమ స్థానంలో నిలవగా, ఖోఖో గేమ్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించారని తెలిపారు. ఫైరింగ్‌లో ఎ.ప్రియ ప్రతిభ చూపించారని తెలిపారు. కళాశాలకు చెందిన మిడ్డి ప్రవీణ్‌కుమార్ దొర క్యాంపు సీనియర్ కేడెట్‌గా, ఎన్‌సీసీ అధికారి ఈసుబ్ బాషా మేజర్ ఆఫీసర్‌గా ప్రశంసాపత్రాలు పొందారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

# రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం జమ

కోరుకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం వరదల కారణంగా పంట నష్టపోయిన కోరుకొండ మండలం మునగాల గ్రామంలో రైతుల ఖాతాల్లో డబ్బు జమయిందని. ఈ మేరకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేసిన కృషికి రైతులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గత ఏడాది తమ గ్రామంలో వరదలకు 606 ఎకరాల్లో పంటకు నష్టం జరిగిందన్నారు.ఎమ్మెల్యే కృషితో మునగాలలో వరదలు, తుపాన్‌లకు పంట నష్టపోయిన 362 మంది రైతుల ఖాతాల్లో రూ.41.1 9,780 జమ అయిందన్నారు. పంట నష్టపోయిన తమకు నష్టపరిహారం రాదేమోనని ఆందోళన చెందామన్నారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడితో ఆనేక సార్లు మాట్లాడి నష్టపరిహారం ఇప్పించారని రైతులు చెప్పారు. ఈ సందర్భంగా బత్తుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

సీతానగరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వంగలపూడి గ్రామానికి చెందిన బి.వెంకట శ్రీనివాసరావు(38) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని హెడ్ కానిస్టేబుల్ వానశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఏడేళ్ల క్రితం వెంకట శ్రీనివాస్ భార్య పుట్టింటిలో ఉండడంతో మనస్తాపానికి గురై గత నెల 22న పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందినట్లు హెచ్‌సీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా శ్రీనివాస్‌కు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# ఏటీఎస్‌ను ఉపసంహరించాలి

### రవాణా రంగ కార్మికులు

### రాజమహేంద్రవరంలోని డీటీవో కార్యాలయం, రాజానగరంలోని ఏటీఎస్ కేంద్రం వద్ద నిరసనలు

జిల్లా రవాణా అధికారి కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేస్తున్న కార్మికులు

డీటీవో కార్యాలయం ఎదుట నిరసన

రాజమహేంద్రవరం అర్బన్/రాజానగరం, జులై 1 (ఆంధ్రజ్యోతి): రవాణా వ్యవస్థ మనుగడకు ముప్పుగా పరిణమించిన ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం(ఏటీఎస్)ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని జిల్లా రవాణా అధికారి కార్యాలయం ఎదుట, రాజానగరంలోని ఏటీఎస్ కేంద్రం వద్ద రవాణా రంగ కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సాంకేతిక వాహనాల సామర్థ్యాన్ని అంచనా వేయగల ప్రక్రియను నిర్వహించడానికి ఏటీఎస్ విధానం ఉపకరించకపోగా, వాహనం ఇంజన్ తదితర ముఖ్య భాగాలకు హాని జరుగుతుందన్నారు. ఏటీఎస్ ప్రక్రియ వివాదాస్పదమైన వాస్తవాన్ని ఇప్పటికే పలు విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రభుత్వం నుంచి స్పందనలేకపోవడంతో నిరసన చేపట్టినట్లు తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్టీవో కార్యాలయంలో ఏవో సత్తిబాబుకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముప్పర్తి సత్యనారాయణ, మార్గాన వసంతకుమార్, దేముడు, వెన్న సత్యనారాయణ, కుమార్, నిడదవోలు, కొవ్వూరు, మండపేట, అనపర్తి ట్యాక్సీ స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వానశెట్టి గంగాధర రావు, బాక్స్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. రాజమహేంద్రవరం నుంచి ఆటోలు, లారీలు, గూడ్స్ వాహనాలతో ర్యాలీగా రాజానగరంలోని ఏటీఎస్ కేంద్రానికి చేరుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ ఏపీలో తప్ప మరే రాష్ట్రంలోనూ ఫిటినెస్ సెంటర్ల విధానం లేదని, తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకుని, పాత విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వానశెట్టి గంగాధర్ మాట్లాడుతూ రవాణా కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ రవాణా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) నాయకులు పోలుపల్లి నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ, కొనిరెడ్డి కృష్ణ, జి.నరసింహారావుశెట్టి, లారీ యూనియన్ నాయకులు గోపాల్, రావు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలోని ఏటీఎస్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రవాణా కార్మికులు

### గోకులం షెడ్లకు నిధుల విడుదల

కోరుకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో రైతులు నిర్మించిన గోకులం షెడ్లకు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నిర్మించిన షెడ్లకు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో మంగళవారం నిధులు జమ చేసిందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

జమునా స్కూల్లో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 45వ డివిజన్‌లో నగరపాలక సంస్థ జమున స్కూల్లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవాని చారిటబుల్ ట్రస్ట్, పరమేష్ బయోటెక్ సంయుక్త ఆర్థిక సాయం రూ.5 లక్షల వ్యయంతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.అనంతరం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, వైశ్రీను, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకీరామయ్య, కంటిపూడి శ్రీను పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీ..** రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ మంగళవారం ఉదయం 6గంటల నుంచే ప్రారంభమైంది. స్థానిక 12వ డివిజన్‌లో వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే వాసు పింఛన్లు అందజేశారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. 42వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మళ్ల వెంకట్రాజుతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కిలపర్తి శ్రీనివాస్, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, అంజి, వానపల్లి శ్రీనివాస్, డి నగేంద్ర, బిశెట్టి అప్పలరాజు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

నామవరంలో దంత వైద్యుడిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రాంతీయాధికారి జెవిఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ సూర్యన్, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక హుకుంపేటలోని గోదావరి రుచులు కన్వెన్షన్ హాల్లో పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు రెహమానిఖాన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంగళ నూపరింటెండెంట్ డాక్టర్ కెనడీ, డాక్టర్ కృష్ణంరాజులను రాష్ట్ర ప్రజావైద్యుల కన్వీనర్ దేశిరెడ్డి బలరామ నాయుడు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. స్థానిక వెంకటేశ్వర నగర్ వాకర్స్ పార్కులో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వైద్యుల దినోత్సవంలో 85 సంవత్సరాల వయసులోనూ ప్రతి ఆదివారం పేదలకు ఉచిత వైద్యం చేస్తున్న పంతం అచ్యుత రామారావును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

దివాన్‌చెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం నామవరంలోని భారతీయ విద్య భవన్స్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని పవన్ ఆర్బిల్ డెంటల్ కేర్ ఆసుపత్రి డాక్టర్ వీవీ సత్యప్రసాద్ అడబాల, డాక్టర్ విక్రమ్ మాట్లాడుతూ దంతాలు, వాటి జాగ్రత్తలు, పరిశుభ్రతలను వివరించారు. విద్యార్థులందరికీ డాక్టర్ విక్రమ్, డాక్టర్ వర్షిక దంత పరీక్షలు చేశారు. అనంతరం దంతవైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో భవన్స్ విద్యాసంస్థల కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ...

విశ్వేసిన అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీవీటీ రాజు మాట్లాడుతూ బీసీ రాయ్ దేశంలో వైద్య వృత్తిలో ఎన్నో కీలక సంస్కరణలు చేశారని, ఆయనను స్మరిస్తూ జూలై 1న డాక్టర్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తాతోటి ప్రభాకరరావు, బళ్ల శ్రీనివాసరావు, వి.దివాకరానందం, పి.చిన్నిమట్ల రామ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్ర-

డాక్టర్ రామారావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

# సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల్లో భక్తుల కిటకిట

సీతానగరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆషాఢమాసం, మంగళవారం, షష్ఠి తిథి కావడంతో స్వామికి ప్రత్యేక రోజుగా భావించి భక్తులు దర్శనాలు చేసుకున్నారు. ముగ్గుళ్ల గ్రామంలోని స్వయంభూ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయార్చకుడు కొడమంచిలి విరేష్ పూజా కార్యక్రమాలు జరిపారు. అలాగే రఘుదేవపురం, సీతానగరం, మునికూడలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.

ముగ్గళ్లలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు

### కడియంలో వారాహి మాతకు పూజలు

కడియం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కడియంలోని శివాలయంలో వారాహి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలతో గ్రామంలో పూజాదికాలు జరిపారు. చిలుకూరి సందీప్ చంద్ర, చిరుకురి ప్రభాకర్ వారాహి అమ్మవారి దీక్షను ఆచరిస్తున్నారు. వారాహి మాత నవరాత్రులను నిర్వహిస్తున్నామని, ఆదివసంబట్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఐదో రోజు పూజల్లో నాయకులు వెలుగుబంటి రఘురాం, చిలుకూరి సుబ్బరాజు, తోరాటి శ్రీనివాస్, చిలుకూరి నాగేశ్వరరావు, ఆకుల శ్రీధర్, బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

నిడదవోలు, జూలై 1(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 9న జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రేఖా భాస్కరరావు పిలుపునిచ్చారు. దీనిపై మంగళవారం నిడదవోలులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 20న జరగాల్సిన ఈ సమ్మె దేశంలో ఏర్పడిన యుద్ధ వాతావరణం వల్ల వాయిదా పడిందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మామిడూరి నాగేంద్ర వరప్రసాద్, ఎ.నరసింహారావు, గన్నా బత్తుల సత్యనారాయణ, పెంటపాటి వెంకటేశ్వరావు, బుద్ధ గోపాలకృష్ణ, బొడిశెట్టి లోవరాజు పాల్గొన్నారు.

## 'ప్రతి వ్యక్తికి భగవాన్ నామస్మరణ ఎంతో అవసరం'

దేవరపల్లి, జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రతి అణువులో దైవం నిక్షిప్తమై ఉంటుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సౌందర్యనిర్మల, శివా నందహరి పారాయణ గురువు నిర్మల మాతాజీ పేర్కొన్నారు. స్థానిక ఆదిశంకరాచార్య జ్ఞాన మందిరంలో మంగళవారం సౌందర్య లహరి, శివానందలహరి పారాయణం చేసే శిష్య బృందానికి ప్రతి శ్లోకంలోని అర్థాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఉన్న దైవత్వాన్ని వెలికి తీయడానికి భగవాన్ నామస్మరణ అవసరమన్నారు. కార్యక్రమంలో చలంచర్ల హరినాథ్, తోట సత్యనారాయణ, నాలమ్మ లక్ష్మీ శ్వరరావు, కటుకూరి సత్యవాణి, జయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బత్తిన ట్రస్ట్ సేవలు అభినందనీయం

దివాన్‌చెరువు, జూలై1 (ఆంధ్రజ్యోతి): పేదలకు బత్తిన ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని శ్రీకృష్ణపట్నం సర్పంచ్, జనసేన నాయకుడు కిమిడి శ్రీరామ్మూర్తి అన్నారు. శ్రీబత్తిన తిలపన్న, శ్రీరామచంద్రమాణిక్యం ట్రస్ట్ చైర్మన్ బత్తిన స్వామి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం శ్రీకృష్ణపట్నంలో జరిగిన కార్యక్రమంలో పేదలకు, దైవసేవకులకు పింఛన్లు, నూతన వస్త్రాలను స్వామి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొర్రా సుధాకిరణ్, బత్తిన ప్రవీణ్‌కుమార్, ఐ.జాన్సన్, సాల్మన్‌రాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

### పేదలకు దుస్తుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలలో పేదలకు నూతన వస్త్రాలు పంచి అన్నదానాలు చేశారు. సూజా సేవ కుడు, అల్ సమీర్గాడ్ ఆఫ్ కంపెనీస్ అధినేత, టీడీపీ నాయకుడు అబ్బుల్లా పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక గౌతమి జీవకారుణ్య సంఘంలో వృద్ధులకు, ప్రభుత్వాసుపత్రి వద్ద రోగుల బంధువులకు అబ్బుల్లా కుటుంబ సభ్యులు అన్నదానం చేసి వస్త్రాలు పంచారు. కార్యక్రమంలో ఫజల్, సుహాల్, కరీమ్, సాద్, తయాబ్, ఇర్ఫాన్, షకీల్, దనీష్, సనాల్, ఎస్కే బషీర్ పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడియం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జేగురుపాడు సబ్‌స్టేషన్ (పొట్టిలంక) నుంచి వచ్చే జెగురుపాడు ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం మండలంలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎన్.సామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జేగురుపాడు, చైతన్యనగర్ ఇండస్ట్రియల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

### నేడు తొస్సిపూడిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

బిక్కవోలు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొస్సిపూడి గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా ఈ కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గ్రామస్తులకు వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

### వర్తకుల క్షేమమే ముఖ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): వర్తకుల వ్యాపార క్షేమమే తమకు ముఖ్యమని గన్నీబ్ సీలేజ్ సంస్థ సౌత్ రీజనల్ మేనేజర్ దుప్పల సుధీర్ అన్నారు. రాజమహేంద్రవరం గుండువారి వీధిలో నువ్వుల వర్తక సంఘం భవనంలో మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దొంగల బారి నుంచి తమ సంపదను ఏవిధంగా భద్రపరుచుకోవాలో డిజిటల్ ప్రజెంటేషన్ చేశారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, అడపా శ్రీహరి, గంటా ప్రకాష్, కూర్మదాసు ప్రభాకర్, దొండపాటి జయసింహా, బొడ్డు రామారావు, వెత్స బాబ్జి పాల్గొన్నారు.

### రైతుల సీఎంఆర్ బకాయిలు చెల్లించాలి

బిక్కవోలు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులకు చెల్లించవలసిన సీఎంఆర్ బకాయిలు తక్షణం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి సీఎంఆర్ బకాయితో పాటు గత ఏడాది, ప్రస్తుతం కలిపి అన్నదాత సుఖీభవ పథకంలో ఒక్కో రైతుకు రూ.40 వేలు ఆర్థిక సాయం ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

### చంద్రబాబును కలిసిన నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును రాజమహేంద్రవరం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, యిన్నమూరి దీపు తదితరులు చంద్రబాబును కలిశారు.

### సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

| | |
|---|---|
| శ్యామల | : మార్గన్ |
| సూర్యమినీ | : ఎఫ్-1 ది మూవీ |
| సూర్యప్యాలెస్ | : కన్నప్ప |
| స్వామి | : కుబేర |
| శివజ్యోతి | : కుబేర |
| అనుశ్రీ(సాయికృష్ణ) | : కన్నప్ప |
| రాజా | : కన్నప్ప |
| ఊర్వశి | : 8 వసంతాలు |
| రంభ | : మా |
| మేనక | : చంద్రేశ్వర, హనుమాన్ జంక్షన్ |
| అప్సర | : కన్నప్ప |
| కుమారి | : ---- |
| అశోక | : కన్నప్ప |
| వీఎస్ మహల్(నామవరం) | : కన్నప్ప |
| మురళీకృష్ణ(ద్వారపూడి/శ్వరం) | : కన్నప్ప |
| వెంకటసూర్య(కడియం) | : కన్నప్ప |
| సత్యగౌరి (అనపర్తి) | : కుబేర |
| సూర్యశ్రీ (అనపర్తి) | : కన్నప్ప |
| ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం) | : కన్నప్ప |
| రామకృష్ణ(కోరుకొండ) | : ఏస్ |
| గీతాసినిమాస్ (సీతానగరం) | : కన్నప్ప |
| శ్రీనివాస (గోకవరం) | : కన్నప్ప |
| టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం) | : కుబేర |
| లలితామహల్(రంపచోడవరం) | : కన్నప్ప |
| నవయుగ(చింతూరు) | : కన్నప్ప |



మీకు నేనున్నా.. : పింఛనుదారుడు పోసిబాబు భుజంపై చేయి వేసి నడచివెళుతున్న సీఎం

పంట పండింది : పంట నష్టపరిహారం చెక్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

బాగా చదువుకోండి : పీ4లో దత్తత ఇస్తున్న అమ్మాయిలతో సీఎం

సీఎంకు కలెక్టర్ ప్రశాంతి జ్ఞాపిక

# జనంతో..సీఎం!

మీ పాలన భేష్ : చంద్రబాబుతో రూ.లక్ష విరాళం ఇచ్చిన వృద్ధురాలు

సూపర్ సార్ : బాబుకు జ్ఞాపిక ఇస్తున్న మార్గదర్శి కాశీ విశ్వనాథరాజు



మా అబ్బాయిని చూడండి సార్ : బాబుకు విన్నవిస్తున్న దివ్యాంగుడి తండ్రి

## రెండున్నర గంటలు ఆలస్యంగా భోజనం

రాజమహేంద్రవరం : చంద్రబాబు సాధారణంగా మధ్యాహ్నం 1-2 గంటల మధ్య భోజనం ముగిస్తారు. ఆయన కారవాన్‌లోనే భోజనానికి ఓ 15 నిమిషాలు సమయం తీసుకుంటారు. మలకపల్లి సభకు ఆయన 11 గంటలకు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించక 2 గంటలకు చేరుకున్నారు. అప్పటికే కారవాన్‌లో భోజనాన్ని సిద్ధం చేశారు. కానీ ప్రజలు వేచి చూస్తున్నారంటూ ఆయన నేరుగా సభా వేదిక పైకి చేరుకున్నారు. సభ ముగిసేసరికి సుమారు సాయంత్రం 4 గంటలు దాటింది. సభ ముగిసిన తర్వాత ప్రజల వినతులు, ఫొటోల అనంతరం ఆయన కార్యకర్తల సమావేశ ప్రాంగణానికి 4.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పుడు కారవాన్‌లో భోజనం ముగించుకొని 5 గంటలకు సమావేశానికి వెళ్లారు.

## దేవుడింతే ఇచ్చాడు.. ఇది మా ఖర్మ.. అనే ఆలోచన మానేయాలి!

సీఎం చంద్రబాబునాయుడు కొవ్వూరు నియోజకవర్గ పర్యటన ఆసక్తికరంగా సాగింది. గతంకంటే భిన్నంగా ఆయన మాటల్లో మార్పు కనిపించింది. పేదల సేవలో..అనే కార్యక్రమానికి వచ్చిన ఆయన నిజంగా పేదలతో మమేకమయ్యారు. పేదలు ఆత్మ గౌరవంతో, విశ్వాసంతో ఆలోచనలు పెంచుకోవాలని , దేవుడింతే ఇచ్చాడు.ఇది మాఖర్మ, నిత్యం కష్టపడడమే మా బతుకు అనే ఆలోచనలు చేయడం మానేయమని పిలుపునిచ్చారు. అంతేకాదు చర్మకార పింఛను దారుడైన పోసిబాబును కొవ్వూరు మండలం ధర్మవరంలో కారులో ఎక్కించుకుని తాళ్లపూడి మండలం మలకపల్లి వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. కారులో పక్కనే కూర్చొపెట్టుకుని వృత్తి, జీవన స్థితిగతులపై ఆరాతీశారు. ఆయన ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చారు. పోసిబాబు మాదిగ డప్పు తీసుకుని ఎలా కొట్టాలో అడిగి కాసేపు డబ్బు వాయించారు. అతని భుజంపై చేయి వేసి వీధిలో నడిచి వెళ్లారు. మరో పింఛన్‌దారుడి బిడ్డను ఎత్తుకుని ఆడించారు. సభానంతరం అనేక మంది సమస్యలు విని అందరికీ అండగా ఉంటానని చెప్పడంతో ప్రజలంతా ఆనందపడ్డారు.

- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

## పేదల సేవలో చంద్రబాబు

- మలకపల్లిలో జనంతో మమేకం
- పీ4లో ఇద్దరు అమ్మాయిల దత్తత
- కొవ్వూరుకు వరాల జల్లు
- సీఎంను చూసేందుకు జనం క్యూ

రాజమహేంద్రవరం/కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గేర్ మార్చారు.. జనంలోనే ఉంటున్నారు.. జనం బాధలు వింటున్నారు..అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.. మీకు నేనున్నానంటూ పేదలకు భరోసాగా నిలుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో మంగళవారం మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేర జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాళ్లపూడి గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు ఉదయం 9 గంటలకే సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. సీఎం చంద్రబాబు మలకపల్లి ప్రజల కోసమే తాను వచ్చానని చెప్పడంతో మలకపల్లి మరింత మురిసిపోయింది. ముందుగా చర్మకారుడు పోసిబాబు ఇంటికి నేరుగా వెళ్లి రూ.4 వేలు పింఛన్ అందజేశారు.అతను తయారుచేసే చెప్పులు, టోపీలు చూశారు. ఒక టోపీ, ఒక చెప్పుల జత తీసుకుని రూ.5 వేలు ఇచ్చారు. గ్రామంలో మరో మహిళలకు పింఛన్ అందజేశారు. అక్కడే ఒక చిన్నపిల్లను ఎత్తుకుని ముద్దాడారు. తల్లితో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమమే పీ4.. సమాజం మీకు ఎంతో ఇచ్చింది. అందులో కొంత తిరిగివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ4) ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తానన్నారు. సమాజంలో 10 శాతం ఉన్నతమైన, ఆదర్శవంతమైన కుటుంబాల నుంచి సమాజంలో దిగువన ఉన్న 20 శాతం మంది ప్రజలను దత్తత తీసుకునే బృహత్తర కార్యక్రమం పీ4 అని చెప్పారు. సంపన్నులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని మూడు దశల్లో ఆ కుటుంబానికి అండగా నిలబడి ఉన్నతికి తవం వంతు గా బాధ్యత తీసుకోవాలన్నారు. 2029 నాటికి పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దేశంలో ఏపీలోనే ఎక్కువ మొత్తంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రగతి తదితర అం శాలను వివరించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు ప్రథమస్థానం ఇవ్వడం జరిగిందన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని గతంలో 150 పడకల ఈ ఆస్పత్రిని అభివృద్ధి కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను శుద్ధిచేసి తాగునీరుగా అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విన్నవించారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారు. అడినవన్నీ ఇచ్చారు.. వెంటనే వరాల జల్లు కురిపించారు.

## పోలీసుల ఓవరాక్షన్..

కొవ్వూరు : సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసులు అతిచేశారు. ఎవరినీ సీఎం చంద్రబాబు చెంతకు వెళ్లనీయకుండా సుమారు కిలోమీటర్ దూరంలోనే బందోబస్తు నిర్వహించారు. మల్లకపల్లిలో 2 వేల మందికి సరిపడా వేదికను సిద్ధం చేయగా అంత మందినీ తనిఖీ చేసి లోపలకు అనుమతించారు.. చంద్రబాబు కాన్వాయ్ వస్తుంటే జనాన్ని పక్కకు తోసేశారు.. దీంతో సభకు వచ్చిన జనం అసహనం వ్యక్తంచేశారు. పార్టీ కార్యకర్తల సమావేశం వద్దా ఇదే పరిస్థితి కనిపించింది. ఎంపిక చేసిన వారిని మాత్రమే లోపలకు అనుమతించారు. దీనిపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

చంద్రబాబే మా విక్టరీ : మలకపల్లిలో మహిళల అభివాదం

బాబును చూద్దామని : గుంపులుగా నడచి వెళుతున్న మహిళలు

సాయం చేస్తారని..

ఎదురుచూపులు : కాపవరంలో చంద్రబాబు రాకకు చూస్తున్న నాయకులు

అంతా ఓకేనా..

మంత్రి నిమ్మలతో శేషారావు, సుబ్బరాయచౌదరి, కుడుపూడి సత్తిబాబు తదితరుల మాటామంతీ

# మీ పాలన బాగుంది సార్..

## సీఎం చంద్రబాబుతో చర్మకారుడు పోసిబాబు

సీఎం నారా చంద్రబాబునాయుడు తన కారులో తన పక్క సీటులో ఓ సామాన్య చర్మకారుడిని కూర్చోపెట్టుకుని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరం నుంచి తాళ్లపూడి మండలం మలకపల్లిలోని అతడి ఇంటివరకూ వెళ్లారు. 2 కిలోమీటర్ల మేర పయనించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ ఆసక్తికరంగా ఉండడం గమనార్హం. ముఖ్యమంత్రి చంద్రబాబు మలకపల్లిలో స్వయంగా పింఛను పంపిణీ చేయడానికి, పీ4 కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ప్రజావేదిక మీద ప్రసంగించడానికి మంగళవారం వచ్చిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కారులో వస్తూ కొవ్వూరు మండలం ధర్మవరంలో ఓ కిరాణా కొట్టువద్ద ఆగారు. సరుకులు కొంటున్న వ్యక్తి వద్దకు వెళ్లి నీపేరేంటి? ఏంచేస్తున్నావ్ అని అడిగారు.?

- **చర్మకారుడు :** నా పేరు సనమండ్ర పోసిబాబు అండి. చర్మకారుడిని. చెప్పులు కుట్టుకుని కుటుంబానికి పోషించుకుంటున్నా. సామాను కొనుక్కోవడానికి వచ్చా.
- **సీఎం :** మీకు పింఛన్ ఇస్తున్నాం కదా?
- **పోసిబాబు :** అవును అయ్యగారు.. మీరే అప్పట్లో రూ.వెయ్యిచ్చారు.ఇవాళ రూ.4 వేలు ఇస్తున్నారు.ఆనందంగా ఉందండి.
- **సీఎం :** వయసు..ఆరోగ్యం ఎలా ఉంది..?
- **పోసిబాబు :** నా వయసు 55 అండి. కాళ్ల నొప్పులు ఇబ్బంది పెడుతున్నాయి సారు.కిడ్నీలో చిన్న ఫాల్ట్ కూడా ఉంది.
- **సీఎం :** పాలన ఎలా ఉంది..?
- **పోసిబాబు :** మీరు బాగా చేస్తున్నారు. వైఎస్ఆర్ వల్ల చాలా ఇబ్బందులు పడ్డాం. నాకు మీరు గతంలో ఇల్లు ఇచ్చారు. మీరు మారాక మధ్యలో ఆగింది. వైసీపీలో సాయం చేయలేదు. అది అలానే ఉండిపోయింది.
- **సీఎం :** చదువుకోవాలనిపించలేదా?
- **పోసిబాబు :** నేను ఇంటికి పెద్దకొడుకునండి, మూడో తరగతి చదివించి..రోజుకు రూ.3లకోసం గేదెలు మకాం పెట్టించారు.
- **సీఎం :** నేను ఒకటో తేదీన పేదల సేవలో.. ప్రజలకు అండగా ఉండాలని చెబుతున్నా..నీ అభిప్రాయం?
- **పోసిబాబు : మనల్ని** చంద్రబాబు నాయుడుగారు బాగా చూస్తున్నారు అనే ఆలోచన ప్రజల మనసులో కలిగింది. వైఎస్ ఆర్‌కు వేసినా ఏమీ లేదని ఇవాళ ప్రజలు తెలుసుకున్నారండి.
- **సీఎం :** ధనవంతులు పేదలకు దత్తత తీసుకుని సాయం చేస్తే ఎలా ఉంటుంది.?
- **పోసిబాబు :** చాలా బాగుంటుంది. అభివృద్ధి చెందుతారు.
- **సీఎం :** నేనింకా బాగా చేయాలని ఆలోచిస్తున్నా.అందరినీ పైకి తీసుకురావాలన్నదే నా లక్ష్యం..

- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చర్మకారుడు పోసిబాబు కుటుంబానికి పింఛన్ మంజూరు పత్రం అందజేస్తున్న సీఎం

### వ్యాపారం ఎలా ఉంది..

ధర్మంలో కిరాణా కొట్టు యజమానితో చంద్రబాబు సంభాషించారు. రోజుకు ఎంత వ్యాపారం చేస్తావని అడగ్గా.. నాలుగు-ఐదు వేలు చేస్తానని యజమాని చెప్పారు. సరుకు ఎక్కడి నుంచి తెస్తావంటే.. రాజమండ్రి నుంచి తెస్తానని చెప్పగా ఏపే రకాలు ఉం టాయని ఆరా తీశారు.బిల్లు చేసే విధానంతో అమ్మితే సులభంగా ఉంటుందని సలహా ఇచ్చారు. తర్వాత కొట్టు యజమాని కుటుం బీకులతో కలసి ఫోటో,సెల్ఫీ తీసు కున్నారు. ఇపుడు బెదిరింపులేమీ లేవు కదా, వ్యాపారం బాగా చేసుకోండని చెప్పి వచ్చేశారు.


పార్టీని ఇబ్బందుల్లో పెడితే సహించను

కార్యకర్తలతో సీఎం భేటీ 8



శ్రద్ధాంజలి

మాకు అత్యంత ఆత్మీయులు, మా శ్రేయోభిలాషి శ్రీ కోనేరు మురళి గారి కుమారుడు కీ॥శే॥ కోనేరు సుష్మంత్ వెంకట్ గారి అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాము... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము...

కీ॥శే॥ స్వర్గీయ శ్రీ కోనేరు సుష్మంత్ వెంకట్

జననం : 17-02-1999 మరణం: 30-06-2025

భూతి మధు సూధనరావు
కంటిపూడి అప్పారావు చౌదరి
రాజమండ్రి

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : ఏఐటీయూసీ

నిడదవోలులో మాట్లాడుతున్న సీఐటీయూ నేత రేఖా భాస్కరరావు

నిడదవోలు, జూలై1 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల తొమ్మిదో తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రేఖా భాస్కరరావు పిలుపునిచ్చారు. దీనిపై మంగళవారం నిడదవోలు పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 20వ తేదీన జరగాల్సిన ఈ సమ్మె దేశంలో ఏర్పడిన యుద్ధవాతావరణం వల్ల వాయిదా పడిందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ఏరియా నాయకులు మాముడూరి నాగేంద్ర వరప్రసాద్, ఎ.నరసింహారావు, గన్నా బత్తుల సత్యనారాయణ, పెంటపాటి వెంకట్రావు, బద్ది సూరిబాబు, చోడిశెట్టి లోవరాజు పాల్గొన్నారు.

## 'ప్రతి వ్యక్తికి భగవాన్ నామస్మరణ ఎంతో అవసరం'

దేవరపల్లిలో సౌందర్యలహరి పారాయణ చేస్తున్న నిర్మల మాతాజీ

దేవరపల్లి, జూలై1 (ఆంధ్రజ్యోతి): ప్రతి అణువులో దైవం నిక్షిప్తమై ఉంటుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సౌందర్యలహరి, శివా నందలహరి పారాయణగురువు నిర్మల మాతాజీ పేర్కొన్నారు. దేవరపల్లిలోని ఆది శంకరాచార్య జ్ఞానమందిరంలో మంగళవారం సౌందర్య లహరి, శివా నందలహరి పారాయణం చేసే శిష్య బృందానికి ప్రతి శ్లోకంలోని అర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్మలమాతాజా మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఉన్న దైవత్వాన్ని వెలికితీయడానికి భగవాన్ నామస్మరణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆదిశంకరాచార్యులు ధ్యానమందిరం కమిటీ సభ్యులు చలంచర్ల హరినాథ్, తోట సత్యనారాయణ, నారాయణ విశ్వేశ్వరరావు, కరుటూరి సత్యవాణి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్‌ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన
## దోషులను కఠినంగా శిక్షించాలి

వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద వైసీపీ నాయకులు

తాళ్లపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని సూరయ్యపేట కాలనీ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సూరయ్యపేట కాలనీ వద్ద మంగళవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు మాట్లాడుతూ దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## పాముకాటుతో వ్యక్తి మృతి

చాగల్లు, జులై 1 (ఆంధ్రజ్యోతి): నందిగంపాడుకు చెందిన ఆత్కూరి పెద్ద సత్యనారాయణ (51) పాముకాటుతో మంగళవారం మృతిచెందాడు. పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## యథావిధిగా ఇసుక రవాణా

తాళ్లపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఇసుక రీచ్‌లు మూసివేయాలని అధికారులు ఆదేశించినప్పటికీ రవాణా మాత్రం మంగళవారం యథావిధిగా సాగినట్టు ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు ఆరోపించారు. అధికారుల ఆదేశాలు లెక్కచేయకుండా తాడిపూడి ఇసుక ర్యాంపు నుంచి రవాణా జరుగుతుందని ఈ విషయాన్ని అధికారులు పరిశీలించాల్సిందిగా ఆయన కోరారు.

## పథకాలను ప్రజలకు తెలియజేయాలి

ఉండ్రాజవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలని మాజీఎమ్మెల్యే శేషారావు పేర్కొన్నారు. మంగళవారం వేలివెన్నులో జరిగిన నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కోరారు.

# సీఎంకు ఘన స్వాగతం

చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

రాజమండ్రి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్

సీఎంకు పుష్పాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

కొవ్వూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడికి టీడీపీ నాయకులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. అనంతరం తాళ్లపూడి మం డలం మలకపల్లి వెళ్లి పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా కాపవరం జంక్షన్‌లోని ఏఎంసీ గోడౌన్ల వద్ద ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త పెందుర్తి వెంకటేష్, మద్దిపట్ల శివరామ కృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేష్, కొఠారు వెంకట్రావు, మద్దిపట్ల సురేష్, గొరిజాల సురేష్, చావా శ్రీనివాసరావు, మూడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**నిడదవోలు:** సీఎం చంద్రబాబుకు మంగళవారం రాజమండ్రిలోని మధురపూడి విమానాశ్రయంలో మంత్రి కందుల దుర్గేష్ ఘన స్వాగతం పలికారు. కొవ్వూరు నియోజకవర్గం మలకపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా విచ్చేశారు.

**గోపాలపురం:** సీఎం చంద్రబాబే తనకి స్ఫూర్తి అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మలకపల్లికి విచ్చేసిన సీఎంను రాజమహేంద్రవరం విమానాశ్రయంలో మంగళవారం కలిసి సాదరంగా స్వాగతం పలికారు.

## హైదరాబాద్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ఒకరి మృతి

జయలక్ష్మీప్రసన్న (ఫైల్)

చాగల్లు, జులై 1 (ఆంధ్రజ్యోతి): చాగల్లుకు చెందిన పోలిశెట్టి జయలక్ష్మీప్రసన్న (22) హైదరాబాద్‌లోని సిగాచి కెమికల్స్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందింది. ఈమె బీఫార్మసీ పూర్తి చేసి ఫ్యాక్టరీలో కెమిస్టుగా పనిచేస్తోంది. అయితే ఉద్యోగంలో చేరి రెండునెలలు గడవకుండానే మృతిచెందడంపై తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. ఆమె తండ్రి పోలిశెట్టి శ్రీనివాసరావు తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి రామలక్ష్మి ఆశ కార్యకర్తగా పనిచేస్తోంది. మృతురాలు పెద్దమ్మాయి కాగా, చిన్నమ్మాయి ప్రభుకుమారి బీటెక్ మూడోసం వత్సరం చదువుతోంది. సంఘటనా స్థలానికి తల్లిదండ్రులు చేరుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఇద్దరికి గాయాలు

నల్లజర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అచ్చన్నపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపల్లి చెందిన ఇద్దరి వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. అనంతపల్లి వెళుతుండగా వీరి బైక్ అదుపు తప్పిపడిపోయారు. వైద్యం నిమిత్తం 108 వాహనంలో నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సీఎం సభలో మలకపల్లి సర్పంచ్‌కు దక్కని గౌరవం

మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి

తాళ్లపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లిలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసి ప్రజా వేదిక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపాక రాజేశ్వరికి గౌరవం దక్కలేదు. అంతేకాకుండా ఆమె పేరు ప్రోగ్రా మ్ లిస్టులో లేదని అధికారులు వెనక్కి పంపించేశారు. దీంతో కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌కు స్థానం కల్పించకపోవటంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

నిడదవోలులో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

నిడదవోలు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర సమాజస్థాపనకు వైద్యుల కృషి ఎంతో అవసరమని ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎన్.శ్రీరామ్మూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని సిరి ఐసీయూ ఎమర్జెన్సీ హాస్పటల్స్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితమే ధ్యేయంగా వైద్యులు సేవలు అందిస్తున్నారని, ప్రతి కుటుంబానికి వైద్యునికి మధ్య ఫ్యామిలీ డాక్టర్ విధానంలో సత్సంబంధాలు ఉండాలన్నారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దార్థ కన్నాజీ, డాక్టర్ శిరీష తోట, డాక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**నల్లజర్ల:** మండలంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నల్లజర్లలో సీనియర్ వైద్యుడు వెంకటపతి దంపతులను, ప్రభుత్వ వైద్యుడు గంగాధర్‌ను పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు బొడిగడ్ల సీతారాములు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనం జయరావు, జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

**దేవరపల్లి:** ఎందరో ప్రాణాలను కాపాడే వైద్యుడే ప్రత్యక్ష దైవమని మండల లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పెందుర్తి రామరహిత పేర్కొన్నారు. అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా

నల్లజర్లలో...

దేవరపల్లిలో ...

దేవరపల్లి సుమంత్ మల్టీస్పెషాలిటీ డాక్టర్ సుమంత్‌ను మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్, డాక్టర్ మంగప్రసాద్, ప్రశాంత్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు మల్లెల వెంకటేశ్వరరావు, రాము, గడా రామనరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పీఎంపీల ఆధ్వర్యంలోనూ డాక్టర్ సుమంత్‌ను సన్మానించారు. మండల పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి పీఎల్ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకట్రావు, సభ్యులు కే.రాము, ఎన్.శ్రీనివాస్, జాన్, సీహెచ్ కామరాజు, కే.నాగరాజు, డాక్టర్ సుమంత్‌ను సన్మానించారు.

## ఏటీఎస్‌ను ఉపసంహరించాలి

● డీటీవో కార్యాలయం ఎదుట నిరసన

జిల్లా రవాణా అధికారి కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం అర్బన్ / రాజానగరం, జులై1 (ఆంధ్రజ్యోతి): రవాణా వ్యవస్థ మనుగడకు ముప్పుగా పరిణమించిన ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం(ఏటీఎస్)ను రాష్ట్రప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలోని జిల్లా రవాణా అధికారి కార్యాలయం ఎదుట, రాజానగరంలోని ఏటీఎస్ కేంద్రం వద్ద రవాణా రంగ కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సాంకేతిక వాహనాల సామర్థ్యాన్ని అంచనా వేయగల ప్రక్రియను నిర్వహించడానికి ఏటీఎస్ విధానం ఉపకరించకపోగా, వాహనం ఇంజన్ తదితర ముఖ్య భాగాలకు హాని జరుగుతుందన్నారు. ఏటీఎస్ ప్రక్రియ విఫలమైందన్న వాస్తవాన్ని ఇప్పటికే పలు విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రభుత్వం నుంచి స్పందనలేకపోవడంతో నిరసన చేపట్టినట్టు తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్టీవో కార్యాలయంలో ఏవో సత్తిబాబుకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముచ్చకర్ల సత్యనారాయణ, మార్గాన వసంతకుమార్, దేముడు, వెన్న సత్యనారాయణ, కుమార్, నిడదవోలు, కొవ్వూరు, మండపేట, అనపర్తి ట్యాక్సీ స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు,నేతలు పాల్గొన్నారు. టీఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. రాజమహేంద్రవరం నుంచి ఆటోలు, లారీలు, గూడ్స్ వాహనాలతో ర్యాలీగా రాజాన గరంలోని ఏటీఎస్ కేంద్రానికి చేరుకుని నినాదాలు చేశారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఏపీలో తప్ప మరే రాష్ట్రంలోనూ ఫిట్‌నెస్ సెంటర్ల విధానం లేదని, తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకుని, పాత విధానానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్ మాట్లాడుతూ రవాణా కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరు కోబోమన్నారు. బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ రవాణా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) నాయకులు పోలుపల్లి నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ, కాకినాడ కృష్ణ, జి.నరసింహారావుతోపాటు లారీ యూనియన్ నేత గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యారావుపాలెంకి 'కెనరా' ఆర్థిక సాయం

చెక్కును అందజేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

ఉండ్రాజవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సూర్యారావుపాలెం గ్రామాభివృద్ధికి కెనరాబ్యాంకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేసింది. బ్యాంకు స్థాపించి 120 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దత్తత గ్రామమైన సూర్యారావుపాలెంకు ఈ సాయాన్ని అందజేశారు. కెనరా బ్యాంకు భీమవరం రీజియన్ డీజీఎం ఎం. మాధవరావు, ఏజీఎం బీ. పవన్‌కుమార్, తాడేపల్లిగూడెం బ్రాంచిమేనేజర్ డి. రాజేంద్రప్రసాద్, గ్రామపెద్దలు ఆర్.ధనం, కోటిపల్లి వెంకటేశ్వరావు, కోడూరు లక్ష్మణరావు, మెండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ జాతి రుణపడి ఉంటుంది

● జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు

కొవ్వూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు సీఎం చంద్రబాబు చేసిన మేలు మరువరానిదని, ఆయనకు మాదిగ జాతి ఆజన్మాంతం రుణపడి ఉంటుందని జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు పేర్కొన్నారు. మలకపల్లి ప్రజావేదికలో సీఎంను ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకొని మాదిగ డప్పును బహూకరించారు. మాకు శాశ్వత న్యాయం చేసిన మిమ్మల్ని మా జాతి ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని, ఉమ్మడి ఏపీలో చంద్రబాబుతో కలిసి బాబ్లీ ప్రాజెక్టు ఆందోళనలో పాల్గొన్నప్పుడు మహారాష్ట్ర పోలీసులు నిర్బంధించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# పొగడ్తలు వినడానికి రాలేదు... పార్టీని బాగుచేయడానికి వచ్చా

● కొవ్వూరులో కొత్తరోజులకు శ్రీకారం చుట్టండి ● బహునాయకత్వాన్ని ఒప్పుకోను ● టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం

సమావేశానికి హాజరైన కార్యకర్తలు.. మాట్లాడుతున్న సీఎం

కొవ్వూరు, జూలై 1(ఆంధ్ర జ్యోతి): 'కష్టపడిన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోను. కార్యకర్తలు నేను చెప్పినట్టే చేయండి. మీ పొగడ్తలు వినడానికి రాలేదు. పార్టీని బాగుచేయడానికి వచ్చాను. పార్టీల్లో ఇబ్బందులు సృష్టించే వాళ్లను దూరం పెడతా, కొవ్వూరులో పాత రోజులు మరిపోండి. కొత్త రోజులకు శ్రీకారం చుట్టండి. సింగిల్ వాయిస్ ఉండాలి. ఎమ్మెల్యే, ద్వి సభ్య కమిటీ ఒకేమాటగా ఒకే తాటిపై నడవాలి. కొవ్వూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడ తా. గీత దాటితే ఉపేక్షించేది లేదు. ఇక్కడ ఏం జరుగుతుందో అంతా నాకు తెలుసు. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వివరాలను సేకరిస్తూనే ఉన్నాం' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలోని ఏఎంసీ గొడౌన్ల వద్ద మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ 'పార్టీలో లీడర్‌షిప్ చూసి ఓట్లు వేస్తారు. నాయకుడు చేసే ప్రతి పనిని, సంక్షేమాన్ని ఇంటింటికి తెలియజేయాలి. ఓటు బ్యాంకు పెంచాలి. టీడీపీకి బలం బీసీ వర్గాలు. 144 కులాలు ఉన్నాయి, చిన్న కులాలకు మైక్రో లెవిల్ గుర్తింపు ఇవ్వాలి. నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోషల్ మీడియా విషయంలో 225 ర్యాంకు. ఫేస్‌బుక్‌లో 2,432 పోస్టులు పెట్టారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడి పోస్టులతో ఇది సమానం. యూట్యూబ్ చానల్ లేనేలేదు. ఇంకా సోషల్ మీడియాలో స్పీడప్ కావాలి. కులాల వారీగా నాయకత్వం చెక్ చేసుకోండి' అని చంద్రబాబు చెప్పారు. డమ్మీ లీడర్లను పెట్టుకుంటే పార్టీ డమ్మీ అయిపోతుందన్నారు. వాయిస్ ఉండే నాయకులను పెట్టుకోవాలన్నారు. పబ్లిక్ ఒపీనియన్ సేకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో బహునాయకత్వాన్ని ఒప్పుకునేది లేదన్నారు. అచ్చిబాబు ఉన్నారు. ద్విసభ్య కమిటీ ఉంది. బయట నియోజకవర్గాల్లో నాయకులు ఎక్కడా ఇంటర్ఫియర్ అవ్వడానికి వీల్లేదన్నారు. అలా చేస్తే వారిని కట్ చేస్తానన్నారు. ఎమ్మెల్యేకి చెబుతున్నాను అందరిని కలుపురండీ అని. జవహర్‌కు గౌరవం ఎస్సీ క మిషన్ చైర్మన్ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 8 వేల నుంచి 9 వేల బూత్‌లలో మన కు మెజారిటీ రాలేదని, 10 వేలు మెజారిటీ వ చ్చి ఉంటే 175కి 175 సీట్లు మనకు వచ్చేవన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చినా నాయకులకు గౌరవం దక్కడం లేదని, అధికారులే ఎంజాయ్ చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే మాట కలెక్టర్ వినడం లేదన్నారు. కొవ్వూరు మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానికంగా ఉండడం లేదని, మీరు సెంట్రల్ జైల్లో ఉండగా నిరాహార దీక్ష చేశానని చెబుతుండగా సీఎం చంద్రబాబు అతడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొవ్వూరు జాతకం 45 సంవత్సరాలుగా నాకు తెలుసు. గ్రూపులు ఈ నియోజకవర్గంలో ఇప్పటి నుంచే ఉండడంలేదన్నారు. నిజమైన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోనన్నారు. గ్రూపు రాజకీయాలు వద్దన్నారు. అయతే కొంతమంది కార్యకర్తలను సమావేశంలోకి అనుమతించక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎస్.రాజీవ్‌కృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, పొట్రు శ్రీనివాసరావు, నామాన పరమేష్, కొఠారు వెంకట్రావు, మద్దిపట్ల సురేష్, గొరిజాల సురేష్, చావా శ్రీనివాసరావు, బొల్లిన శివ నాగేం ద్ర, గెల్లా సురేష్, కొత్తపల్లి ఆశిష్‌లాల్, వరిగేటి కాంతరాజు, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, ఎరుబండి వెంకట్రావు, మూడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీఎం చంద్రబాబు కోసం ఎదురుచూపు

సీఎం చంద్రబాబుకు రూ.లక్ష విరాళం చెక్ అందజేస్తున్న నామా కొండబాబు

## 1500 మందితో బందోబస్తు


సీఎం చంద్రబాబు కాన్వాయ్ వద్ద పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా సుమారు 1500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ మళ్లింపు ఎక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 600 మంది పోలీసులను ప్రత్యక్షంగా విధుల్లో వినియోగించగా.. మిగతా వాళ్లను మఫ్టీలో నిఘా పెట్టారు. డ్రోన్, రోప్, స్పెషల్ పార్టీలను రంగంలోకి దింపారు. వాతావరణ కారణాల వల్ల పర్యటనలో ఎలాంటి మార్పులు జరిగినా దానికి అ నుగుణంగా భద్రత కల్పించడానికి ప్లాన్లు ము ందుగానే సిద్ధం చేశారు. బందోబస్తును తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ నిరంతరం స్వయంగా పర్యవేక్షించారు.

### ఒకే పుష్పం.. భిన్నంగా స్వాగతం

సీఎం స్థాయి వ్యక్తులు వచ్చినప్పుడు జిల్లా ఉన్నతాధికారులు, నేతలు విమానాశ్రయానికి వెళ్లి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలకడం పరిపాటి. కానీ ఈసారి సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు భిన్నంగా ఒక పుష్పంతోనే మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ తదితర నేతలు మలకపల్లిలోని వేదిక వద్దకు ఒక ప్రైవేటు మినీ వ్యాన్‌లో వచ్చారు. వారి గన్‌మ్యాన్‌లను కూడా అనుమతించలేదు. సీఎం ఎస్‌ఎస్‌జీ భద్రతలో ఉన్నారు. దీంతో భద్రతాపరంగా పలు జాగ్రత్తలను సీఎం కార్యాలయం నుంచి సూచించినట్లు తెలుస్తోంది.

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0

## డీఎస్సీకి 21 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూలై1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు ఉదయం షిఫ్టులో 520 మంది అభ్యర్థులకు 508 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 519మందికి 510 మంది హాజరయ్యారు. మొత్తం 21 మంది గైర్హాజరయ్యారు.

## 14 ఇంజనీరింగ్ కళాశాలలు.. 12,990 సీట్లు

ఏలూరు అర్బన్, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాల వారీగా ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతించిన సీట్ల సంఖ్యను ఖరారుచేస్తూ వివరాలతో కూడిన జాబితాను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 14 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలుండగా, వాటిలో అన్ని బ్రాంచ్‌లలో కలిపి మొత్తం 12,990 సీట్లు అడ్మిషన్లకు అందుబాటులో ఉన్నట్టు నిర్ధారించారు.

## రైల్లో దొంగలు పడ్డారు..!

- రైళ్లలో పెరుగుతున్న చోరీలు
- ఆదమరిస్తే అంతే సంగతులు

■ లోపలి పేజీలో..

# 94 శాతం

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఏలూరుసిటీ/ఆగిరిపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందించారు. జిల్లాలోని 2,58,098 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.112.72 కోట్లు నిధులు విడుదల చేసింది. కాగా మంగళవారం సాయంత్రానికి 2,46,000 మంది పింఛన్‌దారులకు రూ.112.00 కోట్లు (94శాతం) పంపిణీ చేశారు. ఏలూరులో పింఛన్ల పంపిణీని కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించి కొంతమంది లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. పింఛన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి బుధవారం పంపిణీ చేస్తారన్నారు. అలాగే పింఛన్ల పంపిణీ అమలు తీరును జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర టూరిజం ఎండీ కె.ఆమ్రపాలి నగరంలోని పత్తేబాద, ఎస్సీ నివాసిత ప్రాంతంలో పరిశీలించి పలువురు లబ్ధిదారులకు అందజేశారు. ఆగిరిపల్లి మండం చొప్పరమెట్లలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కొందరు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మంత్రి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ మొత్తాన్ని 2 వేల నుంచి 3వేల రూపాయలకు పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పడితే తాము 10 రోజుల్లో ఎన్టీయార్ భరోసా పెన్షన్ మొత్తాన్ని 3 వేల నుంచి 4వేల రూపాయలకు పెంచామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏలూరు తహసీల్దార్ గాయత్రి, ఎస్సీ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ దాసరి ఆంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, నగర మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పరమెట్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి పార్థసారథి

ఏలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి ఆమ్రపాలి

ఏలూరు అమీనాపేటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

# సుపరిపాలనలో.. తొలి అడుగు!

## నేటి నుంచి గడపగడపకు టీడీపీ శ్రేణులు

- ఏడాది కూటమి విజయాలపై ప్రచారం.. ఉమ్మడిగా జనం వద్దకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు
- నియోజకవర్గాల వారీగా ఇప్పటికే కార్యాచరణ
- చేసింది చెప్పడం.. ప్రజలను మెప్పించడమే విధి
- అందరూ పాల్గొనాల్సిందే : గన్ని వీరాంజనేయులు

అన్ని నియోజకవర్గాల్లో చేసిందేమిటో.. ప్రజలకు జరిగిన మేలేంటో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎంతమేర అమలు చేశామో పూసగుచ్చినట్లు గడపగడపకూ వివరించేందుకు టీడీపీ నేటి నుంచి తొలి అడుగు వేస్తోంది. ఈ మేరకు పార్టీ యంత్రాంగాన్ని ఎమ్మెల్యేలు,కన్వీనర్లు అప్రమత్తం చేశారు. పార్టీ అధినాయకత్వం ఆదేశించిన విధంగా ఈనెలంతా ప్రజల సమక్షంలోనే సంచరించడం, చేసిందీ చెప్పడం, సమాంతరంగా గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను వివరించాలని నిర్ణయించారు. ఉదయం, సాయంత్రం గడపగడపకూ వెళ్లాలని నిర్ణయించారు. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరు, ఏలూరు, చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాలతో పాటు పోలవరం,ఉంగుటూరు,కైకలూరు నియోజకవర్గాల్లోను విస్తృతంగా తొలి అడుగు నిర్వహించాలని కీలకనిర్ణయం తీసుకున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైంది. ఇంత స్వల్ప వ్యవధిలోనే ఆర్థికంగా లోటుపాట్లను సవరించడమే కాకుండా ప్రజాసంక్షేమం వైపు వేగంగా అడుగులు వేశారు. జిల్లావ్యాప్తంగా ప్రతీ నెల ఠంఛన్‌గా కోట్లాది రూపాయలు పేదవర్గాలకు అందిస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా నాలుగువేలకు పెంచి మరీ పంపిణీ చేస్తున్నారు. తొలుత సచివాలయ సిబ్బంది లేకుండా.. ఇది సాధ్యమా అనే ప్రశ్న తలెత్తినా వేకువ జామునే పింఛన్ల పంపిణీ ప్రారంభించడం ద్వారా ప్రజల్లో తొలి మైలురాయిని అధిగమించారు. పేదవర్గాలకు రాష్ట్రంలో పంపిణీ చేస్తున్నంత పింఛన్ దేశంలో మరెక్కడ లేదన్న విషయాన్ని గడపగడపకూ వెళ్లి అర్థమయ్యే రీతిలో వివరించేందుకు సన్నద్ధం అవుతున్నారు. ప్రత్యేకించి ఏడాదిలోపే సుపరిపాలన అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిన చొరవ, కూటమిలో మిగతా పక్షాలకు ప్రాధాన్యత ఇస్తూ ఒకేమాట- ఒకేబాట అనేలా పాలన సాగిన విషయాన్ని విస్తృత ప్రచారం చేయాలని భావిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి 'సుపరిపాలనలో ఏడాది..గడపగడపకూ టీడీపీ' పేరిట పార్టీశ్రేణులన్నీ కదిలేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, కన్వీనర్లు పార్టీశ్రేణులను సమాయత్త పరుస్తూనే గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలుమెచ్చిన పాలన అందించామని గణాంకాలతో అందించాలని నిర్ణయించారు. ఇప్పటికే పార్టీ అధినాయకత్వం ఏడాదిలో రెట్టింపు సంక్షేమం ఎలా సాగిందో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 149కి పైగా హామీలను వివిధ నియోజకవర్గాల్లో ఎలా అమలు చేశామో కేడర్‌కు దిశానిర్దేశం చేశారు.

### పోలవరం దగ్గర్నుంచి ..

ఏడాది కాలంలో ప్రాధాన్యత పరంగా పోలవరం ప్రాజెక్టుతో పాటు మిగతా హామీల విషయంలో కేంద్ర సహకారంతో ఎలా ముందడుగు వేశారో జిల్లావ్యాప్తంగా వివరించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. పోలవరం ప్రాజెక్టు వైసీపీ హయాంలో మూలన పడగా, రైతు సంక్షేమం దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఎలాంటి లక్ష్యాలతో ముందుకు సాగుతున్నామో రైతులకు పక్కాగా వివరించబోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో త్యాగాలు చేసిన కుటుంబాలకు ఈ ఏడాదిలోనే పరిహారం చెల్లించిన విషయాన్ని గుర్తుచేస్తూ అడుగులు వేయాలని పార్టీ ఇప్పటికే సూచించింది. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే, ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయానికి ప్రాధాన్యత ఇవ్వబోతున్నారు. పట్టణప్రాంతాల్లో చెత్తపన్ను రద్దు చేయడం, పేదల కోసం అన్నక్యాంటీన్లను ప్రారంభిం చడం, నెలవారీ పింఛన్‌ను రూ.నాలుగువేలకు పెంచడం, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే జీవో 117 రద్దు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం, మెగా డీఎస్సీ, ఒంటరి మహిళలకు పింఛన్లు, డ్వాక్రాసంఘాల్లో రుణవితరణలో ప్రాధాన్యత వంటి అంశాలతో పాటు ఉచితగ్యాస్ పథకమే కాకుండా కొద్దిరోజుల వ్యవధిలోనే (మిగతా 8వ పేజీలో)

సారా రహిత జిల్లా ప్రకటన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, డీసీ శ్రీలత, ఇతర అధికారులు

## సారా రహిత జిల్లాగా ఏలూరు

- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఏలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గుర్తించిన 140 గ్రామాల్లో సారాను పూర్తిగా నిర్మూలించిన నేపథ్యంలో జిల్లాను సారా రహిత జిల్లాగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం ప్రకటించారు. కలెక్టరేట్‌లో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సారా తయారీ నిర్మూలనకు ఎక్సైజ్, రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల సమ న్వయంతో నవోదయం2.0లో భాగంగా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో ఇది సాధ్యమైందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'నాలుగు నెలలు సంకల్పం వల్ల ఇది సాధ్యమైంది. సారా రహితంగా జిల్లాను ఉంచేందుకు ఇక మీదట ఒక్క కేసు కూడా నమోదు కాకుండా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖ అధికారులపై ఉంది. జిల్లాలో మరేప్రాంతంలోను సారా అమ్మకాలు, తయారీ లేకుండా దాడులు నిర్వహించండి. టోల్‌ఫ్రీ నంబర్ 14,405 ద్వారా ప్రజలు సమాచారం అందించేలా అవగాహన కల్పించండి. సారా వదిలిన తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి పథకం కింద 40 మందికి రూ.31.40 లక్షలు రుణాలుగా అందజేశాం'అని వివరించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆవులయ్య, డీఎస్పీశ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## దంచికొడుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా నానుడు వర్షాలు కురుస్తుండగా సోమవారం అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఉద్యాన పంటలకు కొంత నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. జిల్లాలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పోలవరం వద్ద గోదావరి నీటి మట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 49,497 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 40.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 21.1 మి.మీ నమోదైంది. పెదవేగి 37.2, బుట్టాయిగూడెం 35.4, ద్వారకాతిరుమల 33, టి.నరసాపురం 31, కుక్కునూరు 28.4, జీలుగుమిల్లి 27.8, దెందులూరు 27.4, చింతలపూడి 27.2, ఉంగుటూరు 25.6, లింగపాలెం 25.2, ముసునూరు 24.8, కామవరపుకోట 24.4, జంగారెడ్డిగూడెం 21.8, ఏలూరు రూరల్ 21, ఆగిరిపల్లి 20.6, భీమడోలు 20.6, పోలవరం 20.4, కొయ్యలగూడెం 19.6, ఏలూరు అర్బన్ 19.2, నిడమర్రు 14, చాట్రాయి 10.4, కలిదిండి 8.4, కైకలూరు 7.2, ముదినేపల్లి 5.6, నూజివీడు 5.4, మండవల్లి 5.2, పెదపాడు 4.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

## వరదలు, విపత్తుల నియంత్రణకు కార్యాచరణ : కలెక్టర్

ఏలూరు,జూలై 1(ఆంధ్రజ్యోతి): అకాల వరదలు, విపత్తుల నిర్వహణకు సమర్ధ వంతంగా ఎదుర్కొనేం దుకు పటిష్ఠ కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో గోదావరి వరద, అకాల విపత్తులను ఏ విధంగా ఎదుర్కొవాలన్న అంశంపై జేసీ ధాత్రిరెడ్డితో కలిసి మంగళవారం ఆమె అధికారులతో సమీక్షించారు. వరద సంసిద్ధత ప్రణాళిక, చేపట్టాల్సిన ముందస్తు చర్యలను గత అనుభవాల నేపథ్యంలో అవసరమైన ప్రత్యేక చర్యలను వివరించారు. వరదలకు జిల్లా సరిహద్దుల్లోని ఏఎస్ఆర్, భద్రాద్రి కొత్తగూడెం, కృష్ణాజిల్లా అధికారులతో కూడిన అంతర్‌జిల్లాల కమిటీలను ఏర్పాటు చేసుకోవా లని సూచించారు. కుక్కునూరు,వేలేరుపాడులో 101 నివాసిత ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికలకు అనుగుణం గా పునరావాస కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత 10 మండలాల్లో వినియోగించేందుకు అవసర మైన డ్రోన్లను అందుబాటులో ఉంచి ట్రయల్‌రన్ నిర్వ హించాలన్నారు. ఏలూరు, నూజివీడుల్లో వరద, అకాల వర్షాల కారణంగా సంభవించే పరిస్థితులను ఎదుర్కొ నేందుకు కమిషనర్లు, సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు సమన్వ యంతో పనిచేయాలన్నారు.డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జల వనరులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఎస్ఈలు పాల్గొన్నారు.

అమరావతికి రూ.లక్ష విరాళం ఇచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న సీఎం

## జనంతో..సీఎం

- పేదల సేవలో చంద్రబాబు
- మలకపల్లిలో జనంతో మమేకం
- పీ4లో ఇద్దరు అమ్మాయిల దత్తత
- కొవ్వూరుకు వరాల జల్లు
- సీఎంను చూసేందుకు జనం క్యూ

చర్మకారుడు పోసిబాబుకు పింఛన్ పత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం/కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గేర్ మార్చారు.. జనంలోనే ఉంటున్నారు..జనం బాధలు వింటున్నారు..అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.. మీకు నేనున్నానంటూ పేదలకు భరోసాగా నిలుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేర జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాళ్లపూడి గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. ముందుగా చర్మకారుడు పోసి బాబు ఇంటికి వెళ్లి రూ.3 వేలు పింఛన్ అందజేశారు.అతను తయారుచేసే చెప్పులు,టోపీలు కూడా చూశారు..ఒక టోపీ, ఒక చెప్పుల జత తీసుకుని రూ.5 వేలు ఇచ్చారు.గ్రామంలో మరో మహిళలకు పింఛన్ అందజేశారు.అక్కడే ఒక చిన్న పిల్లను ఎత్తుకుని ముద్దాడారు. తల్లితో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమమే పీ4.. సమాజం మీకు ఎంతో ఇచ్చింది. అందులో కొంత తిరిగివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని స్పష్టం చేశారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్(పీ4) కార్యక్రమానికి ఆయన మంగళవారం శ్రీకారం చుట్టారు. పీ4 ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తానన్నారు. సమాజంలో 10 శాతం ఉన్నతమైన, ఆదర్శవంతమైన కుటుంబాల నుంచి సమాజంలోని దిగువన ఉన్న 20 శాతం మంది ప్రజలను దత్తత తీసుకునే బృహత్తర కార్యక్రమం పీ4 అని చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి 15 లక్షల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. మూడు దశల్లో ఆ కుటుంబానికి అండగా నిలబడి ఉన్నతికి తమ వంతుగా బాధ్యత తీసుకోవాలన్నారు. 2029 నాటికి పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రశాంతి జిల్లా ప్రగతి తదితర అంశాలను వివరించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని గతంలో 150 పడకల ఈ ఆస్పత్రిని అభివృద్ధి కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని గుర్తు చేశారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని, కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను శుద్ధి చేసి తాగునీరుగా అందించాలని ఎమ్మెల్యే విన్నవించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆదేశించారు. అనంతరం కొవ్వూరు మండలం కాపవరంలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో కలసి ఉండాలని హితబోధ చేశారు. కాగా సీఎం సభకు 2వేల మందికి సరిపడా వేదికను సిద్ధం చేశారు. సభా ప్రాంగణానికి ఎదురుగా కల్యాణ మండపంలో మరో 500 మందికి ఏర్పాట్లు చేశారు. అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. మలకపల్లి సభకు సీఎం 11గంటలకు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో 2గంటల సమయంలో చేరుకున్నారు. భోజనాన్ని సిద్ధం చేసినా ప్రజలు వేచి చూస్తున్నారంటూ ఆయన నేరుగా సభా వేదికపైకి చేరుకున్నారు. సభ ముగిసిన తర్వాత 4.30గంటల ప్రాంతంలో కారవాన్‌లో భోజనం చేశారు.

# పశువులపై చిన్నచూపు..!

## పెరిగిన ఖర్చులతో రైతులకు పోషణ భారం

- జిల్లాలో తగ్గుతున్న పశువుల సంఖ్య..

ఏలూరు టూటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల పెంపకం తగ్గుతోంది. పెట్టుబడి పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో రైతులు పశువులను పెంచేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏటా పాల ఉత్పత్తి పడిపోతూ వస్తోంది. దశాబ్ద కాలానికి ఇప్పటికీ పశువులపెంపకం సగానికి పడిపోయింది. వ్యవసాయాంత్రీకరణతో పశువులతో ఎక్కువ పని లేకుండా పోతోంది. మరోవైపు నేటి యువత పశువులను పెంచడంలో అనాసక్తి చూపడం ఒక కారణం. పశువుల పెంపకం ఖర్చుతో కూడుకున్నది. పశుదాణా ధరలు విపరీతంగా పెరిగాయి. ఎండు పశుగ్రాసంలోనే పశువులు పెంచే రైతులకు పెద్ద చిక్కొచ్చి పడింది. ప్రతి పంటలోను మాసూళ్ల గండం పొంచి చూస్తోంది. వరి కోత యంత్రాల మీద, పంట మాసూళ్ల వచ్చాక ఆ సమయంలో వర్షాలు పడితే గడ్డి పనికి రాక కొరత ఏర్పడుతోంది.

### పశుగణన..లెక్కలిలా..

ప్రతీ ఐదేళ్లకు ఒకసారి జనాభా లెక్కల మాదిరిగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశుగణన చేపడుతుంటాయి. 2019లో అనం తరం 2024లో పశుగణన నిర్వహించారు. ఈ రెండుసార్లు ఆవులు, గేదెల సంఖ్య తగ్గిపోగా గొర్రెలు, మేకల సంఖ్య పెరిగింది. ఆవులు, గేదెల పెంపకం వ్యయభారంగా మారింది. మాంసహార ఉత్పత్తు లకు డిమాండ్ పెరగడంతో గొర్రెలు, మేకల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అతి తక్కువ కాలంలో గొర్రెలు, మేకలు పెంచడం వల్ల అధికలాభాలు రావడంతో వీటి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. 2019లో జిల్లాలో లక్షా 35వేల 607 ఆవులు,ఎద్దులు ఉంటే, 2024 సెన్సస్‌లో లక్షా 21,574కు తగ్గిపోయాయి. గేదెలు/ దున్నలు జిల్లాలో 2,019 పశుగణన ప్రకారం 5,06,110గా ఉంటే, 2024లో 4లక్షల80వేలకు తగ్గిపోయా యి. 2019లో గొర్రెలు 5లక్షల 26వేలు 836 ఉంటే 2024లో 5లక్షల 71వేలకు పెరిగాయి. మేకలు 2019 సెన్సస్ ప్రకారం లక్షా 98వేల 810 ఉంటే 2024లో 2లక్షల 34వేల 800కు పెరిగాయి.

### తగ్గిన ప్రోత్సాహకాలు

పశువుల పెంపకంలో ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలు తగ్గాయి. గడ్డివిత్తనాలు ఇచ్చి, గడ్డి పెంపకానికి 80 శాతం పెట్టుబడి అందించేవారు. అది గడిచిన ప్రభుత్వంలో నిలిచిపోయాయి. నాణ్యమైన దాణా కూడా సబ్సిడీపై అందించడం లేదు. కూటమి ప్రభుత్వం ఇప్పుడి ప్పుడే అందిస్తోంది. గోకులం షెడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

**భారంగా పశువుల పెంపకం**

పశువుల పెంపకం భారంగా మారింది. దానికి తగ్గట్టు పాల ఉత్పత్తుల దిగుబడులు తగ్గిపోయాయి. యువత పశువుల పెంపకంపై ఆసక్తి చూపడం లేదు. చదువుకుని ఉద్యోగాల వైపు యువత మళ్లుతున్నారు. పాతతరం వారికి శక్తిలేక పశువుల పెంపకం భారంగా మారింది. పశువులను సంఖ్య వృద్ధి చేసుకోవాల్సిన అవశ్యకత ఉంది.

\- డాక్టర్ టి.గోవిందరాజు, జేడీ, పశుసంవర్థక శాఖ

# వడ్డెర సొసైటీలకు.. మహర్దశ

- మైనింగ్ లీజుల్లో వారికి ప్రాధాన్యం
- కంకర,రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్స్ కాంట్రాక్టులు
- త్వరలోనే ఈ ప్రక్రియ అమలుకు సన్నాహాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

మైనింగ్ పాలసీలో వడ్డెర సొసైటీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆయా సొసైటీలకు మహర్దశ పట్టనుంది. ఏడాది తెలుగు దేశం పాలనలో ఎన్నికల్లో వివిధ సామాజిక వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ ఒక్కొక్కటిగా పట్టాలెక్కిస్తోంది. కొద్దినెలలు క్రితం మద్యం షాపుల కేటాయిం పుల్లో గౌడ, ఈడిగ, శెట్టిబలిజ తదితర బీసీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ జిల్లా పరిధి లోనే విడిగా ఈ సామాజిక వర్గాలకు మద్యం లైసెన్సులను కేటాయించింది. తాజాగా ఈసారి వడ్డెర, ఉప్పర, సగరలకు చెందిన సామాజిక వర్గానికి మైనింగ్ లీజుల కేటాయింపులో ప్రాధాన్యత పాటించాలని నిర్ణయించింది.

ఏపీ మినరల్, మైనింగ్ పాలసీ-1966లోని రూల్ నంబర్ 12(3)కు అవసరమైన సవరణ చేసింది. ఈ వర్గాలను ఉన్నతంగా స్థానికంగానే ఎదగడానికి మార్గాలను ఏర్పాటు చేసింది. క్వారీ లీజుల కేటాయింపుల్లో రోడ్డుమెటల్, కంకర, బిల్డింగ్ స్టోన్,బ్లాస్ట్, డైమెన్షియల్ స్టోన్ తదితర అంశాల్లో లీజులను వడ్డెర సొసైటీలు దరఖాస్తు చేసుకుంటే వారికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లాలోని భూగర్భగనులశాఖ కార్యాలయాలకు ఉత్తర్వులను పంపింది. ఏపీ సూక్ష్మ ఖనిజాల విధానం-2025ను మంత్రివర్గం ఆమోదించడంతో కొన్నేళ్లుగా ఇబ్బందుల్లో ఉన్న పరిశ్రమలను గట్టెక్కించే దిశగా సానుకూల నిర్ణయాలతో గనుల ఆధారిత కుటుంబాలకు మంచి రోజులు రానున్నాయి. జిల్లాలో సుమారు 70 వరకు వడ్డెర సొసైటీలు ఉన్నట్టు (మిగతా 8వ పేజీలో)

# రేపు ప్రైవేటు పాఠశాలల బంద్

**ఆర్టీఈ ఉచిత అడ్మిషన్లకు ఫీజులు, బకాయిల చెల్లింపునకు డిమాండ్**

**కలెక్టర్, ప్రజాప్రతినిధులు, డీఈవోలకు వినతిపత్రాల అందజేతకు నిర్ణయం**

ఏలూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం 12 (1)సి ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి 25 శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలన్న నిబంధన అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల సంఘం (అపుస్మా) ఉద్యమ బాట పట్టింది. ఇందులో భాగంగా గురువారం అన్ని ప్రైవేటు పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేసి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు, డీఈవోలకు వినతిపత్రాలను ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీఈ ఉచిత అడ్మిషన్ల అమలుకు ఎదురవుతున్న సమస్యలు, ఆర్థికపరమైన బకాయిల చెల్లింపులు నిలిపివేత, తదితర అంశాలపై అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీశ్రీ శర్మ మంగళవారం వివరించారు. ఆర్టీఈ చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లు, సంబంధిత స్కూలు పరిధిలోని ఒక కిలోమీటరు దూరంలో నివసించే కుటుంబాల పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని, ఆ మేరకు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం లేనపుడు మాత్రమే ప్రైవేటు స్కూలులో అడ్మిషన్ ఇచ్చేందుకు షరతులు ఉన్నాయన్నారు.దీనికి భిన్నంగా 15 కిలోమీటర్ల దూరంలోని పిల్లలను కూడా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లకు పంపించడం సరికాదన్నారు.ఆర్టీఈ అడ్మిషన్లకు కేంద్ర ప్రభుత్వం కొంత గ్రాంట్‌ను ఇస్తే, దానికి రాష్ట్రప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంటును కలిపి ఉచిత అడ్మిషన్లు ఇచ్చిన ప్రైవేటు పాఠశాలలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఒక్కో విద్యార్థిపైన సగటున రూ.90,300 ఖర్చు చేస్తోందని, కాని ఉచిత అడ్మిషన్లకింద కేటాయించిన సీట్లు ఒక్కో దానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.7 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు ఇస్తామనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఉచిత అడ్మిషన్ల కింద కేటాయించిన సీట్లకు ఒక్కో దానికి కనీసం రూ.20 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం 2019లో అధికారంలో ఉన్నపుడు అమలుచేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద కేటాయించిన ఉచిత అడ్మిషన్ల ప్రకారం ప్రవేశాలు కల్పించిన ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర వ్యాప్తంగా చెల్లించాల్సిన రూ.350 కోట్ల బకాయిలను ఇంతవరకు ఇవ్వలేదని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆర్టీఈ చట్టంకింద ఉచిత అడ్మిషన్ల నిమిత్తం ప్రైవేటు పాఠశాలలకు మూడేళ్లలో రూ.250 కోట్లు బకాయి పడిందని వివరించారు. ఉచిత అడ్మిషన్లకు డబ్బుల చెల్లింపు అంశంపై కోర్టులో దాఖలైన వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగానే తాజాగా ఆర్టీఈ ఉచిత అడ్మిషన్ల జాబితాలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తూ, సంబంధిత విద్యార్థులను చేర్చుకోవాల్సిందేనని అధికారులు ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి దృష్టి సారించకుండా షోకాజ్ నోటీసులిస్తామని, స్కూలు గుర్తింపు రద్దు చేస్తామని బెదిరింపులకు దిగటం సరైంది కాదన్నారు. గురువారం నిర్వహించనున్న స్వచ్ఛంద బంద్‌లో ఉమ్మడి జిల్లాలోని 1200 ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు పాల్గొంటాయని, అపుస్మా జిల్లాశాఖ సహా, మరో మూడు సంఘాలు పాల్గొంటాయని వివరించారు.

# 100 బస్సులు ఏమయ్యాయి ?

**ఫిట్‌నెస్ ఉందా.. సర్టిఫికెట్ లేకుండానే తిప్పుతున్నారా ?**

**స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ**

తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ సిబ్బంది

(భీమవరం-ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు 1300 బస్సులున్నాయి. ఈ ఏడాది 1200 బస్సులకు ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తయ్యింది. సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. మరో వంద బస్సులు పెండింగ్‌లో ఉన్నాయి. మరమ్మతులు చేపట్టడం వల్ల ఇంకా సర్టిఫికెట్‌లు పొందలేదు. మరోవైపు కాలం చెల్లిన బస్సులు తిప్పకూడదు. ప్రధానంగా విద్యా సంస్థలకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నారు. పదిహేనేళ్ల పూర్తి చేసుకున్న వాహనాలను విద్యా సంస్థలు వినియోగంచకూడదు. అటువంటి బస్సులను పక్కన పెట్టేయాలి. జిల్లాలో ఇంకా వంద బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు మంజూరు కాలేదు. తనిఖీలకు రాలేదు. దాంతో రవాణా శాఖ రంగంలోకి దిగింది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే తిప్పితే చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. రవాణా శాఖ జిల్లా అధికారి ఉమా మహేశ్వరరావు ఆ దిశగా ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్‌లు, ఇతర సిబ్బంది జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కంబైన్డ్ పశ్చిమ గోదావరి) ఆధ్వర్యంలో సీనియర్ పురుషుల మల్టీడే క్రికెట్ జట్టు ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు ఆర్ఎస్ఆర్ మూర్తి, అశోక్‌కుమార్‌గౌడ్, ఎస్‌కే షాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్సీష్ వర్మ (కెప్టెన్), జీఎస్ స్వామినాయుడు (వైస్ కెప్టెన్), రావంత్ నాగకుమార్, కెకెఎస్ఎన్ హరీష్, ఎం.హర్షవర్ధన్, జస్వైన్, డెనిష్, భువనేశ్వర్, బి.చరణ్ సాయితేజ, ఎండీ హెహబూబ్ అలీ, ప్రేమ్ చంద్, రుతీష్క్, దీపక్‌చంద్, రక్షణ్, జయకృష్ణ ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూలపాడులో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

## రాజమండ్రిలో 6న రజక ఆకాంక్ష సభ విజయవంతం చేయండి

భీమవరం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఈనెల 6 తేదీన నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయాలని ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ కోరారు. భీమవరం పట్టణం పేరంటాల చెరువు ఆదిలక్ష్మి రజక సంఘ భవ నంలో నిర్వహించిన రజక నాయకుల సమా వేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజమండ్రి నగర రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు రజక కార్పొరేషన్ చైరపర్సన్ సి.సావిత్రి సభాధ్యక్షరాలిగా, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, మంత్రి కందుల దుర్గేష్ ఎంపీ పురుందేశ్వరి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్, మీడియా కోఆర్డినేటర్ అమనాపు వెంకటేశ్వరరావు, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా వికాసం

**క్రీడా వికాస కేంద్రాలకు పూర్వ వైభవం**
**గత టీడీపీ హయాంలో మంజూరు**
**ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ పాలకులు**
**నూతన విధానం ప్రకటించిన ప్రభుత్వం**
**క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహం**

భీమడోలులో మధ్యలోనే నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రం

ఏలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :: క్రీడల అభివృద్ధికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మినీ స్టేడియాలకు (క్రీడా వికాస కేంద్రాలు) మంచి రోజులు రానున్నాయి. క్రీడలను యువత భవిష్యత్‌కు బాసటగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన క్రీడా వికాస కేంద్రాలు ఇక పూర్వ వైభవం సంతరించుకోనున్నాయి.

### నూతన క్రీడా విధానం

ప్రభుత్వం ప్రకటించిన నూతన క్రీడా విధానంలో భాగంగా క్రీడల కోటాలో ఇచ్చే ఉద్యోగాలను 3 శాతానికి పెంచారు. జాతీయస్థాయిలో స్వర్ణం, రజత, కాంస్యం పతకాలు సాధించే వారికి వరుసుగా రూ.10 లక్షలు, రూ.5 లక్షలు, రూ.3 లక్షలు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతీ నియోజకవర్గంలో క్రీడా వనరులను ప్రోత్సహించేందుకు వీలుగా సన్నాహాలు చేస్తున్నారు. తాజా క్రీడా విధానం ప్రకటనతో సగంలో నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రాలు పూర్తవుతాయన్న ఆశలు క్రీడాకారుల్లో కనిపిస్తోంది.

### ఏలూరు జిల్లాలో ఇలా..

జిల్లాలో 2014-19 మధ్య ప్రతీ నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్ర నిర్మాణం జరపాలని నిర్ణయించారు. తొలి దశలో ఏడు నియోజకవర్గలలోని 5 ప్రాంతాలలో వికాస కేంద్రాలు, ఒక చోట వాటర్ స్పోర్ట్స్ అకాడమీ పనులకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్లు చొప్పున జిల్లాకు రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇండోర్ స్టేడియం, పెవిలియన్, 200 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, లాంగ్ జంప్, కబడ్డీ, క్రికెట్ ప్రాక్టీస్ పిచ్, వాలీబాల్ కోర్టు, కోకో ప్రాంగణం వంటివి నిర్మించాల్సి ఉంది. అయితే జిల్లాలో పనులు ప్రారంభమైనా, 2019 సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడం ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో టీడీపీ హయాంలో చేపట్టిన పథకాలకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో క్రీడాకారులలో కొత్త ఆశలు చిగురించాయి.

### ఎక్కడెక్కడ ఎలా..

భీమడోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏలూరు కోట దిబ్బలోని జూనియర్ కళాశాలలో, దెందులూరు గోపన్నపాలెంలో, చింతలపూడి గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో, పోలవరం నియోజకవర్గం కోటరామచంద్రాపురంలోని గురుకుల పాఠశాలలో క్రీడా వికాస కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంతో పాటు ఐదు నియోజకవర్గాల్లోనూ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. భీమడోలులో ప్లాస్టింగ్ పనులు పూర్తిగా, గ్రౌండ్ ఫ్లోర్ పనులు 50 శాతం పూర్తవగా దెందులూరులో అసంపూర్తిగా, చింతలపూడి కోట రామచంద్రాపురంలోను పునాదులకే పరిమితం అయ్యాయి. తదుపరి నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు పడకేశాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే క్రీడాకారులు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ శ్రీకారం చుట్టిన పనులు అదే ప్రభుత్వం పూర్తిచేసి క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తారన్న నమ్మకం వారిలో నెలకొంది.

**ప్రభుత్వానికి ప్రతిపాదించాం**

జిల్లాలో అసంతృప్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రాల పునర్నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎక్కడెక్కడ ఏమేర పనులు జరిగాయి ? ఇంకా ఏమేరకు పనులు పూర్తి కావాల్సి ఉంది. అందుకు ఎంతెంత విధులు అవసరమవుతాయనే వివరాలతో ప్రతిపాదనలు పంపించాం.

**బి.శ్రీనివాసరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, ఏలూరు.**

తాడేపల్లిగూడెం పాత ఓవర్ బ్రిడ్జి వద్ద కాలువలో చెత్త వేయవద్దని సూచిస్తూ వేసిన పెయింట్

# కాలువలను నాశనం చేయకండి

తాడేపల్లిగూడెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : : తాడేపల్లిగూడెం నియోజకర్గంలో నీటి కాలుష్య నివారణ మునిసిపాలిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఏలూరు కాలువపై ఉన్న పాత బ్రిడ్జి గోడపై కాలువలో చెత్త వేయవద్దని..అది మంచినీరు రూపంలో ప్రతి ఒక్కరూ తాగు తారని మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తూ పెయింటింగ్‌తో రాయించారు.. ఇలాంటి సందశాలు చదివి కొంతమందిలో మార్పు వచ్చినా అది సమాజానికి హితంగా ఉంటుం దని భావిస్తున్నారు. పార్టీలకు ప్రచారాలకు ఉపయోగించే ఇలాంటి గోడలను పట్టణ ప్రజలకు సందేశం ఇచ్చే దిశగా అడుగులు వేశారు. తడిచెత్త పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ఆకుపచ్చ, ఎరుపురంగు డస్ట్ బిన్స్ పంపిణీ చేశారు. దీంతో ప్రజల్లో చాలా వరకు మార్పు వచ్చింది. చెత్త బయట వేయ కుండా శానిటేషన్ సిబ్బందికి ఇస్తున్నారు. దీంతో పట్టణంలో చెత్తకుప్పలు కనిపించడం లేదు. పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఇప్పటికే ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఏలూరు కాలువ ప్రక్షాలన కార్యక్రమం చేపట్టారు. దీంతో ఏలూరు కాలువలో ఉన్న చెత్తను తొలగించారు. కాలు వల్లో చెత్తవేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు కాలు వను ఆనుకుని ఉన్న గ్రామాల పంచాయతీ కార్య దర్శులు ప్రత్యేకంగా గ్రామాల్లో అవ గాహన కల్పించారు. నవాబ్‌పాలెం నుంచి ఉప్పాక పాడు అండర్ టర్నల్ వరకు పూడిక తీశారు.

**ప్రజల్లో అవగాహన పెంచాలి**

పట్టణ ప్రజల్లో నీటి కలుషిత విషయంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఏలూరు కాలువలోకి చెత్త పారవేస్తున్నారు. దీంతో నీరు కలుషితం అవుతోంది. దీన్ని గుర్తించి పాత ఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోడపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాయించాం. దీన్ని చూసి కనీసం కొంతమంది మారినా మిగిలిన వారిలో అవగాహన పెరుగుతుంది.

**-మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు**

తణుకు బాలురున్నత పాఠశాల్లో నిర్మాణంలో ఉన్న వాకింగ్ ట్రాక్

# రెడీ అవుతున్న వాకింగ్ ట్రాక్

తణుకు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తణుకు నడి బొడ్డున ఉన్న బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా క్రీడాకారులకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైస్కూలు గ్రౌండులో వందలాది మంది విద్యార్థులు, వివిధ క్రీడాకారులు, ఆటలు ఆడుతుంటాయి. అలాగే అన్ని వయసుల వారు నిత్యం ఇక్కడ వాకింక్ చేస్తుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకుని యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు 5 లక్షలు వెచ్చించేలా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృషి చేశారు. ఇందులో బాగంగా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ద్వారా స్కూలు ఖాతాలో నిధులు జమ చేస్తారు. ఆ నిధులతో ఇప్పటికే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ట్రా్‌చుట్టూ సిమెంటు ఇటుకలతో నిర్మించారు. దానికి ఫినిషింగ్ చేయాల్సి ఉంది. ట్రాక్ మధ్యలో వాలీబాల్, హకీ, కోకో, క్రికెట్ వంటి ఆటలు ఆడుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు.

**త్వరలోనే ప్రారంభిస్తాం**

**ఎమ్మెల్యే ఆరిమిల్లి**

బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మించే వాకింగ్ ట్రాక్‌ను సాధ్యమైనంత తొందర్లోనే పూర్తి చేసి ప్రారంభించి ప్రజలకు, క్రీడాభిమానులకు అందుబాటులోకి తీసు కొస్తాం. క్రీడల్లో యువత రాణించాలంటే కనీస వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని వాకింగ్ ట్రాక్ ఏర్పాట చేస్తున్నాం. రెండో విడతలో తణుకు, ఇరగవరం మండలాలకు 24 లక్షలు చొప్పున రూ.48 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.

## తణుకు ఆసుపత్రిలో రూ.28 లక్షలతో అభివృద్ధి పనులు

తణుకు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర [illegible] పాత భవ[illegible]లో [illegible] దొడ్డలు [illegible]తో పాటు [illegible] వైద్యు[illegible] ఆరిమిల్లి [illegible]. పాత [illegible] చర్య[illegible]లో కొత్తగా [illegible] గదులు టైల్స్ [illegible] విధంగా [illegible] ఇంటర్నల్ డ్రైన్[illegible] అయ్యిందు [illegible] నాలుగు[illegible] మర[illegible]. అలాగే కొత్త [illegible], మరు[illegible] కొత్త సిమెంట్[illegible] ఆసుపత్రిలో [illegible] ఉన్న సమస్యల [illegible] ఉన్నారు.

ఆసుపత్రి ప్రాంగణంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

# నిగ్గు తేలేనా.?

**ద్వారకాతిరుమల పంచాయతీలో రూ.2 కోట్ల నిధుల దుర్వినియోగం**

**సర్పంచ్, గత కార్యదర్శి, ఎంపీడీవోలే బాధ్యులంటూ తేల్చిన విచారణాధికారులు**

**తాజాగా ప్రధాన విచారణ..పంచాయతీరాజ్ కమిషనర్‌కు తుది నివేదిక అందజేత**

**ఏం చర్యలు తీసుకుంటారో ..?**

ద్వారకాతిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల పంచాయతీలో కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేసినట్టు ప్రాథమిక విచా రణలో తేలినా ఇప్పటివరకూ పూర్వపు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి పైసా రాబట్టలేక పోయారు. ప్రాథమిక విచారణ అనంతరం ఇటీవల పూర్తయిన ప్రధాన విచారణ తర్వాత పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి వీరిపై తీసుకోనున్న చర్యల ఉత్తర్వులు ఇంకా వెలువడక పోవడం ఓ కారణమైతే ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ కుంటం స్వర్ణలత కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై కోర్టును ఆశ్రయించి తాత్కాలిక ఊరట పొందడం మరో కారణం. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయాలని సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు విచారణ ముగిసేవరకు ఆమె సర్పంచ్‌గా కొనసాగవచ్చని గతేడాది అక్టోబరు 26న మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో స్వర్ణలత ఈ ఏడాది మార్చిలో సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. లింగపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఇక్కడి పూర్వపు ఎంపీడీవో ఆశీర్వాదాన్ని సస్పెండ్ చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం ఈ దుర్వినియోగంపై మరోసారి ప్రధాన విచారణ కొనసాగింది. జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు విచారణ అధికారిగా, డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా ప్రిసైడింగ్ అధికారిగా విచారణ చేపట్టి తుది నివేదికను కొద్దిరోజుల క్రితం పంచాయతీ రాజ్ కమిషనర్‌కు అందజేశారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు వీరిపై చర్యలు ఉంటాయని అనుకుంటున్నారు.

### రూ.2.03 కోట్లు దుర్వినియోగం

సమాచారహక్కు చట్టం క్రింద అముక్తకు అందించిన నివేదికతోనే అసలు నిజం బట్టబయలైంది. పంచాయతీ సర్పంచ్ కుంటం స్వర్ణలత, కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, అప్పటి ఎంపీడీవో ఆశీర్వాదంలు పంచాయతీ నిధులను రూ. 2 కోట్ల 25లక్షల 33 వేల 822 దుర్వినియోగం చేసినట్టు తేలింది. అయితే విచారణలో నిధులు దుర్వినియోగం అయినట్టు తేలింది. ఆ సమయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న లంకలపల్లి వెంకటేశ్వరరావు 2019-2024 వరకూ గ్రామపంచాయితీ సాధారణ నిధుల దుర్వినియోగం, ఇంటి, కుళాయి పన్నులు ద్వారా, లైసెన్స్ ఫీజుల వసూలులో నిర్లక్ష్యం, 14, 15 ఆర్థిక సంఘ నిధులు దుర్వినియోగం వంటి అంశాల ద్వారా కైంకర్యం చేసిన రూ.1, 30, 85, 013 సొమ్ము వసూలు చేయాలని సూచించారు. అలాగే ఇదే అంశాలపై 2021 నుంచి సర్పంచ్‌గా విదులు నిర్వర్తిస్తున్న కుంటం స్వర్ణలత రూ.53,57,376 దుర్వినియోగం చేసిందని దుర్వినియోగం చేసిన సొమ్మును వసూలు చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నివేదికలో సూచించారు. అలాగే 2019 జూలై 10 నుంచి 2021 ఏప్రిల్ 2 వరకూ విదులు నిర్వర్తించిన పూర్వ ఎంపీడీవో ఆశీర్వాదం రూ. 18,73,538 సొమ్ము దుర్వినియోగం చేసారని ఈ అవినీతికి ఆయనను బాధ్యులుగా చూపారు. కార్యదర్శి, పూర్వ ఎంపీడీవోలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు, దుర్వినియోగమైన పంచాయతీ నిధులను రాబట్టాలని సూచిం చారు. అయితే ప్రాథమిక విచారణ అనంతరం జరిగిన ప్రధాన విచారణ పూర్తయి తుది నివేదిక అందుకున్న పంచాయతీ రాజ్ కమిషనర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ద్వారకాతిరుమల గ్రామ సచివాలయం

**అసలు గుట్టు రట్టయిందిలా..**

ద్వారకాతిరుమల పంచాయతీలో అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త గతేడాది జనవరి 29న ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ ఆదేశాల మేరకు విచారణాధికారిగా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో రజావుల్లా గతేడాది ఫిబ్రవరి 17న విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఖర్చులు, జమలు, వసూళ్ల రికార్డులను పరిశీలించారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఈవోపీఆర్డీ సుబ్బరాయన్ తదితరుల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. విచారణాధి కారి తన నివేదికను 2024 ఏప్రిల్ 26న జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. ఆ తర్వాత కార్యాలయాల చుట్టూ నివేదిక కోసం తిరిగిన అముక్తకు ఎట్టకేలకు సమాచార హక్కు చట్టం కింద దానిని అందజేశారు. .

# వామనమూర్తిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వామనమూర్తిగా జగన్నాథుడు మంగళవారం భక్తజనులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో కమండలం, పాత్రను ధరించి బలిచక్రవర్తిని పాతాళంలోకి తొక్కివేస్తున్నట్లున్న అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. గత నెల 27న ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఈ అలంకారాలు భక్తులను అల రిస్తున్నాయి. ఇందులో బాగంగా జగన్నాదుడు ప్రతీరోజూ దశావతారాల్లో సాక్షాత్కరిస్తున్నారు. ప్రత్యేక అలంకారాలను భక్తులు దర్శించి తరించాలని ఆలయ అధికారులు, అర్చకులు కోరుతున్నారు.

**పానీ పాట్లు**

నరసాపురం మునిసిపల్ కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె బాట పట్టడంతో నీటి సరఫరా నిలిచింది. దీంతో ప్రజలు తాగునీటికి కటకట లాడుతున్నారు. మునిసిపల్ కార్యాలయంలోని ట్యాప్ వద్ద తాగునీటి కోసం పట్టణ ప్రజలు టిన్నులతో ఇలా బారులు కట్టారు.

-నరసాపురం, ఆంధ్రజ్యోతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

## వీఆర్వోలను యథావిధిగా కొనసాగించాలి

ఏలూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులను యథావిధిగా కొనసాగించాలని, వీఆర్వో సిబ్బంది తగ్గకుండా చూడాలని కోరుతూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ విషయంలో జరుగుతున్న పరిణామాలపై మంత్రితో చర్చించారు.రవీంద్రరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులను యథావిధిగా కొనసాగించాలని, అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలుకు వన్ టైం సెటిల్మెంట్ కింద వెంటనే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రేడ్ 2 వీఆర్వోలుకు గ్రేడ్ 1 ప్రమోషన్స్ కల్పించి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని రవీంద్రరాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బిసుగుణమ్మ, నాయకులు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీ నారాయణ, వి.శ్రీనివాస్, సురేశ్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మండల పరిషత్ అధికారుల జిల్లా నూతన కార్యవర్గం

## ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమోహన్

భీమవరం రూరల్/ఆచంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆచంట ఎంపీడీవో బి.కృష్ణమోహన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళవారం భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆచంట ఎంపీడీవో బి.కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గంగాధరరావు(భీమవరం), ఉపాధ్యక్షుడిగా జీఎస్ఐ రాజు(కాళ్ల), ఎ.శ్రీవాణి(జగనవరం), కోశాధికారిగా సీహెచ్ త్రిశూలపాణి (మొగల్తూరు), ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్(ఉండి), సంయుక్త కార్యదర్శిగా శామ్యూల్ (అత్తిలి)తో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజీనామా

పాలకోడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలానికి చెందిన వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటూరి నరసింహమూర్తి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం తెలియజేశారు. ఈ మేరకు తన రాజీనామా సమాచారాన్ని విలేకరులకు తెలిపారు. 2009లో వైసీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీ కోసం కష్టపడ్డానని, కానీ పార్టీలో సముచిత స్థానం లేదని, అంతేకాకుండా పార్టీని నడిపించే సరైన నాయకుడు లేదని, పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రొటోకాల్ అనేది పార్టీలో లేదని, నిజమైన కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యత లేదని, ఎస్సీలకు ప్రాధాన్యం తగ్గిందని, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడికి పంపినట్టు తెలిపారు.

## వైభవంగా జగన్నాథ రథయాత్ర

ఏలూరు కార్పొరేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్, హరేకృష్ణ క్షేత్ర బృందం సంయుక్తంగా మంగళవారం ఏలూరు నగరంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రకు అపూర్వ ప్రజాస్పందన వచ్చింది. రథంపై జగన్నాథస్వామి, మరో రథంపై రాధాకృష్ణుల విగ్రహాలతో మేళతాళాలు, బాజాభజంత్రీలతో శోభాయాత్రగా పలు డివిజన్లలో కొనసాగింది. కోలాట నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో నగరంలో సందడి నెలకొంది.

## సీఎంను కలిసిన జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్ళపూడి మండలం మలకపల్లి గ్రామంలో నిర్వహించిన పెన్షన్ పంపిణీకి మంగళవారం హాజరైన సీఎం చంద్రబాబుకు రాజమండ్రి విమానాశ్రయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ హృదయ పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందనడానికి పింఛన్ల పంపిణీయే నిదర్శనమని అన్నారు. సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమం పట్ల చూపిన నిబద్ధత ప్రభుత్వ సంకల్పాన్ని మరింత బలపరుస్తుందన్నారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో రెండో రోజు ప్రవేశాలు

నూజివీడు టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండో రోజు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగింది. రెండవ రోజు 555 మందికి కాల్ లెటర్లు పంపించగా 444 మంది రిపోర్ట్ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు శాక్ బిల్డింగ్‌లో మొత్తం 25 కౌంటర్లను ఏర్పాటు చేశారు. వర్షం పడుతున్నా విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**రెండో రోజు 434 మందికి ప్రవేశాలు :** ప్రధాన అడ్మిషన్ల ప్రక్రియలో సోమ, మంగళ వారాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌తో పాటు ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోను అడ్మిషన్లు నిర్వహించారు. రెండో రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొత్తం 434 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా బాలురు 134 మంది, బాలికలు 300మంది అడ్మిషన్లు పొందారు.

**నేటి నుంచి శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్లు :** బుధ, గురువారాల్లో నూజివీడులోని ఎస్ఏసీ ఆడిటోరియంలో శ్రీకాకుళం క్యాంపస్ ప్రవేశాలకు కౌన్సిల్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్ర కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.


ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

**CHANGE OF NAME**

★ నేను చిలకపాటి సుబ్బారావు, చిలకపాటి దుర్గారావు కుమారుడిని, 22/07/1995న జన్మించాను. ప్రస్తుతం 10-4-3/1, సూర్యప్రకాశ్ వీధి, చర్చ్ పేట, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 534301లో నివసిస్తున్నాను. నేను నా పేరుని చిలకపాటి సుభాష్‌గా మార్చుకున్నాను. ఈ మేరకు నిడదవోలులో 30/06/2025న నోటరీ ద్వారా ప్రతిజ్ఞ పత్రం సిద్ధం చేశాను. AJH-2524

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి


# రైల్లో దొంగలు పడ్డారు..!



రైళ్లలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి..కాస్త ఆదమరిస్తే చాలు విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు, నగదు దోచుకుపోతున్నారు. ఎక్కువగా మహిళలనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. సాధారణంగా ప్రయాణ సమయంలో మహిళలు బంగారాన్ని హ్యాండ్ బ్యాగ్‌లో భద్రపరుస్తారు..దీన్ని గమనించి దొంగలు చోరీలకు దిగుతున్నారు. అలాగే రైళ్లు ఆగినప్పుడు కిటికీల దగ్గర మహిళలు కూర్చున్నప్పుడు వారి మెడలోని వస్తువుల్ని లాక్కుని ఉడాయిస్తున్నారు. ఇలాంటి చోరీలు కూడా గతంలో ఎన్నో వెలుగుచూశాయి

**రైళ్లలో పెరుగుతున్న చోరీలు**
**ఆదమరిస్తే అంతే సంగతులు**
**ప్రయాణికుల్లో భయాందోళనలు**
**ఎక్స్‌ప్రెస్‌లలో తగ్గిన బందోబస్తు**

భీమవరం క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు సౌత్ సెంట్రల్ రైల్వే (దక్షిణ మధ్య రైల్వే) లైన్‌లో తిరిగే రైళ్ళను చోరీలకు ఎంచుకుంటున్నారు. ముందుగానే పక్కా ప్లాన్‌తో సిగ్నల్‌ను టాంపరింగ్ చేసి రైళ్లను స్లో చేయించి అనంతరం వారి పని కానిచ్చేస్తున్నారు. రైల్వే పోలీసులు సిబ్బంది కొరత వల్ల రైళ్ళలో అంతంత మాత్రంగానే నిఘా ఉండటంతో వారి పని సులువుగా అయిపోతుంది. ఇటీవల పల్నాడు జిల్లాలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన ఉదంతమే దీనికి ఉదాహరణ. అక్కడ రైళ్ళ సిగ్నల్‌ను ట్యాంపరింగ్ చేసి రైలును స్లో చేసి నగదు దోచుకునేందుకు ప్రయత్నించగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కాల్పులు జరపడంతో దొంగలు పారిపోయారు. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి ప్రాంతాల నుంచి దొంగలు ఈ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. రైళ్ళను ఆపి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసి వారి వద్ద ఉన్న నగదు, బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు వంటివి దోచుకుంటున్నారు. చోరీలు చేసేందుకు ఏకంగా దొంగలు ట్రైనింగ్ తీసుకుంటారంటే దానిని బట్టి దొంగతనాలు ఎలా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు. రైలు స్టేషన్ శివారు ప్రాంతాల్లో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపిన తర్వాత వారే ఒకరిపై ఒకరు నిచ్చెనలా ఎగబాకి కిటికీల వద్ద మహిళల మెడలోని బంగారు వస్తువులను, విలువైన వస్తువులను దోచుకుని ఉడాయిస్తున్నారు.

### సిబ్బంది కొరతతో ఇబ్బందులు

రైళ్లు వేగంగా వెళ్లే సమయాల్లో దొంగలు సిగ్నల్ ట్యాంపరింగ్ చేయడం జరుగుతూ ఉంటుంది. అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్ళల్లో ఏసీ బోగీలకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు ఎక్కువ భద్రత ఇస్తూ ఉంటారు. దానిని అదునుగా చేసుకుని దొంగలు సెకండ్ క్లాస్ రిజర్వేషన్‌లోకి వెళ్లి దొంగతనాలకు పాల్పడతూ ఉంటారు. ఆర్పీఎఫ్ పోలీసులు సెకండ్ క్లాస్ రిజర్వేషన్‌లో కూడా భద్రత కల్పించవలసిన అవసరం ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వల్ల అది సాధ్యం కావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్ళలో ఇలాంటి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సాధారణ రైళ్ళు పాసింజర్లు, డెమో, మెమో రైళ్ళల్లో కూడా దొంగతనాలు జరుగుతున్నప్పటికీ అవి చిన్నవి కావడం వల్ల చాలా వరకు పోలీసులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉదాహరణకు భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ అది ఇటు కైకలూరు, అటు నరసాపురం, కాల్దరి వరకు విస్తరించి ఉంది. ఈ స్టేషన్‌కు 26 మంది సిబ్బంది అవసరం ఉన్నప్పటికీ ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇలా ప్రతి గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లోను, రైల్వే ప్రొటెక్షన్ పోలీస్ స్టేషన్‌లోను సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది.

### ప్రయాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

రైలు ప్రయాణాలు చేసేటప్పుడు ముఖ్యంగా మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. కిటికీల పక్కన ఎట్టి పరిస్థితుల్లోను తలపెట్టి పడుకోకూడదు. అలాగే ప్రయాణాలు చేసేటప్పుడు మెడలో, చేతికి విలువైన వస్తువులు ధరించరాదు. నిద్రపోయేటప్పుడు తలకింద విలువైన వస్తువులు ఉన్న బ్యాగులను పెట్టుకోకూడదు. విలువైన వస్తువులు ఉన్న బ్యాగులతో ప్రయాణిస్తే మాత్రం తప్పనిసరిగా ఒకరు నిద్రపోయినా మరొకరు మేల్కొని ఉండాలి.సెల్‌ఫోన్లు కూడా ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి. అపరిచితులు వస్తున్నప్పుడు వారి పట్ల జాగ్రత్త వహించి దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలి. లేదా 139 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే రైల్వే పోలీసులు సకాలంలో స్పందిస్తారు. అలాగే పురుషులు కూడా ఎక్కువ సొమ్మును జేబుల్లో పెట్టుకుని ప్రయాణించకూడదు. చేతికి, మెడలోను కూడా బంగారు వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో ఉంచకూడదు.

### ఇటీవల జరిగిన కొన్ని చోరీలు

- ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నం దువ్వాడకు చెందిన ఒక మహిళ రైలు ఎక్కేందుకు టౌన్ రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఎక్కి దిగుతున్న సమయంలో ఆమె బ్యాగును గుర్తు తెలియని దుండగుడు లాక్కుపోయాడు. అందులో సుమారు ఐదు కాసుల బంగారు వస్తువులు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- ఈ ఏడాది జనవరి 8వ తేదీన విశాఖపట్నంకు చెందిన మహిళ మచిలీపట్నం రైలులో బ్యాగును పక్కనే పెట్టుకుని సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆదమరిచింది. దీంతో దొంగలు బ్యాగును దొంగిలించారు. ఆ బ్యాగులో సుమారు మూడు కాసుల బంగారు వస్తువులు ఉన్నాయి.
- ఫిబ్రవరి 23న మచిలీపట్నానికి చెందిన మహిళ ఎల్‌టీటీ రైలులో ప్రయాణిస్తుంది. ఆకివీడు దగ్గర ఆమె బ్యాగు చోరీకి గురైంది. ఆ బ్యాగులో 73 గ్రాముల బంగారం, 90 గ్రాముల వెండి, ఒక ఐఫోన్, రూ. 6 వేలు నగదు దోచుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మార్చి 22వ తేదీన భీమవరానికి చెందిన మహిళ కాకినాడ నుంచి భీమవరం సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నది. అయితే మార్గమధ్యలో ఆమె బ్యాగు కనిపించలేదు. దానిలో 88 గ్రాముల బంగారం ఉన్నట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

---

- ఇటీవల ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుంచి వస్తున్న ప్రయాణికురాలు నిద్రపోతున్న సమయంలో మెడలో ఉన్న బంగారాన్ని తీసి హ్యాండ్ బ్యాగ్‌లో భద్రపర్చుకుంది. నిద్రపోతూ బ్యాగ్‌ను చేతికింద పెట్టుకుంది. రైలు వీరవాసరం వచ్చే సమయానికి లగేజీ చూసుకోగా హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు, దొంగలు ఎప్పుడు ? ఎక్కడ కొట్టేశారో ఇంకా తేలలేదు.
- గత నెలలో లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ కోచ్‌లో ఒక ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్ కూడా పోయింది. ఆమె కూడా ఇదే తరహాలో మెడలోని బంగారాన్ని హ్యాండ్‌లో భద్రపర్చుకుని పడుకుంది. ఆకివీడు వచ్చేసరికి బ్యాగ్ లేదు.. గుడివాడ నుంచి ఆకివీడు వచ్చేలోపు బ్యాగ్‌ను అపహరించారు.
- ఈ ఏడాది మార్చిలో లింగంపల్లి నుంచి నరసాపురం వస్తున్న ఓ ప్రయాణికురాలు ఏసీ బోగీలో ఖరీదైన ఫోన్‌ను చార్జింగ్ పెట్టి నిద్రలోకి జారుకుంది. దీన్ని గమనించిన బెడ్ రోలర్ ఫోన్‌ను దొంగలించే ప్రయత్నం చేశాడు.. వెంటనే ఆమె మేల్కొని కేకలు వేయడంతో భర్త లేచి దొంగను పట్టుకునే ప్రయత్నం చేసినా అతను తప్పించుకున్నాడు. గుంటూరులో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో బెడ్ రోలర్ ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. దాదాపు 20 ఫోన్లపైనే ఇదే తరహాలో చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలడంతో పోలీసుల సైతం అవాక్కయ్యారు.

**- నరసాపురం (ఆంధ్రజ్యోతి)**

---

### అపరిచితుల పట్ల జాగ్రత్త వహించాలి

ఎక్కువగా మహిళలు రైలులో ప్రయాణించేటప్పుటు జాగ్రత్తగా ఉండాలి. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండి, వారి కదలికలపై నిఘా ఉంచాలి.అనుమానం వస్తే 139 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. దొంగలు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైళ్లను ఆపి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఉంటున్నారు. వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. పాత నేరస్తులను బైండోవర్ చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దొంగతనాలు అరికట్టేందుకు రైల్వే రక్షణ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది.

**- దస్తగిరి, భీమవరం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ**

---

## జాగ్రత్తలు తీసుకుంటే సేఫ్

ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ కె.బెన్నయ్య(ఫైల్)

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణం అంటే సులువైనది.. చౌకైనది. సుదూర ప్రాంతాలు సైతం తక్కువ సమయంలో సురక్షితంగా చేరుకోగలమని నమ్మకం. అయితే రైళ్లలో ఇటీవల చోరీలు పెరగడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో పొలాలు, అటవీ ప్రాంతాల మధ్య చైన్ లాగి రైలు ఆపి దోపిడీకి పాల్పడుతుంటారు. ఆయుధాలతో ప్రయాణికులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, బ్యాగ్‌లను తస్కరించి చీకటిలో కలిసిపోతారు. 2002 వేసవి కాలంలో బాదంపూడి సమీపంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును చైన్‌లాగి ఆపై ప్రయాణికుల నుంచి వస్తువులు తస్కరించడానికి ప్రయత్నించగా ప్రయాణికులు తిరగబడ్డారు. రైలులో ఉన్న పోలీసులు గాలిలో కాల్పులు జరపడంతో రైలుపై దొంగలు రాళ్లు విసురుకుంటూ పొలాల్లోకి వెళ్లిపోయారు. రైళ్ళల్లో సెల్‌ఫోన్లు తస్కరించడం, హ్యాండ్ బ్యాగ్‌లను తస్కరించడం వంటి సంఘటనలు ఈ మూడేళ్లలో 15 వరకూ ఉన్నాయి. 2023లో నూజివీడు రైల్లే స్టేషన్ సమీపంలో రైలులో ప్రయాణిస్తున్న ఒక మహిళ వాష్‌రూమ్‌కు వెళ్ళిన సమయంలో ఒక వ్యక్తి ఆమె మెడలోని బంగారు చైన్ తెంపుకుని రైలు దిగి పారిపోయాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆ నేరస్తుడిని మొత్తం మీద అరెస్టు చేశారు. 2023 ఆగస్టు నెలలో ఒక జ్యూవెలరీ వ్యాపారి తన వద్ద ఉన్న వివిధ రకాల మోడల్స్ 1 కేజీ 670 గ్రాములు బరువు ఉన్న బంగారపు వస్తువులను తన గుమస్తాకు ఇచ్చి విశాఖపట్టణంలో బంగారు వ్యాపారులకు చూపించడానికి పంపించారు. నాలుగు రోజుల తరువాత ఆ గుమస్తా తన స్నేహితుడితో కలిసి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ పట్టణం నుంచి హైదరాబాద్ వెళుతున్న సమయంలో వారిద్దరు నిద్రపోవడంతో వారి వద్ద ఉన్న నగల సూట్‌కేసు అపహరణకు గురైంది. ఈ సంఘటనపై విజయవాడలో ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదు చేసిన తరువాత ఏలూరుకు బదిలీ చేశారు. మొత్తం మీద ఈనేరం మహారాష్ట్రలోని షోలాపురి గ్యాంగ్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించి ఒక వ్యక్తిని అరెస్టు చేయగలిగారు. మిగిలిన ఐదుగురి కోసం వేట కొనసాగిస్తూనే ఉన్నారు.

### అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

నడుస్తున్న రైళ్ళకు ఎక్కడైనా సిగ్నల్ వ్యవస్థలో సమస్య ఏర్పడి రైళ్ళు మధ్యలో ఆపాల్సి ఉంటే ఆ సమాచారం ముందుగానే ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులకు తెలియజేయాలని స్టేషన్ మాస్టర్లకు, సూపర్‌వైజర్లకు చెప్పాం. నేరాల నియంత్రణ కోసం ప్రయాణీకులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తున్నాం. కిటికీ వద్ద కూర్చునేవారు బంగారు ఆభరణాలు ధరించి ఉంటే అవి కనిపించకుండా చున్నీ కాని, చీర కొంగు కాని కప్పి ఉంచుకోవాలి. రైలులో వాష్‌రూమ్‌కు వెళ్ళేటప్పుడు తోడుగా మగవారిని తీసుకువెళ్లాలి. బంగారపు వస్తువులు జాగ్రత్తగా తీసుకువెళ్ళాలని తెలియజేస్తున్నాం. కొవ్వూరు గోదావరి బ్రిడ్జి నుంచి విజయవాడ సమీపంలోని ముస్తాబాద వరకూ రైళ్లలో పూర్తి భద్రత కల్పిస్తున్నాం.

**- కె.బెన్నయ్య, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్**

---

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గాలిముట్టి పండు మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ బ్రిడ్జిని ఢీకొన్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణా జిల్లా పెడన గ్రామానికి చెం దిన గాలిముట్టి పండు (19) అతని బంధువు ఏసుపోగు చిన్నారావు తాపీపనులు చేస్తుంటారు. వీరు గతంలో రాజమండ్రిలో తాపీ పనులు చేసినప్పుడు ఏలూరుకు చెందిన మేస్త్రి సొమ్ములు ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ము తీసుకోవడానికి వీరు మంగళవారం మోటారు సైకిల్‌పై ఏలూరు వస్తూ ఏలూరు కలపర్రు టోల్‌గేటు సమీపంలోని మద్యం దుకాణం వద్ద మద్యం తాగారు. అక్కడ నుంచి బైపాస్‌లో బయలు దేరగానే కొద్దిదూరం వెళ్ళగా బైక్ అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీ కొన్నారు. ఈ ఘటనలో మోటారు సైకిల్ నడిపిన పండు అక్కడికక్కడే మృతి చెందగా, వెనక కూర్చున్న చిన్నారావు స్వల్ప గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఏలూరు త్రీ టౌన్ సీఐ వి. కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళి కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## భార్య మద్యం తాగవద్దన్నందుకు..

ఆత్మహత్య చేసుకున్న హానక్ మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన భర్త పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగపాలెం మండలం అయ్యప్పరాజ గూడెం గ్రామానికి చెందిన కొప్పాల హానక్ (25)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతను కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన హానక్ పనులకు వెళ్ళకుండా ఉండడంతో భార్య మంగళవారం ఉదయం మందలించింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. మనస్థాపానికి గురైన హానక్ పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ధర్మాజీగూడెం ఆసుపత్రికి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

---

జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో పట్టపగలు దొంగలు రెచ్చిపోతున్నారు. ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై వెళ్తున్నారంటే క్షణాల్లో బైక్‌పై వచ్చి వారి చేతిలో ఫోన్ తస్కరించి పరారవుతున్నారు. బైక్ నంబర్ గుర్తించడానికి ప్రయత్నిస్తే అసలు నంబర్లే ఉండడం లేదు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కేవలం సెల్‌ఫోన్ పోయిన పోర్టల్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సలహా ఇస్తున్నారే తప్ప పట్టపగలు రోడ్లుపైన ఫోన్లను బలవంతంగా తస్కరిస్తుంటే కేసులు నమోదు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

### నంబర్ లేని బైక్‌పై వస్తారు...

# సెల్ ఫోన్లు కొట్టేస్తారు..!

● కేసులు నమోదు చేయని పోలీసులు ● అదే నేరస్థులకు వరం!

నంబరు ప్లేట్‌లేని బైక్‌పై వచ్చిన సెల్ ఫోన్ దొంగలు

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో గతంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నంబర్ లేని వాహనాలను గుర్తించి వాటికి ఈ-చలానా విధించే వారు. అంతేకాక ఆ వాహనం ఇంజన్‌ను బట్టి నంబర్‌ను, సీ-బుక్‌లో ఉన్న నంబర్‌ను పరిశీలించి ఆ నంబర్ ప్లేటు బిగించిన తరువాతే మోటారు సైకిల్‌ను విడిచిపెట్టేవారు. ఒక వేళ సీ-బుక్కు లేదంటే ఖచ్చితంగా తీసుకురావాలని తెలిపి వాహనాన్ని తమ అధీనంలోకి తీసుకునే వారు. దీంతో దొంగ మోటారు సైకిళ్ళు పోలీసు లకు అనేకం చిక్కేవి. అయితే నేడు నగరంలో పోలీసుల వాహనాల తనిఖీ కొడవడింది. దీంతో నంబర్ లేని వాహనాలతో చక్కర్లు కొడుతున్నారు. ఇక ఈవ్ టీజింగ్‌కు కూడా పాల్పడుతున్నారు. ఎవరైనా ఆ వాహనాన్ని గుర్తించడానికి ప్రయత్నిద్దామన్నా నంబర్ లేకపోవడంతో ఏమీ చేయలేని దుస్థితి. ఒక న్యాయవాది మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద వెనుకగా మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు న్యాయవాది జేబులో ఉన్న ఫోనును తస్కరించి మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సలహా ఇచ్చారు. వాస్తవానికి దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఒక రిటైర్డ్ ఎంఈవో నాలుగు రోజుల క్రితం శాంతినగర్‌లో ఒక చర్చి వద్ద నిలబడి ఉండగా పట్టపగలు ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఒక యువకుడు ఆయన పక్కగా వచ్చి జేబులో ఉన్న ఫోన్‌ను తస్కరించి మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. ఇలాంటి ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేయకపోవడంతో ఆ నేరస్థులకు వరంగా మారింది. దీంతో నేరాలకు తెగబడుతున్నారు. నేరాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి తమ ఫోన్లు ఇప్పించాలంటూ బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నెంబర్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో భయాన్ని తొలగించాలి.

## అత్తింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టి. నర్సాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన వెల్లంపల్లి సుజాతకు వెంకటరమణతో 2012లో వివాహమైంది. వీరికి సంతానం లేదు. సుజాతను భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు సూటిపోటు మాటలతో శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. సీఐ ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెల్లపు ఊట ధ్వంసం.. సారా స్వాధీనం

కుక్కునూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కుక్కునూరు మండలంలో సారా స్థావరాలపై దాడులు చేసినట్టు కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం సీఐ తన సిబ్బందితో కలిసి కిన్నెరసానివాగు ఒడ్డున దాడులు చేసి 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారుల సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి సారా స్థావరాలపై దాడులు చేస్తామన్నారు.

మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం

నరసాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): నరసాపురం ప్రధాన పంట కాలువలో మంగళవారం గుర్తుతెలియని మహిళ (35) మృతదేహం కొట్టుకువచ్చింది. రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద కాలువలో తేలుతున్న ఈ మృతదేహన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాలువ నుంచి బయటకి తీయించి పోస్ట్‌మార్టం నిమి త్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ యాదగిరి తెలిపారు.

## పుణ్య క్షేత్రాలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు దోచేశారు..

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలు దర్శించేందుకు వెళ్లిన వారు తిరిగొచ్చేసరికి ఇల్లు దోచేశారు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణ ఎస్సై ఎం. నాగరాజు వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం సుబ్బారావు పేటకు చెందిన బల్ల లలిత కుటుంబంతో కలిసి తిరుపతి తదితర పుణ్యక్షేత్రాలు దర్శించుకు నేందుకు జూన్ 24న వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పరిశీలించగా 6 కాసుల బంగారు వస్తువులు, కేజీ వెండి చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు వివరించారు.

## జీవాలకు ఉచితంగా నట్టల నివారణ వ్యాక్సిన్‌లు

దెందులూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాడి పశులు, గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ వ్యాక్సిన్‌లను అందిస్తుందని దెందులూరు పశుసంవర్థక శాఖ ఏడీఏ దుర్గ జ్యోతి అన్నారు. మంగళవారం దెందులూరు, పెదవేగి మండలాల్లో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని దుర్గజ్యోతి పరిశీలించారు. అనంతరం కొవ్వలిలోని మండల పశువైద్యశాఖ అధికారి డాక్టర్ హరికృష్ణతో కలిసి మాట్లాడుతూ దెందులూరు మండలంలో నట్టల నివారణకు ఉచితంగా మందును వేస్తున్నామని ఇప్పటి వరకు 17 వేల జీవాలకు వ్యాక్సిన్లు వేశామన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పోస్టల్ కాలనీలోని నాగదేవత కాలనీలోని శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జంట నాగుల విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపి కోడిగుడ్లు వేసి ఆరాధించారు. భక్తులు స్వామివారికి ఎర్రటి పుష్పాలు, ఎర్రటి దండలు, ఎర్రటి పండ్లు సమర్పించారు. తొలుత అమ్మవార్లకు, స్వామివారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం విశేష అలంకరణ జరిపి ప్రత్యేక హారతులిచ్చి నివేదనలు సమర్పించి భక్తులకు దర్శనమిచ్చారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చింతలపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు కోరారు. మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులకు అవగాహన కల్పించారు. క్రిమినల్, సివిల్, బ్యాంకు రికవరీ, చెక్‌బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరి, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రాసంరీ నోటు కేసులు పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం కోర్టు ఆవరణలో ప్రతీరోజూ ఫ్రీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల సొమ్ము, సమయం ఆదా అవుతుందన్నారు.

## బెల్టుషాపులు తొలగించాలని మహిళల ఆందోళన

టి.నర్సాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులు తొలగించాలని సీపీఎం నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. టి.నర్సాపురం పంచాయతీలోని ప్రకాశ్‌నగర్‌లో విచ్చలవిడిగా పెరిగిపోయిన బెల్టుషాపులు తొలగించాలని మంగళవారం పలువురు మహిళలు ఆందోళన నిర్వహించారు. ఇష్టానుసారంగా బెల్టుషాపులు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మండలంలో బెల్టుషాపులు తొలగించాలని బెల్టుషాపులు పెట్టిస్తున్న ప్రధాన బ్రాందీ షాపు యాజమానులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## నేటి నుంచి సూపర్-50 సెక్షన్లు ప్రారంభం

బుట్టాయగూడెం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలో టెన్త్ విద్యార్థుల కోసం చేపట్టిన సూపర్ 50 సెక్షన్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొమ్మిదో తరగతిలో అధిక మార్కులు సాధించిన బాలబాలికలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి సెక్షన్‌కు 50 మంది చొప్పున బాలబాలికలను ఎంపికచేసి ఈ ఏడాది నుంచి మోడల్‌గా సూపర్ 50 సెక్షన్లును ఏర్పాటు చేసినట్టు ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని నూతిరామన్నపాలెం, కామయ్యకుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలబాలికల పాఠశాలల్లో సెక్షన్లను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఐటీడీఏ పీఎంఆర్‌సీ అధికారులు ప్రసన్నకుమార్, శిరమయ్య, శ్రీనివాసరావు, రాజేశ్వరిలు సెక్షన్లను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక సెక్షన్లను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

## ఆసక్తి, సామర్థ్యాన్ని బట్టి ఇంజనీరింగ్ కోర్సులు తీసుకోవాలి

ఏలూరు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంజనీరింగ్‌లో సరైన బ్రాంచ్‌ను ఎంపికచేసుకోవాల్సిన అవసరం ఉందని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మర్లపల్లి కృష్ణ సూచించారు. మంగళవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కోర్సుల ఎంపికపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మారుతున్న అవసరాలు, పరిశ్రమల అభివృద్ధి దశలు, కొత్త ఉద్యోగావకాశాలు, తదితర అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం సీఎస్ఈ ఒక్కటే భవిష్యత్ అనుకోవడం పొరపాటన్నారు. ప్రతీ బ్రాంచ్‌కు తనదైన ప్రాధాన్యత, మార్కెట్‌లో మంచి ఉపాధి అవకాశాలుంటాయన్నారు. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా బ్రాంచ్‌ను ఎంపికచేసుకుని, సబ్జెక్టుపై మంచిపట్టు సాధించి, అవసరమైన టెక్నికల్ స్కిల్స్, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్లు పూర్తిచేస్తే ఎలాంటి రంగంలోనైనా విజయాన్ని సాధించగలుగుతారన్నారు.

## సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఎంపీ పుట్టా

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

ప్రజా సమస్యలు వింటున్న ఎంపీ పుట్టా

ప్రజా సమస్యల పరిష్కారానికి మంగళవారం ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే వారి అర్జీలు పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా ఎంపీ అధికారులకు స్పష్టం చేశారు. నియోజకవర్గ నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున అర్జీలతో తరలి రాగా వారి సమస్యలన్నింటిని సావధానంగా ఆలకించి, అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించే ప్రయత్నం చేశారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగంలో కూడా నియోజకవర్గ ప్రజలంతా తమ అర్జీలను అందజేయవచ్చని సూచించారు.

## పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు

ధాత్రినాగలక్ష్మి

చింతలపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన పీజీ సెట్ పరీక్షల్లో కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్స్, కెమికల్ సైన్స్ విభాగాల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కళాశాలకు చెందిన బి.ధాత్రినాగలక్ష్మి కంప్యూటర్ సైన్స్‌లో 143వ ర్యాంకు సాధిం చిందని తెలిపారు. వివిధ భాగాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన మిగిలిన విద్యార్థులను వీరు అభినందించారు.

## వడ్డెర సొసైటీలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ద్వారకాతిరుమలలో బాల్ క్లే, కొయ్యలగూడెం, చింతలపూడి, చాట్రాయి మండలాల్లో రోడ్డు మెటల్, భీమడోలు, ఉంగుటూరు, టి.నర్సాపురం, చాట్రాయి, ముసునూరుల్లో గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. ఆగిరిపల్లి, నూజివీడుల్లో మెటల్, బిల్డింగ్ స్టోన్ క్వారీలున్నాయి. ఓవరాల్‌గా 18 క్వారీలు న్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటి ద్వారా ఏటా రూ.100 కోట్లపైబడి ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ఇదిలా ఉండగా మైనింగ్ పాలసీ ప్రకారం కొత్తగా లీజులకు ఇవ్వడానికి అవకాశం ఉన్న వాటిపై అన్వేషణ సాగుతోంది. ఉమ్మడి పశ్చిమలో ఉన్నప్పుడు కంకర, మెటల్ స్టోన్స్ దేవరపల్లి, పంగిడి, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉండేవి. ఇప్పుడవి లేకపోవడంతో ఏలూరు జిల్లాలోనే ఆగిరిపల్లి, నూజివీడు, మెట్ట ప్రాంతంలో లింగపాలెం, ద్వారకాతిరుమల ప్రాంతాల్లో లీజులకు ఇచ్చే ప్రాంతాలను పరిశోధించనున్నట్టు సమాచారం.

**యంత్రాల్లేనప్పుడు.. వారే కీలకం :** వడ్డెర, ఉప్పర, సగర సామాజిక వర్గాలు యంత్రాలు లేనప్పుడు రెక్కలు ముక్కలు చేసుకుని సమ్మెట, పలుగు, పారలతో మెటల్స్ పిండి చేసి జీవనం సాగించేవారు. ఈ వర్గాలకు యంత్రాల రాకతో ఉపాధి సన్నగిల్లుతోంది. రోజువారీ కూలి దక్కడం లేదు. మరోవైపు ఉపాధిహామీతో మట్టి పనులు కూడా కరువవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వారికి మైనింగ్ లీజుల్లో అవకాశాలను ప్రభుత్వం కల్పించడంతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## సుపరిపాలనలో తొలి అడుగు!

(5వ పేజీ తరువాయి)

అన్నదాత సుఖీభవ కింద రైతులకు అండగా నిలవడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు అడుగులు వేస్తున్నారు. మంత్రి పార్థసారథి, సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, రోషన్ కుమార్, పార్టీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తొలి అడుగుకి తమ,తమ నియోజకవర్గాల్లో సిద్ధం అయ్యారు.

**అంతా పాల్గొనాల్సిందే : గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

సుపరిపాలన తొలి అడుగు పేరిట బుధవారం నుంచి పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యకర్తలు, నేతలు, వివిధ హోదాల్లో ఉన్నవారంతా గడపగడపకూ వెళ్లాల్సిందే. ఏడాది పాటు సాధించిన సంక్షేమ విజయాలను వివరించాలి. ఒకటికి రెండుసార్లు అర్థమయ్యే రీతిలో క్షేత్రస్థాయిలో స్థానికులకు వివరించాలి. సీఎం చంద్రబాబుతో సహా కూటమి నేతలు ప్రజా సంక్షేమం కోసం ఎలా అహర్నిశలు కష్టపడిందీ అర్థమయ్యేలా చెప్పాలి. ఇదేతరుణంలో గత ఐదేళ్లపాటు వైసీపీ దుర్మార్గాన్ని మరోసారి గుర్తుచేయాలి.

**75 శాతం హామీలు నెరవేర్చాం : మంత్రి సారథి**

నూజివీడు,జూలై 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభంకానుందని, టీడీపీ శ్రేణులు ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, ప్రజలకు వివరించాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం నియోజవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో జరిగిన విధ్వంస పాలన నుంచి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్తోందన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం 75 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. కూటమి మిత్రులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

# పల్లె పండుగ బిల్లులేవి?

- గ్రామాల్లో పెద్ద ఎత్తున రోడ్ల పనులు
- రూ.3 కోట్లకు రూ.56 లక్షలే చెల్లింపు
- మిగిలిన మొత్తానికి నాలుగు నెలలుగా ఎదురుచూపు

ఏలూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇప్పటి వరకు జమ కాలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్లు బిల్లుల కోసం వేచి చూస్తున్నారు. అభివృద్ధి పనులు చేపట్టండి, బిల్లులు చేయించే బాధ్యత తాము తీసుకుంటామని జిల్లా అధికారులు,మండల స్థాయి అధికారులకు లక్ష్యాలను విధించారు. దీంతో మండల స్థాయి అధికారులు టీడీపీ నాయకుల వెంటపడి పనులు చేయించారు. పనులు చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా కొంత మందికి బిల్లులు నేటికి చెల్లించలేదు. బిల్లుల కోసం అధికారులను అడిగితే వారు సమాధానాన్ని దాట వేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో పల్లెపండుగ పనుల్లో భాగంగా ఉపాధి హామీ పథకం కింద 10 గోకులాలు, 4 పశువులకు అవసరమైన నీటి తొట్టెల నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం పనులకు రూ.3 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే మొదటి విడతలో 56 లక్షలు విడుదలయ్యాయి. అయినా ఇప్పటి వరకు కాంట్రాక్టర్లుకు జమ కాలేదు. నాలుగు నెలలు కావస్తున్నా రూ.3 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామాల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. మొదటి విడతలో పనులకు బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు చేయలేమని చేతులెత్తేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాట్యాక అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి.గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టారు. ఎంత స్పీడుగా రోడ్లు నిర్మాణ పనులు మొదలయ్యాయో అదే స్థాయిలో కాంట్రాక్టర్లు వాటిని పూర్తి చేశారు. మొదట్లో బిల్లులు కూడా అదేరీతిలో కాంట్రాక్టర్లు ఖాతాలోకి జమయ్యాయి. దీంతో కాంట్రాక్టర్లు మరిన్ని పనులు చేశారు. వాటి బిల్లులు మాత్రం అందలేదు. జనవరి నుంచి ఇప్పటి వరకు రూపాయి కూడా కాంట్రాక్టర్ల ఖాతాలో జమ కాలేదు. దీంతో వారు డీలా పడిపోయారు. కొంత మంది వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పనులు చేశారు. ఇప్పుడు వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అప్పులకు వడ్డీలు కట్టలేక అల్లాడిపోతున్నారు. ఏలూరు రూరల్ మండలంలో చాటపర్రు,మాదేపల్లి, మల్కాపురం, కోమటిలంక, గుడివాకలంక, కేడీ పురం, ప్రత్తికోళ్ళలంక గ్రామాల్లో సీసీ, మెటల్ రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. సుమారు 3 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే మండలంలో 10 గోకులం షెడ్లు ఉపాధి హామీ నిధులతో నిర్మించారు.వీటితో పాటు చాటపర్రు, మాదేపల్లి, కాట్లంపూడి, పైడి చింతలపాడు గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. గోకులం షెడ్లకు 25 లక్షలు, నీటి తొట్లకు 5 లక్షల నిధులు మంజూరు కావలసి ఉంది. చేసిన పనులకు నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

చాటపర్రులో వేసిన సీసీ రోడ్డు.. మాదేపల్లిలో నిర్మించిన నీటి తొట్టె.. కాట్లంపూడిలో గోకులం షెడ్డు

వైద్యులను సత్కరిస్తున్న లయన్స్ నాయకులు అమరశ్రీ

ద్వారకాతిరుమలలో వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

టి.నర్సాపురంలో వైద్యురాలిని సన్మానిస్తున్న దృశ్యం

# ఘనంగా డాక్టర్స్ డే

ఏలూరు క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జన్యు, రక్త సంబంధిత వ్యాధులపై వైద్యుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు రెడ్ క్రాస్ ఛైర్మన్, హిమోఫిలియా చాప్టర్ విజయవాడ కార్యదర్శి డాక్టర్ ఎంబీఎస్‌వి ప్రసాద్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో హిమోఫిలియా, సికిల్‌సెల్ వ్యాధులపై వైద్య విద్య అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఛైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ వైద్యులు ఈ వ్యాధులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకుని వ్యాధిగ్రస్థులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని సూచించారు. విజయవాడ రెయిన్‌బో హాస్పటల్ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ అక్కినేని వీణ, తలసీమియా, సికిల్‌సెల్, ఎనీమియాపై పలు అంశాలను వివరించారు. మమతా హాస్పటల్ చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శశిధర్, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణ రాజు, కార్యదర్శి బి.బెన్నీ పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే, చార్టర్డ్ అకౌంట్ డే ఘనంగా జరిపారు. లయన్స్ క్లబ్ భవనంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన పట్టణంలోని 21 మంది డాక్టర్లకు, ఒక చార్టర్డ్ అకౌంటెంట్‌కు శాలువాలు కప్పి మెమెంటోలు అందచేసి ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అడపా శ్రీనివాసరావు, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి రాజగోపాల్, కె.వి.సత్యనారాయణ, పవన్‌కుమార్, సి.హెచ్. అబ్బయ్య, సుధాకర్, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

● మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా ఏరియా ఆసుపత్రి వైద్యులను మానవత సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సభ్యులు కె.నాగచిన్నారావు, డాక్టర్ ఎ.సత్యనారాయణ, రాజారావు, విశ్వేశ్వరరావు, దేవ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: డాక్టర్స్‌డే సందర్భంగా మంగళవారం అమరశ్రీ ఇందిరాదేవి దంపతులు ఏలూరులో ప్రముఖ జనరల్ సర్జన్లు ఎం.ఎల్.వి.ప్రసాద్, డాక్టర్ ఎం శార్వాణి, ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎ.ప్రసన్నకుమార్, ప్రముఖ జనరల్ మెడిసిన్ వైద్యులు స్వరూపరెడ్డి, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు పి.విజయభాస్కరరెడ్డి, ప్రముఖ యురాలజిస్ట్ భరద్వాజలను ఘనంగా సన్మానించారు. సీనియర్ జర్నలిస్టు, జిల్లా లయన్స్ నాయకులు అమరశ్రీ మాట్లాడుతూ వైద్యులు డాక్టర్ రాయ్‌ను ఆదర్శంగా తీసుకుని వైద్య సేవలందించాలని కోరారు.

● ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే, చార్టర్డ్ అకౌంట్స్ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బొల్లా సత్యనారాయణ, సెక్రటరీ దుష్యంత్‌చౌదరి, కోశాధికారి కూరపాటి సత్యనారాయణల ఆధ్వర్యంలో జరిగింది. డాక్టర్ శానం విజయమోహనరావు ప్రోగ్రామ్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఏలూరు నగరంలో వివిధ విభాగాలల్లో పేరెన్నికగన్న వైద్యుల స్వరూప్‌రెడ్డి, డాక్టర్ శ్రీహర్ష, సింధూజ దంపతులు, ఎన్.రమ్య, బొప్పన దశరథ్, చార్టర్డ్ అకౌంట్ గురజాడ శ్రీకాంత్‌లను ఘనంగా సత్కరించారు.

● జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు శేష కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్యులను, సాయి స్ఫూర్తి ఆసుపత్రి, తదితర ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన సుమారు 50 మంది వైద్యులను సన్మానించారు. సాయి స్ఫూర్తి ఆసుపత్రి ఇన్‌చార్జి వాసిరెడ్డి శ్రీనివాస్, లైన్స్‌క్లబ్ రీజనల్ ఛైర్ పర్సన్ రత్నకుమారి,కార్యదర్శి కొప్పుల రవిచంద్ర, కోశాధికారి కాకర్ల వీరభద్రరావు, కన్నం హనుమంతరావు, కొండపల్లి పండు, మద్దిపాటి నాగేశ్వరరావు, అట్లూరి సురేష్, పంతగాని వెంకన్న, రాజాన పండు, నంగులూరి జగత్, బవిరిశెట్టి మురళీ తదితరులు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: దైవస్వరూపులు వైద్యులని టి.నర్సాపురం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు పెద్దిన ప్రసాద్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటర్నేషనల్ డాక్టర్స్‌డేని పురస్కరించుకుని డాక్టర్ కల్పనారాణిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించి డాక్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. టి.నర్సాపురం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి వంశీ, గంటా సత్యనారాయణ, ముళ్లపూడి సుబ్బారావు, బాలస్వామి, ఆచంట హరీశ్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్ కుమార్, మండల పశువైద్యాధికారి అంగర సురేశ్‌లను లయన్స్ క్లబ్, మానవతా సంస్థల తరపున ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ నూతన మండలాధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజనాన్ని అందించారు. తహసీల్దారు జె.వి. సుబ్బారావు, లయన్స్ మానవత సభ్యులు మొగతడకల శ్రీనివాసరావు, తూంపాటి పద్మ వరప్రసాద్, తాతినేని ప్రసాద్, దేవరపల్లి రాయుడుబాబు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగును విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నాయకులకు ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమిలో పార్టీలను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు పర్యటించాలన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం విజయాలను వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభి స్తుందన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లా డుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిశీలకులు మీరావలి, ఉన్నమట్ల సునీత, మాలల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి పాల్గొన్నారు.

## ఏలూరు నగరంలో శక్తి టీమ్ గస్తీ

ఏలూరు క్రైం, జులై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి టీమ్ బృందాలు విస్తృతంగా గస్తీ నిర్వహిస్తున్నాయి. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశా మేరకు ఏలూరు మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు పర్యవేక్షణలో మహిళా ఎస్ఐ వి. కాంతిప్రియ ఆధ్వర్యంలో శక్తిటీమ్ ఏలూరు నగరంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక గస్తీని నిర్వహించారు. కాలేజీ, స్కూల్స్‌ను విడిచిపెట్టిన సమయంలో వారు ఆ ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులకు ఆత్మస్థైర్యం కల్పించారు.

## కార్మికుల హక్కులను పరిరక్షించాలి

ఏలూరుకార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిరక్షించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కోటదిబ్బ వద్ద గల సర్వీస్ రిజర్వాయర్ వద్ద ది జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం కార్మికుల పట్ల అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు ఎ.అప్పలరాజు, రెడ్డి శ్రీనివాసడాంగే, ఎస్.ఎం. వి.సుబ్బారావు, బి.దుర్గారావు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

ఏలూరుటూటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక యజ్ఞంల నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 20వ డివిజన్‌లో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ అప్పలనాయుడుతో కలిసి ఎమ్మెల్యే చంటి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామునే పింఛన్లు ఇంటింటికి వెళ్లి స్వయంగా అందజేస్తున్నామన్నారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

● పెదవేగి : వికసిత గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పినకడిమిలో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.. ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. దెందులూరు ఏఎంసీ ఛైర్‌పర్సన్ గారపాటి రామసీత, గ్రామ మాజీ సర్పంచ్ పామర్తి గంగరాజు, టీడీపీ పెదవేగి మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్న చింతమనేని

● కామవరపుకోట: మాజీ ఎమ్మెల్యేఘంటా మురళీరామకృష్ణ మంగళవారం అనుచర బృందంతో యానాదికాలనీ, తదితర ప్రాంతాల్లో పాదయాత్ర జరిపి ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ మరోపక్క ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 200 రూపాయలు ఉన్న పెన్షన్‌ను నాలుగు వేల రూపాయలకు పెంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.టీడీపీ నాయకులు వజీర్‌ఖాన్, ఘంటా గోపీ, రెబ్బా పరాత్పరరావు, చింతపల్లి భాస్కరరావు, సాయిన శ్రీకాంత్, కటికల నాగరాజు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## ఏజీపీ డీవో సుబ్రహ్మణ్యంకు సత్కారం

పెదపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, అదే వారికి గుర్తింపును ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నాయుడుగూడెం (ఏజీపీ) శాఖ రీజనల్ మేనేజరు శ్రీదేవి పేర్కొన్నారు. ఏజీపీ డెవలప్‌మెంట్ అధికారి కట్నేని సుబ్రహ్మణ్యం పదవీ విరమణ సత్కారసభ నాయుడుగూడెం బ్యాంకు మేనేజరు వి.ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏజీపీ ఆర్.ఎం. శ్రీదేవి మాట్లాడుతూ 34 ఏళ్ల విధి నిర్వహణలో సుబ్రహ్మణ్యం బ్యాంకు అభివృద్ధికి తన వంతు కృషి చేశారన్నారు. బ్యాంకు యూనియన్ ప్రెసిడెంట్ వెంకట్ మాట్లాడుతూ ప్రతిఉద్యోగి ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. పెదవేగి మేనేజరు శ్రీను, ఆర్.అవినాష్, నాగేంద్ర, ఆనంద్ పాల్గొన్నారు.

నాగమోహనరావును సత్కరిస్తున్న అధికారులు

## జాయింట్ రిజిస్ట్రార్‌కు సత్కారం

ఏలూరుకార్పొరేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక డీసీఎంఎస్ సమావేశ మందిరంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగ విరమణ చేసిన కీర్తి నాగ మోహన్‌రావును ఘనంగా సత్కరించారు. ఉద్యోగులతో పాటు అభిమానులు పాల్గొన్నారు. టి.వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రత్నాజీ

ద్వారకాతిరుమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): దొరసానిపాడు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మరోసారి మద్దిపాటి రత్నాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పరిధిలో పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దుతానని మద్దిపాటి రత్నాజీ తెలిపారు. తనపై నమ్మకంతో గ్రామాధ్యక్షుడిగా మరోసారి అవకాశమిచ్చిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు, పార్టీ మండలాధ్యక్షుడు లంకా సత్తిపండుక కృతజ్ఞతలు తెలిపారు.

## అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద దాతల సహకారంతో మంగళవారం అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. కొయ్యూరుకు చెందిన దాత మూల్పూరి ధనకోటేశ్వరరావు ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 200 మంది భక్తులు అన్నదానం స్వీకరించారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కౌలు కార్డులు పొందాలి

చింతలపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి) : కౌలు చేపట్టే రైతులు కౌలుకార్డు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని యర్రంపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌలు చేసే రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. కార్డులున్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ సం క్షేమ రాయితీ పొందవచ్చన్నారు. నమోదు చేసుకునేలా కూడా వివరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఉద్యానవన శాఖాధికారిణి పర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## మాధవ్ నియామకం పట్ల హర్షం

జీలుగుమిల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పి.వి.ఎన్.మాధవ్ నియామకం పట్ల జీలుగుమిల్లి మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్‌లో రాష్ట్రంలో బీజేపీ మరింత అభివృద్ధి దిశలో పయనిస్తుందన్నారు. ఆయనకు అభినందనలు తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షులు గుడ్ల రాము, నాయకులు కొండపల్లి ప్రసాద్, కక్కిరాల మురళి, రేపాక గోపాలరావు ఉన్నారు.

## జగన్ పాలనపై విమర్శల దాడి

ఏలూరుటూటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మహేశ్‌యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ ఈ కౌన్సెలింగ్ నిర్వహణపై మాట్లాడటం జగన్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఫెడరేషన్ జిల్లా అధికార ప్రతినిధి కె.మణికంఠ, కిల్లారిశెట్టి సంధ్యా, ఎం.స్వామి, ఎం.శ్రీకాంత్, సతీశ్, అభినయ్, శ్రీకర్ పాల్గొన్నారు.

## మహిళా, శిశు సంక్షేమమే లక్ష్యం

పెదవేగి, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం మరింతగా కృషి చేస్తోందని మహిళా శిశు సంక్షేమశాఖ పెదపాడు సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ పెదవేగి సెక్టార్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తుందని, లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సి.హెచ్.పార్వతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారం సరికాదు

కుక్కునూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తప్పుడు ప్రచారం సరికాదని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్ అన్నారు. మంగళవారం కుక్కునూరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యేపై తప్పుడు వార్తలు రాసిన విలేకరిని అరెస్టు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.జనసేన నాయకులు మంత్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు తూము వెంకన్న, టీడీపీ నాయకులు హరిబాబు, ఎం.నరేశ్, నరేంద్రరాజు పాల్గొన్నారు.

## సెయింట్ థెరిస్సా ఇంటర్ క్యాంపస్ విద్యార్థి సంఘ ఎన్నిక

ఏలూరు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఇంటర్ క్యాంపస్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి విద్యార్థి సంఘ ఎన్నికలు మంగళవారం జరిగాయి. బ్యాలెట్ పద్ధతిన నిర్వహించిన పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్లలెక్కింపు చేపట్టి ఎన్నికైన విజేతల వివరాలను వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్ ప్రకటించారు. విద్యార్థినుల సంఘ ప్రెసిడెంట్‌గా ఎం.దుర్గాశ్రావణి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.సమీర, సెక్రటరీగా ఎం.విన్నీ, జాయింట్ సెక్రటరీగా షేక్ రిజ్వానా, ట్రెజరర్‌గా పి.పూజ, డిసిప్లిన్ లీడర్‌గా పి.జాస్మిన్ ఎన్నికయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజేతలు అందరినీ సమన్వయపర్చుకుని పనిచేయాలని సూచించారు. ఎన్నికైనవారిని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, అధ్యాపకబృందం అభినందించారు. ఎన్నికల నిర్వహణను పి.వరప్రసాద్, ఐ.ఆండాళ్లు, దాసరి శారద పర్యవేక్షించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలి

చాట్రాయి, జూలై 1(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం కారణంగా ఈగలు, దోమలు ప్రబలే ప్రమాదం ఉన్నందున అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి సూచించారు. మండలంలోని సోమవరం, పోలవరం గ్రామాల్లో 5 అంగన్వాడీ కేంద్రాలను సీడీపీవో తనిఖీ చేశారు. అన్ని కేంద్రాలలో పోషణ వాటికలను అమలు చెయ్యాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, చిన్నారులకు మెనూ ప్రకారం రుచి పరిశుభ్రమైన ఆహారం అందించాలని అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు.



## ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం మూల్లంక, పెదలంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వర్షాల కారణంగా చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి చేపలు, రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని, చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతూ ఉండాలన్నారు. విద్యుత్ నిలిచి పోతే ప్రత్యామ్నాయంగా అద్దె జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆక్సిజన్ మాత్రలను నిల్వ ఉంచుకోవాలన్నారు.

చీపురుగూడెం పాల సహకార సంఘం వద్ద రైతుల ధర్నా

## పాల సహకార సంఘం లెక్కలు చెప్పాలని ధర్నా

చాట్రాయి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుగూడెం పాల సహకార సంఘానికి సంబంధించిన 22 సంవత్సరాల లెక్కలు చెప్పాలని కోరుతూ మంగళవారం సంఘం వద్ద పాడి రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్‌కి అనుబంధంగా ఉన్న ఈ సంఘంలో అవకతవకలు జరిగాయని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తమ్మిశెట్టి లక్ష్మణరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

**ఆరోపణలు అవాస్తవం**

పాల సహకార సంఘంలో అవినీతి జరిగినట్లు చేసిన ఆరోపణలు అవాస్తవమని సంఘం అధ్యక్షుడు బొట్టు రామచంద్రరావు అన్నారు. సంఘాధ్యక్షుడికి, కృష్ణామిల్క్ యూనియన్ క్లస్టర్ మేనేజర్‌కి జాయింట్ బ్యాంకు అకౌంట్ ఉంటుందని, ఒక్క రూపాయి అవినీతి జరగటానికి కూడా ఆస్కారమే ఉండదన్నారు. ప్రతి ఏటా ఆడిట్ పూర్తి అయిన తరువాత సంఘం వద్ద ఉన్న మిగులు నిధులలో 70 శాతం రైతులకు బోనస్‌గా పంపిణీ చేస్తున్నామని రామచంద్రరావు వివరించారు.

## దివ్యాంగులకు మంత్రి సారథి చేయూత

ముసునూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిరెడ్డిగూడెంకు చెందిన దివ్యాంగుడు కర్రి నాగరాజుకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో వీల్ బ్యాటరీ

మోటార్ సైకిల్ సమకూరింది. మంత్రి సుమారు రూ. 50 వేలతో సమకూర్చిన మోటారు సైకిల్‌ను గ్రామ టీడీపీ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్, సర్పంచ్ భర్త పులిబళ్ళ సత్యనారాయణ మంగళవారం నాగరాజుకు అందజేశారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న తనకు వీల్ మోటారు సైకిల్‌ను ఇచ్చిన మంత్రి పార్థసారథికి నాగరాజు కృతజ్ఞతలు తెలిపాడు.

**చాట్రాయి:** మండలంలోని కృష్ణారావుపాలెంకు చెందిన 5వ తరగతి దివ్యాంగ విద్యార్థి పూట్ల ఇమేష్‌కి మంగళవారం నూజివీడులో గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు.

ధరఖాస్తు చేసిన వారంలోనే బ్యాటరీ ట్రైసైకిల్ అందజేసిన మంత్రి సారథికి విద్యార్థి తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు కృజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిమటబోన పుల్లారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు నమ్మికంటి నారాయణ, నాయకులు లక్ష్మణరావు, కేశవులు, ప్రసాద్, మాధవరావు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు అభినందనీయం

కైకలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పేదలకు చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఇలాంటి సేవలు నిరంతరం అందజేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ గురజాడ ఆనంద్‌కుమార్, రామకృష్ణ విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు తుపాకుల సోమాచారి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆషాఢ సారె సమర్పణ

కైకలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న రామలింగేశ్వరస్వామికి మహిళలు పెద్దఎత్తున

సారె సమర్పించిన గోష్టి మహిళలు

ఆషాఢ సారెను అంద జేశారు. మంగళవారం శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అధికారులు స్వాగతం పలకగా అర్చకులు భీమకిషోర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పిండివంటలు, పండ్లు, స్వీట్లు స్వామివారికి సమర్పించారు. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

## 9న సమ్మె విజయవంతం చేయాలి

కలిదిండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి

జక్కుల మహేష్ అన్నారు. మంగళవారం కలిదిండిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో జరుగుతున్న ఈ సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషు మహంకాళిరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అక్బర్, బాలాజీ, రాజేష్, సూరిబాబు, రమేష్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

గుడిపాడులో పెన్షన్ అందజేస్తున్న గ్రామ టీడీపీ అధ్యక్షుడు ధర్మరాజు తదితరులు

చనుబండలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న తెలుగు యువత నాయకుడు నాగరాజు

కైకలూరులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

# పెన్షన్లు పెంచిన ఘనత కూటమిదే

### లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేత

చాట్రాయి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లు రూ 4 వేలకు, దివ్యాంగుల పెన్షన్లు రూ 6 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండలో మంగళవారం సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరసా శ్రీను, నక్కా శ్రీను, గుడిమళ్ళ బ్రహ్మయ్య, ఫిరంగి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**ముసునూరు:** నెలలో మొదటి రోజే వృద్ధుల ఇళ్లకు వెళ్ళి పెన్షన్ అందించి, వారి కళ్ళల్లో సంతోషాన్ని నింపేలా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని గుళ్ళపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు మందలపు ధర్మరాజు అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి పెన్షన్ నగదును అందజేశారు. అలాగే వివిధ గ్రామాల్లో టీడీపీ నాయకులు పెన్షన్ల పంపిణీ లో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఎంపీ డీవో సత్యనారాయణ క్షేత్రస్థాయిలో పెన్షన్ల పంపిణీని పరిశీలించారు. మండల వ్యాప్తంగా 7741 మంది లబ్ధిదారులకు గాను 7231 మందికి పెన్షన్‌లను అందజేశామని, 93.41 శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, వెలుగు వీవోఏలు పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ మంగళవారం ముదినేపల్లి మండలంలో 95 శాతం పూర్తయింది. మండలంలో 8689 మందికి రూ. 3.26 కోట్లు పెన్షన్‌ను పంపిణీ చేయాల్సి ఉండగా తొలిరోజు 8300 మందికి రూ. 3.05 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వై రామకృష్ణ తెలిపారు. పలు గ్రామాల్లో కూటమి నాయకులు పెన్షన్లు అందజేశారు. అల్లూరులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పెన్షన్లను పంపిణీ చేశారు.

**కైకలూరు:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఆయా పంచాయతీల్లో సిబ్బంది ఆధ్వర్యంలో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు పెన్షన్లు అందజేశారు. కైకలూరు 122వ బూత్‌లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందజేశారు. బూత్ కన్వీనర్ బంకపల్లి భాస్కరరావు, ఎస్సీ సెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, మాజీ సర్పంచ్ తెంటు నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో రెండో రోజు కొనసాగిన ప్రవేశాలు

నూజివీడు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండో రోజు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగింది. రెండవ రోజు 555 మందికి కాల్ లెటర్లు పంపించగా 444 మంది రిపోర్ట్ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు శాక్ బిల్డింగ్‌లో మొత్తం 25 కౌంటర్లను ఏర్పాటు చేశారు. వర్షం పడుతున్నా విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**రెండో రోజు 434 మందికి ప్రవేశాలు**

ప్రధాన అడ్మిషన్ల ప్రక్రియలో సోమ, మంగళ వారాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌తో పాటు ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లోను అడ్మిషన్లు నిర్వహించారు. రెండో రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొత్తం 434 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా బాలురు 134 మంది, బాలికలు 300మంది అడ్మిషన్లు పొందారు.

**నేటి నుంచి శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్లు**

జూలై 2, 3 తేదీల్లో నూజివీడులోని ఎస్ఏసీ ఆడిటోరియంలో శ్రీకాకుళం క్యాంపస్ ప్రవేశాలకు కౌన్సిల్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్ర కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## మహాజన సభలు నిర్వహించండి

నూజివీడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారశాఖను ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు ముగుస్తున్న

సందర్భంగా సహకార సంఘాల పరిధిలో మహాజన పాలకవర్గ సమావేశాలను నిర్వహించాలని నూజివీడు డిప్యూటీ రిజిస్ట్రార్ రవికుమార్ సూచించారు. మంగళవారం ఆయన పలు పీఏసీఎస్‌ల కార్యదర్శులు, సహకార సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆడిట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహాజన సభ నిర్వహణ తదితర అంశాలను వివరించారు. అనంతరం నూజివీడు పీఏసీఎస్ ప్రాంగణంలో మొక్క నాటారు.

# 19 మందితో.. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ

### మంత్రి పార్థసారథి

నూజివీడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి 19 మందితో నియోజకవర్గ అభివృద్ధి కమిటీని త్వర లో ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి పార్థసారథి తెలిపారు. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ కమిటీ నియోజకవర్గం సమస్యలను తన దృష్టికి తీసుకువస్తుందన్నారు. అందరి సహకారంతో సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

**పలువురికి పరామర్శ**

**ఆగిరిపల్లి:** మండలంలోని చొప్పరమెట్ల గ్రామంలో పించన్ల పంపిణీకి విచ్చేసిన మంత్రి పార్థసారథి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బల్ల సూర్య కుమార్, రామినేని మురళిని వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎంపీడీవో భార్గవి, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కబోయిన వేణు, చిట్నేని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కె ఊర్మిళ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపెట్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాట్రాయి, జూలై 1(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు సిపెట్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని సిపెట్ విజయవాడ డైరెక్టర్ సిహెచ్ శేఖర్ కోరారు. టెన్త్ సప్లిమెంటరీలో పాస్ అయిన విద్యార్థులు కూడా అర్హులేనని అన్నారు. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా టెన్త్ విద్యార్థులకు 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ కోర్సులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉన్నదని, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉన్నదని అన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, మరిన్ని వివరాలకు డాక్టర్ పి. శివన్నారాయణ, 94942 59006లో సంప్రదించాలని కోరారు.

## నేడు టీడీపీ మండల కమిటీ ఎన్నిక

కలిదిండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కలిదిండి కల్యాణి ఫంక్షన్ హాలులో బుధవారం టీడీపీ మండల కమిటీ ఎన్నికపై సమావేశం నిర్వహిస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

## పర్వతాపురంలో టీడీపీ సంబరాలు

చాట్రాయి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతాపురం గ్రామ టీడీపీ అధ్యక్షురాలిగా బొర్రా నాగ మల్లీశ్వరి, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీగా బూబత్తుల చెన్నారావు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి-1గా ఎంపికైన ఉయ్యాల దిలీప్‌కుమార్‌లను అభినందిస్తూ మంగళవారం కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. మండల కమిటీలో తమ గ్రామానికి స్థానం కల్పించినందుకు మంత్రి పార్థసారథికి నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బొర్రా నాగేశ్వరరావు, కల్లేపల్లి ప్రభాకర్, రవి, మురళి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ధ్యాన శిక్షణ

కలిదిండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తాడినాడ జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పత్రీజీ శిష్యుడు మనోహర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు జీవీ రమణ, డాక్టర్ నాగరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యూపీ స్కూళ్ల స్థాయి తగ్గింపుపై అభిప్రాయ సేకరణ

### కలెక్టర్ ఆదేశాలతో కదిలిన విద్యాశాఖ

ముదినేపల్లి, జులై 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని యూపీ పాఠశాలల స్థాయి తగ్గింపుపై అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను గుర్తించిన కలెక్టర్ వెట్రిసెల్వి ఈ వ్యవహారంపై వివరాలు పంపాలని సోమవారం రాత్రి అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. డీగ్రేడ్ అయిన యూపీ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి తీర్మానాలు కూడా పంపాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశాలతో ఎంఈవో కె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించారు. తమ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు నిర్వహించాలని ఈ సమావేశాల్లో ఎస్ఎంసీలు, తల్లిదండ్రులు ఏకగ్రీవంగా తీర్మానించారు. యూపీ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేస్తే తమ పిల్లలను దూర ప్రాంతాల్లోని హైస్కూళ్లకు పంపలేమని కూడా తీర్మానాల్లో పేర్కొన్నారు. గతంలో తాము యూపీ పాఠశాలలను కొనసాగించాలని తీర్మానాలు

దాకరం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్చినా అధికారులు డీగ్రేడ్ ఎలా చేశారని కొన్ని పాఠశాలల సమావేశాల్లో తల్లిదండ్రులు ఎస్ఎంసీ సభ్యులు ప్రశ్నించారు. సమావేశాల తీర్మానాలను కలెక్టర్, డీఈఓలకు పంపినట్లు ఎంఈవో తెలిపారు. కాకరవాడ యూపీ స్కూల్‌ను కొనసాగించాలని జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్, గ్రామ మాజీ సర్పంచ్ మారగాని నాగేశ్వరరావు, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు అట్లూరి రామకృష్ణారావు కోరారు. ఆ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహణకు వచ్చిన ఎంఈవో నరేష్ కుమార్‌తో వారు మాట్లాడుతూ సింగరాయపాలెం, వడాలి హైస్కూళ్లకు వెళ్లటం ఈ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరమని తెలిపారు.

నూజివీడులో వైద్యులకు సన్మానం

ముదినేపల్లి పీహెచ్‌సీలో వైద్యురాలికి సత్కారం

కోరుకొల్లు పీహెచ్‌సీలో వేడుకలు

కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణీంద్ర

# ఘనంగా వైద్యుల దినోత్సవం

నూజివీడు టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ ఆధ్వర్యంలో నూజివీడులోని ప్రముఖ వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ అధ్యక్షుడు కోలాహలం రాజు మాట్లాడుతూ భగవంతుడు ప్రాణం పోస్తే ఆ ప్రాణాన్ని నిలిపే వాడు వైద్యుడు అని సాక్షాత్ భగవత్ స్వరూపంగా వైద్యులను భారతీయ సమాజం గర్తిస్తుందన్నారు. లయన్స్ క్లబ్ కోశాధికారి సంధ్య, సభ్యులు సాయి, చెన్నారావు, ఎ. వెంకటేశ్వరరావు, శేఖర్, రఫీ, ఎన్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శాంతిశ్రీని ముదినేపల్లి విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల విద్యా ర్థులు సత్కరించి మెమెంటో అందజేశారు. అనంతరం ముదినేపల్లిలోని ప్రైవేట్ వైద్యులు డాక్టర్ కె.వెంకట్రావు, మనోజ్, పవన్‌లను ఫార్మసీ కళాశాల విద్యార్థులు సత్కరించారు. కళాశాలలో నిర్వహించిన డాక్టర్స్ డే కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తనూజ పాల్గొని ఫార్మసీ రంగం వైద్యవృత్తికి వెన్నెముక అని పేర్కొన్నారు.

**కలిదిండి:** డాక్టర్స్ డే సందర్భంగా కోరుకొల్లు పీహెచ్‌సీలో వైద్యాధికారి ధీరజ్ కుమార్, సిబ్బంది కేక్ కట్ చేశారు. కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవికి సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, కలిదిండి, కోరుకొల్లు సర్పంచ్ ప్రసన్న లీలా కనకదుర్గ శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుధ్య పనులు నిర్వహించాలి

కైకలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్. ఫణీంద్ర అన్నారు. మంగళవారం కైకలూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం అయినందున గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించాలని లేకుంటే ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో.. తొలి అడుగు!

(5వ పేజీ తరువాయి)

అన్నదాత సుఖీభవ కింద రైతులకు అండగా నిలవడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు అడుగులు వేస్తున్నారు. మంత్రి పార్థసారథి, సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, రోషన్ కుమార్, పార్టీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తొలి అడుగుకి తమ,తమ నియోజకవర్గాల్లో సిద్ధం అయ్యారు.

**అందరూ పాల్గొనాల్సిందే: గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

సుపరిపాలన తొలి అడుగు పేరిట బుధవారం నుంచి పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యకర్తలు, నేతలు, వివిధ హోదాల్లో ఉన్నవారంతా గడపగడపకూ వెళ్లాల్సిందే. ఏడాది పాటు సాధించిన సంక్షేమ విజయాలను వివరించాలి. ఒకటికి రెండుసార్లు అర్థమయ్యే రీతిలో క్షేత్రస్థాయిలో స్థానికులకు వివరించాలి. సీఎం చంద్రబాబుతో సహా కూటమి నేతలు ప్రజా సంక్షేమం కోసం ఎలా అహర్నిశలు కష్టపడిందీ అర్థమయ్యేలా చెప్పాలి. ఇదేతరుణంలో గత ఐదేళ్లపాటు వైసీపీ దుర్మార్గాన్ని మరోసారి గుర్తుచేయాలి.

**75 శాతం హామీలు నెరవేర్చాం : మంత్రి సారథి**

**నూజివీడు:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభంకానుందని, టీడీపీ శ్రేణులు ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, ప్రజలకు వివరించాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం నియోజవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో జరిగిన విధ్వంస పాలన నుంచి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్తోందన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం 75 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. కూటమి మిత్రులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

## నూతన వరి వంగడాలు సాగు చేయండి : శాస్త్రవేత్త ఫణికుమార్

ముదినేపల్లి, జులై 1 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన వరి వంగడాల సాగుపై దృష్టి పెట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్త ఫణికుమార్ తెలిపారు. కొరగుంటపాలెం, పెదగొన్నూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం కొత్తగా విడుదల చేసిన 1224, 1262 రకం వరి విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ విత్తనాలు ముదినేపల్లి ప్రాంత భూములకు అనుకూలమైనవేనని అన్నారు. ఏడీఏ వెంకటమణి, ఏవో వేణుమాధవ్, రైతులకు నారుమళ్ళ దశ నుంచి నాట్లు వేసే వరకు పాటించాల్సిన యాజమాన్య విధానాలను వివరించారు. రైతులకు కొత్త వరి విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ పేరే రామకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## వడ్డెర సొసైటీలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ద్వారకాతిరుమలలో బాల్ క్లే, కొయ్యలగూడెం, చింతలపూడి, చాట్రాయి మండలాల్లో రోడ్డు మెటల్, భీమడోలు, ఉంగుటూరు, టి.నర్సాపురం, చాట్రాయి, ముసునూరుల్లో గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. ఆగిరిపల్లి, నూజివీడుల్లో మెటల్, బిల్డింగ్ స్టోన్ క్వారీలున్నాయి. ఓవరాల్‌గా 18 క్వారీలు న్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటి ద్వారా ఏటా రూ.100 కోట్ల పైబడి ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ఇదిలా ఉండగా మైనింగ్ పాలసీ ప్రకారం కొత్తగా లీజులకు ఇవ్వడానికి అవకాశం ఉన్న వాటిపై అన్వేషణ సాగుతోంది. ఉమ్మడి పశ్చిమలో ఉన్నప్పుడు కంకర, మెటల్ స్టోన్స్ దేవరపల్లి, పంగిడి,కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉండేవి. ఇప్పుడవి లేకపోవడంతో ఏలూరు జిల్లాలోనే ఆగిరిపల్లి, నూజి వీడు, మెట్ట ప్రాంతంలో లింగపాలెం, ద్వారకా తిరుమల ప్రాంతాల్లో లీజులకు ఇచ్చే ప్రాంతాలను పరిశోధించనున్నట్టు సమాచారం.

**యంత్రాల్లేనప్పుడు.. వారే కీలకం**

వడ్డెర, ఉప్పర, సగర సామాజిక వర్గాలు యంత్రాలు లేనప్పుడు రెక్కలు ముక్కలు చేసుకుని సమ్మెట, పలుగు, పారలతో మెటల్స్ పిండి చేసి జీవనం సాగించేవారు. ఈ వర్గాలకు యంత్రాల రాకతో ఉపాధి సన్నగిల్లుతోంది. రోజూవారీ కూలి దక్కడం లేదు. మరోవైపు ఉపాధి హామీతో మట్టి పనులు కూడా కరువవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వారికి మైనింగ్ లీజుల్లో అవకాశాలను ప్రభుత్వం కల్పించడంతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.


ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234



## ఎంబీఏ అయితే హాస్టల్‌లో చేరాల్సిందే..

రాజధాని అమరావతి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి అక్కడ ఉన్న ఓ ప్రతిష్ఠాత్మక సంస్థలో ఎంబీఏలో చేరాడు. తొలి ఏడాదికి కోర్సు ఫీజు రూ.3.84 లక్షలకు సమ్మతిస్తూ ఆ విద్యార్థి రూ.10 వేలు అడ్మిషన్ ఫీజు చెల్లించాడు. ఇల్లు దగ్గరే కాబట్టి రోజూ కళాశాలకు వెళ్లి రావచ్చనుకున్నాడు. అయితే హాస్టల్‌లో చేరాలని, అందుకు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాను హాస్టల్‌లో చేరడమేమిటని ఆ విద్యార్థి వాపోతున్నాడు. డే స్కాలర్‌గా చదువుకుంటానని వేడుకున్నా వారు ఒప్పుకోలేదు. స్థానిక పెద్దలు ప్రశ్నించగా నిబంధనలు వర్తించవని యాజమాన్యం చెప్తోంది.

# హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

## రాజధాని విద్యార్థులపై.. ఫీజుల మోత

- స్థానికులైనా హాస్టల్‌లో ఉండాలని మెలిక
- డే స్కాలర్ ప్రవేశాలకు అంగీకరించని ఓ విద్యా సంస్థ
- తమ భూముల్లో సంస్థను నడుపుతూ ఇదేమిటని రైతుల ఆగ్రహం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇది రాజధాని అమరావతి పరిధిలోని ఈ ఒక్క విద్యార్థి పరిస్థితే కాదు.. అందరిదీ. తమ సమీపంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.. దూరాభారం తగ్గుతుంది. పిల్లలు ఇళ్ల నుంచి వెళ్లి చదువుకుంటారు అని భావించిన తల్లిదండ్రుల ఆశలు నిరాశగా మారాయి. అడ్మిషన్ల నుంచి ఫీజుల రాయితీ వరకు అన్యాయం జరుగుతుందోని పలువురు వాపోతున్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతులు ఇచ్చిన భూమిలో 100 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వం కారు చౌకగా ఆ విద్యా సంస్థకు ఇచ్చింది. విద్యా సంస్థ రావడం ద్వారా రాజధానిలోని విద్యా ర్థులకు, చుట్టుపక్కల జిల్లాల వారికి విద్యావకాశాలు పెరుగుతాయని భావించింది. అయితే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం మాటేమోగానీ ఇప్పుడు ఆ సంస్థ విద్యార్థుల నుంచి భారీగా ఆదాయాన్ని కోరుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. విద్యా సంస్థకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా హాస్టల్లోనే చేరాలని డిమాండ్ చేస్తోంది.గత ప్రభుత్వ హయాంలో కూడా ఫీజు రాయితీల విషయంలో సదరు విద్యా సంస్థ కఠినంగానే వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న ఒకరు రాజధానిలోని కొందరు విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వమని కోరగా, దాన్ని కూడా బుట్టదాఖలు చేసినట్లు రైతులు చెబు తున్నారు.

### పీ- 4 స్ఫూర్తికి దెబ్బ

ఇటీవల రాజధానిలోని ఓ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమానికి (మిగతా 8వ పేజీలో)

## హామీలెన్నో.. అమల్లో కొన్ని

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రెడ్డి కాలేజీ నుంచి చుట్టుగుంట రైతు బజారు వరకు ఉన్న డ్రెయినేజి సమీప ప్రాంతాలు వర్షాల సమయంలో ముంపునకు గురవుతున్నాయి. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల సమస్యలతో సుబ్బారెడ్డి నగర్, సీతారామ్‌నగర్, సీతమ్మకాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీవాసులు ఏళ్లుగా ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.

- గుంటూరు తూర్పు నియోజకవర్గం నందివెలుగు రోడ్డులోని రాహుల్ గాంధీనగర్, జియావుద్దీన్ నగర్, రజక కాలనీ వాసులను అంతర్గత రహదారులు, డ్రెయినేజి సమస్యలు వెంటాడుతున్నాయి. పాత గుంటూరు హైవే సమీపంలో మొండివాగు సమస్య పరిష్కారంపై దృష్టి సారించలేదు.

- తాడికొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం అమల్లోకి రాలేదు. తాడికొండ కొండ మల్లికార్జున శివాలయం ఘాట్ రోడ్డుకి నిధులు మంజూరు కాలేదు. ఫిరంగిపురం కొండపై ఉన్న చర్చి అభివృద్ధికి ముందడుగు పడలేదు. పెదపరిమిలో కొటేళ్ల వాగు, లాం చప్టా వద్ద బ్రిడ్జిల నిర్మాణం, కొండవీటి వాగు విస్తరణను పట్టించుకోలేదు.

- పొన్నూరు పట్టణంలో జల జీవన్ పనులతో పాటు ఆటోనగర్ ఏర్పాటు కొమ్మమూరు కాల్వపై బ్రిడ్జి నిర్మాణం హామీలు అమలు కావాల్సి ఉంది.

- ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని వెంగళాయ పాలెం, గోరంట్ల, నగరాలు, రెడ్డిపాలెం, స్వర్ణ భారత్‌నగర్, పలకలూరు, నల్లపాడు, ఏటుకూరు దొంతపాడు, బుడంపాడు గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత డ్రెయినేజీ సమస్యల తో అల్లాడుతు న్నారు. వర్షం వస్తే నగరాలు, బాలాజీనగర్, శ్రీరాం నగర్‌లు చెరువుల్లా మారిపోతున్నాయి.

పనులు ప్రారంభం కానున్న ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3

# ప్రజల చెంతకు.. పాలకులు

### నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు

- ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి
- ఇంటింటికీ టీడీపీ పేరిట కార్యక్రమాలకు శ్రీకారం
- ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలూ భాగస్వామ్యం
- చేసిన మంచి వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు జనంలోకి

చేసిన మంచిని వివరిస్తూ.. రాబోయే నాలుగేళ్లలో చేసే అభివృద్ధిని.. పనులను వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు పాలకులు ప్రజలను నేరుగా కలిసేందుకు సిద్ధమయ్యారు. కూటమి పాలనకు ఏడాది గడిచింది. గత వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలు తేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో గత వైసీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రజా పాలనకు తేడాలను వివరించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి బుధవారం నుంచి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు నెల రోజుల కార్యక్రమం నిర్వహించేలా నేతలు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో నేతలతో పాటు కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజెప్పడంతో పాటు ప్రజల నుంచి సలహాలు స్వీకరించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 'చేసిన మంచి పనులు చెప్పుకోవాలి.. ఏ నాయకుడైనా ప్రజల్లోకి వెళ్లడానికి నామోషీపడకూడదు' అని చంద్రబాబు స్పష్టం చేయగా నేతలందరూ ప్రజలను ప్రత్యేకంగా కలిసేందుకు సమాయత్తమయ్యారు.

పొన్నూరు పట్టణంలో రోడ్డు మార్జిన్‌లో మెకానిక్ షెడ్లు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'సుపరిపాలనకు తొలి అడుగు' అంటూ ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రజలతో మమేకమవ్వడంతోపాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లేలా టీడీపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందించింది. ఈ ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గాల్లో చేపట్టబోయే పనులను ప్రజలకు వివరించి వారి స్పందన తెలుసుకోవడమే లక్ష్యంగా బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. చేసిన మంచి పనులను ప్రజలకు జెప్పాలని.. అదే సమయంలో (మిగతా 8వ పేజీలో)

## ఇసుక అక్రమ మైనింగ్‌పై.. ప్రభుత్వం చర్యలు

- వైసీపీ హయాంలో ఇసుక ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు సిద్ధం
- ఏపీ ఎస్ఏసీ నివేదిక ఆధారంగా డీఎల్ఎస్‌సీ నిర్ణయం
- వివరణ ఆధారంగా తదుపరి చర్యలు

8

## ఏఎన్ఎంల కౌన్సెలింగ్ వివాదాస్పదం

- ఆన్‌లైన్ పేరుతో అన్యాయం అంటూ ఆరోపణలు
- మామూళ్లు ఇస్తే.. కోరుకున్న చోటు పదిలం?

## మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

## ధర కోత!

- 'బర్లీ' రైతుకు షాక్ ఇస్తున్న మార్క్‌ఫెడ్
- క్వింటా రూ.6 వేలు మాత్రమే
- చుట్టుగుంట గోడౌన్‌లో రైతుల పడిగాపులు

## పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు

6

# చేతికి కంది ధరలేక..!

- కంది రైతు కంట నీరు
- కొనుగోళ్లు నిలిపివేసిన మార్క్‌ఫెడ్
- మార్కెట్‌లో పతనమైన ధర
- అమ్ముకోలేక అన్నదాతల అగచాట్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పండించిన కంది పంటను అమ్ముకోలేక అన్నదాతలు అల్లాడుతున్నారు. వేలాది క్వింటాళ్ల నిల్వలు లోగిళ్లలోనే ఉండిపోయాయి. ప్రభుత్వం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేసింది. మార్కెట్‌లో ధర పతనమైంది. దీంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ కూడా చేతులెత్తేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. కంది కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### మార్కెట్‌లో ధర లేదు..

మార్కెట్‌లో కంది ధర పడిపోయింది. క్వింటా కందులు రూ 6,500 లోపే ఉందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించే పరిస్థితి (మిగతా 8వ పేజీలో)

## సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

తెనాలి ఆస్పత్రి తనిఖీలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు

తెనాలి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్సలు తగ్గించి సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ.రంగారావు తెలిపారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్యం, వైద్య పరీక్షలు వంటి వాటిని పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ఓపీ విభాగంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచాలన్నారు. సుఖ ప్రసవాలపై రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలను తీసుకున్నామన్నారు. 100 మందిలో 75 మంది తప్పనిసరిగా నార్మల్ డెలివరీలు జరిగేలా చూడాలన్నారు. సిజేరియన్ ద్వారా డెలివరీలు చేయాల్సి వస్తే ఏ పరిస్థితిలో చేయవల్సి వచ్చిందోనన్న అంశాన్ని రికార్డుల్లో తప్పనిసరిగా పొందుపరచాలని ఆదేశించారు. సిటీస్కానర్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆహార నాణ్యతలను తప్పనిసరిగా ప్రతి రోజు రోగులకు అందించే ముందు సూపరింటెండెంట్ లేదా ఆర్ఎంవో లేదా హెడ్ నర్స్ వంటి వారు పరిశీలించి రికార్డులో నమోదు చేసిన అనంతరమే రోగులకు అందించాలన్నారు. ప్రమాదకర పరిస్థితిలో జిల్లా ప్రభుత్వవైద్యశాలకు వచ్చే రోగులకు ఇక్కడే పూర్తి స్థాయిలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ సీట్లు 30,240

- ఉమ్మడి జిల్లా జాబితా విడుదల
- సెట్ అర్హత సాధించిన విద్యార్థులు 23,536
- అదనపు సీట్లు 6,700
- కౌన్సెలింగ్ ఆలస్యమైతే కళాశాలలకు నష్టం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ సీట్ల జాబితాను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. రెండు యూనివర్శిటీలు, 36 ఇంజనీరింగ్ కళాశాలల్లో 30,240 సీట్లు ఈ ఏడాది అందుబాటులోకి(ఇన్‌టెక్) రానున్నాయి. ఈ ఏడాది మేలో జరిగిన ఏపీ ఈఏపీ సెట్(ఎంసెట్) పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత నెల 8న విడుదలైన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 23,536 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తాజాగా సాంకేతి విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో సీట్లు 32,240 ఉన్నాయి. అంటే దాదాపు 6,700 సీట్లు అదనంగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

### కౌన్సెలింగ్ జాప్యం అయితే ఇబ్బందులే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ జాప్యం వల్ల భారీ స్థాయిలో సీట్లు (మిగతా 8వ పేజీలో)

# సమస్యల పరిష్కారానికి కృషి

● జీడీసీసీ బ్యాంకు సీఈఓ అజయ్

సీఈఓ అజయ్ కిషోర్ కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

గుంటూరు సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జీడీసీసీ బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన సీఈఓ సీహెచ్ అజయ్ కిశోర్‌కుమార్ హామీ ఇచ్చారు. సీఈఓగా నియమితులైన ఆయనను మంగళవారం బ్యాంకు అసోసియేషన్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి కోనేరు బాలాజీ ప్రసాద్, కోశాధికారి దొప్పలపూడి శ్రీనివాస్ ఉద్యోగుల సమస్యలను సీఈఓకు వివరించారు.

## మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.బాలశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి పరీక్ష రాయకుండా ఐదు, ఆరు, ఏడు ఎనిమిది తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు 871262 5039, 63020 18886 నంబర్లకు సంప్రందించాలని ఆయన తెలిపారు.

## 45,067 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,085 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,067 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,953 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | ఆర్మూరు | 9700 | 11000 |
| 334 | 9500 | 13000 | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| నెంబరు. 5 | 10000 | 13200 | 334 | 9500 | 12800 |
| 273 | 10000 | 12500 | నెంబరు. 5 | 10000 | 13300 |
| 341 | 10000 | 13500 | 341 | 10000 | 13300 |
| సూపర్ 10 | 9700 | 12400 | 4884 | 10000 | 12400 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | సూపర్ 10 | 9800 | 12800 |
| తేజ | 10000 | 13700 | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| షార్క్-1 | --- | --- | తేజ | 10000 | 13500 |
| బ్యాడిగి | 10000 | 12800 | బ్యాడిగి | 10000 | 12800 |
| సింజెంటా బ్యాడిగి | --- | --- | దేవనూరు డీలక్స్ | --- | --- |
| దేవనూరు డీలక్స్ | --- | --- | తాలుకాయలు | 4500 | 7000 |

# పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు

ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలను సత్వరమే అందించేలా పెండింగ్ సమస్యలను, సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామిక స్థూల విలువను మరింతగా పెంపొందించేలా చూడాలని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశం జరిగింది. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

**సమావేశంలో చర్చించిన కీలకాంశాలు..**

- మంగళగిరిలోగోల్డ్, హ్యాండ్లూమ్ శారీస్ క్లస్టర్ పనులు వేగవంతం.
- మాడ్యూలర్ కిచెన్ క్లస్టర్‌కు తాడికొండ, ప్రత్తిపాడు నియోజక వర్గంలో అవసరమైన స్థలాల గుర్తింపు.
- ఎస్ఐపీబీ, ఎస్ఐపీసీలో అనుమతులు పొందిన పరిశ్రమలకు సంబంధిత శాఖలు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి.. నిబంధనల ప్రకారం జిల్లాలో అనుమతులు మంజూరు.
- జిల్లాలో 45 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఇంట్రెస్ట్, పవర్ కాస్ట్ సబ్సిడీలకు సంబంధించి రూ.2.52 కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ ఆమోదం.

**ఇసుక నిల్వ చేసుకోవాలి**

జిల్లాలో వర్షాలు వేసవిలో నిర్మాణ అవసరాలకు అనుగుణంగా ఇసుకను ముందస్తుగానే ప్రత్యేకమైన స్టాక్ పాయింట్లలో నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. జేసీ ఎ.భార్గవ్ తేజ పాల్గొన్నారు. నిబంధనలు ప్రకారం ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిగేలా రెవెన్యూ అధికారులను మైనింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్‌లో ఇసుక పూడిక తీత కోసం ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల సరిహద్దు మేరకు.. ప్యాకేజీలను సిద్ధం చేసి టెండర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

## పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు రజతం

మంగళగిరి సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దావనగెరిలో జూన్ 22 నుంచి 30వ తేదీ వరకు జరిగిన సీనియర్ నేషనల్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన బెల్లంకొండ చంద్రిక 84 కిలోల పైబడిన విభాగంలో రజత పతకం సాధించింది. చంద్రిక స్క్వాట్‌లో 222.5 కిలోల బరువును ఎత్తి రజతం, బెంచిప్రెస్‌లో 107.5 కిలోల బరువును ఎత్తి కాంస్యం, డెడ్‌లిఫ్ట్‌లో 200 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించడంతోపాటు ఓవరాల్‌గా 530 కిలోల బరువును ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచింది. చంద్రికను సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కరరావు, సంధాని, వైస్‌చైర్మన్ వంశీకృష్ణ అభినందించారు.

## బకింగ్ హమ్ కెనాల్‌లో బాలిక మృతి

● తోసేసిన గుర్తుతెలియని వ్యక్తి

బాలిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వీరేంద్ర, ఎస్ఐ ఖాజావలి

తాడేపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి బకింగ్ హమ్ కెనాల్ వంతెనపై నుంచి సుమారు పదేళ్ల బాలికను గుర్తుతెలియని వ్యక్తి కాల్వలోకి పడేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఇది చూసిన ఓ మహిళ 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు మూడు గంటల అనంతరం బాలిక మృతదేహాన్ని గుర్తించి, బయటకు తీశారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని తాడేపల్లి సీఐ వీరేంద్ర, ఎస్సై ఖాజావలి తెలిపారు. ఎవరైనా.. బాలికను గుర్తిస్తే 86888 31361 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 184.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 194.00 |

# ధర కోత!

● 'బర్లీ' రైతుకు షాక్ ఇస్తున్న మార్క్‌ఫెడ్
● క్వింటా రూ.6 వేలు మాత్రమే
● చుట్టుగుంట గోడౌన్‌లో రైతుల పడిగాపులు

చుట్టుగుంట సీడబ్ల్యూసీ గిడ్డంగి వద్ద బారులు దీరిన వాహనాలు

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లలో ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒకే పొలంలో పండించిన పంటని తీసుకొస్తే కొన్ని బేళ్లకు ఒక ధర, మరికొన్నింటికి తక్కువ ధర చెల్లిస్తామని చెబుతున్నారు. సింహభాగం బేళ్లకు క్వింటా రూ.6 వేలు ధరనే నిర్ణయిస్తున్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించిన కొత్తలో మంచి ధర ఇచ్చారని, ఇప్పుడు కోత పెట్టేశారని రైతులు వాపో తున్నారు. అదేమంటే తమకు పైఅధికారుల ఆదేశాలంటూ.. చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇలా అయితే తాము భారీగానే నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అప్పటి నుంచే ధర తగ్గింది..**

గుంటూరు నగరంలో చుట్టుగుంట, పెదకాకాని సీడబ్ల్యూసీ గోడౌన్లలో పొగాకు కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఏ, బీ, సీ గ్రేడ్‌లుగా విభజించి క్వింటాకు రూ. 6వేలు, రూ. 9వేలు, రూ. 12వేలు చెల్లిస్తామని ప్రకటించింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కొత్తలో క్వింటాకు రూ.12 వేలు, రూ. 9 వేలు చెల్లించారు. అయితే ఇటీవల ఏపీ మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు సీడబ్ల్యూసీ గోడౌన్లలో తనిఖీలు నిర్వహించి కొనుగోలు చేసిన పొగాకుని పరిశీలించారు. నాణ్యత సరిగా లేదని స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో రైతులు ఎంత నాణ్యతగా పొగాకు బేళ్లను తీసుకొచ్చినా 20 శాతం బేళ్లకు క్వింటా రూ. 9 వేలు, మిగతా 80 శాతం బేళ్లకు రూ. 6 వేలు చెల్లిస్తున్నారు.

**వాహనాలు వెనక్కి..**

పెదనందిపాడు మండలం నుంచి పలువురు రైతులు మంగళవారం ఉదయం ట్రాక్టర్లు, ఆటోలలో పొగాకు బేళ్లను తీసుకొని వచ్చారు. వాళ్లని సాయంత్రం 5 గంటల వరకు కూడా లోనికి అనుమతించలేదు. దీంతో వాహనాలను వెనక్కు తీసుకెళ్లి మళ్లీ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఒక్కో బేలు ప్యాకింగ్, రవాణకు రూ.500, దిగుమతి చేసినందుకు రూ.130 చొప్పున రూ. 630 ఖర్చు అవుతోందని తెలిపారు. నాణ్యత కొలమానం విషయంలో ఎలాంటి శాస్త్రీయత పాటించకుండా ధర తక్కువగా నిర్ణయిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ఐదు ఎకరాల పంట వేసిన రైతు ఎట్టలేదన్నా రూ.2.50 లక్షలకు పైగా నష్టపోతాడని చెప్పారు.

**షెడ్యూల్ మేరకు కొనుగోలు : నరసింహారెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం**

చుట్టుగుంట సీడబ్ల్యూసీ గిడ్డంగిలో పేర్లు నమోదు చేసుకొన్న రైతులకు షెడ్యూల్ ఇచ్చాం. ఆ మేరకు మంగళవారం వచ్చిన రైతుల వద్ద 300 క్వింటాళ్లకు పైగా పొగాకు కొనుగోలు చేశాం. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి నివేదించాం.

# ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ వివాదాస్పదం

గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఏఎన్‌ఎంల నిరసన

గుంటూరు సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రేడ్ -3 ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. ఒక్కో రోజు ఒక్కో సాకు చెప్పి కౌన్సెలింగ్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వాయిదా వేస్తూ వస్తోంది. కౌన్సెలింగ్ ఉందంటూ ఏఎన్‌ఎంలను సుదూర ప్రాంతాల నుంచి సోమవారం గుంటూరుకు పిలిపించారు. రాత్రి 11 గంటల వరకు కార్యాలయం లో పడిగాపులు కాయించి.. సర్వర్ ఓపెన్ కావడం లేదంటూ.. ప్రకటించి వాళ్లను ఇళ్లకు పంపేశారు. మంగళవారం పించను పంపిణీ విధులకు హాజరైన ఏఎన్‌ఎంలు మధ్యాహ్నం మళ్లీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం వరకు వేచి చూసిన తర్వాత ఆన్‌లైన్ సమస్య.. ఇళ్లకు వెళ్లిపోండి అంటూ అధికారులు చెప్పారు. దీంతో కొందరు ఏఎన్ ఎంలు అధికారులతో గొడవకు దిగారు. ఆన్‌లైన్‌లో లింక్ ఓపెన్ కావడం లేదు కాబట్టి కోరుకున్న ఐదు స్థానాల్లో ఎక్కడో చోట కేటాయిస్తామని అధికారుల నుంచి సమాధానం రావడం వివాదాస్పదమైంది.

**ఇంతదానికి కౌన్సెలింగ్ పేరెందుకు..**

ఎక్కడో ఒక చోట కేటాయించేందుకు ఇక కౌన్సెలింగ్ ఎందుకని పలువురు ప్రశ్నించారు. తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భాను మూర్తి మాట్లాడుతూ అధికారులు బదిలీల వ్యవహారంలో అనుసరిస్తున్న పద్ధతి సక్రమంగా లేదని ఆరోపించారు. జూమ్ లో కౌన్సెలింగ్ ఉంటుందని కొంత సేపు, సాధారణ కౌన్సెలింగ్ అని మరికొంత సేపు.. చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. మామూళ్లు ముట్ట చెప్పిన వారికి దగ్గరలోనే పోస్టింగ్‌లు ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా.. పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## తురకా కిశోర్‌కు 14 రోజులు రిమాండ్

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌కు 14 రోజులు రిమాండ్ విధించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో 2019 సంవత్సరంలో టీడీపీ కార్యకర్త పాశం అమరయ్యపై దాడి చేసిన సంఘటనలో తురకా కిశోర్ నిందితుడు. దుర్గి పోలీసులు మంగళవారం గుంటూరు జిల్లా జైలు నుం చి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ వద్ద హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసుల తరుపున పిడుగురాళ్ల పీపీ వినయ్ వాదనలు వినిపించగా, కిశోర్ తరపున న్యాయవాది గుంజె వరప్రసాద్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్.. కిశోర్‌కు 14 రోజులు రిమాండ్ విధించడంతో దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ ఎస్కార్ట్‌తో కిశోర్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

## పిన్నెల్లి సోదరులకు హైకోర్టులో తాత్కాలిక ఊరట

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. గత మే నెల 24వ తేదీన వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల జంట హత్య కేసులో ఏ6, ఏ7గా పిన్నెల్లి సోదరులు ఉన్నారు. తమకు ముందస్తు బెయిల్ కావాలని మంగళవారం హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానంలో వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై వారం రోజులపాటు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆమెనూ మేమే చంపాం!

● ఖననం చేసిన 35 రోజులకు వృద్ధురాలి పోస్ట్‌మార్టం

సుభాషిణి (ఫైల్)

తెనాలి, మారీసుపేట,జూలై 1 (ఆంధ్రజ్యోతి): హత్య జరిగిన 35 రోజుల తర్వాత ఖననం చేసిన వృద్ధురాలి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించడం సంచలనాత్మకమైంది. తెనాలి డీఎస్పీ బి జనార్ధనరావు వివరాల మేరకు.. స్థానిక మారీసుపేటలో ఒంటరిగా ఉంటున్న చావలి సుభాషిణి(65) మే 25న అనుమానాస్పద స్థితిలో ఇంటిలోనే మరణించింది. సహజ మరణంగా భావించి వృద్ధురాలి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఖననం చేశారు. అనంతరం జూన్ 19న మారీసుపేట పరిమి డొంక రోడ్డులో వృద్ధురాళ్ల జంట హత్యలు జరిగాయి. ఈ జంట హత్యల కేసులో అరెస్ట్ అయిన నిందితులు కుసుమకుమారి, గోపి మరో మైనరు బాలుడు సహా ముగ్గురిని విచారించగా.. జంట హత్యలకు ముందే సుభాషిణిని కూడా తామే హత్య చేసినట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు సుభాషిణి మృతిని హత్య కేసుగా నమోదు చేశారు. విచారణలో భాగంగా.. మంగళవారం మల్లెపాడులోని శ్మశాన వాటికలో సుభాషిణి మృతదేహాన్ని తవ్వితీసి తహసీల్దార్ గోపాలకృష్ణ, ఆమె కుటుంబ సభ్యుల సమక్షంలో వైద్య నిపుణులతో పోస్ట్‌మార్టం నిర్వహించారు. నివేదిక ఆధారంగా విచారణను వేగవంతం చేస్తామని డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు.


ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

### ఉద్యోగావకాశాలు

➡ **Wanted a well experienced Principal** Wanted Eng. P.S. Social Staff for 8th to 10th. Contact : Sarojini Vidyalayas, Prathipadu & Pulladigunta, Guntur (Dt), Ph : 9491213407, 9542547509.
AJG-239200

➡ **High school Biology, Physics, Hindi,** social, PET, computer operator and mother teachers. Sri Vidhya High School, NGGOs colony, Gnt. Cont : 9701022900
SSD-1476

➡ **గుంటూరు, నల్లపాడు రోడ్డులో** గల శ్రీ నాగసాయి మందిర్‌లో స్వామి వారికి అర్చనాది కైంకర్యములు చేయుటకు అర్చకులు కావలెను. వసతి మరియు జీతము ఇవ్వబడును. వ్యక్తిగతముగా సంప్రదించవలెను. మేనేజర్: 93927 43225
AJG-239426

➡ **NK అగ్రో ఎక్స్‌పోర్ట్ Pvt.Ltd, తోడేళ్ళగూడెం** గ్రా, డోర్నకల్ మం, మహబూబాబాద్ జిల్లాలో పని చేయుటకు చిల్లిపౌడర్ మెషినరీ ఆపరేటర్స్-3 No.s కావలెను. అర్హత : ITI / పాలిటెక్నిక్ డిప్లొమా (ఏదైనా బ్రాంచ్), మెషీన్ ఆపరేటర్‌గా 3 నుండి 4 సం.లు అనుభవము వుండాలి. సంప్ర॥ 9949976505, మెయిల్ : hr@nkexpo.com
AJG-238772

### ఉచిత జాబ్ ట్రైనింగ్

➡ తెనాలిలోని వైష్ణవి విద్యా సంస్థలో 3 నెలలు ఉచిత హాస్టల్ వసతి, జాబ్ ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ప్లేస్‌మెంట్ ఇవ్వబడును. అర్హత : 10th పాస్ ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి సెల్ నెం : 9290769284, 9701399994
AJG-239363

### SHARES

➡ షేర్ మార్కెట్ & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్, ఫండమెంటల్స్ & టెక్నికల్స్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యూలర్ / సండే బ్యాచ్) ఫ్యాకల్టీ బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్, GNT, Cont : 98854 69566.
RK-620

### పోయినవి

### పాస్‌పోర్ట్ పోయినది

➡ నా పేరున దెందుకూరి రాధామాధవి D/o దెందుకూరి రాధాకృష్ణమూర్తి, ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ A7485007 డేట్ ఆఫ్ పాస్‌పోర్ట్ జారీ 26-03-1999 Dae of Expiry 25-03-2009 గల పాస్‌పోర్ట్ పిట్టలవానిపాలెం నుండి గుంటూరుకి బస్‌లో వెళ్తుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికినచో ఈ అడ్రస్‌కు డి.నెం. 11-139,పిట్టలవానిపాలెం గ్రామం, మండలం, బాపట్ల జిల్లా-522329 నందు తెలియజేయగలరు. / పంపగలరని కోరుచున్నాము.
AJG-RPL

### స్థలం అమ్మకము

➡ గుంటూరు, అమరావతి రోడ్డు రెడ్డిపాలెం హిమని నగర్, 2వలైను, సచివాలయం ప్రక్కన 300 గజాల దక్షిణం ఫేస్ స్థలం అమ్మబడును. 150 + 150 గజాలుగా కూడా అమ్మబడును. ఫోన్ : 63058 39392, 80991 47726
AJG-239429

### గోల్డ్ ఫైనాన్స్

### బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235545

### CHANGE OF NAME

➡ I, GANGINENI VENKATESWARLU S/o Late KONDAIAH, aged 49 years, R/o D.No.1-55, Nuzendla Vill, Nuzendla Mdl, Palnadu Dist, AP, hereby state that my name as GANGINENI VENKATESWARLU mentioned in my Aadhaar No.4492 8356 3323 and as VENKATESWARULU GANGINENI in my 10th class marks memo, both names belong to me.
AJG-239030

### పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

| | |
|---|---|
| గుంటూరు 1 టౌన్ | 97036 18725 |
| గుంటూరు 2 టౌన్ | 99854 01056 |
| తెనాలి | 99854 11202 |
| నరసరావుపేట | 99854 11206 |
| బాపట్ల | 99663 35084 |
| పిడుగురాళ్ళ | 93909 05725 |
| మంగళగిరి | 93986 73618 |
| అమరావతి | 95027 86195 |
| పొన్నూరు | 97042 99094 |
| రేపల్లె | 99854 12254 |
| చిలకలూరిపేట | 91103 23914 |
| వినుకొండ | 99662 50266 |
| మాచర్ల | 88861 19952 |
| సత్తెనపల్లి | 97048 67908 |
| ప్రత్తిపాడు | 63004 34285 |

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్



విజయవంతమైన 2వ వారం

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న నటించిన చిత్రం

ఉన్నవాడు - లేనివాడు

ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన చిత్రం

| | |
|---|---|
| పల్లవి డీలక్స్ ఎ/సి - గుంటూరు | ఈశ్వర్‌సాయి - సత్తెనపల్లి |
| శివ డీలక్స్ ఎ/సి - గుంటూరు | శ్రీనివాస ఎ/సి - మాచర్ల |
| హాలీవుడ్ ఎ/సి - గుంటూరు | కీర్తి కాంప్లెక్స్ - వినుకొండ |
| ది.ప్లాటినో ఎ/సి - గుంటూరు | శ్రీలక్ష్మి ఎ/సి - పొన్నూరు |
| మైత్రి ఎ/సి - గుంటూరు | విజయకృష్ణా - బాపట్ల |
| సినీప్రైమ్ ఎ/సి - గుంటూరు | VNS థియేటర్ - అద్దంకి |
| JLE సినిమా - గుంటూరు | శ్రీవెంకటేశ్వర - టంగుటూరు |
| గోరంట్ల కాంప్లెక్స్ - ఒంగోలు | K3K కాంప్లెక్స్ - చీమకుర్తి |
| అప్సా థియేటర్ - తెనాలి | శ్రీవెంకటేశ్వర - మంగళగిరి |
| మోహన్ ఎ/సి - చీరాల | అశ్విని ఎ/సి - పిడుగురాళ్ళ |
| కె.ఆర్. కాంప్లెక్స్ - చిలకలూరిపేట | బసవేశ్వర ఎ/సి - రేపల్లె |
| ఈశ్వర్ మహల్ - నరసరావుపేట | రామకృష్ణ ఎ/సి - తాడేపల్లి |
| గీతామల్టీప్లెక్స్ - నరసరావుపేట | |

గుంటూరు జిల్లా: శ్రీ వెంగమాంబ సినిమాస్
సెల్: 9097519999



### సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) మెసర్స్ ఆర్.బి ప్యాక్స్, ఎస్.నం.721, మెయిన్ రోడ్, పసుమర్రు ... నం.2) ... [illegible]

మా బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తి ... [illegible]

రిజర్వ్ ధర: రూ. 50,00,000/- (రూపాయలు యాభై లక్షలు మాత్రమే)

| రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది | ప్రదేశం |
|---|---|
| 24-07-2025 | సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, 7-376/1, గాంధీపేట, ఎన్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616 టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148 |

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు : ... [illegible] ... అత్యధిక బిడును కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 30.06.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN-L65110TN1904PLC001287.
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com



### ఎన్నికల ప్రకటన

| | | | |
|---|---|---|---|
| 1. | బ్యాంక్ పేరు | | : ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002 |
| 2. | ఎన్నికల తేది | | : 27-07-2025 (ఆదివారం) |
| 3. | మేనేజింగ్ కమిటీకి ఎన్నుకోబడే సభ్యుల సంఖ్య | | : 2 (ఇద్దరు) మాత్రమే<br>ఒక ప్రొఫెషనల్ డైరెక్టర్ మరియు ఒక జనరల్ డైరెక్టర్ |
| 4. | మేనేజింగ్ కమిటి సభ్యుల పదవి కాలం | | : కాల వ్యవధి: 5 సంవత్సరములు - 07-08-2025 నుండి 06-08-2030 వరకు<br>(ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 లోని సెక్షన్ 21(3) ప్రకారం) |
| 5. | మేనేజింగ్ కమిటి సభ్యత్వానికి పోటీ చేయదలచిన అభ్యర్థులకు కావలసిన అర్హతలు | | : 1. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు కనీసం రెండు సంవత్సరాలు బ్యాంక్‌లో ఓటింగ్ సభ్యునిగా ఉండవలెను.<br>2. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు జరిగిన రెండు జనరల్ బాడీ సమావేశాలకు(2024 సం॥ మరియు 2025 సం॥) హాజరై ఉండవలెను.<br>3. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్ నెం.21 ప్రకారం ఎలాంటి అనర్హత కలిగి ఉండరాదు. |
| 6. | నామినేషన్ల స్వీకరణ | తేది<br>స్థలం<br>సమయం | : 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉదయం 9:00 గం॥ల నుండి మధ్యాహ్నం 01:00 గం॥ల వరకు |
| 7. | స్వీకరించిన నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>మధ్యాహ్నం 02:00 గం॥ల తరువాత |
| 8. | నామినేషన్ల పరిశీలన | తేది<br>స్థలం<br>సమయం | : ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి ఉ॥ 11-00 గం॥ల వరకు |
| 9. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 12-00 గం॥ తరువాత |
| 10. | నామినేషన్లు ఉపసంహరణ | తేది<br>స్థలం<br>సమయం | : ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 11. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల తుది జాబితా ప్రచురణ మరియు చిహ్నాల కేటాయింపు | తేది<br>స్థలం<br>సమయం | : ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 01-00 గం॥ తరువాత |
| 12. | పోలింగ్ తేది మరియు సమయం | తేది<br>స్థలం<br>సమయం | : ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>ఉ॥ 7.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 13. | ఓట్లు లెక్కింపు | తేది<br>స్థలం<br>సమయం | : ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>మ॥ 02-00 గం॥ల నుండి |
| 14. | ఫలితాల ప్రకటన | | : కౌంటింగ్ అయిన వెంటనే ది.27-07-2025 (ఆదివారం) |

తేది: 01-07-2025 (ఎం.వి.ఎన్. సతీష్ బాబు) ఎన్నికల అధికారి, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్థలం: గుంటూరు 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002, (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 క్రింద రిజిస్టర్ చేయబడినది, రిజిస్ట్రేషన్ నెం.431)

గమనిక: 1) ప్రతి అభ్యర్థి నామినేషన్ ఫీజు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) నామినేషన్ దాఖలు సమయంలో చెల్లించవలెను. 2) ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి అనర్హత కలిగి వుండకూడదు. 3) ఓటర్ల జాబితా ఎన్నికల అధికారి వద్ద అందుబాటులో ఉంటుంది. 4) ఓటర్ల జాబితా బ్యాంక్ యొక్క అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం: 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట నందు నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుంది.
గమనిక: 1) ఓటు వేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా బ్యాంక్ వారు జారీ చేసిన సభ్యత్వ నమోదు ఐడీ కార్డు వంటి ఏదైనా ఆమోదించబడిన గుర్తింపు కార్డును ఓటరు తీసుకురావలెను.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రః 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614

## కోస్తా ఆంధ్రాలో తొలిసారిగా ల్యూటిషియమ్ కేన్సర్ థెరపీ

● ఒమేగా హాస్పిటల్ ఎండీ డాక్టర్ నాగకిషోర్ వెల్లడి

పెట్ స్కాన్ వద్ద డాక్టర్ నాగకిషోర్, డాక్టర్ శంకర్ మహదేవ్

గుంటూరు మెడికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ చికిత్సల్లో ఐసోటోపులను ఉపయోగించి చేసే అత్యున్నత వైద్య విధానం (న్యూక్లియర్ మెడిసిన్) ప్యాపీ పెట్ స్కాన్, ల్యూటిషియమ్ థెరపీ చికిత్సా విధానం కోస్తా ఆంధ్రాలో తొలిసారిగా గుంటూరులోని ఒమేగా హాస్పిటల్స్‌లో ప్రారంభించినట్లు ఆసుపత్రి చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌జీ నాగకిషోర్ తెలిపారు. ప్యాపీ పెట్‌స్కాన్, ల్యూటిషియమ్ థెరపీలో కేన్సర్ రోగులకు మరింత ఖచ్చితత్వంతో, వేగంగా వైద్య చికిత్సలు అందించవచ్చని ఆయన వివరించారు. ప్రోస్టేట్ కేన్సర్, న్యూరో ఎండోక్రైన్ ట్యూమర్ల చికిత్సా విధానంలో ఇది సమర్ధవంతంగా పని చేస్తుందన్నారు. శరీరంలో కేన్సర్ కణితులు ఎక్కడ ఉన్నా ఖచ్చితంగా తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా శరీరంలో ఇతర ఇన్‌ఫెక్షన్లను, కణజాల వాపులను కూడా ప్యాపీ స్కాన్‌లో గుర్తించవచ్చని డాక్టర్ నాగకిషోర్ తెలిపారు. ఈ కొత్త టెక్నాలజీలో రోగుల బ్లడ్ షుగర్‌తో సంబంధం లేకుండా పాస్టింగ్ అవసరం లేకుండా పెట్‌స్కాన్ చేయవచ్చన్నారు. కేన్సర్ వ్యాధులను నయం చేయాలంటే వ్యాధి ప్రారంభ దశలో కనిపెట్టి తగిన వైద్యం అందిస్తే రోగులు కోలుకుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యూక్లియర్ మెడిసిన్ ప్రొఫెసర్ శంకర్ మహదేవ్ పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యా ప్రయాణానికి 60 వసంతాలు

● ఘనంగా బాలకుటీర్ వజ్రోత్సవాలు

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): నాటికి...నేటికీ విలువలతో కూడిన విద్యను అందించే శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ విద్యా ప్రయాణానికి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రాడీపేటలోని బ్రాంచ్‌లో మంగళవారం వజ్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డైమండ్ జూబ్లీ చిహ్నంతో పాటు ఫైలాన్ ఆవిష్కరించారు. మంగాదేవి చిల్డ్రన్ యూనివర్స్ పేరుతో విహ్నన్ని ప్రారంభించారు. శ్రీ బాలకుటీర్ విద్యా సంస్థల వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ 1965లో తాను, ప్రభావతి కలిసి ఒక్క పాపతో బ్రాడీపేటలో విద్యా సంస్థను నెలకొల్పినట్టు గుర్తు చేశారు. నాటి నుంచి నేడు 5 వేల మంది విద్యార్థులు, 300 మంది బోధకులు, పదివేల మంది పూర్వ విద్యార్థులతో విలువలతో కూడిన విద్యకు బాలకుటీర్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏవో) ఎన్.రఘురామ్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం మార్కుల్లో ప్రాతిపదికలో కాకుండా నేటి ఆధునిక యుగంలో వారిని అన్ని రంగాల్లో ఉత్తమోత్తము తీర్చిదిద్దేలా బాలకుటీర్ విద్యనందిస్తుందన్నారు. సంస్థ అధ్యక్షుడు పొందుగల లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ రావెల సాంబశివరావు, జయశ్రీ, కొడాలి మురళీ, జీ కృష్ణకుమారి తదితరులున్నారు.

వజ్రోత్సవాల్లో మాట్లాడుతున్న డాక్టర్ మంగాదేవి, రఘురామ్, పాల్గొన్న ఉపాధ్యాయులు

## చెస్ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు అభినందనలు

గుంటూరు(తూర్పు), జూలై 1(ఆంధ్రజ్యోతి): గత నెల 29న చలపతి ఫార్మసీ కళాశాలలో జరిగిన ఆల్ ఇండియా చదరంగం పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. పోటీలలో అండర్-9 విభాగంలో గగనరెడ్డి, మయూరవదన్, అండర్-11 విభాగంలో ఆనందిలు 2, 5, 3 స్థానాల్లో నిలిచి పతకాలను కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను రూక్స్ నైడర్స్ అకాడమీ కోచ్ రాంబాబు, చెస్ అసోసియేషన్ నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చిన జీఎస్టీ

● సీ జీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సుజిత్ మల్లిక్



జ్యోతి వెలిగిస్తున్న సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సుజిత్‌మల్లిక్ తదితరులు

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీతో దేశం ప్రగతి పథంలో దూసుకు వెళుతుందని, జీఎస్టీ అమలు మంచి ఫలితాలు ఇచ్చిందని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సుజిత్ మల్లిక్ అన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చి 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్లో జరిగిన జీఎస్టీ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో జీఎస్టీ ప్రారంభమైన యేడాది రూ. 2,850 కోట్లు ఆదాయం సమకూరగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.7,300 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె గంగాధరరావు మాట్లాడుతూ జీఎస్టీతో దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎఫ్టానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన సాంకేతిక సమస్యలు, సందేహాలు వీడాయన్నారు. సీపీడబ్ల్యూడీ చీఫ్ ఇంజినీర్ ముక్కామల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీ ద్వారా అత్యధిక ఆదాయం వస్తున్నప్పటికీ కార్యాలయాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, సొంత భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం అత్యధిక పన్ను చెల్లింపుదారులను సత్కరించి, మెమోంటోలు బహూకరించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తొలుత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సీ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మినారాయణ, జాయింట్ కమిషనర్ రెజ్వాని, అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి రవికుమార్, మరియదాసు సూపరింటెండెంట్లు అర్‌పిపి కుమార్, యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి, సురేష్, మణి, చిట్టెం వెంకటేశ్వరరావు, పూర్ణసాయి పాల్గొన్నారు.

## మిషన్ ఉన్నతితో రైల్వే ఉద్యోగుల్లో మనోధైర్యం పెంపు

● డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

మిషన్ ఉన్నతి కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన మిషన్ ఉన్నతి ఉద్యోగుల మనోధైర్యాన్ని మరింతగా పెంపొందిస్తుందని గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అన్నారు. పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో మిషన్ ఉన్నతి కార్యక్రమాన్ని మంగళవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ మిషన్ వలన సిబ్బంది పదవీ విరమణ కారణంగా తలెత్తే ఖాళీలకు అర్హత కలిగిన ఉద్యోగులతో వెంటనే భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దీని వలన కీలకమైన పోస్టులు ఖాళీలు అనేవి ఉండవన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ చేసే ఉద్యోగులు తమ జూనియర్లకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులను ఈ మిషన్ కింద అందజేస్తారన్నారు. రిటైర్డు సీనియర్ ట్రైన్ మేనేజర్ ఆర్ దేవనాయక్ ఈ సందర్భంగా తన జూనియర్ అయిన సీనియర్ ప్యాసింజర్ ట్రైన్ మేనేజర్ కే.శివకుమార్‌కు ఉద్యోగోన్నతి ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం ఎం.రమేష్‌కుమార్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్‌ఎం అమూల్యా బీ రాజ్ పాల్గొన్నారు.

## జడ్పీ ఛైర్‌పర్సన్‌ను కలిసిన ఎస్ఈ అశోక్

గుంటూరు సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి ): గుంటూరు జిల్లా పరిషత్ ఛాంబర్ లో మంగళవారం నూతనంగా విధులలో చేరిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఈ) జి.అశోక్ జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను మర్యాద పూర్వకంగా కలసి బొకేను అందించారు. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులపై చర్చించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌ను ఛైర్‌పర్సన్ అభినందించారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న నగర మేయర్ రవీంద్ర. పక్కన ఎమ్మెల్యే మాధవి, జనసేన నాయకులు

పింఛన్లు అందజేస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ తదితరులు

# అమరావతికి తగ్గట్టుగా గుంటూరు నగరాభివృద్ధి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూలై 1( ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం అమరావతి రాజధానిలో భాగంగా ఉన్నందున అందుకు తగ్గట్టుగా నగరంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 1.21 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 18వ డివిజన్ రామనామక్షేత్రం 5వ లైన్ లో 93 లక్షలతో, 24వ డివిజన్ పీకలవాగుపై రూ.28 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులను నిర్మించుటకు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గల్లా మాధవితో కలిసి శంకుస్థాపన చేసి, తదుపరి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే మంగళవారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 18, 24 డివిజన్లలో 1.21 కోట్ల రూపాయలతో, స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులను నిర్మించుటకు శంకుస్థాపన చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నగరాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో అవసరమైన ప్రాంతాలలో డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా తాగునీరు, పారిశుధ్య సమస్యలు లేకుండా నగర పాలక సంస్థ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను వృద్ధులు, వితంతు మహిళలు, దివ్యాంగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందించడం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని 14, 15, 17 వార్డుల్లో లబ్ధిదారులకు మంగళవారం ఆయన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ రాష్ట్రంలో పింఛన్ల పండుగ జరుగుతోందని, ఈ సందర్భంగా లబ్దిదారుల ముఖాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నాలుగేళ్లకు వెయ్యి రూపాయలు పింఛన్ పెంచితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే రూ.వెయ్యి పెంచి పింఛను మొత్తాన్ని రూ.4 వేలు చేసిందని చెప్పారు. తద్వారా తమ కుటుంబంలో ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రగా జీవించే విధంగా హక్కు కల్పించినఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆగకూడదనే కృత నిశ్చయంతో తల్లికి వందనం అమలు చేశామని తెలిపారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హాస్టల్ విద్యార్థుల సదుపాయాలే ప్రభుత్వ ధ్యేయం

బీసీ హాస్టల్ విద్యార్థులకు సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని బీసీ హాస్టల్‌ను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మొదటి ఫైల్‌గా బీసీ హాస్టల్ గురించే సీఎం వద్ద ప్రస్తావించానని ఆయన చెప్పారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హాస్టల్‌కు రూ.2 కోట్లు కేటాయించగా, గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, తిరిగి కూటమి ప్రభుత్వమే దానిపై దృష్టి సారించాల్సి వచ్చిందని ఆయన చెప్పారు.

# వైద్యవృత్తితో ఆత్మసంతృప్తి

● భాష్యం డాక్టర్స్ డే వేడుకల్లో వక్తలు

మాట్లాడుతున్న డాక్టర్ ఉమాజ్యోతి

గుంటూరు (విద్య), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వైద్య వృత్తి ద్వారా లభించే సంతృప్తి ఎంతో ఆనందాన్ని ఇస్తుందని సైకియాట్రిక్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఓడీ, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి అన్నారు. డాక్టర్ బీదన్ చంద్రరాయ్ సంస్మరణార్థం భాష్యం మెయిన్ క్యాంపస్‌లో భాష్యం మెడెక్స్, భాష్యం మెడిఎయిమ్స్ క్యాంపస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నేషనల్ డాక్టర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఉమాజ్యోతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో డ్రగ్స్, మద్యపానం, ధూమపానం వంటి వాటికి ప్రాముఖ్యతను ఇస్తున్నారని, దీని వల్ల యువత పెడదోవపడే అవకాశముందన్నారు. ఈఎన్‌టీ ప్రొఫెసర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ బీదన్ చంద్రరాయ్ ఉత్తమ వైద్యులే కాదు విలువలతో కూడిన రాజకీయవేత్త అని కొనియాడారు. మచిలీపట్నం జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరాలజీ డాక్టర్ గాజుల రామకృష్ణ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ వైద్యులు వారి అనుభవాన్ని మీకోసం అందిస్తున్నారని, వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని, జీవితంలో ఉన్నత విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. తొలుత సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్, భాష్యం మెడెక్స్ పూర్వ విద్యార్థులు డాక్టర్ సీహెచ్ భార్గవి, డాక్టర్ కె.మానస, డాక్టర్ శివకైలాష్, డాక్టర్ గోపీనాథ్, మంగళగిరి ఎయిమ్స్ వైద్య విద్యార్థి జి.శ్రీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో ఘనంగా డాక్టర్స్ డే



డాక్టర్ ఉమాజ్యోతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది పేద రోగులకు చక్కటి వైద్య సేవలు అందించే ప్రభుత్వ వైద్యులను సన్మానించడం తమ బాధ్యత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సంఘం కో ఛైర్మన్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి, హెచ్‌డీ ఎస్ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు ప్రభుత్వాస్పత్రిలో పని చేసే 50 మంది వైద్యులను ఘనంగా సత్కరించారు. వారికి శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. అదేవిధంగా నాట్కో కేన్సర్ సెంటర్ ఐదో వార్షికోత్సవంతో పాటు డాక్టర్స్ డే వేడుకలను నాట్కో కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్, కేన్సర్ వైద్యనిపుణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

### ప్రాణం పోసే వైద్యుడు దైవంతో సమానం : డేగల

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రాణం పోసే వైద్యుడు సాక్షాత్తూ ఆ దైవంతో సమానమని, అందుకే 'వైద్యో నారాయణో హరిః' అన్నారని ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్లో మంగళవారం ఆయన ప్రపంచ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ డేగల ప్రభాకర్ వైద్యులతో కలిసి కేకును కట్ చేసి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులను ప్రజలు ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య వృత్తిని అంకిత భావంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. హాస్పిటల్లోని వైద్యులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు అచ్చంశెట్టి అన్వేష్, కాసుల సాయి రాజశేఖర్, జల్లేపల్లి తేజస్వి, చెరుకూరి జగదీష్, బడుగు పవన్ కుమార్, అందె కోటి వెంకటేశ్వరరావు, మాధవి లత, ఊటుకూరి గోపి, కె.సునీల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డేగల ప్రభాకర్, వైద్యులు

### అహల్యా హాస్పిటల్‌లో ....

గుంటూరు మెడికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని కొత్తపేటలోని అహల్యా హాస్పిటల్‌లో మంగళవారం ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు జరిపారు. డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి డాక్టర్స్ డే వేడుకలు ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్న వైద్యులను వారు సత్కరించారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ జయంతిని పురస్కరించుకొని ఏటా జూలై ఒకటిన డాక్టర్స్ డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా రోగుల వైద్యసేవలకు పునరంకితం కావాలని ఆయన వైద్యులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల గౌరీశంకరరావు, డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కరీం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ గౌరీశంకర్

### కేఎల్‌పీలో...

గుంటూరు(విద్య), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ పాఠశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ చిత్రపటానికి పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్తరంజన్‌సేవా సదన్ అనే ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించి, దేశం కోసం తన జీవితాన్ని అర్పించారని డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. వైద్యులు ప్రాణాంతక వ్యాధులు వచ్చినప్పుడు కూడా ప్రాణాలను లెక్క చేయక ప్రజలకు వైద్యాన్ని అందజేస్తూ వ్యాక్సిన్లు కనిపెట్టి సమాజానికి ఆరోగ్య రక్షణ కల్పించారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'బనకచర్ల' ఆలోచనను విరమించుకోవాలి

● పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి

గుంటూరు కార్పొరేషన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని నిర్మాణంలో ఉన్న పలు నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయకుండానే మరో భారీ ప్రాజెక్టును రూ.82 వేల కోట్లతో నిర్మించ తలపెట్టడం అర్థ రహితమని పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో బనకచర్ల ప్రాజెక్టుపై జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర అటవీ పర్యావరణ నిపుణుల కమిటీ బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించి. ఆ ప్రతిపాదనను వెనక్కి పంపిన తర్వాత నైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు స్వస్తి పలకాలని కోరారు. ఆర్థిక, సాంకేతిక, సామాజిక, పర్యావరణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా, నీటిపారుదల నిపుణులతో సంప్రదించకుండా హడావిడిగా ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి పంపడం అవివేకమన్నారు. అప్పుల పాలైన రాష్ట్రంలో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి 50 ఏళ్లు పడుతుందని, అంచనా వ్యయం అప్పటికి రూ. 8 లక్షల కోట్లగా పైగా చేరిన ఆశ్చర్య పడనక్కర్లేదన్నారు. 2004లో రూ.8 వేల కోట్ల అంచనాతో ప్రారంభమై.. నేడు రూ.57 వేల కోట్లకు చేరిన పోలవరం ప్రాజెక్టును ఉదహరించారు. బనకచర్ల ప్రాజెక్టు గుదిబండగా మారే పలు లోటు పాట్లను ఆయన వివరించారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డి పాల్గొని, మాట్లాడారు.

## నగరంలో వెండింగ్ జోన్లు అతి త్వరలో ఏర్పాటు చేస్తాం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

వెండింగ్ జోన్స్ ఏర్పాటుపై పరిశీలన చేస్తున్న కమిషనర్, కార్పొరేటర్లు

గుంటూరు కార్పొరేషన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్లు అతి త్వరలో ఏర్పాటు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరంలో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు వెండింగ్ జోన్ల కమిటీ సభ్యులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి వ్యాపారుల గుర్తింపు ప్రక్రియ పూర్తికావచ్చిందని, త్వరలోనే గుర్తించిన వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డుల జారీ చేసి వెండింగ్ జోన్లలో స్థలాలను కేటాయిస్తామన్నారు. స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులు నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో నగరంలోని ఆటోనగర్ వై.జంక్షన్, గడ్డిపాడు దగ్గర, టీజేపీఎస్ కాలేజీ దగ్గర, "గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కళాశాల వద్ద తదితర ప్రాంతాలలో పర్యటించారు. అనంతరం ఆర్టీవో కార్యాలయం వద్ద గల అన్న క్యాంటిన్‌లో కమిటీ సభ్యులతో కలిసి భోజనం చేశారు. పర్యటనలో కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, బొడ్డుపల్లి స్మిత పద్మజ, సంకూరి శ్రీనివాసరావు, షేక్ మీరావలి, ట్రాఫిక్ సీఐ సింగయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర రామిరెడ్డి, స్ట్రీట్ వెండర్స్ తలార్, నరసింహారావు, ఉపా సెల్ పీవో రామారావు, మానవతా సంఘం సభ్యులు, ఇతర వెండింగ్ జోన్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వసతి గృహానికి ప్రాథమిక సదుపాయాలు కల్పించండి

● మేయర్‌కు డేగల ప్రభాకర్, కాపు నేతల వినతి

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గోరంట్ల కాపు హాస్టల్ వద్ద రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజ్ వంటి ప్రాథమిక సదుపాయాల కల్పించాలని నగర మేయర్ కొవెలమూడి రవీంద్ర(నాని)కి ఏపీఐడీసీ ఛైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో కాపు నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మేయర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కాపు నేతలు కాపు హాస్టల్ వద్ద ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా తెలగ అభ్యుదయ సంఘ నాయకులు బలిశెట్టి విజయ్ మాట్లాడుతూ హాస్టల్ ప్రాంగణానికి పరిసర ప్రాంతాలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హాస్టల్‌కు రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాల కల్పించి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడాలని మేయర్‌ను కోరారు. కార్యక్రమంలో డేగల వెంకటేశ్వరరావు, కూటాల కృష్ణ, పరిమి సత్యనారాయణ, తుమ్మల నరసింహారావు, నిస్శంకరరావు రోహిత్, శ్రీగిరి నరేంద్ర పాల్గొన్నారు.

## జీఎంసీ ఎదుట కళ్లకు గంతలతో కార్మికుల వినూత్న నిరసన

గుంటూరు కార్పొరేషన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదల, సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టీ పెట్టినట్లు వ్యవహరిస్తున్నారని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఇంజనీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల మహాధర్నా జరుగుతుందని, ఆలోపు ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి జీతాలు పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే నిరవధిక సమ్మెకు పూనుకుంటామని, సమ్మె సందర్భంగా నగరంలో ప్రజలకు జరిగే అసౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు లలిత కుమారి, పాశం పూర్ణచంద్రరావు, కుమార్, విజయ్, కాటంరాజు, నరసింహారావు, రత్నబాబు, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్, ఫిషరీస్ వర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం

గుంటూరు (విద్య), జూలై 1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ (ఏపీఎఫ్‌యూ)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ పీఎంవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి న కార్యక్రమంలో విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్‌తో విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహ న ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల జలజీవుల ఆరోగ్యం, డయాగ్నొస్టిక్స్‌లో ఇరువురం కలిసి భాగస్వామ్య పరిశోధన చేస్తామన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఆక్వా రైతులకు సాంకేతిక శిక్షణ కూ డా అందిస్తామన్నారు. అంతేకాకుండా అధ్యాపకులు, సిబ్బంది మార్పిడి (బోధన, వర్క్‌షాప్‌లు), ప్రయోగశాల వనరుల వినియోగం వివిధ నిపుణుల సేవలు అందిస్తామన్నారు. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రాజెక్టుల కోసం సంయు క్తంగా ప్రతిపాదనలు తయారుచేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూని వర్సిటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ.రాజశేఖర్, స్పెషల్ ఆఫీసర్ టీ సుగుణ, ఆ యా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కారు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన కేసులో నిందితుడైన కారు డ్రైవర్‌కు రెండేళ్ళు జైలు శిక్ష విధించారు. 2021 సంవత్సరంలో పేరేచర్ల జంక్షన్ వద్ద భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం వేములపాడు గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మాలంపాటి శ్రీకాంత్ రెడ్డి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో వాహనం నడుపుతున్న గుంటుపల్లి వెంకటేశ్వరరావు అక్కడిక్కడే మృతి చెందగా, అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు జరిపి సాక్ష్యాధారాలను 5వ అదనపు సివిల్ కోర్టుకు సమర్పించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం మంగళవారం న్యాయమూర్తి లత ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు.

## పెళ్ళైన ఏడు నెలలకే కట్నం కోసం వేధింపులు

డొంకరోడ్డు వల్లూరివారితోటకి చెందిన రామరాజు శ్రావణికి సుమారు 7 నెలల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకి చెందిన శివ నాగ సుబ్రమణ్యంతో పెద్దల సమక్షంలో పెళ్లి జరిగింది. పెళ్లి సమయంలో భర్త, అత్త మామలు కట్నం డిమాండ్ చేసి తీసుకున్నారు. ఇప్పటి వరకు పెళ్లి తరువాతి కార్యక్రమాలు కూడా జరగనివ్వకుండా అదనపు కట్నం డిమాండ్ చేస్తూ ఫిర్యాదిని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈస్ట్‌లో డ్రంకన్ డ్రైవ్

ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని లాలాపేట, కొత్తపేట, పాతగుంటూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మంగళవారం రాత్రి పోలీసులు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. పలువురు మందుబాబులు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు లాలాపేట సీఐ శివప్రసాద్ తెలిపారు. కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో నాజ్ సెంటర్‌లో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు.

## మతిస్థిమితం లేని వృద్ధురాలి అదృశ్యం

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లిఖార్జునపేట కి చెందిన దమ్మాలపాటి అన్నపూర్ణ (75) అనే మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యమైంది. మల్లిఖార్జునపేటలోని ఆమె కూతురు బొజ్జా పద్మ ఇంటిలో నుంచి జూన్ 27న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయలు దేరి వెళ్ళి ఎక్కడకో వెళ్ళిపోయింది. దీంతో ఆమె కూతురు బొజ్జా పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పటిష్టత ప్రశ్నార్థకం

ప్రాజెక్ట్ లోపలి భాగంలో గోడల దుస్థితి

- అమరావతి ధ్యాన బుద్ధ ప్రాజెక్టుకు లీకేజీల సమస్య
- భూగర్భ, మొదటి ప్రాంగణంలో వర్షపు నీరు
- ప్రారంభం నుంచి మరమ్మతులు శూన్యం
- దృష్టి పెట్టని పర్యాటక శాఖ

ప్రాజెక్ట్ ప్రారంభంలో స్లాబుకు పగుళ్లు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అమరావతిలోని ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్ నిర్మాణం 20 ఏళ్లు పూర్తిచేసుకుంది. కానీ, మరమ్మతులపై టూరిజం అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రాజెక్ట్ దిగువన ఉన్న నాలుగు వైపులా సొరంగ మార్గం, బుద్ధుని పీఠం దిగువన శిల్ప సంపదతో పర్యాటకులను ఆకర్షిస్తున్న గ్యాలరీ ప్రాంగణ స్లాబుకు లీకేజీల సమస్య ఏర్పడింది. వర్షపు నీరు కారి గొడలకు పగుళ్లు వస్తున్నాయి. రంగులు లేచిపోయి కళావిహీనంగా మారుతున్నాయి. బుద్ధుని విగ్రహం పీఠం చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో స్లాబుకు ఏర్పడిన లీకుల ద్వారా గ్యాలరీలోకి నీరు చేరుతోంది. అంతేగాక బుద్ధుని బొమ్మకు మోకాళ్ల ప్రదేశంలో చిన్న చిన్న పగుళ్లు రావడం జరిగింది. ప్రాజెక్టుపై అక్కడక్కడా చిన్న చిన్న మొక్కలు కనిపిస్తున్నాయి.

**ప్రారంభం ఇలా..**

2004 ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జేఆర్ పుష్పరాజ్ ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీఆర్ మల్లికార్జునరావు పర్యవేక్షణలో 2006లో జరిగిన కాలచక్ర మహా సభలకు నిర్మాణం పూర్తి చేసుకుంది. బౌద్ధుల ఆరాధ్య దైవం దలైలామా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రారంభించారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని వారసత్వ కేంద్రంగా గుర్తించేలా అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా వారసత్వ నగరంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులోని కొంత నిధులతో ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు లైటింగ్, గ్రానైట్, స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ధ్యానబుద్ధ ప్రాజెక్టులో కొన్ని పనులు నిలిచిపోయాయి.

**పర్యాటక శాఖ నిర్లక్ష్యం..**

ప్రాజెక్టు ప్రారంభం నుంచి పర్యాటకశాఖ సందర్శకులకు టికెట్ ద్వారా సందర్శనకు అవకాశం కల్పిస్తోంది. కానీ, ప్రాథమిక స్థాయిలో మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహించిందని స్థానికులు చెబుతున్నారు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ద్యానబుద్ధ ప్రాజెక్ట్ భావితరాలకు భద్రంగా అందించే విధంగా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి, పటిష్టతకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రాజెక్ట్ మరమ్మతుల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని అంతర్జాతీయ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు.

## మరమ్మతులు చేపడుతాం: ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి రాజధానికి ఐకాన్‌గా ఉన్న ధ్యానబుద్ధ విగ్రహం, అమరావతి పర్యాటక ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద లీకేజీల విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విగ్రహ పరిసర ప్రాంతాలకు మరమ్మతులు చేసి అమరావతిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామన్నారు. అమరావతి అభివృద్ధి పై సీఎం చంద్రబాబుకు విన్నవించానని తెలిపారు.

లీకులతో దెబ్బతిన్న పీఠం దిగువ భాగం

# డబ్బుల్ ధమాకా మోసం!

## 'లుక్' యాప్‌తో టోకరా

- ఒక పద్ధతి ప్రకారం ఆఫర్లతో ఎర
- చివరిగా డిపాజిట్ నగదుకు డబుల్ బెనిఫిట్ ఆఫర్
- నగదు జమకాగానే నిలిచిపోయిన యాప్ సేవలు
- తెనాలి, పరిసరాల్లోనే అధికంగా బాధితులు

తెనాలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మనిషి అమాయకత్వాన్ని, ఆశను క్యాచ్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఓ పద్ధతి ప్రకారం ఓ యాప్ ద్వారా యూజర్లకు ఆఫర్‌లు ద్వారా బహుమతులు ఇచ్చి.. డబుల్ పేమెంట్ అంటూ నగదు డిపాజిట్ చేయించుకుని ఒక్కసారిగా ఉన్నదంతా ఊడ్చేశారు. ఈ యాప్ ద్వారా మోసపోయిన బాధితుల సంఖ్య తెనాలి, పరిసర ప్రాంతాల్లోనే భారీగా ఉంది. రూ.కోట్లల్లోనే వీరంతా నష్టపోయినట్లు సమాచారం. అసలు వివరాల్లోకి వెళితే.. కొన్ని నెలల క్రితం ఫోన్లకు వచ్చిన లింకుల ద్వారా 'లుక్' యాప్‌ను చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్‌లో వచ్చే ప్రకటనలు చూసిన వారికి రూ.15 వంతున జమచేస్తామని యూజర్లకు ఆశ రేకెత్తించారు. దీంతో ఇక అదే పనిగా కొందరు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పేర్లు నమోదు చేసి చూడటం ప్రారంభించారు. యాప్ నిర్వాహకులు కొన్ని రోజులు యూజర్ల వాలెట్‌లోకి నగదు బదిలీ చేసి, విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. గొలుసు కట్టు విధానంలో మెంబర్ షిప్‌లు చేయించిన యూజర్లకు... యాప్ నిర్వాహకులు కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, ఖరీదైన ఇళ్లు అంటూ బహుమతులు కూడా ప్రకటించారు. ఇందుకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు కొత్త ఆఫర్లు ప్రకటిస్తూ.. యూజర్లను పెంచారు. ఇది నమ్మి చాలా మంది తమ కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులను కూడా యాప్ మెంబర్లుగా చేర్చారు. మెంబర్‌షిప్‌లు పెరగడంతో.. యాప్ నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చార్జీలు పెట్టారు. సెక్యూరిటీ డిపాజిట్లు కింద నగదు జమ చేయించుకున్నారు. గత వారం క్రితం యాప్‌లో ఎంత డిపాజిట్ చేస్తే.. అంతకు డబుల్ అమౌంట్ ఇస్తామని ప్రకటించారు. దీంతో పలువురు రూ.20 వేల నుంచి రూ.2లక్షలు పైగా స్తోమతను బట్టి డిపాజిట్ చేశారు. అన్నట్లుగానే వారి వాలెట్‌కు నగదు వచ్చినట్లు చూపించింది. ఎంతో ఆశతో విత్ డ్రా చేసుకుందామని బ్యాంక్‌కు వెళితే.. నగదు రాలేదు. పైగా యాప్ సర్వీసులు గత బుధవారం నుంచి నిలిచిపోయాయి. దీంతో తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. ఓ ప్రైవేట్ వైద్యశాలలో పనిచేస్తున్న ఓ మహిళ తనకు ఆఫర్‌లో కారు రావడంతో.. పూర్తిగా నమ్మి పెద్ద ఎత్తున యాప్ ద్వారా నగదు డిపాజిట్ చేసి పూర్తిగా మోసపోయినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వారి వద్ద నగదు పంపిన వివరాలు మినహా ఏమీ లేకపోవడంతో.. తిరిగి తమ డబ్బులు ఎలా తెచ్చుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. వారు వాడే యాప్ చిరునామా పుణె, అమెరికా అంటూ చూపుతుండటంతో ఏం చేయలేని పరిస్థితి బాధితుల్లో నెలకొంది. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

యాప్ ద్వారా చూపుతున్న నగదు




యాప్‌లో ఒక రోజు సంపాదించిన సొమ్ము, ఖాతాలో ఉన్న నగదు చూపుతున్న దృశ్యం

## చేతి'కంది'..ధర లేక..!

(5వ పేజీ తరువాయి)

లేదంటున్నారు. కంది క్వింటా మద్దతు ధర రూ.7,550గా ఉంది. పత్తి పంట సాగు చేసి ఏటా నష్టపోతున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా కంది పెద్ద ఎత్తున సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం కంది సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేసింది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో పాటు మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 66,273 ఎకరాల్లో కంది సాగు చేశారు. దిగుబడులూ ఆశాజనకంగా వచ్చాయి. అయితే.. మార్క్‌ఫెడ్ మొక్కుబడిగా కంది కొనుగోళ్లు చేసింది. రైతుల వద్ద వేలాది క్వింటాళ్లు నిల్వలు ఉన్నాయి. కందులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేరు. కంది పుచ్చే తత్వం అధికంగా ఉంటుంది. మార్కెట్‌లో విక్రయిద్దామంటే క్వింటా రూ.6,500 లోపే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కంది నిల్వలంటినీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**దళారులు తక్కువకు అడుగుతున్నారు : గెల్లి యోగిరెడ్డి, తెలార్లపల్లి**

కౌలుకు పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో దళారులు క్వింటా రూ.6,500కు కూడా కొనడం లేదు. ఎక్కువ కాలం ఇంటిలో కందులు నిల్వ చేయలేము. ప్రభుత్వం మద్దతు ధరకు రైతులు వద్ద ఉన్న కందులు కొనాలి.

## ఇంజనీరింగ్ సీట్లు 30,240

(5వ పేజీ తరువాయి)

మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది ముందుగానే నోటిఫికేషన్ జారి చేసి కౌన్సెలింగ్ ప్రారంభించారు. అయితే ఈ ఏడాది వేర్వేరు కారణాల వల్ల నోటిఫికేషన్ ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇందుకు మరో రెండు మూడు వారాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సాంకేతిక విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర జిల్లాల వైపు కూడా కొంతమంది వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భారీ సంఖ్యలో మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులందరూ.. కళాశాలలో చేరతారనే నమ్మకం కూడా లేదు. ప్రభుత్వం సత్వరం నోటిఫికేషన్ జారీ చేస్తే సీట్లు మిగులు తగ్గుతుందని యాజమాన్యాలు తొందరపడుతున్నాయి. కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే 30 శాతం ఉన్న యాజమాన్య కోటా సీట్లు భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటాలో ఇక్కడ కూడా కెమికల్, మెకానికల్ సీట్లు భర్తీ కాలేదు. ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసి విద్యార్థులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే ఏపీ ప్రభుత్వం ఇంకా ప్రక్రియ ప్రారంభం చేయకపోవడంపై యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సత్వరం నోటిఫికేషన్ జారీ చేసి, ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

## ప్రజల చెంతకు.. పాలకులు

(5వ పేజీ తరువాయి)

చేయలేకపోయిన పనులు ఎందుకు చేయలేదో వివరించాలని చంద్రబాబు ఇప్పటికే నేతలకు సూచించారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రేపోమాపో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరాలను అమలు చేయనున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నో కష్టనష్టాల కోర్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తీరును నేతలు ప్రజలకు వివరించనున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ఎలా సాగాలన్న దానిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నేతలకు మార్గనిర్దేశనం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కరపత్రాలు కూడా ఆయా నియోజకవర్గాలకు మంగళవారం చేరాయి. బుధవారం ఉదయం నుంచే ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పరిధిలోని ఇళ్ల బాట పట్టనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని, రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రజల ముందుంచాలనే ఆదేశాలు నేతలకు వెలువడ్డాయి. ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు సమస్యలు చెప్పుకుంటే వాటిని సావధానంగా విని పరిష్కారం కోసం కృషి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధిష్ఠానం సూచించింది. ఏడాది వ్యవధిలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఎన్నికలకు ముందు నేతలు ప్రధానంగా ఇచ్చిన హామీలు ఈ ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నేపథ్యంలో ప్రజల్లో చర్చకు రానున్నాయని, వాటిపై నేతలు కూడా సమగ్ర సమాచారం దగ్గర పెట్టుకోవాలని ఆదేశించింది. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. నెల రోజులు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, నేతలకు పిలుపిచ్చారు. కుటుంబ సాధికార సారథుల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**అక్కడక్కడ అసంతృప్తి**

బిల్లుల మంజూరు.. పనులు.. నామినేటెడ్ పదవుల విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. మన ప్రభుత్వం వచ్చింది పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయన్న విశ్వాసంతో అప్పులు చేసి మరీ సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గోకులాల నిర్మాణం తదితర పనులను పెద్దఎత్తున చేశారు. అయితే ఆయా బిల్లుల అంశాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తే చూద్దాం.. చేద్దాంలే అంటున్నారని బాధిత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని, సొంతవారికి ఇలా మొండిచేయి చూపించడంపై నేతలు గుర్రుగా ఉన్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో రూ.154.46 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014 నుంచి 2018 వరకు టీడీపీ ప్రభుత్వం హాయంలో కూడా పార్టీ నేతలు ఉపాధి పనులు చేసిన బిల్లుల చెల్లింపు నేటికి జరగలేదు. ఇలా పెద్ద ఎత్తున నష్టపోయిన నేతలు అసంతృప్తిలో ఉన్నారు. ప్రజాక్షేత్రానికి బయల్దేరిన ప్రజాప్రతినిధులు అసంతృప్తి నేతలపై దృష్టి సారించేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.

## హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

(5వ పేజీ తరువాయి)

హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచే పీ- 4 కార్యక్రమం అమలు జరగాలన్నారు. రాజధానిలో ఏర్పాటైన ప్రతి విద్యాసంస్థ గ్రామానికి నలుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఈ సూచన చేసి రెండు నెలలు కూడా కాక ముందే ఆ పక్కనే ఉన్న మరో విద్యా సంస్థ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక కోర్సుతో మొదలైన ఈ విధానం ఆ తర్వాత అన్ని కోర్సులకూ విస్తరి స్తుందేమోనని, అన్ని విద్యా సంస్థలు అదే వైఖరిని చేపడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**స్థలాలు ఇచ్చిన రాష్ట్రానికి రాయితీ కరువు**

రాజధానిలో విద్యా సంస్థ నిర్మాణానికి వందల ఎకరాలు స్థలం కారుచౌకగా ఇచ్చిన రాష్ట్ర విద్యార్థులకు ఆ విద్యా సంస్థలో రాయితీ లేదు. 1 నుంచి 23 ర్యాంకులు సాధించిన వారికి ఫౌండర్ స్కాలర్‌షిప్ కింద నూరుశాతం, 24 నుంచి 68 ర్యాంకులు సాధించిన వారికి 100 శాతం మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. 69 నుంచి 5000 మధ్య ర్యాంకులు వచ్చినవారికి 90 శాతం, 5,001 నుంచి 13,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 75 శాతం, 13,001 నుంచి 23,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 50 శాతం, 23,001 నుంచి 30,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 25 శాతం ఈక్విటబుల్ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. అయితే రిప్రజంటేటివ్ రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదు. అంటే 68వ ర్యాంకు తరువాత వచ్చిన ఏపీలోని ఏ విద్యార్థికి ఈ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ రాయితీ రావడం లేదు. దీంతో విద్యార్థులంతా మొత్తం ఫీజులు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**ఇది న్యాయం కాదు : రాంబాబు, వెలగపూడి రైతు**

రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని కూడా ఇలా హాస్టల్లో ఉండమని విద్యా సంస్థలు డిమాండ్ చేయడం న్యాయం కాదు. హాస్టల్లో ఉండాలా, వద్దా అనేది విద్యార్థి, అతడి కుటుంబం ఇష్టం. అదే ఊరి వారిని కూడా హాస్టల్లో ఉండమనడం మరీ విడ్డూరంగా ఉంది. విద్యా సంస్థ యాజమాన్యం దీనిపై ఆలోచించాలి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.

# ఇసుక అక్రమ మైనింగ్‌పై.. ప్రభుత్వం చర్యలు

- వైసీపీ హయాంలో ఇసుక ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు సిద్ధం
- ఏపీ ఎస్ఏసీ నివేదిక ఆధారంగా డీఎల్ఎస్‌సీ నిర్ణయం
- వివరణ ఆధారంగా తదుపరి చర్యలు

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-24 ఆర్థిక సంవత్సరాల మధ్యన జిల్లాలో జరిగిన ఇసుక అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఏపీ ఎస్ఏసీ) రీచ్‌ల వారీగా జరిగిన అక్రమ మైనింగ్‌పై ఇచ్చిన నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ మేరకు జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఈ అంశంపై చర్చించి, ఆ సమయంలో ఇసుక మైనింగ్‌కు ఏజెన్సీలుగా వ్యవహరించిన సంస్థ లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. నోటీసు లకు సంబంధిత ఏజెన్సీలు స్పందించిన తర్వాత ఎంత మేరకు అయితే రెవెన్యూ నష్టం జరిగిందో అంత మొత్తం రికవరీ చేయాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా జిల్లా యంత్రాంగం నోటీసులు సిద్ధం చేస్తోంది.

**వైసీపీ నేతల కబంధ హస్తాల్లో..**

ఇసుక రీచ్‌లను వైసీపీ హయాంలో సంబంధిత ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు తమ కబంధ హస్తాల్లోకి తీసుకొన్నారు. తొలుత ఇసుక రీచ్‌లన్నింటిని కేంద్రీకృతం చేశారు. ఒక సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి దాని నుంచి నెల వారీగా మామూళ్లను దండుకొన్నారు. ఆ తర్వాత ఆ సంస్థ సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. ఎన్నికల ఏడాదిన్నర ముందు అయితే మొత్తం రీచ్‌లు ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. ఒక్క పెదకూరపాడు నియోజ కవర్గంలోనే ప్రతి నెలా తాడేపల్లి క్యాంపు ఆఫీసుకు రూ.20 కోట్ల కప్పం కడుతుండేవారన్న ఆరోపణలను ప్రతిపక్షాలు అప్పట్లో చేశాయి.

**అనుకూలంగా నివేదికలు..**

మరోవైపు వైసీపీలో తొలుత అంటకాగిన ఇద్దరు నేతలు ఆ తర్వాత విభేదాలు వచ్చి ఇసుక అక్రమ మైనింగ్‌పై సుప్రీం కోర్టు, ఎన్‌జీటీలో కేసులు దాఖలు చేశారు. అలా కేసులు వేశారని వాళ్లపై వైసీపీ నేతలు పీడీ యాక్టు కేసులు పెట్టించి.. జిల్లా నుంచి బహిష్కరించేలా చేశారు. అయినప్పటికీ ఆ నాయకులు భయపడకుండా పోరాడారు. అక్రమ మైనింగ్‌పై అప్పట్లో కలెక్టర్లను నివేదిక సమర్పించమని సుప్రీం కోర్టు ఆదేశిస్తే.. అందరూ ఒకేలా రిపోర్టు ఇచ్చారు. ఎలాంటి అక్రమ మైనింగ్ జరగలేదని చెప్పారు. అయితే ఇసుక మైనింగ్ విషయంలో ఎవరూ తప్పు చేయొద్దని శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా అన్ని వివరాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయని ఎంపీ బాలశౌరి హెచ్చరించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అది మరుగన పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేపట్టింది. శాస్త్రీయంగా ఏపీ ఎస్ఏసీ ద్వారా సర్వే చేయించి అక్రమ మైనింగ్‌ని నిగ్గు తేల్చింది. దీనిపై ఎలాంటి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తుందోనన్న భయం వైసీపీ నేతల్లో నెలకొంది.



## బీటెక్, ఎంపీఈడీ పరీక్షలు ప్రారంభం

పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

పెదకాకాని, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలో మంగళవారం బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (రెగ్యులర్), మూడో సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (సప్లమెంటరీ), ఎంపీఈడీ ద్వితీయ సెమిస్టర్ (రెగ్యులర్)పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం. సుబ్బారావు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ పరీక్షలు ఏఎన్‌యూ, బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో, ఎంపీఈడీ పరీక్షలు ఏఎన్‌యూతో పాటు నరసరావుపేటలోని కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్నాయని తెలిపారు.

## ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఆచార్య లింగరాజు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య లింగరాజు

పెదకాకాని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఆచార్య చేబ్రోలు లింగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

# గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్రదించండి 98484 11050 99854 03281

## దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 560 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,700, గరిష్టధర రూ.10,500, మోడల్‌ధర రూ.10,470 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,700, గరిష్టధర రూ.11,000, మోడల్‌ధర రూ.10,450 పలికాయి.

## కారు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

మేడికొండూరు జూలై 1 (ఆంధ్రజ్యోతి): కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి మరొకరు తీవ్ర గాయాలు కావడానికి కారణమైన కారు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం ఐదో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి పోలార్ లత తీర్పునిచ్చారు. ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం వేములపాడు గ్రామానికి చెందిన మాలంపాటి శ్రీకాంత్ తన కారులో గుంటూరు వైపునకు అతివేగంతో, అజాగ్రత్తతో వస్తూ మేడికొండూరు మండలం పేరేచర్ల జంక్షన్‌లో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో మోటార్ బైక్ పై ఉన్న భార్యాభర్తల్లో గుంటుపల్లి వెంకటేశ్వరరావు మృతి చెందగా అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. 2021 జనవరి 12వ తేదీన జరిగిన ఈ ప్రమాదంపై కారు డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డి పైన మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం నిరూపణ కావడంతో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## 18 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. మంగళవారం జూలై నెల రేషన్ పంపిణీ ప్రారంభం అవ్వటంతో అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. తాడికొండలో 18 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో ఓ ఇంట్లో రేషన్ బియ్యాన్ని డంప్ చేశారనే సమాచారంతో రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించి 18 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. గతంలో తుళ్లూరు మండలంలో ఎండీయూగా పని చేసిన గుర్రపుశాల అనంద్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. బియ్యాన్ని దగ్గరలోని రేషన్ డీలర్లకు అప్పగించినట్లు తెలిపారు. 6ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సివిల్ సప్లై డీటీ దేవ్‌రాజ్ తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకున్నవారిలో ఆర్ఐ నూతలపాటి హనుమంతరావు, వీఆర్వో మాల్యాద్రి ఉన్నారు.

## వర్మీకంపోస్టుతో రైతులకు మేలు

● డీఎల్పీవో శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : వర్మీ కంపోస్టు ఎరువులతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని డీఎల్పీవో శ్రీనివాసరావు అన్నారు. మండలపరిధిలోని తుమ్మలపాలెంలో రైతన్న నేస్తం ఆధ్వర్యంలో సుప్రీం ఎల్‌టీసీ సహకారంతో స్వచ్ఛమైన ఎరువు రైతన్న కల్పతరువులో భాగంగా వర్మీకంపోస్టు ఎరువు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ రైతులకు వర్మీకంపోస్టు కేజీ, 5 కేజీల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, నాయకులు కాకాని సురేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ 70 వసంతాల సందడి

తాడేపల్లి(ఉండవల్లి), జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారంతో 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఎస్‌బీఐ ఉండవల్లి బ్రాంచ్‌లో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కోశాధికారి పురాణం వెంకటాచార్యులు కేక్ కట్ చేశారు. ఎస్‌బీఐ ప్రజలకు అమూల్యమైన సేవలు అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు లింగంశెట్టి కిషోర్, బుర్రముక్కు భాస్కరరెడ్డి, బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

దుగ్గిరాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం దుగ్గిరాలలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ప్రారంభించారు. రూ.1075ల విలువగల బీపీటీ 5204 సాంబ మసూరి వరి విత్తనాల 25కిలోల సంచిని సబ్సిడీపై రూ.950కి అందిస్తున్నారు. ఏవో విజయబాబు మాట్లాడుతూ రైతులకు సకాలంలో వరి విత్తనాలను అందించేందుకు గానూ, రాష్ట్రప్రభుత్వం ఏపీసీడ్స్ ద్వారా అందిస్తోందన్నారు. టీఎన్‌టీయూఏఎస్ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్షవర్ధన్, వాసిరెడ్డి సుధాకర్, వల్లూరు కోటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే వేడుకలు



డాక్టర్ ముత్తవరపు రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, రోటరీక్లబ్ సభ్యులు

పెదనందిపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోకా పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు, స్నేహమిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆర్‌ఎంపీలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందించడం అభినందనీయమని, వారిని సత్కరించుకోవడం ఒక మంచి పరిణామమని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చిన్నం శ్రీనివాసరావు, పోపూరి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని కార్యకలాపాలపై కొనసాగిన సమావేశాలు

సీఆర్‌డీఏ అధికారులతో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

తుళ్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాం కు బృందం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో వరుసగా రెండో రోజు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. బృంద సభ్యులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు జీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్ రాజధాని లో అన్నివర్గాలకు అందుబాటులో ఉండేలా చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రా జెక్టులు, అమలుచేస్తున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, యువత, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ వంటి అంశాల గురించి కూలంకషంగా వివరించారు. అలాగే రాజధాని నిర్మాణానికి నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాల గురించి, ల్యాండ్ మోనిటైజేషన్ గురించి వివరించారు. ఆయా ప్రాజెక్టుల కు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందంలోని పలువురు సభ్యులు రాజధాని అమరావతిలోని ఏఐఎస్ అధికారుల నివాస సముదాయాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, ఎంఎల్ఏ, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, టిడ్కో నివాస సముదాయాలను సందర్శించారు. ఆయా భవనాల వద్ద, నిర్మాణ పను లు జరుగుతున్న ప్రాంతాల వద్ద పురోగతిని అధికారులు బృందంలోని సభ్యులకు వివరించారు. అమరావతిలో నిర్మించిన వివిధ భవనాలు పర్యావరణ సహిత విధానాలతో నిర్మించామని, రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, ఆయా ప్రాజెక్టుల్లో పురోగతి గురించి సీఆర్‌డీఏ అధికారులు వారికి వివరించారు.

# పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

● రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన
● గంటలకొద్దీ స్థంభించిన ట్రాఫిక్
● మార్క్‌ఫెడ్ డీఎంతో రెవెన్యూ, పోలీసుల చర్చలు
● కేంద్రం ఏర్పాటు హామీతో నిరసన విరమణ

రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు

పెదనందిపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి ఏర్పాటు చేయకపోవడంపై రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గుంటూరు - పర్చూరు రహదారిపై బైఠాయించి, వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతుసంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా రైతులకు పొగాకు ఇళ్లకు చేర్చుకొని పంటను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో అప్పులపాలై ఈ నియోజకవర్గంలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారన్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి కాకుమాను మండలం బీకేపాలెంలో కేంద్రం ఏర్పాటు చేశారని, దీనివల్ల ఈ ప్రాంత రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నాగులపాడు మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే లు హామీ ఇచ్చారని, కనీసం ఈ మండలాల వైపు కన్నెత్తి కూడా చూడలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని నిరసన చేస్తున్న రైతులు సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుకోవాలని, రోడ్లపై ఇలా నిరసనలు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కల్పించరాదని ఎస్ఐ మధుపవన్ తెలిపారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదిలేదని లేదంటూ రైతులు తెలిపారు. తహసీల్దార్ హెనాప్రియ, ఎస్ఐ మధుపవన్‌లు జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడించి ఈ నెల 7న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి, డిప్యూటీ తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కొత్త వెంకటశివరావు, కన్నెగంటి చంద్రరావు, కాపు వెంకట సుబ్బారావు, దొప్పలపూడి రమేష్‌బాబు, అప్పారావు, వెంకయ్య, రాజేంద్ర, రామారావు, రంగనాయకులు, జనసేన అధ్యక్షుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులతో అప్రమత్తంగా ఉండాలి

తాడికొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పదో బెటాలియన్ అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు నీటిలో కొట్టుకుపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంట్లో వృద్ధులు, పిల్లలు ఉన్నప్పుడు ముందుగానే మందులు, ఆహార పదార్థాలు నిల్వఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు.

## రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలి : ఏడీఏ

తాడికొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా మొగ్గుచూపాలని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు ఐ.సునీత తెలిపారు. మంగ ళవారం పాములపాడు, బేజాత్‌పురంలో పొలం పిలుస్తోంది కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని, ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని తెలిపారు.

## పింఛను మంజూరులో సమస్యలను పరిష్కరిస్తా..

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి కుటుంబానికి ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మేడికొండూరు జూలై 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పింఛను అందటం లేదని కొందరు తన దృష్టికి తీసుకు వచ్చారని, ఆ కారణాలను విశ్లేషించి అర్హులందరికి పింఛను అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చెప్పారు. మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక నాయకులతో కలిసి తాను కొర్రపాడు గ్రామంలో ఎస్టీ కాలనీకి వెళ్లగా వారంతా పింఛను అందిన ఒకటో తేదీన పండుగలా చేసుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా తనను కలిసిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి సొంత అవసరాలకు ఈ పింఛను ఎంతగానో ఉపయోగపడుతుందని, మందులకు కుటుంబాలలోని మరొకరిపై ఆధారపడకుండా ఆత్మాభిమానంతో జీవిస్తున్నారని చెప్పారు. మేడికొండూరు మండలంలో 7వేల 8వందల 59మందికి గాను 3కోట్ల 38 లక్షల 40వేల ఐదు వందల రూపాయలు ప్రతినెల ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నామన్నారు. మేడికొండూరులో పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన కోడూరు బాజి పెన్షన్ అందించిన అనంతరం ఆయనకు చదువుకుంటున్న ఇద్దరు ఆడపిల్లలున్నారని చెప్పడంతో ఎమ్మెల్యే వారిని పిలిపించి మీనాన్నకు బాగా లేదని ఆందోళన పడవద్దని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పూలనాగమణి, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్, ఫిషరీస్ వర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం

గుంటూరు (విద్య), జూలై 1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ (ఏపీఎఫ్‌యూ)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ పీఎంవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్‌తో విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల జలజీవుల ఆరోగ్యం, డయాగ్నొస్టిక్స్‌లో ఇరువురం కలిసి భాగస్వామ్య పరిశోధన చేస్తామన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఆక్వా రైతులకు సాంకేతిక శిక్షణ కూడా అందిస్తామన్నారు. అంతేకాకుండా అధ్యాపకులు, సిబ్బంది మార్పిడి (బోధన, వర్క్‌షాప్‌లు), ప్రయోగశాల వనరుల వినియోగం వివిధ నిపుణుల సేవలు అందిస్తామన్నారు. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రాజెక్టుల కోసం సంయుక్తంగా ప్రతిపాదనలు తయారుచేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ.రాజశేఖర్, స్పెషల్ ఆఫీసర్ టీ సుగుణ, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర జలశక్తి పథకాల అమలు తీరు బావుంది

● కేంద్ర బృందం సంతృప్తి

కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మితో సమావేశమైన కేంద్ర బృందం

గుంటూరు సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసి పట్టటమే లక్ష్యంగా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల అమలు తీరు, పురోగతిని పరిశీలించటానికి కేంద్ర జలశక్తి శాఖ పరిశీలకులు కిరణ్‌కుమార్ కర్లపు, రేష్మ పిళ్లైలతో కూడిన అధికారుల బృందం మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరు నాగలక్ష్మిని కలిసి పర్యటన వివరాలు తెలియజేశారు. అనంతరం జల జీవన్ మిషన్ అమలు జరుగుతున్న తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి, దుగ్గిరాల మండలం ఈమని గ్రామాల్లో పర్యటించి పథకం అమలు గురించి గ్రామస్థులతో చర్చించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా చేపడుతున్న ఫారం పాండ్, వాన నీటి సంరక్షణ నిర్మాణాలు, అమృత్ సరోవర్లు, నర్సరీలు, పండ్లు, పూల తోటల పెంపకం వంటి పథకాలను పరిశీలించారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులో నిర్మించిన ఫారం పాండ్‌ను పరిశీలించి అక్కడ మొక్కలను నాటారు. పథకం అమలు తీరుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పనులు చేపడుతున్న తీరు బాగున్నప్పటికీ వాటిని సంబంధిత వెబ్‌సైట్లలో ఫొటోలు అప్ లోడ్ చేయకపోవటం వల్ల పనుల పురోగతి ఆన్‌లైన్‌లో కనిపించటం లేదన్నారు. కనుక చేసిన పనుల తాలూకు ఫోటోలు వెంటనే అప్‌లోడ్ చేసేలా చూడాలని కలెక్టరును కోరారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు జారీ చేస్తానని కలెక్టరు తెలియచేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీరు కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేశ్ స్ఫూర్తితో కార్యకర్తకు రూ.20వేల ఆర్థికసాయం

టీడీపీ కార్యకర్తకు రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

తాడేపల్లి (చిర్రావూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన టీడీపీ కార్యకర్త కొంకా రామారావుకు పక్షవాతం వచ్చిందని సమాచారం అందుకున్న తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం చిర్రావూరు గ్రామానికి వెళ్లి కార్యకర్త కొంకా రామా రావుకు సదరు నగదును అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, నల్లిబోయిన శ్రీనివాసరావు, పిల్లి రమేష్, జెట్టి రవీంద్ర, ఏసుబాబు, సింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బద్వేలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి (F.T.C.), రాజంపేట at బద్వేలు

O.S. No. 9/2021

Muthukuru Chadive Amarnath Reddy S/o Ramachandra Reddy, Hindu Aged 39 Years, Flat No. 501, Pavani Elegance Apartment, Beside Apollo Speciality Hospital, Pinakini Nagar, Nellore 520 004, Ph. :9963999073. - Plaintiff

V/s

D. Malyadri S/o Malakondaiah, Hindu aged about 55 Years, C/o Kondaveedu Enclave, 204, Near Kaza Toll Gate, Guntur, Ph. : 703290847. - Defendant.

దావా సమను

వాది ప్రతివాది అయిన నీపైన రూ. 25,00,000/- రాబట్టుకొనుటకు గాను పై నెంబరు దావాను దాఖలు చేసి ఉన్నారు. కావున నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల రాజశ్రీ కోర్టు నందు 11-07-2025వ తేదీన ఉదయం 10.30 ని. నేరుగా కాని వకీలు ద్వారా కాని హాజరు కావలెనని లేని యెడల రాజశ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను మీకు పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా తేది : 11-07-2025

By order of this Hon'ble Court

యు. నాగేశ్వర్ చౌదరి, సయ్యద్ నాసర్ బాషా, కె. అవినాష్, యు. మురళీకృష్ణ

వాది తరపు న్యాయవాదులు

# రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయంతోనే పొగాకు కొనుగోలు

● జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

తక్కెళ్ళపాడు పొలాల్లో పొగాకు బేళ్ళను పరిశీలిస్తున్న వడ్రాణం హరిబాబు

ఫిరంగిపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలో ఉన్న రైతులను ఆదుకొనేందుకు సాహసోపేత నిర్ణయం చేయటం వల్ల పొగాకు కొనుగోళ్ళు జరుపుతున్నామని జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తక్కెళ్ళపాడులో జరిగిన నల్లబర్లి పొగాకు కొనుగోలుపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కూటమి విప్లవాత్మక నిర్ణయంతో కొనుగోళ్ళకు శ్రీకారం చుట్టామన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ల ఆదేశాలతోనే మండలంలోని రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కొనుగోళ్ళల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చివరి ఆకు వరకు కొనుగోలు చేయాలన్న ఆదేశాలు ఉన్నాయన్నారు. రైతులు దళారుల పాలిట పడకుండా కాపాడారన్నారు. రైతే ముఖ్యమని భావించి రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సభలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జీ నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని తక్కెళ్ళపాడులోని రైతులకు చెందిన పొగాకునే ఎక్కువగా కొనుగోలు చేశామన్నారు. అనంతరం పొలాల్లోని పొగాకు బేళ్ళను చైర్మన్ పరిశీలించారు. కార్యక్రమంలో బీఎం హరి గోపాళం, ఏవో శ్రీమతి వాసంతి, ఇందూరి పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పెనుగొండ కోటిరెడ్డి, శేషం శ్రీనివాస్, మార్పుల శివరామిరెడ్డి, డేగల సీతారామయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ అధ్యక్షుడిగా మండవ నరసింహారావు

ఫిరంగిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఫిరంగిపురం మండల నూతన అధ్యక్షుడిగా కండ్రిక గ్రామానికి చెందిన మండవ నరసింహారావు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఫిరంగిపురం పట్టణ అధ్యక్షుడిగా కటికల అప్పారావు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన వారిని మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ ఎన్నికలో పరిశీలకులు, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పసల థామస్, పెనుగొండ కోటిరెడ్డి, వజ్రాల అయ్యపరెడ్డి, శివయ్య, పెరికల హృదయరాజు, కొలగాని కొండలు, డేగల సీతరామయ్య, మేకల నాగేశ్వరరావు, ఆళ్ళ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావు, అప్పారావులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

ప్రకటన

నా క్లయింట్ అయినటువంటి MAHI INFRA TECH INDIA PRIVATE LIMITED, HYDERABAD, TELANGANA వారి వలన సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా...

పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం మండలం, నర్సాపురం పట్టణం, కోటిపల్లి వారి వీధి, జ్యోతి స్వీట్ హోం దగ్గర, డో.నెం. 6-4-27రు వాస్తవ్యులు భవర్ లాల్ గారి కుమారులు 1) శ్రీ రాజేంద్ర కుమార్ జైన్ 2) రాజేష్ కుమార్ జైన్ ఇరువురు ఏకస్తులై వ్రాయించి వారి వద్ద నుండి యీ క్రింది షెడ్యూలు దాఖలాస్తి కొనుగోలు చేయునిమిత్తమై, నా క్లయింటు విక్రయ ఖరారు పొంది, తన పేర క్రయమైన క్రయ దస్తావేను రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు సిద్ధముగా వున్నారు కావున ఎవరికైన, ఏ రకమైన ఎటాచ్‌మెంట్లు, ఇంజక్షన్లు, భాగలబ్ధ తగాయిదాలు, మనోవర్తి జప్తులు ఉన్న యెడల, యీ ప్రకటన తేది లగాయితు పది (10) రోజుల లోపు, రిజిష్టర్ పోస్ట్ తిరుగు రశీదు పొందే విధముగా, యీ క్రింది అడ్రస్‌నకు తెలియపర్చగలరు. గడువు తేదీలోపు ఎటువంటి అభ్యంతరములు రాని యెడల నిర్వివాద ఆస్తి అని భావించి, నా క్లయింటు రిజిస్ట్రేషన్ చేయించుకొనగలరు. షెడ్యూలు: గుంటూరు జిల్లా, తుళ్ళూరు మండలం, తుళ్ళూరు గ్రామ పంచాయితీ మరియు గ్రామ పరిధిలోని సర్వే.నెం. 202రు, టౌన్ షిప్-9, సెక్టార్-95, కాలనీ-444, బ్లాక్-2929 ప్లాట్ నెం.6, ఉపవర్గం-డి20రు బాపతు ఖాళీ నివేశన స్థలం కొలతలు పొడవు 164.02 అ.లు, వెడల్పు 109.713 అ.లు వెరశి మొత్తం 2000 చ.గ.లు ఏకఖడంగా కలిగిన స్థిరాస్తి.

ఇట్లు

ఎమ్. ఉదయ్ కుమార్, MA.LL.B, అడ్వకేట్

డో.నెం. 13-151/2, తాడేపల్లి, గుంటూరు జిల్లా.

సెల్: 9440028543

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

డాక్టర్ సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు

మంగళగిరి సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డీఎస్ రాజునాయుడు అన్నారు. ప్రజారోగ్య వేదిక మంగళగిరి రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక వైష్ణవి కల్యాణ మండపంలో డాక్టర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రి సాధన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. వైద్యులు మాట్లాడుతూ చిన్నపిల్లలకు చిన్ననాటి నుంచే ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. రోగులకు సేవ చేసే విధానంలో వారితో వైద్యులు వ్యవహరించే తీరును బట్టి రోగం నయమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, మంగళగిరి కన్వీనర్ ప్రసాద్, వివిధ రంగాల ప్రముఖులు కే.కుటుంబరావు, నన్నపనేని నాగేశ్వరరావు, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉత్తమ వైద్యులుగా ఎంపికైన డాక్టర్ గాలి స్వప్న, డాక్టర్ చింతక్రింది చక్రవర్తి, డాక్టర్ సుస్మితలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి సామాజిక దృక్పథంతో, చాటుకోవడం సేవాతత్పరతకు నిదర్శనమన్నారు. డాక్టర్ ఇజాజ్‌అబ్దుల్ రహ్మాన్, ఇందిరకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కళ్లకు గంతలతో కార్మికుల నిరసన

మంగళగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం అక్కడి నుంచి పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ కార్మికులు అనేక రోజులుగా రాష్ట్రమంతటా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు చెంగయ్య, బాలకృష్ణ, బాలాజీ, శీనివాసరావు, ప్రకాష్, కేదార్‌నాథ్, దుర్గారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయమే లాభసాటి

● ఏవో చందోలు సునీత

వట్టిచెరుకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయానికి రానురాను ప్రాధాన్యం పెరుగుతుందని ఏవో చందోలు సునీత అన్నారు. మండలంలోని అనంతవరప్పాడు, లేమల్లెపాడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏవో సునీత రైతులతో మాట్లాడారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం : 15-05-1947

మరణం : 18-06-2025

కీ॥శే॥ శ్రీ నల్లపనేని భాస్కరరావు గారు

మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, మాకు బంగారు బాటలు వేసిన

కీ॥శే॥ నల్లపనేని భాస్కరరావు గారి

పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య : నల్లపనేని రోహిణి

కుమారుడు - కోడలు : నల్లపనేని చక్రవర్తి - స్వాతి

మనుమలు - సాయి సూర్యతేజ, నిషికంఠ, హనీష్

మరియు కుటుంబ సభ్యులు

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

## మధ్యాహ్న భోజనం పథకంపై శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకంపై ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిడపర్రు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీచేశారు. విద్యార్థుల హాజరుపట్టీని, మధ్యాహ్న భోజనం పథకంపై సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆహారం అందించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● రీజనల్ మేనేజర్ కలిమ్

కొల్లిపర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని 104 రీజనల్ మేనేజర్ కలిమ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తూములూరులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించడంతో ఆయన డీఎం రాఘవకుమార్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. 104 వ్యానులో ఉన్న మందులను, రికార్డులను తనిఖీ చేసి వైద్యాధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలిమ్ మాట్లాడుతూ గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించేటప్పుడు సమయపాలనను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంపు గురించి ముందస్తుగా ఆ గ్రామంలో తెలియజేయాలన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నీహ, ఎమ్ఎల్‌హెచ్‌పీ భారతి, ఏఎన్ఎమ్ దీప్తి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు వనకుమారి, రాజ్యం, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జీవనలత

## పలువురికి వైద్య పరీక్షలు

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెయిన్ బో ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని ప్రకాశం రోడ్డులోని లతాస్ డయాబెటిక్ కేర్‌లో రోగులను పరీక్షించారు. షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మధుమేహ వ్యాధికి కారణాలను, నియంత్రణ, నివారణ మార్గాలను డాక్టర్ జీవనలత అవగాహన కల్పించారు.

## వైభవంగా కుసుమ హరనాథ్ బాబా జయంతి

తెనాలి, మారీసుపేట,జూలై 01 (ఆంధ్రజ్యోతి): కుసుమ హరనాథ్ బాబా జయంతిని భక్తులు వైభవంగా నిర్వహించారు. మంగళవారం నందులపేటలోని కుసుమ హరనాథ్ మందిరంలో కుసుమ హరనాథ్ బాబా 160వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో మందిర కమిటీ సభ్యులు భక్తులతో కలసి నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు బాబావారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూలతో అలకరించి పూజలను నిర్వహించి భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రూప్ కమాండర్ పరిశీలన

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విభాగాన్ని గుంటూరు గ్రూపు కమాండర్ కల్నల్ సుదామ్సుదుబాయ్ మంగళవారం పరిశీలించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్యాడెట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించే ఎన్‌సీసీలో చేరి మంచి పౌరులుగా రూపొందాలన్నారు. శిక్షణ పొం దిన ప్రతి ఒక్కరికి ఉన్నత విద్య, ఉద్యోగాలలో ప్రాధాన్యం లభిస్తోందన్నారు. కమాండర్ ఉదయ్‌కుమార్, మేజర్ గురుదీప్‌కుమార్, కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ దేవిప్రియ, అశోక్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

● డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్

తెనాలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే సుపరిపాలన సాధ్యమని డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ చెప్పారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, తెనాలి మండలాలకు సంబంధించిన మహిళా సర్పంచ్‌లకు మార్పు ద్వారా విజేతలు - సాధికారతతో స్వపరిపాలన సాధ్యం అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. తొలి రోజు మహిళా సర్పంచ్‌లు వారివారి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చించుకున్నారు. అనంతరం ఆటపాటలతో కొంతసేపు సందడి చేశారు. ప్రతి కుటుంబంలో మహిళల పాత్ర కీలకమైనదని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లుగా మరింత బాధ్యత ఉంటుందని వైవీడీ ప్రసాద్ వివరించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై వివరించించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ వద్ద ఆటోవాలాల ఆగడాలు

రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఆటోస్టాండ్

● రాత్రి సమయాల్లో ప్రయాణికుల నుంచి అధికంగా వసూళ్లు
● అడిగినంత ఇవ్వకుంటే ప్రయాణికులపై దూషణలు
● ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే వచ్చినవారిపై దౌర్జన్యం
● పోలీసులు దృష్టిసారించాలని ప్రయాణికుల వినతి

తెనాలి, మారీసుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్న ఆటోవాలాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ యూనియన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆటోవాలాలు ప్రయాణికుల నుంచి వారి ఇష్టానుసారం ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వారు అడిగినంత ఇవ్వలేక ఆన్‌లైన్‌లో రాపిడో, ఓలా వాహనాలు బుక్ చేసుకుంటున్న ప్రయాణికులపై దుర్భాషలాడుతూ వారిపై దారులకు యత్నిస్తున్నారు. సోమవారం రాత్రి రైలుదిగి ఇంటికి వెళ్లేందుకు ఒక కుటుంబం ఆటోని ఆశ్రయించగా అధిక మొత్తంలో చార్జీలు అడగడంతో రాపిడో రైడర్స్‌ను బుక్ చేసుకున్నారు. వారికోసం రైల్వే స్టేషన్‌కి వచ్చిన ర్యాపిడో ఆటోవాలాలను అడ్డుకొని వారిపై దాడికి ప్రత్నించారు. దీంతో భయభ్రాంతులకు గురైన రాపిడో రైడర్స్ ప్రయాణికులను వదిలి వెళ్లిపోయారు. దీంతో ప్రయాణికులకు మరో దారిలేక ఏమిచేయలో తెలియని సందిగ్ధంలో చిక్కుకున్న పరిస్థితి. చివరకు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆటోవాలాలు అడిగినంత ఇచ్చి గమ్యస్థానానికి చేరుకున్నారు. గత కొంతకాలంగా ఆటోవాలాలపై పోలీసుల నిఘా లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు పలువురి నుంచి వినిపిస్తున్నాయి. చిన్నారులతో కలసి మహిళలు, రాత్రుళ్ల బస్సు రైల్వేస్టేషన్‌ల నుంచి సమీప గమ్యస్థానాలకు చేరేందుకు నిత్యం ఆటోవాలాలతో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పలువురు మహిళలు చెబుతున్నారు. అధికారులు కనీసం రాత్రుళ్ల ఆటోవాలాల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు మహిళలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## చిరస్మరణీయుడు డాక్టర్ రామకృష్ణ

● ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్

డాక్టర్ రామకృష్ణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఐఎంఏ సభ్యులు

తెనాలి, మారీసుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేద రోగులకు వైద్యసేవలు అందించిన డాక్టర్ కన్నెగంటి రామకృష్ణ చిరస్మరణీయులని ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో డాక్టర్ కన్నెగంటి రామకృష్ణ జయంతిని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం కేవలం 25 పైసలకే వైద్యసేవలందించారన్నారు. పలు సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాలలో పేద రోగులకు వైద్య సేవలందిచారని, వారి సేవలకు గుర్తింపుగా పలు సేవా పురస్కారాలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పావని ప్రియాంక, జాయింట్ సెక్రటరీ డాక్టర్ చందు ఉదయబాస్కర్, డాక్టర్లు శ్యాంప్రసాద్, చందు సాంబశివుడు, నరసింహారావు, ఎంవీ సత్యనారాయణ, గుమ్మడి సాంబశివరావు, ఓకే మూర్తి వి.శేషగిరిరావు, కె.శ్రీనివాసరావు, జేవీ సుబ్బారావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వైద్యుల సేవలు ఎనలేనివి: వెంకటపూర్ణచంద్

డాక్టర్ సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న స్వర్ణపురి మహిళలు

వైద్యులను సన్మానిస్తున్న క్లబ్‌ల ప్రతినిధులు

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్ చెప్పారు. రోటరీ కార్యాలయంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వైద్యులు రవీంద్రనాథ్, శరత్‌రాజ్, జీవనలత, తలశిల రాకేష్, చందు ఉదయబాస్కర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యదర్శి జీవీ నారాయణ, హరిప్రసాద్, వెంకటరత్నం, మురళీకృష్ణ, రాంబాబు, జగదీశ్వరాంబ, కిషోర్, అర్జున్ పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ సంయుక్తలను సన్మానించారు. వెలగ శరత్‌బాబు, రామమోహనరావు, నిర్మల, కనకరత్నం, వెంకటేశ్వరరావు, బ్రహ్మం, నాగిరెడ్డి పాల్గొన్నారు.

#### పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ టి సాయిప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు వి యూన్సీరాణి, జి శోభ, పి నిర్మల, శ్రీలక్ష్మీ, పి రంగవల్లి, శేషుకుమారి, దారా కృష్ణకుమారి, పి ఉమాకుమారి, బి దెబలాబేబీ, ఎస్వీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన జగన్నాథస్వామి ఉత్సవాలు

సుభద్ర అమ్మవారికి సారె తెస్తున్న మహిళలు

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ స్వామి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. నాజరుపేట ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో మంగళవారం బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో సుభద్రాదేవి సారె ఉత్సవం నిర్వహించారు. రథోత్సవం అనంతరం జగన్నాథుడు, బలరాముడు, సుభద్రాదేవిలను ఆలయంలో గుండిచా మందిరంలో విడిది చేశారు. పట్టణంలోని మహిళలు చీర, సారె, పూలు, పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. రథోత్సవం పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించిన 51 అంశాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ విద్యార్థులు 21బహుమతులు సాధించి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. ముగింపు ఉత్సవంలో పినపాడు కోలాట బృందం కోలాటం చేస్తూ జగన్నాధుడి కీర్తనలతో ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించారు. బలరాము గోవిందు ప్రభు, వైష్ణవి, భార్గవ్, వెంకటేష్, అపూర్వ, ఆశ్రిత, గాయత్రి, సుబ్రహ్మణ్యం, శివశంకర్ పాల్గొన్నారు.

### వైభవంగా వీవీఐటీయూ 'జగన్నాథ రథయాత్ర'

జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థులు

పెదకాకాని, జులై 1 (ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాథుని రథయాత్రకు సంఘీభావంగా వీవీఐటీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వీవీఐటీయూ 'జగన్నాథ రథయాత్ర' మంగళవారం వైభవంగా జరిగింది. పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి వీవీఐటీ విశ్వవిద్యాలయం వరకూ సాగిన ఈ రథయాత్రను వివా వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. వేలాది మంది భక్తులు, విద్యార్థులు, ఇస్కాన్, విదేశీ భక్తుల సంకీర్తనల నడుమ వేడుక శోభాయమానంగా ముందుకు సాగింది. గోళ్లమూడిలో భక్తులు పూలు జల్లుతూ రథయాత్రకు స్వాగతం పలికారు. అనంతరం ఇస్కాన్ సభ్యులు వీవీఐటీ యూనివర్శిటీ వద్ద దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహా హారతి నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వివా, వీవీఐటీయూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఇస్కాన్ ముంగళగిరి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దశావతార వెంకన్న స్వామికి ఆషాడ పట్టీ తీసుకొచ్చిన మహిళా భక్తులు

## దశావతార వెంకన్నకు ఆషాడ పట్టి అందజేత

పెదకాకాని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో ఆషాడమాసం సందర్భంగా గుంటూరు నగరానికి చెందిన భక్తులు స్వామి వారికి ఆషాడ పట్టి మంగళవారం సమర్పించినారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలి: డీఈవో

నారాకోడూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఉపాధ్యాయుల కుమార్తెలను అభినందిస్తున్న డీఈవో రేణుక

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి సీవీ రేణుక అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులను కలిసి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన గురించి ఆరాతీశారు. ఈ ఏడాది నూతనంగా 165మంది విద్యార్థులు ఎన్‌రోల్ కావడంపై హర్షవ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు పరిశీలించేందుకు బేస్ లైన్ టెస్ట్ నిర్వహించి ఫలితాల ఆధారంగా బోధన చేయాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కోలా ప్రసాద్ తన ఇద్దరు కుమార్తెలను ఇదే పాఠశాలలో చేర్పించారన్న విషయం తెలుసుకుని ప్రత్యేకంగా డీఈవో వారిని అభినందించారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా ఏపీసీ పద్మావతి, ఐసీడీవో సుజాత, హెచ్ఎం ఏడుకొండలు పాల్గొన్నారు.

## డెంగీ జ్వరంపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్నపూర్ణ

డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి అన్నపూర్ణ

తెనాలి, మారీసుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు డెంగీ జ్వరంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ హాస్పటల్ ప్రాంగణం నుంచి జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్నపూర్ణ జాతీయ డెంగ్యూ మాసోత్సవ అవగాహన ర్యాలీని పచ్చ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీపై అవగాహన కలిగించేందుకు ఈ నెల 31 వరకు మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీని నిర్వహించి శివాజీచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంహెచ్‌వో డాక్టర్ ఎం.ఏసుబాబు, నందులపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.ప్రియంక, జిల్లా సహాయ మలేరియా అధికారి ధరావత్‌రాజునాయక్, పట్టణ సహాయ మలేరియా అధికారి సి.ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి భాస్కరరావుకు జన్మదిన శుభాకాంక్షలు

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 91వ పుట్టిన రోజు జరుపుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు అందించారు. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లో ఆయన గృహానికి వెళ్లి శాలువా, సంపంగి పూలదండతో సత్కరించారు. కారుమంచి శ్రీనివాస్, నన్నపనేని బసవయ్య, కోగంటి తరుణ్, దావులూరి శ్రీనివాస్, గుమ్మడి రవీంద్ర, శాస్త్రి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్‌కు రీజియన్ బెస్ట్ క్లబ్ అవార్డు

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురంకు ఆంధ్రా రీజియన్ బెస్ట్ సెకండ్ క్లబ్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాలలో అత్యుత్తమ సేవలు అందించిన క్లబ్‌లను గుర్తించి అవార్డులు అందించారని అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఈ అవార్డుతో పాటు పలు సేవలకు 9 అవార్డులు, పది సర్టిఫికెట్లు ఈ క్లబ్‌కు దక్కాయని తెలిపారు.

## పొగాకు కొనుగోలు కేంద్రంలో జేసీ తనిఖీ

పొగాకును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

పెదకాకాని, జులై 1 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టరు భార్గవ్ తేజ పెదకాకానిలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ)లో ఏర్పాటుచేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను కొనుగోలు కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు పొగాకు కొనుగోళ్లు నిదానంగా జరుగుతున్నాయన్నారు. మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ సీడబ్ల్యూసీ సిబ్బంది ఉదయం ఆలస్యంగా రావడం వలన కొనుగోళ్లు ఆలస్యమవుతోందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐతా నాగేశ్వరావు, పొగాకు సేకరణ ముఖ్య అధికారులు రమేష్, సుబ్రహ్మణ్యంలు గోడౌన్‌కు వచ్చిన పొగాకు నాణ్యతను ఎలా పరీక్షిస్తారో రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కృష్ణకాంత్, మండల వ్యవసాయ అధికారి కె. రమణకుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసింహ

## మురుగుతో ముంచేశారు.. సబ్ కలెక్టర్‌కు రైతుల మొర

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): సెయింట్ మేరీస్ కళాశాల నిర్వాహకులు తమ నిర్లక్ష్య వైఖరితో పంట భూములను, పొలాలకు వెళ్లే రహదారిని మురుగుతో ముంచేశారని సబ్ కలెక్టర్ వద్ద రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ నారాకోడూరులో పర్యటించారు. గ్రామంలో సెయింట్ మేరీస్ కళాశాల మురుగు నీటి వివాదంపై విచారణ చేపట్టారు. వ్యర్థాలను డొంక రోడ్డులోకి పెద్దఎత్తున విడుదల చేస్తున్నారని, ఇరువైపులా ఉన్న పంట భూముల్లోకి మురుగుచేరి.. తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు సబ్ కలెక్టర్‌కు వివరించారు. దీనిపై ప్రశ్నించిన తమను కళాశాల యాజమాన్యం బెదిరింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. కళాశాల నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడమే కాకుండా.. కళాశాల, వసతి గృహాల నుంచి వచ్చే మురుగును పంట భూముల్లోకి అక్రమంగా విడుదల చేయడంపై సమగ్ర విచారణ జరపాలని రైతులు కోరారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను సబ్‌కలెక్టర్ సంజనాసింహ ఆదేశించారు.

రైతులకు వివరిస్తున్న డీపీఎం రాజకుమారి, పక్కన వ్యవసాయాధికారులు

## ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

● 'పొలం పిలుస్తోంది'లో డీపీఎం రాజకుమారి

తెనాలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రసాయనాలను వినియోగించి పంటలను సాగుచేసే రైతులకు పెట్టుబడులు పెరగడమే తప్ప ఆశించినంత దిగుబడి రావడంలేదని, ప్రకృతి సహజంగా తయారుచేసే జీవామృత ఎరువలతో తయారుచేసి సాగుచేసే ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని సహాయ వ్యవసాయ సంచాలకులు (డీపీఎం) రాజకుమారి చెప్పారు. మండలంలోని కొలకలూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రాజకుమారి విచ్చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించారు. ఏవో సుధీర్‌బాబు మాట్లాడుతూ విత్తన శుద్ధి ఆవశ్యకతను రైతులకు వివరించారు. ప్రతిరైతు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని కోరారు. ఉద్యాన శాఖ అధికారులు, ఆదర్శరైతులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు, ఆస్తి పన్ను పెంపుతో సామాన్యులపై భారం

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాబుప్రసాద్

తెనాలి అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల విధానం, ఆస్తి పన్ను పెంపు కోసం సర్వే, సామాన్యులపై భారం పడుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బాబుప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు స్మార్ట్ మీటర్లను వెనక్కి పంపాలని కోరుతూ నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా మంగళవారం సుందరయ్యనగర్ సుల్తానాబాద్‌లో అవగాహన కల్పించారు. పారిశ్రామికవేత్త అదాని ప్రయోజనాల కోసం స్మార్ట్ మీటర్లు తెచ్చారని ఆరోపించారు. వాటిని ఇంటింటికి ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు చూస్తూ ఊరుకుంటే బిల్లుల భారం పెరిగిపోయి భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. మరోపక్క పట్టణాల్లో ఆస్తి పన్ను పెంచేందుకు మోడల్ వార్డులో సర్వే చేపట్టారని, పూర్తి కాగానే ఆస్తి పన్నులు కూడా పెంచుతారని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచేవరకు ఒకమాట గెలిచిన తరువాత మరోమాట చెబుతూ మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో బాబురావు, బుజ్జి, పౌలు, సూరిబాబు, బాలస్వామి, యేసేబు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **Avuthu Sreenivasu Reddi** (old name) S/o **Veera Reddi**, R/o Door No. 5-23-48, Bank Employees Street, Flat No. 501, Jagadish Enclave, Jayaprakash Nagar, Tenali Town, Guntur Dist., Andhra Pradesh - 522 201, have changed my name to **Avuthu Srinivasa Reddy** S/o **Veera Reddy** hereafter my name is known as **Avuthu Srinivasa Reddy** S/o **Veera Reddy**.

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్**
ప్రభుత్వ సంస్థ - ప్రాయోజిత బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హెడ్ ఆఫీస్, 4/1 బ్రాడీపేట, రఘుమ్యాన్షన్, గుంటూరు-522002, ఫోన్ : 0863-2261125, 2324500

**నెలవారి అద్దె ప్రాతిపదికన గోడౌన్ కావలెను**

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, ప్రధాన కార్యాలయం వారికి బ్యాంకు రికార్డ్స్ భద్రపరుచుటకు పెదకాకాని మండలం నంబూరు గ్రామములో లేక నంబూరు చుట్టు పక్కల ప్రాంతాలలో కార్పెట్ ఏరియా **4000 SFT** నుండి **5000 SFT** మరియు క్రింద తెలిపిన సదుపాయాలు గల గోడౌన్ నెల వారీ లీజు నిమిత్తం కావలెను.

- ❖ తక్షణమే ఉపయోగించుకొనగల స్థితిలో ఉండవలెను.
- ❖ గోడౌన్ మెయిన్ రోడ్‌కు దగ్గరలో ఉండవలెను.
- ❖ ఎలుకలు, చెదలు మరియు వర్షపు నీటి లేకీజీల నుండి పూర్తిగా సురక్షితమైన గోడౌన్ కావలెను.
- ❖ భూమి లేదా భవనం పై ఎటువంటి చట్టపరమైన వివాదాలు లేదా అడ్డంకులు ఉండకూడదు.
- ❖ గోడౌన్ ఆవరణ వరదలకు గురయ్యే లేదా నీరు నిలిచిపోయే ప్రాంతంలో ఉండకూడదు.

పైన తెలిపిన సదుపాయాలు కల గోడౌన్ యజమానుల నుండి బిడ్లు స్వీకరించడం జరుగుతుంది. బిడ్ అప్లికేషన్ ఫారాలు క్రింది చిరునామాలో లేదా బ్యాంకు **website : apgb.bank** నందు లభించును. బిడ్ అప్లికేషన్ ఫారాలు సమర్పించు యజమానులు వాపసు ఇవ్వదగిన 5000/- కాషన్ డిపాజిట్ డిడి రూపంలో బిడ్ అప్లికేషన్ ఫారాలతో సహా సమర్పించవలెను.ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఈ టెండర్‌ను రద్దు చేయు అధికారము బ్యాంకు వారికి కలదు.

బిడ్ అప్లికేషన్ ఫారాలు లభించు చిరునామా : **General Manager, Services Department, Head Office, APGB, 4th floor, D.No:5-37-231, Raghu Mansion, 4/1 th lane,Opp: Sankar Vilas, Brodipet, Guntur. Ph No : 9490158007**

బిడ్ అప్లికేషన్ ఫారం సమర్పించుటకు చివరి తేదీ మరియు సమయం : - 14.07.2025 సాయంత్రం 4.00 గంటలకు

తేదీ : 02.07.2025

**జనరల్ మేనేజర్, ప్రధాన కార్యాలయం, గుంటూరు**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 2 జూలై 2025

# ఇంటింటికీ టీడీపీ

- ప్రతి కుటుంబాన్ని కలవనున్న టీడీపీ నేతలు
- సంక్షేమం, అభివృద్ధిపై ప్రచారం

## నేటి నుంచి నెలరోజులు 'సుపరిపాలనలో తొలి అడుగు'

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి తొలి ఏడాది పాలనపై సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట నెలరోజుల పాటు మళ్లీ ఇంటింటికీ వెళ్లనుంది. తొలి ఏడాదిలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని నిర్ణయించింది. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మొదలుకానుంది. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాల పేరిట టీడీపీ కార్యకర్తలు గడపగడప తొక్కారు. మళ్లీ ఇప్పుడు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర సంక్షేమాలకు సంబంధించి ఇంటింటికీ తిరిగి వివరించనున్నారు.**




(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో 7.50లక్షల కుటుంబాలున్నాయి. ప్రతి ఇంటికీ దగ్గరయ్యేందుకు కుటుంబ సాధికారిక సారధి (కేఎస్ఎస్) వ్యవస్థను టీడీపీ తీసుకువచ్చింది. 30 కుటుంబాలకు ఒక కేఎస్ఎస్‌ను నియమించింది. దీంతో పాటు బూత్‌కన్వీనర్లు, కోకన్వీనరు, గ్రామ కమిటీ, క్లస్టర్, మండల కమిటీలు, మున్సిపల్, కార్పొరేషన్లలో, గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేస్తున్నారు. మండల కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, జిల్లా కమిటీలు ఉన్నాయి. అంటే ఒక్కో నియోజకవర్గంలో సుమారు 800 నుంచి వెయ్యి వరకు కమిటీలు ఉంటాయి. వీటిల్లో ఉండేవాళ్లందరూ నెల రోజులపాటు వారి పరిధిలోని 30 ఇళ్లకు వెళ్లి సంవత్సరకాలంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించనున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొననున్నారు.

### సంక్షేమం.. అభివృద్ధి ఇలా..

- తల్లికి వందనం ద్వారా జిల్లాలో తొలి విడతలో 2,41,119 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.361,67,085 జమ అయ్యాయి.
- జగన్ హయాంలో ఐదేళ్ల గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టలేదు. చంద్రబాబు సర్కారు పల్లెపండుగ పేరుతో పెద్దఎత్తున సీసీరోడ్లు, డ్రైనేజీ, తారురోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం గాను రూ.117.30 కోట్లు కేటాయించారు. తొలి ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా రూ.73.43 కోట్ల వ్యయంతో 161.04 కి.మీ సిమెంటు రోడ్లు నిర్మించాలని శ్రీకారం చుట్టారు.
- వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, డయాలసిస్ పేషంట్లకు పింఛన్ మొత్తాన్ని చంద్రబాబు ప్రభుత్వం పెంచింది. జిల్లాలో అన్నిరకాల పింఛన్లు కలుపుకుని రూ.2,67,898 ఉన్నాయి. సుమారు రూ.80 కోట్ల మేర ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు.
- దీపం పథకంలో భాగంగా ఉచిత సిలిండర్ల ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి 3,74,821 మంది లబ్ధిపొందారు. రెండో విడతలో ఇప్పటివరకు 1,32,356మంది సిలిండర్లు తీసుకున్నారు.
- అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ పేదలు, కార్మికులకు ఊరటనిచ్చింది. రూ.15కే మూడుపూటలా రుచికరమైన నాణ్యమైన ఆహారం ఇక్కడ దొరుకుతోంది. కడపలో మూడు, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, ఎర్రగుంట్లలో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటరును బట్టి ఉదయం టిఫిన్‌కు 300 మందికి, మధ్యాహ్నం 500మందికి, రాత్రి 200 మందికి భోజనం అందిస్తున్నారు.
- గత టీడీపీ హయాంలో నిర్వహించిన డీఎస్సీనే.. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆరేళ్ల తరువాత చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ డీఎస్సీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 705 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి.
- బుగ్గవంక అంటే మొన్నటి దాకా గబ్బువంకలా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన పనులు వేగవంతం చేస్తున్నారు. బుగ్గవంకలో పేరుకుపోయిన కంప ఇతర చెట్లను తొలగించి ఇప్పుడు శుభ్రంగా తయారు చేశారు.

### సుపరిపాలన గురించి వివరిస్తాం

సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ఏడాదిగా సుపరిపాలన సాగుతోంది. ఎన్నికల్లో చెప్పినట్లుగా సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోంది. ఇప్పటికే పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత ఇసుక, దీపం సిలిండరు, అన్నక్యాంటీన్లు.. ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ఇక పల్లెల్లో సీసీం రోడ్లు కళకళలాడుతున్నాయి. ఈవిషయం ప్రతి ఇంటికీ వెళ్లి వివరించనున్నాం. అవసరం అయితే రచ్చబండ నిర్వహించనున్నాం. ప్రతి ఇంటికీ వెళ్లి ఆ వివరాలను ప్రత్యేకఐటీడీపీ యాప్‌లో నమోదు చేయనున్నారు.

- ఆర్.శ్రీనివారెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

## రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

- లోకేశ్‌ను వేడుకున్న బాధితురాలు

చిన్నారులతో మంత్రి లోకేశ్‌ను కలిసి సమస్య వివరిస్తున్న మైదుకూరుకు చెందిన స్వాతి

తాడేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లో గత ఏడాది అక్టోబర్ 19వతేదీన జరిగిన బాంబ్ బ్లాస్ట్‌లో తన భర్త కె.రాజేశ్ మృతి చెందారని, రాష్ట్ర ప్రభుత్వం తనకు ఉద్యోగం కల్పించి పరిహారం అందించాలని కడప జిల్లా మైదుకూరుకు చెందిన మహిళ స్వాతి లోకేశ్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ముగ్గురు పిల్లలతో కలిసి ఉండవల్లి ప్రజాదర్బార్‌కు వచ్చారు. మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తన భర్త ఆర్మీలో పని చేసేవారని, అప్పటి బాంబ్ బ్లాస్ట్‌లో చనిపోగా కేంద్ర ప్రభుత్వం పరిహారం అందజేసిందని రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిహారం అందజేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ముగ్గురు పిల్లలతో జీవనానికి ఇబ్బందిగా ఉందని తన కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని మంత్రిని వేడుకున్నారు. చిన్నారులు తమ తండ్రి ఫొటోతో మంత్రి లోకేశ్ వద్దకు వచ్చి దీనంగా నిలబడిన తీరు కలిచివేసింది. ఆమె సమస్యను విన్న మంత్రి లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## కళాశాల సమాచారం అప్‌డేట్‌లో ఉండాలి

- ఆర్జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి

మాట్లాడుతున్న ఆర్జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి

కడప ఎడ్యుకేషన్,జూలై 1 (ఆంధ్రజ్యోతి): కళాశాల సమాచారం ఎప్పుడూ అప్‌డేట్‌లో ఉండాలని ఆర్జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి సూచించారు. ప్రతి నివేదిక ఆన్‌లైన్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయాలని మంగళవారం కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాష ఆధ్వర్యంలో బోధనేతర సిబ్బందికి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎన్ఆర్‌సీ పరిధిలోని ఏడు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనేతర సిబ్బందికి పరిపాలన సంబంధిత రికార్డుల నిర్వహణ మెలకువలను ఆర్జేడీ తెలియజేశారు. రీసోర్స్ పర్సన్స్‌గా విజయ్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.శివాంజనేయులు, సూపరింటెండెంట్ అనేక సందేహాలను నివృత్తిచేశారు. కడప, ఎర్రగుంట్ల, మైదుకూరు, పెండ్లిమర్రి, వేంపల్లె, పోరుమామిళ్ల, పులివెందుల మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అధునాతన వసతులతో పూలే గురుకులం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన తరగతుల పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో అధునాతన వసతులతో మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయం త్వరలో అందుబాటులోకి రానుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో నూతనంగా ఏర్పాటైన మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపుదిద్దుకున్న గురుకులం వెనుకబడిన తరగతులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనుందన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాలయాన్ని త్వరలో నూతన భవనంలోకి మారుస్తామన్నారు. రెండు నెలల్లోపు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ మాధవి, డీఈ జగదీశ్వరరెడ్డి, డీఈవో షంషుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యానందరాజులు, కాంట్రాక్ట్ ఏజెన్సీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు

7

- రెండు నెలల్లో దాదాపు రూ.7కోట్లకు పైగా స్వాహా
- వాట్సప్ కాల్ కొత్త నెంబర్లతో వస్తే స్పందించవద్దు

## అత్యాచారం కేసులో జీవిత ఖైదు

7

## సీఎం ఆదేశాలకూ దిక్కు లేదా?

- ఒంటిమిట్ట అభివృద్ధికి బీజం పడేనా?
- టూరిజం సర్క్యూట్‌లో భాగమయ్యేనా?
- బ్రహ్మోత్సవాల సమయంలోనే టీటీడీ హడావుడి
- భక్తుల ఆందోళన

6

## 95 శాతం పింఛన్ల పంపిణీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లా 95 శాతం ప్రగతి సాధించింది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో విడుదల చేసిన 7,112 పింఛన్లకు గాను 6,861 పింఛన్లు పంపిణీ చేసి 96.47 శాతం ప్రగతి సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. లింగాల మండలంలో 5,080 పింఛన్లకు గాను 4,619 శాతం పింఛన్లు పంపిణీ చేసి 90.93 శాతం ప్రగతితో చివరి స్థానంలో నిలిచింది.

## అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప మారుతీ నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడు రాష్ట్రంలో గల తిరవణ్ణామలై అరుణాచల గిరి ప్రదర్శనకు కడప రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఈనెల 9, 10 తేదీలలో ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. అరుణాచలం వెళ్లేవారు ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని కోరారు.

## ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, సీఈ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అనుబంధ లా కళాశాలల విద్యార్థులకు ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం వైవీయూలో ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమార్ మాట్లాడుతూ 684 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, 99 మంది గైర్హాజరయ్యారని అన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ఈనెల 9వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్ డాక్టర్ వి.రామకృష్ణ కేంద్రాన్ని పరిశీలించారు.

## తొలివిడత ముగిసిన అడ్మిషన్లు

- ట్రిపుల్‌ఐటీలో 878 మందికి ప్రవేశాలు
- మిగులు సీట్లు 132
- త్వరలో రెండవ జాబితా విడుదల

అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న ట్రిపుల్‌ఐటీ అధికారులు

వేంపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మొదటి విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ మంగళవారం ముగిసింది. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరారు. రెండు రోజుల్లో 1010 మందికి కాల్‌లెటర్లు పంపగా 878 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 132 సీట్లు మిగిలిపోయాయి. డైరెక్టర్ కుమారస్వామి గుప్త పర్యవేక్షణలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో ఈనెల 5వ తేదీన మొదటి విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ ముగుస్తుంది. అన్ని ట్రిపుల్‌ఐటీల్లో మిగులు సీట్లకు రెండో విడత ఎంపిక జాబితా విడుదల చేస్తామని అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు. కాగా అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు చెందిన అంచెన శ్రీధర్ అనే విద్యార్థి అడ్మిషన్ కోసం ఇడుపులపాయ క్యాంపస్‌కు వచ్చాడు. ఆ విద్యార్థి ఇటీవల ప్రమాదానికి గురై నడవలేని విషయం తెలుసుకొని అతని అడ్మిషన్‌ను త్వరితగతిన పూర్తిచేయించి చేర్పించారు. ఏఓ రవికుమార్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బంగారు దుకాణాలపై విజిలెన్స్ దాడులు

వేంపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని బంగారు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ, సిబ్బంది గీతావాణి, రామకృష్ణ మంగళవారం గాంధీరోడ్డులోని బంగారు దుకాణాన్ని తనిఖీ చేశారు. తూకాలు, రికార్డులు పరిశీలించారు. ఈ విషయం తెలియడంతో మిగతా బంగారుదుకాణాలు మూతవేశారు. విజిలెన్స్ అధికారులు వచ్చారని తెలియడంతో వస్త్రదుకాణదారులు కూడా మూతవేసి ఉంచారు. దీనితో విజిలెన్స్ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్లిపోయారు. ఈ విషయంపై అధికారులను విలేకరులు ప్రశ్నించగా దుకాణాలు మూతపడ్డాయి అందుకే వెనుదిరిగి వెళ్తున్నామని చెప్పారు.

## జలాశయాలలో చేపలవేట నిషేధం

కడప రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గండికోట, బ్రహ్మంసాగర్, సోమశిల వెనుక జలాల్లో ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలలపాటు చేపలవేట నిషేధించామని ఉప మత్స్య సంచాలకులు నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జలాశయాలలో జూలై, ఆగస్టు నెలలు సహజంగా చేపల సంతానోత్పత్తి జరిగే కాలమని పేర్కొన్నారు. నిషేధ కాలంలో ఎవరైనా చేపల వేట చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వైసీపీ నేత భూదాహం

- 80 ఎకరాల గుట్టపోరంబోకు స్థలం ఆక్రమణ
- చదును చేసి పంటల సాగు
- పట్టించుకోని రెవెన్యూ అధికారయంత్రాంగం

గుట్టపోరంబోకు స్థలంలో సాగైన పంటలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో వైసీపీ నేతల భూదాహానికి అడ్డు, అదుపు లేకుండా పోయింది. గుట్టల్ని సైతం కరిగించి వేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి పంటల సాగుకు తెరలేపారు. తాజాగా కమలాపురం మండలం టి.సుంకేసుల, తురకపల్లె గ్రామాల పరిధిలోని భారతి సిమెంటు పరిశ్రమ వద్ద గుట్టపోరంబోకు ఆక్రమణకు గురైన విషయం వెలుగుచూసింది. తురకపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దాదాపు 80 ఎకరాల వరకు గుట్టను ఆక్రమించుకుని పండ్ల తోటలు సాగు చేశారని గ్రామస్థులు తెలిపారు. పేదప్రజల పేర్లు చెప్పి గుట్ట మొత్తం వైసీపీ నేతలు ఆక్రమించేసుకున్నారని అంటున్నారు. వైసీపీ నాయకులు భూకబ్జాకు పాల్పడేందుకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అడ్డగోలుగా ఆక్రమించిన భూములకు విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి అనుమతులు లేని గుట్టపోరంబోకు భూములకు విద్యుత్ ఎలా ఇచ్చారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొండను కబ్జా చేయడంతో పశువులకు మేతకు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతోందని వాపోతున్నారు. ఇది ఒక కమలాపురం మండలంలోనే కాదు.. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇలానే ఉంది. ఇప్పటికైనా ఆక్రమిత భూమిని అర్హులైన నిరుపేదలకు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఇదిలా ఉండగా గుట్టపోరంబోకు ఆక్రమణల విషయమై కమలాపురం తహశీల్దారు శివరామిరెడ్డిని వివరణ కోరగా, ఈ అంశం తమ దృష్టికి రాలేదని, అయినప్పటికీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

### అధికారులు స్పందించాలి



తురకపల్లె, టి.సుంకేసుల గ్రామపొలాల్లో భారతిసిమెంటు పరిశ్రమ సమీపంలో ఉన్న గుట్టను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి. పట్టా రైతులు విద్యుత్ పర్మిషన్ కోసం విద్యుత్‌కార్యాలయం చుట్టూ తిరిగినా స్పందించని అధికారులు.. గుట్ట పోరంబోకుకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఎలా ఏర్పాటు చేస్తారు? దీనిపైనా అధికారులు పరిశీలించాలి.

- రామిరెడ్డి గంగాధర్ రెడ్డి

# సీఎం ఆదేశాలకూ దిక్కు లేదా?

కోదండ రామాలయం

● ఒంటిమిట్ట అభివృద్ధికి బీజం పడేనా? ● టూరిజం సర్క్యూట్‌లో భాగమయ్యేనా?
● బ్రహ్మోత్సవాల సమయంలోనే టీటీడీ హడావుడి ● భక్తుల ఆందోళన



ఒంటిమిట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో టీటీడీ, టూరిజం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా గత ఏప్రిల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒంటిమిట్టను సందర్శించారు. కల్యాణం అనంతరం టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు, జిల్లా కలెక్టర్ తదితరులతో ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు.

ఒంటిమిట్ట ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారని, పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తిరుపతి, కాణిపాకం, తాళ్లపాక, గండికోట, ఒంటిమిట్ట, కాళహస్తితో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని టీటీడీ, టూరిజం అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్టలో వసతుల మెరుగుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

రామతీర్థం, లక్ష్మణ తీర్థాల యొక్క ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలన్నారు. రామాయణం, హిందూతత్వం విలువలను తెలిపే విధంగా పోతనగిరిపై శ్రీరామ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులందరికీ అన్న ప్రసాదం అందించేందుకు అన్నదాన భవనాన్ని నిర్మించాలన్నారు. ఒంటిమిట్టను టూరిజం సర్క్యూట్‌లో చేర్చడంలో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచడంతోపాటు, యాత్రికుల సౌకర్యాలను మెరుగుపరచడానికి ఒక ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఈ ఆదేశాలిచ్చి ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్నా అధికారుల్లో ఇప్పటివరకు చలనం లేదు. దీంతో కేవలం బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే టీటీడీ అధికారులు హడావుడి చేసి తర్వాత పట్టించుకోరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఆదేశాల అమలుకు నోచుకొనేలా పనులు త్వరగా పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

### అన్నప్రసాద భవనాన్ని నిర్మించాలి

ఒంటిమిట్టలోని కోదండరామాలయం వద్ద నిత్యాన్నదాన భవనాన్ని నిర్మించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించి 2 నెలలు గడుస్తున్నా అధికారుల్లో చలనంలేదు. ఇప్పటికైనా పనులను వెంటనే ప్రారంభించాలి.

- రుద్రరాజు భానుప్రకాష్‌రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు

### ఆదేశాలు అమలు చేయాలి

బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించిన మేరకు అభివృద్ధి పనులపై. ఇప్పటివరకు అధికారులు దృష్టిసారించలేదు. వెంటనే పనులు ప్రారంభించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

- షేక్ అజుంతుల్లా, మండల కోఆప్షన్ మాజీ మెంబరు

## వివాహిత మృతి కేసులో వీడిన మిస్టరీ

● హత్యగా నిర్ధారించిన పోలీసులు
● భర్త, అతని సోదరి, తల్లి, అమ్మమ్మ అరెస్టు

నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ కృష్ణమోహన్, పీలేరు పోలీసులు

పీలేరు,జూలై1(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెలో ఆదివారం ఉదయం వెలుగు చూసిన హిందూజా అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆమె భర్త, అత్త, ఆడపడచు, భర్త అమ్మమ్మ, భర్తతో వివాహేతర సంబంధం కలిగిన మహిళ కలిసి హత్య చేశారని పోలీసులు తేల్చారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ కథనం మేరకు బందార్లపల్లెకు చెందిన వరంపాటి విజయశేఖర రెడ్డికి, బెంగళూరుకు చెందిన హిందూజాకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వివాహమైన రెండేళ్ల వరకు బాగా సాగిన వారి కాపురం, విజయభాస్కర రెడ్డికి ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగా చెడింది. హిందూజాను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలన్న లక్ష్యంతో అతను తన తల్లి శాంతమ్మ, సోదరి సునంద, అమ్మమ్మ అమ్మణ్ణమ్మతో కలసి వేధించేవాడు. అదనపు కట్నం తెమ్మని వేధించడమే కాకుండా శారీరకంగా హింసించేవాడు. ఈ నేపథ్యంలో గత శనివారం రాత్రి గ్రామస్తులందరూ బందార్లపల్లె సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో గంగ జాతరకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన వారు హిందూజా గొంతు నులిమి హత్య చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించేందుకు మృతదేహాన్ని బందార్లపల్లె సమీపంలోని ఓ బావిలో పడేశారు. అయితే, భయం వేయడంతో గుండెపోటుతో నిద్రలోనే కన్నుమూసిందని అందరినీ నమ్మించేందుకు ఆమె మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీసి ఇంటిలో పడుకోబెట్టారు. నిద్రలో తన భార్య కన్నుమూసిందని విజయశేఖర రెడ్డి తన స్నేహితులు, బంధువులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు, బంధువులకు వేర్వేరు కథనాలు చెప్పడంతో అనుమానం వచ్చిన హిందూజా తల్లి జీవనజ్యోతి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నిజం అంగీకరించారు. దీంతో పీలేరు పోలీసులు వారిని మంగళవారం రాత్రి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించిన పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్, వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## చెన్నకేశవాలయ భూముల సాగు హక్కులు వేలం

● రూ.1.95 లక్షల ఆదాయం

చెన్నకేశవస్వామి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దతిప్పసముద్రం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సాగు హక్కుల వేలంతో మండలంలోని చెన్నకేశవాలయానికి రూ.1.95 లక్షల ఆదాయం చేకూరినట్లు ఈవో మునిరాజ్ తెలిపారు. మండలంలోని పోతుపేట, బూర్లపల్లె, పీటీఎం చెరువు కట్ట కింద ఆలయానికి 13 ఎకరాల భూమి ఉంది. పోతుపేట సమీపంలోని 7 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు దేవదాయ శాఖ అధికారులతో కుమ్మక్కై పదిహేనేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగు చేసుకుంటున్నారు. రెండు నెలల క్రితం ఆ భూమికి వేలం నిర్వహించగా, తాము పంట సాగు చేశామని కొద్ది సమయం కావాలని వేలాన్ని వాయిదా వేయించారు. దేవదాయ శాఖ అధికారులు వారికే వత్తాసు పలికారు. ఎట్టకేలకు మంగళవారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ వేలం నిర్వహించగా వైసీపీకి చెందిన బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి, టీడీపీకి చెందిన గూటం ఈశ్వరప్ప తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు రూ.1.65 లక్షలకు ఏడు ఎకరాల భూమిని ఏడాదిపాటు సాగు చేసుకునేందుకు గూటం ఈశ్వరప్ప హక్కులు దక్కించుకున్నారు. దీంతో భూమిలో ఉన్న పంటను తొలగించే వరకు తమకు సమయం ఇవ్వాలని, ఆ భూమిలో ఉన్న గుట్టలను తొలగించేందుకు ఖర్చు చేయడంతో ఫలసాయంలో తమకు వాటా ఇవ్వాలంటూ ఈశ్వరప్ప ఈశ్వరప్ప చేసిన డిమాండ్ చేశారు. దేవదాయ శాఖ అధికారులు సైతం వైసీపీ నాయకుల వైపే మొగ్గు చూపుతున్నారని, 20 ఏళ్లుగా దేవదాయ శాఖ అధికారులు మామూళ్లు తీపసుకుని వారికే అప్పచేప్పేందుకు సన్నాహాలు చేస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. పోతుపేట గ్రామం పిడుంవారిపల్లె వద్ద గల 2.35 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన మద్దిరెడ్డి రూ. 25,500 లకు దక్కించుకున్నారు. పీటీఎం వద్ద ఉన్న భూమిని అదే గ్రామస్తులు దక్కించుకున్నారు. లీజు ప్రాధిపదికన ఆలయానికి మొత్తం రూ 1.95 అక్షల ఆదాయం చేకూరినట్లు అధికారులు తెలిపారు.

## ఉద్యాన పరిశోధన కేంద్ర పనులు షురూ..

● భూమి చదును చేస్తున్న యంత్రాలు ● పరిశోధన విభాగాన్ని విభజిస్తూ కంచె ఏర్పాటు ● నూతన వంగడాల అభివృద్ధికి చర్యలు

ఉద్యాన పరిశోధన కేంద్రంలో వినియోగంలోకి తెచ్చిన భూమి

పరిశోధనల విభాగాన్ని విభజిస్తూ వేసిన ఫెన్సింగ్

బి.కొత్తకోట, జూలై1(ఆంధ్రజ్యోతి): నూతన వంగడాల సృష్టితో ఉద్యాన రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో బి.కొత్తకోట మండలంలోని బయప్పగారిపల్లి పంచాయతీలో నెలకొల్పిన ఉద్యానపంటల పరిశోధన కేంద్రం ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై ఉనికి కూడా కోల్పోయే దుస్థితి నెలకొంది. గత టీడీపీ హయాంలో 80 ఎకరాలను సేకరించి రైతులకు ఉపయోగకరంగా ఉండే నూతన వంగడాలను ఉత్పత్తి చేసి, ఉద్యాన రంగానికి ఊతమందించాలని ప్రభుత్వం భావించింది. అయితే, ప్రభుత్వం మారడంతో లక్ష్యం కూడా మారింది. పరిశోధనలు, వంగడాలు వగైరాలను పక్కన పెట్టి గత ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. మళ్ళీ కూటమి ప్రభుత్వం రాగానే ఈ పరిశోధన కేంద్రం పనుల్లో కదలిక మొదలైంది. డా.వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేసి, ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలను నియమించి నూతన వంగడాలపై పరిశోధనలను చేయించాలని ప్రభుత్వం భావించింది. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.మాధవి ఫిబ్రవరి 6న ఈ పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతానికి ఐదు ఎకరాలలో పరిశోధనలు మొదలు పెడతామని, అనంతరం విస్తరిస్తామని ప్రకటించారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా పరిశోధనలపై అడుగు ముందుకు పడక పోవడంపై ఆంధ్రజ్యోతిలో జూన్ 13న ఉద్యాన పంటల పరిశోధనలు ఏవీ? అన్న శీర్షికన కథనం వెలువడింది. దీనిపై ఉద్యానశాఖ అధికారులు స్పందించారు. అందుబాటులో ఉన్న నిధులతో భూమిని చదును చేయించారు. 2 బోర్లు వేయించారు. విద్యుత్ కనెక్షన్‌కు రుసుము చెల్లించారు. పరిశోధనలకు ఎంపిక చేసిన స్థలాన్ని వేరు చేస్తూ ఫెన్సింగ్ వేశారు. దీనిపై స్థానికంగా నియమితులైన శాస్త్రవేత్తలు ప్రతాప్, దత్తారెడ్డిలు మాట్లాడుతూ హార్సిలీహిల్స్ దిగువ భాగంలో ఉన్న ఈ పరిశోధన కేంద్రంలో త్వరలో పరిశోధనలు ప్రారంభిస్తామని, రైతులకు అధిక ఉత్పత్తులు, రోగనిరోధక శక్తితో కూడిన కూరగాయలు, పండ్ల వంగడాలను ఉత్పత్తి చేస్తామని తెలిపారు

## నిప్పంటించుకుని యువతి ఆత్మహత్య

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

కలికిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం లేని ఒక యువతి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు స్థానిక జగనన్న కాలనీకి చెందిన కందూరి యర్రయ్య కుమార్తె కందూరి చందన (23)కు ఆరోగ్యపరమైన సమస్యలున్నాయి మానసిక స్థిమితం కూడా లేదు. మంగళవారం తెల్లవారు జామున ఇంటినుంచి బయలుదేరి, నగరిపల్లె మార్గంలోని పెట్రోలు 5 లీటర్ల పెట్రోలు కొనుగోలు చేసింది. ఎస్టీ కాలనీ సమీపంలోని కలికిరి చెరువు వంకలోకి వెళ్లి ఒంటిపై పెట్రోలు పోసుకుని తగలబెట్టుకుంది. ఉదయం స్థానికులు ఆమె మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు జగనన్న కాలనీకి చెందిన చందనగా గుర్తించారు. ఆమె పెట్రోలు కొను గోలు చేసిన విషయం పెట్రోలు బంకులోని సీసీ కెమెరాలో నమోదైనట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కలికిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కలికిరి వాల్మీకిపురం సరిహద్దులోని యర్రావాండ్లపల్లె సమీపంలోని జాతీయ రహదారి టోల్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కలికిరి సర్పంచు యల్లయ్య కుమారుడు వినేష్ (28) తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న వినేష్‌ను టోల్‌గేట్ వద్ద కర్నాటకకు చెందిన బొలెరో వాహనం ఢీ కొంది. దీంతో మోటారు సైకిలు నుజ్జునుజ్జు కాగా, వాహనం కూడా బోల్తా పడింది. కలికిరి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. బొలేరో వాహనం డ్రైవరు పోలీసులకు లొంగిపోయాడు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో కంటైనర్



పోలీసుల అదుపులో ఉన్న కంటైనర్

కురబలకోట, జులై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, 12 మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదానికి కారణమైన కంటైనర్ ఆపకుండా వెళ్లిపోవడంతో, దానిని పట్టుకునేందుకు పోలీసులు రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. కదిరి నుంచి పుంగనూరు వరకు సీసీ కెమెరాలను పరిశీలించి ప్రమాదానికి కారణమైన కంటైనర్ వాహనాన్ని గుర్తించారు. తమిళనాడుకు వెళుతున్న ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముదివేడు పోలీస్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ చెంగల్‌పట్టుకు చెందిన హరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

## పోలీసు అధికారుల సేవలు మరువలేనివి : ఎస్పీ

● పదవీ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులకు సన్మానం

పదవీ విరమణ పొందిన అధికారులతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎన్నో త్యాగాలు చేసి సుదీర్ఘకాలం పోలీసుశాఖకు సేవలందించిన అధికారుల సేవలు మరువలేనివని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. జూన్ నెలలో పదవీ విరమణ పొందిన జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఎస్ఐ రెడ్డెయ్య, మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ పీ. శ్రీహరి, మదనపల్లి వన్‌టౌన్ పోలీస్టేషన్ ఏఎస్ఐ బీ.గణపతి, జిల్లా ఆర్మ్ రిజర్వు ఏఎస్ఐ ఎస్.గౌస్‌మొహిద్దీన్, మన్నూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఏ. శంకరయ్యను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు సమావేశ మందిరంలో ఎస్పీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో చేరి దశాబ్దాల తరబడి సమాజానికి సేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్, రామనాథ్‌హెగ్డే, డీఎస్పీలు ఎస్. మహేంద్ర, ఎంఆర్ కృష్ణమోహన్, ఎం.శ్రీనివాసులు, ఏవో జే.త్రినాథ సత్యం, ఇన్‌స్పెక్టర్లు పీ. రాజారమేశ్, కే. రాజారెడ్డి, ఎం. చంద్రశేఖర్, ఎం. తులసీరాం, వీజే రామకృష్ణ, ఎం. పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు హాజరయ్యారు. ు

## దళితుడిపై దాడి కేసులో నిందితులను అరెస్టు చేయాలి

● పోలీస్ స్టేషన్ ఎదుట మాలమహానాడు ధర్నా

ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబీకులు

వాల్మీకిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ కోటపల్లెకు చెందిన చింతపర్తి గురునాథ్‌పై జూన్ 27న జరిగిన దాడిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని మాల మహానాడు అధికార ప్రతినిధి మల్లెల మోహన్, జిల్లా అధ్యక్షుడు శివయ్య తెలిపారు. గురునాథ్‌ను గ్రామ సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లి బోయపల్లెకు చెందిన భార్గవ్, అతని అనుచరులు 15 మంది కులం పేరుతో దూషిస్తూ దాడి చేశార ఆరోపించారు. ఈ విషయంపై కేసు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు, మాలమహానాడు నాయకులు గుందా మనోహర్, వెంకటస్వామి, శివారుపల్లె సుధాకర్, నాగార్జున, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో రసాభాస

● సిద్దవరంలో ఏకగ్రీవం, తొమ్మిది చోట్ల పోటీ

ఏకగ్రీవంగా ఎన్నికైన సిద్దవరం టీడీపీ గ్రామ కమిటీ సభ్యులతో ఎన్నికల పరిశీలకుడు దేవరింటి శ్రీనివాసులు

మదనపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి) నియోజకవర్గ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో మంగళవారం జరిగిన టీడీపీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా తెలుగు తమ్ముళ్లు గొడవపడ్డారు. దీంతో పోలీసుల బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఽ మండలంలో మంగళవారం 10 గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. వాటిలో సిద్దవరం టీడీపీ గ్రామ కమిటీ మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకుడు దేవరింటి శ్రీనివాసులు తెలిపారు. తొమ్మిది చోట్ల పోటీ నెలకొందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించగా సిద్దవరం గ్రామ కమిటీ అధ్యక్షుడుగా సి. నాగమల్లప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె. రవి ఎన్నికైనట్లు తెలిపారు. గుర్రంవాండ్లపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీలో ఉండగా కోటకాడపల్లి గ్రామ కమిటీ అధ్యక్ష పదవికి ఆరుగురు, శివపురం గ్రామ కమిటీ పదవికి పది మంది, వెలిగల్లు టీడీపీ గ్రామ కమిటీ పదవికి 14 మంది, బండమీదపల్లికి పదిమంది, ఎన్‌వోపల్లి టీడీపీ గ్రామ కమిటీ పదవికి ఆరుగురు, కలిచెర్ల ఏడుగురు, సి. గొల్లపల్లికి ఎనిమిది మంది, పెద్దమండ్యంకు 12 మంది పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. వెలిగల్లు బండమీదపల్లి, ఎన్‌వోపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో క్రమశిక్షణ వీడి దుర్భాషలాడుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణ నెలకొనడంతో పోలీసులు సర్దిచెప్పారు. మండలంలో 17 గ్రామ కమిటీలుండగా 6 గ్రామ కమిటీలు ఏకగ్రీవం కాగా 11 చోట్ల పోటీ నెలకొన్నట్లు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఇస్మాయిల్, గంగాధర, మనోహర్‌నాయక్, నటరాజ్‌నాయక్, రామాంజులు, రామకృష్ణరెడ్డి, ఆయా గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పెద్దమండ్యం, తంబళ్ళపల్లి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వర, స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా!

● రామానాయుని చెరువులో ఆగని తవ్వకాలు

రామానాయుని చెరువులో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

గుర్రంకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఇసుకాసురులు తుంగలో తొక్కేస్తున్నారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్ల తో ఇసుకను తవ్వి సిద్ధం చేస్తుండగా, పగటి వేళల్లో దానిని ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం మండలంలోని రామానాయుడి చెరువు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నవారికి, స్థానిక రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. గుర్రంకొండ మండలం తరిగొండ పంచాయతీ పరిధిలో రామానాయునిచెరువు ఉంది. ఈ చెరువులో ఇసుక మేటలు అధికంగా ఉన్నాయి. ఈ ఇసుకను కొన్ని నెలలుగా కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుకాసురులను మందలించి కట్టడిచేశారు. రెవెన్యూ అధికారులు చుట్టూ ట్రెంచ్ కొట్టించారు. దీంతో కొన్ని రోజులు ఇసుక అక్రమ రవాణకు అడ్డుకట్టపడింది. ప్రస్తుతం మండలంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు సిబ్బంది మారడంతో ఇసుకాసురులు మళ్లీ ఇసుక అక్రమ రవాణా ప్రారంభించారు. ప్రతి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో చెరువులో ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులే దర్శనమిస్తున్నాయి.ఈ విషయమై వారం రోజుల క్రితం తరిగొండలో ఇసుకాసురులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, పోలీసులకు తెలిపిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో మండల కేంద్రానికి వస్తున్న ఇసుక ట్రాక్టర్లు

### నేను ఏమీ చేయలేని పరిస్థితి...

రామానాయుని చెరువులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాట వాస్తవమే. ఇసుకాసురులకు నాయకుల అండదండలు ఉండడంతో మాపై తిరుగబడుతున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్లను విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్న ఏమీ చేయలేకపోతున్నాం.

- వెంకటరమణ, వీఆర్వో, తరిగొండ

# డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు

● రెండు నెలల్లో దాదాపు రూ.7కోట్లకు పైగా స్వాహా ● వాట్సప్ కాల్ కొత్త నెంబర్లతో వస్తే స్పందించవద్దు

కడప క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతూ డబ్బులను దోచేస్తున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పలువురు బాధితులు దాదాపు రూ.7కోట్ల మేర డబ్బులు పోగొట్టుకున్నారు. దీన్ని బట్టి సైబర్ కేటుగాళ్లు ఏ విధంగా మోసాలకు పాలపడుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. పులివెందుల ప్రాంతానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి ఫోన్లు చేసి మీపై డ్రగ్స్ కేసు ఉందని... మిమ్మల్ని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు వస్తాయని చెప్పడంతో ఆ ఉద్యోగి భయపడి రూ.1.8 కోట్లు డబ్బులు పోగొట్టుకున్నాడు. చివరికి అవమానం భరించలేక చనిపోయాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి.

డిజిటల్ అరెస్టు అనేది ఒక సైబర్ మోసం. సైబర్ నేరగాళ్లు వీడియోకాల్స్ చేసి తాము పోలీసులమనో, దర్యాప్తు అధికారులమంటూ నమ్మిస్తారు. బ్యాంకు ఖాతా, సిమ్‌కార్డు, ఆధార్‌కార్డువంటివి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారంటూ బెదిరింపులకు పాల్పడతారు. విచారణ పూర్తయ్యేంత వరకు ఇక్కడ నుంచి కదలడానికి వీలు లేదంటూ కట్టడి చేస్తారు. డబ్బులు చెల్లిస్తే వదిలేస్తామని లేకపోతే మిమ్మల్ని అరెస్టు చేస్తే మీ ప్రాంతాల్లో అవమానాలకు గురి కావాల్సిందంటూ హెచ్చరిస్తారు. ఖాతాలో డబ్బులు జమ అయ్యాక విడిచిపెడతామంటారు. అలా ఎక్కడికీ వెళ్లనీయకండా ఒక రకంగా అరెస్టు చేసినట్లుగా నిర్బంధించడమే డిజిటల్ అరెస్టు అంటారు. సాధారణంగా నకిలీ అరెస్టు వారెంట్లు, చట్టపరమైన చర్యల గురించి ప్రస్తావిస్తూ మోసాలకు పాల్పడుతుంటారు. ఫోను చేసి డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారంటూ వాట్సప్ ద్వారా మొదట కాల్ చేస్తారు. ఒకవేళ మీరు పట్టించుకోకపోతే ఆధార్ నెంబరుతో పాటు తొలుత హిందీ, మరియు ఇంగ్లీషు భాషల ద్వారా వివరాలు తెలుపుతారు. బ్యాంకు ఖాతా వివరాలు కూడా వారు మనకు తెలియకోకుండానే చెప్పగలరు. లైవ్ ఫొటో, అకౌంటు ఓపెన్ చేసి తరువాత మన బ్యాంకు ద్వారానే వీరు లోను పెట్టుకుంటారు. బాధితులకు ఓటీపీ నెంబరు వస్తే ఆ ఓటీపీని తెలుసుకుని తరువాత లోను పద్ధతి ద్వారా డబ్బులు కాజేస్తారు. ఇప్పుడు ప్రస్తుతం డిజిటల్ అరెస్టు స్కాం సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వినియోగిస్తూ వస్తున్నారు.

**విద్యావంతులు, చదువుకున్న వారే ఎక్కువ**

డిజిటల్ అరెస్టు కానీ ఏ ఇతర సైబర్ మోసాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ శాతం ఉద్యోగస్తులు, విద్యావంతులే ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా, టెక్నికల్‌గా పరిజ్ఞానం ఉన్నా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు. చివరికి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కేవలం ఈ రెండు నెలల వ్యవధిలోనే జిల్లాలో దాదాపు రూ.7కోట్ల మేర డబ్బులు పోగొట్టుకున్నారు.

**మోసపోయిన వారి వివరాలు..**

● ఇటీవల పులివెందులకు చెందిన ఓ రిటైర్డ్ లెక్చరర్‌ను డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు అతని వద్ద నుంచి దాదాపు రూ.1.8 కోట్లు స్వాహా చేశారు. ఈ అవమానం భరించలేక ఆయన ప్రాణాలు కోల్పోయాడు.

● డిజిటల్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ ఇంజనీరు రూ.3.2 కోట్లు డబ్బులు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించారు. అలాగే గత నెల కడపకు చెందిన ఓ మహిళా కాంట్రాక్టరు సైబర్ మోసగాళ్ల వలలో పడి రూ.1.5 కోట్లు పోగొట్టుకుని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

**డిజిటల్ అరెస్టులకు భయపడవద్దు..**

**- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్,**

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు వాట్సప్ వీడియో కాల్‌చేస్తే ఎవరూ భయపడాల్సిన పనిలేదు. వారి మాటలకు భయపడి డబ్బులు వేయవద్దు. సీబీఐ, ఎన్‌ఫోర్స్ మెంటు లాంటి సెంట్రల్ ఉద్యోగుల పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియోకాల్స్ చేస్తారు. కానీ దేశంలో అధికారులు ఎవరు కూడా వీడియోకాల్స్‌తో మాట్లాడరు. కొంత మంది సైబర్ నేరగాళ్లు డ్రగ్స్‌కు సంబంధించి అధికారుల పేర్లతో వీడియోకాల్ చేసి రూ.10లక్షలు, 20 లక్షలు డిపాజిట్ చేస్తే పూర్తి స్థాయిలో విచారించి.. మీ ప్రమేయం లేకపోతే డబ్బులు తిరిగి ఇస్తామని చెబుతారు. కానీ వారి మాటలు నమ్మవద్దు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మాత్రమే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తుంటారు. ఎవరైనా అధికా రులమంటూ వీడియోకాల్స్ చేస్తే తక్షణమే 1980 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేస్తే ఆ సైబర్ నేరగాళ్లను పట్టుకునే అవకాశం ఉంటుంది.

## శనగల వ్యాపారస్తులు మోసం చేశారు...

● డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు

డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కమలాపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో కష్టపడి శనగ పంట పండించి అమ్ముకుంటే.. డబ్బులు ఇవ్వాల్సిన వ్యాపారస్తులు మోసం చేశారంటూ మండల పరిధిలోని కోగటం గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ వారు మంగళవారం డిప్యూటీ తహసీల్దారు జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోగటం గ్రామానికి చెందిన ఎకిన్ బాషా, సతీష్, జిలానీ అనే ముగ్గురు శనగల వ్యాపారం చేసేవారన్నారు. వాళ్లు తమ వద్ద ఎంతో నమ్మకంతో శనగలు కొనుగోలు చేశారన్నారు. మొదట్లో శనగలు వేసిన రైతులకు బాండ్లు ఇచ్చి డబ్బులు తరువాత ఇస్తామని చెప్పడంతో నమ్మి మోసపోయామన్నారు. తరువాత డబ్బులు ఇవ్వాలని అడగ్గా అదిగో ఇదిగో ఇస్తామంటూ కాలయాపన చేశారన్నారు. ఇలా నాలుగేళ్లు కాలం గడిపారని.. ఇప్పుడు డబ్బులు ఇవ్వాలని గట్టిగా నిలదీస్తే.. డబ్బులు ఇవ్వకపోతే దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. దాదాపు రూ.6 కోట్లు ఎగ్గొట్టారని... అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని.. లేకపోతే ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కోగటం గ్రామానికి చెందిన కొందరు నాయకులు వ్యాపారస్తుల ఆస్తులను రాయించుకున్నారని.. తమకు మాత్రం డబ్బులు ఇవ్వకుండా దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. స్థానిక నాయకులు ఈ విషయం బయటకు రాకుండా నాలుగేళ్లుగా తొక్కిపెట్టారని.. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## రిమ్స్‌లో అన్నదాన సేవ

రిమ్స్‌లో అన్నదానం

అన్నదానం నిర్వహిస్తున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప సెవెన్ రోడ్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుళ్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదాన సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి రిమ్స్‌కు వైద్యం కోసం వచ్చే వారితో పాటు వారి సహాయకులు ఆకలితో ఇబ్బం దులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో గత సంవత్సరం నవంబర్ నుంచి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి వారం సుమారు 1000 భోజన పొట్లాలు, మనిషికి రెండు వాటర్ ప్యాకెట్లు పంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భోజనం ప్యాకెట్ ప్యాకింగ్, అన్నదాన వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్నారని తెలిపారు.

## ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, జులై 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు ఈనెల 12, 13, తేదీలలో (శని, ఆది) నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సింగం భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. 12వ తేదీ కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో అండర్-15, అండర్-17, విభాగాలకు చెందిన బాల, బాలికల ఎంపికలు జరుగనున్నాయన్నారు. 13వ తేదీ ఆదివారం ప్రొద్దుటూరు పట్టణ జార్జి క్లబ్‌లో అండర్-11, అండర్-13 బాల, బాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్‌లో విడివిడిగా పోటీలు నిర్వహించి తదుపరి జిల్లా జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 10వ తేదీ సాయంత్రం లోగా 9440107080 అనే నెంబర్‌కు పంపించాలని కోరారు. కాగా డబుల్స్ విభాగంలో పాల్గొనే వారు తమ పార్టనర్ పేరు తప్పనిసరిగా జతచేసి పంపించాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరు కావాల్సి వుంటుందన్నారు. సింగిల్స్ విభాగంలో మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడాకారులు, అలాగే డబుల్స్ విభాగంలో ప్రథమ విజేతగా నిలిచిన జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారన్నారు.

## అత్యాచారం కేసులో జీవిత ఖైదు

తిప్పాబతిని క్రిష్ణయ్య ఆలియాస్ ఓబులయ్య

కడప క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైలవరం పీఎస్ పరిధిలో 2022 సంవత్సరంలో ఓ వివాహితపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1,01,000లు జరి మానా విధిస్తూ కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్ కుమార్ తీర్పునిచ్చారు. వివరాలిలా.. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన తిప్పాబతిని క్రిష్ణయ్య అలియాస్ ఓబులయ్య అదే గ్రామానికి చెందిన మానసికస్థితి సరిగా లేని ఓ వివా హిత ఇంట్లో ఒక్కటే ఉండగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విష యం ఆమె భర్తకు తెలపడంతో 11.01.2022 తేదీ మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి మైలవరం పీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.రామక్రిష్ణ కేసు నమోదు చేసి జమ్మలమడుగు రూర ల్ సీఐ కొండారెడ్డికి అప్పగించారు. ప్రస్తుతం సదరు కేసు కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి రమేశ్‌కుమార్ ముందుకు విచారణకు రాగా నిందితుడు నేరస్తుడిగా నిరూపణ కావడంతో జీవిత ఖైదు మరియు రూ.1,01,000లను జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా నేరస్తుడికి శిక్షపడేలా చేసిన రూరల్ సీఐ గోపాల్ రెడ్డి, ఎస్ఐ శ్యాంసుందర్, అధికారులు, సంబంధిత కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది ని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించారు.

## 10 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం

● 73 పరుగుల స్వల్ప ఆధిక్యంలో నెల్లూరు జట్టు

సాయిచరణ్, రెహన్, వరుణ్‌సాయినాయుడు, ధీరజ్‌కుమార్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, జులై 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా రెండవ రోజైన మంగళవారం అనంతపురం జట్టు తన ప్రత్యర్థి జట్టు చిత్తూరుపై 10 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగుర వేసింది. అలాగే నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 73 పరుగుల ఆధిక్యత సాధించింది.

**ఏసీఏ క్రికెట్ మైదానంలో...:** అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంత పురం జట్టు మొద టి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవ ర్లలో 5 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఇందులో రెహన్ 108 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా వుండగా ఓవర్‌నైట్ స్కోర్ 179 పరుగులతో తిరిగి రెండవరోజైన మంగళ వారం బ్యాటింగ్‌కు దిగి మొత్తంగా 58.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రెహన్ 163 పరుగులు సాధించారు. దీంతో అనంతపురం జట్టుకు 71 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధికృత లభించింది. కాగా బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ సాయిచరణ్ 6 వికెట్లు సాధించడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 34.5 ఓవర్లలో కేవలం 99 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో అనంతపురం బౌలర్ వరుణ్‌సాయినాయుడు 7 వికెట్ల సాధించి చిత్తూరు జట్టు పతనాని కి కారకుడయ్యారు. దీంతో 28 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి కేవలం 4.2 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 29 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది.

**కేఓఆర్ఎం మైదానంలో..:** నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 69.3 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 129 పరుగులతో రెండవ రోజైన మంగళవారం బ్యాటింగ్‌కు దిగి మొత్తం 67.3 ఓవర్లలో 303 పరుగు లకు ఆలౌట్ అయింది. ఇందులో ధీరజ్ కుమార్‌రెడ్డి 70 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 71 పరుగుల స్వల్ప ఆధిక్యత లభిం చింది. కాగా నెల్లూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమ యానికి 38 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 144 పరుగులు చేసింది. ఇందులో రోహిత్ 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

హసీన (ఫైల్ ఫొటో)

పులివెందుల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతబజార్‌కు చెందిన హసీన (45) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... మంగళవారం ఉదయం 6గంటల ప్రాంతంలో వివేకానంద పాఠశాల సమీపంలో దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని చుట్టుపక్కల గాలింపు చేపట్టగా ఓ మహిళ మృతదేహం కనిపించింది. అప్పటికే ఆ మృతదేహం ఉబ్బిపోయి కుళ్లిపోయే స్థితిలో దుర్వాసన వస్తోంది. మృతురాలి వివరాల కోసం పోలీసులు ఆరా తీసి గుంత బజార్‌కు చెందిన హసీనాగా గుర్తించారు. ఈమెకు వివాహం కాలే దు. ఒంటరి మహిళగా జీవిస్తోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు.

## 30 రేషన్ బియ్యం బస్తాలు పట్టివేత

ప్రొద్దుటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని ఆచార్లకాలనీ వద్ద అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 30 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ ఎస్ఐ హనుమంత్ తెలిపారు. మల్లా వీరాంజనేయులు అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఒక్కో బస్తా 48 కేజీల వంతున 30 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్న వీరాంజనేయులతో పాటు గోపాల క్రిష్ణ, దినకర్ అనే వ్యక్తులను కూడా అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ డీటీ మల్లికార్జున, ఎఫ్ఐ మహేంద్రా రెడ్డిలకు పోలీసులు అప్పగించారు.

## పోలీసుల అదుపులో దొంగలు

లింగాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటర్లు, స్టార్లర్లు, బిందుసేద్యం పరికరాలు, పలు రకాల ట్రాక్టర్ పరికరాలను రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఘటనలు వరుసగా కొద్ది రోజుల నుంచి లింగాల మండలం బోనాల గ్రామంలో చోటుచేసుకుంటున్నాయి. అయితే సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు పొలాల్లోకి వెళ్లి స్టార్టర్‌ను దొంగలించి ఇంటికి వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి గ్రామంలో రోడ్డుపై కిందపడ్డారు. ఈ సంఘటనను గమనించిన కొందరు గ్రామస్థులు మంగళవారం లింగాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై లింగాల స్టేషన్ బాధ్యతలను చూస్తున్న పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీ వల్లిని వివరణ కోరగా దొంగలు అదుపులో ఉన్న విషయం నిజమేనని.. వారిని విచారణ చేస్తున్నామని తెలిపారు.

## కడప ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

శస్త్రచికిత్స అనంతరం తొలగించిన కణితి

కడప సెవెన్ రోడ్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసు పత్రిలో మంగళవారం రామాంజనేయులు (37) అనే వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. పులివెందుల మండలం తుమ్మలపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులుకు కడప ప్రభుత్వ సూపర్‌స్పె షాలిటీ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేసి అతని కుడి వైపు అడ్రినల్ గ్రంథిలో సుమారు పది సెంటీ మీటర్ల పరిమాణంలో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. దీన్ని ఫియోక్రోమోసైటోమా వ్యాధిగా గుర్తించారు. ఈ వ్యాధి వలన అనియంత్రిత రక్తపోటు, తీవ్రమైన గుండెదడ, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి చాలా అరుదైనది. సగటు ప్రతి పది లక్షల మందిలో ఐదుగురిలో మాత్రమే కనిపిస్తుంది. ఎండోక్రైనాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో యూరా లజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫె సర్ డాక్టర్ శ్రీదీప్, అనస్తీషియా విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సునీ ల్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర సమన్వయంతో గత మంగ ళవారం శస్త్రచికిత్సను (ఓపెన్ అడ్రి నలెక్టమీ) విజయవంతంగా నిర్వహిం చారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని ఐసీయూలో పరిశీలనకు ఉంచి, ఆరో గ్యస్థితి మెరుగుపడడంతో ప్రస్తుతం సాధారణ వార్డుకు తరలించారు. త్వరలోనే రామాంజనేయులును డిశ్చార్జి చేస్తామని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు గండి క్షేత్రంలో టెండర్లు

చక్రాయపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న శ్రావణమాసోత్సవాల సందర్భంగా బుధవారం సీల్డ్ టెండర్లు, బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమి షనర్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, చలువపందిళ్లు, బారికేడ్ల ఏర్పాట్లు, ఫొటోలు, వీడియోల రికార్డింగ్, స్వాగత ఆర్చీలు, ప్రత్యేక భజంత్రీల ఏర్పాట్లకు సంబంధించి సీల్డ్ టెండర్లు, దేవస్థా ఆవరణలో తాత్కాలిక అంగళ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకు నేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అలంఖా న్‌పల్లె వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు అలంఖాన్‌పల్లెకు చెందిన ఓబయ్య (55) సొంత పని నిమిత్తం మాచుపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి రాత్రి బైపాస్ రోడ్డు ద్వారా ఇంటికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వైద్యశిక్షణ సమీపంలోకి రాగానే రోడ్డు డివైడరుకు స్కూటరు ఢీకొనడంతో కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఘనంగా డీసీసీబీ చైర్మన్ జన్మదిన వేడుకలు

డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి కేక్‌ను తినిపిస్తున్న రితేష్‌రెడ్డి, విజయమ్మ, అభిమానులు

బద్వేలుటౌన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీసీసీబీ కార్యాలయంలో మంగళవారం డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఆత్మీయులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అభిమానులు, స్నేహితులు శాలువాలతో సత్కరించి కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ రందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అభిమానులు, ఆత్మీయులు అనాథ శరణాలయం, ఆసుపత్రుల్లో పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్లు అరవ శ్రీనివాసులరెడ్డి, పల్లె శ్రీనివాసు లరెడ్డి, పల్లె రమేష్‌రెడ్డి, పాటూరి రాధాక్రిష్ణారెడ్డి, మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, వెంగల్‌రెడ్డి, రాయచూరి ప్రసాద్, శివయ్యస్వామి, రెడ్డెయ్య, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఒకే సం.లో టెన్త్, ఇంటర్**

ఒకే సంవత్సరంలో టెన్త్, ఇంటర్ పాస్ (APOSS 100%) ఓపెన్ ఇంటర్‌తో పాటు రెగ్యులర్ ఇంటర్ M.P.H.W., M.L.T., C.S.E. కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. సెల్ : 62815 10785
Ajc-245153

**ముస్లీం వివాహ సంబంధాలు**

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. **స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో,** నంద్యాల జిల్లా. సెల్: **87908 44959** (2వ సంబంధాలు కలవు)
AJL-236636

**CHANGE OF NAME**

RAHAMTHU MEAH SHAIK (old name) S/o. SHAIK JAFFAR SAB, R/o. D.NO.8/34, SAVAIPURA STREET, KADAPA, Y.S.R KADAPA DIST., A.P., INDIA-516001. Do hereby change my name to SHAIK RAMTHU MIYA (New Name), Hence forth then now I may be called as SHAIK RAMTHU MIYA.
AJC-245160

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్,షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: **7382114647.**
AJA- 237881

**ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి**

**యూనిట్ కార్యాలయం**
**9985411183**
**9985411189**

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

## 'కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం వివక్ష'

కార్పొరేషన్ ఎదుట అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప ఎర్రముక్కపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కడప నగరం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారానికి కొద్దిరోజులుగా చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతుగా నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆఫీసు వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ మోకాళ్లపై కూర్చొని తమ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ యూనియన్ కార్యదర్శి సుంకర కిరణ్, వడ్లపల్లె శ్రీధర్, బాబు నాగరాజు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే కార్యకర్తలకు న్యాయం : లోకేశ్

మంత్రి లోకేశ్‌తో వేణుగోపాల్‌రెడ్డి

వేంపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. వేంపల్లెకు చెందిన టీడీపీ యువనాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి మంగళవారం ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసి మాట్లాడారు. పార్టీలో పనిచేసిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వేంపల్లెలో ఉన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, యువతకు ఉద్యోగాలు పెంచే కార్యక్రమాలు చేస్తున్నామని లోకేష్ చెప్పినట్లు వారు తెలిపారు.

**గెస్ట్‌ఫ్యాకల్టీకి న్యాయం చేయండి..:** ఎనిమిదేళ్లుగా ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాం. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేరామన్న ఉద్దేశంతో ఎన్నో ఇబ్బందులు పెట్టారు. మా తర్వాత చేరిన వారికి రూ.39వేల వేతనం ఇస్తుండగా మాకు మాత్రం రూ.25వేలు మాత్రమే ఇస్తున్నారు. పనికితగ్గ వేతనం ఇప్పించి న్యాయం చేయాలని ఐటీశాఖ మంత్రి నారాలోకేష్‌కు ఆర్జీయూకేటీ గెస్ట్‌ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్, లోకనాథ్, మణికిరణ్ తదితరులు కలిసి వినతిపత్రం ఇచ్చారు.

## రైల్వే చార్జీలపెంపు రద్దు చేయాలి

రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నేతలు

కడప సెవెన్‌రోడ్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ అర్ధరాత్రి నుంచి పెంచిన రైల్వే చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆకార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, తిమ్మయ్య పాల్గొన్నారు.

తిరుతని శాఖ (DPC: 3799)
నం.97/2బి, చిత్తూరు రోడ్డు, తిరుతని - 631209
ఫోన్: 044-2794 5255 / 94442 43799
ఇమెయిల్: cb3799@canarabank.com
కెనరా బ్యాంక్ Syndicate
ఇ-వేలం అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) / 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన
ఆస్తి వివరాలు
రిజర్వు ధర రూ.1,90,73,000/- ధరావత్తు రూ.19,07,300/- బిడ్ పెంపు రూ.1,00,000/-
ఇ-వేలం తేదీ & సమయం 22.07.2025 ఉదయం 11:30 గం. నుండి మ.12:30 గం.
ఇ-వేలం పోర్టల్: https://baanknet.com
తేది: 30.06.2025, ప్రదేశం: తిరుపతి అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

# కేసీ ఉపకాల్వలపై నిర్లక్ష్యం..!

●కోట్లు ఖర్చు పెట్టి కట్టింది పేడదిబ్బల కోసమా..? ●పొలాలకు దారి కోసం కాల్వలు నాశనం ● ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కొండపేటలో కేసీ ఉప కాల్వలో నిండుగా ఉన్న పేడదిబ్బలు

చెన్నూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గతంలో టీడీపీ హయాంలో ప్రపంచ బ్యాంకు నిధులతో మండలంలో కేసీ ప్రధాన కాల్వ, ఉప కాల్వల నిర్మాణం జరిగింది. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి పాతకడప చెరువుకు, అలాగే చెన్నూరు మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల భూములు సాగయ్యేలా ఈ కాల్వల నిర్మాణం జరిగింది. అప్పట్లో మట్టి,బురద కాల్వలుగా ఉన్న కేసీ ప్రధాన కాల్వ ఉపకాల్వలన్నీ కోట్లాది రూపాయలు ఇచ్చి ప్రపంచ బ్యాంకు నిధులతో కాంక్రీటు లైనింగ్‌గా మార్చి రైతులు సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. అయితే కాల్వ నిర్మాణం అప్పుడే పొలాలకు ఏ విధంగా నీరు పారాలి, డైవర్షన్ కాల్వలు, చిన్న చిన్న పంట కాల్వలు ఇలా అన్నిరకాలుగా ప్రతి ఎకరానికి నీరందేలా కాల్వ నిర్మాణం జరిగింది. అయితే ఖాజీపేట మండలం చెముళ్లపల్లె నుంచి కొత్తపల్లె మీదుగా ఆంజనేయపురం, కొండపేట మీదుగా కనుపర్తి, బలసింగాయపల్లె వరకు ఉపకాల్వ ఏర్పాటు చేశారు. కట్టిన కొన్నేళ్లపాటు ఈ కాల్వ రైతులకు ఉపయోగపడేది. అయితే కొత్తపల్లె వద్దనే కాల్వలకు అంతరాయం కలగడంతో ఆ నీటిని సక్రమంగా పారించుకునే విధంగా లేకుండా చేసుకున్నారు. ఫలితంగా కొండపేట కనుపర్తి ఉప కాల్వలకు నీటి రాక తగ్గింది. అయితే కేసీ అధికారులు దీనిపై దృష్టి పెట్టలేదు. చాలామంది రైతులు కాల్వకు నీరు కావాలని కొన్నేళ్లపాటు పదే పదే అడిగి విసుగు చెంది విరమించుకున్నారు. దీంతో కొండపేట వద్ద కేసీ ఉపకాల్వ పూర్తి నీరు రాక ఎండిపోయింది. దీంతో కాల్వకు ఇరువైపులా ఉన్న వారు ఆ కాల్వనంతా పేడ దిబ్బలుగా మార్చివేశారు.

**వంద మీటర్ల పొడవునా పేడదిబ్బలే..:** పంట కాల్వ అయిన కేసీ ఉపకాల్వ కొందరి నిర్లక్ష్యంతో అధికారులు పట్టించుకోక పేడ దిబ్బగా మారింది. కాల్వ చిన్నదై నాలుగు అడుగుల లోతుగా ఉండడంతో ఇష్టానుసారంగా పేడను, పశువుల మూత్రాన్ని అందులో వదులుకుంటున్నారు. పైగా అక్కడక్కడా లైనింగ్ కూడా పగలగొట్టడం, అందులో చెట్లు పెరగడం జరిగి పూర్తిగా పనికి రాకుండాపోయింది. పైగా ఇదే కాల్వ పక్కన కొండపేట చెరువు వైపు వెళ్లే చిన్నపాటి కల్వర్టు ఉంది. ఆ కల్వర్టు కింద వరకు పేడ దిబ్బలు కుక్కేశారు.

**పొలాల దారి కోసం కాల్వలు తెగ్గొట్టారు..:** ఇదే కొండపేట రెవెన్యూ గ్రామంలో హైస్కూలు వెనుకవైపు కేసీ ఉప కాల్వ ఉంది. ఆ కాలువనే కనుపర్తి వరకు వెళుతుంది. అయితే ఇదే కాల్వకు పై వైపున పొలాలున్న కొందరు రైతులు కాల్వకు నీరు ఇస్తే తాము పొలాలకు వెళ్లే దారి సరిగా ఉండదని ఏకంగా కాల్వనే తెగ్గొట్టారు. 1909లో బ్రిటీషు హయాంలో గరండా (కమాను) దాని మీదుగా కేసీ ఉప కాల్వ ఏర్పాటు చేశారు. అయితే ఈ దారికి పైభాగంలో ఉన్న కేసీ ఉప కాల్వ లైనింగ్ అంతా పగలగొట్టి ఒకవేళ కేసీ ఉపకాల్వకు నీరు వదిలినా పగలగొట్టబడిన లైనింగ్ నుంచి గరండాల కింద వైపు ఉన్న తెలుగుగంగ కాల్వలోకి నీరు వెళ్లనట్లుగా చేశారు. అంతేకాక ఈ గరండాల పైన ఉన్న కాలువ ప్రస్తుతం రైతులకు దారిగా మార్చుకున్నారు. అందులో ఆ రైతులవి పట్టాభూ ములు ఏమీ కావు. అక్రమంగా సాగు చేసుకున్న భూములే. ఈ కాల్వను పగల గొట్టడంతో ఇక కనుపర్తి, బలసింగాయపల్లె రైతులకు పూర్తిగా నీరు రాని పరిస్థితి ఏర్పడింది.

**రూపురేఖలు లేని కనుపర్తి కాల్వ..:** ఈ ఉపకాల్వనే కనుపర్తి రెవెన్యూ గ్రామ పొలాలకు గతంలో నీరందించింది. ఈ ఉపకాల్వల గుండా నీరు వస్తే మోటర్లు ఆడాల్సిన అవసరం ఉండదు. అయితే కొందరి నిర్లక్ష్యకారణంగా ఉపకాల్వను ఇష్టానుసారంగా పగలగొట్టి కనుపర్తి వైపు అసలు కేసీ ఉపకాల్వ ఉందా అన్న విధంగా దాని రూపురేఖలే లేకుండా చేశారు. మొత్తమ్మీద కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన కేసీ ఉప కాల్వలు మండలంలో ఒక్క కొండపేట, కనుపర్తి, బలసింగాయపల్లెను మినహాయిస్తే మిగతా అన్ని చోట్ల ఉపయోగపడుతున్నా ఈ మూడు రెవెన్యూ గ్రామాల్లో మాత్రం పనికిరాకుండా చేశారు. ప్రభుత్వ నిధులు వృథా, రైతులకు వ్యథ ఇది కొందరి స్వార్థంతో జరిగిన కథలాగా రోజూ ఈ మూడు గ్రామాల ప్రజలు చెప్పుకోవడం జరుగుతోంది. అధికారులు స్పందించి ఇప్పటికైనా ఈ కాల్వను బాగు చేస్తే భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడి ఎంతో మేలు చేస్తాయి.

కల్వర్టు కింది వరకు కుక్కినట్లు వేసిన పేడదిబ్బలు, చెడగొట్టబడిన కొండపేట కేసీ ఉప కాల్వ

## పోలింగ్ స్టేషన్ల తనిఖీ

పులివెందుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని 73 పోలింగ్ బూత్‌లను మంగళవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్ తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు తనిఖీ చేపట్టామన్నారు. పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు, పేర్ల తప్పులు ఉన్నాయా అని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. అలాగే 1200 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న బూత్‌లను విభజన చేసే అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ షేక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గృహం...

వేముల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేములలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం పులివెందుల ఏఎస్‌డబ్ల్యూఓ రామాంజనేయులు తనిఖీ చేశారు. హాస్టల్ వార్డన్‌తో కలిసి హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యంగా ఉంటోందా అని అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలలోని పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల బీమా నమోదు కోసం దరఖాస్తు చేసుకోండి

వల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలకు బీమా నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం దిగువపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంటల బీమా నమోదు కోసం ఆఖరు తేది 31.7.2025 అని వరి పంటకు మాత్రం 15.8. 2025 అని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ కుళాయ ప్ప,వ్య వసాయ సహాయకుడు దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

## చలో రాజమండ్రి సమావేశానికి
## రజకులు తరలిరండి

కడప మారుతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాజమండ్రి నగర శ్రీ వేంకటేశ్వర ఆనం కళాక్షేత్రంలో ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు తలపెట్టిన రజక ఆకాంక్ష సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి రజకులు తరలి రావాలని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చేలో రవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న జిల్లా రజక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కృష్ణమూర్తి, ఆంజనేయులు, ఎరికలయ్య, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు రూ.1000 కోట్లు బకాయిలు చెల్లించాలి

● డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి

కడప, కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రబీ సీజన్‌లో ధాన్యం సరఫరా చేసిన సుమారు 46 వేల మంది కౌలు రైతులకు రూ.1000 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరు లతో మాట్లాడుతూ విత్తనాల కోసం అప్పులు చేసి, ధాన్యం అమ్ము కున్న రైతులకు ఇప్పటికీ చెల్లింపులు అందక పోవడం అన్యాయ మన్నారు. కార్యక్రమంలోనాయకులు సిరాజుద్దీన్, విజయ కుమార్ సుశీల్, మొయిద్దీన్, మామిళ్ల బాబు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## అధిక కేసులు రాజీ అయ్యేలా సహకరించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై 5న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో పోలీసులతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కడప, అన్నమయ్య జిల్లాల సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుకాల పూజలు

రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

కడప కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడప విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా రాయలసీమ నలుమూలల నుంచి అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆ తల్లి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 వరకూ ప్రత్యేక పూజలు గావించారు.

## వాహనాల తనిఖీలో గంజాయి పట్టివేత

సింహాద్రిపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మంగళవారం సింహాద్రి పురంలోని సాయిబాబా గుడి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పార్నపల్లి వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు బైకుపై వచ్చారు. వారు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో తనిఖీ చేయగా 250 గ్రాము ల గంజాయి దొరికింది. వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

## దుప్పట్లు పంపిణీ

పులివెందుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో 30 మంది దివ్యాం గులకు దుప్పట్లు వితరణగా అందించారు. పట్టణంలోని వస్త్రవ్యాపారి టీడీ సుబ్బారావు 64వ జయంతిని పురస్కరిం చుకొని వారి కుటుంబ సభ్యులు దుప్పట్ల పంపిణీకార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సుబ్బారావు కుటుంబ సభ్యులు సుగుణాకర్,చంద్రశేఖర్, అవోపీ సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, లెక్చరర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు వితరణ

కడప నాగరాజుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆజాద్‌నగర్‌లో ఉన్న బృంద వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మంగళవారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జెల్ల రవికుమార్, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ సి.మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో నిత్యావసరసరుకులు అందేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'పెండింగ్ పనులు పూర్తి చేయాలి'

చెన్నూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు వద్ద హైవేలో పెండింగులో ఉన్న డ్రైనేజీ, సర్వీసురోడ్లు, బస్‌షెల్టరు త్వరగా పూర్తి కావాలని లేకపోతే టీడీపీ తరపున దేనికైనా సిద్ధమని, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శివారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఆకుల వెంకటచలపతి, టీడీపీ నేతలు నాగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి అన్నారు. చెన్నూరులో హైవే సిబ్బంది సాయిరెడ్డి, బాషాతో మాట్లాడుతూ వీలైనంతత్వరగా పనులు చేపట్టాలని అన్నారు. దీంతో హైవే అధికారులు మాట్లాడుతూ పనులు వాయిదా పడుతున్న మాట వాస్తవమేనని, ఒకమారు పనులు చేయాలని నిధులు మంజూరై వెనక్కి వెళ్లాయని, ఇప్పుడు కేబినెట్‌లో అప్రూవల్ కావాలని రాగానే పనులు చేపడతామని అన్నారు. ఈ కార్యక్ర మంలో నీటి సంఘం అధ్యక్షుడుశ్రీనివాసులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## వ్యాపారంగా మారిన వైద్యం : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గతంలో వైద్యుడిని భగవంతుడిగా చూసేవారని, ప్రస్తుతం మారిన కాలంలో వైద్యం వ్యాపారంగా మారి పోయిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని వేంపల్లెలోని మాజీ జడ్పీటీసీ డాక్టర్ బాష ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాషను, తులసిరెడ్డిని పలువురు డాక్టర్లు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లెకు చెందిన డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ప్రభుత్వ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు దేవుళ్లతో సమానం

కడప ఎడ్యుకేషన్,జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు దేవుళ్లతో సమానమని ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ లయన్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ కడప చాప్టర్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మను ప్రసాదిస్తున్న వైద్యులు కనిపించే దేవుళ్లన్నారు. పలువురు వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ కో-కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, బోగాల కొండారెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, రాఘవేంద్ర వర్మ,కొండూరు జనార్దన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు సహకరించండి

పులివెందుల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దోమల నివారణకు సహకరించాలని పులివెందులలోని బాకరాపురం యూపీహెచ్‌సీ వైద్యాధికారి శాంతికుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జయమ్మ కాలనీలో జాతీయ డెంగ్యూ నివారణ దినం సందర్భంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, సుజాత,ఆశాకార్యకర్త సులోచన, ప్రజలు పాల్గొన్నారు.

## చెప్పడమే తప్ప పూర్తి చేసేదెన్నడు.?

పీహెచ్‌సీ, ఎన్‌హెచ్‌లలో పనుల గతి అంతేనా..

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చీర్లసురేశ్‌యాదవ్

చెన్నూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు కింద పనులు అప్పగించినా హైవే రహదారుల్లో పనులు చేయాలని చెప్పినా అవి చేయకపోగా వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ గడువు కోరడం తప్ప పనులు జరిగే దెప్పుడు, ఇప్పట్లో పనులు ఏమైనా జరిగే అవకాశం ఉందా లేదా అంటూ ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూరు మండల పరిషత్ సభాభవనంలో మంగళవారం మధ్యాహ్నం ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పీహెచ్‌సీ పూర్తయితే పదిమందికి ఉపయోగ పడుతుందని ఎమ్మెల్యే కూడా పలుమార్లు చెప్పినా ఇంత వరకు ఎందుకు పట్టించుకోలేదని కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్ ఏఈ గంగిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 3న నంద్యాలలో సమావేశం ఉందని, ఆ సమావేశంలో కేసీ కెనాల్‌కు ఎప్పుడు నీరు వచ్చేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, తహసీల్దార్ సరస్వతి, మండలస్థాయి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నందిమండలంలో డెంగీపై అవగాహన ర్యాలీ

పెండ్లిమర్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):నందిమండలం గ్రామంలో మంగళవారం వైద్యుడు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది డెంగీ మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రామప్రతాప్,మార్గరేట్,రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

## పాడిపరిశ్రమతో ఆర్థిక ప్రగతి సాధ్యం

మహమ్మద్‌గౌస్
పశువైద్యాధికారి, చాపాడు

చాపాడు, జూలై1(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమతో గ్రామాల్లో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పశువైద్యాధికారి మహమ్మద్‌గౌస్ పేర్కొన్నారు. గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్ల పెంపకంపై ఆసక్తి పెంచుకోవాలని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

**పశ్న:** మండలంలో ఎన్ని పశువైద్యశాలలు ఉన్నాయి. సిబ్బంది ఎందరున్నారు?

**జవాబు:** మండలంలో చాపాడు, వెదురూరు, చిన్నగురవలూరు మూడు ప్రధాన పశువైద్యశాలలు ఉండగా 11 మంది సిబ్బంది పనిచేస్తున్నారన్నారు.

**పశ్న:** ఆవులు, గేదెలు, గొర్రెలు ఎన్ని ఉన్నాయి?

**జవాబు:** ఆవులు 2,812, గేదెలు 18,772, గొర్రెలు 24,700 ఉన్నాయి.

**ప్రశ్న:** మంచి రకం ఆవుల వివరాలు తెలుపండి. ?

**జవాబు:** జర్సీ, క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్ వంటి రకాల ఆవులు మండలంలో ఉన్నాయి.

**ప్రశ్న:** మండలంలో పాడిపరిశ్రమ ఏ విధంగా ఉంది ?

**జవాబు:** జిల్లాలోనే చాపాడు మండలంలో పాడిపరిశ్రమ ఎక్కువగా ఉంది. ఎక్కువ మంది రైతులు పాడిపరిశ్రమ పట్ల ఆసక్తి చూపుతున్నారు.

**ప్రశ్న:** రైతులకు సబ్సిడీకి గడ్డి విత్తనాలు ఇస్తున్నారా ?

**జవాబు:** గో-7 , సూపర్ మేఫియర్, ఏపీబీఎల్-4 మేలురకం గడ్డి విత్తనాలను పాడి రైతులకు అందిస్తున్నాం.

**ప్రశ్న:** మండలంలో పాలు రోజుకు ఎన్ని లీటర్లు ఉత్పత్తి అవుతున్నాయి?

**జవాబు:** మండలంలో రోజుకు 25,900 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి.

## జమ్మలమడుగులో చిరుజల్లులు

జమ్మలమడుగు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురిశాయి. నెల రోజుల నుంచి వర్షం లేక రైతాంగం వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

# మా పిల్లలను కాలనీలోనే చదివిస్తాం

●ఎక్కడికీ పంపించం ● మిద్దెల ఎస్సీ కాలనీ వాసులు ● విద్యార్థుల కోసం పోటా పోటీగా ఆటోలు పంపిన ప్రభుత్వ పాఠశాలల వారు

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో నిర్మల

విద్యార్థుల కోసం పోటా పోటీగా ఏర్పాటు చేసిన ఆటోలు

కాశినాయన జులై1(ఆంధ్రజ్యోతి) మాపిల్లలను బయటి పాఠశాలలకు పంపించమని మాగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే చదివించుకుంటామని మిద్దెల ఎస్సీకాలనీ వాసులు మంగళవారం ఎంఈవోకు తెలియజేశారు. గత ప్రభుత్వం మిద్దెల ఎస్సీకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోగల 3, 4, 5 తరగతులను నర్సాపురంలోని జడ్పీ ఉన్నతపాఠశాలకు అటాచ్ చేశా రు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని రద్దుచేసి నర్సాపు రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఎంపిక చేసి అక్కడికి కలిపారు. కానీ ఎక్కువ మంది విద్యార్థుల తల్లిదండ్రులు నర్సాపురం పంపుటకు ఇష్టపడక కాలనీకి సమీపంలోఉన్న మూలపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గత 10 రోజులుగా పంపు చున్నారు. దీంతో మూలపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేకంగా ఆటో ఏర్పాటు చేశారు. ఇది గమనించిన నర్సాపురంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు మిద్దెల ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థులను నర్సాపురం పాఠశాలకే పంపాలని తాముకూడా ప్రతిరోజు విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పిస్తామంటూ ముందుకువచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం రెండు పాఠశాలలకు సంబంధించిన ఆటోలు విద్యార్థుల కోసం మిద్దెల ఎస్సీకాలనీకి వచ్చాయి. విద్యార్థులను ఎక్కడికి పంపాలో తేల్చుకోలేని వారి తల్లిదండ్రులు కాలనీలో ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఎక్కడికీ పంపమని కాలనీలోనే చదువుకొనేలా అవకాశం కల్పించాలని కోరారు. ఈవిషయంపై ఎంఈవో మాట్లాడుతూ ప్రస్తుతానికి ఇక్కడి 3,4,5 తరగతుల విద్యార్థులను నర్సాపురం ప్రైమరీ మోడల్ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. మీ పాఠశాల సమస్యను జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళతానని వారు అనుమతిస్తే ఇక్కడే చదివించుకోవచ్చని తెలిపారు. ఇందుకు ససేమిరా అన్న కాలనీవాసులు పిల్లలను మిద్దెల ప్రాథమిక పాఠశాలలోనే కూర్చోబెట్టడంతో రెండు ఆటోలు వెనుదిరిగి వెళ్లాయి. దీంతో ఉన్న తాధికారులు ఈసమస్యకు ఎలాంటి పరిష్కారం చూపుతారో వేచిచూడాలి.

## కష్టకాలంలో పనిచేసినవారికి పదవులివ్వాలి

ప్రొద్దుటూరు , జూలై 1 (ఆంధ్రజ్యోతి ) : కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ పదవులలోనూ పార్టీ పదవులలోనూ స్థానం కల్పించాలని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి లోకేశ్‌ను ప్రవీణ్ కుమార్ రెడ్డి కలిసి ప్రొద్దుటూరు అభివృద్ధికి సంబంధించి కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులకు నిధులు రాష్ట్ర ప్రభుత్వమే అందజేయాలన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు నర్సింగ్ సిబ్బంది తగినమేర లేనికారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మున్సిపాలిటీలో మురుగుకాలువల ఆధునీకీకరణకు, తాగునీటి పైప్‌లైను నిర్మాణ పనులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## మునిగిన పంటలకు పరిహారం ఇప్పించండి

బద్వేలు, జూలై1 (ఆంధ్రజ్యోతి ): ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను బద్వేలు మండల మాజీ అధ్యక్షుడు బీరం జయరామిరెడ్డి విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిసి మునిగిన పంటలకు పరిహారం ఇప్పించాలని కోరారు. పుట్టాయపల్లె పంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులు, సగిలేరు పికప్ ఆనకట్ట వల్ల మునిగిన పంట భూములకు నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఉన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. .

## మొహర్రం వేడుకలు ప్రారంభం

రాజుపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభం కావడంతో పీర్ల చావిడిలలో పీర్లు కొలువుదీరాయి. మండలంలోని టంగుటూరు, గోపాయపల్లె, తొండలదిన్నె, కొర్రపాడు గ్రామాల్లో ఈ పండుగను మతాలకతీతంగా జరుపుకుంటారు. గురువారం చిన్నసర్గీస్, శుక్రవారం విడిదినం, శనివారం పెద్దసర్గీస్, ఆదివారం గ్రామపీర్లను ఊరేగించి అనంతరం కుందూలోకి వెళ్లి శుభ్రపరిచి పండుగ ముగుస్తుందని తెలిపారు. టంగుటూరు గ్రామంలో బాబాఫకృద్దీన్ అనే పీరు ఆనవాయితీగా పురవీధుల్లో ఊరేగిస్తారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడండి

మైదుకూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు నియోజవకర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రొద్దుటూరులో మంగళవారం విద్యుత్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల నుంచి ప్రభుత్వ చలానా మాత్రమే తీసుకోవాలని, అంతకుమించి ఏదైనా ఎక్కువ డబ్బులను తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

బాలాయపల్లె గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నాగభూషణ్

బద్వేలు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సైబర్ నేరాలు, ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ నాగభూషణ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బాలాయపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కనే ఉండే ఇళ్లల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు (డ్రగ్స్) ట్రాఫిక్ నియమాలపై వారికి అవగాహన కల్పించారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా పోలీసులను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

## రైల్వే చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారం మోపే విధంగా పెంచిన రైల్వే చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో అక్కడ పనిచేస్తున్న అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు సుబహాన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బయోగ్యాస్, విండ్‌మిల్ కోసం స్థల పరిశీలన

బాలుర ఉన్నత పాఠశాలలో భోజన శాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

ముద్దనూరు, జూలై1(ఆంధ్రజ్యోతి):మండలంలో బయోగ్యాస్, విండ్‌మిల్ ఏర్పాటు కోసం మంగళవారం ఆర్డీవో సాయిశ్రీ స్థల పరిశీలన చేశారు. యామవరం గ్రామ సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్, బొందలకుంట గ్రామ సమీపంలో ఎకోరిన్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టే గాలిమరల విద్యుత్ కోసం స్థలాన్ని పరిశీలించారు. తరువాత జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గది, భోజశాలను పరిశీలించి ,బెంచీల పై నే విద్యార్థులకు భోజన వసతి కల్పించాలన్నారు. విద్యార్థినుల మరుగు దొడ్డలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు అలీఖాన్, డీటీ వదరకిశోర్‌రెడ్డి ,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజేష్‌కుమార్ సేవలు మరువలేనివి

చాపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ రాజేష్‌కుమార్ ప్రజలకు చేసిన వైద్యసేవలు మరువలేనివని మైదుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో మలేష్ అన్నారు. చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ రాజేష్‌కుమార్ చెన్నకేశంపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్‌ను డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, ఓబులేసు, శ్రీవాణి, కావ్య, మహాలక్ష్మి, మాధవి, సీహెచ్‌వో మహదేవ్‌యాదవ్, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, రమేష్, రాఘవయ్య, ఇతర సిబ్బంది శాలువాలు కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు..

## హాస్టల్‌ను తెరవాలి

పోరుమామిళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : టేకూరుపేటలో హాస్టల్‌ను రీఓపెన్ చేయాలని హ్యూమన్‌రైట్స్ జాయింట్ కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు బద్వేలు రెవెన్యూ డివిజనల్ ఏవోకువినతిపత్రం అందించారు. మండలంలోని టేకూరుపేటలో రూ.50 లక్షలతో హాస్టలు నిర్మించారని, అక్కడ హైస్కూలు ఉందని, కొన్ని సంవత్సరాల వరకు హాస్టలు నడిపి తరువాత మూసివేయడం జరిగిందన్నారు. నిత్యం విద్యర్థులు 6,7 కిమీ నుంచి హైస్కూలుకు వస్తున్నారన్నారు. కానీ ఇంత వరకు హాస్టల్ రీ ఓపెన్ కాలేదని, వెంటనే హాస్టలు రీఓపెన్ అయ్యేలా చూడాలని కోరారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మైలవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనాల శివనారాయణ తెలిపారు. మంగళవారం మైలవరంలో జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేసే దేశవ్యాప్త సమ్మెకు ఏపీ చేనేత కార్మిక సంఘం సంపూర్ణ మద్ధతు తెలుపుతుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మిక రంగాన్ని, చట్టాలను తూట్లు పొడిచే విధంగా కేంద్ర నిర్ణయాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, దాసు, సంజీవరాయుడు, ముని పాల్గొన్నారు.

## వారాహి అలంకరణలో వాసవీమాత

అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

ఖాజీపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకుని కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో వారాహి మాత అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం ఖాజీపేట ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు తాతా విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## రిటైర్డు ఉపాధ్యాయుడికి సన్మానం

దువ్వూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని కల్యాణ మండపంలో మంగళవారం రిటైర్డు ఉపాధ్యాయుడు సి.వీరారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు.. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 5న లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోని కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని లోక్ అదాలత్ ఛైర్మన్ వైజే పద్మశ్రీ, ప్రిన్సిపల్ జూనియనర్ సివిల్ జడ్జి వై.సరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్‌కుమార్‌లు కోరారు. మంగళవారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 5న నిర్వహించబోయే లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి వెళదాం... ప్రగతిని తెలియజేద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, జులై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లోకి వెళదాం, ప్రగతిని తెలియజేద్దామని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్ రెడ్డి, బొజ్జా రోశన్న, డీసీసీబీ ఛైర్మన్‌లు సూర్యనారాయణరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మంచికార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనమైందని, కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పుడిప్పుడే ఆర్థికంగా ఎదుగుతూ రాష్ట్రానిగాడిలో పెడుతూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. రాబోయే నాలుగుఏళ్లలో కూటమి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెల్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈఏడాది సుపరిపాలన అంతా జనరంజకమేనని, అభివృద్ధి, సంక్షేమమే సుపరిపాలన తొలిఅడుగు నినాదంతో ఇంటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని శ్రీకారం చుడుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా డీసీసీబీ ఛైర్మన్ పుట్టినరోజు వేడుకలు

డీసీసీబీ ఛైర్మన్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

అట్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణ పుట్టినరోజు వేడుకలు మంగళవారం అట్లూరులో టీడీపీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందించారు. కుంభగిరిలో టీడీపీ కార్యాలయంలో ఆయన అభిమానులు కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, సొసైటీత్రిసభ్య కమిటీ మెంబరు పాటూరు రాధా క్రిష్ణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లిఖార్జునరెడ్డి, బోవిళ్ల అమర్‌నాధరెడ్డి, కొత్తపు మునిరెడ్డి, పి.సాంబశివారెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, పెద్ద రామసుబ్బారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, లేవాకు రామక్రిష్ణరెడ్డి, అయ్య వారయ్య, గురుప్రసాద్‌రెడ్డి, పాలచెంచురెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పదోన్నతి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రామేశ్వరం మోడల్ ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ బాల అంకిరెడ్డి వెంకటాపురం హైస్కూలు ప్రధానోపాధ్యాయునిగా, ఎంఈవోగా సేవలు అందించడమే కాక పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు విద్యార్థులకు క్రీడా స్థలం సమకూర్చారన్నారు. అలాగే పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడు పుల్లయ్య చక్కని సేవలందించారన్నారు. గతంలో రామేశ్వరం నుంచి బదిలీపై వెళ్లిన సదాలక్ష్మి, వేణుగోపాల్‌లను సన్మానించారు. కార్యక్రమంలో వెంకటాపురం ప్రధానోపాధ్యాయులు జయరాములు, రాజా, వెంకట్రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, గురయ్య, శరత్, ప్రసాద్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## నోటీసులు లేకుండా కూల్చివేయడం దారుణం

శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

బద్వేలు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో వైసీపీ వలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి చెందిన ఇల్లు, కార్యాలయాలను చెరువుతట్టు పోరంబోకు స్థలంలో నిర్మించారంటూ ఎలాంటి నోటీసులు లేకుండా అధికారులు ఉన్నపళంగా కూల్చివేయడం దారుణమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బయనపల్లె గ్రామంలోని శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని అధికారులు కూల్చివేయడాన్ని ఎంపీ పరిశీలించారు. శ్రీకాంత్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలం చెరువులోకి ఉందా, లేదంటే గ్రామనత్తం కింద ఉందా అన్న విషయంలో అధికారులకే క్లారిటీ లేదన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఎంత అణగదొక్కాలని ప్రయత్నించినా అంతే బలంతో ముందుకు వెళతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మాజీ అనుడా ఛైర్మన్ సింగసాని గురుమోహన్, జడ్పీటీసీ వంకెల పోలిరెడ్డి, వంకెల పెద్ద పోలిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజంలో వైద్యుల సేవలు వెలకట్టలేనివి

పోరుమామిళ్ల, జూలై 1 (ఆంధ్ర జ్యోతి) :సమాజంలో వైద్యుల సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. మంగళ వారం మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ డాక్టర్స్‌డే వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ మౌనికా రెడ్డి, డాక్టర్ చిత్తా అమితారెడ్డిలు, డాక్టర్ ఆనంద్‌లు కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. సంద ర్భంగా రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యుల సేవలు వెలకట్టలేనివన్నారు.

## అంధులకు పెన్షన్లు పంపిణీ అభినందనీయం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంధులకు పింఛన్లు ప్రతినెలా 1వ తేదీనే పంపిణీ చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాజులపల్లె పెద్ద సుబ్బమ్మ, పెద్ద సుబ్బయ్య సేవా ట్రస్టు ఛైర్మన్ అధ్యక్షుడు గాజులపల్లి రామచంద్రుడు అంధులకు లింగారెడ్డి చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. 40 మంది అంధులకు ఒక్కొక్కరికి రూ.200 వంతున అందజేశారు. అలాగే పి.భారతిరూ, భక్త పెంచలయ్య, రిటైర్డు హెడ్మాస్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు ఒక్కొక్కరు రూ.100 వంతున .40 మందికి జకరయ్య రూ.50 వంతున న్యాయవాది శేషయ్య చీరెలు, టవాళ్లు, రాజేంద్రప్రసాద్ పంచెలు అందజేశారు.

## ప్రభుత్వ స్థలంలో బస్‌షెల్టరు నిర్మించాలి

బ్రహ్మంగారిమఠం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని సర్వే నెం.445లో ప్రభుత్వ భూమి ఉందని అక్కడ బస్‌షెల్టరును ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పెదుల్లపల్లెప్రభాకర్, సహాయ కార్యదర్శి చేజర్ల రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని, బస్‌షెల్టరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే అధికారులు, వెంటనే స్పందించాలని వారు కోరారు.

## పురాతన ఆలయాలను పరిరక్షించండి

కొండాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంపునకు గురైన పురాతన ఆలయాలను పరిరక్షించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ కోరారు. మండలంలోని ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు గ్రామంలోని శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయాలలో గుప్తనిధుల కోసం విగ్రహాల కింద తవ్వడం దారుణమన్నారు. తదుపరి ఇలాంటి చర్యలకు పాల్పడకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) :కోడూరు మండలం గుంతపల్లెకు చెందిన గుంత జయరామిరెడ్డి(42) కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గుంతపల్లెకు చెందిన జయరామిరెడ్డి ఇటీవల మైదుకూరు బైపాస్ వద్ద నిలబడి ఉండగా మిల్లర్ వచ్చి ఢీకొనడంతో తీవ్రగాయాలవ్వగా, కర్నూల్‌కు చికిత్స నిమిత్తం తరలించగా మంగళవారం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని బంధువులు తెలిపారు.


తిరుత్తని శాఖ (DPC: 3799)
నం.97/2బి, చిత్తూరు రోడ్డు, తిరుత్తని - 631209
ఫోన్: 044-2794 5255 / 94442 43799
ఇమెయిల్: cb3799@canarabank.com
కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ) Syndicate

**ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) / 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/హామీదారుల నుండి కెనరా బ్యాంక్, తిరుత్తని శాఖకు రావలసిన బకాయి 31.05.2025 నాటికి మొత్తం రూ.1,42,82,694.66 (ఒక కోటి నలభై రెండు లక్షల ఎనభై రెండు వేల ఆరువందల తొంభై నాలుగు రూపాయల అరవైఆరు పైసలు మాత్రమే) ప్లస్ దానిపై తదుపరి వడ్డీని రాబట్టుకొనుటకు, సెక్యూర్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్‌చేయబడినట్టి, కెనరా బ్యాంక్, తిరుత్తని శాఖ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "అక్కడ ఏది ఉంటే అదే" ప్రాతిపదికన 22.07.2025న (సమయం ఉ.11.30 గం. నుండి మ.12.30 గం.) విక్రయించబడునని సాధారణ ప్రజలకు, ముఖ్యంగా రుణగ్రహీతలకు మరియు హామీదారులకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

రుణగ్రహీత: మెసర్స్ మధు గ్రూప్స్, ప్రొప్రైటర్: చింత మధురవాణి, నం.7/316, న్యూ కృష్ణానగర్, కోడూరు, ఆం.ప్ర - 516101, శ్రీమతి చింత మధురవాణి భర్త చింత రామసుబ్బారెడ్డి, ప్రొప్రైటర్: మెసర్స్ మధు గ్రూప్స్, హామీదారు: శ్రీ ఎం.రమణయ్య అలియాస్ చింత రామసుబ్బారెడ్డి తండ్రి చింత ఆదిరెడ్డి, ఇరువురి నివాసం: నం.7/316, న్యూ కృష్ణానగర్, కోడూరు, ఆం.ప్ర - 516101

**ఆస్తి వివరాలు**

టైటిల్ హోల్డర్: శ్రీ ఎం.రమణయ్య అలియాస్ చింత రామసుబ్బారెడ్డి తండ్రి చింత ఆదిరెడ్డి - కడప జిల్లా, కోడూరు పంచాయతీ, కోడూరు మండలం, సర్వే నం.684/2ఎలో ఉన్న న్యూ కృష్ణానగర్, వార్డు నం.7 వద్దగల డోర్ నం.7/316, 7/316ఎ కలిగిన 2243.60 చ.అ. విస్తీర్ణం గల నివాస భవనం (GF: 923.83 చ.అ, FF: 975.64 చ.అ, SF: 344.13 చ.అ.)తో పాటు 4050 చ.అ. విస్తీర్ణం గల భూమి యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: 15 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: యేరొగల్ల కృష్ణయ్య, మద్దూరు, సరోజమ్మ మరియు మాచర్ల సుబ్బారాయుడులకు చెందిన ఇళ్లు, తూర్పు: MDO కార్యాలయం కంచె, పశ్చిమం: 18 అడుగుల వెడల్పు రోడ్డు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| రిజర్వు ధర | రూ.1,90,73,000/- | బయానా | రూ.19,07,300/- | బిడ్ గుణాంకం | రూ.1,00,000/- |

ఇ-వేలం తేది & సమయం 22.07.2025 సమయం ఉ.11:30 గం. నుండి మ.12:30 గం.

బయానాను 21.07.2025న లేదా ఆలోగా సా.4.00 గం.వరకు డిపాజిట్ చేయవలెను.

అధీకృత అధికారి ముందస్తు అనుమతితో 17.07.2025 & 19.07.2025న (ఉ.11.00 గం. మరియు సా.4.00 గం. మధ్య) ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును.

బయానా చెల్లింపు: కాగోరు బిడ్డర్లు రిజర్వు ధరలో 10% బయానా (EMD) ను M/s PSB అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా జమ చేయవలెను లేదా చలాన్‌ను జనరేట్ చేయడం ద్వారా RTGS/NEFT ద్వారా బయానాను ఖాతా వివరాలలో జమ చేయవలెను.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేయబడిన "E-Auction" లింక్‌ను రిఫర్ చేయండి లేదా సర్వీస్ ప్రొవైడర్ BAANKNET (M/s PSB Alliance Pvt. Ltd), (సంప్రదించు నంబర్లు: 70466 12345 / 63549 10172 / 82912 20220 / 98922 19848 / 81602 05051, ఇమెయిల్: support.baanknet@psballiance.com) వారిని సంప్రదించండి లేదా మేనేజర్, కెనరా బ్యాంక్, తిరుత్తని శాఖ (మొబైల్: 94442 43799) వారిని ఏదేని పనిరోజున కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.

ఇ-వేలం పోర్టల్: https://baanknet.com

తేది: 30.06.2025, ప్రదేశం: తిరువళ్ళూరు — అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 D.C.M. : 99854 11184

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 2 జూలై 2025 | 5

పంట పండింది : పంట నష్టపరిహారం చెక్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

బాగా చదువుకోండి : పీ4లో దత్తత ఇస్తున్న అమ్మాయిలతో సీఎం

సీఎంకు కలెక్టర్ ప్రశాంతి జ్ఞాపిక

మీకు నేనున్నా.. : పింఛనుదారుడు పోసిబాబు భుజంపై చేయి వేసి నడచివెళుతున్న సీఎం

# జనంతో..సీఎం!

మీ పాలన భేష్ : చంద్రబాబుతో రూ.లక్ష విరాళం ఇచ్చిన వృద్ధురాలు

సూపర్ సార్ : బాబుకు జ్ఞాపిక ఇస్తున్న మార్గదర్శి కాశీ విశ్వనాథరాజు

మా అబ్బాయిని చూడండి సార్ : బాబుకు విన్నవిస్తున్న దివ్యాంగుడి తండ్రి

## దేవుడింతే ఇచ్చాడు.. ఇది మా ఖర్మ.. అనే ఆలోచన మానేయాలి!

సీఎం చంద్రబాబునాయుడు కొవ్వూరు నియోజకవర్గ పర్యటన ఆసక్తికరంగా సాగింది. గతంకంటే భిన్నంగా ఆయన మాటల్లో మార్పు కనిపించింది. పేదల సేవలో..అనే కార్యక్రమానికి వచ్చిన ఆయన నిజంగా పేదలతో మమేకమయ్యారు. పేదలు ఆత్మ గౌరవంతో, విశ్వాసంతో ఆలోచనలు పెంచుకోవాలని , దేవుడింతే ఇచ్చాడు.ఇది మాఖర్మ, నిత్యం కష్టపడడమే మా బతుకు అనే ఆలోచనలు చేయడం మానేయమని పిలుపునిచ్చారు. అంతేకాదు చర్మకార పింఛను దారుడైన పోసిబాబును కొవ్వూరు మండలం ధర్మవరంలో కారులో ఎక్కించుకుని తాళ్లపూడి మండలం మలకపల్లి వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. కారులో పక్కనే కూర్చొపెట్టుకుని వృత్తి, జీవన స్థితిగతులపై ఆరాతీశారు. ఆయన ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చారు. పోసిబాబు మాదిగ డప్పు తీసుకుని ఎలా కొట్టాలో అడిగి కాసేపు డబ్బు వాయించారు. అతని భుజంపై చేయి వేసి వీధిలో నడిచి వెళ్లారు. మరో పింఛన్‌దారుడి బిడ్డను ఎత్తుకుని ఆడించారు. సభానంతరం అనేక మంది సమస్యలు విని అందరికీ అండగా ఉంటానని చెప్పడంతో ప్రజలంతా ఆనందపడ్డారు.

– (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

## పేదల సేవలో చంద్రబాబు

- మలకపల్లిలో జనంతో మమేకం
- పింఛన్ల పంపిణీ.. మాటామంతీ
- పీ4లో ఇద్దరు అమ్మాయిల దత్తత
- సీఎంను చూసేందుకు జనం క్యూ

రాజమహేంద్రవరం/కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గేర్ మార్చారు.. జనంలోనే ఉంటున్నారు.. జనం బాధలు వింటున్నారు..అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.. మీకు నేనున్నానంటూ పేదలకు భరోసాగా నిలుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో మంగళవారం మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేర జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాళ్లపూడి గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు ఉదయం 9 గంటలకే సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. సీఎం చంద్రబాబు మలకపల్లి ప్రజల కోసమే తాను వచ్చానని చెప్పడంతో మలకపల్లి మరింత మురిసిపోయింది. ముందుగా చర్మకారుడు పోసిబాబు ఇంటికి నేరుగా వెళ్లి రూ.4 వేలు పింఛన్ అందజేశారు.అతను తయారుచేసే చెప్పులు, టోపీలు చూశారు. ఒక టోపీ, ఒక చెప్పుల జత తీసుకుని రూ.5 వేలు ఇచ్చారు. గ్రామంలో మరో మహిళలకు పింఛన్ అందజేశారు. అక్కడే ఒక చిన్నపిల్లను ఎత్తుకుని ముద్దాడారు. తల్లితో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమమే పీ4.. సమాజం మీకు ఎంతో ఇచ్చింది. అందులో కొంత తిరిగివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ4) ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తానన్నారు. సమాజంలో 10 శాతం ఉన్నతమైన, ఆదర్శవంతమైన కుటుంబాల నుంచి సమాజంలో దిగువన ఉన్న 20 శాతం మంది ప్రజలను దత్తత తీసుకునే బృహత్తర కార్యక్రమం పీ4 అని చెప్పారు. సంపన్నులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని మూడు దశల్లో ఆ కుటుంబానికి అండగా నిలబడి ఉన్నతికి తప్పంవంతుగా బాధ్యత తీసుకోవాలన్నారు. 2029 నాటికి పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దేశంలో ఏపీలోనే ఎక్కువ మొత్తంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రగతి తదితర అం శాలను వివరించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు ప్రథమస్థానం ఇవ్వడం జరిగిందన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని గతంలో 150 పడకల ఈ ఆస్పత్రిని అభివృద్ధి కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను శుద్ధిచేసి తాగునీరుగా అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విన్నవించారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారు. అడినవన్నీ ఇచ్చారు.. వెంటనే వరాల జల్లు కురిపించారు.

## రెండున్నర గంటలు ఆలస్యంగా భోజనం

రాజమహేంద్రవరం : చంద్రబాబు సాధారణంగా మధ్యాహ్నం 1-2 గంటల మధ్య భోజనం ముగిస్తారు. ఆయన కారవాన్‌లోనే భోజనానికి ఓ 15 నిమిషాలు సమయం తీసుకుంటారు. మలకపల్లి సభకు ఆయన 11 గంటలకు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించక 2 గంటలకు చేరుకున్నారు. అప్పటికే కారవాన్‌లో భోజనాన్ని సిద్ధం చేశారు. కానీ ప్రజలు వేచి చూస్తున్నారంటూ ఆయన నేరుగా సభా వేదికపైకి చేరుకున్నారు. సభ ముగిసేసరికి సుమారు సాయంత్రం 4 గంటలు దాటింది. సభ ముగిసిన తర్వాత ప్రజల వినతులు, ఫొటోల అనంతరం ఆయన కార్యకర్తల సమావేశ ప్రాంగణానికి 4.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పుడు కారవాన్‌లో భోజనం ముగించుకొని 5 గంటలకు సమావేశానికి వెళ్లారు.

## పోలీసుల ఓవరాక్షన్..

కొవ్వూరు : సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసులు అతిచేశారు. ఎవరినీ సీఎం చంద్రబాబు చెంతకు వెళ్లనీయకుండా సుమారు కిలోమీటర్ దూరంలోనే బందోబస్తు నిర్వహించారు. మల్లకపల్లిలో 2 వేల మందికి సరిపడా వేదికను సిద్ధం చేయగా అంత మందినీ తనిఖీ చేసి లోపలకు అనుమతించారు.. చంద్రబాబు కాన్వాయ్ వస్తుంటే జనాన్ని పక్కకు తోసేశారు.. దీంతో సభకు వచ్చిన జనం అసహనం వ్యక్తంచేశారు. పార్టీ కార్యకర్తల సమావేశం వద్దా ఇదే పరిస్థితి కనిపించింది. ఎంపిక చేసిన వారిని మాత్రమే లోపలకు అనుమతించారు. దీనిపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

## కాకినాడలో నేడు జడ్పీ సమావేశం

6

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: నం. 1) మెసర్స్ విల్లా ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహించు దీని యజమాని శ్రీ విల్లా సుబ్బారావు, డి.నం. 52-1-71, లక్ష్మి గణపతి గ్యాస్ పక్కన, గతి సెంటర్ సమీపాన, నరసింహ రోడ్, జగనాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా - 533002, నం. 2) శ్రీ విల్లా సుబ్బారావు, తండ్రి శేషారావు, డోర్ నం. 52-1-59, భానువారి వీధి, గతి సెంటర్, జగనాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా - 533002, నం. 3) శ్రీమతి విల్లా సూర్యకుమారి, భర్త విల్లా సుబ్బారావు, డోర్ నం. 52-1-59, భానువారి వీధి, గతి సెంటర్, జగనాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా - 533002 వారి నుండి 22.06.2025 నుండి చార్జ్ చేయబడే తదుపరి వడ్డీ మరియు బ్యాంకుకు ఇతర బకాయి, ఇతర ఖర్చులతో కలుపుకొని 21.06.2025 నాటికి మొత్తము రూ.33,01,788/- (రూపాయలు ముప్పై మూడు లక్షల ఒక వేయి ఏడు వందల ఎనభై ఎనిమిది మాత్రమే) రాబట్టుకొనుటకు SARFAESI చట్టం 2002 క్రింద సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తి

షెడ్యూల్-బి : (శ్రీ విల్లా సుబ్బారావు, తండ్రి శేషారావుకు చెందిన ఆస్తి)

తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ నగరపాలక సంస్థ ప్రాంతం, నరసింహ రోడ్, జగన్నాథపురంలో నరసింహా రోడ్‌కు పశ్చిమాన భాను వీధి, టి.ఎస్.నం. 540లో వార్డు నం. 22, డోర్ నం. 52-1-59 ...

రిజర్వు ధర: రూ. 35,00,000/-
(రూపాయలు ముప్పై ఐదు లక్షలు మాత్రమే)

| రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీ : | ప్రదేశం |
|---|---|
| 21-07-2025 | సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, కాకినాడ శాఖ, 27-9-52, పూలవారి వీధి, కాకినాడ, తూర్పుగోదావరి - 533001 టెలిఫోన్ నం. 0884-2341124, సెల్ నం. 9390219317 |

ప్రదేశం : కుంభకోణం, తేది : 30.06.2025 — అధీకృత అధికారి
నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంభకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

# 'తొలి అడుగు' నేడే

- నేటి నుంచి జిల్లాలో టీడీపీ సుపరిపాలనలో 'తొలి అడుగు' కార్యక్రమం
- ఏడాది ప్రభుత్వ పాలన గురించి ఇంటింటికీ వెళ్లి వివరించనున్న ఎమ్మెల్యేలు, క్యాడర్
- చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలని అధిష్ఠానం ఆదేశాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలు, అవినీతి, వేధింపుల నుంచి బయటపడి సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏడాదిగా జిల్లా అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోంది. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో జిల్లాలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఏడాది పాలనలో విజయాలు, సాధించిన ప్రగతి, పనులపై ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించడానికి టీడీపీ సిద్ధమైంది. బుధవారం నుంచి నెలరోజులపాటు జిల్లావ్యాప్తంగా నియోజకవర్గస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లనున్నారు. ఏడాదికాలంలో ప్రజలకు చేకూరిన లబ్ధి, గత వైసీపీ ప్రభుత్వం ఏవిధంగా జిల్లాను, ప్రజలను ఇబ్బంది పెట్టిందో వివరించనున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యేలంతా సుపరిపాలన తొలి అడుగు పేరుతో భారీ ప్రచారం నిర్వహించబోతున్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను ఏవిధంగా అమలు చేశామో వీరంతా ప్రజలకు వివరించనున్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం, త్వరలో జమ చేయనున్న అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అధికారంలోకి రాగానే నియోజకవర్గ, గ్రామస్థాయిలో రహదారుల మరమ్మతు, కొత్తవి నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తి, కొత్తవి మంజూరు, బిల్లుల బకాయిలు చెల్లింపు, గత ప్రభుత్వ పన్ను భారాల తొలగింపు ఇలా ఏడాదిగా ప్రజల మంచి కోసం ఏమేం చేశామో ఎమ్మెల్యేలంతా నెలరోజులపాటు కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించనున్నారు. అటు ఎమ్మెల్యేలు సైతం నిరంతరం ప్రజల్లో ఉండకపోతే పనితీరులో వెనుకబడిపోతారని ఇటీవల జరిగిన సమావేశంలో హెచ్చరించారు. తొలి అడుగులో పనిచేసిన విధానంపై ఎప్పటికప్పుడు నివేదికలు రప్పిస్తానని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల దగ్గర నుంచి క్యాడర్ వరకు నేటి నుంచి చేసిన మంచి పనులు, వైసీపీ హయాంలో జరిగిన దోపిడీ, ప్రస్తుతం ఆ పార్టీ చేస్తోన్న అరాచకాలను వీరంతా ప్రజలకు వివరించనున్నారు. బుధవారం తొలిరోజు కార్యక్రమంలోభాగంగా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప తొలి అడుగు కార్యక్రమాన్ని సెంటిమెంట్‌గా భావించే తొలి తిరుపతిలో భారీగా నిర్వహించనున్నారు. ఇక్కడినుంచే చేసిన అభివృద్ధిని వివరించనున్నారు. రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌తోపాటు మరికొందరు నేతలు ఇక్కడే పాల్గొననున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తొలి అడుగు కార్యక్రమాన్ని జగ్గంపేట పంచాయతీ పరిధిలోని సీతారాంపురం నుంచి మొదలుపెట్టనున్నారు. వేలాదిమందితో ఇంటింటా కార్యక్రమాన్ని ప్రారంభించి చేసిన మంచిని వివరించనున్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఈ కార్యక్రమాన్ని కాకినాడలో ఉదయం ఆరో వార్డు, సాయంత్రం 24వ వార్డులో ప్రారంభిస్తారు. తుని ఎమ్మెల్యే దివ్య తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణంలోని కొండవారిపేట, సాయంత్రం ఎస్.అన్నవరంలో మొదలుపెట్టనున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఏడాది పాలన విజయాలపై భారీ కరపత్రాల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించనున్నారు.

## 'ఉమ్మడి తూర్పు' జిల్లాతో బీవీ పట్టాభిరామ్‌కు అనుబంధం

- రామచంద్రపురం కృత్తివెంటి పాఠశాలలో విద్యాభ్యాసం
- కాకినాడలో డిగ్రీ పూర్తి.. ఇంద్రజాలకుడిగా ప్రదర్శనలు
- ఆయన మృతికి పలువురి సంతాపం

7

కాకినాడలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్న బీవీ పట్టాభిరామ్(ఫైల్‌ఫొటో)

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏయూ ఆర్జేడీ

కలెక్టరేట్(కాకినాడ), జూలై1 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా ఆంధ్ర యూనివర్సిటీ రీజియన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీగా నియమితులైన జీవీ రామచంద్రరావు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏయూ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ రామచంద్రరావు

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రిజర్వు ధర: రూ. 32,00,000/-
(రూపాయలు ముప్పై రెండు లక్షలు మాత్రమే)

| రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీ : | ప్రదేశం |
|---|---|
| 22-07-2025 | సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, కాకినాడ శాఖ, నం.27-9-52, పూలవారి వీధి, కాకినాడ, గోదావరి - 533001, టెలిఫోన్ నం. 0884-2341124, సెల్ నం.9390219317 |

ప్రదేశం : కుంభకోణం, తేది : 30.06.2025 — అధీకృత అధికారి
నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంభకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com




# ఐటీఐతో ఉపాధికి భరోసా

ఉపాధికి భరోసా ఇచ్చే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరితే తక్కువ సమయంలో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చు. పాలిటెక్నిక్ డిప్లొమా, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి వచ్చినా ఐటీఐకి డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. ఐటీఐ పూర్తిచేసిన వారికి పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు ఉండడంతో ఈ కోర్సుల పట్ల ఆసక్తి చూపే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఐటీఐ పూర్తయిన తర్వాత పాలిటెక్నిక్ డిప్లొమా రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉంది. ఐటీఐ పాసైతే వివిధ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ఈ కారణంగా ఐటీఐ చదివేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

- పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు
- స్కిల్ హబ్ ద్వారా ఎన్నో ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు ప్రభుత్వ, 39 ప్రైవేట్ ఐటీఐలు
- వాటిల్లో మొత్తం 13 ట్రేడ్లు
- జూలై 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఐటీఐలో ప్రవేశం చాలా కష్టంగా ఉండేది. అప్పట్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారు సైతం ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు ఇష్టపడేవారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సీటు సాధించాలంటే గగనమే. 10-15 ఏళ్ల క్రితం ఐటీఐ కోర్సులకు డిమాండ్ పూర్తిగా తగ్గింది. అయితే తాజాగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఐటీఐ చదివిన వారికి ఉద్యోగావకాశాలు వస్తుండడంతో క్రమేణా పూర్వవైభవం సంతరించుకుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జూలై 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అప్లికేషన్, ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐల్లో జూలై 17వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకుంటేనే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అర్హులవుతారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా తయారుచేసి సీట్లను భర్తీ చేస్తారు.

కాకినాడ జిల్లాలో కాకినాడ, జగ్గంపేటల్లో రెండు ప్రభుత్వ, 12 ప్రైవేట్, తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో ఒక ప్రభుత్వ, 12 ప్రైవేట్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 15 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి.

బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. రెండేళ్లు, ఏడాది కాలపరిమితితో కూడిన ఐటీఐ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

2022-23లో 436 మంది విద్యార్థులకు 263 మంది ప్లేస్‌మెంట్ సంపాదించారు. 2023-24లో 463 మంది విద్యార్థులకు 436మంది, 2024-25లో 415 మందికి ప్రస్తుతానికి 364 మంది ఉద్యోగాలు సాధించారు.

**ఫిట్టర్:** ఇది ఎవర్‌గ్రీన్. రెండేళ్ల కోర్సు. ఇతర కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నా దీంట్లో మాత్రం సీట్లు నిండిపోతాయి. ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయి. కౌన్సెలింగ్‌లో తొలి ఆప్షన్‌గా దీనినే ఎంచుకుంటారు.

**ఎలక్ట్రికల్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. ఎలక్ట్రికల్ విభాగంతో సంబంధం ఉన్న కోర్సు ఇది. దీనిని పూర్తి చేసిన వారికి ట్రాన్స్‌కో, జెన్‌కో. ఏపీఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. ప్రైవేట్ సెక్టార్లో కూడా మంచి అవకాశాలొస్తున్నాయి.

**డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. నిర్మాణ రంగంలో అవకాశాలు ఎక్కువ. వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగాలు పొందొచ్చు. ఈ కోర్సు పూర్తిచేసిన వారు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

**మోటారు మెకానిక్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. మోటారు రంగంలో స్థిరపడేందుకు అవకాశముంటుంది. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలుంది. మోటారు రంగానికి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. స్వయం ఉపాధి దిశగా ఈ రంగాన్ని ఎంచుకుని అద్భుతాలు సృష్టించిన వారు ఉన్నారు.

**ఇన్‌స్ట్రుమెంట్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. దీనిని పూర్తిచేస్తే పరిశ్రమల్లో ఆటోమేషీన్ల వద్ద ఉద్యోగాలు కల్పిస్తారు. దీంతో డిమాండ్ బాగానే ఉంది.

**డీజిల్ మెకానిక్:** కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే. డీజిల్‌తో సంబంధం ఉన్న అన్ని విభాగాల్లో ఉద్యోగం పొందేందుకు అవకాశముంది. ముఖ్యంగా ఆర్టీసీ గ్యారేజీలో.

**కంప్యూటర్స్:** కోర్సు కాలపరిమితి ఏడాది. పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులు. ఏ రంగంలో రాణించాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాల్సిందే. కంప్యూటర్ ఆపరేటర్లుగా హార్డ్‌వేర్ ఉద్యోగాలు పొందే వీలుంది.

**కటింగ్ అండ్ టైలరింగ్:** ఈ కోర్సు కాలపరిమితి ఏడాది మాత్రమే. మహిళలకు కటింగ్, టైలరింగ్ సంబంధించి తర్ఫీదు ఇస్తారు. తద్వారా వారు స్వయం ఉపాధి పొందే అవకాశముంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రుణాలు ఇచ్చి ఈ కోర్సు పూర్తి చేసిన వారిని ప్రోత్సహిస్తున్నాయి.

**ఎలక్ట్రానిక్ మెకానిక్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. టీవీలు, సెల్‌ఫోన్లు రిపేర్ చేయడంలో శిక్షణ ఇస్తారు. ఇందులో ప్రావీణ్యం పొందితే సొంతంగా తమ కాళ్లపై నిలబడటమే కాకుండా మరికొంతమందికి ఉపాధి కల్పించవచ్చు.

**వెల్డర్:** ఏడాది కోర్సు పూర్తిచేసిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. అరబ్ దేశాల్లో ఉద్యోగావకాశాలు అధికం.

**బ్రిడ్జి కోర్సుతో పాలిటెక్నిక్**

ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా పైచదువులు కొనసాగించవచ్చు. ఇది పూర్తి చేసిన తర్వాత ప్రవేశపరీక్ష ద్వారా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.

## మార్కులే ప్రాతిపదిక

**ఎం.వేణుగోపాలవర్మ, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్**
**కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్**

పదో తరగతిలో మార్కుల ప్రాతిపదికన రూపొందించిన మెరిట్ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తాం. ఐటీఐ కోర్సులు చదివిన అభ్యర్థులకు ఉపాధి గ్యారంటీగా లభిస్తుంది. పరిశ్రమల్లో ప్రాధాన్యంతో పాటు విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. నాణ్యమైన సంస్థలు, పెద్దపెద్ద కంపెనీలు కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. శిక్షణ అనంతరం అప్రెంటిస్ మేళాలు, మెగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు చూపిస్తున్నాం. అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలను తర్వాత ప్రకటిస్తాం.

### ఐటీఐ చదువుతుండగానే ప్లేస్‌మెంట్

**సుందరపల్లి వంశీసత్యకృష్ణ**

నాన్న డ్రైవర్. చదువు త్వరగా పూర్తిచేసి ఆయనకి సహాయపడాలనుకున్నా. ఐటీఐ ద్వారా అయితే త్వరగా ఉద్యోగం వస్తుందని ఇనుస్ట్రుమెంట్ మెకానికల్ రెండు సంవత్సరాల కోర్సులో చేరాను. అనుకున్నట్టే రెండో సంవత్సరంలో ఐటీఐలో ఈ నెల 13న నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పోల్‌మాన్ ఇనుస్ట్రుమెంట్స్ కంపెనీ (హైదరాబాద్)లో ఉద్యోగానికి ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది.

### అమ్మ, నాన్న ఎంతో సంతోషించారు: చిలుకోటి బన్నీ

నాది తొండంగి మండలం బెండపూడి. అమ్మ, నాన్న కూలి పనులు చేస్తూ నన్ను చదివించారు. వారి కష్టాన్ని చూడలేక త్వరగా ఉద్యోగం సంపాదించాలనుకున్నా. కొంతమంది ఇచ్చి సలహా మేరకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సులో చేరాను. సెకండియర్ చదువుతుండగా ఏప్రిల్ 26న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎల్‌అండ్‌టీ చెన్నై బ్రాంచ్‌కి సెలెక్ట్ అయ్యాను. పరీక్షలు పూర్తయ్యాక రెండు నెలలు ట్రైనింగ్ ఇచ్చి నెలకి రూ.16వేల జీతంతో ఉద్యోగమిచ్చారు. అమ్మ, నాన్న చాలా సంతోషించారు.

### టాటా కంపెనీలో ఉద్యోగమొచ్చింది

**పాలిక ప్రేమ్‌భవానీమూర్తి, రామచంద్రపురం**

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ రెండో సంవత్సరం హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాను. మే 7న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం పొందాను. పరీక్షల అనంతరం ఒక నెల ట్రైనింగ్ ఇచ్చారు. వసతి, భోజన సౌకర్యం, ట్రాన్స్‌పోర్టు ఇచ్చి నెలకి రూ.12వేలు బేసిక్‌తో ఉద్యోగం పొందాను.

### క్యాంపస్ ఇంటర్వ్యూలో సత్తా చాటాను

**చదల జాన్ డేనియల్ సతీష్‌చంద్ర, మైలవరం, అల్లూరి జిల్లా**

తండ్రిలేని నన్ను అమ్మ ఎంతో కష్టపడి చదివించింది. త్వరగా జీవితంలో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో ఐటీఐలో చేరాను. మే 28న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సత్తా చాటాను. బక్షౌ హోషన్ (తిరుపతి)లో ఉద్యోగం సంపాదించాను. అమ్మ చాలా సంతోషించింది.

### ఒక సంవత్సరం చదువుకే ఉద్యోగం

**ఎలుగుబంటి సత్యమణికంఠ**

ఐటీఐ చదివితే ఉద్యోగం త్వరగా వస్తుందని సలహా మేరకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో వన్ ఇయర్ కోర్సు డీజిల్ మెకానిక్ తీసుకున్నాను. మే 28న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణి ఇంజన్ వాల్వ్ (హైదరాబాద్) కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకి రూ.14,700 బేసిక్‌తో ఉద్యోగం సంపాదించాను. చాలా హ్యాపీగా ఉంది.

### ఎల్‌అండ్‌టీ కంపెనీకి ఎంపికయ్యాను

**దూడ రాజ్‌కుమార్**

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో డాక్యుమెంట్ సివిల్ రెండో సంవత్సరం చదువుతున్నాను. జూన్ 4న ఎల్‌అండ్‌టీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచాను. ఆ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. త్వరగా ఉద్యోగం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

# పవన్ నిధులు తెస్తే మాకేంటి!

- డిప్యూటీ సీఎం పనులు ప్రతిపాదిస్తే అంగీకరించాలా
- మా ప్రతిపాదనలు పెట్టాల్సిందే
- అజెండాపై సంతకం చేయని చైర్‌పర్సన్
- కాకినాడ కలెక్టర్‌కు చేరిన గొల్లప్రోలు నగర 'పంచాయితీ'

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని నిధులు తీసుకుని పనులు ప్రతిపాదిస్తే నగర పంచాయతీ పాలకవర్గం మోకాలడ్డుతోంది. తాము ప్రతిపాదించిన పనులు పెట్టకుంటే అజెండాపై సంతకం చేసేది లేదని చైర్‌పర్సన్ తేల్చిచెప్పడంతో కౌన్సిల్ సమావేశమే జరగలేదు. ఈ 'పంచాయితీ' కాస్తా కాకినాడ జిల్లా కలెక్టర్ వద్దకు చేరింది.

గొల్లప్రోలు పట్టణంలో నెలకొన్న సమస్యలపై పలు వినతులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన పేషీ అధికారులను పంపి పరిశీలన చేయించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన పనులను తక్షణం చేపట్టేందుకు వీలుగా పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చి పిఠాపురం పట్టణానికి రూ.3 కోట్లు, గొల్లప్రోలు నగర పంచాయతీకి రూ.కోటి ప్రత్యేక నిధులుగా మంజూరు చేయించారు. వీటితో గొల్లప్రోలులోని వివిధ ప్రాంతాల్లో 27 రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రతిపాదించారు. ఇప్పుడు ఈ పనులను ఆమోదించేందుకు వైసీపీ మెజార్టీ ఉన్న గొల్లప్రోలు నగర పంచాయతీ పాలకవర్గం ఆది నుంచీ ఆటంకాలు సృష్టిస్తోంది. మే 29న సాధారణ, అత్యవసర సమావేశాల్లో ఈ పనులను టేబుల్ అజెండాగా తీసుకువచ్చారు. అప్పుడు వైసీపీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు సంతకం చేయకుంటే కమిషనరు కనకారావు తనకున్న విచక్షణాధికారంతో టేబుల్ అజెండా ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించలేదు. కొంత సమయం తీసుకుని అప్పుడు చర్చిద్దామంటూ వాయిదా వేశారు.

నగర పంచాయతీ నెలవారీ కౌన్సిల్ సమావేశాల నిర్వహణలో భాగంగా జూన్‌లో సాధారణ సమావేశం నిర్వహణకు వివిధ అంశాలతో పాటు గత అత్యవసర సమావేశంలో టేబుల్ అజెండాగా తీసుకురాగా వాయిదా వేసిన కోటి రూపాయల అభివృద్ధి పనుల అంశాన్ని కలిపి కమిషనరు... చైర్‌పర్సన్ సంతకం కోసం పంపారు. అయితే తాము ప్రతిపాదించిన పనులే పెట్టాలని, లేకుంటే అజెండాపై సంతకం చేసేది లేదని చైర్‌పర్సన్ స్పష్టం చేసి అజెండాను హోల్డ్‌లో పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన నిధులకు ఆయనే పనులు ప్రాతిపాదించారని అధికారులు చైర్‌పర్సన్‌కు వివరించారు. అయినప్పటికీ తమకే మెజార్టీ ఉందని, తాము చెప్పిన పనులే పెట్టాలని, డిప్యూటీ సీఎం అయినా మాకు లెక్కేంటి అనే రీతిలో వైసీపీ పాలకవర్గం ఉండడంతో ప్రతిష్టంభన ఏర్పడింది.

చైర్‌పర్సన్ అజెండాను తిరస్కరించడంతో జూన్‌లో జరగాల్సిన గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం జరగలేదు. అజెండా అంశాలను ఆమోదించి లేదా తిరస్కరించి తనకు పంపలేదని కమిషనరు చెప్తున్నారు. దీంతో పవన్‌కల్యాణ్ పట్టణాభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చి రెండున్నర నెలలు గడుస్తున్నా ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి ఏర్పడింది. పక్కనే ఉన్న పిఠాపురం పురపాలక సంఘంలో పవన్ తెచ్చిన రూ.3కోట్లతో వైసీపీ మెజార్టీ ఉన్నా కౌన్సిల్ సమావేశంలో పనులు ఆమోదించడం, టెండరు పిలవడం జరిగిపోయాయి. ఇక్కడ మాత్రం పనులు జరగకూడదనే రీతిలో గొల్లప్రోలు వైసీపీ పురపాలకుల తీరు ఉందని జనసైనికులు, కూటమి నేతలు మండిపడుతున్నారు. కాగా ఈ మొత్తం వ్యవహారంపై కలెక్టరుకు నివేదిక పంపినట్టు కమిషనరు కనకరావు చెప్తున్నారు. దీంతో పనుల 'పంచాయితీ' కలెక్టర్ కోర్టుకు చేరింది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

## అక్రమ తవ్వకాలు జరిపితే క్రిమినల్ చర్యలు

- ర్యాంపుల్లో తవ్వకాలను డ్రోన్‌లతో పరిశీలిస్తున్నాం: ఆర్డీవో శ్రీకర్
- మానేపల్లిలో రెండు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం

పి.గన్నవరం, జులై 1(ఆంధ్రజ్యోతి): ర్యాంపుల్లో ఇప్పటివరకు జరిగిన మట్టి, ఇసుక తవ్వకాలను డ్రోన్‌ల ద్వారా పరిశీలిస్తున్నామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. ఏ ర్యాంపులో ఎంతమేర అనుమతులు ఉన్నాయో, తవ్వకాలు ఎంతమేర జరిగాయో పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ర్యాంపులను మంగళవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు.నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు జరిపిన వారిపై మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసులు అందించి జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఈనెల 1వ తేదీ నుంచి అక్టోబరు 15వరకు ఏవిధమైన ఇసుక, మట్టి తవ్వకాలు జరిపినా సంబంధిత వ్యక్తులపై ప్రభుత్వ నిబంధనలు అనుసరించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో ర్యాంపుల్లో ఉన్న బాటలను, నదీపాయలపై ఉన్న అడ్డుకట్టలను తొలగించే విధంగా స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అనంతరం మండలంలోని ఊడిమూడి, వైవీపాలెం, మానేపల్లి, కందాలపాలెం ర్యాంపులను ఆయన పరిశీలించి ర్యాంపుల్లో బాటలను తొలగించాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవికి సూచించారు. అలాగే ర్యాంపుల పరిధిలో ఉన్న వీఆర్వోలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ర్యాంపులను పరిశీలించాలని ఆదేశించారు. ఇది లావుండగా మానేపల్లి మట్టి ర్యాంపు తనిఖీల్లో భాగంగా ర్యాంపు పరిసరాల్లో ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లను ఆర్డీవో స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆధీనంలో ఉంచినట్టు తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న ట్రాక్టర్ల యజమానులను ఉద్దేశించి ఒక ట్రక్కు ఇసుక కోసం బయటకు వస్తే వాహనాలు బయటకురావని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంట స్థానిక వీఆర్వోలు ఎం.నాగన్న, ఎన్.రత్నకుమారి, సిబ్బంది ఉన్నారు.

### మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు: ఏడీ

అంతర్వేది, జూలై 1(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని మత్స్యశాఖ ఏడీ హర్షవర్ధన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సఖినేటిపల్లి మండలం పల్లిపాలెంలో మత్స్యకారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈదురుగాలులు, అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు.

### తమలపాకుల అలంకరణలో సత్తెమ్మతల్లి

ముమ్మిడివరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మ తల్లిని మంగళవారం తమలపాకులతో అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### వైద్య విద్యార్థినికి గోల్డ్‌మెడల్

జీజీహెచ్(కాకినాడ), జూలై 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో సామాజిక వైద్య శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫస్టియర్ చదువుచున్న డాక్టర్ ఉజితను బంగారు పతకం వరించింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో జూన్ 27నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. రంగరాయ వైద్య కళాశాల నుంచి సామాజిక వైద్యవిభాగం హెచ్‌వోడీ డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీదేవి, పీజీ విద్యార్థులు హాజరయ్యారు. పేపర్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డాక్టర్ ఉజితకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం దక్కింది. ఆమెను మంగళవారం ఆర్ఎంసీలో ప్రిన్సిపాల్ ఎ.విష్ణువర్ధన్ అభినందించారు.

వీరబాబును సత్కరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

## ఆక్వారిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరబాబు

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆక్వారిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడకు చెందిన బాబు ఎక్వేరిస్ట్ అధినేత, టీడీపీ బీసీ విభాగం జిల్లా నాయకుడు చొల్లంగి వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ పాత పోస్టాఫీసు వీధిలోని హోటల్ గ్రీన్‌పార్క్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం రాష్ట్ర అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చొల్లంగి వీరబాబు, గౌరవాధ్యక్షుడిగా నాగవర్మ, ఉపాధ్యక్షుడిగా కొవ్వూరి విమలాబాబు, కార్యదర్శిగా బొల్ల బంగారాజు, సంయుక్త కార్యదర్శిగా తాతపూడి రంగారావు, కోశాధికారిగా మీర్ జమీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, విశిష్ట అతిథిగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడలి ఈశ్వరి, గౌరవ అతిథిగా మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.కృష్ణారావు హాజరయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. మత్స్య శాఖ అభివృద్ధి అధికారి గోపి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, అసోసియేషన్ కోర్ కమిటీ సభ్యుడు రవి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి (బాబు)

## డీసీసీబీకి పూర్వవైభవం తీసుకొస్తా: చైర్మన్ తుమ్మల బాబు

కాకినాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకొస్తానని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. డీసీసీబీ సమావేశ హాలులో మంగళవారం ఆయన అధ్యక్షతన ఆప్కాబ్ అధికారులతో సమావేశం జరిగింది. ఆప్కాబ్ సీజీఎం ఎన్.వెంకటరత్నం బృందంతో బ్యాంకు పురోభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆప్కాబ్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు, రాయితీలు కల్పించాలని అధికారులను కోరారు. బ్యాంకు నిరర్థక ఆస్తులను తగ్గించాలని, డిపాజిట్లను పెంచాలని, కొత్త రుణాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు. రైతులకు అందుబాటులో సొసైటీలు పని చేస్తాయని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో ప్రవీణ్‌కుమార్, సీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

## శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం రూ.31.66 లక్షలు

హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పెద్దాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం తెరిచి లెక్కించారు. 104 రోజులకు రూ.31,66,081 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ అధికారి వి.ఫణీంద్రకుమార్. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది లావణ్య, హరిబాబు, తుని, అనపర్తిలకు చెందిన శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

### నేడు జడ్పీ సమావేశం

కాకినాడ సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కాకినాడ జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరగనుంది. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించనుండగా మంత్రులు, ఎమ్మెల్యేలు జడ్పీటీసీలు, ఎంపీపీలు విచ్చేయనున్నారు. ఏర్పాట్లను జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు పర్యవేక్షించారు.

## సర్కారు బడిలోకి ఉపాధ్యాయుడి బిడ్డ

**కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్కూల్ టీచర్**

కుమార్తెను రాజమహేంద్రవరంలోని చున్నీలాల్ జాజు కార్పొరేషన్ పాఠశాలలో చేర్పిస్తున్న శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల చుట్టూ తిరిగి లక్షలకు లక్షలు ఫీజులు కట్టి మరి సీట్ల కోసం ఎదురుచూసే తరుణంలో వాటిని కాదని తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదువుకోవాలని ఒక ఉపాధ్యాయుడు తలంచాడు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ చున్నీలాల్ జాజు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చింతపల్లి శ్రీనివాస్ తన కుమార్తె మేరిగ్రేస్‌ను 8వ తరగతిలో తన పాఠశాలలోనే చేర్చారు. గతంలో ఇదే ఉపాధ్యాయుడు నాగరాజా మునిసిపల్ పాఠశాలలో పనిచేసినప్పుడు అక్కడ 7వ తరగతిలో చేర్పించారు. ఇప్పుడు చున్నీలాల్‌కు ఆయన బదిలీ కావడంతో తన కుమార్తెను ఈ పాఠశాలకు మార్చుకున్నారు. చిన్నపాటి ప్రైవేట్ ఉద్యోగం చేస్తేనే తమ పిల్లలను బ్రాండ్ ఇమేజ్ ఉన్న పాఠశాలలో చేర్పించి చదించే నేటి కాలంలో ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదువుకోవాలని శ్రీనివాస్ ఈ నిర్ణయం తీసుకోవడం పలువురిని ఆలోచింపజేస్తోంది. ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను పెంచుతుంది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కూడా బాగున్నాయని, ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగం రాకముందు తాను ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశానని, అందువల్ల తనకు తేడా తెలుసునన్నారు.

### సబ్జెక్‌పై పట్టు వస్తుంది

మాది రామచంద్రపురం దగ్గర కాపవరం గ్రామం. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదువుకున్నాను. నా కుమార్తె కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతానని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధనతో సబ్జెక్‌పై పట్టువస్తుంది. తనలో కాన్ఫిడెన్స్ వుంది. పదో తరగతిలో పాఠశాలకు మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది.

-శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు.

## దాట్ల మరిన్ని సామాజిక రచనలు చేయాలి

**రీజెన్సీ అధినేత జీఎన్ నాయుడు**

దేవదానంరాజును సత్కరిస్తున్న జీఎన్ నాయుడు

యానాం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యానాంకు చెందిన ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మరిన్ని సామాజిక స్పృహ కలిగిన రచనలు చేయాలని రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు అన్నారు. ఉగాదినాడు సీఎం చంద్రబాబు నుంచి కళారత్న పురస్కారం అందుకున్న కవి, కథకుడు, చరిత్రకారుడు దాట్ల దేవదానంరాజును నాయుడు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజు గతంలో యానాం పూర్వవైభవం కోసం అనేక సూచనలు చేశారని, సాహిత్య రంగంలో మరిన్ని సామాజిక అంశాలతో రచనలు చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అకాంక్షించారు. రాజును చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు, చింతా కొండలరావు కూడా అభినందించారు.

## సిగాచి ఫ్యాక్టరీలో ప్రమాదం చాగల్లు యువతి మృతి

జయలక్ష్మీ ప్రసన్న (ఫైల్)

చాగల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన పోలిశెట్టి జయలక్ష్మీప్రసన్న (22) హైదరాబాద్‌లోని సిగాచి కెమికల్స్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందింది. ఆమె బీ ఫార్మసీ పూర్తిచేసి ఫ్యాక్టరీలో కెమిస్టుగా పనిచేస్తోంది. ఉద్యోగంలో చేరి 2 నెలలు గడవకుండానే మృతిచెందడంపై తల్లిదండ్రులు బోరున విల పిస్తున్నారు. తండ్రి పోలిశెట్టి శ్రీనివాసరా వు తాపీమేస్త్రీ. తల్లి రామలక్ష్మి ఆశ కార్యకర్త. మృతురాలు పెద్దమ్మాయి కాగా, చిన్న మ్మాయి ప్రభుకుమారి బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఘటనా స్థలానికి త ల్లిదండ్రులు చేరుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మోటార్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి

సీతారామ రాజు (ఫైల్)

తునిరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని 16వ జాతీయ రహదారి చేపూరి వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి వ్య క్తి మృతిచెందాడు. తేటగుంట గ్రామానికి చెం దిన దంతులూరి వరహసీతారామరాజు (43) మంగళవారం మోటార్‌సైకిల్‌పై తుని నుంచి తేటగుంట వస్తుండగా చేపూరి వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 సిబ్బంది ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాముకాటుకు వ్యక్తి మృతి

చాగల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం నందిగంపాడుకు చెందిన ఆత్కూరి పెద్ద సత్యనారాయణ (51) పాముకాటుకు మంగళవారం మృతిచెందాడు. పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఫుడ్ కమిటీ సభ్యుల ఆగ్రహం

### అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్‌కు షోకాజ్ నోటీసులు

శంఖవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇలాంటి భోజనాన్ని మీ పిల్లలకు పెడతారా అని ఫుడ్ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో మంగళవారం ఫుడ్ కమిటీ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్, లక్ష్మిరెడ్డి పర్యటించారు. నెల్లిపూడి 2, శంఖవరం4 అంగన్‌వాడీ పాఠశాలలను పరిశీలించి రికార్డుల్లో తేడాలను గమనించారు. హాజరుపట్టీని పరిశీలించి తరచుగా తనిఖీ నిర్వహించని సూపర్‌వైజర్లు రజనీ, అరుణశ్రీకు షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా నోడల్ అధికారి జెస్సీ ఫ్లోరెన్స్‌ను ఆదేశించారు. స్టాక్‌లలో తేడా ఉన్నందున నెల్లిపూడి పాఠశాల టీచర్‌కు నరాల భూలక్ష్మీకి షోకాజ్ ఇవ్వాలని సీడీపీవో పి.వెంకటలక్ష్మీకి తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేసి విద్యాశాఖ సిబ్బందిని ప్రశ్నించారు. అల్లూరి సీతారామరాజు ఏజన్సీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పదిలోపే భోజనం పాఠశాలకు వస్తుందని పలువురు తెలపడంతో దీనిపై నివేదిక పంపాలన్నారు. డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో ఎస్వీ రమణ, సూపర్‌వైజర్లు నాగమణి తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ జిల్లా నెల్లిపూడిలో అంగన్‌వాడీ రిజిస్టర్లు పరిశీలిస్తున్న సభ్యులు

# పొగడ్తలు వినడానికి రాలేదు... పార్టీని బాగుచేయడానికి వచ్చా

మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

● కొవ్వూరులో కొత్తరోజులకు శ్రీకారం చుట్టండి ● బహునాయకత్వాన్ని ఒప్పుకోను ● టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం

కొవ్వూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'కష్టపడిన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోను. కార్యకర్తలు నేను చెప్పినట్టే చేయండి. మీ పొగడ్తలు వినడానికి రాలేదు. పార్టీని బాగు చేయడానికి వచ్చాను. పార్టీల్లో ఇబ్బందులు సృష్టించే వాళ్లను దూరం పెడతా, కొవ్వూరులో పాత రోజులు మరిపోండి. కొత్త రోజులకు శ్రీకారం చుట్టండి. సింగిల్ వాయిస్ ఉండాలి. ఎమ్మెల్యే, ద్విసభ్య కమిటీ ఒకేమాటగా ఒకేతాటిపై నడవాలి. కొవ్వూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడతా. గీత దాటితే ఉపేక్షించేది లేదు. ఇక్కడ ఏం జరుగుతుందో అంతా నాకు తెలుసు. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వివరాలను సేకరిస్తూనే ఉన్నాం' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలోని ఏఎంసీ గొడౌన్ల వద్ద మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ 'పార్టీలో లీడర్‌షిప్ చూసి ఓట్లు వేస్తారు. నాయకుడు చేసే ప్రతి పనిని, సంక్షేమాన్ని ఇంటింటికి తెలియజేయాలి. ఓటు బ్యాంకు పెంచాలి. టీడీపీకి బలం బీసీ వర్గాలు. 144 కులాలు ఉన్నాయి, చిన్న కులాలకు మైక్రో లెవిల్ గుర్తింపు ఇవ్వాలి. నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోషల్ మీడియా విషయంలో 225 ర్యాంకు. ఫేస్‌బుక్‌లో 2,432 పోస్టులు పెట్టారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడి పోస్టులతో ఇది సమానం. యూట్యూబ్ చానల్ లేనేలేదు. ఇంకా సోషల్ మీడియాలో స్పీడప్ కావాలి. కులాల వారీగా నాయకత్వం చెక్ చేసుకోండి' అని చంద్రబాబు చెప్పారు. డమ్మీ లీడర్లను పెట్టుకుంటే పార్టీ డమ్మీ అయిపోతుందన్నారు. వాయిస్ ఉండే నాయకులను పెట్టుకోవాలన్నారు. పబ్లిక్ ఒపీనియన్ సేకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో బహునాయకత్వాన్ని ఒప్పుకునేది లేదన్నారు. అచ్చిబాబు ఉన్నారు. ద్విసభ్య కమిటీ ఉంది. బయట నియోజకవర్గాల్లో నాయకులు ఎక్కడా ఇంటర్ఫియర్ అవ్వడానికి వీల్లేదన్నారు. అలా చేస్తే వారిని కట్ చేస్తానన్నారు. ఎమ్మెల్యేకి చెబుతున్నాను అందరిని కలుపురండీ అని. జవహర్‌కు గౌరవం ఎస్సీ కమిషన్ చైర్మన్ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 8 వేల నుంచి 9 వేల బూత్‌లలో మనకు మెజారిటీ రాలేదని, 10 వేలు మెజారిటీ వచ్చి ఉంటే 175కి 175 సీట్లు మనకు వచ్చేవన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చినా నాయకులకు గౌరవం దక్కడం లేదని, అధికారులే ఎంజాయ్ చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే మాట కలెక్టర్ వినడం లేదన్నారు. కొవ్వూరు మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానికంగా ఉండడం లేదని, మీరు సెంట్రల్ జైల్లో ఉండగా నిరాహార దీక్ష చేశానని చెబుతుండగా సీఎం చంద్రబాబు అతడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొవ్వూరు జాతకం 45 సంవత్సరాలుగా నాకు తెలుసు. గ్రూపులు ఈ నియోజకవర్గంలో ఇప్పటి నుంచే ఉండడంలేదన్నారు. నిజమైన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోనన్నారు. గ్రూపు రాజకీయాలు వద్దన్నారు. అయతే కొంతమంది కార్య కర్తలను సమావేశంలోకి అనుమతించక పోవడం తో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎస్.రాజీవ్‌కృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఆళ్ల హరిబాబు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, పొట్రు శ్రీనివాసరావు, నామాన పరమేష్, కొఠారు వెంకట్రావు, మద్దిపట్ల సురేష్, గొరిజాల సురేష్, చావా శ్రీనివాసరావు, బొల్లిన శివ నాగేం ద్ర, గెల్లా సురేష్, కొత్తపల్లి ఆశిష్‌లాల్, వరిగేటి కాంతరాజు, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, ఎరుబండి వెంకట్రావు, 3 మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# సీఎం కారులో చర్మకారుడు

### సరుకులు కొనిచ్చిన ముఖ్యమంత్రి
### చెప్పుల జత, టోపీకి రూ.5వేలు

పోసిబాబు తయారుచేసిన చెప్పును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. మలకపల్లిలో చర్మకారుడు పోసిబాబు ఇంటికి వెళ్లి చర్మకారదారులకు ఇచ్చే పింఛను ఇవ్వాల్సి ఉంది. అయితే పోసిబాబు ధర్మవరంలోని ఓ షాపు వద్ద ఉండడం గమనించిన యంత్రాంగం సీఎంకు చెప్పగా..ఆ దుకాణం వద్ద కారు ఆపి పోసిబాబును కారులో ఎక్కించుకొని తన పక్క సీటులో కూర్చోబెట్టుకున్నారు. అక్కడి నుంచి మలకపల్లికి 2కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకూ కుటుంబ నేపథ్యం, స్థితిగతులు, వృత్తి జీవితం తదితర విషయాలపై పోసిబాబును ఆరా తీశారు. ఒక్కసారిగా సీఎం చంద్రబాబు కారు ఎక్కడమే కాకుండా ఆయన పక్కనే కూర్చొని రెండు కిలోమీర్లు ప్రయాణించడంపై పోసిబాబు సంతోషం వ్యక్తం చేశాడు. ఎంతో ఉన్నతాధికారులకు సైతం దక్కని అవకాశం తనకు దక్కిందని, ఎంతో అదృష్టమంటూ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. పోసిబాబును తీసుకుని అతడి ఇంటికి వెళ్లి పింఛను అందజేసి యోగక్షేమాలు అడిగారు. పోసిబాబు డప్పును తీసుకొని దరువు వేశారు. దీంతో ఆ కుటుంబం మరింత మురిసిపోయింది. పోసిబాబు తయారు చేసిన చెప్పులు, టోపీని చంద్రబాబు ముచ్చటపడి కొనుగోలు చేశారు. వాటి నిమిత్తం రూ.5 వేలు పోసిబాబుకు చెల్లించారు. గ్రామంలో చర్మకార పింఛను పొందుతున్న వ్యక్తి పోసిబాబు ఒక్కడే కావడం గమనార్హం. అంతకు ముందు కొండా వెంకటేశ్వరరావు జనరల్ స్టోర్‌కి వెళ్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కష్టసుఖాలపై ఆరా తీశారు. అనంతరం గెడ్డం కృష్ణ దుర్గా ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందజేశారు. అక్కడే తల్లి ఒడిలో ఉన్న పసిపాపను దగ్గరకు తీసుకొని ముద్దాడారు. దారి పొడవునా ఉన్న ప్రజలను చూస్తూ అభివాదం చేశారు.

### మురిసిన మలకపల్లి

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలంలో మలకపల్లి ఓ చిన్న గ్రామం. వివిధ విభాగాల్లో 783 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులు ఉన్నారు. ఈ గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. అదీ ఆరు అడుగుల సందులోకారు వెళ్లడానికి కూడా కాస్త ఇబ్బందిగా ఉండే పరిస్థితుల్లో ఎస్సీ పేటలోకి సీఎం వెళ్లడం, పింఛన్లు ఇవ్వడం ఇదే మొదటి సారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. ప్రస్తుతం రబీ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా జనం ఉదయం 9గంటలకే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎక్కువగా మహిళలే ఉన్నారు. ప్రజల కోసమే తాను వచ్చానని సీఎం చెప్పగా మలకపల్లి మురిసిపోయింది.

# 1500 మందితో బందోబస్తు


సీఎం చంద్రబాబు కాన్వాయ్ వద్ద పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా సు మారు 1500 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ మళ్లింపు ఎక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 600 మంది పోలీసులను ప్రత్యక్షంగా విధుల్లో వినియోగించగా.. మిగతా వాళ్లను మఫ్టీలో నిఘా పెట్టారు. డ్రోన్, రోప్, స్పెషల్ పార్టీలను రంగంలోకి దింపారు. వాతావరణ కారణాల వల్ల పర్యటనలో ఎలాంటి మార్పులు జరిగినా దానికి అ నుగుణంగా భద్రత కల్పించడానికి ప్లాన్లు ము ందుగానే సిద్ధం చేశారు. బందోబస్తును తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ నిరంతరం స్వయంగా పర్యవేక్షించారు.

### ఒకే పుష్పం.. భిన్నంగా స్వాగతం

సీఎం స్థాయి వ్యక్తులు వచ్చినప్పుడు జిల్లా ఉన్నతాధికారులు, నేతలు విమానాశ్రయానికి వెళ్లి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలకడం పరిపాటి. కానీ ఈసారి సీఎం చంద్రబాబు వచ్చినపుడు భిన్నంగా ఒక పుష్పంతోనే మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ తదితర నేతలు మలకపల్లిలోని వేదిక వద్దకు ఒక ప్రైవేటు మినీ వ్యాన్‌లో వచ్చారు. వారి గన్‌మ్యాన్‌లను కూడా అనుమతించలేదు. సీఎం ఎన్ఎస్‌జీ భద్రతలో ఉన్నారు. దీంతో భద్రతాపరంగా పలు జాగ్రత్తలను సీఎం కార్యాలయం నుంచి సూచించినట్లు తెలుస్తోంది.

# మోటార్‌సైకిల్, ఆటోను ఢీకొన్న కారు

### ఇద్దరికి తీవ్ర గాయాలు

దెబ్బతిన్న కారు

దెబ్బతిన్న ఆటో

గొల్లప్రోలు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెళ్తుండగా మోటార్‌సైకిల్, ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడకు చెందిన వెంకటరమణ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి కేదారశెట్టి విష్ణువర్ధన్ ఇటీవల కొత్త కారు కొనుగోలు చేశాడు. తన స్నేహితుడు మందారపు అభిషేక్‌తో కలిసి విశాఖపట్టణంలో కారు సర్వీసింగ్ చేయించేందుకు కాకినాడ నుంచి మంగళవారం బయ లుదేరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో వెళ్తుండగా అడవిపుంత నుంచి వస్తున్న మోటార్‌సైకిల్‌ను, ఆపై రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆటోను ఢీకొన్నారు. ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న చేబ్రోలుకు చెందిన ఓరుగంటి అప్పలరాజు, కర్రి చక్రంకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని తొలుత పిఠాపురం తదనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. హైవే పోలీసులు, గొల్లప్రోలు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

నల్లజర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అచ్చన్నపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపల్లి చెందిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపల్లి వెళ్తుండగా వారి బైక్ అదుపు తప్పి పడిపోయారు. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఎలక్ట్రికల్ షాపులో చోరీ

### క్యాష్ కౌంటర్‌లో రూ.70వేలతో పరారీ

షాపులో సీసీ కెమెరా దృశ్యం

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దుకాణ యజమానిని ఏమార్చి గుర్తు తెలియని వ్యక్తి క్యాష్ కౌంటర్‌లోని సొమ్మును తస్కరించి పరారయ్యాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ షాపు వద్దకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. దుకాణ యజమానిని ఎలక్ట్రికల్ సామాన్లు కావాలని అడగగా యజమానికి లోపలకు వెళ్లాడు. ఇది గమనించిన అగంతకుడు క్యాష్ కౌంటర్‌లోని రూ.70 వేలకు పైగా నగదును తీసుకుని పరారయ్యాడు. షాపు యజమాని, ఇతరులు వెంటపడినప్పటికి దొరకలేదు. చోరీ దృశ్యాలు షాపులోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా షాపు నిర్వాహకులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 'ఉమ్మడి తూర్పు గోదావరి'తో బీవీ పట్టాభిరామ్‌కు అనుబంధం

### రామచంద్రపురంలోని కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం
### కాకినాడలో డిగ్రీ విద్య పూర్తి
### ఇంద్రజాలకుడిగా ప్రదర్శనలు
### కాకినాడలో వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహణ

విద్యార్థులు, తల్లిదండ్రులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న పట్టాభిరామ్ (ఫైల్)

రామచంద్రపురం(ద్రాక్షారామ)/కార్పొరేషన్(కాకినాడ), జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు బీవీ పట్టాభిరామ్ మృతితో గోదావరి జిల్లాల్లోని ఆయన సన్నిహితులు, ఆయన శ్రేయోభిలాషుల్లో విషాదం నెలకొంది. ఆయనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. పట్టాభిరామ్ నెల్లూరు జిల్లాలో జన్మించినప్పటికీ.. ఆయన తండ్రి బీవీ సత్యనారాయణ కాజులూరు మండలం శీల గ్రామంలో జన్మించినట్టుగా సమాచారం. ఆయన వృత్తి రీత్యా వేర్వేరు ప్రదేశాల్లో ఉండాల్సి వచ్చింది. దీంతో ఆయన తండ్రి సత్యనారాయణ అప్పటి తూర్పుగోదావరి జిల్లా.. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం మండలం చెల్లూరు సర్వారాయ సుగర్స్‌లో ఇంజనీర్‌గా పనిచేసేవారు. దీంతో ఆయన కుటుంబం రామచంద్రపురంలో నివాసం ఉండేది. ఈ నేపథ్యంలో పట్టాభిరామ్ బాల్యం అంతా ఇక్కడే సాగింది. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించారు. దీంతో కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాల పూర్వవిద్యార్థిగా బీవీ పట్టాభిరామ్‌ను 2009లో రామచంద్రపురంలో పూర్వవిద్యార్థుల సంఘం సత్కరించింది. ఆయన, ప్రముఖ గేయ రచయిత దివంగత అదృష్టదీపక్ ఇద్దరూ క్లాస్‌మేట్స్ కాకినాడ పీఆర్ కాలేజీలో డిగ్రీ.. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఏ చదివారు. పట్టాభిరామ్‌కు కౌమారదశలో కాలి వైకల్యం కలిగింది. దీంతో ఆయన ఆత్మన్యూనతా భావానికి గురికాగా దాన్ని జయించి తనని తాను ఇంద్ర జాలికుడిగా, రచయితగా తీర్చిదిద్దుకున్నారు. డిగ్రీ చదవుతున్న సమయంలో ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబార్‌రావు వద్ద మంత్రజాల విద్యలో మెళకువలు నేర్చుకున్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో అనేక స్టేజీలపై ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవారు. వ్యక్తిత్వ వికాస నిపుణిడిగా పలుమార్లు కాకినాడలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

### ప్రజలను జాగృతం చేస్తూ కార్యక్రమాలు

అదృష్టదీపక్‌తో పట్టాభిరామ్

పట్టాభిరామ్ ఇంద్రజాల విద్యతో చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రాజాలన్ని జోడించి ప్రభుత్వ పథకాలు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలపై ప్రచారం కల్పించారు. వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన రెం డురెళ్ల ఆరు లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. పలు పత్రికల్లో వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు. పలు పర్యాయాలు రామచంద్రపురంలో ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు.

## రాచపల్లి అరుణాచల క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యేల బృందం


కాకినాడ జిల్లా రాచపల్లిలో బసవేశ్వరుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని ఆంధ్రా అరుణాచల క్షేత్రం జిల్లాకే ఒక మణిహారం అని ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభరాజా, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప కొనియాడారు. రాచపల్లి అడ్డురోడ్డు వద్ద రమణ సేవాశ్రమ ప్రాంగణంలో ఉన్న అపీత కుచాంబ సమేత అరుణాచల దేవస్థానాన్ని మంగళవారం ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. అరుణాచలేశ్వర స్వామి అపీత కుచాంబ అమ్మవార్లను, బసవేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 7న ఈ ఆలయంలో భక్తగ్రేసర్లు మహాశివభక్తులైన 63 నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలతోపాటు దక్షిణామూర్తి, సూర్యభగవాన్, అయిగ్రీత, కాళభైరవ, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణాచలమాధవి, ఆలయ వ్యవస్థాపకులు స్వామిరమణానంద ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో నిర్వాహక కమిటీ ఆహ్వాన మేరకు ఎమ్మెల్యేలు ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రతిష్ఠించే నాయినార్ల విగ్రహాలను, పల్లకిలను, ఆధ్యాత్మిక వేదిక, ఇతర ఏర్పాట్లను ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది.


ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

**కావలెను**

కాకినాడ మెయిన్ రోడ్డులో Jewelary & Textiles షోరూంలో పనిచేయుటకు సిబ్బంది కావలెను. Qly. Inter Salary 16 వేలు, డిగ్రీ 18వేలు, డేటా ఎంట్రీ సిస్టమ్ ఆపరేటింగ్‌లో అనుభవం కలవారు కావలెను. శాలరీ రూ.22,000/- మరియు కాకినాడలో ఒక ఇంట్లో వంట మరియు ఇంటిలో పనులు చేయుటకు 35 సం॥ల లోపు ఆడ వంట మనిషి కావలెను. జీతం రూ.20వేలు కాకినాడ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సెల్: 6301943220, 8008440189

AJD:

**వధువు కావలెను**

37 సం॥గల ఆర్థికంగా బాగా స్థిరపడిన డైవర్స్ (రెడ్డి) వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు వున్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు నో డౌరీ సెల్: 6301943220, 8008440189

AJD:

4 Lines CLASSIFIED Rs.230/- Only


## 'హెలికాప్టర్లను అందుబాటులో ఉంచండి'

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

కూనవరం/వీఆర్‌పురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూనవరం 1986 నుంచి 2006 వరకు వచ్చిన వరదల్లో ప్రజలకు ఆహారం సరఫరా, అత్యవసర రోగులను భద్రాచలం తరలించేందుకు అప్పటి ప్రభుత్వాలు హెలికాప్టర్లను ఉపయోగించేవని ఇప్పుడు కూడా అవి అందుబాటులో ఉండేలా చూడాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు ప్రజలు సూచించారు. రాబోయే వరదల దృష్టిలో పెట్టుకుని అల్లూరి జిల్లా కూనవరంలో ప్రజలతో పీవో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో చిన్న లాంచీలు ఉపయోగిస్తే ప్రతి గ్రామంలోకి వెళ్లి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించవచ్చన్నారు. ఒక్క కోతలగుట్టలోనే కాకుండా ప్రతి సచివాలయంలో బఫర్ స్టాక్‌తో పాటు నిత్యావసర వస్తువులు ఉంచాలన్నారు. వరదల సమయంలో తాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆసుపత్రుల్లో అన్ని మందులు ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీవో మాట్లాడుతూ ప్రజల సూచించిన ప్రతి సమస్యను పరిష్కారిస్తామని హామీఇచ్చారు. వరదల సమయంలో తాను కోతుల గుట్టలోని కలెక్టర్ బంగ్లాలో అందుబాటులో ఉంటానని తెలిపారు. బాధితుల కోసం వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తానని ఎటువంటి సమస్య వచ్చిన ఆ గ్రూపులో తెలియచేస్తే వెంటనే సమస్యను పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్య కూనవరం మేజర్ పంచాయితీ ఈవో సురేష్ పాల్గొన్నారు. వీఆర్‌పురం మండలం రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో పీవో వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

## వెళ్తోంది యుద్ధ ట్యాంకర్ వార్‌కు కాదు!

కొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండిపై యుద్ధ ట్యాంకర్ వెళ్లడం ఏమిటని ఆశ్చర్యపోకండి. ఈ ట్యాంకర్‌ను కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన యువకుడు పంపన నాగేంద్ర చెక్కతో తయారు చేశాడు. కాకినాడ బీచ్‌పార్క్‌లో సందర్శకుల వీక్షణ కోసం ఏర్పాటు చేసేందుకు సుమారు 20రోజులు శ్రమించి తీర్చిదిద్దాడు. మంగళవారం బీచ్‌పార్క్‌లో ఏర్పాటు చేసేందుకు వెంకట రాపురం నుంచి గోర్స పండూరు మీదుగా బీచ్‌రోడ్డుకు ఎడ్లబండిపై ట్యాంకర్‌ను తరలించారు. దీంతో ఆ దారిలో పలువురు ఆశ్చర్యంగా తిలకించారు.

## గోదావరి.. శబరి సంగమం.. అద్భుతం

కూనవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాసిక్‌లో పుట్టిన గోదావరి నది ఒడిశా రాష్ట్రంలోని తూర్పు కనుమల్లో సింకరం కొండల శ్రేణుల నుంచి ప్రవహించే శబరి నది అల్లూరి జిల్లా కూనవరం వద్ద సంగమంగా ఏర్పడతాయి. ఈ రెండు నదులు ఇక్కడ కలిసిన సుమారు కిలోమీటరు వరకు వేరువేరుగా ప యనిస్తాయి. గోదావరి నీళ్ల నీలం రంగులోను, శబరి నీళ్ల ఎరుపు రంగులోను ప్రవహిస్తాయి. 2 నదులు నిత్యం ఇలాగే ప్రవహించినా వర్షాకాలంలో మాత్రం వేరువేరుగా ప్రవహిస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తాయి.

కూనవరంలో వేరు వేరు రంగుల్లో కనిపిస్తున్న శబరి, గోదావరి నీళ్లు

## రహదారిపై ఆక్రమణల తొలగింపు

తాళ్లరేవు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ పరిధిలోని సీతారామపురం-గాడిమొగ రహదారిపై ఆక్రమణలను మంగళవారం తొలగించారు. కార్యదర్శులు వీజేవీ రమణ, శంకరనారాయణ, వెంకటరమణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ సమక్షంలో పంచాయతీ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణలను తొలగించారు.

కాకినాడ, సామర్లకోట మండలం అచ్చంపేటల్లో లబ్ధిదారులకు పెన్షన్ల సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, చినరాజప్ప

## 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 34వ డివిజన్ బ్యాంక్‌పేటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు లబ్ధిదారులకు అందజేశారు. టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, డివిజన్ నాయకులు పొంగా సత్య, బచ్చు కృష్ణ, శ్రీను, సూరిబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** అచ్చంపేటలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. పంచాయతీ, సచివాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

107వ సారి రక్తదానం చేస్తున్న శ్రీనివాసరాజు

## 'దేశ నిర్మాణంలో సీఏల పాత్ర కీలకం'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో చార్టర్డ్ అకౌంటెంట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ కాకినాడ బ్రాంచి చైర్మన్ తాళ్ళూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బ్రాంచి కార్యాలయంలో సీఏ డేని ఘనంగా నిర్వహించారు. సీఏ జెండాను శ్రీనివాసరాజు ఎగురవేశారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి 107వసారి రక్తదానం చేశారు. అధిక సంఖ్యలో సీఏలు రక్తదానం చేశారు. శ్రీనివాసరాజు, సీనియర్ సీఏ ఆదిత్యశర్మ మాట్లాడారు. అనంతరం డాక్టర్ వాడ్రేవు రవి ఆధ్వర్యంలో హెల్దీ లైఫ్‌స్టైల్ మేనేజ్‌మెంట్ సదస్సు జరిగింది. సెక్రటరీ పాండురంగమూర్తి, ట్రెజరర్ పవన్‌కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు నేతి నాగేశ్వరరావు, డాక్టర్ సతీష్, మాచారెడ్డి, డాక్టర్ కామరాజు, చిరంజీవి రెడ్డి, మమత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి):** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే డిస్పెన్సరీలో వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాలు నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు తెలిపారు. డాక్టర్లు డీవీవీ సత్యనారాయణ, ఎన్.సుదీప్తి, సీఏ ఎన్.సతీష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మురళీధర్, మునిరెడ్డి, కుటుంబరావు, పద్మ, ఫార్మసిస్టు పి.శ్రావణి, డిస్పెన్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొడవలి కొండపై సంయుక్త సర్వే

### కలెక్టర్ ఆదేశాలతో మైన్స్, రెవెన్యూ అధికారుల పరిశీలన

గొల్లప్రోలు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో సర్వే నెం.133/1లోని కొండ పోరంబోకు (తురకల కొండ) భూముల్లో మైన్స్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం సంయుక్త సర్వే చేపట్టారు. వైసీపీకి చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, గత ఎన్నికల్లో చిత్తూరు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తికి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన లీజులు ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కొడవలి కొండపై తవ్వకాలు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ షాన్‌మోహన్ సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా మైన్స్ సర్వేయర్ శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యతేజ, రవిచంద్ర, ఎంఆర్ఐ బాలకృష్ణ, కొడవలి వీఆర్వో గోవిందులు కొండ ప్రాంతంలో సర్వే నిర్వహించారు. ఇప్పటివరకు తవ్వకాలు జరిగిన ప్రాంతాలు, బౌద్ధ ఆరామాలు ఎక్కడ ఉన్నాయి. ఏమైనా చెట్లు కొట్టివేశారా, ఇచ్చిన అనుమతుల ప్రకారమే తవ్వకాలు జరిగాయా, ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహించారా తదితర అంశాలను పరిశీలించారు.

## మేమే వైద్యులం... డాక్టర్ల వేషధారణలో అలరించిన చిన్నారులు

పిఠాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మేమే వైద్యులం, మీకు వైద్య పరీక్షలు చేస్తామంటూ ఆ చిన్నారులు చేసిన సందడి ఆకట్టుకుంది. యాప్రాన్లు ధరించి డాక్టర్ల వేషధారణలో అలరించారు. పట్టణంలోని భాష్యం స్కూల్లో మంగళవారం డాక్టర్స్ డే నిర్వహించారు. విద్యార్థులు వైద్య విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ చేసిన నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. విష్ణు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ పిల్లా శ్రీధర్, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వెనక్కి తీసుకునే వరకు పోరాటం: రత్నాకర్

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలంతా ఒకటేనని ఆనాటి బ్రిటీష్ పాలకులే గుర్తించారని, అయితే కేంద్రంతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల పాలకులు కుట్రపూరితంగా ఎస్సీ వర్గీకరణ చేపడుతున్నారని మాలమహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ పేర్కొన్నారు. నగరంలోని శాంతినివాస్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకునే వరకు నిరంతర పోరాటం కొనసాగుతుందన్నారు. నాయకులు కొప్పుల ప్రేమ్ బాబు, చిన్నం వెంకటేశ్వరరావు, నెల్లి సూరిబాబు, దారా నూకరాజు పాల్గొన్నారు.

## మహిళకు జనసేన ఆర్థిక సహాయం

పిఠాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో అనారోగ్యానికి గురై, విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటి వద్ద ఉన్న మహిళ కేశబోయిన నవీనను మంగళవారం జనసేన నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు రూ.5వేలు, జనసేన స్థానిక నాయకులంతా కలిపి రూ.12వేలు అందించారు. ఆమె చికిత్సకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిఠాపురం అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం మాజీ చైర్మన్ రెడ్డెం జనార్దన్, కౌన్సిలర్ కావాడ పోసయ్య, బండి రవి, పోలిశెట్టి శేఖర్, గాది కోటేశ్వరరావు, పడాల దొరబాబు, కొట్టేటి రాజేష్, నల్లాడ ప్రసాద్, ఉప్పు అప్పన్న, ఎస్.నాగు, కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా
## డాక్టర్ ఉమామహేశ్వరి

పెద్దాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా డాక్టర్ యు.ఉమామహేశ్వరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు పలువురు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా వైద్యుల దినోత్సవం

జీజీహెచ్ (కాకినాడ), జూలై 1 (ఆంధ్ర జ్యోతి)! కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో 13 మంది బెస్ట్ డాక్టర్లకు అవార్డులను ప్రదానం చేశారు. వైద్యులు గ్రామీణ వైద్య సేవలు మరింత బలోపేతం అయ్యేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అవార్డులు అందుకున్న వారిలో డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ ఐవీ రావు, డాక్టర్ ఎంబిఆర్ శర్మ, డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డాక్టర్ ప్రబోద్‌కుమార్, డాక్టర్ ఠాగూర్, డాక్టర్ జీఎస్ మూర్తి, డాక్టర్ ఆర్.మహలక్ష్మి, డాక్టర్ వై.నాగేశ్వరరావు, డాక్టర్ ఆదిత్యప్రసన్న, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఉన్నారు. జీజీహెచ్‌కు ఆర్థోపెడిక్ రంగంలో ఎనలేని సేవలు అందించి, తనదైన శైలిలో పాలన అందించిన డాక్టర్ విఠల్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శశి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి):** డాక్టర్స్ డే సందర్భంగా గాంధీనగర్‌లో అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు మద్ద వికాస్ అధ్యక్షత వహించగా గవర్నర్ పెంకే గోవిందరాజులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సౌత్ మల్టిపుల్ క్లబ్ కోశాధికారి వనం శ్రీనివాసరావు మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ నులుకుర్తి తారకకృష్ణలను శాలువాలతో సత్కరించారు. క్లబ్ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి పెంకే శివకుమార్, పీఆర్వో సుభద్ర, మన్యం గణేష్ వీరబాబు, కాకరపల్లి శ్రీనివాసరావు, గణేష్, నాగమణి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** భీమేశ్వర లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈదర ఈశ్వరకుమార్, చిత్తులూరి రాజా, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు, కర్రి ఆదినారాయణరెడ్డి, కానుబోయిన విజయకృష్ణ, బడుగు బాబీ, సేపేని సురేష్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే నిర్వహించారు. డాక్టర్ సన్యాసిరావుకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ మహోన్నత్, డాక్టర్ శ్రీవల్లీదేవిలను ఘనంగా సత్కరించారు. ఏలేటి రమేష్, వేగు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఆర్ఎంసీలో డాక్టర్ విఠల్‌ను సత్కరిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

కాకినాడలో డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

సామర్లకోటలో డాక్టర్ సన్యాసిరావును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

### ఘనంగా కుమార షష్టి పూజలు

సామర్లకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలోని కుమారస్వామి ఉపాలయం వద్ద మంగళవారం స్కంధ షష్టి మహా పర్వదినాన విశేష పూజలు నిర్వహించారు. ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ వేద మంత్రోచ్చారణలతో కుమారస్వామిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

### గొల్లప్రోలు తహసీల్దారుగా
## గోపాలకృష్ణ

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు తహసీల్దారుగా వీవీ గోపాలకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకుతహసీల్దారుగా పనిచేసిన సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో పిఠాపురం తహసీల్దారు గోపాలకృష్ణకు గొల్లప్రోలు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూపరంగా ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు కృషి చేస్తానని గోపాలకృష్ణ తెలిపారు.

## అఖిలేష్ యాదవ్ పుట్టిన రోజు వేడుక

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాద్ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో మంగళవారం జిల్లా బీసీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. విద్యార్థులు, బాటసారులకు అల్పాహారం, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు కుక్కల పోతురాజు, జట్ల శేషుకుమార్, తానంకి పార్థసారధి ఆధ్వర్యం వహించగా యనమల శివరామకృష్ణన్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, అల్లి రాజబాబు, కోలా ప్రసాదవర్మ, కుక్కల పోతురాజు, జట్ల శేషుకుమార్ మాట్లాడారు, తుమ్మలపల్లి చిన్న, రంగారావు, అబ్రహం, చరణ్, సూర్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏడాది సుపరిపాలనపై ఇంటింటా ప్రచారం'

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనపై ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం నుంచి నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంపై మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కొండబాబు ఆధ్వర్యాన కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సుర్ల లోవరాజు విచ్చేశారు. నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు సుంకర తిరుమల కుమార్, గ్రంధి నారాయణరావు, కొండమూరి సత్యనారాయణ, తుమ్మల రమేష్, గదుల సాయిబాబు, బచ్చు శేఖర్, ఎంఏ తాజుద్దీన్, వొమ్మి బాలాజీ, నల్లూరి శ్రీనివాస్, పంతాడి రాజు, సీకోటి అప్పలకొండ, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, పాలిక నాని, బోనేపల్లి శ్రీనివాస్, చితలపూడి రవి, గెడ్డం పూర్ణచంద్రశేఖర్, పలివెల రవిఅనంతకుమార్, బంగారు సత్యనారాయణ, బలసాడి రంగారావు, గాది శివరామకృష్ణ, ఎండీ జిలాని, గుమ్మళ్ల చిన్న, ఏవీడీ మెంటారావు, చింతా పేర్రాజు, సంగాని నాగేశ్వరరావు, బొబ్బిలి గోవిందు, దవులూరి భద్రరావు, మేడిశెట్టి చిన్ని, పసపులేటి వెంకటేశ్వరరావు, తుమ్మల సునీత, కొల్లు కుమారి, కొపనాతి నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు. చిత్రంలో మాజీ మంత్రి చిక్కాల

## 'సుపరిపాలనలో తొలి అడుగు'ను విజయవంతం చేయాలి

### టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పిలుపు

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిందని, భవిష్యత్తులో మరిన్ని అమలు చేస్తుందన్నారు. 2014-19లో అభివృద్ధి, సంక్షేమాల గురించి ప్రజలకు చెప్పలేకపోయిన కారణంగా 2019 ఎన్నికల్లో నష్టం కలిగిందన్నారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదని, ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. అందువల్ల ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నవీన్ కోరారు.

## భీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

సామర్లకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట భీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ ఈదర ఈశ్వరకుమార్, జిల్లా చైర్మన్ చిత్తులూరి రాజా వెల్లడించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా కార్యదర్శిగా బడుగు శ్రీకాంత్, కోశాధికారిగా ఏలేటి రమేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారికి లయన్స్ ప్రతినిధులు, శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. మద్దాలి శ్రీను, సేపేని సురేష్, కాపుగంటి పైడిరత్నం, కర్రి ఆదినారాయణరెడ్డి, గుండు శంకరరావు పాల్గొన్నారు. హరిహర క్షేత్రం తరపున కూనంశెట్టి అర్జునరావు ఆధ్వర్యంలో పండితులచే శ్రీనివాసరావుకు శాలువా కప్పి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

నూతన అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

## రేపు అన్ ఎయిడెడ్ పాఠశాలల బంద్

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్ టీఈ సెక్షన్12(1)(సీ)ని న్యాయంగా అమలు చేయాలని విద్యాశాఖాధికారులకు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవట్లేదని, దీనికి నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అన్ ఎయిడెడ్ పాఠశాలలను మూసివేస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఒక ప్రకటనలో తెలిపింది. కొంతమంది క్షేత్రస్థాయి అధికారుల ఏకపక్ష చర్యలకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. అధికారులు సరైన ధ్రువీకరణ లేకుండా అడ్మిషన్లు బలవంతం చేస్తున్నారని, షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని, గుర్తింపు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు.

## మల్లవరానికి పోటెత్తిన భక్తులు

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఏపీ, తెలంగాణలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అభిషేకాలు చేయించుకునేందుకు తరలివచ్చారు. అభిషేకాలు చేయించుకున్న ఉగ్ర షష్టి మండపంలో నిద్రించారు. పలువురు భక్తులు సోమవారమే మల్లవరం చేరుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

## అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 1 (ఆంధ్ర జ్యోతి): గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షణకు కాకినాడ జిల్లా నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ, ఏలేశ్వరం, తుని, డిపోల నుంచి బస్సులు ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు బయల్దేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటాయి. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత కంచి దర్శనం అనంతరం శ్రీకాళహస్తి వస్తాయి. శ్రీకాళహస్తిలో దర్శనం తర్వాత ఈ నెల 11వ తేదీ ఉదయానికి గమ్యస్థానాలకు చేరుకుంటాయి. టిక్కెట్లు ధర కాకినాడ, ఏలేశ్వరం నుంచి రూ3,100, తుని నుంచి రూ.3,300. పూరీ జగన్నాథ రథయాత్రకు వెళ్లే వారికి కూడా స్పెషల్ బస్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉంటే వారు ఉన్న చోటు నుంచి కోరిన చోటుకు బస్సులు పంపుతామన్నారు. మరిన్ని వివరాలకు కాకినాడ 7382910658, ఏలేశ్వరం 9959225532, తుని 9959225539 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బీజేపీ నూతన అధ్యక్షుడికి అభినందన

సామర్లకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా నియమితుడైన పీవీఎన్ మాధవ్‌ని ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ నిర్వాహక చైర్మన్ డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర మంగళవారం అమరావతిలో కలిశారు. ఆయనకు పుష్పమాల వేసి అభినందించారు.

### 'పట్టాభిరామ్ మరణం తీరని లోటు'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 1 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ హిప్నాటిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ .పట్టాభిరామ్ మరణం తెలుగు వారికి తీరని లోటని సాహితీవేత మార్ని జానకిరామచౌదరి పేర్కొన్నారు. చదువుకునే రోజుల్లోనే ఆయన తమకు రోల్ మోడల్ అన్నారు. తనకు ఆయనతో దాదాపు పదేళ్ల పరిచయం ఉందని జ్ఞాపకం చేసుకున్నారు. కాకినాడలో సాహిత్య సభలు, వ్యక్తిత్వవికాస తరగతులకు హాజరైనప్పుడు కలిస్తే చాలా ఆత్మీయంగా మాట్లాడేవారన్నారు. ఎన్నో విశేషాలను పంచుకుంటూ కొన్ని పుస్తకాలను బహుమతిగా ఇచ్చారని చెప్పారు.

## 20న ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నిక

పిఠాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పిఠాపురం తాలూకా యూనిట్ ఎన్నికల ప్రక్రియను కాకినాడ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు మంగళవారం ప్రకటించారు. ఎన్నికల అధికారిగా కాకినాడ పట్టణ అధ్యక్షుడు ఎ.సత్తిరాజు, సహాయ ఎన్నికల అధికారిగా డి.రామమూర్తి, పర్యవేక్షణాధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల చంద్రరావు వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని చెప్పారు. 9వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 20 ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు.

### కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కాకినాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతిలో ఖాళీగా ఉన్న రెండు సీట్ల భర్తీకి బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థి కనీస వయసు 12 నుంచి 14 సంవత్సరాలలోపు ఉండాలని, ఆసక్తి కలిగి అర్హులైన వారు ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

## ట్యాబ్‌లు అందజేత

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మెప్మా రిసోర్స్‌పర్సన్లకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంగళవారం ట్యాబ్‌లు అందజేశారు. స్మార్ట్ సిటీ కార్యాలయ సమావేశ హాలులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల తనిఖీ

గొల్లప్రోలు రూరల్, జూలై 1 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తాటిపర్తిలో జరుగుతున్న పారిశుధ్య పనులను గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న, డిప్యూటీ ఎంపీడీవో కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు. వీధుల్లో చెత్తాచెదారం వేయవద్దని సూచించారు.

### నేడు సుపరిపాలనలో తొలిఅడుగు

సామర్లకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చదలాడ తిరుపతిలో జరిగే తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో, రాజ్యసభ సభ్యుడు, సానా సతీష్‌బాబు తదితర కూటమి నేతలు పాల్గొంటారు.

### 5200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ సిబ్బంది తుని నియోజకవర్గ పరిధిలోని తొండంగి, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో మంగళవారం సారా బట్టీలపై దాడులు ని ర్వహించారు. 5200లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10లీటర్ల సారా, డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. 8 మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ ఇన్‌ఫోర్స్‌మెంట్‌వింగ్, కాకినాడ ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

విద్యార్థులతో ముచ్చటిస్తున్న శిరీషదేవి

రాజవొమ్మంగి జూలై1 (ఆంధ్ర జ్యోతి): మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే శిరీషదేవికి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. మంగళవారం ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మిరియాల వీధిలో ఆమె పర్యటించారు. దీనిలో భాగంగా చిన్నారులు (విద్యార్థులు) మా పాఠశాల శిథిలావస్థకు చేరు కుందని, మీరు వచ్చి చూడాలని కోరారు, వెంటనే ఎమ్మె ల్యే పాఠశాలను తనిఖీ చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే మర్రిపాలెం, మిరియాల వీధి, చెరుకుంపాలెంలో వీధిలైట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని ప్రజలు కోరడంతో తక్షణమే పంచాయతీ కార్యదర్శికి పనులు ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, చెరుకుంపాలెం సర్పంచ్ నాగు, ఎంపీటీసీ మీనవల్లి సుబ్బారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

## 'లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు ఇవ్వాలి'

పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుల తీరు పరిశీలిస్తున్న పీవో

దేవీపట్నం, జూలై 1 (ఆంధ్ర జ్యోతి): సామాజిక పింఛన్లు ఎక్కడికక్కడ లబ్ధిదారులకు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇందుకూరుపేటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కొత్తవీధి (మునినికుంట) గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు.

## పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మిరియాల వీధిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

రంపచోడవరం, జూలై 1 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం పెదగొట్టాలరేవులో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయంతి, కూటమి నాయకులు అడబాల బాపిరాజు, పి.అనంతమోహన్, పి. ఆర్.పి.శ్రీను, సలాది బాపిరాజు, లక్ష్మి, వై.నిరంజనీదేవి, సిద్ద వెంకన్న, ఎడ్లపల్లి పోసిబాబు, సత్య, చోటు, సూరిబాబు, జనార్ధనరావు, రమణ, పండా బాబి, గణపతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సిరిగిందలపాడులో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి పింఛన్లను అందజేశారు.

**రాజవొమ్మంగి:** చెరుకుంపాలెం పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే శిరీషదేవి పింఛన్లు పంపిణీ చేశారు. మిరియాల వీధి,చెరుకుంపాలెంలోని లబ్ధిదారులకుఅందించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ఐటీడీఏ ధర్నాకు తరలిరావాలి

రంపచోడవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు నిర్వాసితుల తరలిరావాలని సీపీఎం ప్రాంతీయ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, కె.శాంతిరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు.

## గంజాయి కేసులో పాత నేరస్థులకు కౌన్సెలింగ్

మోతుగూడెం, జూలై 1 (ఆంధ్ర జ్యోతి): ఎస్పీ అమిత్‌బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు డొంకారాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటూ రాష్ట్రంలో వివిధ పోలీస్‌స్టేషన్లో గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న పాత నేరస్తులకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

డాక్టర్ ఉదయ భాస్కర్ రెడ్డిని సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

మోతుగూడెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధి తులసిపాక పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా హాస్పటల్ సిబ్బంది డాక్టర్ ఉదయ భాస్కర్ రెడ్డికి బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి కేక్ కట్ చేశారు. అనంతరం సిబ్బంది మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రపంచానికి వైద్యులు చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు.

**కూనవరం:** కోతులగుట్ట పీహెచ్‌సీలో జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని మంగళారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. మహేష్‌బాబు, డాక్టర్ సీ.తేజ, డాక్టర్ ప్రజ్వల, హెడ్ నర్స్ బి.బొజ్జి, ఫార్మసిస్ట్ తుష్టి జోగారావు, వైద్య సిబ్బంది పలీనా, నాగేష్, సాయమ్మ, శ్రీనివాస్ రెడ్డి, తేజ, సతీష్, రమేష్, బాపిరాజు, ప్రసన్న, రామాదేవి, భువనేశ్వరి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## రహదారులపై నేలకొరిగిన భారీ వృక్షాలు

ఎటపాక రహదారిపై పడిన వృక్షం

ఎటపాక, జూలై1(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మండల కేంద్రమైన ఎటపాకలో మంగళవారం సాయంత్రం భారీ వృక్షం రహదారిపై కూలిపోయింది. దీంతో గంటపాటు భద్రాచలం- చర్ల వైపు వెళ్లే వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. అయితే ఈ వృక్షం కూలిన ప్రదేశంలో విద్యుత్ సరఫరా లైన్ ఉండడంతో వైర్లు తెగిపోయాయి.. విషయం తెలుసుకున్న ఎస్ఐ అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో వృక్షాన్ని తొలగించారు.

**మోతుగూడెం:** చింతూరు మండలం మోతుగూడెం ఫోర్ బై మార్గమధ్యలో గత 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఓ భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఏపీ జెన్కో లోయర్ సీలేరు సివిల్ సెక్షన్ ఫోర్ బై డివిజన్ ఏడీఈ నాగనరసింహారావు, ఏఈ మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేయడంతో కాంట్రాక్ట్ కార్మికులు వృక్షాన్ని తొలగించి రహదారిని క్లియర్ చేశారు. అనంతరం వాహనాలు నడిచాయి.

# పింఛన్లతో వృద్ధుల జీవితాలకు భద్రత

● తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి మండలం కోదాడలో ఎమ్మెల్యే దివ్య, ప్రత్తిపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

తొండంగి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల ద్వారా వృద్ధుల జీవితాలకు భద్రత ఏర్పడిందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మంగళవారం ఆమె కోదాడ గ్రామంలో సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరిపైనా ఆధా ర పడకుండా నిర్భయంగా జీవించే అవకాశాన్ని ప్రభు త్వం కల్పించిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో జీవించేందుకు అనువైన పథకాలు రూపొందించి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, చొక్కా అప్పారావు, బూర్తి సింహాచలం, బూర్తి కృష్ణ, దడాల విజయ బాబు, జనసేన మండలాధ్యక్షుడు బెండపూడి నాయుడు, పేకేటి దారకొండ పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**తునిరూరల్:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తుని మండలం తేటగుంట శివారు గవరుపేట గ్రామంలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం లో ఆమె పాల్గొని అధికారులతో కలిసి పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం ఎంపీడీవో కె.సాయినవీన్‌తో మండలంలో జరుగుతున్న పెన్షన్ పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. నూరుశాతం తొలిరోజే పూర్తవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మా జీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, కొల్లు సత్యనారాయణ, చామంతి సత్తిబాబు, గజ్జి రాంబాబు, పేరూరి వెంకటకృష్ణ ఉన్నారు.

### సంక్షేమానికి అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే సత్యప్రభ

**ప్రత్తిపాడు**: సంక్షేమానికి అధిక ప్రాధాన్యమని, కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ప్రత్తిపాడులోని మున్సిబ్‌వారి రామాలయం వద్ద మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి మదినే దొరబాబు, కూటమినాయకులు యాళ్ళ విశ్వేశ్వరరావు, సీబీఎన్ ఆర్మీ కోర్డినేటర్ యాళ్ళ జగదీష్ పోలిశెట్టి శ్రీనివాస్, మదినే స్వామి పాల్గొన్నారు.

### జిల్లాలో 2,69,158 పింఛన్లు

● డ్వామా పీడీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెలా రూ.2,69,158 పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు డ్వా మా పీడీ శ్రీనివాసరావు చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా మండలంలోని ధర్మవరంలో మంగళవారం పర్యటించా రు. గ్రామంలోని 3 సచివాలయాల పరిధిలో యాళ్ళ బుల్లబ్బికి, బొల్లు నూకరాజుకు వికలాంగ ఫించన్ రూ.15వేలు వంతున అందజేశారు. స్వయంబరపు చిన్నంబులకు పా క్షిక దివ్యాంగుల ఫించన్ రూ.6వేలు అందజేశారు. పిం ఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా పెన్షన్ డీపీఎం వీబీఆర్ రాయ్, గ్రామ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్, ఏపీఎం వై. వెంకట్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీ

**ఏలేశ్వరం:** మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం

ఏలేశ్వరంలో వైద్యులను సత్కరిస్తున్న కౌన్సిలర్ చలమయ్య

ఏలేశ్వరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సత్కరించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు విజయనర్సింగ్ హోమ్ ప్రముఖ వైద్యులు సఖిరెడ్డి విజయబాబు, వెంకట్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హెడ్ నర్స్ పరిమళ ప్రేమరత్నం, సూపరింటెండ్ జి.శైలజ, వైద్యులు రమేష్, రఘుపతి, లావణ్య, సౌమ్య, హారికలకు శాలువా కప్పి మెమెంటోలు ఇచ్చి కౌన్సిర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల శ్రీనివాస్, చందు వోలు సాయిరాజా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

**జగ్గంపేట**: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య దినోత్సవం సందర్భంగా శ్రీ విజయలక్ష్మి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యురాలు రూపవతి విద్యార్థులకు పలుసూచనలు చేశారు. డాక్టర్ బి.రాం ప్రసాద్, డాక్టర్ ఏవీవీ రాజేంద్రకుమార్, హెచ్ఎం రంగారావు, తమ్మలపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

జగ్గంపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**ప్రత్తిపాడు:** వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు కేక్ కట్ చేసి వైద్య సిబ్బందికి, రోగులకు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య వైద్యులు వినీల, వినయ్, రఘురాం, శ్వేత, సంతోషి, తేజస్వినుఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు, వెలుగుల నాని, పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## కుమ్మరిలోవ నిర్వాసితుల ఆందోళన

● రోడ్డుపై బైఠాయింపు

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపడుతున్న కుమ్మరిలోవ గ్రామస్థులు

తునిరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా తుని శివారు కుమ్మరిలోవ సమీపంలో కాలనీ తొలగింపులో భాగంగా అధికార యంత్రాంగం బాధితులతో పలు దఫాలు చర్చలు అనంతరం కాలనీ ఖాళీ చేసేందుకు గ్రామస్తులు అంగీకరించారు. అయితే పరిహారం అందించాం కాలనీ రెండురోజుల్లో ఖాళీ చేయాలని రెవెన్యూ యంత్రాంగం హుకూం జారీ చేయడంతో కుమ్మరిలోవ కాలనీవాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. తుని కొట్టాం రోడ్డుపై బైఠాయించి అధికార యంత్రాంగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించకుండా ఉన్నపలంగా వెళ్లిపోవాలంటే ఎలా అని ప్రశ్నించారు. తమకు కేటాయించిన స్థలాలు అప్పగించి అదేప్రాంతంలో కనీస మౌలిక వసతులు ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కాలనీ విడిచి వెళ్లబోమని తెలిపారు.

## 'ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి'

శంఖవరంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శంఖవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకుని విద్యార్థు లు ఉన్నత శిఖరాలకు చేరాలని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ప్రభుత్వం అందించిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిం తనీడి కుమార్, బొర్రా లచ్చబాబు, బొర్రావాసు, జట్ల శ్రీను ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### లంపకలోవలో విద్యామిత్ర కిట్ల పంపిణీ

**ప్రత్తిపాడు :** లంపకలోవలో విద్యామిత్ర కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు గొంతిన సురేష్, స్కూల్ చైర్మన్ ముప్వల గంగాభవానిలు, గ్రామపెద్దలు విద్యార్థులకు విద్యామిత్ర సామాగ్రిని అందజేశారు.

### కూటమి పాలనలో వేగంగా రాష్ట్రాభివృద్ధి

**రౌతులపూడి:** గుమ్మరేగల గ్రామంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి బచ్చల నానాజీ ఆధ్వర్యంలో క్రియాశీలక కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ కర్ణం సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శి షేక్‌సలీమ్, పక్కుర్తి సతీష్,ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తునిరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వాకర్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు కండవల్లి డేనియల్ జోసెఫ్ అన్నారు. ఆయన అధ్యక్షతన తునిలో సుమారు 200 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫాస్ట్ గవర్నర్ చదరం శివాజీ, కొందెం సత్యనారాయణ, గాజుల వేణుగోపాలస్వామి, పందుళ్ళ పర్తి శివ, వాడపల్లి శ్రీనివాస్, నెల్లిపూడి నాగేశ్వరావు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా పాదాలమ్మ పండుగ

బలరామపురంలో అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): బలరామపుర ంలో మంగళవారం పాదాలమ్మవారి పండుగను గ్రా మస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే వరు పుల సత్యప్రభ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశా రు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచ్ పైల సీతా, ఎంపీటీసీ సోమరౌతు రవి, మాజీ సర్పంచ్ పైల పైడిరాజు, సోమరౌతు మౌళి, కోరుప్రోలు సత్తిబాబు, యగదాసు హరిబాబు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కోటనందూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై జగన్నాథపురంలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. లోన్ యాప్‌ల పేరిట నకిలీ సంస్థలు చేస్తున్న మోసాలపై ఎస్ఐ టిరామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో గొర్లి అచ్చియ్యనాయుడు, మాతిరెడ్డి బాబులు, గుడివాడ అర్జున్న పాల్గొన్నారు.

## ధర్మవరంలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం రాజగోపాలస్వామి ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) ప్రత్తిపాడు ఖండ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యకర్తలు దొడ్డిపట్ల సోమన్నదొర, చుక్కల సత్యనారాయణ మూర్తులు ధ్వజప్రణామం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దాడి చిన్నారావు, దాసంశేషారావు, ఉప్పల తిరుపతిరావు, రామకుర్తి రాజబాబు, సిద్దపురెడ్డి చంద్రరావు, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మవరంలో ఆర్ఎస్ఎస్ ధ్వజ ప్రణామం చేస్తున్న కార్యకర్తలు

సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న జ్యోతుల నవీన్

## అందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు కృషి

జగ్గంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం బొర్రంపాలెనికి చెందిన సాగి తులసికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును టీడీపీ జగ్గంపేట కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి మూర్తి, మారిశెట్టి రాధా, గండేపల్లి మండల తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి వై.మణికంఠ పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వారం కూడా జనసేన నాయకులు, కార్యకర్తలు అన్నదానం ప్రారంభించి పేదలకు వడ్డించారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, గంధం శ్రీను, మొగిలి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి శంఖుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

## వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు వేయలేదు

రౌతులపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారులకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం రాజవరం నుంచి దిగిశివాడ, గంగవరం గ్రామాలకు నిర్మించనున్న బీటీ రహదారికి శంకుస్థాపన చేశారు. ఎ.మల్లవరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, చింతకాయల రాజు, పంచాడ బుజ్జి, చిటికెల అడివి రాజులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు డిమాండ్ చేశారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం తాడి లక్ష్మణరావు అధ్యక్షతన విప్లవ యువజన సంఘం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బుగతా హాజరై మాట్లాడారు. తాడి లక్ష్మణరావు అధ్యక్షుడిగా, చిన్నం నానిబాబు కార్యదర్శిగా 15 మందితో మండల కమిటీని ఏర్పాటు చేశారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, మానుకొండ అనీల్, దుమ్మల సింహాచలం, బోడపాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మాధవ్ ప్రమాణ స్వీకారంలో ప్రత్తిపాడు బీజేపీ నాయకులు

ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ప్రత్తిపాడు బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీనాగేంద్ర మాధవ్ ప్రమాణ స్వీకారానికి ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. విజయవాడ వెళ్లి మాధవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పైలాబోసు, ఊటా వీరబాబు, పైలా అయ్యప్ప, నీలి సురేష్, కర్రి ధర్మరాజు, బిక్కి నాగేంద్ర, ఏపీఆర్ చౌదరి, సాహితీ వర్మ, కోన సురేష్ ఉన్నారు.

## నియామకంపై హర్షం

బాలుదొర

శంఖవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా మాధవ్ నియామకంపై నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ గంటా బాలుదొర హర్షం వ్యక్తం చేశారు. బీజేపీలో మాత్రమే నిస్వార్థంగా పనిచేసే వాళ్లకు గుర్తింపు ఉంటుందన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న బంగారమ్మ

## విద్యార్థులకు నగదు బహుమతులు

జగ్గంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పంచాయతీ మాజీ సర్పంచ్ ఎం.తాతారావు జయంతి సందర్భంగా ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ఆయన సతీమణి బంగారమ్మ రూ.5వేలు చొప్పున అందజేశారు. విద్యార్థులు ఎల్.నందిని, ఎ.సామ్యూల్ సాధించడంతో పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎల్.శ్రీను, వి.రమేష్, జె.అచ్యుత్, రిటైర్డ్ డ్రిల్ మాస్టార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇక్బాల్ హుసేన్‌కు నోటీసులు ఇస్తాం 7

● డీసీఎం డీకే శివకుమార్

వాల్మీకి కార్పొరేషన్‌లో

# అవినీతి కేసు..

## సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతికి సంబంధించిన వివాదంపై హైకోర్టు ధర్మాసనం సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. దీంతో మాజీ మంత్రి నాగేంద్రతోపాటు పలువురికి కొత్త కష్టం వచ్చినట్లయ్యింది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు సంబంధించి వసంతనగర్‌లోని బ్యాంకులో గ్రాంట్లు ఉండేవి. వాటిని ఎంజీ రోడ్డుశాఖకు బదిలీ చేశారు. అక్కడనుంచి హైదరాబాద్‌కు చెందిన పలు కంపెనీలకు ప్రైవేట్‌బ్యాంకు, సహకారబ్యాంకుల ద్వారా నిధులు పంపించారు. వాల్మీకి కార్పొరేషన్ అకౌంటెంట్ చంద్రశేఖరన్ ఆత్మహత్యతో అవినీతి అంశం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే ఈ వివాదంపై యూనియన్‌బ్యాంకు ఫిర్యాదు మేరకు ఈడీ విచారణ జరిపింది. అందులో మాజీ మంత్రి నాగేంద్ర సూత్రధారిగా తేలుస్తూ రూ. 97 కోట్ల రూపాయలు అవినీతి జరిగినట్లు చార్జ్‌షీట్ దాఖలు చేసింది. రాష్ట్రప్రభుత్వం ఇదే వివాదాన్ని సిట్ ద్వారా విచారణ జరిపించగా నాగేంద్రకు క్లీన్ చిట్ ఇచ్చారు. సిట్ సమగ్రంగా దర్యాప్తు జరపలేదని, బీజేపీ ఎమ్మెల్యేలు బసనగౌడపాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహొళి, మాజీ ఎమ్మెల్యేలు అరవింద లింబావళి, కుమారబంగారప్పలు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి ఎం నాగప్రసన్న సిట్ విచారణను రద్దు చేస్తూ సమగ్ర దర్యాప్తు చేయాలని సీబీఐను సూచించారు. సిట్ సేకరించిన అన్ని ఆధారాలను సీబీఐకి అప్పగించాలని సూచించారు.

## విక్టోరియా ఆసుపత్రిలో చెలరేగిన మంటలు 7

● ఇతర వార్డులకు రోగుల తరలింపు

# విస్తరణపైనే.. ఆశలు..!

● నాయకత్వ మార్పు అంశానికి తెర
● సడలింపునకు ఓకే అన్న సుర్జేవాలా
● మంత్రివర్గంలో చోటుకు ఆశావహుల ఎదురుచూపు
● రాష్ట్ర ఇన్‌చార్జ్‌తో పలువురు ఎమ్మెల్యేల భేటీ

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పాలన తర్వాత రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం కుదిరే అవకాశం కనిపిస్తోంది. ఆగస్టు ముగియగానే పాలనలో అనూహ్యమైన మార్పులు ఉండవని, కానీ కొంత సడలింపులు ఉంటాయని సహకారశాఖ మంత్రి రాజణ్ణ అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఉన్నట్లు పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. సడలింపులు అంటే నాయకత్వ మార్పు వంటి తీవ్రత కాదని, మంత్రులను మార్చడమేననే చర్చలు జోరందుకున్నాయి. ఏడాదికాలంగా రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం అప్పుడప్పు తెరపైకి వస్తుంది. అధిష్టానం హెచ్చరికలతో అంతలోనే సమసిపోతుంది. ఇలా 2024 మే నుంచి ఈ ఏడాది మే మేరకు నాలుగైదుసార్లు నాయకత్వ మార్పు అంశం హల్‌చల్ చేసింది. కేపీసీసీ అధ్యక్షుడి మార్పు కూడా ఇదే రీతిలో ప్రస్తావనలు వచ్చాయి. సీనియర్ మంత్రి సతీశ్‌జార్కిహొళి ఏకంగా మరికొన్ని రోజులంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. పలుమార్లు మంత్రులు ప్రత్యేకంగా రహస్య సమావేశాలు కావడం కూడా మార్పుల అంశం చర్చలకు కారణమైంది. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఈ నవంబరు నాటికి రెండున్నరేళ్లు పూర్తి కానుంది. అప్పటికి నాయకత్వ మార్పు తప్పనిసరి అనే కొత్త ప్రచారం వారం రోజులుగా సాగుతోంది. రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్‌హుసేన్ మాట్లాడుతూ డీసీఎం డీకే శివకుమార్ త్వరలోనే సీఎం అవుతారని ఎవరూ అడ్డుకోలేరన్నారు. అదేరోజున సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర స్పందించారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని, ఐదేళ్లు సిద్దరామయ్య సీఎంగా ఉంటారన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేసీ వేణుగోపాల్ బెంగళూరును సందర్శించి పార్టీ ఎమ్మెల్యేల భేటీలో పాల్గొన్నారు. మంత్రుల ప్రోగ్రెస్ కార్డు పరిశీలిస్తామని, రెండేళ్ల తర్వాత మార్పు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల మే నెలకు రెండేళ్ల పాలన ముగియడంతో మరోసారి విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. అయితే అధిష్ఠానం కొన్ని నెలలు ఆగాలంటూ సున్నితంగా తిరస్కరించింది. దీంతో విస్తరణకు ఎందుకు వాయిదా వేస్తున్నారనేది ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. సీఎం పదవికోసం తీవ్రంగా ప్రయత్నించిన డీకే శివకుమార్ ఎటువంటి వివాదాన్ని మీదుకు తెచ్చుకునేందుకు సిద్ధంగా లేరనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఎవరూ నాయకత్వ మార్పు విషయాన్ని మాట్లాడరాదంటూ హెచ్చరిస్తున్నారు. కేపీసీసీ అధ్యక్షుడి హోదాలో రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్‌కు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఇలా డీకే శివకుమార్, సీఎం సిద్దరామయ్యకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. కానీ మంత్రివర్గ విస్తరణ అంశం తాజాగా తెరపైకి రావడంతో కనీసం పదిమంది దిని మార్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ సాగుతోంది. మూడు రోజుల పర్యటనకు వచ్చిన పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు అభిప్రాయాలు తీసుకుంటున్నారు. సమగ్ర నివేదిక అధిష్ఠానానికి అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఎవ్వరూ మాట్లాడరాదని సూచించారు.

**కొందరికి సీటు.. కొందరిపై వేటు..!**

పార్టీలో సాగుతున్న చర్చల ప్రకారం కేబినెట్‌నుంచి తొలగే వారి జాబితాలో కేహెచ్ మునియప్ప, రహీంఖాన్, శరణబసప్ప దర్శనాపూర్, మంకాళవైద్య, కేఎన్ రాజణ్ణ, వెంకటేశ్, శివానందపాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, బైరతి సురేశ్, ఆర్‌బీ తిమ్మాపుర పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిస్థానంలో కొత్తగా కేబినెట్‌లోకి బీకే హరిప్రసాద్, ఆర్‌వీ దేశ్‌పాండే, అప్పాజి నాడగౌడ, శివలింగేగౌడ, లక్ష్మణసవది, రూపాశశిధర్, ప్రసాద్ అబ్బయ్య, మలవళ్ళి నరేంద్రస్వామి, అజయ్‌సింగ్, యూటీ ఖాదర్, బంగారపేట నారాయణస్వామి, మాగడి బాలకృష్ణ, బేళూరు గోపాలకృష్ణ, తిపటూరు షడాక్షరి, టీబీ జయచంద్ర, బీఆర్ పాటిల్‌లు ఉన్నారు. కేబినెట్ విస్తరణ జరిగితే... బీ నాగేంద్రకు మరోసారి మంత్రిని చేస్తానని సీఎం సిద్దరామయ్య బహిరంగంగానే ప్రకటించారు. కానీ ఆయనపై వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ గ్రాంట్ల అవినీతి కేసు ఉంది. సిట్ ఆయనకు క్లీన్‌చిట్ ఇచ్చినా తాజాగా అదే కేసుపై సీబీఐ ద్వారా విచారణకు హైకోర్టు ధర్మాసనం తాజాగా ఆదేశించింది. దీంతో నాగేంద్ర పేరు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సెప్టెంబరు ఆఖరు లేదా అక్టోబరు మొదటివారంలో విస్తరణ ఉంటుందనే కథనాలు జోరందుకున్నాయి.

# ఊహాజనిత జర్నలిజంతో సమాజానికి ప్రమాదం

● సంచలనాల కోసం అబద్ధాల ప్రచారం సరి కాదు ● 'వాస్తవ సమాచారం కోసం సమరం' చర్చాగోష్ఠిలో సీఎం సిద్దరామయ్య

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య, మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషా ఖాన్

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఊహాజనితమైన జర్నలిజం పత్రికారంగంతోపాటు సమాజానికి ప్రమాదమని సీఎం సిద్దరామయ్య అన్నారు. పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్ణాటక మీడియా అకాడమీ, సమాచారశాఖ, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్‌లు సంయుక్తంగా సమాచారశాఖ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. 'వాస్తవ సమాచారం కోసం సమరం' అనే చర్చాగోష్టిని ప్రారంభించి సీఎం మాట్లాడుతూ సమాచారం కోసం పోరాడే సందర్భం వచ్చిందంటే అబద్ధాలు పెరిగాయనే అర్థం కాదా..? అంటూ ప్రశ్నించారు. ఊహాజనితమైన కథనాలు కేవలం పత్రికారంగానికే కాకుండా సమాజానికి పెను ప్రమాదమన్నారు. వాస్తవికత లేకుంటే ప్రజలు ఒకే కోణంలో అర్థం చేసుకుంటారన్నారు. మీడియా స్వతంత్రంగా నిర్భయంగా కథనాలు రాయాలని భావిస్తానన్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఇటువంటి కథనాలకే ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. తనపై ఎన్ని కట్టుకథలు ప్రచారం చేసినా ఎవరికీ ఫోన్ చేసేది లేదన్నారు. తన కారుపై కాకి కూర్చున్నందుకు చర్చలు జరిపారని, ఇది మూఢనమ్మకాలను ప్రచారం చేసినట్లు కాదా అన్నారు. ఇటువంటి అంశాన్ని జర్నలిజం అనవచ్చా అన్నారు. గ్రామీణ పాత్రికేయులకు బస్‌పాస్, ఆరోగ్య సంజీవిని ప్రారంభిస్తున్నామని, పాత్రికేయులకు అనుకూలం కావాలనే కొత్త విధానాలు తీసుకొచ్చామన్నారు. కానీ తమకు అనుకూలంగా రాయాలని కాదన్నారు. వాస్తవాన్ని సమాజానికి చూపాలని, ప్రజలపరంగా ప్రజాప్రభుత్వపరంగా ఉండాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు ప్రజలను చైతన్యం తీసుకొచ్చేందుకు పత్రికలు పనిచేశాయన్నారు. రాజ్యాంగంలో నైతిక విలువలు, వాస్తవాలను దారితప్పించేలా పనిచేయరాదన్నారు. సమాజంలో సమానంగా అవకాశాలు రావాలంటే కులమత రహిత సమాజం రావాలన్నారు. ద్వేషం, అభిమానం లేని సమాజాన్ని సృష్టించే విధానానికి మీడియా మద్దతు ఇవ్వరాదన్నారు. తన వ్యాఖ్యలు కేవలం పార్టీ దృష్ట్యా కాకుండా సమాజం పరంగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషా ఖాన్, వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శివానంద తగడూరు, ప్రముఖ రచయిత పీ సాయినాథ్, సాహితీవేత్త రహమత్ తరికెరెతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన కారు

## అదుపు తప్పిన కారు..

# ఆరుగురి మృతి

● టెంపోను తప్పించే ప్రయత్నంలో ప్రమాదం
● అందరూ స్నేహితులే.. భీమేశ్వర కొండకు వెళ్తుండగా ఘోరం

పురుషోత్తమ నారాయణప్ప నరసింహమూర్తి ఈశ్వరప్ప గోపినాథ్ కాళప్ప (ఫైల్)

దొడ్డబళ్ళాపుర, జూలై 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ జిల్లా దొడ్డబళ్ళాపుర శివారులోని మాకళి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. స్టేట్ హైవేపై మంగళవారం ఉదయం ఎదురుగా వస్తున్న టెంపోను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో దొడ్డబళ్ళాపుర పట్టణం కరేనహళ్ళి వార్డుకు చెందిన ఈశ్వరప్ప (75), పురుషోత్తమ (75), కాళప్ప (68), నారాయణప్ప (70), గోపినాథ్ (52), కారు డ్రైవర్ నరసింహమూర్తి (50) మృతి చెందారు. భీమేశ్వర కొండను సందర్శించేందుకు ఎనిమిదిమంది కారులో బయల్దేరారు. వీరంతా స్నేహితులు. వీరి యాత్ర ఇలా విషాదంగా ముగియడంతో కుటుంబ సభులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదం ధాటికి మృతదేహాలు చెల్లాచెదురైపడ్డాయి. ఘటనాస్థలంలో నలుగురు మృతి చెందగా గాయపడినవారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక ఇద్దరు ఆస్పత్రిలో మృతి చెందారు. మరోఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై దొడ్డబళ్ళాపుర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు.

ఆసుపత్రిలో మార్చురీ వద్ద బంధువులు

## లోకాయుక్త వలలో గ్రేడ్-2 తహసీల్దార్

దొడ్డబళ్ళాపుర, జూలై 1(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర ఉప విభాగాధికారి కార్యాలయం గ్రేడ్-2 తహసీల్దార్ దివాకర్ లంచం తీసుకుంటూ సోమవారం పట్టుబడ్డారు. సుమారు 1.5లక్షల రూపాయల మొత్తం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. నెలమంగల తాలూకా గిరియనపాళ్య సర్వే 1/4, 1/7లలోని 8.20 గుంటలను కోర్టు సేల్‌డీడ్ ప్రకారం ఖాతా చేయాల్సి ఉంది. దీన్ని చేసేందుకు గ్రేడ్ -2 తహశీల్దార్ రూ.2లక్షలను డిమాండ్ చేశారు. అయితే ఫిర్యాదుదారుడు న్యాయవాది దొరస్వామి చివరకు 1.5లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఇందుకు సంబంధించి లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా పథకం ప్రకారం సదరు మొత్తం ఇస్తుండగా లోకాయుక్త అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లోకాయుక్త పోలీస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ నేతృత్వంలోని బృందం దాడులు నిర్వహించింది. ప్రస్తుతం దొడ్డబళ్ళాపుర ఉపవిభాగాధికారి కార్యాలయంలో రికార్డుల పరిశీలన కొనసాగుతోంది.

## అలా.. మాట్లాడటం ప్రకాశ్ బెళవాడికి అలవాటే

● కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): సాక్ష్యాలు లేకుండా మాట్లాడడం ప్రకాశ్ బెళవాడికి అలవాటుగా మారిందని కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీకి తొత్తుగా మారినట్లు ప్రకాశ్‌బెళవాడి చెప్పుకొన్నారన్నారు. అటువంటి వ్యక్తి నుంచి సమాజంపై వ్యాఖ్యలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చునన్నారు. నరేంద్రమోదీ ఎమ్మెల్యే అయ్యాక ముఖ్యమంత్రి అయ్యారో లేదో అనేది తెలుసుకోవాలన్నారు. రాజ్యసభ సభ్యుడు ప్రధాని కారాదని ఎక్కడా లేదన్నారు. ప్రపంచం మెచ్చిన ఆర్థికశాస్త్రవేత్త మన్మోహన్‌సింగ్ అస్సోం నుంచి రాజ్యసభ సభ్యుడు అయ్యాక ప్రధాని అయ్యారన్నారు. అస్సోం దేశంలో లేదా అన్నారు. ప్రధాని అయిన దేవేగౌడ కూడా రాజ్యసభ సభ్యుడేనన్నారు.

చిరుతతో వస్తున్న గ్రామస్థులు

## ఊరంతా ఏకమై..!

● రైతుపై చిరుత దాడి
● కలిసికట్టుగా బంధించిన గ్రామస్థులు

బాగేపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులంతా కలిసి చిరుతను బంధించారు. మంగళవారం బాగేపల్లి తాలూకా పరిధిలోని వర్లకొండ గ్రామం వరాహగిరి కొండపై కరేనహళ్ళికి చెందిన రైతుపై చిరుత దాడి చేసింది. అయితే గాయాలతో ఆయన బయట పడ్డారు. ఇటీవల కొన్నిరోజులుగా వరాహగిరి కొండపై చిరుత సంచారం, బండపై విశ్రాంతి తీసుకున్న దృశ్యాలు డ్రోన్ కెమెరాకు చిక్కాయి. వర్లకొండ పక్కన ఉన్న కరేనహళ్ళికి చెందిన రైతు రామకృష్ణప్ప గొర్రెలు మేపేందుకు వెళ్లగా చిరుత దాడి చేసింది. వీపుపై గాయాలు కావడంతో రైతు కేకలు వేశారు. చుట్టుపక్కలవారు రావడంతో చిరుత అక్కడ నుంచి పరుగులు తీసింది. అయితే విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామస్థులు దండుకర్రలతో అక్కడికి చేరుకున్నారు. ఆర్ఎఫ్ఓ రాజశేఖర్, అటవీశాఖ సిబ్బంది సహకారంతో కొండల్లోనున్న చిరుతను బంధించేశారు.

గాయపడ్డ రైతు రామకృష్ణప్ప

# ఇన్‌ఫ్లో తగ్గింది..!

● తుంగభద్ర జలాశయానికి తగ్గిన వరద
● నీటి విడుదలలో మరింత జాప్యం



బళ్లారి సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. రెండు రోజులుగా ఎగువ నుంచి వరద తాకిడి తగ్గింది. దీంతో ఇప్పుడే క్రస్ట్‌గేట్లు ఎత్తే ఆలోచన లేనట్లు బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు. రెండు, మూడు రోజుల్లో నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. రెండు రోజులుగా జలాశయంలోకి ఇన్‌ఫ్లో 60,000 క్యూసెక్కులకు పైగా ఉంది. మంగళవారం సగటు ప్రవాహం 33.916 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుత నీటి మట్టం 1.624.38 అడుగులు , జలాశయం నిల్వ సామర్థ్యం 74.48 టీఎంసీలు. జూలై, ఆగస్టు నెలల్లో సాధారణంగా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈసారి గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయకూడదని నిర్ణయించినందున, వీలయినంత త్వరగానే క్రస్ట్ గేట్లు ఎత్తి అదనపునీటిని నదిలోకి విడుదల చేసే అవకాశం ఉంది.

## ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

● కెనరా బ్యాంకు ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజు

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజు అభిప్రాయపడ్డారు. 1906లో ఏర్పాటైన కెనరాబ్యాంకు ప్రస్తుతం 120వ సంస్థాపనా దినోత్సవం ఆచరిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఖాతాదారులకు సేవలందించేలా బ్యాంకు తానుశాఖలను సైతం విస్తరించిందన్నారు. 9,800కుపైగా శాఖలు, 11,900 ఏటీఎంలతో ఆర్థికంగా పటిష్టంగా ఉంటూ తన అస్థిత్వాన్ని కలిగి ఉందన్నారు. ఇటీవలే సేవింగ్స్‌బ్యాంకు ఖాతాలలో మినిమం బ్యాలెన్స్‌లకు చార్జీలు తొలగించామన్నారు. బ్యాంకు గ్లోబల్ టర్నోవర్ రూ.25లక్షల కోట్లను దాటిందన్నారు. జాతీయ స్థాయిలో సమగ్రబ్యాంకింగ్ భవిష్యత్తుకోసం కట్టుబడినట్టు తెలిపారు. వినియోగదారులకు డిజిటల్‌బ్యాంకింగ్ సేవలతోపాటు బీమా ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. తాజాగా కెనరా అస్పైర్‌లో భాగంగా జీరో బ్యాలెన్స్, యువతను ఆకట్టుకునేలా విద్య, బీమా సౌలభ్యాలతో ఖాతాల సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఈ మేరకు నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శిథిలావస్థకు చేరిన నింబగల్లు హెడ్‌రెగ్యులేటర్ షట్టర్లు

కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పూడిక

కోతకు గురైన కాలువగట్టు

# మరమ్మతులైనా చేయండి

## ఏళ్లు గడిచినా పూర్తికాని ఆధునికీకరణ పనులు

**కాలువలో పేరుకుపోయిన మట్టి, బండరాళ్లు.. ప్రశ్నార్థకంగా హెచ్చెల్సీలో నీటి పారుదల**

ఉరవకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టి ఒకటిన్నర దశాబ్దాల కాలం దాటినా ఏమాత్రం ముందుకు సాగడం లేదు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టింది. అయితే ఏళ్లు గడిచినా ఆరో ప్యాకేజీలో పనులకు మోక్షం కలగలేదు. కొద్దివరకు పనులు చేసి వదిలేశారు. ఈక్రమంలోనే భారీ వర్షాల వల్ల ఏర్పడిన కోతలతో కాలువ అధ్వానంగా మారింది. గత పాలకులు ఎవరూ ఈ ఆధునికీకరణ పనుల గురించి పట్టించుకోలేదు. కాలువలో పూడిక పెరిగిపోవడంతో నీరు ముందుకు పారడం ప్రశ్నార్థకంగా మారింది. కాలువలో పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పెరిగిపోయాయి. హెచ్చెల్సీ ఆరో ప్యాకేజీలో 183వ కి.మీ నుంచి 189కి.మీ వరకూ పనులు నిలిచి పోయాయి. ఇంద్రావతి డీప్ కట్ వద్ద ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హెచ్చెల్సీ గట్టు కోతకు గురైంది. నింబగల్లు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం వల్ల కాలువలోకి మట్టి కొట్టుకు వచ్చింది. ఇది నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. హెచ్చెల్సీకి ఉన్న షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి. షట్టర్లకు ఉన్న రాళ్లు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేస్తే సాగునీరు పారే అవకాశముంది. ఇంద్రావతి వద్ద డీప్‌కట్‌లో అడ్డంగా పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి.

● ఈ విషయంపై హెచ్చెల్సీ ఏఈ నజీరుద్దీన్‌ను వివరణ కోరగా కోతకు గురైన కాలువగట్టు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీకి నీళ్లు వచ్చేలోపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



## నేడు అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీవీఈఓ గురుప్రసాద్ ప్రకటనలో తెలిపారు. స్టాక్ మేనేజ్‌మెంట్, డెయిరీ కోర్సులకు లెక్చరర్లు అవసరమన్నారు. ఇందుకు వెటర్నరీ, డెయిరీ సైన్స్ చదివినవారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల వారు బుధవారం ఉదయం 10.30 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని డీవీఈఓ తెలిపారు.

## నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించనున్నట్లు ఏపీసీ శైలజ వెల్లడించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న కేజీబీవీఎస్ఓలు, సీఆర్‌టీలు, ఐఈడీలు, ఆపరేటర్లు, ఇతర బోధనేతర సిబ్బంది నుంచి మ్యూచువల్స్, రిక్వెస్ట్ బదిలీలకు దరకాస్తులు స్వీకరించామన్నారు. వాటిని పరిశీలించి తుదిసీనియార్టీ జాబితాను తయారుచేసి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆ జాబితాలో పేర్లున్న వారందరికీ బుధవారం ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. సీనియారిటీ లిస్టులో అదనపు పాయింట్లు పొందిన అభ్యర్థులు అందుకు సంబంధించిన స్పౌజ్, మెడికల్, డెత్, లీగల్ సర్టిఫికెట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఏపీసీ తెలిపారు.

## ప్రతి నెలా స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

**కలెక్టర్ వినోద్‌కుమార్**

అనంతపురం కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీన పేదల సేవలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్, మున్సిపల్, డ్వామా, జడ్పీ తదితర శాఖల అధికారులతో మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఓడీఎఫ్ ప్లస్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సాస యాప్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, ఇంకుడు గుంతలు, స్వచ్ఛత, పరిశుభ్రత, పారిశుధ్యం, అన్న క్యాంటీన్లు, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీ పేదల సేవలో ప్రభుత్వ కార్యక్రమాలు, 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, 30న సివిల్ రైట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నెలలో మూడు కార్యక్రమాల ద్వారా 36 గ్రామాలను కవర్ చేయాలని అన్నారు. ప్రతి నెలా నియోజకవర్గంలోని ఒక గ్రామానికి తాను వెళతానని అన్నారు.

## ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయం

**జీఎస్టీ ఏసీ సాగి సుందర్‌రాజు**

అనంతపురం కలెక్టరేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లలో అధికారులు, ఉద్యోగుల పని తీరు ప్రశంసనీయమని సెంట్రల్ గూడ్స్ సర్వీసెస్ టాక్స్(జీఎస్టీ) అసిస్టెంట్ కమిషనర్ సాగి సుందర్ రాజు అన్నారు. నగరంలోని జీఎస్టీ కార్యాలయంలో 8వ జీఎస్టీ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అధికంగా పన్ను చెల్లించిన పలు సంస్థల ప్రతినిధులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ 2024-25 సంవత్సరానికి అత్యధికంగా రూ.4,888 కోట్లు సమకూరిందన్నారు.

# నేడే.. తొలి అడుగు

అనంతపురం, పుట్టపర్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లనున్నా రు. 'సుపరిపాలనలో... తొలి అడుగు' పేరిట బుధవారం నుంచి ప్రజల వద్దకు వస్తున్నారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలు, సూపర్ సిక్స్ అమలు, సమస్యల పరిష్కారం గురించి వివరించేందుకు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. వీటితో పాటు ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఐదేళ్ల పాలనలో చేసిన విధ్వంసాన్ని ప్రజలకు గుర్తు చేయాలని నిర్ణయించారు. చేసిన, చేయబోయే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి, 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగనున్నారు.

### ప్రధాన అజెండా ఇదే..

● వైసీపీ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినింది. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ కంపెనీలురాష్ట్రానికి వచ్చాయి.

● దేశంలోని ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా హామీ మేరకు... రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల పింఛన్లు అందజేస్తున్నారు.

● సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం ప్రారంభించారు. దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. మెగా డీఎస్సీలో భాగంగా 16,347 టీచర్ పోస్టు భర్తీకి చర్యలు చేపట్టారు.

● మత్స్యకార భరోసా, రూ.5కే అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం, అల్పాహారం. అర్చకులకు, నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేల చొప్పున ఆర్థిచేయూత అందిస్తున్నారు. పాస్టర్లు, ఇమామ్‌లు, మౌజన్లకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అమలు చేస్తున్నారు. పీ-4 ద్వారా నిరుపేదలకు ఆర్థిక చేయూతనందించి, ఆ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

● ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నారు. అగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు.

● కరువు జిల్లా అనంతకు జీవనాడి అయిన హంద్రీనీవాను పూర్తిచేసి, ప్రతి ఎకరానరికీ సాగునీరు అందించేందుకు ఏకంగా రూ.3,800 కోట్లు బడ్జెట్లో కేటాయించారు. హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇదే నెలలో పనులన్నీ పూర్తిచేసి, ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించనున్నారు.

### ఎవరెవరు ఎక్కడెక్కడ..?

● ఉరవకొండ ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడేరు మండలం జయపురంలో 'తొలి అడుగు' వేస్తారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగరంలోని 39వ డివిజన్‌లో లక్ష్మీనగర్ రామాలయం నుంచి ప్రారంభిస్తారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శెట్టూరు మండలం పెరుగు పాళ్యం నుంచి, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు గుమ్మఘట్ట మండలం కేపీ కుంట నుంచి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆత్మకూరు మండలం ముట్టాల నుంచి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గార్లదిన్నె నుంచి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కసాపురం నుంచి తొలి అడుగును ప్రారంభిస్తారు.

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత గోరంట్ల మండలం కొలింపల్లిలో తొలి అడుగు ప్రారంభిస్తారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అమడగూరు మండలం కసముంద్రంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మడకశిర మండలం చందకచర్లలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలో ప్రారంభిస్తారు. హిందూపురంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ శ్రేణులు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ధర్మవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పిలుపునిచ్చారు.

### నెలరోజులు ప్రజల్లో టీడీపీ : మంత్రి సవిత

పెనుకొండ టౌన్: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పండగలా నిర్వహిద్దామని మంత్రి సవిత టీడీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఎన్నికల పరిశీలకుడ నరసింహరావు ఆధ్వర్యంలో మంగళవారం పెనుకొండ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇప్పటికే తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్, దీపం-2, యువతకు ఉద్యోగాలు కల్పించామని, త్వరలో ఉచిత బస్సు, 204 అన్న క్యాంటీన్‌లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏడాదిలో వచ్చిన పరిశ్రమలు, ఎస్సీ వర్గీకరణ, డ్వాక్రా మహిళలకు రుణాలు, గుంతలు లేని రోడ్లు.. ఇలా అన్ని అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

## వారిని వదిలేసి.. నాపై నిందలా..!

**ఈ-స్టాంపులపై నేనే ఫిర్యాదు చేశా**

**టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీచౌదరి**

మాట్లాడుతున్న మారుతీచౌదరి

అనంతపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వారిని వదిలేసి, తనపై నిందలు వేయడం తగదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీ చౌదరి పేర్కొన్నారు. ఈ-స్టాంపుల వ్యవహారంలో అధికారులకు తానే ఫిర్యాదు చేశానన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రప్ప అలియాస్ బాబు మీ-సేవలో అవినీతికి పాల్పడుతూ ఈ-స్టాంప్‌లలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తనకు సమాచారం అందిందన్నారు. దీనిపై ఎర్రప్ప అలియాస్ బాబును ఫోన్‌ద్వారా విచారించానన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు సైతం తన వద్ద ఉన్నాయన్నారు. ఆ విషయంలో తప్ప.. మీసేవ బాబును ఎప్పుడూ సంప్రదించలేదని తెలిపారు. ఇదే విషయంపై తాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు వివరణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై బాబుకు సంబంధించిన మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారన్నారు. ఈ కక్షతోనే తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అసలైన బాధ్యులను వదిలేసి తనపై వేధింపులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వ్యక్తులను వదిలేసి కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తనపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఘటనపై మరోసారి ఆడిట్ నిర్వహించి, నిజానిజాలు నిగ్గుతేల్చాలనీ, వాటిని ప్రజలకు తెలియజెప్పాలని కోరారు.

## కుళ్లాయిస్వామికి నిత్యపూజ నివేదన

**భక్తులతో కిక్కిరుస్తున్న గూగూడు**

నార్పల, జూలై 1(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామికి మంగళవారం నిత్య పూజ నివేదన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తాదులు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అధికారులు క్యూలైన్లు కూడా ఏర్పాటు చేయడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాలు చేసేందుకు నీరు కూడా లేదని వాపోయారు.

### గూగూడు ఉత్సవాలపై డ్రోన్ నిఘా

అనంతపురం క్రైం(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలపై డ్రోన్ నిఘా ఉంచనున్నట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తవాలు ఆద్యంతం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల పరిసరాల్లో భక్తుల తాకిడిని పర్యవేక్షిస్తామన్నారు. ట్రాఫిక్, నేరాలను నియంత్రిస్తామన్నారు.

కొలువుదీరిన కుళ్లాయిస్వామి, గూగూడు కుళ్లాయిస్వామి దేవాలయం డ్రోన్ వ్యూ..

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

## భూసేకరణ వేగవంతం చేయాలి

**కలెక్టర్ టీఎస్ చేతన్**

పుట్టపర్తి టౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంత చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారుల భూసేకరణలో పెడింగ్‌పై అధికారులు దృష్టి పెట్టి, అత్యవసరంగా పూర్తి చేయాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఎన్‌హెచ్342 ప్యాకేజీలోని ముదిగుబ్బ మండలంలోని దొరిగిల్లు ప్రభుత్వ కళాశాల ప్రహరీ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, పుట్టపర్తి మండలంలోని అమ్మగొండ్యపాళ్యం ప్రాతంలో పెడింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్య, ఎన్‌హెచ్ఏఐ పీడీ అశోక్ కుమార్, డీఈ గిడ్డయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు పాల్గొన్నారు.

### 10న సీఎం పర్యటన: కలెక్టర్

పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ చేతన్

కొత్తచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు కొత్తచెరువుకు ఈ నెల 10న వస్తారని కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం తెలిపారు. సీఎం పర్యటన కోసం స్థానిక హైస్కూ ల్ క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రావాల్సి ఉన్నింది. కానీ మొహర్రం కారణంగా పదో తేదీకి పర్యటన వాయిదా పడింది. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ టీఎస్ చేతన్ పర్యవేక్షించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరవేస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్తచెరువు మండలం తలమర్లలో సచివాలయ సిబ్బందితో కలిసి వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ సొమ్మును అందజేశారు. పింఛన్ సొమ్మును ఇచ్చేందుకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అని ఆరా తీశారు. ఎంపీపీ గాయత్రీదేవి, ఎంపీడీఓ నటరాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సర్పసూక్త క్షీరాభిషేకం చేశారు. ఆకుపూజ, అలంకరణ, అర్చన, మహానైవేద్య సమర్పణ, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. కల్యాణ కట్టపై శ్రీవల్లీదేవసేనతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# మొద్దు నిద్ర..!

**ఎస్కేయూ ఆవరణలో తొలగించిన మొద్దులు, చెట్ల కొమ్మలు**

- నెలలు గడుస్తున్నా తరలించకుండా నిర్లక్ష్యం
- విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

కుప్పలు.. తెప్పలుగా తొలగించిన చెట్ల మొద్దులు

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎండిపోయిన మొద్దులను చూసి ఇదేదో కట్టెల డిపో అనుకుంటే పొరబడినట్లే. ఇది ప్రతిష్టాత్మక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆవరణం. క్యాంపస్‌లో ఎండిపోయిన భారీ వృక్షాలను కొట్టేసి, వేర్లతోసహా పెకలించారు. విద్యుత్ లైన్లను అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సైతం నెలల క్రితం తొలగించారు. వాటిని వర్సిటీ ఆవరణలో అలాగే వదిలేశారు. అవి పూర్తిగా ఎండిపోయాయి. వాటిలోకి విషపురుగులు చేరుకుని, ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. దీనిపై నిత్యం అక్కడే తిరిగే వేలాది మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు. వాటిని వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్ తరలించకుండా నెలలుగా అక్కడే వదిలేశాడు. కొన్ని మొద్దులతో షెడ్ల కింద వంటావార్పు కూడా చేశారు. అయినా వర్సిటీ అధికారులు వాటిని తరలించే ప్రయత్నాలు చేయరు. మొద్దునిద్ర వీడరు.

### వర్సిటీ పునఃప్రారంభం నాటికి తొలగించేస్తాం

వర్సిటీ ఆవరణలో ఎండిపోయిన వృక్షాలు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాం. వాటిని అటవీశాఖ అధికారుల అనుమతితో బహిరంగ వేలం నిర్వహించాం. వేలంలో దక్కించుకున్నవారు వాటిని తరలించడంలో జాప్యమవుతోంది. ప్రస్తుతం వర్సిటీకి సెలవులు. పునఃప్రారంభమయ్యే నాటికి వాటిని తొలగించేలా చర్యలు చేపడతాం.

- రవిప్రసాద్‌రావు, వర్సిటీ ఎస్టేట్ అధికారి

ఇంజనీరింగ్ విభాగం సమీపంలోని వాహనాల పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటైన పాయ్యి

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### నోస్ట్రడామస్ (వర్ధంతి)

ఫ్రాన్స్ దేశానికి చెందిన సిద్ధాంత కర్త మైఖేల్ డి నోస్ట్రడామస్ 1503 డిసెంబరు 15న జన్మించారు. రాబోవు సంఘటనలను ఊహించి, ముందే తన రచనలలో రాసుకున్నాడు. ఈ రచనలకు ప్రొఫెటీస్ ఆఫ్ నోస్ట్రడామస్ అని పేరు. తెలుగులో కాలజ్ఞానం వంటిది. ప్రపంచంలో ఎన్నో అంశాలు ఆయన పేర్కొన్నట్టు చోటు చేసుకోవడం గమనార్హం. అంతేకాక మెడికల్ సైన్స్‌పైన కూడా రెండు పుస్తకాలు రాశారు. 1566 జూలై 2న కన్నుమూశారు.

### ఓవీ విజయన్ (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత, మళయాళ సాహిత్యంలో గొప్ప రచయితగా పేరొందిన ఓవీ విజయన్ 1930 జూలై 2 కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో జన్మించారు. జర్నలిస్టుగానే కాక కార్టూనిస్ట్‌గా కూడా పేరొందారు. 6 నవలలు, 9 చిన్నకథల కలెక్షన్స్, 9 వ్యాసాలు రాశారు. ఆయన రచనలను తానే సొంతంగా ఆంగ్లంలోకి అనువాదం చేయడం మరో ప్రత్యేకత. కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, వాయలార్ అవార్డు, మాతృభూమి లిటరరీ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2005 మార్చి 30న కన్నుమూశారు.

### గురువాయూర్ దురై (పుట్టినరోజు)

ప్రముఖ మృదంగ వాద్య కళాకారులలో ఒకరైన గురువాయూర్ దురై 1935 జూలై 2న కేరళ రాష్ట్రం గురువాయూర్‌లో జన్మించారు. చిన్నతనంలో పాల్ఘాట్ సుబ్బయ్యర్ వద్ద, తర్వాత ఈపీ నారాయణ పిశరోడి వద్ద మృదంగం నేర్చుకున్నారు. అనంతరం పళని సుబ్రమణ్య పిళ్ళై వద్ద గురుకులం తరహాలో పూర్తి స్థాయి శిక్షణ పొందారు. అనంతరం టీఎన్ రాజరత్నం పిళ్ళై, నామగిరి పెట్టై కృష్ణన్‌లకు కచేరీలో మృదంగం సహకారం అందించారు. సంగీత కళా శిఖామణి, కళైమామణి, సంగీత నాటక అకాడమీ ఠాగూర్ రత్న, సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందారు. 2025లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

### గణేశ్ (పుట్టినరోజు)

కన్నడ సినీరంగంలో పేరొందిన గోల్డెన్‌స్టార్ గణేశ్ 1978 జూలై 2న బెంగళూరు గ్రామీణ జిల్లా నెలమంగల తాలూకా అడకమరనహళ్ళిలో జన్మించారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటులలో ఒకరిగా నిలిచారు. 2006లో 'ముంగారు మళె' సినిమా ఏడాదిపాటు మల్టిప్లెక్స్‌లో ప్రదర్శించబడి గోల్డెన్‌స్టార్‌గా పేరొందారు. బుల్లితెరపై పలు సీరియల్స్‌లో నటించారు. ప్రత్యేకించి కామెడి టైమ్ షోతో రాణించారు. ఉత్తమనటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు.

## ఇక్బాల్ హుసేన్‌కు నోటీసులు ఇస్తాం: డీకే

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పు ప్రస్తావనలు పెరుగుతున్న తరుణంలో డీసీఎం డీకే శివకుమార్ తీవ్రంగా మండిపడ్డారు. రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ ఇటీవల డీసీఎం ముఖ్యమంత్రి అవుతారని బహిరంగంగా ప్రకటించారు. ఈ అంశం ఇటీవల హల్‌చల్ చేసింది. తాజాగా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా సమక్షంలోనూ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం తీవ్రంగా స్పందించారు. రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయనకు నోటీసులు జారీ చేస్తామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు లేదని, సిద్దరామయ్యను మరింత బలోపేతం చేస్తామన్నారు. నాయకత్వ మార్పు లేదని, సీఎం మార్పుకు సంబంధించి ఎక్కడా చర్చ జరగలేదని, పార్టీ బలోపేతమే ముఖ్యమని, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలు స్పష్టమైన సందేశం ఇచ్చారన్నారు. మీడియా ముందు ఎవ్వరూ మాట్లాడరాదన్నారు. ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్‌కు నోటీసులు ఇస్తామన్నారు. ఎమ్మెల్యేలు బీఆర్ పాటిల్, బాలకృష్ణ ఎవరికైనా ఇదే షరతులు వర్తిస్తాయని హెచ్చరించారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

- నవోదయ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాస్

రక్తదానం చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

రాయచూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న వారికి రక్తదానం అత్యంత కీలకమని ప్రాణ రక్షణలో రక్తదానానికున్న ప్రాధాన్యం వెలకట్టలేనిదని నవోదయ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. అంతర్ జాతీయ రక్తదాతల సంస్కరణార్థం మంగళవారం నవోదయ విద్యసంస్థ డాక్టర్ సీఎం గురుమూర్తి సభాభవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా స్వచ్ఛంతంగా రక్తదానం చేసే వారు నిజంగా అభినందనీయులన్నారు. రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తవని ప్రతియొక్కరు రక్తదానానికి ముందుకు రావాలన్నారు. అదే సమయంలో దాతల నుంచి సేకరించిన రక్తాన్ని శుద్ధీకరించే సమయంలో వారి రక్త నమూనా తదితర వివరాలను దాతలకు స్పష్టంగా అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.

# భూస్వాధీనంలో శాస్త్రీయత ఏదీ..?

» అఖిల భారత కిసాన్ సంఘం

బాగేపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకాలో 13 గ్రామాల రైతులనుంచి పరిశ్రమల అభివృద్ధి పేరిట బలవంతంగా తీసుకుంటున్నారని, భూస్వాధీనం కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) తీరు శాస్త్రీయంగా లేదని అఖిలభారత కిసాన్ సంఘం ఆరోపించింది. సంఘం తాలూకా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన తెలిపారు. శిరస్తేదార్ మంజునాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘం రాష్ట్రసంచాలకులు కేవీ రామచంద్ర మాట్లాడుతూ దేవనహళ్ళి తాలూకాలో 13 గ్రామాలనుంచి 1775 ఎకరాల స్వాధీనానికి బీజేపీ పాలనలో రైతులకు నోటీసు ఇచ్చారన్నారు. అప్పటినుంచి 13 గ్రామాల రైతులు 1080 రోజులుగా వివిధదశలలో పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. దేవనహళ్ళి తాలూకా కార్యాలయం, జిల్లా అధికారి కార్యాలయం, బెంగళూరు ఫ్రీడం పార్కులలో నిరసన కొనసాగించారన్నారు. మంత్రి, ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. పచ్చటి సాగుభూమిని రైతులనుంచి బలవంతంగా లాక్కోవడం ద్వారా అన్నదాతలను వీధినపడేస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే రానున్నరోజుల్లో బియ్యానికి కూడా కరువు వస్తుందని హెచ్చరించారు. తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, అయితే పచ్చటి పంటపొలాలను పరిశ్రమల కోసమని బలవంతంగా తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికే పరిశ్రమల కోసం సేకరించిన కొన్నివందల ఎకరాలు వృధాగా ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరసనలో అఖిలభారత కిసాన్ సంఘం తాలూకా అధ్యక్షుడు రామరెడ్డి, కార్యదర్శి ఆదిశేషు, ఆర్‌ఎం చలపతి, ముజుమిల్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లి తాలూకా కార్యాలయం వద్ద కిసాన్‌సంఘం నిరసన

# స్టార్టప్‌లతోనే బలమైన దేశం: గవర్నర్

చర్చాగోష్ఠిని ప్రారంభిస్తున్న గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్వావలంబన, బలిష్టమైన దేశ నిర్మాణానికి స్టార్టప్‌లు మరింత సహకారం కానున్నాయని గవర్నర్ థావర్ చంద్‌గెహ్లాట్ అన్నారు. నగరంలోని పరిశ్రమల ఆధునీకరణ, పరిశోధనా మండలి, జైన్‌డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ - వికాసయాత్ర' అనే అంశంపై చర్చాగోష్ఠిని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో కొత్తదనం, ఆవిష్కరణలు కేవలం ప్రయోగాలకే పరిమితం కారాదని, విద్య, పరిశ్రమ, సమాజ పురోగతికి దోహదపడేలా ఉండాలన్నారు. సదృఢమైన భారత్‌కోసం అందరూ తమవంతు సహకారం అందించాలన్నారు. 2015లో భారత్ 81వ స్థానంలో ఉండేదని, 2023 గణాంకాల ప్రకారం 40వస్థానానికి చేరిందన్నారు. స్టార్టప్ ఇండియా, డిజిటలీకరణ, ఆత్మనిర్భర్‌భారత్, మేక్ ఇన్ ఇండియా వంటి పరికల్పనలతో యువత సరికొత్తగా ఉత్సాహంగా మరింత ముందుకు సాగాలన్నారు. జైన్ వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ చెనరాజ్ రాయ్‌చంద్‌జైన్, డాక్టర్ శ్వేతాసింగ్, ప్రొఫెసర్ అశుతోష్ శర్మా, ప్రొఫెసర్ టీజీ సీతారాం తదితరులు పాల్గొన్నారు

# మంచి పనులతోనే జీవితానికి సార్థకత

వివిధ రంగాల్లో సాధకులను సత్కరిస్తున్న స్వామీజీ

- ఆదిచుంచనగిరి శాఖ మఠం సౌమ్య నాథస్వామీజీ

దొడ్డబళ్ళాపుర, జూలై 1(ఆంధ్రజ్యోతి): అధికారం ఉన్నప్పుడు మంచి పనులు చేయడం ద్వారా మాత్రమే గౌరవం, జీవితానికి సార్థకత సాధ్యమని ఆదిచుంచనగిరి శాఖ మఠం సౌమ్య నాథస్వామిజీ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కేఎంహెచ్ భవనంలో అభిమానుల సేవా సమితి ఆధ్వర్యంలో వనసుమదొళొన్న మన కుణియనలి దాడుతిరె అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ కేఎం హనుమంతరాయప్ప చదివింది కేవలం నాల్గో తరగతి మాత్రమేనని అయితే జీవితంలో కష్టాలను అధిగమించి, నేతకార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి ఎన్నో సాధనలు సాధించారని ప్రశంసించారు. కేంద్రప్రభుత్వ రంగ సెంట్రల్ సిల్క్‌బోర్డు అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. కల్పవృక్షంలా అందరికీ తనవంతు సాయం చేసి జీవితాన్ని సార్థకం చేసుకున్నారన్నారు. ఆయన జీవితాన్ని గురించి పుస్తకం రూపుదిద్దుకోవడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిదాయకం కానుందన్నారు. ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ మండలిలో అధ్యక్షుడిగా ఈశ్వరప్ప తర్వాత దొడ్డబళ్ళాపురకు చెందిన కేఎం హనుమంతరాయప్ప మాత్రమేనని ఆయన బీజేపీ తర పున రెండుసార్లు పురసభ అధ్యక్షుడిగా ఎన్నో ప్రజాసేవా కార్యక్రమాలు చేశారని, యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నా లజీ అకాడమీ డైరెక్టర్ హులికల్ నటరాజ్ మాట్లా డుతూ దొడ్డబళ్ళాపురకు కీర్తి ప్రతిష్టలు తేవడంలో హనుమంతరాయప్ప కృషి ఎంతో ఉందన్నారు. దొడ్డబళ్ళాపురద వాజ్‌పేయి, లయన్స్ అభినవ భీష్మ, నాడప్రభు కెంపేగౌడ తదితర పురస్కారాలు పొందిన ఆయన జీవితం మనకు ఆదర్శప్రాయ మన్నారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల సాధ కులను ఆత్మీయంగా సత్కరించారు. విద్యా వాచ స్పతి విశ్వవిజేత డాక్టర్ అరళుమల్లిగె పార్థసారథి, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, సాహితీ వేత్తలు, పోరాటనేతలు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కొడతి అధ్యక్షురాలిగా వీణారవి



వీణారవిని అభినందిస్తున్న సభ్యులు

దొమ్మసంద్ర, జూలై 1(ఆంధ్రజ్యోతి): మహ దేవపుర నియోజకవర్గంలోని కొడతి గ్రామపంచా యతీ నూతన అధ్యక్షురాలిగా వీణా రవి ఎన్నికయ్యారు. ఇదివరకు అధ్యక్షురాలిగా కొన సాగిన కృష్ణవేణి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి సోమవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష స్థానానికి కాంగ్రెస్ మద్దతుదారురాలు వీణారవి, బీజేపీ మద్దతుదారురాలు రాధాకావేరప్ప నామినేషన్‌లు సమర్పించారు. 28మందికిగాను 15 ఓట్లు వీణారవికి దక్కడంతో విజేతగా నిలిచారు. ప్రత్యర్థి రాధా కావేరప్పకు 13ఓట్లు లభించాయి. అనంతరం నూతన అధ్యక్షురాలు వీణారవి మాట్లాడుతూ కొడతి గ్రామ పంచాయతీ నగరానికి అనుబంధంగా ఉందని, కావున మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అందరి సహకారం తీసుకుంటామన్నారు. తాగునీరు, వీధిదీపాలు ఇతర వ్యవస్థలను మెరుగుపరుస్తామన్నారు. నూతన అధ్యక్షురాలిని ఇతర సభ్యులు ఆత్మీ యంగా సత్కరించి అభినందించారు. ఈ సంద ర్భంగా కొడతి గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు మంజునాథ్, మాజీ అధ్యక్షురాలు కృష్ణవేణి, సభ్యులు రమేశ్‌రెడ్డి, ఆశా చిట్టిబాబు, నారాయణ స్వామి (బాబు), మమతాలక్ష్మణ్, నలినాక్షి, నంజుండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతికతపై దృష్టి సారించాలి

- డాక్టర్ ఎన్‌సీ మహేంద్రబాబు

ప్రాజెక్ట్ ఎక్స్‌పో ప్రారంభంలో డాక్టర్ మహేంద్రబాబు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): సాంకేతికత విశ్వవ్యాప్తంగా పరుగులు తీస్తోందని, రోజుకో మార్పు సాధ్యమవుతోందని విద్యార్థులు ఆ దిశగా దృష్టి సారించాలని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఎన్‌సీ మహేంద్రబాబు అభిప్రాయపడ్డారు. సప్తగిరి ఎన్‌పీఎస్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను లాంఛనంగా ప్రారంభించారు. మౌల్యమాపన రిజిస్ట్రార్ ఎం నాగ రాజ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. డాక్టర్ మహేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిశోధనల ద్వారా అకడమిక్ అంశాలు సమగ్రంగా అర్థం చేసుకునేందుకు కారణమవుతాయన్నారు. 303 ప్రాజెక్టులు ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో 201 సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు కాగా 102 ప్రాజెక్టులు హార్డ్ వేర్‌గా ఉన్నాయి. రెండురోజులపాటు ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

# పెద్దారెడ్డిని ప్రజలే రానివ్వడం లేదు

- రికార్డులు, ఆధారాలూ పంపుతా.. చూడండి
- నాపై, నా కొడుకుపై అనేక అక్రమ కేసులు పెట్టారు: జేసీ ప్రభాకర్ రెడ్డి

అనంతపురం క్రైం, జూలై1(ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డిని ప్రజలే తాడిపత్రికిలోకి రానివ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దారెడ్డి పెద్ద కొడుకు ఒక రోగ్ అని, తాడిపత్రిని దోచేసి నాశనం చేశారంటూ మండిపడ్డారు. గత ఐదేళ్ల తనపై, తన కొడుకుపై కేసులు పెట్టి జైళ్లకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ ఉంటే జుట్టు, లేకుంటే కాళ్లు పట్టుకునే చందంగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. మంగళవారం ఆయన అనంతపురంలోని తన గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేతలకు తాను వ్యతిరేకం కాదన్నారు. నాడు తన అన్న దివాకర్ రెడ్డి శిష్యులుగా ఉన్న వారు ప్రస్తుతం వైసీపీలో ఉన్నారన్నారు. గత ఐదేళ్లలో చట్టాలను పక్కన బెట్టి తమపై కేసులు పెట్టారన్నారు. తనను 130 రోజులు, తన కొడుకు జేసీ అశ్మిత్ రెడ్డిని 75 రోజులు జైల్లో పెట్టారన్నారు. గత ఐదేళ్లలో కేతిరెడ్డి పెద్దారెడ్డి చేయని అరాచకం లేదన్నారు. తన ఉన్న ఇళ్లు 6 సెంట్లు ఫ్రాడ్ చేసి రిజిస్ట్రర్ చేయించారని, కోటమికుంట్లలో వందల ఎకరాల భూ అక్రమాలు జరిగాయన్నారు. రైతులు సోలార్‌కు ఇస్తే... వాటిని కన్వర్షన్ చేసిన తర్వాత కూడా అక్రమంగా పాసు పుస్తకాలు చేశారంటూ మండిపడ్డారు. తనకు గన్‌మెన్ కూడా లేరన్నారు. పెద్దారెడ్డి ప్రైవేటు గన్‌మెన్‌ను కూడా పెట్టుకున్నాడన్నారు. తననెవరూ చంపలేరనీ, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న పెద్దారెడ్డి ట్రై చేసేలా ఉన్నాడన్నారు. సూర్యప్రతాప్‌రెడ్డి లేకుంటే.. పెద్దారెడ్డి జీరో అన్నారు. తనను ముండమోపి అంటూ పెద్దారెడ్డి అంటున్నారనీ, ఆయన ఏ జెండర్ కూడా తెలియడం లేదన్నారు. ఆయన డాంకీ, క్రాస్ బ్రీడ్‌లా ఉంటాడనీ, అలాగే తింటాడంటూ ఎద్దేవా చేశారు. పెద్దారెడ్డి సారా కూడా కాచారని, ఇసుక అమ్మడంతోపాటు అనేక అక్రమాలు చేశాడన్నారు. తనకు ఆ అవసరం లేదనీ, మీసం మెలేసి బతుతున్నానంటూ మీసం తిప్పుతూ తెలియజేశారు. పెద్దారెడ్డికి ఇదే లాస్ట్ వార్నింగ్ అంటూ హెచ్చరించారు.

## చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు (గ్రైరంగాలు) టన్ను గరిష్టంగా రూ.28,200 అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలకు విక్రయాలు జరిగాయన్నారు. ఇక సీజనల్ రకం కాయలు టన్ను గరిష్టంగా 16వేలు, కనిష్టంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 792 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



## జె వెంకటాపుర అధ్యక్షురాలిగా నయనా

నూతన అధ్యక్షురాలితో కేపీసీసీ కన్వీనర్ తదితరులు

శిడ్లఘట్ట, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జె వెంకటాపుర గ్రామ పంచాయతీ అధ్యక్షస్థానానికి జరిగిన ఎన్నికల్లో మిత్తనహళ్ళి గ్రామ పంచాయతీ సభ్యురాలు నయనా ఎస్ గెలుపొందినట్టు ఎన్నికల అధికారి రవి ప్రకటించారు. రాజీనామాతో ఖాళీ అయిన అధ్యక్షస్థానానికి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ మద్దతుదారురాలు బైరసంద్ర గ్రామానికి చెందిన శశికళ, మిత్తనహళ్ళి గ్రామపంచాయతీ సభ్యురాలు నయనా ఇద్దరూ నామినేషన్ సమర్పించారు. మొత్తం 17మంది సభ్యులకుగాను 16మంది కాంగ్రెస్ మద్దతుదారులు, ఒకరు జేడీఎస్ మద్దతుదారులు ఉన్నారు. నయనాకు 10 ఓట్లు దక్కగా శశికళకు 7 ఓట్లు వచ్చాయి. దీంతో నయనా ఎస్ అధ్యక్షురాలిగా ఎన్నికైనట్టు ప్రకటించారు. కాగా కాంగ్రెస్‌కు ఇద్దరు మద్దతుదారులు అధ్యక్షస్థానంకోసం పోటీపడ్డంతో సభ్యుల మధ్య గందరగోళం నెలకొంది. కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ చేసిన రాజీ ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షురాలిని పలువురు అభినందించారు. బాణాసంచాకాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ ఉపాధ్యక్షురాలు ఇందిరా, కాంగ్రెస్ యువ నాయకుడు హరీశ్, నాగేశ్, సుగటూరు దేవరాజ్, సతీశ్, కేపీసీసీ సభ్యుడు ఏ చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఫెలోమెనాలో సీనియర్ డాక్టర్లకు సత్కారం

సంబరాలు చేసుకుంటున్న వైద్యబృందం

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేక్‌నగర్‌లోని సెయింట్ ఫెలోమినా ఆసుపత్రిలో విశిష్ట సేవలందిస్తున్న సీనియర్ వైద్యులకు సత్కారం చేశారు. మంగళవారం ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. సీనియర్ డాక్టర్లు బాలాజి డీఆర్, సంజయ్ రావ్, శైలజ, సంధ్యాలను సన్మానం చేశారు. కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. యువడాక్టర్లు నృత్యాలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాజి మాట్లాడుతూ సెయింట్ ఫెలోమెనాలో రెండు దశాబ్దాలకు పైగా సేవలందిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ వృత్తి సమాజానికి ఎంతో ఆదర్శవంతమైందన్నారు.

## విక్టోరియా ఆసుపత్రిలో చెలరేగిన మంటలు

» ఇతర వార్డులకు రోగుల తరలింపు

ఆస్పత్రిలో మంటలు

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విక్టోరియా ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సిబ్బంది సమయ స్ఫూర్తిగా వ్యవహరించడంతో భారీ ప్రమాదం తప్పింది. మంటల కారణంగా కొద్దిసేపు దట్టమైన పొగ ఆవరించింది. వెంటనే ముందస్తు చర్యలలో ఐసీయూ విభాగంలోని 26మంది రోగులను హెచ్ బ్లాక్‌కు తరలించారు. సుమారు తెల్లవారు జామున 3 గంటలకు సెల్లార్‌లోని సెమినార్ రూంలో మంటలను డ్యూటీ డాక్టర్ దివ్యా నేతృత్వంలోని సిబ్బంది గుర్తించారు. వెంటనే అగ్ని మాపక సిబ్బందికి విషయం తెలపగా తక్షణం స్పందించి రంగంలోకి మంటలను నియంత్రించారు. కాగా ప్రమాదానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు.

## ఘనంగా కాళికాంబదేవి జాతర

జ్యోతులతో వస్తున్న భక్తులు

శిడ్లఘట్ట, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ కంబదహళ్ళిలో కాళికాంబదేవి అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం పూజలు, హోమాలతో జాతర ప్రారంభమైంది. మంగళవారం జ్యోతులతో భక్తులు ఊరేగారు. ఈ సందర్భంగా ఇళ్లముందు రంగవల్లులు వేశారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. జాతరలో పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప, గ్రామ ప్రముఖులు జగదీశ్, శ్రీనివాస్ ప్రకాశ్, లక్ష్మీపతి, బచ్చేగౌడ, రాజగోపాల్, సురేంద్ర మునేగౌడ తదితరులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ 95909 81234
ACO బెంగళూరు సౌత్ 77951 55585
SR బెంగళూరు ఈస్ట్ 88616 94202
SR బెంగళూరు నార్త్‌వెస్ట్ 99009 22004
SR హోసూరు 86818 81386
ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
ఇట్లు: జనరల్ మేనేజర్

## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1624.38 | 1,584.15 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 33,916 | 11.854 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 2,389 | 296 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 74.49 | 6.78 |

# సమస్యల స్టేషన్..!

- బళ్లారి రైల్వే స్టేషన్‌లో సమస్యల కూత
- నత్తనడకన 'అమృత భారత్' అభివృద్ధి పనులు
- ఫ్లై ఓవర్ లేక వాహనదారులకు ఇబ్బందులు

బళ్లారి, జూలై 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి రైల్వే స్టేషన్లో సమస్యలు పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినా పనులు నత్తనడక సాగుతున్నాయి. 'అమృత్ భారత్' స్టేషన్ పథకం కింద 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిధులు కేటాయించారు. ఇందులో బాగంగా హుబ్లీ రైల్వే డివిజన్ లో బాగంగా బళ్లారి రైల్వే స్టేషన్‌కు అభివృద్ధికి రూ. 16.66 కోట్లు మంజూరు చేశారు. బళ్లారి రైల్వే స్టేషన్‌ను వారసత్వ స్టేషన్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలనేది మోదీ ఉద్దేశం. పూర్వ బ్రిటీష్ కాలం లో గోడలకు వేసిన పెయింటింగ్‌ను తొలగించడం. విశ్రాంతి గదులు, ఎస్ఎస్ కార్యాలయం, టికెట్ బుకింగ్ ఆఫీస్, స్టాఫ్ విశ్రాంతి భవనం పునరుద్దరించడంతో పాటు ప్లాట్ ఫారం 1, 2,. 3, అభివృద్ధి తదితర పనులకు నిధులు మంజూరు చేశారు. అయితే ఈ పనులు నత్తనడక సాగుతున్నట్లు హుబ్బళ్లీ రైల్వే డివిజన్ అధికారులు "ఎక్స్" సోషియల్ మీడియా ద్వారా తెలిపారు. 65 శాతం పనులు పూర్తీ అయ్యాయని మిగిలిన పనులు పూర్తి కావాలని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. హైటెన్షన్ విద్యుత్ వైర్లు కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని రైల్వే కాంట్రాక్టరు అంటున్నారు. రైల్వే ప్లాట్‌ఫారం సరిగ్గా లేనికారణంగా, లిఫ్టు కూడా లేకుండా పోవడంతో ప్రయాణికులు ఓ ప్లాట్ ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారంకు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలు, గర్భిణులు ప్లాట్‌ఫారం చేరుకోవాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్లాట్‌ఫారం దాటుకునే లోపే రైలు టైం కావడంతో ప్లాట్‌ఫారం నుంచి రైళ్లు వెళ్లిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి, విజయనగర, హుబ్లీళీ, ఇలా అనేక రైల్వే స్టేషన్లలో పనులు నత్తనడక సాగుతున్నాయి. అంతే కాకుండా బళ్లారి, విజయనగర జిల్లాల నుండి ఇనుము ముడిఖనిజం గూడ్సుల్లో అధికంగా రవాణా అవుతోంది. సరుకు రవాణా లోనే రైల్వేకు అధిక ఆదాయం లభిస్తోంది. కానీ ఇక్కడ ప్లాట్‌ఫారం, ఇతర సౌకర్యాలు కల్పనగలో రైల్వే నిర్లక్ష్యం చేస్తుందని, కేంద్ర నుండి అమృత భారత్ స్టేషన్ కింద మంజూరు అయిన పనులు వేగవంగా చేయాని రైల్వే కమిటీ సభ్యులు కోరుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కమిటీ కోరుతోంది.

రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం

## నమోదు కాని రాజకీయ పార్టీలపై
# చర్యలు: కలెక్టర్

కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రిజిస్టర్ కాని, నడుస్తున్న రాజకీయ పార్టీలపై విచారణ చేపడ్తామని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. మంగళవారం మీడియా తో మాట్లాడిన కలెక్టర్ బళ్లారి జిల్లాలో నమోదైన గుర్తింపు లేని రాజకీయ పార్టీ అయిన జనస్వరాజ్య పార్టీ అధీకృత ప్రతినిధి కోరుకుంటే జూలై 18లోపు తన లిఖిత అభ్యర్థనలు రాష్ట్రంలోని ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించవచ్చన్నారు. పార్టీ తరపున పిటిషన్ సమర్పించేవారు పార్టీ అధ్యక్షుడు కానీ ప్రధాన కార్యదర్శి విచారణకు హాజరు కావాలన్నారు. నిర్ణీత సమయం లోపు పార్టీ నుంచి ఎటువంటి లిఖిత అభ్యర్థన రాకపోతే పార్టీ నుండి ఎటువంటి ప్రకటన రాలేదని పరిగణించబడుతుందని , పార్టీని సంప్రదించకుండా ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయం తీసుకుంటుందని సూచించారు.

## రెండు లారీల ఢీ.. డ్రైవర్లకు గాయాలు

ప్రమాద స్థలంలో లారీలు

బళ్లారిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామం వద్ద ఎన్‌హెచ్ 63 రోడ్డుపై రెండు లారీలు ఢీ కొన్నాయి. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో యాడికి చెందిన ఐచర్ వాహనం, సివిల్ లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్లు మహేష్, మహమ్మద్ ఖాసీంలకు కాళ్లు విరిగాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పీడీహళ్లి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను 108 ఆంబులెన్స్ ద్వారా బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తహసీల్దార్‌గా గౌసియా బేగమ్

బాధ్యతలు స్వీకరిస్తున్న గౌసియా బేగమ్

సిరుగుప్ప, జూలై 1(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తహసీల్దార్‌గా గౌసియా బేగమ్ అధికార మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్ లోకాయుక్త కేసులో చిక్కుకోవడంతో ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌గా కురుగోడు తహసీల్దార్ నరసప్పను జిల్లా అధికారి నియమించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గౌసియా బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ నరసప్ప గౌసియా బేగమ్‌కు తమ అధికారాన్ని అందించారు.

## చెట్లను కాపాడండి: కరవే

అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కరవే అధ్యక్షుడు పంపనగౌడ

బళ్లారిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా తదితర ప్రాంతాల్లో మొహర్రం పండుగ సందర్భంగా వ్యవసాయ పంట పొలాల్లో చెట్లు నరకకుండా కాపాడాలని కరవే నాయకులు కోరారు. మంగళవారం కర్ణాటక రక్షణ వేదిక గ్రామీణ అధ్యక్షుడు పంపన్న గౌడ నేతృత్వంలో అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్‌కు మనవిపత్రం అందజేశారు. మొహర్రం పండుగ సందర్భంగా చెట్లు నరకకుండా కాపాడాలని వాతావరణంలో మార్పులతో వర్షాలతో పాటు వాతావరణం ప్రకృతిని అందించే చెట్లను నరకకుండా కాపాడాలని, ఎండిన చెట్లను నరికి మొహర్రం పండుగకు వాడుకోవాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ అందించే వినతిపత్రం అందజేశారు. అధికారులు అంజి, శేఖర్, ఆంజనేయ, లింగేష్, తిరుమలేష్, ఉలిగప్ప, కరవే పదాధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులపై కేసులు సరికాదు

- విద్యార్థి సంఘం నాయకుడు రాజేశ్ కుమార్

విలేకరులతో మాట్లాడుతున్న రాజేశ్ కుమార్

రాయచూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వెనకబడిన రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం పోరాడుతున్న నేతలపై కేసులు బనాయించడం సరికాదని కర్ణాటక విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ కుమార్ అన్నారు. ఈ విషయంలో ఉద్యమకారుల పై కేసు నమోదు చేయించేందుకు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ చేసిన ప్రయత్నం ఎవ్వరికి సంతోషాన్నివ్వదన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో మాట్లాడిన రాజేశ్ కుమార్ సిటీ ఎమ్మెల్యేను ఉద్దేశించి పోరాట నాయకులైన అశోక్ కుమార్ జైన్, బసవరాజ్ కళస చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికి తప్పేనని ఈ విషయంలో వారిని ఎవ్వరు సమర్థించడం లేదన్నారు. అదే సమయంలో ఎమ్మెల్యేగా బాధ్యతయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి వారి నుంచి క్షమాపణలకు డిమాండ్ చేయాల్సింది పోయి కేసు బనాయించడం పైగా పోరాట టెంటును పేకించి వేస్తానని దర్పంగా మాట్లాడడం ఆయన హోదాకు హొందతనానికి తగదన్నారు. ఇప్పటికైన సిటీ ఎమ్మెల్యే ఎయిమ్స్ ఏర్పాటు పోరాట ఉద్యమానికి బాధ్యతగల ప్రజాప్రతినిధిగా నేతృత్వం వహించాలని అన్ని వర్గాల వారిని ఉద్యమంలో మమేకం చేయేసేలా తగిన కృషి చేయాలన్నారు. ఈ విషయంలో కేంద్రం పై ఒత్తిడి తెచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారిని ముఖ్యంగా విద్యావంతులు మేధావులను ఏకం చేయాల్సిన బాధ్యత సిటీ ఎమ్మెల్యే పైనే ఉందన్నారు. ఇప్పటికైన వాస్తవాన్ని గ్రహించి ఉద్యమకారుల పై పెట్టిన కేసులను ఎమ్మెల్యే విత్‌డ్రా చేసుకోవాలని ఆయన కోరారు.

## అవినీతిని వెలికితీయాలి

- పత్రికలు సమాజానికి మార్గదర్శకం: కమిషనర్

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నకమిషనర్ దివాకర్

హోస్పేట, జూలై 1:(ఆంధ్రజ్యోతి):సమాజంలోని లోపాలను సరిదిద్దడానికి జర్నలిస్టులతో కలిసి పనిచేయాడానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని జిల్లా కమిషనర్ దివాకర్ స్పష్టం చేశారు. నగరంలోని సైన్స్ కళాశాల ఆడిటోరియంలో 182వ ప్రెస్ వేడుకలను మంగళవారం కర్ణాటక జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించారు. ఈ వేడుకలను కమిషనర్ దివాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లోపాలను సరిదిద్దడానికి జర్నలిస్టులు కృషి చేయాలని, అవినీతిని వెలికి తీయడంలో వెనకడుగు వేయరాదన్నారు. అభివృద్ధి పనుల్లో వార్తా పత్రికల పాత్ర ప్రత్యేకమైనదని, ప్రతి సమస్యను తమ దృష్టికి తేవడంలో పాత్రికేయుల పాత్ర కీలకమైనదన్నారు. పత్రికా మాధ్యమాలు అటువంటి అంశాలపై దృష్టి సారించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులుపాల్గొన్నారు.

## కాలువలకు మరమ్మతులు చేపట్టండి

- నీటిపారుదల శాఖ అధికారులకు రైతుల వినతి

వినతిపత్రం అందజేస్తున్న హసురుసేన నాయకులు

కంప్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా పరిధిలోని డిస్ట్రిబ్యూటర్ కాలువలు పరిశుభ్రం చేపట్టాలని రైతు సంఘం నాయకులు చిన్న నీటి పారుదల శాఖ అధికారి శ్రీనివాస్ కు మనవిపత్రం అందించారు. ఈ సందర్భంగా తాలుకా హసురుసేన రైతు సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప నాయక మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్ కాలువలకు రేపో మాపో కాలువలకు నీరు విడుదల చేసే సమయం ఆసన్నమైంది. కనుక చివరి ఆయకట్టు రైతులను దృష్టిలో వుంచుకుని డిస్ట్రిబ్యూటర్ షట్టర్లు అలాగే కాలువలకు పరిశుభ్రం చేపట్టి రైతులకు సక్రమంగా అందేలా చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే పలు డిస్ట్రిబ్యూటర్ కాలువలకు పరిశుభ్రం చేపడుతున్నారు. మిగిలిన కాలువలు కూడా పూడిపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి చివరి ఆయకట్టు రైతులకు నీరందేలా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని రంగప్ప, గంగన్న కొట్టూరు రమేష్, సుదర్శన్, నాగరాజు తదితరులు రైతులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ అందజేస్తున్న ఎస్పీ శోభారాణి

## అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

- ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాగ్రత్త వహిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని, హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్పీ శోభారాణి అన్నారు. మంగళవారం జిల్లాపోలీసు ప్రాంగణంలో ఎస్పీ ట్రాఫిక్ అవగాహనా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద జిల్లావ్యాప్తంగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. ఈ మొబైల్ వాహనం నేరాల నియంత్రణ , మహిళలు , పిల్లలు వృద్ధులకు భద్రతా చర్యలపై ప్రచారం చేపడ్తారన్నారు. ,రహదారి భద్రత, ఆస్తి నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ మోసాలు, కుల వివక్షత మొదలైన వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తుందని అన్నారు.తదుపరి వాహనదారుల భద్రత కోసం పోలీసు సిబ్బందికి హెల్మెట్‌లను ఎస్పీ అందజేశారు. ఈసందర్భంగా అదనపు పోలీసు సూపరింటెండెంట్ రవికుమార్, నవీన్ కుమార్, మినెరా స్టీల్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ హనుమంతరెడ్డి, జిల్లాలోని అన్ని పోలీసు అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

- విద్యార్థులకు సీఐ వాసుకుమార్ హితవు

ర్యాలీలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంప్లి, జూలై1(ఆంధ్రజ్యోతి) : యువకులు విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉండాలని సీఐ వాసుకుమార్ అన్నారు. మంగళవారం కంప్లి పట్టణంలో షామియా చంద్ విద్యార్థులు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు విరుద్దంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ వాసుకుమార్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ అలవాట్లకు పడిపోయి జీవితాన్నే నాశనం చేపట్టుకుంటున్నారన్నారు. అలా కాకుండా యువకులు విద్యార్థులు మంచి అలవాట్లు అలవరుచుకుని క్రమశిక్షణ ఉత్తమ విద్యపొంది తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. తమ చుట్టూ వుండే ప్రదేశాల్లో మత్తుపదార్థాలు అమ్మకాలు చేపట్టినట్లయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అవినాష్, కాంబ్లే సుజాత, సునిల్, పోలీసు సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసమూర్తి

డాక్టర్ శ్రీనివాసమూర్తిని అభినందిస్తున్న సంఘం సభ్యులు

సిరుగుప్ప, జూలై1(ఆంధ్రజ్యోతి) : సిరుగుప్ప తాలుకా బ్రాహ్మణుల సంఘం తాలుకా అధ్యక్షుడిగా డాక్టర్ జే శ్రీనివాసమూర్తి ఎంపికయ్యారు. సిరుగుప్ప పట్టణం వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణంలో బ్రాహ్మణుల సంఘానికి నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వెంకటేష్ ఆచార్య, ఉపాధ్యక్షులుగా సంజీవ ఆచార్య, రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా మురళీధర్, సహ కార్యదర్శిగా మాధవాచార్య, కోశాధికారిగా ప్రాణేష్ ఆచార్య, డైరెక్టర్లుగా ప్రహల్లాదరావు, హనుమంతరావు, పవన్‌కుమార్ దేశాయ్, పద్మనాభరావు, ప్రకాష్, నారాయణ, లక్ష్మీలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మూడేళ్ల పాటు ఈ కమిటీ అమలులో వుంటుందని తెలిపారు.

## విద్యాసామగ్రి పంపిణీ

విద్యార్థులతో పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్

బళ్లారి సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మూడు పాఠశాలలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అంద్రాళ్ రామనగర పాఠశాల, విజయపుర క్యాంప్, ప్రభుత్వ లోయర్ ప్రైమరీ డీసీ కాలనీలో బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు సంవత్సరానికి అవసరమైన నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్ళు, రబ్బర్లు, డ్రాయింగ్ పుస్తకాలు,దిక్సూచి పెట్టెలు, ఏరేజర్లు, షార్పనర్లు, స్కెచ్ పెన్నులు, స్కేళ్ళు. స్కూల్ బ్యాగులు వంటి వివిధ విద్యా ప్రోత్సాహకరమైన అభ్యాస సామగ్రిని పంపిణీ చేశారు. బీడీసీసీ మాజీ అధ్యక్షుడు రమేశ్‌గోపాల్ దేశభక్తుడు భగత్‌సింగ్ సాహస గాథలను పిల్లలకు బోధించి విద్యార్థులు ఆయనలా సాహసికులుగా మారడానికి ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమంలో బుడా మాజీ అధ్యక్షుడు నాగేశ్,బళ్లారి సేవా సమితి అధ్యక్షుడు సురేంద్రకుమార్ భప్పన, బళ్లారి సేవా సమతి కార్యదర్శి రామచంద్ర, కిరాణా దుకాణాల సంఘం అధ్యక్షుడు వీరాంజనేయులు, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి కరాటే పోటీలకు
## శ్రీ నందా రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు

బళ్లారి సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ నందా రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులు కరాటే టోర్నమెంట్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల బెంగళూరులోని జీడబ్ల్యూ ఆర్ డ్రాగన్ లెగసీ గ్లోబల్ గ్రూప్ వరల్డ్ రికార్డ్ గ్లోబల్ అకాడమీ సీబీఎస్‌సీ నిర్వహించిన టోర్నమెంట్‌లో 9వ తరగతి విద్యార్థిని కావ్యశ్రీ ,7వ తరగతి విద్యార్థిని గౌతమ్ పాల్గొని 30 నిమిషాలు జరిగిన చదరంగం పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. విద్యార్థులు ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు . పాఠశాల అధ్యక్షుడు వేములపల్లి గాంధీ తెలిపారు. విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల అధ్యక్షుడు వేములపల్లి గాంధీ

# హోసూరు జోన్

## మేకల పెంపకం పట్ల పెరిగిన ఆసక్తి

జమునాపరి రకం మేక

హోసూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో జమునాపరి మేకల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మేకలతోపాటు ఆవులు, కోళ్లను అనుబంధంగా పెంచుతున్నారు. హోసూరు, డెంకణీ కోట్టై, బాగలూరు ప్రాంతాలలో పొలాలతోపాటు జమునాపరి మేకలను పెంచుతున్నారు. ఈ మేకలు 80-140 కేజీల వరకు పెరుగుతాయి. మేకల చెవులు ఒక అడుగు వరకు ఉంటాయి. మగ మేకలు 5 అడుగుల వరకు, ఆడ మేకలు 4 అడుగుల వరకు ఎత్తు పెరుగుతాయి. 4 మేకలను పెంచితే రెండేళ్లలో 20 పిల్లలను ఈనుతాయి. ఈ రకం మేక మాంసానికి హోసూరులోనే మాత్రమే కాకుండా మలేషియా, తైవాన్, సింగపూర్, జపాన్, అరబ్‌దేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. జమునాపరి మేకల పెంపకం లాభదాయకంగా ఉందని పాడిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అనప కిలో రూ.80.. రైతుల్లో హర్షం

హోసూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో రెండో సీజన్‌కు ముందు పండించిన అనపకాయ కిలో రూ.80 ధర పలుకుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు, డెంకణీకోట్టై, అంచెట్టి, ఉరిగం తదితర ప్రాంతాలలో వర్షాధారంగా అనపను పండిస్తారు. ఇక్కడ మట్టిసారం అనప పంటకు కూడా అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడితోపాటు నాణ్యతగా ఉంటోంది. స్థానికంగా పండించే పంటలు హోసూరుతోపాటు పొరుగున ఉండే కర్ణాటకకు కూడా ఎగుమతి చేస్తారు. డిసెంబరు, జనవరి నెలల్లో వచ్చే అనప కిలో రూ.60గా ఉండగా ప్రస్తుతం రూ.80 ధర పలకడంపై రైతులు సంబరపడుతున్నార

## రోడ్డు పనులతో వాహనదారులకు ఇబ్బందులు

రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తెరలు

హోసూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డెంకణీకోట్టై రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, సబ్‌కలెక్టర్ కార్యాలయం, ప్రైవేట్ ఆసుపత్రులు, పెద్ద వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు రహదారులశాఖ చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రోడ్డు డెవలెప్‌మెంట్ ఫండ్ కింద రూ.1.60కోట్లతో మురుగునీటి కాలువ నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు 4నెలలుగా సాగుతోంది. ఆసుపత్రి సమీపంలోని పాత మురుగుకాలువను తొలగిస్తుండగా ఆసుపత్రి ప్రాంగణంలోని 40మీటర్ల చుట్టుకొలత గోడ కూలిపోయింది. రోడ్డు విస్తరణ, మురుగునీటి కాలువ నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ నెలలు గడిచినా ప్రహరీగోడ మరమ్మతు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆసుపత్రి ప్రహరీని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## మొహర్రం ప్రార్థనల్లో సిరుగుప్ప ఎమ్మెల్యే

సౌదాగర్ మసీదులో పీర్లను ప్రతిష్ఠించిన ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జూలై 1(ఆంధ్రజ్యోతి): మొహర్రం ప్రార్థనలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సిరుగుప్ప పట్టణం దేశనూరు రోడ్డు మార్గంలో వున్న సౌదాగర్ మసీదులో పీర్లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తమ నివాసం నుంచి సౌదాగర్ మసీదు వరకు పీర్ల దేవుళ్ల పెట్టెను మోసుకుని వెళ్లి మసీదులో పీర్లను ఏర్పాటు చేశారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు పూలమాలలు వేసి సన్మానించారు. భారీఎత్తున బాణసంచా పేల్చారు. ముస్లిం ప్రముఖులు, కాంగ్రెస్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



మీకు నేనున్నా.. : పింఛనుదారుడు పోసిబాబు భుజంపై చేయి వేసి నడచివెళుతున్న సీఎం

పంట పండింది : పంట నష్టపరిహారం చెక్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

బాగా చదువుకోండి : పీ4లో దత్తత ఇస్తున్న అమ్మాయిలతో సీఎం

సీఎంకు కలెక్టర్ ప్రశాంతి జ్ఞాపిక

# జనంతో..సీఎం!

మీ పాలన భేష్ : చంద్రబాబుతో రూ.లక్ష విరాళం ఇచ్చిన వృద్ధురాలు

సూపర్ సార్ : బాబుకు జ్ఞాపిక ఇస్తున్న మార్గదర్శి కాశీ విశ్వనాథరాజు

మా అబ్బాయిని చూడండి సార్ : బాబుకు విన్నవిస్తున్న దివ్యాంగుడి తండ్రి

## దేవుడింతే ఇచ్చాడు.. ఇది మా ఖర్మ.. అనే ఆలోచన మానేయాలి!

సీఎం చంద్రబాబునాయుడు కొవ్వూరు నియోజకవర్గ పర్యటన ఆసక్తికరంగా సాగింది. గతంకంటే భిన్నంగా ఆయన మాటల్లో మార్పు కనిపించింది. పేదల సేవలో..అనే కార్యక్రమానికి వచ్చిన ఆయన నిజంగా పేదలతో మమేకమయ్యారు. పేదలు ఆత్మ గౌరవంతో, విశ్వాసంతో ఆలోచనలు పెంచుకోవాలని , దేవుడింతే ఇచ్చాడు.ఇది మాఖర్మ, నిత్యం కష్టపడడమే మా బతుకు అనే ఆలోచనలు చేయడం మానేయమని పిలుపునిచ్చారు. అంతేకాదు చర్మకార పింఛను దారుడైన పోసిబాబును కొవ్వూరు మండలం ధర్మవరంలో కారులో ఎక్కించుకుని తాళ్లపూడి మండలం మలకపల్లి వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. కారులో పక్కనే కూర్చొపెట్టుకుని వృత్తి, జీవన స్థితిగతులపై ఆరాతీశారు. ఆయన ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చారు. పోసిబాబు మాదిగ డప్పు తీసుకుని ఎలా కొట్టాలో అడిగి కాసేపు డబ్బు వాయించారు. అతని భుజంపై చేయి వేసి వీధిలో నడిచి వెళ్లారు. మరో పింఛన్‌దారుడి బిడ్డను ఎత్తుకుని ఆడించారు. సభానంతరం అనేక మంది సమస్యలు విని అందరికీ అండగా ఉంటానని చెప్పడంతో ప్రజలంతా ఆనందపడ్డారు.

– (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

## పేదల సేవలో చంద్రబాబు

- మలకపల్లిలో జనంతో మమేకం
- పింఛన్ల పంపిణీ.. మాటామంతీ
- పీ4లో ఇద్దరు అమ్మాయిల దత్తత
- సీఎంను చూసేందుకు జనం క్యూ

రాజమహేంద్రవరం/కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గేర్ మార్చారు.. జనంలోనే ఉంటున్నారు.. జనం బాధలు వింటున్నారు..అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.. మీకు నేనున్నానంటూ పేదలకు భరోసాగా నిలుస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో మంగళవారం మార్గదర్శులు, బంగారు కుటుంబాల పేర జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాళ్లపూడి గ్రామానికే కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు ఉదయం 9 గంటలకే సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. సీఎం చంద్రబాబు మలకపల్లి ప్రజల కోసమే తాను వచ్చానని చెప్పడంతో మలకపల్లి మరింత మురిసిపోయింది. ముందుగా చర్మకారుడు పోసిబాబు ఇంటికి నేరుగా వెళ్లి రూ.4 వేలు పింఛన్ అందజేశారు.అతను తయారుచేసే చెప్పులు, టోపీలు చూశారు. ఒక టోపీ, ఒక చెప్పుల జత తీసుకుని రూ.5 వేలు ఇచ్చారు. గ్రామంలో మరో మహిళలకు పింఛన్ అందజేశారు. అక్కడే ఒక చిన్నపిల్లను ఎత్తుకుని ముద్దాడారు. తల్లితో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమమే పీ4.. సమాజం మీకు ఎంతో ఇచ్చింది. అందులో కొంత తిరిగివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్ (పీ4) ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తానన్నారు. సమాజంలో 10 శాతం ఉన్నతమైన, ఆదర్శవంతమైన కుటుంబాల నుంచి సమాజంలో దిగువన ఉన్న 20 శాతం మంది ప్రజలను దత్తత తీసుకునే బృహత్తర కార్యక్రమం పీ4 అని చెప్పారు. సంపన్నులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని మూడు దశల్లో ఆ కుటుంబానికి అండగా నిలబడి ఉన్నతికి తవం వంతంగా బాధ్యత తీసుకోవాలన్నారు. 2029 నాటికి పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దేశంలో ఏపీలోనే ఎక్కువ మొత్తంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రగతి తదితర అంశాలను వివరించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు ప్రథమస్థానం ఇవ్వడం జరిగిందన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని గతంలో 150 పడకల ఈ ఆస్పత్రిని అభివృద్ధి కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను శుద్ధిచేసి తాగునీరుగా అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విన్నవించారు. వీటిపై సీఎం సానుకూలంగా స్పందించారు. అడినవన్నీ ఇచ్చారు.. వెంటనే వరాల జల్లు కురిపించారు.

## రెండున్నర గంటలు ఆలస్యంగా భోజనం

రాజమహేంద్రవరం : చంద్రబాబు సాధారణంగా మధ్యాహ్నం 1-2 గంటల మధ్య భోజనం ముగిస్తారు. ఆయన కారవాన్‌లోనే భోజనానికి ఓ 15 నిమిషాలు సమయం తీసుకుంటారు. మలకపల్లి సభకు ఆయన 11 గంటలకు రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించక 2 గంటలకు చేరుకున్నారు. అప్పటికే కారవాన్‌లో భోజనాన్ని సిద్ధం చేశారు. కానీ ప్రజలు వేచి చూస్తున్నారంటూ ఆయన నేరుగా సభా వేదికపైకి చేరుకున్నారు. సభ ముగిసేసరికి సుమారు సాయంత్రం 4 గంటలు దాటింది. సభ ముగిసిన తర్వాత ప్రజల వినతులు, ఫొటోల అనంతరం ఆయన కార్యకర్తల సమావేశ ప్రాంగణానికి 4.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పుడు కారవాన్‌లో భోజనం ముగించుకొని 5 గంటలకు సమావేశానికి వెళ్లారు.

## పోలీసుల ఓవరాక్షన్..

కొవ్వూరు : సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసులు అతిచేశారు. ఎవరినీ సీఎం చంద్రబాబు చెంతకు వెళ్లనీయకుండా సుమారు కిలోమీటర్ దూరంలోనే బందోబస్తు నిర్వహించారు. మల్లకపల్లిలో 2 వేల మందికి సరిపడా వేదికను సిద్ధం చేయగా అంత మందినీ తనిఖీ చేసి లోపలకు అనుమతించారు.. చంద్రబాబు కాన్వాయ్ వస్తుంటే జనాన్ని పక్కకు తోసేశారు.. దీంతో సభకు వచ్చిన జనం అసహనం వ్యక్తంచేశారు. పార్టీ కార్యకర్తల సమావేశం వద్దా ఇదే పరిస్థితి కనిపించింది. ఎంపిక చేసిన వారిని మాత్రమే లోపలకు అనుమతించారు. దీనిపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

అంతా ఓకేనా..

చంద్రబాబే మా విక్టరీ : మలకపల్లిలో మహిళల అభివాదం

బాబును చూద్దామని : గుంపులుగా నడచి వెళుతున్న మహిళలు

సాయం చేస్తారని..

ఎదురుచూపులు : కాపవరంలో చంద్రబాబు రాకకు చూస్తున్న నాయకులు

మంత్రి నిమ్మలతో శేషారావు, సుబ్బరాయచౌదరి, కుడుపూడి సత్తిబాబు తదితరుల మాటామంతీ

అమలాపురంలోని 25వ వార్డు పరిధిలో పింఛను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

## గౌరవప్రద జీవితానికి భరోసా పింఛన్లు

### అమలాపురంలో ఇళ్లకు వెళ్లి స్వయంగా అందించిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,జూలై1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా సామాజిక భద్రతతో పాటు గౌరవప్రదమైన జీవితానికి భరోసా ఏర్పడుతుందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. మంగళవారం అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 25వ వార్డు సచివాలయంలో పేదలకు పింఛన్లు అందించారు. అనంతరం ఆ ప్రక్రియను ఆయన పరిశీలించారు. దివ్యాంగులు, వృద్ధులకు స్వయంగా కలెక్టర్ పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట పర్యవేక్షణ, సమన్వయంతో సజావుగా పెన్షన్లు పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పీ4 వంటి వినూత్న విధానాలను విజయవంతం చేయాలన్నారు. అమలాపురం పురపాలక సంఘ పరిధిలో 4,361 మందికి రూ. కోటి 94 లక్షలను పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. 25వ వార్డులో 193 మందికి రూ.8.51 లక్షలను అందిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు పెన్షన్ అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వారి ఇళ్ల వద్దకే తీసుకువెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఒకటో తేదీన ఏదైనా కారణం చేత పింఛను తీసుకోకపోతే రెండు రోజుల్లో మళ్లీ పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, డీఆర్డీఏ ఏపీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వం చేపడుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే పాల్గొని సందడి చేశారు. ఇటీవల అమరావతిలో టీడీపీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పింఛన్ల పంపిణీలో జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు పాల్గొని వారే స్వయంగా వివిధ మండలాల్లో పింఛన్లను అందజేశారు.

## చాకలిపాలెం- కనకాయలంక కాజ్‌వేకు మోక్షం!

- హైలెవిల్ వంతెన నిర్మాణానికి రూ.22.83 కోట్ల నిధులు మంజూరు
- ఇటీవలే మంత్రి రామానాయుడు పరిశీలన
- వరదల సమయంలో తీరనున్న వెతలు

చాకలిపాలెం ఏటిగట్టు దిగువున కనకాయలంక కాజ్‌వే, వరద సమయంలో రాకపోకలు (ఫైల్‌ఫొటో)

పి.గన్నవరం,జూలై1(ఆంధ్రజ్యోతి): గోదావరికి ఎర్రనీరు వచ్చిందంటే చాలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతం పి.గన్నవరం మండలంలోని చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వరదలకాలం ఆ ప్రాంత లంకగ్రామస్తులు ప్రయాణం చేయడానికి నానావస్థలు పడతారు. కాజ్‌వే లోతట్టు ప్రాంతంలో ఉండడంతో స్వల్ప వరదలకు సైతం కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ క్రమంలో కనకాయలంక గ్రామం యలమంచిలి మండలం పాలకొల్లు నియోజకవర్గంలో ఉండడంతో వంతెనపై ఆ నియోజకవర్గ ప్రతినిధి, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టిపెట్టారు. రూ.24కోట్ల నిర్మాణం వ్యయంతో కాజ్‌వే స్థానే హైలెవిల్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ఏప్రిల్ 6వ తేదీన కనకాయలంక గ్రామాన్ని మంత్రి సందర్శించి వంతెన నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. దీంతో మరుసటిరోజే ఏప్రిల్ 7వ తేదీన సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) సీఈ ఆళ్ల విజయభాస్కర్, సంబంధిత అధికారుల బృందంతోపాటు ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ ఇంచార్జ్ ఈఈ, రాజోలు హెడ్‌వర్క్స్ సబ్‌డివిజన్ డీఈ గంగుమళ్ల శ్రీనివాస్‌తో కలిసి వంతెన నిర్మాణ ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం రూ.24 కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు.

### పరిపాలన ఆమోదం..

చాకలిపాలెం ఏటిగట్టు నుంచి కనకాయలంక గ్రామ సరిహద్దులో సీసీ రోడ్డుకు వంతెనను అనుసంధానం చేస్తూ కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి రూ. 22.83 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి పరిపాలన ఆమోదం లభించినట్టు హెడ్‌వర్క్స్ ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ తెలిపారు. చాకలిపాలెం ఏటిగట్టు (వశిష్ట ఎడమగట్టు) నుంచి 360 మీటర్ల మేర పొడవు, 3.05 మీటర్ల వెడల్పుతో వంతెన ఉంటుందని, వాటిలో 310 మీటర్లు మేర 15 ఫిల్లర్లు, రెండు అవుట్‌మేట్లతో కూడిన వంతెనతోపాటు 50 మీటర్ల మేర అప్రోచ్ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఇరిగేషన్ నిధులతో నిర్మించే ఈ వంతెనకు పరిపాలన ఆమోదం లభించింది. త్వరలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసుకుని సంబంధిత కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు అనంతరం వంతెన పనులకు శ్రీకారం చుట్టాల్సి ఉంది. ఆ దిశగా మంత్రి నిమ్మల రామానాయుడు కృషి చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

### పంట కాల్వపై రూ.80 లక్షల నిధులతో వంతెన

ఇక పి.గన్నవరం మండలంలోని వాడ్రేవుపల్లి గ్రామం- రాజోలు మండలం తాటిపాక పరిసర ప్రాంతంలో పి.గన్నవరం ప్రధాన పంటకాల్వపై పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండల పరిధిలోని పెదలంకను కలిపేవిధంగా రూ.80 లక్షలు నిధులతో సింగిల్ లైన్ వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఈమేరకు పాలనాపరమైన ఆమోదం లభించినట్టు హెడ్‌వర్క్స్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు.

ఇంజనీర్లతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి : కలెక్టర్ ఆదేశం

అమలాపురం, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాల కింద కొనసాగుతున్న నిర్మాణ పనులను వేగవంతంచేసి సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కోనసీమ జిల్లాలో మంగళవారం పలు నిర్మాణ పనుల పురోగతిపై వివిధ శాఖల ఇంజనీర్లతో సమీక్షించారు. జొన్నాడ ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయడంతోపాటు వంతెనకు అనుబంధంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. వారంలోగా సర్వీసు రోడ్లను అభివృద్ధిచేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. 216 జాతీయ రహదారి నిర్మాణ పనులపై థర్డ్ పార్టీ తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. పాశర్లపూడి జంక్షన్ పనులు జాప్యానికి తావు లేకుండా వేగవంతం చేయాలని నగరంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, గెద్దాడ గ్రామంలో పనులను సెప్టెంబరు నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి శానపల్లిలంక వద్ద రైతులు భూమిని ఇవ్వడానికి అంగీకారం తెలిపారని, వారి నుంచి అంగీకారపత్రం తీసుకుని ఇస్తామన్నారు. రూ.45.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఊడిమూడిలంక వంతెన పనులు వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాల్సిందిగా సూచించారు. జేసీ నిషాంతి, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, ఎన్‌హెచ్ ఏఈలు వెంకటరమణ, శ్రీనివాస్, ట్రాన్స్‌కో డీఈఈ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




ఉపాధికి భరోసా ఇచ్చే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరితే తక్షణ సమయంలో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చు. పాలిటెక్నిక్ డిప్లొమా, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి వచ్చినా ఐటీఐకి డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. ఐటీఐ పూర్తిచేసిన వారికి పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు ఉండడంతో ఈ కోర్సుల పట్ల ఆసక్తి చూపే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఐటీఐ పూర్తయిన తర్వాత పాలిటెక్నిక్ డిప్లొమా రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉంది. ఐటీఐ పాసైతే వివిధ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ఈ కారణంగా ఐటీఐ చదివేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

# ఐటీఐతో ఉపాధికి భరోసా

- పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు
- స్కిల్ హబ్ ద్వారా ఎన్నో ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు ప్రభుత్వ, 39 ప్రైవేట్ ఐటీఐలు
- వాటిల్లో మొత్తం 13 ట్రేడ్లు
- జూలై 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఐటీఐలో ప్రవేశం చాలా కష్టంగా ఉండేది. అప్పట్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారు సైతం ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు ఇష్టపడే వారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సీటు సాధించాలంటే గగనమే. 10-15 ఏళ్ల క్రితం ఐటీఐ కోర్సులకు డిమాండ్ పూర్తిగా తగ్గింది. అయితే తాజాగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఐటీఐ చదివిన వారికి ఉద్యోగావకాశాలు వస్తుండడంతో క్రమేణా పూర్వవైభవం సంతరించుకుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జూలై 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అప్లికేషన్, ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐల్లో జూలై 17వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకుంటే అడ్మిషన్ కౌన్సెలింగ్ అర్హులవుతారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా మెరిట్ జాబితా తయారుచేసి సీట్లను భర్తీ చేస్తారు.

కాకినాడ జిల్లాలో కాకినాడ, జగ్గంపేటల్లో రెండు ప్రభుత్వ, 12 ప్రైవేట్, తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో ఒక ప్రభుత్వ, 12 ప్రైవేట్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 15 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి.

బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. రెండేళ్ల, ఏడాది కాలపరిమితితో కూడిన ఐటీఐ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

2022-23లో 436 మంది విద్యార్థులకు 263 మంది ప్లేస్‌మెంట్ సంపాదించారు. 2023-24లో 463 మంది విద్యార్థులకు 436మంది, 2024-25లో 415 మందికి ప్రస్తుతానికి 364 మంది ఉద్యోగాలు సాధించారు.

**ఫిట్టర్:** ఇది ఎవర్‌గ్రీన్. రెండేళ్ల కోర్సు. ఇతర కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నా దీంట్లో మాత్రం సీట్లు నిండిపోతాయి. ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయి. కౌన్సెలింగ్‌లో తొలి ఆప్షన్‌గా దీనినే ఎంచుకుంటారు.

**ఎలక్ట్రీషియన్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. ఎలక్ట్రికల్ విభాగంతో సంబంధం ఉన్న కోర్సు ఇది. దీనిని పూర్తి చేసిన వారికి ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. ప్రైవేట్ సెక్టార్లో కూడా ఉపాధి అవకాశాలున్నాయి.

**డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. నిర్మాణ రంగంలో అవకాశాలు ఎక్కువ. వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగాలు పొందొచ్చు. ఈ కోర్సు పూర్తిచేసిన వారు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

**మోటారు మెకానిక్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. మోటారు రంగంలో స్థిరపడేందుకు అవకాశాలుంటాయి. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలుంది. మోటారు రంగానికి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. స్వయం ఉపాధి దిశగా ఈ రంగాన్ని ఎంచుకుని ఉద్యోగాలు సృష్టించిన వారు ఉన్నారు.

**ఇన్‌స్ట్రుమెంట్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. దీనిని పూర్తిచేస్తే పరిశ్రమల్లో ఆటోమెషీన్ల వద్ద ఉద్యోగాలు కల్పిస్తారు. దీంతో డిమాండ్ బాగానే ఉంది.

**డీజిల్ మెకానిక్:** కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే. డీజిల్‌తో సంబంధం ఉన్న అన్ని విభాగాల్లో ఉద్యోగం పొందేందుకు అవకాశముంది. ముఖ్యంగా ఆర్టీసీ గ్యారేజీలో.

**కంప్యూటర్స్:** కోర్సు కాలపరిమితి ఏడాది. పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులు. ఏ రంగంలో రాణించాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాల్సిందే. కంప్యూటర్ ఆపరేటర్లుగా హార్డ్‌వేర్ ఉద్యోగాలు పొందే వీలుంది.

**కటింగ్ అండ్ టైలరింగ్:** ఈ కోర్సు కాలపరిమితి ఏడాది మాత్రమే. మహిళలకు కటింగ్, టైలరింగ్ సంబంధించి తర్ఫీదు ఇస్తారు. తద్వారా వారు స్వయం ఉపాధి పొందే అవకాశముంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రుణాలు ఇచ్చి ఈ కోర్సు పూర్తి చేసిన వారిని ప్రోత్సహిస్తున్నాయి.

**ఎలక్ట్రానిక్ మెకానిక్:** ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. టీవీలు, సెల్‌ఫోన్లు రిపేర్ చేయడంలో శిక్షణ ఇస్తారు. ఇందులో ప్రావీణ్యం పొందితే సొంతంగా తమ కాళ్లపై నిలబడటమే కాకుండా మరికొంతమందికి ఉపాధి కల్పించవచ్చు.

**వెల్డర్:** ఏడాది కోర్సు పూర్తిచేసిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. అరబ్ దేశాల్లో ఉద్యోగావకాశాలు అధికం.

### బ్రిడ్జి కోర్సుతో పాలిటెక్నిక్

ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా పైచదువులు కొనసాగించవచ్చు. ఇది పూర్తి చేసిన తర్వాత ప్రవేశపరీక్ష ద్వారా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.

## మార్కులే ప్రాతిపదిక

**ఎం.వేణుగోపాలవర్మ, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్**
**కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్**

పదో తరగతిలో మార్కుల ప్రాతిపదికన రూపొందించిన మెరిట్ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తాం. ఐటీఐ కోర్సులు చదివిన అభ్యర్థులకు ఉపాధి గ్యారంటీగా లభిస్తుంది. పరిశ్రమల్లో ప్రాధాన్యంతో పాటు విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. నాణ్యమైన సంస్థలు, పెద్దపెద్ద కంపెనీలు కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. శిక్షణ అనంతరం అప్రెంటిస్ మేళాలు, మెగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు చూపిస్తున్నాం. అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలను తర్వాత ప్రకటిస్తాం.

### ఐటీఐ చదువుతుండగానే ప్లేస్‌మెంట్

**సుందరపల్లి వంశీసత్యకృష్ణ**

నాన్న డ్రైవర్. చదువు త్వరగా పూర్తిచేసి ఆయనకి సహాయపడాలనుకున్నా. ఐటీఐ ద్వారా అయితే త్వరగా ఉద్యోగం వస్తుందని ఇనుస్ట్రుమెంట్ మెకానికల్ రెండు సంవత్సరాల కోర్సులో చేరాను. అనుకున్నట్టే రెండో సంవత్సరంలో ఐటీఐలో ఈ నెల 13న నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పోల్‌మాన్ ఇనుస్ట్రుమెంట్స్ కంపెనీ (హైదరాబాద్)లో ఉద్యోగానికి ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది.

### అమ్మ, నాన్న ఎంతో సంతోషించారు: చిలుకోటి బన్నీ

నాది తొండంగి మండలం బెండపూడి. అమ్మ, నాన్న కూలి పనులు చేస్తూ నన్ను చదివించారు. వారి కష్టాన్ని చూడలేక త్వరగా ఉద్యోగం సంపాదించాలనుకున్నా. కొంతమంది ఇచ్చి సలహా మేరకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సులో చేరాను. సెకండియర్ చదువుతుండగా ఏప్రిల్ 26న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎల్అండ్‌టీ చెన్నై బ్రాంచ్‌కి సెలెక్ట్ అయ్యాను. పరీక్షలు పూర్తయ్యాక రెండు నెలలు ట్రైనింగ్ ఇచ్చి నెలకి రూ.16వేల జీతంతో ఉద్యోగమిచ్చారు. అమ్మ, నాన్న చాలా సంతోషించారు.

### టాటా కంపెనీలో ఉద్యోగమొచ్చింది

**పాలిక ప్రేమ్‌భవానీమూర్తి, రామచంద్రపురం**

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ రెండో సంవత్సరం హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాను. మే 7న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం పొందాను. పరీక్షల అనంతరం ఒక నెల ట్రైనింగ్ ఇచ్చారు. వసతి, భోజన సౌకర్యం, ట్రాన్స్‌పోర్టు ఇచ్చి నెలకి రూ.12వేలు బేసిక్‌తో ఉద్యోగం పొందాను.

### క్యాంపస్ ఇంటర్వ్యూలో సత్తా చాటాను

**చదల జాన్ డేనియల్ సతీష్‌చంద్ర, మైలవరం, అల్లూరి జిల్లా**

తండ్రిలేని నన్ను అమ్మ ఎంతో కష్టపడి చదివించింది. త్వరగా జీవితంలో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో ఐటీఐలో చేరాను. మే 28న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సత్తా చాటాను. బక్లౌ హోషన్ (తిరుపతి)లో ఉద్యోగం సంపాదించాను. అమ్మ చాలా సంతోషించింది.

### ఒక సంవత్సరం చదువుకే ఉద్యోగం

**ఎలుగుబంటి సత్యమణికంఠ**

ఐటీఐ చదివితే ఉద్యోగం త్వరగా వస్తుందని సలహా మేరకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో వన్ ఇయర్ కోర్సు డీజిల్ మెకానిక్ తీసుకున్నాను. మే 28న జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణి ఇంజన్ వాల్వ్స్ (హైదరాబాద్) కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకి రూ.14,700 బేసిక్‌తో ఉద్యోగం సంపాదించాను. చాలా హ్యాపీగా ఉంది.

### ఎల్అండ్‌టీ కంపెనీకి ఎంపికయ్యాను

**దూడ రాజ్‌కుమార్**

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో డాక్యుమెంట్ సివిల్ రెండో సంవత్సరం చదువుతున్నాను. జూన్ 4న ఎల్అండ్‌టీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచాను. ఆ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. త్వరగా ఉద్యోగం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది.

# పవన్ నిధులు తెస్తే మాకేంటి!

- డిప్యూటీ సీఎం పనులు ప్రతిపాదిస్తే అంగీకరించాలా
- మా ప్రతిపాదనలు పెట్టాల్సిందే
- అజెండాపై సంతకం చేయని చైర్‌పర్సన్
- కాకినాడ కలెక్టర్‌కు చేరిన గొల్లప్రోలు నగర 'పంచాయితీ'

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని నిధులు తీసుకుని పనులు ప్రతిపాదిస్తే నగర పంచాయతీ పాలకవర్గం మోకాలడ్డుతోంది. తాము ప్రతిపాదించిన పనులు పెట్టకుంటే అజెండాపై సంతకం చేసేది లేదని చైర్‌పర్సన్ తేల్చిచెప్పడంతో కౌన్సిల్ సమావేశమే జరగలేదు. ఈ 'పంచాయితీ' కాస్తా కాకినాడ జిల్లా కలెక్టర్ వద్దకు చేరింది.

గొల్లప్రోలు పట్టణంలో నెలకొన్న సమస్యలపై పలు వినతులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన పేషీ అధికారులను పంపి పరిశీలన చేయించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన పనులను తక్షణం చేపట్టేందుకు వీలుగా పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చి పిఠాపురం పట్టణానికి రూ.3 కోట్లు, గొల్లప్రోలు నగర పంచాయతీకి రూ.కోటి ప్రత్యేక నిధులుగా మంజూరు చేయించారు. వీటితో గొల్లప్రోలులోని వివిధ ప్రాంతాల్లో 27 రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రతిపాదించారు. ఇప్పుడు ఈ పనులను ఆమోదించేందుకు వైసీపీ మెజార్టీ ఉన్న గొల్లప్రోలు నగర పంచాయతీ పాలకవర్గం ఆది నుంచీ ఆటంకాలు సృష్టిస్తోంది. మే 29న సాధారణ, అత్యవసర సమావేశాల్లో ఈ పనులను టేబుల్ అజెండాగా తీసుకువచ్చారు. అప్పుడు వైసీపీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు సంతకం చేయకుంటే కమిషనరు కనకారావు తనకున్న విచక్షణాధికారంతో టేబుల్ అజెండా ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించలేదు. కొంత సమయం తీసుకుని అప్పుడు చర్చిద్దామంటూ వాయిదా వేశారు.

నగర పంచాయతీ నెలవారీ కౌన్సిల్ సమావేశాల నిర్వహణలో భాగంగా జూన్‌లో సాధారణ సమావేశం నిర్వహణకు వివిధ అంశాలతో పాటు గత అత్యవసర సమావేశంలో టేబుల్ అజెండాగా తీసుకురాగా వాయిదా వేసిన కోటి రూపాయల అభివృద్ధి పనుల అంశాన్ని కలిపి కమిషనరు... చైర్‌పర్సన్ సంతకం కోసం పంపారు. అయితే తాము ప్రతిపాదించిన పనులే పెట్టాలని, లేకుంటే అజెండాపై సంతకం చేసేది లేదని చైర్‌పర్సన్ స్పష్టం చేసి అజెండాను హోల్డ్‌లో పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన నిధులకు ఆయనే పనులు ప్రాతిపాదించారని అధికారులు చైర్‌పర్సన్‌కు వివరించారు. అయినప్పటికీ తమకే మెజార్టీ ఉందని, తాము చెప్పిన పనులే పెట్టాలని, డిప్యూటీ సీఎం అయినా మాకు లెక్కేంటి అనే రీతిలో వైసీపీ పాలకవర్గం ఉండడంతో ప్రతిష్టంభన ఏర్పడింది.

చైర్‌పర్సన్ అజెండాను తిరస్కరించడంతో జూన్‌లో జరగాల్సిన గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం జరగలేదు. అజెండా అంశాలను ఆమోదించి లేదా తిరస్కరించి తనకు పంపలేదని కమిషనరు చెప్తున్నారు. దీంతో పవన్‌కల్యాణ్ పట్టణాభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చి రెండున్నర నెలలు గడుస్తున్నా ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి ఏర్పడింది. పక్కనే ఉన్న పిఠాపురం పురపాలక సంఘంలో పవన్ తెచ్చిన రూ.3కోట్లతో వైసీపీ మెజార్టీ ఉన్నా కౌన్సిల్ సమావేశంలో పనులు ఆమోదించడం, టెండరు పిలవడం జరిగిపోయాయి. ఇక్కడ మాత్రం పనులు జరగకూడదనే రీతిలో గొల్లప్రోలు వైసీపీ పురపాలకుల తీరు ఉందని జనసైనికులు, కూటమి నేతలు మండిపడుతున్నారు. కాగా ఈ మొత్తం వ్యవహారంపై కలెక్టరుకు నివేదిక పంపినట్టు కమిషనరు కనకరావు చెప్తున్నారు. దీంతో పనుల 'పంచాయితీ' కలెక్టర్ కోర్టుకు చేరింది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

## అక్రమ తవ్వకాలు జరిపితే క్రిమినల్ చర్యలు

- ర్యాంపుల్లో తవ్వకాలను డ్రోన్‌లతో పరిశీలిస్తున్నాం: ఆర్డీవో శ్రీకర్
- మానేపల్లిలో రెండు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం

పి.గన్నవరం, జులై 1(ఆంధ్రజ్యోతి): ర్యాంపుల్లో ఇప్పటివరకు జరిగిన మట్టి, ఇసుక తవ్వకాలను డ్రోన్‌ల ద్వారా పరిశీలిస్తున్నామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. ఏ ర్యాంపులో ఎంతమేర అనుమతులు ఉన్నాయో, తవ్వకాలు ఎంతమేర జరిగాయో పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ర్యాంపులను మంగళవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు.నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు జరిపిన వారిపై మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసులు అందించి జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఈనెల 1వ తేదీ నుంచి అక్టోబరు 15వరకు ఏవిధమైన ఇసుక, మట్టి తవ్వకాలు జరిపినా సంబంధిత వ్యక్తులపై ప్రభుత్వ నిబంధనలు అనుసరించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో ర్యాంపుల్లో ఉన్న బాటలను, నదీపాయలపై ఉన్న అడ్డుకట్టలను తొలగించే విధంగా స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. అనంతరం మండలంలోని ఊడిమూడి, వైవీపాలెం, మానేపల్లి, కందాలపాలెం ర్యాంపులను ఆయన పరిశీలించి ర్యాంపుల్లో బాటలను తొలగించాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవికి సూచించారు. అలాగే ర్యాంపుల పరిధిలో ఉన్న వీఆర్వోలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ర్యాంపులను పరిశీలించాలని ఆదేశించారు. ఇది లావుండగా మానేపల్లి మట్టి ర్యాంపు తనిఖీల్లో భాగంగా ర్యాంపు పరిసరాల్లో ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లను ఆర్డీవో స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆధీనంలో ఉంచినట్టు తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న ట్రాక్టర్ల యజమానులను ఉద్దేశించి ఒక ట్రక్కు ఇసుక కోసం బయటకు వస్తే వాహనాలు బయటకురావని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంట స్థానిక వీఆర్వోలు ఎం.నాగన్న, ఎన్.రత్నకుమారి, సిబ్బంది ఉన్నారు.

### మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు: ఏడీ

అంతర్వేది, జూలై 1(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని మత్స్యశాఖ ఏడీ హర్షవర్ధన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సఖినేటిపల్లి మండలం పల్లిపాలెంలో మత్స్యకారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈదురుగాలులు, అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు.

### తమలపాకుల అలంకరణలో సత్తెమ్మతల్లి

ముమ్మిడివరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మ తల్లిని మంగళవారం తమలపాకులతో అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### వైద్య విద్యార్థినికి గోల్డ్‌మెడల్



జీజీహెచ్(కాకినాడ), జూలై 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో సామాజిక వైద్య శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫస్టియర్ చదువుచున్న డాక్టర్ ఉజితను బంగారు పతకం వరించింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో జూన్ 27నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. రంగరాయ వైద్య కళాశాల నుంచి సామాజిక వైద్యవిభాగం హెచ్‌వోడీ డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీదేవి, పీజీ విద్యార్థులు హాజరయ్యారు. పేపర్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డాక్టర్ ఉజితకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం దక్కింది. ఆమెను మంగళవారం ఆర్ఎంసీలో ప్రిన్సిపాల్ ఎ.విష్ణువర్ధన్ అభినందించారు.

వీరబాబును సత్కరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

## ఆక్వారిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరబాబు

కాకినాడ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆక్వారిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడకు చెందిన బాబు ఎక్వేరిస్ట్ అధినేత, టీడీపీ బీసీ విభాగం జిల్లా నాయకుడు చొల్లంగి వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ పాత పోస్టాఫీసు వీధిలోని హోటల్ గ్రీన్‌పార్క్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం రాష్ట్ర అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చొల్లంగి వీరబాబు, గౌరవాధ్యక్షుడిగా నాగవర్మ, ఉపాధ్యక్షుడిగా కొవ్వూరి విమలాబాబు, కార్యదర్శిగా బొల్ల బంగారాజు, సంయుక్త కార్యదర్శిగా తాతపూడి రంగారావు, కోశాధికారిగా మీర్ జమీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, విశిష్ట అతిథిగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడలి ఈశ్వరి, గౌరవ అతిథిగా మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.కృష్ణారావు హాజరయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. మత్స్య శాఖ అభివృద్ధి అధికారి గోపి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, అసోసియేషన్ కోర్ కమిటీ సభ్యుడు రవి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి (బాబు)

## డీసీసీబీకి పూర్వవైభవం తీసుకొస్తా: చైర్మన్ తుమ్మల బాబు

కాకినాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకొస్తానని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. డీసీసీబీ సమావేశ హాలులో మంగళవారం ఆయన అధ్యక్షతన ఆప్కాబ్ అధికారులతో సమావేశం జరిగింది. ఆప్కాబ్ సీజీఎం ఎన్.వెంకటరత్నం బృందంతో బ్యాంకు పురోభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆప్కాబ్ ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు, రాయితీలు కల్పించాలని అధికారులను కోరారు. బ్యాంకు నిరర్థక ఆస్తులను తగ్గించాలని, డిపాజిట్లను పెంచాలని, కొత్త రుణాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు. రైతులకు అందుబాటులో సొసైటీలు పని చేస్తాయని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో ప్రవీణ్‌కుమార్, సీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

## శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం రూ.31.66 లక్షలు

హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పెద్దాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం తెరిచి లెక్కించారు. 104 రోజులకు రూ.31,66,081 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ అధికారి వి.ఫణీంద్రకుమార్. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది లావణ్య, హరిబాబు, తుని, అనపర్తిలకు చెందిన శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

### నేడు జడ్పీ సమావేశం

కాకినాడ సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కాకినాడ జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరగనుంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించనుండగా మంత్రులు, ఎమ్మెల్యేలు జడ్పీటీసీలు, ఎంపీపీలు విచ్చేయనున్నారు. ఏర్పాట్లను జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు పర్యవేక్షించారు.

# సర్కారు బడిలోకి ఉపాధ్యాయుడి బిడ్డ

కుమార్తెను రాజమహేంద్రవరంలోని చున్నీలాల్ జాజు కార్పొరేషన్ పాఠశాలలో చేర్పిస్తున్న శ్రీనివాస్

**కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్కూల్ టీచర్**

రాజమహేంద్రవరం సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల చుట్టూ తిరిగి లక్షలకు లక్షలు ఫీజులు కట్టి మరి సీట్ల కోసం ఎదురుచూసే తరుణంలో వాటిని కాదని తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదువుకోవాలని ఒక ఉపాధ్యాయుడు తలంచాడు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ చున్నీలాల్ జాజు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చింతపల్లి శ్రీనివాస్ తన కుమార్తె మేరిగ్రేస్‌ను 8వ తరగతిలో తన పాఠశాలలోనే చేర్చారు. గతంలో ఇదే ఉపాధ్యాయుడు నాగరాజా మునిసిపల్ పాఠశాలలో పనిచేసినప్పుడు అక్కడ 7వ తరగతిలో చేర్పించారు. ఇప్పుడు చున్నీలాల్‌కు ఆయన బదిలీ కావడంతో తన కుమార్తెను ఈ పాఠశాలకు మార్చుకున్నారు. చిన్నపాటి ప్రైవేట్ ఉద్యోగం చేస్తేనే తమ పిల్లలను బ్రాండ్ ఇమేజ్ ఉన్న పాఠశాలలో చేర్పించి చదించే నేటి కాలంలో ప్రభుత్వ పాఠశాలలోనే తన కుమార్తె చదువుకోవాలని శ్రీనివాస్ ఈ నిర్ణయం తీసుకోవడం పలువురిని ఆలోచింపజేస్తోంది. ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను పెంచుతుంది. ఈ నేపథ్యం లో శ్రీనివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కూడా బాగున్నాయని, ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగం రాకముందు తాను ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశానని, అందువల్ల తనకు తేడా తెలుసునన్నారు.

### సబ్జెక్‌పై పట్టు వస్తుంది

మాది రామచంద్రపురం దగ్గర కాపవరం గ్రామం. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదువుకున్నాను. నా కుమార్తె కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతానని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధనతో సబ్జెక్‌పై పట్టువస్తుంది. తనలో కాన్ఫిడెన్స్ వుంది. పదో తరగతిలో పాఠశాలకు మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది.

-శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు.

# దాట్ల మరిన్ని సామాజిక రచనలు చేయాలి

**రీజెన్సీ అధినేత జీఎన్ నాయుడు**



దేవదానంరాజును సత్కరిస్తున్న జీఎన్ నాయుడు

యానాం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యానాంకు చెందిన ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మరిన్ని సామాజిక స్పృహ కలిగిన రచనలు చేయాలని రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు అన్నారు. ఉగాదినాడు సీఎం చంద్రబాబు నుంచి కళారత్న పురస్కారం అందుకున్న కవి, కథకుడు, చరిత్రకారుడు దాట్ల దేవదానంరాజును నాయుడు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజు గతంలో యానాం పూర్వవైభవం కోసం అనేక సూచనలు చేశారని, సాహిత్య రంగంలో మరిన్ని సామాజిక అంశాలతో రచనలు చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజును చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు, చింతా కొండలరావు కూడా అభినందించారు.

## సిగాచి ఫ్యాక్టరీలో ప్రమాదం చాగల్లు యువతి మృతి

జయలక్ష్మీ ప్రసన్న (ఫైల్)

చాగల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన పోలిశెట్టి జయలక్ష్మీప్రసన్న (22) హైదరాబాద్‌లోని సిగాచి కెమికల్‌ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందింది. ఆమె బీ ఫార్మసీ పూర్తిచేసి ఫ్యాక్టరీలో కెమిస్టుగా పనిచేస్తోంది. ఉద్యోగంలో చేరి 2 నెలలు గడవకుండానే మృతిచెందడంపై తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. తండ్రి పోలిశెట్టి శ్రీనివాసరావు తాపీమేస్త్రీ. తల్లి రామకృష్ణ ఆశ కార్యకర్త. మృతురాలు పెద్దమ్మాయి కాగా, చిన్న అమ్మాయి ప్రభుకుమారి బీబీజీ మూడో సంవత్సరం చదువుతోంది. మృతురాలి నివాసం వద్ద బంధువులు చేరుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మోటార్‌ సైకిల్‌ అదుపు తప్పి వ్యక్తి మృతి

సీతారామ రాజు (ఫైల్)

తునిరూరల్‌, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని 16వ జాతీయ రహదారి వేమూరి వద్ద మోటార్‌సైకిల్‌ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందాడు. తేట గుంట గ్రామానికి చెందిన దంతులూరి వరహాసీతారామరాజు (43) మంగళవారం మోటార్‌సైకిల్‌పై తుని నుంచి తేటగుంట వస్తుండగా వేమూరి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 సిబ్బంది ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఘటనపై తుని రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాముకాటుకు వ్యక్తి మృతి

చాగల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం నందిగంపాడుకు చెందిన అత్మూరి పెద్ద సత్యనారాయణ (51) పాముకాటుకు మంగళవారం మృతిచెందాడు. పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఫుడ్‌ కమిటీ సభ్యుల ఆగ్రహం

### అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌, టీచర్‌కు షోకాజ్‌ నోటీసులు

శంఖవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇలాంటి భోజనాన్ని మీ పిల్లలకు పెడతారా అని ఫుడ్‌ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో మంగళవారం ఫుడ్‌ కమిటీ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్‌, లక్కిరెడ్డి పర్యటించారు. నెల్లిపూడి 2, శంఖవరం4 అంగన్‌వాడీ పాఠశాలలను పరిశీలించి రికార్డుల్లో తేడాలను గమనించారు. హాజరుపట్టిక పరిశీలించి తరువాత తనిఖీ నిర్వహించిన సూపర్‌వైజర్‌ రజని, అరుణశ్రీకు షోకాజ్‌ నోటీసులు ఇవ్వాల్సిందిగా నోడల్‌ అధికారి జెస్సీ ఫ్లోరెన్స్‌ను ఆదేశించారు. స్టాక్‌లో తేడా ఉన్నందున నెల్లిపూడి పాఠశాల టీచర్‌కు నగల బాలల్మికి షోకాజ్‌ ఇవ్వాలని సీడీపీవో వినోదలక్ష్మికి తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అల్లూరి సీతారామరాజు ఏజెన్సీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని ఫుడ్‌ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పదింటిలోపే భోజనం పాఠశాలలకు వస్తుండడం వలన పలువురు తెలపడంతో దీనిపై నివేదిక పంపిస్తామన్నారు. డీఎల్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు, ఎంఈవో ఎస్సీ రమణ, సూపర్‌వైజర్లు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా నెల్లిపూడిలో అంగన్‌వాడీ రిజిస్టర్లు పరిశీలిస్తున్న సభ్యులు

# పొగడ్తలు వినడానికి రాలేదు... పార్టీని బాగుచేయడానికి వచ్చా

మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

● కొవ్వూరులో కొత్తరోజులకు శ్రీకారం చుట్టండి ● బహునాయకత్వాన్ని ఒప్పుకోను ● టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం

కొవ్వూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'కష్టపడిన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోను. కార్యకర్తలు నేను చెప్పినట్టే చేయండి. మీ పొగడ్తలు వినడానికి రాలేదు. పార్టీని బాగు చేయడానికి వచ్చాను. పార్టీలో ఇబ్బందులు సృష్టించే వాళ్లను దూరం పెడతా, కొవ్వూరులో పాత రోజులు మరిపోండి. కొత్త రోజులకు శ్రీకారం చుట్టండి. సింగిల్‌ వాయిస్‌ ఉండాలి. ఎమ్మెల్యే ద్విసభ్య కమిటీ ఒకేమాటగా ఒకేతాటిపై నడవాలి. కొవ్వూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడతా. గీత దాటితే ఉపేక్షించేది లేదు. ఇక్కడ ఏం జరుగుతుందో అంతా నాకు తెలుసు. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వివరాలను సేకరిస్తూనే ఉన్నాం' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలోని ఏఎంసీ గోడౌన్‌ వద్ద మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ 'పార్టీలో లీడర్‌షిప్‌ చూసి ఓట్లు వేస్తారు. నాయకుడు చేసే ప్రతి పనిని, సంక్షేమాన్ని ఇంటింటికి తెలియజేయాలి. ఓటు బ్యాంకు పెంచాలి. టీడీపీకి బలం బీసీ వర్గాలు. 144 కులాలు ఉన్నాయి, చిన్న కులాలకు మైక్రో లెవిల్‌ గుర్తింపు ఇవ్వాలి. నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోషల్‌ మీడియా విషయంలో 225 ర్యాంకు. ఫేస్‌బుక్‌లో 2,432 పోస్టులు పెట్టారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడి పోస్టులతో ఇది సమానం. యూట్యూబ్‌ చానల్‌ లేనేలేదు. ఇంకా సోషల్‌ మీడియాలో స్పీడప్‌ కావాలి. కులాల వారీగా నాయకత్వం చెక్‌ చేసుకోండి' అని చంద్రబాబు చెప్పారు. ముమ్మి లీడర్లను పెట్టుకుంటే పార్టీ ముమ్మ అయిపోతుందన్నారు. వాయిస్‌ ఉండే నాయకులను పెట్టుకోవాలన్నారు. పబ్లిక్‌ ఒపీనియన్‌ సేకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో బహునాయకత్వాన్ని ఒప్పుకునేది లేదన్నారు. అల్లుబాబు ఉన్నారు. ద్విసభ్య కమిటీ ఉంది. బయట నియోజకవర్గంలో ఉన్నవారు కులు ఎక్కడా ఇంటర్‌ఫియర్‌ అవ్వడానికి వీల్లేదన్నారు. అలా చేస్తే వారిని కట్‌ చేస్తానన్నారు. ఎమ్మెల్యేకి చెబుతున్నాను అందరిని కలుపుకుంటే అని. జవహర్‌కు గౌరవం ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 8 వేల నుంచి 9 వేల బూత్‌లలో మనకు మెజారిటీ రాలేదని, 10 వేలు మెజారిటీ వచ్చి ఉంటే 175కి 175 సీట్లు మనకు వచ్చేవన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చినా నాయకులకు గౌరవం దక్కడం లేదని, అధికారులే ఎంజాయ్‌ చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే మాట కలెక్టర్‌ వినడం లేదన్నారు. కొవ్వూరు మండలానికి చెందిన కార్యకర్త మాట్లాడుతూ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానికంగా ఉండడం లేదని, మీరు సెంట్రల్‌ జైల్లో ఉండగా నిరాహార దీక్ష చేశానని చెబుతుండగా సీఎం చంద్రబాబు అతడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొవ్వూరు జాతకం 45 సంవత్సరాలుగా నాకు తెలుసు. గ్రూపులు ఈ నియోజకవర్గంలో ఇప్పటి నుంచి ఉండడంలేదన్నారు. నిజమైన కార్యకర్తకు అన్యాయం చేస్తే దేవుడు చెప్పినా ఊరుకోనన్నారు. గ్రూపు రాజకీయాలు వద్దన్నారు. అయితే కొంతమంది కార్య కర్తలను సమావేశంలోకి అనుమతించక పోవడం తో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెండ్యాల వెంకటేష్‌, ఎస్‌.రాజీవ్‌కృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్‌, కొవ్వూరు ఎఎంసీ చైర్మన్‌ నాదెళ్ల శ్రీరామ్‌, ఆళ్ల హరిబాబు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, పొట్రు శ్రీనివాసరావు, నామాన పరమేష్‌, కొఠారు వెంకట్రావు, మద్దిపట్ల సురేష్‌, గొరిజాల సురేష్‌, చావా శ్రీనివాసరావు, బొల్లిన శివ నాగేంద్ర, గెల్లా సురేష్‌, కొత్తపల్లి ఆశీష్‌లాల్‌, వరిగేటి కాంతారావు, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, ఎరుబండి వెంకట్రావు, 3 మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సీఎం కారులో చర్మకారుడు

### సరుకులు కొనిచ్చిన ముఖ్యమంత్రి

### చెప్పుల జత, టోపీకి రూ.5వేలు

పోసిబాబు తయారుచేసిన చెప్పును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. మలకపల్లిలో చర్మకారుడు పోసిబాబు ఇంటికి వెళ్లి చర్మకారదారులకు ఇచ్చే పింఛను ఇవ్వాల్సి ఉంది. అయితే పోసిబాబు దుర్గమ్మ గుడి వద్ద ఒక షాపు పెట్టి ఉండడం గమనించిన యంత్రాంగం సీఎంకు చెప్పగా..ఆ దుకాణం వద్ద కారు ఆపి పోసిబాబును కారులో ఎక్కించుకుని తన పక్క సీటులో కూర్చోబెట్టుకున్నారు. అక్కడి నుంచి మలకపల్లికి 2కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకూ కుటుంబ నేపథ్యం, స్థితిగతులు, వృత్తి జీవితం తదితర విషయాలపై పోసిబాబును ఆరా తీశారు. ఒక్కసారిగా సీఎం చంద్రబాబు కారు ఎక్కమనే కాకుండా ఆయన పక్కనే కూర్చొని రెండు కిలోమీటర్ల ప్రయాణించడంపై పోసిబాబు సంతోషం వ్యక్తం చేశాడు. ఎంతో ఉన్నతాధికారులకు సైతం దక్కని అవకాశం తనకు దక్కిందని, ఎంతో అదృష్టమంటూ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. పోసిబాబును తీసుకుని అతడి ఇంటికి వెళ్లి పింఛను అందజేసి యోగక్షేమాలు అడిగారు. పోసిబాబు దుకాణంలో కొన్ని వస్తువులు కూడా కొన్నారు. దీంతో ఆ కుటుంబం మరింత మురిసిపోయింది. పోసిబాబు తయారు చేసిన చెప్పులు, టోపీని చంద్రబాబు ముచ్చటపడి కొనుగోలు చేశారు. వాటి నిమిత్తం రూ.5 వేలు పోసిబాబుకు చెల్లించారు. గ్రామంలో చర్మకార పింఛను పొందుతున్న వ్యక్తి పోసిబాబు ఒక్కడే కావడం గమనార్హం. అంతకు ముందు కొండా వెంకటేశ్వరరావు జనరల్‌ స్టోర్‌కి వెళ్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కష్టసుఖాలపై ఆరా తీశారు. అనంతరం గెద్దం కృష్ణ దుర్గ ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందజేశారు. అక్కడే తల్లి ఒడిలో ఉన్న పసిపాపను దగ్గరకు తీసుకొని ముద్దాడారు. దారి పొడవునా ఉన్న ప్రజలను చూస్తూ అభివాదం చేశారు.

### మురిసిన మలకపల్లి

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలంలో మలకపల్లి ఓ చిన్న గ్రామం. వివిధ విభాగాల్లో 783 మంది ఎన్టీఆర్‌ భరోసా పింఛను లబ్ధిదారులు ఉన్నారు. ఈ గ్రామానికి కాదు.. మండలానికే సీఎం రావడం ఇదే మొదటిసారి. అది అరు అడుగుల సందులోకూడా వెళ్లడానికి కూడా కాస్త ఇబ్బందిగా ఉండే పరిస్థితుల్లో ఎస్సీ పేటలోకి సీఎం వెళ్లడం, పింఛన్లు ఇవ్వడం ఇదే మొదటి సారి. దీంతో ఆ చిన్న గ్రామం మురిసిపోయింది. సీఎం చంద్రబాబును చూడాలని సగం ఊరు సభకు చేరుకోగా.. మిగతావారు ఇంటి బయట వేచి చూశారు. ప్రస్తుతం రబీ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా జనం ఉదయం 9గంటలకే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎక్కువగా మహిళలే ఉన్నారు. ప్రజల కోసమే తాను వచ్చానని సీఎం చెప్పగా మలకపల్లి మురిసిపోయింది.

## 1500 మందితో బందోబస్తు


సీఎం చంద్రబాబు కాన్వాయ్‌ వద్ద పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా సుమారు 1500 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్‌ మళ్లింపు ఎక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 600 మంది పోలీసులను ప్రత్యక్షంగా విధుల్లో వినియోగించగా.. మిగతా వాళ్లను మఫ్టీలో నియమించారు. డ్రోన్‌, రోప్‌, స్పెషల్‌ పార్టీలను రంగంలోకి దింపారు. వాతావరణ కారణాల వల్ల పర్యటనలో ఎలాంటి మార్పులు జరిగినా దానికి అనుగుణంగా భద్రత కల్పించడానికి ప్లాన్లు ముందుగానే సిద్ధం చేశారు. బందోబస్తును తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ నిరంతరం స్వయంగా పర్యవేక్షించారు.

### ఒకే పుష్పం.. భిన్నంగా స్వాగతం

సీఎం స్థాయి వ్యక్తులు వచ్చినప్పుడు జిల్లా ఉన్నతాధికారులు, నేతలు విమానాశ్రయానికి వెళ్లి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలకడం పరిపాటి. కానీ ఈసారి సీఎం చంద్రబాబు వచ్చినపుడు భిన్నంగా ఒక పుష్పంతోనే మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్‌ తదితర నేతలు మలకపల్లిలోని వేదిక వద్దకు ఒక ప్రైవేటు మినీ వ్యాన్‌లో వచ్చారు. వారి గన్‌మ్యాన్‌లను కూడా అనుమతించలేదు. సీఎం ఎస్‌ఎస్‌జీ భద్రతలో ఉన్నారు. దీంతో భద్రతాపరంగా పలు జాగ్రత్తలను సీఎం కార్యాలయం నుంచి సూచించినట్లు తెలుస్తోంది.

## మోటార్‌సైకిల్‌, ఆటోను ఢీకొన్న కారు

### ఇద్దరికి తీవ్ర గాయాలు

దెబ్బతిన్న కారు

దెబ్బతిన్న ఆటో

గొల్లప్రోలు రూరల్‌, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెళ్తుండగా మోటార్‌సైకిల్‌, ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ నుంచి వెంకటరమణ గ్యాస్‌ ఏజెన్సీ ప్రతినిధి కేదారిశెట్టి విష్ణువర్ధన్‌ ఐటీవల కొత్త కారు కొనుగోలు చేశారు. ఆ స్నేహితుడు మండారపు అభిషేక్‌తో కలిసి విశాఖపట్టణంలో కారు సర్వీసింగ్‌ చేయించేందుకు కాకినాడ నుంచి మంగళవారం బయ లుదేరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో వెళ్తుండగా అదుపుతప్పి ముందు వెళ్తున్న మోటార్‌సైకిల్‌ను, ఆపై రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆటోను ఢీకొన్నారు. ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న చేబ్రోలుకు చెందిన ఒరుగంటి అప్పలరాజు, కర్రి చక్రరావు తీవ్ర గాయాలయ్యాయి. వారిని తొలుత పిఠాపురం తదనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై పోలీసులు, గొల్లప్రోలు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### బైక్‌ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

నల్లజర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అచ్చన్నపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపల్లి చెందిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపల్లి నుంచి వెళ్తుండగా వారి బైక్‌ అదుపు తప్పి పడిపోయారు. స్థానికులు 108కు ఫోన్‌ చేయడంతో నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఎలక్ట్రికల్‌ షాపులో చోరీ

### క్యాష్‌ కౌంటర్‌లో రూ.70వేలతో పరారీ

గొల్లప్రోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దుకాణ యజమానిని ఏమార్చి గుర్తు తెలియని వ్యక్తి క్యాష్‌ కౌంటర్‌లోని సొమ్మును తస్కరించి పరారయ్యాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం పిఠాపురం కార్యాలయం ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్‌ షాపు వద్దకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. దుకాణ యజమానిని ఎలక్ట్రికల్‌ సామాన్లు కావాలని అడగగా యజమానికి లోపలకు వెళ్లాడు. ఇది గమనించిన ఆగంతకుడు క్యాష్‌ కౌంటర్‌లోని రూ.70 వేలకు పైగా నగదును తీసుకుని పరారయ్యాడు. షాపు యజమాని, ఇతరులు వెంటపడినప్పటికీ దొరకలేదు. చోరీ దృశ్యాలు షాపులోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా షాపు నిర్వాహకులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షాపులో సీసీ కెమెరా దృశ్యం

## 'ఉమ్మడి తూర్పు గోదావరి'తో బీవీ పట్టాభిరామ్‌కు అనుబంధం

విద్యార్థులు, తల్లిదండ్రులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న పట్టాభిరామ్‌ (ఫైల్‌)

రామచంద్రపురం(ద్రాక్షారామ)/కార్పొరేషన్‌(కాకినాడ), జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు బీవీ పట్టాభిరామ్‌ మృతితో గోదావరి జిల్లాలోని ఆయన సన్నిహితులు, ఆయన శ్రేయోభిలాషుల్లో విషాదం నెలకొంది. ఆయనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. పట్టాభిరామ్‌ నెల్లూరు జిల్లాలో జన్మించినప్పటికీ.. ఆయన తండ్రి బీవీ సత్యనారాయణ కాజులూరు మండలం శీల గ్రామంలో జన్మించినట్లుగా సమాచారం. ఆయన వృత్తి రీత్యా వేర్వేరు ప్రదేశాల్లో ఉండాల్సి వచ్చింది. దీంతో ఆయన తండ్రి సత్యనారాయణ అప్పటి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం మండలం చెల్లూరు సర్కారు సుగర్స్‌లో ఇంజనీర్‌గా పనిచేసేవారు. దీంతో ఆయన కుటుంబం రామచంద్రపురంలో నివాసం ఉండేది. ఈ నేపథ్యంలో పట్టాభిరామ్‌ బాల్యం అంతా ఇక్కడే సాగింది. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించారు. దీంతో కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాల పూర్వవిద్యార్థిగా బీవీ పట్టాభిరామ్‌ను 2009లో రామచంద్రపురంలో పూర్వవిద్యార్థుల సంఘం సత్కరించింది. ఆయన, ప్రముఖ గేయ రచయిత దివంగత అద్దేపల్లి ఇద్దరూ క్లాస్‌మేట్స్‌. కాకినాడ పీఆర్‌ కాలేజీలో డిగ్రీ, కాకినాడ పీఆర్‌ ప్రభుత్వ కళాశాలలో బీఏ చదివారు. పట్టాభిరామ్‌కు కొమారదలలో కాలి వైకల్యం కలిగింది. దీంతో ఆయన ఆత్మన్యూనతా భావానికి గురికాగా దాన్ని జయించి తనని తాను ఇంద్ర జాలికుడిగా, రచయితగా తీర్చిదిద్దుకున్నారు. డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబార్‌రావు వద్ద మంత్రజాల విద్యలో మెళకువలు నేర్చుకున్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో అనేక స్టేజీలపై ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవారు. వ్యక్తిత్వ వికాస నిపుణిడిగా జిల్లా నలుమూలల కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

### రామచంద్రపురంలోని కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం

### కాకినాడలో డిగ్రీ విద్య పూర్తి

### ఇంద్రజాలకుడిగా ప్రదర్శనలు

### కాకినాడలో వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహణ

### ప్రజలను జాగృతం చేస్తూ కార్యక్రమాలు

అద్దేపల్లి ప్రభుతో పట్టాభిరామ్‌

పట్టాభిరామ్‌ ఇంద్రజాల విద్యతో చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్‌ ప్రోద్బలంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలపై ప్రచారం కల్పించారు. వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో పడమటి సంధ్యారాగం, డాక్టర్‌ పట్టాభిరామ్‌గానే కనిపించారు. పలు పత్రికల్లో వ్యక్తిత్వ వ్యాసాలు రాశారు. పలు పర్యాయాలు రామచంద్రపురంలో ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు.

## రాచపల్లి అరుణాచల క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యేల బృందం

కాకినాడ జిల్లా రాచపల్లిలో బసవేశ్వరుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని అరుణాచల క్షేత్రాన్ని కాకినాడ జిల్లాకే ఒక మణిహారం అని ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభారాజా, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప కొనియాడారు. రాచపల్లి అద్దరోడ్డు వద్ద రమణ సేవాశ్రమ ప్రాంగణంలో ఉన్న అపీత కుచాంబ సమేత అరుణాచల దేవస్థానాన్ని మంగళవారం ఎమ్మెల్యేల బృందం సందర్శించారు. అరుణాచలేశ్వర స్వామి అపీత కుచాంబ అమ్మవార్లను, బసవేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 7న ఈ ఆలయంలో భక్తగిరేసర్లు మహాశివభక్తుల్లైన 63 నాయనార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలతోపాటు దక్షిణామూర్తి, సూర్యభగవాన్‌, అయ్యగిరి, కాలభైరవ, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను ఆశ్రమ వ్యవస్థాపక పీఠపాదాధిపతి ధవి, ఆలయ వ్యవస్థాపకులు స్వామిరమణానంద ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యేలు ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రతిష్ఠించే నాయనార్ల విగ్రహాలను, పల్లకిలను, ఆధ్యాత్మిక వేదిక, ఇతర ఏర్పాట్లను ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది.


ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

**కావలెను**

కాకినాడ మెయిన్‌ రోడ్డులో Jewelry & Textiles షోరూమ్‌లో పనిచేయుటకు సిబ్బంది కావలెను. Qly. Inter Salary 16 వేలు, డిగ్రీ 18వేలు, డీపా ఎంట్రీ సిస్టమ్‌ ఆపరేటింగ్‌లో అనుభవం కలవారు కావలెను. శాలరీ రూ.22,000/- మరియు కాకినాడలో ఓక ఇంట్లో వంట పనులు ఇంటిలో పనులు చేయుటకు 35 సంవత్సరాల లోపు ఆడ వారు మహిళ కావలెను. జీతం రూ.20వేలు భోజనం వసతి సౌకర్యం కలదు. ఆసక్తి గలవారు సంప్రదించగలరు. సెల్‌: 6301943220, 8008440189

AJD:

**వధువు కావలెను**

37 సం॥లు అర్హతగల బాగా స్థిరపడిన వైశ్య (రెడ్డి) వరుడికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు నో డౌరీ సెల్‌: 6301943220, 8008440189

AJD:

4 Lines CLASSIFIED Rs. 230/- Only


## 'హెలికాప్టర్లను అందుబాటులో ఉంచండి'

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌

కూనవరం/వీఆర్‌పురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూనవరం 1986 నుంచి 2006 వరకు వచ్చిన వరదల్లో ప్రజలకు ఆహారం సరఫరా, అత్యవసర రోగులను భద్రాచలం తరలించేందుకు అప్పటి ప్రభుత్వాలు హెలికాప్టర్లను ఉపయోగించేవని ఇప్పుడు కూడా అవి అందుబాటులో ఉండేలా చూడాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు ప్రజలు సూచించారు. రాబోయే వరదల దృష్ట్యా పెట్టుకుని అల్లూరి జిల్లా కూనవరంలో ప్రజలతో పీవో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సమావేశంలో చిన్న లాంచీలు ఉపయోగిస్తే ప్రతి గ్రామంలోకి వెళ్లి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించవచ్చన్నారు. ఒక్క కోతులగుట్టలోనే కాకుండా ప్రతి సెంటర్‌లలో బఫర్‌ స్టాక్‌తో పాటు నిత్యావసర వస్తువులు ఉంచాలన్నారు. వరదల సమయంలో తాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆసుపత్రుల్లో అన్ని మందులు ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీవో మాట్లాడుతూ ప్రజా సూచించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. వరదల సమయంలో తాను కోతులగుట్టలోని కలెక్టర్‌ బంగ్లాలో అందుబాటులో ఉంటానని తెలిపారు. బాధితుల కోసం వాట్సాప్‌ గ్రూపును ఏర్పాటు చేస్తానని ఎటువంటి సమస్య వచ్చినా ఆ గ్రూపులో తెలియచేస్తే వెంటనే సమస్యను పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్‌ శ్రీనివాస్‌, ఎంపీడీవో రామారావు, తదితరులు ప్రసాద్‌, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పుల్లయ్య కూనవరం మేజర్‌ పంచాయతీ ఈవో సురేష్‌ పాల్గొన్నారు. వీఆర్‌పురం మండలం రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో పీవో వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

## వెళ్తోంది యుద్ధ ట్యాంకర్‌ వార్‌కు కాదు!

కొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండిపై యుద్ధ ట్యాంకర్‌ వెళ్లడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారు. ఈ ట్యాంకర్‌ను కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన యువకుడు పంపన నాగేంద్ర చెక్కతో తయారు చేశాడు. కాకినాడ బీచ్‌పార్క్‌లో సందర్శకుల వీక్షణ కోసం ఏర్పాటు చేసేందుకు సుమారు 20రోజులు శ్రమించి తీర్చిదిద్దాడు. మంగళవారం బీచ్‌పార్క్‌లో ఏర్పాటు చేసేందుకు వెంకట రాఘవపురం నుంచి గొర్రె చిలకమ్మ పాకలు మీదుగా బీచ్‌రోడ్డుకు ఎడ్లబండిపై ట్యాంకర్‌ను తరలించారు. దీంతో ఆ దారిలో పలువురు ఆశ్చర్యంగా తిలకించారు.

## గోదావరి.. శబరి సంగమం.. అద్భుతం

కూనవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాసిక్‌లో పుట్టిన గోదావరి నది ఒడిశా రాష్ట్రంలోని తూర్పు కనుమల్లో సింకరం కొండ శ్రేణుల నుంచి ప్రవహించే శబరి నది అల్లూరి జిల్లా కూనవరం వద్ద సంగమంగా ఏర్పడతాయి. ఈ రెండు నదులు ఇక్కడ కలిసిన సుమారు కిలోమీటరు వరకు విభిన్న రంగుల్లో పయనిస్తాయి. గోదావరి నీళ్లు నీలం రంగులోనూ, శబరి నీళ్లు ఎరుపు రంగులోనూ ప్రవహిస్తాయి. 2 నదులు నిత్యం ఇలాగే ప్రవహించినా వర్షాకాలంలో మాత్రం వేరువేరుగా ప్రవహిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తాయి.

కూనవరంలో వేరు వేరు రంగుల్లో కనిపిస్తున్న శబరి, గోదావరి నీళ్లు

# అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

టీడీపీ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, జనవాణిలో అర్జీ తీసుకుంటున్న ఎమ్మెల్యే గిడ్డి

## ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు పేరిట చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మంగళవారం అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొని ప్రతినిధులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని, వాటిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, బూత్ కన్వీనర్లకు మార్గ నిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయడంతోపాటు కార్యకర్తల సంక్షేమంపై వివరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి విజయలక్ష్మి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, టీడీపీ మండల, పట్టణశాఖల అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, అరిగెల నానాజీ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మట్ట మహాలక్ష్మిప్రభాకర్, ఆశెట్టి ఆదిబాబు, రాజులపూడి వెంకటేశ్వరరావు(భీమయ్య), మాదా మాధవి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేగా చంద్రబాబు జన్మనిస్తే..**

ఎమ్మెల్యేగా చంద్రబాబు జన్మనిస్తే ఆ అర్హత కలిగించిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లవల్లే తాను ఎమ్మెల్యే కాగలిగానన్నారు. అందుకే ముంబైలోని అంబేడ్కర్ రాజగృహం వద్ద ఇటీవల తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నట్టు వివరించారు. అంబేడ్కర్ మనుమడు ఆనంద్ అంబేడ్కర్ సమక్షంలో పుట్టినరోజు జరుపుకోవడం మరువలేనిదన్నారు.

### సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఐ.పోలవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం మురమళ్ల శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి కళ్యాణమండపంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బుధవారం నుంచి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో బూత్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికార కమిటీ సభ్యులు, గ్రామకమిటీ కన్వీనర్లు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, మందాల గంగాసూర్యనారాయణ, సాగిరాజు సూరిబాబురాజు, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, కాశర్లపూడి రాజేష్, పొద్దోకు బాలు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాకా సీతాదేవితోపాటు క్లస్టర్, బూత్, గ్రామకమిటీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారవేదిక జనవాణి

మామిడికుదురు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న జనవాణి కార్యక్రమంలో రెండోరోజు మంగళవారం ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో సంప్రదించి బాధితులకు న్యాయం జరగాలని సూచించారు. కార్యక్రమంలో మామిడికుదురు మండలానికి చెందిన జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, తుండూరి బుజ్జి, సర్పంచ్ అడబాల తాతకాపు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అయినవిల్లిలంకలో ఎంపీ హరీష్‌మాధుర్, సీహెచ్ గున్నేపల్లిలో ఎమ్మెల్యే బుచ్చిబాబు పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

● పింఛన్ల పంపిణీలో ఎంపీ హరీష్‌మాధుర్

అయినవిల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. మంగళవారం అయినవిల్లిలంకలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. గ్రామంలోని వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు పెన్షన్లు అందజేశారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉదయాన్నే ఇంటి వద్దకే పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. నాయకులు చిట్టూరి శ్రీనివాస్, వస్కా శ్యామ్, సలాది పుల్లయ్యనాయుడు, మద్దాల సుబ్బారావు, మేడిశెట్టి అంజిబాబు, సయ్యపురాజు సత్యనారాయణ రాజు, వారా లక్ష్మీనరసింహరామ్ పాల్గొన్నారు.

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛను అందజేస్తున్న అంగన్‌వాడీ టీచరు సావిత్రి

### పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే

**ముమ్మిడివరం:** ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పేదలకు సామాజిక భద్రతతో పాటు గౌరవప్రద జీవితానికి భరోసా ఏర్పడుతుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మంగళవారం పింఛన్ల పంపిణీలో పాల్గొని పింఛన్లు అందించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పింఛన్లు పెంపుదల చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ గొలకోటి దొరబాబు, సకిలే వెంకటేశ్వరరావు, యాళ్ల ఉదయ్, సబ్బతి రాంబాబు, గొలకోటి చిట్టిబాబు, శీలం సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆసుపత్రిలో పింఛను అందజేత

చర్మం కాలి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం అంగన్‌వాడీ టీచరు నిట్ల సావిత్రికి పింఛను అందజేశారు. ముమ్మిడివరం మండలం తాణేలంకకు చెందిన పేరూరి సూర్యనారాయణ ప్రమాద వశాత్తూ చర్మం కాలి కాకినాడ ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అంగన్‌వాడీ టీచరు నిట్ల సావిత్రి మంగళవారం కాకినాడ వెళ్లి పింఛను అందించారు.

● పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ, ఏపీఎం అన్నపూర్ణలు పాల్గొన్నారు. చినకొత్తలంకలో వితంతువు పిల్లా పరమేశ్వరికి పింఛను పంపిణీ చేశారు.

**అంబాజీపేట:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పెన్షన్లు పెంచారని టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి దాసరి వీరవెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. అలాగే మాచవరంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల వెంకటసుబ్బారావు ప్రభుత్వ పెన్షన్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

**రాజోలు:** సంక్షేమం, అభివృద్ధి రెండింటిలోను కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని గుబ్బల శ్రీనివాస్ అన్నారు. పొన్నమండలో మంగళవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు దాకే ఏడుకొండలు, ఎంపీటీసీ మోకా ఉష, కూనవరం గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు చెల్లింగి జానకీరామ్, మోకా ఏడుకొండలు పాల్గొన్నారు.

## 'విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి'

అమలాపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేస్తుందని సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆరోగ్యవంతమైన భోజనాన్ని అందించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతం స్టాకు రిజిస్టర్‌ను, బియ్యం స్టాకును పరిశీలించారు. ప్రతీనెలా బియ్యం సరఫరా చేస్తాం కాబట్టి ఎక్కడా నిల్వ లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్సు సీఆర్పీ మెండి శ్రీనుబాబు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

### వ్యవసాయంలో అధునాతన టెక్నాలజీ అవలంభించాలి

అంబాజీపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయరంగంలో ఆధునాతన టెక్నాలజీని అవలంభించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని పి.గన్నవరం ఇన్ చార్జ్ ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్ అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 80 శాతం రాయితీతో వ్యవసాయ డ్రోన్‌ను కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులుకు అందించారు. వ్యవసాయంలో డ్రోన్ ద్వారా మందులను పిచికారీ చేయడంతో కూలీల ఖర్చును అధిగమించవచ్చునని తెలిపారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్, డ్రోన్ కంపెనీ ప్రతినిధి ద్వారా రూ.10లక్షలు విలువైన డ్రోన్‌ను కృషీవల కంపెనీకి అందించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ముత్యాల జమీలు, యాళ్ల వెంకటానందం, ఆకాశం శ్రీనివాస్, అడ్డాల గోపాలకృష్ణ, ఏవో ధర్మరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### పీఎండీఎస్ సాగు-నేలతల్లి సారవంతం

మలికిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పీఎండీఎస్ (నవధాన్యాలను) సాగు చేయడం ద్వారా నేలతల్లి సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి కిరణ్ అన్నారు. మంగళవారం లక్కవరంలో గుబ్బల సత్యనారాయణ పొలంలో సాగుచేసిన నవధాన్యాల పంటను ఈ సందర్భంగా పరిశీలించారు. స్వర్ణకుమారి, హరిబాబు, సూర్యకుమారి, మౌనిక పాల్గొన్నారు.

### శ్రీసుబ్బాలమ్మతల్లికి తీపి కావిడి

అమలాపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం గ్రామదేవత శ్రీ సుబ్బాలమ్మ అమ్మవారికి సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు తీపి కావిడి సమర్పించారు. అమ్మవారి సేవా మహోత్సవాన్ని సూర్యబలిజ సంఘం అధ్యక్షుడు భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా సంఘ మహిళలు చలిమిడి, పానకం, వడపప్పు, పండ్లు, పువ్వులు, స్వీట్లు ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, చిక్కాల గణేష్, తిక్కిరెడ్డి నేతాజీ, సంఘ నాయకులు మద్దుల రవినాగేశ్వరరావు, మద్దుల గోపాలకృష్ణ, కాలే సురేష్, యండమూరి శివకేశవ, పందిరి శ్రీనివాస్, కాలే వెంకన్న, యండమూరి రాము, భాస్కర్ల శ్యామ్, కోటిపల్లి సాయి, భాస్కర్ల రవితేజ పాల్గొన్నారు.

### విద్యామిత్ర కిట్లను పారదర్శకంగా పంపిణీ చేయాలి

మామిడికుదురు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పారదర్శకంగా విద్యార్థులకు పంపిణీ చేయాలని మండల ప్రత్యేకాధికారి డీఎల్డీవో జె.వేణగోపాల్ కోరారు. లూటుకుర్రు హైస్కూలులోగల స్టాకు పాయింట్‌ను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యామిత్ర కిట్లను, వాటి నాణ్యతను పరిశీలించి ప్రతీఒక్క విద్యార్థికి ఈ కిట్లు అందేలా విద్యాశాఖాధికారులు కృషిచేయాలన్నారు. ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ఏవో వెంకటేశ్వరరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## 'కాసు'కు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు

మంత్రి దుర్గేష్ నుంచి అవార్డు అందుకుంటున్న కాసు

రాజోలు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో చెరుకూరి గార్డెన్స్‌లో జరిగిన రోటరీ క్లబ్ వారి వార్షికోత్సవ అవార్డుల ఫంక్షన్‌లో కోనసీమ జిల్లాలోని ఉత్తమ సేవలు అందించిన ఏకైక క్లబ్ రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ నుంచి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును అందుకున్నారు. వివిధ జిల్లాల నుంచి రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

### రీజెన్సీ తెరిచేందుకు అందరి సహకారం అవసరం

యానాం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యానాంలో రీజెన్సీ పరిశ్రమ తెరిపించేందుకు ప్రజలందరి సహకారం అవసరమని పరిశ్రమ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు అన్నారు. యానాం కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఆర్థాని దినేస్ ఆధ్వర్యంలో సావిత్రినగర్ గ్రామం లో ప్రజలతో ముఖముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎన్ నాయుడు హాజరై మా ట్లాడారు. రీజెన్సీ పరిశ్రమ తెరవలేం అంటూ యానాంలో ఉన్న ప్రజల అందరి సహకారం కావాలని కోరారు. అందుకు ప్రజలు పిలిస్తే ఎక్కడికైనా రావడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. దినేష్ మాట్లాడుతూ భావితరాలు బాగుపడాలంటే రీజెన్సీ రావాలని అందుకు పార్టీలకు అతీతంగా సహకారించాలని అన్నారు. మెల్లం చిన్ని, అరుణ్‌కుమార్, రాజబాబు, వర్మ, పాల్గొన్నారు.

### వరదలు ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలపై సమీక్ష

మామిడికుదురు, జూలై 1(ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి వచ్చే వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తుగా అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. సమావేశంలో డీఎల్డీవో వేణుగోపాల్, తహశీల్దార్ పి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ వరదలు ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళికలు సిద్ధంచేయాలని, ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని బలోపేతం చేసేవిధంగా చూడాలన్నారు. బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని, వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలు, ముంపుబారిన పడిన గ్రామాల్లో బాధితుల కోసం పడవలు ఏర్పాటు, తాగునీటి సరఫరా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, ఏవో కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

### సమాజంలో ఉపాధ్యాయుడికి ప్రత్యేక గుర్తింపు

ఉప్పలగుప్తం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇతర ఉద్యోగులకు భిన్నంగా ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎంపీటీసీలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి అన్నారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అరవ రామస్వామినాయుడు దంపతులను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం నూకల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కంకటాల రామం, జనసేన అధ్యక్షుడు గొలకోటి తాతాజీ, మంచెం బాబి పాల్గొన్నారు.

### విద్యార్థినులకు రక్షణగా శక్తి యాప్

అమలాపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఆపద సమయంలో రక్షణగా నిలిచేందుకు ప్రభుత్వం శక్తి యాప్‌ను తీసుకువచ్చిందని పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు వివరించారు. అమలాపురం బాలికల వసతిగృహంలో మంగళవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు ఎక్కడైనా ఆకతాయిల వేధింపులకు గురైనా, ఇతర సమస్యల్లో చిక్కుకున్నా శక్తియాప్‌ను వినియోగించుకుని రక్షణ పొందవచ్చునన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, జూలై1(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో న్యూఫీడర్ పనులు జరుగుతున్నందున ఈనెల 2న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈ కారణంగా బుధవారం ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, జగ్గరాజుపేట, గొల్లవిల్లి, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, చీకట్లపాలెం, సన్నవిల్లి, నూదాపాలెం, భట్టుపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విలసవిల్లి, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

### మోటారు వాహనదారుల సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురంటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మోటారు వాహనదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిపరిష్కారానికి కృషిచేస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. మోటారు వాహనాల ఫిట్‌నెస్‌కు ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకురావడంతో వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా రవాణా జేఏసీ ప్రతినిధుల బృందం మంగళవారం ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. రవాణా జేఏసీ జిల్లా నాయకులు వాసంశెట్టి సత్తిరాజు, బొంతు బాలరాజు, దేవరపల్లి శాంతికుమార్‌తో పాటు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

అంతర్వేది, జూలై 1(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి కొబ్బరి తోటలో పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు చాకచక్యంగా ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4500 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లకు స్టేషన్ కండిషన్ బెయిల్ మంజూరుచేసి విడుదల చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అంబాజీపేట, జూలై1(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల వెంకటసుబ్బారావు, వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పశువైద్య కేంద్రంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాడిపరిశ్రమపై రైతులు దృష్టి సారించాలన్నారు. పాడి సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మైలా ఆనందరావు, సత్యనారాయణ, చింతా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలని

## కళ్లకు గంతలుతో నిరసన

ముమ్మిడివరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరం నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం నల్ల రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు మొక్కవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారంతా నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నంబరు 36 ప్రకారం జీతాలు పెంచాలని, 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన ప్రతీ కార్మికుడిని పర్మినెంట్ చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్ చేశారు. శుక్రవారం జరప తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం అనంతరం పూర్తిస్థాయి సమ్మెకు వెళతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, వైవీ రమణ, జి.రమేష్, కె.గోవిందరాజు, వి.ప్రసాద్, కె.వెంకటశివ, కె.శరత్, జి.ప్రదీప్, జి.వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.రవీంద్ర, ఎన్.అరుణ, ఎన్.బొజ్జమ్మపాటు పలువురు పాల్గొన్నారు.

### మహిళల సంరక్షణకు వ్యూహాత్మక చర్యలు

ఉప్పలగుప్తం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల సంరక్షణకు పోలీసుశాఖ వ్యూహాత్మక చర్యలు చేపట్టినట్టు అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ అన్నారు. గొల్లవిల్లి సీఎస్ఎం కళాశాలలో మంగళవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మహిళా సంరక్షణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వివిధ మార్గాల్లో యువతులు వంచనకు గురవుతున్న తీరును ఆయన వివరించారు. శక్తి యాప్‌పై విద్యార్థినులను ఆరా తీశారు. ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ రాజేష్, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యుల సేవలు ప్రశంసనీయం

● ఘనంగా వైద్యుల దినోత్సవం

బండారులంకలో పీహెచ్‌సీ వైద్యులను సన్మానిస్తున్న శంకరమూర్తి, వైద్యుడు పప్పుశర్మను సన్మానిస్తున్న దృశ్యం

అమలాపురంరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి పేర్కొన్నారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గౌతమ్, డాక్టర్ అమృతి, డాక్టర్ అన్నామణిలు గ్రామపెద్దల సమక్షంలో ఘనంగా సత్కరించారు. వక్తలు వైద్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీ హెచ్‌ఈవో ఎన్.రామారావు, ఎంపీహెఎస్ డి.ఆనందశేఖర్, పిచ్చిక శ్యామ్, మాడా మాధవి, యాళ్ల సుబ్బలక్ష్మి, కాశిన బాబి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జె.శివకుమార్, కార్యదర్శి డాక్టర్ వైటీ నాయుడు, డాక్టర్ పీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు. పేరూరులో లయన్స్ క్లబ్‌కు నూతనంగా అధ్యక్షుడైన నూదా గణపతి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్‌కు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్స్ డే, చార్టర్ అకౌంటెంట్స్ డేను పురస్కరించుకుని డాక్టర్ పీఎస్ శర్మ, డాక్టర్ రుద్రరాజు శిల్ప, చార్టడ్ అక్కౌంటెంట్స్ మంథా సత్యనారాయణ, గోకవరపు వరప్రసాద్, జి.కామేశ్వరరావులను సత్కరించారు. పూర్వపు అధ్యక్షుడు రవణం వేణుగోపాల్ రీజియన్ చైర్‌పర్సన్ బూరగాయల శివరామకృష్ణ, కార్యదర్శి బెహరా హనుమంతరావు, కోశాధికారి గుత్తుల నాగేశ్వరరావు, జంపన సుమన్‌వర్మ, సుగ్గు గోపి, పట్నాల రమణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని హోమియో వైద్యుడు డాక్టర్ బీఎస్ మోహన్‌ను యర్రమల్లి సత్యనారాయణమూర్తి, గోటేటి గంగాధర రావు, కుడుపూడి త్రినాథ్, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరుల ఆధ్వర్యంలో దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

### వైద్యులకు సత్కారం

అమలాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అమలాపురం వశిష్ట క్లబ్ అధ్యక్షురాలు బూరగాయల గాయత్రీ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సీనియర్ వైద్యుడు పప్పు శర్మను వశిష్ట క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌కు చెందిన బూరగాయల శివరామకృష్ణ, వశిష్టక్లబ్‌కు చెందిన కూచిమంచి సంధ్యారాణి, పద్మప్రసాద్, అనంతలక్ష్మి, చిక్కాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్స్ డేను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాకిరెడ్డి పూర్ణిమ, అనంతలక్ష్మితో పాటు లయన్స్‌క్లబ్, వశిష్ట క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**అమలాపురం టౌన్:** అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత ఏబీ నాయుడు, కరస్పాండెంట్ ఎ.శ్యామలామహలక్ష్మి, ప్రిన్సిపాల్ టి.నాగమాధవి ఆధ్వర్యంలో తొలుత డాక్టర్ రాయ్ జయంతి వివరాలను విద్యార్థులకు వివరించి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వైద్యుల వేషధారణలతో చిన్నారుల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ గంధం రాము, డాక్టర్ నిమ్మకాయల రామమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోకరకొండ నాగేంద్ర, గోటేటి గంగాధరరావు, నూకల సత్యనారాయణ, పేరి లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక ఆరోగ్య కేంద్రంలో..

**ముమ్మిడివరం:** ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్య సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయిశృతి మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవల కింద ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ సర్జరీ, గైనకాలజీ, పిరియాట్రిక్, అనస్థీషియా సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులు కూడా అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, పాయసం చిన్నీ, యాళ్ల ఉదయ్, గొల్లపల్లి గోపి, పిల్లి నాగరాజు, శివ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**మలికిపురం:** అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నూతనంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న గెడ్డం ఫిలిప్‌రాజు పలువురు డాక్టర్లను ఈ సందర్భంగా మంగళవారం దుశ్శాలువాలతో సన్మానించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్.రవి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ ఓగూరి అలేఖ్య, డాక్టర్ నిమ్మి లతాపాల్ తదితరులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గుబ్బల బాబ్జి, గెడ్డం తులసీభాస్కర్, నల్లి శివ, కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

## డెంగీ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ముమ్మిడివరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): డెంగీ మాసోత్సవాల్లో భాగంగా కొత్తలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ ముకుంద ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ డెంగీ జ్వర లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ర్యాలీలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది పీహెచ్ఎన్ విమలకుమారి, హెచ్‌వీ శాంతకుమారి, వనిత, పి.సుశీల, ఎన్.శ్రీనివాసరావు, నార్ని శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

### డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు: డెంగీవ్యాధిపై ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగరం, పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్‌లెవీ సూచించారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా నగరం పీహెచ్‌సీ వద్ద మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో సత్యవతి, సూపర్‌వైజర్ నరసింహారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### డెంగీ మాసోత్సవ ర్యాలీ

**అంబాజీపేట:** ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీలలో వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, సుమప్రియ ఆధ్వర్యంలో డెంగ్యూ మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. డెంగీ నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు చూసుకోవాలన్నారు. స్థానిక పీహెచ్‌సీల వద్ద ర్యాలీలు చేపట్టారు.

### నెలాఖరు వరకు సెక్షన్ 30 అమలు

అమలాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 31వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అమలాపురం టౌన్, అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు సెక్షన్ 30 అమలు వర్తిస్తుందన్నారు.

### దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

అమలాపురంటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు దోమల బెడద నివారించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్రశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. టిడ్కో గృహ సముదాయంలో కనీస సౌకర్యాలు లేక ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రంలో వివరించారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నిర్మల్‌కుమార్‌ను జిల్లాశాఖ ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పితాని బేబిరావు, సాధనాల రామకృష్ణ, గానుగుల సత్యనారాయణ, కేతా సోమేశ్వరరావు, యాలంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కుసుమ

పి.గన్నవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జిగా కుసుమ వెంకటేశ్వరావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర బహుజన్ సమాజ్‌పార్టీ అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ నుంచి ఉత్తర్వులు అందినట్లు వెంకటేశ్వరావు తెలిపారు. నియోకవర్గ కమిటీ, సెక్టార్, బూత్ కమిటీల నిర్మాణానికి సంబంధించి పూర్తి బాధ్యతలు నిర్వర్తించాలని పార్టీ అదిష్టానం ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఇంచార్జ్ వెంకటేశ్వరావుకు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తాడి రాంబాబు, ప్రధాన కార్యదర్శి ములపర్తి చందు, కన్వీనర్ దాకే సాగర్‌లు శుభాకాంక్షలు తెలిపారు.


**ప్రకటన**



కీ॥శే॥ జక్కంపూడి సత్యనారాయణ

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం అరవపాలెం గ్రామ నివాసి అయిన కొప్పినీడి మంగ కుమారి W/o సాయి రంగారావు అను నేను యావన్మందికి తెలియజేయునది. నా తండ్రి గారు మలికిపురం మండలం, గుడిమెళ్లంక గ్రామ కాపురస్తులైన జక్కంపూడి సత్యనారాయణ S/o నరసింహమూర్తి గారు ది.17.06.2024వ తేదీన ఇంటి దగ్గర మరణించారు. వీరి మరణం గుడిమెళ్లంక గ్రామ పంచాయితీలో నమోదు కాబడలేదు. ఎవరికైన ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల 10 రోజులలో తెలియజేయగలరు.

కొప్పినీడి మంగకుమారి ,W/o సాయిరంగారావు అరవపాలెం, సెల్: 7997128993

**ప్రకటన**



కీ॥శే॥ జక్కంపూడి మంగతాయారు

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం అరవపాలెం గ్రామ నివాసి అయిన కొప్పినీడి మంగ కుమారి W/o సాయి రంగారావు అను నేను యావన్మందికి తెలియజేయునది. నా తల్లి గారు మలికిపురం మండలం, గుడిమెళ్లంక గ్రామ కాపురస్తురాలైన జక్కంపూడి మంగతాయారు W/o సత్యనారాయణ గారు ది.03.06.2023 వ తేదీన ఇంటి దగ్గర మరణించారు. వీరి మరణం గుడిమెళ్లంక గ్రామ పంచాయితీలో నమోదు కాబడలేదు. ఎవరికైన ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల 10 రోజులలో తెలియజేయగలరు.

కొప్పినీడి మంగకుమారి ,W/o సాయిరంగారావు అరవపాలెం, సెల్: 7997128993

**ప్రకటన**



కీ॥శే॥ బోనం నాగమణి గారు

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామ కాపురస్తులు బోనం నరసింహారావు S/o సత్యనారాయణ (లేటు) గారు ఇచ్చిన ప్రకటన మా తల్లిగారైన బోనం నాగమణి W/o సత్యనారాయణ (లేటు) గారు మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో వారి ఇంటిలో ది.20-01-2023 సం॥లో మరణించారు. వీరి మరణం పంచాయితీ రికార్డుల్లో నమోదు చేయలేదు. ఏమైన అభ్యంతరాలు ఉన్న యెడల 10రోజులలో తెలియజేయగలరు.

బోనం నరసింహారావు డోర్ నెం.4-198, లక్కవరం సెల్: 9502244718

## జొన్నాడ ఇసుక ర్యాంపును పరిశీలించిన అధికారులు

ఆలమూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులను మంగళవారం మండల శాండ్ టాస్క్‌ఫోర్సు టీం పరిశీలించింది. ర్యాంపులో ఇసుక తవ్వకాలు అక్టోబరు 15వ తేదీ వరకు నిషేధం ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకుని ర్యాంపులో ఇసుక తవ్వకాలు చేయడం కుదరదని స్పష్టం చేశారు. ర్యాంపును పరిశీలించిన వారిలో తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.66 లక్షలు

ఆత్రేయపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4.66 లక్షలు వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

## లేబర్ కోర్సును వెంటనే రద్దు చేయాలి

ఆత్రేయపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే సమ్మెలో పాల్గొనాలని కొబ్బరి, ఒలుపు, భవన నిర్మాణ కార్మికులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్రేయపురం మండలం లొల్లలాకుల వద్ద సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక లేబర్ కోర్సును తీసుకువచ్చిందని తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుళ్ల పెద్దశ్రీను, కేతా రామకృష్ణ, పితాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలేయ మార్పిడికి సీఎం సహాయనిధి సాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం ఆర్యవటం గ్రామానికి చెందిన పితాని తారకేశ్వర ప్రసాద్‌కు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షలు విలువైన ఎల్‌వోసీని మంత్రి సుభాష్ అందచేశారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రి లో కాలేయ సంబంధిత వ్యాధితో బాధితుడు చికిత్స పొందుతున్నారు. మంత్రి చొరవతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరు చేస్తూ ఎల్‌వోసీ జారీ చేశారు. బాధిత కుటుంబీకులకు ఎల్‌వోసీని మంత్రి అందచేశారు.

ఎల్‌వోసీ అందచేస్తున్న మంత్రి సుభాష్

తొలి అడుగు కార్యక్రమంలో సంక్షేమం, అభివృద్ధి కరపత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే బండారు

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో కోనసీమ డెల్టా రైతాంగానికి ఉపయోగపడేలా లొల్లలాకుల అభివృద్ధి, పిచ్చుకలంక అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ఏడాదిన్నరలో పోలవరం పూర్తవుతుందన్నారు. ఇప్పటి ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లి 2029లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నుంచి జరిగే ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, పరిశీలకులు పలివెల ప్రకాష్, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ఆత్రేయపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ హైస్కూల్‌లో పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. విశ్రాంత హెచ్‌ఎం దివంగత చిలువూరి సుబ్బరాజు జ్ఞాపకార్థం కుమార్తె వడ్లమూడి శేషమణి ప్రతి ఏటా తండ్రి పుట్టినరోజు సందర్భంగా పదిలో ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తునారు. ఈ ఏడాది ప్రథమస్థానం సాధించిన సాధనాల అనిల్‌కుమార్, నడింపల్లి భానురామసత్య ప్రతాప్‌రాజు, మంగెన గోవర్ధన్, దుళ్ళ రేణుక శివదుర్గ మణిచంద్రికలకు స్కాలర్‌షిప్‌లను మాస్టారు మనువరాలు సాగిరాజు హర్షిత, సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్‌రాజు చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం మురళీకృష్ణ, పీఈటీ రవిరాజు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఉచిత రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వద్దిపర్రుకు చెందిన పల్లేటి రాజబాబు ఐఏఎస్ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. పల్లేటి ట్రస్టు ద్వారా తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు వివిధ సేవలు అందిస్తున్నారు. రాజబాబు ఐఏఎస్ అధికారిగా స్టేట్ హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్, పబ్లిక్ కమిషనర్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ శిబిరంలో 30 మంది యువకుల రక్తాన్ని అందించగా కాకినాడకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో దాన్ని అందించారు.

## జేఏసీ అధ్యక్షుడిగా ఇబ్రహీం ఎన్నిక

మండపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): ముస్లిం జేఏసీ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన సయ్యద్ ఇబ్రహీం ఎన్నికయ్యారని జమియా మసీదు అధ్యక్షులు ఎండీ ఆవుతార్‌రేహ్మాన్ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లో వున్న చిన్న మసీదులో జరిగిన కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఆయన్ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



### అన్నదాన ట్రస్టుకు విరాళం

ద్రాక్షారామ, జూలై 1(ఆంధ్రజ్యోతి): భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్టుకు ద్రాక్షారామకు చెందిన వేమూరి రామ్మూర్తి, వేమూరి శేషమ్మ దంపతులు, వారి కుమార్తె వేమూరి విజయలక్ష్మి రూ.1.05 లక్షల విరాళం అందచేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీకి విరాళం మొత్తం వారు అందచేశారు.

ఆత్రేయపురం పీహెచ్‌సీలో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం మండలం మాచవరం పీహెచ్‌సీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం మండలం అంగరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

## పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

• డెంగీ మాసోత్సవాల్లో వైద్యుల హితవు • డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ఆత్రేయపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను తరిమికొట్టవచ్చని వైద్యాధికారిణిలు సౌమ్య, హైమశ్రీలు అన్నారు. మంగళవారం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా దోమకాటు ఆరోగ్యానికి చేటు నినాదంతో ర్యాలీ జరిపారు. ప్రతి ఇంట్లో దోమతెరలు తప్పనిసరిగా వాడాలని కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, సూపర్ వైజర్ విజయభాను సిబ్బంది పాల్గొన్నారు.

### డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ఎం.మణికంఠ మాట్లాడుతూ జ్వరం, తలనొప్పి, కీళ్ల, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వద్ద నుంచి గ్రామంలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

**జాతీయ వైద్యుల దినోత్సవం:** మాచవరం పీహెచ్‌సీ వద్ద జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరిపారు. పీహెచ్‌సీ వైద్యుడు మణికంఠతో వైద్య ఆరోగ్య సిబ్బంది కేక్ కట్ చేయించి అభినందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, సీహెచ్‌వీ శివ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### డెంగీపై అవగాహన కల్పించాలి

#### మలేరియా జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

**కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి):** డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా అరికట్టవచ్చని మలేరియా జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అచ్యుతాపురం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈనెలలో చేపట్టే డెంగీ లక్షణాలు, నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగం గా వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీ లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయదీపిక, కరుణేంద్రకుమారి, ఎంపీహెచ్‌ఈవో గోపాలకృష్ణ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అంగర పీహెచ్‌సీలో డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, ఎంఈవో తాతారావు, ఎంపీహెచ్‌ఎస్ నానిబాబు, ఎంపీహెచ్‌ఏ వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ అధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా డెంగ్యూ వ్యాధిపై ఇంటింట ప్రచారం నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలుంటే తక్షణం వైద్యులను సంప్రదించాలని వారు సూచించారు. కార్యక్రమంలో పెదపళ్ల వైద్యాధికారి సాయికిషోర్‌తో పాలు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

మండపల్లిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

## సకాలంలో సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమ ఫలాలను సకాలంలో అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం వాడపాలెం, మండపల్లి గ్రామాల్లో పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ధరణాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాస్, చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఎంపీడీవో నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాక హైస్కూల్‌కు మైక్‌సెట్ బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

### పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

రాయవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక పడాల పెద్దరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం చార్జింగ్ మైక్‌సెట్‌ను బహూకరించారు. 2000-2005 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గుడిమెట్ల విజయభాస్కరరెడ్డి, వీరంశెట్టి సత్తిబాబు, పడాల శివ మణికంఠరెడ్డి తదితరులు చేతులమీదుగా హైస్కూల్ హెచ్‌ఎం రాంబాబుకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారాలు అందించడం అభినందనీయమని హెచ్‌ఎం అన్నారు.

### లబ్ధిదారుడికి ఆసుపత్రిలో పెన్షన్ అందచేత

రావులపాలెం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి సచివాలయ ఉద్యోగి అందచేశారు. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడుకు చెందిన చదలవాడ నాగేశ్వరరావు అనారోగ్యం కారణంగా రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న నరేంద్ర రాజమహేంద్రవరంలో ఆసుపత్రిలో లబ్ధిదారునికి పెన్షన్ అందచేశారు.

### జెడ్.మేడపాడు సహకార సంఘ అధ్యక్షుడిగా సలాది

మండపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి) జెడ్.మేడపాడు సహకార సంఘ తిసభ్య కమిటీ అధ్యక్షుడిగా ద్వారపూడికి చెందిన సలాది బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఆయనతోపాటు సభ్యులుగా నియమితులైన సంగిశెట్టి అమ్మన్న, బి.మదన మోహనరావులతోపాటు కూటమి నాయకులతో కలిసి మంగళవారం టీడీపీ పట్టణ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను కలిశారు. ఎమ్మెల్యేను సభ్యులు సత్కరించారు. తమకు పదవిని అందించిన ఎమ్మెల్యేకు దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మండల వైస్ ఎంపీపీ గజ్జారపు వెంకటరమణ, చింతా దొరబాబు, పల్ల వీరబాబు, గోణం పుల్లయ్య, సత్తి సత్యనారాయణ, బుల్లబ్బు, పల్లబాబు, డాక్టర్ నాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో డాక్టర్ ప్రవీణ్‌ను సత్కరిస్తున్న వాసంశెట్టి సత్యం, చంద్రశేఖర్

ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిని సత్కరిస్తున్న పీఎంపీలు

## ఆరోగ్యవంతమైన సమాజానికి వైద్యుల పాత్ర కీలకం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజానికి వైద్యుల పాత్ర కీలకమని కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ప్రవీణ్‌తో పాటు పలువురు వైద్యులను సత్కరించారు. కరోనా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వైద్యులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### వైద్యులకు సన్మానం

**ఆలమూరు, (ఆంధ్రజ్యోతి):** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆలమూరు సీహెచ్‌సీ, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యులను మండల పీఎంపీలు తోట వెంకటేశ్వరరావు, శర్మల అధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఆయా ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను సత్కరించినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఏటిగట్టు రోడ్డులో ఇసుక లారీలను తనిఖీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది. పక్క చిత్రంలో ఏటిగట్టు నుంచి గోదావరిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల సీజ్

కె.గంగవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసకపల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసినట్లు రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు వస్తున్న వదంతుల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌ల తనిఖీలు చేపట్టామని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం రెవెన్యూ, పోలీసు బృందాలు తనిఖీలు చేస్తుండగా మసకపల్లి పరిధిలో సర్వే నెంబరు 8లో ఏటిగట్టు సమీపంలో అక్రమంగా ఇసుక (గొండ్రుమట్టి)ని తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని సీజ్ చేసి భూగర్భ గనుల శాఖకు అప్పగించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ బృందాల్లో తహశీల్దార్ శ్రీరామ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, వీఆర్‌వోలు , పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## పూడిక తొలగింపుతో రైతుల్లో హర్షాతిరేకాలు

మండపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో గల రామచంద్రుడు డెడికెటెడ్ చానల్‌కు అనుబంధంగా వున్న గొల్లపుంత బ్రాంచి కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక వల్ల సాగునీరు అందక ఆయకట్టు రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇటీవల స్థానిక రైతుల ఫిర్యాదు మేరకు తాపేశ్వరం ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో సాగునీటి సంఘం నేతృత్వంలో పంటకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. కాల్వలో వ్యర్థాలు, గుర్రపుడెక్క తొలగించడంతో సాగునీరు సక్రమంగా అందుతుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొల్లపుంతకాలనీకి వెళ్లే పంటకాల్వను శుభ్రం చేస్తున్న దృశ్యం

## పీజీ సెట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, జూలై 1(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పీజీ సెట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ కనబరిచినట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.రమేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు 35 మంది ర్యాంకులు సాధించారన్నారు. వివిధ యూనివర్శిటీలలో ఆయా కోర్సులు చదివేందుకు వారికి అవకాశం లభించిందన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగంలో జి.చంటి ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్, అధ్యాపకులు బీపీఎన్ రెడ్డి, సుభాషిణి, సుమలత, రజని, వరప్రసాద్, సౌజన్య, దుర్గాదేవి, శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

#### డీఎస్పీ సుంకర మురళీమోహన్

కొత్తపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం నుంచి సెక్షన్ 30 అమలులో ఉంటుందని డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు జరపకూడదన్నారు. కొత్తపేట సబ్‌డివిజన్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

### సెక్షన్ 30 అమలులో ఉంది

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 1 నుంచి నెలాఖరు వరకు రామచంద్రపురం సబ్‌డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ రఘువీర్ తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, అంగర, రాయవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉంటుందన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు సమావేశాలు జరపకూడదన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు జరపడానికి ముందుగా రామచంద్రపురం డీఎస్పీ అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థి సంఘాల హామీతో రిలే నిరాహారదీక్ష విరమిస్తున్న శ్రీవాణి

### రిలే నిరాహారదీక్ష విరమించిన శ్రీవాణి

మండపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేశవరం గ్రామంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి 75 రోజులుగా చేస్తున్న నిరవధిక రిలే నిరాహార దీక్షను విద్యార్థి సంఘాల నాయకుల హామీతో మంగళవారం విరమించారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు సంఘాల నాయకులు సిద్ధు, జోసఫ్‌లు దీక్షా శిబిరానికి వెళ్లి శ్రీవాణితో ఆందోళన విరమింపచేశారు. ప్రభుత్వ ఆస్థిని కాపాడాలని 75 రోజుల నుంచి ఆమె దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యరీత్యా దీక్షను విరమించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆమె దీక్షను విరమించారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సాయిరాం, సుహాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

అంతర్వేది, జూలై 1(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి కొబ్బరితోటలో పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు చాకచక్యంగా ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4500 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లకు స్టేషన్ కండిషన్ బెయిల్ మంజూరు చేసి విడుదల చేసినట్టు ఎస్ఐ తెలిపారు.





# ప్రహసనం..!

## ఇరిగేషన్ కృష్ణా ఈస్టర్న్ కార్యాలయం తరలింపులో తీవ్ర జాప్యం

### గుడివాడలోని డీఈ కార్యాలయం వద్ద సిద్ధమైన ఈఈ కార్యాలయ భవనాలు

ఇరిగేషన్ శాఖలో కృష్ణా ఈస్టర్న్ కార్యాలయం బెజవాడ నుంచి గుడివాడ తరలింపు ప్రక్రియ ప్రహసనంగా నడుస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో చేసుకున్న తీర్మానం అమలుకు నోచుకోవడంలేదు. అప్పట్లో వసతులు లేవనే సాకుతో ఆగిపోయిన ఉద్యోగులు నేడు నూతన భవనాలు సిద్ధమైనా అడుగు ముందుకు వేయడంలేదు. విజయవాడను వదిలి వెళ్లేందుకు సిద్ధపడటంలేదు. దీంతో రైతులు, నీటి సంఘాలు దశాబ్ద కాలంగా కార్యాలయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

- విజయవాడ నుంచి రావడానికి ససేమిరా అంటున్న ఉద్యోగులు
- దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న రైతులు, నీటి సంఘాలు

కొత్తగా నిర్మించిన భవనం

(ఆంధ్రజ్యోతి, గుడివాడ): కృష్ణా తూర్పు విభాగం పరిధిలోని రైవస్ కాలువ పూర్తిగా గుడివాడ పరిసరాల గుండా వెళ్తోంది. పక్కనే ఉన్న గన్నవరం నియోజకవర్గం గుండా ఏలూరు కాలువ వెళ్తోంది. ఈ రెండు కాలువల పర్యవేక్షణ చేయాల్సిన కృష్ణా ఈస్టర్న్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం గుడివాడలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈఈ కార్యాలయం విజయవాడలో కొనసాగుతోంది. ఈ క్రమంలో గుడివాడ డీఈ కార్యాలయ పరిధిలో ఈఈ కార్యాలయం కార్యకలాపాల కోసం కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి నూతన భవనాలను నిర్మించారు. రైవస్, ఏలూరు కాలువల పరిధిలోని నీటి సంఘాలు, రైతులు గతంలో పలుమార్లు ఇరిగేషన్ ఎస్ఈ, అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును కలిసి కృష్ణా ఈస్టర్న్ కార్యాలయం గుడివాడలో ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు సమర్పించారు. వసతులు లేవనే సాకుతో కార్యాలయ తరలింపును అప్పట్లో ఉద్యోగులు అడ్డుకున్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో జలవనరులశాఖను పూర్తిగా వదిలేశారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో అడిగేవాళ్లు లేకపోవడంతో కార్యాలయ తరలింపు ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి సంఘాలు పునఃజీవం పోసుకున్నాయి. దీంతో గుడివాడకు కేఈ ఈఈ కార్యాలయ తరలింపు డిమాండ్ తిరిగి తెరపైకి వచ్చింది.

#### రైతులకు ఎంతో మేలు

కేఈ డివిజన్ కార్యాలయం గుడివాడకు తరలిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటివరకు రైతులు, రైతు సంఘాలు, నీటి సంఘాల సభ్యులు ఈఈతో పని ఉంటే విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. గుడివాడకు కార్యాలయాన్ని తరలిస్తే రైతులకు, నీటి సంఘాల సభ్యులకు డబ్బుతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. పనులు కూడా వేగంగా జరుగుతాయి.

#### ముందుకురాని ఉద్యోగులు

రాష్ట్ర విభజనకు ముందు నుంచే ఇరిగేషన్ ఈఈ కార్యాలయ ఉద్యోగులు విజయవాడలో పాతుకుపోవడంతో గుడివాడకు తరలివెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. దాదాపుగా 70 మంది వరకు ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా విజయవాడ, చుట్టూ పక్కల్లోనే నివాసముంటున్నారు. గుడివాడలో ఈఈ కార్యాలయానికి అవసరమైన భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడికి కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యోగులంతా గుడివాడకు రావాలి, లేదంటే రోజు విజయవాడ నుంచి గుడివాడకు సర్వీస్ చేయాలి. అందుకే కార్యాలయ తరలింపును అడ్డుకుంటున్నారని ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

#### రాష్ట్ర విభజన సమయంలో తీర్మానం

రాష్ట్ర విభజన సమయంలో ఇరిగేషన్ శాఖలో కృష్ణా ఈస్టర్న్ డివిజన్‌ను గుడివాడలో ఏర్పాటు చేయాలని తీర్మానించుకున్నారు. ఇది ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ అయిన రాష్ట్ర విభజన తర్వాత తప్పనిసరైంది. అప్పట్లో వసతులు లేవనే సాకుతో ఉద్యోగులు కార్యాలయ తరలింపును అడ్డుకున్నారు. నేడు పూర్తిస్థాయిలో భవనాలు సిద్ధంగా ఉన్నాయి.

# చీకట్లో చకచకా!

## జక్కంపూడి వడ్లకొండపై గ్రావెల్ మాఫియా కన్ను

- రాత్రి వేళ యథేచ్ఛగా తవ్వకాలు
- లారీల్లో భారీగా గ్రావెల్ తరలింపు
- అడ్డుకున్న స్థానికులు.. లెక్కచేయని అక్రమార్కులు
- జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

జక్కంపూడి వడ్లకొండ వద్ద తవ్వకాలు

జక్కంపూడిలో మళ్లీ అక్రమ తవ్వకాలు ఆరంభమయ్యాయి. వడ్లకొండను రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తవ్వుకున్న మాఫియానే మళ్లీ రంగంలోకి దిగి లారీల్లో భారీగా గ్రావెల్‌ను తరలించుకుపోతోంది. స్థానికులు అడ్డుకున్న లెక్కచేయకుండా ముందుకు సాగుతోంది. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని సర్వే నెంబర్ 88లో వడ్లకొండ ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వడ్లకొండను అక్రమార్కులు మిగతా 6లో..

# జ్యోతిషం చూసి పెట్టుబడి

ఏజెంట్ల ద్వారా వచ్చిన డబ్బులను ఎందులో పెట్టుబడిగా పెట్టాలి? ఏ తిథులు కలిసి వస్తాయి? ఏ ఘడియలు నోట్లకట్లను మన మెట్లు ఎక్కిస్తాయి? ఇలా జ్యోతిషం చెప్పించుకోవడానికి అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ప్రత్యేకంగా జ్యోతిషురాలిని నియమించుకున్నాడు. తిథులు, వర్జ్యాలు చూసి ఏ రంగంలో పెట్టుబడులు పెట్టాలి అని భవిష్యవాణిని వినిపించిన ఆమెకు కోట్లాది రూపాయలను చెల్లించినట్టు తెలిసింది.

## అద్విక మోసంలో వెలుగులో మరో ఘట్టం

- జ్యోతిషం కోసం ప్రత్యేకంగా సలహాదారు
- ఓ మహిళను నియమించుకున్న ఆదిత్య
- జ్యోతిషం చెప్పినందుకు రూ.కోట్లలో చెల్లింపు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ ఎన్టీఆర్ కాలనీ ఈఎస్ఐ రోడ్డులో అద్విక ట్రేడింగ్ కంపెనీని ఏర్పాటు చేసిన తర్వాత ఆదిత్య తన కార్యాలయంలో మహిళా సిబ్బందిని దండిగానే నియమించుకున్నాడు. ట్రేడింగ్‌కు సంబంధించిన సలహాల కోసం లబ్బీపేటకు చెందిన కీర్తిని సలహాదారురాలిగా నియమించుకున్న విషయం తెలిసిందే. ఆమెకు నెలకు రూ.20లక్షల వరకు జీతం ఇచ్చాడు. ఆదిత్యకు సెంటిమెంట్ చాలా ఎక్కువ. ఏ పని ప్రారంభించినా బలమైన మంచి ఘడియలను చూసుకుంటాడు. ఏజెంట్లు, ఖాతాదారులు పెరిగే సరికి ఆదిత్య బాగా బిజీ అయిపోయాడు. ఈ నేపథ్యంలో ఖాతాదారుల ద్వారా వచ్చిన డబ్బులను ఏ సమయంలో, ఏ తిథిలో మరో రంగంలో పెట్టాలో ఎప్పటికప్పుడు తెలియజేయడానికి ఒక మహిళా జ్యోతిషరాలిని ప్రత్యేకంగా నియమించుకున్నాడు.

**సొంతంగా చెప్తే కలిసిరాదని...**

అద్విక కార్యాలయంలో సిబ్బంది వివరాలు, వారికి చేసిన చెల్లింపుల గురించి పోలీసులు ఆరా తీస్తున్న సమయంలో జ్యోతిష్కరాలి జాతకం బయటపడింది. అద్విక కార్యాలయం ప్రారంభం నుంచి ఆమె ఇక్కడ పనిచేసినట్టు గుర్తించారు. చివరికి ఖాతాదారులకు, ఏజెంట్లకు చెల్లింపులను బకాయి పెట్టిన ఆదిత్య ఆమెకు మాత్రం నోట్ల కట్టలను చేతిలో పెట్టాడు. పోలీసులు ప్రశ్నించినప్పుడు ఆమె చెప్పిన సమాధానాలకు షాక్ తిన్నారు. స్టాక్ మార్కెట్లో షేర్ల కొనుగోలు, అమ్మకాలు, ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆమె ముహూర్తాలను నిర్ణయించేది. ఆదిత్య జాతక చక్రాన్ని దగ్గర పెట్టుకుని ఈ ముహూర్తాలు నిర్ణయించింది. ఆమెకు నెలకు లక్షల్లోనే జీతం ఇచ్చినట్టు తెలిసింది. ఇలా ఆమెకు రూ.2-3 కోట్ల వరకు చెల్లించినట్టు సమాచారం. ఇంత మొత్తంలో వేతనం తీసుకోవడం కంటే సొంతంగా జ్యోతిష్యం చెప్తే ఇంకా ఎక్కువ సంపాదించవచ్చు కదా అని పోలీసులు ప్రశ్నించారు. ఎదుటి వారి నుంచి డబ్బులు తీసుకుని జ్యోతిషం చెప్పకూడదని ఒట్టు పెట్టుకున్నట్టు పోలీసులకు వివరించింది. నెలనెల జీతం తీసుకుని మాత్రమే జ్యోతిషం చెప్పాలని నిర్ణయించుకున్నట్టు స్పష్టం చేసింది. ఈ సమాధానంతో పోలీసులకు ఏం చేయాలో తోచలేదు.

# అయోమయం!

## 2020లో గ్రీన్ అంబాసిడర్‌ల నియామకం

### ఒక్కో పారిశుధ్య కార్మికుడికి జీతంగా రూ.10 వేలు నిర్ణయం

- 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు ఇవ్వాలని పంచాయతీలకు ఆదేశాలు
- ట్రెజరీకి ఆదేశాలు పంపకపోవడంతో అమలుకు నోచుకోని ప్రక్రియ
- రూ.6 వేలే ఇస్తామన్న పంచాయతీలు
- ముందుకురాని గ్రీన్ అంబాసిడర్‌లు
- ట్రెజరీకి ఆదేశాలు పంపాలని కోరుతున్న గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు

మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరిచేందుకు 2020లో స్వచ్ఛభారత్ మిషన్ నిధులు వినియోగించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందికి ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. పురపాలక సంఘాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.18 వేల జీతం ఇస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్‌లకు నెలకు కనీసంగా రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పంచాయతీలకు వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వినియోగించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ పనిని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని మిగతా 6లో..

#### నెలకు రూ.6 వేలు జీతం

జిల్లాలో 479 పంచాయతీలు ఉండగా, గతంలో రెండు వేల మంది గ్రీన్ అంబాసిడర్లు పనిచేసేవారు. నెలకు రూ.పది వేల జీతానికి నియమితులైన వీరికి ట్రెజరీ ద్వారా జీతం బిల్లులు ఇవ్వవపోవడంతో వీరి జీతంలో పంచాయతీ పాలకవర్గాలు కోత పెట్టాయి. నెలకు రూ.6 వేలు మాత్రమే ఇస్తామని చెప్పాయి. ఆ జీతానికి తాము పనిచేయలేమని గ్రీన్ అంబాసిడర్‌లు తప్పుకున్నారు. దీంతో 2వేల మంది నుంచి ఆ సంఖ్య నేడు 1,178కి చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలు కొంతమేర ఆర్థికంగా పుంజుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేసేందుకు, స్థానికంగా ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వంపై ఆర్థికపరంగా భారం పడకుండా గ్రీన్‌అంబాసిడర్‌లకు నెలకు రూ.10వేల జీతాన్ని తామే చెల్లిస్తామని పంచాయతీ పాలవర్గాలు ముందుకు వచ్చాయి. పంచాయతీలకు వచ్చే 15వ ఆర్థికసంఘం నిధులు, జనరల్ ఫండ్స్ నుంచి గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాలి
● మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి పిలుపు 8

దుర్గమ్మకు ఆషాఢ సారె 6

గుర్విందపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

# తప్పుచేసి..!

## అభివృద్ధి పనుల్లో నిబంధనలు ఉల్లంఘించిన గుర్విందపల్లి సర్పంచ్

- బిల్లులు చేయలేనని చేతులెత్తేసిన పూర్వపు ఏఈ
- ఈ బురద నాకెందుకని తిరస్కరించిన ప్రస్తుత ఏఈ
- దీంతో పెట్రోల్ డ్రామాతో రక్తి కట్టించిన సర్పంచ్ ఉదయభాస్కర్
- మూడు నెలల్లో ఆత్మహత్య చేసుకుంటానని మరోసారి వెల్లడి

తను చేసిన తప్పులతో ఏఈలు బిల్లులు చేసేందుకు తిరస్కరించటంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పెట్రోల్‌తో ఆత్మహత్యకు ప్రయత్నించిన గుర్విందపల్లి సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ ఉదంతం సంచలనంగా మారింది. సొంత వైసీపీ ప్రభుత్వంలో చేసిన వర్కులకు బిల్లులు చేయించుకోలేని సర్పంచ్ తాజాగా బిల్లుల కోసం పెట్రోల్‌తో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగటంలో రాజకీయ కోణం ఉందని విమర్శలు వస్తున్నాయి. సర్పంచ్ చేసిన తప్పులు అతనికే శాపంగా మారాయని అధికారులు పేర్కొంటున్నారు.

టెక్నికల్ శాంక్షన్ లేకుండా పంచాయతీ నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్

ఉదయభాస్కర్, సర్పంచ్

తోట్లవల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గుర్విందపల్లి పంచాయతీ నూతన కార్యాలయానికి 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.13.50 లక్షలు ఉపాధి హామీ నిధులను కేటాయించింది. పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలు కలిపి మొత్తం రూ.15 లక్షల వ్యయం అంచనాతో 2017 నవంబరు 6న అప్పటి ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బాసంశెట్టి రాజశ్రీ పేరున వర్క్ ఆర్డర్ ఉండగా, ఐలూరుకు చెందిన కాంట్రాక్టర్ రాఘవరావు పంచాయితీ భవన నిర్మాణం పిల్లర్లు, ఆపై శ్లాబు వరకు నిర్మించారు. రూ.8 లక్షల వరకు అప్పటికి బిల్లులయినట్టు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణాన్ని చాలా కాలం అలాగే వదిలేసింది. భవనం అసంపూర్తిగా ఉండటంతో ప్రస్తుత సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ అభ్యర్థన మేరకు మండల పరిషత్ కార్యాలయం నుంచి రూ.2 లక్షల చొప్పున రెండు విడతలుగా రూ.4 లక్షలు ఇవ్వటంతో రాజు అనే కాంట్రాక్టర్ వర్కు పూర్తి చేశారు. దాంతో 2024 మార్చి 11వ తేదీన మిగతా 6లో..

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్ బాధ్యతల స్వీకరణ 8

నున్నలో తొలి ప్రైవేట్ ఏటీఎస్ కేంద్రం
● ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్నెస్ పరీక్షలన్నీ ఇక్కడే!
● వెహికల్ ఇన్‌స్పెక్టర్స్‌తో పని లేకుండానే ప్రైవేటు సిబ్బంది తనిఖీలు
● ట్రాక్, టెస్టింగ్ బ్లాక్, స్టోరేజ్ బ్లాక్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు

పేరుకుపోయిన బూడిద నిల్వలు

# చిత్తశుద్ధి ఏదీ?

- కృష్ణమ్మ చెంతనే ఉన్నా తప్పని నీటి కష్టాలు
- నిర్వహణ లోపం.. అధికారుల నిర్లక్ష్యం
- ఏటా మురిగిపోతున్న రూ. కోట్ల నిధులు
- ఫిల్టర్ బెడ్‌లోకి ఎన్టీటీపీఎస్ బూడిద అవశేషాలు
- పైపులైన్ లీకులతో భారీగా నీరు వృథా
- కార్మికులకు రెండు మాసాలుగా అందని వేతనాలు

**కృష్ణమ్మ చెంతనే ఉన్నా ఇక్కడి ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడంలేదు. ఓపక్క రాజధాని అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నా అమరావతికి అత్యంత చేరువలోని నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందడం లేదు. తాగునీటి శుద్ధిలో ఇక్కడి అధికారులకు చిత్త శుద్ధి కొరవడటంతో ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యానికి ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలయ్యే ప్రమాదం పొంచి ఉంది. కలుషిత బారినుంచి తాగునీటి శుద్ధికి నిధులు పుష్కలంగా ఉన్నా అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్ల అవి ఏటా మురిగిపోతున్నాయి.

ఎన్టీటీపీఎస్ బూడిద

దీంతో 104 ఆవాస ప్రాంతాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాల సరఫరా ప్రహసనంగా మారింది. కలుషిత నీటిని తాగలేక ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు.

## 104 గ్రామాలకు తప్పని నీటి కష్టాలు

ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసిన కృష్ణా జలాలు మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి మున్సిపాలిటీతో పాటు 104 గ్రామాల ప్రజలకు ప్రతి రోజు సరఫరా అవుతుంటాయి. ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్ నుంచి కృష్ణాజలాలను సమీపంలో ఉన్న ఫిల్టర్‌కు మళ్లించి అక్కడ శుద్ధి చేసి ప్రజలకు అందిస్తారు. అయితే ఇక్కడే పెద్ద లోపం జరుగుతుంది. ఎన్టీటీపీఎస్ నుంచి వస్తున్న బూడిద నీరు కూలింగ్ కెనాల్‌లో కలుస్తుంది. దాని దిగువ భాగం నుంచి ఫిల్టర్ బెడ్‌కు తాగునీటిని మళ్లిస్తున్నారు. ఈక్రమంలో తాగునీటిలో బూడిద చేరడంతో ఫిల్టర్ బెడ్స్ సైతం బూడిదతో నిండిపోతున్నాయి. దీంతో తాగునీటి శుద్ధి ప్రహసనంగా మారుతోంది. ఎంత శుద్ధి చేసినా తాగునీటిలో బూడిద అవశేషాలు మిగిలి ఉంటున్నాయి. ఈ క్రమంలో కృష్ణా జలాలు వాటి సహజసిద్ధ రుచినే కోల్పోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి శుద్ధి అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతున్నది. మరోపక్క పైపులైన్లకు లీకులు ఏర్పడి వాటిని సకాలంలో సరిచేకపోవడం వల్ల నీరు వృథాగా పోతోంది.

ఫిల్టర్ బెడ్

తాగునీటి శుద్ధి ప్లాంట్

నీటి పైప్‌లైన్లు

## ఏటా మురిగిపోతున్న రూ.2 కోట్ల నిధులు!

గ్రామీణ రక్షిత మంచినీటి పథకం సవ్యంగా అమలు చేసేందుకు ప్రతి ఏటా రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేస్తారు. వాటితో ఫిల్టర్‌బెడ్ మెయింటినెన్స్, పైపులైన్ మరమ్మతులు, ఇతర పనులు నిర్వహిస్తారు. అయితే అధికారులు పూర్తిస్థాయిలో నిధులను ఖర్చు చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో ఏటా రూ.2 కోట్ల వరకు మెయింటినెన్స్ నిధులు మురిగిపోతున్నాయి. 2023-24లో చేసిన పనులకు ఇప్పటి వరకు ఎస్టిమేట్స్ వేయలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

## కూలింగ్ కెనాల్ ఎగువ భాగం నుంచి నీరు తీసుకోవాలి

ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో ప్లాంట్ నుంచి వచ్చి బూడిద నీరు కలిసే దిగువ భాగం నుంచి కాకుండా ఫిల్టర్ బెడ్‌లోకి ఎగువ భాగం నుంచి నీరు తీసుకుంటే తాగునీటిలో బూడిద అవశేషాలు కలిసే అవకాశం ఉండదు. ఇందుకు కోట్ల రూపాయాలు ఖర్చవుతుంది. దీనిపై ఎన్టీటీపీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పైపులైన్ మార్చి కూలింగ్ కెనాల్‌లో బూడిద నీరు కలిసే దిగువ భాగం నుంచి కాకుండా ఎగువ భాగం నుంచి తాగునీరు ఫిల్టర్ బెడ్‌కు మళ్లించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్మికులకు అందని వేతనాలు

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పనిచేసే కార్మికులకు మూడు మాసాలుగా వేతనాలు అందడం లేదు. కాంట్రాక్టు సంస్థ కింద పనిచేసే కార్మికులకు సకాలంలో వేతనాలు అందక వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. కాంట్రాక్టర్‌కు కార్మిక యూనియన్ నోటీసులు ఇవ్వడం జరిగింది. కార్మికులు బంద్ పాటిస్తే 104 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదు.

జి.కొండూరులో వృథాగా పోతున్న నీరు

## వృథాగా పోతున్న నీరు

ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్ నుంచి మైలవరం నియోజకవర్గం వరకు వేసిన తాగునీటి పైపులైన్‌కు పలుచోట్ల లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. అయినా ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం గమనార్హం. జి.కొండూరు పులివాగు వంతెన పక్కన కొత్తూరు గొల్లగూడెం వెళ్లే రహదారి పక్కన పైప్‌లైన్‌ల లీకుతో గతేడాది నుంచి భారీగా నీరు వృథా అవుతోంది. ఇప్పటి వరకు దానిని సరిచేయించే నాథుడు లేదు.

## గొల్లపూడి ఈఎన్‌సీలో ఆలస్యం!

గ్రామీణ రక్షిత మంచి నీటి సరఫరా పథకం సవ్యంగా అమలు కాకపోవడానికి.. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందక పోవడానికి గొల్లపూడిలో ఉన్న ఈఎన్‌సీ కార్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తున్నది. చేసిన మెయింటినెన్స్ పనులకు సకాలంలో ఎస్టిమేట్స్ వేసి బిల్లులు చెల్లిస్తే అటు కాంట్రాక్టు సంస్థకు బిల్లులు అందడంతో పాటు కొత్త పనులు చేపట్టే వీలుంటుంది. ఇటు కార్మికులకు, సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించవచ్చు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లోపాన్ని సరిచేసి శుద్ధిచేసిన స్వచ్ఛమైన కృష్ణాజలాలను ప్రజలకు అందించాలని పలువురు కోరుతున్నారు.

## నిధులు మిగులుతాయ్..

ఏటా స్కీమ్ మెయింటినెన్స్‌కు రూ.4.5 కోట్లు జనాభా ప్రాతిపదికన నిధులు వస్తాయి. నీరు ఇచ్చే ప్రాతిపదికన ఖర్చులుంటాయి. ఈ క్రమంలో ఏటా రూ.2 కోట్లకు పైగా నిధులు ప్రభుత్వానికే మిగులుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారమే నిధులు ఇస్తున్నారు. అయితే ఈ 14 ఏళ్లలో కొండపల్లి మున్సిపాలిటీతో కలిసి మైలవరం నియోజకవర్గంలోని 104 ఆవాస ప్రాంతాల్లో జనాభా భారీగా పెరిగింది. ఒక మనిషికి సగటున 55 లీటర్లు మాత్రమే ఇస్తున్నారు. అత్యధిక గ్రామాల్లో ఫ్లోరైడ్, సాల్ట్ వాటరే ప్రజలు దిక్కవుతుంది. ఈ క్రమంలో మనిషికి సగటున 80 లీటర్ల వరకు కృష్ణా జలాలు అవసరం ఉంది. మెయింటినెన్స్‌కు వచ్చే నిధులు మిగిల్చి మురగబెట్టే బదులు నీటి విడుదల పెంచితే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

- ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ దయానంద్

అమ్మవారికి సారె సమర్పించిన మహిళా భక్తులు

## దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన భక్తబృందాలు

ఇంద్రకీలాద్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ చేసి మొక్కులు తీర్చుకోవడానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తబృందాలు తరలివచ్చాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో భక్త బృందాలు సారె సమర్పణ చేశాయి. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఈవో వీకే శీనానాయక్ అధికారులను ఆదేశించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం మహామండపం 6వ అంతస్తులో భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు. అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు.

### వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై ఉపాలయంలో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లీలా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారికి షష్ఠి తిథి జన్మతిథి రోజున విశేష అర్చనలు చేస్తారు. ఈ క్రమంలో కల్యాణోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. భక్తుల ఈతిబాధలు, గ్రహ బాధలు తొలగటానికి, వివాహాది శుభకార్యాల కోసం సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన మేలు చేకూరుస్తుందని చెబుతారు. మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం మేళ తాళాల మధ్య భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదికపై ఉంచి కల్యాణాన్ని జరిపించారు.

### వారాహి నవరాత్రుల ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జూన్ 26 నుంచి వారాహి గుప్తనవరాత్రుల పూజలు జరుగుతున్నాయి. అనుష్టానపరులు, దేవీ ఉపాసకులు ప్రత్యేకంగా పూజలను నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారిని పూజించటం ద్వారా పంటలు సమృద్ధిగా పండి రైతులు, భక్తులు సంతోషంగా వర్ధిల్లుతారని పండితులు చెబుతున్నారు. యాగశాలలో మంగళవారం ఉదయం అమ్మవారికి పంచవారాహి మంత్రములతో జప, హోమాలు శాస్త్రోక్తంగా ఏకాంతసేవలు నిర్వహించారు. 4న శుక్రవారం పూర్ణాహుతి, వారాహి నవరాత్రి ఉత్సవాల సమాప్తి జరుగుతుందని ఈవో శీనానాయక్ తెలిపారు.

మాధవ్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

### దుర్గమ్మను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రకీలాద్రి: ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పి.వి.ఎన్.మాధవ్ కుటుంబసమేతంగా మంగళవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మాధవ్‌కు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ ఉత్తమ్ చంద్ బండారీతోపాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పొట్టి శ్రీహరి, నాయకులు సీకూ సింగ్, తదితరులు ఉన్నారు.

## మంచిని ప్రచారం చేద్దాం : బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ప్రజలకు చేసిన మంచిని పార్టీశ్రేణులు ప్రచారం చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పోరంకి పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఎమెల్యే మాట్లాడారు. సుపరిపాలనలో తొలిఅడుగు సమిష్టిగా కష్టపడి పనిచేస్తేనే సాధ్యమైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తు.. అన్ని వ్యవస్థలను గాడిన పెడుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, లోకేష్‌లకు దక్కుతుందన్నారు.

ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులు

## వైద్య విద్యార్థుల అరెస్ట్

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యనభ్యసించి రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ చేసిన తమకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పర్మినెంట్ సర్టిఫికేట్ ఇవ్వకుండా తిప్పిస్తున్నారని వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఎదుట రెండురోజులగా నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యవిద్యార్థులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇంటర్న్‌షిప్ పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా సర్టిఫికేట్ ఇవ్వడానికి ఎందుకు విముఖత చూపుతున్నారో అర్థం కావడం లేదని వారు వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్‌కు తమ సమస్యను చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బాలికను గర్భవతిని చేసిన కేసులో..

## 20 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా

విజయవాడ లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలతో బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలో ఫిర్యాది కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఫిర్యాది భర్త అనారోగ్యంతో చనిపోవడంతో అప్పటి నుంచి ఆమె కుమారుడు, కూతురుతో కలిసి ఉంటోంది. ఆమె హోటల్‌లో పనిచేస్తుంటుంది. ఈ క్రమంలో సదరు బాలికకు నెలసరి రావడంలేదని ఆసుపత్రిలో చూపించగా బాలిక గర్భవతి అని వైద్యులు చెప్పడంతో బాలికను నిలదీయగా పదో తరగతి చదివే సమయంలో ఆటోడ్రైవర్ యడవల్లి కార్తీక్ పరిచయమై ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా లొంగదీసుకొన్నట్టు తల్లికి చెప్పింది. బాలిక తల్లి కార్తీక్‌ను పిలిచి అడుగ్గా బాబు పుట్టాక ఇంటిలో చెప్పి ఒప్పిస్తానంటూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్టు, బాబు పుట్టిన తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసినట్టు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడి గురించి విచారించగా అప్పటికే అతడికి పెళ్లి అయినట్టు తెలిసిందని, తన కూతురిని మోసం చేసి గర్భవతిని చేసిన నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బాలిక తల్లి ఇబ్రహీంపట్నం పోలీసులకు 2023 నవంబరులో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ వి.కృష్ణవేణి 11మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.

## కలెక్టర్ పేషీతో చెప్పిస్తావా?

- నేను నీ దగ్గరకు రాను.. నువ్వే రా.. ఇదే నీకు శిక్ష
- జీజీహెచ్‌లో రోగిపై ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ చిందులు
- డాక్టర్స్ డే రోజున వైద్యుడికి కొరవడిన సేవాభావం

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ డే నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులనుద్దేశించి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గొప్పగా వ్యాఖ్యలు చేశారు. డాక్టర్లు సేవాభావం, మానవత్వం కలిగి ఉండాలని హితబోధ చేశారు. డాక్టర్లు వైద్యో నారాయనో హరి అనే మాటకు మంచి పేరు తీసుకురావాలని పొగిడారు. అది జరిగిన కొంతసేపటికే జీజీహెచ్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పృథ్వీ అనే వ్యక్తి ఆసుపత్రిలో ఆర్థో విభాగంలో చికిత్స చేయించుకోవడానికి వచ్చాడు. అదే సమయంలో సదరు రోగి గురించి కలెక్టర్ పేషీ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ హెచ్‌వోడీకి ఫోన్‌చేసి రోగిపై కొద్దిగా కేర్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ అహం దెబ్బతిని "కలెక్టర్ పేషీతో చెప్పిస్తావా.. ఈరోజు నుంచి నీకు వైద్యం కావాలంటే ఫస్ట్‌ఫ్లోర్‌కు రా.. ఇదే నీకు శిక్ష" అంటూ చిందులు వేశారు. చేతికి రెండు చోట్ల రిబ్స్ విరిగి ఇబ్బందిపడుతున్న రోగిపై దయ లేకుండా ఆయన వ్యవరించారని అక్కడున్న రోగులు చెప్పుకుంటున్నారు. సదరు ఆర్థో హెచ్‌వోడీ బంధువు ఎన్టీఆర్ జిల్లాలో ఒక ఎమ్మెల్యే కావడం గమనార్హం. కలెక్టర్ నుంచి ఫోన్ వస్తేనే ఈ విధంగా స్పందిస్తే సామాన్య రోగుల పరిస్థితి ఏంటని అక్కడున్న వారు గుసగుసలాడుకుంటున్నారు.

## అయోమయం!

(5వ పేజీ తరువాయి)

కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. అయితే పంచాయతీలకు ఆదేశాలు జారీ చేసిన అప్పటి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాల బిల్లులు చేయాలని ట్రెజరీ విభాగానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల నుంచి గ్రీన్‌అంబాసిడర్‌లకు జీతాల బిల్లులు పంపితే స్పష్టమైన ఆదేశాలు లేవని ట్రెజరీ అధికారులు ఈ బిల్లులను వెనక్కు పంపారు. దీంతో గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు పంచాయతీల నుంచి విడుదల చేసేందుకు అడ్డంకులు ఏర్పడ్డాయి.

### వర్షాకాలం అత్యవసరం

వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడిచింది. నేటి నుంచి నవంబరు నెల వరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. వీటిలో ప్రాణాంతకమైక మలేరియా, డెంగీ వంటివి కూడా ఉన్నాయి. వ్యాధుల వ్యాప్తి నివారణ కోసం పంచాయతీల్లో పారిశుద్ధ పనులు చేపట్టేందుకు గ్రీన్ అంబాసిడర్‌లను పూర్తిస్థాయిలో నియమించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో చెత్తసంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి, చెత్త నుంచి సంపద తయారీని ప్రోత్సహిస్తోంది, చెత్త సంపద తయారీ కేంద్రాల్లోనూ గ్రీన్ అంబాసిడర్‌లే పనిచేయాల్సి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని గ్రీన్ అంబాసిడర్‌లకు పంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇచ్చేలా ట్రెజరీకి పంచాయతీరాజ్ విభాగం కమిషనర్ నుంచి లేఖ రాయాలని జిల్లాలోని పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు కోరుతున్నారు.

## చీకట్లో చకచకా!

(5వ పేజీ తరువాయి)

ఇష్టానుసారం తవ్వేశారు. కోట్లాది రూపాయల మట్టిని దర్జాగా తరలించుకుపోయారు. అప్పట్లో మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ వంటి అధికార వ్యవస్థలన్నీ అక్రమార్కులకు సహకరించటంతో.. హద్దూ, అదుపు లేకుండా తవ్వకాలు జరిగిపోయాయి. గతేడాది బుడమేరుకు వరదలు వచ్చిన సమయంలో వర్షాల కారణంగా వడ్లకొండలో కొంత భాగం గ్రావెల్ పెళ్లలు విరిగి పడ్డాయి. వీటిని కూడా రాత్రికి రాత్రి తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అక్రమ సంపాదనకు అవకాశం లేకపోవటంతో అక్రమార్కులు అదనుచూసి మళ్లీ ఇప్పుడు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. వడ్లకొండను లక్ష్యంగా చేసుకుని గ్రావెల్‌ను తన్నుకుపోతున్నారు. ఇప్పుడు కూడా మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ వంటి వ్యవస్థలను అడ్డుపెట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. రాత్రికి రాత్రి పెద్ద సంఖ్యలో పొక్లెయిన్లతో గ్రావెల్‌ను తవ్వి తరలించేస్తున్నారు. స్థానికులు అడ్డుకున్నా తగ్గేది లేదంటూ తవ్వేస్తున్నారు. దీంతో గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మైలవరం మండలం వెలగలేరు, జి.కొండూరు మండలం చేగిరెడ్డిపాడు రెవెన్యూ పరిధిలో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందాయి.

## తప్పుచేసి..!

(5వ పేజీ తరువాయి)

నాటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అక్కడి వరకు నిధుల చెలింపుల్లో ఎలాంటి సమస్య రాలేదు. తర్వాత పంచాయతీ భవనంలో మిగిలిన వర్కులు పూర్తి చేయాలని కోరటంతో మండల పరిషత్ నుంచి 2024 జూలైలో రూ.3 లక్షలు కేటాయించారు. ఈ మూడు లక్షలతో ఏయే పనులు చేయాలో పీఆర్ ఏఈతో అంచనా వేసి పంచాయతీలో తీర్మానం చేసి టెక్నికల్ ఆర్డర్ పొందాల్సి ఉంది. ఇవేమి చేయకుండా పనులు చేశాను, బిల్లుల చేయమని పూర్వపు పీఆర్ ఏఈ రాజులపాటి రాఘవరావుని సర్పంచ్ కోరటంతో టెక్నికల్ శాంక్షన్ లేకుండా చేసిన పనులను తానెలా గుర్తిస్తానని, బిల్లులు చేయలేనని తేల్చి చెప్పారు. ఇక్కడే తిరకాసు కనిపిస్తోంది. 2024 మార్చిలో పంచాయతీ భవనాన్ని అట్టహాసంగా ప్రారంభించాక జూలైలో మళ్లీ రూ.3 లక్షలతో ఇంజనీరింగ్ విభాగానికి తెలపకుండా పనులు చేయటంలోనే డొల్లతనం కనిపిస్తోంది. రాఘవరావు బదిలీ అయి కొత్తగా వచ్చిన పీఆర్ ఏఈ శరాబంధిరాజును ఆ రూ.3 లక్షలకు బిల్లులు చేయమంటే పాత ఏఈ చేయలేని బిల్లులను తానూ చేయలేనని తిరస్కరించారు.

### ఏకపక్షంగా పనులు చేసి.. బెదిరింపులు

ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద పంచాయతీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణం చేయాలని సర్పంచ్ ఉదయభాస్కర్ చెప్పటంతో ఏఈ శరాబంధిరాజు రూ.2.50 లక్షలకు ఎస్టిమేట్ వేశారు. దీనికి కూడా పంచాయతీ తీర్మానం, టెక్నికల్ శాంక్షన్ రాకుండానే ఏకపక్షంగా పనులు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. బస్‌షెల్టర్‌కు బిల్లులు చేయనని ఏఈ చెప్పారు. దీంతో సర్పంచ్ ఉదయభాస్కర్ బిల్లులకు పరిష్కార మార్గంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంచుకుని వెంట పెట్రోల్ బాటిల్ తెచ్చి బిల్లులు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని ఏఈ శరాబంధిరాజును బెదిరించి కలకలం సృష్టించారు. ఇందులో సర్పంచ్ ఉదయభాస్కర్ నిబంధనలను ఉల్లంఘించినట్టు స్పష్టం అవుతోంది. తన తప్పుని తానే బహిర్గతం చేసుకుని ఇప్పుడు బిల్లులు చేయించుకోలేని పరిస్థితిని కొనితెచ్చుకున్నాడని పలువురు నాయకులు అంటున్నారు.

### నన్ను బ్లాక్ మెయిల్ చేయటమే : ఏఈ

పీఆర్ ఏఈ శరాబంధిరాజును వివరణ కోరగా గుర్విందపల్లి సర్పంచ్ ఉదయభాస్కర్ పెట్రోల్ బాటిల్ తెచ్చి బిల్లుల కోసం తనను బ్లాక్ మెయిల్ చేయటమేనన్నారు. పంచాయతీకి రూ.3 లక్షలు ఖర్చు పెట్టి చేశానని చెబుతున్న వర్కులను తాను చూడలేదని, చూడని వాటికి బిల్లులను చేయలేనని చెప్పారు. బస్‌షెల్టర్‌కు ఎస్టిమేట్ వేసిస్తే టెక్నికల్ శాంక్షన్ తేకుండా నిర్మాణం పూర్తిచేశాక టెక్నికల్ శాంక్షన్ తెచ్చారని, నిర్మాణానికి ఏ మెటీరియల్ ఉపయోగించారో ఎలా అంచనా వేయగలమని ఏఈ తెలిపారు.

### 90 శాతం తప్పు నాదే

- ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, సర్పంచ్

సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ వ్యవహారంలో 90 శాతం తప్పు తనదేనన్నారు. అయితే తన సొంత డబ్బులు రూ.8 లక్షల వరకు ఖర్చు చేశానని, వాటికి రూ.4 లక్షల వరకు వడ్డీలు అయ్యాయని, ఈ అప్పులను భరించలేకున్నానని తెలిపారు. బాకీల వారు వచ్చి డబ్బులు అడుగుతుంటే అవమానం తట్టుకోలేకుండా ఉన్నానని, ఏఈ బిల్లులు చేయకుంటే మరణమే శరణ్యమని మరోసారి స్పష్టం చేశారు. మండల సమావేశంలోకి పెట్రోల్ తెవటం తప్పేనన్నారు.

హైదరాబాద్‌కు చేరుకొన్న హాజీలు

## ఆంధ్రప్రదేశ్ హాజీలకు ఘన స్వాగతం

- రెండు విమానాల్లో హైదరాబాద్‌కు చేరుకున్న 529 మంది

కృష్ణలంక, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 529 మంది హాజీలు రెండు ప్రత్యేక విమానాల్లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. మక్కా నుంచి నేరుగా హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న హాజీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, మైనార్టీ సలహాదారులు షరీఫ్, హజ్ కమిటీ ఈవో, మెంబర్ల అధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకొన్న హాజీలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీ, ఎన్ఎండీ ఫరూక్, ముస్తాక్ అహ్మద్‌లు శుభాభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరపున హాజీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలియజేశారు. హజ్ కమిటీ మెంబర్లు మహబూబ్ బాషా, బాబా ఫక్రుద్దీన్, మన్సూర్ అలీఖాన్, మిర్జా ఆబిద్ హుస్సేన్, ఆసిఫ్ వలి తదితరులున్నారు.

## ఇగ్నో రీజనల్ డైరెక్టర్‌గా సుమలత బాధ్యతల స్వీకారం

వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్‌గా కె.సుమలత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రీజనల్ డైరెక్టర్ డీఆర్ శర్మ సోమవారం పదవీ విరమణ చేశారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రానికి 2019 అక్టోబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు సుమలత రీజనల్ డైరెక్టర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాంతీయ కేంద్రం పరిధిలోని విద్యార్థులకు మెరుగైనసేవలు అందిస్తామని, దూరవిద్యను ఎక్కువ మందికి చేరువ చేయనున్నట్టు తెలిపారు. ప్రాంతీయ కేంద్రం పరిధిలో అధ్యయన కేంద్రాలు లేని జిల్లాల్లో నూతన అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పలు నూతన కోర్సులను ఆయా అధ్యయన కేంద్రాలలో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సుమలతకు డిప్యూటీ డైరెక్టర్లు ప్రసాద్ బాబు, శరత్‌చంద్ర, అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ మమత, డిప్యూటీ రిజిస్ట్రార్ బాలచందర్, ఇగ్నో సిబ్బంది అభినందనలు తెలిపారు.

## బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం అవివేకం

వన్‌టౌన్ : పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నం చేయడం అవివేకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్ జిల్లా డీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు గోదావరి వరదల సమయంలో, మామూలు సమయాల్లో సుమారు మూడు వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్న విషయం అందరికీ తెలిసిన విషయమన్నారు. గోదావరిలో వృథాగా పోతున్న వేల టీఎంసీలలో కేవలం 200 టీఎంసీలు శ్రీశైలం దిగువన ఉన్న బనకచర్లకు తరలిస్తే తద్వారా రాయలసీమ ప్రాంతం, పోలవరం నుంచి, బనకచర్ల వరకు దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని దూరదృష్టితో సీఎం చంద్రబాబు మానస పుత్రికగా భావించి ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేయటం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు వలన అనేక విధాలుగా లబ్ది చేకూరుతుందని ఆయన వివరించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుని కేవలం రాజకీయ కారణాలతో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు త్వరలోనే ప్రాజెక్టుకు అనుమతులు తెస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**బ్రాయిలర్ ధరలు**
అమరావతి (కి.లో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## నేర నియంత్రణకు పోలీసుల పల్లెనిద్ర

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడుతూ పోలీసులు ప్రజల మధ్య స్నేహభావం పెంచడమే పల్లెనిద్ర ముఖ్య ఉద్దేశమని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మల్లవల్లిలోని పీఏసీఎస్ ఆవరణలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్ర మం నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యు వత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు అక్కినేని ధర్మరాజు, షేక్ జాన్‌బాషా, కృష్ణాజీ, తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లెనిద్రలో భాగంగా మల్లవల్లి గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహిస్తున్న వీరవల్లి ఎస్సై శ్రీనివాస్

జక్కులనెక్కలంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. కానూరులో వెలగపూడి శంకరబాబు.. ముదునూరులో దండమూడి చౌదరి

# అర్హులందరికి పింఛన్లు

### ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. మండలంలోని జక్కుల నెక్కలంలో మంగళవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని పెంచడంతోపాటు, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంతకు ముందు రెండు నెలల పింఛన్ బ్యాలెన్స్‌ను కూడా కలిపి ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదన్నారు. బాపులపాడు మండలంలో 163, గన్నవరం మండలంలో 132, ఉంగుటూరు మండలంలో 113 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే పింఛన్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి. స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షుడు గూడవల్లి తులసి మోహన్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు జెర్రిపోతుల..., పార్టీ నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, తుల్లిమిల్లి సుబ్రహ్మణ్యం, కాటూరి అప్పారావు, వీర్ల రాంబాబు, పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం..**

**పెనమలూరు :** గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేస్తూ గాడి తప్పిన వ్యవస్థలను దారిలో పెట్టే పనిలో టీడీపీ కూటమి ప్రభుత్వం నిమగ్నమయిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. మంగళవారం పోరంకిలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ, జగన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లలో పింఛన్లు పంపిణీ పేరుతో సంవత్సరానికి 250చొప్పున పెంచి ప్రజలను మోసం చేసిందని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీ ఇచ్చిన ప్రకారం పింఛన్లను పెంచి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్ చక్రవర్తి పాల్గొన్నారు.

● కానూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు లబ్ధిదారులకు పింఛన్లు పంపి ణీ చేశారు. ఆయన వెంట రియాజ్, జోనేపూడి రవికిరణ్, రమేష్, జమాల తదితరులు ఉన్నారు.

సిద్దిక్‌నగర్‌లో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్

**కానూరు:** కానూరు సిద్దిక్‌నగర్ రేకుల మసీద్ వీధిలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన సనత్‌నగర్, సిద్దిక్‌నగర్, సుగాలికాలనీ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్, డ్రైనేజీని పరిశీలించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు

**ఉయ్యూరు :** మండల పరిధి గ్రామాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు లబ్ధిదారు లకు పంపిణీ చేశారు. ముదునూరులో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, పాలడుగు భాస్కర్ పింఛన్లు అందజేశారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం పింఛన్లు పెంచి అంద జేస్తుందని చౌదరి అన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు పామర్తి నాగరాజు, కోడె హరీశ్, తుమ్మల చర్ల హరీశ్, మహేశ్, రవితేజ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పింఛను అందజేస్తున్న టీడీపీ నేతలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** వృద్ధులకు, ఒంటరి మహిళల ఆత్మగౌరవాన్ని నిలిపేలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అండగా నిలుస్తున్నాయని యూనిట్ ఇన్‌చార్జి అక్కినేని రవికుమార్ అన్నారు. కొత్తపల్లిలో మంగళవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పా ల్గొన్నారు. అత్యవసర సమయంలో ఆర్థిక అవసరా లకు అండగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు నిలుస్తున్నా యన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు కోరం సుధీర్, కార్యదర్శి అలెగ్జాండర్ పాల్గొన్నారు.

**విజయవాడ రూరల్ :** విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండలం అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు అధికారులతో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

అంబాపురంలో పింఛను అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు

రేమల్లెలో పండ్ల తోటలను పరిశీలిస్తున్న కేంద్రం బృందం

## ఉపాధి పనుల పరిశీలన

**హనుమాన్‌జంక్షన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** బాపులపాడు మండలంలో రేమల్లె, మడిచర్ల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ బృందం మంగళవారం పరిశీలించింది. ఆ శాఖ డైరెక్టర్ రాజ్ ప్రియాసింగ్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు రేమల్లెలో సంగీతరావు వ్యవసాయ క్షేత్రంలో సాగుచేసిన పండ్ల తోటను, బంద్రీ చెరువు పూడిక తీతపనులు, పోలగాని శ్రీనివాసరావు గృహంలో నిర్మించిన పశువుల శాల, డిస్ట్రిబ్యూటరీ ఛానల్ పూడిక తీత పనులను పరిశీలించారు.అనంతరం మడిచర్లలో తెనాలి రంగమ్మ వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన పంటకుంట, బీటీ రోడ్డు, రజకుల చెరువు పూడిక తీసి బలప రిచిన కట్టను, పీఎంఏవై పథకం కింద నిర్మించిన ఇంటిని పరిశీలించారు. కార్యక్ర మంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్, డీఆర్‌డీఏ పీడీ హరహరినాథ్, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, పీఆ ర్‌ఏఈ జయరాజు, ఏపీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**సంస్మరణ సభ**

కీ॥శే॥ తవ్వా కనకదుర్గా వరలక్ష్మి గారు
జననం : 18-2-1946
మరణం : 22-6-2025

బెజవాడ రాజారావు హైస్కూలు సహవ్యవస్థాపకులుగా, SKPVV హిందూ హైస్కూలు గ్రేడ్ 1 తెలుగు పండిట్‌గా విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన మీ మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఇవే మా ఘన నివాళులు. మీరందించిన స్ఫూర్తి సదా మాకు అనుసరణీయం.

భర్త : బెజవాడ రాజారావు
Cell : 94402 80263, 89859 17897
కుమారుడు : శ్యామ్ ప్రకాష్
కోడలు : లక్ష్మీప్రసన్న
కుమార్తె : మధులత
అల్లుడు : జూలూరి శ్రీరామ శివప్రసాదరావు
మనుమళ్ళు, మనుమరాండ్రు

సంస్మరణ సభ : ది. 2-7-2025 బుధవారం ఉదయం11 గం.లకు బెజవాడ రాజారావు హైస్కూలు, అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ-12 నందు జరుగును.

**ప్రథమ వర్ధంతి**

జననం: 17-09-1932
మరణం: 13-07-2024

కీ.శే. శ్రీమతి పరుచూరి నీలకంఠేశ్వరమ్మ గారు
భర్త : కీ.శే. పరుచూరి బాలకృష్ణారావు గారు B.A, BL (Advocate)

ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను మాకు పంచి, మా ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, అందరి క్షేమాన్ని సర్వదా కాంక్షించే మీరు, దైవ సన్నిధికిచేరి నేటికి సంవత్సర కాలమైననూ మీ మధుర స్మృతులు మా మదిలో పదిలం.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, మీ దివ్య ఆశీస్సులు మాపై సదా ప్రసరించాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కుమారులు - కోడళ్ళు :
డా॥ పరుచూరి గంగాధరరావు - కీ.శే. యశోధర
పరుచూరి వెంకట నరసింహారావు - కవిత
కుమార్తెలు - అల్లుళ్ళు :
తుమ్మల శాంత కుమారి - బసవయ్య బాబు
తుమ్మల లక్ష్మీబాయి - వెంకట కృష్ణారావు
గుమ్మడి యశోధర - కీ.శే. గోపాల శివ రామ ప్రసాదు
కోనేరు మణి - వెంకట నారాయణ
పరుచూరి వేద మాతృదేవి
మనుమలు, మనుమరాండ్రు, ముదిమనుమలు, ముదిమనుమరాండ్రు

సంవత్సరీకము : ది. 02-07-2025 బుధవారం చిట్టూర్పు గ్రామంలోని మా స్వగృహము నందు జరుపబడును.

## యనమలకుదురులో వైద్యశిబిరం నేడు

**పెనమలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వ హించనున్నట్లు టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీని వాస్ తెలిపారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు స్థానికు లకు షుగర్, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు చేస్తారని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాహి చండీయజ్ఞం

## ఘనంగా వారాహి యజ్ఞం

**హనుమాన్‌జంక్షన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాడమాసం పురస్కరించుకొని మం గళవారం వారాహి చండీయజ్ఞం ఘనంగా నిర్వహిం చారు. దేవస్థానం ట్రస్టీలు కాకాని బాబు, తవ్వా పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో ఈవో శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో అర్చకులు చక్రావధానులు సీతారామా చార్యు లు యజ్ఞం నిర్వహించారు. అమ్మవారికి మహాసం కల్పం, పంచ గవ్యాలతో అభిషేకం, కుంకుమపూజ నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

## బీజేపీ నూతన అధ్యక్షుడిని అభినందించిన శ్రీమన్నారాయణ



**కానూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు, పెనమలూరు మండల సీనియర్ నేత వల్లూరి శ్రీమన్నారాయణ అభినందించారు. విజ యవాడలో మాధవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. రాష్ట్రంలో బీజేపీ మరింతగా అభివృద్ధి చెం దేందుకు మాధవ్ నాయకత్వం ఎంతగానో దోహ దపడుతుందని శ్రీమన్నారాయణ పేర్కొన్నారు.

## టీడీపీ కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్‌గా పులి శ్రీనివాసరావు

**కంకిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** మండల పరిధిలోని కంకిపాడు, ఉప్పలూరు క్లస్టర్లను ఏర్పాటు చేసి క్లస్టర్ కన్వీనర్లుగా దేవినేని రాజా, అన్నే ధన య్యలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నియమించారు. అయితే వీరికి మద్దతుగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కంకిపాడు కో కన్వీనర్‌గా పులి శ్రీనివాస రావు, ఉప్పలూరు కో కన్వీనర్‌గా రంజిత్‌లను నియ మించారు. అదే విధంగా కంకిపాడు మండలంలోని 20 గ్రామాలకు సంబంధించిన యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. బూత్ కమి టీల్లో పేర్లు రాని పలువురు నాయకులు పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్నారు. వారిని చల్లబరిచేందుకు పార్టీ అధిష్ఠానం నిమగ్నమైంది.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు.. గన్నవరంలో ఎంపీడీవో స్వర్ణలతకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

## లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి: సీఐటీయూ

**పెనమలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ నెల 9న జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఆటోనగర్‌లో కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సీఐటీ యూ జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు నరసింహ రావు, లక్ష్మీప్రసన్న, షేక్ కాసిం, మస్తానవలి తదితరులు పాల్గొన్నారు.

**గన్నవరం :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం కార్మి కులు, పారిశుధ్య కార్మికులు, ఈ నెల 9న సమ్మె చేస్తున్నట్లు అధికారులకు మం గళవారం వినతిపత్రాలు అందజేశారు. ఎంపీడీవో టి. స్వర్ణలత, ఎంఈవో కార్యా లయంలో సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘ నాయకులు గండికోట సమ్మక్క, మల్లంపల్లి లలిత కుమారి, సుందరమ్మ, రూతు కుమారి, వరలక్ష్మి, కరుణ, లూదియా, సునీత, శ్రీనివాస్‌రెడ్డి, తాతబ్బాయి పాల్గొన్నారు.

## కలువపాములలో సుపరిపాలనలో తొలిఅడుగు నేడు

**ఉయ్యూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేప డుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం ఉదయం కలవ పాములలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సిందిగా కోరారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**ఉయ్యూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** అనారోగ్యంతో ఉన్నవారికి వైద్యం చేసి ప్రాణాలు కాపాడే వైద్యులను దైవంతో సమానంగా భావిస్తారని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల ఛైర్మన్ మండవ జయదేవ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యులు స్ఫూర్తి, రోహిణి, సుచిత, మురళి, రాజేంద్రలను సత్కరించారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రావులపల్లి సుధాకర్, సంగం తిరుమలరావు, కుశాల్ ధీరజ్‌ను, జాన్ డేవిడ్ తదితరులను సత్కరించారు. నెల్లిరాంబాబు, కుటుంబరాజు, సత్యకిషోర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళా శాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినో త్సవం నిర్వహించి వైద్యులు షమీమ్, ధీరజ్‌లను ఘనంగా సత్కరించారు.

● జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు హోప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్న అభి వృద్ధి కమిటీ ఛైర్మన్ జయదేవ్, వైద్యులను ఘనంగా సన్మానించారు. చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

**హనుమాన్‌జంక్షన్ :** నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం పనిచేసే వైద్య వృత్తి మహోన్నత మైనదని వారధి ఫౌండేషన్ ట్రస్టీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి కిరణ్ ముప్పాళ్ల అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిరణ్ స్థానిక ప్రముఖ వైద్యులు నడిమింటి బలరామకృష్ణ, పూషడపు శ్రీకాంత్, గ్రామీణ వైద్యుడు వేమూరి వెంకటేశ్వరరావులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వేగిరెడ్డి బాలాజీ, నాని, బోయపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లను సత్కరిస్తున్న ఉయ్యూరు వాకర్స్

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

### తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

**కానూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి) :** నయా దం దా.. తాడిగడప మున్సిపాలిటీలో అక్రమ నిర్మా ణాలు అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనం.. ఈ ప్రాంతంలో తీవ్రచర్చనీయాంశమైంది. ఎవరినోట విన్నా నాయా దందా పేరుతో ఆంధ్రజ్యో తిలో వచ్చిన కథనమే వినిపిస్తోంది. దీనిపై తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ స్పందించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు గ్రామాలైన కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో అక్రమ భవన నిర్మాణాలపై సర్వే చేపిస్తామని తెలిపారు. ఈ నాలుగు గ్రామాల్లో నిర్మాణాలకు ఇచ్చిన అను మతులు, నిర్మాణ స్థితి తదితర అంశాలపై లోతుగా పరిశీలన చేస్తామన్నారు. అక్రమ భవన నిర్మాణాలకు తోడ్పాటు అందించిన తాడిగడప మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అపార్టుమెంట్‌లు, గ్రూప్‌హౌస్‌లు, గేటెడ్ కమ్యూనిటీలో గృహాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన అను మతులు ఉన్నాయో లేదో కూడా వినియోగదారులు క్షుణంగా పరిశీలించాలని కమిషనర్ షేక్ నజీర్ సూచించారు.

## ఆయుర్వేద ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై మెడికల్ ఆఫీసర్లు

**కానూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** కానూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు నియమితులయ్యారు. జగ్గయ్యపేట మండలం వేదాద్రి ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. విష్ణువర్ధన్ ప్రతి మంగళవారం, గురువారం, శనివారాల్లో కానూరు ఆస్పత్రిలో పని చేస్తారు. అదేవిధంగా బాపులపాడు మండలం కానుమోలు డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాహిని ప్రతి బుధ, శుక్రవారం కానూరులో డిప్యుటేషన్‌పై పనిచేస్తారు. కానూరు ఆయుర్వేద ఆస్పత్రిలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి డిప్యుటేషన్‌పై విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ఫ్యాకల్టీగా వెళ్లడంతో ఇక్కడ ఈ ఖాళీ ఏర్పడింది. కాగా మంగళవారం డాక్టర్ విష్ణువర్ధన్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు

## రథ్ ఫెస్ట్ రాష్ట్రసాయి పోటీల్లో శ్రీమ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల విజయకేతనం

**ఉయ్యూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** ఇస్కాన్ సంస్థ నిర్వహించే రథ యాత్రలో భాగంగా తెనాలిలో ఆదివారం జరిగిన రాథ్ ఫెస్ట్-2025 స్టేట్ లెవల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) మ్యూజిక్ ఇనుస్ట్రుమెంట్ (కీ బోర్డ్) పోటీల్లో ఉయ్యూ రుకు చెందిన శ్రీమ్యూజిక్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు విశేష ప్రతిభకనపరచి పలు బహుమతులు గెలుచుకున్నారు. ఇస్కాన్ సంస్థ ప్రతి సంవత్సరం నిర్వహించే రథ్ ఫెస్ట్ పోటీల్లో శ్రీ మ్యూజిక్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు రెండు సంవత్సరా లుగా బహుమతులు సాధిస్తున్నారని, ఈ సంవత్సరం పోటీల్లో మైథిలీ మిత్ర మూడు బహుమతులు సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిందని ఇనిస్టిట్యూట్ మాస్టర్ ధూళిపూడి శేషగిరిరావు తెలిపారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు

**ఉంగుటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** యూరియా, ఇతర రసాయన ఎరువులను రైతులకు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్ర యిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ స్పష్టం చేశారు. మండలంలోని ఇందుపల్లి పీఏసీఎస్ గోడౌనులో నిల్వ చేసిన యూరియా బస్తాలను ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావుతో కలిసి ఏవో పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. ప్రస్తుత అవసరాల మేరకు మండలంలోని అన్ని పీఏసీఎస్‌లలో యూరియా బస్తాలు నిల్వ వుంచామని పేర్కొన్నారు. ఎరువుల కొరత, సాగు విషయంలో సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని ఏవో సూచించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
© 99854 09240, 99854 11733, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
© సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

**GOLD FINANCE**
» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235544

**వధువు కావలెను**
» పద్మశాలి-47 సం.లు/Govt/1L/గుంటూరు, పద్మశాలి-38 సం.లు/బిజినెస్/1L/గుంటూరు, రజక-40 సం.లు/SWE/1.50/హైదరాబాద్ లేట్ వరులకు అందమైన వధువులు కావలెను. కుల పట్టింపు లేదు. వాట్సాప్: 76739 26517
AJB- 235601

**HOUSE FOR SALE**
» నున్న టీచర్స్ కాలనీలో 115 గ.లో 2 ఇళ్లు & 96 గ.లో 2 ఇళ్లు & 54 గ.లో ఇల్లు అమ్మకం. సంప్రదించండి: © 98669 35667 / 93929 47777
AJB- 698

**PLOT FOR SALE**
» ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ప్లాట్స్ 'తక్కువ' ధరలో నందిగామ దగ్గరలో, ఇళ్ల మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు & కంచికచర్ల దగ్గర ఔటర్ రింగ్ రోడ్‌కు, హైవేకి దగ్గరలో CRDA ప్లాట్స్. సెల్: 88018 03689
AJB - 142

» కంచికచర్ల - పేరకలపాడు, HYD హైవేకి & అమరావతి ORR కి దగ్గర, తారురోడ్డు ఫేస్‌తో, CRDA & పంచాయతీ ప్లాట్లు. సెల్ నెం. : 73372 04349
AJB - 143

**WANTED TEACHERS**
» TEACHERS (Ladies) with U.G or P.G Qualification and good English. And Teacher for Science in High School. COASTS HIGH SCHOOL, VJA-I. Cont: 81799 90508, 92913 98877
AJB - 235543

**WANTED**
» ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు సీనియర్ సిటిజెన్ లేదా గృహిణులు మరియు రిటైర్డ్ అయిన వారికి Fixed Income / PF / ESIC పెన్షన్ ఇన్కమ్ Opportunity కలదు. అర్హత : 10th ఆపైన. విజయవాడ పరిసర ప్రాంతం వారికే సంప్ర. సెల్ : 77023 96675
AJB -235373

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

# నున్నలో తొలి ప్రైవేట్ ఏటీఎస్ కేంద్రం

**ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలన్నీ ఇక్కడే !**

- వెహికల్ ఇన్‌స్పెక్టర్స్‌తో పని లేకుండానే ప్రైవేటు సిబ్బంది తనిఖీలు
- ట్రాక్, టెస్టింగ్ బ్లాక్, స్టోరేజ్ బ్లాక్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ రూరల్ మండలం నున్నలో రవాణా శాఖ పరిధిలో తొలి ప్రైవేటు వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ కేంద్రం ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, ప్రైవేటు సంస్థలు నిర్వహించే ఈ కేంద్రాలను ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ (ఏటీఎస్)గా పిలుస్తారు. ఇకపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఈ ఏటీఎస్ కేంద్రాల్లోనే జరుగుతాయి. గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఈ పరీక్షలు నిర్వహించగా, ఇప్పుడు ఏటీఎస్ అందుబాటులోకి రావడంతో ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యతను చేపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఫిట్‌నెస్ తనిఖీ సేవల కోసం కైజెన్ ఇన్స్పెక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ఏటీఎస్‌ను నున్నలో సువిశాల స్థలంలో ఏర్పాటు చేసింది. వాహనాల పరిశీలనకు వీలుగా ఒక ట్రాక్, రెండు వాహనాలకు ఏకకాలంలో పరీక్షలు నిర్వహించేందుకు రెండు బ్లాకులతో కూడిన స్టేషన్, వాహనాలు ఉంచేందుకు పొడవైన గోడౌన్ ఏర్పాటు చేశారు. పచ్చదనం మధ్య ఈ ఏటీఎస్

నున్నలో ఏర్పాటైన రవాణా వాహనాల ఫిట్నెస్ తనిఖీ కేంద్రం (ఏటీఎస్)

పనిచేస్తోంది. వాహన ఫిట్‌నెస్ కోసం వాహనదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్లాట్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే ఏటీఎస్‌కు వెళ్లమని నిర్దేశిస్తారు. అక్కడ ప్రైవేటు సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అయితే, ఏటీఎస్ వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో విజయవాడ, నందిగామ వంటి ఆర్టీవో కేంద్రాల్లో స్థానికంగా ఫిట్‌నెస్ పరీక్షలు జరిగేవి. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల వాహనదారులు నందిగామలో పరీక్షలు చేయించుకునేవారు. ఇప్పుడు వీరంతా నున్నలోని ఏటీఎస్‌కు రావాల్సి ఉంటుంది, ఇది మైలవరం, తిరువూరు వాహనదారులకు దూర ప్రయాణంగా మారింది. మైలవరం మండలంలోని జీ కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల వారికి ఈ ఇబ్బంది మరింత ఎక్కువ. ప్రతి నియోజకవర్గంలో ఒక ఏటీఎస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ప్రస్తుతానికి ఈ కేంద్రాల వల్ల పెద్దగా ఇబ్బందులు లేకపోయినా, ప్రైవేటు సంస్థ నిర్వహణలో ఉండటం వల్ల భవిష్యత్తులో అవకతవకలు, అధిక ఫీజుల దోపిడీకి అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## వీఆర్వోల సంఖ్య తగ్గకుండా నిర్ణయం తీసుకోండి

- మంత్రికి వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు వినతి

గాంధీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోల క్యాడర్ సంఖ్య తగ్గకుండా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర గ్రామ, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. ఈ మేరకు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతమున్న వీఆర్వోలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. అర్హులైన గ్రేడ్-1 వీర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వెంటనే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వీఆర్వోల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని రవీంద్రరాజు పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బీ సుగుణమ్మ, రాష్ట్ర నేతలు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీనారాయణ, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నేతలు వీ శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలించక

## గన్నవరంలో ఇండిగో ల్యాండింగ్

- అరగంట తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు..

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఇండిగో విమానం గన్నవరం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఇండిగో విమానం మంగళవారం సాయంత్రం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరగా వాతావరణం అనుకూలించకపోవడంతో గన్నవరంలో రాత్రి 9.20కి 214 మంది ప్రయాణికులతో వచ్చింది. ముగ్గురు ప్రయాణికులు ఇక్కడ దిగారు. మిగిలినవారితో హైదరాబాద్‌కు రాత్రి 9.50కు తిరిగి వెళ్లింది.

## స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి పిలుపు

పెనమలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో భాగంగా సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు అందరూ కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా పశ్చిమలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహిస్తూ మరణాల రేటును తగ్గించేలా అడుగులు వేస్తున్నామన్నారు. మానవ వనరులను అభివృద్ధి చేసి విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా సీఎం చంద్రబాబు విజన్ డాక్యుమెంటును రూపొందించారన్నారు. 2047 డాక్యుమెంటుకు అనుగుణంగా పనిచేసి పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. ఎంఎస్ బేగ్, స్పెషల్ ఆఫీసర్ ఏ రవీంద్రరావు, తహసీల్దారు ఇంతియాజ్ పాషా, మెడికల్ ఆఫీసర్ సుహాసిని, జోనల్ కమీషనర్ రమ్యకీర్తన, ఎంఈవో సోమశేఖర్, సీసీపీ రత్నకుమార్, షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ శాంతికిరణ్ పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాల్లో రాజీ ప్రసక్తే లేదు

- డీసీజీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రాణం అత్యంత విలువైనది. ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాల్సిందేనని, పరిశ్రమల భద్రతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదని, నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ (డీసీజీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని, ముఖ్యంగా కర్మాగారాలు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్య శాఖలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కర్మాగారాల

పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం శివకుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, కొండపల్లి పారిశ్రామిక సంఘం ప్రతినిధి ఎంఎస్ రామచంద్రరావు, డీపీవో పీ లావణ్యకుమారి, హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, వీటీపీఎస్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితరాల ద్వారా పొందిన రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు, సంపద సృష్టికి సద్వినియోగం చేసుకొని, ఆర్థిక వృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన వార్షిక రుణ-జీవనోపాధి ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక - జీవనోపాధులుపై సమావేశం జరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలు పొందే రుణాలపై పర్యవేక్షణ చేసి, ఆ రుణాలను కుటుంబాల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా చేయిపట్టి నడిపించాలని అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. రుణాలను ప్రణాళికాయుతంగా సద్వినియోగం చేసుకొంటూ సంపద సృష్టికి బాటలు వేసుకోవాలన్నారు. కుటుంబ సర్వే ఆధారంగా ఈ వార్షిక రుణ ప్రణాళికకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ముందుకెళ్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకు డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

### సెప్టెంబరు 30 వరకు ప్రత్యేక ప్రచారం

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లక్ష్యాలను చేరుకొనేందుకు వీలుగా జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం కే ప్రియాంక వివరించారు. పీఎంజేడీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవైలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, వివిధ బ్యాంకుల కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ లక్ష్మీశ

ఎ.కొండూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు, పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. మంగళవారం ఉదయం ఏ కొండూరు మండలంలోని కంభంపాడు గ్రామంలో పెన్షన్లు పంపిణీ, జలజీవన్ మిషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. పెద్దాయనా బాగున్నారా? పెన్షన్ సమాయానికి అందుతుందా? ఆరోగ్యం ఎలా ఉంది? ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అంటూ లబ్ధిదారులును ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,27,220 మంది పెన్షన్‌దారులకు రూ.99 కోట్ల 24లక్షల 72వేల 500లను సామాజిక పెన్షన్ల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు.

జలజీవన్ మిషన్ పనులపై వివరాలు తెలుసుకొంటున్న కలెక్టర్

### జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

ఎ.కొండూరు మండలంలోని జలజీవన్ మిషన్ పనులను కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు కొనసాగుతున్నాయ్యాని, కొన్నిచోట్ల జాతీయ రహదార్లు, ఇరిగేషన్ కాల్వలు, రైల్వే లైన్లు అడ్డుగా ఉండటంతో పనుల్లో ఆలస్యమైందని, గ్రామాల్లోని కొత్తగా నిర్మాణం చేస్తున్న వాటర్ ట్యాంక్ పనులు తుది దశకు చేరుకున్నట్టు తెలిపారు. మరో నెలా 15 రోజులో పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందజేస్తామన్నారు. తిరువూరు ఆర్‌డీవో కే మాధురి, ఏపీడీ నాంచారరావు, తహసీల్దార్ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజధాని కార్యకలాపాలపై కొనసాగిన సమావేశాలు

కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో వరుసగా రెండో రోజు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. బృంద సభ్యులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు జీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్ రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, యువత, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ వంటి అంశాల గురించి కూలంకషంగా వివరించారు. అలాగే రాజధాని నిర్మాణానికి నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాల గురించి, ల్యాండ్ మోనిటైజేషన్ గురించి వివరించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రపంచబ్యాంకు,

సీఆర్‌డీఏ అధికారులతో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందంలోని పలువురు సభ్యులు రాజధాని అమరావతిలోని ఏఐఎస్ అధికారుల నివాస సముదాయాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, ఎంఎల్‌ఏ, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, టిడ్కో నివాస సముదాయాలను సందర్శించారు. ఆయా భవనాల వద్ద, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్ద పురోగతిని అధికారులు బృందంలోని సభ్యులకు వివరించారు. అమరావతిలో నిర్మించిన వివిధ భవనాలు పర్యావరణ సహిత విధానాలతో నిర్మించామని, రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, ఆయా ప్రాజెక్టుల్లో పురోగతి గురించి సీఆర్‌డీఏ అధికారులు వారికి వివరించారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా

## సందీప్ మాథుర్ అదనపు బాధ్యతల స్వీకరణ

రైల్వేస్టేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా దక్షిణ కోస్తా రైల్వేలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందీప్ మాథుర్ బాధ్యతలు స్వీకరించారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో జనరల్ మేనేజర్‌గా ఆయన అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ సిగ్నలింగ్ ఇంజనీరింగ్‌లో 1988 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇంతకుముందు న్యూ సౌత్ కోస్ట్ విశాఖపట్నం హెడ్ క్వార్టర్స్ రైల్వే జోన్‌కు మేనేజర్‌గా నియామకమయ్యారు. సందీప్ మాథుర్ రైల్వే బోర్డులో సిగ్నలింగ్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ అనేక సాంకేతిక ఆధునీకరణ విధానాలను, సిగ్నలింగ్ వ్యవస్థలో ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ సిగ్నల్ టెలికం ఇంజనీర్‌గా అలహాబాద్ డివిజన్‌లో ఉద్యోగాన్ని ప్రారంభించారు. చాలా జోన్లలో కీలక బాధ్యతలను నిర్వహించారు. మలేషియాలో డబుల్ లైన్ ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచింది. సందీప్ మాథుర్ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఏజీఎం నీరజ్ అగర్వాల్, ఇతర విభాగాధిపతులు, సీనియర్ అధికారులతో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమావేశం నిర్వహించారు. 6 డివిజన్లకు చెందిన డీఆర్‌ఎంలు వీసీద్వారా పాల్గొన్నా రు. ట్రైన్ల నిర్వహణలో భద్రత (సేఫ్టీ)కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో ట్రాక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ట్రైన్ల రాకపోకలకు సమయాలు కచ్చితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సేఫ్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులలో ప్రామాణికాలు పాటించాలని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి క్రమంలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఐదేళ్లలో సాధించిన ప్రగతిని ఆయన అభినందించారు. సిబ్బంది అంకిత భావానికి ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ విభాగాధిపతుల కార్యాలయాలకు నిధులు

వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బందరు రోడ్డులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఏపీపీఎస్సీ ఇతర విభాగాధిపతుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల నిర్వహణకు రూ.1.18కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విభాగాధిపతుల కార్యాలయాలలో అత్యవసర మరమ్మతులు, సెక్యూరిటీని పెంచేందుకు నిధులు వెచ్చించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించటంతో తదుపరి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

# వెంటాడుతున్న పాపాలు

**తల్లికి వందనానికి శాపంగా మారిన వైసీపీ ప్రభుత్వ రీసర్వే**

- సెంటు భూమి లేకపోయినా.. 23.67 ఎకరాలున్నాయట!
- వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో వెలుగు చూసిన విచిత్రం
- గండేపల్లి గ్రామానికి చెందిన తల్లి అద్దంకి సరితకు షాక్
- పొలం ఉందని తల్లికి వందనం రాకపోవటంతో ఆందోళన
- జరిగిన తప్పును సరిదిద్దాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ

**వైసీపీ ప్రభుత్వ రీసర్వే పాపాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన తప్పు ఓ నిరుపేద కుటుంబానికి శాపంగా పరిణమించింది. సెంటు భూమి లేకపోయినా ఏకంగా 23.67 ఎకరాలున్నట్టుగా చూపించటంతో ఆ కుటుంబం సంక్షేమ పథకాలకు అర్హత లేకుండా పోయింది. తల్లికి వందనం సొమ్ములు అందకపోవటంతో ఆరా తీయగా పొలం విషయం వెలుగులోకి వచ్చింది. తమకు పొలం లేదు, జరిగిన తప్పును సరిదిద్దాలంటూ బాధిత కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.**

- ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన అద్దంకి మల్లికార్జునరావు, సరిత దంపతులు. వీరికి కాలనీ ఇల్లు తప్పితే ఎలాంటి ఆస్తిలేదు. ఇద్దరూ కూలీ పనులకు వెళుతుంటారు. పిల్లలను చదివించాలన్న కోరికతో కష్టపడుతున్నారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు అఖిల్ బీటెక్ రెండో సంవత్సరం, కుమార్తె కోకిల ఇంటర్ రెండో సంవత్సరం, చిన్నకుమార్తు ఏడుకొండలు పదో తరగతి చదువుతున్నారు. సుమారుగా 7 నెలల క్రితం పనికి వెళుతుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో సరిత ఎడమ చేయి విరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఆర్థిక సాయం అందుతుందన్న ఉద్దేశంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి, విరిగిన చోట చేతిలో ప్లేట్లు వేశారు. వైద్య సేవ మాత్రం అందలేదు. నానా తిప్పలు పడి రూ.40 వేలు చెల్లించారు. వేసవి సెలవుల అనంతరం గత నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం రోజునే ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులు అందించింది. కానీ సరిత ఇద్దరు పిల్లలకు రూ.26 వేలు రావల్సి ఉండగా, రూపాయి రాలేదు. గ్రామ సచివాలయానికి వెళ్లి అడగ్గా, తన పేరుతో 23.67 ఎకరాల మెట్ట భూమి ఉన్నట్టుగా చూపించటంతో సరిత అవాక్కైంది. పరిటాల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 2446లో 21.67 ఎకరాల మెట్ట భూమి సరిత ఆధార్ నెంబరు చూపిస్తోంది. సరితకు చేయి విరగటంతో కూలీ పనులు చేయలేకపోతోంది. భర్త మల్లికార్జునరావు ఒక్కడే నెట్టుకొస్తున్నాడు. పథకం సొమ్ములు రాకపోవటంతో సరిత వేదనకు అంతులేదు. పరిటాల, కంచికచర్ల వెళ్లి పలుసార్లు అధికారులను కలిసి విన్నవించింది. తమ కుటుంబానికి సెంటు భూమి లేదు. జరిగిన తప్పును సరిదిద్ది తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నప్పటికీ చూద్దాం చేద్దామంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్పితే కనికరించటం లేదు. దీనిపై కంచికచర్ల తహసీల్దార్ నరసింహారావును వివరణ కోరగా పరిటాల రీసర్వేలో తప్పులు దొర్లాయని, తన దృష్టికి వచ్చిన వెంటనే ఐదారు సరిచేశామని, సరితకు కూడా త్వరలో న్యాయం చేస్తామన్నారు.


సరిత పేరుతో 23.67 ఎకరాలు చూపుతున్న ఎలిజిబులిటీ చెక్

## పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలి: జాహ్నవి

గంపలగూడెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న భారతీయ తొలి మహిళ, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి అన్నారు. కలెక్టర్ ఆదేశం మేరకు మంగళవారం గంపలగూడెంలోని పెదకొమెర కేజీబీవీని ఆమె సందర్శించారు. పాఠశాల బాలికలతో తన అనుభవాలను పంచుకున్నారు. బాలికల అనుమానాలను నివృత్తి చేశారు. ఎన్నో సవాళ్లతో కూడిన అంతరిక్షయానం చేసి భారత జాతీయ పతకాన్ని గగన వీధుల్లో ఎగుర వేసేందుకు అహర్నిశలు శ్రమిస్తానన్నారు. పట్టుదలతో చదివి అనుకున్నది సాధించాలన్నారు. అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధనా సంస్థ టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీ (టైస్), నాసా మాజీ వ్యోమగామి నాయకత్వం వహిస్తున్న ఈ మిషన్ కోసం నిర్వహించిన అనేక పరీక్షల్లో తా ను అర్హత సాధించినట్లు చెప్పారు. 2029 మార్చిలో చేపట్టనున్న తొలి అంతరిక్ష యాత్ర బృందంలో భారత్ నుంచి తనను ఎంపిక చేశారన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ జి.మహేశ్వరరావు, ఏమ్‌వో అశోక్, అసిస్టెంట్ ఏఎమ్‌వో శిరీష, డీసీడీవో విశ్వభారతి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఎమ్.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు, పాడి గేదె మృతి

విస్సన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేమిరెడ్డిపల్లి గ్రామంలో నడించెరువు సమీపంలో విద్యుదాఘాతానికి గురై పాడి రైతు వేగి శ్రీనివాసరావు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం తన గేదెను మేపే క్రమంలో ఫెన్సింగ్ తీగెకు విద్యుత్ సరఫరా రావడంతో దాన్ని తాకిన గేదె షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. అది గమనించని రైతు శ్రీనివాసరావు గేదెను లేపే ప్రయత్నంలో దాన్ని తాకి షాక్ గురై మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పట్టణంలో మరొకరి మృతి

సోమవారం రాత్రి విద్యుత్‌షాక్‌కు గురై విస్సన్నపేట పట్టణానికి చెందిన మర్రిబోయిన మణికంఠ (36) అక్కడకక్కడే మృతి చెందాడు. ఇంటి ఆవరణలోని విద్యుత్ మోటార్‌కు మరమ్మతుల చేసేందుకు ప్రయత్నించగా షాక్ గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు. టీడీపీ, తాపీ వర్కర్స్ యూనియన్ నేతలు మణికంఠ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 96, 104, 115
చికెన్ విత్ స్కిన్ 184
చికెన్ స్కిన్‌లెస్ 194
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## సాగునీరు విడుదల

కూచిపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బార్లపూడి బ్రాంచ్ కాలువ ద్వారా బార్లపూడి నీటి సంఘ అధ్యక్షుడు తాతినేని పూర్ణచంద్రరావు సాగునీరు విడుదల చేశారు. ఈ నీటి విడుదల కారణంగా బార్లపూడి కాలువ పరిధిలోని పెను మత్స, బార్లపూడి, మువ్వ, మొవ్వపాలెం, నరసన్నపాలెం, పెదపూడి, కూచిపూడి తదితర గ్రామాల పరిధిలో సాగులోని పొలాలు వేసుకునేందుకు నారుమడులు పెంచుకునేందుకు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పూర్ణచంద్రరావు తెలిపారు.

సాగునీటిని విడుదల చేస్తున్న పూర్ణచంద్రరావు

శివరామ్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

### టీడీపీ తోట్లవల్లూరు అధ్యక్షుడిగా శివరామ్

తోట్లవల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ తోట్లవల్లూరు మండల అధ్యక్షుడిగా వీరమనేని శివరామ్‌ప్రసాద్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల టీడీపీ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం గరికపర్రు సాయి కల్యాణ మండపంలో నిర్వహించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె. వీరబాబు పర్యవేక్షణలో ఎన్నిక కార్యక్రమం జరిగింది. ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న శివరామ్‌ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవటంతో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన కనకపల్లి ఉప సర్పంచ్ వీరంకి పరశురామ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, సర్పంచ్ మూడే శివశంకర్, గిరిబాబు, తిమ్మారెడ్డి, చింతపల్లి వెంకటేశ్వరరావు, చొప్పరపు సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ, వంశీకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్, ఏవోలను సన్మానిస్తున్న నేతలు

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన తప్పనిసరి

గుడ్లవల్లేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ అన్నారు. ప్రపంచ వ్యవసాయదినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, మండల వ్యవసాయాధికారి సునీల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లు, కార్యదర్శి కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జోన్ చైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, యెనిగళ్ళ నాగేశ్వరరావు,చాపరాల గాంధీప్రసాద్, జంగం మోహనరావు,సూరపనేని పరంధామయ్య, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకటరావు, దేవిశెట్టి రామకృష్ణ, మల్లి, వీరబద్రరావు,వెంకటేశ్వరరావు, రంగబాబు, సాయి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పామర్రు అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పమిడిముక్కల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరకాలంలో పామర్రు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా నియోజకవర్గంలో రూ. 166.54 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేశామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. కూటమి ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకుని సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపనులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా గ్రామాలలో రూ. 35.80 కోట్లతో 492 సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణం, రూ. 15.83 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం, గుంతల పూడ్చివేత పనులు జరిగాయని వివరించారు. జిల్లా ఖనిజ అభివృద్ధి నిధులు రూ. 1.09 కోట్లతో సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యం, ఎంపీ నిధులు, రూ. 1.15 కోట్లతో కమ్యూనిటీ హాల్, రోడ్ల నిర్మాణం చేశామన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ నిధులు రూ. 19.51 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులు, వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగిందని వివ రించారు. పామర్రు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ. 6 కోట్లు, గ్రామీణ ప్రజలు వైద్యపరీక్షల కోసం పట్టణాలకు వెళ్లనవసరం లేకుండా తొట్లవల్లూరులో రూ. 50 లక్షలు, మొవ్వలో రూ. 50 లక్షలతో ల్యాబ్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, రూ. 18 కోట్లతో ఆర్‌డీఎస్ఎస్ స్కీము, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు పనులు జరిగినట్లు తెలిపారు. పామర్రు, మొవ్వలో రూ. 6 కోట్లతో ఎస్సీ హాస్టళ్ల నిర్మాణం, ప్రధానమంత్రి అవాస్ గ్రామీణ యోజన ద్వారా రూ. 4.32 కోట్లతో గ్రామానికి రూ. 18లక్షల చొప్పున 24 ఎస్సీ గ్రామాలు అభివృద్ధి పనులు చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 5.62 కోట్లతో వివిధ పనులు, పక్కాగృ హాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ. 5 కోట్లు చెల్లింపుల జరిగేలా చూశామని వివరించారు. 254 మంది లబ్ధిదారులకు ఆరోగ్య సేవల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి రూ. 1.8 కోట్లు అందజేసి వైద్యఖర్చులకు ఉపయోగడినట్టు తెలిపారు. ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా 2,574మంది లబ్ధిదారులకు గృహాల రిపేర్ల నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున సహాయం, రైతులకు రూ. 98లక్ష విలువ గల వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసామని తెలిపారు. కల్యాణ మండపాల నిర్మాణం, సీఎస్ఆర్ గ్రాంటు ద్వారా పెదముత్తేవి, యలమర్రు, కాజ గ్రామాలకు రూ. 3.25 కోట్లు వచ్చాయన్నారు. ఎస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీలకు ఆయా కార్పొరేషన్ల ద్వారా రూ. 4.5 కోట్లు వ్యక్తిగత రుణాలు మంజూరై వారి ఆర్థిక అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. తారు రోడ్ల నిర్మాణం, కాలువల నిర్వహణ, పనులతో పాటు ఐనంపూడిలో ఎంఎస్ఎంఈ పార్కు, ఇండస్ట్రియల్ హబ్, నిమ్మకూరులో బెల్ కంపెనీ నిర్మాణం, పామర్రులో ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రైవేట్ రంగంలో క్యామ్ ఆక్వా, ఉరుటూరు సమీపాన జీ ఆర్‌వీజీ ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీ ఏర్పాటు ద్వారా నియోజకవర్గ ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి జరిగిందని, పమిడిముక్కలలో పామాయిల్ మొక్కల నర్సరీ వచ్చిందన్నారు. కనుమూరు వద్ద క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుచేస్తున్నారని తద్వారా ని యోజక వర్గ ప్రజలతో పాటు పొరుగు నియోజకవర్గ ప్రజలకు క్యాన్సర్ వైద్యం అందుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు రాంబాబు

### అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ తీసుకువెళ్తాం

● అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని

గుడివాడ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభు త్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికి తీసుకువెళ్తామని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌చార్జులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనపై ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని యాప్‌లో నమోదు చేయాలన్నారు. 'మై టీడీపీ యాప్' ద్వారా చేసిన పనులు నాయకత్వానికి తెలపాలన్నారు. 2024 ఎన్నికల్లో 94శాతం సీట్లలో ప్రజలు గెలిపించారన్నారు. గత వైసీపీ దుష్ట పాలకుల అహంకారమే వారి ఓటమికి కారణమని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుర్తించాలన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో పరిస్థితులు అనుకూలించకపోయిన రాష్ట్రంలో సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతంగా వేశామన్నారు. ఈ సమావేశంలో పట్టణ, రూరల్, నందివాడ మండల అధ్యక్షుడు రాంబాబు, మురళీ, దానేటి సన్యాసిరావు, పట్టణ, గ్రామ కమిటీల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

# విద్యతో ఉన్నత భవిత సాధ్యం

● రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

గుడివాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధిలో బట్టు వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశసేవకు అంకితమవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. మంగళవారం స్థానిక ఐఎంఏ హాల్లో బట్టు వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2025పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బట్టు మనోరంజితం మెమోరియల్ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోన శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళ్లితే విజయాలు సొంతమవుతాయన్నారు. విద్యార్థి దశలో 09,10,11,12 తరగతుల విద్య కీలకమన్నారు. ఈ సమయంలోనే విద్యార్థులు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో విద్యాభ్యాసంలో ముందడుగు వేయాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.25వేలు, ఇద్దరు విద్యార్థులకు రూ.15వేలు, రూ.10వేలు, 17మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలుచొప్పున మొత్తం రూ.1.60లక్షలు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా కలెక్టర్ బట్టు అంబేడ్కర్, జిల్లా న్యాయమూర్తి గోపి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, ట్రస్టు చైర్మన్ బట్టు పద్మకుమారి, సభ్యులు బట్టు ప్రసన్నకుమారి, బట్టు ప్రశాంతి, బట్టు విజయలక్ష్మీ, గంటా రమేష్ మనోహర్, పి.వి సత్యనారాయణ, జక్కుల విజయశేఖర్, ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేస్తున్న శశిధర్

# అర్హులందరికీ 'తల్లికి వందనం' పడేలా చూడాలి

● జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు

గుడివాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరికీ తల్లికి వందనం నగదు పడే విధంగా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించారు. క్లస్టర్ల వారీగా ఆయా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలతో కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి, ఆ పాఠశాలల్లో ఆధార్ లేని విద్యార్థులు ఎవరైనా ఉంటే వెంటనే ఆధార్ నమోదు చేయించి తల్లికి వందనం పడే విధంగా చూడాలని సీఆర్పీలను ఆదేశించారు. చిన్న చిన్న పొరపాట్లు సరి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, సీఆర్పీలపై ఉందన్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, ప్రాథమిక పాఠశాలల్లో హాజరు శాతం ఏ విధంగా ఉంది, యుపి, ఉన్నత పాఠశాలలు ఎన్ని ఉన్నాయో వివరాలతో క్లస్టర్ పాఠశాలల్లో ఉండాలన్నారు. రికార్డులు సక్రమంగా క్లస్టర్ పాఠశాలల్లో నమోదు చేయించి ఉండాలన్నారు. గుడివాడ మండలం, రూరల్, అర్బన్ పాఠశాలల్లో ప్రతీ అంశం కంప్యూటరీకరణ చేయించాలని ఎంఈవో బాలాజీని కోరారు. ఎటువంటి అలసత్వం వహించినా ప్రధానోపాధ్యాయులపై చర్యలు ఉంటాయని తెలిపారు. పాఠశాల రికార్డులు సక్రమంగా లేకపోతే సహించేది లేదని హెచ్చరించారు. క్లస్టర్ల వారీగా మోటూరు, బిళ్లపాడు, గర్ల్స్ హైస్కూల్, బేతవోలు, టౌన్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులను ఆయా పాఠశాలల నిర్వహణపై వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలాజీ, క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మంగళవారం 13వవార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, కూటమినేతలతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్‌సిలిండర్లు అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం ఎంతమంది పిల్లలున్నా సరే వర్తింపజేస్తున్నామన్నారు. అన్నదాతలకు ఇదే నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం అమలులోకి రానుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రాబోతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, 13వార్డుమాజీ సభ్యులు అల్లంశెట్టి సురేష్, అంజిబాబు, తాడిశెట్టి మధు, మంతెన రామాంజనేయులు, చాట్ల రామారావు, కాయల సాంబయ్య, ఇస్మాయేలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

# రైతుల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంది

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గుడ్లవల్లేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సాగుకు నీటిని అందిస్తూ రైతులకు అండగా ఉంటూ వస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం గుడ్లవల్లేరులోని బంటుమిల్లి లాకుల వద్ద సాగునీటిని విడుదల చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం సంకల్పించిన విధంగా రైతులకు అండగా నిలుస్తూ చివరి ఎకరాకూ నీరు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగం అధికారులకు సహకరిస్తూ అక్రమంగా తూములు, ఇంజన్లు పెట్టి పైన నీరు తోడేసి దిగువ ప్రాంతం వారికి ఇబ్బంది కలుగకుండా సహకరించాలన్నారు. నీటి సం ఘాల ద్వారా డీసీ చైర్మన్లు, నీటిసంఘాల అధ్యక్షులు బాధ్యత తీసుకొని ప్రభుత్వ నిధులను వినియోగించుకుని రిపేర్లు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బి.ఆంజనేయ ప్రసాద్, డిప్యూటీ ఈఈ ఎస్.శ్రీను, ఏఈ లు నిర్మలా సరోజ, లక్ష్మీతులసి, లాక్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీసీలు ఎన్.చంద్రమోహనరావు, బి.కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

### గుడివాడ ఏడీఏగా కవిత

గుడివాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గుడివాడ వ్యవసాయ డివిజన్ ఏడీఏగా ఎస్.కవిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఏలూరు నుంచి బదిలీపై గుడివాడ వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి బంటుమిల్లి బదిలీ అయ్యారు. దీంతో ఖాళీ ఏర్పడటంతో ఎస్.కవిత ఇక్కడకు వచ్చారు. గుడివాడ, పెదపారుపూడి, నందివాడ వ్యవసాయాధికారులు బోలెం అనంతలక్ష్మీ, త్రినాథ ఆంజనేయరావు, భాను ప్రకాష్, సింధు, అనిత తదితరులు ఏడీఏకు స్వాగతం పలికి అభినందించారు. ఎరువుల షాపుల యజమానులు, రైతులు ఏడీఏకు అభినందనలు తెలియజేశారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడ : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ రైల్వే స్టేషన్ పరిధిలో దోసపాడు రైల్వేస్టేషన్ దగ్గరలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 60సంవత్సరాలుంటుందని, మృతుడి సమాచారం తెలిసినవారు గుడివాడ రైల్వే పోలీస్‌స్టేషన్ నెం. 94406 27570, 98662 21412కు సమాచారంఅందించాలని ఎస్సై కోరారు.

### కూటమిపై బురద చల్లేందుకే సర్పంచ్ పెట్రోల్ డ్రామా : వీరంకి

తోట్లవల్లూరు : వైసీపీకి చెందిన గుర్విందపల్లి సర్పంచ్ ఉదయభాస్కర్ మండల పరిషత్ సమావేశంలో పెట్రోల్ తెచ్చి బిల్లుల కోసం ఆత్మహత్యాయత్నంకు పాల్పడటం ఒక డ్రామా అని, వైసీపీ నేతలు సర్పంచ్‌తో ఆడించిన నాటకమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. తోట్లవల్లూరులో తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురుమూర్తి మాట్లాడుతూ 2024 మార్చిలో వైసీపీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో పంచాయతీ భవనాన్ని ప్రారంభింపచేసిన సర్పంచ్ తన సొంత ప్రభుత్వంలో ఎందుకు బిల్లుల మంజూరు చేయించుకోలేదని ప్రశ్నించారు. మండల పరిషత్ కేటాయించిన రూ. 3 లక్షలను వైసీపీ ఎంపీపీ ఉండగా ఎందుకు మంజూరు చేయించుకోలేదన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులను బిల్లులు చేయటం లేదని కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకే పెట్రోల్ డ్రామా ఆడారని, ఇలాంటి కుయుక్తులను సహించేది లేదని గురుమూర్తి హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ మూడే శివశంకర్, నాయకులు తటుకూరి రమణ వల్లూరు రాంబాబు పాల్గొన్నారు.

# తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

● వ్యవసాయాధికారిణి అనంతలక్ష్మీ

గుడివాడ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి నారుమడులు పోశారని, తెగుళ్ల రాకుండా ముందుగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. మంగళవారం కల్వపూడి అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వర్షం గత వారం రోజులుగా కురుస్తున్నందున పొలాల్లో వరి నారుమడులు ఏపుగా పెరుగుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నాట్లు వెదజల్లినందున వాటికి ఎక్కువగా కలుపు వచ్చే అవకాశం ఉందని, కలుపు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు దమ్ములు దున్నుకుని వరి నాట్లకు సిద్ధంగా ఉండాలని అన్నారు. సీపూడి తదితర గ్రామాల్లో వరి నారుమడులు ఏపుగా పెరుగుతున్నాయని, త్వరలోనే వరి నాట్లు వేసే అవకాశం ఉన్నందున ఏమైనా సూచనలు, సలహాలు కావాలంటే సంబంధిత సచివాలయ సిబ్బందిని, వీఏఏలను కలవొచ్చునని తెలిపారు. రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ అనంతలక్ష్మీ

### పాఠశాల బస్సుల తనిఖీలు

గుడివాడ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : గుడివాడ, ఉయ్యూరు పరిధిలో ప్రైవేటు పాఠశాలల బస్సులను క్షేత్రస్థాయిలో రవాణ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. గుడివాడ ఆర్టీవో ఎన్.యు.ఎన్.ఎస్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎంవీఐలు సంగీతరావు, సుబ్బారావు, ఆయేషాలు బస్సులను తనిఖీ చేశారు. ప్రధానంగా డ్రైవర్ లైసెన్స్, బస్సు ఫిట్‌నెస్, పరిమితి మించి విద్యార్థులకు ఎక్కించడం, పన్ను చెల్లింపు తదితర అంశాలను పరిశీలించారు.

### వర్చువల్‌గా కోర్టు భవనాలకు శంకుస్థాపన

గుడివాడ : స్థానిక కోర్టు భవనాల నిర్మాణాన్ని వర్చువల్‌గా మంగళవారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ శంకుస్థాపన చేశారు. ఇన్నాళ్లు సరైన వసతులు లేక, అద్దె భవనాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. న్యాయాధికారి రవినాథ్‌తిలారి, హైకోర్టు న్యాయమూర్తులు వి.శ్రీనివాస్, వి.గోపాలకృష్ణారావు, మండవ కిరణ్మయి, జిల్లా న్యాయమూర్తి గోపి, అదనపు జిల్లా జడ్జి బి.సుబ్రహ్మణ్యం, గుడివాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మల చర్ల శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

### సామగ్రి చోరీ ముఠాపై ఫిర్యాదు

పామర్రు: మండలంలో నూతనంగా నిర్మిస్తున్న భవంతుల్లో వినియోగించే విలువైన ఎలక్ట్రికల్ ,ఇతర వస్తుసామగ్రిని గుట్టుచప్పుడు కాకుండా చోరీకి పాల్పడుతున్న ముఠాపై పామర్రు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితులైన మండల పరిధిలోని టీడీపీ మాజీ ఎంపీటీసీ పెదపూడి నాగేశ్వరరావు వారి నూతన భవంతిలోగల సీసీఫుటేజ్ ఆధారంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు అనుమానితులైన మహమ్మద్ సల్మాన్(25), అబ్దుల్ ఖదీర్(35), కె. కూమార్(23), కోట కొండ(18) మోదుగుమూడి తేజ(27)ను అదుపులోకి తీసుకుని మంగళవారం విచారణ చేపడుతున్నట్టు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

# పీహెచ్‌సీ వైద్యులకు సత్కారం

గుడ్లవల్లేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులకు సన్మానం నిర్వహించారు. గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రవీణ, హోమియోపతి వైద్యురాలు డాక్టర్ ప్రదీప, స్థానిక ప్రయివేటు వైద్యులు డాక్టర్ దుక్కిపాటి మోహన్‌లను లయన్స్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మేరుగు పెరుమాళ్ళు, కార్యదర్శి కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జోన్ చైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, చాపరాల రాజేశ్వరరావు, పాల్గొన్నారు. స్థానిక ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో డాక్టర్ ప్రవీణను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ వి.ఏ కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యబాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు :సింగలూరులో మంగళవారం భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిబార్ దంతవైద్య కళాశాల నిర్వహణలో ఉచిత పూర్తి కట్టుడు పళ్ల వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 62 మందికి పరీక్షలు నిర్వహించగా 18 మందికి పూర్తిగా తీసిపెట్టుకొనే కట్టుడు పళ్లను అమర్చేందుకు వైద్యనిపుణులు నిర్ధారించారు. వారికి పూర్తిగా సిబార్ దంతవైద్య కళాశాల వారిచే కట్టుడు పళ్లను గ్రామంలోనే తయారుచేసి బుధవారం వారికి అందచేయనున్నామని డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. శిబిరాన్ని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, దంత వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ మన్నే ప్రకాష్, కట్టుడు పళ్ళ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ కడియాల కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్)
కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09737, 99854 11610

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
▸ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235544

PLOT FOR SALE
▸ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ప్లాట్స్ 'తక్కువ' ధరలో నందిగామ దగ్గరలో, ఇళ్ల మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు & కంచికచర్ల దగ్గర ఔటర్ రింగ్ రోడ్‌కు, హైవేకి దగ్గరలో CRDA ప్లాట్స్. సెల్: 88018 03689
AJB - 142

▸ కంచికచర్ల - పేరకలపాడు, HYD హైవేకి & అమరావతి ORR కి దగ్గర, తారురోడ్డు ఫేస్‌తో, CRDA & పంచాయతీ ప్లాట్లు. సెల్ నెం. : 73372 04349
AJB - 143

వధువు కావలెను
▸ పద్మశాలి-47 సం.లు/Govt/1L/గుంటూరు, పద్మశాలి-38 సం.లు/బిజినెస్/1L/గుంటూరు, రజక-40 సం.లు/SWE/1.50/హైదరాబాద్ లేట్ వరులకు అందమైన వధువులు కావలెను. కుల పట్టింపు లేదు. వాట్సాప్: 76739 26517
AJB- 235601

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ANDHRA JYOTHI CLASSIFIEDS
GST 5% Extra
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 220/- ప్రతి అదనపు లైనుకు రూ॥ 45/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464, తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు
ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.
లీగల్ ప్రకటనలు
జన్మదిన, వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
ఎటువంటి ప్రకటనకైనా ఆంధ్రజ్యోతి ని సంప్రదించండి.
అంతిమయాత్ర, వర్ధంతి, జయంతి
ANDHRA JYOTHI CLASSIFIEDS క్లాసిఫైడ్స్
పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద,
గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
మచిలీపట్నం, పెడన : 99854 11610,
చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737,
ఉయ్యూరు, పామర్రు : 99854 09737

| బ్రాయిలర్ ధరలు | |
|---|---|
| అమరావతి | (రూ.ల్లో) |
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్‌స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |
| నెక్ కోడిగుడ్డు ధర (100) | |
| విజయవాడ జోన్ రైతు ధర రూ. 590 | |

### సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరించాలి : కొనకళ్ల

అవనిగడ్డ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. బొబ్బా గోవర్ధన్ మాట్లాడుతూ, మండలానికి ఇద్దరు చొప్పున సాంకేతిక బృందాన్ని తొలి అడుగు కార్యక్రమానికి నియమిస్తున్నట్లు తెలిపారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, తుమ్మల చౌదరిబాబు, మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, మాచవరపు ఆదినారాయణ, బండే శ్రీనివాసరావు, నడకుదుటి జనార్దనరావు, కర్రా సుధాకర్, షేక్ బాజీవలి, లకనం నాగాంజనేయులు, విశ్వనాథపల్లి పాప, బండే నాగ వెంకట కనకదుర్గ, మండవ బాలవర్ధిరావు, వరదచూరి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిని సందర్శించి సర్వే చేయిస్తున్న ఆర్డీవో స్వాతి

## వివాదాస్పద భూమి ఆర్డీవో సర్వే

బంటుమిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పెందుర్రు మిల్లి పంచాయతీ అర్థావానిగూడెంలో వివాదాస్పద భూమికి ఆర్డీవో కె.స్వాతి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. గ్రామంలోని 586-1లో ఎకరం 85 సెంట్లు, 586-4లో 84 సెంట్లు, 586-3లోని ఎకరం 24 సెంట్లు భూమి ఉంది. ఈ భూమి ఇరువర్గాల మధ్య వివాదస్పదంగా మారింది. 586-1లోని ఎకరం 85 సెంట్లలో ఎకరం భూమిని దళిత కర్షక నిర్వహణకు వినియోగిస్తున్నారు. 50 సెంట్లు ఒకరికి రిజిస్ట్రేషన్ కాగా, మిగిలిన 30 సెంట్లు వివాదస్పదంగా మారింది. 586-2లో ఉన్న 84 సెంట్లు భూమిలో గ్రామానికి చెందిన నంబూరి సాయిబాబు చెరువు తవ్వుతుండగా అర్థా నాగబాబు పోదరులు తమ భూమిలోకి వస్తున్నారంటూ అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బాధితులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశం మేరకు ఆర్డీవో స్వాతి, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వర్మ, డీసీసీ రాజా, సీఐ నాగేంద్ర ప్రసాద్, ఎస్సై గణేష్ ఆభూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించారు. 586-3లో ఎకరం 24 సెంట్లు సర్వే చేసి ఆక్రమణలను తొలగించారు.

## వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన

అవనిగడ్డ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రధాన సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల- నివారణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదని, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్ల పట్టుకోరాదని, విద్యుత్ లైన్లు చెట్టుకొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. పార్కులు, స్టేడియంలలోని విద్యుత్ స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని, లైట్లు గొలికి తడవకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలను కరెంట్ వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదని, గాలి, దుమారం, వర్షం వల్ల తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదని సూచించారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక ఏఈలు ఎస్‌వీ.సత్యనారాయణ, కె.గోపీచంద్, జి.వి.రాజు, జేఈ అవనిగడ్డ ప్రసాద్, ఎల్ఐ, ఎల్ఎం, జేఎల్ఎం గ్రేడ్-2, సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ శాఖల పనితీరుపై ప్రత్యేకాధికారి సమీక్ష

అవనిగడ్డ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని, బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రత్యేక అధికారి సాయిబాబు అన్నారు. అవనిగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ తుంగల సుమతి దేవి అధ్యక్షతన జరిగింది. ప్రత్యేకాధికారి సాయిబాబు వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాబోధన బాగుంటుందని, ప్రైవేట్ ఆసుపత్రుల వైపే మొగ్గు చూపుతున్నారని సమాధానం ఇవ్వటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారి హరికృష్ణ రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యులు లు స్వంపు దిమ్మె రైతులకు సకాలంలో వరి విత్తనాలు అందటం లేదని, ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సమృద్ధిగా నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నివేశనాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు పులిగడ్డ విచ్చేశ్వరరావు, ఎంపీడీవో మరియకుమార్, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## డాక్టర్స్‌డే సందర్భంగా వైద్యులకు సత్కారం

చల్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భంగా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న పురిటిగడ్డ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.విజయరావుకు ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు మెక్క అందజేసి సత్కరించారు. ఆసుపత్రి సిబ్బంది ఎన్.కమలాకరరావు, లోకేష్, రాజేశ్వరి, మారుతి తదితరులు ఉన్నారు.

## ఘంటసాల పీహెచ్‌సీ వైద్యులకు సత్కారం

ఘంటసాల : ఘంటసాల గ్రామంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, డాక్టర్ టి.వెంకటేశ్వరరావులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. హెల్త్ సూపర్‌వైజర్లు శివకృష్ణ, పూర్ణచంద్ర, సీనియర్ అసిస్టెంట్ కుమార్, స్టాఫ్ నర్సు రాణి, ల్యాబ్ టెక్నీషియన్ దివ్య, ఫార్మసీ ఆఫీసర్ కృష్ణ, ఏఎన్ఎం మారతమ్మ, హెల్త్ అసిస్టెంట్ సిహెచ్. శ్రీనివాసరావు, ఎఫ్ఎన్ఓ రాజమ్మ హాజరయ్యారు.

కోడూరులో నీరు విడుదల చేస్తున్న పీసీ చైర్మన్ దేవనబోయిన | సాగునీటిని విడుదల చేస్తున్న శ్రీకాకుళం డీసీ వైస్ చైర్మన్ సుగ్గున రాంబాబు

# రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

● తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన ● కాల్వలకు నీరు విడుదల

కోడూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. కోడూరు ప్రధాన పంట కాల్వ రెగ్యులేటర్ నుంచి దిగువ గ్రామాల పంట కాలువలకు సాగు, తాగునీటిని మంగళవారం విడుదల చేశారు. రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. అనంతరం 13వ నెంబర్ పంట కాల్వలో అడ్డంకులను తొలగించటానికి ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. నీటి సంఘాల అధ్యక్షులు ఇజ్జినేని శివాజీ, గంజాల సుందరరావు, ఇరిగేషన్ ఏఈ విజయ్ కుమార్, కోట రాంబాబు, పుతలపూడి సాయిబాబు, కాగిత రామారావు, బచ్చు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### రెండో నెంబర్ చానల్ నీరు విడుదల

ఘంటసాల : మండల పరిధిలోని శ్రీకాకుళం శివారు రెండో నెంబర్ చానల్ వద్ద సాగునీటిని శ్రీకాకుళం డీసీ వైస్ చైర్మన్ సుగ్గన రాంబాబు మంగళవారం విడుదల చేశారు. వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ కోడి రాధాకృష్ణ, జనసేన పార్టీ నాయకులు కోన రాజశేఖర్, సుగ్గన పవన్ కుమార్, ఏఎంసి డైరెక్టర్ కొమరగిరి నాగిని, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

### నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు అవశ్యం

మోపిదేవి : నారుమడుల్లో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి చెప్పారు. పెదప్రోలు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారుమడులు పరిశీలించి కాండం తొలుచు పురుగు వచ్చే అవకాశం ఉందని, దాని నివారణకు కార్బోఫ్యూరన్ గుళికలు 160 గ్రాములు చొప్పున ఒక సెంటు నారుమడికి వేయాలని సూచించారు. ఇనుప ధాతు లోపం ఉన్నట్లైతే 20 గ్రాముల అన్నభేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు, రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారి చేయాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం పంపిణీ చేసిన మినీ కిట్స్ నారుమడులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ శాఖాధికారిణి కె.హెప్సిబా, రైతులు పాల్గొన్నారు.

### రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ఘంటసాల : మండలంలోని తాడేపల్లి, కొడాలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి, వ్యవసాయాధికారులతో కలసి నారుమడులను పరిశీలించారు. సుధారాణి మాట్లాడుతూ ఐరన్ లోపం నివారణకు అన్నభేది 20 గ్రాములు, నిమ్మ ఉప్పు రెండు గ్రాములు కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. జింక్ లోపం నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటిలో కలిపి 4 నుంచి 5 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏడీఏ ఎస్.శ్యామల ప్రభుత్వం ఈ-క్రాప్ చేయించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతు తీసుకోవాలన్నారు. భూమిలో దొరికే ఐరిజాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ దండమూడి శివనాగేశ్వరరావు, ఏవో వర్ధజారాణి, తాడేపల్లి, కొడాలి రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఈఈ

చల్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నున్న - గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైను ఆధునికరణ పనులు ఈనెల 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్, చల్లపల్లి డీఈ పులి శివనాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. గుడివాడ విద్యుత్ ఉపకేంద్రం 220 కేవీలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు. పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## గొర్రెపాటి వెంకట సుబ్బయ్యకు నివాళి

ఘంటసాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల చరిత్ర రాసిన చరిత్రకారుడు పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛ ఘంటసాల కార్యకర్తలు గొర్రెపాటి సురేష్, వేమూరి రత్నశేఖర్, పోతన లక్ష్మీశ్వరరావు, వడ్డమూడి వెంకట కృష్ణారావు, దోనేపూడి అహోబలరావు, వడ్డమూడి ప్రసాదరావు, పోతన వెంకటేశ్వరరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వరదచూరి వెంకట గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత

కోడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ శాఖ హెచ్చరికలను అనుసరించి హంసలదీవి బీచ్ గేట్లు మూసివేస్తున్నట్లు ఇన్‌చార్జి ఫారెస్ట్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన గ్రామాల్లో మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. లెళ్లగుంట గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రార్థనా మందిరం వద్ద తడి, పొడి చెత్త బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వి.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నబూర్, డీఎల్‌డీవో పద్మావతి, డీపీవో రజావల్లి, సర్పంచ్ మానస, పంచాయతీ కార్యదర్శి ఎంటేశ్వరకుమార్, ఉపాధ్యాయులు తేజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

నందమూరులో పర్యటిస్తున్న కలెక్టర్ బాలాజీ

### విద్యార్థులతో సహపంక్తి భోజనం

కృష్ణలంకవెట్టి గ్రామంలో కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం పర్యటించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం చేశారు. విద్యాబోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

### నందమూరులో పర్యటన

పెడన : స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన నందమూరు గ్రామాన్ని కలెక్టర్ డి.కె. బాలాజీ మంగళవారం సందర్శించారు. ఈ గ్రామానికి ఈనెల 8న కేంద్ర బృందం వస్తున్నందున గ్రామ స్థితిగతులను తెలుసుకునేందుకు బాలాజీ పర్యటించారు. సచివాలయంలో అధికారులతో భేటీ అయ్యారు. ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద జంగిల్ క్లియరెన్స్ జరిగిందీ లేనిదీ తెలుసుకున్నారు. వీధిలైట్లు, శానిటేషన్ తదితరాలపై ఆరా తీశారు. కేంద్ర బృందం పర్యటన సమయంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారి పద్మావతి, డీఎల్‌పీవో రజావల్లి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమార్, సర్పంచ్ నరసింహారావు, సీడీపీవో సుమద్రవేణి పాల్గొన్నారు.

## సేవ చేయడంలోనే ఎంతో ఆనందం

మచిలీపట్నం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తోటి మానవులకు సేవలందించడంలో ఎంతో ఆనందం ఉంటుందని కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కూన రాంజీ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం రాత్రి జరిగింది. స్వార్ స్కూల్‌లో వి. శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మానవత జిల్లా కార్యదర్శి సీతాల ప్రసాద్, జిల్లా కన్వీనర్ పోతురాజు వీరశేఖరరావు, కోశాధికారి జి.వి.వి. సత్యనారాయణ మాట్లాడారు. మచిలీపట్నం మానవత నూతన అధ్యక్షుడిగా జి. కిషోర్‌కుమార్, కార్యదర్శిగా డాక్టర్ హనీలేర్, కోశాధికారిగా పి.బి.ఆర్.వి. ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా బొమ్మిడి అయ్యప్పస్వామి, సంయుక్త కార్యదర్శిగా పి.వి. పవన్‌కుమార్, ఇసి విద్య బంధ బిహారీ సుబ్రహ్మణ్యం,ఈసీ సభ్యులుగా డాక్టర్ బి.కె. మల్లికార్జునుడు, వి. సుందరరాం, ఎన్‌కె నూర్జహాన్ బేగం, గౌరవ డైరెక్టర్‌గా ఎ.శ్రీరాం, చైర్మన్‌గా మోటమర్రి బాబాప్రసాద్, కో చైర్మన్‌గా కార్మెంటర్ జిల్లా నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. డాక్టర్ బి. ధన్వంతరి ఆచార్యను డాక్టర్స్ డే సందర్భంగా సత్కరించారు.

## సహకార వారోత్సవాల్లో మొక్కలు నాటుతాం

మచిలీపట్నం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వ తేదీన అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటటం తదితర నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి కె.చంద్రశేఖర్ తెలిపారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రామ అధ్యర్యంలో డివిజనల్ కో-ఆపరేటివ్ కార్యాలయం వద్ద మంగళవారం మొక్కలు నాటారు.

## రక్తదాన శిబిరం 4న

అవనిగడ్డ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా అవనిగడ్డలో ఈనెల 4వ తేదీన రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాధా - రంగా మిత్ర మండలి నాయకులు యాసం చిట్టిబాబు తెలిపారు. రాధా - రంగా మిత్ర మండలి ముఖ్యులు బచ్చు రుమునాద్, అవనిగడ్డ ప్రకాష్, అన్నపురెడ్డి రామదాసు, అన్నపురెడ్డి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం

మోపిదేవి, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాపర్లపాలెం ఊటుకంక గ్రామానికి చెందిన కొప్పూరి రామకృష్ణారెడ్డి - ఉమా రాజ్యశ్రీ దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారు. దాతలు స్వామివారి ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు విరాళం అందించారు.

## పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకులం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన దేశాయిపేట మునిసిపల్ హైస్కూల్ విద్యార్థినికి ముఖ్య రాజేని లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్, మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటినందించి ఆర్థిక సాయం అందజేశారు.

ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, నోబుల్ హైస్కూల్ రిటైర్డ్ హెడ్మాస్టర్, న్యాయవాది మద్దాల సువర్ణరాజు, న్యాయవాది కమ్మిలి విజయకుమార్, లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లంకిశెట్టి హరినాథ్‌బాబు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

మోపిదేవి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పెదప్రోలు పంచాయతీ శివారు ప్రశాంత్ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పులిగడ్డ గ్రామానికి చెందిన నంబూరి కిశోర్ కుమార్ మోపిదేవిలో 200 కేజీల బియ్యం నాలుగు సంచుల్లో రవాణా చేస్తుండగా, ప్రశాంత్ నగర్ వద్ద పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్సై వై.వి.సత్యనారాయణ తెలిపారు.

## 32 మందికి సీఎం సాయం

అవనిగడ్డ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.12.23 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు, మంజూరు పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ అందజేశారు.

## అగ్నిబాధితురాలికి సహాయం

చల్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వెలివోలు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కొడాలి యూస్సీకి బేతేలు మినిస్ట్రీస్ సంఘ సభ్యులు రూ.14 వేల విలువైన బీరువా, గ్యాస్ స్టవ్, కుర్చీలను వితరణగా అందజేశారు. ఎర్రగుంట ప్రసాద్, మధు, పడమటి ఆమృతరావు, మేకాపు కోటేశ్వరరావు, ఉదయగిరి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం

ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు ముగిసిన సందర్భంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, అడపా రాంబాబు పాల్గొన్నారు.


క్యాపిటల్ హాస్పిటల్స్, విజయవాడ వారి
గ్యాస్ట్రోఎంటరాలజి క్లినిక్

కొలనోస్కోపి • ఎండోస్కోపి • ఇ.ఆర్.సి.పి. • ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్
• గ్యాస్ ట్రబుల్ • అజీర్తి • పుల్లత్రేపులు • కడుపులో మంట
• కడుపులో నొప్పి • పచ్చకామెర్లు • రక్తంతో కూడిన వాంతులు
• లివర్ ఇన్ఫెక్షన్లు • విరోచనముల రంగు మారుట • విరోచనములో ఇబ్బందులు
డా॥ ముప్పా ఇంద్రకీల గిరీష్
M.D. (General Medicine), D.M.(Gastroenterology)
Consultant International Gastroenterologist and Hepatologist
ప్రతి గురువారం
మధ్యాహ్నం గం. 12-00ల నుండి
సాయంత్రం గం. 4-00 ల వరకు
అపాయింట్‌మెంట్ కొరకు
ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
MMKNR ప్లాజా, గాంధీబొమ్మ, రేవిండలు రోడ్, చెమ్మన్నగిరిపేట, మచిలీపట్నం
9154388881, 9493573133



ప్రథమ వర్ధంతి



జననం: 17-09-1932
మరణం: 13-07-2024
కీ.శే. శ్రీమతి పరుచూరి నీలకంఠేశ్వరమ్మ గారు
భర్త: కీ.శే. పరుచూరి బాలకృష్ణారావు గారు B.A, BL (Advocate)
ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను మాకు పంచి, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, అందరి క్షేమాన్ని సర్వదా కాంక్షించే మీరు, దైవ సన్నిధికి చేరి నేటికి సంవత్సరం కాలమైనను మీ మధుర స్మృతులు మా మదిలో పదిలం... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, మీ దివ్య ఆశీస్సులు మాపై సదా ప్రసరించాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కుమారులు - కోడళ్ళు :
డా॥ పరుచూరి గంగాధరరావు - కీ.శే. యశోధర
పరుచూరి వెంకట నరసింహారావు - కవిత
కుమార్తెలు - అల్లుళ్ళు :
తుమ్మల శాంత కుమారి - బసవయ్య బాబు
తుమ్మల లక్ష్మీబాయి - వెంకట కృష్ణారావు
గుమ్మడి యశోధర - కీ.శే. గోపాల శివ రామ ప్రసాదు
కోనేరు మణి - వెంకట నారాయణ
పరుచూరి వేద మాతృదేవి
మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు
సంవత్సరీకము: ది. 02-07-2025 బుధవారం చిట్టూర్పు గ్రామంలోని మా స్వగృహము నందు జరుపబడును.


## ఎన్నికల ప్రకటన

| | | | |
|---|---|---|---|
| 1. | బ్యాంక్ పేరు | | ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002 |
| 2. | ఎన్నికల తేదీ | | 27-07-2025 (ఆదివారం) |
| 3. | మేనేజింగ్ కమిటీకి ఎన్నుకోబడే సభ్యుల సంఖ్య | | 2 (రెండు) మాత్రమే<br>ఒక ప్రొఫెషనల్ డైరెక్టర్ మరియు ఒక జనరల్ డైరెక్టర్ |
| 4. | మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవీ కాలం | | కాల వ్యవధి: 5 సంవత్సరములు - 07-08-2025 నుండి 06-08-2030 వరకు<br>ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 లోని సెక్షన్ 21(3) ప్రకారం |
| 5. | మేనేజింగ్ కమిటీ సభ్యత్వానికి పోటీ చేయడానికి అభ్యర్ధులకు కావలసిన అర్హతలు | | 1. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు కనీసం రెండు సంవత్సరాలు బ్యాంకులో ఓటింగ్ సభ్యుడై ఉండవలెను.<br>2. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు జరిగిన రెండు జనరల్ బాడీ సమావేశాలు(2024 సం॥ మరియు 2025 సం॥) హాజరై ఉండవలెను.<br>3. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 బ్యాంక్ బైలాస్ నం. 21 ప్రకారం అర్హత కలిగి ఉండవలెను. |
| 6. | నామినేషన్ల స్వీకరణ | తేది<br>స్థలం<br>సమయం | 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గంటల నుండి ఉ॥ 11-00 గంటల వరకు |
| 7. | స్వీకరించిన నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>మధ్యాహ్నం 02-00 గంట తరువాత |
| 8. | నామినేషన్ల పరిశీలన | తేది<br>స్థలం<br>సమయం | ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గంటల నుండి |
| 9. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>పరిశీలన తరువాత |
| 10. | నామినేషన్లు ఉపసంహరణ | తేది<br>స్థలం<br>సమయం | ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గంటల నుండి మ॥ 12-00 గంటల వరకు |
| 11. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల తుది జాబితా ప్రచురణ మరియు చిహ్నాల కేటాయింపు | తేది<br>స్థలం<br>సమయం | ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>మ॥ 01-00 గంట తరువాత |
| 12. | పోలింగ్ తేది మరియు సమయం | తేది<br>స్థలం<br>సమయం | ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>ఉ॥ 7.00 గంటల నుండి సా॥ 12-00 గంటల వరకు |
| 13. | ఓట్ల లెక్కింపు | తేది<br>స్థలం<br>సమయం | ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>మ॥ 02-00 గంటల నుండి |
| 14. | ఫలితాల ప్రకటన | | కౌంటింగ్ అయిన వెంటనే ది.27-07-2025 (ఆదివారం) |

తేది: 01-07-2025 (ఎం.వి.ఎస్. సతీష్ బాబు) ఎన్నికల అధికారి, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్థలం: గుంటూరు 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002, (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 క్రింద రిజిస్టర్ చేయబడినది, రిజిస్ట్రేషన్ నెం.431)

గమనిక: 1) ప్రతి అభ్యర్థి నామినేషన్ ఫీజు రూ.10,000/- (తిరిగి చెల్లించబడదు) ...


ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారం కొనుగోలును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా దుట్టుతో విడిపించి అధిక ధర తీసుకొనుటకు. (స్పాట్ క్యాష్) సంప్రదించండి :88024 89999
AJB-235544

వధువు కావలెను
» పద్మశాలి-47 సం.లు/Govt/1L/గుంటూరు, పద్మశాలి-38 సం.లు/బిజినెస్/1L/గుంటూరు, రజక-40 సం.లు/SWE/1.50/హైదరాబాద్ లకు తగిన వధువులు కావలెను. కుల పట్టింపు లేదు. సెల్: 76739 26517
AJB- 235601

PLOT FOR SALE
» ఇన్‌స్టాల్‌మెంట్‌లో ప్లాట్స్ 'తమ్ముర' ధరలో నందిగామ దగ్గరలో, ఇళ్ల మధ్యలో లక్ష్మీ నగర్ ఎదురుగా, కంచికచర్ల దగ్గర ఔటర్ రింగ్ రోడ్డు, హైవేకి దగ్గరలో CRDA ప్లాట్స్. సెల్: 88018 03689
AJB - 142

» కంచికచర్ల - పేరకలపాడు, HYD హైవేకి & అమరావతి ORR కి దగ్గర, తారురోడ్డు ఫేస్‌లో, CRDA & పంచాయితీ ప్లాట్లు. సెల్ నెం.: 73372 04349
AJB - 143

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలలో ఉన్న వ్యక్తులు, సంస్థలతో పాఠకులు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోకుండా ఎటువంటి లావాదేవీలు జరపకూడదు. ఉపశీర్షికల నిమిత్తం ఆంధ్రజ్యోతి సంస్థ కు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్లు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, పిన్ నంబర్లు ఎవ్వరికీ తెలియజేయకండి. లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
రూ. 220/-
కలర్ 30% EXTRA
విజయవాడ: 99854 11610, గుడివాడ: 99854 09737, చల్లపల్లి: 99854 11331, మైలవరం: 99854 00421, గన్నవరం: 99854 02464, తిరువూరు: 99854 09207, ఉయ్యూరు, పామర్రు: 99854 09737

## ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా మధుసూదన్

**కర్నూలు న్యూసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఆర్‌డబ్ల్యూఎస్ (గ్రామీణ నీటి సరఫరా విభాగం) కర్నూలు జిల్లా క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఇంజనీర్‌గా బీవీ మధుసూదన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసి డీఈ కుషీకుమార్ రెడ్డి జూన్ 30న పదవీ విరమణ పొందారు. దీంతో బనగానపల్లె డీఈగా పని చేస్తున్న మధుసూదన్‌కు క్యూసీ అదనపు బాధ్యతలు అప్పగించారు.

## విమాన వేళ ..!

- నేటి నుంచి కర్నూలు-విజయవాడ ఫ్లైట్ సర్వీసులు

**ఓర్వకల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వాసుల మరో కల నెరవేరింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కర్నూలు-విజయవాడ విమాన సర్వీసులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇండిగో విమానయాన సంస్థ ఈ సర్వీసులను నడుపనుంది. బుధవారం విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి ఇండిగో మొదటి సర్వీసు మధ్యాహ్నం 3:45 గంటలకు బయలుదేరి ఓర్వకల్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయానికి సాయంత్రం 4:50 గంటలకు చేరుతుంది. నంద్యాల, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ముఖ్య అతిథులుగా సాయంత్రం 4 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని 4:14 గంటలకు మొదటి ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ అందజేస్తారు. ప్రముఖుల ప్రసంగం అనంతరం 5:10 గంటలకు ప్రయాణికులతో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి విమానం బయలుదేరి 6:15 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుతుంది. ఈ సర్వీసులు వారంలో మూడు రోజులు (సోమ, బుధ, శుక్ర) అందుబాటులో ఉండనున్నాయి. ఈ కొత్త సర్వీసుల ద్వారా కర్నూలు-విజయవాడ ప్రయాణం మరింత సులభతరం అవుతుంది.

## ఇంటి వద్దకే పింఛన్

- కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎమ్మెల్యే

**ఓర్వకల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఎన్టీఆర్ భరోసా పించన్ల డబ్బు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నామని కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. గ్రామంలో లక్ష్మమ్మ, సుంకన్న, ఆశమ్మ, సత్యం, వెంకటస్వామిలకు వృద్ధాప్య పించన్లు, లక్ష్మీదేవి, కుసుమ కుమారి, వెంకటలక్ష్మిలకు వితంతు పించన్లు, హనుమన్న, మద్దయ్యలకు వికలాంగ పించన్లు వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై నెలలో జిల్లాలో అర్హులైన 2,36,640 మంది లబ్ధిదారులకు రూ.101.89 కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. అధికారులు సరైన సమయానికి వచ్చి పించన్లు ఇస్తున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్నారా? తెలుసుకున్నారు. అద్దె ఇంట్లో ఉన్నట్లయితే ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3వేల నుంచి రూ.4వేలకు పించన్ పెంచిందని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ రమణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, స్థానిక నాయకులు విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు...!

- ప్రతిష్టాత్మకంగా 'సూపర్ సిక్స్' అమలు
- తల్లికి వందనం, రూ.4 వేల పింఛన్‌తో జనం ఖుషీ
- నేటి నుంచి ఇంటింటా ప్రజాప్రతినిధులు, నేతలు

**కర్నూలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు సారథ్యంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుంది. వైసీపీ విధ్వంసం.. అరాచక పాలనకు స్వస్తి చెప్పాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుకట్టి జనం మధ్యకు వెళ్లాయి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకొని ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టింది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ద్వారా 'ఇంటింటా సంక్షేమం.. పల్లెపల్లెన ప్రగతి చేసి చూపిస్తాం' అంటూ ప్రధాన హామీలు ఇచ్చారు. ఏడాది పాలనలో వృద్ధులకు పింఛన్ రూ.4 వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ.. వంటి హామీలు ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. రైతులకు పెట్టుబడి సాయం చేసి అండగా నిలవాలని 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయింది. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిలో సాధించిన విజయాలు, సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి పనులు ఇంటింటికీ వెళ్లి వివరించడమే కాదు. ఇంటింటికీ ఇవ్వాల్సిన సంక్షేమం, ఆ పల్లెలో చేయాల్సిన అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేయడమే మహోన్నత ఆశయంతో నేటి నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏడాదిలో జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

### ఇంటింటా దీపం.. యువతకు మెగా డీఎస్సీ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో దీపం పథకం ఒకటి. జిల్లాలో 6.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు కలిగిన వినియోగదారులు ఉన్నారు. వీరిలో దీపం పథకం కింద 4.85 లక్షల మంది పేదలు నమోదు చేసుకున్నారు. వీరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతున్నాయి. అలాగే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో అన్న క్యాంటీన్ల ద్వారా వేలాది మంది పేదల ఆకలి తీరుస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16,347, ఉమ్మడి జిల్లాలో 2,600 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు.

### అవ్వ తాతల మోమున చిరునవ్వులు

ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధులకు రూ.200 పింఛన్ ఇస్తూ వచ్చారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో బాధ్యతలు చేపట్టిన సీఎం చంద్రబాబు ఒకేసారి ఐదు రెట్లు పెంచి రూ.1,000 చేశారు. 2019 ఎన్నికల ముందు రూ.2 వేలకు పెంచారు. వైసీపీ అధికారంలోకి వస్తే రూ.3 వేలు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక దశలవారీగా ఐదేళ్లలో రూ.వెయ్యి పెంచుతానని మాట మార్చారు. 2024 ఎన్నికల్లో పింఛన్ రూ.4 వేలు చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి స్పష్టమైన హామీ ఇచ్చింది. జూన్ 12న కూటమి ప్రభుత్వం అధికారం చేపడితే.. జూలై ఒకటో తారీఖునే వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ, కాలేయం, తలసేమియా బాధితులకు రూ.10 వేలు, పూర్తి వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలకు పెంచారు. జిల్లాలో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 2,45,229 మంది ఉన్నారు. ప్రతి నెల రూ.115-120 కోట్లు ఇస్తున్నారు.

### 3.67 లక్షల విద్యార్థులకు తల్లికి వందనం

జిల్లాలో 25 మండలాల్లో 2,242 పాఠశాలలు ఉన్నాయి. ఆయా బడుల్లో 4,73,823 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరిలో 'తల్లికి వందనం పథకానికి' 3,67,614 మంది విద్యార్థులు అర్హులు. వీరికి ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున రూ.477.89 కోట్లు తల్లులు ఖాతాలో జమ చేశారు. పాఠశాలల మౌలిక వసతులకు రూ.73.52 కోట్లు ఇచ్చారు. 2,26,181 కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం నేరుగా లభించింది. గత వైసీపీ హయాంలో అమ్మఒడి కేవలం ఒక విద్యార్థికే ఇస్తే.. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎందరు విద్యార్థులు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చింది. ఐదుగురు పిల్లలు ఉన్న కుటుంబాలు ఒక్కో తల్లి ఖాతాలో రూ.65 వేలు జమ చేయడం కొసమెరుపు.

### త్వరలో..

సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ ఒకటి. కేంద్రం రూ.6 వేలు, రాష్ట్రం రూ.14 వేలు కలిపి రూ.20 వేలు పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇవ్వనున్నారు. జిల్లాలో 2.56 లక్షల మంది అర్హులైన రైతులను గుర్తించారు అలాగే స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' అమలు చేయనున్నారు.


మిగతా 6వ పేజీలో


## మంచిని ప్రజలకు వివరించాలి

- టీడీపీ శ్రేణులకు మంత్రి భరత్ నిర్దేశం

కరపత్రాలు విడుదల చేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు నగరంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు మంచి చేయడం ఒక భాగమైతే చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం మరో భాగమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చాక పింఛన్ పెంపు, తల్లికి వందనం పథకం అమలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, పరిశ్రమలు, ఉపాధి తదితర సంక్షేమ పథ కాలను అమలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరి ఏపీ కూడా అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఈ విషయాలన్నీ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేషన్ డైరెక్టర్లు సంజీవలక్ష్మి, ముంతాజ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7న ఐఏబీ సమావేశం

- ఎల్లెల్సీ నీటి విడుదలపై నిర్ణయం
- వివిధ సాగునీటి ప్రాజెక్టులపై చర్చించే అవకాశం

**కర్నూలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఈ నెల 7న సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగే ఐఏబీ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారు. ప్రధానంగా తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి నీటి విడుదలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. తుంగభద్ర డ్యాంలో మంగళవారం నీటి లెక్కలు తీసే సమయానికి 74.48 టీఎంసీలు వరద చేరింది. ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం ఐసీసీ సమావేశం నిర్వహించి ఈ నెల 10 నుంచి ఎల్లెల్సీకి నీటి విడుదల చేయాలని టీబీపీ బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. దీంతో జిల్లా రైతుల నుంచి నీటి విడుదలపై తీవ్ర ఒత్తిడి వస్తుంది. ఎల్లెల్సీ కింద ఖరీఫ్‌లో 43,519 ఎకరాల ఆయకట్టు ఉంది. దాదాపు 35 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ఇంజనీర్లు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అదే క్రమంలో డ్యాంలో నీటి లభ్యత పెరిగితే పూర్తి ఆయకట్టుకు నీటిని ఇవ్వాలనే ఆలోచన కూడా చేస్తున్నారు. ఏ తేది నుంచి నీటి విడుదల చేస్తారు..? ఎన్ని ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇస్తారో..? ఐఏబీలో నిర్ణయం తీసుకుంటారు. తుంగభద్ర డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.782 టీఎంసీలు కాగా.. మంగళవారం నీటి లెక్కలు పరిశీలిస్తే 1624.38 అడుగుల లెవల్‌లో 74.48 టీఎంసీల వరద చేరింది. ఎగువ నుంచి 33,916 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుంది. నదీతీరంలో గ్రామాల అవసరాల కోసం 2,389 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

## సులభ దర్శనానికి ఏర్పాట్లు

- దేవదాయశాఖ మల్టీజోన్- 2
- డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్
- మహానందిలో పర్యటన

## చరిత్రను యువత తెలుసుకోవాలి

- పరిశోధనల కేంద్రంగా క్లస్టర్ యూనివర్సిటీ
- రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు


7


## కర్నూలు వర్సిటీల్లో యోగి వేమన ప్రొఫెసర్లు

- అనధికారిక సేవల్లో అక్కడి ప్రొఫెసర్లు
- ఆర్‌యూ ప్రిన్సిపాల్‌గా మరో ప్రొఫెసర్ ప్రయత్నాలు..

**కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** యోగి వేమన వర్సిటీ ప్రొఫెసర్లు డిప్యుటేషన్‌పై కర్నూలు వర్సిటీల్లో పాగా వేస్తున్నారు. తాజాగా మరో ప్రొఫెసర్ రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియామకం దాదాపుగా ఖరారు అయినట్లు సమాచారం. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సమీప బంధువు యోగి వేమన వర్సిటీలోని ఓ ప్రొఫెసర్‌గా ఉంటూ కర్నూలు వర్సిటీల్లో పెత్తనం చేలాయిస్తున్నారని విద్యార్థులు మండి పడుతున్నారు. జిల్లాలోని యూనివర్సిటీల్లో గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కడప జిల్లాకు చెందని ప్రొఫెసర్లే రిజిస్ట్రార్లుగా పెత్తనం చెలాయించారు. ఇప్పుడూ అదే సాంప్రదాయం కొనసాగుతోందనే విమర్శలున్నాయి. క్లస్టర్ వర్సిటీకి రిజిస్ట్రార్‌గా, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీకి ఇన్‌చార్జి ఉపకులపతిగా కూడా ఆదే వర్సిటీకి చెందిన ఓ ప్రొఫెసర్‌కు బాధ్యతలు కట్టబెట్టడంలో ఆయన పాత్ర కీలకమనే ప్రచారం ఉంది. ఉన్నత విద్యామండలి అనుమతి లేకుండా వర్సిటీల్లో డిప్యుటేషన్లపై ఇటీవల ఉన్నత విద్యామండలి ప్రశ్నించింది. ఉన్నత విద్యామండలి అనుమతితో పాటు పాలక మండలి ఆమోదం తప్పని సరిగా ఉండాలని ఉన్నత విద్యామండలి కార్యదర్శి రాయలసీమ వర్సిటీకి లేఖ రాశారు. రాయలసీమ యూనివర్సిటీ అధికారులు రిజిస్ట్రార్‌గా ప్రస్తుత ప్రొఫెసర్‌నే కొనసాగించేలా కమిటీ ఓ లేఖ ఉన్నత విద్యామండలికి సిఫారసు చేసిందని కొందరు ప్రొఫెసర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం కడప యోగి వేమన ఉన్నతాధికారులతో ప్రస్తావించగా తమ ప్రొఫెసర్లకు ఎలాంటి అనుమతులు లేవని, పైగా ఏడాది డిప్యుటేషన్ కాలం ముగుస్తోంది కాబట్టి వారు వర్సిటీకి తిరిగి రావాల్సి ఉంటుందని తెలిపారు.

### జిల్లాలోని ప్రొఫెసర్లకు బాధ్యతలు ఇవ్వాలి

జిల్లాలో అర్హులైన ప్రొఫెసర్లనే వర్సిటీల్లో నియమించాలి. కడప జిల్లాలోని యోగి వేమన వర్సిటీలోని జగన్ బంధువు డైరెక్షన్‌లో ఇక్కడి వర్సిటీల్లో ఎట్లా పదవుల్లో నియమిస్తారు.

- సీమ కృష్ణ రాథోడ్, రాష్ట్ర అధ్యక్షుడు, రాయలసీమ విద్యార్థి సమాఖ్య

### ఆర్‌యూలో మహిళా ప్రొఫెసర్‌కు అవమానం..

రాయలసీమ యూనివర్సిటీలోని ఓ బ్లాక్ ఖాళీ చేయాలని ఓ ఉన్నతాధికారి మహిళా ప్రొఫెసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక బలవంతంగా బ్లాక్ ఖాళీ చేయిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యహారంపై విద్యార్థులు ఉన్నతాధికారిని నిలదీసిన విషయం క్యాంపస్‌లో చర్చనీయాంశమైంది.

### తీర్మానం చేశాం

రిజిస్ట్రార్‌గా బోయ విజయకుమార్ నాయుడును కొనసాగుతున్నట్లు కమిటీలో తీర్మానం చేశాం. ఉన్నత విద్యామండలికి కూడా లేఖ రాశాం.

- వి. వెంకట బసవ, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ

## చెత్త నుంచి సంపద సృష్టించాలి

పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

**కర్నూలు న్యూసిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే విధంగా కృషి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల సీఈఓ, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, కర్నూలు జిల్లా ఎంపీడీఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో లెగసీ డంప్ (ఎంతోకాలంగా పేరుకుపోయిన చెత్త)పై సర్వే చేయాలన్నారు. వాటి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సేకరించిన చెత్తను మున్సిపాలిటీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బయో మైనింగ్‌కు తరలించాలన్నారు. అక్కడ ట్రామెల్ యంత్రాన్ని వినియోగించుకుని చెత్తను నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేస్తారని అన్నారు. ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లరప్పలను వేర్వేరు చేస్తారని అన్నారు. వేరు చేసిన వాటిని ఇతర కంపెనీలకు విక్రయించడం వల్ల సంపద వస్తుందన్నారు. గ్రామల్లో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్‌కు తరలించడం వల్ల గ్రామాల్లో కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు.

## వారంలో అన్నదాత సుఖీభవ..

- ఉమ్మడి జిల్లాలో 4,63,021 మంది రైతులకు లబ్ధి

**కర్నూలు అగ్రికల్చర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని సత్వరమే అమలు చేసేందుకు ఏర్పాట్లు మొదలు పెట్టింది. అర్హులైన రైతులను గుర్తించి వెంటనే ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో గత పది రోజుల నుంచి రైతు సేవా కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించేందుకు రైతులు ఆ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. కర్నూలు జిల్లాలో 2,77,224 మంది అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులు అని తేల్చారు. ఇప్పటి దాకా 2,22,284 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఇంకా 3,735 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. 1,205 మంది రైతులను అనర్హులుగా ప్రకటించారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,85,297 మందిని అర్హులుగా తేల్చారు. అందులో 1,80,787 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఈ జిల్లాలో 4,510 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. రెండు జిల్లాలో కలిపి 4,940 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది.



### నిధుల విడుదలలో కేంద్రం జాప్యం

అన్నదాతా సుఖీభవ పథకం కింద.. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రస్తుత ఖరీఫ్‌లో మొదటి విడతగా అందించాల్సిన రూ.2వేలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా రూ.5వేలను కలిపి మొత్తం మొదటి విడతలో రూ.7వేలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు ఎదురు చూస్తున్నారు. గత నెలలోనే అన్నదాతా సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ఒకేసారి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం ద్వారా విడుదలయ్యే రూ.2వేలతో కలిపి మొత్తం రూ.7వేలను అందించేందుకు సిద్ధమైంది. అయితే కేంద్ర ప్రభుత్వం వివిధ కారణాల వల్ల నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పథకం అమలుకు కాస్త జాప్యం జరిగే పరిస్థితి నెలకొంది. మరో వారం రోజుల్లో కేంద్రం మొదటి విడత రూ.2వేలను అందించే అవకాశం ఉంది.




# నగరానికి మేఘమాల

కర్నూలు నగరంపై పడిపోతున్నట్లు కనిపిస్తున్న ఈ కారు మేఘాలు మంగళవారం సాయంత్రం ఆకాశంలో కాసేపు సందడి చేశాయి. నగరానికి ఆకాశంలో మేఘ మాలగా కనిపించిన దృశ్యాన్ని ప్రజలు తిలకించారు. గగనంలో మేఘాలు దోబూచులాడి కనువిందు చేశాయి. కర్నూలు సిటీలో ఉన్న భారీ భవనాలపై మేఘాలు వాలి, ఆ తర్వాత దాదాపు రెండు గంటల పాటు కర్నూలు నగరంలో వర్షం కురిసింది. వర్షం రాకతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

## తిరుమలకు ప్రత్యేక ప్యాకేజీ

టూరిజం ఆధ్వర్యంలో వెసులుబాటు

కర్నూలు న్యూసిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ తిరుమల వెంకన్న దర్శనానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. టూరిజం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం కర్నూలు నుంచి నంద్యాల మీదుగా తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రత్యేక ప్యాకేజీ ఉంటుంది. ఈ ప్యాకేజీలో ఎస్ఎస్‌డీ (స్పెషల్ ఎంట్రీ దర్శనం) టికెట్ ద్వారా త్వరితగతిన దర్శనం చేయించనున్నారు. ట్విన్ షేరింగ్ నాన్ ఏసీ వాహనం వసతితో పాటు ప్రొఫెషనల్ టూర్ గైడ్ సేవలు అందుబాటులో తీసుకువస్తున్నారు. తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, శ్రీనివాసమంగాపురం, తిరుచానూరు ఆలయాలను కూడా ప్యాకేజీలో భాగంగా చేర్చారు. ప్యాకేజీ చార్జీలు కర్నూలు నుంచి రూ.2,670, నంద్యాల నుంచి రూ.2,470గా నిర్ణయించారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు పూర్తిగా ఉచితం. తిరుమలలో విశ్రాంతి కోసం గదులను కూడా కల్పించనున్నారు. అయితే తిరుమలకు వచ్చేవారు భోజన వసతిని వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం రాత్రి కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ టూరిజం కార్యాలయం వద్ద వాహనం బయలుదేరి ఆర్టీసీ బస్టాండు, మెడికల్ కాలేజీ, నంద్యాల చెక్‌పోస్టు వద్ద పర్యాటకులను పికప్ చేసుకుంటారు. పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా పర్యాటక అభివృద్ధి సంస్థ మరిన్ని ప్యాకేజీలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు టూరిజం డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

# సారథులు వస్తున్నారు

- ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కమిటీల ఏర్పాటు దిశగా చర్యలు
- డీసీవోల చేతికి జాబితా
- పరిశీలించి పంపాలని ప్రభుత్వం ఆదేశాలు
- కర్నూలులో 43, నంద్యాలలో 28 సంఘాలకు జాబితా ఖరారు
- ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలు వచ్చేస్తున్నాయి. ఇప్పటిదాకా కర్నూలు జిల్లాకు 43, నంద్యాల జిల్లాలో 28 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను నియమిస్తూ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సిఫారసు లెటర్లను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి ఆయా జిల్లాలోని సహకార శాఖ అధికారి కార్యాలయానికి శనివారం జాబితాలు అందాయి. వీటిని పూర్తి స్థాయిలో విచారణ జరిపి అన్ని సక్రమంగా ఉంటే ప్రభుత్వానికి ఈ జాబితాలను పంపిస్తామని కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణుడు విలేకరులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఆర్థికంగా అండదండలు అందిస్తున్న వ్యవసాయ పరపతి సంఘాలకు వారం రోజుల్లో సారథులు రాబోతున్నారు. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జిలుగా సహకార శాఖతో పాటు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. వీరి స్థానంలో ఆయా సంఘాలకు ఒక చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను సూచిస్తూ త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయబోతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో కర్నూలు, నంద్యాల జిల్లాలో 99 సహకార సంఘాలు ఉన్నాయి. వైసీపీ హయాంలో వీటికి ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీ కార్యకర్తలనే త్రీమెన్ కమిటీలో నియమించి ప్రతి ఆరు నెలలకు పదవీ కాలం పొడిగించుకుంటూ పోయారు. ఇదే సమయంలో నామినేట్ అయిన త్రీమెన్ కమిటీలోని సభ్యులు తాము అనుకున్న విధంగా భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడి సంఘాలను నష్టాల ఊబిలోకి నెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా సంఘాల్లోని త్రీమెన్ కమిటీలను రద్దు చేసి సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. వీరు తగినంత మంది లేక 3, 4 సంగాలకు ఒకరి చొప్పున ఇన్‌చార్జిలుగా నియమించడంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పాలన గాడి తప్పింది. రైతులకు ఇచ్చే రుణాలు బకాయిలను సక్రమంగా వసూలు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పర్సన్ ఇన్‌చార్జిల గడువు ఈ నెల 28తో ముగిసింది. మళ్లీ ఆరు నెలలకు ఈ గడువు పెంచాల్సి ఉంది. ఈ సమయంలో త్రిసభ్య కమిటీల నియామకాన్ని కొలిక్కి తీసుకురాబోతున్నారు.

### ఆశావాహుల నిరీక్షణ:

ఉమ్మడి జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఇప్పటికీ కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 28 సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఖరారు చేస్తూ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సిఫారసు లెటర్లను ప్రభుత్వానికి పంపారు. ప్రస్తుతం ఈ త్రీమెన్ కమిటీలకు ఎమ్మెల్యేల చేత ప్రతిపాదించిన వారిపై జిల్లా సహకార శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మిగిలిన సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఖరారు చేసే విషయంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. సహకార సంఘాల ద్వారానే పెద్ద ఎత్తున రుణాలు రైతులకు పొదుపులక్ష్మి గ్రూపులకు అందిస్తుండటంతో ఈ అధికారాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే ఆశ ఎమ్మెల్యేల అనుచరుల్లో ఎక్కువైపోయింది. దీంతో ఒక్కో సంఘంలో త్రీమెన్ కమిటీ జాబితాలో చోటు దక్కించుకునేందుకు పది నుంచి 20 మంది దాకా ఎమ్మెల్యేల వద్ద క్యూ కడుతున్నారు. మూడు నెలల క్రితమే ఆశావాహుల పేర్లను ఎమ్మెల్యేలు తీసుకుంటూ వస్తున్నారు. కొన్ని చోట్ల కూటమి నేతల మధ్య అభిప్రాయబేధాలు తలెత్తడంతో ఇన్నాళ్లూ వాటిని పక్కన పెట్టేశారు. మరో వారంలోపు ఈ సంఘాలన్నింటికీ త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా సహకార శాఖ అధికారులు ఎమ్మెల్యేల నుంచి జాబితాలను తెప్పించుకుని వాటిపై త్వరితగతిన పరిశీలన జరిపి ప్రభుత్వానికి పంపనున్నారు.

### ప్రభుత్వానికి జాబితాను పంపిస్తాం

కర్నూలు జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సంబంధించి త్రీమెన్ కమిటీలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వానికి అందాయి. అక్కడి నుంచి మాకు ఆ జాబితాలను ప్రభుత్వం పంపింది. వీటిని పరిశీలించి ప్రభుత్వానికి అందజేస్తాం. మిగిలిన సహకార సంఘాలకు కూడా త్వరితగతిన ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల నుంచి త్రీమెన్ కమిటీల జాబితాలను తీసుకుని ప్రభుత్వానికి పంపుతాం.

- వెంకటకృష్ణుడు, డీసీవో

# సుపరిపాలనలో తొలిఅడుగు!

(5వ పేజీ తరువాయి)

### ● పారిశ్రామిక ప్రగతి.. హైకోర్టు బెంచ్

గడ్డపై పారిశ్రామిక ప్రగతి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యక్తి కావడం ఇందుకు కారణం. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులకు టెండర్లు పూర్తి చేశారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యం. జపాన్‌కు చెందిన ఇటోయో మైక్రో టెక్నాలజీ కార్పోరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎన్ గ్రూపులు సంయుక్తంగా దాదాపు రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ 130 ఎకరాల్లో స్థాపించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 1200 ఎకరాల్లో రూ.13 వేల కోట్లతో 'ఈవీ పార్క్'కు ఒప్పందం, 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. తాజాగా రిలయన్స్ సంస్థ రూ.1,266 కోట్లతో జ్యూష్ తయారి పరిశ్రమ స్థాపనకు ఒప్పందం చేసుకుంది. 80 ఎకరాలు ఎకరం రూ.30 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో పాటు రూ.16,500 కోట్లు పెట్టుబడులు, 12-13 వేల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు 7 సోలార్, విండ్ ప్రాజెక్టులకు ఒప్పందం జరిగింది. అలాగే.. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చర్యలు వేగంగా చేస్తున్నారు.

### ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లాలి

తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు జరిగే 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇటీవల జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వైసీపీ ఓటమి తర్వాత ఆ పార్టీ నేతల విధ్వంసాన్ని ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సహా అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఏడాదిలో ఎంత లబ్ధిపొందారు, అర్హులైన వారు ఎంత మంది ఉన్నారు, గ్రామంలో చేసిన అభివృద్ధి, చేయాల్సిన ప్రగతిపై ప్రజలకు వివరించాలని కోరారు. మై టీడీపీ యాప్ ద్వారా చేసిన పనులు అధిష్ఠానానికి తెలియజేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఎన్టీఆర్ విద్యా సంకల్పం

- పొదుపు సంఘాల మహిళల పిల్లలకు కోసం..
- మరో పథకానికి శ్రీకారం చుట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- కేజీ నుంచి పీజీ వరకు అమలు

హాలహర్వి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. పొదుపు మహిళల పిల్లల చదువు కోసం రుణాలు అందించి ఆదుకునేందుకు ఆదేశించడంతో చదువుకు సాయంగా, పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అధిక వడ్డీలకు.. అప్పులు చేసి

పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆస్తులు అమ్ముకొని ఇబ్బందులు పడుతున్నారని గమనించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యా సంస్థల్లో చదివే పిల్లలకు ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రుణం తీసుకున్న మహిళ తీసుకున్న రుణాన్ని బట్టి కనిష్ఠంగా 24కంతుల నుంచి 36 కంతుల వరకు వాయిదాల పద్ధతిలో 35 పైసలు వడ్డీకే రుణం చెల్లించేలా వెసులుబాటు కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందుకోసం ప్రభుత్వం రూ.200 కోట్లు నిధులు ఖర్చు చేసేలా విధివిధానాలు తయారు చేసింది. ఈ పథకంతో పేదల బిడ్డలకు ఎంతో ఊరటనిస్తుందని, విద్యాభివృద్ధి కోసం ఇలాంటి పథకం అమలు చేయడం ఎంతోమంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగునిస్తుందని పొదుపు సంఘాల మహిళలు చెబుతున్నారు. ఈ పథకం వల్ల జిల్లాలో 3,23,530 మంది పొదుపు మహిళల పిల్లలకు ఈ పథకం లబ్ధి పొందే అవకాశం ఉంది.

### పేద మహిళలకు ఊరట

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతున్న ఈకొత్త పథకం ఎంతోమంది పేద మహిళలకు ఊరటనిస్తుంది. ఈ ఏడాది అమలుచేస్తే ఎంతోమంది పేద విద్యార్థుల భవిష్యత్‌కు భరోసానిచ్చే గొప్ప పథకం ఇది.

- రంగవేణి, పొదుపు మహిళ, హాలహర్వి





సిద్ధమయ్యారు. రుణం అందించి తక్కువ వడ్డీతో నెలనెలా తిరిగి చెల్లించేలా రూపొందించిన పథకమే ఎన్టీఆర్ విద్యా సంకల్పం. విద్యాసంకల్పం పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసింది. ఈ పథకం వల్ల అనేకమంది పొదుపు సంఘాల మహిళల పిల్లల చదువుకు కొండంత అండగా నిలుస్తుందని భావిస్తున్నారు పొదుపు మహిళలు.

### స్త్రీ నిధి బ్యాంకు ద్వారా..

రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళల పిల్లలు విద్యాభివృద్ధి కోసం స్త్రీనిధి బ్యాంకు ద్వారా 4శాతం (35 పైసలు) వడ్డీకే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం పొందేందుకు వెసులుబాటు కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రస్తుతం పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం ఉపాధి పొందేందుకు స్త్రీనిధి నుంచి 12శాతం వడ్డీతో రుణాలు అందిస్తున్నారు. ఈపథకం ప్రవేశ పెట్టడంతో కేవలం నాలుగు శాతానికి వడ్డీతో రుణాలు ఇవ్వాలని

### బిడ్డల భవిష్యత్తుకు భరోసా

ప్రభుత్వం ఎన్టీఆర్ విద్యాసంకల్పం కొత్త పథకానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషకరమైన విషయం. పిల్లల చదువుల కోసం మాలాంటి తల్లులు ఎన్నో అవస్థలు పడుతున్నాం. స్థోమత లేక సగంలోనే విద్యను ఆపేసి నిరుద్యోగులుగా మారుస్తున్నాం. ఇలాంటి పథకంతో పేద బిడ్డలంతా విద్యావంతులుగా మారతారని ఆశిస్తున్నాం.

- అమృత, పొదుపు మహిళ, హాలహర్వి

## సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలు

కర్నూలు కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అవకాశాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ దరఖాస్తులు కళాశాలలో లభిస్తాయని, వాటిని పూర్తి చేసి ఆగస్టు 31లోగా అందజేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల్లో గాత్రం, వయోలిన్, మృదంగం, కూచిపూడి నృత్య విభాగాలలో ప్రవేశాలు పొందవచ్చని, ప్రవేశానికి బాలలకు 2025 జూలై 1 నాటికి 10 ఏళ్లు పూర్తి అయి ఉండాలని తెలిపారు. కళాశాలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారు రెండేళ్ల డిప్లమో కోర్సులో చేరడానికి అర్హులని తెలిపారు.

## ఎక్సైజ్ ఐ యాప్‌ను అమలు చేయాలి

- ప్రతి మద్యం దుకాణానికి సీసీ కెమెరాలు
- వీసీలో ఎక్సైజ్ శాఖ కమిషనర్

కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఐ యాప్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా దుకాణాల సమయ పాలనతో పాటు పోలీసుల విధులకు సంబంధించిన ప్రతి అంశం అందులో పొందు పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం దుకాణాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కెమెరాలను అమరావతి కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓవైసీవి అనుచిత వ్యాఖ్యలు

- రాజకీయ లబ్ధి కోసమే ఆయన తాపత్రయం
- టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాహిద్



**కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** రాజకీయ లబ్ధి కోసం ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాహిద్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇస్లాంతో పాటు ముస్లిం మత పెద్దలు ఇచ్చే ప్రతి సూచనలను గౌరవిస్తూ, సమాజం పట్ల బాధ్యతగా టీడీపీ పని చేస్తోందన్నారు. రాజకీయ స్వలాభం కోసం వచ్చిన వారు టీడీపీపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఒక పార్టీని మత పరంగా వాడుకుని ఇక్కడికి వచ్చి తమపై విమర్శలు చేస్తే ఏపీలో ముస్లింలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. ముస్లింల అభివృద్ధి కోసం టీడీపీ చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ప్రస్తుతం ముస్లిం సమాజం పూర్తిగా చైతన్యవంతమైందన్న విషయాన్ని ఓవైసీ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో మీ ఆధీనంలో ఉన్న వక్ఫ్ ఆస్తులను పూర్తి స్థాయిలో వక్ఫ్ బోర్డుకు అప్పగించగలరా? అని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో రాజకీయంగా చొరవ తీసుకుని ఓటు విభజన సృష్టించి ఇతరులకు లాభం కలిగించే ప్రయత్నాలు చేయలేదా? అని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాల్లో ముస్లిం సమాజానికి ఎంఐఎం చేసిన తప్పులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కొంప ముంచిన డ్రైవర్ నిద్రమత్తు

- అదుపు తప్పి, వంతెన ఢీకొట్టి ఆగిపోయిన లారీ
- వంకలోకి వెళ్లకపోవడంతో తప్పిన ప్రాణాపాయం



వంతెనపై వేలాడుతున్న లారీ

**పత్తికొండటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** డ్రైవర్ నిద్రమత్తుతో ఓ లారీ అదుతప్పి వంతెన ఢీ కొట్టింది. లారీ ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన 46 టీయూ 0032 నంబర్ గల కంటైనర్ లారీ చెన్నై నుంచి బిస్కెట్లు, చాక్లెట్ల లోడుతో మహారాష్ట్రకు బయలుదేరింది. అయితే మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారి అటికెలగుండు వంతెన వద్దకు చేరుకుంటున్న సమయంలో డ్రైవర్ కునుకుతీయడంతో లారీ అదుపు తప్పి వంతెను ఢీకొట్టి ఆగిపోయింది. అలాగే ముందుకు దూసుకెళ్లి ఉంటే కింద ఉన్న వాగులో పడి ప్రాణాపాయం సంభవించేది. లారీ సగం వంతెనై, మరో సగం కిందకు వేలాడుతున్నట్లు కనిపించడంతో వాహనదారులు అవాక్కయ్యారు.

## మహిళ ఆత్మహత్య

**ఆలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎ.గొనేహాల్ గ్రామానికి చెందిన శ్వేత (24) ఆత్మహత్య చేసుకుంది. బంధువులు, ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. మొలగవల్లి గ్రామానికి చెందిన శ్వేతను ఎ.గొనేహాల్ గ్రామానికి చెందిన నాగభూషణంతో నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే వీరికి సంతానం కలగకపోవడంతో చికిత్స తీసుకున్నా ఫలితం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్వేత మంగళవారం ఉరివేసుకుంది. బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థి అదృశ్యంపై కేసు

**గడివేముల, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పెసరవాయి గ్రామంలో పదో తరగతి చదువుతున్న జస్వత్ సోమవారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు మంగళవారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పెసరవాయి గ్రామానికి చెందిన శివశంకర్ మొదటి భార్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శివశంకర్, అతడి రెండో భార్య 10 సంవత్సరాల క్రితం మృతి చెందారు. వారి పిల్లలు మొదటి భార్య వద్దే ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రెండో భార్య కుమారుడు జశ్వంత్ సిగరెట్ కాల్చుతున్నాడని పెద్దమ్మ, అన్న మందలించారు. సోమవారం విద్యార్థి బస్సులో పాఠశాలకు వెళ్లిన జశ్వంత్ సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు ఆరా తీశారు. అతడి సోదరి శ్రీలేఖ గ్రామంలో కూడా జశ్వంత్ ఆచూకీ దొరకలేదు. దీంతో శ్రీలేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

## ప్రేమ పేరుతో బాలికను వంచించినందుకు

- 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.25వేలు జరిమానా

**కర్నూలు లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రేమ పేరుతో బాలికను లోబరుచుకుని లైంగికదాడి చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు, రూ.25వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా పోక్సో కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. జిల్లాకు చెందిన ఓ బాలిక (15) పీర్ల పండుగ కోసం తమ బంధువుల ఊరయిన ఆదోని మండలం బసరకోడు గ్రామానికి వెళ్లింది. అక్కడ షేక్ చాంద్‌బాషా అనే యువకుడు బాలికను పరిచయం చేసుకుని తరుచూ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రేమిస్తున్నాని చెప్పేవాడు. 2021 ఫిబ్రవరి 3వ తేదీన బాలిక ఉంటున్న పత్తికొండ బస్టాండుకు వచ్చి ఫోన్‌చేసి బాలికను ఇంటి నుంచి రమ్మని చెప్పాడు. మేజరయ్యే వరకు పెళ్లి చేసుకోనని బాలిక చెప్పినా వినకుండా ఇప్పుడు నీవు రాకపోతే మన ప్రేమ విషయం మీ ఇంట్లో వారికి చెబుతానని బెదిరించడంతో బాలిక బస్టాండుకు రాగా ఇద్దరు బెంగళూరు వెళ్లారు. బాలికను బలవంతంగా లొంగదీసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత బాలిక పత్తికొండకు తిరిగి వచ్చి తన తల్లిదండ్రులతో జరిగిన విషయం చెప్పగా పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి డోన్ డీఎస్పీ కేసును విచారించి షేక్ చాంద్‌బాషా అతని కుటుంబ సభ్యులపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. కేసు విచారణ దశలోనే 2వ నిందితుడు సలీం మృతి చెందగా.. మొదటి నిందితుడు షేక్ చాంద్ బాషాపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రాజేంద్రబాబు తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించే జరిమానాతో పాటు ప్రభుత్వం రూ.లక్ష బాలికకు నష్టపరిహారం చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సీవీ శ్రీనివాసులు వాదించారు.

## జీజీహెచ్‌లో దారుణం

- న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్ పక్కన శిశువు మృతదేహం

**కర్నూలు హాస్పిటల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ పక్కన ఖాళీ స్థలంలో గుర్తు తెలియని ఓ శిశువు మృతదేహం పడి ఉంది. ఆ శిశువు మృతదేహానికి చీమలు పట్టాయి. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో శిశువు మృతదేహాన్ని న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్ అబ్దుల్లా, సిబ్బంది గమనించి సూపరింటెండెంట్‌కు, పోలీసులకు సమాచారం అందించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి చూస్తే అక్కడ శిశువు మృతదేహం మాయమైంది. కర్నూలు జీజీహెచ్‌లో ప్రసవించిన శిశువు మృతి చెందడంతో అక్కడే పడేసి వెళ్లారా..? లేదా సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులలో ప్రసవించిన శిశువు మృతి చెందడంతో ఇక్కడే పడేసి వెళ్లారా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శిశువు మృతదేహానికి బొడ్డు పేగు చుట్టుకుని ఉంది. ఆసుపత్రిలో డెలివరీ అయిన వెంటనే బొడ్డు పేగును కోసి తల్లిదండ్రులకు అప్పగిస్తారు. అయితే బొడ్డు పేగుతో శిశువు ఉండటం వల్ల ప్రసవించిన వెంటనే మృతి చెందడంతో అక్కడే పడేసి వెళ్లారా..? అనే అనుమానం వ్యక్తమవుతోంది. అయితే మొత్తం వ్యవహారాన్ని ఆసుపత్రి వర్గాలు గోప్యంగా ఉంచాయి.

# చరిత్రను యువత తెలుసుకోవాలి

మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

- పరిశోధనల కేంద్రంగా క్లస్టర్ యూనివర్సిటీ
- రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

**కర్నూలు అర్బన్, జులై 1 (ఆంధ్రజ్యోతి):** జిల్లా చరిత్రను యువత తెలుసుకోవాలని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో కర్నూలు జిల్లా 167వ అవిర్భావ దినోత్సవాలను కర్నూలు జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు ఆచార్య షేక్ మన్సూర్ రహ్మాన్, ప్రముఖ వ్యాపారవేత్త, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ కల్కూర చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్ కట్ చేసిన సంబరాలు జరుపుకున్నారు. కర్నూలు జిల్లా ఆవిర్భావం.. ఘన చరిత్రపై క్లస్టర్ వర్సిటీలో అంతర్భాగమైన కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ బాలుర డిగ్రీ కాళాశాలలో వ్యాస రచన పోటీల్లో నిర్వహించారు. విజేత విద్యార్థులకు విజ్ఞానం పెంచే పుస్తకాలు, ప్రశంస పత్రాలు, సీల్డ్‌ను అందజేశారు. చెరగని చరిత్రకు చిరునామ కర్నూలు అని, ఇక్కడ పని చేయడం జీవితంలో మరవలేని ఘట్టమన్నారు. మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు ఆచార్య షేక్ మన్సూర్ రహ్మాన్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులు పాలెగాళ్ల పాలనను అంతం చేసి రాయలసీమగా పిలవబడే జిల్లాలను దత్త మండలాలుగా చేశారన్నారు. మొదట కడప, బళ్లారి జిల్లాలు ఉండేవని, 1858లో కర్నూలు జిల్లా ఏర్పడిందన్నారు. కల్కూర చంద్రశేఖర్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో ఎంతో వెనుకబడిన జిల్లా కర్నూలు.. సాగునీటి ప్రాజెక్టు కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు తక్షణమే చేపట్టాలన్నారు. జిల్లా ఘనచరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన వీరుల గురించి వివరించారు. అడ్మినిస్ట్రేషన్ డీన్ అత్తర్ బాను, ప్రభుత్వ బాలుర డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు సోమశేఖర్ తదితరులు పాల్గొని ప్రసగించారు.

# ఏకధాటిగా ఏఎన్ఎం గ్రేడ్-3 బదిలీలు

- 31 గంటలు విరామం లేకుండా కౌన్సెలింగ్
- డీఎంహెచ్‌వోను అభినందించిన కలెక్టర్, జడ్పీ సీఈవో

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

**కర్నూలు హాస్పిటల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు వైద్య ఆరోగ్యశాఖ రికార్డు స్థాయిలో సచివాలయ గ్రేడ్-3 ఏఎన్ఎం బదిలీల కౌన్సెలింగ్ కొనసాగింది. ఉమ్మడి జిల్లాకు చెందిన 751 మంది ఏఎన్ఎం గ్రేడ్-3లకు బదిలీల కౌన్సెలింగ్‌కు కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ అవిశ్రాంతంగా 31 గంటలు కౌన్సెలింగ్‌ను నిర్వహించి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి అభినందనలు అందుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 751 మంది సచివాలయ ఏఎన్ఎంలకు సోమవారం ఉదయం 7 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ పర్యవేక్షణలో డీఐవో డా. నాగప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఏవో కే.అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు మధుసూదన్, సంపత్ కుమార్, లోక సాయిరాజ్, జూనియర్ అసిస్టెంట్లు సోహాయిల్, హారిక కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు బదిలీల కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం ఏవో కొంత అస్వస్థతకు గురి కాగా, 10 నిమిషాల అనంతరం కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఏఎన్ఎం గ్రేడ్-3 కౌన్సెలింగ్ ప్రక్రియను మంగళవారం ఉదయం 11 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో జడ్పీ సీఈవో పరిశీలించారు.

## పించన్ తీసుకోడానికి గంట ముందు మృతి

**పాణ్యం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఇంకో గంట బతికుంటే సిరాజ్ అనే లబిదదానడే రూ. 15 వేలు పించన్ తీసుకునే వాడని మృతుని బంధువులు తెలిపారు. పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పాణ్యంకు చెందిన అచ్చుకట్ల సిరాజ్ (68)మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆ తార్వాత కొద్ది సేపపటికే డయాలసిస్ పించన్ ఇవ్వడానికి అధికారులు మృతుని ఇంటి వద్దకు వెళ్లారు. సిరాజ్ మృతితో పించన్ ఇవ్వలేదు. బంధువులు, స్థానికులు, టీడీపీ నాయకులు కోరినా ఫలితం లేకపోవడంతో అతి పేద కుటుంబానికి చెందిన సిరాజ్ భార్యకు పించన్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. సిరాజ్ భార్య అమీరున్‌బీ కేన్సర్ వ్యాధితో పదేళ్లుగా బాధపడుతోందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి పేర్కొన్నారు.

మృతుని భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకుడు

## ఏటీఎం కార్డు మార్చి రూ.50 వేలు చోరీ

**ఆదోని, జూలై 1(ఆంధ్రజ్యోతి):** మేడం.. ఏటీఎం పిన్ నంబర్ తప్పు కొట్టారు. అంటూ ఆ యువతి పెట్టిన ఏటీఎం కార్డును బైటికి తీసి, కార్డు మార్చి రూ.50 వేలు కొట్టేసిన ఘటన ఆదోని పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆదోని మండలం విరుపాపురం గ్రామానికి చెందిన ఓ యువతికి ఆదోని పట్టణంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆమె ఎమ్మిగనూరు టర్నింగ్‌లో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏటీఎం సెంటర్‌కు వెళ్లింది. తన ఏటీఎం కార్డు మిషన్‌లో పెట్టి పిన్ నంబర్ కొట్టగానే.. అక్కడే ఉన్న ఓ యువకుడు ఏటీఎం కార్డు బైటికి తీసి పిన్ తప్పు కొట్టారు మేడం.. అంటూ నమ్మబలికాడు. అక్కడే ఉన్న ఇంకో వ్యక్తి కూడా అదే మాట అని ఏటీఎం కార్డు మార్చేశారు. వారు మార్చి ఇచ్చిన ఏటీఎం కార్డును ఆమె మిషన్‌లో పెట్టి పిన్ నంబర్ కొట్టగా రాంగ్ అని చూపడంతో ఏటీఎం సెంటర్ నుంచి ఆమె బయటకు వెళ్లిపోయింది. ఆ తర్వాత అక్కడ ఉన్న ఇద్దరు యువకులు కూడా బయటకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఐదు నిమిషాల్లో ఆ యువతికి తన అకౌంట్ నుంచి రూ.49,990 డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. తన అకౌంట్‌లో ఉన్న అమౌంట్‌ను చెక్ చేసుకుంది. నిజగానే రూ.49,990 డ్రా అయినట్లు, మిగతా రూ.34 వేలు ఉన్నట్లు అకౌంట్ చూపించింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామస్వామి విచారణ చేయడంతో హర్యానాకు చెందిన సచిన్ అనే వ్యక్తి అమౌంట్ డ్రా చేసుకున్నట్లుగా తెలిసింది. వెంటనే సైబర్ క్రైమ్ వారికి ఆ యువతి ఫిర్యాదు చేసింది.

## సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోండి

లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

- నంద్యాల కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఎస్బీఐ ఉద్యోగులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్బీఐ 70వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి సూర్యఘర్ ముక్త్ బిజిలి యోజన పథకం కింద సోలార్ ప్యానల్స్‌కు దరఖాస్తు చేసుకున్న 100 మందికి మంజూరు చేసినట్లు తెలిపారు. నంద్యాల మండలంలో పాండురంగాపురం, డోన్ మండలంలో గోసానిపల్లె రెండు గ్రామాలకు సోలార్ ప్యానల్స్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ ఆర్ఎం వెంకట సూర్యప్రకాశ్, బీఎం శేషు పాల్గొన్నారు.

# వీరేష్ బంధువుల ఆచూకీ లభ్యం

- ఆదోనికి వచ్చిన మామ
- ఇప్పటికే తల్లిదండ్రులు, నానమ్మ మృతి
- విచారించి వారికి అప్పజెప్పిన అధికారులు

వీరేష్‌ను మేనమాకు అప్పగిస్తున్న సబ్‌కలెక్టర్, తహసీల్దార్

**ఆదోని, జూలై 1(ఆంధ్రజ్యోతి):** 31 ఏళ్ల క్రితం తల్లిదండ్రుల నుంచి తప్పి పోయి తిరిగి వచ్చిన వీరేష్ బంధువుల వివరాలు తెలిశాయి. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన '31 యేళ్ల తర్వాత తిరిగి వచ్చాడు' కథనాన్ని చదివిన వీరేష్ బంధువులు గుర్తుపట్టి ఆదోనికి చేరుకున్నారు. కర్నూలు సమీపంలోని సూదిరెడ్డి పల్లెలో ఉన్న మేనత్త లక్ష్మి, జగదీష్ వీరేష్‌ను గుర్తించి తహసీల్దార్ రమేష్ వద్దకు వచ్చారు. తమ వద్ద ఉన్న ఫొటోలు, రేషన్ కార్డులో ఉన్న నాన్నమ్మ అంజనమ్మ ఫోటోను చూపడంతో వీరేష్ గుర్తుపట్టాడు. కాగా వీరేష్ తండ్రి జనార్ధన్, తల్లి పద్మ, నాన్నమ్మ అంజనమ్మ అందరూ మృతిచెందినట్లు తెలియడంతో విలపించాడు. వీరేష్ తల్లిదండ్రులు కుమారుడు తప్పియాన్న బాధతోనే చనిపోయినట్లు బంధువులు తెలిపారు. ఎట్టకేలకు 31 యేళ్ల తర్వాత బంధువులు కలుసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వీరేష్‌ను బంధువులకు అప్పజెప్పారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

- అంకిరెడ్డిపల్లెలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు
- నెల క్రితమే ట్యాంకర్లు ఏర్పాటు చేయించిన మంత్రి బీసీ
- పర్యవేక్షణ లేకపోవడంతోనే సమస్య తీవ్రం

రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

**కొలిమిగుండ్ల, జూలై1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అంకిరెడ్డిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు రోడ్డెక్కారు. మంగళవారం గ్రామంలోని చింతలాయపల్లె రహదారి కాలనీలో నీటి సరఫరా సక్రమంగా లేదని, కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో అనంతపురం-అమరావతి ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కొలిమిగుండ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మహిళలకు సర్దిచెప్పారు. సంబంధిత అధికారులు వస్తున్నారని, సమస్యపై మాట్లాడతారని తెలపడంతో ప్రజలు ధర్నా విరమించారు.

**మేలోనే అప్రమత్తం చేసిన మంత్రి బీసీ**

మండలంలో రెండేళ్లుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మే నెలలోనే అధికారులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అప్రమత్తం చేశారు. అల్ట్రాటెక్ పరిశ్రమతో మాట్లాడి నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు స్థానిక టీడీపీ నాయకుల అంతర్గత కలహాలతో, ఎవరూ బాధ్యత తీసుకోక పోవడం సమస్య జఠిలం కావడానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## సులభ దర్శనానికి ఏర్పాట్లు

- దేవదాయశాఖ మల్టీజోన్- 2 డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

వసతి గృహాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

**మహానంది, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మహానందీశ్వరుడి సన్నిధికి వచ్చే భక్తులు సులభంగా దర్శనం చేసుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయశాఖ మల్టీజోన్-2 డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం మహానంది క్షేత్ర పరిధిలోని పలు విభాగాలను డీసీ తనిఖీ చేశారు. క్షేత్ర పరిధిలో అపరిశుభ్రతను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ మధులకు సూచించారు. అలాగే వసతి గృహాలను ఆధునికీకరించి భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. దేవస్థానం పరిధిలో దుకాణాలు, హోటళ్లను పరిశీలించి నిబంధనల ప్రకారం భక్తులకు ఆహార పదార్థాలు నిర్ణయించిన ధరలకు విక్రయించాలని యజమానులను ఆదేశించారు. అనంతరం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పసుపుల సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

**WANTED**

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్ కావలెను. అర్హత: డిగ్రీ, P.G. 2 సంవత్సరాలు ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసిన వారికి ప్రాధన్యత ఇవ్వబడును. సంప్ర. సెల్ నెంబర్: 99856 52221

AJL-236579

**ముస్లీం వివాహ సంబంధాలు**

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్: 87908 44959 (2వ సంబంధాలు కలవు)

AJL-236636

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 237881

**PASSPORT MISSING**

I, MAMIDURI ARUNACHALAM REDDY S/o. KRISHNA REDDY MAMIDURI, R/o.H.No: 87-1328, Engineers Colony, Kurnool dist, AP., have lost my Indian Original passport bearing No:S9490406, While I was travelling from my house to near Government General Hospital kurnool on 25.06.2025. If anyone found please inform to the above address Contact No: 9441264010

AJL-236469

FOR ADVERTISEMENTS CONTACT.
Cell: 99854 11369

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

Andhra Jyothi Classifieds
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

- టూర్స్ & ట్రావెల్స్
- ఉద్యోగఅవకాశాలు
- తలంబ్రాలు
- హెల్త్‌కేర్
- అమ్మకము
- కొనుగోలు
- కంప్యూటర్ శిక్షణ
- బ్యూటీకేర్
- రియల్ ఎస్టేట్

4 లైన్ల క్లాసిఫైడ్ కేవలం 240 రూ॥లు
ప్రతి అదనపు లైను 45 రూ॥లు మాత్రమే

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కోసం సంప్రదించండి.
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోండి.
99854 02121

## ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు: మంత్రి

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** నగరంలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్డీవో సందీప్, కర్నూలు, అర్బన్, కల్లూరు తహసీల్దార్లు వెంకట రమేష్, రవి, ఆంజనేయులుతో సమీక్షించారు. టీజీ భరత్ మాట్లాడుతూ మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారన్నారు. నగరంలోని పంప్‌హౌస్ సమీపంలోని ఉన్న గూడెం కొట్టాల ప్రజలకు ఇళ్ల పట్టాలు అందిస్తామని యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు పట్టాలు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇళ్ల పట్టాలిచ్చిన వారికి స్థలాలు లేవని, చాలా మంది తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఏపీటీఎస్ క్యాంపు ప్రభుత్వ గృహసముదాయాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను పూర్తిగా తొలగించి, ఆ స్థలాలను ప్రజల అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని ఆదేశించారు.

## వర్గీకరణ విజయోత్సవ సభకు తరలిరండి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ**

మాట్లాడుతున్న కృపాకర్ మాదిగ

**కర్నూలు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ప్రకాశం జిల్లాలోని ఈదుమూడి గ్రామంలో జరిగే ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రామాంజనేయులు అధ్యక్షతన కర్నూలులో జరిగిన మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి కృపాకర్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్జీ ప్రకాశ్‌మాదిగ, రెడ్డిపోగు డేవిడ్ మాదిగ, ఏవీ సుబ్బయ్య మాదిగ, విశ్రాంత డీఎస్పీ పాపారావు మాదిగ, ప్రొఫెసర్ పుల్లయ్య శేషయ్య, మోజెస్ మాదిగ, చంద్రుడు మాదిగ పాల్గొన్నారు.

## బిల్లులు ఇవ్వకపోతే సమ్మెకు సిద్ధం

**కర్నూలు న్యూసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** నగర పాలకలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇవ్వకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని గ్రేటర్ కర్నూలు కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రంగయ్య మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి క్యాష్ రిపోర్టులు రాకపోవడంతో నగర పాలక అధికారులు బిల్లులు చెల్లింపులో జాప్యం వహిస్తున్నారన్నారు. చేసిన పనులకు సంబంధించి ఒక్క నెలలో బిల్లులు సమర్పిస్తే అధికారులు బిల్లులకు సంబంధించి ఎం.బుక్ అప్‌లోడ్ చేయడానికి మూడు నెలల వ్యవధి తీసుకుంటున్నారని అన్నారు. ప్రధాన కార్యదర్శి మురళీ మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఈశ్వరీనివాసరెడ్డి, కోశాధికారి కె.రంగస్వామి, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లురెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తార్ బాషా, శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించండి

**ఓర్వకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లులో నెలకొన్న విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని మండల కన్వీనర్ గోవిందరెడ్డి, గ్రామస్థులు మంగళవారం ఏఈ సునీల్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఓర్వకల్లులో గత కొంత కాలంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడం, లోఓల్టేజీ సమస్య వల్ల ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, నాగరాజు, చాంద్‌బాషా, ఆదాంబాషా పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయాలి

**కర్నూలు న్యూసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** మధ్యాహ్న భోజన పథకాన్ని ఇతరులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఏజెన్సీలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు.

## మైనర్‌లో గ్రాడ్యుయేషన్ డే

**కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** స్థానిక ఎ.క్యాంపులోని మైనర్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జేఎన్టీయూ డైరెక్టర్ అకాడమిక్ ఆడిట్ డాక్టర్ దుర్గాప్రసాద్ హాజరై ప్రసంగించారు. ఫార్మసీ రంగానికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, కళాశాల టాపర్లకు మెడల్స్‌ను డాక్టర్ దుర్గాప్రసాద్, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్. నిరంజన్ బాబు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డా.స్నేహ సతీష్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్ పాల్గొన్నారు.

## 4న లేజర్ రన్ ఎంపిక పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 4న ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల విభాగాల్లో లేజర్ రన్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మోడరన్ పెంటాథలాన్ సెక్రటరీ మంచికంటి అవినాష్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11 నుంచి 13 వరకు నరసరావు పేటలో జరగబోయే 9వ రాష్ట్ర స్థాయి మోడరన్ పెంటా తలాన్ లేజర్ రన్ పోటీలకు ఉమ్మడి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే జిల్లా క్రీడాకారులు రూ.50 ప్రవేశ రుసుంతో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9247400100ను సంప్రదించాలని సూచించారు.

## ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

**కర్నూలు న్యూసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. మంగళవారం పదవీ విరమణ పొందిన ప్రజారోగ్య విభాగం సూపర్‌వైజర్ ఇ.దామోదర్, లైన్‌మెన్ టీవీ రమణను కమిషనర్ సత్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ తర్వాత శేష జీవితాన్ని తమ కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగికి సన్మానం

**కోడుమూరు రూరల్:** మండలంలోని లద్దగిరి పంచాయతీ కార్యదర్శి భూపాల వెంకటేశ్వర్లు బదిలీ కావడంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు భూపాల వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో దేవరాజు, మిన్నల్లా, హుసేన్, గిడ్డయ్య, రవి, అబ్దుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'సుపరిపాలన తొలి అడుగు' విజయవంతం చేద్దాం

**పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి**

**కల్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంటింటికీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై

మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఓర్వకల్లు, కల్లూరు అర్బన్, రూరల్ మండలాల బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను విడుదల చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పాణ్యం పరిశీలకులు ఆదెన్న, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, ఈవీ రమణ. ఎస్.ఫిరోజ్, పీయూ మాదన్న, మహానంది, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ కోరారు. మంగళవారం మండలంలోని హుశేనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 30 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలనకు తొలి అడుగు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గాల్లోని ప్రతి ఇంటికీ బూత్ సభ్యులు వెళ్లి టీడీపీ ఈ ఏడాదిలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయలన్నారు. జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో సుపరిపాలనకు తొలి అడుగు - డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తూ దేశానికి నవ్యాంధ్రప్రదేశ్‌ను రోల్ మోడల్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లాలు మహ్మద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నాయకులు

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

**కర్నూలు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో మంగళవారం అధికారులు చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఆయన వెంట కర్నూలు మండల ఎంపీడీవో రఘునాథ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, దిన్నెదేవ రపాడు గ్రామ సర్పంచు మాధవస్వామి, టీడీపీ నాయకులు సుబ్బయ్య, ఆచారి, చిత్రసేనుడు పాల్గొన్నారు.

**గూడూరు:** సీఎం చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు జే.సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కె.నాగులాపురం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్రాముడు, ఎంపీటీసీ మద్దిలేటి, తిరుపాల్ పాల్గొన్నారు.

● సుపరిపాలన తొలి అడుగు- ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ అన్నారు. మంగళవారం కె.నాగులాపురంలో టీడీపీ నాయకులతో సమా వేశం నిర్వహించారు.

**ఓర్వకల్లు:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం పింఛన్‌దారులకు వరం లాంటిదని టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి అన్నారు. మంగళవా రం మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఆయనతోపాటు అధికారులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. అలాగే మండలంలోని పూడిచర్ల, కన్నమడకల, కేతవరం, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

**కల్లూరు:** అర్హులకు ఇంటివద్దకే ఏన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తున్నట్లు కల్లూరు మండలం నోడల్ ఆఫీసర్, సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో పర్యటించి ఎంపీడీఓ, టీడీపీ నాయకుడు టి.వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

దిన్నెదేవరపాడులో పింఛన్ డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కల్లూరు మండలం కొంగనపాడులో..

ఓర్వకల్లులో..

గూడూరు మండలం కె.నాగులాపురంలో..

## తరగతుల విలీనాన్ని ఆపాలి

**కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా**

**కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 3 నుంచి 8 తరగతుల వరకు విద్యార్థులను సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయడాన్ని విరమించుకోవాలని పీడీఎస్‌యూ, బీఎస్‌యూ, ఏఐడీఎస్‌వో విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలియజేశారు. విద్యార్థులు మా స్కూల్ మాకే కావాలి... తరగతుల విలీనాన్ని ఆపండంటూ నినాదాలు చేశారు. తరగతులను విద్యార్థులకు అదే పాఠశాలలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల వద్దకు డీఈవో శామ్యూల్‌పాల్ వచ్చి నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా ఈ సమస్యపై స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం పై విద్యార్థిసంఘాల నాయకులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో కార్యదర్శి మల్లేష్, పీడీఎస్‌యూ అస్లాం, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్, బీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు దత్తు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

## యోగా విద్యార్థులకు కలెక్టర్ అభినందన

**కర్నూలు కలెక్టరేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీల్లో విజేతలైన 19 మంది విద్యార్థులను కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు దైనందిన జీవితంలో యోగా సాధన అంతర్భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు విద్యార్థులు యోగా సాధన చేయడం కోసం ప్రత్యేకంగా సెంటర్‌ను ఏర్పాటు చేస్తానని అన్నారు. జిల్లా స్థాయిలో వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై విజయవాడలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిబ కనబరచడం అభినందనీయమన్నారు. కర్నూలు నగరానికి చెందిన యోగా గురువులు అవినాష్‌శెట్టి, ఎస్.ముంతాజ్ బేగంలను కలెక్టర్ సన్మానించారు. సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

# సీనియర్ వైద్యులు ఆదర్శప్రాయులు

● మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ
● ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**కర్నూలు హాస్పిటల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు వైద్య కళాశాలలో బోధానసుపత్రిలో పని చేసిన సీనియర్ వైద్యులు ఆదర్శవంతులని, వారి అడుగుజాడల్లోనే నడవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని కాలేజీలోని కౌన్సిల్ హాలులో సీనియర్ వైద్యులను కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ సన్మానించారు. సీనియర్ వైద్యులు డాక్టర్ సుదర్శన్ (ప్లాస్టిక్ సర్జరీ), డా.నిరుపమ (రిటైర్డు డీఎంహెచ్‌వో), డా.పిఎన్.జిక్కి (నెప్రాలజీ), డా.అబ్దుల్ గఫూర్ (రేడియాలజి) డా.ఉదయ్ కుమార్ (డీవీఎల్), డా.జాహ్నవి, డా.వెంకటరమణ (గైనిక్), డా.గిడ్డయ్య (అప్తామాలజి) డా.కే.సీతారామయ్య (యురాలజి), డా.మహేంద్ర కుమార్ (ఈఎన్‌టీ) తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్లు సాయి సుధీర్, రేణుకాదేవి, విజయానంద్‌బాబు, సింధియా శుభప్రద, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

డాక్టర్ శంకర్‌శర్మను సన్మానిస్తున్న డెంటల్ కాలేజీ వైద్యులు, డాక్టర్ల వేషధారణలో చిన్నారులు

**డాక్టర్ శంకర్‌శర్మకు సన్మానం:** జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రా లజిస్టు డాక్టర్ శంకర్‌శర్మను ఘనంగా సన్మానించారు. శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం, ధ్యానం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ డా.వై.మురళీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.నాగలక్ష్మిరెడ్డి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

**మెడికవర్ హాస్పిటల్‌లో..** కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో మంగళవారం చిన్నారులతో కలిసి డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కర్నూలు మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు మొక్కలు నాటారు. హాస్పిటల్ సీఈవో డా.సునీల్ సేపూరి మాట్లాడారు.

**కర్నూలు కల్చరల్:** అమ్మ జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మ ఇస్తారని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్, సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, బాలసాయి కంటి ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్ర మానికి జనరల్ సర్జన్ డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న వైద్యులను సన్మానించడం అభినందనీయమని అన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్లు జయప్రకాశ్, ప్రభాకర్, రంగనాయకులు, బాల ఈశ్వరయ్యలకు డాక్టర్ బీసీ రాయ్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డులను అందజేశారు. అలాగే గైనకాలజిస్టు డాక్టర్లు ప్రత్యూష, ప్రవీణ్, రవితేజ, జ్యోత్స్న, విజయ్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్స్ గౌరవాధ్యక్షుడు కేడీజే బాబు పాల్గొన్నారు.

**కర్నూలు ఎడ్యుకేషన్:** స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్క రించుకుని మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిన్న పిల్లల వైద్యనిపుణుడు జి.భరత్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం పండ్లు, కూరగాయలు, చిరు దాన్యాలను తీసుకోవాలన్నారు. ప్రజలకు చేస్తున్న సేవలు చేస్తున్న వైద్యులందరికీ పాఠశాల సీఈవో గోపినాథ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యనిపుణుడు జనార్దన్‌రెడ్డి, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్, ఉపా టధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ వైద్యులతో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

సత్కారం పొందిన వైద్యులతో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

**కర్నూలు కల్చరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో కొనసాగుతున్న వారాహిదేవి నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

**ఓర్వకల్లు:** మండల కేంద్రమైన ఓర్వకల్లులో వెలసిన సుంకులా పరమేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మ వారిని వివిధ పుష్పాలతో, కూరగాయలు, పండ్లు, నిమ్మకాలతో అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి శక్తి గణపతి పూజ, సహస్రధారాభిషేకం, శాకాంబరి పూజలు, మహా మంగళహారతులిచ్చారు.

## గృహాలు నిర్మించుకోకుంటే రద్దు చేస్తాం

**సి.బెళగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోకుంటే వాటిని రద్దు చేస్తామని ఎంపీడీవో రాణెమ్మ హెచ్చరించారు. సోమవారం మండలంలోని కంబందహాల్, సి.బెళగల్ గ్రామాల్లో నిర్మిస్తున్న గృహాలను ఎంపీడీవో పరిశీలించారు. ఆమె వెంట ఏఈ సుమంత్, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ రంగన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## రుణాలను సకాలంలో చెల్లించాలి

**సి.బెళగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. మంగళవారం మండల వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ పొదుపు మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసమావేశంలో బుక్ కీపర్లు, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

**కర్నూలు న్యూసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** నగరంలోని పలు ప్రాంతాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బాబా బృందావన్ నగర్‌లో పర్యటించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ బాబా బృందావన్ నగర్‌లో గత ఐదేళ్లుగా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇంకా ఎన్ని రోజులు డబ్బులు పెట్టి నీళ్ల కొనాలని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో స్థానికుడు రహంతుల్లా, కమిటీ సభ్యులు మహ్మద్ యూనుస్, షేక్ అన్వర్ బాషా పాల్గొన్నారు.

## మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**సి.బెళగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** మొహర్రం పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ పరమేష్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్రేవుల, చింతమానుపల్లె, బ్రాహ్మణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లోని ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మి గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో మొహర్రం సందర్భంగా గొడవలు సృష్టిస్తే ఊరుకోమన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ప్రసిడెంట్ తిమ్మప్ప, విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, దూద్‌వలి, వెంకటరమణ, రసూల్, బాబు పాల్గొన్నారు.

## వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** స్థానిక ఇందిరాగాంధీ కాలనీలోని ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్ వార్డెన్ వెంకటరెడ్డిపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, జిల్లా అధ్యక్షుడు శరత్ కుమార్ డిమాండ్ చేశారు.మంగళవారం సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రంగలక్ష్మీదేవిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డెన్ విద్యార్థులకు మెనూ ప్రకారం టిఫిన్, భోజనం, కోడిగుడ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు.

## విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

**కల్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పందిపాడు టీడీపీ నాయకుడు శేఖర్‌చౌదరి అన్నారు. మంగళవారం 28వ వార్డు పందిపాడు ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను శేఖర్‌చౌదరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీడీపీ నాయకులు లక్ష్మణ్‌యాదవ్, నాగరాజు, రవి, శివ పాల్గొన్నారు.

## ఉపాధి ప్రదాత దామోదరం మునిస్వామి

**కల్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఉపాధి ప్రదాత దామోదరం మునిస్వామి అని దామోదరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డి.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం మునిస్వామి 98వ జయంతిని పురస్కరించుకుని పెద్దపాడులోని సంజీవయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కళ్లే ఈశ్వరయ్య, ఎస్.రంగస్వామి, పోతుల శేఖర్, అయ్యస్వామి, వేణు పాల్గొన్నారు.

## దేవనకొండ ఎంపీడీవోగా జ్యోతి

దేవనకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా ఎస్.జ్యోతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా కమలాపురంలో పనిచేస్తున్న ఆమె బదిలీపై దేవనకొండకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన బీవీ రమణరావు పదవీ వీరమణ పొందడంతో అధికారులు జ్యోతిని దేవనకొండకు పంపారు.

## ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు : సీఐ

అవగాహన కల్పిస్తున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్

తుగ్గలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, హాస్టళ్లలో ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ హెచ్చరించారు. మంగళవారం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు వగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లల బంగారు భవిష్యత్తు కోసం హాస్టల్స్, కళాశాలలకు పంపుతారని, బుద్ధిగా చదువుకోవాలన్నారు. క్రమశిక్షణ ఉంటేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన,ఇ ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేసి హాస్టల్ నుంచి ఇంటికి పంపుతారని అన్నారు. ఎస్‌వో షాహీన్, ఉపాధ్యాయులు కవిత, తదితరులు ఉన్నారు.

## సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి

రైతులతో మాట్లాడుతున్న ఏవో సుధాకర్

ఆదోని రూరల్, జూలై 1 ఆంధ్రజ్యోతి): సాగులో రైతులు నూతన సాంకేతిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని ఏవో సుధాకర్ సూచించారు. మంగళవారం సిబ్బందితో కలిసి మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాలను పరిశీలించారు. పంట మార్పిడి తప్పనిసరి అని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకే మందులను వినియోగించాలన్నారు. కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎఈవో సతీష్, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి విమల బాయి, ఎంపీఈవో భారతి ఉన్నారు.

## వైసీపీ కార్యవర్గ సభ్యుడిగా చంద్రశేఖర్

మద్దికెర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకుడు గంధం చంద్రశేఖర్‌ను పార్టీ ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడిగా నియమించింది. చంద్రశేఖర్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ విష్ణు, మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు.

## బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా ఎమ్మెల్యే

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మధుసూదన శర్మ

ఆదోని టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పార్థసారథిని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక చేయడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వెల్లా మధుసూదన శర్మ, కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఎమ్మెల్యేను సన్మానిం చారు. పార్థసారథికి జాతీయస్థాయిలో పదవి లభించడంతో ఆదోని నియోజకవర్గానికి గుర్తింపు లభిస్తుందని, నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కావడానికి అవకాశం కలిగిందన్నారు.

# రైతులతో ఆటలు..

- రీ సర్వే లోపాలు సరిచేయకుండా రైతులను తిప్పుకుంటున్న రెవెన్యూ అధికారులు
- భూమి తక్కువగా చూపుతుండటంతో అవస్థలు పడుతున్న రైతులు

కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు

మద్దికెర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో వైసీపీ హయాంలో చేసిన రీ సర్వేలో అవకతవకలుగా చోటుచేసుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు గ్రామాలు హంపా రెవెన్యూ పరిధిలో ఉండగా, దాదాపు 5వేల ఎకరాలు సాగు భూమి ఉంది. గతంలో అన్యాయం జరిగిం దని, కూటమి ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తారని రైతులు ఆశించారు. తమ భూ సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకంతో రైతులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుతున్నారు. అన్ని ధ్రువపత్రాలు ఉన్నా రెవెన్యూ అధికారులు కనికరం చూపడంలేదని వాపోతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ గుండాల్ నాయక్ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని, ఎవరికీ ఎటువంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని వివరణ ఇచ్చారు.

**ఎకరా తక్కువగా వచ్చింది**

పెద్దల నుంచి ఐదెకరాల పొలం వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే చేసి ఎకరా తగ్గించారు. న్యాయం చేయాలని ఆరు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. - ప్రతాప్, బసినేపల్లి

**తిప్పుకుంటున్నారు**

నా పొలానికి సంబంధించిన అన్ని రికార్డులు ఉన్నాయి. అయినా 1.5 ఎకరాలు చూపించడం లేదు. రోజూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. - ఏసప్ప, బసినేపల్లి

## సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

దేవనకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలందిచినప్పుడే ఉద్యోగికి గుర్తింపు వస్తుందని వైద్యాధికారి డా.విజయభాస్కర్ అన్నారు. పీహెచ్‌సీలో సూపర్‌వైజరుగా పనిచేసి పదవీవిమరణ పొందిన హనుమంతమ్మను మంగళవారం సిబ్బంది వైద్యాధికారులు కళ్యాణ్, వెంకటేశ్వర్లు, ఆరుణజ్యోతి, హెచ్‌వోలు సాయిబాబ, రంగస్వామి పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం పెట్టాలి

మద్దికెర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. మంగళవారం మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను ఇస్తోందన్నారు. హెచ్‌ఎం బసవరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు

మాట్లాడుతున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బుధవారం నుంచి నెల రోజులపాటు నిర్వహించనున్న సుపరిపాలన అంశంపై నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం, పెన్షన్ల పెంపుదల అమలుపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. ఏబీసీ బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, వెంకన్న, అశోక్, తిప్పయ్య, అట్టేకల్ బాబు, తిప్పయ్య, మల్లప్ప, బసవరాజు, మల్లికార్జున, నరసప్ప, కొమ్ము రాజు, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

## కండీషన్ లేని బస్సులను నడపవద్దు : డీఎస్పీ

సూచనలు చేస్తున్న డీఎస్పీ, ఎంవీఐ

ఆదోని, జూలై1(ఆంధ్రజ్యోతి): కండీషన్ లేని బస్సులను నడపకూడదని డీఎస్పీ హేమలత సూచించారు. మంగళవారం భాష్యం స్కూల్ ఆవరణలో బస్సులను ఎంవీఐ శిశిరదీప్తి, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో బస్సులను తనిఖీ చేశారు. డ్రైవింగ్ విషయంలో యాజమాన్యం, డ్రైవర్లకు సూచనలు చేశారు. బస్సులకు సంబంధించిన రికార్డులు అన్నీ అప్‌డేట్‌లో ఉండాలని, డ్రైవర్లు యూనిఫాం కలిగి ఉండి పిల్లలు బస్సులో నిలుచోకుండా, కిటికీలోంచి తలలు బయటికి పెట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న మహిళా రైతులు

పత్తికొండ;టౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): దళితులు సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని దళిత మహిళా రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళ చేశారు. వారు మాట్లాడుతూ ఆస్పరి మండలం కైరుప్పల గ్రామ సర్వే నెం. 578లో 23 ఎకరాల ప్రభుత్వ భూమిని 40 ఏళ్లుగా 12 పేద దళిత కుటుంబాలు సాగుచేసుకుని జీవిస్తున్నారన్నారు. అయితే ఆస్పరికి చెందిన రాజగోపాల్, బిల్లేకల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు పంటలను దున్నేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులకు గురి చేస్తున్న రాజగోపాల్, వెంకటేశ్వర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అక్రమ పట్టాలను రద్దు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు.

## తోటలు సాగు చేయండి

మద్దికెర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉపాధి పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకోవాని ఏపీవో నర్సిరెడ్డి సూచించారు. మంగళవారం కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు రైతుల నుంచి వివరాలు సేకరించాలన్నారు.

## టీబీని ఓడించండి

మాట్లాడుతున్న కౌన్సిలర్ వైజీ బాలాజీ

ఆదోని టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీబీని ఓడించి దేశాన్ని గెలిపించాలని కౌన్సిలర్ వైజీ బాలాజీ అన్నారు. మంగళ వారం సంతపేటలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు. టీబీ రహిత దేశంగా రూపొందిం చాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. బాధితులు ఉచిత వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌సాగర్ టీబీ లక్షణాలను నివారణో పాయాలను వివరించారు. సూపర్వైజర్లు బాబురాజు, సీతారాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నీలకంఠ

మాధవ్‌ను సన్మానిస్తున్న నీలకంఠ

ఆదోని టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కునిగిర నీలకంఠ మంగళవారం విజయవాడలో శుభాకాంక్షలు తెలిపారు. మాధవ్ సారథ్యంలో పార్టీ ప్రజలకు చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు పులికొండలో సుపరిపాలనలో తొలి అగుడు

పత్తికొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికొండ గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ కన్వీనర్ కడవల సుధాకర్ తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్యాంబాబు పాల్గొని ఇంటింటికి తిరిగి ఏడాది పాలనను ప్రజలకు వివరిస్తారన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్‌కు సమస్యలు విన్నవిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్

తుగ్గలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్ కోరారు. మంగళవారం తహసీల్దార్ రవిని కలిసి సమస్యలను విన్నవించారు. రీసర్వేతో భూముల రికార్డులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, వాటన్నింటిని సరిచేసి, కొలతలు వేసి ఇవ్వాలన్నారు. అలాగే గిరిజన రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

## గుర్తింపు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలి

తుగ్గలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలనే రైతులకు అమ్మాలని ఏవో సురేష్ యాదవ్ సూచించారు. మండలంలోని జొన్నగిరిలో మంగళవారం ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే రైతులకు మందులను విక్రయించాలని, ఆన్‌లైన్ బిల్లులు ఇవ్వాలన్నారు.

## అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 1 (ఆంధ్ర జ్యోతి) తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మంగళ వారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు పిరా సాహెబ్, సోమన్న మాట్లాడుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె 29 రోజులైనా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కరీముల్లా అహ్మద్, కర్రెప్ప, వీరేష్, రామంజి, దాదు, పక్రుద్దీన్ ఎలక్ట్రికల్ భాష, అల్తాఫ్ కైలాస్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 201/2021
M. Naga Swamy Naik ...... వాది
-Vs-
M.GURVAIAH, S/o M.Gangulaiah, APSRTC Conductor No. 40664, Adoni Depot, APSRTC Bus Stand, Adoni town, Kurnool District . ...... ప్రతివాది
దావా సమాను
ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా వాది మీపై దాఖలు చేసిన దావా కేసులో మీకు ఎన్ని మార్లు కోర్టు నుంచి దావా సమన్లు పంపినను తీసుకోనందున ఇందు మూలముగా మీకు తెలియజేయడమేమనగా పై కోర్టులో పై కేసు 04-08-2025వ తేదిన వాయిదా వేసియున్నారు. ఆ రోజు నీవు ఉదయం 10.30గం.లకు పై కోర్టులో స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
వాయిదా తేది:04-08-2025
టి. మల్లికార్జున్ రెడ్డి, B.Com., B.L, వాది పరం అడ్వకేటు, ఆత్మకూరు, నంద్యాల జిల్లా. సెల్ 94400 92111

## హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి

క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. మంగళవారం ఆలూరులోని ఉమా కళ్యాణ మండపంలో చంద్రబాబు షూరిటీ మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించారు. సూపర్ సిక్స్ పథకాలు అందలేదని, చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అని చెబుతూ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు మీకు ఎంత అప్పు ఉన్నారో చూపిస్తుందన్నారు. దొంగ హామీలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇంతవరకూ ఇవ్వలేద న్నారు. 18 సంవత్సరాల మహి ళలకు నెలకు రూ.1,500లు, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. ఏడాదికే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిం దన్నారు. తెర్నేకల్ సురేంద్రరెడ్డి, మల్లికార్జున, మారయ్య, ఎంపీపీ రంగమ్మ, దేవనకొండ, ఆస్పరి, జెడ్పీటీసీ కిట్టు, దొరబాబు, వైసీపీ నాయకులు గిరి, భాస్కర్, శీనప్ప, శేషప్ప, లుమాంబ, అరికెర వీరేష్, నీలకంఠ, రామాంజనేయులు, మహానంది, కొట్టాల రాజు, వరుణ్ పాల్గొన్నారు.

## రైతుల కోసం పోరాడతాం

తుగ్గలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికి పోరాడతామని వైసీపీ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాబాదులో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని ఏడాది గడిచినా రైతులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల నగదును రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. తనను జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నిక చేసిన అధినేత జగన్ మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు రాధాకృష్ణ, నారాయణ, రంగన్న, ఓబులేసు, లక్ష్మన్న ఉన్నారు.

## బడికెళ్లాలంటే ఆటోలే దిక్కు

మండలంలోని లింగంపల్లి గ్రామంలో 60 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరు రోజూ 4 కి.మీ.ల దూరంలోని హెబ్బటం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. బస్సులు లేకపోవడంతో ఒక్కో ఆటోలో 35మంది విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రమాదం సంభవిస్తే ఎలా అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - హొళగుంద.

## కనీస వేతనం కోసం ఉద్యమించాలి

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ

ఆదోని అగ్రికల్చర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం కోసం అంగన్వాడీ వర్కర్లు ఉద్యమించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం రెవెన్యూ భవనంలో సరోజ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. కనీస వేతన నెలకు రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీఐటియూ నాయకులు పద్మా, వరలక్ష్మి, రేణుక, పుష్ప, లక్ష్మిదేవి, లలితా, రాజేశ్వరి, మంజుల భాను పాల్గొన్నారు.

ఆదోనిలో డాక్టర్లను సన్మానిస్తున్న సభ్యులు.. పత్తికొండలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

## వైద్యులను గౌరవించాలి

ఆదోని టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేస్తున్న వైద్యులను గౌరవించాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ గోపీనాథ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్యులను సన్మానించారు. వెద్యులు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. వైద్యులు కృష్ణమూర్తి, ఆయేషా, గోపీనాథ్, ప్రసాద్ రావు, క్లబ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారెడ్డి కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా కోశాధికారి వర్ణప్పరాజు విశిష్ట సభ్యులు నీలి మోహన్, గోవిందరాజు మూర్తి పాల్గొన్నారు

- ఆవోపా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు అంతర్జాతీయ వైద్యుల దినోత్సవంతో పాటు చార్టెడ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్, గంగాధర్ రావు, డాక్టర్ అనురాధ, డాక్టర్ వాసవి, సీఏ రవిశంకర్‌ను సన్మానించారు. సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా కార్యదర్శి రఘు కోశాధికారి వెంకటేశ్వర్లు సభ్యులు రఘు, రాజేష్ పాల్గొన్నారు.

**పత్తికొండ:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం డాక్టర్స్‌డే నిర్వహించారు. వైద్యాధికారి కల్పన ఆధ్వర్యంలో వైద్యులు కేక్ కట్‌చేశారు. సమాజంలో వైద్యవృత్తికి ప్రత్యేకస్థానం ఉందదని డా.కల్పన అన్నారు.

**మద్దికెర:** వైద్యులు అవిశ్రాంతంగా సేవలందిస్తారని మండల ఆర్‌ఎంపీ సంఘం అధ్యక్షుడు వలిసాహెబ్, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి, జిలానీబాషాను సన్మానించారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, వైద్యసిబ్బంది అక్బర్‌బాషా, సూర్యనారాయణ, రంగస్వామి, వినోద్, తదితరులు ఉన్నారు.

**వెల్దుర్తి:** ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి, వైద్యులు భారతి, సాహిత్య, వరప్రసాద్, రాజశేఖర్, భానుమంజీర పాల్గొన్నారు

# ప్రైవేటు పాఠశాలల దందా..

- నిబంధనలకు నీళ్లు
- అధిక ఫీజులు వసూలు
- మౌలిక వసతులు కరువు
- తల్లిదండ్రుల బాధ పట్టించుకునే వారు కరువు

పెద్దకడబూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందించాల్సిన యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. తమ బిడ్డలను మంచి విద్యావంతులు తీర్చిదిద్దాలనే తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం పాఠశాలల వద్ద ఏర్పాటు చేయాల్సిన ఫీజులు బోర్డులు ఎక్కడా కనిపించవు ఒక వేళ కనిపించిన బోర్డులో ఒక్క రేటు వారి టేబుళ్ల పై మరో రేటు ఉంటుంది. దీంతో చేసేదేమి లేక యాజమాన్యాలు చెప్పినంత చెల్లించక తప్పడం లేదు.. ఫీజులు చెల్లించినా..తమ బిడ్డలకు కనీస సౌకార్యలు లేవని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**● అధిక ఫీజులు వసూలు:**
నర్సరీ నుంచి యూకేజీ వరకు రూ 5వేల నుంచి 7వేల దాక , ఒకటో తరగతి నుంచి మూడవ తరగతికి రూ 10వేల నుంచి 13 వేల వరకు ఇలా ఒక్కో తరగతికి ఏటా రూ 3 వేల నుంచి 5వేల వరకు పెంచు తున్నాయి. దీనికి అదనంగా బుక్స్ ఫీజులు,బెల్ట్ టై వంటి వాటికి అదనంగా బాదేస్తున్నారు.

> కడుపు కాల్చుకుని.. కన్న బిడ్డల భవిష్యత్తే.. తమ ధ్యేయంగా అహర్నిశలు కష్టపడే ప్రతి తల్లిదండ్రుల ఆవేదని ఇది.. వేలకు వేలు ఫీజులు కడుతున్నా.. తమ బిడ్డలకు కనీస సౌకర్యాలు కూడా పాఠశాల యాజమాన్యాలు కల్పించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆ బిడ్డల ఆవేదన చూసి సగటు అమ్మ, నాన్న చెందుతున్న వేదన ఇది. ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు నిఘా ఉంచాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తం అవుతున్నాయి.

**● మౌలిక వసతులు కరువు..**
ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు దండుకునే విషయంలో ఉన్నంతా శ్రద్ధ వారికి కావాల్సిన మౌలిక వసతులను కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు, మూత్రశాలలు కానీ ఉండటం లేదు. విద్యార్థులు చేసేదిమి లేక ఆరుబయటే అన్నీ కానిచేస్తున్నారు. విద్యకు తప్ప ఆటలకు, విద్యార్థుల భద్రతకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**● నిబంధనలు గాలికి...**
ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేయాలంటే భవనాలు ఉండాలి.. అలా కాక రేకుల షెడ్డుల్లో, సిమెంట్ పెంకులతో షెడ్లను ఏర్పాటు చేసి దానిలో తరగతి గదులును నిర్వహిస్తారు. వాన, ఎండకాలల్లో విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి కావాల్సిందే. అంతే కాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల ఏర్పాటుకు ముందు అగ్నిమాపకశాఖ నుంచి ఫైర్ సర్టిఫికెట్ పొందాలి. సంబంధిత శాఖ అధికారుల భవనాన్ని అనుకూలతను పరిశీలించి అనువుగా ఉంటే అనుమతులు ఇవ్వాలి. అలా కాకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అనుమతులు పోందుతున్నారు. భవనాలు సంగతి అటు ఉంచితే ఇక్కడా రేకులా షెడ్డుల్లో, సిమెంటు పెంకులతో ఏర్పాటు చేసిన పాఠశాలలను పరిశీలించకుండా పేపర్ల ఆధారంగానే సర్టిఫై చేస్తున్నారని అదే విధంగా. విద్యాశాఖ అధికారులు కూడా మామూళ్లు తీసుకొని చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**● ఉపాధ్యాయుల అర్హతలూ ప్రకటించాలి...**
ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది విద్యార్హతలతో కూడిన బోర్డులను సైతం కచ్చితంగా ఏర్పాటు చేయాలి. కానీ ఏ ప్రైవేట్ పాఠశాలలో కనిపించడం లేదు. చాలా పాఠశాలలు 10వతరగతి, ఇంటర్ చదివిన వారిని తీసుకోని పాఠశాలలను కొనసాగిస్తున్నారు. విద్యార్హత ఉన్న ఉపాధ్యాయులు తీసుకుంటే అధిక జీతాలు ఇవ్వాలి ఉంటుందని 10వతరగతి, ఇంటర్ చదివిన ఉపాధ్యాయులును తీసుకుంటే తక్కువ జీతాలు ఇచ్చి పని చేయించుకోవచ్చు అని వారిని తీసుకుంటున్నా నేఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### చర్యలు తీసుకోవాలి
విద్యార్థులకు మౌలిక వసతులు కూడా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఏర్పాటు చేయడం లేదు. ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.
-మహేంద్రబాబు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి

### అతిక్రమిస్తే చర్యలు తప్పవు
మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యం ఫీజులు వివరాలను పాఠశాల ముందు బోర్డులో నమోదు చేసుకోవాలి. అర్హత ఉన్న ఉపాధ్యాయులు చేతే విద్యార్థులకు బోధన చేయాలి. ఇప్పటికే అయా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాన్ని పిలిపించి మౌలిక వసతులు, ఫీజులు వివరాలపై తెలియజేశాం.
-సువర్ణ సునియం, ఎంఈఓ-1

## రైతులపై భారం మోపడం సరికాదు
ఎమ్మిగనూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమా కోసం ప్రీమియం భారాన్ని రైతులపై మోపాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని వైసీపీ పార్టీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రైతులపై ఒక్క రూపాయి కూడా భారం వేయకుండా ఉచిత పంటల బీమా ద్వారా రైతుల బీమా నగదు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. హెక్టారుకు వేల రూపాయలు చెల్లించమని ఒత్తిడి చేయడం దారుణమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందవరం మండల ఉపాధ్యక్షుడు రాఘవ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## మండల టీడీపీ కన్వీనర్ ఎంపికపై హర్షం
ఎమ్మిగనూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్‌గా కె. తిమ్మాపురం గ్రామానికి చెందిన కేటీ వెంకటేశ్వర్లు ఎంపికై ఎమ్మిగనూరు మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్‌గా ఎన్నికైన కేటీ వెంకటేశ్వర్లును మండల నాయకులు సోగనూరు జగదీష్, సురేష్‌చౌదరి, రామచంద్ర, రాము, నరసన్నగౌడ్, శంకర్‌గౌడ్, మురళీకృష్ణారెడ్డి, రామకృష్ణనాయుడు, అంపయ్య, హరిలతో పాటు మండల నాయకులు పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు.

## బస్టాండులో భక్తులకు మెరుగైన సౌకర్యాలు
మంత్రాలయం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం ఆర్టీసీ బస్టాండులో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు అన్నారు. మంగళవారం ఆయన ఆర్టీసీ బస్టాండును తనిఖీ చేశారు. బస్టాండులో వ్యక్తిగత మరుగుదొడ్లు, సౌకర్యాలు, కుర్చీలు, బస్సుల రవాణా వంటివి పరిశీలించారు. పంచముఖి, బెంగుళూరు, తుంగభద్ర రైల్వేస్టేషన్ వంటి ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యంగా ఉన్నా తమకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈయన వెంట కంట్రోలర్ బాస్కర్ ఉన్నారు.

## పాఠశాల స్వీపర్‌పై దాడి
మంత్రాలయం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోణ గ్రామంలో ప్రాథమిక ఎస్సీ కాలనీ పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న గుండపోగుల మాణిక్యమ్మ పై అదే గ్రామానికి చెందిన మాజీ విద్యాకమిటీ చైర్మన్ నేపాల్ అలియాస్ రంగన్న అనే వ్యక్తి దాడిచేసి గాయపర్చినట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. మంగళవారం ఉదయం పాఠశాలలో పని చేయొద్దని, నిన్ను ఎవరూ నియమించలేదని రంగన్న అనే వ్యక్తి అడ్డగించి దుర్భాషలాడుతూ దాడిచేశారు. దీంతో మహిళకు గాయాలు కావడంతో మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు.

## అంగన్‌వాడీల నూతన కమిటీ ఎన్నిక
ఎమ్మిగనూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మహా సభలో సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎమ్మిగనూరు ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షురాలిగా కే. శైలజ, ఉపాధ్యక్షులు నీరజ, అరుణ, ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మీలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, గోవింద, రాముడులు మల్లేశ్వరి, నాగలక్ష్మి, తులసి, లతా పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయం తనిఖీ
నందవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరం పంచాయతీ కార్యాలయాన్ని డిఎల్‌పీవో తిమ్మక్క మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. డ్రైనేజీల్లో పూడికతీత ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే పర్యావరణ పరిశుభ్రత, ఇళ్ల పక్కల మురుగునీరు నిల్వ లేకుండా చూసుకొని వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీకి ఆదాయం పెంచే వనరులు ఏర్పాటు చేయాలన్నారు. హోటల్ యజమానులతో మాట్లాడి హోటల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమెతో పాటు ఈవోపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి ఉన్నారు.

## కన్నడ విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం చేయూత

కన్నడ పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కౌతాళం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కన్నడ మీడియం చదువుతున్న విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం కన్నడ పుస్తకాలు సరఫరా చేయకపోవడంతో కన్నడ మీడియం చదువుతున్న విద్యార్థుల సమస్యను కొందరు ఉపాధ్యాయులు కర్ణాటక ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయారు. విద్యార్థుల సమస్యలను గుర్తించిన కర్ణాటక ప్రభుత్వం వారికి అవసరమైన కన్నడ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సరఫరా చేసింది. మంగళవారం ఆ పాఠ్యపుస్తకాలను ఎంఈఓ-2 శోభారాణి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వానికి తాము ఎంతో రుణపడి ఉన్నామని విద్యార్థులు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నడ ఉపాధ్యాయులు హనుమంతప్ప, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లకు భారీ జరిమానా
ఎమ్మిగనూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారికి మంగళవారం కోర్టు భారీ జరిమానాలు విధించింది. ఈ సందర్భంగా పట్టణ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని ఎమ్మిగనూరు కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి రూ10వేలు చొప్పున జరిమానా విధించారు. 23 మందికి గాను మొత్తం రూ2,30,000 కోర్టు జరిమానా విధించింది.

## మహిళల రక్షణకు శక్తి యాప్
పెద్దకడుబూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): ఆపద సమయాలలో మహిళలు, అమ్మాయిల భద్రత కోసం తమ మొబైల్ ఫోన్‌లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని అది మహిళకు రక్షణ కవచంగా ఉంటుందని డీఎస్పీ ఉపేంద్రబాబు విద్యార్థినిలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని కేజీబీవి పాఠశాలలో విద్యార్థినిలకు శక్తి యాప్ పై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్ రెడ్డి, శక్తి టీమ్ ఏఎస్ఐ నటరాజ్, కస్తూర్బా ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడుదాం
కౌతాళం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని కౌతాళం గ్రామ మేజర్ పంచాయతీ సర్పంచ్ పాల్‌దినకరన్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శి ప్రకాశం ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సభకు హాజరైన సర్పంచ్ పాల్‌దినకరన్ మాట్లాడుతూ ఏడాది కాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు గురించి జాతీయ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులను గురించి గ్రామ ప్రజలతో అధికారులతో చర్చించారు.

## టీడీపీ పట్టణ, మండలాల అధ్యక్షుల ఎంపిక

ఎన్నికైన సభ్యులతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు,జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత కమిటీల నియమాక ప్రక్రియలో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలం, గోనేగండ్ల, నందవరం మండలాలకు అధ్యక్షులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ పరిశీలకుల సమక్షంలో పట్టణంలోని వార్డుల, గ్రామాల అధ్యక్షులు ఎన్నుకున్నారు. ఎమ్మిగనూరు పట్టణం నుంచి మహేష్, బందేనవాజ్ పోటీపడ్డారు. మహేష్‌కు 24 మంది మద్దతు పలకగా బందేనవాజ్‌కు 14మంది మద్దతు పలికారు. దీంతో మహేష్‌ను పట్టణ టీడీపీ అధ్యక్షులుగా ప్రకటించారు. అలాగే ఎమ్మిగనూరు మండలానికి కేటీ వెంకటేశులు, పార్లపల్లి మల్లికార్జున పోటీ పడగా కేటీ వెంకటేశుకు అత్యధిక మంది సభ్యులు మద్దతు పలకటంతో ఆయనను మండల టీడీపీ అధ్యక్షుడిగా ప్రకటించారు. అలాగే గోనేగండ్ల మండలానికి తిరుపతయ్య నాయుడును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నందవరం మండలానికి నారాయణరెడ్డి, కాశీం వలి పోటీ పడగా కాశీం వలికి అత్యదిక సభ్యులు మద్దతు పలకటంతో కాశీం వలిని మండల టీడీపీ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ ఎన్నికలతో నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత ఎన్నికల నియమాకం ప్రక్రియ ముగిసినట్లైంది. సమావేశంలో పార్టీ పరిశీలకులు జిల్లేల శ్రీరాములు,లక్ష్మినారయణ, అక్కిరెడ్డి భాస్కరరెడ్డి, సుబ్బారెడ్డి, టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్, పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే ఆర్థికసాయం
గోనెగండ్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్ల కు చెందిన టీడీపీ కార్యకర్త బేతాల ఉసేన్‌కు ఆరోగ్య ఖర్చులకు గాను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి రూ. 10వేలు ఆర్థిక సహాయం ఆందజేశారు.కొన్ని మాసాలుగా బేతాల ఉసేన్ ఆనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందుల ఖర్చులకు, కుటుంబ ఖర్చులకు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని గోనెగండ్లకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అక్బర్‌బాషా, భారతం రహంతుల్లా, హకీం టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'న్యాయం చేయండి సారూ..'
నందవరం జూలై 1(ఆంధ్రజ్యోతి): తన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించి న్యాయం చేయండి సారూ... అంటూ మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన జవాన్ ఖలీల్ తల్లి నబూబీ మంగళవారం తహసీల్దారు శ్రీనివాసులను వేడుకుంది. నందవరం తహసీల్దారు కార్యాలయంలో అర్జీ తీసుకువచ్చి తహసీల్దారుకు ఇచ్చి తనకు 2.00 ఎకరాలు పొలం ఉందని దాన్ని ఆన్‌లైన్‌లో 1.32 ఎకరాలు చూపిస్తుండంతో తమకు న్యాయం చేసి మిగతా భూమిని ఎక్కించాలని కోరింది. దీంతో ఆయన మాట్లాడుతూ కలెక్టర్, జేసీ, ఎంపీ శబరితో పాటు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని అయితే తాము 1.94 సెంట్ల ఎక్కిస్తున్నట్లు గత నెల 20న ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో ఆమె 2.00 ఎకరాలు కరెక్టుగా ఎక్కించాలని డిమాండ్ చేసింది. తహసీల్దారు మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్‌కు లెటర్ పెడతానని వారికి న్యాయం చేస్తామన్నారు.

## మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంచాలమ్మను అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం అశాడమాస షష్ఠి శుభదినం ను పురష్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆశీస్సులతో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు,గంధం, పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

**ఆగస్టు 8 నుంచి రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాలు:** రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు ఆగస్టు 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం టీటీడీ కళ్యాణ మండపంలో సప్తరాత్రోత్సవాలపై శ్రీమఠం అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఆగస్టు 8 నుంచి 14 వరకు జరిగే ఉత్సవాల్లో ప్రాముఖ్య రోజులైన 10న పూర్వారాధన, 11న మధ్యారాధన, 12న ఉత్తరాధనలో మహారథోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మఠం మేనేజర్, ఈఈ సురేష్ కోనాపూర్, శ్రీపతిఆచార్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుధీంద్రరావు, తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, గ్రామ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, శ్రీనిధి, బాస్కర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి
గోనెగండ్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలతో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. వీరంపల్లి గ్రామంలో ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని వాటి పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మంత్రాలయం:** సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, చిన్న పిల్లలు, మహిళలపై జరిగే నేరాలు పట్ల జాగ్రత్తగా ఉండాలని మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఏపీ రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ అశోక్ ఆధ్వర్యంలో పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించి సైబర్ మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**కోసిగి:** సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ కూడా లింక్‌లను ఓపెన్ చేసి ఓటీపీలు చెప్పరాదని ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. మంగళవారం చింతకుంట గ్రామంలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. . ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నజీర్, సలాంవలి ఉన్నారు.

## అక్రమంగా నిర్మించిన ఇంటి గోడను తొలగించాలి
ఎమ్మిగనూరు రూరల్,జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ఏనుగుబాల గ్రామంలో రోడ్డుపై అక్రమంగా నిర్మించిన ఇంటి గోడను తొలగించాలని టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు నాగరాజు, చిన్నప్రభుదాసు, చిన్న ఇసాక్, నాగరాజు, షడ్రక్ డిమాండ్ చేశారు.

## రైతులకు న్యాయం జరిగేలా చూడాలి
● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

రాఘవేంద్రరెడ్డిని ,రామకృష్ణారెడ్డిలను సన్మానిస్తున్న డైరెక్టర్లు

మంత్రాలయం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో నూతనంగా ఎంపికైన సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు సొసైటీల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందించి న్యాయం జరిగేలా చూడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో మాధవరంలో రాఘవేంద్రరెడ్డి నివాసంలో నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు డీసీ తిమ్మప్ప, చాపల నగేష్, పెద్దకడుబూరు మండలం డైరెక్టర్ ఆంజనేయులు ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి శాలువలు కప్పి పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు పొందిన వారు రైతులకు న్యాయం చేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వరదరాజు, శివ, నరసింహ, వెంకటేశ్వర్లు, రాజు, రాఘవేంద్ర, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, పేతురు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

నాగలాపురంలో కొళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దకడుబూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామని వైసీపి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగలాపురం గ్రామంలో రూ 5లక్షలతో ఏర్పాటు చేసిన కుళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద రూ 26.50లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో తాగునీటిని అందించి ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేస్తామన్నారు. గ్రామాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపి మండల కన్వీనర్ రాంమోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవిచంద్ర రెడ్డి, ముక్కరప్ప, అర్లప్ప, యల్లప్ప, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

**మంత్రాలయం**
కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తాండా గ్రామంలో వైసీపీ నాయకులు సుగాలి హనుమంతు నాయక్ శస చికిత్స చేయించుకుని విశాంత్రి తీసుకుంటుండగా ఆయన వెళ్లి పరామర్శించారు. ఈయన వెంట నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షులు దశరథరెడ్డి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## మండల టీడీపీ కన్వీనర్ ఎన్నిక
నందవరం, జూలై 1 (ఆంధజ్యోతి): నందవరం మండల టీడీపీ కన్వీనర్‌గా కాశీంవలీ నియమితులైయ్యారు. మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆద్వర్యంలో టీడీపీ మండల కన్వీనర్ పదవికి ఓటింగ్ జరిగింది. రైస్‌మిల్ నారాయణరెడ్డి, మాచాపురం కాశీంవలీలు పోటీ పడగా అందులో కాశీవలీ గెలుపొందాడు. తనకు ఓటు వేసిన టీడీపీ గ్రామ కమిటి అధ్యక్షులుకు సహకరించిన ఎమ్మెల్యే బీవీకు ప్రత్యేక అబినందనలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

## 9న దేశవ్యాప్త సమ్మె
ఎమ్మిగనూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాల రద్దుకై జూలై9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఏపి మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఇస్మాయిల్, నాగరాజులు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉన్న 44 చట్టాలను కేవలం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలుగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తుందన్నారు, కార్మికులు సాధించుకున్న చట్టాల అమలుకై జూలై9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు .అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాజా కేశన్న, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి
పెద్దకడుబూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రైనేజీల పూడికతీత, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం అయ్యారని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ అన్నారు. గ్రామాల్లో సమస్యలపై యంపీడీవో స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

గుడికల్లు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దేవదాసు



మంత్రాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లను అందజేస్తామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దేవదాసు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాలలో మంగవారం సచివాలయం సిబ్బంది పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4వేలు ఇచ్చారు. అలాగే వికలాంగులకు రూ. 6వేల అందజేశారు. గోనెగండ్ల మండల వ్యాప్తంగా 28 గ్రామాలలో 8882 పింఛన్‌లను గాను సాయంత్రం లోపు 8359 పింఛన్‌ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మణిమంజరి తెలిపారు.

**మంత్రాలయం:** రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేయాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ మండల నాయకులు వరదరాజు,కంసలి నరసింహ, ఆశోక్ రెడ్డి,మంచాల సొసైటి డైరెక్టర్ డీసీ తిమ్మప్ప అన్నారు. మంగళవారం మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకుమంత్రాలయం, సూగూరు, చెట్నహళ్లి గ్రామాల్లో టీడీపీ జిల్లా నాయకులు ఎస్పి బాస్కర్ రెడ్డి, కాలువ చైర్మన్ నరసింహులు, సొసైటి డైరెక్టర్ చాపల నాగేష్‌లు ఎన్టీఆర్ భరోసా ఫించన్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ, ఎంపీటీసీ మేకల వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, నీలకంఠ, రాముడు, బోజప్ప, రజాక్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

| | |
|---|---|
| కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు | - 99854 09260 |
| కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు | - 9985411379 |
| ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు | - 9985171793 |
| నంద్యాల, పాణ్యం, ఆళ్లగడ్డ, బనగానపల్లె | - 9985411377 |

## ఉపాధిలో లక్ష్యాలను అధిగమించాలి

**కలెక్టర్ రాజకుమారి**

మాట్లాడుతున్న కలెక్టర్

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఉపాధి హామీలో ప్రగతి లక్ష్యాలను వందశాతం అధిగమించాలని కలెక్టర్ రాజకుమారి ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఎంపీడీ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పనిని తప్పనిసరిగా కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకం, లేబర్ టార్గెట్ నర్సరి దినసరి వేతనం, నీటి కుంటలు, సోక్ పిట్స్ కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాలతో మండలాల వారీగా ప్రగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎంఆండ్ఈ భాస్కర్‌నాయుడు, ఏపీడీలు నరసింహారెడ్డి, సాంబశివరావు, అన్వరాబేగం తదితరులు పాల్గొన్నారు.

**సులభ దర్శనానికి ఏర్పాట్లు**
● దేవాదాయశాఖ మల్లికార్జున- 2
● డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్
● మహానందిలో పర్యటన
7
**చరిత్రను యువత తెలుసుకోవాలి**
● రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

# కొళాయిల్లో అక్రమ ధారలు

కాల్వల్లో పైపు లైన్లు

- పెరిగిపోతున్న అక్రమ కనెక్షన్లు
- మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు
- అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి

**నంద్యాల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల పట్టణంలో అక్రమ కొళాయి కనెక్షన్లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రతి ఇంటికీ మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, వినియోగదారుల వెసులుబాటును బట్టి కనెక్షన్లు ఇస్తున్నారు. ఇదే అదునుగా చేసుకున్న మున్సిపాలిటీలోని కొందరు అధికారులు అక్రమ కనెక్షన్లకు అనుమతులు ఇస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ ఎప్పటికైనా వాటికి మూల్యం మాత్రం తప్పక చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ కొళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నా అధికారులు ఎందుకు తనిఖీలు చేయకపోవడం, వారిపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నంద్యాల మున్సిపల్ పరిధిలో వేలల్లో అక్రమ కొళాయి కనెక్షన్లు అధికంగానే ఉన్నాయి. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా, మున్సిపాలిటీకి పన్నులు చెల్లించకుండా కొందరు నాయకులు, స్థానిక మున్సిపల్ అధికారులు మామూళ్లు తీసుకుని అక్రమంగా కనెక్షన్లు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ నుంచి పురపాలక పరిధిలో వచ్చిన రైతునగరం, వెంకటేశ్వరపురం, క్రాంతినగర్, వంటి ప్రాంతాల్లో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూలు, డిపాజిట్లు సేకరణ అధికారులకు తలనొప్పిగా మారింది. దీనికి తోడు నాయకులు అడ్డంకులు సృష్టించడం, నివాస గృహాల వారు రికార్డులు సక్రమంగా ఉంచుకోకపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ తంతును అధికారులు గుర్తించి కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరణ చేసేందుకు సిద్ధమయ్యారు.

### నంద్యాలలో 32,264 కనెక్షన్లు!

నంద్యాల పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. సుమారుగా 2లక్షల జనాభా ఉన్నారు. వీటిలో 49,143 నుంచి 50 వేల వరకు అసెస్‌మెంట్లు ఉన్నాయి. కానీ కొళాయి కనెక్షన్లు కేవలం 32,264 కనెక్షన్లు ఉన్నాయి. ఇటీవల గత కొంత కాలంగా అధికారులు దాడులు నామమాత్రంగా నిర్వహించి వారికి సరిపోని వారికి సుమారుగా 300 అక్రమ కనెక్షన్లు గుర్తించామని అధికారులు చెబుతున్నారు. కానీ పట్టణంలో అక్రమంగా చాలా ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు. పూర్తి స్థాయిలో సర్వే చేసి ఇంటి, ఆస్తి పన్నులు, కొళాయి కనెక్షన్లు డిపాజిట్లు వసూలు చేస్తే పుర ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

నంద్యాల మున్సిపాలిటీ కార్యాలయం

### కమర్షియల్ కనెక్షన్ల పరిస్థితి

నంద్యాల పట్టణంలో కమర్షియల్ కనెక్షన్ కిందికి ఆసుపత్రులు, దుకాణాలు, అపార్టుమెంట్స్, షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్‌లు వస్తాయి. ఇవి సుమారుగా వేలల్లో ఉన్న వాటిని కేవలం 800 ఉన్నాయని చూపిస్తున్నారు. కానీ నంద్యాలలో సుమారుగా 2వేల పైగా కమర్షియల్ అక్రమంగా కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం. కానీ అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా వాటిపై దృష్టి సారించి అక్రమ కనెక్షన్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### చర్యలు తీసుకుంటాం

అక్రమ కనెక్షన్లు ఉన్న వారిని గుర్తించి నోటీసులు ఇప్పిస్తాం. ఆ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరణ చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పట్టణ అభివృద్ధికి కృషి చేస్తాం. ఎవరైనా అక్రమంగా కొళాయి కనెక్షన్లు పొంది ఉంటే అలాంటి వారిపై నిఘా ఉంచుతాం.

\- బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్ నంద్యాల

## పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

**నంద్యాల రూరల్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** నంద్యాల పట్టణంలోని 36వ వార్డులో రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. మంగళవారం వార్డు ఇన్‌చార్జి మారుతి ప్రసాద్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.4వేలకు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఏడాదికి కొంత మొత్తాన్ని పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ దాస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విమానానికి వేళాయే..!

● నేటి నుంచి కర్నూలు-విజయవాడ ఫ్లైట్ సర్వీసులు

**ఓర్వకల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వాసుల మరో కల నెరవేరింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కర్నూలు-విజయవాడ విమాన సర్వీసులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇండిగో విమానయాన సంస్థ ఈ సర్వీసులను నడుపనుంది. బుధవారం విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి ఇండిగో మొదటి సర్వీసు మధ్యాహ్నం 3:45 గంటలకు బయలుదేరి ఓర్వకల్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయానికి సాయంత్రం 4:50 గంటలకు చేరుతుంది. నంద్యాల, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ముఖ్య అతిథులుగా సాయంత్రం 4 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని 4:14 గంటలకు మొదటి ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ అందజేస్తారు. ప్రముఖుల ప్రసంగం అనంతరం 5:10 గంటలకు ప్రయాణికులతో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి విమానం బయలుదేరి 6:15 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుతుంది. ఈ సర్వీసులు వారంలో మూడు రోజులు (సోమ, బుధ, శుక్ర) అందుబాటులో ఉండనున్నాయి. ఈ కొత్త సర్వీసుల ద్వారా కర్నూలు-విజయవాడ ప్రయాణం మరింత సులభతరం అవుతుంది.

# సుపరిపాలనలో తొలి అడుగు...!

- ప్రతిష్టాత్మకంగా 'సూపర్ సిక్స్' అమలు
- తల్లికి వందనం, రూ.4 వేల పింఛన్‌తో జనం ఖుషీ
- నేటి నుంచి ఇంటింటా ప్రజాప్రతినిధులు, నేతలు

**నంద్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు సారథ్యంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుంది. వైసీపీ విధ్వంసం.. అరాచక పాలనకు స్వస్తి చెప్పాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుకట్టి జనం మధ్యకు వెళ్లాయి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకొని ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టింది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ద్వారా 'ఇంటింటా సంక్షేమం.. పల్లెపల్లెన ప్రగతి చేసి చూపిస్తాం' అంటూ ప్రధాన హామీలు ఇచ్చారు. ఏడాది పాలనలో వృద్ధులకు పింఛన్ రూ.4 వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ.. వంటి హామీలు ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. రైతులకు పెట్టుబడి సాయం చేసి అండగా నిలవాలని 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయింది. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిలో సాధించిన విజయాలు, సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి పనులు ఇంటింటికీ వెళ్లి వివరించడమే కాదు. ఇంటింటికీ ఇవ్వాల్సిన సంక్షేమం, ఆ పల్లెలో చేయాల్సిన అభివృద్ధిపై ప్రణాళికలు తయారు చేయడమే మహోన్నత ఆశయంతో నేటి నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏడాదిలో జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

### అవ్వా,తాతల ఆనందం

సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అమలు చేసిన పథకం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు. ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధులకు రూ.200 పింఛన్ ఇస్తూ వచ్చారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో బాధ్యతలు చేపట్టిన సీఎం చంద్రబాబు ఒకేసారి ఐదు రెట్లు పెంచి రూ.1,000 చేశారు. 2019 ఎన్నికల ముందు రూ.2 వేలకు పెంచారు. వైసీపీ అధికారంలోకి వస్తే రూ.3 వేలు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత దశలవారీగా ఐదేళ్లలో రూ.వెయ్యి పెంచుతానంటూ మాట మార్చారు. 2024 ఎన్నికల్లో పింఛన్ రూ.4 వేలు చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి స్పష్టమైన హామీ ఇచ్చారు. జూన్ 12న కూటమి ప్రభుత్వం అధికారం చేపడితే.. జూలై ఒకటో తారీఖునే వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ, కాలేయం, తలసేమియా బాధితులకు రూ.10 వేలు, పూర్తి వైకల్యం కలిగిన వారికి రూ.15 వేలకు పెంచారు.

మిగతా 6వ పేజీలో

### దీపం.. అన్నక్యాంటీన్లు.. మెగా డీఎస్సీ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో దీపం పథకం ఒకటి. జిల్లాలో ఐదు లక్షలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో అర్హులందరికీ దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతున్నాయి. అలాగే మున్సిపల్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల ద్వారా వేలాది మంది పేదల ఆకలి తీరుస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16,347, జిల్లాలో 2,600 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు.

### 'తల్లికి వందనం' విజయవంతం

జిల్లా వ్యాప్తంగా తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలు చేశారు. ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున ఇవ్వకగా మరో రూ.2వేలు పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కోసం కేటాయించారు. గత వైసీపీ హయాంలో అమ్మఒడి కేవలం ఒక విద్యార్థికే ఇస్తే.. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎందరు విద్యార్థులు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చింది. ఐదుగురు పిల్లలు ఉన్న కుటుంబాలు ఒక్కో తల్లి ఖాతాలో రూ.65 వేలు జమ చేయడం కొసమెరుపు.

### రైతులు.. మహిళలకు శుభవార్త



ప్రభుత్వం అమలు చేయాల్సిన సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ ఒకటి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి రూ.20 వేలు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇవ్వనున్నారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో అర్హులైన రైతులను గుర్తించారు. ఏడాదిలో మూడు విడతల్లో పెట్టుబడి సాయం కోసం రైతుల ఖాతాలో జమ చేస్తారు. మొదటి విడత ఈ నెలలో విడుదల చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' అమలు చేయనున్నారు.

## నేర నియంత్రణ లక్ష్యంగా పని చేయాలి

**ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**

సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

**నంద్యాల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** నేర నియంత్రణ లక్ష్యంగా ప్రతి పోలీసు పని చేయాలని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు యంత్రాంగంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణలో ఆధునికతను ఉపయోగించి కేసుల త్వరగా ఛేదించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసు స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసును క్షుణ్ణంగా ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గస్తీ నిర్వహించి నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి రోజు విజిబుల్ పోలీసుల్లో భాగంగా తనిఖీలు చేయాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి, పీడీఎస్ బియ్యం, వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, సాయుధ బలగాల ఆదనపు ఎస్పీ చంద్ర బాబు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌కుమార్, ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# వారంలో అన్నదాత సుఖీభవ..

● ఉమ్మడి జిల్లాలో 4,63,021 మంది రైతులకు లబ్ధి

**కర్నూలు అగ్రికల్చర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని సత్వరమే అమలు చేసేందుకు ఏర్పాట్లు మొదలు పెట్టింది. అర్హులైన రైతులను గుర్తించి వెంటనే ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో గత పది రోజుల నుంచి రైతు సేవా కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించేందుకు రైతులు ఆ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. కర్నూలు జిల్లాలో 2,77,224 మంది అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు అని తేల్చారు. ఇప్పటి దాకా 2,22,284 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఇంకా 3,735 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. 1,205 మంది రైతులను అనర్హులుగా ప్రకటించారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,85,297 మందిని అర్హులుగా తేల్చారు. అందులో 1,80,787 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఈ జిల్లాలో 4,510 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. రెండు జిల్లాలో కలిపి 4,940 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది.



### నిధుల విడుదలలో కేంద్రం జాప్యం

అన్నదాత సుఖీభవ పథకం కింద.. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రస్తుత ఖరీఫ్‌లో మొదటి విడతగా అందించాల్సిన రూ.2వేలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా రూ.5వేలను కలిపి మొత్తం మొదటి విడతలో రూ.7వేలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు ఎదురు చూస్తున్నారు. గత నెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ఒకేసారి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం ద్వారా విడుదలయ్యే రూ.2వేలతో కలిపి మొత్తం రూ.7వేలను అందించేందుకు సిద్ధమైంది. అయితే కేంద్ర ప్రభుత్వం వివిధ కారణాలతో నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పథకం అమలుకు కాస్త జాప్యం జరిగే పరిస్థితి నెలకొంది. మరో వారం రోజుల్లో కేంద్రం మొదటి విడత రూ.2వేలను అందించే అవకాశం ఉంది.



# నగరానికి మేఘమాల

కర్నూలు నగరంపై పడిపోతున్నట్లు కనిపిస్తున్న ఈ కారు మేఘాలు మంగళవారం సాయంత్రం ఆకాశంలో కాసేపు సందడి చేశాయి. నగరానికి ఆకాశంలో మేఘ మాలగా కనిపించిన దృశ్యాన్ని ప్రజలు తిలకించారు. గగనంలో మేఘాలు దోబూచులాడి కనువిందు చేశాయి. కర్నూలు సిటీలో ఉన్న భారీ భవనాలపై మేఘాలు వాలి, ఆ తర్వాత దాదాపు రెండు గంటల పాటు కర్నూలు నగరంలో వర్షం కురిసింది. వర్షం రాకతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

## తిరుమలకు ప్రత్యేక ప్యాకేజీ

టూరిజం ఆధ్వర్యంలో వెసులుబాటు

**కర్నూలు న్యూసిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ తిరుమల వెంకన్న దర్శనానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. టూరిజం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం కర్నూలు నుంచి నంద్యాల మీదుగా తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రత్యేక ప్యాకేజీ ఉంటుంది. ఈ ప్యాకేజీలో ఎస్ఎస్‌డీ (స్పెషల్ ఎంట్రీ దర్శనం) టికెట్ ద్వారా త్వరితగతిన దర్శనం చేయించనున్నారు. ట్విన్ షేరింగ్ నాన్ ఏసీ వాహనం వసతితో పాటు ప్రొఫెషనల్ టూర్ గైడ్ సేవలు అందుబాటులో తీసుకువస్తున్నారు. తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, శ్రీనివాసమంగాపురం, తిరుచానూరు ఆలయాలను కూడా ప్యాకేజీలో భాగంగా చేర్చారు. ప్యాకేజీ చార్జీలు కర్నూలు నుంచి రూ.2,670, నంద్యాల నుంచి రూ.2,470గా నిర్ణయించారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు పూర్తిగా ఉచితం. తిరుమలలో విశ్రాంతి కోసం గదులను కూడా కల్పించనున్నారు. అయితే తిరుమలకు వచ్చేవారు భోజన వసతిని వారే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం రాత్రి కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ టూరిజం కార్యాలయం వద్ద వాహనం బయలుదేరి ఆర్టీసీ బస్టాండు, మెడికల్ కాలేజీ, నంద్యాల చెక్‌పోస్టు వద్ద పర్యాటకులను పికప్ చేసుకుంటారు. పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా పర్యాటక అభివృద్ధి సంస్థ మరిన్ని ప్యాకేజీలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు టూరిజం డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

# సారథులు వస్తున్నారు

- ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు కమిటీల ఏర్పాటు దిశగా చర్యలు
- డీసీవోల చేతికి జాబితా
- పరిశీలించి పంపాలని ప్రభుత్వం ఆదేశాలు
- కర్నూలులో 43, నంద్యాలలో 28 సంఘాలకు జాబితా ఖరారు
- ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం

**కర్నూలు అగ్రికల్చర్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలు వచ్చేస్తున్నాయి. ఇప్పటిదాకా కర్నూలు జిల్లాకు 43, నంద్యాల జిల్లాలో 28 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఛైర్మన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను నియమిస్తూ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సిఫారసు లెటర్లను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి ఆయా జిల్లాలోని సహకార శాఖ అధికారి కార్యాలయానికి శనివారం జాబితాలు అందాయి. వీటిని పూర్తి స్థాయిలో విచారణ జరిపి అన్ని సక్రమంగా ఉంటే ప్రభుత్వానికి ఈ జాబితాలను పంపిస్తామని కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణుడు విలేకరులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఆర్థికంగా అండదండలు అందిస్తున్న వ్యవసాయ పరపతి సంఘాలకు వారం రోజుల్లో సారథులు రాబోతున్నారు. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జిలుగా సహకార శాఖతో పాటు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. వీరి స్థానంలో ఆయా సంఘాలకు ఒక ఛైర్మన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను సూచిస్తూ త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయబోతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో కర్నూలు, నంద్యాల జిల్లాలో 99 సహకార సంఘాలు ఉన్నాయి. వైసీపీ హయాంలో వీటికి ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీ కార్యకర్తలనే త్రీమెన్ కమిటీలో నియమించి ప్రతి ఆరు నెలలకు పదవీ కాలం పొడిగించుకుంటూ పోయారు. ఇదే సమయంలో నామినేట్ అయిన త్రీమెన్ కమిటీలోని సభ్యులు తాము అనుకున్న విధంగా భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడి సంఘాలను నష్టాల ఊబిలోకి నెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా సంఘాల్లోని త్రీమెన్ కమిటీలను రద్దు చేసి సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. వీరు తగినంత మంది లేక 3, 4 సంఘాలకు ఒకరి చొప్పున ఇన్‌చార్జిలుగా నియమించడంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పాలన గాడి తప్పింది. రైతులకు ఇచ్చే రుణాలు బకాయిలను సక్రమంగా వసూలు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పర్సన్ ఇన్‌చార్జిల గడువు ఈ నెల 28తో ముగిసింది. మళ్లీ ఆరు నెలలకు ఈ గడువు పెంచాల్సి ఉంది. ఈ సమయంలో త్రిసభ్య కమిటీల నియామకాన్ని కొలిక్కి తీసుకురాబోతున్నారు.

### ఆశావాహుల నిరీక్షణ:

ఉమ్మడి జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఇప్పటికే కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 28 సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఖరారు చేస్తూ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సిఫారసు లెటర్లను ప్రభుత్వానికి పంపారు. ప్రస్తుతం ఈ త్రీమెన్ కమిటీలకు ఎమ్మెల్యేల చేత ప్రతిపాదించిన వారిపై జిల్లా సహకార శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మిగిలిన సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఖరారు చేసే విషయంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. సహకార సంఘాల ద్వారానే పెద్ద ఎత్తున రుణాలు రైతులకు పొదుపులక్ష్మి గ్రూపులకు అందిస్తుండటంతో ఈ అధికారాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే ఆశ ఎమ్మెల్యేల అనుచరుల్లో ఎక్కువైపోయింది. దీంతో ఒక్కో సంఘంలో త్రీమెన్ కమిటీ జాబితాలో చోటు దక్కించుకునేందుకు పది నుంచి 20 మంది దాకా ఎమ్మెల్యేల వద్ద క్యూ కడుతున్నారు. మూడు నెలల క్రితమే ఆశావాహుల పేర్లను ఎమ్మెల్యేలు తీసుకుంటూ వస్తున్నారు. కొన్ని చోట్ల కూటమి నేతల మధ్య అభిప్రాయబేధాలు తలెత్తడంతో ఇన్నాళ్లూ వాటిని పక్కన పెట్టేశారు. మరో వారంలోపు ఈ సంఘాలన్నింటికీ త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా సహకార శాఖ అధికారులు ఎమ్మెల్యేల నుంచి జాబితాలను తెప్పించుకుని వాటిపై త్వరితగతిన పరిశీలన జరిపి ప్రభుత్వానికి పంపనున్నారు.

**ప్రభుత్వానికి జాబితాను పంపిస్తాం**

కర్నూలు జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సంబంధించి త్రీమెన్ కమిటీలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వానికి అందాయి. అక్కడి నుంచి మాకు ఆ జాబితాలను ప్రభుత్వం పంపింది. వీటిని పరిశీలించి ప్రభుత్వానికి అందజేస్తాం. మిగిలిన సహకార సంఘాలకు కూడా త్వరితగతిన ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల నుంచి త్రీమెన్ కమిటీల జాబితాలను తీసుకుని ప్రభుత్వానికి పంపుతాం.

**- వెంకటకృష్ణుడు, డీసీవో**

# సుపరిపాలనలో తొలిఅడుగు!

(5వ పేజీ తరువాయి)

- **పారిశ్రామిక ప్రగతి.. హైకోర్టు బెంచ్**

గడ్డపై పారిశ్రామిక ప్రగతి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యక్తి కావడం ఇందుకు కారణం. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులకు టెండర్లు పూర్తి చేశారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యం. జపాన్‌కు చెందిన ఇటోయో మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎస్ గ్రూపులు సంయుక్తంగా దాదాపు రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ 130 ఎకరాల్లో స్థాపించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 1200 ఎకరాల్లో రూ.13 వేల కోట్లతో 'ఈవీ పార్క్'కు ఒప్పందం, 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. తాజాగా రిలయన్స్ సంస్థ రూ.1,266 కోట్లతో జ్యూస్ తయారి పరిశ్రమ స్థాపనకు ఒప్పందం చేసుకుంది. 80 ఎకరాలు ఎకరం రూ.30 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో పాటు రూ.16,500 కోట్లు పెట్టుబడులు, 12-13 వేల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు 7 సోలార్, విండ్ ప్రాజెక్టులకు ఒప్పందం జరిగింది. అలాగే.. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చర్యలు వేగంగా చేస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లాలి

తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

**కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** నెల రోజుల పాటు జరిగే 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఇటీవల జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వైసీపీ ఓటమి తర్వాత ఆ పార్టీ నేతల విధ్వంసాన్ని ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సహా అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఏడాదిలో ఎంత లబ్ధిపొందారు, అర్హులైన వారు ఎంత మంది ఉన్నారు, గ్రామంలో చేసిన అభివృద్ధి, చేయాల్సిన ప్రగతిపై ప్రజలకు వివరించాలని కోరారు. మై టీడీపీ యాప్ ద్వారా చేసిన పనులు అధిష్ఠానానికి తెలియజేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఎన్టీఆర్ విద్యా సంకల్పం

- పొదుపు సంఘాల మహిళల పిల్లలకు కోసం..
- మరో పథకానికి శ్రీకారం చుట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- కేజీ నుంచి పీజీ వరకు అమలు



**హాలహర్వి, జూలై 1(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. పొదుపు మహిళల పిల్లల చదువు కోసం రుణాలు అందించి ఆదుకునేందుకు ఆదేశించడంతో చదువుకు సాయంగా, పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పేద మహిళలకు ఊరట**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతున్న ఈకొత్త పథకం ఎంతోమంది పేద మహిళలకు ఊరటనిస్తుంది. ఈ ఏడాది అమలుచేస్తే ఎంతోమంది పేద విద్యార్థుల భవిష్యత్‌కు భరోసానిచ్చే గొప్ప పథకం ఇది.

**- రంగవేణి, పొదుపు మహిళ, హాలహర్వి**

### అధిక వడ్డీలకు.. అప్పులు చేసి

పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆస్తులు అమ్ముకొని ఇబ్బందులు పడుతున్నారని గమనించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యా సంస్థల్లో చదివే పిల్లలకు ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రుణం తీసుకున్న మహిళ తీసుకున్న రుణాన్ని బట్టి కనిష్టంగా 24కంతుల నుంచి 36 కంతుల వరకు వాయిదాల పద్ధతిలో 35 పైసలు వడ్డీకే రుణం చెల్లించేలా వెసులుబాటు కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందుకోసం ప్రభుత్వం రూ.200 కోట్లు నిధులు ఖర్చు చేసేలా విధివిధానాలు తయారు చేసింది. ఈ పథకంతో పేదల బిడ్డలకు ఎంతో ఊరటనిస్తుందని, విద్యాభివృద్ధి కోసం ఇలాంటి పథకం అమలు చేయడం ఎంతోమంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగునిస్తుందని పొదుపు సంఘాల మహిళలు చెబుతున్నారు. ఈ పథకం వల్ల జిల్లాలో 3,23,530 మంది పొదుపు మహిళల పిల్లలకు ఈ పథకం లబ్ధి పొందే అవకాశం ఉంది.

సిద్ధమయ్యారు. రుణం అందించి తక్కువ వడ్డీతో నెలనెలా తిరిగి చెల్లించేలా రూపొందించిన పథకమే ఎన్టీఆర్ విద్యా సంకల్పం. విద్యాసంకల్పం పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసింది. ఈ పథకం వల్ల అనేకమంది పొదుపు సంఘాల మహిళల పిల్లల చదువుకు కొండంత అండగా నిలుస్తుందని భావిస్తున్నారు పొదుపు మహిళలు.

### స్త్రీ నిధి బ్యాంకు ద్వారా..

రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళల పిల్లలు విద్యాభివృద్ధి కోసం స్త్రీనిధి బ్యాంకు ద్వారా 4శాతం (35 పైసలు) వడ్డీకే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం పొందేందుకు వెసులుబాటు కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రస్తుతం పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం ఉపాధి పొందేందుకు స్త్రీనిధి నుంచి 12శాతం వడ్డీతో రుణాలు అందిస్తున్నారు. ఈపథకం ప్రవేశ పెట్టడంతో కేవలం నాలుగు శాతానికి వడ్డీతో రుణాలు ఇవ్వాలని



**బిడ్డల భవిష్యత్తుకు భరోసా**

ప్రభుత్వం ఎన్టీఆర్ విద్యాసంకల్పం కొత్త పథకానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషకరమైన విషయం. పిల్లల చదువుల కోసం మాలాంటి తల్లులు ఎన్నో అవస్థలు పడుతున్నాం. స్థోమత లేక సగంలోనే విద్యను ఆపేసి నిరుద్యోగులుగా మారుస్తున్నాం. ఇలాంటి పథకంతో పేద బిడ్డలంతా విద్యావంతులుగా మారతారని ఆశిస్తున్నాం.

**- అమృత, పొదుపు మహిళ, హాలహర్వి**

## సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలు

**కర్నూలు కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అవకాశాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ దరఖాస్తులు కళాశాలలో లభిస్తాయని, వాటిని పూర్తి చేసి ఆగస్టు 31లోగా అందజేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల్లో గాత్రం, వయోలిన్, మృదంగం, కూచిపూడి నృత్య విభాగాలలో ప్రవేశాలు పొందవచ్చని, ప్రవేశానికి బాలలకు 2025 జూలై 1 నాటికి 10 ఏళ్లు పూర్తి అయి ఉండాలని తెలిపారు. కళాశాలలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారు రెండేళ్ల డిప్లమో కోర్సులో చేరడానికి అర్హులని తెలిపారు.

## ఎక్సైజ్ ఐ యాప్‌ను అమలు చేయాలి

- ప్రతి మద్యం దుకాణానికి సీసీ కెమెరాలు
- వీసీలో ఎక్సైజ్ శాఖ కమిషనర్

**కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఎక్సైజ్ ఐ యాప్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా దుకాణాల సమయ పాలనతో పాటు పోలీసుల విధులకు సంబంధించిన ప్రతి అంశం అందులో పొందు పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం దుకాణాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కెమెరాలను అమరావతి కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓవైసీవి అనుచిత వ్యాఖ్యలు

• రాజకీయ లబ్ధి కోసమే ఆయన తాపత్రయం
• టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాహిద్

**కర్నూలు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** రాజకీయ లబ్ధి కోసం ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాహిద్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇస్లాంతో పాటు ముస్లిం మత పెద్దల ఇచ్చే ప్రతి సూచనలను గౌరవిస్తూ, సమాజం పట్ల బాధ్యతగా టీడీపీ పని చేస్తోందన్నారు. రాజకీయ స్వలాభం కోసం వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇస్తున్నారని టీడీపీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ముస్లింల సంక్షేమం కోసం టీడీపీ చిత్తశుద్ధితో పని చేస్తోందని, ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఉద్దేశ్యం...

## కొంప ముంచిన డ్రైవర్ నిద్రమత్తు

• అదుపు తప్పి, వంతెన ఢీకొట్టి ఆగిపోయిన లారీ
• వంకలోకి వెళ్లకపోవడంతో తప్పిన ప్రాణాపాయం

వంతెనపై వేలాడుతున్న లారీ

**పత్తికొండటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** డ్రైవర్ నిద్రమత్తుతో ఓ లారీ అదుపుతప్పి వంతెన ఢీ కొట్టింది. లారీ ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన 46 టీయూ 0032 నంబర్ గల కంటైనర్ లారీ చెన్నై నుంచి బిస్కెట్లు, చాక్లెట్లు లోడుతో మహారాష్ట్రకు బయలుదేరింది. అయితే మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారి అటికెలగుండు వంతెన వద్దకు చేరుకుంటున్న సమయంలో డ్రైవర్ కునుకుతీయడంతో లారీ అదుపు తప్పి వంతెను ఢీకొట్టి ఆగిపోయింది. అలాగే ముందుకు దూసుకెళ్లి ఉంటే కింద ఉన్న వాగులో పడి ప్రాణాపాయం సంభవించేది. లారీ సగం వంతెనై, మరో సగం కిందకు వేలాడుతున్నట్లు కనిపించడంతో వాహనదారులు అవాక్కయ్యారు.

## మహిళ ఆత్మహత్య

**ఆలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎ.గోనేహాల్ గ్రామానికి చెందిన శ్వేత (24) ఆత్మహత్య చేసుకుంది. బంధువులు, ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. మొలగవల్లి గ్రామానికి చెందిన శ్వేతను ఎ.గోనేహాల్ గ్రామానికి చెందిన నాగభూషణంతో నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే వీరికి సంతానం కలగకపోవడంతో చికిత్స తీసుకున్నా ఫలితం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్వేత మంగళవారం ఉరివేసుకుంది. బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థి అదృశ్యంపై కేసు

**గడివేముల, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పెసరవాయి గ్రామంలో పదో తరగతి చదువుతున్న జస్వత్ సోమవారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు మంగళవారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పెసరవాయి గ్రామానికి చెందిన శివశంకర్ మొదటి భార్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శివశంకర్, అతడి రెండో భార్య 10 సంవత్సరాల క్రితం మృతి చెందారు. వారి పిల్లలు మొదటి భార్య వద్దే ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రెండో భార్య కుమారుడు జశ్వంత్ సిగరెట్ కాల్చుతున్నాడని పెద్దమ్మ, అన్న మందలించారు. సోమవారం విద్యార్థి బస్సులో పాఠశాలకు వెళ్లిన జశ్వంత్ సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు ఆరా తీశారు. అతడి సోదరి శ్రీలేఖ గ్రామంలో కూడా జశ్వంత్ ఆచూకీ దొరకలేదు. దీంతో శ్రీలేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

## ప్రేమ పేరుతో బాలికను వంచించినందుకు

• 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.25వేలు జరిమానా

**కర్నూలు లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రేమ పేరుతో బాలికను లోబరుచుకుని లైంగికదాడి చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు, రూ.25వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా పోక్సో కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. జిల్లాకు చెందిన ఓ బాలిక (15) పీర్ల పండుగ కోసం తమ బంధువుల ఊరయిన ఆదోని మండలం బసరకోడు గ్రామానికి వెళ్లింది. అక్కడ షేక్ చాంద్‌బాషా అనే యువకుడు బాలికను పరిచయం చేసుకుని తరుచూ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రేమిస్తున్నాని చెప్పేవాడు. 2021 ఫిబ్రవరి 3వ తేదీన బాలిక ఉంటున్న పత్తికొండ బస్టాండుకు వచ్చి ఫోన్‌చేసి బాలికను ఇంటి నుంచి రమ్మని చెప్పాడు. మేజరయ్యే వరకు పెళ్లి చేసుకోనని బాలిక చెప్పినా వినకుండా ఇప్పుడు నీవు రాకపోతే మన ప్రేమ విషయం మీ ఇంట్లో వారికి చెబుతానని బెదిరించడంతో బాలిక బస్టాండుకు రాగా ఇద్దరు బెంగళూరు వెళ్లారు. బాలికను బలవంతంగా లొంగదీసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత బాలిక పత్తికొండకు తిరిగి వచ్చి తన తల్లిదండ్రులతో జరిగిన విషయం చెప్పగా పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి డోన్ డీఎస్పీ కేసును విచారించి షేక్ చాంద్‌బాషా అతని కుటుంబ సభ్యులపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. కేసు విచారణ దశలోనే 2వ నిందితుడు సలీం మృతి చెందగా.. మొదటి నిందితుడు షేక్ చాంద్ బాషాపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రాజేంద్రబాబు తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించే జరిమానాతో పాటు ప్రభుత్వం రూ.లక్ష బాలికకు నష్టపరిహారం చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సీవీ శ్రీనివాసులు వాదించారు.

## జీజీహెచ్‌లో దారుణం

• న్యూ డయోగ్నస్టిక్ బ్లాక్ పక్కన శిశువు మృతదేహం

**కర్నూలు హాస్పిటల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ పక్కన ఖాళీ స్థలంలో గుర్తు తెలియని ఓ శిశువు మృతదేహం పడి ఉంది. ఆ శిశువు మృతదేహానికి చీమలు పట్టాయి. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో శిశువు మృతదేహాన్ని న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్ అబ్దుల్లా, సిబ్బంది గమనించి సూపరింటెండెంట్‌కు, పోలీసులకు సమాచారం అందించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి చూస్తే అక్కడ శిశువు మృతదేహం మాయమైంది. కర్నూలు జీజీహెచ్‌లో ప్రసవించిన శిశువు మృతి చెందడంతో అక్కడే పడేసి వెళ్లారా..? లేదా సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులలో ప్రసవించిన శిశువు మృతి చెందడంతో ఇక్కడే పడేసి వెళ్లారా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శిశువు మృతదేహానికి బొడ్డు పేగు చుట్టుకుని ఉంది. ఆసుపత్రిలో డెలివరీ అయిన వెంటనే బొడ్డు పేగును కోసి తల్లిదండ్రులకు అప్పగిస్తారు. అయితే బొడ్డు పేగుతో శిశువు ఉండటం వల్ల ప్రసవించిన వెంటనే మృతి చెందడంతో అక్కడే పడేసి వెళ్లారా..? అనే అనుమానం వ్యక్తవుతోంది. అయితే మొత్తం వ్యవహారాన్ని ఆసుపత్రి వర్గాలు గోప్యంగా ఉంచాయి.

# చరిత్రను యువత తెలుసుకోవాలి

మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

• పరిశోధనల కేంద్రంగా క్లస్టర్ యూనివర్సిటీ
• రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

**కర్నూలు అర్బన్, జులై 1 (ఆంధ్రజ్యోతి):** జిల్లా చరిత్రను యువత తెలుసుకోవాలని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో కర్నూలు జిల్లా 167వ ఆవిర్భావ దినోత్సవాలను కర్నూలు జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు ఆచార్య షేక్ మన్సూర్ రహ్మాన్, ప్రముఖ వ్యాపారవేత్త, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కల్కూర చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్ కట్ చేసిన సంబరాలు జరుపుకున్నారు. కర్నూలు జిల్లా ఆవిర్భావం.. ఘన చరిత్రపై క్లస్టర్ వర్సిటీలో అంతర్భాగమైన కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ బాలుర డిగ్రీ కాళాశాలలో వ్యాస రచన పోటీల్లో నిర్వహించారు. విజేత విద్యార్థులకు విజ్ఞానం పెంచే పుస్తకాలు, ప్రశంస పత్రాలు, సీల్డ్‌ను అందజేశారు. చెరగని చరిత్రకు చిరునామ కర్నూలు అని, ఇక్కడ పని చేయడం జీవితంలో మరవలేని ఘట్టమన్నారు. మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు ఆచార్య షేక్ మన్సూర్ రహ్మాన్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులు పాలెగాళ్ల పాలనను అంతం చేసి రాయలసీమగా పిలవబడే జిల్లాలను దత్త మండలాలుగా చేశారన్నారు. మొదట కడప, బళ్లారి జిల్లాలు ఉండేవని, 1858లో కర్నూలు జిల్లా ఏర్పడిందన్నారు. కల్కూర చంద్రశేఖర్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో ఎంతో వెనుకబడిన జిల్లా కర్నూలు.. సాగునీటి ప్రాజెక్టు కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు తక్షణమే చేపట్టాలన్నారు. జిల్లా ఘనచరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన వీరుల గురించి వివరించారు. అడ్మినిస్ట్రేషన్ డీన్ అత్తర్ బాను, ప్రభుత్వ బాలుర డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు సోమశేఖర్ తదితరులు పాల్గొని ప్రసగించారు.

# ఏకధాటిగా ఏఎన్ఎం గ్రేడ్-3 బదిలీలు

• 31 గంటలు విరామం లేకుండా కౌన్సెలింగ్ • డీఎంహెచ్‌వోను అభినందించిన కలెక్టర్, జడ్పీ సీఈవో

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

**కర్నూలు హాస్పిటల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు వైద్య ఆరోగ్యశాఖ రికార్డు స్థాయిలో సచివాలయ గ్రేడ్-3 ఏఎన్ఎం బదిలీల కౌన్సెలింగ్ కొనసాగింది. ఉమ్మడి జిల్లాకు చెందిన 751 మంది ఏఎన్ఎం గ్రేడ్-3లకు బదిలీల కౌన్సెలింగ్‌కు కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ అవిశ్రాంతంగా 31 గంటలు కౌన్సెలింగ్‌ను నిర్వహించి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి అభినందనలు అందుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 751 మంది సచివాలయ ఏఎన్ఎంలకు సోమవారం ఉదయం 7 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ పర్యవేక్షణలో డీఐవో డా. నాగప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఏవో కే.అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు మధుసూదన్, సంపత్ కుమార్, లోక సాయిరాజ్, జూనియర్ అసిస్టెంట్లు సోహాయిల్, హారిక కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు బదిలీల కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం ఏవో కొంత అస్వస్థతకు గురి కాగా, 10 నిమిషాల అనంతరం కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఏఎన్ఎం గ్రేడ్-3 కౌన్సెలింగ్ ప్రక్రియను మంగళవారం ఉదయం 11 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో జడ్పీ సీఈవో పరిశీలించారు.

## పింఛన్ తీసుకోడానికి గంట ముందు మృతి

**పాణ్యం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఇంకో గంట బతికుంటే సిరాజ్ అనే లబిదదానడే రూ. 15 వేలు పింఛన్ తీసుకునే వాడని మృతుని బంధువులు తెలిపారు. పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న పాణ్యంకు చెందిన అచ్చుకట్ల సిరాజ్ (68)మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆ తార్వాత కొద్ది సేపపటికే డయాలసిస్ పింఛన్ ఇవ్వడానికి అధికారులు మృతుని ఇంటి వద్దకు వెళ్లారు. సిరాజ్ మృతితో పింఛన్ ఇవ్వలేదు. బంధువులు, స్థానికులు, టీడీపీ నాయకులు కోరినా ఫలితం లేకపోవడంతో అతి పేద కుటుంబానికి చెందిన సిరాజ్ భార్యకు పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. సిరాజ్ భార్య అమీరున్‌బీ కేన్సర్ వ్యాధితో పదేళ్లుగా బాధపడుతోందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి పేర్కొన్నారు.

మృతుని భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకుడు

## ఏటీఎం కార్డు మార్చి రూ.50 వేలు చోరీ

**ఆదోని, జూలై 1(ఆంధ్రజ్యోతి):** మేడం.. ఏటీఎం పిన్ నంబర్ తప్పు కొట్టారు. అంటూ ఆ యువతి పెట్టిన ఏటీఎం కార్డును బైటికి తీసి, కార్డు మార్చి రూ.50 వేలు కొట్టేసిన ఘటన ఆదోని పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆదోని మండలం విరుపాపురం గ్రామానికి చెందిన ఓ యువతికి ఆదోని పట్టణంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆమె ఎమ్మిగనూరు టర్నింగ్‌లో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏటీఎం సెంటర్‌కు వెళ్లింది. తన ఏటీఎం కార్డు మిషన్‌లో పెట్టి పిన్ నంబర్ కొట్టగానే.. అక్కడే ఉన్న ఓ యువకుడు ఏటీఎం కార్డు బైటికి తీసి పిన్ తప్పు కొట్టారు మేడం.. అంటూ నమ్మబలికాడు. అక్కడే ఉన్న ఇంకో వ్యక్తి కూడా అదే మాట అని ఏటీఎం కార్డు మార్చేశారు. వారు మార్చి ఇచ్చిన ఏటీఎం కార్డును ఆమె మిషన్‌లో పెట్టి పిన్ నంబర్ కొట్టగా రాంగ్ అని చూపడంతో ఏటీఎం సెంటర్ నుంచి ఆమె బయటకు వెళ్లిపోయింది. ఆ తర్వాత అక్కడ ఉన్న ఇద్దరు యువకులు కూడా బయటకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఐదు నిమిషాల్లో ఆ యువతికి తన అకౌంట్ నుంచి రూ.49,990 డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. తన అకౌంట్‌లో ఉన్న అమౌంట్‌ను చెక్ చేసుకుంది. నిజగానే రూ.49,990 డ్రా అయినట్లు, మిగతా రూ.34 వేలు ఉన్నట్లు అకౌంట్ చూపించింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామస్వామి విచారణ చేయడంతో హర్యానాకు చెందిన సచిన్ అనే వ్యక్తి అమౌంట్ డ్రా చేసుకున్నట్లుగా తెలిసింది. వెంటనే సైబర్ క్రైమ్ వారికి ఆ యువతి ఫిర్యాదు చేసింది.

## సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోండి

లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

• నంద్యాల కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఎస్బీఐ ఉద్యోగులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్బీఐ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి సూర్యఘర్ ముక్త్ బిజిలి యోజన పథకం కింద సోలార్ ప్యానల్స్‌కు దరఖాస్తు చేసుకున్న 100 మందికి మంజూరు చేసినట్లు తెలిపారు. నంద్యాల మండలంలో పాండురంగాపురం, డోన్ మండలంలో గోసానిపల్లె రెండు గ్రామాలకు సోలార్ ప్యానల్స్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ ఆర్ఎం వెంకట సూర్యప్రకాశ్, బీఎం శేషు పాల్గొన్నారు.

# వీరేష్ బంధువుల ఆచూకీ లభ్యం

• ఆదోనికి వచ్చిన మామ • ఇప్పటికే తల్లిదండ్రులు, నానమ్మ మృతి • విచారించి వారికి అప్పజెప్పిన అధికారులు

వీరేష్‌ను మేనమామకు అప్పగిస్తున్న సబ్‌కలెక్టర్, తహసీల్దార్

**ఆదోని, జూలై 1(ఆంధ్రజ్యోతి):** 31 ఏళ్ల క్రితం తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి తిరిగి వచ్చిన వీరేష్ బంధువుల వివరాలు తెలిశాయి. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన '31 యేళ్ల తర్వాత తిరిగి వచ్చాడు' కథనాన్ని చదివిన వీరేష్ బంధువులు గుర్తుపట్టి ఆదోనికి చేరుకున్నారు. కర్నూలు సమీపంలోని సూదిరెడ్డి పల్లెలో ఉన్న మేనత్త లక్ష్మి, జగదీష్ వీరేష్‌ను గుర్తించి తహసీల్దార్ రమేష్ వద్దకు వచ్చారు. తమ వద్ద ఉన్న ఫొటోలు, రేషన్ కార్డులో ఉన్న నాన్నమ్మ అంజనమ్మ ఫోటోను చూపడంతో వీరేష్ గుర్తుపట్టాడు. కాగా వీరేష్ తండ్రి జనార్ధన్, తల్లి పద్మ, నాన్నమ్మ అంజనమ్మ అందరూ మృతిచెందినట్లు తెలియడంతో విలపించాడు. వీరేష్ తల్లిదండ్రులు కుమారుడు తప్పియాన్న బాధతోనే చనిపోయినట్లు బంధువులు తెలిపారు. ఎట్టకేలకు 31 యేళ్ల తర్వాత బంధువులు కలుసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వీరేష్‌ను బంధువులకు అప్పజెప్పారు.

# తాగునీటి సమస్య పరిష్కరించాలి

• అంకిరెడ్డిపల్లెలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు
• నెల క్రితమే ట్యాంకర్లు ఏర్పాటు చేయించిన మంత్రి బీసీ
• పర్యవేక్షణ లేకపోవడంతోనే సమస్య తీవ్రం

రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

**కొలిమిగుండ్ల, జూలై1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అంకిరెడ్డిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు రోడ్డెక్కారు. మంగళవారం గ్రామంలోని చింతలాయపల్లె రహదారి కాలనీలో నీటి సరఫరా సక్రమంగా లేదని, కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో అనంతపురం-అమరావతి ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కొలిమిగుండ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మహిళలకు సర్దిచెప్పారు. సంబంధిత అధికారులు వస్తున్నారని, సమస్యపై మాట్లాడతారని తెలపడంతో ప్రజలు ధర్నా విరమించారు.

**మేలోనే అప్రమత్తం చేసిన మంత్రి బీసీ**

మండలంలో రెండేళ్లుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మే నెలలోనే అధికారులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అప్రమత్తం చేశారు. అల్ట్రాటెక్ పరిశ్రమతో మాట్లాడి నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు స్థానిక టీడీపీ నాయకుల అంతర్గత కలహాలతో, ఎవరూ బాధ్యత తీసుకోక పోవడం సమస్య జఠిలం కావడానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## సులభ దర్శనానికి ఏర్పాట్లు

• దేవదాయశాఖ మల్టీజోన్- 2 డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

వసతి గృహాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

**మహానంది, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మహానందీశ్వరుడి సన్నిధికి వచ్చే భక్తులు సులభంగా దర్శనం చేసుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయశాఖ మల్టీజోన్-2 డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం మహానంది క్షేత్ర పరిధిలోని పలు విభాగాలను డీసీ తనిఖీ చేశారు. క్షేత్ర పరిధిలో అపరిశుభ్రతను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ మధులకు సూచించారు. అలాగే వసతి గృహాలను ఆధునికీకరించి భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. దేవస్థానం పరిధిలో దుకాణాలు, హోటళ్ళను పరిశీలించి నిబంధనల ప్రకారం భక్తులకు ఆహార పదార్థాలు నిర్ణయించిన ధరలకు విక్రయించాలని యజమానులను ఆదేశించారు. అనంతరం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పసుపుల సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

**WANTED**

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్ కావలెను. అర్హత: డిగ్రీ, P.G. 2 సంవత్సరాలు ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసిన వారికి ప్రాధన్యత ఇవ్వబడును. సంప్ర. సెల్ నెంబర్: **99856 52221**

AJL-236579

**ముస్లీం వివాహ సంబంధాలు**

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. **స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో,** నంద్యాల జిల్లా. సెల్: **87908 44959** (2వ సంబంధాలు కలవు)

AJL-236636

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:**7382114647.**

AJA- 237881

**PASSPORT MISSING**

I, **MAMIDURI ARUNACHALAM REDDY** S/o. KRISHNA REDDY MAMIDURI, R/o.H.No: 87-1328, Engineers Colony, Kurnool dist, AP., have lost my Indian Original passport bearing **No:S9490406,** While I was travelling from my house to near Government General Hospital kurnool on 25.06.2025. If anyone found please inform to the above address **Contact No: 9441264010**

AJL-236469

**FOR ADVERTISEMENTS CONTACT.**
**Cell: 99854 11369**

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

**Andhra Jyothi Classifieds**

**ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్**

* టూర్స్ & ట్రావెల్స్
* ఉద్యోగఅవకాశాలు
* తలంబ్రాలు
* హెల్త్‌కేర్
* అమ్మకము
* కొనుగోలు
* కంప్యూటర్ శిక్షణ
* బ్యూటీకేర్
* రియల్ ఎస్టేట్

4 లైన్ల క్లాసిఫైడ్ కేవలం 240 రూ॥లు
ప్రతి అదనపు లైను 45 రూ॥లు మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన పూర్తిగా ఉచితం

**ఆంధ్రజ్యోతి**

ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతిలో ప్రకటన ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోండి.

**99854 02121**

## గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ఆత్మకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించినట్లు ప్రిన్సిపాల్ సుంకన్న మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఫిజిక్స్, సీపీఎండ్‌ఎస్ సబ్జెక్టులకు సంబంధించిన ఖాళీలకు ఎమ్మెస్సీ ఫిజిక్స్ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత కలిగిన అభ్యర్థులు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7న ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440541437ను సంప్రదించాలన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మోమిన్ షబాన

బీజేపీ నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మోమిన్ షబాన

**ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్, మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబాన మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం విజయవాడలో జరిగిన సంఘటన పర్వ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలో సుస్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్న బీజేపీ రాష్ట్రంలో కూడా పూర్తి స్థాయి మెజార్టీతో అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు.

## కొరటాల సత్యనారాయణ ఆశయాలను సాధిద్దాం

కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

**ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** సీపీఎం అగ్ర నాయకుల్లో ఒకరైన కొరటాల సత్యనారాయణ ఆశయాలను సాధించేలా ఆ పార్టీ శ్రేణులు బాధ్యతగా వ్యవహరించాలని నాయకులు ఏసురత్నం, రణధీర్, నరసింహనాయక్ పేర్కొన్నారు. మంగళవారం కొరటాల సత్యనారాయణ 19వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలోని అమృతలూరు మండలం, ప్యావరు గ్రామానికి చెందిన సత్యనారాయణ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మాబాషా, రామ్‌నాయక్, సురేంద్ర, కొత్తపల్లి, స్వాములు ఉన్నారు.

## ఏఎస్ఐ మృతి

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ మాధవస్వామి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మంగళవారం విధులు పూర్తి చేసుకుని కుటుంబం ఉంటున్న డోన్‌కు వెళ్లడానికి నంద్యాల ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. అక్కడ ఫిట్స్ వచ్చి పడిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతి చెందినట్లు తెలిపారు.

## నట్టల నివారణ మందు తాగించాలి

కోడూరులో నట్టల నివారణ మందు తాపిస్తున్న డాక్టర్ జ్యోత్స్నాదేవి

**బండిఆత్మకూరు జూలై 1(ఆంధ్రజ్యోతి):** గొర్రెలు, మేకల పెంపకందారులు విధిగా జీవాలకు నట్టల నివారణ మందు తాగించాలని పశు వైద్యాధికారి సత్తిగారి జ్యోత్స్నాదేవి తెలిపారు. మంగళవారం బండిఆత్మకూరు మండలం ఏ కోడూరు, చిన్న దేవళాపురం గ్రామాల్లో నట్టల నివారణ మందు శిబిరాలు చేపట్టారు. ప్రతి పశుపోషకుడు జీవాల పెంపకం లాభదాయకంగా సాగాలంటే పశువైద్యాధికారుల సూచనలు సలహాలు పాటించాలని డాక్టర్ సూచించారు.

## భూసార ఆధారంగానే సాగు చేపట్టాలి

రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ ఆంజేయులు

**బండిఆత్మకూరు జూలై 1(ఆంధ్రజ్యోతి):** రైతులు భూసార పరీక్షల ఆధారంగానే పంటలు సాగు చేయాలని ఏడీ ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో ఏవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటను ఏడీ రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం డీఆర్సీ ఏడీ చెన్నయ్య మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రశీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దన్న, వీఏఏ సుహాసిని, నారాయణ, నాగన్న పాల్గొన్నారు.

## శ్రీశైలం అన్నదాన పథకానికి విరాళం

విరాళం అందజేసిన వారికి ప్రసాదాలు అందజేస్తున్న పర్యవేక్షకురాలు

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీశైలం అన్నప్రసాద వితరణకు కోదాడకు చెందిన కనగల నాగేశ్వరరావు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయం పర్యవేక్షకురాలు హిమబిందు రశీదు ఇచ్చి ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎంతో మంది ఇక్కడికి భక్తులు వస్తుంటారు. ఇలాంటి వారికి అన్నదానం చేసేందుకు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.

# ఏడాది పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లండి: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

ఇస్కాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

**నందికొట్కూరు, జూలై 01 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం అల్లూరు గ్రామంలోని మాండ్ర శివానందరెడ్డి నివాసంలో మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన పథకాల గురిం చి ప్రజలకు తెలియజేయాలన్నారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవకార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ పట్టణాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి మండలాల కన్వీనర్లు పలుచాని మహేశ్వరరెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి సహాయ నిధి తమను ఎంతగానో ఆదుకున్నదని మారుతి నగర్‌కు చెందిన దాలు.లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మారుతి నగర్‌కు చెందిన దాలు.లక్ష్మీదేవికి అనారోగ్య కారణంగా వైద్యం చేయించుకున్నారు. ఆసుపత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆమెకు రూ.84,443ల చెక్కును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో యాదవకార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ముర్తుజావలి, వేణుగోపాల్, సురేంద్ర, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పాములపాడు:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మండలంలోని ఇస్కాల గ్రామ శివార్లలోని, ఇస్కాల ఎత్తిపోతల పథకం నుండి స్థానిక టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి, ఏర్వ రాము, ఏర్వ శ్రీనివాసరెడ్డి, క్యాతం శ్రీనివాసులు, కలిముల్లతో కలసి ఎమ్మెల్యే బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. నీటని విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నారయణరెడ్డి, టీడీపీ నాయకులు కలిముల్ల, తిక్కస్వామి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, తిమ్మారెడ్డి, హరినాధరెడ్డి, గోవిందు, లక్ష్మికాంతరెడ్డి, వెంకటేశ్వరరావు, పూసలక్రిష్ణ, కరింబాష, సత్యంరెడ్డి, శివరామయ్య,ఏసేపు, గజ్జల భాస్కరరెడ్డి, క్రిష్ణారెడ్డి, రత్నమయ్య పాల్గొన్నారు.

● మండలంలోని క్రిష్ణరావుపేట గ్రామంలో ఎమ్మెల్యే మంగళవారం పించన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సన్ని, జనార్దన్, రామక్రిష్ణ, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, తిమ్మారెడ్డి, హరినాధరెడ్డి, గోవిందు, వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరెడ్డి, ఏసేపు, నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బుడ్డా

**వెలుగోడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తీసుకెల్లాలని శ్రీశైలం నియోజక వర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన స్వగ్రామమైన వేల్పనూరులో నియోజకవర్గ ముఖ్య నాయకులతో, మండల పార్టీ అధ్యక్షులతో, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని వైసీపీ చేస్తున్న అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసీకెనాల్ ప్రాజెక్టుల చైర్మెన్ బనూకనరు రామలింగారెడ్డి, అబ్దుల్‌కలాం, ఖలీల్, రసూల్, భూపాల్‌చౌదరి, రఘుస్వామిరెడ్డి,జాఖీర్, క్రిష్ణారెడ్డి, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

## శాకాంబరీదేవిగా వాసవీమాత

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు శాకాంబరీమాతగా భక్తులకు దర్శనమచ్చారు. ప్రతిఏటా ఆషాడమాసంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వంకాయలు, క్యారెట్, పచ్చిమిర్చి, టమోట, నిమ్మకాయలు, దొండకాయలు, బెండకాయలు, ఆలుగడ్డ, బీట్‌రూట్, ఉల్లిగడ్డలు, దోసకాయ, మునక్కాయ, ముల్లంగి, సోరకాయ, బుడంకాయ,అల్లం, గుమ్మడికాయ, చిక్కుడు, మట్టిక్కాయలు, కరివేపాకు, కోతిమీర, ఆకూకూరలతో అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించారు. లోకకళ్యాణార్థం నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలతో పాటు కుంకుమార్చనలు, లక్ష పుష్పార్చనలు, లలితాసహస్రనామాలు, పారాయణాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు విశేషంగా తరలివచ్చి వాసవీ అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలతో కూడిన నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**నంద్యాల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పలు హోటళ్లలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, శానిటరీ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. భీమాస్, సురభి హోటల్‌ల్లో పరిశుభ్రత పాటించలేదని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒక్కొక్క హోటల్‌కు రూ. 35000 జరిమానా విధించారు. అలాగే అపరిశుభ్రమైన ఆహార పదార్థాలు వినియోగిస్తున్న హర్షట్రేడర్స్‌కు రూ.5000, న్యూహిందూస్తాన్ ట్రేడర్స్ రూ2000, పూర్ణిమా ట్రేడర్స్‌కు రూ.5000, నరేంద్ర ట్రేడర్స్‌కు రూ5000, జైభవాని స్టోర్స్‌కు రూ5000 జరిమానా విధించారు. ఈతనిఖీలలో విజిలెన్స్ డీసీటీవో వెంకటరమణ, ఎసై నరేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

## 4న దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరం

**ఆత్మకూరు రూరల్, జూలై 1:** ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 4న దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి వారికి అవసరమైన పరికరాలను అందజేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించి అన్ని గ్రామాల్లోని దివ్యాంగులు, వృద్ధులకు తెలియజేయాలన్నారు. సదరం సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, మూడు ఫోటోలు,రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం,స్వాలంబన కార్డులతో ఈ శిబిరానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## మెగా డీఎస్సీకి 19 మంది గైర్హాజర్

**నంద్యాల హస్పిటల్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలకు మంగళవారం 19 మంది గైర్హాజర్ అయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆర్జీఎం కళాశాలలో మొదటి సెషన్‌లో 6 మంది రెండో సెషన్‌లో ఇద్దరు, శాంతి రాం ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సెషన్‌లో ముగ్గురు, రామక్రిష్ణా డిగ్రీ కళాశాలలో మొదటి సెషన్‌లో ఒకరు, రెండవ సెషన్‌లో ఒకరు, రెండో సెషన్‌లో ఒకరు గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. మొదటి సెషన్ లో 695 మందికి గాను 682 మంది హాజరయ్యారన్నారు. అలాగే రెండో సెషన్‌లో 695 మందికి గాను 689 మంది డీఎస్సీ పరీక్షలకు హాజరైనట్లు వివరించారు.

## కొత్తపల్లిలో భారీ వర్షం

కొత్తపల్లిలో ప్రధాన వీధుల్లో వాగులు తలపిస్తున్న వర్షపునీరు

**కొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొత్తపల్లి, వీరాపురం, గువ్వలకుంట్ల, శివపురం, సింగరాజుపల్లి, దుద్యాల, నందికుంట, కొక్కెరంచ, నాగంపల్లి, ఎర్రమటం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు వర్షపునీరుతో కుంటలను తలపించాయి. మొక్కజొన్న పంట, పత్తి, మునగ, కంది పంటలకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు ఆందనం వ్యక్తం చేశారు.

## 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

**ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి):** కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సుదర్శనవర్మ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వ పెద్దలు కార్పొరేట్ వ్యక్తులకు దాసోహమయ్యారని అన్నారు. దీన్ని అడ్డుకునేందుకు గాను చేపడుతున్న పోరాటాల్లో భాగంగా 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రణధీర్, పుల్లయ్య, అలీబాషా, లింగస్వామి, జబివుల్లా, ప్రసాద్, కలిముల్లా తదితరులు ఉన్నారు.

## ఉచిత యోగా శిక్షణ

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలంలో ఉచితంగా యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈ యోగా శిక్షణను వారంలో రెండు రోజుల పాటు గురువు ఒంగోలుకు చెందిన సుబ్రహ్మణ్యం ఇస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళ, బుధవారాల్లో చంద్రావతి కల్యాణ మండపంలో ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాలా రాష్ట్రాల భక్తులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. యోగాతో ఆరోగ్యం, ఒత్తిడిని తగ్గించుకోవచ్చు అన్నారు.

యోగా చేస్తున్న సిబ్బంది

## షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

**నంద్యాల హస్పిటల్ జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు 5,6 తేదీలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా షటిల్ బ్యాట్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే వంశీధర్ తెలిపారు. నంద్యాల పట్టణంలోని నంది ఇండోర్ స్టేడియంలో జూలై 5వ తేదిన అండర్ 11,13,15 సంవత్సరాల లోపు బాల బాలికల విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 6న అండర్ 17,19 సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. సింగిల్స్, డబుల్ విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో కోచ్ నాగార్జునకు ఈనెల 4న సాయంత్రం అందజేయాలన్నారు. వివరాలకు 8985809434 సంప్రదించాలని తెలిపారు.

## పారా ఒలింపిక్ అర్షద్‌ను అభినందించిన కలెక్టర్

అర్షద్‌ను అభినందిస్తున్న కలెక్టర్

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నంద్యాలకు చెందిన అర్షద్‌ను కలెక్టర్ రాజకుమారి మంగళవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ఇంకా ఎన్నో విజయాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇలాంటి వరకు ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుంది. అనంతరం డీఎస్‌డీవో రాజు మాట్లాడుతూ.. బాడీ బిల్డింగ్, స్విమ్మింగ్, అర్చరీ, సైక్లింగ్ వంటి వాటిలో సుమారుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 15 పతకాలు, సాధించారని తెలిపారు. దేశంలో మొదటి స్థానంలో, ఏషియాలో రెండో స్థానంలో, ప్రపంచంలో ఐదో స్థానంలో ర్యాంకు ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో రామునాయక్ పాల్గొన్నారు.

## ఎల్ఐసీ పబ్లిక్ సెక్టార్‌ను బలోపేతం చేయాలి

కేక్ కట్ చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు,ఏజంట్లు

**ఆత్మకూరు రూరల్, జూలై 1:** కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ పబ్లిక్ సెక్టార్‌ను బలోపేతం చేయాలని ఆత్మకూరు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, నాగన్నలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆ అసోసియేషన్ 75వ ప్లాటినం జూబ్లీ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్ ఆధ్వర్యంలో ఆ యూనియన్ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అమీర్‌హంజా, జబివుల్లా, శోభారాణి, ఇస్మాయిల్, ప్రవీణ్, లియాఫి నాయకులు కరీం, స్వామిదాసు, సాయిరాం, రాంబాబు,కలిముల్లా, లక్ష్మిరెడ్డి, డీవోల సంఘం అధ్యక్షులు జగన్నాధరాజు, ఆత్మకూరు, నందికొట్కూరు ఏజంట్లు పాల్గొన్నారు.

## ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం

బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

**నందికొట్కూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా అభివృద్ధి మాత్రం శూన్యమని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం ఏడాది పాలనపై సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద బెక్‌లెట్‌ను ప్రజా వైద్యశాల డా.నాగేశ్వర్ రెడ్డి విడుదల చేశారు. డా.నాగేశ్వర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఫక్కీర్ సాహెబ్, రామకృష్ణ, రాజశేఖర్, మాసూం, వైసీపీ నాయకులు అబూబకర్ పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

**కొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలోని ఎర్రకుంట గిరిజన గూడెంకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త పెద్ద వీరన్న కుటుంబ సభ్యులకు మాజీ మండల వైస్ ప్రెసిడెంటు టీడీపీ సీనియర్ నాయకులు సహదేవుడు ఆర్థిక సాయాన్ని అందించారు. ఇటీవల అనారోగ్యంతో పెద్ద వీరన్న మృతి చెందడంతో ఆయన కుమారుడు వెంకటేశ్వర్లుకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని సహదేవుడు అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, కన్నయ్య, సత్యరాజు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేయాలి

మహానందిలో గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

**మహానంది, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని మహానంది, తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్రతను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుధ్య కార్మికులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యవరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చలం చలం శిరీష, టీడీపీ నాయకులు గంగిశెట్టి మల్లిఖార్జునరావు, పాశం రాజ, సుధర్శనంరెడ్డి, భూపతి రామచంద్రుడు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామికి ప్రదోషకాల పూజలు

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీశైలంలో క్షేత్ర పాలకుడు వీదభద్ర స్వామికి ప్రదోషకాల పూజలు నిర్వహించినట్లు ఆలయం ఈవో తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రతి మంగళవారం, అమవాస్య రోజుల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమవాస్య రోజుల్లో పూజలు చేయడం వల్ల వారికి ఉన్న దోషాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం అన్నారు.

వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

## నందీశ్వరుడికి పూజలు

**నంద్యాల టౌన్ జూలై 1(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం నందీశ్వరుడికి లోక కల్యాణం కోసం ఆలయం ప్రాంగణంలో వెలిసిన (శనగల బసవన్న) కు విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయం ఈవో తెలిపారు. ప్రతి మంగళవారం, త్రయోదశి రోజున దేవస్థాన సేవగా ఈ కైంకర్యం, నిర్వహిస్తామన్నారు. సాయంసంధ్యా సమయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో దేశంలో శాంతి, వర్షాలు, కురిసి పంటలు బాగా పండి పాడి సంవృద్ధిగా ఉండాలని పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు

సంజామల కోట వీధిలో కొలువుదీరిన పీర్లు

**బేతంచెర్ల/కోవెలకుంట్ల/సంజామల/కొలిమిగుండ్ల/రుద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో పీర్లు మంగళవారం కొలువుదీరాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి పూజలు చేశారు. హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా మొహర్రం జరుపుకుంటున్నారు.

## సాగులో మెలకువలు పాటించాలి

బిజినవేములలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

**కోవెలకుంట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** పంటల సాగులో రైతులు మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించుకోవాలని వ్యవసాయశాస్త్రవేత్త రవిప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమా వేశంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ధ్రువీకరణ పత్రంతో సంక్షేమ పథకాలు

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు

**రుద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు రెవెన్యూ ధ్రువీకరణ పత్రంతో పొందవచ్చని తహసీల్దారు మల్లికార్జున రావు తెలిపారు. మంగళవారం కార్యాలయంలో సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఎల్‌పీఎంలో అధిక భూమి చూపించడం, ఇతర అనివార్య కారణాల వల్ల ప్రభుత్వ సంక్షే పథకాలు (తల్లికి వందనం,అన్నదాతల సుఖీభవ ) తహసీల్దారు సర్టిఫై చేసి ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారన్నారు. ఆ పత్రం ఆయా సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

**ఆయకట్టు పన్ను రూ.2.36కోట్లు బకాయిలు**

మండలంలో ఆయకట్టు పన్ను రూ.2.36కోట్లు బకాయి ఉందని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. ఇప్పటి వరకు 19 రెవెన్యూ గ్రామాల్లో రూ.29.25 లక్షలు వసూలు చేశారన్నారు. మిగిలిన సొమ్ము త్వరితగతిన వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలన్నారు. మండలంలో 1151 లక్ష్యం కాగా, 261 మందికి కౌలు రైతులకు కౌలు కార్డు మంజూరు చేశామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

**ఆళ్లగడ్డ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఉపకరణాల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ప్రత్యేక అధికారి హరి మాదవ్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎంపీ బైరెడ్డి శబరి సహకారంతో దివ్యాంగులు, వృద్ధులకు అలింకో అసెస్మెంట్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ శిబిరంలో నాలుగు కౌంటర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీరికి రెండు నెలల్లో పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, ఏడీ ఫాతిమా, హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్, దివ్యాంగుల పోరాట కమిటీ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు. కాగా, వినికిడి పరికరాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన పలువురు ఇబ్బంది పడ్డారు. ఆడియో ప్రోగ్రాం చేసేందుకు పరికరాలు లేక గంటల తరబడి కూర్చొని చేసేది లేక వెనుతిరిగారు.

## అహోబిలం ప్రధాన అర్చకుడికి పురస్కారం

ప్రశంసా పత్రంతో ప్రధాన అర్చకుడు

**ఆళ్లగడ్డ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామికి అత్యంత అరుదైన పురస్కారం అందుకున్నారు. తమిళనాడులోని శ్రీరంగం క్షేత్రంలో అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప శ్రీరంగ నాధయ తీంద్ర మహాదేశికన్ స్వామి వారి 70వ జయంతి భీమరధ శాంతి సందర్భంగా నిర్వహించిన వేద విద్వాంసుల సభలో అత్యంత ప్రతిభ కనపరిచిన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామికి ఆగమన విద్వాన్‌మణి పురస్కారంతో పాటు బంగారు డాలర్, నగదు అవార్డులను అందజేశారు. పీఠాధిపతి జయంతి ఉత్సవాలలో తనకు గుర్తింపు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

## బాచేపల్లి తండాలో వైద్య శిబిరం

**ఆళ్లగడ్డ, జూలై 1(ఆంధ్రజ్యోతి):** మండలంలోని బాచేపల్లి గిరిజన తండాలో డాక్టర్ డే సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఎండి డాక్టర్ సారధిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ లక్ష్మిరెడ్డి, కంటి వైద్య నిపుణులు యశ్వంత్‌రెడ్డి, గైనకాలజిస్ట్ అనీషా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఫార్మసిస్టు మధుసూదన్, ఆప్తమాలజిస్ట్ అజయ్, నాయక్, రవి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రైవేటు డాక్టర్లు

**డోన్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని షాదీఖానాలో డాక్టర్స్ డేను ప్రైవేటు డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, ప్రైవేటు డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈర్లదిన్నె శ్రీధర్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి మస్కీం వలి, చిన్న పిల్లల వైద్యనిపుణులు బాలచంద్రారెడ్డి, గైనకాలజిస్టులు డాక్టర్ సుంకన్న, డాక్టర్ యశోధ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ భవనాలకు గ్రహణం

- వైసీపీ పాలనలో మొండి గోడలకే పరిమితం
- అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ

ప్యాపిలిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

**ప్యాపిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు గ్రహణం పట్టింది. వైసీపీ పాలనలో పలు భవనాలు మొండి గోడలకే పరిమితమయ్యాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో దాదాపు 80 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అందులో కేవలం 40 కేంద్రాలకే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మిగిలిన 40 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు నిధుల మంజూరు అయ్యాయి. పలు గ్రామాల్లో భవనాల నిర్మాణాలను కూడా ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో పిల్లర్లకే పరిమితం కాగా మరికొన్ని గ్రామాల్లో టాప్ లెవెల్ వరకు నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే నిర్మాణాలను పూర్తి చేయడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**25 గ్రామాల్లో ..**

మండలంలోని కలచట్ల, బోయవాండ్లపల్లి, బావిపల్లి, ప్యాపిలి తదితర 25 గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాలు ఇరుకుగా ఉండటంతో తరగతులు నిర్వహించడంలో టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఇరుకు గదుల్లో కూర్చువాలంటే పిల్లలు కూడా ఇక్కట్లకు గురవుతు న్నారు. అధికారులు పిల్లల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను పూర్తి చేయాలని తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- పట్టణంలో సుడిగాలి పర్యటన

షాదీఖానా పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

**బనగానపల్లె, జూలై 1(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. గోపాల్‌నగర్‌లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులను పరి శీంచారు. బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కిచెన్ రూం, బియ్యం నిల్వ ఉన్నగదిని మంత్రి పరిశీలించారు. భోజనం, నాణ్యతా ప్రమాణా లను స్వయంగా పరిశీలించారు. ఈనెల 5న పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో టాయ్‌లెట్ల నిర్మాణం కోసం రూ. 20లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే షాదీఖానా భవన నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జుర్రేరు వాగు సుందరీకరణ పనులను పరిశీలించారు. అలాగే గోపాల్‌నగర్, ఖాజీవాడ, ఆస్థానం రోడ్డు, లాల్‌మసీదు వీధి, పోలీస్‌స్టేషన్ వెనుక వీధుల్లో పూర్తైయిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీ శ్రీనివాసులు, బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఏఈ సాయికృష్ణ, రమణ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది , విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు: మంత్రి బీసీ

పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**బనగానపల్లె:** అర్హులందరికీ ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గోపాల్‌నగర్‌లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. పలువురు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకరాగా పరిష్కరిస్తా నని హామీ ఇచ్చారు. మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో 426మందికి లబ్ధిదారులకు స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధి నినాదంతో ముందుకు పోతున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్, నాయకులు కాశీంబాబు, రఫీ, కృష్ణారెడ్డి, పూలకలాం, అల్తాఫ్‌హుసేన్, ఎంపీడీవో నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్ చేయాలి

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయండి
- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్ చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండలస్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని కొత్తపేటలో లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరు కలిసికట్టుగా ఉండి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలో 30రోజుల పాటు పండుగ వాతావరణంలో సుపరి పాలనకు తొలి అడుగు - డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్ రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, ఎన్నికల కమిటీ అబ్జర్వర్స్ గడ్డం రామకృష్ణారెడ్డి, గోవిందనాయుడు, విజయకుమార్, నాయక్, ఓబులాపురం శేషిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, నాయకులు టీఈ కేశన్నగౌడు, చంద్రపల్లి లక్ష్మీనారాయణ యాదవ్, బేతంచెర్ల ఎల్లనాగయ్య, కమలాపురం సర్పంచ్ అర్జున్ రెడ్డి, కొత్తకోట శ్రీను, సుదీష్, తోట మనోహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

- పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం నియోజకవర్గ అభివృద్ధి, గ్రామీణ సంక్షేమం, ప్రభుత్వం చేపడుతున్న ప్రాధాన్యత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

కోర్టు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**డోన్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కోల్‌కత్తాలో లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం డోన్ కోర్టు గేటు ముందు ఐఏఎల్ ఆధ్వర్యంలో భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.శివరామకృష్ణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేజీ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నల్లమేకల మద్దయ్య, సహాయ కార్యదర్శి జే.రవిమోహన్, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా ప్రతినిధి మీనుగ కుమారి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు

**డోన్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన పీవీఎన్ మాధవ్‌ను డోన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

**బనగానపల్లె, జూలై 1(ఆంధ్రజ్యోతి):** పాఠశాల పురోభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని టీచర్ సతీశ్ కుమార్ అన్నారు. మండలంలోని టంగుటూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ పదోన్నతిపై వెళ్లిన సతీశ్‌కుమార్, విజయకుమార్‌ను హెచ్‌ఎంలు జగదీశ్, సింగయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. ఉపాధ్యాయులు సుదర్శన్, శంకర్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

గుంతలుపడ్డ సంజామల - ముదిగేడు రహదారి

మరమ్మతులు చేసిన డబుల్ రోడ్డు

# గుంతలమయమైన రోడ్డుకు మోక్షం

**సంజామల, జూలై 1(ఆంధ్రజ్యోతి):** గుంతలమయమైన రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని ముదిగేడు నుంచి సంజామల వరకు రోడ్డు అధ్వానంగా ఉండేది. దాంతో రోడ్డు మరమ్మతులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 12.56 కోట్లు నిధులను విడుదల చేయించారు. ఈ నిధులతో ఆరు కిలో మీటర్ల రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించారు. ముదిగేడు నుంచి సంజామల జూనియర్ కాలేజీ వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. జూనియర్ కాలేజీ నుంచి సంజామలలోకి సీసీరోడ్లు వేయనున్నట్లు కాంట్రాక్టర్ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న రోడ్డుతో ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు డబుల్ రోడ్డు ఏర్పాటుతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మానసలింగేశ్వరుడికి అభిషేకం

**రుద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** లోక కల్యాణం కోసం మానస లింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు, సుబ్రమణ్యస్వామి షష్టి పర్వదినం పురస్కరించుకుని పంచామృతాభిషేకం అర్చకులు శివశర్మ మంగళవారం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మి గోదాదేవి సమేత వాసాపురం వేంకటేశ్వరుడికి కూడా పూజలు చేసినట్లు తెలిపారు. పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

## నాల్గవ రోజుకు చేరిన నిరసన

**డోన్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించవద్దని డాక్యుమెంటు రైటర్లు చేస్తున్న ధర్నా మంగళవారం నాల్గవరోజుకు చేరుకుంది. డోన్ కోర్టు లాయర్స్ సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, మండల కమిటీ సభ్యులు ఎస్‌ఏ చిన్న రెహిమాన్, రామాంజనేయులు నాగమద్దయ్య, ఐద్వా నాయకురాలు షమీమ్ భేగం, డాక్యుమెంటు రైటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి బీసీ గుల్లదుర్తికి రాక

**కోవెలకుంట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** మండల పరిధిలోని గుల్లదుర్తి గ్రామంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు, ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రి బీసీ బుధవారం ఉదయం 8.30గంటలకు గ్రామానికి చేరుకొని సీసీ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఇంటింటికీ టీడీపీలో పాల్గొని ప్రభుత్వ పథకాలు వివరిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

## లేఅవుట్ కాలనీలో కంపచెట్లు తొలగించండి

**కోవెలకుంట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలో ప్రైవేటుగా వేసిన లేఅవుట్ కాలనీల్లో కంపచెట్లను, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయించుకోవాలని కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ ఈవో, ఈవోఆర్‌డి ప్రకాశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరగడం వల్ల పాములు, తేళ్లు, విష పురుగులు సంచరిస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నెల 15లోగా తొలగించకపోతే గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించి, లేఅవుట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీరామ్

**అవుకు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** అవుకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీరామ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన వెంగన్న పదవీవిరమణ పొందడంతో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## జాతీయస్థాయికి విద్యార్థి ఎంపిక

అజిత్‌రెడ్డి

**చాగలమర్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి అజిత్‌రెడ్డి రాష్ట్రస్థాయి పెన్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. విజయవాడలో గత నెల 29న నిర్వహించిన అండర్-12 విభాగంలో రాష్ట్ర చాంపియన్‌షిప్ కత్తి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మహారాష్ట్ర నాసిక్ పట్టణంలో జూలై 5 నుంచి 7 వరకు జరిగే అండర్-12 నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అజిత్‌రెడ్డి పాల్గొంటాడని హెచ్‌ఎం స్మిత తెలిపారు. విద్యార్థి అజిత్‌రెడ్డి జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు చంద్ర ఓబుళరెడ్డి, ఆశాజ్యోతి, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఉపాధ్యాయులు అభినందించారు.

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

**చాగలమర్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో రంగనేతాజీ సూచించారు. మంగళవారం నగల్లపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మణి, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

## శాకాంబరిగా అమ్మవారు

అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

**చాగలమర్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకాంబరి అలంకారంలో కొలువుదీరారు. ఆషాడమాసం సందర్భంగా మంగళవారం మహిళలు అమ్మవారికి కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరింప చేశారు. శాకంబరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సామూహిక వడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి, సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**చాగలమర్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని ఎంఈవో న్యామతుల్ల తెలిపారు. మంగళవారం చాగలమర్రి పాతబస్టాండులోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**చాగలమర్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపర్‌వైజర్ రామలింగారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మద్దూరు గ్రామంలోగల ఆరోగ్య కేంద్రంలో డెంగీ, మలేరియా మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. డెంగీ, మలేరియా జర్వాలపై నిర్లక్ష్యం చేయకుండా వైద్య చికిత్స చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాబుహుసేన్, ఏఎన్‌ఎం నర్సమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఆయకట్టుకు సాగునీరు విడుదల

**అవుకు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** అవుకు రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసినట్లు ఎస్సార్బీసీ ఈఈ శుభకుమార్ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.685 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. రైతులు ఖరీఫ్‌లో పంట పొలాలను సాగు చేసుకునేందుకు సిద్ధమవటంతో రిజర్వాయర్ నుంచి లోకల్ ఆయకట్టుకు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. అలాగే చెర్లోపల్లె సమీపంలోని గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) గేట్ల ద్వారా కడప జిల్లాకు వెళ్లే కెనాల్‌కు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని అన్నారు. 12ఏ బ్లాక్ ఎస్సార్బీసీ ప్రధాన (సంగపట్నం) కాల్వ కింద మరమ్మతు పనులు జరుగుతుండటంతో నీటిని విడుదల చేయలేదన్నారు. రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల చేయాలి

**రుద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. మంగళ వారం మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జోక్యం చేసుకుని పోతిరెడ్డిపాడు నుంచి వెలుగోడు, గోరుకల్లు రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. నీరు విడుదల చేయకుంటే 4న పోతిరెడ్డిపాడు గేట్లు రైతులతో కలిసి ఎత్తుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు రామక్రిష్ణ, శివక్రిష్ణ, గోపాల్, నాగయ్య, బాలు, లింగమయ్య పాల్గొన్నారు.

## ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

**కొలిమిగుండ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ శివరాముడు మంగళవారం తెలిపారు. గ్రామానికి తాగు నీరు సరఫరా అందించే బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో తాగు నీటి సమస్య ఏర్పడిందన్నారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ శివ తెలిపారు.



## పండుగ శోభ!

మరో నాలుగురోజుల్లో రొట్టెలపండుగ ప్రారంభం కాబోతోంది. ఈలోపు పండుగ వేదిక అయిన బారాషహీద్ దర్గా, స్వర్ణాలచెరువు వద్ద ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. దర్గా, ముఖద్వారాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణ నగరవాసులను ఆకట్టుకుంటోంది. మరోవైపు మొహర్రం నెల ప్రారంభం కావడంతో యాత్రికుల రాక మొదలైంది. వచ్చినవారు చెరువులో స్నానమాచరించి, రొట్టెలు మార్చుకుంటున్నారు. ఇక దర్గాలో బారాషహీదులను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

ముఖద్వారాల వద్ద విద్యుద్దీప అలంకరణ

---

● నెల పాటు నిర్వహణ ● ఏడాది సుపరిపాలనపై వివరాలు సేకరణ

● సలహాలు, సూచనలు ప్రత్యేక యాప్‌లో నమోదు ● అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం

# నేటినుంచి జనంలోకి టీడీపీ

కందుకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెడుతున్న 'సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ' కార్యక్రమం జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రారంభంకానుంది. నెలరోజుల వ్యవధిలో ప్రతి ఇంటికీ పార్టీ నాయకులు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించటంతోపాటు ఏడాదికాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తారు. ప్రతినెలా 1వ తేదీన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్లు వారి ఇంటివద్దనే అందజేస్తున్న తీరు, ఇటీవల తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఎంతమంది బిడ్డలు ఉన్నా అందరికీ రూ.13వేల చొప్పున తల్లుల ఖాతాలకు జమ, దీపం పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయటం వంటివాటిని వివరించనున్నారు. అలాగే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్న వైనాన్ని కూడా ప్రజలకు వివరిస్తారు.

### మండలస్థాయిలో ఇన్చార్జులు

ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఇంటింటా సమర్థవంతంగా నిర్వహించే బాధ్యతను టీడీపీ మండల కమిటీల బాధ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, ప్రతి 30 ఇళ్లకు నియమించిన ఒక కేఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించేలా టీడీపీ అధిష్ఠానం రూపకల్పన చేసింది. బాధ్యులందరికీ వారి మొబైళ్లలో ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసింది. 'మై టీడీపీ యాప్'లో కేవలం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు మాత్రమే ఆపరేట్ చేయగలిగేలా వారు ఒక్కొక్కరు ఐదుగురి కేఎస్ఎస్‌లకి ఏకకాలంలో ఆ యాప్‌ను అందించగలిగేలా సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఒక్కో ఇంటివద్దకు వెళ్లాక కేఎస్ఎస్‌లు ఆ ఇంటిముందు నిలబడి ఫొటోతీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ ఇంటికి సంబంధించిన వివరాలన్నీ ఓపెన్ అవుతాయి. ఆ వివరాల ఆధారంగా ఆ ఇంట్లో ఎంతమందికి ఎన్టీఆర్ భరోసా ఫించన్ వస్తోంది, ఎంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ అయింది, ఇప్పటివరకు ఎన్ని సిలిండర్లకు సబ్సిడీ నగదు జమ అయింది వివరించటంతోపాటు మరే ఇతర ప్రభుత్వ పథకాల ద్వారానైనా ఆ కుటుంబానికి లబ్ధి చేకూరి ఉంటే ఆ వివరాలను కూడా వివరించనున్నారు. అలాగే ఏడాదికాలంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను కూడా కేఎస్ఎస్‌లు ఇంటింటా వివరించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయం, సూచనలను స్వీకకరించా ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతి ఇంటికీ ఇన్చార్జులు వెళ్లి ఫొటోతీస్తేనే ఆ ఇంటి సర్వే పూర్తయినట్లు సాఫ్ట్‌వేర్ నిర్ధారించేలా ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. అలాగే ప్రతి ఇంటివద్ద కనీసం మూడు నిమిషాలు ఉంటేనే మరో ఇంటి ఫొటోతీసేందుకు ఆ యాప్ అనుమతిస్తుంది. అంటే వీరు ప్రతి ఇంటికీ తప్పకుండా వెళ్లాల్సిందే. ఆ ఇంట్లో వారితో మాట్లాడి వారు చెప్పే వివరాలు అప్‌లోడ్ చేస్తే తప్ప మరో ఇంటికి వెళ్లే అవకాశం లేదు. ఈ మొత్తం కార్యక్రమాన్ని నెలరోజుల్లో పూర్తిచేసేలా రూపకల్పన చేశారు.

రొట్టెల పండుగ ఆహ్వాన వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

## రొట్టెల పండుగను విజయవంతం చేయండి

మంత్రి పొంగూరు నారాయణ ● బారాషహీద్ దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యా నికి ప్రతీకగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగను విజయవంతం చేసి అందరికీ మంచిపేరు తేవాలని బారాషహీద్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యులకు పురపాలక మంత్రి పొంగూరు నారాయణ సూచించారు. మంగళవారం రాత్రి బారాషహీద్ దర్గాలో నూతన ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, సభ్యులతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రొట్టెల పండుగకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఉత్సవ కమిటీ చిత్తశుద్ధితో సేవలు అందించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువ మంది భక్తులు రొట్టెల పండుగకు వస్తారని అందుకు అనుగుణం గా అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగ ఆహ్వాన పోస్టర్లు ఆవిష్కరించారు.

## మినీ.. ఇక మెయిన్

● అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

● ఉన్నవారికి అదనం.. కొత్తవారికి కొలువు

● జిల్లాలో 229 మినీ అంగన్‌వాడీలకు ప్రయోజనం

నెల్లూరు (హరనాథపురం); జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్ వాడీలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఎన్నికల హామీలఅమలులో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని 229 మినీ అంగన్‌వాడీలకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో ఇప్పటికే 2705 ప్రధాన, 229 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఈ కేంద్రాలలో ఆరు నెలల నుంచి ఒక ఏడాది వయసున్న పిల్లలు 13,987 మంది నమోదై ఉన్నారు. 50,965 మంది పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులకు ఈ సెంటర్ల ద్వారా అంగన్‌వాడీలు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు.

● పెరగనున్న జీతాలు

ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రస్తుతం నెలకు రూ.11,500 వేతనం ఇస్తుండగా, మినీ అంగన్‌వాడీలకు కేవలం రూ.7500 మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో మినీ కేంద్రాల్లో ప్రస్తుతం పని చేస్తున్న 229 మందికి ఇకపై రూ.11,500 ప్రకారం జీతం అందనుంది. అంటే.. ఒకేసారి వీరికి ఒక్కొక్కరికి రూ.4 వేల మేర వేతనాలు పెరగనున్నాయి.

● 229 పోస్టుల భర్తీ

మినీ అంగన్‌వాడీల్లో కేవలం కార్యకర్త మాత్రమే ఉంటారు. అయితే ఇప్పుడు మెయిన్ అంగన్ వాడీ కేంద్రాలుగా మారుతున్న తరుణంలో సహాయకుల(ఆయాలు)ను నియమించేందుకు ప్రకటన కూడా వెలువడనుంది. దీంతో జిల్లాలో 229 మంది మహిళలకు ఉపాధి లభించనుంది. అంగన్‌వాడీకార్యకర్తల భర్తీకి చర్యలు చేపట్టనున్నారు. కార్యకర్తల సర్వీసు ఆధారంగా గ్రాట్యూటీ అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం కూడా తీసుకుంది. దీంతో మినీ కేంద్రాల అంగన్‌వాడీలకు ప్రోత్సాహంతో పాటు, బాలల వికాసానికి తోడ్పాటు కలగనుంది. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియకు చర్యలు ప్రారంభిస్తామని చెప్పారు.

## నాకు సంబంధం లేదు!

● పోలీసు విచారణలో కాకాణి సమాధానాలు

నెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : 'కృష్ణపట్నం పోర్టు వద్ద ట్రాన్స్‌పోర్టర్ల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసిన వ్యవహారంతో నాకు సంబంధం లేదు.. మీరు చెబుతున్న వ్యక్తులెవరో నాకు తెలియదు.. రాజకీయ కక్షతో నాపై అక్రమ కేసులు బనాయించారు.' ఇవీ అక్రమ టోల్‌గేట్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన సమాధానాలు. ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో పోలీసులు రెండో రోజు కూడా కాకాణిని విచారించారు. నెల్లూరులోని పీటీసీలో పోర్టు సీఐ రవినాయక్, ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డిలు పలు ప్రశ్నలకు కాకాణి ముందుంచారు. ట్రాన్స్‌పోర్టర్ల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యక్తులతో మీకు ఎటువంటి సంబంధం ఉందని పోలీసులు ప్రశ్నించగా.. అసలు వారెవరో తనకు తెలియదని కాకాణి సమాధానమిచ్చారు. ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్‌లో వైసీపీ నాయకులు భాగస్వాములుగా ఉన్నారుగా అని పోలీసులు ప్రశ్నించగా.. ఎవరెవరు ఎటువంటి వ్యాపారాలు చేస్తారో తనకెలా తెలుస్తుందని సమాధానమిచ్చారు. ఈ కేసులోని కొందరు నిందితులను విచారించిన సమయంలో మీరు వారితో కలిసి చెక్‌పోస్టులను సందర్శించినట్లు స్టేట్‌మెంట్ ఇచ్చారని, దీనికి ఏం సమాధానం చెబుతారంటూ పోలీసులు కాకాణిని అడగ్గా.. ఎవరో ఇచ్చిన స్టేట్‌మెంట్లపై తాను వ్యాఖ్యానించనని, సాంకేతికంగా తన పాత్రను రుజువు చేయాలంటూ కాకాణి రాతపూర్వకంగా పోలీసులకు సమాధానమిచ్చారు. రెండు రోజుల కష్టడీ ముగియడంతో కాకాణిని తిరిగి జైలులో అప్పగించారు.

పెండ్లి కుమార్తెగా ద్రౌపదీదేవి

## వైభవంగా ద్రౌపదీ కల్యాణం

నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మ రాజులస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన బకాసుర వధ ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

- వివరాలు 8లో...

## సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తి

● 533 మందికి స్థానచలనం

- వివరాలు 8లో...

పశువులపై థైలీరియా ప్రభావం

## పెన్నా నదిలో దర్జాగా రోడ్డు

కలువాయి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాజుపాళెం సమీపంలో పెన్నానది లోపలకు ఇసుకాసురులు రోడ్డు నిర్మిస్తున్నారు. ప్రవాహం ఉన్న చోట సిమెంటు పైపులు వేసి పెద్ద పెద్ద బండరాళ్లతో జోరుగా పనులు చేయిస్తున్నారు. కలువాయి సమీపంలోని తెలుగుగంగ కాలువ నుంచి లారీలతో బండరాళ్లు, మట్టిని భారీ వాహనాలతో ఇక్కడకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల అధికారులు మానవశక్తితో పూడికతీతకు టెండర్లు పిలిచి ఇసుక రీచ్‌కు అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నది నుంచి ఇసుక తరలించేందుకు రోడ్డు పనులు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో ఇదే ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు నదిలోనే రోడ్డు వేశారు. నదిలో ప్రవాహం పెరగడంతో ఈ రోడ్డు పలుచోట్ల కొట్టుకుపోయింది. మళ్లీ ఇప్పుడు రోడ్డు నిర్మిస్తున్నారు.

### పూడికతీత అనుమతులపై విమర్శలు

రాజుపాళెం సమీపంలో పెన్నానదిపై ఎలాంటి బ్యారేజ్‌లు, కట్టడాలు లేవు. దీంతో ఈ ప్రాంతంలో నీరు నిల్వ ఉండే అవకాశం లేదు. కాబట్టి ఇక్కడ పూడిక ఉండే ఆస్కారం ఉండదు. అయినా అధికారులు సంగం బ్యారేజ్ అప్‌స్ట్రీమ్ అంటూ టెండర్లు పిలిచి అనుమతులు ఇచ్చారు. సోమశిల జలాశయానికి కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి సంగం బ్యారేజ్‌కి 50 కి.మీ పైగా దూరం ఉంటుంది. అక్కడ బ్యారేజ్ ఉంటే ఇక్కడ నదిలో పూడిక ఎలా ఉంటుందో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనికితోడు మానవశక్తితో నదిలో నుంచి ఇసుకను ఎలా బయటకు తీస్తా రో అధికారులకే తెలియాలి. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశీనాయక్ మాట్లాడుతూ రాజుపాళెం సమీపంలోని నదిలో రోడ్డు నిర్మాణానికి మేము ఎలాంటి అప్రూవల్ ఇవ్వలేదన్నారు.

రాజుపాళెం సమీపంలో నదిలో రోడ్డు పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

## 'విజయ' పాల సేకరణ ధర పెంపు

నెల్లూరు (వెంకటేశ్వరపురం): నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితికి (విజయ డెయిరీ) పాలు పోసే రైతులకు పాల సేకరణ ధర పెంచుతున్నట్లు ఆ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 10 శాతం వెన్న కలిగిన లీటరు పాలకు రూ.75.90 ఇస్తున్నారు. దానిని రూ1.50 పెంచి రూ.77.40 ఇవ్వనున్నట్లు తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి పెరిగిన ధర అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ తదితరులు

## మొక్కుబడిగా దిశా

● సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల డుమ్మా

● కేంద్ర పథకాల అమలుపై జరగని చర్చ

నెల్లూరు (జడ్పీ), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలపై మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన దిశా సమావేశం మొక్కుబడిగా సాగింది. దిశా చైర్మన్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో సహా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు సభ్యులుగా ఉన్నారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నేరుగా మంజూరు చేస్తున్న 67 పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. వ్యవసాయం, హౌసింగ్, అంగన్వాడీలు, మహిళలు, పిల్లల భద్రత, జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన, విద్యాశాఖ, జలజీవన్ మిషన్ వంటి అనేక ప్రధాన పథకాలు ఉన్నాయి. అయితే ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు తిరుపతి ఎంపీ గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. దిశా చైర్మన్ వేమిరెడ్డితోపాటు కేవలం జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ ఆనంద్ ఇతర అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో పథకాలపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండాపోయింది. 67 పథకాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరాలు వెల్లడించినా అవి క్షేత్రస్థాయిలో సమగ్రంగా అమలు అవుతున్నాయా లేదా చర్చించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేకపోవడంతో కేవలం అధికారులు చెప్పిన వివరాలతోనే సమావేశం ముగిసింది. కేంద్ర పథకాల అమలు తీరు సమగ్రంగా ఉందా లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా!? ఉన్న పథకాలను ఏ సమయంలో పూర్తి చేయాలి, చేసేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించి ఉంటే జిల్లాకు ఎంతో మేలు జరిగేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఇవన్నీ క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతున్నాయన్న వివరాలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్దే ఎక్కువగా ఉంటాయి. దీంతో సభ్యులందరూ హాజరై ఉంటే జిల్లాకు ఎంతో మేలు జరిగేదన్న అభిప్రాయం కొంతమంది అధికారుల్లో వ్యక్తమైంది.

● జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుదాం : ఎంపీ

కేంద్రం అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసి జిల్లాను పూర్తి అభివృద్ధిపథంలో నడపాలని దిశా చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పథకాల అమలులో ఏమైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసార పరీక్షలు, ఈ మార్కెట్లు, డ్రిప్ ఇరిగేషన్, గ్రామాల్లో మౌలిక వసతులు, అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద మరింత మందిని చేర్చే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు కేటాయించి పెండింగ్ పనులు, ఫ్యాన్లు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల కుర్చీలు

## పంట బీమా పథకం రైతులకు వరం

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట బీమా పథకం రైతులకు వరం అని వ్యవసాయశాఖ కోవూరు ఏడీ అనిత తెలిపారు. మండలంలోని అలగానిపాడు, ముదివర్తి గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటకు అగస్టు 15వ తేదీ వరకు, వేరుశనగకు ఈనెల 31లోగా బీమా చేయించుకోవాలన్నారు. తద్వారా పంటలకు ఎటువంటి నష్టం వచ్చినా రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఈవో లక్ష్మి, వీఏఏలు కామాక్షి, సాయి లక్ష్మిలు పాల్గొన్నారు.

**బంగారం, వెండి ధరలు**

| బంగారం (22 క్యారెట్లు) | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.9347 |
| వెండి కిలో ధర | రూ. 110000 |
| వెండి ఒక గ్రాము | రూ. 113.00 |

# కంకరు టిప్పరు బీభత్సం

- ఇంజన్‌లో వ్యాపించిన మంటలు
- డ్రైవర్ దూకేయడంతో చెట్టును ఢీకొని ఆగిన వైనం
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రోడ్డు పక్కన చెట్టును ఢీకొని ఆగిపోయిన టిప్పర్

కావలిరూరల్, జూలై 1(ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు సెంటర్‌లో కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ మంగళవారం బీభత్సం సృష్టించింది. స్థానికుల వివరాల మేరకు.. జీఎస్ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కి చెందిన టిప్పర్ తుమ్మలపెంట రోడ్డుకు కంకరులోడుతో వెళ్తుండగా తుమ్మలపెంట రోడ్ సెంటర్‌కు వచ్చేసరికి టిప్పర్ ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. దీంతో బ్రేకులు కూడా పడక టిప్పర్ ఆగకపోవడంతో డ్రైవర్ టేకేలాల్ లారీలో నుంచి కిందకు దూకేశాడు. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో లారీ 30 అడుగుల మేరకు ముందుకుపోయి ఒక చెట్టును ఢీకొని ఆగిపోయింది. అనంతరం బ్యాటరీ వైర్లు తొలగించి మంటలు ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో ఒక ఆటో, బైక్ స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి వార్షిక వేడుకలు

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దెలమడుగులో శ్రీమహావిష్ణు, అయ్యప్పస్వామి ఆలయం నిర్మించి నాలుగేళ్లయింది. ఈ సందర్భంగా చతుర్థ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, మలికాపురాతమ్మ, శ్రీఅభయాంజేయస్వామి సహిత విష్ణుమూర్తికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు నూతన వస్త్రాలను పాలవెల్లి లక్ష్మీనారాయణ దంపతులు అందించారు.సాయంత్రం పురవీధుల్లో దేవేరులకు గ్రామోత్సవం నిర్వహించారు.

# యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు

- పట్టపగలే తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

పట్టపగలే ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : అనుమతులేవ్వు.. అడిగేటోళ్లు లేరు.... ఇంకేముంది మట్టిని దర్జాగా తవ్వేస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే మట్టిని దోచేస్తున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. రాపూరు మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పట్టపగలే ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద చెరువులో ఉన్న మట్టిని ఎక్స్‌కవేటర్లతో తవ్వి ట్రాక్టర్లతో తోలుకుపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ధనార్జనే ధ్యేయంగా మట్టిని కొల్లగొడుతూ లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వెంచర్లు, లేఅవుట్లు, రియల్ ఎస్టేట్‌లకు అక్రమంగా మట్టిని తోలుకొనిపోతున్నారని అధికారులకు తెలిసినా, తెలియనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. గత కొద్దిరోజులుగా మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. మండలంలో ఉన్న ఓ కర్మాగారానికి ట్రాక్టర్ మట్టి రూ.2వేలు వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో అధికార పార్టీకి చెందిన నాయకుడికి రూ.500 వరకు అందుతుందనేది సమాచారం. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**నియంత్రణ లేని అతివేగం**

మట్టి అక్రమ రవాణా చేసే ట్రాక్టర్ల వేగానికి ఇతర వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఎక్కువ ట్రిప్పులు తోలాలనే అత్యుత్సాహంతో అత్యంత వేగంగా ట్రాక్టర్లను నడుపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతాయనే ఆరోపణలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మట్టి రవాణా చేసే పలు ట్రాక్టర్లకు కనీసం సరైన డాక్యుమెంట్లు కూడా లేవనే కూడా ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ పత్రాలు కూడా లేకపోవడంతో ప్రమాద సమయంలో భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఫిట్‌నెస్ లేని వాహనాలను కూడా మట్టి రవాణాకు వినియోగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పెద్ద చెరువులో మట్టి తవ్వగా ఏర్పడిన గుంతలు

### గల్లంతైన వారి కోసం
# మూడు బృందాల గాలింపు

అడవిలో గాలింపునకు సిద్ధమైన బృందాలు

అనంతసాగరం జూలై 1 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి సోమశిల అటవీ ప్రాంతంలో గల్లంతైన మనుబోలు మండలం నాయుడుపల్లికి చెందిన రత్నానాయుడు, సుబ్బారాయుడు ఆచూకీ కోసం పోలీసు, అటవీశాఖ అధికారులు మూడు బృందాలుగా విడిపోయి మంగళవారం గాలింపు చేట్టారు. గత వారం రోజులుగా వారికోసం బంధువులు గాలిస్తున్న విషయం తెలిసిందే. కాగా అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో అనంతసాగరం, సోమశిల, మర్రిపాడు పోలీసులు స్థానికులతో కలిసి అటవీ సిబ్బంది సహకారంతో డ్రోన్ కెమెరాలతో విస్తృతంగా గాలిస్తున్నారు. అయిన వారి జాడ లేక పోవడంతో ఏమయ్యారు..? అనే ఆందోళనతో కుటుంబసభ్యులు భయపడుతున్నారు. కాగా వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.10 వేల పారితోషకం అందిస్తామని సోమశిల ఎస్ఐ అనూష ప్రకటించారు. ఆచూకీ తెలిసే వరకు గాలింపు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**అడవిలో ఎర్రచందనం కూలీలు ?**

గల్లంతైన వారి కోసం సోమశిల అటవీ ప్రాంతంలో బాధితుల కుటుంబ సభ్యులు గాలిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎర్రచందనం కూలీలు అడవిలో తారసపడట్టు వారు చెబుతున్నారు. వారి నుంచి గల్లంతైనవారికి ఏమైనా.. హాని కలిగిందా ? అనే అనుమానం కలుగుతోంది. గాలింపులో భాగంగా ఎర్రచందనం కూలీల కోసం కూడా అధికారుల వేట సాగిస్తున్నారు.

## తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వండి : డీఎల్‌పీవో

మనుబోలు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వచ్చే పంచాయతీ చెత్తబండికి తడి చెత్తను, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలని డీఎల్‌పీవో పుట్టా రమణయ్య సూచించారు. మంగళవారం మనుబోలులో ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య కార్మికులకు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గురుడయ్య, బిల్లు కలెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో రక్తదాన శిబిరం

వెంకటాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం, నోవా బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత రక్తదాన శిబిరాన్ని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, పీఆర్వో నీలమణి కంఠ, డాక్టర్ సుజాత, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

ముత్తుకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్సడే వేడుకలను జంగాలకండ్రిగలో జగన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటసురేష్ మాట్లాడారు. అనంతరం వైద్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జయభారత్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివమౌర్యగుప్తా, మేనేజర్ గురుప్రసాద్, హర్ష, సునీల్, ప్రత్యూష, అమర్‌నాథ్‌రెడ్డి, పాల్గొన్నారు.

## చార్టర్డ్ అకౌంటెంట్స్ డే

వెంకటాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక టోల్‌ప్లాజా వద్ద ఉన్న సీఏ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఏఐభవన్)లో మంగళవారం సీఏ (చార్టర్డ్ అకౌంటెంట్స్) 77వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వృక్షారోపణ, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను చేపట్టారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రముఖ మోటివేటర్ కంచి ఆనందరెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ నెల్లూరు శాఖ చైర్‌పర్సన్ హిమహాసిని, వైస్ చైర్మన్ ఉదయ్‌తేజ, సభ్యులు సునీల్‌కుమార్, సందీప్, ఖజాంచి, శ్రీనివాస్, సాయిచరణ్ పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

పొదలకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మొక్కల పెంపకంతోనే పర్యా వరణం సాధ్యమవుతుందని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ తులసి అన్నారు. మంగళవారం పట్టణంలో మొక్కల పెంపకంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో డాక్టర్సడేను పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ రోడ్డులో పెట్రోలు బంకు పరిసర ప్రాంతంలో మద్యం మత్తులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తిని స్థానిక ప్రజల సమాచారంతో సోమవారం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మంగళవారం ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం తెలపాలని కోరారు.

# త్వరలో ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణం పూర్తి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట : పెన్షను పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలు కలగా మిగిలిన ముదివర్తి - ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని ముదివర్తిపాలెం మిక్స్‌డ్ కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఐదేఏళ్లలో అస్తవ్యస్తమైన పాలనా వ్యవస్థను సంస్కరించి ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణం పూర్తయ్యాక ఇందుకూరుపేట మండల వాసులకు వరద ముప్పుతో పాటు ఉప్పు నీటి సమస్య ఉండదన్నారు. వరద ముప్పు రాకుండా రాముడు కాలువకు ప్రొటక్షన్ వాల్ నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు ఆగిపోయాయన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, నాగరాజు, సుబ్రహ్మణ్యం, రాజారెడ్డి, చిల్లకూరు రాధారెడ్డి పాల్గొన్నారు.

విడవలూరు : పంచన్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ నాగ రాజకుమారి తెలిపారు. మండలంలోని పార్లపల్లిలో మంగళవారం జరిగిన పించన్ల పంపిణీ కార్యక్రమంలో అమె పాల్గొని పింఛన్లు అందజేశారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 3.4 లక్షల లబ్ధిదారులకు రూ.132 కోట్ల అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. 1వ తేది 95 శాతం పూర్తి చేస్తున్నామని, భర్త చనిపోయిన మహిళలకు పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, ఏపీఎం వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య పాల్గొన్నారు.

## పింఛన్ల పథకం దేశంలోనే ఓ చరిత్ర : సోమిరెడ్డి

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న పింఛన్లు దేశంలోనే ఒక చరిత్ర అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపాళెంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేసి, వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన వ్యవస్థలన్నింటిని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. అమరావతి క్యాంటమ్ వ్యాలీ దేశానికే దిక్సూచిగా నిలవనున్నదని చెప్పారు. కృష్ణపట్నం కంటైనర్ పోర్టు ఎందుకు తమిళనాడుకు వెళ్లిపోయిందని, ఎగుమతులు, దిగుమతులు కూడా బంద్ అయిపోయాయని, ఇందుకు కారణం ఎవరని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, శ్రీనితారెడ్డి, నందకిషోర్‌రెడ్డి, బాబురెడ్డి ఎంపీడీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

**ముత్తుకూరు:** పేదల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి శృతిరెడ్డి తెలిపారు. మంగళవారం ముత్తుకూరు పంచాయతీ పరిధిలోని బలిజపాలెం, తహసీల్దారు కాలనీలో సచివాలయ ఉద్యోగులు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలం మల్లికార్జున్ యాదవ్, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బులిగర్ల శ్రీనివాసులు, అరుఖ్కయ్యగారి ఏడుకొండలు, ఎల్లయ్య, పాల్గొన్నారు.

# వైద్యులకు ఘన సన్మానం

డాక్టర్ వెంకట చలపతిగౌడ్‌ను సన్మానిస్తున్న పెద్ది ప్రభావతి చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు

కోవూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను పెద్ది ప్రభావతి చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు 14 మంది డాక్టర్లను ఘనంగా సన్మానించారు. డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్లు చూపిన ధైర్యసాహసాలు, వృత్తి నైపుణ్యత ప్రశంసనీయమన్నారు. వైద్యుడు దేవుడితో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ నరసింహమూర్తి, వైద్యాధికారులు లీలావతి, వెంకటాచలపతి గౌడ్, జ్యోతిప్రభ, సలావుద్దీన్, ఇర్ఫాన్, నిరంజన్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మారుతీ నాగార్జున, సత్యవతి, వేముల నిఖిల్ పాల్గొన్నారు.

# 30 ఏళ్ల సమస్యకు పరిష్కారం

- శాంతినగర్‌లో రేషన్‌షాపు ప్రారంభం

శాంతినగర్ కుమ్మరవీధిలో సరుకులు అందజేసి రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న తహసీల్దారు, తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని 8, 9వ వార్డుల పరిధిలో రేషన్‌షాపు లేక లబ్ధిదారులు కిలోమీటరు దూరం వెళ్తున్న 30 ఏళ్ల నాటి సమస్య పరిష్కారం అయ్యింది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో మంగళవారం శాంతినగర్ కుమ్మరవీధిలో తహసీల్దారు వెంకటేశ్వర్లు రేషన్‌షాపును ప్రారంభించారు. అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, టీడీపీ నేత వింజం రామానాయుడుతో కలిసి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 8, 9వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీరాయ్‌కి నివాళులర్పిస్తున్న గ్రామీణ వైద్యులు

## రక్తదానం ప్రాణదానంతో సమానం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని బుజ్జమ్మ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొలుసు రత్నం తెలిపారు. భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ జయంతి సందర్భంగా ముత్తుకూరులోని షాదీమంజిల్‌లో మంగళవారం డాక్టర్ బీసీ రాయ్ ఫస్ట్ ఎయిడ్ ప్రొవైడర్స్ అసోసియేషన్, బుజ్జమ్మ సేవా ట్రస్ట్, గ్రామీణ వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం అవసరంపై ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదా నం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, వెంకట్, రత్నయ్య, షఫీ, ప్రకాశం, మెడిపల్స్ అధినేత సురేష్, వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి నివారణపై ర్యాలీ

సైదాపురం, జూలై1(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రం సైదాపురం లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జనార్దన్ మాట్లాడుతూ జూలై 30 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పరిస రాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తా రని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సీహెచ్‌వో ఎస్. చిట్టి, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన వాహనమిత్ర వాగ్దానం నెరవేర్చాలి

- కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాహనమిత్ర వాగ్దానం రూ.15వేలు తక్షణం నెరవేర్చాలని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఆటో కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు 500 ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వం ఆటోలకు కూడా టోల్‌గేట్లు విధించి డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబరు 21 ప్రకారం ఆర్టీవో కార్యాలయంలో వాహనాలు అందించే అన్ని రకాల సేవలపై 100శాతం ఫీజులు పెంచి కార్మికుల నడ్డి విరుస్తోందన్నారు. ఆటోలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేవిధానం ప్రైవేటు ఏజన్సీలకిచ్చి సెన్సార్ పద్ధతితో అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయడం సరికాదన్నారు. భవిష్యత్‌లో ఎదుర్కొనే అన్ని రకాల ప్రజా వ్యతిరేక పోరాటాలకు ముదుండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. బుచ్చిలో జిల్లా మహాసభలు జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభ అనంతరం 27మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కే.సరేష్, ఎం.రాజాలు, ట్రెజరర్‌గా బాబురావును, 11మంది ఆఫీస్ బ్యారర్స్ 13మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా 300మంది కార్మికులు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్నాథం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ఆటో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నిద్రిస్తున్న మహిళ ఇంట్లో చోరీ

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, క్లూస్ టీం

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెగచర్ల గ్రామంలో సోమవారం రాత్రి నిద్రిస్తున్న ఓ మహిళ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు కథనం మేరకు వివరాలు... తెగచర్లకి చెందిన బొడ్డు సుగణమ్మ ఒంటరిగా ఉంటోంది. ఆమె భర్త ఏడాదిన్నర కిందట చనిపోగా, కూతురుతో తెగచర్లలోనే నివాసం ఉంటున్నారు. రోజులాగే వరండాలో గ్రిల్‌కి తాళం వేసి మంచం పక్కనే తాళం చెవి పెట్టుకుని నిద్రపోయింది. ఈ విషయాన్ని గమనించిన అగంతకుడు ఆ తాళంతోనే వరండా గ్రిల్ తెరిచి, ఇంట్లో లోని బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, నాలుగు సవర్ల బంగారు చోరీ చేశాడు. తెల్లవారుజామున నిద్రలేచి చూడగా తాళాలు పగులగొట్టి చూడగా, బంగారు నగలు, రూ.2లక్షల నగదు చోరీకి గురైందని గ్రహించింది. ఈ మేరకు మంగళవారం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రెండు టిప్పర్లు, యంత్రం సీజ్

స్వాధీనం చేసుకున్న టిప్పరుతో మైనింగ్ అధికారిణి

కలువాయి, జూలై 1(ఆంధ్ర జ్యోతి): గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద నుంచి అనుమతి లేకుండా బండరాళ్లు తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఓ యంత్రాన్ని మంగళవారం మైనింగ్ అధికారులు సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. మైనింగ్ డీడీ ఆదేశాల మేరకు ఆర్ఐ స్వాతి, టీఏలు వెంకటేశ్వర్లు, వాణిశ్రీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజులుగా రాజుపాళెం వద్ద పెన్నానదిలో నిర్మిస్తున్న రోడ్డుకు ఇక్కడి నుంచి రాళ్లు, మట్టి తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వారు దాడులు నిర్వహించారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగి ఒకరు మంగళవారం రాపూరులో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం వివరాల మేరకు, పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి బండి పెద్ద అంకయ్య (70) ఆర్టీసీలో డ్రైవర్‌గా రిటైర్డ్ అయి, లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం స్థానిక బంగ్లా క్వార్టర్‌లో పురుగుల మందు తాగినట్లు గమనించిన కొందరు స్థానికులు హుటాహుటీన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రికి వెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలతో ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 114 |
| స్కిన్ చికెన్ | 210 |
| స్కిన్‌లెస్ | 232 |

కోడిగుడ్ల ధర (100): 590

### ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ' : ఏవో

నెల్లూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన ప్రతీ రైతుకు ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుతుం దని వ్యవసాయ అధికారులు బీ శ్రీదేవి, నాగమోహన్ తెలిపారు. మంగళ వారం మండలంలోని గొల్లకందుకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాలున్న రైతుల జాబితా ప్రభుత్వానికి పంపించామని, ఆ మేరకు నిధులను ప్రభుత్వం అందచేస్తుందని చెప్పారు. వరి పైరును ఎక్కువగా షైట్ తెగులు ఆశిస్తోందని, దానిని ప్రాథమిక దశలోనే నియంత్రించుకో వాలని సూచించారు. ప్రస్తుతం జింక్ సల్ఫేట్, జిప్సం రాయితీ ధరకు లేవని, స్టాకు రాగానే అందచేస్తామని తెలిపారు.

## కనుపూరు కాలువ

# కరిగిపోతోంది!

- కరకట్టలు తవ్వి మట్టి తరలింపు
- సౌత్‌మోపూరు, ఉప్పుటూరు, కందమూరు వద్ద దందా
- రూ.లక్షలు దండుకుంటున్న అక్రమార్కులు
- ఇరిగేషన్ అధికారుల కళ్లకు గంతలు

నెల్లూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కనుపూరు కాలువ కరకట్టలపై మట్టి మాఫియా కన్ను పడింది. నాలుగు మండలాల్లోని 60 వేల ఎకరాలకు సాగునీటిని అందించే ఈ కాలువ గట్లను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. నిత్యం వందల ట్రిప్పుల మట్టిని అమ్మి రూ.లక్షలు జేబుల్లోకి వేసుకుంటున్నారు. నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు గ్రామంలో కాలువ కరకట్ట మట్టి తవ్వకాలు జోరుగా సాగుతుండగా, మండలంలోని ఉప్పుటూరు, కందమూరు, ఆమంచర్లలోనూ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనివల్ల కాలువ రూపుకోల్పోతోంది. ఈ దందా పట్టపగలే జరుగుతున్నా జల వనరుల శాఖ అధికారులు కళ్లుమూసుకుని వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

**● రోజుకు వంద ట్రాక్టర్లపైనే..**

నెల్లూరుకు 20 కి.మీ పడమరన సౌత్‌మోపూరు పంచాయతీ పరిధిలో కనుపూరు కాలువ కరకట్టలను పది రోజులుగా ఎడతెరపి లేకుండా తవ్వే స్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి ఎక్స్‌కవేటర్ సహాయంతో పట్టపగలే మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం ఎడగారు పంటకు నారేతలు పూర్తవడంతో ట్రాక్టర్లు ఖాళీగా ఉండటం వల్ల మట్టి ముఠా ఇదే అదునుగా తీసుకుని ఎడతెరపి లేకుండా తవ్వకాలు సాగిస్తోంది. సౌత్‌మోపూరుతోపాటు ములుముడి, కందమూరు గ్రామాల్లో ప్లాట్ల లెవలింగ్, ఇళ్ల నిర్మాణాలకు ఈ మట్టిని ట్రాక్టర్ రూ. 1000-1500లకు విక్రస్తున్నారు. రోజుకు వందకుపైనే ట్రాక్టర్ల మట్టి తరలిపోతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామాల్లో బంజరు భూముల నుంచి వ్యక్తిగత అవసరాలకు ఒకటి, రెండు ట్రిప్పుల మట్టిని తవ్వుకోవడం సహజం. కానీ ప్రస్తుతం కొందరు మట్టి వ్యాపారాన్ని నిర్భయంగా సాగిస్తున్నారు. వీరి చర్యలతో కనుపూరు కాలువకు ఇరువైపుల ఉన్న కరకట్ట ఇప్పటికే దెబ్బతిన్నది. తక్షణం మట్టి తవ్వకాలు ఆపకపోతే కాలువ సహజత్వాన్ని కోల్పోతుందని వ్యవసాయదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కరకట్టలు బలహీనమైతే వర్షాకాలంలో, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో గండ్లుపడే ప్రమాదం కూడా ఉంది.

మట్టి తవ్వకాలతో ధ్వంసమైన కనుపూరు కాలువ కరకట్ట

**● కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు**

వ్యవసాయదారులకు సాగునీరు అందించడంతోపాటు సహజ వనరుల ను కాపాడాల్సిన జలవనరుల శాఖ అధికారులు, భారీగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా కన్నెత్తి చూడటం లేదు. ఈ విషయమై స్థానిక ఇరిగేషన్ ఏఈ వాసుదేవరావును వివరణ కోరగా కాలువ కరకట్టను తవ్వి మట్టి తరలించినది ఎవరో విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆర్‌ఎస్‌ఆర్‌ఎంను ఆధునికీకరిస్తాం

● ఎంపీ వేమిరెడ్డి

బాలికతో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి, చిత్రంలో మంత్రి నారాయణ, నాయకులు

నెల్లూరు(విద్య), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్‌ఎం హైస్కూల్‌ను ఆధునికీకరించి, ఉన్నత విద్యా ప్రమాణాలకు నిలయంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఆర్‌ఎం, వీఆర్ ఉన్నత పాఠశాలలను మంత్రి నారాయణతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్ హైస్కూల్‌ను మంత్రి నారాయణ ఉత్తమంగా తీర్చిదిద్దారన్నారు. తాను రిషీ వ్యాలీ పాఠశాలలో చదువుకున్నానని, దాని కంటే కూడా వీఆర్ హైస్కూల్‌లో అత్యాధునిక వసతులున్నాయని చెప్పారు. పాఠశాలలో చేరేందుకు ఐదు వేల దరఖాస్తులు వచ్చాయంటే ఇక్కడ చదవడానికి విద్యార్థులు ఎంత ఆసక్తి చూపుతున్నారో అర్థమవుతోందన్నారు. సీట్లు రాలేదని ఎవరూ బాధపడవద్దని, వచ్చే ఏడాది అందరికీ అవకాశం వస్తుందన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు వాసులు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని ఎంపీ పిలుపునిచ్చారు. చక్కటి వసతులు కలిగిన వీఆర్ హైస్కూల్‌ను ఈనెల 7న మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తున్నారని తెలిపారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులతో ఆయన కొంతసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### కన్సల్టెన్సీలకు పార్కుల ఆధునికీకరణ బాధ్యత : మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూలై 1, (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి పార్కుల ఆధునికీకరణ బాధ్యతలను కన్సల్టెన్సీలకు అప్పగించనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం 17వ డివిజన్‌లోని చిల్డ్రన్స్ పార్కును ఆయన పరిశీలించారు. అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సౌకర్యాలపై స్థానిక కమిటీ సభ్యులతో చర్చించారు. నిర్వహణ బాధ్యతలను ఎన్‌ఎంసీ అధికారులకు అప్పగించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కన్సల్టెన్సీలతోపాటు పార్కుల అభివృద్ధి కమిటీలు, ఎన్‌ఎంసీ అధికారులు ఏకాభిప్రాయంతో ఆధునికీకరణ పనులు చేపడతారని చెప్పారు. స్కేటింగ్ ట్రాక్‌ను త్వరలో ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. పార్కు అభివృద్ధికి తనవంతుగా కొంతమేర నిధులు సమకూర్చేం దుకు ముందుకొచ్చిన రియల్టర్ వెంకటేశ్వర్లును మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్, టీడీపీ నాయకురాలు తాళ్ళపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### న్యూస్ బాక్స్

### బాలు సంగీత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీ జ్యోతిర్మయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, పదేళ్లు నిండిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారానికి రూ.50, సర్టిఫికెట్ కోర్సు మొదటి సంవత్సరానికి రూ.1600, తర్వాతి మూడేళ్లకు రూ.1100 చొప్పున చెల్లించాల ని తెలిపారు. డిప్లమో కోర్సు మొదటి సంవత్సరానికి రూ. 2100 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గాత్రం (కర్ణాటక), వయోలిన్, భరతనాట్యం, మృదంగం, డోలు కోర్సులు నిర్వహిస్తున్నామని, వీటిలో చేరేందుకు విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు అందరూ అర్హులేనని వివరించారు. ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల దాకా తరగతులు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9491128616 నెంబరును సంప్రదించాలని కోరారు.

### భరోసా పింఛన్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్‌లో మంగళవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది. ఇందులో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు. 2019 నవంబరు నుంచి 2023 మధ్య మరణించిన పెన్షనర్ల భార్యలు పేర్లు నమోదు చేసుకోవడానికి సచివాలయ ఉద్యోగులకు ఆప్షన్ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, భాస్కర్, అద్దంకి చంద్ర, సునీల్ సింగ్, సిద్ద కళాచారి, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

### దంత వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

● కార్పొరేటర్ నరసింహగిరి

నెల్లూరు (వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దంత వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని నగరంలోని 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి పిలుపునిచ్చారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లక్కీ డెంటల్ కేర్, పీఎంపీ అసోసియేసన్ ఆధ్వర్యంలో మంగళవారం బుజబుజ నెల్లూరులో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులకు దంత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నరసింహగిరి మాట్లాడుతూ దంతాలు, నోరు ఆరోగ్యంగా ఉంటే చాలా రోగాలు దరిచేరవన్నారు. దంత వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లక్కీ డెంటల్ కేర్ వైద్యురాలు డాక్టర్ డోలా సుస్మిత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోనబోయిన శేషు, విశ్రాంత ఆర్టీసీ అధికారి సాగల సాయి, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శశికళ పాల్గొన్నారు.

### దారికి అడ్డంగా గోడ కట్టిన వ్యక్తిపై కేసు

నెల్లూరు రూరల్, జూలై 1,(ఆంధ్రజ్యోతి) : పొలానికి వెళ్లే దారికి అడ్డంగా గోడ నిర్మించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. మండలంలోని జొన్నవాడ రహదారి దొడ్ల డెయిరీ ఎదురుగా శ్రీవాణికి ఎకరం పొలం ఉందన్నారు. పొలం కొనుగోలు చేసినప్పుడే ఆమెకు దారిని కేటాయించారని తెలిపారు. ఆమె నిర్మించుకున్న గేటుకు ఎదురుగా దారి లేకుండా గోడ నిర్మించడంతో ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తిపై శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

### వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి

నెల్లూరు (వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేశారని, అయితే కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఈ కార్యక్రమాన్ని ఆపేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడ అజీజ్ అహ్మద్, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### 9న దేశవ్యాప్త సమ్మె

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 184 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొంటారని, ఆరోజున సెంటర్లు మూతవేస్తున్నట్లు సీడీపీవో మాధవిలతకు యూనియన్ నాయకులు సమ్మె నోటీసులు అందచేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను విధించి కార్మికుల జీవితాలు వీధులపాలు చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొనాలని కోరారు.

## కాంగ్రెస్ బలోపేతానికి చేయి చేయి కలుపుదాం

సమావేశంలో నాయకులతో వెంకట్రావు యాదవ్

నెల్లూరు (వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చేయి చేయి కలపాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్ పిలుపునిచ్చారు. నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ కూటమి ప్రభుత్వంలో ప్రజలు విసిగి పోయారని, రాబోయే రోజుల్లో హస్తం హవా నడుస్తుందని జోస్యం చెప్పారు. వైసీపీ, టీడీపీలు దొందూ దొందేనని బీజేపీ చంకనెక్కి పనిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని వెల్లడించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి రాష్ట్ర పర్యట న వల్ల పార్టీ బలోపేతమవుతుందని చెప్పారు. నెల్లూరు సిటీ ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా ఎంపికైనందుకు వెంకట్రావుకు నాయకులు అభినందనలు తెలిపారు. అల్లాఉద్దీన్, మల్లికార్జునరెడి, సుధీర్, నరేష్, రెహమాన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## 'బ్లాక్ స్పాట్లు' తొలగిస్తాం : ఎంహెచ్‌వో చైతన్య

తొలగించిన బ్లాక్ స్పాట్లను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో చైతన్య

నెల్లూరు(సిటీ), జులై 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేసే బ్లాక్ స్పాట్లను తొలగిస్తున్నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య తెలిపారు. మంగళవారం 42వ డివిజన్ పరిధిలోని మన్సూర్‌నగర్‌లో ఆయన పర్యటించారు. చెత్త తరలించే వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానరోడ్లు, కూడళ్లు, నివాసాల సమీపంలో బ్లాక్ స్పాట్ల దగ్గర ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనంలోనే ఇంట్లో వ్యర్థాలను వేయాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇది అందరి బాధ్యత అని సూచించారు.

## ఫ్యాక్షన్ పాలిటిక్స్ చేస్తామంటే కుదరదు : సోమిరెడ్డి

నెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించడానికే మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జైలుయాత్ర చేపట్టారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఫ్యాక్షన్ పాలిటిక్స్ చేస్తామంటే కుదరదని, పోలీసులు తాట తీస్తారని ఓ వీడియో సందేశం ద్వారా హెచ్చరించారు. వైసీపీ నేత తలశిల రఘురాం నెల్లూరులో మీటింగులు పెడుతూ జగన్ పర్యటకు భారీగా జనాన్ని తీసుకురావాలంటూ టార్గెట్‌లు పెడుతున్నారని సోమిరెడ్డి అన్నారు. ఎంత ఖర్చయినా లెక్కచేయకుండా రౌడీలను, గంజాయి బ్యాచ్‌లను తీసుకురావాలంటూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలిస్తున్నారని ఆరోపించారు. నెల్లూరులో అశాంతిని రేకెత్తించాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జైలు వద్దకు వెళ్లి గోవర్ధన్‌రెడ్డి అందాలు పొగుడుకొని వెళితే తమకెలాంటి అభ్యంతరం లేదని, అలా కాకుండా అతిగా ప్రవర్తిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు.

## బీఎస్‌ఎన్‌ఎల్‌ను ఆదరించండి : ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సమాచార రంగంలో వినూత్న ఆవిష్కరణలు చేస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థను ప్రజలందరూ ఆదరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం బీఎస్‌ఎన్‌ఎల్ సలహా మండలి సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లా టెలికం సలహా బోర్డు అధ్యక్షుడిగా తనకు ఈ కమిటీ సమావేశం రెండవదని చెప్పారు. ఆరు నెలల కాలంలో జిల్లాలో 35 టవర్లు ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు రూ.1500 కోట్ల లోటుతో టెలికం సంస్థ నష్టాల్లో ఉండేదని, తిరుపతి - నెల్లూరు జోన్ల అధికారుల కృషి ఫలితంగా రూ. 600 కోట్ల లాభాల్లోకి వచ్చిందని చెప్పారు. టెలికం సలహా మండలి సభ్యులు గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ మెరుగుపరచాలని కోరారని తెలిపారు. వచ్చే ఆరు నెలల కాలంలో జిల్లాలోని అన్ని మారుమూల గ్రామాలకు పూర్తిస్థాయిలో సిగ్నల్స్ అందిస్తామని హామీ ఇచ్చిన అధికారులను ఎంపీ అభినందించారు. ఈ సమావేశంలో బీఎస్‌ఎన్‌ఎల్ పీజీఎం సీ అమరేంద్ర రెడ్డి, డీజీఎం ఎం శ్రీనివాసరావు, ఫైనాన్స్ డీజీఎం శ్రీనివాసరావు, మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యులను సన్మానిస్తున్న వైద్య కళాశాలల అధికారులు

నెల్లూరు (వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ వైద్య కళాశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నారాయణ వైద్య విద్యాసంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బీజు రవీంద్రన్ మాట్లాడుతూ గొప్ప వైద్యునిగా ఎనలేని సేవలందించిన డాక్టర్ బీసీ రాయ్ జయంతి, వర్ధంతి ఒకే రోజు కావడం విశేషమన్నారు. వైద్యునిగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు. నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ మాట్లాడుతూ వైద్యులు రోగులకు అందించాల్సిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్, నారాయణ ఆసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ, ఏజీఎం శేఖర్‌రెడ్డి, ఏవో సందేశ్ రైజర్ తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను సత్కరించారు.

## గిరిజన బాలికకు వేమిరెడ్డి దంపతుల పరామర్శ

గిరిజన బాలికను పరామర్శిస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు (వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన బాలికను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాళెం కాకర్లదిబ్బలో చిత్రహింసలకు గురైన చెంచమ్మ అనే బాలికను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు జరగ కుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారి వైద్య ఖర్చులన్నీ తామే భరిస్తామని పేర్కొన్నారు. చిన్నారి చెంచమ్మ పూర్తిగా కోలుకున్న అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో చేర్పించి బాగోగులు చూస్తామని వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నేతలు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కోడూరు కమలా కర్ రెడ్డి, ఇందుకూరుపేట టీడీపీ మండల అధ్యక్షుడు పవన్‌కుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విభాగం కార్మికుల వేతనాలు పెంచాలి

**● కార్పొరేషన్ ఎదుట సీఐటీయూ ఆందోళన**

నెల్లూరు(సిటీ), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, మోహన్‌బాబు, మట్టిపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజీ విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల పాత్ర చాలా కీలకమైందన్నారు. కేంద్రం సూచించిన విధివిధానాల ప్రకారం వీరికి కనీస వేతనం రూ.26 వేలు అందాల్సి ఉండగా రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నైపుణ్యం కలిగిన కార్మికులకు జీతాలు ఎక్కువ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు కూడా వీరికి అందడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచల నరసయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

### మహిళా సర్పంచులకు నేటి నుంచి శిక్షణ

నెల్లూరు రూరల్, జులై 1,(ఆంధ్రజ్యోతి) : 'స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు' అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ వరకు ఈ తరగతులు జరుగుతాయని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. నెల్లూరు డివిజన్‌లోని రూరల్, పొదలకూరు, రాపూరు, టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, బుచ్చి, కోవూరు, వెంకటాచలం, కొడవలూరు మండలాల పరిధిలోని మహిళా సర్పంచులు శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

### రేపు పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్‌సీ బకాయిలపై చర్చించేందుకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎన్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నగరంలోని భక్తవత్సల నగర్‌లో గల పెన్షనర్స్ భవనంలో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లా ట్రెజరీ అధికారి డీ గంగాద్రి పదవీ విరమణ సందర్భంగా ఈ సమావేశంలో ఆయనను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Nellore-1 బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగొట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది శ్రీమతి వల్లెపు గోవిందమ్మ భర్త రవి, వెలగచెట్టు సంఘం, నెల్లూరుసిటీ గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రరు తనఖా చేయించుకొని ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, ఛార్జీలు క్రయములు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

**SCHEDULE**

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రి.డి. యిలాకా నెల్లూరు స.రి.లో చేరిన నెల్లూరు రూరల్ మండలం నెల్లూరు బిట్-1 కొత్తూరు గ్రామ పంచాయితీలో చేరిన నెల్లూరు బిట్-1 గ్రామంలోని సర్వే నెం.1904 రు య 118.59 ట్లు భూమి యెండ్ల ప్లాట్లుగా లే అవుట్ చేయబడి అప్రూవ్ కాబడిన ప్లాను దాఖలా శ్రీవారి కాలనిలోని నెం.257 రు ప్లాటు 33-1/3 అంకణములు లేక 222.969 చ.మీ. ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు: నెం.318 రు ప్లాటు, దక్షిణం: నెం.256 రు ప్లాటు, పడమర: 30 అడుగులు వెడల్పు గల లే అవుట్ రోడ్డు, ఉత్తరం: నెం.258 రు ప్లాటు. యీ హద్దులలోని 33-1/3 అంకణములు లేక 222.969 చ.మీ. ఖాళీ స్థలమున్నూ, యీ స్థలమునకు సంబంధించిన యావత్తు యాజిమెంటు హక్కులతోటి

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

**ఉత్తరక్రియలు**

నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ క్రియాశీలక నిస్వార్థ కార్యకర్తగా తుది శ్వాస వరకు కొనసాగిన మా కుమారుడు శ్రీ శాఖమూరి సుబ్బరాయుడు గారు తేది: 15-06-2025 ఆదివారం నాడు స్వర్గస్తులైనారు. వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ శాఖమూరి సుబ్బరాయుడు గారు
మరణం : 15-06-2025

పెద్దకర్మ : తేది : 03-07-2025 గురువారం నాడు ఉదయం 10 గంIIలకు, నెల్లూరు, నిప్పో ఫ్యాక్టరీ ప్రక్కవీధిలోని న్యూ మిలిటరీ కాలనీ 6వ వీధిలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

ఇట్లు : తల్లిదండ్రులు
శాఖమూరి యానాదినాయుడు - పెంచలమ్మ

## రవీంద్రబాబు సేవలు అభినందనీయం

● ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

రవీంద్రబాబు దంపతులను సత్కరిస్తున్న సూర్యనారాయణ, ఉద్యోగులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ అధికారిగా చొప్పా రవీంద్రబాబు ప్రజలకు అందించిన సేవలు అభినందనీ యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం టౌన్‌హాల్లో ఐ కృష్ణయ్య కన్వీనర్‌గా ఉన్న నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో చొప్పా రవీంద్రబాబు ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ సేవ, ఉద్యమ స్పృహ కలగలిపిన నేత రవీంద్రబాబు అని కొనియాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు కలిసి రవీంద్రబాబు, కామేశ్వరమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ ఇకపై తనవంతుగా సామాజిక సేవల్లో పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియల్ పీటర్‌రావు, ఏపీజీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రాంప్రసాద్, ఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, పలువురు తహసీలార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్టినింటికి తరలిన కలిగిరమ్మ

కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్ల మూడవ రోజు మంగళవారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి ఆలయంలో అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా సోమవారం సాయంత్రం మేళతాళాల నడుమ పుట్టినిల్లైన పాపనమునిపాలెంకు తరలివెళ్లిన కలిగిరమ్మ అక్కడ గ్రామోత్సవం అనంతరం మంగళవారం సాయంత్రం తప్పెట్లు, మేళతాళాల మధ్య, ముద్రగడపావనం, వీరతాళ్లు, ఆవు, ఎద్దు వాహనాలు వెంటరాగా ప్రత్యేక పుష్పాలంకరణతో మెట్టినిల్లైన జిర్రావారిపాలెంలో గ్రామోత్సవానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ గ్రామోత్సవం అనంతరం తిరిగి బుధవారం ఉదయం కలిగిరిలో ఆలయానికి చేరుకుంటారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

## భళిరా భళి!

భీమ, బకాసురుల యుద్ధ సన్నివేశం

- ఆకట్టుకున్న బకాసుర వధ ఘట్టం
- వైభవంగా ద్రౌపదీ కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మూలాపేట శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం వైభవంగా జరిగింది. నగరంలోని పడ్మశాలీపేట వాసులు ద్రౌపదీదేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి పెండ్లి కుమార్తెగా అలంకరించి మంగళవాద్యాలు, విద్యుత్, పుష్పాలంకారాలు, బాణాసంచా వేడుకలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ద్రౌపదీ వివాహ ఘట్టానికి ముందు సాయంత్రం బకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. భీముని వేషధారి బకాసురునికి బండిపై ఆహారం తీసుకుని బయలుదేరడం, మార్గంలో ఆహారాన్ని భీముడు తినేయడం వంటి ఘట్టాలను మూలాపేట వీధుల్లో ప్రదర్శించారు. ఆలయం ముందున్న వేదికపై బకాసురుడు, భీముడి యుద్ధాన్ని ప్రదర్శించారు. భక్తులు చప్పట్లతో ఆసక్తిగా తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం విశేష పూజలు, చప్పర ఉత్సవం, భగవద్గీత పారాయణం, సాయంత్రం మహాభారతం ప్రవచనం, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.



### రేపు వెంగమాంబ పేరంటాల

# పదహారు రోజుల ఉత్సవం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసి ఉన్న వెంగమాంబ పేరంటాల పదహారు రోజుల ఉత్సవం గురువారం నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహారు రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం రోజున పదహారు రోజుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో వెట్టిగుంట ఉష్ణశ్రీ మంగళవారం తెలిపారు.

# జగన్ పర్యటన వాయిదా

● హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ

నెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి జిల్లా పర్యటన వాయిదా పడింది. 3వ తేదీన నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని జగన్ పరామర్శించాల్సి ఉంది. ఇందుకు వైసీపీ నేతలు జైలుకు దూరంగా పలు ప్రాంతాల్లో హెలిప్యాడ్ ఏర్పాటుకు ప్రయత్నించారు. కానీ ఇందుకు పోలీసులు అంగీకరించలేదు. పల్నాడు జిల్లా పర్యటనలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతల దృష్ట్యా జైలు సమీపంలోనే హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు వైసీపీ నేతలకు సూచించారు. స్వయంగా పోలీసులే ఓ ప్రాంతాన్ని చూపించారు. ఈ ప్రాంతాన్ని వైసీపీ ముఖ్య నేతలు పరిశీలించారు. కానీ వారు సుముఖత చూపలేదు. అయితే శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. కాకాణి పరామర్శించేందుకు వచ్చే సమయంలో ఎక్కువ దూరాన ఎందుకు హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకోవాలని, తాము కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని వైసీపీ నేతలను పోలీసులు ఒప్పించే ప్రయత్నం చేశారు. కానీ ఇందుకు ఒప్పుకోని వైసీపీ నేతలు, జగన్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. నెల్లూరు పర్యటనకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలంటూ వైసీపీ నేతలు మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు.

### సోమశిలను సందర్శించిన

# మత్స్యశాఖ అధికారులు

అనంతసాగరం జూలై 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో మూడు నెలలపాటు చేపలవేట నిషేధం విధించిన విషయం తెలిసిందే. కాగా కొందరు అక్రమంగా చేపలవేట కొనసాగిం చేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం అయింది. దీంతో మంగళవారం మత్స్యశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. ఏడీ శ్రీనివాసులు, ఎఫ్‌డీవో రమేష్ జలాశయాన్ని సందర్శించి జాలర్లతో మాట్లాడారు. ఎవరైనా అక్రమంగా చేపల వేట కొనసాగిస్తే సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

**బిజినెస్ కొరకు మంచి అవకాశం**
కావలి ట్రంకురోడ్‌లో మంచి బిజినెస్ జరుగుతున్న షాపును షాపులో ఉన్న ఫర్నీచర్, మిషనరీతో సహా లీజుకు ఇవ్వబడును. మిషనరీతో ఉన్న వాల్యూలో 50% గుడ్‌విల్ కూడా ఇవ్వబడును. సం.ప్ర. సెల్: 70322 02875, 96030 53676
AJR-211989

**WANTED**
Wanted Female Telecallers Educations Institute, Qualification, Any Degree. Salary + Incentives.
cont: 91773 86631
AJR- 212096

**TOLET**
Tolet for commercial building 5000sft, G+2 fathekan peta cont: 98490 48316, 92999 90603
AJR- 212173

**FOR RENT**
Two bed room flat totally renovated for rent flat no 12 Raghava apartment tekkemitta with Pooja attached bath. Contact: Sreedhar, 97012 34748, 78935 10562
AJR- 212178

**పొలం అమ్మబడును**
నెల్లూరుకు 20 కి.మీ దూరంలో మరుపూరు గ్రామంలో క్లియర్ టైటిల్, రోడ్డు సౌకర్యం కల 7 ఎకరముల పొలం అమ్మబడును. ధర ఎ॥ 17 లక్షలు. సం.ప్ర. 93907 22541, 94402 24440
AJR-2874

**Ac బస్సు యాత్ర**
వాడపల్లి, భీమవరం, పట్టిసీమ, పేరుపాలెం, మదుర్రుబ్రిడ్జి, ద్రాక్షారామం, ఓడలరేవు, అన్నవరం, తేది:11-07-25, 2 రోజులు టి॥ 3250/- (A/c బస్సు రూం+ భోజనం). కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-212091

**రైలు యాత్ర**
మహాలయ పక్షంలో నేపాల్ (ముక్తినాథ్) తేది. 06-09-25. 12 రో టి॥ 25,000/- (రైలు, భోజనం, రూం, A/c బస్సు). కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-212092

**శ్రీ దుర్గాభవాని జ్యోతిష్యాలయం**
శ్రీ దుర్గాభవాని జ్యోతిష్యాలయం, వివాహం, చదువు, పెళ్లి, ప్రేమ, భార్యాభర్తల మధ్య సమస్యలు, నాగదోషం ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరింపబడును. శ్రీవిద్య హాటల్ ఎదురు, స్టోన్‌హౌస్‌పేట పెన్న. సెల్: 9704249338
AJR-240710

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారణలు జరుపుకుని వివరాలను తెలుసుకుని సముచితంగా నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారుల ప్రకటనలతో లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించిన పాఠకులు బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన క్లెయిమ్‌లు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారుడితో జరుపుతున్న లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఐడీవీ

# పశువులపై థైలీరియా ప్రభావం

- వ్యాధి సోకితే ప్రాణాలకే ముప్పు
- నివారణకు ఉచితంగా వ్యాక్సినేషన్
- మొట్టమొదటిసారి ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం

పశువుల్లో చాలా మందికి తెలియని ఎంతో తీవ్రమైన థైలీరియా వ్యాధి వ్యాప్తి చెందుతోంది. దీన్ని గుర్తించడంతోపాటు నివారణ చాలా కష్టతరమైంది. అంతేగాక వాటి నివారణకు అవసరమైన మందులు కూడా ఎంతో ఖరీదైనవి. అవికూడా అరుదుగా దొరుకుతాయి. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా థైలీరియా నివారణకు ఉచితంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

నెల్లూరు (వ్యవసాయం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ మీద ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. పశువులకు సాధారణంగా వచ్చే కొన్ని రకాల వ్యాధులు, వైరస్‌లపై పాడి రైతులకు కొంతమేర అవగాహన ఉంది. వాటి నివారణకు ప్రభుత్వాలు కూడా ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాలు సీజన్ వారీగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. అయితే చాలా మందికి తెలియని థైలీరియా వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి పశువుల్లో ముఖ్యంగా తెల్ల పశువులకు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

● పేడుదులు(టిక్స్) ద్వారా వ్యాప్తి

థైలీరియా అనే ఏకకణ పరాన్నజీవి ద్వారా థైలీరియా వస్తుంది. ఇవి పిడుదులు (టిక్స్) అనే జీవి ద్వారా వ్యాప్తి చెందుతాయి. పిడుదులు కలిగిన పశువు ద్వారా మందలోని మిగతా పశువులకు వ్యాప్తి చెందుతుంది. ఈవ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరం, ఒంటిపై వాపు గడ్డలు కనిపిస్తాయి. పశువులు నీరసించి బక్కచిక్కిపోతాయి. దూడల్లో రక్త విరేచనాలు కనిపిస్తాయి. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారుతుంది. ఈ వ్యాధి కారణంగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి.

● ఉచితంగా వ్యాక్సినేషన్

ఈవ్యాధి కారణంగా పశువుల్లో మరణాలు, పాడిరైతులకు జరుగుతున్న ఆర్థిక నష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటి సారిగా థైలీరియా నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మూడు నెలలు దాటిన దూడలకు, పశువులు, ఆవులకు ఒకసారి ఉచితంగా ఈ టీకా వేసే కార్యక్రమం జరుగుతోంది. ఇదే మార్కెట్‌లో రూ.వేలు ఖర్చయ్యే పరిస్థితి. అంతేగాక ఈ మందు అన్ని దుకాణాల్లోనూ లభించదు. ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేయడంతో పాడిరైతులకు కొంత ఉపశమనం కలుగుతోంది.

వ్యాక్సిన్‌తో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పాడిరైతు (ఫైల్)

● ముందు జాగ్రత్తలు అవసరం

థైలీరియా టీకా వేయించుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. బక్కచిక్కిన ఆవులకు టీకా వేయకూడదు. అదేవిధంగా టీకా వేసుకునే వారం ముందు నట్టల నివారణ మందు తాగించాలి. వ్యాక్సిన్ వేసిన 21 రోజుల వరకు ఎలాంటి యాంటిబయాటిక్స్ ప్రోటోజోల్ మందులు వేయకూడదు. నిండు చూలు ఆవులకు వేయకపోవడం మంచిది.

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

థైలీరియా వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతుంది. థైలీరియా వ్యాధి బారిన పడిన పశువులకు ఖరీదైన మందులు వాడాల్సిన పరిస్థితి. ఏదైనా ఒకసారి ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయించుకోవడం వల్ల వ్యాధిని నివారించవచ్చు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టీకా అవసరమైన రైతులు 9989932893 నెంబరును సంప్రదించండి. ఉచితంగా ఇంటి వద్దకే వచ్చి పశువులకు టీకా వేస్తారు.

- చైతన్యకిషోర్, ఏడీ, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

# ప్రతి నెలా పింఛన్ల పండుగ

● పెన్షన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), రాష్ట్రంలో ప్రతి నెలా ఒకటో తేదీ పింఛన్ల పండుగ రోజు అని మున్సిపల్ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని 42వ డివిజన్ మన్సూర్ నగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచి ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లో తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ పొలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

**మానసిక దివ్యాంగురాలికి పింఛను...**

నగరంలోని గౌతమినగర్‌కు చెందిన మానసిక దివ్యాంగురాలు భానుశ్రీ ఇంటికి మంగళవారం కలెక్టర్ ఆనంద్ వెళ్లి పింఛను అందజేశారు. ఆ చిన్నారితో కాసేపు ముచ్చటించారు. భానుశ్రీని సమీపంలోని భవిత కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని, బాలిక ఆరోగ్యం మెరుగుపడేందుకు వెంకటాచలంలోని సీఆర్‌సీ కేంద్రానికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స అందించాలని ఆమె తల్లికి సూచించారు. ఇందుకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, జిల్లాలో మంగళవారం తొలిరోజు 95 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. బుధవారం మిగిలిన పింఛన్ల పంపిణీ చేయనున్నారు.

# కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

● విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తన ● మూకుమ్మడిగా దాడికి పాల్పడిన గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ప్రేమపూరితంగా వంచాల్సిన ఓ ఉపాధ్యాయుడు కీచక అవతారం ఎత్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన ఘటన అనంతసాగరం మండలం తూర్పుబోయమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు.. ఆ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు లోకేసాని వెంగయ్య విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుండటంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు మంగళవారం మూకుమ్మడిగా పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆ ఉపాధ్యాయుడిని నిలదీయగా, గ్రామస్థులతో వాదనకు దిగి దాడి చేసేందుకు పూనుకున్నాడు. అనంతరం గ్రామస్థులు ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడడంతోపాటు కారు అద్దాలను ధ్వంసం చేశారు. వారి నుంచి తప్పించుకున్న ఉపాధ్యాయుడు ప్రహరీ గోడ దూకి పరారయ్యాడు. గత విద్యా సంవత్సరం కూడా ఇలాంటి సంఘటనకు పాల్పడటంతో గ్రామస్థులు ఆందోళన చేయగా సహచర ఉపాధ్యాయులు సర్దుబాటు చేసి పంపించారు. ఆ సమయంలో ఎంఈవో సైతం ఉపాధ్యాయుడి నుంచి లిఖిత పూర్వక లేఖ రాయించుకున్నారు. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాల వద్దకు చేరుకొని కారును స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరిపి నివేదికను అందజేయడం జరుగుతుందని ఎంఈవో రమణయ్య తెలిపారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్థులు

## శాంతియుతంగా నిరసన తెలిపిన రైతులపై కేసులా?

● ప్రభుత్వం, పోలీసుల తీరుపై కరేడు రైతుల ఆగ్రహం

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : వందల ఏళ్లుగా బంధం ఏర్పరుచుకున్న మట్టిని, పచ్చటి పంట పొలాలను కాపాడుకోడానికి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసినందుకు గ్రామంలోని 38 మంది రైతులపై అక్రమంగా కేసులు పెడతారా అని కరేడు గ్రామస్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి విలువైన, సారవంతమైన భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం వెనుక మర్మం దాగిఉందనే అనుమానం కలుగుతోందని అన్నారు. రైతులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడంతో బలవంతంగా దున్నారు. బంజరు భూములను వదిలి ఏటా రెండు పంటలు పండే భూములను బలవంతంగా లాక్కోవాలని చూడటం దుర్మార్గమన్నారు. కరేడు పంచాయతీలోని పలు గ్రామాల్లోని ప్రజలు స్వచ్ఛందంగా గత ఆదివారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు సైతం పార్టీలకు, కులమతాలకు అతీతంగా వందల మంది నిరసన కార్యక్రమంలో పాల్గొంటే ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మీదనే ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టడంతో పోలీసుల పక్షపాత ధోరణి బయటపడిందన్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా గ్రామం, పంట పొలాలను నిలుపుకోవడానికి ఐక్యంగానే పోరాడతామని, మాయమాటలకు మతలబులకు లొంగమన్నారు. ప్రభుత్వం గ్రామసభల నిర్వహిస్తే ఏకతాటిపై గ్రామస్థులంతా ముక్తకంఠంతో మా ప్రాణాలైనా ఇస్తాం కానీ మా భూములు మాత్రం ఇండోసోల్ కంపెనీ రియల్‌ఎస్టేట్ మాత్రం ఇవ్వమని గ్రామసభలో ప్రతిజ్ఞ చేస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న కరేడు రైతులు, గ్రామస్థులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదాశివరావు

## నా భూమిని ఆక్రమిస్తున్నారు!

- ఉదయగిరి ఎమ్మెల్యే, తమ్ముడిపై ఆరోపణలు
- పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు
- గారపాటి సదాశివరావు ఆవేదన

నెల్లూరు (హరనాథపురం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తన భూమిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన తమ్ముడు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని, తన భూమి తనకు దక్కేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చూడాలని నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెం గ్రామానికి చెందిన గారపాటి సదాశివరావు కోరారు. మంగళవారం టౌన్‌హాల్ మినీ సమావేశ మందిరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన కుటుంబం మొదటినుంచీ టీడీపీలో ఉందని అన్నారు. ప్రస్తుతం తాను ఏలూరులో ఉంటున్నానని, తన స్వగ్రామం చింతలపాలెంలో 88 ఎకరాల భూమి ఉందని చెప్పారు. ఆ భూమిలో మామిడి తోట సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లాకు చెందిన తలసిల వెంకట నరసింహారావుకు తనకు మధ్య ఆర్థిక లావాదేవీల సమస్య తలెత్తిందన్నారు. దీంతో నరసింహారావు రౌడీలతో తనపై దాడి చేయించాడని, గతేడాది డిక్లేరేషన్ కూడా కాజేసేందుకు పాల్పడడానికి ఆరోపించారు. ఈ మేరకు జలదంకి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఆ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సంబంధించిన అంశమని పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని తెలిపారు. తన మనుషుల చేత భూమికి సంబంధించిన విలాసం ఎమ్మెల్యే చెప్పారని, ఆయన తమ్ముడు కూడా ఇదే చెప్పారని అన్నారు. తన భూమిలో రూ. 36 లక్షల విలువైన మామిడి కాయలను కోసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు తమ భూమి మీదే కన్నేశారని ఆరోపించారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన ఎమ్మెల్యేనే ఇలా చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చర్యలు తీసుకుని నా భూమి నాకు దక్కేలా చూడాలని కోరారు.

## రొట్టెల పండుగలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగే రొట్టెల పండుగలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్‌లో రొట్టెల పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఐదు రోజులపాటు జరిగే రొట్టెల పండుగకు గతంకంటే ఎక్కువగా భక్తులు విచ్చేసే అవకాశం ఉందని, అందుకు గుణంగా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. స్వర్ణాల చెరువులో తగినంత నీటిని ఉంచాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్లేసులు వద్ద, ఇతర అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా పోలీసు అధికారులకు సూచించారు. రొట్టెల పండుగ ఏర్పాట్లలో భాగమయ్యే వివిధ శాఖల సిబ్బందికి ఆయా రోజుల్లో సెలవులు ఉండవని స్పష్టం చేశారు. అధికారులందరూ రొట్టెల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ సౌజన్య, నగర కమిషనర్ నందన్, నెల్లూరు ఆర్డీవో అనూష, విద్యుత్, ఇరిగేషన్ ఎస్‌ఈలు విజయన్, దేశాయ్ నాయక్, డీఎంహెచ్‌వో సుజాత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తి

● 533 మందికి స్థాన చలనం

నెల్లూరు (జడ్పీ), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. ఐదేళ్లు ఒకే చోట పని చేసిన వారందరిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. 20 రోజులుగా బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానించగా తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారంతా ముందుగా దరఖాస్తు చేసుకున్నారు. రిక్వెస్ట్ బదిలీలకు సంబంధించి కూడా దరఖాస్తులు వచ్చాయి. దీంతో గ్రేడ్-5 కార్యదర్శులకు ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 114 మంది ఉండగా వారందరిని వివిధ సచివాలయాలకు బదిలీ చేశారు. అలాగే రిక్వెస్ట్ ద్వారా 41 మంది దరఖాస్తు చేసుకోగా వారిని కూడా బదిలీ చేశారు. గ్రేడ్- 6 కార్యదర్శులకు సంబంధించి ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులు 270 మంది ఉండగా వారిని బదిలీ చేశారు. అలాగే రిక్వెస్ట్ ద్వారా 107 మంది దరఖాస్తు చేసుకోగా వారికి కూడా స్థానచలనం కల్పించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం సాయంత్రం డీపీవో జారీ చేశారు. మొత్తంగా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 533 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ఉదయగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షబ్బీర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం కాలనీవాసులు డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాకు విన్నవించారు. కొన్నిరోజులుగా కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి అరకొరగా నీటి సరఫరా జరుగుతుండడంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### బంగారం, వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.9347 |
| వెండి కిలో ధర | రూ. 110000 |
| వెండి ఒక గ్రాము | రూ. 113.00 |

# ఊరిస్తున్న మేఘాలు... నేలరాలని చినుకులు

**● జూన్‌లో లోటు వర్షపాతం ● పైర్ల సాగుకు రైతుల ఎదురుచూపు**

గండిపాళెం జలాశయంలో అరకొరగా ఉన్న నీరు, విత్తు వేసేందుకు పొలాన్ని దుక్కి దున్ని సిద్ధం చేసిన రైతన్న

ఉదయగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వర్షాధారంపై అధారపడే పంటల సాగు చేస్తారు. అదును దాటుతున్నా భూమి ఇంకా పదును కాలేదు. ముందస్తు రుతుపవనాల రూపంలో ఊరించినా వరుణుడు ఆపై ముఖం చాటేశాడు. ఫలితంగా వాగులు, చెరువులు ఒట్టిపోయాయి. జలాశయాలు అరకొర నీటితో దర్శనమిస్తున్నాయి. భూగర్భజలాలు పాతాళం వైపు పరుగులు తీస్తున్నాయ్. ఖరీఫ్ ప్రారంభమై నెల కావస్తున్నా పూర్తిస్థాయిలో పంటల సాగుకు నోచుకోలేదు. కొంతమంది రైతులు విత్తు వేసేందుకు పొలాలను దుక్కుదున్ని చినుకుల జాడీ కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

**● జల సవ్వడి ఏదీ ?**

జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 51.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, కేవలం 19 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. గత వారంరోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా చినుకు రాలలేదు.దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల చిరుజల్లులు పడుతున్నా భూమి అదును కావడంలేదు. ఖరీఫ్‌లో జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. అయితే ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 250 చెరువులు ఉండగా 47 వేల ఎకరాల అయకట్టు ఉంది. దాదాపు 90 శాతం చెరువులు ఒట్టిపోయాయి. మిగిలిన చెరువుల్లో అరకొరగా నీరుంది. నియోజకవర్గంలోని గండిపాళెం. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు. వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 16 వేల ఎకరాల ఆయకట్టు అధికారికంగా, మరో 5 వేల ఎకరాల అనధికారికంగా సాగవుతోంది. అయితే ప్రస్తుతం జలాశయంలో 6 అడుగుల మేర నీటిమట్టం ఉండడంతో ఆయకట్టు బీడుగా ఉంది.

**● ఇప్పటికే సాగైన పంటలపై ప్రభావం**

జిల్లాలో కొంతమంది రైతులు గతంలో కురిసిన వర్షాలతో ఆరుతడి పంటలు సాగు చేశారు. వరుణుడు కరుణించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎలాగోలా కష్టాలు పడి పంటలకు నీటి తడులు అందిస్తున్నామని, పరిస్థితి ఇలాగే ఉంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని అంటున్నారు. ఏదిఏమైనా వరుణుడిపై భారం మోపి రైతన్న ఖరీఫ్‌లో పంటల సాగుకు ముందుకు సాగుతున్నాడు.

## న్యూస్ బాక్స్

### అంకాళమ్మకు ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో వెలసి ఉన్న అంకాళమ్మ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు గోత్రనామాలతో భక్తుల పూజలు నిర్వహించారు. భక్తులకు అనంతరం నిర్వహించి సిరిమాను ఉత్సవం, బాణసంచా పేలుళ్ల ఎంతగానో ఆకట్టుకున్నాయి. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### ఆనకట్టపై మొక్కల తొలగింపు

ఆనకట్టపై తొలగించిన మొక్కలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్టపై ఏపుగా పెరిగిన మొక్కలను మంగళవారం తొలగించారు. గతనెల 16న ఆంధ్రజ్యోతిలో 'నిర్లక్ష్యపు మొక్కలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి కూలీలను ఏర్పాటు చేసి ఆనకట్టపై పెరిగిన మొక్కలను తొలగించారు. శ్లాబు దెబ్బతినకుండా చర్యలు చేపట్టారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

మాధవ్‌ను అభినందిస్తున్న ఉదయగిరి బీజేపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 1(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఎస్ఎస్ కన్వన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రమాణస్వీకారోత్సవానికి నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, కదిరి వెంకటరంగారావు, మాధవరావు, మాలేపాటి మల్లికార్జుననాయుడు, చల్లా చినమాలకొండయ్య తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి సముచితస్థానం కల్పించడం బీజేపీకే సాధ్యమని, అందుకు ఉదాహరణే మాధవ్ అని వారు పేర్కొన్నారు.

### మై టీడీపీ యాప్‌పై శిక్షణ

వింజమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మై టీడీపీ యాప్‌పై పట్టణంలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల మండలాల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లకు, బూత్ కన్వీనర్లకు గ్రామ కమిటీ నాయకులకు, రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన సీ.కార్తిక్ మంగళవారం శిక్షణ ఇచ్చారు. స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, సంక్షేమ పథకాలు వివరాలను ఏ విధంగా నమోదు చేయాలి, ఇంటింటికి తిరిగినప్పుడు లబ్ధిదారుల ద్వారా ఏ విధంగా యాప్‌ను ఉపయోగించాలో తెలియజేశారు. బుధవారం నుంచి జరిగే ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారని, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య తెలిపారు.

శిక్షణలో పాల్గొన్న పార్టీ మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు

## ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

నగదు ప్రోత్సాహకాలు అందచేస్తున్న చల్లా ప్రభాకర్ యాదవ్

సంగం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 ఏడాదిలో పదిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తన తండ్రి జ్ఞాపకార్థం అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చల్లా ప్రభాకర్ యాదవ్ మంగళవారం నగదు ప్రోత్సాహకాలు అందచేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పీ. మధుచరణ్‌కు రూ. 5000, ద్వితీయ స్థానం సాధించిన బీ..జ్యోతికి రూ. 3000, తృతీయ స్థానంలో నిలిచిన మేఘశ్యామ్‌కు రూ. 2000 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు దాత ప్రభాకర యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

లస్కర్ శ్రీనివాసులు దంపతులను, లైన్‌ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య దంపతులను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

సంగం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదవీ విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగులకు మంగళవారం ఆ కార్యాలయాల ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన చేసిన వీసీ మస్తానయ్యను తుంగా దయాకర్‌రెడ్డి కల్యాణ మండపంలో ఏఈ మన్మథరావు ఆధ్వర్యంలో ఈఈ రమేష్ చౌదరి శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. అలాగే స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో లస్కర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన వై శ్రీనివాసులు దంపతులను ఏఈ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో డీఈ పెంచలయ్య శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## తెగుళ్ల నివారణపై అవగాహన

సంగం : వరిపైరు పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సంగం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు, జంగాలకండ్రిక గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి శశిధర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రామ్మోహన్ మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వరి పొలాల్లో పైరును పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో వరిపైరులో మైట్ నివారణకు ఒబెరాన్ మందును పిచికారి చేయాలని చెప్పారు. సీఎస్‌సీ సెంటర్‌లో క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. వరి పైరుకు రైతు వాటా ఎకరాకు రూ. 840, వేరుశనగ పంటకు రూ. 280 చొప్పున ఇన్సూరెన్స్ వాటా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగపట్నం సునీల్, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

**● ఎరువుల యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలి**

ఉదయగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలు, విత్తనశుద్ధి, భూసార పరీక్ష ఫలితాల ప్రకారం సిఫార్సు చేసిన ఎరువుల వాడకం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు కల్లూరి రాజశేఖర్‌రెడ్డి, వినోద్, వీఏఏలు చల్లా పూజిత, కోనయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



సంగం : వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న పీఎంపీలు, మెడికల్ షాపులవారు

సంగం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్యశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాపుల నిర్వాహకులు స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పీఎంపీ వైద్యులు, మెడికల్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

**● వింజమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని స్థానిక మాశిలామణి ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం డాక్టర్స్‌డేను నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ మాశిలామణిని శాలువా, పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానికులు రాజగోపాల్‌రెడ్డి, కొండారెడ్డి, జేవీవీ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోషణ్ ట్రాకర్‌తో పౌష్టికాహారం

**● ముఖ ఆధారిత గుర్తింపుతో లబ్ధిదారులకు అందజేత**

పోషణ్ ట్రాకర్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మర్రిపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు తావులేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి పౌష్టికాహార పంపిణీ సమయంలో లబ్ధిదారుల ముఖగుర్తింపును తప్పనిసరి చేసింది. కేంద్రాల్లోని మూడు నుంచి ఆరేళ్ల వయస్సు బాలల్లో ఎంత మంది ఆహారం తీసుకున్నది నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. ఆత్మకూరు ప్రాజెక్ట్ కింద 255, అనంతసాగరం ప్రాజెక్ట్ కింద 159 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. ఆగస్టు 1 నుంచి గర్భిణులకు మాత్రమే ముఖ ఆధారిత గుర్తింపు (ఫేషియల్ రికగ్నేషన్) తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ వివరాలను నమోదు చేసేందుకు పోషణ్ ట్రాకర్ అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిపై నియోజకవర్గంలోని సిబ్బందికి కేంద్రాల నిర్వహణలో చేర్పులు, మార్పులపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

## బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలి

ఏఐఐఈఏ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

ఆత్మకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని ఆల్‌ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐఐఈఏ) ఆత్మకూరు శాఖ నేతలు టీ. రమేష్, ఎస్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావం సందర్భంగా ఆత్మకూరు ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం వద్ద మంగళవారం వారు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థను కంటికి కనురెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపైన ఉందన్నారు. పాలసీదారుల సర్వీసులో మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ మెహర్‌కుమార్, సీపీఎం, సీఐటీయు నాయకులు జి శివప్రసాద్, కే. డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి వనరుల మరమ్మతులకు నిధులు

విలేకరులతో మాట్లాడుతున్న డీఈ చంద్రమౌళి

ఉదయగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి జలవనరుల శాఖ సబ్‌డివిజన్ పరిధిలో సాగునీటి వనరుల మరమ్మతులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సబ్‌డివిజన్ పరిధిలోని పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం పరిధిలో 14 పనులకు రూ.79 లక్షలు, ఉదయగిరి మండలం తిరుమలాపురానికి రూ.3.15 లక్షలు, పుల్లాయపల్లికి రూ.3.25 లక్షలు, లింగనేనిపల్లికి రూ.3.20 లక్షలు, దాసరిపల్లికి రూ.3.20 లక్షలు, బండగానిపల్లికి రూ.3.10 లక్షలు, సీతారామపురం మండలంలో స్వామి చెరువుకు రూ.3.30 లక్షలు, ఊర చెరువుకు రూ.3.20 లక్షలు, మర్రివూట్ల రిజర్వాయర్‌కు రూ.3.10 లక్షలు, మారంరెడ్డిపల్లి చెరువుకు రూ.3.30 లక్షలు, పబ్బులేటిపల్లి కి రూ.3.20 లక్షల చొప్పున 24 పనులకు రూ.1.11 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈనిధులతో ఆయా చెరువులు, జలాశయం పరిధిలోని కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, ఇతరత్రా పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గండిపాళెం జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, ఏఈ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్యలు జరిగిన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

హత్యలు జరిగిన నివాసాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీధర్

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాళెం గ్రామ సమీపంలో గల ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న జంట హత్యలు, భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనా స్థలాన్ని మంగళవారం కావలి డీఎస్పీ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హత్యలు జరిగిన నివాసాన్ని పరిశీలించి కాలనీ వాసుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే భర్త చేతిలో గాయపడి వైద్యశాలలో చికిత్సపొందుతూ ఇంటికి వచ్చిన భార్య వెంకాయమ్మ గాయాలను పరిశీలించారు. అనంతరం హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### డెంగ్యూ వ్యాధి నివారణపై ర్యాలీ

సైదాపురం, జూలై1(ఆంధ్రజ్యోతి): గ్రామంలో మంగళవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జనార్దన్ మాట్లాడుతూ జూలై 30 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సీహెచ్‌వో ఎస్. చిట్టి, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

## కంకరు టిప్పరు బీభత్సం

**● ఇంజన్‌లో వ్యాపించిన మంటలు**
**● డ్రైవర్ దూకేయడంతో చెట్టును ఢీకొని ఆగిన వైనం**
**● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం**

రోడ్డు పక్కన చెట్టును ఢీకొని ఆగిపోయిన టిప్పర్

కావలిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు సెంటర్‌లో కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ మంగళవారం బీభత్సం సృష్టించింది. స్థానికుల వివరాల మేరకు.. జీఎస్ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కి చెందిన టిప్పర్ తుమ్మలపెంట రోడ్డుకు కంకరులోడుతో వెళ్తుండగా తుమ్మలపెంట రోడ్ సెంటర్‌కు వచ్చేసరికి టిప్పర్ ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. దీంతో బ్రేకులు కూడా పడక టిప్పర్ ఆగకపోవడంతో డ్రైవర్ టేక్‌లాల్ లారీలో నుంచి కిందకు దూకేశాడు. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో లారీ 30 అడుగుల మేరకు ముందుకుపోయి ఒక చెట్టును ఢీకొని ఆగిపోయింది. అనంతరం బ్యాటరీ వైర్లు తొలగించి మంటలు ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో ఒక ఆటో, బైక్ స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

### గల్లంతైన వారి కోసం

## మూడు బృందాల గాలింపు

అడవిలో గాలింపునకు సిద్ధమైన బృందాలు

అనంతసాగరం జూలై 1 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి సోమశిల అటవీ ప్రాంతంలో గల్లంతైన మనుబోలు మండలం నాయుడుపల్లికి చెందిన రత్నానాయుడు, సుబ్బారాయుడు ఆచూకీ కోసం పోలీసు, అటవీశాఖ అధికారులు మూడు బృందాలుగా విడిపోయి మంగళవారం గాలింపు చేట్టారు. గత వారం రోజులుగా వారికోసం బంధువులు గాలిస్తున్న విషయం తెలిసిందే. కాగా అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో అనంతసాగరం, సోమశిల, మర్రిపాడు పోలీసులు స్థానికులతో కలిసి అటవీ సిబ్బంది సహకారంతో డ్రోన్ కెమెరాలతో విస్తృతంగా గాలిస్తున్నారు. అయిన వారి జాడ లేక పోవడంతో ఏమయ్యారు..? అనే ఆందోళనతో కుటుంబసభ్యులు భయపడుతున్నారు. కాగా వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.10 వేల పారితోషకం అందిస్తామని సోమశిల ఎస్ఐ అనూష ప్రకటించారు. ఆచూకీ తెలిసే వరకు గాలింపు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**● అడవిలో ఎర్రచందనం కూలీలు ?**

గల్లంతైన వారి కోసం సోమశిల అటవీ ప్రాంతంలో బాధితుల కుటుంబ సభ్యులు గాలిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎర్రచందనం కూలీలు అడవిలో తారసపడట్టు వారు చెబుతున్నారు. వారి నుంచి గల్లంతైనవారికి ఏమైనా.. హాని కలిగిందా ? అనే అనుమానం కలుగుతోంది. గాలింపులో భాగంగా ఎర్ర చందనం కూలీల కోసం కూడా అధికారుల వేట సాగిస్తున్నారు.

## నిద్రిస్తున్న మహిళ ఇంట్లో చోరీ

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, క్లూస్ టీం

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెగచర్ల గ్రామంలో సోమవారం రాత్రి నిద్రిస్తున్న ఓ మహిళ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు కథనం మేరకు వివరాలు... తెగచర్లకి చెందిన బొడ్డు సుగణమ్మ ఒంటరిగా ఉంటోంది. ఆమె భర్త ఏడాదిన్నర కిందట చనిపోగా, కూతురుతో తెగచర్లలోనే నివాసం ఉంటున్నారు. రోజూలాగే వరండాలో గ్రిల్‌కి తాళం వేసి మంచం పక్కనే తాళం చెవి పెట్టుకుని నిద్రపోయింది. ఈ విషయాన్ని గమనించిన అగంతకుడు ఆ తాళంతోనే వరండా గ్రిల్ తెరిచి, ఇంట్లో లోని బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, నాలుగు సవర్లు బంగారు చోరీ చేశాడు. తెల్లవారుజామున నిద్రలేచి చూడగా తాళాలు పగులగొట్టి చూడగా, బంగారు నగలు, రూ.2లక్షల నగదు చోరీకి గురైందని గ్రహించింది. ఈ మేరకు మంగళవారం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు టిప్పర్లు, యంత్రం సీజ్

స్వాధీనం చేసుకున్న టిప్పరుతో మైనింగ్ అధికారిణి

కలువాయి, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద నుంచి అనుమతి లేకుండా బండరాళ్లు తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఓ యంత్రాన్ని మంగళవారం మైనింగ్ అధికారులు సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. మైనింగ్ డీడీ ఆదేశాల మేరకు ఆర్ఐ స్వాతి, టీఏలు వెంకటేశ్వర్లు, వాణిశ్రీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజులుగా రాజుపాళెం వద్ద పెన్నానదిలో నిర్మిస్తున్న రోడ్డుకు ఇక్కడి నుంచి రాళ్లు, మట్టి తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వారు దాడులు నిర్వహించారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగి ఒకరు మంగళవారం రాపూరులో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం వివరాల మేరకు, పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి బండి పెద్ద అంకయ్య (70) ఆర్టీసీలో డ్రైవర్‌గా రిటైర్డ్ అయి, లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం స్థానిక బంగ్లా క్వార్టర్‌లో పురుగుల మందు తాగినట్లు గమనించిన కొందరు స్థానికులు హుటాహుటీన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రికి వెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలతో ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 114 |
| స్కిన్ చికెన్ | 210 |
| స్కిన్‌లెస్ | 232 |

కోడిగుడ్ల ధర (100): 590

## పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు న్యాయం చేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం రంగంలోకి రావాలని రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన స్థానిక కందుకూరు 2 వేలం కేంద్రంలో పొగాకు వేలంను పరిశీలించారు. లో గ్రేడ్‌లకు కనీస ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకు కొనుగోలు చేయటం ద్వారా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నోబిడ్‌లు, సీఆర్‌లు తగ్గేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వర్జీనియా పొగాకు రైతును ఆదుకునేందుకు ముందుకొచ్చే వరకు ఏపీ రైతుసంఘం రైతులకు అండగా పోరాటం సాగిస్తుందని తెలిపారు.

### న్యూస్ బాక్స్

#### ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగన్ పర్యటన ఆగదు

కావలిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన ఆగదని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు గురువారం నెల్లూరు రానున్న జగన్మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుటిల ప్రయత్నాలను చేస్తుందని విమర్శించారు. రైలు, బస్సెక్కయినా, నడిచైనా జగనన్న నెల్లూరు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు అక్రమ లేఔట్లు వేశారని, తాను ప్రభుత్వ భూమి 128 ఎకరాలు ఆక్రమించానని తేలుస్తామని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎందుకు మౌనం వహించారని, రియల్టర్లతో సర్దుబాటు చేసుకున్నారా అని ప్రశ్నించారు.

#### పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు న్యాయం చేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం రంగంలోకి రావాలని రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన స్థానిక కందుకూరు 2 వేలం కేంద్రంలో పొగాకు వేలంను పరిశీలించారు. లో గ్రేడ్‌లకు కనీస ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకు కొనుగోలు చేయటం ద్వారా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నోబిడ్‌లు, సీఆర్‌లు తగ్గేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వర్జీనియా పొగాకు రైతును ఆదుకునేందుకు ముందుకొచ్చేవరకు ఏపీ రైతుసంఘం రైతులకు అండగా పోరాటం సాగిస్తుందని తెలిపారు.

#### అన్నదాత సుఖీభవ నమోదుకు మరో అవకాశం

కలిగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేని రైతులకు ఆన్‌లైన్ నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినట్లు మండల వ్యవసాయాధికారి జహీర్ మంగళవారం తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డ్, బ్యాంకు ఖాతాపుస్తకం, 1బి, అడంగల్ కాపీలతో రైతుసేవ కేంద్రాల్లో వీఏఏ లేదా వీహెచ్ఏఎస్‌లను సంప్రదించి ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు.

#### హక్కులు కాలరాసేందుకే లేబర్ కోడ్ చట్టాలు

కావలిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు హక్కులు కాలరాసేందుకే కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ చట్టాలు తీసుకొచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మామిళ్లపల్లి మోహనరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్యతో కలసి విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చేందుకు 44 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ నల్ల చట్టాలతో కార్మికుల సర్వం కోల్పోయే ప్రమాదం ఉందని, సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రశ్నించే హక్కు కోల్పోతారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీపీఎం నేతలు ఎస్ వెంకయ్య, మధుసూదన్‌రావు, సీఐటీయు నాయకులు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

#### 355 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 500 పొగాకు బేళ్లు తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీ ప్రతినిధులు పాల్గొని 355 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-116, ఆర్ఆర్-15, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 145 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.219.99గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

#### అధికారులను కలిసిన జనసేన నేతలు

బిట్రగుంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డిని జనసేన మండల అధ్యక్షుడు టీ.వెంకటేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అదే విధంగా ఎస్ఐ ఎన్.ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో జనసేన సైనికులు హరీష్, కాలేబు, వేంకటేశ్వర్లు, శివ, రవి, చైతన్య, రాజేంద్ర, సురేష్, కార్తీక్, బాబు పాల్గొన్నారు.

పెదపవని చెరువులో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

## పెదపవని చెరువులో యథేచ్ఛగా
# గ్రావెల్ తవ్వకాలు!

- 40 నుంచి 50 ట్రాక్టర్లతో తరలింపు
- ఆందోళనలో సాగునీటి సంఘం అధ్యక్షులు, రైతులు

లింగసముద్రం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని సాగునీటి చెరువులో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం ఉదయం నుంచి చెరువులో రెండు ఎక్స్‌కవేటర్‌లతో గ్రావెల్ తవ్వి సుమారు 40 నుంచి 50 ట్రాక్టర్ల ద్వారా తరలించారు. రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ, ఆ కాలువ పరిధిలోని బ్రాంచి కాలువల రోడ్ల పేరుతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయం తెలిసిన సాగునీటి సంఘం అధ్యక్షుడు మలిశెట్టి నాగేశ్వరరావు, సంఘం సభ్యులు, గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి, గ్రావెల్ తరలింపుపై అనుమతి పత్రాలను చూపాలని అడిగి, వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో గ్రావెల్ తరలించవద్దని చెప్పారు. అయినా వారు వినిపించుకోకపోవడంతో ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కూడా పట్టించుకోలేదని తెలిపారు. ఈ గ్రావెల్ ట్రాక్టర్లు గ్రామంలో ప్రధాన రహదారిలో చాలా వేగంగా పోతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువులో ఎక్స్‌కవేటర్ల ద్వారా పెద్ద పెద్ద గుంతలు చేస్తుండడం పట్ల కూడా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చెరువులోకి వచ్చే నీరు ఈ గుంతలలో మాత్రమే నిల్వ ఉండే అవకాశం ఉంది. గుంతలలోని నీరు తూము వద్దకు వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు కింద చిన్న సన్నకారు రైతులకు కలిపి సుమారు 400 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. దీంతో ఈ ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మైనర్ ఇరిగేషన్ ఏఈఈ బి. మనోహర్ మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈ ద్వారా ఒంగోలు ఇరిగేషన్ డివిజన్ ఈఈకి అనుమతుల కోసం లెటర్ పంపామన్నారు. అయితే ప్రభుత్వ పనుల కావడంతో ముందుగానే గ్రావెల్ తరలిసున్నామన్నారు. అయితే ఈ గ్రావెల్ తరలింపునకు సంబంధించి చెల్లించాల్సిన సీనరేజి ఆయా హెడ్ ఆఫ్ ఖాతాలో జమ అవుతాయన్నారు.

## నేడు వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణ

మాట్లాడుతున్న విగ్రహ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): కావలి ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న పేద బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణ కల ఎట్టకేలకు నెరవేరతోందని రంగావిగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ట్రంకు రోడ్డులోని రైతుబజారు వద్ద రంగ విగ్రహావిష్కరణ జరుగుతోందన్నారు. విగ్రహావిష్కరణ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో రంగా అభిమానులతో కలసి ఆయన మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సారధ్యంలో జరుగు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఆవిస్కరణ అనంతరం అక్కడే బహిరంగ సభ అనంతరం రాత్రికి భోజన ఏర్పాట్లు చేశామని చెప్పారు. రంగా అభిమానులు, కాపునాయకులు, పార్టీలు, కులమతాలకతీతంగా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విగ్రహావిష్కరణ కమిటీ బాధ్యుడు బాబూరావు, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభం

ఎక్స్‌కవేటర్ ఆపరేట్ చేసి కాలువల్లో పూడికతీసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధిగాంచిన మోపాడు, మాచవరం చెరువుల కింద పంట కాలువల్లో పూడికతీత పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. మోపాడు చెరువు ఆయకట్టు పరిధిలోని ఆనందపురం గ్రామం వద్ద పల్లెవాగులో ఆయన స్వయంగా ఎక్స్‌కవేటర్ ఆపరేట్‌చేసి పూడికతీసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోపాడు, మాచవరం చెరువుల పరిధిలోని చివరి ఆయకట్టుకు కూడా సక్రమంగా నీ చూడటం కోసం పంట కాలువల్లో పూడికతీతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ రెండు చెరువుల పరిధిలోని ఏడు ప్రధాన కాలువల్లో పూడికతీయటం కోసం రూ.43 లక్షల ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు పంట పెట్టుబడి సాయంగా త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ. 20వేలు ఆర్థికసహాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వీఆర్ కోట ఆనకట్ట సిస్టం అధ్యక్షుడు తల్లపనేని రవీంద్ర, ఆయా గ్రామాల నాయకులు కంద్రా మాల్యాద్రి, తల్లపనేని మురళి, దామా మాధవరావు, రావుల నారాయణ, వడ్డెళ్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

### పింఛను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

పట్టణంలోని 25వ వార్డు కేసరిగుంట కాలనీలో మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఇతర స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, సురేష్‌కుమార్, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

మాట్లాడుతున్న ఉద్యాన అధికారి విశాల్

ఉలవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పంటకు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు విజయ్‌కుమార్, విశాల్ సూచించారు. మంగళవారం మన్నేటికోట, ఆత్మకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ-క్రాప్ నమోదువలన రైతులకు అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంట కొనుగోలు, పీఎం కిసాన్‌వంటి అనేక ప్రభుత్వ పథకాలకు అర్హత పొందతారాని తెలిపారు. వ్యవసాయ పంటలతోపాటు ఉద్యాన పంటలైన మామిడి, సపోటా, జామ, సరుగుడు, జామాయిల్ పంటలకు పంట నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎండీ షరిపుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

## పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

లింగసముద్రం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమాకు రైతులు ప్రీమియం చెల్లించాలని పొలం పిలుస్తోంది మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కె.హర్షవర్ధన్ చెప్పారు. మంగళవారం మండలంలోని మాలకొండరాయుని పాలెం, లింగసముద్రం-1 రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండరాయునిపాలెంలో 56 మంది రైతులకు 23 క్వింటాళ్ల జనుము విత్తనాలు, ఇద్దరు రైతులకు 1 క్వింటా జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్రీహరి, మనుకిరణ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారిని కలిసిన మహిళా కండక్టర్లు

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారిగా షేక్.షమీమ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం కావలి డిపోకు చెందిన మహిళా కండక్టర్లు నెల్లూరులోని ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ షమీమ్ మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ధనమ్మ, కే.గోవిందమ్మ, ఎస్.గీతాబాయి, ధనలక్ష్మి, ఎన్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రియల్‌ఎస్టేట్ కోసం ఎస్సీ, ఎస్టీలను రోడ్డుకీడుస్తారా ?

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన పేరుతో రైతుల వద్ద వేలాది ఎకరాలు విలువైన భూములు ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని సీఐటీయూ అనుబంధ వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం కరేడులోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరేడులో అధిక శాతం ఎస్సీ ఎస్టీలు ఉన్నారని, వారికి ఉన్న కొద్దిపాటి పంట భూములతోపాటు నివాస గృహాలు ఇండోసోల్ కంపెనీ నిర్మాణంకు భూసేకరణలో తీసుకుంటే వాళ్లంతా రోడ్డున పడతారని పేర్కొన్నారు. కరేడు పంచాయతీ పరిధిలో బలవంతపు భూసేకరణలో తొలుత ప్రధాన రహదారి వెంట ఉన్న రామకృష్ణాపురం, పొట్టేనుగుంట ఎస్టీ కాలనీలు, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీల గృహాలను లాగేసుకుని రోడ్డుకు ఈడుస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఎంతటి పోరాటానికైనా, త్యాగాలకైనా వెనుకాడమని, దుర్మార్గ చర్యలను ఎదుర్కొంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జీవీబీ కుమార్, పొన్నం రామలక్ష్మమ్మ, కత్తి మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకయ్యకు జన్మదిన శుభాకాంక్షలు

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును కందుకూరు నియోజకవర్గంకు చెందిన ప్రకాశం జిల్లా డెయిరీ మాజీచైర్మన్ చల్లా శ్రీనివాసరావు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై చర్చించిన వెంకయ్యనాయుడు పలు అంశాలను ప్రస్తావించినట్లు చల్లా శ్రీనివాసరావు తెలిపారు.

## మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నేతలు

కొండాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, తదితర నాయకులు మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, బీజేపీ రాష్ట్రయువమోర్చా ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావు, సీనియర్ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చల్లా చిన మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాలేపాటి జన్మదిన వేడుకలు

బిట్రగుంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు బోగోలు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామ కోదండరామాలయ కమిటీ సభ్యులు పీ.వెంకటకృష్ణయ్య, టీ.వెంకటేశ్వర్లు, జీ.మల్లికార్జున, వీ.సాయినాగేంద్ర, జీ.గోపి, భాను తదితరులు పూలమాలు, శాలువలతో సన్మానించారు. నాల్గోసారి కూడా మండల టీడీపీ కన్వీనర్‌గా ఎంపిక కావడంతో నాగేశ్వరరావుతో పాటు మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఎల్.సుధీర్ బాబును ఘనంగా సన్మానించారు. పార్టీ నేతలు సీహెచ్.వెంకటేశ్వర్లు, కే.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.విజయ్‌కుమార్, ఏ.ఆదిశేషయ్య, పీ.హర్ష, ఎన్.పిచ్చయ్య, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలను సన్మానిస్తున్న శ్రేణులు

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యులను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్రసమరయోధుడు, పశ్చిమబెంగాల్ రెండవ ముఖ్యమంత్రి ప్రజావైద్యుడు డాక్టర్ బీసీ రాయ్ జన్మదినంను జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా తలసేమియా డేకేర్ సెంటర్‌కు స్వచ్ఛందంగా వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు పామూరు శ్రీధర్, శ్రీరాం మనోహర్‌బాబు, టీ. రమ్యలను సత్కరించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్ మాట్లాడుతూ కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రెడ్‌క్రా స్ సేవా కార్యక్రమాలకు అండ గా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏ. రమేష్ రెడ్డి, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, జిల్లా, కావలి కమిటీ సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్న కుమార్, జనిగర్ల మనోహర్, గొట్టిపాటి మనో రమ తదితరులు పాల్గొన్నారు.

### సుపరిపాలనలో తొలి అడుగును
## విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పట్టణ టీడీపీ శ్రేణులతో జరిగిన కార్యక్రమంలో సుపరిపాలనకు సంబంధించిన టీడీపీ యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి తెలియపరుద్దామన్నారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే అభిప్రాయాలను సేకరిస్తూ ఫై టీడీపీ యాప్‌లో పొందపరచాలన్నారు. బూత్ లెవల్‌లోని కార్యకర్తలు, ఇన్‌చార్జిలు ఈ కార్యక్రమా న్ని ముందుకు తీసుకెళ్లాలని, యూనిట్ ఇన్‌చార్జి లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు వారికి సహకారం అందించాలని తెలిపారు. ముసునూరులోని 15వ వార్డులో బుధవారం ఉదయం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి తిరిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య పోట్లూరు శ్రీనివాసులు, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై 9న దేశవ్యాప్త సమ్మె

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 184 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొంటారని, ఆరోజున సెంటర్లు మూతవేస్తున్నట్లు సీడీపీవో మాధవిలతకు యూనియన్ నాయకులు సమ్మె నోటీసులు అందచేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను విధించి కార్మికుల జీవితాలు వీధులపాలు చేస్తుందని దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొని వారి న్యాయమైన డిమాండ్లపై పోరాడాలన్నారు. సీఐటీయూ నాయకులు కుమార్, అంగన్‌వాడీలు ఇందిరావతి, తిరుపతమ్మ, గీత, కోటేశ్వరరి, వరలక్ష్మీ, శైలజ తదితరులు సమ్మె నోటీసు ఇచ్చినవారిలో ఉన్నారు.



**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |

# ల్యాబ్ ఆన్ వీల్స్

మొబైల్ ల్యాబ్

బస్సులోపల ల్యాబ్

● పద్మావతి వర్సిటీ ఆధ్వర్యంలో ఫ్లో బస్ ప్రారంభం

విద్యార్థుల వద్దకు వెళ్లి సైన్సు పట్ల ఆసక్తి పెంచేలా ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో బస్)ను తీర్చిదిద్దారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో 'టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ (టీబీఐ)' ఆధ్వర్యంలో ఈ మొబైల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. రొబొటిక్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఆగ్మెంటెడ్, వర్చువల్ రియాలటీ (ఏఆర్-వీఆర్), త్రీడీ ప్రింటింగ్, హోల్ గ్రామ్‌లు, డ్రోన్లు, వాతావరణ పర్యవేక్షణ స్టేషన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ టూల్స్, మొబైల్ ప్లానిటోరియం, మేకర్స్ స్పేస్, స్టూడెంట్ ఇన్నోవేషన్ షోకేస్ వంటివి ఉన్నాయి. సౌరశక్తితో నడవడం ఈ మొబైల్ ల్యాబ్ ప్రత్యేకత. ఈ ల్యాబ్ బస్సును మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేశారు. సైన్స్‌కు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన కలిగించే లక్ష్యంతో ఈ బస్సు ఏర్పాటు చేసినట్టు వీసీ ఉమ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 40 వేలమందికి పైగా విద్యార్థుల చెంతకు వెళ్లి సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ బస్సు తోడ్పడిందన్నారు. రాష్ట్రంలోనూ విద్యార్థుల వద్దకెళ్లే క్రమంలో పద్మావతి వర్సిటీ నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించామన్నారు. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులందరికీ ఈ ఫ్లో బస్‌లో ల్యాబ్‌ను చూసే అవకాశం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్.రజని, ల్యాబ్ సీఈవో మధులాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

# సుపరిపాలనలో తొలి అడుగు

నేటి నుంచి ఇంటింటికీ తెలుగుదేశం

అన్ని నియోజకవర్గాల్లో ముగిసిన కసరత్తు

జనం బాట పట్టనున్న అధికార పార్టీ నేతలు

తిరుపతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట బుధవారం నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనికోసం అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విదేశీ పర్యటనలో ఉన్నందున.. ఆ నియోజకవర్గం మినహా మిగిలిన అన్నిచోట్లా అధికార పార్టీ నేతలు జనం బాట పట్టి.. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించనున్నారు. సమస్యలనూ తెలుసుకునే ప్రయత్నం చేయనున్నారు. పాడైన రోడ్లు బాగుపడడం, కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం, పెరిగిన సంక్షేమ పింఛన్ల మొత్తం, తల్లికి వందనం, ఉచిత వంటగ్యాస్ వంటి పథకాల అమలు నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ధైర్యంగా జనంలోకి వెళ్ళగలిగే వాతావరణం నెలకొని ఉండటంతో ఆ పార్టీలో ఉత్సాహపూరిత వాతావరణం కనిపిస్తోంది.

'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలను తిరుపతిలో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, టీడీపీ నేతలు

**తిరుపతి: సుందరయ్యనగర్‌లో మొదలు**

తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు పెద్ద కసరత్తే నడిచింది. పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా మంగళవారం తిరుపతి చేరుకుని పార్టీ నేతలతో సమావేశమయ్యారు. బుధవారం ఉదయం 8 గంటలకు 34వ డివిజన్ పరిధిలోని సుందరయ్య నగర్ నుంచీ జనంలోకి వెళ్ళనున్నారు. అనంతరం క్లస్టర్ల వారీగా ఆయా ప్రాంత నేతలు కార్యక్రమాన్ని చేపట్టేలా నిర్ణయించారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలతో పాటు ముఖ్య నేతలు హాజరు కానున్నారు.

**చంద్రగిరి: మంగళం షిర్డీసాయి మందిరం నుంచి..**

చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని షిర్డీ సాయి మందిరం నుంచీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే పులివర్తి నానీ పాల్గొననున్నారు. బుధవారం మొత్తం తిరుమల నగర్ పంచాయతీలోనే పర్యటించనున్నారు. వాస్తవానికి నెల రోజుల పాటే కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ నిర్ణయించగా.. పులివర్తి నానీ మాత్రం నియోజకవర్గం మొత్తం పర్యటించేందుకు మూడు నెలల పాటు కొనసాగించాలని నిర్ణయించారు.

**నగరి: పన్నూరులో ప్రారంభం**

నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం పన్నూరు గ్రామంలో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదివరకూ విజయపురం మండలంలోని కమ్మకండ్రిగ నుంచీ ఈ తరహా కార్యక్రమాలను ప్రారంభించడం ఆనవాయితీగా పాటించేవారు. ఈ సారి సెంటిమెంట్‌కు భిన్నంగా పన్నూరును ఎంచుకున్నారు.

**శ్రీకాళహస్తి: వీరభద్రస్వామి సన్నిధి నుంచీ..**

శ్రీకాళహస్తి నియోజకవర్గానికొస్తే తొట్టంబేడు మండలం చిన్న సింగమాల పంచాయతీ వీరభద్రస్వామి సన్నిధి నుంచీ కార్యక్రమాన్ని శుభారంభం చేయనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అంకయ్య చౌదరి, ముఖ్యనేతలు పాల్గొంటున్నారు.

**గూడూరు: తిక్కవరంలో ఆరంభం**

గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం తిక్కవరంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రోజూ రాత్రి 7 గంటల వరకూ పర్యటనలు కొనసాగించాలని, ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

**సత్యవేడు: రాజగోపాలపురం నుంచీ**

సత్యవేడు మండలం రాజగోపాలపురంలో సాయంత్రం 4 గంటలకు ఇంటింటికీ టీడీపీ ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన నేపథ్యంలో ఆయన ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతి బాబు, పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగనుంది. మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

**వెంకటగిరి: ఒక రోజు ఆలస్యంగా..**

విదేశీ పర్యటనలో ఉన్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం రాత్రికి చేరుకుంటారని సమాచారం.ఈ కారణంగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమయ్యే అవకాశముంది.

**సూళ్లూరుపేట: సెంటిమెంటుకు పెద్ద పీట**

సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి ఓజిలి మండలం కురుగొండ్లలో ఉదయం 8 గంటలకు ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈశాన్యం సెంటిమెంటుతో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఇక్కడ్నుంచే ప్రచారం ప్రారంభిస్తారు. అదే సెంటిమెంటుతో ఇప్పుడూ మొదలు పెడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులను అక్కడికి ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆహ్వానిస్తున్నారు.

## కిటకిటలాడిన జపాలి

తిరుమలలోని జపాలి అంజనేయుడి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. కొద్దిరోజులుగా సందర్శనీయ ప్రదేశాల్లో ఒకటైన పాపవినాశన మార్గంలోని జపాలికి భక్తుల తాకిడి పెరిగింది.ఇందులో భాగంగానే మంగళవారం ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు క్యూకట్టారు.సిబ్బంది క్యూలైన్ ద్వారా విడతలవారీగా భక్తులను అనుమతించి దర్శనం కల్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతి రూరల్ ఓటేరులో పింఛను అందజేస్తున్న కలెక్టర్

## 95.89 శాతం మందికి పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. 691 సచివాలయాల పరిధిలో ఉద్యోగులు ఉదయం 6.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారు. తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలో కలెక్టర్ వెంకటేశ్వర్ పింఛన్లు అందజేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. జిల్లాలో 2,59,732మంది లబ్ధిదారులకుగాను రాత్రి 7గంటలకు 2,49,054మందికి పింఛన్లు అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు. రాష్ట్రంలో పింఛన్లు పంపిణీలో 95.89 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ అభినందించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

# మైనారిటీ నేతను అక్కున చేర్చుకుని..

● కుటుంబానికి అండగా ఉంటామంటూ మంత్రి లోకేశ్ హామీ

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో బెదిరింపులకు, కక్ష సాధింపు చర్యలక బెదరక.. ఎదురొడ్డి నిలబడిన మైనారిటీ నేత అల్లాబక్షు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ హామీ హామీ ఇచ్చారు. ఓజిలి మండలం ఆరిమేనిపాడుకు చెందిన టీడీపీ మైనార్టీసెల్ నాయకుడు అల్లాబక్షు.. 2021లో టీడీపీ నుంచి సర్పంచ్, ఎంపీటీసీకు పలువురిని బరిలో ఉంచారు. దీనిని సహించలేని వైసీపీ నాయకులు బెదిరించారు. అయినా, బెదరక పోటీలో నిలవడంతో ఆయన 3.50 ఎకరాల్లోని జామాయిల్ తోటలను నరికేశారు. ఆ భూములను నిషేధిత జాబితా 22ఏలో చేర్చారు. అల్లాబక్షు కొత్తగా కట్టుకున్న ఇంటి గోడను కూలగొట్టారు. అయినా అల్లాబక్షు లొంగక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి నుంచి మరింతగా టీడీపీ కోసం కష్టపడి పనిచేశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్.. కుటుంబం సహా తనను కలవాలని కబురు పంపారు. ఆప్రకారం మంగళవారం ఉండవల్లిలోని లోకేశ్ ఇంటికి అల్లాబక్షు దంపతులు, పిల్లలు వెళ్లారు. వీరి కుటుంబ వివరాలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న లోకేశ్.. పార్టీకి అండగా నిలిచి పోరాడిన అల్లాబక్షును అభినందించారు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరడంతో పరిశీలిస్తామని హామీఇచ్చారు. కుటుంబానికి అండగా ఉండటంతో పాటు పిల్లల చదువుకు తాను అండగా నిలుస్తానని లోకేష్ భరోసానిచ్చారు.

**ఆ ఏనుగు దంతాలు**

# భాకరాపేటలో చోరీకి గురైనవే

● రెండు గన్నులపై దర్యాప్తు కొనసాగుతోందన్న అటవీశాఖ అధికారి వివేక్

మంగళం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాదులో డ్రైవర్ ప్రసాద్ వద్ద దొరికిన ఏనుగు దంతాలు భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో చోరీకి గురైనవేనని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ తెలిపారు. తిరుపతిలో మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. 'భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో భద్రపరచిన ఏనుగు దంతాలు 2023లో చోరీకి గురయ్యాయి. ఆ సమయంలో ఏనుగు దంతాల పొడవు, వాటి చుట్టుకొలతలను రికార్డులో నమోదు చేసున్నారు. హైదరాబాదులో ప్రసాద్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాల పొడవు, చుట్టుకొలతతో ఇవి సరిపోయాయి. దీనిని మరింత శాస్త్రీయంగా నిర్ధారించడానికి డెహ్రాడూన్‌లోని ల్యాబ్‌కు ఏనుగు దంతాల యనామిల్‌ను పంపించాం. ఏనుగు దంతాలతో పాటు చోరీకి గురైన రెండు గన్నులు ఏమయ్యాయి? ఎక్కడున్నాయి? ఈ చోరీకి పాల్పడింది ఎవరనేది తెలియాల్సి ఉంది. దీనిపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ.. సంబంధిత పోలీసు అధికారులను కలిసి వివరాలను సేకరిస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి సమాచారం వెలుగులోకి వస్తుంది. డెహ్రాడూన్‌లోని ల్యాబ్ నుంచి రిపోర్టు రావడానికి నెల రోజులు పట్టే అవకాశం ఉంది' అని ఆయన వివరించారు. కాగా, ఏనుగు దంతాలను సొమ్ము చేసుకునే ప్రయత్నంలో హైదరాబాద్‌లో నిందితుడు పట్టుబడటంతో భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో రెండు ఏనుగు దంతాలతో పాటు రెండు గన్నులు కూడా అప్పట్లో చోరీకి గురైన అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టింది. హైదరాబాద్ పోలీసుల వద్దనున్న నిందితుడైన డ్రైవర్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉంది.

# మహిళా సంరక్షణ కార్యదర్శులకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలని ఆ సంఘం నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల సంఘం నాయకురాలు నజమా మాట్లాడుతూ.. చిత్తూరు ఎస్పీ కార్యాలయంలో చేపట్టిన బదిలీల ప్రక్రియ, నిబంధనలను అనుసరించి జరగలేదని ఆరోపించారు. ఈ బదిలీల ప్రక్రియ సీనియారిటీ జాబితా ప్రామాణికంతో ఖాళీల వివరాలను తెలుపుతూ నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న మహిళా కార్యదర్శులను జీవో నెంబరు 6ను పరిగణనలోకి తీసుకుని వార్డు నుంచి వార్డుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. స్పౌజ్, మెడికల్ కేటగిరి కింద నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని విమర్శించారు. వీటిని పునఃపరిశీలించి రీకౌన్సెలింగ్ చేయాలన్నారు. ఈ నిరసనలో సంఘం నాయకులు ఊర్వశి, జ్ఞానాంబిక, విజయలక్ష్మి, మహిళ సంరక్షణ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయం నాయకుడు కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు

# నేడు, రేపు చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం/శాంతిపురం, జులై 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో బుధ, గురువారాల్లో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. తొలిరోజున టీడీపీ కార్యక్రమమైన 'సుపరిపాలనలో తొలి అడుగు'ను తిమ్మరాజుపల్లెలో ప్రారంభిస్తారు. ముందుగానే నిర్ణయించిన 26 ఇళ్లకు వెళ్లి, వారిని పలకరించి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తారు. కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటారు. రాత్రికి స్వగృహంలో బస చేస్తారు. మళ్లీ గురువారం ఉదయం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. స్వగృహంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తారు. అదయ్యాక టీడీపీ క్యాడర్‌తో సమావేశమై రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తారు. సాయంత్రం చంద్రబాబు తిరుగు ప్రయాణమవుతారు.

# ప్రవేశాలకు 'ఆధారం' లేదు

● ఆధార్ లేని విద్యార్థులు 500కి పైగానే ● జిల్లా వ్యాప్తంగా 7 పాఠశాలల్లో కేంద్రాలు

తిరుపతి(విద్య), జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1, 2 తరగతులకు సంబంధించి 500 మందికి పైగా విద్యార్థులకు ఇప్పటికీ ఆధార్ కార్డులు లేనట్టు విద్యాశాఖాధికారులు గుర్తించారు. 1, 2 తరగతుల్లో ప్రవేశాలకు వస్తున్న వారిలో అత్యధిక శాతం మందికి ఆధార్ లేకపోవడంతో ప్రవేశాల లెక్కలు నమోదు కావడంలేదు. ఆయా విద్యార్థులను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా చేర్చలేక పోతున్నారు. ముఖ్యంగా యుడైస్ నమోదు కావడంలేదు. దీంతో ఇప్పటి వరకు 1, 2 తరగతుల్లో ఎంత మంది చేరారనే లెక్కలు తేలడం లేదు. ఈ క్రమంలో ఏడు పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటుకు డీఈవో కేవీఎన్ కుమార్ చర్యలు తీసుకున్నారు. తిరుచానూరు జడ్పీ హైస్కూల్, తిరుపతి అర్బన్ ఎస్పీజేఎన్ఎం మున్సిపల్ హైస్కూల్, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ హైస్కూల్, పుత్తూరు బాలికల జడ్పీ హైస్కూల్‌లో, గూడూరులోని జడ్పీ బాలికల, బాలుర పాఠశాలలు, నాయుడుపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచే ఈ ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయని డీఈవో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేయించి ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలని సూచించారు. డీవైఈవోలు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలో ఆధార్ లేని విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి నమోదు చేయించాలన్నారు. ఆ వెంటనే యుడైస్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని సూచించారు.

**Required Staff**
- Store Keeper
- Site Supervisor
- Site engineer

For Hotel Construction at Tirupati
Call :080-22445889
hr@shravanthigroup.com

## 'సీమ'కు నీటికోసం సీఎం కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర

రాయలసీమకు నీరందించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్న ఆయన తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరు ఇచ్చేలా సీఎం ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికి స్వామి ఆశీస్సులు కావాలని వేడుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రముఖ వయొలిన్ వాయిద్య కళాకారిణి కుమారి కన్యాకుమారి, ప్రముఖ నృత్యకళాకారిణి ఆనంద శంకర్ జయంత్, తెలంగాణ ఎమ్మెల్యే బసవరాజు సారయ్య, ఆస్ట్రాలజర్ వేణుస్వామి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కుమారి కన్యాకుమారి - ఆనంద శంకర్ జయంత్

## సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,730**

**తలనీలాలు సమర్పించినవారు: 28,940**





# రామాపురం @ కందగడ్డ ఊరు

● 50 ఏళ్లకుపైగా ప్రధాన సాగు ఇదే

**కందగడ్డ పండిస్తారే ఆ ఊరు పేరేమిటి? ఎప్పుడైనా ఆ గ్రామం పేరు గుర్తురాకపోతే ఇలా అడిగితే చాలు.. టక్కున రామాపురం అని చెబుతారు. రామచంద్రాపురం మండలంలోని ఈ గ్రామం కందగడ్డ సాగుకు పెట్టింది పేరు. 50 ఏళ్లుగా కందసాగులో అధిక దిగుబడి సాధించి రైతులు లాభాలబాట పట్టారు.**

- రామచంద్రాపురం, ఆంధ్రజ్యోతి

రామచంద్రాపురం మండలం రామాపురం.. తిరుపతికి అతి సమీపంలో ఉందీ గ్రామం. ఇక్కడ జల వనరులు తక్కువగా ఉండటంతో ఎన్నో ఏళ్ల కిందటే తిరుపతి మార్కెట్‌లో వ్యాపారం చేసేవారు. ఈ గ్రామంలో 70 ఏళ్ల క్రితమే సుబ్బారెడ్డి, సైదారెడ్డి అనే వారు తమిళనాడు నుంచి కందగడ్డ విత్తనం తెచ్చి సాగు చేశారు. దీంతో పాటు పలు వాణిజ్యవ్యాపారుల వైపు రైతులు దృష్టి మరలిచారు. కందతోటను ఏప్రిల్, మే నెల మధ్య నాటాలి. ఎకరా సాగుకు 72 కిలోలవి 25 నుంచి 30 బస్తాలు కావాలి. విత్తనం బస్తా ధర రూ.1,700 నుంచి రూ.2వేలు వరకు ఉంటుంది. దున్నకం, ఎరువులు, మందులు, కూలీలు అన్ని కలిపి ఎకరా సాగుకు లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంట ఐదు నెలల నుంచి ఆరునెలల్లోపు తీయాలి. ఒకవేళ అనుకోని అవాంతరాలు ఎదురైనా రెండు నుంచి మూడు నెలలు భూమిలో ఉన్నా చెడిపోయే పరిస్థితి లేదు. తక్కువ నీటితో సాగయ్యే కంద మొండిపంట. పెద్దగా చీడపీడలు అంటవు. ఎకరా తోట 250 నుంచి 300 బస్తాలు దిగుబడి ఇస్తుంది. ఎకరా కందతోటలో అన్నిపోను రూ.3లక్షలు మిగులుతుందని రైతులు చెప్పారు. రామాపురంలో ఎన్నో ఏళ్లుగా 50 మంది రైతులు ఏటా కందసాగులో మంచి లాభాలు గడిస్తున్నారు. నీటి ఆధారం లేని గ్రామం కావడంతో పేదరికం ఎక్కువగా ఉండేది. ఎపుడైతే వాణిజ్యపంట సాగుతో మంచి లాభాలు గడించి లక్షాధికారులు అయ్యారు. మండలంలోనే రామాపురం ధనిక గ్రామంగా మారింది.

### కంద.. మొండిపంట

అన్ని పంటల్లాగా కంద నీర్పుడు దశకు వచ్చినా అప్పటికపుడు తీయాల్సిన పరిస్థితి లేదు. భూమిలో కొంతకాల్వ నిల్వ ఉన్నా చెడిపోయే పరిస్థితి ఉండదు. పెద్దగా చీడపీడలు ఆశించవు. రైతుకు మంచి లాభాలిచ్చే కంద.. మొండి పంట.

- రంజిత్



రామాపురంలో సాగు అవుతున్న కంద తోటలు

### 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం

మాకున్న రెండు ఎకరాల్లో.. కుటుంబం 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం. ఎకరా కందసాగుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. నల్లరేగడి భూమి అయితే మంచిదిగుబడి ఇస్తుంది. సంక్రాంతి సీజన్‌లో 70 కిలోల బస్తా ధర రూ.2వేల నుంచి రూ.3వేలు పలుకుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.3లక్షలు మిగులుతాయి. మాగ్రామమంతా కందసాగే చేస్తున్నాం.

- కె.మునిరామిరెడ్డి

## నకిలీలను నమ్మి మోసపోవద్దు

● భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం, బస, ఆర్జిత సేవల కోసం నకిలీ వ్యక్తులను నమ్మి మోసపోవద్దని టీటీడీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా భక్తులను కోరింది. పెద్దింటి ప్రభాకరాచార్యులు పేరుతో వైష్ణవ యాత్రాస్ అనే ఫేస్‌బుక్ పేజీని నడుపుతున్న ఓ వ్యక్తి శ్రీవారి అభిషేకం, ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కల్పిస్తామంటూ మోసం చేస్తున్న అంశం టీటీడీ దృష్టికి రావడంతో ఈ హెచ్చరిక చేసింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. టికెట్ల పేరుతో భక్తులను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## టీటీడీ ఛైర్మన్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

తిరుమల, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రీవారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఫొటో సహా ఎక్స్ ఖాతాలో చంద్రబాబు పోస్ట్ చేశారు.

చంద్రబాబు ఎక్స్‌లో పెట్టిన పోస్టు

## డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు వాయిదా పడ్డాయి. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు జూలై 7 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల వాయిదాను విద్యార్థులు గమనించాలని అధికారులు కోరారు. కొత్త షెడ్యూల్‌ను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

## మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

బాలాయపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను భర్త హత్య చేసిన ఘటన బాలాయపల్లి మండలం అంబలపూడి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు.. బాటా వెంకటేశ్వర్లు తన భార్య సిద్దమ్మతో కలసి అంబలపూడిలోని సురేష్‌కు చెందిన మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. ఇటీవల సిద్దమ్మ వెళ్లిపోవడంతో నచ్చజెప్పి కాపురానికి తీసుకొచ్చాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో సిద్దమ్మను వెంకటేశ్వర్లు హతమార్చాడు. తన భార్యను హత్య చేశానని స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి, ఎస్ఐ గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సిద్దమ్మ మృతదేహం

## గోవిందుడి పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం జరిగే పుష్పయాగం కోసం మంగళవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం తిరువీధుల్లో సేనాధిపతి విష్వక్సేనుడి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో అర్చకులు మన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఇక, బుధవారం ఉదయం 9.30-11.30గంటల మధ్య శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు. సాయంత్రం 6-7గంటల మధ్య ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించే ఊంజల్ సేవను రద్దు చేశారు.

పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

సేనాపతి ఊరేగింపు

అవార్డు అందుకుంటున్న ఇసుజు ప్రతినిధులు

## 'ఇసుజు' పరిశ్రమకు ఎక్స్‌లెన్స్ అవార్డు

సత్యవేడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని కార్ల తయారీ పరిశ్రమ ఇసుజుకు ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆవరణలో 'సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత'పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడు సంస్థల్లో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్.దినకర్ సమక్షంలో గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా పరిశ్రమ ప్రతినిధులు అవార్డును అందుకున్నారు. ఇసుజు మోటర్స్‌తో పాటు అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, టీటీఈ ఎలక్ట్రానిక్స్, ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్, పీవీఎస్ కెమికల్స్, లక్కీఫోర్‌యూ ఎగ్జిమ్స్ అండ్ మినరల్స్ తదితర సంస్థలు ఈ అవార్డులు అందుకున్నాయి.

## క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షలో తిరుపతి విద్యార్థినికి ఫస్ట్ ర్యాంకు

● ఏపీలో విజయవాడ కేంద్రంగా తొలిసారిగా కోర్సు ప్రారంభం

త్రిపుర గవర్నరు ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ నుంచి ప్రవేశపత్రాన్ని అందుకుంటున్న శిరీష

తిరుపతి రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల (రఘునాథరిసార్ట్)కు చెందిన కంబాల వాణి, రాము దంపతుల కుమార్తె శిరీష ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నిర్వహించిన ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు రాగా.. ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభ చాటి మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. కాగా, రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా నడిచే ఇండ్లాస్ ఆస్పత్రిలో ఈ ఏడాది తొలిసారిగా ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ కోర్సు ప్రారంభించారు. ఈ కోర్సులో ప్రవేశానికి 12మంది విద్యార్థులు అర్హత సాధించగా..వీరిలో తిరుపతికి చెందిన శిరీష ఫస్ట్‌ర్యాంకుని సాధించారని పేర్కొన్నారు. మంగళవారం త్రిపుర గవర్నరు డాక్టర్ ఎన్.ఇంద్రసేనరెడ్డి, రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతులమీదుగా అడ్మిషన్ లెటర్‌ని ఆమె అందుకున్నారు. జైపూర్‌లోని మణిపాల్ వర్సిటీలో ఈమె ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సు చేశారు.

## తిరుపతి- అకోలా మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుపతి- అకోలా మధ్య నడుస్తున్న వారాంతరం ప్రత్యేక రైళ్లను జూలై 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేది వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం తిరుపతి నుంచి అకోలాకు ప్రత్యేక రైలు(07605) బయలు దేరుతుందన్నారు. అకోలాలో ఈ ప్రత్యేక రైలు(07606) ప్రతి ఆదివారం బయలుదేరి రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న కారణంగా ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంచుతున్నామని పేర్కొన్నారు.

## ముగ్గురు నిందితుల అరెస్టు

● 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో నేరాలు, ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను శ్రీకాళహస్తి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వండలూరు కండ్రిగకు చెందిన ముత్తం మణిమారన్, తిరుపతి జిల్లా వెంకటగిరి కోళ్లఫారానికి చెందిన మారి మాణిక్యం, శ్రీకాళహస్తి ఏనుగుల గుంటకు చెందిన కొట్టంబేడి రాజా ముఠాగా ఏర్పడ్డారు. కొంత కాలంగా తమిళనాడుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల తొట్టంబేడు, రేణిగుంట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి సమీపంలోని నంది రెస్టారెంటు వద్ద అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వీరు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్టు చేసి.. 140 గ్రాములు బంగారు నగలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

## భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయండి



అధికారులతో వర్చువల్‌గా సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలిసి నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులతో వర్చువల్‌గా సమీక్షించారు. శ్రీకాళహస్తి-నడికుడితో పాటు పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులను పూర్తిచేయాలని, భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాగరమాల కింద చేపట్టిన ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులను నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని ఆర్డీవోలకు సూచించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఏడీబీ రోడ్డు పనులనూ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్‌రెడ్డి, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ వైద్యసేవలో డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఎన్టీఆర్ వైద్యసేవలో రక్తపరీక్షలు, చికిత్సలు, ఆర్థోపెడిక్ విషయంలో రోగులను తప్పుదోవ పట్టించి అనధికారికంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి కొన్ని ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తున్నాయని.. అలాంటివి పునరావృతం కాకుండా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శివకుమార్, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'జనసురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి జనసురక్ష బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో జనసురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే బీమా పథకాల గురించి తెలపడమే దీని ఉద్దేశ్యమన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.2లక్షల వరకు లబ్ధిదారులకు జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అటల్ పెన్షన్ యోజననూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తిరుమలలో మరో కియాస్క్ ప్రారంభం

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల సౌకర్యార్థం మరో కియాస్క్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వితరణగా అందించిన ఈ మిషన్‌ను ఆ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్(బీ అండ్ వో) దినేష్ గులాటి ప్రారంభించారు. ఈ కియాస్క్ ద్వారా లడ్డూ కొనుగోళ్లతో పాటు విరాళాలు అందజేయవచ్చు.

కియాస్క్‌ను ప్రారంభిస్తున్న దినేష్ గులాటి

## ఇంజనీరింగ్‌లో 23,715 ఇన్‌టేక్‌కి అనుమతి

తిరుపతిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 2025-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ బ్రాంచీలలో ఇన్‌టేక్ అనుమతి వివరాలను పాత జిల్లాల వారీగా వెల్లడించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 1080 (ఇన్‌టేక్), 21 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో 22,635 చొప్పున 24 కళాశాలల్లో మొత్తం 23,715 ఇన్‌టేక్ కేటాయించినట్లు తెలిసింది.

పాడుపడిన భవనంలో గంజాయి తీసుకుంటున్న యువకులు

## గంజాయి తీసుకుంటూ డ్రోన్‌కు చిక్కిన యువకులు

తిరుచానూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పెద్ద చెరువులో పాడుపడిన భవనంలో కొందరు గంజాయి తీసుకుంటున్నట్లు గుర్తించిన పోలీసులు నిఘా పెట్టారు. పోలీస్ ఈగల్ టీం, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం డ్రోన్‌తో డ్రైవ్ నిర్వహించగా, ఆ భవనంలో నలుగురు యువకులు గంజాయి తీసుకుంటుండటం బయట పడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. వీరిలో బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది.

## పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: పాశం

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని నలజాలమ్మవీధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికివందనం ద్వారా చదువుకునే పిల్లలందరి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలండర్లను అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తేస్తామని చెప్పారు. బుధవారం నుంచి ఏడాది పాలనను ప్రజలకు వివరించేందుకు గడపగడపకు కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచు రామయ్య, కల్పన, శ్రీధర్, నరసింహులు, రవీంద్రారెడ్డి, సోమిశెట్టి చెంచు రామయ్య, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం తడకండ్రిగ పంచాయతీ అనపగుంట గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. మురుగు కాలువలు లేక మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోందని గ్రామస్తులు చెప్పడంతో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, సెల్వం, పళణి, శ్రీధర్, రవి, రమేష్, శ్రీనివాసన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ

పెళ్లకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామంలో లబ్ధిదారులకు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే రోసనూరులో దొమ్మరాజు సత్యనారాయణరాజు, రావుల పాడులో కొచ్చెర్ల వెంకటరమణయ్య నాయుడు(కేవీ నాయుడు), పునబాకలో వేలూరు హరి నాయుడు, తాళ్ల యుగందర్ గౌడ్, చిల్లకూరులో సన్నాడి వేణురెడ్డి, నెలబల్లిలో ఉదయ్‌కుమార్ నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు.

## బీసీ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నం

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇందిరా మైదానంలో ఈ నెల 6వ తేదీన అంబేద్కర్, పూలే ఫౌండేషన్(ఏపీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా సభను విజవంతం చేయాలని మాజీ మంత్రి, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరసా వెంకటరత్నం అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలోని పూలే విగ్రహం వద్ద బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు అంబేడ్కర్, పూలే ఫౌండేషన్‌ను స్థాపించామన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, రాజ్యాధికారం నినాదంతో బలహీన వర్గాలందరినీ సమన్వయపరిచి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, యాదగిరి, నాగరాజుగౌడ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు బీమా... రైతులకు ధీమా

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారిణి దీప

వాకాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోకుండా ప్రభుత్వం రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తోందని వ్యవసాయ శాఖ అధికారిణి దీప అన్నారు. మండలంలోని బాలిరెడ్డిపాళెం, గంగన్నపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆగస్టు 15 లోగా రైతులు కామన్ సర్వీసు సెంటర్ ద్వారా రూ.168 చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ హర్ష, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే

వైద్యులను సన్మానిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం డాక్టర్స్ డే జరుపుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఆస్పత్రి సూపరింటెండ్ రమేష్ నేతృత్వంలో వైద్యులు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో వైద్యులు స్టీవెన్, లావణ్య, ద్రాక్షయణి, ప్రసన్న, ఉదయిని, ఖాదర్ భాషా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఏలిమేటి సతీష్, హనుమంతరావు, సరిత పాల్గొన్నారు.

## వైద్యులు దేవుళ్లతో సమానం

గూడూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు జన్మనిస్తే... అనారోగ్యానికి గురైన సమయంలో మన ప్రాణాలను కాపాడి పునర్జన్మనిచ్చే డాక్టర్లు దేవుళ్లతో సమానమని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్లు ప్రసూన, రాజా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు దైవ స్వరూపులు

నాయుడుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు దైవ స్వరూపులని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం నూర్ రియాజ్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం విద్యార్థులను నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ఆస్పత్రిలో డాక్టర్లు అందించే వైద్యసేవల గురించి తెలియజేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను, సిబ్బందిని విద్యార్థులు సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఏవో గౌస్‌బాషా, డీన్ శ్రీకాంత్, కోఆర్డినేటర్ ప్రిస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరసామి ఆలయంలో 17నుంచి ఆడికృత్తిక వేడుకలు

వెంకటగిరి, జూలై1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర సామి దేవస్థానంలో ఈనెల 17నుంచి 21వ తేదీ వరకు ఆడికృత్తిక వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ దొంతు శారద ఆవిష్కరించారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరావు, దొంతు బాలకృష్ణ, జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, న్యాయవాది కోటేశ్వరావు, డాక్టర్ ఆవుల రామాంజునేయులు, డాక్టర్ చల్లా సుమన్, డాక్టర్ రామారావు బాల, ఆలయ కమిటీ సభ్యులు కుసుమా రమేస్, గొల్లగుంట రాము, దోర్నాగల బాలయ్య, దొంతు మునివెంకటరత్నం పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి: విజయశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, రఫీ, పళణి తదితరులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ నాయకులు ఏమి చేయకుండా అన్నీ చేసినట్లు చెప్పుకుని ఐదేళ్లు కాలం గడిపి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం చేసిన పనులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు ఏజీ కిషోర్, వాకచర్ల రమేష్, బొమ్మన్ పళణి, శ్రీనివాసులునాయుడు, 786 రఫీ, శ్రీహరి రెడ్డి, పామంజి శ్రీనివాసులు, మురళీకృష్ణారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి పథకాల పరిశీలన

షార్ రోడ్డులో తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయుడు, డీఈ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నీటి పథకాలను మంగళవారం ప్రజా ఆరోగ్యశాఖ ఎస్ఈ మోహన్ అధికారులతో కలిసి పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని దేగలపాలెం చెరువు వద్దనున్న నీటి పథకం, పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో 2018లో ఏఐబీ నిధులతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించి తాగునీరందించే పనులు ప్రారంభించామని, 30 శాతం మేర పనులు జరిగి ఆగిపోయాయన్నారు. ఏఐబీ గడువు ముగియడంతో దాని స్థానంలో అర్బన్ యుఐడీఎఫ్ పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రతిపాదనలు సైతం పూర్తయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రాంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎస్ఈ చెప్పారు. కార్యక్రమంలో ఈఈ సుబ్బరాయుడు, డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

ఆటోలో విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న సీఆర్పీ బాబు

వాకాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందిస్తున్నట్లు ఎంఈవో నసీం ఆలీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాయదుర్గం ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులను సీఆర్పీ బాబు ఆధ్వర్యంలో చేర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యతో పాటు పుస్తకాలు, బ్యాగులు, షూలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుమ్మరవీధి ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరవీధి ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, చంద్రనీల్, నయాం, రాజశేఖర్, చైతన్య, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు అన్నారు. మంగళవారం స్థానిక బాలసదనంలో తిరుపతికి చెందిన రుయా ఆస్పత్రి వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థునులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రదీప్, ప్రత్యూష, గుణశేఖర్, ఝాన్సీరాణి, దీప్తి, మధుబాబు, వార్డెన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్‌కు సత్కారం

ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న కోటేశ్వరరావు

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని శ్రీభారత్ ట్రస్టు ఛైర్మన్ కె.కోటేశ్వరరావు సత్కరించారు. మంగళవారం హైదరాబాదులో ఇంద్రసేనారెడ్డిని కలిసిన కోటేశ్వరరావు శ్రీభారత్‌ట్రస్టు నిర్వహిస్తున్న విద్యా వికాశ కేంద్రాల గురించి వివరించారు.

## పొలం పిలుస్తోంది

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపాళెం, కోట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏవో సుచ్చేంద్రప్రసాద్ ఎరువులు, పురుగుమందులు, యాజమాన్య పద్ధతులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకాలల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

**పెళ్లకూరు:** కొత్తూరు, పెళ్లకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పైరును పరిశీలించి సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. నాయుడుపేట ఏడీఏ నాగార్జున సాగర్, మండల వ్యవసాయాధికారిణి విజయకుమారి పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న లారీ

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వరదయ్యపాళెం మండలం చెదురుపాకం గ్రామానికి చెందిన మల్చి చల్లయ్య మంగళవారం చేనిగుంటలోని తన బంధువుల ఇంటికి వచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. చేనిగుంట వద్ద జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చల్లయ్యకు కాలువిరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత కక్షలతో దాడి చేశారని ఫిర్యాదు

బాలాయపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడగుంట గ్రామానికి చెందిన కొమ్మల నాగరాజు పాత కక్షలతో తమపై దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన మల్లారపు వెంకటాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం తాను, తన తల్లి రేణుకమ్మ తోట దగ్గరకు వెళ్లి వస్తుండగా నాగరాజు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంకటాద్రి, రేణుకమ్మకు గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం గ్రామానికి చెందిన సునీల్ ఉద్యోగం రాలేదన్న బాధతో ఇటీవల గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి ఆయనను రాయ వేలూరు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

## పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరశింగారావుపేటలో మంగళవారం పేదలకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు మాట్లాడుతూ రవాణాశాఖ అధికారి మురళీమోహన్ తల్లి కొర్రపాటి రాములమ్మ జయంతి సందర్భంగా ఆమె కుమారుల సహకారంతో దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రామ్మోహన్, చిరంజీవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటగిరి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపమాంబపురం, చింతగుంట గ్రామాల్లో మంగళవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారు. రేపు జంగాలపల్లి, పారవోలు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని బంగారుపేట పీహెచ్‌సీ డాక్టర్ శివకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జినీత, హిరత, పద్మావతి, సర్పంచులు మస్తాన్, చెంచు ప్రసన్న కుమార్, పీఎస్ కోటీశ్వరరావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య పరీక్షలు

వెంకటగిరి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెగుంట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం డాక్టర్ డే సందర్భంగా డాక్టర్ రామాంజనేయులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్, బండారు ఆంజనేయులు, ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాంబట్టు గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 24 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన మునీంద్ర, సుబ్రహ్మణ్యం మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 24 బాంటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## నేటి నుంచి ఇంటింటికీ మంచి ప్రభుత్వం

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరగనుంది. బుధవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించనున్నారు. తొలిరోజు బుధవారం ఉదయం ఓజిలి మండలం కురుగుండ్లలో, సాయంత్రం తన్నమాల గ్రామంలో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

## రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి

వెంకటసుబ్బయ్య (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని సోమవారం రాత్రి రైలు ఢీకొనడంతో టీడీపీ నాయకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు... వీరారెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన వెంకటసుబ్బయ్య(48) 27వ వార్డు టీడీపీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడు. ఆవులను పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గాంధీనగర్ సమీపంలోని పశువులను మేతకు తీసుకువెళ్లే క్రమంలో పట్టాల వద్ద దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య మృతిచెందాడు. స్థానికులు గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్ పోలీసులు చెప్పారు. వెంకటసుబ్బయ్య మృతిపై ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సంతాపం తెలిపారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

చిల్లకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు(30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.... ఏడుకొండలుకు నెల్లూరు సమీపంలోని గురివిందపూడి గ్రామానికి చెందిన ఉషాతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెంలో కాపురం ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగా భార్య, పిల్లలను వదిలిపెట్టి నెల రోజుల క్రితం తన స్వగ్రామమైన తిప్పగుంటపాళెం వచ్చిన ఏడుకొండలు తన సొంత ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం మస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంట్లో పరిశీలించగా ఏడుకొండలు ఆత్మహత్య చేసుకున్న విషయం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ కోట తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో పేదలు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పలు కుటుంబాలకు రేషన్, ఆధార్‌కార్డులు లేవన్న సాకుతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, నారాయణ, శేషయ్య, భాస్కర్, కృష్ణ, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం

భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కోట మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పలగాటి భాస్కర్‌రెడ్డిని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం గజమాలతో సత్కరించారు. కొక్కుపాడులో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంపీటీసీ సురేష్‌బాబు, చాపల శ్రీనివాసులు, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, పల్లం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు ఈనెల 3న మాజీ సీఎం జగన్ వస్తారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం స్థానిక సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రమాదేవి ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శ్రీరమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మందికి పైగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, చిన్నపాటి శస్త్ర చికిత్సలను చేయడంతో పాటు అవసరమైన మందులను అందించినట్లు ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి తెలిపారు. తన తండ్రి, న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి స్ఫూర్తితో పేదల కోసం ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తాము ప్రజలకు అందించే ఉత్తమ సేవలకుగాను డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్టు నుంచి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి

# చెదిరిన కలలు

## హైదరాబాద్‌లోని సిగాచి ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

## ప్రేమ వివాహం చేసుకున్న నవ దంపతులు దుర్మరణం

### పుట్రేలలో విషాదం ● కంటతడి పెట్టుకున్న ఎమ్మెల్యే కొలికపూడి

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు కష్టపడి చదువుకున్నారు. పీజీ పట్టాలు అందుకుని ఫార్మా కంపెనీలో కొలువులు సాధించారు. విధుల్లో ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. జీవితాంతం ఒక్కటిగా ఉండాలని భావించారు. పెద్దల అనుమతితో పెళ్లి పీటలు ఎక్కాలనుకున్నారు. వారు నిరాకరించడంతో కొద్దిరోజుల కిందటే తిరుపతిలో వివాహం చేసుకున్నారు. తిరువూరు ఎమ్మెల్యే చొరవతో చివరకు పెద్దలను ఒప్పించారు. ఆషాఢం తర్వాత విందు కార్యక్రమాలు అనుకోవడంతో ఆనందంగా ఉన్నారు. వీరి ఆనందాన్ని తెలంగాణలోని పాశమైలారంలో సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదం ఆవిరి చేసింది. నవ దంపతులను పొట్టన పెట్టుకుంది. ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది.

విజయవాడ/తిరువూరు/విస్సన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల దక్షిణ మాలపల్లికి చెందిన శ్రీరమ్య, కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నికిల్‌రెడ్డి ఫార్మా కంపెనీ మంటల్లో మరణించారు. శ్రీరమ్య తల్లిదండ్రులు రామాల నారయ్య, పద్మ దంపతులు వ్యవసాయ కూలీలు. పెద్దకుమార్తె జోత్స్న భర్తతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. చిన్న కుమార్తె శ్రీరమ్య తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసింది. హైదరాబాద్‌కు వెళ్లి సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగం సంపాదించింది.

ఎమ్మెల్యే కొలికపూడి దంపతులతో శ్రీరమ్య, నిఖిల్‌రెడ్డి (ఫైల్)

విలపిస్తున్న శ్రీరమ్య తల్లిదండ్రులు

### విధుల్లో కలిసిన మనసులు

కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి ఎమ్మెస్సీ చేసి ఇదే కంపెనీలో కెమిస్ట్‌గా చేరాడు. శ్రీరమ్య, అతడు కలిసి ల్యాబ్‌లో పనిచేసేవారు. అలా పెరిగిన పరిచయం ప్రేమగా మారింది. కలిసి పనిచేస్తున్న ఇద్దరూ వివాహ జీవితంలోనూ కలిసే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ తల్లిదండ్రులను ఒప్పించి ఒక్కటవ్వాలని భావించారు. ఈ ప్రేమ విషయాన్ని ఇద్దరూ వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీనికి ఇద్దరు తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఎప్పటికీ అంగీకరించబోమని తేల్చి చెప్పారు. దీంతో ఏం చేయాలో తెలియని ఇద్దరూ చివరికి పెద్దల నిర్ణయాన్ని వ్యతిరేకించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తిరుపతిలో కొద్దిరోజుల క్రితమే పెళ్లి చేసుకున్నారు. అక్కడి నుంచే తాము పెళ్లి చేసుకున్నామన్న విషయాన్ని ఇంట్లో పెద్దలకు ఫోన్ ద్వారా చెప్పారు. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ వెళ్లిపోయారు.

### తిరువూరు ఎమ్మెల్యే చొరవతో ఒప్పుకున్న తల్లిదండ్రులు

పెద్దల నిర్ణయాన్ని ఎదిరించి పెళ్లి చేసుకోవడంతో గొడవలు జరిగే అవకాశం ఉందని భావించిన నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య అక్కడే ఉంటున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఆశ్రయించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్న ఆయన ఇంటికి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. ఎమ్మెల్యే దంపతులు నవ జంటకు నూతన వస్త్రాలను బహూకరించారు. తర్వాత నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య మిగతా 6లో..

# చీకట్లో చకచకా!

## జక్కంపూడి వడ్లకొండపై గ్రావెల్ మాఫియా కన్ను

- రాత్రి వేళ యథేచ్ఛగా తవ్వకాలు
- లారీల్లో భారీగా గ్రావెల్ తరలింపు
- అడ్డుకున్న స్థానికులు.. లెక్కచేయని అక్రమార్కులు
- జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

జక్కంపూడి వడ్లకొండ వద్ద తవ్వకాలు

జక్కంపూడిలో మళ్లీ అక్రమ తవ్వకాలు ఆరంభమయ్యాయి. వడ్లకొండను రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తవ్వుకున్న మాఫియానే మళ్లీ రంగంలోకి దిగి లారీల్లో భారీగా గ్రావెల్‌ను తరలించుకుపోతోంది. స్థానికులు అడ్డుకున్న లెక్కచేయకుండా ముందుకు సాగుతోంది. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని సర్వే నెంబర్ 88లో వడ్లకొండ ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వడ్లకొండను అక్రమార్కులు మిగతా 6లో..

# జ్యోతిషం చూసి పెట్టుబడి

ఏజెంట్ల ద్వారా వచ్చిన డబ్బులను ఎందులో పెట్టుబడిగా పెట్టాలి? ఏ తిథులు కలిసి వస్తాయి? ఏ ఘడియలు నోట్లకట్లను మన మెట్లు ఎక్కిస్తాయి? ఇలా జ్యోతిషం చెప్పించుకోవడానికి అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ప్రత్యేకంగా జ్యోతిష్కురాలిని నియమించుకున్నాడు. తిథులు, వర్జ్యాలు చూసి ఏ రంగంలో పెట్టుబడులు పెట్టాలి అని భవిష్యవాణిని వినిపించిన ఆమెకు కోట్లాది రూపాయలను చెల్లించినట్టు తెలిసింది.

## అద్విక మోసంలో వెలుగులో మరో ఘట్టం

- జ్యోతిషం కోసం ప్రత్యేకంగా సలహాదారు
- ఓ మహిళను నియమించుకున్న ఆదిత్య
- జ్యోతిషం చెప్పినందుకు రూ.కోట్లలో చెల్లింపు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ ఎన్టీఆర్ కాలనీ ఈఎస్ఐ రోడ్డులో అద్విక ట్రేడింగ్ కంపెనీని ఏర్పాటు చేసిన తర్వాత ఆదిత్య తన కార్యాలయంలో మహిళా సిబ్బందిని దండిగానే నియమించుకున్నాడు. ట్రేడింగ్‌కు సంబంధించిన సలహాల కోసం లబ్బీపేటకు చెందిన కీర్తిని సలహాదారురాలిగా నియమించుకున్న విషయం తెలిసిందే. ఆమెకు నెలకు రూ.20లక్షల వరకు జీతం ఇచ్చాడు. ఆదిత్యకు సెంటిమెంట్ చాలా ఎక్కువ. ఏ పని ప్రారంభించినా బలమైన మంచి ఘడియలను చూసుకుంటాడు. ఏజెంట్లు, ఖాతాదారులు పెరిగే సరికి ఆదిత్య బాగా బిజీ అయిపోయాడు. ఈ నేపథ్యంలో ఖాతాదారుల ద్వారా వచ్చిన డబ్బులను ఏ సమయంలో, ఏ తిథిలో మరో రంగంలో పెట్టాలో ఎప్పటికప్పుడు తెలియజేయడానికి ఒక మహిళా జ్యోతిషరాలిని ప్రత్యేకంగా నియమించుకున్నాడు.

**సొంతంగా చెప్తే కలిసిరాదని...**

అద్విక కార్యాలయంలో సిబ్బంది వివరాలు, వారికి చేసిన చెల్లింపుల గురించి పోలీసులు ఆరా తీస్తున్న సమయంలో జ్యోతిష్కురాలి జాతకం బయటపడింది. అద్విక కార్యాలయం ప్రారంభం నుంచి ఆమె ఇక్కడ పనిచేసినట్టు గుర్తించారు. చివరికి ఖాతాదారులకు, ఏజెంట్లకు చెల్లింపులను బకాయి పెట్టిన ఆదిత్య ఆమెకు మాత్రం నోట్ల కట్టలను చేతిలో పెట్టాడు. పోలీసులు ప్రశ్నించినప్పుడు ఆమె చెప్పిన సమాధానాలకు షాక్ తిన్నారు. స్టాక్ మార్కెట్లో షేర్ల కొనుగోలు, అమ్మకాలు, ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆమె ముహూర్తాలను నిర్ణయించేది. ఆదిత్య జాతక చక్రాన్ని దగ్గర పెట్టుకుని ఈ ముహూర్తాలు నిర్ణయించింది. ఆమెకు నెలకు లక్షల్లోనే జీతం ఇచ్చినట్టు తెలిసింది. ఇలా ఆమెకు రూ.2-3 కోట్ల వరకు చెల్లించినట్టు సమాచారం. ఇంత మొత్తంలో వేతనం తీసుకోవడం కంటే సొంతంగా జ్యోతిష్యం చెప్తే ఇంకా ఎక్కువ సంపాదించవచ్చు కదా అని పోలీసులు ప్రశ్నించారు. ఎదుటి వారి నుంచి డబ్బులు తీసుకుని జ్యోతిషం చెప్పకూడదని ఒట్టు పెట్టుకున్నట్టు పోలీసులకు వివరించింది. నెలనెల జీతం తీసుకుని మాత్రమే జ్యోతిష్కం చెప్పాలని నిర్ణయించుకున్నట్టు స్పష్టం చేసింది. ఈ సమాధానంతో పోలీసులకు ఏం చేయాలో తోచలేదు.

# ప్రహసనం..!

## ఇరిగేషన్ కృష్ణా ఈస్టర్న్ కార్యాలయం తరలింపులో తీవ్ర జాప్యం

- గుడివాడలోని డీఈ కార్యాలయం వద్ద సిద్ధమైన ఈఈ కార్యాలయ భవనాలు
- విజయవాడ నుంచి కదిలేందుకు ససేమిరా అంటున్న ఉద్యోగులు
- దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న రైతులు, నీటి సంఘాలు

ఇరిగేషన్ శాఖలో కృష్ణా ఈస్టర్న్ కార్యాలయం బెజవాడ నుంచి గుడివాడ తరలింపు ప్రక్రియ ప్రహసనంగా నడుస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో చేసుకున్న తీర్మానం అమలుకు నోచుకోవడలేదు. అప్పట్లో వసతులు లేవనే సాకుతో ఆగిపోయిన ఉద్యోగులు నేడు నూతన భవనాలు సిద్ధమైనా అడుగు ముందుకు వేయడంలేదు. విజయవాడను వదిలి వెళ్లేందుకు సిద్ధపడటంలేదు. దీంతో రైతులు, నీటి సంఘాలు దశాబ్ద కాలంగా కార్యాలయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

కొత్తగా నిర్మించిన భవనం

(ఆంధ్రజ్యోతి, గుడివాడ): కృష్ణా తూర్పు విభాగం పరిధిలోని రైవస్ కాలువ పూర్తిగా గుడివాడ పరిసరాల గుండా వెళ్తోంది. పక్కనే ఉన్న గన్నవరం నియోజకవర్గం గుండా ఏలూరు కాలువ వెళ్తోంది. ఈ రెండు కాలువల పర్యవేక్షణ చేయాల్సిన కృష్ణా ఈస్టర్న్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం గుడివాడలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈఈ కార్యాలయం విజయవాడలో కొనసాగుతోంది. ఈ క్రమంలో గుడివాడ డీఈ కార్యాలయ పరిధిలో ఈఈ కార్యాలయం కార్యకలాపాల కోసం కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి నూతన భవనాలను నిర్మించారు. రైవస్, ఏలూరు కాలువల పరిధిలోని నీటి సంఘాలు, రైతులు గతంలో పలుమార్లు ఇరిగేషన్ ఎస్ఈ, అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును కలిసి కృష్ణా ఈస్టర్న్ కార్యాలయం గుడివాడలో ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు మిగతా 6లో..

### రైతులకు ఎంతో మేలు

కేఈ డివిజన్ కార్యాలయం గుడివాడకు తరలిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటివరకు రైతులు, రైతు సంఘాలు, నీటి సంఘాల సభ్యులు ఈఈతో పని ఉంటే విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. గుడివాడకు కార్యాలయాన్ని తరలిస్తే రైతులకు, నీటి సంఘాల సభ్యులకు డబ్బుతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. పనులు కూడా వేగంగా జరుగుతాయి.

### ముందుకురాని ఉద్యోగులు

రాష్ట్ర విభజనకు ముందు నుంచే ఇరిగేషన్ ఈఈ కార్యాలయ ఉద్యోగులు విజయవాడలో పాతుకుపోవడంతో గుడివాడకు తరలివెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. దాదాపుగా 70 మంది వరకు ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా విజయవాడ, చుట్టూ పక్కల్లోనే నివాసముంటున్నారు. గుడివాడలో ఈఈ కార్యాలయానికి అవసరమైన భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడికి కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యోగులంతా గుడివాడకు రావాలి, లేదంటే రోజు విజయవాడ నుంచి గుడివాడకు సర్వీస్ చేయాలి. అందుకే కార్యాలయ తరలింపును అడ్డుకుంటున్నారని ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

**నున్నలో తొలి ప్రైవేట్ ఏటీఎస్ కేంద్రం**
● ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలన్నీ ఇక్కడే !
● ట్రాక్, టెస్టింగ్ బ్లాక్, స్టోరేజ్ బ్లాక్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు
8

**చిత్తశుద్ధి ఏదీ?**
» కృష్ణమ్మ చెంతనే ఉన్నా తప్పని నీటి కష్టాలు
» నిర్వహణ లోపం.. అధికారుల నిర్లక్ష్యం
» ఏటా మురిగిపోతున్న రూ. కోట్ల నిధులు
6

# మంటగలిసిన మానవత్వం

ఆస్తుల కోసం అనుబంధాలను మరచి హత్యలకు దిగుతున్నారు. అల్లారు ముద్దుగా పెంచిన బిడ్డలు వ్యసనాలకు బానిసలైతే చూసి తట్టుకోలేక కన్నతండ్రులే కడతేరుస్తున్నారు. మానవత్వం మంటగలిసే ఇలాంటి ఘటనలు ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం రెండు చోట్ల వెలుగుచూశాయి.

## ఆస్తి కోసం వృద్ధురాలి దారుణ హత్య

- పట్టపగలు కర్రతో కొట్టి పెట్రోల్ పోసి నిప్పు
- మనమడి పనే అని అనుమానం!
- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

హైమావతి మృతదేహం



హైమావతి (ఫైల్)

జి.కొండూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెవుటూరు గ్రామానికి చెందిన ఉమ్మడి హైమావతి (70) దారుణ హత్యకు గురైంది. రోజులానే పొలానికి గేదెలు తోలుకెళ్లిన ఆ వృద్ధురాలికి ఇదే అఖరు రోజు అవుతుంది అనుకోలేదు. గేదెలు తోలుతున్న ఆమెను ఒక వ్యక్తి కర్రతో తలపై బలంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో కాలిపోతూ కనిపించింది. కొద్ది సేపటికి అక్కడకు చుట్టు పక్కల వారు, పోలీసులు వచ్చి కాలుతున్న ఆమెపై దుప్పటి కప్పి మంటలను ఆర్పేశారు. మనుమడే ఈపని చేసి ఉంటాడని పోలీసులతో పాటు పలువురు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఆస్తి విభేదాలే కారణమా!**

ఉమ్మడి చలపతిరావు - హైమావతి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. వీరికి 2 ఎకరాలు మెట్ట, ఎకరంన్నర మాగాణి, ఒక భవనం, 50 సెంట్ల ఖాళీ దొడ్డి, కొంత నగదు ఉంది. పిల్లల పెళ్లిళ్లకు రెండెకరాలు మెట్టను అమ్మేశారు. పెద్ద కుమారుడు శివ సత్యేంద్ర కుమార్‌కు హైమావతి తన తమ్ముడు కుమార్తె (మేనకోడలు)ను ఇచ్చి పెళ్లి చేసింది. వీరికి ఒక కుమారుడు వేణు (20), ఒక పాప ఉన్నారు. రెండో కుమారుడు శివకి సొంత కుమార్తె కూతుర్ని ఇచ్చి పెళ్లి చేసింది. వారికి ఒక కుమారుడు. ఈ క్రమంలో కుటుంబంలో గొడవల కారణంగా పెద్ద కుమారుడు భార్య పుట్టిల్లు అయిన కంచికచర్ల మండలం పరిటాల వెళ్లి స్థిరపడిపోయాడు. చిన్న కుమారుడు శివ కామెర్ల వ్యాధితో ఈ మధ్యే చనిపోయాడు. పెద్ద కుమారుడు శివసత్యేంద్రకుమార్‌కు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో కన్నుపోయింది. కాలు, చేతులు దెబ్బతినడంతో మంచానికే పరిమితమయ్యాడు. పెద్దకుమారుడి కొడుకు వేణు ఏసీ మెకానిక్‌గా పని చేస్తూ చెల్లిని చదివిస్తున్నాడు. ఈ క్రమంలో గతవారం క్రితం చెవుటూరులో ఉన్న తన తాత చలపతిరావు, నానమ్మ హైమావతిలతో మాట్లాడి ఆస్తి పంపకాలు చేయాలని ఇంట్లో చాలా మిగతా 6లో..

## కన్నతండ్రే కడతేర్చాడు

### వ్యసనాలకు బానిసైన కొడుకు

- పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయిన కోడలు
- మద్యం కోసం తల్లిదండ్రులతో గొడవ
- కట్టెతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి

ఘటనా స్థలంలో మృతుడు వెంకట నారాయణ

నిందితుడు గోల్ల కృష్ణ

జగ్గయ్యపేట రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కన్న కొడుకును తండ్రి కట్టెతో తలపై మోది హత్య చేసిన ఘటన మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గోల్ల కృష్ణ చిన్న కుమారుడు వెంకట నారాయణ (35) కొంత కాలంగా దుర్వ్యసనాలకు బానిసై తల్లిదండ్రులు, భార్యాపిల్లలపై అమానుషంగా ప్రవర్తిస్తుండటంతో విసుగు చెందిన భార్య తన ఇద్దరు పిల్లలతో నాలుగేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. లారీ డ్రైవర్, మిగతా 6లో..

పేరుకుపోయిన బూడిద నిల్వలు

# చిత్తశుద్ధి ఏదీ?

కృష్ణమ్మ చెంతనే ఉన్నా ఇక్కడి ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడంలేదు. ఓపక్క రాజధాని అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నా అమరావతికి అత్యంత చేరువలోని నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందడం లేదు. తాగునీటి శుద్ధిలో ఇక్కడి అధికారులకు చిత్త శుద్ధి కొరవడటంతో ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యానికి ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్టీటీపీఎస్ బూడిద

- కృష్ణమ్మ చెంతనే ఉన్నా తప్పని నీటి కష్టాలు
- నిర్వహణ లోపం.. అధికారుల నిర్లక్ష్యం
- ఏటా మురిగిపోతున్న రూ. కోట్ల నిధులు
- ఫిల్టర్ బెడ్‌లోకి ఎన్టీటీపీఎస్ బూడిద అవశేషాలు
- పైపులైన్ లీకులతో భారీగా నీరు వృథా
- కార్మికులకు రెండు మాసాలుగా అందని వేతనాలు

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలయ్యే ప్రమాదం పొంచి ఉంది. కలుషిత బారినుంచి తాగునీటి శుద్ధికి నిధులు పుష్కలంగా ఉన్నా అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్ల అవి ఏటా మురిగిపోతున్నాయి. దీంతో 104 ఆవాస ప్రాంతాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాల సరఫరా ప్రహసనంగా మారింది. కలుషిత నీటిని తాగలేక ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు.

## 104 గ్రామాలకు తప్పని నీటి కష్టాలు

ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసిన కృష్ణా జలాలు మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి మున్సిపాలిటీతో పాటు 104 గ్రామాల ప్రజలకు ప్రతి రోజు సరఫరా అవుతుంటాయి. ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్ నుంచి కృష్ణాజలాలను సమీపంలో ఉన్న ఫిల్టర్‌కు మళ్లించి అక్కడ శుద్ధి చేసి ప్రజలకు అందిస్తారు. అయితే ఇక్కడే పెద్ద లోపం జరుగుతుంది. ఎన్టీటీపీఎస్ నుంచి వస్తున్న బూడిద నీరు కూలింగ్ కెనాల్‌లో కలుస్తుంది. దాని దిగువ భాగం నుంచి ఫిల్టర్ బెడ్‌కు తాగునీటిని మళ్లిస్తున్నారు. ఈక్రమంలో తాగునీటిలో బూడిద చేరడంతో ఫిల్టర్ బెడ్స్ సైతం బూడిదతో నిండిపోతున్నాయి. దీంతో తాగునీటి శుద్ధి ప్రహసనంగా మారుతోంది. ఎంత శుద్ధి చేసినా తాగునీటిలో బూడిద అవశేషాలు మిగిలి ఉంటున్నాయి. ఈ క్రమంలో కృష్ణా జలాలు వాటి సహజసిద్ధ రుచినే కోల్పోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి శుద్ధి అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతున్నది. మరోపక్క పైపులైన్లకు లీకులు ఏర్పడి వాటిని సకాలంలో సరిచేకపోవడం వల్ల నీరు వృథాగా పోతోంది.

ఫిల్టర్ బెడ్

తాగునీటి శుద్ధి ప్లాంట్

నీటి పైప్‌లైన్లు

## ఏటా మురిగిపోతున్న రూ.2 కోట్ల నిధులు!

గ్రామీణ రక్షిత మంచినీటి పథకం సవ్యంగా అమలు చేసేందుకు ప్రతి ఏటా రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేస్తారు. వాటితో ఫిల్టర్‌బెడ్ మెయింటినెన్స్, పైపులైన్ మరమ్మతులు, ఇతర పనులు నిర్వహిస్తారు. అయితే అధికారులు పూర్తి స్థాయిలో నిధులను ఖర్చు చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో ఏటా రూ.2 కోట్ల వరకు మెయింటినెన్స్ నిధులు మురిగిపోతున్నాయి. 2023-24లో చేసిన పనులకు ఇప్పటి వరకు ఎస్టిమేట్స్ వేయలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

## కూలింగ్ కెనాల్ ఎగువ భాగం నుంచి నీరు తీసుకోవాలి

ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో ప్లాంట్ నుంచి వచ్చి బూడిద నీరు కలిసే దిగువ భాగం నుంచి కాకుండా ఫిల్టర్ బెడ్‌లోకి ఎగువ భాగం నుంచి నీరు తీసుకుంటే తాగునీటిలో బూడిద అవశేషాలు కలిసే అవకాశం ఉండదు. ఇందుకు కోట్ల రూపాయాలు ఖర్చవుతుంది. దీనిపై ఎన్టీటీపీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పైపులైన్ మార్చి కూలింగ్ కెనాల్‌లో బూడిద నీరు కలిసే దిగువ భాగం నుంచి కాకుండా ఎగువ భాగం నుంచి తాగునీరు ఫిల్టర్ బెడ్‌కు మళ్లించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్మికులకు అందని వేతనాలు

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పనిచేసే కార్మికులకు మూడు మాసాలుగా వేతనాలు అందడం లేదు. కాంట్రాక్టు సంస్థ కింద పనిచేసే కార్మికులకు సకాలంలో వేతనాలు అందక వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. కాంట్రాక్టర్‌కు కార్మిక యూనియన్ నోటీసులు ఇవ్వడం జరిగింది. కార్మికులు బంద్ పాటిస్తే 104 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదు.

జి.కొండూరులో వృథాగా పోతున్న నీరు

## వృథాగా పోతున్న నీరు

ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్ నుంచి మైలవరం నియోజకవర్గం వరకు వేసిన తాగునీటి పైపులైన్‌కు పలుచోట్ల లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. అయినా ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం గమనార్హం. జి.కొండూరు పులివాగు వంతెన పక్కన కొత్తూరు గొల్లగూడెం వెళ్లే రహదారి పక్కన పైప్‌లైన్‌ల లీకుతో గతేడాది నుంచి భారీగా నీరు వృథా అవుతోంది. ఇప్పటి వరకు దానిని సరి చేయించే నాథుడు లేడు.

## గొల్లపూడి ఈఎన్‌సీలో ఆలస్యం!

గ్రామీణ రక్షిత మంచి నీటి సరఫరా పథకం సవ్యంగా అమలు కాకపోవడానికి.. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందక పోవడానికి గొల్లపూడిలో ఉన్న ఈఎన్‌సీ కార్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తున్నది. చేసిన మెయింటినెన్స్ పనులకు సకాలంలో ఎస్టిమేట్స్ వేసి బిల్లులు చెల్లిస్తే అటు కాంట్రాక్టు సంస్థకు బిల్లులు అందడంతో పాటు కొత్త పనులు చేపట్టే వీలుంటుంది. ఇటు కార్మికులకు, సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించవచ్చు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లోపాన్ని సరిచేసి శుద్ధిచేసిన స్వచ్ఛమైన కృష్ణాజలాలను ప్రజలకు అందించాలని పలువురు కోరుతున్నారు.

## నిధులు మిగులుతాయ్..

ఏటా స్కీమ్ మెయింటినెన్స్‌కు రూ.4.5 కోట్లు జనాభా ప్రాతిపదికన నిధులు వస్తాయి. నీరు ఇచ్చే ప్రాతిపదికన ఖర్చులుంటాయి. ఈ క్రమంలో ఏటా రూ.2 కోట్లకు పైగా నిధులు ప్రభుత్వానికే మిగులుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారమే నిధులు ఇస్తున్నారు. అయితే ఈ 14 ఏళ్లలో కొండపల్లి మున్సిపాలిటీతో కలిసి మైలవరం నియోజకవర్గంలోని 104 ఆవాస ప్రాంతాల్లో జనాభా భారీగా పెరిగింది. ఒక మనిషికి సగటున 55 లీటర్లు మాత్రమే ఇస్తున్నారు. అత్యధిక గ్రామాల్లో ఫ్లోరైడ్, సాల్ట్ వాటరే ప్రజలు దిక్కవుతుంది. ఈ క్రమంలో మనిషికి సగటున 80 లీటర్ల వరకు కృష్ణా జలాలు అవసరం ఉంది. మెయింటినెన్స్‌కు వచ్చే నిధులు మిగిల్చి మురగబెట్టే బదులు నీటి విడుదల పెంచితే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

- ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ దయానంద్

అమ్మవారికి సారె సమర్పించిన మహిళా భక్తులు

## దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన భక్తబృందాలు

ఇంద్రకీలాద్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ చేసి మొక్కులు తీర్చుకోవడానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తబృందాలు తరలివచ్చాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో భక్త బృందాలు సారె సమర్పణ చేశాయి. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఈవో వీకే శీనానాయక్ అధికారులను ఆదేశించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం మహామండపం 6వ అంతస్తులో భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు. అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు.

### వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై ఉపాలయంలో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లీలా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారికి షష్టి తిథి జన్మతిథి రోజున విశేష అర్చనలు చేస్తారు. ఈ క్రమంలో కల్యాణోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. భక్తుల ఈతిబాధలు, గ్రహ బాధలు తొలగటానికి, వివాహాది శుభకార్యాల కోసం సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన మేలు చేకూరుస్తుందని చెబుతారు. మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం మేళ తాళాల మధ్య భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదికపై ఉంచి కల్యాణాన్ని జరిపించారు.

### వారాహి నవరాత్రుల ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జూన్ 26 నుంచి వారాహి గుప్తనవరాత్రుల పూజలు జరుగుతున్నాయి. అనుష్టానపరులు, దేవీ ఉపాసకులు ప్రత్యేకంగా పూజలను నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారిని పూజించటం ద్వారా పంటలు సమృద్ధిగా పండి రైతులు, భక్తులు సంతోషంగా వర్ధిల్లుతారని పండితులు చెబుతున్నారు. యాగశాలలో మంగళవారం ఉదయం అమ్మవారికి పంచ వారాహి మంత్రములతో జప, హోమాలు శాస్త్రోక్తంగా ఏకాంతసేవలు నిర్వహించారు. 4న శుక్రవారం పూర్ణాహుతి, వారాహి నవరాత్రి ఉత్సవాల సమాప్తి జరుగుతుందని ఈవో శీనానాయక్ తెలిపారు.

మాధవ్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

### దుర్గమ్మను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రకీలాద్రి: ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పి.వి.ఎన్.మాధవ్ కుటుంబసమేతంగా మంగళవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మాధవ్‌కు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ ఉత్తమ్ చంద్ బండారీతోపాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పొట్టి శ్రీహరి, నాయకులు సీకూ సింగ్, తదితరులు ఉన్నారు.

## మంచిని ప్రచారం చేద్దాం : బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ప్రజలకు చేసిన మంచిని పార్టీశ్రేణులు ప్రచారం చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పోరంకి పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఎమెల్యే మాట్లాడారు. సుపరిపాలనలో తొలిఅడుగు సమిష్టిగా కష్టపడి పనిచేస్తేనే సాధ్యమైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తు.. అన్ని వ్యవస్థలను గాడిన పెడుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, లోకేష్‌లకు దక్కుతుందన్నారు.

ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులు

## వైద్య విద్యార్థుల అరెస్ట్

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యనభ్యసించి రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ చేసిన తమకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పర్మినెంట్ సర్టిఫికేట్ ఇవ్వకుండా తిప్పిస్తున్నారని వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఎదుట రెండురోజులగా నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యవిద్యార్థులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇంటర్న్‌షిప్ పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా సర్టిఫికేట్ ఇవ్వడానికి ఎందుకు విముఖత చూపుతున్నారో అర్థం కావడం లేదని వారు వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్‌కు తమ సమస్యను చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికను గర్భవతిని చేసిన కేసులో..

## 20 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా

విజయవాడ లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలతో బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలో ఫిర్యాది కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఫిర్యాది భర్త అనారోగ్యంతో చనిపోవడంతో అప్పటి నుంచి ఆమె కుమారుడు, కూతురుతో కలిసి ఉంటోంది. ఆమె హోటల్‌లో పనిచేస్తుంటుంది. ఈ క్రమంలో సదరు బాలికకు నెలసరి రావడంలేదని ఆసుపత్రిలో చూపించగా బాలిక గర్భవతి అని వైద్యులు చెప్పడంతో బాలికను నిలదీయగా పదో తరగతి చదివే సమయంలో ఆటోడ్రైవర్ యడవల్లి కార్తీక్ పరిచయమై ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా లొంగదీసుకొన్నట్టు తల్లికి చెప్పింది. బాలిక తల్లి కార్తీక్‌ను పిలిచి అడుగ్గా బాబు పుట్టాక ఇంటిలో చెప్పి ఒప్పిస్తానంటూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్టు, బాబు పుట్టిన తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసినట్టు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడి గురించి విచారించగా అప్పటికే అతడికి పెళ్లి అయినట్టు తెలిసిందని, తన కూతురిని మోసం చేసి గర్భవతిని చేసిన నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బాలిక తల్లి ఇబ్రహీంపట్నం పోలీసులకు 2023 నవంబరులో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ వి.కృష్ణవేణి 11మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్ట పరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.

## కలెక్టర్ పేషీతో చెప్పిస్తావా?

- నేను నీ దగ్గరకు రాను.. నువ్వే రా.. ఇదే నీకు శిక్ష
- జీజీహెచ్‌లో రోగిపై ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ చిందులు
- డాక్టర్స్ డే రోజున వైద్యుడికి కొరవడిన సేవాభావం

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ డే నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులనుద్దేశించి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గొప్పగా వ్యాఖ్యలు చేశారు. డాక్టర్లు సేవాభావం, మానవత్వం కలిగి ఉండాలని హితబోధ చేశారు. డాక్టర్లు వైద్యో నారాయనో హరి అనే మాటకు మంచి పేరు తీసుకురావాలని పొగిడారు. అది జరిగిన కొంతసేపటికే జీజీహెచ్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పృధ్వీ అనే వ్యక్తి ఆసుపత్రిలో ఆర్థో విభాగంలో చికిత్స చేయించుకోవడానికి వచ్చాడు. అదే సమయంలో సదరు రోగి గురించి కలెక్టర్ పేషీ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ హెచ్‌వోడీకి ఫోన్‌చేసి రోగిపై కొద్దిగా కేర్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ అహం దెబ్బతిని "కలెక్టర్ పేషీతో చెప్పిస్తావా.. ఈరోజు నుంచి నీకు వైద్యం కావాలంటే ఫస్ట్‌ఫ్లోర్‌కు రా.. ఇదే నీకు శిక్ష" అంటూ చిందులు వేశారు. చేతికి రెండు చోట్ల రిబ్స్ విరిగి ఇబ్బందిపడుతున్న రోగిపై దయ లేకుండా ఆయన వ్యవరించారని అక్కడున్న రోగులు చెప్పుకుంటున్నారు. సదరు ఆర్థో హెచ్‌వోడీ బంధువు ఎన్టీఆర్ జిల్లాలో ఒక ఎమ్మెల్యే కావడం గమనార్హం. కలెక్టర్ నుంచి ఫోన్ వస్తేనే ఈ విధంగా స్పందిస్తే సామాన్య రోగుల పరిస్థితి ఏంటని అక్కడున్న వారు గుసగుసలాడుకుంటున్నారు.

## కన్నతండ్రే కడతేర్చాడు

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ కూలీగా పనులు చేస్తూ ఆవారాగా తిరిగే వెంకట నారాయణ మద్యం కోసం డబ్బులు కావాలని తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం తాగి తండ్రితో గొడవకు దిగటంతో పక్కనే ఉన్న కట్టె కర్రతో కుమారుడి తలపై మోదగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అల్లారు ముద్దుగా పెంచి..

గోళ్ల కృష్ణ, నాగేంద్రమ్మలకు నలుగురు సంతానం. చిన్నవాడైన వెంకట నారాయణ అంటే ఇద్దరికి ఇష్టం. పెద్ద కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు వివాహాలు కాగా వారు కుటుంబాలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. వెంకట నారాయణకు 15 ఏళ్ల క్రితం కృష్ణవేణితో వివాహం చేయగా, కుమారుడు రుషివర్ధన్, కుమార్తె రేష్మ ఉన్నారు. వెంకట నారాయణ వ్యసనాలకు బానిస కావటంతో భార్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కేంద్రంలో ఉంటూ కుమార్తెను మణుగూరులోని హాస్టల్‌లో ఏడో తరగతి చదివిస్తుండగా, కుమారుడు ఆమె వద్దనే ఉంటూ ఏడో తరగతి చదువుతున్నాడు. డబ్బుకోసం తల్లిదండ్రులను విసిగిస్తుండటంతో ఇటీవల చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదుచేయగా, కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పూటుగా మద్యం తాగి తండ్రితో వాగ్వాదానికి దిగటంతో పక్కనే ఉన్న కట్టెతో తలపై మోదటంతో వెంకట నారాయణ మృతి చెందాడు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాన్ని చూసి తల్లి, భార్య, కుమార్తె, కుమారుడు కన్నీరుమున్నీరయ్యారు.

## చీకట్లో చకచకా!

(5వ పేజీ తరువాయి)

ఇష్టానుసారం తవ్వేశారు. కోట్లాది రూపాయల మట్టిని దర్జాగా తరలించుకుపోయారు. అప్పట్లో మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ వంటి అధికార వ్యవస్థలన్నీ అక్రమార్కులకు సహకరించటంతో.. హద్దూ, అదుపు లేకుండా తవ్వకాలు జరిగిపోయాయి. గతేడాది బుడమేరుకు వరదలు వచ్చిన సమయంలో వర్షాల కారణంగా వడ్లకొండలో కొంత భాగం గ్రావెల్ పెళ్లలు విరిగి పడ్డాయి. వీటిని కూడా రాత్రికి రాత్రి తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అక్రమ సంపాదనకు అవకాశం లేకపోవటంతో అక్రమార్కులు అదనుచూసి మళ్లీ ఇప్పుడు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. వడ్లకొండను లక్ష్యంగా చేసుకుని గ్రావెల్‌ను తన్నుకుపోతున్నారు. ఇప్పుడు కూడా మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ వంటి వ్యవస్థలను అడ్డుపెట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. రాత్రికి రాత్రి పెద్ద సంఖ్యలో పొక్లెయినర్లతో గ్రావెల్‌ను తవ్వి తరలించేస్తున్నారు. స్థానికులు అడ్డుకున్నా తగ్గేది లేదంటూ తవ్వేస్తున్నారు. దీంతో గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మైలవరం మండలం వెలగలేరు, జి.కొండూరు మండలం చేగిరెడ్డిపాడు రెవెన్యూ పరిధిలో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందాయి.

## ప్రహసనం..!

(5వ పేజీ తరువాయి)

సమర్పించారు. వసతులు లేవనే సాకుతో కార్యాలయ తరలింపును అప్పట్లో ఉద్యోగులు అడ్డుకున్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో జలవనరుల శాఖను పూర్తిగా వదిలేశారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో అడిగేవాళ్లు లేకపోవడంతో కార్యాలయ తరలింపు ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి సంఘాలు పునఃజీవం పోసుకున్నాయి. దీంతో గుడివాడకు కేఈ ఈఈ కార్యాలయ తరలింపు డిమాండ్ తిరిగి తెరపైకి వచ్చింది.

### రాష్ట్ర విభజన సమయంలో తీర్మానం

రాష్ట్ర విభజన సమయంలో ఇరిగేషన్ శాఖలో కృష్ణా ఈస్ట్రన్ డివిజన్‌ను గుడివాడలో ఏర్పాటు చేయాలని తీర్మానించుకున్నారు. ఇది ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ అయిన రాష్ట్ర విభజన తర్వాత తప్పనిసరైంది. అప్పట్లో వసతులు లేవనే సాకుతో ఉద్యోగులు కార్యాలయ తరలింపును అడ్డుకున్నారు. నేడు పూర్తిస్థాయిలో భవనాలు సిద్ధంగా ఉన్నాయి.

## చెదిరిన కలలు

(5వ పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించారు. రెండు కుటుంబాలను కూర్చోబెట్టి మాట్లాడారు. జరిగిన విషయాన్ని వదిలిపెట్టి పిల్లలు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాలని రెండు కుటుంబాలను ఒప్పించారు. దీంతో ఆషాఢం వెళ్లిన తర్వాత విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాలని రెండు కుటుంబాలు భావించాయి. ఇరు కుటుంబాలు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా తాము తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించడంతో నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య ఆనందంలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన రోజున శ్రీరమ్య ఉదయం పది గంటల షిఫ్టునకు వెళ్లాల్సి ఉండగా తెల్లవారుజామున ఐదు గంటల షిఫ్టునకు వెళ్లింది. అప్పటికే నిఖిల్‌రెడ్డి విధుల్లో ఉన్నాడు. ఆ ఇద్దరు ఎక్కడ కలుసుకుని ఒక్కటయ్యారో అక్కడే జరిగిన ప్రమాదంలో ఇద్దరూ సజీవ దహనమవ్వడం అందరిని కలచివేసింది. కాగా, ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి వెంటనే హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. యువజంట మరణంపై కన్నీరు పెట్టుకుంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు.

## మంటగలిసిన మానవత్వం

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందిగా ఉందని చెప్పాడు. వారు వినకపోవడంతో జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వాపోయాడు. ఆస్తి వివాదం సివిల్ మేటర్ అని కోర్టులో తేల్చుకోవాలని పోలీసులు సలహా ఇచ్చి అతడ్ని పంపేశారు. ఆస్తి పంచలేదనే కోపం పెంచుకున్న వేణునే నానమ్మ హైమావతిని హత్య చేసి ఉంటాడనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఘటన జరిగిన తర్వాత వేణు సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అవ్వడం, కనపడకుండా పోవడంతో ఇది అతని పనే అని అందరూ గట్టిగా చెబుతున్నారు. పోలీసులు మాత్రం ఇంకా హత్య ఎవరు చేశారో నిర్ధారించలేదు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి మైలవరం సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌కు చేరుకొన్న హాజీలు

## ఆంధ్రప్రదేశ్ హాజీలకు ఘన స్వాగతం

- రెండు విమానాల్లో హైదరాబాద్‌కు చేరుకున్న 529 మంది

కృష్ణలంక, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 529 మంది హాజీలు రెండు ప్రత్యేక విమానాల్లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. మక్కా నుంచి నేరుగా హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న హాజీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, మైనార్టీ సలహాదారులు షరీఫ్, హజ్ కమిటీ ఈవో, మెంబర్ల అధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకొన్న హాజీలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీ, ఎన్ఎండీ ఫరూక్, ముస్తాక్ అహ్మద్‌లు శుభాభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరపున హాజీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలియజేశారు. హజ్ కమిటీ మెంబర్లు మహబూబ్ బాషా, బాబా ఫక్రుద్దీన్, మన్సూర్ అలీఖాన్, మిర్జా ఆబిద్ హుస్సేన్, ఆసిఫ్ వలి తదితరులున్నారు.

## ఇగ్నో రీజనల్ డైరెక్టర్‌గా సుమలత బాధ్యతల స్వీకారం

వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్‌గా కె.సుమలత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రీజనల్ డైరెక్టర్ డీఆర్ శర్మ సోమవారం పదవీ విరమణ చేశారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రానికి 2019 అక్టోబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు సుమలత రీజనల్ డైరెక్టర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాంతీయ కేంద్రం పరిధిలోని విద్యార్థులకు మెరుగైనసేవలు అందిస్తామని, దూరవిద్యను ఎక్కువ మందికి చేరువ చేయనున్నట్టు తెలిపారు. ప్రాంతీయ కేంద్రం పరిధిలో అధ్యయన కేంద్రాలు లేని జిల్లాల్లో నూతన అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పలు నూతన కోర్సులను ఆయా అధ్యయన కేంద్రాలలో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సుమలతకు డిప్యూటీ డైరెక్టర్లు ప్రసాద్ బాబు, శరత్‌చంద్ర, అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ మమత, డిప్యూటీ రిజిస్ట్రార్ బాలచందర్, ఇగ్నో సిబ్బంది అభినందనలు తెలిపారు.

## బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం అవివేకం

వన్‌టౌన్ : పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నం చేయడం అవివేకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు గోదావరి వరదల సమయంలో, మామూలు సమయాల్లో సుమారు మూడు వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్న విషయం అందరికీ తెలిసిన విషయమన్నారు. గోదావరిలో వృథాగా పోతున్న వేల టీఎంసీలలో కేవలం 200 టీఎంసీలు శ్రీశైలం దిగువన ఉన్న బనకచర్లకు తరలిస్తే తద్వారా రాయలసీమ ప్రాంతం, పోలవరం నుంచి, బనకచర్ల వరకు దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని దూరదృష్టితో సీఎం చంద్రబాబు మానస పుత్రికగా భావించి ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేయటం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు వలన అనేక విధాలుగా లబ్ది చేకూరుతుందని ఆయన వివరించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుని కేవలం రాజకీయ కారణాలతో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు త్వరలోనే ప్రాజెక్టుకు అనుమతులు తెస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 96,104, 115
చికెన్ విత్ స్కిన్ 184
చికెన్ స్కిన్‌లెస్ 194

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## ఎంబీవీకేలో ఉపాధి శిక్షణ తరగతులు 5 నుంచి

గవర్నర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 5నుంచి వివిధ కోర్సుల్లో శిక్షణకు కొత్త బ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి టి.క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, సీ లాంగ్వేజ్, డీటీపీ, ఫొటోషాప్‌లో శిక్షణ కాలం 2 నెలలు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 90145 41958, 9490098042లో సంప్రదించాలని కోరారు.

# ‘సుపరిపాలనలో తొలి అడుగు’ విజయవంతం చేయండి

### ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు

భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. తూర్పు పరిధి గురునానక్ కాలనీలోని న్యాక్ కల్యాణమండపంలో మంగళవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు (ఇంటింటి కార్యక్రమం)లో భాగంగా నియోజక వర్గ పార్టీ నేతలు, కూటమి నేతల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథులు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని తెలియజేయాలని తెలిపారు. ప్రస్తుతం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు భవిష్యత్తులో అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, టీడీపీ నేతలు వెలగపూడి శంకర్‌బాబు, ఎర్రబోతు రమణ, పరుచూరి ప్రసాద్, వల్లభనేని సతీష్, కార్పొరేటర్లు, నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యులు, నేతలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

## అగ్నిప్రమాదాల నిరోధంపై అవగాహన

లబ్బీపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బందరురోడ్డులోని ముగ్ధ షోరూమ్, సెయింట్ జాన్స్ స్కూల్‌లో మంగళవారం వీఎంసీ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సముదాయాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు, ప్రమాదం జరిగినపుడు మంటలను ఏవిధంగా నిరోధించాలి, ఎటువంటి పరికరాలు వాడాలి, ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ అలారం ఎలా వస్తుంది తదితర అంశాలపై అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# కుటీర పరిశ్రమలపై అవగాహన

మాట్లాడుతున్న గద్దె క్రాంతికుమార్

పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలకు కుటీర పరిశ్రమలపై అవగాహన ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎంపీ కేశినేని శివనాథ్ కృషి చేస్తున్నారని ఎన్ఐఆర్‌డీ జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్‌వర్మ, టీడీపీ నాయకులు గద్దె క్రాంతికుమార్‌లు తెలిపారు. తూర్పు నియోజక వర్గం 11వ డివిజన్ టీడీపీ నాయకులు నాదెండ్ల రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం కనకమేడల రవీంద్ర కమ్యూనిటీ హాల్లో తొమ్మిది స్లమ్ ఫెడరేషన్‌లో ఉన్న డ్వాక్రా సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశక్తి ఉన్న మహిళల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు మహిళాభ్యున్నతికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, కె.మీనాక్షి, ఉమామహేశ్వరి, ప్రసాద్ పాల్గొన్నారు.

### పరిశోధన నిమిత్తం ఐటీఐ కాలేజీకి కారు అందజేత

భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని మోటార్ మెకానిక్ విభాగానికి పరిశోధన నిమిత్తం హ్యూండాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సీఎస్ఆర్‌ఫండ్స్‌లో భాగంగా న్యూఐ20 కారు అందజేసినట్లు ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# విజయవాడ ఖ్యాతిని పెంచే బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేయండి

### టైటిల్ ఎంపిక కమిటీ సభ్యుల సమావేశంలో కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, పర్యాటక, నదులను దృష్టిలో పెట్టుకొని విజయవాడ ఖ్యాతిని పెంచే బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేయాలని నగర కమిషనర్, కమిటీ చైర్మన్ ధ్యానచంద్ర సభ్యులకు సూచించారు. విజయవాడ బ్రాండ్ ఇమేజ్ పోటీల టైటిల్ ఎంపిక కమిటీ సమావేశం మంగళవారం నగర కమిషనర్ ధ్యానచంద్ర చాంబర్‌లో జరిగింది. పోటీలకు వచ్చిన 229 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఒక్కరూ టాప్ 10ను ఎంపిక చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులే కాకుండా వినూత్నంగా ఉన్న ఆలోచనలను స్వాగతించాలని కమిటీలో ఉన్న ప్రతి ఒక్క సభ్యులు వినూత్నమైన పద్ధతిలో ఎంపిక చేయాలన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటక, నదులను దృష్టిలో పెట్టుకొని టాప్ 10తో నివేదిక సమర్పించాలన్నారు. ముఖ్యంగాఎంపిక చేసేటప్పుడు, బ్రాండ్ ఇమేజ్‌లలో ప్రస్తుతం ఇతర ప్రదేశాలకు ఆ పేరు లేకుండా చూసుకోవాలని సూచించారు. తదుపరి సమావేశానికి ప్రతి ఒక్కరూ వచ్చిన టాప్10లో 5 సెలెక్ట్ చేసి కలెక్టర్‌కు నివేదికను సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ ఏ శ్రీ శిల్ప, అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్స్ నటరాజన్ షణ్ముగం, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ భాస్కరరావు, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ కేవీ రమణరావు, మోహన్‌లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

# గురువులను సత్కరించడం గొప్ప అనుభూతి

### డాక్టర్స్ డే కార్యక్రమంలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏవై రావు

వైద్యులను సత్కరించిన సిద్ధార్థ మెడికల్ కాలేజీ సిబ్బంది

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కళాశాలను గొప్ప స్థాయికి తీసుకువచ్చిన ఘనత తమ గురువులు, వైద్యులు, నాయకులదేనని ప్రిన్సిపాల్ ఏ.వై.రావు తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన డాక్టర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏటా డాక్టర్స్ డే కార్యక్రమం నిర్వహించి గురువులను తలచుకుని, సత్కరించడం గొప్ప అనుభూతని తెలిపారు. గురువులు చూపిన మార్గం దీపస్తంభం లాంటిదన్నారు. ప్రముఖ డాక్టర్లు జి.ఈశ్వర్ (జనరల్ మెడిసిన్), టి.జె. ప్రసన్న కుమార్ (ప్రముఖ సర్జన్), కె.ప్రభాదేవి (ప్రసూతి, గైనకాలజీ) అందించిన సేవలు, సమాజానికి చూపిన నిబద్ధత యువతకు ప్రేరణగా నిలుస్తుందని నెఫ్రాలజిస్ట్ ఎన్.అమ్మన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురి వైద్యుల సేవలను గుర్తు చేసుకుంటూ కాలేజీ సిబ్బంది వారికి సన్మానం చేశారు.

NAVRANG A/c
RUNNING VERY SUCCESSFULLY
THRILL AND DANGERS
CAR RACES WONDERFULLY
DONE BY BRAD PITT

తెలుగు 2D -రోజూ 4 ఆటలు
11:30 AM, 2-30 PM
6:30 PM, 9-30 PM
Online Tickets Available in "BOOK MY SHOW"

విజయ్‌కృష్ణను సన్మానిస్తున్న సీనియర్ సిటిజెన్ కార్యవర్గం

### సీనియర్ సిటిజెన్ అసోసియేషన్‌కు రూ.లక్ష విరాళం

పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పటమట సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మంగళవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు విజయ్‌కృష్ణ తన తండ్రి రామ్మోహన్ జ్ఞాపకార్థం రూ.లక్ష అసోసియేషన్‌కు విరాళంగా అందించారు. అసోసియేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతుగా ఈ విరాళం ప్రకటించినట్లు ఆయన తెలిపారు. దాతను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సూర్యదేవర పాపారావు, కొండపల్లి మాధవరావు, వసంత శివశంకర్రావు, సభ్యులు పాల్గొన్నారు.

# వీధికుక్కల బెడద.. పట్టించుకోని అధికారులు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి : నగరంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మూడో డివిజన్‌లోని నాగార్జునగర్, విజయలక్ష్మి కాలనీ, కరెన్సీనగర్ కాలనీ, శ్రీరామచంద్రనగర్, కనకదుర్గనగర్, తదితర కాలనీల్లో వీధి కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. ఈ కాలనీల్లో మెయిన్, అంతర్గత రోడ్డులో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలన్ని భయానికి గురిచేస్తున్నాయి. కాలనీలోని ఖాళీ స్థలాలను నివాస స్థావరంగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో కుక్కలు పెద్దగా అరుస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయంలో వాహనదారుల వెంట పడుతున్నాయి. ఈ సందర్భంలో వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. దీంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రామలింగేశ్వరనగర్:** వీధి కుక్కలు, పిచ్చి కుక్కల తాకిడి తట్టుకోలేక పటమట, అంబేడ్కర్ నగర్, లంబాడీపేట, సత్యనారాయణ నగర్, కాల్వగట్టువాసులు బెంబేలెత్తుతున్నారు. వీధులలో నడవాలంటేనే ముఖ్యంగా రాత్రి వేళలో విధి నిర్వహణ పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లే సమయంలో బిక్కుబిక్కుమంటూ వెళుతున్నామని, ఎటువైపు నుంచి ఏ కుక్క దాడి చేస్తుందోనని భయంగా ఉందని ఆయా ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు ఆడుకునే సమయంలో వీధి కుక్కలు వారి ప్రాణాలు తీస్తాయేమోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

## హ్యాకథాన్ విజేతలు ఆదిత్య విద్యార్థులు

విజేతలను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్స్ క్లబ్ హ్యాకథాన్ పోటీల్లో విజయవాడ ఆదిత్య కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి రూ.30 వేలు బహుమతిని గెలుచుకున్నారు. ఈ పోటీల్లో బీఎస్సీ మూడో ఏడాది విద్యార్థులు బి.తేజశ్రీ, ఎ.భాస్కర రెడ్డి, లోకేష్‌లు విజేతలుగా నిలిచారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు తెలియకుండా మొబైల్‌లో వాడే ఏ సమాచారమైనా తల్లిదండ్రులకు తెలిపే విధంగా రూపొందించిన సేవ్ గార్డియన్ అనే ప్రదర్శన బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు. విజేతలను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ రాజ్‌కుమార్, అధ్యాపకురాలు సుల్తాన, చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డిలు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

కృష్ణలంకలో, పటమటలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

### దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా

# ముఠా కార్మికుల ప్రచారం

గవర్నర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె. దుర్గారావు కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. మంగళవారం 23వ డివిజన్ ఆలీబేగ్ వీధిలో ముఠా కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి బడా కంపెనీలకు అనుకూలమైన కార్మిక చట్టాలు తేవడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. బ్రహ్మయ్య, ఎం. సీతారాములు, సీహెచ్ నరసింహులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో అందుబాటులోకి శాంపిల్ బిల్డింగ్

### రూ.7లక్షలతో స్టేజ్, హ్యాండ్‌వాష్, పెయింట్ తదితర పనులు

స్టేజి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్ ఫొటో)

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: రాణిగారితోట 17వ డివిజన్‌లోని శాంపిల్ బిల్డింగ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. డివిజన్‌లోని పేద,మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు నిర్మించిన శాంపిల్ బిల్డింగ్‌లో అరకొర వసతులతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంలో ఈ భవనాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించడంతో రూ.7లక్షల అంచనాలతో పనులు ప్రాంరంభమయ్యాయి. బిల్డింగ్ శ్లాబ్ ఫ్లోరింగ్, పెయిటింగ్స్‌తో పాటు ప్రధానంగా భవనం లోపల స్టేజ్ నిర్మాణం, వాష్ బేషిన్ల నిర్మాణంతో పాటు ఇతర ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే స్థానికంగా ఉన్న వారికి అన్ని వసతులతో శుభకార్యాల కోసం భవనం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను డివిజన్ టీడీపీ నాయకులు రాయి రంగమ్మ, శ్రీనివాస చౌదరి తదితరులు పరిశీలించారు.

**ఎమ్మెల్యే చొరవతోనే..**

శాంపిల్ బిల్డింగ్ అభివృద్ధి పనులు చకచక జరగడానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సహకారం ఎంతో ఉంది. ఆయన చొరవతోనే అధికారులు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తున్నారు.

కొప్పుల శ్రీనివాస చౌదరి,
(టీడీపీ డివిజన్ నాయకులు)

రోడ్డు ఆక్రమించి నిర్మించిన మెట్లు, అరుగులు

# రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు

### ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: పదిహేనవ డివిజన్ రామలింగేశ్వరనగర్ శివగంగాభవాని వీధి చివర కొంతమంది ఇంటి యజమానులు రోడ్డును ఆక్రమించి మెట్లు నిర్మించేస్తున్నారు. దానికి తోడు ఇంటి ముందు కార్లు తదితర వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలుగా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఆ రోడ్డులో కార్లు, ఆటోలు,

పెద్దవాహనాలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించి నిర్మించిన మెట్లను తొలగించి ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

**GOLD FINANCE**
బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235544

**వధువు కావలెను**
పద్మశాలి-47 సం.లు/Govt/1L/గుంటూరు, పద్మశాలి-38 సం.లు/బిజినెస్/1L/గుంటూరు, రజక-40 సం.లు/SWE/1.50/హైదరాబాద్ లేట్ వరులకు అందమైన వధువులు కావలెను. కుల పట్టింపు లేదు. వాట్సాప్: 76739 26517
AJB- 235601

**HOUSE FOR SALE**
నున్న టీచర్స్ కాలనీలో 115 గ.లో 2 ఇళ్లు & 96 గ.లో 2 ఇళ్లు & 54 గ.లో ఇల్లు అమ్మకం. సంప్రదించండి: ✆ 98669 35667 / 93929 47777
AJB- 698

**PLOT FOR SALE**
ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ప్లాట్స్ ‘తక్కువ’ ధరలో నందిగామ దగ్గరలో, ఇళ్ల మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు & కంచికచర్ల దగ్గర ఔటర్ రింగ్ రోడ్‌కు, హైవేకి దగ్గరలో CRDA ప్లాట్స్. సెల్: 88018 03689
AJB - 142

కంచికచర్ల - పేరకలపాడు, HYD హైవేకి & అమరావతి ORR కి దగ్గర, తారురోడ్డు ఫేస్‌తో, CRDA & పంచాయతీ ప్లాట్లు. సెల్ నెం. : 73372 04349
AJB - 143

**WANTED TEACHERS**
TEACHERS (Ladies) with U.G or P.G Qualification and good English. And Teacher for Science in High School. COASTS HIGH SCHOOL, VJA-I. Cont: 81799 90508, 92913 98877
AJB - 235543

**WANTED**
ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు సీనియర్ సిటిజెన్ లేదా గృహిణులు మరియు రిటైర్డ్ అయిన వారికి Fixed Income / PF / ESIC పెన్షన్ ఇన్కమ్ Opportunity కలదు. అర్హత : 10th ఆపైన. విజయవాడ పరిసర ప్రాంతం వారికే సంప్ర. సెల్ : 77023 96675
AJB -235373

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ॥ 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు
ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.
లీగల్ ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన, వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఎటువంటి ప్రకటనకైనా ఆంధ్రజ్యోతిని సంప్రదించండి.
అంతిమయాత్ర, వర్ధంతి, జయంతి
క్లాసిఫైడ్స్
పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777,
వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240,
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

# నున్నలో తొలి ప్రైవేట్ ఏటీఎస్ కేంద్రం

## ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలన్నీ ఇక్కడే !

- వెహికల్ ఇన్‌స్పెక్టర్స్‌తో పని లేకుండానే ప్రైవేటు సిబ్బంది తనిఖీలు
- ట్రాక్, టెస్టింగ్ బ్లాక్, స్టోరేజ్ బ్లాక్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు

**ఆంధ్రజ్యోతి, విజయవాడ:** విజయవాడ రూరల్ మండలం నున్నలో రవాణా శాఖ పరిధిలో తొలి ప్రైవేటు వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ కేంద్రం ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, ప్రైవేటు సంస్థలు నిర్వహించే ఈ కేంద్రాలను ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ (ఏటీఎస్)గా పిలుస్తారు. ఇకపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఈ ఏటీఎస్ కేంద్రాల్లోనే జరుగుతాయి. గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఈ పరీక్షలు నిర్వహించగా, ఇప్పుడు ఏటీఎస్ అందుబాటులోకి రావడంతో ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యతను చేపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఫిట్‌నెస్ తనిఖీ సేవల కోసం కైజెన్ ఇన్స్‌పెక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ఏటీఎస్‌ను నున్నలో సువిశాల స్థలంలో ఏర్పాటు చేసింది. వాహనాల పరిశీలనకు వీలుగా ఒక ట్రాక్, రెండు వాహనాలకు ఏకకాలంలో పరీక్షలు నిర్వహించేందుకు రెండు బ్లాకులతో కూడిన స్టేషన్, వాహనాలు ఉంచేందుకు పొడవైన గోడౌన్ ఏర్పాటు చేశారు. పచ్చదనం మధ్య ఈ ఏటీఎస్ పనిచేస్తోంది. వాహన ఫిట్‌నెస్ కోసం వాహనదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్లాట్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే ఏటీఎస్‌కు వెళ్లమని నిర్దేశిస్తారు. అక్కడ ప్రైవేటు సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అయితే, ఏటీఎస్ వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో విజయవాడ, నందిగామ వంటి ఆర్టీవో కేంద్రాల్లో స్థానికంగా ఫిట్‌నెస్ పరీక్షలు జరిగేవి. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల వాహనదారులు నందిగామలో పరీక్షలు చేయించుకునేవారు. ఇప్పుడు వీరంతా నున్నలోని ఏటీఎస్‌కు రావాల్సి ఉంటుంది, ఇది మైలవరం, తిరువూరు వాహనదారులకు దూర ప్రయాణంగా మారింది. మైలవరం మండలంలోని జీ కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల వారికి ఈ ఇబ్బంది మరింత ఎక్కువ. ప్రతి నియోజకవర్గంలో ఒక ఏటీఎస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ప్రస్తుతానికి ఈ కేంద్రాల వల్ల పెద్దగా ఇబ్బందులు లేకపోయినా, ప్రైవేటు సంస్థ నిర్వహణలో ఉండటం వల్ల భవిష్యత్తులో అవకతవకలు, అధిక ఫీజుల దోపిడీకి అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నున్నలో ఏర్పాటైన రవాణా వాహనాల ఫిట్నెస్ తనిఖీ కేంద్రం (ఏటీఎస్)

## వీఆర్వోల సంఖ్య తగ్గకుండా నిర్ణయం తీసుకోండి

- మంత్రికి వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు వినతి

**గాంధీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోల క్యాడర్ సంఖ్య తగ్గకుండా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర గ్రామ, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. ఈ మేరకు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతమున్న వీఆర్వోలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. అర్హులైన గ్రేడ్-1 వీర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వెంటనే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వీఆర్వోల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని రవీంద్రరాజు పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బీ సుగుణమ్మ, రాష్ట్ర నేతలు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీనారాయణ, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నేతలు వీ శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలించక

## గన్నవరంలో ఇండిగో ల్యాండ్

- అరగంట తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు

**విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఇండిగో విమానం గన్నవరం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఇండిగో విమానం మంగళవారం సాయంత్రం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరగా వాతావరణం అనుకూలించకపోవడంతో గన్నవరంలో రాత్రి 9.20కి 214 మంది ప్రయాణికులతో వచ్చింది. ముగ్గురు ప్రయాణికులు ఇక్కడ దిగారు. మిగిలినవారితో హైదరాబాద్‌కు రాత్రి 9.50కు తిరిగి వెళ్లింది.

## స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి పిలుపు

**పెనమలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో భాగంగా సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు అందరూ కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా పశ్చిమలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహిస్తూ మరణాల రేటును తగ్గించేలా అడుగులు వేస్తున్నామన్నారు. మానవ వనరులను అభివృద్ధి చేసి విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా సీఎం చంద్రబాబు విజన్ డాక్యుమెంటును రూపొందించారన్నారు. 2047 డాక్యుమెంటుకు అనుగుణంగా పనిచేసి పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. ఎంఎస్ బేగ్, స్పెషల్ ఆఫీసర్ ఏ రవీంద్రరావు, తహసీల్దారు ఇంతియాజ్ పాషా, మెడికల్ ఆఫీసర్ సుహాసిని, జోనల్ కమీషనర్ రమ్యకీర్తన, ఎంఈవో సోమశేఖర్, సీసీపీ రత్నకుమార్, షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ శాంతికిరణ్ పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాల్లో రాజీ ప్రసక్తే లేదు

- డీసీజీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

**కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ప్రాణం అత్యంత విలువైనది. ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాల్సిందేనని, పరిశ్రమల భద్రతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదని, నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ (డీసీజీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని, ముఖ్యంగా కర్మాగారాలు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్య శాఖలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం శివకుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, కొండపల్లి పారిశ్రామిక సంఘం ప్రతినిధి ఎంఎస్ రామచంద్రరావు, డీపీవో పీ లావణ్యకుమారి, హెచ్‌పీసీపీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, వీటీపీఎస్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

### ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితరాల ద్వారా పొందిన రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు, సంపద సృష్టికి సద్వినియోగం చేసుకొని, ఆర్థిక వృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన వార్షిక రుణ-జీవనోపాధి ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక - జీవనోపాధులుపై సమావేశం జరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలు పొందే రుణాలపై పర్యవేక్షణ చేసి, ఆ రుణాలను కుటుంబాల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా చేయిపట్టి నడిపించాలని అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. రుణాలను ప్రణాళికాయుతంగా సద్వినియోగం చేసుకొంటూ సంపద సృష్టికి బాటలు వేసుకోవాలన్నారు. కుటుంబ సర్వే ఆధారంగా ఈ వార్షిక రుణ ప్రణాళికకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ముందుకెళ్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకు డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

### సెప్టెంబరు 30 వరకు ప్రత్యేక ప్రచారం

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లక్ష్యాలను చేరుకొనేందుకు వీలుగా జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్టు ఎల్‌డీఎం కే ప్రియాంక వివరించారు. పీఎంజేడీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవైలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, వివిధ బ్యాంకుల కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ లక్ష్మీశ

**ఎ.కొండూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు, పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. మంగళవారం ఉదయం ఏ కొండూరు మండలంలోని కంభంపాడు గ్రామంలో పెన్షన్లు పంపిణీ, జలజీవన్ మిషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. పెద్దాయనా బాగున్నారా? పెన్షన్ సమాయానికి అందుతుందా? ఆరోగ్యం ఎలా ఉంది? ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అంటూ లబ్ధిదారులును ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,27,220 మంది పెన్షన్‌దారులకు రూ.99 కోట్ల 24లక్షల 72వేల 500లను సామాజిక పెన్షన్ల ద్వారా అందజేస్తునట్టు తెలిపారు.

జలజీవన్ మిషన్ పనులపై వివరాలు తెలుసుకొంటున్న కలెక్టర్

### జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

ఎ.కొండూరు మండలంలోని జలజీవన్ మిషన్ పనులను కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు కొనసాగుతున్నాయ్యాని, కొన్నిచోట్ల జాతీయ రహదార్లు, ఇరిగేషన్ కాల్వలు, రైల్వే లైన్లు అడ్డుగా ఉండటంతో పనుల్లో ఆలస్యమైందని, గ్రామాల్లోని కొత్తగా నిర్మాణం చేస్తున్న వాటర్ ట్యాంక్ పనులు తుది దశకు చేరుకున్నట్టు తెలిపారు. మరో నెలా 15 రోజులో పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందజేస్తామన్నారు. తిరువూరు ఆర్‌డీవో కే మాధురి, ఏపీడీ నాంచారరావు, తహసీల్దార్ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజధాని కార్యకలాపాలపై కొనసాగిన సమావేశాలు

**కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో వరుసగా రెండో రోజు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. బృంద సభ్యులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు జీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్ రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, యువత, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ వంటి అంశాల గురించి కూలంకషంగా వివరించారు. అలాగే రాజధాని నిర్మాణానికి నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాల గురించి, ల్యాండ్ మోనిటైజేషన్ గురించి వివరించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందంలోని పలువురు సభ్యులు రాజధాని అమరావతిలోని ఏఐఎస్ అధికారుల నివాస సముదాయాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, ఎంఎల్ఏ, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, టిడ్కో నివాస సముదాయాలను సందర్శించారు. ఆయా భవనాల వద్ద, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్ద పురోగతిని అధికారులు బృందంలోని సభ్యులకు వివరించారు. అమరావతిలో నిర్మించిన వివిధ భవనాలు పర్యావరణ సహిత విధానాలతో నిర్మించామని, రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, ఆయా ప్రాజెక్టుల్లో పురోగతి గురించి సీఆర్‌డీఏ అధికారులు వారికి వివరించారు.

సీఆర్‌డీఏ అధికారులతో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా

## సందీప్ మాథుర్ అదనపు బాధ్యతల స్వీకరణ

**రైల్వేస్టేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా దక్షిణ కోస్తా రైల్వేలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందీప్ మాథుర్ బాధ్యతలు స్వీకరించారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో జనరల్ మేనేజర్‌గా ఆయన అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ సిగ్నలింగ్ ఇంజనీరింగ్‌లో 1988 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇంతకుముందు న్యూ సౌత్ కోస్ట్ విశాఖపట్నం హెడ్ క్వార్టర్స్ రైల్వే జోన్‌కు మేనేజర్‌గా నియామకమయ్యారు. సందీప్ మాథుర్ రైల్వే బోర్డులో సిగ్నలింగ్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ అనేక సాంకేతిక ఆధునీకరణ విధానాలను, సిగ్నలింగ్ వ్యవస్థలో ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ సిగ్నల్ టెలికం ఇంజనీర్‌గా అలహాబాద్ డివిజన్‌లో ఉద్యోగాన్ని ప్రారంభించారు. చాలా జోన్లలో కీలక బాధ్యతలను నిర్వహించారు. మలేషియాలో డబుల్ లైన్ ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచింది. సందీప్ మాథుర్ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఏజీఎం నీరజ్ అగర్వాల్, ఇతర విభాగాధిపతులు, సీనియర్ అధికారులతో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమావేశం నిర్వహించారు. 6 డివిజన్లకు చెందిన డీఆర్ఎంలు వీసీద్వారా పాల్గొన్నా రు. ట్రైన్ల నిర్వహణలో భద్రత (సేఫ్టీ)కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో ట్రాక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ట్రైన్ల రాకపోకలకు సమయాలు కచ్చితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సేఫ్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులలో ప్రామాణికాలు పాటించాలని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి క్రమంలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఐదేళ్లలో సాధించిన ప్రగతిని ఆయన అభినందించారు. సిబ్బంది అంకిత భావానికి ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ విభాగాధిపతుల కార్యాలయాలకు నిధులు

**వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** విజయవాడ బందరు రోడ్డులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఏపీపీఎస్సీ ఇతర విభాగాధిపతుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల నిర్వహణకు రూ.1.18కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విభాగాధిపతుల కార్యాలయాలలో అత్యవసర మరమ్మతులు, సెక్యూరిటీని పెంచేందుకు నిధులు వెచ్చించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించటంతో తదుపరి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

# వెంటాడుతున్న పాపాలు

## తల్లికి వందనానికి శాపంగా మారిన వైసీపీ ప్రభుత్వ రీసర్వే

- సెంటు భూమి లేకపోయినా.. 23.67 ఎకరాలున్నాయట!
- వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో వెలుగు చూసిన విచిత్రం
- గండేపల్లి గ్రామానికి చెందిన తల్లి అద్దంకి సరితకు షాక్
- పొలం ఉందని తల్లికి వందనం రాకపోవటంతో ఆందోళన
- జరిగిన తప్పును సరిదిద్దాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ

**వైసీపీ ప్రభుత్వ రీసర్వే పాపాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన తప్పు ఓ నిరుపేద కుటుంబానికి శాపంగా పరిణమించింది. సెంటు భూమి లేకపోయినా ఏకంగా 23.67 ఎకరాలున్నట్టుగా చూపించటంతో ఆ కుటుంబం సంక్షేమ పథకాలకు అర్హత లేకుండా పోయింది. తల్లికి వందనం సొమ్ములు అందకపోవటంతో ఆరా తీయగా పొలం విషయం వెలుగులోకి వచ్చింది. తమకు పొలం లేదు, జరిగిన తప్పును సరిదిద్దాలంటూ బాధిత కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.**

- ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన అద్దంకి మల్లికార్జునరావు, సరిత దంపతులు. వీరికి కాలనీ ఇల్లు తప్పితే ఎలాంటి ఆస్తిలేదు. ఇద్దరూ కూలీ పనులకు వెళుతుంటారు. పిల్లలను చదివించాలన్న కోరికతో కష్టపడుతున్నారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు అఖిల్ బీటెక్ రెండో సంవత్సరం, కుమార్తె కోకిల ఇంటర్ రెండో సంవత్సరం, చిన్నకుమార్డు ఏడుకొండలు పదో తరగతి చదువుతున్నారు. సుమారుగా 7 నెలల క్రితం పనికి వెళుతుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో సరిత ఎడమ చేయి విరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఆర్థిక సాయం అందుతుందన్న ఉద్దేశంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి, విరిగిన చోట చేతిలో ప్లేట్లు వేశారు. వైద్య సేవ మాత్రం అందలేదు. నానా తిప్పలు పడి రూ.40 వేలు చెల్లించారు. వేసవి సెలవుల అనంతరం గత నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం రోజునే ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులు అందించింది. కానీ సరిత ఇద్దరు పిల్లలకు రూ.26 వేలు రావల్సి ఉండగా, రూపాయి రాలేదు. గ్రామ సచివాలయానికి వెళ్లి అడగ్గా, తన పేరుతో 23.67 ఎకరాల మెట్ట భూమి ఉన్నట్టుగా చూపించటంతో సరిత అవాక్కైంది. పరిటాల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 2446లో 21.67 ఎకరాల మెట్ట భూమి సరిత ఆధార్ నెంబరు చూపిస్తోంది. సరితకు చేయి విరగటంతో కూలీ పనులు చేయలేకపోతోంది. భర్త మల్లికార్జునరావు ఒక్కడే నెట్టుకొస్తున్నాడు. పథకం సొమ్ములు రాకపోవటంతో సరిత వేదనకు అంతులేదు. పరిటాల, కంచికచర్ల వెళ్లి పలుసార్లు అధికారులను కలిసి విన్నవించింది. తమ కుటుంబానికి సెంటు భూమి లేదు. జరిగిన తప్పును సరిదిద్ది తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నప్పటికీ చూద్దాం చేద్దామంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్పితే కనికరించటం లేదు. దీనిపై కంచికచర్ల తహసీల్దార్ నరసింహారావును వివరణ కోరగా పరిటాల రీసర్వేలో తప్పులు దొర్లాయని, తన దృష్టికి వచ్చిన వెంటనే ఐదారు సరిచేశామని, సరితకు కూడా త్వరలో న్యాయం చేస్తామన్నారు.



సరిత పేరుతో 23.67 ఎకరాలు చూపుతున్న ఎలిజిబులిటీ చెక్

## డాక్టర్ గుళ్లపల్లికి రోటరీ పురస్కారం

**భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఏడాది రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో వృత్తిపరంగా సమాజానికి విశిష్ట సేవలందించిన, నిష్ణాతులకు అందించే జీవిత సాఫల్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావుకు అందజేసినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు డాక్టర్ వీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడ ఎంజీ రోడ్‌లోని ప్రముఖ హోటల్‌లో జరిగిన సమావేశంలో డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రపంచస్థాయి సదుపాయాలతో కంటిసేవలు అందిస్తున్నామని ఏపీ, తెలంగాణ, ఒడిశాతోపాటు వివిధ ప్రాంతాల్లో దాదాపు 320 ఐ కేర్ ఇనిస్టిట్యూట్‌లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. రోటరీ క్లబ్ విజయవాడ కార్యదర్శి ఎస్ రవిప్రకాష్, రోటరీ డిస్ట్రిక్ పూర్వ గవర్నర్లు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, డాక్టర్ ఎంసీ దాస్, డాక్టర్ మోహన్ ప్రసాద్, ఓకేషన్ కమిటీ డైరెక్టర్స్ పొన్నం శ్రీరామ్, టీ ప్రభాకర్, డాక్టర్ వీ లీలాప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు, మాజీ ప్రెసిడెంట్ రోటేరియన్ పీ కృష్ణాజీ పాల్గొన్నారు.

డాక్టర్ గుళ్లపల్లికి పురస్కారం అందిస్తున్న శ్రీదేవి

## విద్యుదాఘాతంతో రైతు, పాడి గేదె మృతి



**విస్సన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** వేమిరెడ్డిపల్లి గ్రామంలో నడించెరువు సమీపంలో విద్యుదాఘాతానికి గురై పాడి రైతు వేగి శ్రీనివాసరావు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం తన గేదెను మేపే క్రమంలో ఫిన్సింగ్ తీగెకు విద్యుత్ సరఫరా రావడంతో దాన్ని తాకిన గేదె షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. అది గమనించని రైతు శ్రీనివాసరావు గేదెను లేపే ప్రయత్నంలో దాన్ని తాకి షాక్ గురై మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పట్టణంలో మరొకరి మృతి

సోమవారం రాత్రి విద్యుత్‌షాక్‌కు గురై విస్సన్నపేట పట్టణానికి చెందిన మర్రిబోయిన మణికంఠ (36) అక్కడకక్కడే మృతి చెందాడు. ఇంటి ఆవరణలోని విద్యుత్ మోటార్‌కు మరమ్మతుల చేసేందుకు ప్రయత్నించగా షాక్ గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు. టీడీపీ, తాపీ వర్కర్స్ యూనియన్ నేతలు మణికంఠ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

## హ్యాకథాన్ విజేతలు ఆదిత్య విద్యార్థులు

**విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్స్ క్లబ్ హ్యాకథాన్ పోటీల్లో విజయవాడ ఆదిత్య కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి రూ.30 వేలు బహుమతిని గెలుచుకున్నారు. ఈ పోటీల్లో బీఎస్సీ మూడో ఏడాది విద్యార్థులు బి.తేజశ్రీ, ఎ.భాస్కర రెడ్డి, లోకేష్‌లు విజేతలుగా నిలిచారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు తెలియకుండా మొబైల్‌లో వాడే ఏ సమాచారమైనా తల్లిదండ్రులకు తెలిపే విధంగా రూపొందించినసేవ్ గార్డియన్ అనే ప్రదర్శన బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు. విజేతలను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో హెచ్‌వోడీ రాజ్‌కుమార్, అధ్యాపకురాలు సుల్తాన, ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డిలు పాల్గొన్నారు.

భవిష్యత్తు కార్యచరణపై సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్ సమీక్ష

## కనకదుర్గానగర్‌లో ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల పరిశీలన

**ఇంద్రకీలాద్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** దుర్గగుడి అధికారులు ఇటీవల ఘాట్ రోడ్డు నుంచి అర్జునవీధి వరకు రోడ్డుకు రెండు వైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. ఆ ప్రాంతాలను సీపీ రాజశేఖర బాబు, ఈవో శీనానాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నుంచి మహామండపం వైపునకు వెళ్లే మార్గంలో రిటైనింగ్ వాల్ వద్ద, రథం సెంటర్ నుంచి కనకదుర్గానగర్ వైపు వెళ్లే మార్గం మధ్యలో వాహనదారులు వన్‌వేలో వెళ్లకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని సీపీని ఈవో కోరారు. కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లులు కోసం బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అర్జునవీధిలో సెంట్రల్ రిసెప్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. అంతకుమందు సీపీ దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు పాల్గొన్నారు.

## అవగాహనతోనే క్షయ నివారణ

**వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** అవగాహనతోనే క్షయ నివారణ సాధ్యమని ప్రభుత్వ పాతఆసుపత్రి సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎస్) బి.ఉషారాణి అన్నారు. ఏలూరు కాల్వ సమీపంలోని నవజీవన్ బాల భవన్‌లో మంగళవారం క్షయపై అవగాహన కల్పించి, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ తొలి దశలోనే గుర్తిస్తే నిర్మూలన మరింత సాధ్యమవుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి సమయంలో చెమటం పట్టడం, కళ్లెలో రక్తం పడటం, చాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం, బరువు తగ్గిపోవడం, ఆకలి వేయకపోవడం, అలసటగా ఉండటం, మెడ మీద గడ్డలు రావడం వంటివి క్షయవ్యాధి లక్షణాలని, వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. అపోహలు నమ్మవద్దని చెప్పారు. టీబీ సూపర్ వైజర్ ఎన్.నాగేశ్వరరావు, టీబీ హెచ్‌వీ ఇందిరా, బాలభవన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశోధన నిమిత్తం ఐటీఐ కాలేజీకి కారు అందజేత

**భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని మోటార్ మెకానిక్ విభాగానికి పరిశోధన నిమిత్తం హూండాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సీఎస్ఆర్‌ఫండ్స్‌లో భాగంగా న్యూఐ20 కారు అందజేసినట్లు ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## విజయవాడ ఖ్యాతిని పెంచే.. బ్రాండ్ టైటిల్‌ను ఎంపిక చేయండి

### టైటిల్ ఎంపిక కమిటీ సభ్యుల సమావేశంలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**కార్పొరేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):** ఆధ్యాత్మిక, పర్యాటక, నదులను దృష్టిలో పెట్టుకొని విజయవాడ ఖ్యాతిని పెంచే బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, కమిటీ ఛైర్మన్ ధ్యానచంద్ర సభ్యులకు సూచించారు. టైటిల్ ఎంపిక కమిటీ సమావేశం మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన 229 దరఖాస్తులను పరిశీలించి, ప్రతి ఒక్కరూ టాప్ 10ను ఎంపిక చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులే కాకుండా వినూత్నంగా ఉన్న ఆలోచనలను స్వాగతించా లన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటక, నదులను దృష్టిలో పెట్టుకొని టాప్ 10తో నివేదిక సమర్పించాలన్నారు. ఎంపిక సమయంలో బ్రాండ్ ఇమేజ్, ప్రస్తుతం ఇతర ప్రదేశాలకు ఆ పేరు లేకుండా చూసుకోవాలని సూచించారు. తదుపరి సమావేశానికి ప్రతి ఒక్కరూ వచ్చిన టాప్10లో 5-సెలెక్ట్ చేసి కలెక్టర్‌కు నివేదికను సమర్పించాలన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ ఎ.శ్రీశిల్ప, అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్స్ నటరాజన్ షణ్ముగం, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ భాస్కరరావు, డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ కె.వి.రమణరావు, మోహన్ పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి : ధ్యానచంద్ర

31వ డివిజన్‌లో పింఛన్ అందిస్తున్న బొండా ఉమా

**వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పింఛన్ల పంపిణీ సత్వరమే పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం 43వ డివిజన్ భవానీపురం ఊర్మిళా సుబ్బారావునగర్, హెచ్‌బీ కాలనీలో పర్యటించారు. సందర్భంగా ఆయన లబ్ధిదారులతో ప్రతినెలా సకాలంలో అందుతుందా లేదా అన్నదానిపై ఆరా తీశారు. అనంతరం ఊర్మిళా సుబ్బారావు నగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. హెచ్‌బీ కాలనీలో అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పర్యటనలో అసిస్టెంట్ మెడి కల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

**హామీలు నెరవేరుస్తున్న కూటమి: బొండా ఉమా**

**సత్యనారాయణపురం:** కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నేరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడు అంబేడ్కర్‌కాలనీలో మంగళవారం ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా కూటమి పనిచేస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాజేష్‌వర్మ, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, పడమటి రామ కృష్ణ, దేవరకపు మాల్యాద్రి పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికే ప్రాధాన్యం

### మెగా వైద్యశిబిరంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

**విద్యాధరపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం రౌండ్ టేబుల్ ఇండియా, రోటరీక్లబ్, లేడీస్ సర్కిల్, సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవానీపురం ఎన్డీఏ కార్యాలయంలో మెగా మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ పేదలకు లబ్ధి చేకూరేలా ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వం సేవలు అందిస్తుందన్నారు. వైద్యులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని మెరుగైన సేవలు అందించాలన్నారు. సమాజసేవలో భాగస్వాములై సేవలు అందిస్తున్న వైద్యులను సత్కరించి అభినందించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించటానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో విజయవాడ రౌండ్ టేబుల్ ఛైర్మన్ కాట్రగడ్డ మోహన్, లేడీస్ సర్కిల్ ఛైర్పర్సన్ అలేఖ్య, అమరావతి రౌండ్ టేబుల్ ఛైర్మన్ సందీప్, లేడీస్ సర్కిల్ ఛైర్పర్సన్ సింధు అందలం, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి అధ్యక్షుడు డాక్టర్ ప్రలోబ్, రౌండ్ టేబుల్ అధ్యక్షుడు కౌశిక్ యక్కల, డాక్టర్ ఆదిత్య, సుజనా ఫౌండేషన్ హెల్త్ కో ఆర్డినేటర్ బొమ్మకంటి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీవీకేలో ఉపాధి శిక్షణ తరగతులు 5 నుంచి

**గవర్నర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఈనెల 5నుంచి వివిధ కోర్సుల్లో శిక్షణకు కొత్త బ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి టి.క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, సీ లాంగ్వేజ్, డీటీపీ, ఫొటోషాప్‌లో శిక్షణ కాలం 2 నెలలు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 90145 41958, 9490098042లో సంప్రదించాలని కోరారు.

## శ్రీపాద శ్రీవల్లభగురు బలసిద్ధి వ్రతం 10న

**గాంధీనగర్:** శ్రీత్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ నెల 10న శ్రీపాద శ్రీవల్లభ గురు బలసిద్ది వ్రతం నిర్వహిస్తున్నట్టు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో ఆహ్వాన పత్రికను మంగళవారం ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 96181 93027లో సంప్రదించాలని చైర్ పర్సన్ యడ్లపాటి శిరీష రాణి తెలిపారు.


NAVRANG A/c

RUNNING VERY SUCCESSFULLY THRILL AND DANGERS CAR RACES WONDERFULLY DONE BY BRAD PITT

THE MOVIE

తెలుగు 2D -రోజూ 4 ఆటలు 11:30 AM, 2-30 PM 6:30 PM, 9-30 PM

Online Tickets Available in " BOOK MY SHOW"



**సంస్మరణ సభ**

కీ॥శే॥ తవ్వా కనకదుర్గా వరలక్ష్మి గారు

జననం : 18-2-1946

మరణం : 22-6-2025

బెజవాడ రాజారావు హైస్కూలు సహవ్యవస్థాపకులుగా, SKPVV హిందూ హైస్కూలు గ్రేడ్ 1 తెలుగు పండిట్‌గా విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన మీ మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఇవే మా ఘన నివాళులు. మీరందించిన స్ఫూర్తి సదా మాకు అనుసరణీయం.

భర్త : బెజవాడ రాజారావు

Cell : 94402 80263, 89859 17897

కుమారుడు : శ్యామ్ ప్రకాష్

కోడలు : లక్ష్మీప్రసన్న

కుమార్తె : మధులత

అల్లుడు : జూలూరి శ్రీరామ శివప్రసాదరావు

మనుమళ్ళు, మనుమరాండ్రు

సంస్మరణ సభ : ది. 2-7-2025 బుధవారం ఉదయం11 గం.లకు బెజవాడ రాజారావు హైస్కూలు, అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ-12 నందు జరుగును.


## గురువులను సత్కరించడం గొప్ప అనుభూతి

వైద్యులను సత్కరించిన సిద్దార్థ మెడికల్ కాలేజీ సిబ్బంది

**విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** సిద్ధార్థ మెడికల్ కళాశాలను గొప్ప స్థాయికి తీసుకువచ్చిన ఘనత తమ గురువులు, వైద్యులు, నాయకులదేనని ప్రిన్సిపాల్ ఎ.వై.రావు తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన డాక్టర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏటా డాక్టర్స్ డే కార్యక్రమం నిర్వహించి గురువులను తలచుకుని, సత్కరించడం గొప్ప అనుభూతని తెలిపారు. గురువులు చూపిన మార్గం దీపస్తంభం లాంటిదన్నారు. ప్రముఖ డాక్టర్లు జి.ఈశ్వర్ (జనరల్ మెడిసిన్), టి.జె. ప్రసన్న కుమార్ (ప్రముఖ సర్జన్), కె.ప్రభాదేవి (ప్రసూతి, గైనకాలజీ) అందించిన సేవలు, సమాజానికి చూపిన నిబద్ధత యువతకు ప్రేరణగా నిలుస్తుందని నెఫ్రాలజిస్ట్ ఎన్.అమ్మన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురి వైద్యుల సేవలను గుర్తు చేసుకుంటూ కాలేజీ సిబ్బంది వారికి సన్మానం చేశారు.

## వివాహితను వేధిస్తున్న నలుగురిపై కేసు

**వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** వివాహితను వేధిస్తున్న భర్తతో పాటు మరో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదైంది. గొల్లపూడి మైలురాయి సెంటర్ 3వ లైన్‌లో ఉంటున్న పేరిపోగు మాణిక్యం, ముదినేపల్లికి చెందిన శ్యాంబాబును వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. శ్యాంబాబు కరెంటు పనులతో పాటు టైల్స్ వ్యాపారం చేస్తుంటాడు. కొన్ని సంవత్సరాలుగా మాణిక్యంను భర్త మానసికంగా వేధిస్తున్నాడు. అతనికి తల్లిదండ్రులు, సోదరుడు కూడా సహకరిస్తున్నారు. మాణిక్యంకు మానసిక పరిస్థితి బాగాలేదంటూ ప్రచారం చేశారు. ఏడాది క్రితం శ్యాంబాబు భార్యను గొల్లపూడిలో ఆమె తల్లిదండ్రుల వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. బాధితురాలు తనను తీసుకువెళ్లమని ప్రాధేయపడినా తీసుకువెళ్లక పోగా పిల్లలను కూడా చూడటానికి ఇంటికి రానీయకుండాలేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తుతెలియని మృతదేహం

స్వర్ణాప్యాలెస్ థియేటర్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లేకపోవటంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు, ఒంటిపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగా ఫ్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## సమ్మెకు మద్దతుగా ముఠా కార్మికుల ప్రచారం

**గవర్నర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె. దుర్గారావు కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. మంగళవారం 23వ డివిజన్ ఆలీబేగ్ వీధిలో ముఠాకార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి బడా కంపెనీలకు అనుకూలమైన కార్మిక చట్టాలు తేవడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. బ్రహ్మయ్య, ఎం. సీతారాములు, సీహెచ్ నరసింహులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కనీస వేతనాలు అమలు చేయాలి..

**సత్యనారాయణపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** హోటల్ రంగంలో పని చేస్తున్న కార్మికుల కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు అన్నారు. హోటల్ రంగకార్మికుల సమస్యలు పరిష్కరించాలని 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో హోటల్ అండ్ బేకరి వర్కర్స్ యూనియన్, జగదీష్, ఎం.వి. రమణ, కొండయ్య, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

## ఇంజనీరింగ్ కార్మికుల వినూత్న నిరసన

**ధర్నాచౌక్, జూలై 1 ఆంధ్రజ్యోతి):** తమకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా ధర్నాచౌక్‌లో మంగళవారం వెహికల్ డిపో మెకానిక్స్ పని చేసే పనిముట్ల పని స్వభావంతో నిరసన తెలిపారు. యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ నగరంలో 700 చెత్త తరలించే వాహనాలను 24గంటలు మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌ల జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఇంజనీరింగ్ కార్మికులంతా సమ్మెలోకి దిగారని పారిశుధ్మ కార్మికులను కూడా సమ్మెలోకి దింపుతామని హెచ్చరించారు.

## సీనియర్ సిటిజెన్ అసోసియేషన్‌కు రూ.లక్ష విరాళం

**పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** పటమట సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మంగళవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు విజయ్‌కృష్ణ తన తండ్రి రామ్మోహన్ జ్ఞాపకార్థం రూ.లక్ష అసోసియేషన్‌కు విరాళంగా అందించారు. అసోసియేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతుగా ఈ విరాళం ప్రకటించినట్లు ఆయన తెలిపారు. దాతను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సూర్యదేవర పాపారావు, కొండపల్లి మాధవరావు, వసంత శివశంకర్రావు, సభ్యులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

పశ్చిమ: 99854 09286, సెంట్రల్: 99854 11733, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు

సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234



ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

**GOLD FINANCE**

బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999 AJB-235544

**వధువు కావలెను**

పద్మశాలి-47 సం.లు/Govt/1L/గుంటూరు, పద్మశాలి-38 సం.లు/బిజినెస్/1L/గుంటూరు, రజక-40 సం.లు/SWE/1.50/హైదరాబాద్ లేట్ వరులకు అందమైన వధువులు కావలెను. కుల పట్టింపు లేదు. వాట్సాప్: 76739 26517 AJB- 235601

**HOUSE FOR SALE**

నున్న టీచర్స్ కాలనీలో 115 గ.లో 2 ఇళ్లు & 96 గ.లో 2 ఇళ్లు & 54 గ.లో ఇల్లు అమ్మకం. సంప్రదించండి: 98669 35667 / 93929 47777 AJB- 698

**PLOT FOR SALE**

ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ప్లాట్స్ 'తక్కువ' ధరలో నందిగామ దగ్గరలో, ఇళ్ల మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు & కంచికచర్ల దగ్గర ఔటర్ రింగ్ రోడ్‌కు, హైవేకి దగ్గరలో CRDA ప్లాట్స్. సెల్: 88018 03689 AJB - 142

కంచికచర్ల - పేరకలపాడు, HYD హైవేకి & అమరావతి ORR కి దగ్గర, తారురోడ్డు ఫేస్‌తో, CRDA & పంచాయతీ ప్లాట్లు. సెల్ నెం. : 73372 04349 AJB - 143

**WANTED TEACHERS**

TEACHERS (Ladies) with U.G or P.G Qualification and good English. And Teacher for Science in High School. COASTS HIGH SCHOOL, VJA-I. Cont: 81799 90508, 92913 98877 AJB - 235543

**WANTED**

ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు సీనియర్ సిటిజెన్ లేదా గృహిణులు మరియు రిటైర్డ్ అయిన వారికి Fixed Income / PF / ESIC పెన్షన్ ఇన్కమ్ Opportunity కలదు. అర్హత : 10th ఆపైన. విజయవాడ పరిసర ప్రాంతం వారికే సంప్ర. సెల్ : 77023 96675 AJB -235373

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

GST 5% Extra

REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT

బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ॥ 40/- కలర్ 30% EXTRA

1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.

లీగల్ ప్రకటనలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

జన్మదిన, వార్షికోత్సవ శుభాకాంక్షలు

ఎటువంటి ప్రకటనకైనా ఆంధ్రజ్యోతిని సంప్రదించండి.

అంతిమయాత్ర, వర్ధంతి, జయంతి

క్లాసిఫైడ్స్

పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609

పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733 గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

**బ్రాయిలర్ ధరలు**
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 96, 104, 115
స్కిన్ విత్ స్కిన్ 184
స్కిన్‌లెస్ 194
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

గుంతలు పూడ్చేస్తున్న కోడూరు మనోజ్

### తెలుగు యువత నాయకుడు మనోజ్ చొరవ

**మైలవరంరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** మైలవరం - నూజివీడు ఆర్ అండ్ బీ రహదారిపై గుంతలను మంగళవారం పూడ్చివేశారు. సమస్యపై మంత్రి లోకేష్ స్పందించడంతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాలతో తెలుగు యువత నాయకుడు కోడూరు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేసి గుంతలు పూడ్చివేశారు. మనోజ్‌ను పలువురు వాహనదారులు అభినందించారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయకుమార్, బాబా, వీరేశ్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

## జాతీయ స్థాయి సమ్మెను జయప్రదం చేయాలి

**నందిగామ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్రం నాలుగు లేబర్ కోడ్ బిల్లును తీసుకువచ్చిందని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జాతీయ స్థాయిలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్లను ఆయన కోరారు. ఈ సందర్భంగా అధికారులకు సమ్మె నోటీసును అందజేశారు. కార్మిక వ్యతిరేక బిల్లుపై కార్మికులు కదం తొక్కాలన్నారు. వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన

**తిరువూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** సమస్యల పరిష్కారం కోరుతూ చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై నిలబడి నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు అమలు చేయ్యాని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయ్యాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, మోహనరావు, శ్రీను, గోపీచంద్, నారాయణ, కలాం, బాలస్వామి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.




## రహదారిని బాగుచేయాలని ధర్నా

**మైలవరంరూరల్ :** మైలవరం - నూజివీడు ఆర్అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ వెల్వడం అడ్డరోడ్డు వద్ద మంగళవారం సీ పీఎం నాయకులు ఆందోళనకు దిగారు. నాలుగు నెలలుగా రహదారి అంతా గుంతలు పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. అనంతరం సీపీఎం నాయకులు సుధాకర్, వెంకటరెడ్డి, తదితరులను ఎస్సై కె.సుధాకర్ అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆందోళన చేసిన నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

**ఎ.కొండూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** ఉద్యాన పంటల సాగుకు ఉపాధి పథకంలో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఎ.కొండూరు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి ఉద్యాన తోటలను పరిశీలించారు. అనంతరం నిమ్మతోటను సందర్శించారు.

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో 375 ఎకరాలు ఉద్యాన పంటలు సాగుకు లక్ష్యంగా నిర్దేశించినట్టు ఆయన తెలిపారు.

ఇప్పటికీ 224 ఎకరాల్లో మల్లె, మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, ఆపిల్ బేర్, మునగ వంటి పంటలకు సాగు చేపట్టేలా ఉద్యాన శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

ముందుగా చైతన్య నగర్ తాండ గిరిజనులు కలెక్టర్ లక్ష్మీశకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గిరిజనులతో కొద్దిసేపు మాట్లాడి ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు.

గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, మొక్క నాటుతున్న లక్ష్మీశ

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమా

సమావేశంలో మాట్లాడుతున్న షేక్ ఖాజా

# కూటమి ప్రభుత్వ విజయాలు వివరించండి

**గొల్లపూడి, జులై 1 (ఆంధ్రజ్యోతి) :** ప్రజల విశ్వాసాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు పోస్టర్‌ను ప్రదర్శించారు. తప్పుడు ప్రచారాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో చేసిన మంచిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని కూటమి నాయకులకు పిలుపు నిచ్చారు.

### ఇంటింటికీ టీడీపీ జయప్రదం చేయండి

**జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం పట్టణంలో ఎస్ఎస్ఆర్ గ్రాండ్ హాలులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ఇచ్చిన హామీలను నేరవేర్చిందన్నారు. పార్టీ నేతలు కొఠారు సత్యనారాయణ ప్రసాద్, ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఘైనేని రాధాకృష్ణ, కట్టా నరసింహారావు, జిల్లేపల్లి సుధీర్, యానాల గోపీ చంద్ తదితరులు పాల్గొన్నారు. **నందిగామ:** కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి షేక్ ఖాజా, నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణం కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై మంగళవారం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నివాసంలో సమీక్షా సమావేశం జరిగింది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజలకు తెలిసే విధంగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా ముందుక సాగి ఈ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, నాయకులు కోగంటి బాబు, ఏచూరి రామకృష్ణ, మేకల సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించమంటే..

**వత్సవాయి :** ప్రజా సమస్యలను పరిష్కరించాలని అడిగినందుకే గ్రామ కార్యదర్శి సుబేదర్ తనపై అనేక రకాలుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తుందని టీడీపీ కార్యకర్త అన్నెపాక హరిష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మా ట్లాడుతూ తాను ఏ తప్పూ చేయలేదని వాపోయారు. గ్రామ కార్యదర్శి ఇస్తున్న తప్పుడు ఫిర్యాదులపై ఎస్సై ఉమా మహేశ్వరరావు ఎలాంటి విచారణ లేకుండానే కేసులు నమోదు చేసి ఇబ్బం దులు పెడుతున్నారని ఆరోపించారు. సోమవారం గ్రామ కార్యదర్శి భర్త ఆలి పెట్రోల్ క్యాన్‌తో వచ్చి దాడికి యత్నించాడని ఆరోపించారు.

పెదకొమిర కేజీబీవీ బాలికలతో తన అనుభవాలు పంచుకుంటున్న అంతరిక్షయానం చేయనున్న దంగేటి జాహ్నవి

## పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలి : జాహ్నవి

**గంపలగూడెం, జులై 1 (ఆంధ్రజ్యోతి) :** పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న భారతీయ తొలి మహిళ, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి అన్నారు. కలెక్టర్ ఆదేశం మేరకు మంగళవారం గంపలగూడెంలోని పెదకొమెర కేజీబీవీని ఆమె సందర్శించారు. పాఠశాల బాలికలతో తన అనుభవాలను పంచు కున్నారు. బాలికల అనుమానాలను నివృత్తి చేశారు. ఎన్నో సవాళ్లతో కూడిన అంతరిక్షయానం చేసి భారత జాతీయ పతకాన్ని గగన వీధుల్లో ఎగుర వేసేందుకు అహర్నిశలు శ్రమిస్తానన్నారు. పట్టుదలతో చదివి అనుకున్నది సాధించాలన్నారు. అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధనా సంస్థ టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీ (టైస్), నాసా మాజీ వ్యోమగామి నాయకత్వం వహిస్తున్న ఈ మిషన్ కోసం నిర్వహించిన అనేక పరీక్షల్లో తా ను అర్హత సాధించినట్లు చెప్పారు. 2029 మార్చిలో చేపట్టనున్న తొలి అంతరిక్ష యాత్ర బృందంలో భారత్ నుంచి తనను ఎంపిక చేశారన్నారు. సమగ్రశిక్ష ఏపీపీ జి.మహేశ్వరరావు, ఏఎంవో అశోక్, అసిస్టెంట్ ఏఎంవో శిరీష, డీసీడీవో విశ్వభారతి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఎమ్.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

## ఎంఈవో పాఠశాలల తనిఖీ

**కంచికచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :** మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించాల్సిన గుడ్లు మూడురోజులకే మురిగిపోతున్నాయంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల విద్యాశాఖాధికారి బి. బాలాజీ స్వయంగా పలు పాఠశాలలకు వెళ్లి గుడ్లను పరిశీలించారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, గుడ్లు ఎక్కువగా మురిగిపోతున్నాయని, మురిగిపోయిన గుడ్లకు సంబంధించి కాంట్రాక్టరు కొత్త గుడ్లు ఇవ్వటం లేదన్నారు. ఎంఈవో దగ్గరుండి కాంట్రాక్టరుతో మురిగిపోయిన గుడ్లను లెక్కించి, కొత్త గుడ్లు ఇప్పించారు. ఇండెంట్ ప్రకారం గుడ్లు తీసుకునే సమయంలో ఉపాధ్యాయులు జాగ్రత్తగా ఉండాలని, నిశితంగా గుడ్లను పరిశీలించి తీసుకోవాలని సూచించారు. విచారణ నివేదికను డీఈవోకు పంపినట్టు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే తాతయ్య చొరవతో గోతులు పూడ్చివేత

**పెనుగంచిప్రోలు, జులై 1 (ఆంధ్రజ్యోతి) :** ఇటీవల కురిసిన వర్షాల వల్ల పెనుగంచిప్రోలు బైపాస్ రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వర్షం నీరు నిలబడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్పందించి గుంతలను దగ్గరుండి పూడ్చించారు. గుంతలను పూడ్చేందుకు పూర్తిగా సహకరించిన చింతల వెంకట సీతారామయ్యను ఆయన అభినందించారు. మాదినేని విక్రమ్, జిల్లేపల్లి సుధీర్‌బాబు, కొత్తపల్లి సతీష్, నన్నపనేని తిరుపతిరావు, గుగులోతు రమేష్, కొండ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

**GOLD FINANCE**
▸ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235544

**PLOT FOR SALE**
▸ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ప్లాట్స్ 'తక్కువ' ధరలో నందిగామ దగ్గరలో, ఇళ్ల మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు & కంచికచర్ల దగ్గర ఔటర్ రింగ్ రోడ్‌కు, హైవేకి దగ్గరలో CRDA ప్లాట్స్. సెల్: 88018 03689
AJB - 142

▸ కంచికచర్ల - పేరకలపాడు, HYD హైవేకి & అమరావతి ORR కి దగ్గర, తారురోడ్డు ఫేస్‌తో, CRDA & పంచాయతీ ప్లాట్లు. సెల్ నెం. : 73372 04349
AJB - 143

**వధువు కావలెను**
▸ పద్మశాలి-47 సం.లు/Govt/1L/గుంటూరు, పద్మశాలి-38 సం.లు/బిజినెస్/1L/గుంటూరు, రజక-40 సం.లు/SWE/1.50/హైదరాబాద్ లేట్ వరులకు అందమైన వధువులు కావలెను. కుల పట్టింపు లేదు. వాట్సాప్: 76739 26517
AJB- 235601

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

మైలవరం, ఇబ్రహీంపట్నంలలో వైద్యులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

# డాక్టర్స్ డే వేడుకల్లో వైద్యులకు సత్కారం

**మైలవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** డాక్టర్స్ డేను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యులను ఘ నంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ ప్రోగ్రాం కమిటీ కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు చనుమోలు నాగభూషనం, కార్యదర్శి శీలం రామిరెడ్డి, కోశాధికారి చలవాది హరిష్ కుమార్ గుప్తా, జెడ్సి శ్రీధర్, లియో క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్, కార్యదర్శి లక్ష్మణ సాయి, సభ్యులు లేళ్ల ఏడుకొండలు, టి.వెంకటేశ్వరరావు, చంద్రం, దినేష్‌బాబు, కోయ శ్రీను, సతీష్‌బాబు, రాంప్రసాద్, నాగప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. మదర్ థెరెసా ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధా ఆధ్వర్యంలో ప్రభు త్వ, ప్రైవేటు ఆస్పత్రి వైద్యులను ఘనంగా సత్కరించారు. ద్రోణవల్లి విజయలక్ష్మీ, కొత్తా అరుణ, వజ్రాల స్రవంతి, ఎస్కె షహేదా బేగం, మాధవి పాల్గొన్నారు. **నందిగామ రూరల్ :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు సాంబశివరావు, కొండలరావు, శ్రీనివాసరావు, లక్ష్మీకాంత్‌లను క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు సీతారామయ్య, సభ్యులు శ్రీనివాసరావు, యర్రంరెడ్డి గాంధీ, సాంబశివరావు, సుబ్రహ్మణ్యం, పబ్బతి నరేంద్ర, మారం అమరయ్య, తదితరులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్స్‌డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వై. రత్న ప్రియదర్శినిని సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు. **ఇబ్రహీంపట్నం :** డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యురాలు ఫర్హీన్‌ను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథ రెడ్డి, కార్యదర్శి ఎ.సురేష్, బి.కృష్ణారెడ్డి, ఎన్.బుల్లిరాజు చౌదరి, చనమోలు వెంకటేశ్వరరావు, నాగిరెడ్డిపాల్గొన్నారు. **తిరువూరు :** పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, ఆడిటర్స్ డేను ఘనంగా నిర్వహించారు. వైద్యులను సత్కరించారు. పివి.రావు, శంకర్‌రావు, రాజేష్‌ఖన్నా, ప్రకాశరావు, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, నంబూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జంగాలపల్లిలో భారీ కొండచిలువ హతం

**మైలవరంరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):** జంగాలపల్లిలో జనావాసాల్లోకి ప్రవేశించిన 10 అడుగుల భారీ కొండచిలువను గ్రామానికి చెందిన యువకులు మంగళవారం చంపివేశారు. దళితవాడలోని వాటర్ ట్యాంకర్ సమీపంలోని పాడుబడిన బావిపక్కన ఉన్న కొండచిలువను గేదెలకు పాలు తీసేందుకు వెళ్లిన కొండలరావు అనే రైతు చూసి కేకలు వేశాడు. కొండలరావు కేకలు విన్న యువకులు గొడ్డళ్ళు, కత్తులతో కొండచిలువను చంపివేశారు. చనిపోయిన కొండచిలువ 10 అడుగుల పొడవు, 15 కేజీల బరువు ఉంటుందని యువకులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి బావి వద్ద వ్యర్థాలను తొలగించడంతో పాటు చెత్తా,చెదారం లేకుండా చేయాలని జంగాలపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

## నివేశన స్థలాలు ప్రభుత్వ భూముల జాబితా నుంచి తొలగించాలి

**తిరువూరు:** పూర్వార్జితంగా వస్తున్న తమ నివేశన స్థలాలను ప్రభుత్వ భూముల జాబితాలో చేర్చారని, తమభూముల్ని ప్రభుత్వ భూముల జాబితానుంచి తొలగించాలని ఆప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మంగళవారం తహసీల్దార్ ఉదయబాస్కరరావుకు వినతిపత్రం అందించారు. పాతతిరువూరు 13వ వార్డు పరిధిలోని ఆర్ఎస్‌నెం.104/2లో 1.84 ఎకరాల నివేశన స్థలాల్లో సుమారు 20 కుటుబాలు, పక్కాగృహాలు నిర్మించుకొని దీర్ఘకాలంగా నివాసం ఉంటున్నారని వారు పేర్కొన్నారు. గతంలో కొందరు ప్రైవేటు గ్రామకంఠం భూమిగా ధ్రువీకరణ పత్రాలు పొంది, భూములు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు వారు వివరించారు. ఇటీవల రీసర్వే నిర్వహించి తమ భూముల్ని ప్రభుత్వం భూములుగా రికార్డులో నమోదు చేయ్యడంతో, రిజిస్ట్రేషన్లు కాని, ఇళ్లపై రుణాలు కాని పొందలేని పరిస్థితి నెలకొందని, తమ భూముల్ని ప్రభుత్వ భూముల జాబితా నుంచి తొలగించాలని కోరుతు ఆ ప్రాంత వాసులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

## ఆర్యవైశ్య సంఘం సేవలు అభినందనీయం

**నందిగామ:** నందిగామ ఆర్యవైశ్య సంఘం అభినందనీయమైన సేవలు అందిస్తుంది. సంఘ నాయకుడు పారేపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో వాసవీ వృద్ధాప్య పెన్షన్లు అందిస్తున్నారు. ఆర్థికంగా ఎదిగిన ఆర్యవైశ్యుల సహాయంతో సంఘం 55 నెలలుగా ప్రతి నెలా పెన్షన్లు అందజేస్తుంది. పది మంది పేద వృద్ధులకు ఐదు వందల చొప్పున క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నారు. ఈనెల పట్టణానికి చెందిన చిలకల వేణుగోపాల్, ఉమామహేశ్వరి దంపతులు పెన్షన్‌లు అందజేశారు. దాతల సహకారంతో ఈకార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

**ఇబ్రహీంపట్నం:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ సంస్థలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు మంగళవారం బీజేపీ నూతన అధ్యక్షుడు విష్ణు కుమార్ రాజును విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ రిజియన్ ఉపాధ్యక్షుడు బొర్రా ప్రవీణ్, పార్టీ నాయకులు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రకటన

| | | | |
|---|---|---|---|
| 1. | బ్యాంక్ పేరు | | : ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002 |
| 2. | ఎన్నికల తేది | | : 27-07-2025 (ఆదివారం) |
| 3. | మేనేజింగ్ కమిటీకి ఎన్నుకోబడే సభ్యుల సంఖ్య | | : 2 (ఇద్దరు) మాత్రమే<br>ఒక ప్రొఫెషనల్ డైరెక్టర్ మరియు ఒక జనరల్ డైరెక్టర్ |
| 4. | మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవి కాలం | | : కాల వ్యవధి: 5 సంవత్సరములు - 07-08-2025 నుండి 06-08-2030 వరకు<br>(ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 లోని సెక్షన్ 21(3) ప్రకారం) |
| 5. | మేనేజింగ్ కమిటీ సభ్యత్వానికి పోటీ చేయదలచిన అభ్యర్ధులకు కావలసిన అర్హతలు | | : 1. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు కనీసం రెండు సంవత్సరాలు బ్యాంక్‌లో ఓటింగ్ సభ్యునిగా ఉండవలెను.<br>2. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు జరిగిన రెండు జనరల్ బాడీ సమావేశాలకు(2024 సం॥ మరియు 2025 సం॥) హాజరై ఉండవలెను.<br>3. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్ నెం.21 ప్రకారం ఎలాంటి అనర్హత కలిగి ఉండరాదు. |
| 6. | నామినేషన్ల స్వీకరణ | తేది<br>స్థలం<br>సమయం | : 14-07-2025 (సోమవారం)<br>: ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>: ఉదయం 9:00 గం॥ల నుండి మధ్యాహ్నం 01:00 గం॥ల వరకు |
| 7. | స్వీకరించిన నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : 14-07-2025 (సోమవారం)<br>: ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>: మధ్యాహ్నం 02:00 గం॥ల తరువాత |
| 8. | నామినేషన్ల పరిశీలన | తేది<br>స్థలం<br>సమయం | : ది.15-07-2025 (మంగళవారం)<br>: ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>: ఉ॥ 9.00 గం॥ల నుండి ఉ॥ 11-00 గం॥ల వరకు |
| 9. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : ది.15-07-2025 (మంగళవారం)<br>: ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>: మ॥ 12-00 గం॥ తరువాత |
| 10. | నామినేషన్లు ఉపసంహరణ | తేది<br>స్థలం<br>సమయం | : ది.16-07-2025 (బుధవారం)<br>: ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>: ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 11. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల తుది జాబితా ప్రచురణ మరియు చిహ్నాల కేటాయింపు | తేది<br>స్థలం<br>సమయం | : ది.16-07-2025 (బుధవారం)<br>: ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>: మ॥ 01-00 గం॥ తరువాత |
| 12. | పోలింగ్ తేది మరియు సమయం | తేది<br>స్థలం<br>సమయం | : ది.27-07-2025 (ఆదివారం)<br>: నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>: ఉ॥ 7.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 13. | ఓట్లు లెక్కింపు | తేది<br>స్థలం<br>సమయం | : ది.27-07-2025 (ఆదివారం)<br>: నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>: మ॥ 02-00 గం॥ల నుండి |
| 14. | ఫలితాల ప్రకటన | | : కౌంటింగ్ అయిన వెంటనే ది.27-07-2025 (ఆదివారం) |

తేది: 01-07-2025 (ఎం.వి.ఎస్. సతీష్ బాబు) ఎన్నికల అధికారి, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్థలం: గుంటూరు 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002, (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 క్రింద రిజిస్టర్ చేయబడినది, రిజిస్ట్రేషన్ నెం.431)
గమనిక: 1) ప్రతి అభ్యర్థి నామినేషన్ ఫీజు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) నామినేషన్ దాఖలు సమయంలో చెల్లించవలెను. 2) ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి అనర్హత కలిగి వుండకూడదు. 3) ఓటర్ల జాబితా ఎన్నికల అధికారి వద్ద అందుబాటులో ఉంటుంది. 4) ఓటర్ల జాబితా బ్యాంక్ యొక్క అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం: 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట నందు నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుంది.
గమనిక: 1) ఓటు వేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా బ్యాంక్ వారు జారీ చేసిన సభ్యత్వ నమోదు ఐడి కార్డు వంటి ఏదైనా ఆమోదించబడిన గుర్తింపు కార్డును ఓటరు తీసుకురావలెను.

## ఎంబీఏ అయితే హాస్టల్‌లో చేరాల్సిందే..

రాజధాని అమరావతి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి అక్కడ ఉన్న ఓ ప్రతిష్ఠాత్మక సంస్థలో ఎంబీఏలో చేరాడు. తొలి ఏడాదికి కోర్సు ఫీజు రూ.3.84 లక్షలకు సమ్మతిస్తూ ఆ విద్యార్థి రూ.10 వేలు అడ్మిషన్ ఫీజు చెల్లించాడు. ఇల్లు దగ్గరే కాబట్టి రోజూ కళాశాలకు వెళ్లి రావచ్చనుకున్నాడు. అయితే హాస్టల్‌లో చేరాలని, అందుకు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాను హాస్టల్‌లో చేరడమేమిటని ఆ విద్యార్థి వాపోతున్నాడు. డే స్కాలర్‌గా చదువుకుంటానని వేడుకున్నా వారు ఒప్పుకోలేదు. స్థానిక పెద్దలు ప్రశ్నించగా నిబంధనలు వర్తించవని యాజమాన్యం చెప్తోంది.

# హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

## రాజధాని విద్యార్థులపై.. ఫీజుల మోత

- స్థానికులైనా హాస్టల్‌లో ఉండాలని మెలిక
- డే స్కాలర్ ప్రవేశాలకు అంగీకరించని ఓ విద్యా సంస్థ
- తమ భూముల్లో సంస్థను నడుపుతూ ఇదేమిటని రైతుల ఆగ్రహం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇది రాజధాని అమరావతి పరిధిలోని ఈ ఒక్క విద్యార్థి పరిస్థితే కాదు.. అందరిదీ. తమ సమీపంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.. దూరాభారం తగ్గుతుంది. పిల్లలు ఇళ్ల నుంచి వెళ్లి చదువుకుంటారు అని భావించిన తల్లిదండ్రుల ఆశలు నిరాశగా మారాయి. అడ్మిషన్ల నుంచి ఫీజుల రాయితీ వరకు అన్యాయం జరుగుతుందోని పలువురు వాపోతున్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతులు ఇచ్చిన భూమిలో 100 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వం కారు చౌకగా ఆ విద్యా సంస్థకు ఇచ్చింది. విద్యా సంస్థ రావడం ద్వారా రాజధానిలోని విద్యా ర్థులకు, చుట్టుపక్కల జిల్లాల వారికి విద్యావకాశాలు పెరుగుతాయని భావించింది. అయితే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం మాటేమోగానీ ఇప్పుడు ఆ సంస్థ విద్యార్థుల నుంచి భారీగా ఆదాయాన్ని కోరుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. విద్యా సంస్థకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా హాస్టల్లోనే చేరాలని డిమాండ్ చేస్తోంది.గత ప్రభుత్వ హయాంలో కూడా ఫీజు రాయితీల విషయంలో సదరు విద్యా సంస్థ కఠినంగానే వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న ఒకరు రాజధానిలోని కొందరు విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వమని కోరగా, దాన్ని కూడా బుట్టదాఖలు చేసినట్లు రైతులు చెబు తున్నారు.

### పీ- 4 స్ఫూర్తికి దెబ్బ

ఇటీవల రాజధానిలోని ఓ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమానికి (మిగతా 8వ పేజీలో)

## హామీలెన్నో.. అమల్లో కొన్ని

- గురజాల నియోజకవర్గం పొందుగల పరిసర ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధి ప్రతిపాదనల దశలోనే ఉంది. పిడుగు రాళ్ల మెడికల్ కళాశాల, ఆస్పత్రి అందుబాటులోకి రాలేదు.

- పెదకూరపాడు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి కలగా మారింది. పారిశ్రామికవాడ ఏర్పాటుకు గారపాడులో ఊరి ఉమ్మడి భూమి 300 ఎకరాలు ఉంది. కృష్ణానది పక్కనే ప్రవహిస్తున్నా సాగు, తాగు నీరు అందక రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- చిలకలూరిపేట నియోజకవర్గం కోటప్ప కొండ రోడ్డులో ఆటోనగర్ ఏర్పాటు చేసినా లబ్దిదారులు అక్కడకు పోలేదు. పర్యాటక కేంద్రంగా కొండవీడు అభివృద్ధి ఏడాదిలో కొలిక్కి రాలేదు.

- సత్తెనపల్లి అచ్చంపేట రోడ్డులోని రైల్వే గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు సాగడం లేదు. గోదావరి పెన్నా నదుల అనుసంధానం పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

- వినుకొండలో అగ్రికల్చర్ కళాశాల మంజూరు ముందడుగు పడలేదు. ప్రభుత్వాస్పత్రిని వంద పడకల స్థాయికి పెంచాలన్న హామీ పెండింగ్‌లో ఉంది.

- నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం వీరవట్నం, పరగటిచర్ల ఎత్తిపోతల పథకాల హామీలు అమల్లోకి రాలేదు. నియోజకవర్గంలో 50కి పైగా కమ్యూనిటీ హాళ్ల, షాదీఖానాలు, విప్పర్లపల్లి రహదారిలో ఓగేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణాలు, వల్లపు చెరువు సుందరీ కరణ ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి.

- మాచర్ల నియోజకవర్గంలో రూ.1200 కోట్లతో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. పట్టణంలో 100 పడకల ఆస్పత్రికి భూమి కేటాయించారు. వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు వచ్చి ఉండగా పనులు ప్రారంభం కాలేదు.

కొండవీడు ఘాట్ రోడ్డు

# ప్రజల చెంతకు.. పాలకులు

## నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు

- ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి
- ఇంటింటికీ టీడీపీ పేరిట కార్యక్రమాలకు శ్రీకారం
- ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలూ భాగస్వామ్యం
- చేసిన మంచి వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు జనంలోకి

చేసిన మంచిని వివరిస్తూ.. రాబోయే నాలుగేళ్లలో చేసే అభివృద్ధిని.. పనులను వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు పాలకులు ప్రజలను నేరుగా కలిసేందుకు సిద్ధమయ్యారు. కూటమి పాలనకు ఏడాది గడిచింది. గత వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలు తేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో గత వైసీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రజా పాలనకు తేడాలను వివరించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి బుధవారం నుంచి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేం దుకు నెల రోజుల కార్యక్రమం నిర్వహించేలా నేతలు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో నేతలతో పాటు కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజెప్పడంతో పాటు ప్రజల నుంచి సలహాలు స్వీకరించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 'చేసిన మంచి పనులు చెప్పుకోవాలి.. ఏ నాయకుడైనా ప్రజల్లోకి వెళ్లడానికి నామోషీపడకూడదు' అని చంద్రబాబు స్పష్టం చేయగా నేతలందరూ ప్రజలను ప్రత్యేకంగా కలిసేందుకు సమాయత్తమయ్యారు.

వరికిపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'సుపరిపాలనకు తొలి అడుగు' అంటూ ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రజలతో మమేకమవ్వడంతోపాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లేలా టీడీపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందించింది. ఈ ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గాల్లో చేపట్టబోయే పనులను ప్రజలకు వివరించి వారి స్పందన తెలుసుకోవడమే లక్ష్యంగా బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. చేసిన మంచి పనులను ప్రజలకు జెప్పాలని.. అదే సమయంలో (మిగతా 8వ పేజీలో)

## ఇసుక అక్రమ మైనింగ్‌పై.. ప్రభుత్వం చర్యలు

- వైసీపీ హయాంలో ఇసుక ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు సిద్ధం
- ఏపీ ఎస్‌ఏసీ నివేదిక ఆధారంగా డీఎల్ఎస్‌సీ నిర్ణయం
- వివరణ ఆధారంగా తదుపరి చర్యలు

8

## ఏఎన్ఎంల కౌన్సెలింగ్ వివాదాస్పదం

- ఆన్‌లైన్ పేరుతో అన్యాయం అంటూ ఆరోపణలు
- మామూళ్లు ఇస్తే.. కోరుకున్న చోటు పదిలం?

## భూ ఆక్రమణలపై విచారణ

- కబ్జాకు గురైన భూ రికార్డుల పరిశీలన
- సమగ్ర విచారణ జరపాలి: చీఫ్ విప్ జీవీ

## మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

## ఇంజక్షన్ వికటించి బాలిక మృతి?

6

## గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

# చేతి కంది ధరలేక..!

- కంది రైతు కంట నీరు
- కొనుగోళ్లు నిలిపివేసిన మార్క్‌ఫెడ్
- మార్కెట్‌లో పతనమైన ధర
- అమ్ముకోలేక అన్నదాతల అగచాట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పండించిన కంది పంటను అమ్ముకోలేక అన్నదాతలు అల్లాడుతున్నారు. వేలాది క్వింటాళ్ల నిల్వలు లొగిళ్లలోనే ఉండిపోయాయి. ప్రభుత్వం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేసింది. మార్కెట్‌లో ధర పతనమైంది. దీంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ కూడా చేతులెత్తేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. కంది కోనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



### మార్కెట్‌లో ధర లేదు..

మార్కెట్‌లో కంది ధర పడిపోయింది. క్వింటా కందులు రూ 6,500 లోపే ఉందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించే పరిస్థితి (మిగతా 8వ పేజీలో)

# ఇంజనీరింగ్ సీట్లు 30,240

- ఉమ్మడి జిల్లా జాబితా విడుదల
- సెట్ అర్హత సాధించిన విద్యార్థులు 23,536
- అదనపు సీట్లు 6,700
- కౌన్సెలింగ్ ఆలస్యమైతే కళాశాలలకు నష్టం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రైవేటు కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ సీట్ల జాబితాను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. రెండు యూనివర్శిటీలు, 36 ఇంజనీరింగ్ కళాశాలల్లో 30,240 సీట్లు ఈ ఏడాది అందుబాటులోకి(ఇన్‌టెక్) రానున్నాయి. ఈ ఏడాది మేలో జరిగిన ఏపీ ఈఏపీ సెట్(ఎంసెట్) పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత నెల 8న విడుదలైన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 23,536 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తాజాగా సాంకేతి విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో సీట్లు 32,240 ఉన్నాయి. అంటే దాదాపు 6,700 సీట్లు అదనంగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

### కౌన్సెలింగ్ జాప్యం అయితే ఇబ్బందులే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ జాప్యం వల్ల భారీ స్థాయిలో సీట్లు (మిగతా 8వ పేజీలో)

# హామీలన్నీ నెరవేరుస్తాం

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- పార్టీలు కాదు అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే యరపతినేని
- సిమెంట్ ఫ్యాక్టరీల బాధితులకు నష్టపరిహారం పంపిణీ

6

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ లావు, వేదికపై ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్‌బాబు

## ఔషధాల అక్రమ నిల్వ కేసులో జైలు శిక్ష

నరసరావుపేట లీగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఔషధాల నిల్వ చేసి, రికార్డులు నిర్వహించకుండా.. రసీదులు ఇవ్వలేదని నేరం రుజువు కావడంతో.. పట్టణంలోని షిర్డి వెంకట మహేష్ కుమార్‌కు సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.55 వేల జరిమానా విధిస్తూ దిగువ కోర్టు విధించిన శిక్షను స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మంగళవారం యథావిధిగా ఖరారు చేసింది. నిందితుడు అక్రమంగా ఔషధాల నిల్వ ఉంచుకుంది.. 2016లో అప్పటి నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు అవ్వడంతో 2020 జనవరి 21న నర్సరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శిక్ష ఖరారు చేస్తూ.. తీర్పునిచ్చారు. నిందితుడు తీర్పుపై జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నారు. అదనపు న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథావిధిగా కొనసాగించింది.

## ఇంజక్షన్ వికటించి బాలిక మృతి?

నరసరావుపేట లీగల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద చెరువుకు చెందిన బేబీ ఆయిషా(5) అనే చిన్నారి ఓ ఆర్ఎంపీ ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత మృతి చెందడం ఆందోళనకు దారితీసింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. పెద్ద చెరువులోని ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నివసించే అహ్మద్ కుమార్తె ఆయిషా (5) దగ్గుతో, జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకెళ్లారు. ఆర్ఎంపీ ఓ ఇంజక్షన్ ఇచ్చాడు. ఇంటికి వెళ్లిన తర్వాత పాప కడుపు నొప్పి వస్తుందని చెప్పడంతో.. గుంటూరు రోడ్డులోని ఓ చిన్న పిల్లల వైద్యశాలకు తీసుకెళ్లారు. పాప పరిస్థితి విషమంగా ఉందని లైఫ్‌లైన్ వైద్యశాలకు తీసుకెళ్లమని వైద్యులు రిఫర్ చేశారు. ఆ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే పాప చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పాప బంధువులు మృతదేహాన్ని పీఎంపీ వైద్యశాల వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి వచ్చి బందోబస్తు నిర్వహించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## 45,067 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,085 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,067 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,953 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | ఆర్మూరు | 9700 | 11000 |
| 334 | 9500 | 13000 | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| నెంబరు. 5 | 10000 | 13200 | 334 | 9500 | 12800 |
| 273 | 10000 | 12500 | నెంబరు. 5 | 10000 | 13300 |
| 341 | 10000 | 13500 | 341 | 10000 | 13300 |
| సూపర్ 10 | 9700 | 12400 | 4884 | 10000 | 12400 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | సూపర్ 10 | 9800 | 12800 |
| తేజ | 10000 | 13700 | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| షార్క్-1 | --- | --- | తేజ | 10000 | 13500 |
| బ్యాడిగి | 10000 | 12800 | బ్యాడిగి | 10000 | 12800 |
| సింజెంటా బ్యాడిగి | --- | --- | దేవనూరు డీలక్స్ | --- | --- |
| దేవనూరు డీలక్స్ | --- | --- | తాలుకాయలు | 4500 | 7000 |

# హామీలన్నీ నెరవేరుస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ● సిమెంట్ ఫ్యాక్టరీల బాధితులకు నష్టపరిహారం పంపిణీ

దాచేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్క హామీని నెరవేర్చుకుంటూ వస్తోందని, మరో నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, త్వరలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో మంగళవారం భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల పంట నష్టం, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు నష్టపరిహారం, భూములు కోల్పోయిన రైతు కుటుంబాల వ్యక్తులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ లావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. బాధితులకు ఉద్యోగ నియామక పత్రాలు, నగదు చెక్కులను పంపిణీ చేశారు. దీని కోసం 20 ఏళ్లగా ఎదురు చూస్తున్న బాధిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సభలో ఎంపీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. తాగునీటి హామీలో భాగంగా.. గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు నాగార్జున సాగర్ నుంచి నీరు అందించేందుకు రూ.1,200 కోట్లతో టెండర్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. గత 40 ఏళ్లగా గురజాల నియోజక వర్గ ప్రజలతో తాను మమేకమై ఉన్నానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. తనకు ఓట్లు వేసినా.. వేయక పోయినా ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా 50 మందికి ఉద్యోగ నియామకాలు చేశామని తెలిపారు. ఫ్యాక్టరీల దుమ్మూ ధూళితో పంట నష్ట పోయిన రైతులకు, బ్లాస్టింగ్‌తో నివాస గృహాలు దెబ్బతిన్న 317 మంది బాధితులకు రూ.1,22,62,850 నష్ట పరిహారంగా చెల్లించినట్లు వెల్లడించారు. నష్ట పరిహారం పొందిన వారిలో 60 శాతం వైసీపీ వారేనని పేర్కొన్నారు. ఇంకా మరికొంత మందికి ఇప్పించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బాధితులకు నమూన నగదు చెక్కు అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ అరుణ్‌బాబు

### మౌలిక వసతులు కల్పిస్తాం

సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములు ఇచ్చిన పెదగార్లపాడు, తక్కెళ్ళపాడు, తంగెడ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చిందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఇప్పటికే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నష్ట పరిహారం ఇప్పించామని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా ఇప్పించే అవకాశం కల్పిస్తామన్నారు.

# వైసీపీని సమాజం నుంచి వెలివేయాలి : యరపతినేని

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ఇంటింటికి వెళ్లనున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు అమలు చేసే క్రమంలో.. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజా మద్దతు ఉందని పేర్కొన్నారు. ఇంటింటికి టీడీపీ శ్రేణులు వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని సూచించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయ్యిందని, తాలిబన్ల పాలనలా కొనసాగించారని మండిపడ్డారు. గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేయడమే కాకుండా.. ప్రతి నెలా 1న ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. రెంటపాళ్లలో జగన్ యాత్ర.. జనానికి మరణ యాత్రలా సాగిందన్నారు. జగన్ కారు కింద సింగయ్య మృతి చెందితే.. ఒక్కరైనా కారును నిలిపిన దాఖలాలు లేవన్నారు. పైగా రప్పా రప్పా.. పొట్టేళ్ల తలలను నరికినట్లు నరుకుతామంటూ ఫ్లెక్సీలు చేతబూని నినాదాలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలపై మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు యరపతినేని తెలిపారు.

# భూ ఆక్రమణలపై విచారణ

● కబ్జాకు గురైన భూ రికార్డుల పరిశీలన ● సమగ్ర విచారణ జరపాలి: చీఫ్ విప్ జీవీ

భూ రికార్డులను పరిశీలిస్తున్న సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ హరికృష్ణ, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పరిధిలో ఆక్రమణలకు గురైన భూములపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'కంటపడితే కబ్జా' అనే కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బ్రిడ్జి వద్ద గల తిమ్మాయపాలెం పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 721లో 3.14 ఎకరాల కుంట భూమి ఆక్రమణపై విచారణ చేపట్టాలని తహసీల్దార్ సురేష్‌నాయక్‌ను ఆదేశించారు. ఆర్ఐ హరికృష్ణ రెవెన్యూ సిబ్బందితో కుంట భూమిని సందర్శించారు. విచారణలో వెల్లడైన అంశాలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ సురేష్‌నాయక్ తెలిపారు. భూ కబ్జాలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆర్డీవో మధులతతో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమణలకు గురైన భూములను కాపాడాలని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, విచారణ చేయాలని ఆదేశించారు. లోకాయుక్తకు 2022లో అప్పటి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఇచ్చిన నివేదిక ఆధారంగా సమగ్ర విచారణ జరపాలని తెలిపారు. తిమ్మాయపాలెం రెవెన్యూలోనూ, గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి ఆనుకొని మార్కాపురం రోడ్డులోని బ్రిడ్జి వద్ద ఉన్న భూముల రికార్డులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే నంబరు 720/4లో 7.70 ఎకరాలు, 741/13లో 37.74 ఎకరాలు, 739/1లో 66 సెంట్లు, 717/5లో 1.78 ఎకరాల్లో చుక్కల భూమి ఉన్నట్లు లోకాయుక్తకు కలెక్టర్ నివేదిక ఇవ్వడం జరిగిందని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో జరిగిన తప్పిదాలను, అందుకు కారకులైన ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జీవీ ఆదేశించారు.

## గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాగుపాలెంలో ఓగేరు వాగు కొత్త బ్రిడ్జి వద్ద గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు అరకిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ పి. రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.హజరత్తయ్య, సిబ్బంది నిఘా పెట్టి దాసరి పవన్ సాయి (36), కటికల సింగయ్య (21), వేముల దుర్గా ప్రసాద్ (24)ను అదుపులోకి తీసుకున్నారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరిచగా.. రిమాండ్ విధించారు.

## మైనార్టీ బాలికల గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.బాలశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి పరీక్ష రాయకుండా ఐదు, ఆరు, ఏడు ఎనిమిది తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు 871262 5039, 63020 18886 నంబర్లకు సంప్రందించాలని ఆయన తెలిపారు.

## వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ గోపిరెడ్డి



డాక్టర్ గోపిరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నేతలు

నరసరావుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ ప్రెసిడెంట్ పదవిపై నెలకొన్న ప్రచారానికి అధిష్ఠానం తెరదించింది. మాజీ మంత్రి విడదల రజని, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్లు కూడా పరిశీలించినప్పటికీ గోపిరెడ్డి పేరును ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో నిందితుడిగా ఉండటంతో ఆయన పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గోపిరెడ్డిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైసీపీ నియమించింది. పార్టీ నేతలు, కార్యకర్తలు డాక్టర్ గోపిరెడ్డిని ఘనంగా సత్కరించి, ఆయనకు అభినందలు తెలిపారు. తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తానని, అన్ని నియోజకవర్గాల సమన్వయ కర్తల సలహాల మేరకు పార్టీని పటిష్ఠం చేస్తానని చెప్పారు.

# పింఛను సొమ్ము గోల్‌మాల్

● రూ.9.50 లక్షలు సొంతానికి వాడుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ● నాలుగు నెలల తర్వాత వెలుగులోకి

యడ్లపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడులో సామాజిక పింఛను నగదు గోల్‌మాల్ అయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రమైన యడ్లపాడు 1, 2 సచివాలయాల పరిధిలో చోటుచేసుకుంది. సచివాలయం 1 వెల్ఫేర్ అసిస్టెంట్ రెండవ సచివాలయానికి కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీని వెల్ఫేర్ అసిస్టెంట్‌కే అప్పగించారు. ప్రతి నెలా పింఛన్ పంపిణీ అనంతరం మిగులు నగదును 7వ తేదీ లోపు చలనా లేదా ఆన్‌లైన్, యూపీఐ ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలి. ఇలా అతని వద్ద నుంచి నాలుగు నెలల కాలంలో యడ్లపాడు-1 సచివాలయ పరిధిలో పంపిణీ కాని పింఛన్ల నగదు రూ.4,77లక్షలు, యడ్లపాడు-2 పరిధిలో రూ.4,73,500 కలిపి మొత్తం రూ.9,50,500 సొంతానికి వాడుకున్నట్లు అధికారులు తేల్చారు. ఉద్యోగి వాడుకున్న మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమచేయించేందుకు కసరత్తు చేస్తున్నారు. నిధులు జమకాని విషయాన్ని డీఆర్‌డీఏ అధికారులు ఎప్పటికప్పుడు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. ఈ విషయమై సదరు ఉద్యోగిని ప్రశ్నించగా తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో గతంలో చెల్లించిన చలానాలలో మార్పులు చేసి.. ప్రస్తుత నెలల్లో జమ చేసినట్లుగా చూపించేవాడు. సాంకేతిక లోపంతో డీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో కనిపించడం లేదని నమ్మించాడు. కొన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు వాస్తవంగా జమచేసినా అవి కూడా ఆన్‌లైన్‌లో కన్పించకపోవడంతో ఎంపీడీవోకు ఎలాంటి అనుమానం రాలేదు. నాలుగు రోజుల కిందట డీఆర్డీఏ అధికారులు చలానాలు తీసుకుని జిల్లా కార్యాలయానికి రావాల్సిందిగా సూచించారు. అక్కడ పరిశీలించగా.. సదరు చలానా నంబర్లు సరిపోలేదు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నిలదీయగా నగదు సొంతానికి వాడుకున్నట్లు అంగీకరించాడు.

## పిన్నెల్లి సోదరులకు హైకోర్టులో తాత్కాలిక ఊరట

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. గత మే నెల 24వ తేదీన వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల జంట హత్య కేసులో ఏ6, ఏ7గా పిన్నెల్లి సోదరులు ఉన్నారు. తమకు ముందస్తు బెయిల్ కావాలని మంగళవారం హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానంలో వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై వారం రోజులపాటు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

## తురకా కిశోర్‌కు 14 రోజులు రిమాండ్

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ మున్సిపల్ ఛైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌కు 14 రోజులు రిమాండ్ విధించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో 2019లో టీడీపీ కార్యకర్త పాశం అమరయ్యపై దాడి చేసిన సంఘటనలో తురకా కిశోర్ నిందితుడు. దుర్గి పోలీసులు మంగళవారం గుంటూరు జిల్లా జైలు నుంచి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ వద్ద హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసుల తరుపున పిడుగురాళ్ల పీపీ వినయ్ వాదనలు వినిపించగా, కిశోర్ తరపున న్యాయవాది గుంజె వరప్రసాద్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్.. కిశోర్‌కు 14 రోజులు రిమాండ్ విధించడంతో దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ ఎస్కార్ట్‌తో కిశోర్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

## పండగ వాతావరణంలో 'తొలి అడుగు' : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో సుపరిపాలనకు తొలి అడుగు ఇంటింటికీ ప్రచార కార్యక్రమం బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పింఛను నగదు ఒకేసారి రూ.4 వేలకు పెంచి 64 లక్షల మందికి ఒకటో తేదీనే ఇంటి వద్దకే వెళ్లి అందిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా దీపం-2 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ చేశామని పేర్కొన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 184.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 194.00 |


### సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడీ: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

**SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన**

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) మెసర్స్ ఆర్.బి ప్యాక్స్, ఎస్.నం.721, మెయిన్ రోడ్, పసుమర్రు గ్రామం, చిలకలూరిపేట, చిలకలూరిపేట మండలం, గుంటూరు-522616. నం.2) శ్రీమతి మేడికొండూరి రాధిక అలియాస్ హారిష, భర్త మేడికొండూరి రాంబాబు, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, కళామందిర్ సెంటర్ సమీపాన, చిలకలూరిపేట-522616. నం.3) శ్రీ మేడికొండూరి రాంబాబు, తండ్రి మేడికొండూరి రాఘవయ్య, డి.నం.16-81, బొబ్బల సత్యనారాయణ వీధి, కళామందిర్ సెంటర్ సమీపాన, చిలకలూరిపేట-522616 వారి నుండి 10.12.2024 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి 09.12.2024 నాటికి రూ.36,98,005/- (రూపాయలు ముప్పై ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల ఐదు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంక్‌కు తనఖా పెట్టిన స్థిరాస్తి
(శ్రీమతి మేడికొండూరి రాధిక అలియాస్ హారిష, భర్త మేడికొండూరి రాంబాబుకు చెందిన ఆస్తి)

గుంటూరు జిల్లా, చిలకలూరిపేట సబ్ జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట మండలం, పసుమర్రు గ్రామ పంచాయతీ ఏరియాలో గల పసుమర్రు గ్రామ డి.నం.721 లోని భవిష్యత్తులో దానిపై నిర్మించబోయే నిర్మాణాలు మరియు ప్రస్తుత ఏదేని నిర్మాణంలో ఉన్న నిర్మాణాలతో పాటు 735.680 చ.గజ స్థలం, ఆస్తి యావత్తు. సరిహద్దులు: తూర్పు: మార్గం కొరకు వదిలివేయబడిన నడవ 12 అడుగులు- 209 లింకులు, దక్షిణం:సర్కార్ డొంక-80 లింకులు, పశ్చిమం: పల్లపు కృష్ణ భూమి-171 లింకులు, ఉత్తరం: కందిమల్ల నారాయణస్వామి భూమి-80 లింకులు.

**రిజర్వు ధర: రూ. 50,00,000/-**
(రూపాయలు యాభై లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

| రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీ : | ప్రదేశం |
|---|---|
| 24-07-2025 | సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, 7-376/1, గాంధీపేట, ఎస్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616 టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148 |

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, 7-376/1, గాంధీపేట, ఎస్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు-522616 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08647-257444, సెల్ నం.9398314148లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెటును అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేదీ : 30.06.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN-L65110TN1904PLC001287.
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com



### ఎన్నికల ప్రకటన

| | | | | |
|---|---|---|---|---|
| 1. | బ్యాంక్ పేరు | | : | ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002 |
| 2. | ఎన్నికల తేది | | : | 27-07-2025 (ఆదివారం) |
| 3. | మేనేజింగ్ కమిటీకి ఎన్నుకోబడే సభ్యుల సంఖ్య | | : | 2 (ఇద్దరు) మాత్రమే<br>ఒక ప్రొఫెషనల్ డైరెక్టర్ మరియు ఒక జనరల్ డైరెక్టర్ |
| 4. | మేనేజింగ్ కమిటి సభ్యుల పదవి కాలం | | : | కాల వ్యవధి: 5 సంవత్సరములు - 07-08-2025 నుండి 06-08-2030 వరకు (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 లోని సెక్షన్ 21(3) ప్రకారం) |
| 5. | మేనేజింగ్ కమిటి సభ్యత్వానికి పోటీ చేయదలచిన అభ్యర్థులకు కావలసిన అర్హతలు | | : | 1. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు కనీసం రెండు సంవత్సరాలు బ్యాంక్‌లో ఓటింగ్ సభ్యునిగా ఉండవలెను.<br>2. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు జరిగిన రెండు జనరల్ బాడీ సమావేశాలకు(2024 సం॥ మరియు 2025 సం॥) హాజరై ఉండవలెను.<br>3. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్ నెం.21 ప్రకారం ఎలాంటి అనర్హత కలిగి ఉండరాదు. |
| 6. | నామినేషన్ల స్వీకరణ | తేది<br>స్థలం<br>సమయం | : | 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉదయం 9:00 గం॥ నుండి మధ్యాహ్నం 01:00 గం॥ల వరకు |
| 7. | స్వీకరించిన నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : | 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>మధ్యాహ్నం 02:00 గం॥ల తరువాత |
| 8. | నామినేషన్ల పరిశీలన | తేది<br>స్థలం<br>సమయం | : | ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి ఉ॥ 11-00 గం॥ల వరకు |
| 9. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : | ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 12-00 గం॥ తరువాత |
| 10. | నామినేషన్లు ఉపసంహరణ | తేది<br>స్థలం<br>సమయం | : | ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 11. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల తుది జాబితా ప్రచురణ మరియు చిహ్నాల కేటాయింపు | తేది<br>స్థలం<br>సమయం | : | ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 01-00 గం॥ తరువాత |
| 12. | పోలింగ్ తేది మరియు సమయం | తేది<br>స్థలం<br>సమయం | : | ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>ఉ॥ 7.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 13. | ఓట్లు లెక్కింపు | తేది<br>స్థలం<br>సమయం | : | ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>మ॥ 02-00 గం॥ల నుండి |
| 14. | ఫలితాల ప్రకటన | | : | కౌంటింగ్ అయిన వెంటనే ది.27-07-2025 (ఆదివారం) |

తేది: 01-07-2025 (ఎం.వి.ఎస్. సతీష్ బాబు) ఎన్నికల అధికారి, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్థలం: గుంటూరు 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002, (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 క్రింద రిజిస్టర్ చేయబడినది, రిజిస్ట్రేషన్ నెం.431)

గమనిక: 1) ప్రతి అభ్యర్థి నామినేషన్ ఫీజు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) నామినేషన్ దాఖలు సమయంలో చెల్లించవలెను. 2) ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి అనర్హత కలిగి వుండకూడదు. 3) ఓటర్ల జాబితా ఎన్నికల అధికారి వద్ద అందుబాటులో ఉంటుంది. 4) ఓటర్ల జాబితా బ్యాంక్ యొక్క అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం: 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట నందు నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుంది.

గమనిక: 1) ఓటు వేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా బ్యాంక్ వారు జారీ చేసిన సభ్యత్వ నమోదు ఐడి కార్డు వంటి ఏదైనా ఆమోదించబడిన గుర్తింపు కార్డును ఓటరు తీసుకురావలెను.

### ఉద్యోగావకాశాలు

➜ Wanted a well experienced Principal Wanted Eng. P.S. Social Staff for 8th to 10th. Contact : Sarojini Vidyalayas, Prathipadu & Pulladigunta, Guntur (Dt), Ph : 9491213407, 9542547509.
AJG-239200

➜ High school Biology, Physics, Hindi, social, PET, computer operator and mother teachers. Sri Vidhya High School, NGGOs colony, Gnt. Cont : 9701022900
SSD-1476

➜ గుంటూరు, నల్లపాడు రోడ్డులో గల శ్రీ నాగసాయి మందిర్‌లో స్వామి వారికి అర్చనాది కైంకర్యములు చేయుటకు అర్చకులు కావలెను. వసతి మరియు జీతము ఇవ్వబడును. వ్యక్తిగతముగా సంప్రదించవలెను. మేనేజర్: 93927 43225
AJG-239426

➜ NK అగ్రో ఎక్స్‌పోర్ట్ Pvt.Ltd, తోడేళ్ళగూడెం గ్రా, డోర్నకల్ మం, మహబూబాబాద్ జిల్లాలో పని చేయుటకు చిల్లిపౌడర్ మెషినరీ ఆపరేటర్స్-3 No.s కావలెను. అర్హత : ITI / పాలిటెక్నిక్ డిప్లొమా (ఏదైనా బ్రాంచ్), మెషీన్ ఆపరేటర్‌గా 3 నుండి 4 సం.లు అనుభవము వుండాలి. సంప్ర॥ 9949976505, మెయిల్ : hr@nkexpo.com
AJG-238772

### ఉచిత జాబ్ ట్రైనింగ్

➜ తెనాలిలోని వైష్ణవి విద్యా సంస్థలో 3 నెలలు ఉచిత హాస్టల్ వసతి, జాబ్ ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ప్లేస్‌మెంట్ ఇవ్వబడును. అర్హత : 10th పాస్ ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి సెల్ నెం : 9290769284, 9701399994
AJG-239363

### SHARES

➜ షేర్ మార్కెట్ & మ్యూచువల్ ఫండ్స్ (బేసిక్స్, ఫండమెంటల్స్ & టెక్నికల్స్) ట్రైనింగ్ కోర్సు (రెగ్యులర్ / సండే బ్యాచ్) ఫ్యాకల్టి బై NSE సర్టిఫైడ్ మార్కెట్ ప్రొఫెషనల్, GNT, Cont : 98854 69566.
RK-620

### పోయినవి

### పాస్‌పోర్ట్ పోయినది

➜ నా పేరున దెందుకూరి రాధామాధవి D/o దెందుకూరి రాధాకృష్ణమూర్తి, ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ A7485007 డేట్ ఆఫ్ పాస్‌పోర్ట్ జారీ 26-03-1999 Dae of Expiry 25-03-2009 గల పాస్‌పోర్ట్ పిట్టలవానిపాలెం నుండి గుంటూరుకి బస్‌లో వెళ్తుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికినచో ఈ అడ్రస్‌కు డి.నెం. 11-139,పిట్టలవానిపాలెం గ్రామం, మండలం, బాపట్ల జిల్లా-522329 నందు తెలియజేయగలరు. / పంపగలరని కోరుచున్నాము.
AJG-RPL

### స్థలం అమ్మకము

➜ గుంటూరు, అమరావతి రోడ్డు రెడ్డిపాలెం హిమని నగర్, 2వలైను, సచివాలయం ప్రక్కన 300 గజాల దక్షిణం ఫేస్ స్థలం అమ్మబడును. 150 + 150 గజాలుగా కూడా అమ్మబడును. ఫోన్ : 63058 39392, 80991 47726
AJG-239429

### గోల్డ్ ఫైనాన్స్

### బంగారం కొనబడును

➜ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235545

### CHANGE OF NAME

➜ I, GANGINENI VENKATESWARLU S/o Late KONDAIAH, aged 49 years, R/o D.No.1-55, Nuzendla Vill, Nuzendla Mdl, Palnadu Dist, AP, hereby state that my name as GANGINENI VENKATESWARLU mentioned in my Aaadhaar No.4492 8356 3323 and as VENKATESWARULU GANGINENI in my 10th class marks memo, both names belong to me.
AJG-239030

### పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

### సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

| | |
|---|---|
| గుంటూరు 1 టౌన్ | 97036 18725 |
| గుంటూరు 2 టౌన్ | 99854 01056 |
| తెనాలి | 99854 11202 |
| నరసరావుపేట | 99854 11206 |
| బాపట్ల | 99663 35084 |
| పిడుగురాళ్ళ | 93909 05725 |
| మంగళగిరి | 93986 73618 |
| అమరావతి | 95027 86195 |
| పొన్నూరు | 97042 99094 |
| రేపల్లె | 99854 12254 |
| చిలకలూరిపేట | 91103 23914 |
| వినుకొండ | 99662 50266 |
| మాచర్ల | 88861 19952 |
| సత్తెనపల్లి | 97048 67908 |
| ప్రత్తిపాడు | 63004 34285 |

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11225 | 99854 01330
99854 01690 | 99854 77867

## నేడు మాడుగులలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

గురజాలటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు బుధవారం మండలంలోని మాడుగులలో పర్యటించనున్నారు. మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహావిష్కరణతోపాటు రామాలయం వద్ద నిర్వహించనున్న సమావేశంలో పాల్గొననున్నారు. పల్లెనిద్రలో భాగంగా రాత్రి గ్రామంలోనే బస చేయనున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బెల్లంకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం విద్యుత్ నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏఈ పవన్‌కుమార్ పేర్కొన్నారు. బెల్లంకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని మాచాయపాలెం 11కేవీ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్, మాచాయపాలెం, చంద్రా జుపాలెం, కందిపాడు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఏఈ పేర్కొన్నారు.

● పిడుగురాళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కొండమోడు సబ్‌స్టేషన్ 11-కేవీ టౌన్ ఫీడర్‌లో మరమ్మతులు దృష్ట్యా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ సైదారావు తెలిపారు. శ్రీనివాసకాలనీ, బ్రహ్మానందరెడ్డి కాలనీ, మారుతీ మహాలక్ష్మీ థియేటర్ల వెనుకవైపు, డ్రైవర్స్ కాలనీ, జానపాడు మెయిన్‌రోడ్డు, పీడబ్ల్యూడీ కాలనీ, రైల్వేస్టేషన్ పక్కన ఎస్సీ కాలనీ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏఈ తెలిపారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

రెంటచింతల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయి జంక్షన్‌కు చెందిన యువతి అదృశ్యమైంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పుతోళ్ల శ్రీను, గోపమ్మ మూడో కుమార్తె రాజేశ్వరి పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ నర్సరీలోకి పనికెళ్తుంది. అయితే ఈ నెల 27న ఉపాధి కోసం వెళ్లిన రాజేశ్వరి ఇంటికి తిరిగి రాలేదు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత తల్లి గోపమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు.

## ఎఫ్ఏసీ ఎంపీడీవోగా సీహెచ్ శ్రీనివాసరావు

శ్రీనివాసరావు

రెంటచింతల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండల ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జ్) ఎంపీడీవోగా సీహెచ్ శ్రీనివాసరావును నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగానే పనిచేస్తున్నారు. ఇప్పటి దాకా ఇక్కడ పనిచేసిన కె.సరోజనిదేవి గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. సీహెచ్ శ్రీనివాసరావు పంచాయతీ రాజ్ వ్యవస్థలో వివిధ హోదాల్లో 38 సంవత్సరాల అనుభవం పొందారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపీడీవో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిశారు.

## శివాలయం చైర్మన్‌గా కొత్త గోపాలరావు

రెంటచింతల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ రెంటచింతలలో వందల ఏళ్లనాటి అతిపురాతనమైన శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) నూతన అధ్యక్షుడి పేరును ఖరారు చేస్తూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ప్రముఖ టీడీపీ నేత ఆర్యవైశ్య వర్గానికి చెందిన కొత్త గోపాలరావుతో పాటు మరో 9 మంది కమిటీ సభ్యులను ప్రకటించారు. పల్నాట ప్రముఖ శైవ క్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్‌గా కూడా ఆర్యవైశ్య వర్గానికే చెందిన గుండా వెంకట శివయ్యను ఫైనల్ చేసిన ఎమ్మెల్యే దేవాలయ పాలకమండళ్ల ఏర్పాటులో ఆర్యవైశ్య వర్గీయులకు అత్యధిక ప్రాధాన్యమివ్వడం విశేషం.. తనకు పదవి రావడానికి కారకులైన టీడీపీ నేతలకు గోపాలరావు కృతజ్ఞతలు తెలిపారు.

## న్యూటన్స్‌లో సైబర్ క్రైంపై అవగాహన

మాచర్ల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. నేషనల్ సైబర్ క్రైం చీఫ్ అబ్జర్వర్ ప్రదీప్‌కుమార్ విద్యార్థులకు సైబర్ క్రైం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 90 శాతం పింఛన్ల పంపిణీ

నకరికల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను మంగళవారం 90శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీకే కేవీఎస్ ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలి

నకరికల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేరు చేయాలని ఎంపీడీవో జీ కాశయ్య సూచించారు. మంగళవారం నరసింగపాడులో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీకే కేవీఎస్ ప్రసాదు, పీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

దుర్గి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్ అన్నారు. మంగళవారం దుర్గిలో జరిగిన సీఐటీయూ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కరపత్రాలను విడుదల చేశారు.

## అవ్వా, తాతల సంక్షేమమే మా ధ్యేయం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కారంపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అవ్వా, తాతల సంక్షేమమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని వినుకొండ రోడ్డులో మంగళవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవ్వా తాతలకు గృహాలకు వెళ్లి స్వయంగా పింఛన్‌ను పంపిణీ చేశారు. వినుకొండ రోడ్డు, లింగబలిజ వీధిలో పింఛన్లను అందించారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, గోళ్ల సురేష్ యాదవ్, మునుగోటి సత్యం, ఉన్నం లక్ష్మీనారాయణ, బొల్నేడి శ్రీనివాసరావు, బూసా రామాంజినేయులు, ఎంపీపీ గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, సర్పంచ్ సర

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

స్వతి బాలునాయక్, బొమ్మిన శేషగిరి, బొల్నేడి కోటేశ్వరరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, ఎస్‌పీఆర్ కృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉంది

కారంపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మండలంలోని నరమాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ముదరాజు రవికుమార్ మృతి చెందాడు. రవికుమార్ టీడీపీ సభ్యత్వం తీసుకోవడంతో మంగళవారం కారంపూడిలో అతని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ప్రమాద బీమా రూ.5 లక్షల నగదు చెక్కును అందజేశారు.

## పిన్నెల్లిలో ఇంటింటికి తొలి అడుగు

● సంక్షేమ పథకాల గురించి గడప గడపకు తిరిగిన యరపతినేని
● తల్లికి వందనం గురించి బాల బాలికలను విచారించిన ఎమ్మెల్యే

మాచవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామంలో ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ మహిళలతో చిన్నారులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తూ.చ తప్పకుండా అమలు చేస్తామని తెలియజేశారు. పిన్నెల్లిలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. పిన్నెల్లిలో గత ప్రభుత్వంలో రాక్షస పాలన కొనసాగిందని, నేడు ప్రశాంతంగా పరిపాలన కొనసాగుతుందని తెలియజేశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు లభించని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలంటూ స్థానిక నాయకులకు సూచించారు. కొత్త పిన్నెల్లి గ్రామానికి చేరుకొని అంకాళమ్మ దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పిన్నెల్లి షాదీఖానాను సందర్శించి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు చింతపల్లి నన్నె, యరవేద రామిరెడ్డి, అమరనాథ్, దస్తగిరి, సుభానీ, శేఖర్, అంకారావు, సుబ్బారావు తదితరులున్నారు.

పిన్నెల్లిలో వృద్ధుడిని ఆరోగ్య విషయాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యరపతినేని

## ఎన్టీఆర్ భరోసాతో ఆర్థిక చేయూత

వృద్ధుడికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు అర్హులైన లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట టీడీపీ నేతలు యేల్లినేడి రామస్వామి, మస్తాన్‌వలి, కంభపాటి అబ్రహం, బండారు నాగరాజు, అంకాళ్ల ప్రభుదాసు, బలిజేపల్లి సురేష్‌కుమార్, మొక్కపాటి రవిచంద్ర, దరువూరి నాగేశ్వరరావు, రాంబోబుడే, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ సూరజ్ దనోరే అన్నారు. డాక్టర్ డే సందర్భంగా మంగళవారం పుతుంబాక భవనంలో వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరంలో పలువురు డాక్టర్లు పాల్గొన్ని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, సీపీఎం నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి పట్టణంలోని 10వ వార్డుకు చెందిన టీడీపీ నేత హనుమంతురావు బ్రెయిన్ స్ట్రోక్ శాస్త్ర చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు.

## ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలో రెవెన్యూలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. మంగళవారం మండలంలోని ఓర్వకల్లులో గ్రామసభలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో 394 పింఛన్‌లు ఉన్నాయని, అర్హులైన వారికి కూడా కొత్త పింఛన్‌లు త్వరలో ఇస్తామన్నారు. గత తహసీల్దార్ మండల ప్రజలను ఇబ్బందులు పెట్టాడని, ఇప్పుడు అలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని, నెలకు ఒకసారి అర్జీలపై సమీక్ష చేయాలని తెలిపారు. త్వరలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతామని తెలిపారు. ఈ గ్రామసభలో తహసీల్దార్ ఎన్ సరోజ, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, చల్లా రమేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ఎస్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

## టీడీపీ మండల అధ్యక్షుడిగా ఏటుకూరి బ్రహ్మయ్య

పెదకూరపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పెదకూరపాడు మండల అధ్యక్షుడిగా ఏటుకూరి బ్రహ్మయ్యను నియమిస్తూ స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రకటించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో బ్రహ్మయ్య పనిచేశాడు. ఎన్నికల సమయంలో బ్రహ్మయ్య కీలక పాత్ర పోషించాడు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు ఏటుకూరి బ్రహ్మయ్యకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని పలువురన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తెలుగుదేశం పార్టీ తనను గుర్తించి మండల అధ్యక్షుడిగా ప్రకటించడం సంతోషంగా ఉందని అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. బ్రహ్మయ్య గతంలో క్రోసూరు మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్‌గా కూడా పదవి బాధ్యతలు నిర్వహించారు.

ఏటుకూరుబ్రహ్మయ్యను సన్మానిస్తున్నటీడీపీ నేతలు ఆంజనేయులు, పూర్ణచంద్రరావు

పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, బుచ్చిపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, శ్రీరామినేని వెంకటేశ్వర్లు, ఏరువాక ఇన్నారెడ్డి, పాటిబండ్ల యోహాన్, రత్తయ్య, షేక్ సుభాని, గంట కోటేశ్వరరావు, షేక్ ముంతాజ్, షేక్ మస్తాన్ షరీఫ్, చిర్రా సుబ్బారెడ్డి తదితరులు బ్రహ్మయ్యను సత్కరించారు.

## హామీలు అమలు చేసిన ఘనత టీడీపీదే..

దాచేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేడాదిలోపే అభివృద్ధితోపాటు ప్రజలకిచ్చిన హామీలను కూడా అమలు చేయడంలో ముందుందని టీడీపీ నేతలు వేముల శివకుమార్ అన్నారు. మంగళవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మండలంలో 95 శాతం పూర్తి చేశారు. అలాగే తల్లికి వందనం పథకం కూడా అర్హులకు అందించినట్లు వివరించారు. వైసీపీ నేతలు మాత్రం వాస్తవాలు తెలుసుకోకుండా అవాకులు, చవాకులు పేలడం సరికాదన్నారు. ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న అధికారులకు కూటమి నేతలు సహకారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, వెంకట్రామయ్య, మహ్మద్‌రఫీలు ఉన్నారు.

### తహసీల్దార్‌ను సన్మానించిన కూటమి నేతలు

దాచేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌యాదవ్‌ను పిడుగురాళ్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, టీడీపీ సీనియర్ నేత అచ్చారావు, తిరుమలశెట్టి ఆంజనేయులు తదితరులు అభినందించి రైతుల సమస్యలను వివరించారు.

## మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి

● ఏడీఏ హనుమంతురావు

రాజుపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భూమిలో పైరును విత్తుకునే ముందుగా మొలకశాతాన్ని పరీక్షించుకోవాలని క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వీ హనుమంతురావు తెలిపారు. మంగళవారం మండలంలోని రెడ్డిగూడెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హనుమంతురావు మాట్లాడుతూ భూమిలో సరిపడ తేమ ఉన్నపుడు మాత్రమే విత్తనాన్ని విత్తుకోవాలని దీనివల్ల మొలకశాతం బాగా రావటానికి అవకాశం ఉంటుందన్నారు. తేమ లేని పరిస్థితిలో విత్తుకున్నట్లయితే మొలకశాతం తగ్గి దిగుబడి తగ్గిపోతుందన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట నరసయ్య మాట్లాడుతూ విత్తనాలు కావలసిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేయించుకున్నట్లయితే సబ్సిడీ ద్వారా విత్తనాలు తెప్పిస్తారన్నారు.

## అడవి సరిహద్దు భూమిని పేదలకు పంచాలి

క్రోసూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరికపాడు గ్రామ సమీపంలో ఉన్న అడవి సరిహద్దు భూమి రెవెన్యూ భూమిగా గుర్తించి పేదలకు పంచాలని పలువురు రైతులు మంగళవారం క్రోసూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెరికపాడు గ్రామ పరిధిలోని అడవి సరిహద్దు ప్రాంతంలో ఆన్‌లైన్ సర్వే రెవెన్యూ భూమిగా ఉన్నట్టుగా గతంలో రెవెన్యూ అధికారులు గుర్తించారని తెలిపారు. ఆ భూమిని పేదలకు పంచాలని చాలా కాలంగా పోరాడుతున్నామన్నారు. అర్హత గల వారికి, భూమి లేని పేదలకు సదరు భూమిని పంచాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు భూమి పంచుతామని పలువురు రాజకీయ పార్టీల నాయకులు అనేక సార్లు హామీ కూడా ఇచ్చారన్నారు. తామంతా భూమి లేని పేదలమని, సదరు భూమిని తమకు పంచితే ఉపాధి లభిస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రవిబాబు, కౌలు రైతు సంఘం నాయకులు హనుమంతరావు, కేవీపీఎస్ నాయకులు పౌలు, శివ కోటేశ్వరరావు, రామారావు, పుల్లారావు పాల్గొన్నారు.

## మానవ సేవయే మాధవ సేవ : డాక్టర్ మధుసూదనరావు

అచ్చంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవయే మాధవ సేవ అని డాక్టర్ మామిళ్ళపల్లి మధుసూదనరావు అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని ఆంజనేయుడి విగ్రహం సెంటర్లో డాక్టర్సడే సందర్భంగా డాక్టర్ మధుసూదనరావును అచ్చంపేట మండల నవయుగ ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు షేక్ అబ్దుల్లా, జీ శ్రీనివాసరావు, షేక్ సైదా, కే మల్లికార్జునరావు, శ్రీనివాసరెడ్డి, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మధుసూదనరావును పూలమాలలతో సన్మానించారు.

● క్రోసూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు పీహెచ్‌సీలో మంగళవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ షాద్‌ను ఘనంగా సత్కరించారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు.

● మాచర్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగళవారం లయన్స్ క్లబ్ పల్నాడు ఆధ్వర్యాన డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మురళీకృష్ణ, ఉషారాణి, సౌమ్య, విడియాల హరీష్‌లను ఘనంగా సన్మానించారు.

● మాచర్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైభవ్ రెసిడెన్షియల్ ఫంక్షన్ హాల్లో మంగళవారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, ట్రెజరర్ యనమదల వెంకట్రామయ్య ఆధ్వర్యాన వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మురహరిరావు, కొండవీటి రామకోటయ్య, మూఢావత్ దశరథ్‌చౌహాన్, గోనుగుంట్ల శ్రీకాంత్, మంద వంశీలను సన్మానించారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

● ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్

మాచర్ల రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, సునీల్‌కుమార్, పున్నారావు, యశ్వంత్, రాజన్, చంద్రమోహన్, బాబునాయక్, రత్నశ్రీ, శిరీషా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీని ఢీకొన్న కారు

● ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతున్న స్కూటిని ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలు పాలైన సంఘటన మంగళవారం వెల్దుర్తి మండలం మండాది గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కొణతం ఓబుల్‌రెడ్డి (75) తన మనుమరాలు ప్రవల్లిక ఇద్దరు స్కూటి (ఏపీ39ఎస్‌ఈ 3041) పై గ్రామం నుంచి ప్రధాన రహదారి క్రాస్ చేస్తుండగా మాచర్ల వైపు నుంచి శ్రీశైలం వైపు వస్తున్న టాటా బోల్డ్ కారు (ఏపీ057ఏ 5479) వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో స్కూటిపై ఉన్న తాత, మనుమరాలు గాలిలో ఎగిరిపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కారును వదిలి అక్కడి నుంచి పారిపోగా చుట్టుపక్కల వారు గమనించి క్షతగాత్రులను మాచర్ల పట్టణంలోని వైద్యశాలకు తరలించారు. మార్గంమధ్యలో ఓబుల్‌రెడ్డి మృతి చెందగా, ప్రవల్లికను వైద్యులు నరసరావుపేటకు తరలించారు. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉంది. వెల్దుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సుపరిపాలనలో తొలిఅడుగు.. ఇంటింటికి టీడీపీ

● శిరిగిరిపాడు నుంచి శ్రీకారం : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నెల రోజులపాటు నిర్వహించే సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పార్టీ శ్రేణులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 8:30 గంటలకు వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అలాగే మై టీడీపీ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని పార్టీ కేడర్ చేస్తున్న పనులను అందులో అప్‌లోడ్ చేయాలన్నారు. యేడాది పాలనను ఈ నెల రోజులపాటు నియోజకవర్గ ప్రజలకు వివరించేందుకు యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గస్థాయి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట పంగులూరి పుల్లయ్య ఉన్నారు.

### నేటి నుంచి సుపరిపాలనకు తొలి అడుగు ప్రారంభం

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తెలియజేసేందుకు సుపరిపాలనకు తొలిఅడుగు పేరుతో బుధవారం నుంచి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఇంటింటికి తిరిగే కార్యక్రమం మండలపరిధిలోని దిడుగు గ్రామం నుంచి ప్రారంభిస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తెలియజేశారు.

● పెదకూరపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు పెదకూరపాడులో, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొంటారని నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ కూటమికే సాధ్యం

● ఎమ్మెల్యే యరపతినేని

చంద్రపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రతినెల 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయడం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని చంద్రపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని హాజరై పలువురు వృద్ధులు, మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ శ్రీనివాసులు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండ రంగ శ్రీను, తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఎల్‌వీఆర్, వడ్డవల్లి సాంబశివ రావు, బత్తుల శ్రీను, కామేశ్వరరావు, పిల్లి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ముఖ్య నాయకులతో తొలిఅడుగు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రభుత్వ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న నాలుగు సంవత్సరాలలో చేయనున్న అభివృద్ధి పనులను కూడా వివరించాలన్నారు. మూడో తేదీ నుంచి చేపట్టనున్న ఇంటింటి కార్యక్రమంపై నేతలు మద్దిరాల గంగాధర్, రమేష్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు యేల్లినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, కనుమూరి బాజిచౌదరి, చౌట శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, ఆళ్ల అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, అంచుల నరసింహరావు, ఆవులరాజు, మన్నవ శారదదేవి తదితరులు ఉన్నారు.

## డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ

బెల్లంకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ దీపిక అన్నారు. మంగళ వారం బెల్లంకొండ మండలంలోని జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా చంద్రాజుపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టడం ద్వారా డెంటీ జ్వరం వస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, పీహెచ్‌వో మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

● క్రోసూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ డెంగీ మాసోత్సవాలు మంగళవారం క్రోసూరలో ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం జూలై నెలను ప్రభుత్వం డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవంగా ప్రకటించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి మహమ్మద్ షాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో ఆరోగ్య భద్రత వస్తుందన్నారు. దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీ ప్రధాన వీధుల్లో కొనసాగింది.

## పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

పిడుగురాళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పిడుగురాళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ఐలాండ్ సెంటర్ వరకు నల్లకండువాలు ధరించి కార్మికులు, ఇంజనీరింగ్ సిబ్బంది నిరసన ర్యాలీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి.. అదేవిధంగా ఇంజనీరింగ్ కార్మికుల నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వాలని, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని.. తదితర డిమాండ్ల సాధన కోసం 4వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం, 9వ తేదీన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ తెలగపల్లి శ్రీను కోరారు. కార్యక్రమంలో విజయ్, ప్రతాప్, రమేష్, వెంకయ్య, కొక్కెర శ్రీను, వేముల శ్రీనివాసరావు, తిరుమలరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నీటి వసతి కలిగిన చోట నారు మడులు సిద్ధం చేసుకోవాలి

నకరికల్లు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నీటి వసతి కలిగిన చోట నారు మడులు సిద్ధం చేసుకోవాలని ఏవో కే దేవదాసు తెలిపారు. మంగళవారం దేచవరం, చల్లగుండ్ల అడ్డరోడ్డు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. విత్తనాలు వేసే ముందు రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో దిలీప్‌కుమార్, ఎంపీఈవో రవిబాబు పాల్గొన్నారు.

# పటిష్టత ప్రశ్నార్థకం

ప్రాజెక్ట్ లోపలి భాగంలో గోడల దుస్థితి

ప్రాజెక్ట్ ప్రారంభంలో స్లాబుకు పగుళ్లు

● అమరావతి ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్‌కు లీకేజీల సమస్య ● భూగర్భ, మొదటి ప్రాంగణంలో వర్షపు నీరు ● ప్రారంభం నుంచి మరమ్మతులు శూన్యం ● దృష్టి పెట్టని పర్యాటక శాఖ

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అమరావతిలోని ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్ నిర్మాణం 20 ఏళ్లు పూర్తిచేసుకుంది. కానీ, మరమ్మతులపై టూరిజం అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రాజెక్ట్ దిగువన ఉన్న నాలుగు వైపులా సొరంగ మార్గం, బుద్ధుని పీఠం దిగువన శిల్ప సంపదతో పర్యాటకులను ఆకర్షిస్తున్న గ్యాలరీ ప్రాంగణ స్లాబుకు లీకేజీల సమస్య ఏర్పడింది. వర్షపు నీరు కారి గోడలకు పగుళ్లు వస్తున్నాయి. రంగులు లేచిపోయి కళావిహీనంగా మారుతున్నాయి. బుద్ధుని విగ్రహం పీఠం చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో స్లాబుకు ఏర్పడిన లీకుల ద్వారా గ్యాలరీలోకి నీరు చేరుతోంది. అంతేగాక బుద్ధుని బొమ్మకు మోకాళ్ల ప్రదేశంలో చిన్న చిన్న పగుళ్లు రావడం జరిగింది. ప్రాజెక్టుపై అక్కడక్కడా చిన్న చిన్న మొక్కలు కనిపిస్తున్నాయి.

**ప్రారంభం ఇలా..**

2004 ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జేఆర్ పుష్పరాజ్ ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీఆర్ మల్లికార్జునరావు పర్యవేక్షణలో 2006లో జరిగిన కాలచక్ర మహా సభలకు నిర్మాణం పూర్తి చేసుకుంది. బౌద్ధుల ఆరాధ్య దైవం దలైలామా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రారంభించారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని వారసత్వ కేంద్రంగా గుర్తించేలా అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా వారసత్వ నగరంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులోని కొంత నిధులతో ధ్యానబుద్ధ ప్రాజెక్ట్‌కు లైటింగ్, గ్రానైట్, స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ధ్యానబుద్ధ ప్రాజెక్ట్‌లో కొన్ని పనులు నిలిచిపోయాయి.

**పర్యాటక శాఖ నిర్లక్ష్యం..**

ప్రాజెక్టు ప్రారంభం నుంచి పర్యాటకశాఖ సందర్శకులకు టికెట్ ద్వారా సందర్శనకు అవకాశం కల్పిస్తోంది. కానీ, ప్రాథమిక స్థాయిలో మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహించిందని స్థానికులు చెబుతున్నారు. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ధ్యానబుద్ధ ప్రాజెక్ట్ భావితరాలకు భద్రంగా అందించే విధంగా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి, పటిష్టతకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రాజెక్ట్ మరమ్మతుల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని అంతర్జాతీయ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు.

### మరమ్మతులు చేపడుతాం: ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి రాజధానికి ఐకాన్‌గా ఉన్న ధ్యానబుద్ధ విగ్రహం, అమరావతి పర్యాటక ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద లీకేజీల విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విగ్రహ పరిసర ప్రాంతాలకు మరమ్మతులు చేసి అమరావతిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామన్నారు. అమరావతి అభివృద్ధి పై సీఎం చంద్రబాబుకు విన్నవించానని తెలిపారు.

లీకులతో దెబ్బతిన్న పీఠం దిగువ భాగం

# డబ్బుల్ ధమాకా మోసం!

● ఒక పద్ధతి ప్రకారం ఆఫర్లతో ఎర ● చివరిగా డిపాజిట్ నగదుకు డబుల్ బెనిఫిట్ ఆఫర్ ● నగదు జమకాగానే నిలిచిపోయిన యాప్ సేవలు ● తెనాలి, పరిసరాల్లోనే అధికంగా బాధితులు

## 'లుక్' యాప్‌తో టోకరా

తెనాలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మనిషి అమాయకత్వాన్ని, ఆశను క్యాచ్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఓ పద్దతి ప్రకారం ఓ యాప్ ద్వారా యూజర్లకు ఆఫర్‌లు ద్వారా బహుమతులు ఇచ్చి.. డబుల్ పేమెంట్ అంటూ నగదు డిపాజిట్ చేయించుకుని ఒక్కసారిగా ఉన్నదంతా ఊడ్చేశారు. ఈ యాప్ ద్వారా మోసపోయిన బాధితుల సంఖ్య తెనాలి, పరిసర ప్రాంతాల్లోనే భారీగా ఉంది. రూ.కోట్లల్లోనే వీరంతా నష్టపోయినట్లు సమాచారం. అసలు వివరాల్లోకి వెళితే.. కొన్ని నెలల క్రితం ఫోన్లకు వచ్చిన లింకుల ద్వారా 'లుక్' యాప్‌ను చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్‌లో వచ్చే ప్రకటనలు చూసిన వారికి రూ.15 వంతున జమచేస్తామని యూజర్లకు ఆశ రేకెత్తించారు. దీంతో ఇక అదే పనిగా కొందరు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పేర్లు నమోదు చేసి చూడటం ప్రారంభించారు. యాప్ నిర్వాహకులు కొన్ని రోజులు యూజర్ల వాలెట్‌లోకి నగదు బదిలీ చేసి, విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. గొలుసు కట్టు విధానంలో మెంబర్‌షిప్‌లు చేయించిన యూజర్లకు... యాప్ నిర్వాహకులు కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, ఖరీదైన ఇళ్లు అంటూ బహుమతులు కూడా ప్రకటించారు. ఇందుకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు కొత్త ఆఫర్లు ప్రకటిస్తూ.. యూజర్లను పెంచారు. ఇది నమ్మి చాలా మంది తమ కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులను కూడా యాప్ మెంబర్లుగా చేర్చారు. మెంబర్‌షిప్‌లు పెరగడంతో.. యాప్ నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చార్జీలు పెట్టారు. సెక్యూరిటీ డిపాజిట్ల కింద నగదు జమ చేయించుకున్నారు. గత వారం క్రితం యాప్‌లో ఎంత డిపాజిట్ చేస్తే.. అంతకు డబుల్ అమౌంట్ ఇస్తామని ప్రకటించారు. దీంతో పలువురు రూ.20 వేల నుంచి రూ.2లక్షలు పైగా స్తోమతను బట్టి డిపాజిట్ చేశారు. అన్నట్లుగానే వారి వాలెట్‌కు నగదు వచ్చినట్లు చూపించింది. ఎంతో ఆశతో విత్ డ్రా చేసుకుందామని బ్యాంక్‌కు వెళితే.. నగదు రాలేదు. పైగా యాప్ సర్వీసులు గత బుధవారం నుంచి నిలిచిపోయాయి. దీంతో తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. ఓ ప్రైవేట్ వైద్యశాలలో పనిచేస్తున్న ఓ మహిళ తనకు ఆఫర్‌లో కారు రావడంతో.. పూర్తిగా నమ్మి పెద్ద ఎత్తున యాప్ ద్వారా నగదు డిపాజిట్ చేసి పూర్తిగా మోసపోయినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వారి వద్ద నగదు పంపిన వివరాలు మినహా ఏమీ లేకపోవడంతో.. తిరిగి తమ డబ్బులు ఎలా తెచ్చుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. వారు వాడే యాప్ చిరునామా పుణే, అమెరికా అంటూ చూపుతుండటంతో ఏం చేయలేని పరిస్థితి బాధితుల్లో నెలకొంది. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

యాప్ ద్వారా చూపుతున్న నగదు

యాప్‌లో ఒక రోజు సంపాదించిన సొమ్ము, ఖాతాలో ఉన్న నగదు చూపుతున్న దృశ్యం

## చేతి'కంది'..ధర లేక..!

(5వ పేజీ తరువాయి)

లేదంటున్నారు. కంది క్వింటా మద్దతు ధర రూ.7,550గా ఉంది. పత్తి పంట సాగు చేసి ఏటా నష్టపోతున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా కంది పెద్ద ఎత్తున సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం కంది సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేసింది. ప్రభుత్వ పోత్సాహం ఉండటంతో పాటు మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 66,273 ఎకరాల్లో కంది సాగు చేశారు. దిగుబడులూ ఆశాజనకంగా వచ్చాయి. అయితే.. మార్క్‌ఫెడ్ మొక్కుబడిగా కంది కొనుగోళ్లు చేసింది. రైతుల వద్ద వేలాది క్వింటాళ్ల నిల్వలు ఉన్నాయి. కందులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేరు. కంది పుచ్చే తత్వం అధికంగా ఉంటుంది. మార్కెట్‌లో విక్రయిద్దామంటే క్వింటా రూ.6,500 లోపే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కంది నిల్వలంటినీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**దళారులు తక్కువకు అడుగుతున్నారు : గెల్లి యోగిరెడ్డి, తెలార్లపల్లి**

కౌలుకు పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో దళారులు క్వింటా రూ.6,500కు కూడా కొనడం లేదు. ఎక్కువ కాలం ఇంటిలో కందులు నిల్వ చేయలేము. ప్రభుత్వం మద్దతు ధరకు రైతులు వద్ద ఉన్న కందులు కొనాలి.

## ఇంజనీరింగ్ సీట్లు 30,240

(5వ పేజీ తరువాయి)

మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది ముందుగానే నోటిఫికేషన్ జారి చేసి కౌన్సెలింగ్ ప్రారంభించారు. అయితే ఈ ఏడాది వేర్వేరు కారణాల వల్ల నోటిఫికేషన్ ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇందుకు మరో రెండు మూడు వారాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సాంకేతిక విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర జిల్లాల వైపు కూడా కొంతమంది వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భారీ సంఖ్యలో మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులందరూ.. కళాశాలలో చేరతారనే నమ్మకం కూడా లేదు. ప్రభుత్వం సత్వరం నోటిఫికేషన్ జారీ చేస్తే సీట్లు మిగులు తగ్గుతుందని యాజమాన్యాలు తొందరపడుతున్నాయి. కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే 30 శాతం ఉన్న యాజమాన్య కోటా సీట్లు భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటాలో ఇక్కడ కూడా కెమికల్, మెకానికల్ సీట్లు భర్తీ కాలేదు. ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసి విద్యార్థులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే ఏపీ ప్రభుత్వం ఇంకా ప్రక్రియ ప్రారంభం చేయకపోవడంపై యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సత్వరం నోటిఫికేషన్ జారీ చేసి, ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

## ప్రజల చెంతకు.. పాలకులు

(5వ పేజీ తరువాయి)

చేయలేకపోయిన పనులు ఎందుకు చేయలేదో వివరించాలని చంద్రబాబు ఇప్పటికే నేతలకు సూచించారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రేపోమాపో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరాలను అమలు చేయనున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నో కష్టనష్టాల కోర్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తీరును నేతలు ప్రజలకు వివరించనున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ఎలా సాగాలన్న దానిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నేతలకు మార్గనిర్దేశనం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కరపత్రాలు కూడా ఆయా నియోజకవర్గాలకు మంగళవారం చేరాయి. బుధవారం ఉదయం నుంచే ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పరిధిలోని ఇళ్ల బాట పట్టనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని, రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రజల ముందుంచాలనే ఆదేశాలు నేతలకు వెలువడ్డాయి. ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు సమస్యలు చెప్పుకుంటే వాటిని సావధానంగా విని పరిష్కారం కోసం కృషి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధిష్ఠానం సూచించింది. ఏడాది వ్యవధిలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఎన్నికలకు ముందు నేతలు ప్రధానంగా ఇచ్చిన హామీలు ఈ ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నేపథ్యంలో ప్రజల్లో చర్చకు రానున్నాయని, వాటిపై నేతలు కూడా సమగ్ర సమాచారం దగ్గర పెట్టుకోవాలని ఆదేశించింది. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. నెల రోజులు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, నేతలకు పిలుపిచ్చారు. కుటుంబ సాధికార సారథుల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**అక్కడక్కడ అసంతృప్తి**

బిల్లుల మంజూరు.. పనులు.. నామినేటెడ్ పదవుల విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. మన ప్రభుత్వం వచ్చింది పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయన్న విశ్వాసంతో అప్పులు చేసి మరీ సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గోకులాల నిర్మాణం తదితర పనులను పెద్దఎత్తున చేశారు. అయితే ఆయా బిల్లుల అంశాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తే చూద్దాం.. చేద్దాంలే అంటున్నారని బాధిత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని, సొంతవారికి ఇలా మొండిచేయి చూపించడంపై నేతలు గుర్రుగా ఉన్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో రూ.154.46 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014 నుంచి 2018 వరకు టీడీపీ ప్రభుత్వం హాయంలో కూడా పార్టీ నేతలు ఉపాధి పనులు చేసిన బిల్లుల చెల్లింపు నేటికి జరగలేదు. ఇలా పెద్ద ఎత్తున నష్టపోయిన నేతలు అసంతృప్తిలో ఉన్నారు. ప్రజాక్షేత్రానికి బయల్దేరిన ప్రజాప్రతినిధులు అసంతృప్తి నేతలపై దృష్టి సారించేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.

## హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

(5వ పేజీ తరువాయి)

హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచే పీ- 4 కార్యక్రమం అమలు జరగాలన్నారు. రాజధానిలో ఏర్పాటైన ప్రతి విద్యాసంస్థ గ్రామానికి నలుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించి ప్రయోజ కులను చేయాలని సూచిం చారు. ఈ సూచన చేసి రెండు నెలలు కూడా కాక ముందే ఆ పక్కనే ఉన్న మరో విద్యా సంస్థ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమ ర్శలున్నాయి. ప్రస్తుతం ఒక కోర్సుతో మొదలైన ఈ విధానం ఆ తర్వాత అన్ని కోర్సులకూ విస్తరి స్తుందేమోనని, అన్ని విద్యా సంస్థలు అదే వైఖరిని చేపడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**స్థలాలు ఇచ్చిన రాష్ట్రానికి రాయితీ కరువు**

రాజధానిలో విద్యా సంస్థ నిర్మాణానికి వందల ఎకరాలు స్థలం కారుచౌకగా ఇచ్చిన రాష్ట్ర విద్యార్థులకు ఆ విద్యా సంస్థలో రాయితీ లేదు. 1 నుంచి 23 ర్యాంకులు సాధించిన వారికి ఫౌండర్ స్కాలర్‌షిప్ కింద నూరుశాతం, 24 నుంచి 68 ర్యాంకులు సాధించిన వారికి 100 శాతం మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. 69 నుంచి 5000 మధ్య ర్యాంకులు వచ్చినవారికి 90 శాతం, 5,001 నుంచి 13,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 75 శాతం, 13,001 నుంచి 23,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 50 శాతం, 23,001 నుంచి 30,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 25 శాతం ఈక్విటబుల్ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. అయితే రిప్రజంటేటివ్ రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదు. అంటే 68వ ర్యాంకు తరువాత వచ్చిన ఏపీలోని ఏ విద్యార్థికి ఈ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ రాయితీ రావడం లేదు. దీంతో విద్యార్థులంతా మొత్తం ఫీజులు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**ఇది న్యాయం కాదు : రాంబాబు, వెలగపూడి రైతు**

రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని కూడా ఇలా హాస్టల్లో ఉండమని విద్యా సంస్థలు డిమాండ్ చేయడం న్యాయం కాదు. హాస్టల్లో ఉండాలా, వద్దా అనేది విద్యార్థి, అతడి కుటుంబం ఇష్టం. అదే ఊరి వారిని కూడా హాస్టల్లో ఉండమనడం మరీ విడ్డూరంగా ఉంది. విద్యా సంస్థ యాజమాన్యం దీనిపై ఆలోచించాలి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.

# ఇసుక అక్రమ మైనింగ్‌పై.. ప్రభుత్వం చర్యలు

● వైసీపీ హయాంలో ఇసుక ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు సిద్ధం ● ఏపీ ఎస్ఏసీ నివేదిక ఆధారంగా డీఎల్ఎస్‌సీ నిర్ణయం ● వివరణ ఆధారంగా తదుపరి చర్యలు

గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-24 ఆర్థిక సంవత్సరాల మధ్యన జిల్లాలో జరిగిన ఇసుక అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్(ఏపీ ఎస్ఏసీ) రీచ్‌ల వారీగా జరిగిన అక్రమ మైనింగ్‌పై ఇచ్చిన నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ మేరకు జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఈ అంశంపై చర్చించి, ఆ సమయంలో ఇసుక మైనింగ్‌కు ఏజెన్సీలుగా వ్యవహరించిన సంస్థ లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. నోటీసు లకు సంబంధిత ఏజెన్సీలు స్పందించిన తర్వాత ఎంత మేరకు అ యితే రెవెన్యూ నష్టం జరిగిందో అంత మొత్తం రికవరీ చేయాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా జిల్లా యంత్రాంగం నోటీసులు సిద్ధం చేస్తోంది.

**వైసీపీ నేతల కబంధ హస్తాల్లో..**

ఇసుక రీచ్‌లను వైసీపీ హయాంలో సంబంధిత ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులు తమ కబంధ హస్తాల్లోకి తీసుకొన్నారు. తొలుత ఇసుక రీచ్‌లన్నింటిని కేంద్రీకృతం చేశారు. ఒక సంస్థకు కాంట్రాక్టు ఇచ్చి దాని నుంచి నెల వారీగా మామూళ్లను దండుకొన్నారు. ఆ తర్వాత ఆ సంస్థ సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. ఎన్నికల ఏడాదిన్నర ముందు అయితే మొత్తం రీచ్‌లు ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. ఒక్క పెదకూరపాడు నియోజ కవర్గంలోనే ప్రతి నెలా తాడేపల్లి క్యాంపు ఆఫీసుకు రూ.20 కోట్ల కప్పం కడుతుండేవారన్న ఆరోపణలను ప్రతిపక్షాలు అప్పట్లో చేశాయి.

**అనుకూలంగా నివేదికలు..**

మరోవైపు వైసీపీలో తొలుత అంటకాగిన ఇద్దరు నేతలు ఆ తర్వాత విభేదాలు వచ్చి ఇసుక అక్రమ మైనింగ్‌పై సుప్రీం కోర్టు, ఎన్‌జీటీలో కేసులు దాఖలు చేశారు. అలా కేసులు వేశారని వాళ్లపై వైసీపీ నేతలు పీడీ యాక్టు కేసులు పెట్టించి.. జిల్లా నుంచి బహిష్కరించేలా చేశారు. అయినప్పటికీ ఆ నాయకులు భయపడకుండా పోరాడారు. అక్రమ మైనింగ్‌పై అప్పట్లో కలెక్టర్లను నివేదిక సమర్పించమని సుప్రీం కోర్టు ఆదేశిస్తే.. అందరూ ఒకేలా రిపోర్టు ఇచ్చారు. ఎలాంటి అక్రమ మైనింగ్ జరగలేదని చెప్పారు. అయితే ఇసుక మైనింగ్ విషయంలో ఎవరూ తప్పు చేయొద్దని శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా అన్ని వివరాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయని ఎంపీ బాలశౌరీ హెచ్చరించారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అది మరుగన పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ చేపట్టింది. శాస్త్రీయంగా ఏపీ ఎస్ఏసీ ద్వారా సర్వే చేయించి అక్రమ మైనింగ్‌ని నిగ్గు తేల్చింది. దీనిపై ఎలాంటి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమిస్తుందోనన్న భయం వైసీపీ నేతల్లో నెలకొంది.

## బీటెక్, ఎంపీఈడీ పరీక్షలు ప్రారంభం

పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు

పెదకాకాని, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలో మంగళవారం బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (రెగ్యులర్), మూడో సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (సప్లమెంటరీ), ఎంపీఈడీ ద్వితీయ సెమిస్టర్ (రెగ్యులర్)పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం. సుబ్బారావు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ పరీక్షలు ఏఎన్‌యూ, బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో, ఎంపీఈడీ పరీక్షలు ఏఎన్‌యూతో పాటు నరసరావుపేటలోని కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్నాయని తెలిపారు.

## ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఆచార్య లింగరాజు

పెదకాకాని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఆచార్య చేబ్రోలు లింగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య లింగరాజు

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11226, 99854 11220
99852 07026

## రైతులు పంటల బీమా నమోదు చేయించుకోవాలి: ఏవో

రొంపిచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగుచేసిన పంటలకు బీమా నమోదు చేయించుకోవాలని ఏవో శివలీల మంగళవారం తెలిపారు. మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులను తీసుకోవాలని కోరారు. వరి, కంది, ఎర్ర మిరప పంటలకు బీమా సౌకర్యం ఉందన్నారు. పంట నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో కుక్కల పట్టివేత

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాగన్నపాలెంలో మంగళవారం వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిపారు. సుమారు 20కుక్కలను సంబంధిత ఏజెన్సీ వారు పట్టుకుని ప్రత్యేక వాహనంలో ఒంగోలుకు తరలించారు. అక్కడ వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిపిన అనంతరం తిరిగి పట్టణంలో వాటిని విడిచిపెట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు.

## 'పొలం పిలుస్తోంది'

ఈపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాలెం, బొగ్గరంలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి రామినేని రామారావు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు, అన్నదాత సుఖీభవ స్కీమ్, పీఎం కిసాన్, కౌలు రైతు కార్డుల గురించి, పంట నమోదు గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు వీ గణేష్, సర్పంచ్ వెంకటరావు, కె.సాంబశివరావు, కేతినేని రామారావు, గంగినేని ప్రసాద్, కె.నరసింహరావు, రైతులు పాల్గొన్నారు.

## వైద్యురాలికి సన్మానం

రొంపిచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్యాధికారి రేవతిబాయికి ఘనసన్మానం జరిగింది. కార్యక్రమంలో సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దవరంలో వైద్యుల దినోత్సవం

నూజెండ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది అందించే సేవలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు, బారతరత్న డాక్టర్ బీసీరాయ్ సేవలను వైద్య విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ఏపీపీగా సురేష్‌బాబు

నరసరావుపేట లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అదనపు సహాయ సెషన్స్ కోర్టు ఏపీపీగా గుండాల సురేష్‌బాబును నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో సురేష్ బాబు ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు.

## 5 న క్యాంటీన్ నిర్వహణ వేలం

నరసరావుపేట లీగల్, జూలై 1, (ఆంధ్రజ్యోతి): న్యాయస్థాన భవనాల ఆవరణలోని క్యాంటీన్ నిర్వహణకు ఈ నెల 5న బహిరంగ వేలం ఉన్నట్లు న్యాయవాద సంఘ అధ్యక్షుడు సుబ్బారావు మంగళవారం తెలిపారు. సాయంత్రం 5గంటలకు నర్సరావుపేట కోర్టు ఆవరణలో వేలం నిర్వహిరన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

వినుకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పట్టణ కార్మిక సంఘం కార్యదర్శ షేక్ ఫిరోజ్ పిలుపునిచ్చారు. సమ్మెలో మహిళ, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## విశ్రాంత సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

నరసరావుపేట లీగల్, జూలై 1, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ విభాగంలో సేవలందించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు అల్లాబక్షు, గాలయ్యలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫెన్సింగ్‌లో నిర్మలా స్కూల్ విద్యార్థి ప్రతిభ

వినుకొండటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పట్టణంలోని నిర్మలా స్కూల్‌లో 4వ తరగత చదువుతున్న పిల్లి రుత్విక్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి అండర్ 10కేటగిరిలో రుత్విక్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రుత్విక్ పాల్గొననున్నాడు.

## ఏఈ వెంకటేశ్వరస్వామికి సత్కారం

శావల్యాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో పంచాయతీ రాజ్ ఏఈ కొత్తగుంట్ల వెంకటేశ్వరస్వామి కీలకపాత్ర పోషించారని శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ వెంకటేశ్వరస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ గంగానాయక్, ఎంపీడీవో సీతారామయ్యలు పాల్గొని ఘనంగా సత్కరించారు.

## గ్రామ కమిటీలకు జీవీ అభినందన

నూజెండ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో గ్రామపార్టీ అధ్యక్షుడిగా ఎండ్లూరి వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్‌గా మాలపాటి రామారావు, ప్రధాన కార్యదర్శిగా గంగినేని శ్రీను, తెలుగు యువత అధ్యక్షుడిగా మేదరమెట్ల శ్రీధర్, తెలుగు రైతు వట్టికొండ శ్రీను, ఐటీడీపీ ఎండ్లూరి శ్రీనులు ఎన్నికయ్యారు. మంగళవారం వీరికి చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

# పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

### నియోజకవర్గ పార్టీ శ్రేణులతో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడేసినా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకోకుండా రప్పా, రప్పా భాషతో చెలరేగిపోతున్నారన్నారు. ఇలాంటి వైసీపీని శాశ్వతంగా లేకుండా చేయాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. జగన్ పోతుపోతూ రూ.10.5లక్షల కోట్లు అప్పులు వారసత్వంగా ఇచ్చినా సంక్షేమం, అభివృద్ధిని పరుగులు తీయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందరూ అండగా నిలవాలన్నారు. 65లక్షల మందికి ఒకేసారి వెయ్యి రూపాయలు పింఛన్ పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, జగన్‌కు ఎక్కడైనా పోలిక ఉందా అని ప్రశ్నించారు. జూలై 2వ తేదీ నుంచి నెల పాటు ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ప్రారంభం, మత్స్యకారుల భరోసా, తల్లికి వందనం పథకాలు ప్రభుత్వం అమలు చేసిందని, ఈ నెలలో అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో చేస్తున్న, చేయబోయే అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. జగన్ హయాంలో ఒక్కరికే అమ్మఒడి అందితే కూటమి ప్రభుత్వం ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నప్పటికీ తల్లికి వందనం ఇస్తున్నామన్నారు. చంద్రబాబు చెప్పిన దానికంటే మెరుగ్గా పనిచేయాలని, మంచి ఫలితాలు అందుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రిలోకేష్ పనిచేస్తున్నారని, ఉచిత గ్యాస్ సిలెండర్‌పై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఈ నెలాఖరులోపు అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయని, ఈ వివరాలన్నీ ప్రజలకు తెలియజేయాలన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంలో భాగంగా రెండు చోట్ల ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండబట్టే రాజధాని అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కుకు నిధులు ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తొలి ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలమేరకు పథకాలు అమలు చేస్తున్నామని, ఇదే స్ఫూర్తితో కొత్త పథకాలతో ప్రజలకు మేలు చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పంగా పెట్టుకున్నారన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెలుగుదేశం ప్రచారానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, బూత్ కన్వీనర్లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి తదితరులు

## డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

నరసరావుపేట లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పాత పలనాడు బస్టాండ్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ నివారణకు ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడేగా భావించి ప్రతిఒక్కరూ నిల్వనీరు లేకుండా తొలగించుకోవాలన్నారు. దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యశాలకు వెళ్లి వైద్యునితో చెకప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి డాక్టర్ గీతాంజలి, డాక్టర్ హనుమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా సత్యసాయిబాబా రథోత్సవం

రథయాత్రలో పాల్గొన్న సత్య సాయిబాబా భక్తులు

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలలో భాగంగా పుట్టపర్తి నుంచి ప్రారంభమైన సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర మంగళవారం బాపట్ల జిల్లానుంచి చిలకలూరిపేటకు చేరుకుంది. స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. రథానికి భక్తులు హారతులిచ్చారు. పట్టణ వీధులలో రథం వెంట నడుస్తూ మహిళలు సంకీర్తనలు ఆలపించారు. చెక్క భజనలు, కోలాట ప్రదర్శనలు చేశారు. వాసవీనగర్‌లోని సాయిబాబా గుడివరకు రథయాత్ర సాగింది. పెద్దసంఖ్యలో బాబా భక్తులు భక్తి శ్రద్ధలతో యాత్రలో పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఘంటా వీరరాఘవయ్య, సమితి జిల్లా అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర నాయకులు సురేంద్ర పాల్గొన్నారు. మూడు రోజుల పాటు పల్నాడు జిల్లాలో రథ యాత్ర కొనసాగుతుంది. ఈ నెల 4 న ప్రకాశం జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

## డిప్యూటీ తహసీల్దార్‌గా సల్మాన్ బాధ్యతల స్వీకారం

నాదెండ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల మండల ఉప తహసీల్దార్‌గా షేక్ సల్మాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన నాదెండ్లకు బదిలీపై వచ్చారు. ఆయనను తహసీల్దార్ చంద్రశేఖర్, సిబ్బంది, కూటమి నేతలు అభినందించారు. నాదెండ్ల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన ఎస్.చంద్రశేఖర్‌ను కూటమి నేతలు మంగళవారం కలిసి సత్కరించారు.

## వైభవంగా సీతాలాంబదేవి వార్షికోత్సవం

నాదెండ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని సీతాలాంబదేవి (బొడ్డురాయి) 15వ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా నరసరావుపేట లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు వి.హిమవంతరావు, జి.శ్రీనివాసరావు, నాగభూషణం, ఎన్.హరిబాబు, ఎన్.శ్రీనివాసరావు, జి.శివకుమార్, ఎస్.శ్రీను, వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

## జాతీయస్థాయి సదస్సులో సమస్యల ప్రస్తావనకు వినతి

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హర్యానాలో ఈ నెల 3,4 తేదీలలో పార్లమెంట్ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి సదస్సులో మున్సిపల్ పట్టణాలలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించాలని, పరిష్కార మార్గాలు కనుగొనాలని సదస్సులో పాల్గొనేందుకు ప్రభుత్వ ఆహ్వానంపై వెళుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీని మంగళవారం స్థానిక న్యాయవాది, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మాదాసు భానుప్రసాద్ కలిసి కోరారు. లోక్ సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ సింగ్‌కు రాసిన లేఖ ప్రతిని ఆయన చైర్మన్‌కు అందచేశారు. ఊరేగింపులు, ఉత్సవాలలో డీజే సౌండ్ సిస్టం వలన కలుగుతున్న అనర్థాలు, కోల్పోతున్న ప్రాణాలు, ప్రధాన కూడళ్లను బ్లాక్‌చేసి ఆధ్యాత్మిక, రాజకీయ, వ్యక్తిగత వేడుకలు నిర్వహిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించడం, ప్రధాన కూడళ్ళు, రహదారులపై, కార్నర్ పాయింట్స్‌లో నిత్యం ఫ్లెక్సీలు నెలకొల్పి ప్రమాదాలకు తావివ్వడం వంటి సమస్యలను అందరి దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట పట్టణ ప్రముఖులు అందెల శౌరి, షేక్ కరిముల్లా, సాప వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల్లో సమయ పాలన పాటించాలి

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అందరు సమయ పాలన పాటించి గ్రంథాలయ పాఠకులకు సేవలు అందించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఉద్యోగులను కోరారు. మంగళవారం నరసరావుపేటలోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. వారికి కావాల్సిన పుస్తకాలను రీడర్స్ ఆన్ డిమాండ్ అనే పద్ధతి ద్వారా వెంటనే కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పల్నాడులో సెస్సు బకాయిలు అన్నీ చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సాయం అందజేస్తానని అన్నారు. గ్రంథాలయంలో పాఠకులకు కావాలిసిన మరుదొడ్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. గ్రంథాలయ వాచ్‌మెన్ విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న సాకిరెడ్డి శివపార్వతిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి యడ్లపాటి రాధ, జె కృష్ణ, వై సునీల, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చిలకలూరిపేట నియోజకవర్గంలో బుధవారం నుంచి ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ నాయకులు, శ్రేణులు పాల్గొంటారు. తొలుత పట్టణంలోని 13, 14, 17వ వార్డులలో సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తున్నట్టు పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్ తెలిపారు.

## ఘనంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం

నరసరావుపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని రీజనల్ బ్యాంకు కార్యాలయంలో రీజనల్ మేనేజర్ పీ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ హాజరయ్యారు. సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా అమ్మనాన్నల ప్రేమాలయం వృద్ధాశ్రమానికి రెండు మంచాలు, అవసరమైన నిత్యావసరాలను అందజేశారు. అదేవిధంగా ప్రకాష్‌నగర్ ఏడీబీ ఎస్‌బీఐలో వార్షికోత్సవ వేడుకలలో భాగంగా కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా సీంగం యోగాంజనేయశర్మ హాజరయ్యారు.

### శావల్యాపురంలో...

శావల్యాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వఆవిర్భావదినోత్సవ వేడుకలను శావల్యాపురం బ్రాంచ్‌లో మేనేజర్ వలేటి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ ఖాతాదారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం శావల్యాపురం జడ్పీపాఠశాలలో గతేడాది 8,9,10 తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి నగదు పురస్కారాన్ని అందజేశారు. బ్రాంచ్‌మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యంగా ఎస్‌బీఐ ఎన్నో సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. హెచ్ఎం విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, సుభాష్‌చంద్రారెడ్డి, బ్యాంక్ క్యాషియర్ శ్రీహరి, అటెండర్ ప్రకాష్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మారుతున్న పేదల జీవితాలు: చీఫ్‌విప్ జీవీ

పింఛన్‌లను పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన

వినుకొండ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి పేద, బలహీనవర్గాల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తున్నాయని, ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో మంగళవారం నిర్వహించిన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తం అందజేసి వారి సంక్షేమం అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన సెలవు వస్తే ముందు రోజు ఇంటికి ఠంచన్‌గా పింఛన్ ఇవ్వడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సామాజిక భద్రతా పింఛన్‌ల ద్వారా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి అందుతున్న ఆర్థికసాయం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చూడటం తమ బాధ్యత అని ఉద్ఘాటించారు. ప్రతి నెల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలబడటం ద్వారా ఇది అందరి ప్రభుత్వం అనే సందేశాన్ని కూడా బలంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలాబేగం, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, పీవీ సురేష్, షమీమ్, శ్రీనుతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణంలోని 23, 24 వార్డులలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, 23వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దుగ్గెంపూడి వీరయ్య చౌదరి, 24వ వార్డు అధ్యక్షుడు రావెళ్ళ పెద నాగేశ్వరరావు, గుత్తా అంకమ్మ చౌదరి, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు, నల్లపాటి చిన్నబ్బాయి, గంగవరపు యల్లమంద, బెల్లం కృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.

పింఛను పంపిణీచేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

## చిన్నకొండపై పారిశుధ్య పనులు

వినుకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీన జరిగే రామలింగేశ్వరస్వామి తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ చిన్నకొండపై పారిశుధ్య పనులు చేపట్టారు. మెట్లమార్గం ద్వారా భక్తులు చిన్నకొండకు చేరుకునే అవకాశం ఉండటంతో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా మెట్ల పూజకు అనువుగా ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి కొండపై పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

## 6వ తేదీ వరకు సహకార వారోత్సవాలు

● జిల్లా సహకార అధికారి నాగరాజు

నరసరావుపేట మండలం ఇక్కుర్రులో మొక్కలు నాటుతున్న అధికారులు

నరసరావుపేట రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు సహకార ఉత్సవ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మండలం ఇక్కుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మంగళవారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు పాల్గొని మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయాల్లో అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించినట్లు తెలిపారు. మోడల్ ఆడిటింగ్, స్వచ్ఛత, సభ్యత్వ నమోదు, పాఠశాలలలో సహకార సంఘాలపై అవగాహన సదస్సులు, సహకార సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజనల్ సహకార అధికారి కే.తిరుపతయ్య మాట్లాడుతూ ఇక్కుర్రు ప్రాథమిక సహకార సంఘం సేవలను రైతులు వినియోగించుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సంఘం ఆర్థికంగా బలపడటానికి రైతులందరూ సహకరించాలన్నారు. సబ్ డివిజనల్ సహకార అధికారి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ ఇక్కుర్రు పీఏసీఎస్ మరింత అభివృద్ధి చెందాలన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా పలువురు డాక్టర్లకు సత్కారం

చిలకలూరిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఇక్కడి డాక్టర్లను మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ వైద్యులు కొల్లా అమర్, పిన్నింటి సాహితి, లింగా అప్పారావు, డాక్టర్ మక్కెన వంశీకృష్ణలను పండరీపురం రోటరీ క్లబ్ సభ్యులు బోనం వెంకటేశ్వరరావు, దొరడ్ల శివనాగ మనోజ్‌కుమార్, రాజు, సింగరావు, దాసునయన, లింగయ్య చౌదరి, బిట్రా నాగేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సెంట్రల్ బ్యాంకు మేనేజర్, సిబ్బంది జానకీ నర్సింగ్‌హోమ్‌కు చెందిన వైద్యులు ముప్పాళ్ళ హనుమంతరావు, ముప్పాళ్ళ బలరామకృష్ణ, తేజస్విలను కలిసి సత్కరించారు.

## నేడు తలార్లపల్లి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేత

నూజెండ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల సబ్ స్టేషన్ పరిధిలోని నూజెండ్ల బీసీ కాలనీ, తలార్లపల్లి ఫీడర్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముండ్లమూరు మండలం ఈదర నుంచి నూజెండ్ల సబ్ స్టేషన్‌కు 33కేవీ నూతన విద్యుత్ లైన్ నిర్మాణంలో భాగంగా వైర్లు బిగించనున్నట్టు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు, వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

## విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందింపజేయాలి

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

పోట్లూరు (శావల్యాపురం) జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉత్తమబోధనను అందించి వారిలోని సామర్థ్యాలను పెంపొందింపజేయాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని పోట్లూరులోని మెయిన్, హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం తనిఖీచేశారు. హెచ్‌సీ పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత ఉండడంతో విద్యార్థుల్లో సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయని, ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టిని సారించి వారిని తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మధ్యాహ్న బోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న బోజనంలో ప్రభుత్వం సన్నబియ్యాన్ని సరఫరా చేయడంతో పాఠశాలల్లో భోజనం చేసేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, హెచ్ఎంలు షరీఫ్, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాల పూర్వ వైభవానికి కృషి చేస్తాం

● లూథరన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

యడ్లపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాల ఖాళీ తరగతి గదులతో వెలవెలబోతోందని పూర్వ విద్యార్థులు, దాతల వారసులు, గ్రామస్థులు, పాఠశాల అభివృద్ధి సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల పరిరక్షణ, భవితవ్యంపై గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఏఈఎల్‌సీ ప్రతినిధుల మాటలు నమ్మి భావితరాల విద్య, భవితను దృష్టిలో ఉంచుకుని, 1952లో నిర్మించిన యడ్లపాడు కమిటీ హైస్కూల్ నిర్వహణ బాధ్యతలను మాత్రమే ఏఈఎల్‌సీకి అప్పగించడం జరిగిందన్నారు. ఏఈఎల్‌సీ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, 20ఏళ్లుగా ఉపాధ్యాయ నియామకాలు కూడా చేపట్టలేదని ఆరోపించారు. 15 ఏళ్ళ క్రితమే పాఠశాల పూర్వ విద్యార్థులు సంఘటితమై పాఠశాల పూర్వవైభవానికి యత్నిస్తున్నారన్నారు. దాతల సహకారంతో రూ.40లక్షలు సమీకరించి తరగతి, కార్యాలయ గదులపై స్లాబులను పునరుద్ధరించి, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. 1952లో ఏఈఎల్‌సీకి కేవలం పాఠశాల నిర్వహణ బాధ్యత మాత్రమే అప్పగించడం జరిగిందని, ఎలాంటి యాజమాన్య హక్కులు కల్పించలేదన్నారు. గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు కొందరు దుష్ప్రచారానికి తెగబడ్డారన్నారు. పాఠశాల భవనం, స్థలం కబ్జాకు గురవుతున్నదని, కబ్జాదారులు ప్లాట్లుగా వేసి అమ్ముకో జూస్తున్నారంటూ కొందరు ప్రచారం చేస్తుండడం బాధాకరమన్నారు. తమ సంకల్పంతో భాగస్వాములై భావితరాల విద్యా భవిష్యత్‌కోసం తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థులు గ్రామ పెద్దలు ముత్తవరపు రామారావు, నూతలపాటి కాళిదాసు, పోపూరి వెంకటరత్తయ్య, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, బెజ్జం రాజశేఖర్, టి.సునీల్, కాసు రామస్వామిరెడ్డి, సి.చెంచారెడ్డి, నంబూరి శివరామకృష్ణ, జరుగుల అంజేశ్వరరావు, పోపూరి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



## అవగాహనతోనే డెంగ్యూ నివారణ సాధ్యం

పార్వతీపురం, జూలై1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే డెంగ్యూ నివారణ సాధ్యమని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా మంగళవారం పార్వతీపురం జడ్పీ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. నిల్వ నీటిని గుర్తించాలని, పరిసరాలను శుభ్రపర్చాలని, నీటి తొట్టెలపై మూతలు ఉంచాలన్నారు. డెంగ్యూ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం డాక్టర్స్‌డే సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. సమాజంలో వైద్యుని పాత్ర ఎంతో కీలకమని, మరింత విస్తృతంగా వైద్య సేవలందించాలన్నారు.

నేటి నుంచి

# ఇంటింటికీ టీడీపీ

సుపరిపాలనలో తొలి అడుగు

- 'సుపరిపాలనలో తొలి అడుగు'కు శ్రీకారం
- నెలరోజుల పాటు నిర్వహణ
- ప్రజల్లోకి మంత్రి, ఎమ్మెల్యేలు, కూటమి శ్రేణులు
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం
- వైసీపీ చెప్పే అబద్ధాలను తిప్పికొట్టనున్న నేతలు

పార్వతీపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో నేటి నుంచి 'సుపరి పాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించనున్నారు. కూటమి శ్రేణులు, ఎమ్మెల్యేలు, మంత్రి, నేతలు బుధవారం నుంచి ప్రజల మధ్యకు వెళ్లనున్నారు. నెల రోజుల పాటు ప్రజా క్షేత్రంలోనే ఉండనున్నారు. కిందిస్థాయి కార్యకర్తలు, నాయకులంతా ప్రతి ఇంటి తలుపునూ తట్టనున్నారు. ఏడాదిలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించనున్నారు. భవిష్యత్‌లో చేయ బోయే కార్యక్రమాలను తెలియజేయ నున్నారు. వైసీపీ చెప్పే అబద్ధాలను తిప్పి కొట్టనున్నారు. కాగా నేడు సాలూరు నియోజక వర్గంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, కురుపాంలో ప్రభుత్వ విప్ తోయక జగ దీశ్వరి, పార్వతీపురంలో బోనెల విజయ చంద్ర, పాలకొండలో నిమ్మక జయకృష్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రతి గామంలోనూ పండుగలా 'సుపరిపాలనకు తొలి అడుగు' నిర్వహించేందుకు కూటమి శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. పింఛన్ల మొత్తం పెంపు, అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం, ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, ఉచిత ఇసుక, సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం, డీఎస్సీ, రేషన్ షాపులు పునఃప్రారంభం, రహదారులు, గోశాలల నిర్మాణం, కంటైనర్ ఆసుపత్రుల ఏర్పాటు వంటి విషయాలను ప్రజలకు తెలియజేయనున్నారు. ఏడాది పాలనలో నమోదు చేసిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, రానున్న రోజుల్లో చేయబోయే కార్యక్రమాలను వివరించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను కూడా ప్రజలకు చెప్పనున్నారు.

అప్‌గ్రేడ్ సరే..

# వసతులేవీ?

- రేకుల షెడ్డులోనే చదువులు
- ఆరుబయటే భోజనాలు
- అదనపు భవనాలు లేక అవస్థలు
- ఇదీ చావిడివలస పాఠశాలలో పరిస్థితి

అదనపు భవనం లేక రేకులషెడ్డులోనే బోధిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామం చావిడివలస పాఠశాలను ఎంపీపీఎస్ (మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల) నుంచి మోడల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (ఎంపీయూపీఎస్)గా ఇటీవల అప్‌గ్రేడ్ చేశారు. అయితే వసతుల కల్పన మాత్రం మరిచారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో ఏర్పాటు చేసిన తాత్కాలిక రేకుల షెడ్డులోనే గిరిజన చిన్నారులు చదువుకోవాల్సి వస్తోంది. మరోవైపు ఆరుబయటే మధ్యాహ్నం భోజనం చేయాల్సి వస్తోంది. చావిడివలస పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 75 మంది విద్యార్థులు చదువుతున్నారు. పీవి ఈతమానుగూడ, చావిడివలస, గురండి, కోమటిగూడ, పుట్టిగాం గ్రామాల్లోని గిరిజన చిన్నారులు ఇదే పాఠశాలకు వస్తుంటారు. అయితే ఇటీవల చావిడివలస స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు హెచ్‌ఎం, సెకెండరీ గ్రేడ్ టీచర్‌ను నియమించారు. దీంతో మొత్తంగా ఐదుగురు ఉపాధ్యాయులు గిరిజన చిన్నారులకు బోధిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా పాఠశాలలో చదువుతున్న గిరిజన చిన్నారులకు వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. అదనపు భవనాలు లేకపోవడంతో

(మిగతా 8వ పేజీలో...)

వసతి సమస్య కారణంగా నేలపై కూర్చొని చదువుకుంటున్న గిరిజన చిన్నారులు

జిల్లా కేంద్రాసుపత్రి

## రోడ్డులో అంధకారం

- వెలగని వీధిలైట్లు
- రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు

6లో

## వైభవంగా హీరా పంచమి పూజలు

6లో

అంతర్రాష్ట్ర రోడ్డుపై గోతిలో

## కూరుకుపోయిన లారీ

- బారులుదీరిన వాహనాలు
- ఏడు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

6లో

బురదమయంగా

## గ్రామీణ రహదారులు

- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

8లో

సాలూరులో కురుస్తున్న వర్షం

## మూడు రోజులుగా ముసురు

సాలూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజుల నుంచి తెరిపి ఇవ్వడం లేదు. ఏజెన్సీలోనూ ముసురు వాతావరణం నెలకొంది. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. కొన్నిచోట్ల జల్లులు, మరికొన్నిచోట్ల ఓ మోస్తరు వాన పడింది. మరోవైపు రైతులు హుషారుగా పొలం పనులు చేసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం తొలి తడి అందించిందని చెబుతున్నారు. వరి నారుమళ్లకు కూడా మేలు చేస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కొండల తోటి.. మబ్బుల భేటీ

6లో

# 93 శాతం పింఛన్ల పంపిణీ

అడ్డాపుశీలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

గరుగుబిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మంగళవారం 93 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సొమ్ము అందించారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా లెక్కచేయలేదు. జిల్లాలో 1,38,769 మంది లబ్ధిదారులకు గాను తొలిరోజు 1,27,827 మందికి పింఛన్ అందజేశారు. ఈ నెల పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం రూ. 59.21కోట్లను విడుదల చేసింది.

- పార్వతీపురం రూరల్: అడ్డాపుశీల గ్రామంలో లబ్ధిదారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పింఛన్లు అందించారు. డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఎంపీడీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### స్పౌజ్ పింఛన్లకు ఎదురుచూపు

గరుగుబిల్లి: జిల్లాలో ఎంతోమంది అర్హులు స్పౌజ్ పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే.. ఆ తర్వాత నెలలోనే అతని భార్యకు పింఛన్ వర్తించేలా ప్రభుత్వం స్పౌజ్ కేటగిరీని ప్రవేశపెట్టింది. ఈ మేరకు జిల్లాలో 1,521 మందికి పింఛన్లు మంజూరు చేశారు. 2023, డిసెంబరు 1 నుంచి 2024, అక్టోబరు 31 మధ్య కాలంలో పింఛన్ పొంది మృతి చెందిన వారి జీవిత భాగస్వాములకు పింఛన్లు అందించాలని నిర్ణయించారు. అయితే వివిధ కారణాలతో మే, జూన్ నెలల్లో వాటిని పంపిణీ చేయలేకపోయారు. ఈ నెలలో స్పౌజ్ పింఛన్లకు సంబంధించి నగదు విడుదలైనా ఇప్పటివరకూ పంపిణీ చేయలేదు. త్వరితగతిన వాటిని అందించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

**తేదీ ఖరారు కావల్సి ఉంది..**

స్పౌజ్ పింఛన్ల నగదు విడుదలైంది. అయితే వాటి పంపిణీకి తేదీ ఖరారు కావాల్సి ఉంది. ఈ పింఛన్ల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పౌజ్ పింఛన్లను ఎప్పుడు పంపిణీ చేస్తామన్నది త్వరలోనే వెల్లడిస్తాం.

- ఎం.సుధారాణి, పీడీ, డీఆర్‌డీఏ

## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం కావాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మౌలిక వసతులతో జిల్లాలో అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం అడ్డాపుశీలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి చిన్నారులతో కాసేపు మాట్లాడారు. స్టోర్ రూమ్‌లోని నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలన్నారు. వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించి చక్కగా బోధించాలని సూచించారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఫర్నీచర్‌ను పంపిణీ చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ఆర్థికంగా నిలదొక్కుకోవాలి..

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులందరూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కలెక్టర్ సూచించారు. వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అడ్డాపుశీలలో గ్రామంలో స్వయం సహాయ సంఘాలు నిర్వహించబడుతున్న వస్త్ర వ్యాపారాన్ని ఆయన పరిశీలించారు. స్త్రీనిధి నుంచి లక్ష రుపాయలు రుణంగా పొంది వస్త్ర వ్యాపారం నిర్వహించు కోవడం ఆనందంగా ఉందన్నారు

జిల్లా కేంద్రం..

# పడకేసిన పారిశుధ్యం

- పేరుకుపోయిన చెత్తకుప్పలు, వ్యర్థాలు
- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న మురుగునీరు
- దోమల స్వైరవిహారం.. వ్యాధులు ప్రబలే ప్రమాదం
- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన అధికారులు, పాలకవర్గం

వీధుల్లో పరిస్థితి ఇదీ..

చెత్త, వ్యర్థాలతో నిండిన వరహాల గెడ్డ

పార్వతీపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్డెక్కుతోంది. ఎక్కడికక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తోంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. అధికారులు, పాలకవర్గం స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేయడంపై మున్సిపాల్టీవాసులు మండి పడుతున్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకముందే పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా పారిశుధ్యం, మురుగునీటి మళ్లింపుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

### ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం మున్సిపాల్టీగా ఏర్పడి 60 ఏళ్లు అవుతుంది. గ్రేడ్-1 అప్‌గ్రేడ్ అయ్యి 25 ఏళ్లు కావస్తుంది. జిల్లా కేంద్రంగా మారి మూడేళ్లు గడుస్తుంది. అయినా పట్టణంలో పరిస్థితేమీ మారలేదు. మున్సిపాల్టీలో 30వార్డులు ఉండగా.. అధికారికంగా 55 వేల మంది జనాభా ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. అనధికారికంగా సుమారు 80వేల మందికి పైగా జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. ఆయా వార్డుల నుంచి రోజుకు సుమారు 15 నుంచి 20 టన్నుల వరకు చెత్తలు, వ్యర్థాలను

(మిగతా 8వ పేజీలో...)

మురుగు కాలువ ఇలా..

6,780 ఇంజనీరింగ్

## సీట్లకు అనుమతి

విజయనగరం కలెక్టరేట్ జూలై1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 6,780 ఇంజనీరింగ్ సీట్లకు ఉన్నతి విద్యా శాఖ అనుమతి ఇచ్చింది. జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో 360, తొమ్మిది ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 6,420 సీట్లుకు ఆమోదం తెలిపింది. ఈ సీట్ల ప్రాప్తికి మాత్రమే ఆయా కళాశాలలు భర్తీ చేయాల్సి ఉంది.

## గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

- పింఛన్ల పంపిణీలో మంత్రి సంధ్యారాణి

8లో

పాచిపెంట మండలం తెట్టెడివలసలో గిరిజన వృద్ధునికి పింఛన్ ఇస్తున్న మంత్రి సంధ్యారాణి

# కొండల తోటి... మబ్బుల భేటీ

సాలూరు ఏజెన్సీలో తూర్పు కనుమలపై హిమపాతంలా...

మన్యం జిల్లా అంతటా విశాలమైన అటవీ ప్రాంతం ఉంది. దూరం నుంచి చూస్తే పచ్చని తివాచీ పరిచినట్టు కనిపిస్తుంది. ఇక కొండల శిఖరాలైతే ఆకాశాన్ని తాకుతున్నట్టు కనిపిస్తాయి. ఆ శిఖరాలపై... పచ్చని ప్రకృతిలో సేదదీరేందుకు వచ్చాయేమో అనేటట్టుగా మబ్బులు సందడి చేస్తున్నాయి. నీటిని మోసుకొచ్చి కొండలకు అభిషేకం చేస్తున్నట్టుగా వానజల్లులను కురిపిస్తున్నాయి. తూర్పు కనుమలను మంచు పరదాలు కప్పినట్టు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

-సాలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి)

పారమ్మకొండపై అందంగా...

## అభివృద్ధిపై ప్రచారం బాధ్యత కార్యకర్తలదే

● ఉత్తరాంధ్రపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం గంట్యాడ గ్రామంలో జామి, గంట్యాడ మండలాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో 'సుపరిపాలనకు తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.రెండు కోట్లతో 170 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న తాటిపూడి నుంచి మదుపాడకు రోడ్డు వేశామని చెప్పారు. తాటిపూడిలో బోటు షికారు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి గ్రామానికి రోడ్లు వేశామని... గోకులాలు నిర్మించుకున్నామని చెప్పారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తోందన్నారు. గ్రామంలోని ప్రతి కార్యకర్త బలంగా తయారు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులు భయపడేవిధంగా కార్యకర్తలు ఉండాలన్నారు. ఏ కార్యకర్త అయినా తనకు చట్టబద్ధమైన పనిని అప్పగిస్తే కచ్చితంగా చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌రావు, కొప్పలవెలమ డైరెక్టర్ అల్లు విజయకుమార్, తాటిపూడి ఆయకట్టు ఛైర్మన్ కె.జగన్నాథం, టీడీపీ నాయకులు రంధి చినరామునాయుడు, బూడి అప్పలనాయుడు, కొరుపోలు కృష్ణమూర్తి, రంధి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

విజయనగరం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత సిటీ బస్టాండ్ సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్కంద షష్టి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గాయత్రీ శర్మ పర్యవేక్షణలో ఈ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

● బొబ్బిలి: గొల్లపల్లి దాడితల్లి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం స్కంద షష్టి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామిని పూలతో అలంకరించారు.

విజయనగరంలో అలంకరించిన దృశ్యం

## ఆకట్టుకున్న కోలాటం

విజయనగరం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులతల్లి పైడిమాంబ చదురుగుడి వద్ద మంగళవారం నగరంలోని ఉడా కాలనీకి చెందిన కోలాటం నృత్య శిక్షకురాలు లక్ష్మీ శ్రీనివాస్ బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారి పాటలకు అనుగుణంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఆలయ ఈవో శిరీష, ఉద్యోగులు, అర్చకులు, పైడిమాంబ సేవా సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి వద్ద పైడిమాంబకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లను నేవేద్యంగా సమర్పించారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి.. అమ్మవారిని దర్శించుకున్నారు.

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

జిల్లా ఆసుపత్రి రహదారిలో చీకటిగా ఉన్న దృశ్యం

## ఆస్పత్రి రోడ్డులో అంధకారం

పార్వతీపురంటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్రాసుపత్రికి రాత్రి పూట వెళ్లాలంటే రోగులు, వారి బంధువులు హడలిపోతున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత జిల్లా ఆసుపత్రి రహదారిలో ప్రయాణమంటే ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఆసుపత్రి రహదారిలో వీధిలైట్ల నిర్వహణ సరిగా లేక పోవడంతో ఈ పరిసరాల్లో అంధకారం అలముకుంది. చీకట్లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి తలెత్తింది. ఈ విషయమై మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావును వివరణ కోరగా వెంటనే వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపడతామన్నారు.

పాలకొండ: వరాహనరసింహావతారంలో జగన్నాథుడు

పాలకొండ: స్వామి వారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పార్వతీపురం టౌన్: నరసింహావతారంలో...

భామిని: బత్తిలిలో నారసింహావతారంలో...

## వైభవంగా హీరా పంచమి పూజలు

జగన్నాథుని రథోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం హీరా పంచమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథుని దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. రథయాత్ర నుంచి ఐదో రోజున హీరా పంచమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఆషాఢంలో ప్రకాశవంతమైన రోజుగా దీనిని భావిస్తారని అర్చకులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం

రథం వద్ద మహిళల పూజలు

వీరఘట్టం: వామనావతారంలో..

జియ్యమ్మవలస: చినమేరంగిలో...

విజయనగరం రూరల్:రామావతారంలో...

## వైభవంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

పాలకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో వారాహీదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం హారతులు సమర్పించారు. అర్చకులు శరత్ బృందం లలితా సహస్రనామ పారాయణం చేశారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కుమ్మరిగుంట గ్రామం వద్ద రోడ్డుపై గోతిలో దిగబడిన లారీ

బారులుదీరిన వాహనాలు

## గోతిలో కూరుకుపోయిన లారీ

● బారులుదీరిన వాహనాలు

● ఇదీ అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి

జియ్యమ్మవలస, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి అత్యంత దారుణంగా తయారైంది. వాహన చోదకులు ఈ రహదారిపై నిత్యం నరకం చూస్తున్నారు. మంగళవారం కుమ్మరిగుంట సమీపంలో ప్రధాన రహదారిపైన గోతిలో లారీ కూరుకుపోయింది. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు, అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటర్లకొద్దీ బారులుదీరాయి. దాదాపు 7 గంటల పాటు వాహనాలు కదల్లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రహదారిలో ఎక్కడో ఓ చోట తరచూ ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయని వాహన చోదకులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితికి భయపడి ఆర్టీసీ సర్వీసులనే రద్దు చేశారు. ఆటోలు కూడా నడపలేకపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి... నిధులు మంజూరు చేసి... త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## 2.29 లక్షల మంది రైతుల ఈకేవైసీ పూర్తి

● 11,250 మందికి విత్తనాల పంపిణీ ● వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విజయనగరం కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 29 వేల మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే రైతుల ఖాతాలకు జమవుతాయన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన నిధులు జూలైలో విడుదల అవుతాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు ప్రణాళికపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● **ప్రశ్న:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల పంపిణీ పరిస్థితి ఏంటి?

**జవాబు:** ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 97,216 హెక్టార్లలో వరి, 9,598 హెక్టార్లలో మొక్కజొన్న, 201 హెక్టార్లలో వేరుశెనగ, 1804 హెకార్లలో ప్రత్తి సాగుచేస్తున్నారు. అలాగే గోగును 118 హెక్టార్లు, చెరకు 3002 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 50,010 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా... ఇప్పటి వరకూ 42,735 క్వింటాళ్లు రైతు సేవ కేంద్రాలకు పంపించాం. ఇప్పటి వరకూ 11,250 మంది రైతులకు విత్తనాలు అందించాం. 30 కేజీల ప్యాకెట్ ధర రూ 1,260. ప్రభుత్వం ఇస్తున్న రాయితీ 300 తీసివేయగా... ప్రతి రైతు రూ.960 చెల్లించి విత్తనాలు తీసుకోవాలి. విత్తనశుద్ధిలో భాగంగా సుడిమాన్ మందును రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నాం. 1,121రకం 38వేల క్వింటాళ్లు, 1124 రకం 1,650, 3,291 రకం 2,500 , 5204 రకం 2,500 క్వింటాళ్లు అందిస్తున్నాం.

● **ప్ర:** విత్తనాలు వేసుకోవడానికి అనువైన సమయమేనా?

**జ:** ఈ ఏడాది మే నెలలో అధికంగా వర్షం కురిసింది. సాధారణం కంటే 40 మిల్లీమీటర్లు ఎక్కువగా కురిసింది. జూన్ నెలలో కురవాల్సిన వర్షంకంటే 19 మిల్లీమీటర్లు తక్కువ కురిసింది. ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. దుక్కిదున్ని పొలాలను సిద్ధం చేసుకోవాలి. విత్తనాలు వేసుకోవడానికి రైతులు సిద్ధంగా ఉండాలి.

● **ప్ర:** ఎరువుల పరిస్థితి ఏంటి?

**జ:** ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు కావలసిన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ కలిపి 19 వేలు మెట్రిక్ టన్నులు అవసరం. ప్రస్తుతం ప్రస్తుతం 21 వేల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి.

● **ప్ర:** కౌలు రైతుల విషయంలో ఏం చేయబోతున్నారు?

**జ:** జిల్లాలోని మొత్తం 15,650 కౌలుకార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకూ 10 వేల కార్డులను కౌలు రైతులకు అందించాం. ఈ కార్డులు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులు అన్నదాతా సుఖీభవ పథకానికి కూడా అర్హులు.

● **ప్ర:** భూసార పరీక్షలు పూర్తయ్యాయా?

**జ:** భూసార పరీక్షల కోసం పొలాల నుంచి మట్టి నమూనాలను తీసుకుని ల్యాబ్‌కు పంపించాం. జిల్లా వ్యాప్తంగా 21 వేల పరీక్షలు నిర్వహించాం. వీటి ఫలితాలు కొద్దిరోజుల్లో రానున్నాయి. వీటిని నాట్లు వేసుకునేలోగా రైతులకు అందిస్తాం. వీటి ఆధారంగా రైతులు ఎరువులు పిచికారీ చేస్తారు.

● **ప్ర:** సాంకేతికతను ఎలా వినియోగిస్తున్నారు?

**జ:** పంట పొలాలకు పురుగు మందులు పిచికారీ చేయడానికి రైతులకు డ్రోన్లు అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 24 డ్రోన్లు మంజూరయ్యాయి. వీటికి 19 డ్రోన్లకు రైతులు డబ్బులు చెల్లించారు. ఇంకా ఐదు డ్రోన్లకు రైతులు డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఒక్కొక్క డ్రోనుకు రూ.10 లక్షలు చొప్పున చెల్లించాలి. రైతులు రూ.5 లక్షలు చెల్లిస్తే బ్యాంకు మరో ఐదు లక్షలు రుణంగా ఇస్తుంది. తరువాత ప్రభుత్వం రూ.8 లక్షలు రాయితీ ఇస్తుంది. అంటే రైతుకు 80 శాతం రాయితీపై డ్రోన్లు అందించినట్టు అవుతుంది.

# డ్రైనేజీల నిర్వహణ ఎక్కడ?

● చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి మురుగునీరు
● కాల్వలపై నిర్మాణాలను తొలగించని మునిసిపాలిటీ
● పట్టణవాసులకు తప్పని ఇక్కట్లు

శ్రీకాకుళం రోడ్డులో మురుగునీటి ప్రవాహం

రాజాం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీలో డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లు, వీధులు చెరువులను తలపించడం సర్వసాధారణమైంది. దీంతో పట్టణవాసులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిస్థాయిలో కాల్వల నిర్మాణం జరపకపోవడం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడమే ఇందుకు కారణం. కాల్వల నిర్మాణాలకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, దాన్ని అమలు చేయాల్సిన మున్సిపల్ యంత్రాంగం చేతులెత్తేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వర్షం కురిస్తే బొబ్బిలి రోడ్డులోని సుమారు ఏడెనిమిది వీధుల్లోని మురుగునీరంతా మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తూ శ్రీకాకుళం రోడ్డులోని సప్తగిరి కాలనీలోని ఇళ్లను ముంచెత్తుతోంది. అక్కడ నుంచి అదే రోడ్డులోని పెట్రోల్ బంక్ వరకూ నీరు నిలిచిపోతోంది. ఇలాంటి సందర్భాలలో పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెతలు వర్ణనాతీతం. అలాగే వర్షం కురిస్తే ఈశ్వరనారాయణ కాలనీలోని ఆరు లేన్లు, బాబానగర్, నరసింహనాయుడు కాలనీలకు వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. మల్లికార్జున కాలనీలోని ఏడు వీధుల్లోనూ ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా వీరికి కష్టాలు తప్పవు. ప్రధానంగా బొబ్బిలి రోడ్డులోని మార్కెట్ యార్డు మొదలుకుని శ్రీకాకుళం రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. కాల్వలపై శాశ్వత నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. మున్సిపల్ యంత్రాంగం ఆక్రమణదారుల జోలికి వెళ్లకపోవడంతో కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాంతో మురుగు నీరు ముందుకు సాగక రోడ్డుపైకి ఉప్పొంగుతోంది.

అంబేడ్కర్ జంక్షన్ వద్ద ప్రధాన కాల్వపై అక్రమ నిర్మాణం

సామాజిక ఆసుపత్రి ఎదుట కాల్వపై ఆక్రమణలు

## 8న ఏఎంసీ పాలకవర్గం బాధ్యతలు?

విజయనగరం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 8న జరగనుంది. ఏఎంసీ చైర్మన్‌గా గాజులరేగ ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కర్రోతు నర్సింగరావు పేరును టీడీపీ ప్రకటించింది. వైస్ చైర్మన్‌తో పాటు, 18 మంది పాలకవర్గ సభ్యులు జాబితాను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు నెలరోజుల క్రితమే పార్టీ అధిష్ఠానానికి నివేదించారు. జిల్లాలోని తొమ్మిది ఏఎంసీలకుగానూ, ఇప్పటికే మూడు ఏఎంసీల పాలకవర్గాలకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే మిగతా ఆరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు ఉత్తర్వులు రావల్సి ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం బుధవారం సాయంత్రం నాటికి విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సంబంధించి ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే పాలకవర్గం ఈ నెల 6 లేదా 8న కొలువు దీరనుంది.

## సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయండి

లక్కవరపుకోట, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని దళిత ఉద్యమ జిల్లా నేత గంటాన అప్పారావు కోరారు. మంగళవారం ఎల్.కోటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయలేదన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ఉదయభాస్కర్, పి.సూరిదేముడు, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

డెంకాడ, జూలై1 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో ఆరోగ్యానికి ఎటువంటి అనర్థం జరగదని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని డి.తాళ్లవలసలో ఆయన పర్యటించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ విధానం, వాల్వ్ పిట్స్, ట్యాంక్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సూచనలు చేశారు. సర్పంచ్ టి.త్రిమూర్తులు, పంచాయతీ సెక్రటరీ రజని ఉన్నారు.

## సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

విజయనగరం దాసన్నపేట, జూలై1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు తెలియజేసేందుకే రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు నెలకు రూ 1,500, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సాయం వంటి వాగ్దానాలు అమలు కాలేదన్నారు. ఈ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సమ్మె విరమించండి

రాజాం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిరవధిక సమ్మె విరమించాలని కమిషనర్ అప్పలనాయుడు మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కమిషనర్ మంగళవారం సందర్శించారు. సమ్మెలో పాల్గొన్న సిబ్బందితో మాట్లాడారు. తక్షణమే సమ్మె విరమించాలని కమిషనర్ కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని వారు కమిషనర్‌కు స్పష్టం చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడవాడ గ్రామానికి చెందిన కొణతాల అసిరితల్లికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.37100 మంజూరయ్యాయి. మంగళవారం పోలిపల్లిలోని నివాసంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సంబంధిత చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బీమా పథకాలను వినియోగించుకోండి

గుర్ల, జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష బీమా పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.వి.రమణమూర్తి, డీసీసీబీ జనరల్ మేనేజర్ కేవీవీఆర్ఎస్ సత్యనారాయణ సూచించారు. ఆనందపురంలో జన సురక్ష పథకాలపై వారు అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్ల సహకార బ్యాంకు మేనేజర్ ఎ.శ్రీనివాసనాయుడు, సర్పంచ్ సత్యవతి పాల్గొన్నారు.

## నేటి నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు'

● ఎంపీ కలిశెట్టి

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం నుంచి విజయనగరం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలన్నారు. మండల, పట్టణ, నగర అధ్యక్షుల ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌చార్జిలు ఇంటింటికీ వెళ్లి ప్రతి రోజు 30 నుంచి 50 కుటుంబాలతో మాట్లాడాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, కోదండరామ్ పాల్గొన్నారు.

## పింఛన్లతో ఆర్థిక తోడ్పాటు

పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక తోడ్పాటు లభిస్తోందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం నగరంలోని 28వ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీలో ఆమె లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని చంద్రబాబు పెంచారన్నారు. పేదల కళ్లల్లో ఆనందం నింపారన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు పాలవలస యశస్వి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు. ● నగరంలోని నాలుగో డివిజన్‌లోని మంగళ వీధిలో టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## 'సుపరిపాలన'పై శిక్షణ

మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

పూసపాటిరేగ, జూలై1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహణపై మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు 35 నుంచి 50 కుటుంబాలను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు ఎండీ నజీర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకరావు, నాయకుడు భాస్కరరావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారుల కళ్లలో సంతోషం చూస్తున్నాం..

● భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారుల కళ్లలో సంతోషం కనిపిస్తోందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని లింగాలవలసలో మంగళవారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుగత లలిత, బైరెడ్డి శ్రీను, బుగత రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కళా జన్మదిన వేడుకలు


కళాకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

గరివిడి, జూలై1 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాపు శంబాం సెంటర్ నుంచి చీపురుపల్లి మీదుగా గరివిడి వరకు పార్టీ నాయకులు ర్యాలీగా వెళ్లారు. నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● రాజాం: రాజాంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారంచీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయుకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్వాసితుల సమస్యను పరిష్కరించండి

శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలని కలెక్టర్, ఎస్పీలను కోరినట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ భూమి సమస్యను కలెక్టర్ అంబేడ్కర్‌కు వివరించేందుకు వెళ్లానన్నారు. అయితే వారు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో సిబ్బందికి లేఖ అందించానన్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి సమస్య వివరించామన్నారు. నిర్వాసితులు వారి సమస్యలు చెప్పుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని ఎస్పీని కోరినట్టు ఆయన చెప్పారు.

## మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో చేపట్టిన మంచి పనులు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సంబంధించి గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్టీఆర్ అమలు చేసిన రూ.70 పింఛన్‌ను రూ.4 వేల వరకు పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. తల్లికి వందనం పథకానికి రూ.10 వేలు కోట్లు వెచ్చించామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15వేలు చొప్పున అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను కలుపుకుని ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద అందజేయనున్నామన్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలు కానుందన్నారు. గడిచిన ఏడాదిలో ప్రతీ గ్రామంలో రోడ్లు, తాగునీరు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 300 సేవలు అందుతున్నాయన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ అందిస్తున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనపై విసిగిన ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

బొండపల్లి, జూలై1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని అంబటివలసలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కుల వృత్తిదారులు ఆత్మగౌరవంతో జీవనం సాగించాలనే లక్ష్యంతో పింఛన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాముల కావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల, ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

కొత్తవలస ఏఎంసీ పాలక మండలితో ఎంపీ భరత్

కొత్తవలస, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లిలో గల ఓ కల్యాణ మండపంలో మంగళవారం కొత్తవలస మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చొక్కాకుల మల్లునాయుడు, వైస్ చైర్మన్‌గా తూర్పాటి ఆదిబాబు, డైరెక్టర్లతో ఎంపీ భరత్, ఎమ్మెల్యే లలితకుమారి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడారు. మార్కెట్ కమిటీని అభివృద్ధి చేయడానికి పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కేబీఏ రాంప్రసాదః, ఇందుకూరి సుధారాణి, రాయవరపు చంద్రశేఖర్, గొరపల్లి రాము, గొంప వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

● శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ప్రతి కుటుంబం సీఎంని కుటుంబ పెద్దగా భావిస్తున్నారన్నారు. అలాగే పట్టణంలోని పుణ్యగిరి, బర్మాకాలనీ ప్రాంతాల్లో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి పింఛన్లను పంపిణీ చేశారు.

## సాగునీటిపై దృష్టి పెట్టండి

ప్రాజెక్ట్ వివరాలు చూపిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని ఇరిగేషన్ ఇంజనీర్లకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. ముంజేరు సమీపంలోని కార్యాలయంలో మంగళవారం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టల పునరుద్ధరణపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టల ప్రస్తుత పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలో నిలిచిన ప్రాజెక్టలను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈఈ త్రినాథులు, ఏఈ అరుణ్‌దీప్, నాయకుడు పి.జగదీశ్ తదితరులున్నారు.

## హరిత శోభకు శ్రీకారం

● కొవ్వాడ అగ్రహారంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
● నడుంబిగించిన సర్పంచ్ రఘు

శివాలయం ప్రాంగణంలో సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న రఘు

పూసపాటిరేగ, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు జనసేన మండల నాయకుడు, సర్పంచ్ కోట్ల రఘు నడుం బిగించారు. మంగళవారం స్థానిక శివాలయం నుంచి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో గ్రామస్థులను భాగస్వాములను చేశారు. రాజమండ్రి దరి కడియం నుంచి 4 వేల విభిన్న రకాల సుందరమైన మొక్కలను తెప్పించారు. గ్రామానికి చేరువలోని చెరువు గట్టుపై నాటి ఆహ్లాద వాతావరణాన్ని ప్రజలకు అందించనున్నారు. అలాగే గ్రామంలో రహదారులకు మొక్కలను నాటించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఆయన దాదాపు రూ.2లక్షలు వెచ్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోట్ల సత్యం నాయుడు, ఇజ్జరోతు సీతంనాయుడు, లెంక రామకృష్ణ, దేబారిక అప్పారావు, యువకులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య

సత్య (ఫైల్)

గంట్యాడ, జూలై1 (ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామానికి చెందిన చుక్క సత్య (24) కడుపునొప్పి తట్టుకోలేక మంగళవారం మధ్యాహ్నం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాల మేరకు.. సత్యవతి కొద్ది రోజులు నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. నొప్పి తగ్గకపోవడంతో ఇంటిలోని వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు కొన ప్రాణంతో ఉన్న ఆమెను ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. దాంతో ఆమె మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు సత్య లక్కిడాం పీఏసీఎస్‌లో చిరు ఉద్యోగి.

## పాముకాటుతో యువకుడి మృతి

సంతోష్ (ఫైల్)

సీతంపేట రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన ఓ గిరిజన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీతంపేట మండలం దోనుబాయి పంచాయతీ చెక్కాపురానికి చెందిన మండంగి సంతోష్‌కుమార్(31) సోమవారం రాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా పాము కాటువేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సంతోష్‌కుమార్‌ను దోనుబాయి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయానికి సంతోష్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం మృతి చెందాడు. చేతికి అందివొచ్చిన కొడుకు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు మండంగి బలరాం, సుభద్రమ్మలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. బలరాంకు ముగ్గురు కొడుకులు కాగా వీరిలో సంతోష్‌కుమార్ అందరికంటే చిన్నవాడు. దీనిపై దోనుబాయి ఎస్ఐ మస్తాన్ కేసు నమోదు చేశారు.

## తప్పిన పెనుప్రమాదం

● వ్యాన్‌ను ఢీకొన్న రైలు ● అరగంట పాటు రైలు నిలిపివేత

ప్రమాదానికి గురైన వ్యాన్

దత్తిరాజేరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌ను రైలు ఢీకొన్న ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలం లోని మరడాం సమీపంలో రైలు పట్టాల పక్కన వ్యాన్‌లో కూరగాయలు లోడ్ చేశారు. ఆ వ్యాన్‌ను వెనక్కి నడుపుతుండగా ఇటీవల కురిసిన వర్షాలకు నేల చిత్తడిగా ఉండటంతో బురదలో జారింది. వ్యాన్ వెనకభాగం పట్టాలకు చేరువైంది. వ్యాన్‌ను డ్రైవర్ రామునాయుడు వెనక్కి మళ్లించే క్రమంలో విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వస్తున్న గూడ్స్ రైలు దాన్ని స్వల్పంగా ఢీకొంది. దీంతో అరగంట సమయం రైలు నిలిచింది. పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే సిబ్బంది వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## శిథిలాల్లో చిక్కుకుని.. ప్రాణాలతో బయటపడి

● కూలిన పెంకుటిల్లు ● గాయాలపాలైన వీఆర్ఏ

కూలిన పెంకుటిల్లు, దాలయ్య (ఇన్‌సెట్‌లో)

రాజాం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): శిథిలాల్లో ఓ వ్యక్తి చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన ఘటన రాజాంలోని హరిజనవీధిలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రెవెన్యూ శాఖలో వీఆర్ఏగా పనిచేస్తున్న దాలయ్య మంగళవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తిరిగి 12 గంటల సమయంలో ఇంటికి చేరాడు. ఇంట్లో భోజనం చేసి కాసేపు చేరబడ్డాడు. అయితే నాలుగురోజులుగా వర్షాలు కురవడంతో ఆయన నివాసం ఉంటున్న పెంకుటిళ్లు పైకప్పు ఆకస్మికంగా కూలింది. దాలయ్య ఆ శిథిలాల కింద చిక్కుకున్నాడు. క్షణాల్లో తేరుకున్న హరిజనవీధి వాసులు శిథిలాలను తొలగించి ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాలయ్యను కాపాడారు. ఈ ఘటనలో దాలయ్య గాయపడ్డాడు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

దత్తిరాజేరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరడాం గ్రామంలోని శివారు ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ తెలిపారు. వారి నుంచి రూ.2800లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

## కళ్లకు గంతలతో నిర్వాసితుల నిరసన

శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలోని జిందాల్ నిర్వాసితులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్దిరోజుల కిందట ఎమ్మెల్యే వచ్చి, నాలుగు రోజుల్లో కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పి మాట ఆమె మరచిపోయారన్నారు. అలాగే పలువురు టీడీపీ, బీజేపీ నేతలు కూడా సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు పెట్టిస్తామని చెప్పి మిన్నకున్నారన్నారు. తమకు అండగా నిలిచిన ఎమ్మెల్సీపై పలువురు చేస్తున్న వ్యాఖ్యలు బాధ కలిగిస్తున్నాయని నిర్వాసితులు అన్నారు.

## చెవిలో పువ్వుతో కార్మికులు..

నెల్లిమర్ల, జూలై1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు మంగళవారం చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కాఆర్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు, శేఖర్, శ్రీను, పైడిరాజు, బాబూరావు, హరిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# అప్‌గ్రేడ్ సరే.. వసతులేవీ?

(5వ పేజీ తరువాయి)

వారికి అవస్థలు తప్పడం లేదు. మధ్యాహ్న భోజనం కూడా ఆరుబయట నేలపైనే కూర్చుని తినాల్సి వస్తోంది. గ్రామస్థులే తాత్కాలికంగా చీరలను అడ్డుపెట్టి బాత్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇలా అనేక సమస్యల నడుమ గిరిజన చిన్నారుల చదువులు సాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఎంఈవో ఏమన్నారంటే..**

'ఈ ఏడాది మండలంలోని అన్ని ఎంపీయూపీ, మోడల్ ప్రైమరీ పాఠశాలలన్నింటికీ అదనపు భవనాలు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గిరిజన విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో చావిడివలస పాఠశాలకు కూడా పక్కా భవనాలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.' అని ఎంఈవో ఆనందరావు తెలిపారు.

# జిల్లాకేంద్రం.. పడకేసిన పారిశుధ్యం

(5వ పేజీ తరువాయి)

డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అయితే జనాభా సంఖ్యకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను నియమించడం లేదు. గత కొన్నేళ్లుగా 120 మంది లోపే పనిచేస్తున్నారు.

● సాలూరు, బొబ్బిలి మున్సిపాల్టీలతో పోల్చితే.. పార్వతీపురంలో పారిశుధ్య నిర్వహణ అనేది రోజు రోజుకూ అధ్వానంగా మారుతుంది. పట్టణంలో ఏ వార్డులో చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలువల్లో పూడికలు తీయకపోవడంతో ఎక్కడిక్కడే మురుగు నీరు నిలిచిపోతుంది. వేసవి కాలంలో ఆయా వార్డుల్లోని కాలువల్లో చేపట్టిన పూడిక తీత పనులను తూతూ మంత్రంగా చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా 30 వార్డుల్లోని మురుగునీరు వరహాల గెడ్డలోకి వెళ్తుంది. అయితే దానిలో కూడా వ్యర్థాలు, చెత్తలు పేరుకుపోవడంతో ఎక్కడిక్కడి నీరు నిలిచిపోతుంది. దోమల విజృంభణకు తోడు దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● పార్వతీపురంలో ఆరేళ్ల కిందట చేపట్టిన 'దోమలపై దండయాత్ర' కార్యక్రమానికి కూడా అధికారులు మంగళం పాడేశారు. దీంతో ప్రజలకు దోమలు బెడత తప్పడం లేదు. తరచూ రోగాలపాలవుతూ.. ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు మరింత ప్రబలే అవకాశం ఉంది. అయితే పారిశుధ్య నిర్వహణపై ఇప్పటికీ ప్రత్యేక కార్యచరణ రూపొందించక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

పార్వతీపురం మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. అధికారులతో పాటు పాలకులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

**- జి.గంగరాజు, గాంధీసత్రం వీధి, పార్వతీపురం**

**రోగాలపాలవుతున్నా..**

పారిశుధ్యం నిర్వహణ గాడి తప్పడంతో మున్సిపాల్టీ వాసులు తరచూ రోగాలపాలవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం విచారకరం.

**- ఎస్.ఉమ, ప్రజా సంఘాల నాయకులు, కొత్తవీధి, పార్వతీపురం**

**ప్రణాళికలు రూపొందించాం**

పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి మళ్లింపుపై శ్రద్ధ చూపుతున్నాం. ఇందుకోసం ప్రత్యేక కార్యచరణ ప్రణాళికలను రూపొందించాం. దీనిపై ప్రజారోగ్యశాఖాధికారులకు కూఏడా స్పష్టమైన ఆదేశాలిచ్చాం. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

**- సీహెచ్ వెంకటేశ్వర్లు, కమిషనర్, పార్వతీపురం మున్సిపాల్టీ**

## మామిడిపల్లిలో పట్టపగలే చోరీ

సాలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో మంగళవారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మామిడిపల్లిలో హోటల్ నడుపుతున్న మండవిల్లి ధనరాజు అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆయన కుమారుడికి కొద్దిరోజుల్లో వివాహం కానున్నది. విజయనగరం వెళ్లి వస్తువులు కొనుగోలుకు పయనమయ్యారు. క్యాంపు వెళ్లే ముందు భార్య లక్ష్మితో కలిసి హోటల్‌లో ఉన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్యలో ఇంటిలో దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. విజయనగరం వెళ్లదామని ఇంటికి వచ్చిన వారికి తలుపులు తెరిచి, బీరువా తీసి ఉండడంతో ఆందోళన చెందారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సాలూరు సీఐ రామకృష్ణ, ఎస్ఐ నరసింహమూర్తి పరిశీలించారు. ఈ విషయమై ఎస్ఐ మాట్లాడుతూ రెండున్నర తులాల బంగారం, సుమారు లక్ష రూపాయలు నగదు చోరీకి గురై ఉంటుందని చెప్పారు. ఈ ఘటనపై పూర్తిగా దర్యాప్తు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

## డెంగ్యూ నివారణ అందరి బాధ్యత

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ నివారణ అందరి బాధ్యతగా తీసుకోవాలని పాలకొండ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రత్నతేజ్ అన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా మంగళవారం పాల కొండ పట్టణంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగ్యూ జ్వర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకేశ్ దృష్టికి సాక్షరభారత్ వీసీవోల సమస్యలు

జియ్యమ్మవలస, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని సాక్షరభారత్ గ్రామ సమన్వయకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేవళ్ల పాండురంగనాయుడు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మంగళగిరిలో మంత్రిని కలిసి, వినతిపత్రం అందజేశారు. 2010లో ఇద్దరు సాక్షరభారత్ గ్రామ సమన్వయకర్తలను ఎంపిక చేశారని చెప్పారు. పగటి పూట వయోజన విద్యా కేంద్రాల నిర్వహణతో పాటు వృత్తి విద్యలో మహిళలకు శిక్షణ ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డామన్నారు. కానీ తమను అర్థాంతరంగా తొలగించారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించి.. పూర్తి పరిశీలన చేసి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సొంత మండలంలోనే కొనసాగించండి

● సచివాలయ ఉద్యోగుల వినతి

పీవోతో మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగులు

సీతంపేట రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమను సొంత మండలాల్లోనే కొనసాగించాలని సీతంపేటకు చెందిన సచివాలయ ఉద్యోగులు కోరారు. ఇటీవల సచివాలయ ఉద్యోగులను బదిలీ చేశారు. వీరంతా మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సబ్ కలెక్టర్, పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై పీవో స్పందిస్తూ ప్రభుత్వ జీవో ప్రాప్తికి ఈ బదిలీలు జరిగాయని, నిబంధనల ప్రకారం ఒకచోట ఐదేళ్లు విధులు నిర్వహించిన వారు తప్పక బదిలీ కావాల్సిందేనని అన్నారు.

# ఇది సీసీ రోడ్డే..

● బురదమయంగా గ్రామీణ రహదారులు

● తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

బురదమయంగా సాంబన్నవలస రహదారి

గరుగుబిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ చూస్తున్నది సీసీ రోడ్డే.. వర్షాల కారణంగా ఇలా దర్శనమిస్తోంది. జిల్లాలోని చాలా గ్రామీణ రహదారులది ఇదే పరిస్థితి. గతంలో గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లన్నీ పాడయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా నిర్మాణాలకు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. అలాగే పంచాయతీల పరిధిలో పనుల నిర్వహణకు సిద్ధమవుతున్నా ఆర్థిక సంఘం నిధులు విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంది. గతంలో నిర్వహించిన పనులకు చెల్లింపులు కాకపోవడంతో గుత్తేదారులు పలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. మండలంలోని సాంబన్నవలస, శివ్వాం పంచాయతీ సీమలవానివలస, రావుపల్లి నుంచి కొత్తూరు, పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేట, రాయిందొరవలస, పెద్దూరు నుంచి బీవీ పురం, గరుగుబిల్లి నుంచి బీవీ పురంతో పాటు పలు గ్రామాల రహదారులు అత్యంత దారుణంగా దర్శనమిస్తున్నాయి. వర్షా కాలం వచ్చిందంటే గ్రామాల్లో రహదారుల ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారుల మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

● మంత్రి సంధ్యారాణి

● సామాజిక పింఛన్ల పంపిణీ

సాలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట మండలంలోని పెద్దవలస పంచాయతీ తెట్టెడివలస, అమ్మవలస గ్రామాల్లో మంగళవారం ఆమె సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామానికి వచ్చిన ఆమెకు సాదర స్వాగతం లభించింది. గిరిజనులతో ఆమె థింసా నృత్యం చేసి, డప్పు వాయించి ఉత్సాహం నింపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దవలస, పద్మాపురం పంచాయతీలకు ఏది అవసరమైనా నేరుగా తనను సంప్రదించవచ్చునని చెప్పారు. ఇప్పటికే పాచిపెంట మండలంలో రూ.20 కోట్ల లింకు రోడ్ల మంజూరుకు నిధులు మంజూరు చేశామని ఆమె తెలిపారు. అలాగే తెట్టెడివలస గ్రామంలోని పాఠశాలకు ఇప్పటికే ప్రహరీ మంజూరు చేశామన్నారు. త్వరలో మరుగుదొడ్ల భవనాన్ని, మధ్యాహ్న భోజన వంట గది నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మండలంలో ఉన్న పలువురు గిరిజనులకు పోడు పట్టాలను మంజూరు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పాచిపెంట మండల ప్రధాన కార్యదర్శి గూడెపు యుగంధర్, సర్పంచ్ కుమారి పాల్గొన్నారు.

సాలూరు: తెట్టెడివలసలో వృద్ధుడితో ముచ్చటిస్తున్న మంత్రి సంధ్యారాణి

**రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: ప్రభుత్వ విప్**

గుమ్మలక్ష్మీపురం: కొత్తవలసలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసీల్దార్ శేఖర్, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, కొత్తవలస మాజీ సర్పంచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధికి కలిసి రండి: ఎమ్మెల్యే బోనెల**

పార్వతీపురం రూరల్: రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రజలందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం కారాడవలస గ్రామంలో ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కారాడవలస అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందని, అందరూ కలిసివస్తే అన్ని విధాలా అభివృద్ధి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు వెంకటరమణ, సత్యనారాయణ, ఎంపీటీసీ వై.తవిటినాయుడు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

పార్వతీపురం రూరల్: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి

పార్వతీపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజలకు వివరించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ అధ్యక్షులతో మంగళవారం ఆయన పార్వతీపురంలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల సంక్షేమ కోసం నిరంతరం పాటుపడతారని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం శవాల వెంట వెళతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చినుకులతో అన్నదాతకు చికాకులు

పత్తి విత్తనాలు నాటేందుకు అవస్థలు పడుతున్న రైతులు

భామిని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ చిరుజల్లులు కురవడంతో అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు. జూలై నెల ప్రారంభం కావడంతో పలువురు పత్తి, మొక్కజొన్న, వరి నాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయానికే చిరుజల్లులు ప్రారంభం కావడంతో పొలాల్లో ట్రాక్టర్ దుక్కులు దున్నడానికి వీలు లేకపోవడంతో తాత్కాలికంగా కర్రలతో తయారు చేసి, అచ్చులు తీస్తున్నారు. మరి కొంతమంది తాళ్లతో కట్టి వరుస మొక్కలు నాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. కాగా పలు చోట్ల పదును చిక్కకపోవడంతో లివిరి, భామిని, ఘనసర, నులకజోడు తదితర గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

## పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

రామభద్రపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని ఏపీడీ రమామణి సూచించారు. మండలంలోని కొత్తరేగ, పాతరేగ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ ఏడాది పండ్ల తోటల పెంపకం కింద లక్ష్యాలను పూర్తిచేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫాంపాండ్స్, కంపోస్టు పిట్స్ పనులు పూర్తిచేయాలని ఆమె సూచించారు. ఇప్పటివరకు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈనెల 10వ తేదీలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఏపీవో త్రినాథరావు, ఈసీ సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

సీతంపేట రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీడీ అన్నదొర ఆదేశించారు. సీతంపేట మినీ గురుకులం, దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, మెనూ, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. గిరిజన విద్యార్థుల కోసం వండిపెట్టిన వంటకాలను రుచి చూశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యా ప్రమాణాల స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మినీ గురుకులంలో చిన్నారితో మాట్లాడుతున్న డీడీ అన్నదొర

## సమ్మెను విజయవంతం చేయాలి

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వామపక్ష సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తెరమీదకి తెచ్చిందన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టనున్న సమ్మెలో కార్మిక, ఉద్యోగ వర్గాలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, పీకేఎస్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. ● సీతానగరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 9న సీఐటీయూ నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బైరిపూడి పద్మ, జి.పాప కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో సీహెచ్‌వో ఎస్‌వీ రమణకు సమ్మె నోటీసును అందజేశారు. ● గుమ్మలక్ష్మీపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలో గల ఆశా వర్కర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పీహెచ్‌సీ వైద్యుడు బుద్దేశ్వరరావుకు సమ్మె నోటీసు అంటించారు.

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. మూడో వార్డు సంఘ వీధిలో రూ.10.60 లక్షలతో సీసీ రోడ్డు, 25వ వార్డు సాయినగర్ రూ.3.60 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు, 19వ వార్డులో రూ.3 లక్షలతో కల్వర్టు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ పనులన్నిటినీ నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సీనియర్ నేత రౌతు రామ్మూర్తి, డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ గుప్తా, కోటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ, బొత్స సురేష్, కొల్లి రామారావు, బొత్స అప్పులు, రాయపురెడ్డి భాను పాల్గొన్నారు.

### మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల నాలుగు మండలాల మహిళా సర్పంచ్‌లకు బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు పాల్గొని, 73వ రాజ్యాంగ సవరణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సర్పంచ్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చకుంటే మరో పోరాటం

సాలూరు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

సాలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ పరిపాలన అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పురపాలక సంఘం కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నా చేపట్టాలని యూనియన్ పిలుపునిచ్చింది. ఈసందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు, సాలూరు పట్టణ అధ్యక్షుడు తుపాకుల రాముడు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం తరపున అధికారులు చేసుకున్న మినిట్స్ ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగులతో సమానంగా 62 సంవత్సరాల రిటైర్‌మెంట్ వయస్సు పెంచాలని కోరారు. సాలూరు మున్సిపాలిటీలో నలుగురు కాంట్రాక్ట్ కార్మికులు మృతిచెందిన వారికి నేటికీ నష్ట పరిహారం ఇవ్వలేదని, వారి కుటుంబాలు ఉద్యోగం ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోలరాజు రవి, మహిళా నాయకులు స్వప్న, మీడియా ఇన్‌చార్జి శ్రీను పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### పిల్లలను పనిలో పెట్టొద్దు

పాలకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను బాల కార్మికులుగా పనిలో పెట్టుకుంటే వారిపై చర్యలు తప్పవని పాలకొండ లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక లేబర్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. షాపులు, మిల్లులు, గొడౌన్లకు లేబర్ లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. పట్టణంలోని లేబర్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో వడమలోని ట్యాంక్ వద్దకు మార్చామని చెప్పారు.

### సారాతో మహిళ అరెస్టు

సాలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): సారా ప్యాకెట్లతో ఒక మహిళను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ పి.అప్పలరాజు తెలిపారు. సాలూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎరుకుల వీధిలో ఒక మహిళ వద్ద 120 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఆమెను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుళ్లు ఆర్.చిన్నాంనాయుడు, బి.కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

సాలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరుకుల వీధి దాసరి సన్యాసిరావు ఇంటి వెనుక ఉన్న బహిరంగ ప్రదేశంలో మంగళవారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సాలూరు టౌన్ పోలీసులు తెలిపారు. 13 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.23,800, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని చెప్పారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మక్కువ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.హరికృష్ణ సూచించారు. ఈ మేరకు మంగళవారం కన్నంపేటలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

### టీడీపీ మండల అధ్యక్షుడిగా యుగంధర్

సాలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం పాంచాళి గ్రామ సర్పంచ్ గూడెపు యుగంధర్‌ను టీడీపీ మండల అధ్యక్షుడిగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం ప్రకటించారు. ఆమె మంగళవారం సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

మక్కువ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 14 మందికి మంగళవారం సాలూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చామని ఎస్ఐ ఎం.వెంకటకమణమూర్తి తెలిపారు. మేజిస్ట్రేట్ వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.లక్షా 40వేల జరిమానాను విధించారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపి రెండోసారి పట్టుబడితే వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ జీవితకాలం సస్పెండ్ చేస్తామన్నారు.

### విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు

సీతానగరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అయ్యగారి వెంకటనరసింహం(సుప్రీంకోర్టు జడ్జి) జయంతి సందర్భంగా ఆ కుటుంబానికి చెందిన ఆనంద్ ఈ ప్రోత్సాహకాలను అందజేశారు. బంక శ్రావణి, వెన్నెల ప్రియాంక, వడ్డాది శమిత్రాశ్రీ, తనూజాలకు రూ.5వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

ఒంగోలులో పింఛన్ లెక్కించుకుంటున్న వృద్ధులు

# మార్కాపురానికి పవన్ కల్యాణ్

- రూ.1290 కోట్లతో తాగునీటి పథకానికి శంకుస్థాపన
- 4న కార్యక్రమం.. నేడు ఏర్పాట్లు పరిశీలించనున్న కలెక్టర్, ఎమ్మెల్యే

సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందుల, సబ్ కలెక్టర్ త్రివినాగ్

ఒంగోలు జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఈనెల 4న జిల్లాకు వస్తున్నారు. ఆ రోజున మార్కాపురం సమీపంలో రూ.12900 కోట్లతో చేపట్టే భారీ తాగునీటి పథకానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి

మిగతా 6లో...

# సందడిగా..

- ఇంటింటికీ వెళ్లి పెన్షన్ల పంపిణీ
- పాందూరులో పాల్గొన్న మంత్రి స్వామి
- పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధుల హాజరు
- మధ్యాహ్నానికే మూడొంతులు అందజేత

ఒంగోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మంగళవారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సందడి సందడిగా సాగింది. ఉదయం ఏడుగంటల నుంచే ఊరు, వాడ సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ ప్రారంభించారు. పేదల సేవల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వివిధస్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పాల్గొనాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో పెన్షన్ల పంపిణీలో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ అన్సారియా మొదలు కిందిస్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో 29,0625 మంది వివిధ వర్గాల లబ్ధిదారులకు ఈనెల పెన్షన్ల కింద రూ.123.02 కోట్లు మంజూరయ్యాయి. సోమవారమే ఆ మొత్తాలను బ్యాంకుల నుంచి డ్రా చేసి సంబంధిత సచివాలయాల

మిగతా 6లో...

పాందూరు గ్రామంలో పింఛన్ అందచేస్తున్న మంత్రి స్వామి

# సచివాలయ ఉద్యోగులకు 5న బదిలీల ఉత్తర్వులు

## నేరుగా ఈమెయిల్ ద్వారానే పంపేందుకు చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు ఈనెల 5వ తేదీన ఇవ్వనున్నారు. ఆ శాఖల అధికారులు ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రభుత్వం మరో ఐదు రోజులు అదనపు సమయాన్ని ఇచ్చింది. వెంటనే బదిలీల ఉత్తర్వులు ఇస్తే గ్రామ, వార్డుల్లో పింఛన్ల పంపిణీతో పాటు పలు రకల ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడనుండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈనెలలో ప్రభుత్వం అమలు చేయనుంది. లబ్ధిదారుల ఈకేవైసీ కూడా పూర్తి చేయాల్సి ఉంది. వీటన్నింటినీ ప్రస్తుతం చేయాల్సి ఉండటంతో వెంటనే సచివాలయ ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులు ఇస్తే వాటన్నింటికీ ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రస్తుతం కొనసాగుతున్న సచివాలయాల్లోనే ఆ ఉద్యోగులందరినీ కొనసాగిస్తూ ఈ ఐదు రోజుల్లో ఆయా పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు.

# అయ్యో్యారు!

- బదిలీ టీచర్లలో ఆనందం ఆవిరి
- 500 మందికిపైగా పాత స్థానాల్లోనే విధులు
- డీఎస్సీ నియామకాల కోసం ఎదురుచూపులు

**ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఇతర పాఠశాలలు కోరుకున్న కొందరు ఉపాధ్యాయులు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎన్నేళ్ల నుంచో బదిలీ కోసం ఎదురుచూస్తున్న వీరికి కొత్త పాఠశాలలు కోరుకున్నామన్న ఆనందం ఆవిరైంది. కోరుకున్న కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరి మళ్లీ పాత పాఠశాలలకు వెళ్లి విధులు నిర్వహించి రావడంతో వారు నిరాశకు లోనవుతున్నారు. ఎనిదేళ్లుగా అష్టకష్టాలు పడుతూ సుదూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నవారు రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలలోనే పనిచేయాల్సి రావడంతో ఈ కష్టాలు ఇంకెన్నాళ్లంటూ వాపోతున్నారు.**

ఒంగోలు విద్య, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సుమారు 500 మందికి పైగా సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు తమపాత స్థానాలను ఎవ్వరూ కోరుకోకపోవడంతో వారు అక్కడే పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. జీతం కొత్తపాఠశాలల నుంచి డ్రా చేయబోతున్నా పనిమాత్రం పాత పాఠశాలలోనే చేయాల్సి రావడంతో వారు ఉసూరుమంటున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో కొత్తస్థానాలు కోరుకుతన్న హైస్కూలు ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్-2 హెచ్‌ఎం), ఆదర్శ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు అందరూ కోరుకున్న కొత్త పాఠశాలల్లో సాఫీగా చేరిపోయారు. వారు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. సమస్యల్లా సెకండరీ గ్రేడ్ టీచర్లకు, స్కూలు అసిస్టెంట్లకు ఏర్పడింది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఒక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు లేదా ముగ్గురు టీచర్లలో సర్వీసులో జూనియర్ కోరుకున్న కొత్త పాఠశాలల్లో చేరి మళ్లీ వచ్చి పాత పాఠశాలల్లోనే పనిచేయాల్సి వచ్చింది. జిల్లాలో సుమారు 300 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క టీచర్ లేని పరిస్థితి ఉంది. ఈ

మిగతా 6లో...

## భోజనం భేష్

మధ్యాహ్న భోజనం మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ అన్సారియా హెచ్చరించారు. మద్దిపాడు మండలం, గార్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సోమవారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రేషన్ షాపును పరిశీలించి వెరిఫికేషన్, ఆన్‌లైన్ ప్రక్రియను చెక్ చేశారు.

# అడ్డగోలుగా అనుమతులు

- దర్శిలో విచ్చలవిడిగా బీఈడీ కళాశాలలు
- భవనాలు లేకున్నా ఓకే చేస్తున్న యూనివర్సిటీ అధికారులు

దర్శి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బీఈడీ కళాశాలల నిర్వహణ ఒక అక్రమ తంతుగా మారింది. యూనివర్సిటీ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. కళాశాలలకు భవనాలు లేనప్పటికీ ఓకే చేస్తున్నారు. దర్శిలో 18 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. నాగార్జున యూనివర్సిటీ అనుసంధానమైన ఈ కళాశాలల్లో నిబంధనల ప్రకారం ప్రతి ఏడాదీ అధికారులు తనిఖీలు చేయాలి. అందులో భాగంగా ప్రస్తుతం నాగార్జున యూనివర్సిటీ అధికారులు ఇక్కడి కళాశాలలను తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం అత్యంత గోప్యంగా జరుగుతోంది. యూనివర్సిటీ అధికారులు భవనాలు లేని కళాశాలలకు సైతం అన్నీ ఉన్నట్లుగానే సర్టిఫై చేసి అనుమతులు ఇవ్వటం ఆనవాయితీగా మారింది.

నిబంధనల ప్రకారం కళాశాలలను పరిశీలించి తగినన్ని తరగతి గదులు ఉన్నాయా, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నారా, విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారా అన్న అంశాలను పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. అయితే, కొన్ని కళాశాలలకు భవనాలు లేవు. అన్ని కళాశాలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చేరుతారు. వారు పరీక్షలకు మాత్రమే హాజరవుతారు. ఒక్కరోజు కూడా క్లాసులు జరిగిన దాఖలాలు లేవు. యూనివర్సిటీ అధికారులు ఇక్కడ ఏం జరుగుతుందనే అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కొన్ని సంవత్సరాలుగా గుడ్డిగా అనుమతులను కొనసాగిస్తున్నారు. ఈ తంతులో భాగంగా ఈ ఏడాది ప్రస్తుతం యూనివర్సిటీ అధికారులు బీఈడీ కళాశాలలను తనిఖీలు చేసేందుకు కొద్దిరోజుల క్రితం వచ్చారు. వారు ఎక్కడ ఉన్నారో, ఏ కళాశాలలను తనిఖీలు చేస్తున్నారో ఎవ్వరికీ తెలియదు. అంతా కాగితాల మీదనే జరిగిపోతోంది. ఇక్కడ అన్ని కళాశాలకు భవనాలు ఉన్నట్లు, విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు రికార్డులను వారు పరిశీలించి అంతా సక్రమంగా ఉన్నట్లు అనుమతులు ఇస్తున్నారు.

ఈ ఏడాది కూడా యూనివర్సిటీ అధికారులు అలాగే అనుమతులు ఇచ్చేశారు. బోధనా తరగతులతో పనిలేకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు పరీక్షలు రాసి సర్టిఫికెట్లు తీసుకువెళ్తున్నారు. పాస్ గ్యారెంటీ పేరుతో దళారులు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూళ్లు చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఎంతమంది పరీక్షలు రాస్తున్నారనే విషయం కూడా విద్యాశాఖ అధికారులకు సమాచారం ఉండదు. అంతా యూనివర్సిటీ అధికారులే చూసుకుంటున్నారని, తమకు సమాచారం ఇవ్వటం లేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు, యూనివర్సిటీ ఉన్నతాధికారులు బీఈడీ కళాశాలల నిర్వహణ తంతును గుర్తించి, అక్రమాలను అరికట్టాలను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వైసీపీ ఆత్మ విమర్శ చేసుకోవాలి

- పార్టీలు మారితే చేసిన పాపాలు పోతాయా?
- సంక్షేమం... ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం
- మీడియా సమావేశంలో దామచర్ల, రియాజ్

7

## గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతుల ఆందోళన

- నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్
- పరిహారం అందకుంటే రోడ్డు నిర్మాణానికి సహకరించబోమని స్పష్టీకరణ
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎదుట నిరసన

7

## అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్టు

# మండుతున్న కూరగాయలు

- కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు పెరుగుదల
- సెంచరీ దాటిన బీన్స్
- ఉత్పత్తి తగ్గడమే కారణం
- సామాన్యుల విలవిల

**జిల్లా ప్రజానీకానికి కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వేసవి సమయంలో పెరగాల్సినవి ఇప్పుడు రోజురోజుకు పెరిగిపోతుండటంతో సామాన్యుడు కొనుగోలు చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు కొన్నిరకాల కూరగాయల ధరలు పెరిగాయి. మరికొన్ని రూ.20 నుంచి రూ.25 వరకు పెరిగాయి. ఉత్పత్తి తగ్గిపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.**

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. కొన్ని రకాలు కిలో ధర సెంచరీ దాటిపోతోంది. సాధారణంగా ప్రస్తుతం కూరగాయల సీజన్ ప్రారంభం కావాల్సి ఉండగా ఎండల తీవ్రత, ఇతర కారణాలతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో రవాణా చార్జీలు పెరిగి ధరలు పెరిగిపోయాయి. నాలుగు రోజుల వ్యవధిలో టమోటా కిలోకు రూ.10 పెరిగింది. వారం క్రితం కిలో టమోటా రూ.20 ఉండగా ప్రస్తుతం కిలో రూ.30కి చేరింది. ఇక బీన్స్ గతవారం కిలో రూ.80 నుంచి రూ.90 మధ్య ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.110కి చేరింది. ఇలా అన్ని రకాల కూరగాయల

మిగతా 6లో...

ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు (రూ.)

| కూరగాయలు | ధరలు |
|---|---|
| బీన్స్ | 110.00 |
| బీట్‌రూట్ | 50.00 |
| క్యారెట్ | 60.00 |
| టమోటాలు | 30.00 |
| పచ్చిమిర్చి | 40.00 |
| వంకాయలు | 50.00 |
| బీర | 50.00 |
| దొండ | 30.00 |
| చామదుంప | 50.00 |
| పెద్దచిక్కుళ్ళు | 80.00 |
| చిన్నచిక్కుళ్ళు | 50.00 |
| బంగాళదుంప | 40.00 |
| కాకర | 60.00 |
| బెండ | 40.00 |
| దొండకాయలు | 30.00 |

## ఆటోను ఢీకొన్న మోటార్‌సైకిలిస్టు

బాధితుడ్ని వైద్యశాలకు తరలింపునకు ఏర్పాట్లు చేసిన మంత్రి రవి

గాయపడ్డ యువకుడిని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న మంత్రి రవి

మేదరమెట్ల,జూలై1(ఆంధ్రజ్యోతి): ఆటోను మోటారుసైకిలిస్టు ఢీకొన్న ఘటన రామినాతల- మేదరమెట్ల రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన ఇస్సర్ల శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ సమయంలో ద్రైవారావు రులో అద్దంకి కార్యక్రమాలలో పాల్గొని మేదరమెట్ల వైపు వెళ్తున్న మంత్రి రవికు మార్ ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఆగి క్షతగాత్రుడు శ్రీకాంత్‌ను వైద్యశాలకు తర లించేందుకు 108 కు ఫోన్ చేశారు. వాహనం అక్కడకు వచ్చి శ్రీకాంత్‌ను తీసుకు వెళ్ళేంతవరకు రవికుమార్ అక్కడే ఉండి పర్యవేక్షించారు. మేదర మెట్ల ఎస్సై మహ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

ఇసుక రవాణా చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

చినగంజాం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, సోన పోరంబోకు భూములలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకొంటా మని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, ఎస్‌ఐ శీలం రమేష్‌లు హెచ్చరిం చారు. చినగంజాం గ్రామ సర్వే నెంబరు 829లోని సోన పోరంబోకు భూములలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న ప్రదేశాన్ని వారు మంగళవారం పరిశీలిం చారు. సోన పోరంబోకు భూములలో అక్రమ ఇసుక రవాణా జరుగకుండా కట్ట లు(ట్రెంచ్) వేయించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు, అపరాధ రుసుం విధిస్తామని తెలి పారు. కార్యక్రమంలో ఆర్ఐ బందారు దానియేల్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగు ట్రక్కుల వరిగడ్డి అందజేత

పశు గ్రాసం అందజేస్తున్న దాతలు

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): శింగర కొండ సమీపంలోని హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో ఆవులకు మంగళవారం గోపాల పురానికి చెందిన శింగమనేని నాగేశ్వర రావు, కోయ సాంబశివరావులు నాలుగు ట్రక్కుల వరిగడ్డిని అందజేశారు. మైలవ రాపు వెంకటేశ్వర్లు పూర్ణచంద్రరావులు ఒక ట్రక్కు వరిగడ్డి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కార్యక్ర మంలో గోశాల నిర్వహకుడు గోనుగుంట సుబ్బారావు, వాసు గురుస్వామి, విను కొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రత నుంచి ఉపశమనం

- చల్లబడిన వాతావరణం, పలుచోట్ల జల్లులు

ఒంగోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిని తలపించే రీతిలో ఉన్న ఎండల తీవ్రత నుంచి జిల్లా ప్రజలకు కాస్తంత ఉపశమనం లభించింది. జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడటంతో పాటు మంగళవారం చిరు జల్లులు పడ్డాయి. గతానికి భిన్నంగా ఈ ఏడాది రోహిణి కార్తెలో వర్షాలు కురిశాయి. అనంతరం వచ్చిన మృగశిర, ఆరుద్రకా ర్తెల్లో ఎండలు మండాయి. సాధార ణంగా రుతుపవనాలు విస్తరణతో ఆరు ద్రకార్తె (ఈ సమయం)లో వర్షాలు పడాలి. అయితే గత నెల 22 నుంచి ఆరుద్రకార్తె రాగా నెలా ఖరు వరకు ఎండలు మండాయి. జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో 38 నుంచి 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్ర తలు నమోదయ్యాయి. నాలుగైదు రోజులు వేడిగాలులు కూడా వీచాయి. ఆపై ఉక్కపోతతో ప్రజా నీకం అవస్థలు పడ్డారు. అలాంటి వాతావరణం నుంచి సోమ, మంగ ళవారాల్లో మార్పు వచ్చింది. అత్య ధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల దిగువకు రావడంతో పాటు మబ్బులు పట్టాయి. మంగ ళవారం మధ్యాహ్నం నుంచి పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఒంగోలు అర్బన్ ప్రాంతంతో పాటు మద్దిపాడు, కొత్త పట్నం, ఎన్‌జీపాడు, సంతనూతల పాడు, వైపాలెం, దోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు, రాచర్ల, గిద్దలూరు, కేకేమిట్ల, జరుగుమల్లి, చీమకుర్తి, దర్శి, కనిగిరి, దొనకొండ ప్రాంతాల్లో వాతవరణం చల్లబడటంతో పాటు చిరు జల్లులు పడ్డాయి.

దీంతో దాదాపు నెల రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోత వాతావర ణంతో అవస్థలు పడుతున్న జిల్లా ప్రజానీకం తాజా వాతావరణ పరిస్థి తితో కాస్తంత ఉపశమనం పొందింది.

ఒంగోలులో కురుస్తున్న జల్లులు

# మిద్దె మచ్చు పైనపడి బాలుడు మృతి

ఇద్దరికి గాయాలు

కురిచేడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం పడమర నాయుడు పాలెం పంచాయతీ వల్లెల యానాది కాలనీలో మంగళవారం సరదాగా ఆడు కుంటుండగా విషాద చోటుచేసుకుంది. చెట్టు, మిద్దెలు ఎక్కి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు పాత మిద్దె మచ్చు కూలి ఒకరు మృతి చెందగా, మరో ఇద్ద రికి గాయాలయ్యాయి.

కాలనీలో బొజ్జా అంకారావు, బొజ్జా మార్తెయ్య, బొజ్జా వెంకటేశ్వర్లు కుటుం బాలు నివాసం ఉంటున్నారు. అంకా రావు కుమారుడు మహీధర్ (13) కుమారుడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. మధ్యాహ్నం పాఠశాల భోజన విరామ సమయంలో మహీధర్ తన స్నేహితు లైన మల్లికార్జున, గంగా కార్తీక్‌లతో కలిసి ఆటకు వెళ్ళాడు. వారి నివాసం ఉంటున్న గృహానికి దగ్గరలో సేతు వెంకయ్య 20 సంవత్సరాల క్రితం నిర్మా ణం చేసి ఉన్న గృహాన్ని గంగులో వదిలేసి త్రిపురాంతకం మండలం వెళ్ళాడు. ఆ ఇంటికి దగ్గరలో ఓ వేప చెట్టు కూడా ఉంది. ముగ్గురు స్నేహితులు చెట్టు ఎక్కి ఆడుకుంటూ నిర్మాణం ఆపిన ఇంటిపైకి ఎక్కాడు. మిద్దెకు శ్లాబ్ వేయకుండా మచ్చు మాత్రం నిర్మించి వదిలి వేశారు. ముగ్గురు పిల్లలు ఆడు కుంటూ మచ్చుమీద కూర్చొన్నారు. వీరి బరువుకు మచ్చు విరిగి పడింది. మచ్చు కింద మహీధర్ పడిపోగా, మల్లిర్జున, గంగాకార్తీక్‌లు చివరలో పడి పోయారు. స్థానికులు వెంటనే స్పందించి ట్రాక్టరుతో కింద పడిన మచ్చును తొలగించారు. మచ్చు కింద పడిన మహీధర్ మృతి చెందగా మల్లికా ర్జున, గంగా కార్తీక్ గాయపడ్డారు. కురి చేడు ప్రభుత్వ వైద్యశా లలో ప్రాథమిక చికిత్స అనంతరం మల్లికార్జున్ ను మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మహీధర్ మృతదేహా నికి పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశా లకు తరలించారు. కుమారుడి మృతితో మహీధర్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తు న్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

# సంక్షోభంలోనూ మెరుగైన సంక్షేమం

- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి
- పొందూరులో అధికారులు, నాయకులతో కలిసి.. పింఛన్ నగదు పంపిణీ చేసిన మంత్రి

కొండపి(టంగుటూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గడిచిన వైసీపీ ప్రభు త్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా సంక్షోభంలోకి నెట్టినా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అన్ని సంక్షేమ కార్యక్రమా లను పేదలకు అందిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరు మండలంలోని పొందూ రు గ్రామంలో ఆయన మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచి త బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తు న్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు కేంద్రం ప్రభు త్వం వాటా విడుదల చేసిన వెంటనే విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఒంగోలు ఆర్టీవో లక్ష్మీ ప్రసన్న, టీడీపీ కొండపి నియోజకవర్గ పరిశీల కులు ఆకాశ్ స్వాములు, టీడీపీ నాయ కులు బెల్లం జయంతిబాబు, జెజవాద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్ర కూటమి లక్ష్యం

ఆరోగ్య ఆంధ్ర కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజ నేయ స్వామి అన్నారు. తూర్పు నాయు డుపాలెంలో మంగళవారం క్షయ నిర్మూ లన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్ర మంలో భాగంగా అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వామి మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. టీబీ నివారించేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు.

# సందడిగా..

(5వపేజీ తరువాయి)

సిబ్బందికి అధికారులు అందజేయగా వారు మంగళవారం ఉదయం 7 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇచ్చారు. అలా ఉదయం పది గంటల సమయా నికే దాదాపు సగం మందికిపైగా లబ్ధిదా రులకు నగదు అందాయి. అలా 12 గంటల సమయానికి దాదాపు ముప్పా తులు(75శాతం) మందికి పింఛన్ల మొత్తాలు అందాయి. అలా మధ్యాహ్నం మూడు గంటల వరకు 91 శాతంతో 2.54 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు రూ.110.10 కోట్లు మొత్తం అందజేశారు. రాత్రి వరకు ఆయా ప్రాంతాల్లో ఆందు బాటులో ఉన్న మిగిలిన వారికి అందజే శారు. అయితే కొత్త పెన్షన్‌దారులకు ఈనెలలో కూడా నిరాశే మిగిలింది. భర్తలు చనిపోయిన మహిళలకు స్పౌజ్ పింఛన్ ఇవ్వనున్నట్లుగా గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అలా రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి వివరాలను సచివాల యాల ద్వారా సమాచారం సేకరించారు. అందులో జిల్లాలో ఇలాంటివి 3,499 మంది ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ జూన్ 1వ తేదీ నుంచి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా అనంతరం ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల పింఛన్ల పంపిణీ జరుగుతుందని అందరూ భావించారు. లబ్ధిదారులు కూడా అందుకోసం ఎదురు చూశారు. అయితే మంగళవారం ఇచ్చిన జూలై పింఛన్లలో కూడా పాత వారికే తప్ప కొత్తవారికి ఇవ్వకపోవడంతో వారు నిరాశ గురయ్యారు. వారికి ఎప్పుడు అందజేస్తారన్న విషయం కూడా అధికారులు వద్ద స్పష్టత లేదు.

- టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో రాష్ట్ర సాంఘికశా ఖమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం వద్ద జరిగిన సభలో పాల్గొన్నారు.
- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడులో పింఛన్లు పంపిణీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.
- ఒంగోలు నగరంలోని 49వ డివిజ న్ పరిధిపోలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధ న్ పింఛన్లు పంపిణీ చేశారు.
- చీమకుర్తి మండలం కేవీఎల్లగహా రంలోని అంబేద్కర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పింఛన్లు పంపిణీ చేశారు.
- కనిగిరి మునిసిపాలిటీలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి పంపిణీ చేయగా గిద్దలూరు పట్ట ణంలోని ఏడవ వార్డులో అక్కడి ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు.
- మార్కాపురంలోని 13వవార్డులో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పంపిణీ చేయగా దర్శి పట్టణంలో నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చ య్యతో కలిసి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు పింఛన్లు పంపిణీ చేశారు.
- వైపాలెం మండలం బోయలప ల్లిలో ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లోని అధికారులు, స్థానిక ప్రజాప్ర తినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ..కూరగాయలు

(5వపేజీ తరువాయి)

ధరలు పెరిగిపోయాయి.

చెన్నయ్, పలమనేరు నుంచి దిగుమతి

మార్టూరు, కొత్తపట్నం ప్రాంతం నుంచి మార్కెట్‌కు పలురకాల కూరగా యలు వస్తాయి. అయితే ఆ రెండు ప్రాంతాల్లో ఉత్పత్తి గణనీయంగా పడి పోయింది. మరోవైపు పశ్చిమ ప్రాంతంలో ప్రస్తుత సమయంలో టమోటా రావాల్సి ఉండగా మార్కెట్‌కి రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా వరకు చెన్నయ్, పలమనేరు, మదన పల్లి తదితర ప్రాంతాల నుంచి ఒంగో లుకు దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. దీని కారణంగానే ధరలు పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు చెప్తున్నారు. కిలోల చొప్పున కొనుగోలు చేస్తే ఈ ధరలు ఉంటుండగా పావు కిలో కొను గోలు చేయాలంటే సగానికి సగం అది కంగా పెట్టి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రిటైల్ షాపులో టమోటా కిలో రూ.30 పలుకుతుండగా పావు కిలో వచ్చి రూ.10కి విక్రయిస్తున్నారు. మరోవైపు తోపుడు బండ్ల ద్వారా ఇంటింటికీ తిరిగి కూరగాయలు విక్ర యించే చిరు వ్యాపారుల వద్ద కొను గోలు చేయాలంటే ప్రజలు అమ్మో అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగా యల ధరలు ఇలా ఉండగా ఇప్పుడు ఆకు కూరల ధరలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. నిన్నా మొన్నటి వరకు ఏ రకం ఆకుకూర కట్ట కొను గోలు చేయాలన్నా రూ.5కు లభించగా ప్రస్తుతం మార్కెట్లోనే కట్ట రూ.10కి చేరింది. అన్నిరకాల ఆకుకూరల ధరలు కూడా పెరిగిపోయాయి.

## ఎన్నికల ప్రకటన

| | | | | |
|---|---|---|---|---|
| 1. | బ్యాంక్ పేరు | | : | ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002 |
| 2. | ఎన్నికల తేది | | : | 27-07-2025 (ఆదివారం) |
| 3. | మేనేజింగ్ కమిటీకి ఎన్నుకోబడే సభ్యుల సంఖ్య | | : | 2 (ఇద్దరు) మాత్రమే<br>ఒక ప్రొఫెషనల్ డైరెక్టర్ మరియు ఒక జనరల్ డైరెక్టర్ |
| 4. | మేనేజింగ్ కమిటి సభ్యుల పదవి కాలం | | : | కాల వ్యవధి: 5 సంవత్సరములు - 07-08-2025 నుండి 06-08-2030 వరకు<br>(ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 లోని సెక్షన్ 21(3) ప్రకారం) |
| 5. | మేనేజింగ్ కమిటి సభ్యత్వానికి పోటీ చేయదలచిన అభ్యర్థులకు కావలసిన అర్హతలు | | : | 1. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు కనీసం రెండు సంవత్సరాలు బ్యాంక్‌లో ఓటింగ్ సభ్యునిగా ఉండవలెను.<br>2. ఎన్నికలు జరిగే సంవత్సరానికి ముందు జరిగిన రెండు జనరల్ బాడీ సమావేశాలకు(2024 సం॥ మరియు 2025 సం॥) హాజరై ఉండవలెను.<br>3. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్ నెం.21 ప్రకారం ఎలాంటి అనర్హత కలిగి ఉండరాదు. |
| 6. | నామినేషన్ల స్వీకరణ | తేది<br>స్థలం<br>సమయం | : | 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉదయం 9:00 గం॥ల నుండి మధ్యాహ్నం 01:00 గం॥ల వరకు |
| 7. | స్వీకరించిన నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : | 14-07-2025 (సోమవారం)<br>ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 3/2 బ్రాడీపేట, గుంటూరు వారి నోటీసు బోర్డు<br>మధ్యాహ్నం 02:00 గం॥ల తరువాత |
| 8. | నామినేషన్ల పరిశీలన | తేది<br>స్థలం<br>సమయం | : | ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి ఉ॥ 11-00 గం॥ల వరకు |
| 9. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ | తేది<br>స్థలం<br>సమయం | : | ది.15-07-2025 (మంగళవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 12-00 గం॥ తరువాత |
| 10. | నామినేషన్లు ఉపసంహరణ | తేది<br>స్థలం<br>సమయం | : | ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు<br>ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 11. | చెల్లుబాటు అయ్యే నామినేషన్ల తుది జాబితా ప్రచురణ మరియు చిహ్నాల కేటాయింపు | తేది<br>స్థలం<br>సమయం | : | ది.16-07-2025 (బుధవారం)<br>ది గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 3వ అంతస్థు, 3/2 బ్రాడీపేట, గుంటూరు లోని నోటీసు బోర్డు<br>మ॥ 01-00 గం॥ తరువాత |
| 12. | పోలింగ్ తేది మరియు సమయం | తేది<br>స్థలం<br>సమయం | : | ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>ఉ॥ 7.00 గం॥ల నుండి మ॥ 12-00 గం॥ల వరకు |
| 13. | ఓట్లు లెక్కింపు | తేది<br>స్థలం<br>సమయం | : | ది.27-07-2025 (ఆదివారం)<br>నవీన్ స్కూల్, 4వ లైను, పాండురంగ నగర్, అమరావతి రోడ్, గుంటూరు<br>మ॥ 02-00 గం॥ల నుండి |
| 14. | ఫలితాల ప్రకటన | | : | కౌంటింగ్ అయిన వెంటనే ది.27-07-2025 (ఆదివారం) |

తేది: 01-07-2025 (ఎం.వి.ఎన్. సతీష్ బాబు) ఎన్నికల అధికారి, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
స్థలం: గుంటూరు 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002, (ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 క్రింద రిజిస్టర్ చేయబడినది, రిజిస్ట్రేషన్ నెం.431)

గమనిక: 1) ప్రతి అభ్యర్థి నామినేషన్ ఫీజు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) నామినేషన్ దాఖలు సమయంలో చెల్లించవలెను. 2) ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం 1995 మరియు బ్యాంక్ యొక్క బై-లాస్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి అనర్హత కలిగి వుండకూడదు. 3) ఓటర్ల జాబితా ఎన్నికల అధికారి వద్ద అందుబాటులో ఉంటుంది. 4) ఓటర్ల జాబితా బ్యాంక్ యొక్క అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం: 3వ అంతస్తు, 3/2 బ్రాడీపేట నందు నోటీసు బోర్డులో ప్రదర్శించబడుతుంది.
గమనిక: 1) ఓటు వేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా బ్యాంక్ వారు జారీ చేసిన సభ్యత్వ నమోదు ఐడి కార్డు వంటి ఏదైనా ఆమోదించబడిన గుర్తింపు కార్డును ఓటరు తీసుకురావలెను.

## మార్కాపురానికి పవన్ కల్యాణ్

(5వపేజీ తరువాయి)

ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో ఏర్పాట్లపై దృష్టి సారించారు. పశ్చిమ ప్రాంత ప్రజల తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో వెలిగొండ నీరు ఆధారంగా రూ.వెయ్యి కోట్లతో భారీ ప్రాజెక్టు మంజూరైంది. అప్పట్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్న నారా లోకేష్ సదరు పథకానికి శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు జరగలేదు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసి తిరిగి టెండర్లు పిలిచింది. ఆ ప్రాజెక్టును దక్కించుకున్న సంస్థ 2024 జూన్‌లో అగ్రిమెంట్ కూడా చేసుకుంది. అయినా పనులు ప్రారంభం కాలేదు. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ఆ బిందర్లను రద్దు చేసింది. పశ్చిమ ప్రాంతంలోని గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, వైపాలెం నియోజకవర్గాల్లోని 18 మండలాల్లో 578 హ్యాబిటేషన్లకు ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు ఇచ్చే కార్యక్రమానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటు మరికొన్ని ఇతరత్రా కార్యక్రమాలు, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఆ మేరకు ఉన్నతస్థాయి నుంచి వచ్చిన సమాచారంతో ఆదివారమే జిల్లా అధికారులు మార్కాపురం వెళ్లి అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి చర్చించారు. ఏర్పాట్లను ప్రాథమికంగా పరిశీలించారు. శంకుస్థాపన ప్రాంతం, బహిరంగ సభ నిర్వహణ ప్రాంతాలను పరిశీలించేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం మార్కాపురంలో పర్యటించనున్నారు. అక్కడి ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తారు.

## 'అయ్యో'రు!

(5వపేజీ తరువాయి)

పాఠశాలలకు ఒక్కరు కూడా బదిలీ కోరుకోలేదు. ఈ పాఠశాలలు మూతబడకుండా ఉండాలంటే పాత టీచర్లు మళ్లీ అక్కడే పనిచేయాల్సిఉంది. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు బదిలీపై వెళ్లి ఆ పాఠశాలలకు కొత్త టీచర్లు కోరుకోకపోవడంతో అక్కడ నుంచి బదిలీ అయిన టీచర్లు కొత్త పాఠశాలలో చేరి పాత పాఠశాలల్లోనే పనిచేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రాథమి, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రస్తుతం 700 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బదిలీలు ముగిసిన తర్వాత జిల్లాలో 825 ఎస్జీటీ పోస్టులు ఖాళీ ఉండగా కనీసం ఒక్కరు కూడా తిరిగి వారిలో కనీసం బైస్కేల్లో టీచర్లు 230 మంది కొత్త పాఠశాలలను కోరుకోగా అప్పటికీ 600 ఖాళీ పోస్టులు ఉన్నాయి. జూన్ 30న మరో 100 మంది ఎస్జీటీలు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీల సంఖ్య 700కు చేరింది. అయితే మెగా డీఎస్సీలో కేవలం 106 ఎస్జీటీ ఖాళీలను మాత్రమే ప్రకటించారు. డీఎస్సీ పరీక్షలు బుధవారంతో ముగియనున్నాయి. ఒకవేళ నియామకాలు ఇచ్చినా 106 మంది పోను ఇంకా 594 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇన్ని ఖాళీ పోస్టులతో పాఠశాలల నిర్వహణ కత్తిమీదసాము కానుంది.

## సులభతరంగా రేషన్ పంపిణీ

అవీఇవీ

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణం ద్వారా రేషన్ సరుకుల సులభత రంగా ప్రజ లకు అందిం చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొంగళవీడు రోడ్డులో చౌకధరల దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.గతంలో ఆటో ద్వారా రేషన్ పంపిణీ వలన వలువరు ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలి యక పనులు మానుకుని మరీ వేచి చూసేవారన్నారు. ఆ ఇబ్బందు లను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవ న్‌కల్యాణ్ పేదలకు రేషన్ పంపిణీ సక్రమంగా అందించాలన్న ఉద్దే శ్యంతో డీలర్ల ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు రేషన్ అందుకునేలా సిద్ధ బియ్యం తీసుకునేలా చ ర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణ, కౌన్సిలర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్ రాక ఏర్పాట్ల పరిశీలన

మార్కాపురం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పవన్‌కల్యాణ్ ఈనెల 4న మార్కాపురం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగానికి సమాచారం రావడంతో మంగళవారం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ త్రివినాగ్ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ గ్రామం వద్ద శిలాఫలకం ఆవిష్కరణ, జలజీవన్ మిషన్ పథకంలో మంజూరైన పనులను పవన్‌కల్యాణ్ ప్రారంభిస్తారని వారు తెలి పారు. పట్టణ శివారు ప్రాంతంలోని బోడపాడు రోడ్డులో గల ప్లాట్ లలో హెలిప్యాడ్ స్థలాన్ని, మార్కెట్ యార్డులో సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, నాయకులు పాల్గొన్నారు. బుధవారం కలెక్టర్ అన్సారియా స్థలాన్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.

## పంట సాగుదారు చట్టంతో చక్కని ప్రయోజనం

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పంట సాగుదారు చట్టంతో కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయని ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పేర్కొన్నారు. చీరాల, వేటపాలెం మండలాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుదారు ధ్రువపత్రాలతో ప్రతి కౌలుదారైతుకు బ్యాంకు ద్వారా ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథ కాలు అందుతాయని వివరించారు. భూ యజమాని సొంతంలోని కౌలుదారులకు సహకరించాలన్నారు. తద్వారా యజమానులకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల కోటే శ్వరరావు, డీటీఆర్‌సీ ప్రతినిధి భగవాన్‌దాస్, నెక్టరిటీ భారతి, లలిత, ప్రసన్న తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

డాక్టర్ ఫణీంద్రబాబును సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

### డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే నిర్వహణ

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ నూతన అధ్యక్షుడిగా బాచిన శివదరహర్షచంద్రరావు, కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక క్రాంతి నర్సింగ్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఫణీంద్రబాబు, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మచౌదరిల సమక్షంలో బాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ ఫణీంద్రబాబు, డాక్టర్ బాజావలీలను సన్మానించారు. ఆకౌంటెంట్స్‌డే సందర్భంగా కోట శ్రీనివాసకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చప్పిడి వీరయ్య, మందలపు శ్రీనివాసుమధురి, మల్లది శ్రీని వాసరావు,అలహరి హరిప్రసాద్, చామర్తి వెంకట గురుశేఖర్, మహ్మదీరఫీ, దేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, దేవపాలన, జ్యోతి చం ద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచం ద్రమూర్తి, డాక్టర్ ఖాజీ వలి, సంకా బాబు, ఊటుకూరు రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యులకు రోటరీ సభ్యుల సత్కారం

మార్టూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): జాతీయవైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను పూలమాలతో, శాలువాలు కప్పి సత్కరించారు. ఆస్ప త్రిలో వైద్యులుగా పనిచేస్తున్న అశోక్‌రెడ్డి, విష్ణుతేజ, కిషోర్ కుమార్, సాయి ప్రసాదరావు, గార్డియా, నీరజ, సుబ్రహ్మణ్యంలను రోటరీ సభ్యులు సత్కరించారు. అనంతరం రోగులకు రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రవేటు వైద్యులు వి శ్రీనివాసరావు తదితరులను సత్కరించారు. అంతేగాకుండా జాతీయ చార్టర్ ఆకౌంట్స్ దినోత్సవం సందర్భంగా కె రాకేష్, వనజ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి సిహెచ్ నాగేశ్వర రావు, అసిస్టెంట్ గవర్నర్ ఆర్ అంకమ్మచౌదరి, మాజీ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, షేక్ కాజాహుస్సేన్, కోటేశ్వరరావు, తదిత రులు పాల్గొన్నారు.

## డీఎస్సీకి 97శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు మంగళవారం 96శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. గత నెల 20న వాయిదా పడినపరీక్షను నిర్వహించారు. జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జర్గా 1015 మందికి 973మంది హాజరు కాగా 42మంది గైర్హా జరయ్యారు. ఉదయం సెషన్‌లో 581మందికి 551, మధ్యాహ్న సెషన్‌లో 434మందికి 422 మంది హాజయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగి నట్లు డీఈవో పేర్కొన్నారు.

## 8 కిలోలు గంజాయి పట్టివేత

- నిందితుడి అరెస్టు

ఒంగోలు క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో గల ఏబీఎం కాలేజి కాంపౌండ్ వాల్ వద్ద అనుమానా స్పదంగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎలీనా తెలిపారు. మంగళవారం నిర్వహించిన తనిఖీలలో బాగంగా చిత్తూరు జిల్లా నగిరి మండలానికి చెందిన ఎస్.మణిని అరెస్టు చేసి నట్టు చెప్పారు. అనకాపల్లి నుంచి నగిరికి గంజాయి తీసుకుకెళుతు న్నాడు. ఒంగోలులో రైలు దిగడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు పి.రవిఆంజనే యులు, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

**కలెక్టర్ అన్సారియా ఆదేశం**

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో రెవెన్యూ వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులుజారీ చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో 46,015 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 11,579 మందికి మాత్రమే సీసీఆర్సీ కార్డులు జారీ చేశారని చెప్పారు. ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూసేకరణ చేయడంతోపాటు ప్రస్తుతం ఉన్న లే అవుట్లలో అందుబాటులో ఖాళీగా ఉన్న ప్లాట్లను పరిశీలన చేయాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటివద్దకే రేషన్ అందించేదృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌డీసీలు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసప్రసాద్, పద్మశ్రీ, వరలక్ష్మి, గోపిబాబు పాల్గొన్నారు.

## 10న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్

ఒంగోలు విద్య, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నారు. మొదట ఈ నెల 5న నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ దీనిని ఈనెల 10కి మార్చు చేస్తూ పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో ఘనంగా ఈ వేడుకలను నిర్వహించనున్నారు. అన్ని పాఠశాలల్లో తల్లికివందనం పథకం ఆవశ్యకత, దాని ఉపయోగాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, డ్రాయింగ్ తదితర పోటీలను పాఠశాలలకు 10వ తేదీన వచ్చే తల్లుల ముందు ప్రదర్శించాలి. పదో తరగతిలో అత్యధిక మార్పులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైన వారిని, పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగిన పూర్వ విద్యార్థులను పిలిపించి ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తి సందేశం ఇప్పించాలి. తల్లికి వందనం పోటీలను రానున్న మూడు రోజుల్లో నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులు తమ ఇళ్లలో మొక్కలు నాటతామంటే వారికి మొక్కలను సరఫరా చేసేందుకు ముందుగా పాఠశాలలో పంపిణీకి మొక్కలు సిద్ధం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

## 20 హైస్కూళ్లకు కొత్త డీడీవో కోడ్‌లు

**జీతాల సమస్యకు పరిష్కారం**

ఒంగోలు విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 20 హైస్కూళ్లకు కొత్త డీడీవో(డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్) కోడ్‌లు మంజూరు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 531 హైస్కూళ్లకు డీడీవో కోడ్‌ల మంజూరు కాగా, జిల్లాలో 20 ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ పాఠశాలల్లో హెచ్‌ఎం, టీచర్లకు జీతాల సమస్య పరిష్కారమైంది. జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 85 యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో 28 హైస్కూళ్లలో 75 మందికి పైగా విద్యార్థులు ఉండటంతో ఆ పాఠశాలలకు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేశారు. ఇటీవల జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఈ పాఠశాలల్లోని హెచ్‌ఎం, స్కూలు అసిస్టెంట్ పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. ప్రస్తుతం వీటిలో 20 పాఠశాలలకు డీడీవో కోడ్‌లు మంజూరు కావడంతో అక్కడి ప్రధానోపాధ్యాయులే జీతాలు డ్రాచేయనున్నారు. మిగిలిన పాఠశాలలకు ఆయా మండలాల మండల విద్యాధికారి-1 జీతాలు డ్రా చేస్తారు. చిలంకూరు, ముప్పవరం, శీలవారిపల్లి హైస్కూళ్లకు హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేశారు. యర్రగొండపాలెం(ఉర్దూ), వెల్లంపల్లి, గానుగపెంట, చినదోర్నాల, కెల్లంపల్లి, చింతకుంట, వెస్ట్‌వీరాయపాలెం, చాకిరాల, బడుగులేరు, ఆరవవార్డు యాదవబజారు, ఈస్ట్ వీరాయపాలెం, బండివెలిగండ్ల జడ్పీ హైస్కూలు, ఒంగోలులోని బాలాజీనగర్ హైస్కూలు, మార్కాపురంలోని ఎస్సీ, బీసీ కాలనీ హైస్కూలు, పీఎస్ కాలనీలోని హైస్కూలుకు కూడా డీడీవో కోడ్‌లు మంజూరయ్యాయి.

## అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

ఎర్రగొండపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజక వర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని శుభ్రం చేశారు. పంచాయతీ కార్యాలయం పక్కన మండల పరిషత్ అతిథి గృహం వద్ద ఉన్న చిన్న భవనంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. దీంతో దాని ఎదురుగా శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి ఆ ప్రాంతాన్ని ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించినట్లు పంచాయతీ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

అన్న క్యాంటీన్ కోసం స్థలం శుభ్రం చేస్తున్న ఎక్స్‌వేటర్

## రేపటి నుంచి పొగాకు వేలం బహిష్కరణ

**● పొగాకు రైతుల తీర్మానం**

ఒంగోలు(రూరల్), జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రతి పొగాకు వేలం కేంద్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి వేలం ప్రక్రియను బహిష్కరిస్తున్న రైతులు తీర్మానించారు. మంగళవారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో రైతులు, రైతు సంఘం నాయకులు కలిసి వేలం నిర్వహణాధికారి జె.తులసితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లోగ్రేడ్ పొగాకును అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. నోబిడ్‌లతో అల్లాడిపోతున్నాయని, ఇలాంటి అనివార్య పరిస్థితులలో పొగాకు వేలంను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. పొగాకు చూరను కూడా వ్యాపారులు కొనుగోలు చేయాలని తీర్మానించారు. అనంతరం వేలం నిర్వహణాధికారి తులసికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.హనుమారెడ్డి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునీల్, పొద హరిబాబు, చెరుకూరి వాసుబాబు, గుడిపూడి రాజారావు, దొడ్డా సీతారామయ్య, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వేలం నిర్వహణాధికారి తులసికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

# నిలబడి...!

## బోడపాడు ప్రభుత్వ పాఠశాలలో 30 నుంచి 130కి పెరిగిన సంఖ్య

### మార్కాపురంలో ఈఏడాది కార్పొరేట్ స్కూళ్లు మానేసి అడ్మిషన్లు తీసుకున్న 45 మంది విద్యార్థులు

**ప్రజాప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోపాటు దాతల సాయంతో మరింత అభివృద్ధి**

**ఏటా నవోదయ సీట్లు**

**హౌస్‌ఫుల్ బోర్డు దిశగా అడ్మిషన్లు!**

మార్కాపురం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంతోపాటు తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ఊపిరిపోస్తున్నాయి. వీటికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడితే ఆ బడి దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోందనేదానికి బోడపాడు ఎంపీపీపాఠశాలే ఉదాహరణ.

మార్కాపురం మండలం బోడపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది. గ్రామంలో ఉండే విద్యార్థులు అందరూ ఆ పాఠశాలలో చదువుతుండడమేగాక మార్కాపురం పట్టణం నుంచి రోజూ 45 మంది ఆటోలో స్కూలుకు వస్తుండడం గమనార్హం. వీరందరూ కార్పొరేట్ పాఠశాలలను వదిలేసి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ పాఠశాలకు వస్తుండడం, ప్రభుత్వ విద్యావ్యవస్థ మీద తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుండడమేనని చెప్పవచ్చు.

బోడపాడు ఎంపీపీ పాఠశాలలో 2023 జూన్ 12న పెద్దారవీడు మండలం బోడిరెడ్డిపల్లి స్కూల్ నుంచి ఉపాధ్యాయుడు శ్రీనివాసులు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచే ఈ పాఠశాలలో మార్పు మొదలైందని చెప్పవచ్చు. అప్పటికీ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య 30. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 130 మందికి చేరింది. ఉపాధ్యాయులు ఐదుగురు ఉన్నారు. పాఠశాలలో హౌస్‌ఫుల్ బోర్డు పెట్టే పరిస్థితి ఉంది. ఏటా ఇక్కడ చదువుతున్న విద్యార్థులు నవోదయ సీట్లు సైతం సాధిస్తున్నారు.

మార్కాపురం నుంచి వాహనంలో స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

**● దాతల సహకారంతో పాఠశాలలో అభివృద్ధి పనులు**

పాఠశాలలో గ్రామస్థులు, దాతల సహకారంతో కార్పొరేట్ స్కూల్స్ స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విద్యార్థులు చదువుకునేందుకు లక్ష రూపాయలతో రేకుల షెడ్‌ను నిర్మించారు. రూ.50వేలతో మరుగుదొడ్లను ఆధునికీకరించారు. రూ.లక్షతో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

**● సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసలు**

పాఠశాలలో జరిగే స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాల సమయంలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. ఈ ఏడాది మార్చి 8న మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి సభా కార్యక్రమంలో బోడపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ధీర వనితల వేషధారణతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్నారులను గుర్తించి వారిని అభినందించారు.

**● అభినందించిన కలెక్టర్**

గత ఏడాది డిసెంబర్ 26న బోడపాడు గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ప్రతిభ, అభివృద్ధి పనులను చూసి ఉపాధ్యాయులను అభినందించారు.

బోడపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాల

**పేదలకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యం**

**టీచర్ శ్రీనివాసులు**

గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నదే లక్ష్యం. రూ.4లక్షలతో పాఠశాలలో అభివృద్ధి, వసతుల కల్పనకు కృషి చేశాం. మార్కాపురం పరిసర ప్రాంతాలలోని సుమారు 20 గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తుండడం సంతోషంగా ఉంది. విద్యార్థుల సౌలభ్యం కోసం హనుమంతు అనే వలంటీర్‌ను పెట్టి రూ.10వేల సొంత నిధులు ఖర్చు చేస్తున్నా. ప్రభుత్వ విద్యా పథకాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నదే నా ఆశయం.

**శ్రీను సార్‌తో పనిచేయడం ఆనందంగా ఉంది**

**జాకబ్, ప్రధానోపాధ్యాయుడు**

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు మంచి బోధన ఇవ్వడంలో శ్రీనివాసులు మాస్టారు కృషి అభినందనీయం. అవసరాలను ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సొంత నిధులు, దాతల సహకారంతో తీర్చుతున్నారు. మెరుగైన బోధన అందిస్తుండడంతో ఈ పాఠశాల గుర్తింపు పొందింది.

**విద్యా బోధన బాగుంది**

**సుబ్బలక్ష్మమ్మ విద్యార్థి తల్లి**

శ్రీనివాసులు మాస్టార్ ఈ బడికి రావడం అదృష్టం. నా ఇద్దరు కుమార్తెలు ఇక్కడే చదువుతున్నారు. పాపకు నవోదయలో సీటు వచ్చింది. రెండో పాప 5వ తరగతి చదువుతోంది. శ్రీను మాస్టారు అదనపు సమయం కూడా వెచ్చించి పాఠాలు చెబుతున్నారు.

# వైసీపీ ఆత్మ విమర్శ చేసుకోవాలి

**ఎమ్మెల్యే దామచర్ల**

**పార్టీలు మారితే చేసిన పాపాలు పోతాయా ?**

**సంక్షేమం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం**

**మీడియా సమావేశంలో దామచర్ల, రియాజ్**

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం ఏడాది పాలనలో ఏమీ చేయలేదని అబద్ధపు ప్రచారాలు చేస్తున్న వైసీపీ నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, ముఖ్యంగా విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు. మంగళవారం ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల నేతలతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ పాలనలో నవరత్నాలు పేరుతో ప్రజలను మోసంచేసిన సంగతి మర్చిపోయారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పించన్ పెంచడానికి ఐదేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. పేదలకు టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా పాడుపెట్టడంతో పాటు, లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వడ్డీలు కూడా కట్టకుండా ఎగవేసిన ఘనత వైసీపీదేనని విమర్శించారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంతో నేటికీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. తప్పుడు పనులు చేసిన ఆ పార్టీ నేతల అరెస్ట్ తదితర అన్నీ విషయాల్లోనూ పోలీసులు నోటీసులు ఇచ్చి చట్ట ప్రకారమే ముందుకెళుతున్నారని చెప్పారు. ఒంగోలులో గత వైసీపీ పాలనలోనే టీడీపీ శ్రేణులపై 87 అక్రమ కేసులు పెట్టిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. మహిళలు అని కూడా చూడకుండా అరెస్టులు చేయించిన మాజీ మంత్రి తాను పార్టీ మారానని మాట్లాడుతున్నారని, గత ఐదేళ్లు అరాచకాలు చేసి, నేడు పార్టీలు మారితే పాపాలు పోతాయా? బాధితులు బాధ తగ్గుతుందా? అని విమర్శించారు. 151 సీట్లు వచ్చాయని 2019లో విర్రవీగి, ప్రజలను మోసం చేశారని, అదే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసిన సంగతిని నిత్యం గుర్తుంచుకోవాలని చెప్పారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇప్పటికే పింఛన్లు పెంపు, ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి తల్లికి వందనం నగదు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు, డీఎస్సీ విడుదల, అలాగే అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేసిందని తెలిపారు. దాంతోపాటు వచ్చే నెల 15 నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి నియోజకవర్గంలో ఇంటింటికీ ప్రజలతో మమేకం అవుతున్నట్లు తెలిపారు. రోజూ 50 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడనున్నట్లు దామచర్ల చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షులు లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారన్నారు. ఓర్వలేని వైసీపీ నేతలు వారు చేయరు.. చేసేవారిని చేయనివ్వకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, మేయర్ గంగాడ సుజాత పలువురు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన రియాజ్, సుజాత

## లారీ డ్రైవర్‌కు జరిమానా, జైలు

గిద్దలూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడిపిన మందుబాబుకు కోర్టు జరిమానాతోపాటు జైలు శిక్ష విధించింది. కంభం మండలంలో మద్యం తాగి లారీ నడిపిన ఓ వ్యక్తికి గిద్దలూరు కోర్టు న్యాయాధికారి భరత్‌చంద్ర మంగళవారం తీర్పు ఇచ్చారు. లారీ డ్రైవర్‌కు రూ.10వేలు జరిమానా, 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే మరో 20 రోజులు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులు ఆందోళన

**నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్**

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎదుట నిరసన**

మర్రిపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం చెల్లించాలంటూ మంగళవారం మర్రిపూడి పంచాయతీ పరిధిలోని దుగ్గిరెడ్డిపాలెంలో ఆందోళనకు దిగారు. భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ రోడ్డునిర్మాణ పనులు పరిశీలించేందుకు వచ్చారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు సంవత్సరకాలంగా నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారంటూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎదుట ఆందోళనకు దిగారు. గత రెండు దశాబ్దాలకుపైగా 6.50 సెంట్ల భూమిని అసైన్‌మెంట్ పట్టా ద్వారా అనుభవిస్తున్నామని, అధికారులు అనాధీనం భూమిగా చూపిస్తూ నష్టపరిహారం రాకుండా చేశారని ఆరోపించారు. జీవనాధారమైన భూమిని పోగొట్టుకొని ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దుద్దుకుంట కోటయ్య భూమిలో ఉన్న వ్యవసాయబోరును తొలగిస్తే రహదారి నిర్మాణ పనులు సజావుగా సాగుతాయని ఎస్‌డీసీ వరకుమార్ రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికే నష్టపరిహారం అందించే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. పరిహారం అందించనిదే రోడ్డు నిర్మాణానికి సహకరించబోమని రైతులు స్పష్టం చేశారు. ఆయన వెంట డిప్యూటి తహసీల్దార్ నాగరాజు, వీఆర్వో బడేసాహెబ్ రైతులు ఉన్నారు.

నష్టపరిహారం కోసం అధికారులను నిలదీస్తున్న రైతులు

# అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్టు

గిద్దలూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండలం తాటిచెర్లమోటు గ్రామంలో బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. గిద్దలూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఈ కేసులో కడప జిల్లా కలసపాడు మండలం గోపవరం గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్‌నాయుడు, ఇదే మండలంలోని మహానందిపల్లికి చెందిన కేత కుమారి, గోపవరం గ్రామానికి చెందిన ఎం.బాలుడు అనే నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. తాటిచెర్లమోటులో భోజన హోటల్‌లో జూన్ 26 అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. హోటల్‌లో మద్యం సేవించి హోటల్‌కు చెందిన బాలికపై చంద్రశేఖర్ నాయుడు లైంగిక దాడి చేయగా, మిగతా ఇద్దరు అతనికి సహకరించినట్లు పేర్కొన్నారు. తమకు రాజకీయ బలం ఉందని, బయటకు చెప్తే చంపుతామని నిందితులు బెదిరించినట్లు తెలిపారు. బాధితురాలిని తీసుకుని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు, నిందితులపై పోక్సో చట్టం పెట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ కోటయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

**WANTED IMMEDIATELY**

1) సైటు సూపర్‌వైజర్, 2) సైటు ఇంజనీర్స్‌గా మా కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవము కలిగిన అభ్యర్థులు వెంటనే కావలెను. విద్యార్హత, 1). ఏదేని డిగ్రీ / ఇంటర్, 2). B.Tech Civil or Diploma Civil, Contact సెల్: 6304413121

AJO-240762

**అద్దెకు ఇవ్వబడును**

ఒంగోలు ఉడ్ కాంప్లెక్స్ నందు మెయిన్ రోడ్ ఫేసింగ్‌లో కల 3000 Sft ఆఫీస్ స్పేస్ / గోడౌన్ అద్దెకు ఇవ్వబడును. వెంటనే సంప్రదించండి. సెల్: 8085959052.

AJO-240763

**లేడీస్ స్టాఫ్ కావలెను**

ఒంగోలు ప్రముఖ ఫర్నీచర్ షాప్‌లో పనిచేయుటకు లేడీస్ స్టాఫ్ కావలెను. వయస్సు 18 నుండి 35 లోపు వారు Q : 10th/Inter, జీతం : 12,000/- ఇవ్వబడును. సంప్రదించండి. సెల్: 9030590855

AJO-240764

**క్లాసిఫైడ్ ప్రకటన**

బ్లాక్ & వైట్ 4 లైన్లు రూ. 190/-
ప్రతి అదనపు లైనుకు రూ.45/-
కలర్ 4 లైన్లు రూ. 220/-
ప్రతి అదనపు లైనుకు రూ.50/-
5% GST అదనం

**కావలెను**

ఒంగోలు, మధుర్‌శ్రీ కంపెనీ నందు పనిచేయుటకు మహిళలకు మాత్రం అవకాశం కలదు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశములు కలవు. సంప్ర॥ సెల్: 8919154522

AJO-233082

**PLOT FOR SALE**

ఒంగోలు కార్పోరేషన్ బోర్డర్‌లో రింగురోడ్డు సమీపంలో నివాస గృహాలు మధ్య మంగమూరులో ఇండ్ల స్థలాలు అమ్మబడును. తక్కువ ధరలకే ఇల్లు కట్టించి ఇవ్వబడును. సెల్: 9493521896.

AJO-211479

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇప్పుడు మీ ఆత్మీయులకు, ప్రకటనల ద్వారా మరింత చేరువకండి.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ, షష్ఠిపూర్తి, ఉద్యోగ, వ్యాపార, లీగల్ ప్రకటనలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411484

## సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

● పీడీసీసీ బ్యాంకు చైర్మన్ సీతారామయ్య

ఉద్యోగులతో మాట్లాడుతున్న సీతారామయ్య

చీమకుర్తి, జూలై1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కోరారు. మంగళవారం చీమకుర్తి సహకార బ్యాంకును, మండలంలోని కేడీసీసీ బెంలో సొసైటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారోత్సవాలను పురస్కరించుకుని ఆయా సొసైటీల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. బ్యాంకు శాఖ పనితీరును పరిశీలించారు. ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కేవీపాలెంలో సాధారణ సమావేశానికి ఆయన హాజరయ్యారు.

## పేద విద్యార్థులకు ఆర్థికసాయం

విద్యార్థికి నగదును అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఒంగోలులోని వెంకటరమణ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్ చేయూతనిచ్చారు. వెంకటరమణ చారిటబుల్ ట్రస్టు ద్వారా మంగళవారం స్థానిక బాలాజీనగర్‌లోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి జగదీష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్య ద్వారా మాత్రమే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు, గురువులకు, పాఠశాలకు మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో వెంకటరమణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం 1 నుంచి 10 తరగతి వరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం బంకా లక్ష్మీప్రసన్న, కార్పొరేటర్ నాగభూషణం, టీడీపీ నాయకులు గోలగాముడి వెంకటేశ్వర్లు, జేఏసీ నాయకులు రాజేష్, నరేష్, కార్తీక్, నాగార్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి మహేంద్ర సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరాన్ని దారితప్పించే చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైనదని తెలిపారు. వాటికి అలవాటు పడితే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడంతో పాటు బంగారం లాంటి భవిష్యత్ చేజేతులా నాశనం చేసుకున్నట్లు అవుతుందని వివరించారు. అనంతరం సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్ట్ చేశామని స్కామర్లు పోలీసులు, సీబీఐ అధికారుల పేరుతో బెదిరిస్తున్నారని పోలీసులు డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ విచారణలు చేపట్టరన్నారు. వీటిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని విద్యార్థులకు ఎస్సై సూచించారు.

## కౌలు రైతులు గుర్తింపుకార్డులు పొందాలి

ఒంగోలు(రూరల్), జూలై 1(ఆంధ్రజ్యోతి): కౌలుకు భూములు సాగు చేసే రైతులు తప్పక గుర్తింపు కార్డులు పొందాలని ఏవో రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం త్రోవగుంట, మండువవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేసి 40రోజులు దాటిన తరువాత దుక్కిలో దున్నేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలపై అవగాహన**

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు, బోగనంపాడు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి వి.రాము అధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రాము మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాలు సబ్సిడీలపై అవగాహన కల్పించారు.

## రేపు సర్వసభ్య సమావేశం

పొన్నలూరు, జూలై 01 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో డాక్టర్ వి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు ఆయా శాఖాధికారులు పాల్గొనాలని ఆమె సూచించారు.

## పొన్నలూరు హైస్కూల్ అభివృద్ధికి దాతల చేయూత

దాతలు నిర్మించిన ముఖద్వారం

పొన్నలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పొన్నలూరులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు చేయూతనందిస్తున్నారు. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకట్రావు, రవిబాబు సుమారు రూ.2.4 లక్షలు ఖర్చుచేసి పాఠశాలకు ముఖద్వారం నిర్మించారు. తమ తండ్రి, కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మళ్ల మాలకొండయ్య జ్ఞాపకార్థం దీనిని ఏర్పాటుచేశారు. పాతగేటు స్థానంలో రూ.70 వేలతో కొత్తగా ఇనుపగేటు అమర్చారు. 1994-95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు రూ.36 వేలతో వంటగదికి రేకుల వరండా నిర్మించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులోనూ మరింత చేయూత అందిస్తామని పూర్వవిద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

## పోయిన బంగారు ఆభరణాల అప్పగింత

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బంగారాన్ని పోలీసులు బాధితుడికి అప్పజెప్పిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అయ్యంబొట్లపల్లికి చెందిన పెద్దపోగు కోటయ్య మే31వ తేదీన బ్యాంకులో బంగారం తాకట్టుపెట్టి లోన్ తీసుకునేందుకు ఎర్రగొండపాలెం వచ్చారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద కూల్‌డ్రింక్ తాగి బ్యాంకుకు వెళ్లి చూడగా బంగారం పోయినట్లు గుర్తించారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చౌడయ్య సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. కోటయ్య కూల్‌డ్రింక్ తాగిన చోట కింద పడిపోయిన ఆభరణాలను మరో వ్యక్తి తీసుకెళ్లారు. ఆ వ్యక్తి కూల్‌డ్రింక్ తాగి ఫోన్‌పే చేయడంతో ఆ నెంబర్ ద్వారా అతడిని పట్టుకొని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు కోటయ్యకు ఆభరణాలు అప్పజెప్పడంతో ఆయన ఎస్ఐ, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలి

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆ కులాది మండలి జీవనాధారం ఆయన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే సాగు, తాగునీరు సంబంధించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాబోయే మార్కాపురం జిల్లాలో శ్రీశైలం, సున్నిపెంటలను కలపాలని గొడ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటులో భాగంగా జరుగుతున్న అనేక విషయ సేకరణలో శ్రీశైలం, సున్నిపెంట లాంటి ప్రాంతాలను మార్కాపురంలో కలపాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ సామాజిక పింఛనుతో భరోసా

● ఎమ్మెల్యే దామచర్ల ● నగరంలో పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్ అన్సారియా ● కె.అగ్రహారంలో ఎమ్మెల్యే బీఎన్ అందజేత

ఒంగోలులో పింఛను నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

కె.అగ్రహారంలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పింఛనుతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని కరవది బజారులో లబ్ధిదారులకు దామచర్ల స్వయంగా పింఛను నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో వెయ్యి రూపాయల పింఛను పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందే ఒకే సారి రూ.వెయ్యి పెంపు ప్రకటించారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలిసంతకం పింఛన్ల పెంపుపై పెట్టారన్నారు. 1వ తేదీన ఉదయం 6గంటల నుంచే పంపిణీ ప్రక్రియ జరుగుతుందని, గత వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తలుగా ఉన్న వలంటీర్లు ఇష్టం వచ్చినట్టుగా పంపిణీ చేసేవారని ఆరోపించారు. అయితే నేడు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు నేరుగా ఇంటికొచ్చి లబ్ధిదారుల చేతికి అందిస్తూ అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని దామచర్ల తెలిపారు. అలాగే నగరంలోని అన్నవరప్పాడులో లబ్ధిదారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధుసూదనరావులు పింఛను అందజేశారు.

అన్నవరప్పాడులో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా, కమిషనర్ వెంకటేశ్వరరావు

**ఒంగోలు మండలంలో..**

ఒంగోలు(రూరల్): మండలంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఎంపీడీవో రాజశేఖర్ రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

**కె.అగ్రహారంలో..**

చీమకుర్తి: కె.అగ్రహారం గ్రామంలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొని తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి ఇంటింటా తిరుగుతూ లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రామచంద్రం, ఇస్తర్ల కొండలు, లోకేష్, యడ్లపల్లి రామబ్రహ్మం, అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని గిరిజన భవనాన్ని ఆయా సామాజిక వర్గాల సంస్కృతిని ప్రతిబింబేలా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం ఒంగోలులోని గిరిజన భవనాన్ని, పరిసరాలను మొత్తం తిరిగి అందులోని వసతులను పరిశీలించారు. ప్రస్తుతం ఆ భవన స్థితిగతులను గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. కార్పొరేషన్ నుంచి నీటి కనెక్షన్ రావాల్సి ఉందని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు ఆటు భవనంలో ఏసీలు, ఇతర ఫర్నిచర్ ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. భవనం వెనుక వైపున జీజీహెచ్ ప్రాంగణంలో నుంచి ప్రవేశించేలా ఒక గేటును కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, అందుకు సంబంధించి వివరాలను అందజేశారు. ఆయా అంశాలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసుల దినోత్సవం ఉన్నందున, ఆలోపు ఈ భవనాన్ని ఆధునికీకరించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో వసతులను సమకూర్చిన తర్వాత వైవిధ్య కార్యక్రమాలకు కూడా ఈ భవనాన్ని అద్దెకు ఇవ్వడం ద్వారా నిర్వహణకు అవసరమైన ఆదాయం సమకూర్చుకోవచ్చని తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ అధికారికి కలెక్టర్ ఆ నారాయా సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, గనులశాఖ డీడీ రాజశేఖర్, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ భాస్కరరావు, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

● ఎమ్మెల్యే దామచర్ల పిలుపు

అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 60 ఏళ్లకు పైబడిన వారందరూ క్షయ నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. టీబీ ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం స్థానిక 49వ డివిజన్‌లో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన ప్రజలు, మగర్ ఉన్నవారు, పొగ, మద్యం తాగే వారు ఎక్కువగా క్షయ బారిన పడతారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం ఉచితంగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,12,817 మందికి వైద్యపరీక్షలు చేయగా 5432 మందిని అనుమానితులుగా గుర్తించామని, వారిలో 137 మందికి క్షయ నిర్ధారణ అయిందన్నారు. వీరందరికీ ప్రతి ఒక్కరూ క్షయపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీవాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నేటి నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు'**

ఒంగోలు కార్పొరేషన్: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందులో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీవీఆర్ కన్వెన్షన్ హాలులో పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రజలు గత సైకో వైసీపీ పాలనకు గుణపాఠం చెప్పి టీడీపీ కూటమిని ఆదరించారన్నారు. అయితే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం నుంచి నియోజకవర్గంలో చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి రోజు 5,6 డివిజన్లలో ప్రారంభిస్తామని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్ష పాత్ర పోషించాలని దామచర్ల పేర్కొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం

ఐఎంఏ హాలులో వైద్యదంపతులను సత్కరిస్తున్న డాక్టర్లు

శ్రీరామ్ ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం స్థానిక ఐఎంఏ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 70 సంవత్సరాలు వయస్సు పొందిన డాక్టర్లను, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కేవీ. సుబ్బానాయుడుతోపాటు డాక్టర్లను చేబ్రోలు నాగేశ్వరరావు, కంచర్ల వెంకటేశ్వర్లు, సెట్టిపాటి సత్యనారాయణ, రాంబాబు, ఆలూరి ప్రభాకర్ రావు, డాక్టర్ సోనార్ బాబు, ఆర్‌వీఎస్ మల్లికార్జునరావు, నజ్జ మురళీ, జి. కోటేశ్వరరావు, బెతాని రంగారావు, సీహెచ్.చలమయ్యలను సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డి.శివసీతారామయ్య, సెక్రటరీ జాలాది మణిబాబు, కోశాధికారి ఎంపీ.రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నె వీరయ్యచౌదరి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జయశేఖర్ పాల్గొన్నారు.

**శ్రీరామ్ హాస్పిటల్‌లో..**

ఒంగోలు కార్పొరేషన్: డాక్టర్స్ డే పురస్కరించుకుని ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ ఎండీ, డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఆయన సతీమణి డాక్టర్ కాంతకుమారి, ఇతర వైద్యులతో కలిసి సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు దీరజ్ బాబు, పేర్వలి, కుమార్ వర్మ, పసుపులేటి సుధీర్, నందలూరు సరసయ్య, చైతన్య, సామిత్ర పల్లవ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

**చీమకుర్తిలో...**

చీమకుర్తి: పట్టణంలో డాక్టర్స్‌డే వేడుకలు మంగళవారం జరిగాయి. డాక్టర్ జవహర్ వైద్యసేవా పురస్కారం మేదరమెట్లకు చెందిన డాక్టర్ డి.కోదండరెడ్డికి అందజేశారు. రూ.లక్ష నగదుతో కూడిన కోదండరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. జేవీపీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్ మాట్లాడుతూ వైద్యసేవలో విశేషమైన సేవలందిస్తున్న వైద్యులను ప్రతిఏటా

కోదండరెడ్డిని సత్కరిస్తున్న జవహర్ తదితరులు

అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గెలాక్సీ గ్రానైట్ అధినేత చలువాది బదరీనారాయణ, విజయకుమారరెడ్డి, జయప్రకాష్, సుబ్రహ్మణ్యాచారి, డాక్టర్ శారద, నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యవృత్తి ఎంతో విలువైనది

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి ఎంతో విలువైనదని డాక్టర్ శివకృష్ణ పేర్కొన్నారు. స్థానిక వీఐపీరోడ్డులోని శ్రీ చైతన్య ఐకాన్ అండ్ సీబ్యాచ్ స్కూలులో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ తాను శ్రీచైతన్య పూర్వ విద్యార్థి నేనని, వ్యవసాయ కుటుంబం నుంచి తాను వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు వైద్య వృత్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష, చైతన్య స్కూల్స్ ప్రిన్సిపాల్స్ జోసఫ్‌బాబు, శేషయ్య, పావని, ఆర్ఐ అనిల్ కుమార్, కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డీన్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శివకృష్ణ

## సద్దుమణిగిన బంగారువ్యాపారుల వివాదం

● ఎమ్మెల్యే దామచర్ల చొరవ

ఒంగోలు కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారుల మధ్య విబేధాలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. రెండు రోజుల క్రితం గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా ప్రసాద్, అలాగే మరో వ్యాపారి కొల్లిపల్లి సురేష్ మధ్య విబేధాలు చోటు చేసుకోవడంతో వ్యాపారులు రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో తాతా ప్రసాద్ నేతృత్వంలో ఒకరోజు బంగారు దుకాణాలు బంద్ ప్రకటించి నిరసన తెలియజేశారు. అయితే ఈ పంచాయితీ ఎమ్మెల్యే దామచర్ల వద్దకు చేరింది. వారిద్దరితో మాట్లాడిన ఎమ్మెల్యే సమన్వయం చేశారు. కలిసి పనిచేసుకోవాలని, విబేధాలు వీడాలని సూచించారు. ఈ సందర్భంగా వారిద్దరి చేత కరచాలనం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు తన నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. గురువారం ఉదయం కొండపిలో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. శుక్రవారం పుర మండలం గొట్టిపడియలో జరిగే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సభలో పాల్గొంటారు. శనివారం రాచర్ల మండలం జేపీచెరువులో పర్యటిస్తారు.

## 9న టైర్‌బంద్ నిర్వహించాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 9వతేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో రవాణా కార్మికులు టైర్‌బంద్ నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం తోట బ్రహ్మయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రవాణా కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. బీఎన్‌ఎస్‌ చట్టంలో 106ఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, నేషనల్‌హైవే పర్మిట్ వాహనాలకు డబుల్ డ్రైవర్ విధానంపై చర్యలు తీసుకోవాలన్నారు. సెన్సార్ సిస్టం ఎత్తివేయాలని కోరారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జాయింట్ స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్ అన్సారియాను శాలువతో సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసేలా చూడాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. కలెక్టర్‌గా ఏడాది కాలం పూర్తిచేసుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యల పరిష్కారం కోసం అన్నిశాఖల అధికారులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి వరకుమార్, సహాధ్యక్షుడు మసూర్‌అలీ, మోటా శ్రీనివాసరావు, సురేష్‌బాబు, ఏసురత్నం, శ్రీనివాసరావు, చెంచారావు, వంశీ, మల్లేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రజిత మానస, వసంత, ప్రసన్న, ప్రణతి, సుమతి, సరస్వతి, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## కుల ధ్రువీకరణపై విచారణ చేయాలి

ఒంగోలు కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ మాజీ ఐఏఎస్ అధికారి అరిమేటి విద్యాసాగర్, ఆయన కుటుంబ సభ్యులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సృష్టించి, మాజీ ఐపీఎస్ అధికారి ఏకేఖాన్ సహాయంతో తనపై అన్యాయంగా ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేయించారని న్యాయవాది ఏపీరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012లో తనపై కేసు నమోదు చేయగా, విద్యాసాగర్ పొందిన కుల ధ్రువీకరణ (ఎస్సీ) ప్రభుత్వ జీవో లేదని పేర్కొన్నారు. ఆ కుల ధ్రువీకరణ పత్రం సరైనది కాదని, దీంతో తాను న్యాయం కోసం లోకాయుక్తను ఆశ్రయించగా, ఒంగోలు కలెక్టర్ కార్యాలయానికి విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. అయితే పూర్వపు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ విచారణ జాప్యం చేశారన్నారు. 45 రోజుల్లో పూర్తి కావాల్సిన విచారణ రెండేళ్లు అయినా నేటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ప్రస్తుత కలెక్టర్ తమీమ్ అన్సారియా జేసీ గోపాలకృష్ణ విచారణ త్వరితగతిన పూర్తి చేసి వాస్తవాలను వెల్లడించాలని రమణ కోరారు.

## 20 నుంచి విద్యార్థులకు పోటీలు

చీమకుర్తి, జూలై1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భారత రాజ్యాంగం-కనీస అవగాహనపై ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న పోటీలను జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ నాయకులు ముండూరి రంగారావు కోరారు. చీమకుర్తి ఉన్నతపాఠశాలలో మంగళవారం కమిటీ సభ్యులు పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 22న సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన జూనియర్, సీనియర్ విభాగాల వారికి ఒంగోలులోని మీడియా కేమెరామెన్ అసోసియేషన్ కార్యాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కుమార్, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకృష్ణవర్మన్, కోటయ్య, పిన్నిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

నాగులుప్పలపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఎస్ఐ రజియా సుల్తానా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల, సైబర్ నేరాల మీద అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలల్లో తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పొలాల్లో వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం, జూలై1(ఆంధ్రజ్యోతి): కొప్పోలు పొలాల్లో అస్సాం రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ ఘటనను మంగళవారం ఒంగోలు తాలుకా పోలీసులు గుర్తించారు. మృతదేహం వద్ద దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా అస్సాంకు చెందిన గోలాప్‌జోరి (50)గా గుర్తించారు. అయితే మృతదేహం చేతులు, కాళ్లు పైకి లేపినట్లు ఉన్నాయి. దీంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి వారి బంధువులకు సమాచారం ఇచ్చారు.

## మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు : సీఐ

సంతనూతలపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. సోమవారం రాత్రి నిర్వహించిన తనిఖీలలో సంతనూతలపాడు గ్రామానికి చెందిన వినాల నాగరాజు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మద్యం మత్తులో ఆటో నడుపుతున్నాడని గమనించి అదుపులోకి తీసుకున్నారు. నాగరాజును కోర్టులో హాజరుపరచగా రూ.10వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. నిర్లక్ష్యంగా, పరిమితికి మించి గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారికి ఒక్కొక్కరికి రూ.50వేల జరిమానా కోర్టు విధించిందని చెప్పారు.

## ఉత్సాహంగా వనమహోత్సవం

మొక్కను నాటుతున్న హరిబాబు

సంతనూతలపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సిండికేట్ రైతుసేవ సహకార సొసైటీ ప్రాంగణంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు మొక్కలు నాటారు. సొసైటీ ఎండీ ఎం.శంకరప్రసాద్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఎన్.సురేంద్రబాబు, బొడ్డపాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు కందుల, అశోక్‌రెడ్డి, బోయలపల్లిలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

# ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి పేదకూ న్యాయం

### ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీలో ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి పేదకూ న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 13 వార్డు పూల సుబ్బయ్య కాలనీలో వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను మంగళవారం ఉదయం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 1వ తేదీన పింఛన్ రూ.4వేలు అందజేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణ, వక్కలగడ్డ మల్లికార్జున, సత్యనారాయణ, వెంకటరెడ్డి, మొరా వెంకటరెడ్డి, నాయకులు మౌలాలి, వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : వైసీపీ పాలనతో నెలకొన్న తీవ్ర సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 7వ వార్డు కొంగళవీడు రోడ్డులో మంగళవారం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి వృద్ధులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలకులు వృద్ధులను దారుణంగా మోసం చేశారన్నారు. రూ.1000 పెంచేందుకు జగన్‌రెడ్డికి నాలుగేళ్లు పట్టిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాగానే రూ.4వేల పింఛన్ అందజేశారన్నారు. ఓ పక్క సంక్షేమాన్ని, మరో పక్క అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం ఇది అని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ షానేషావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్యయాదవ్, బిల్లా రమేష్, తహసీల్దార్ ఆంజనేయ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రమణ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.4వేలు, రూ.6వేలు పింఛన్‌ను ప్రభుత్వం అందజేసోందని, దీంతో వృద్ధులు, దివ్యాంగుల్లో ఆనందం వెల్లువిరిస్తోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని బోయలపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేసిన ఎరిక్షన్‌బాబు స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, సర్పంచ్ పాలడుగు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు వేగినాటి సత్యనారాయణ, వెంకట కోటయ్య, పెరుమాళ్ల మల్లికార్జునరావు, మంత్రు నాయక్, సత్యనారాయణగౌడ్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, వీఆర్వో పెద్ద ఓబయ్య, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పొదిలి : ఎన్టీఆర్ భరసా పింఛన్‌ల పంపిణీని మండలంలో మంగళవారం ఆముదాలపల్లి గ్రామంలో ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు ప్రారంభించారు. సుమారు 90శాతం పంపిణీ పూర్తయినట్లు ఆయన తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు బుధవారం అందజేస్తారని చెప్పారు. టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు ఉదయం నుంచే గ్రామాల్లో పింఛన్‌లను పంపిణీ చేశారు.

### 5 నెలలుగా ఎమ్మెల్యే సొంత నిధులతో పింఛన్

కంభం : ప్రజా దర్బార్‌లో ఇచ్చిన హామీ మేరకు గత 5 నెలలుగా పింఛన్ మంజూరు కాని వృద్ధునికి ఎమ్మెల్యే సొంత డబ్బులు రూ.4వేలు స్థానిక టీడీపీ నాయకుల ద్వారా అందచేస్తున్నారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసులు రూ.4వేల పింఛన్‌ను మంగళవారం అందజేశారు.

ప్రభుత్వ డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## వైద్య వృత్తి ఎంతో గొప్పది

కంభం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జబ్బుల నుంచి ఉపశమనం, ప్రమాదాల నుంచి ప్రాణరక్షణ కల్పించే వైద్య వృత్తి ఈ భూమి మీద గొప్ప వృత్తి అని కంభం లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా కంభం ప్రభుత్వ వైద్యశాలలో పని చేసే వైద్యులను ఘనంగా సన్మానించారు. లయన్స్ అధ్యక్షుడు తన్నీరు బాలరంగారావు, కార్యదర్శి శిరిగిరి వెంకటరావు, కోశాధికారి వెంకటగుండయ్య, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ పులి శ్రీనివాసప్రసాద్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శిరీష ప్రియదర్శిని, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శివనాయక్, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ ఫణికిశోర్, డాక్టర్ పద్మావతిబాయి, డాక్టర్ శేఖర్‌నాయక్‌ను సన్మానించారు.

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో వైద్యులు మంగళవారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మాధవరావు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

కంభం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులకు పర్మిషన్ ఇస్తున్న ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీ పీ నాయకులు నరాల చెన్నారెడ్డి, రమణరెడ్డి మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కంభం ఎక్సైజ్ పరిధిలోని కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల పరిధిలో కంభం ఎక్సైజ్ సీఐ, మార్కాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు బెల్టుషాపుల నిర్వహించే వారితో చేతులు కలిపి మార్కాపురం డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాలలో బెల్టుషాపులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం అమ్మేవారికి అనుమతులు ఇచ్చారన్నారు. దీని వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని తెలిపారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

పొదిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నవ్యాంధ్ర దివ్యాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి అన్నారు. మంగళవారం జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో దివ్యాంగుల సంక్షేమశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సువార్తమ్మను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంవత్సర కాలంగా ట్రైసైకిళ్ల తయారీని నిలిపివేయడంతో జిల్లాలో అర్హులైన దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## జాగ్రత్తలతో డెంగీ నివారణ

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి డెంగీ జ్వరాన్ని నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేందర్ రెడ్డి అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా మంగళవారం బాలుర ఉన్నత పాఠశాల నుంచి మానవహారం, ర్యాలీ, సదస్సు నిర్వహించారు. డెంగీ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, దామోదర్ రెడ్డి, రమేష్, వైద్య సిబ్బంది కాశయ్య, సత్యనారాయణరాజు, ఆర్.శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదురు ఖాళీ ప్లేట్‌లతో భిక్షం అడుగుతున్నట్లుగా నిరసన తెలిపారు. జీతాలు పెంచకపోతే భిక్షమెత్తుకుని బతకాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. ఆప్కో జాబితాలో తమ పేర్లు ఉండడంతో ప్రభుత్వ పథకాలు తమకు అందడం లేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, రూబెన్, ఇమాంసా, సుబ్బారెడ్డి, సలాంఖాన్ పాల్గొన్నారు.

## 1 నుంచి 31 వరకు పోలీస్ యాక్ట్ అమలు

పొదిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జూలై 1 నుంచి 31వతేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ లక్ష్మీనారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, బహిరంగసభలు నిర్వహించకూడదని ఆయన తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా యాక్ట్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరు అనుమతులు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేయవద్దని ఆయన కోరారు.

## ప్రసవానికి వచ్చిన మహిళకు కుటుంబ సంక్షేమ ఆపరేషన్

ఎర్రగొండపాలెం రూరల్, జూలై (ఆంధ్రజ్యోతి) : పురిటి నొప్పులతో ప్రసవానికి వచ్చిన మహిళకు కుటుంబ సంక్షేమ ఆపరేషన్ చేసిన ఘటన మంగళవారం ఏరియా వైద్యశాలలో చోటుచేసుకుంది. నర్సాయపాలెంకు చెందిన పీ రిత్త ప్రసవానికి ఏరియా ఆసుపత్రిలో చేరింది. ఆపరేషన్ చేసి బిడ్డను తీసిన డాక్టర్ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కూడా చేశారని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ యాదిద్యదేవర వివరణ ఇస్తూ గర్భసంచిలో ఇన్‌ఫెక్షన్ ఉండడంతో కుటుంబ సభ్యుల ఆమోదంతోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసినట్లు తెలిపారు.

## పోయిన బంగారు ఆభరణాల అప్పగింత

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బంగారాన్ని పోలీసులు బాధితుడికి అప్పజెప్పిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండంలోని అయ్యంబోట్లపల్లికి చెందిన పెద్దపోగు కోటయ్య మే31వ తేదీన బ్యాంకులో బంగారం తాకట్టుపెట్టి లోన్ తీసుకునేందుకు ఎర్రగొండపాలెం వచ్చారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద కూల్‌డ్రింక్ తాగి బ్యాంక్‌కు వెళ్లి చూడగా బంగారం పోయినట్లు గుర్తించారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ పీ చౌడయ్య సిబ్బందితో కలసి ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. కోటయ్య కూల్‌డ్రింక్ తాగిన చోట కింద పడిపోయిన ఆభరణాలను మరో వ్యక్తి తీసుకెళ్లాడు. ఆ వ్యక్తి కూల్‌డ్రింక్ తాగి ఫోన్‌పే చేయడంతో ఆ నెంబర్ ద్వారా అతడిని పట్టుకొని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు కోటయ్యకు ఆభరణాలను అప్పజెప్పడంతో ఆయన ఎస్‌ఐ, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా వారాహి నవరాత్రి పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో వారాహి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, వరుణ్ తేజశర్మ జగదాంబ మాత మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జగదాంబ మాత ఉత్సవమూర్తికి ఆరోరోజు ధూమ్ర వారాహి అలంకారం నిర్వహించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈ దుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

## కుసుమ హరనాథబాబాకు పూజలు

గిద్దలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకుసుమ హరనాథ బాబా 160వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ మందిరంలో కుసుమ హరనాథులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. సామూహిక భజనలు, సంకీర్తనలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దద్దనాల ఆంజనేయ స్వామి ఆలయానికి బ్రేక్

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని దద్దనాల ఆంజనేయ స్వామి ఆలయ దర్శనానికి బ్రేక్ పడింది. ఈ ఆలయానికి వెళ్లే భక్తులకు ఎర్రగొండపాలెం అటవీ శాఖాధికారి ఎస్వీ సుబ్బారావు హెచ్చరికలను జారీ చేశారు. కేంద్ర పర్యావరణ, జాతీయ పెద్దపులుల సంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు జూలై 1 నుంచి సెప్టంబర్ 30వ తేదీ వరకు ఆలయానికి వేళ్లే భక్తులను రాకపోకలను నిలిపివేసినట్లు ఆయన మంగళవారం తెలిపారు. ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తప్పవని అన్నారు.

## సమ్మె నోటీసు అందజేత

గిద్దలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ఈనెల 9న కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెలో పాల్గొననున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమ్మె నోటీసు అందచేశారు. అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు స్వర్ణకుమారి, కార్యదర్శి మున్నా మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేకూర్చే కార్మిక లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని కోరారు. ఐసిడిఎస్ బలోపేతానికి అధిక నిధులు కేటాయించాలని, అంగన్‌వాడిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మె నోటీసులో పేర్కొన్నారు. గత సమ్మె కాలం ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 9న జరిగే సమ్మెలో అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలందరూ పాల్గొనాలని కోరారు.

## రంగారెడ్డికి ఘనంగా నివాళి

గిద్దలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ మాజీ మంత్రి, మాజీ స్పీకర్ అయిన పిడతల రంగారెడ్డి 34వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన స్మారక మందిరం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గానికి, రాష్ట్రానికి పిడతల రంగారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పోలిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, లెక్చరర్లు, వివిధ వర్గాల ప్రతినిధులు ఉన్నారు.

## 5న మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన జరిగే సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులతోపాటు సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని తెలిపారు. పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించండి

రాచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారులు షేక్ మొయినుద్దీన్, వి గిరిధర శర్మ అన్నారు. మండల కేంద్రమైన రాచర్లపేట ఎంపీపీ పాఠశాలను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే విధులకు వచ్చి కూడా ప్రయోజనం ఉండదన్నారు. ఉపాధ్యాయులు సమయానికి వస్తే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటారన్నారు. ప్రభుత్వ ఆశయాన్ని సఫలీకృతం చేయాలన్నారు. నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం, మౌలిక వసతుల కల్పన, రికార్డుల నిర్వహణ వాటిలో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు.

## వినియోగదారుల సంఘ సమావేశం

గిద్దలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సంఘ సమావేశం జరిగింది. ఈ సంఘం అధ్యక్షుడు వి.వీరారెడ్డి మాట్లాడుతూ కాశిరెడ్డి కుంటలో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలన్నీ వృథాగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరికరాలను కాశినాయన దేవాలయంలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత పిల్లలు, పెద్దలు వాటిని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రాచర్ల గేటు దగ్గర ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, తరచూ గేటు పడుతుండడం వలన ముఖ్యంగా అంబులెన్స్, 108 వాహనాలలో వెళ్లే రోగులకు ఇబ్బంది కలుగుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'సుపరిపాలనకు తొలి అడుగు'ను విజయవంతం చేయాలి

### ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలన ఏడాది అయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు మార్కాపురం వస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రజలకు చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూమి ఆన్‌లైన్ చేయాలని విజ్ఞప్తి

ఎర్రగొండపాలెం,జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాదంపల్లి గ్రామంలో సర్వే నెంబరు 429/1లో ఉన్న 1.35 ఎకరా భూమికి ఆన్‌లైన్ చేయాలని కన్నమనేని వెంకట రమణ అనే మహిళకు మంగళవారం తహసీల్దార్ మంజునాథరెడ్డికి అర్జీ అందజేశారు. ఆన్‌లైన్ కోసం ఐదేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల కిందట భర్త చనిపోతే పొలం నాపేరున ఆన్‌లైన్ చేయక పోవడంతో రైతు భరోసా అందలేదని తెలిపారు. ఇప్పటికైనా భూమికి ఆన్‌లైన్ చేసి నాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్వోతో విచారణ చేయించి ఆన్‌లైన్ చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. తన భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేశారని మార్తా కృష్ణారెడ్డి అర్జీ అందజేశారు. వీరాయిపాలెంలో తన భూమి ఆక్రమణకు గురైందని రైతు అర్జీ అందజేశారు.

## విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

పొదిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ, అడ్వాన్స్ ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియాలో 33వ ర్యాంక్ సాధించిన సోమిశెట్టి చక్రిని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. ర్యాంక్ రావడంతో ముంబయి ఐజీటీలో సీటు సాధించడంపై ఎమ్మెల్యే అభినందించారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

## భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది మందికి జీవనాధారం అయిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే సాగు, తాగునీరు సంబంధించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని, రాబోయే మార్కాపురం జిల్లాలో శ్రీశైలం, సున్నిపెంటలను కలపాలని గౌడ సంఘం నాయకులు సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటులో భాగంగా జరుగుతున్న అనేక విషయ సేకరణలో శ్రీశైలం, సున్నిపెంట లాంటి ప్రాంతాలను మార్కాపురంలో కలపాలన్నారు. సమగ్రమైన అవగాహనతో ఆలోచించి శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఐ.రంగస్వామి గౌడ్, డి.లక్ష్మయ్య గౌడ్, కె.నాగార్జున గౌడ్, విజయ్ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈనెల 2వ తేదీ బుధవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు శేషగిరి రావు ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రశాంత్‌నగర్, నరసింహ స్వామి మెట్ల ఏరియా, గణేష్‌నగర్, నరవరోడ్డు, పొట్టిశ్రీరాములు, కొప్పువారివీధి, గడ్డంవారివీధి, కొమరోలు బస్టాండ్ వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

# రైతన్నల గెలుపుకోసమే పొలం పిలుపు

- వారంలో రెండు రోజులు రైతుల వద్దకు అధికారులు
- ఎరువుల వాడకం, సస్యరక్షణపై అవగాహన

రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

త్రిపురాంతకం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన తెలుసుకునేలా సాగులో వారికి ఎదరయ్యే సమస్యల పరిష్కారం కోసం సూచనలు సలహాలు ఇచ్చేలా ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో పొలంపిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విత్తనం నాటే దగ్గరనుంచి మేలైన పద్ధతులు అవలంబించడం ద్వారా రైతులు అధికంగా దిగుబడులు సాధించేలా వ్యవసాయాధికారులు రైతుల చెంతకు వచ్చి వారికి సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ప్రకృతి సేద్యం, రసాయనిక ఎరువుల వాడకం, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు, బయో ఉత్పత్తులపై అవగాహన, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అధికారులు రైతులకు వివరిస్తున్నారు. వారంలో రెండు రోజుల పాటు మంగళ, బుధవారాల్లో నాలుగు గ్రామాల చొప్పున అంటే నెలకు 16 గ్రామాల్లో అధికారులు పొలంపిలుస్తోంది పేరుతో రైతుల వద్దకు వెళ్లి వారికి అవసరమైన సలహాలు అందిస్తారు. అధికారుల బృందంలో మండల వ్యవసాయాధికారి, ఉద్యాన శాఖ అధికారి, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉండి ఈ కార్యక్రమాన్ని రైతులకు ప్రయోజన కరంగా అమలు చేస్తున్నారు.

### విత్తన ఎంపిక కీలకం

రైతులు సాగుకు ముందుగా విత్తనాల ఎంపికలోనే చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు. విత్తన దుకాణాల్లో అనుమతులు ఉన్నచోట మాత్రమే కొనుగోలు చేయాలని, కొనేముందు లేబుల్ పరిశీలించటం, తప్పనిసరిగా రసీదు తీసుకోవడం, అవసరమైతే కొన్ని విత్తనాలను పక్కకు తీసి దాచిపెట్టడం వంటివి చేయాలని రైతులకు వివరిస్తున్నారు. రసీదులను, పక్కనపెట్టిన విత్తనాలను పంట చేతికి వచ్చేవరకు భద్రంగా ఉంచాలని తెలియజేస్తున్నారు.

### అధికంగా రసాయన ఎరువుల వాడకంతో నష్టం

ముఖ్యంగా ఈ కార్యక్రమంలో అధికారులు ఎరువుల వాడకంపై రైతులకు వివరిస్తున్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వినియోగం వల్ల నష్టం వాటిల్లుతుందని సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని తెలియజేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువుల వినియోగం తెలియజేస్తున్నారు. క్రిమి సంహారక మందులను అధికంగా పిచికారీ చేయడం వల్ల నేల కలుషితమై భూమిలో పోషకాలు తగ్గిపోయి పంట దిగుబడులు తగ్గుతాయని హెచ్చరిస్తున్నారు. ప్రకృతి సాగును ప్రోత్సహించటంలో భాగంగా జీవామృతం, బీజామృతం తయారీపై రైతులకు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం తొలు చేస్తున్న పథకాలు గురించి వారికి తెలియజేయటం చేస్తున్నారు.

### రైతులు హాజరుకావాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరం. సాగులో మెళకువలు తెలుసుకునేందుకు వారికున్న సందేహాల నివృత్తికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది. వారంలో రెండు రోజులు జరిగే కార్యక్రమం ఏ రోజు ఎక్కడ జరుగుతుందో ముందుగానే షెడ్యూల్ వేయటం జరిగింది. ఆ ప్రకారం రైతులు వారి గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలి.

బి.సంగమేశ్వరరెడ్డి, ఏవో

## జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ర్యాలీ

గిద్దలూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సబ్ డివిజన్ పరిధిలోని 4 సెక్షన్ల సిబ్బంది, అధికారులు పాల్గొనగా ర్యాలీ సెక్షన్ ఆఫీసు నుండి క్లబ్ రోడ్డు, రైల్వేస్టేషన్, మున్సిపల్ కార్యాలయం, పెద్దబజారు, పొట్టిశ్రీరాములు విగ్రహం నుంచి సబ్ డివిజన్ కార్యాలయం వరకు నిర్వహించారు. ర్యాలీలో సిబ్బంది భద్రత నియమాలు పాటించాలని కోరుతూ సూచనలు, నినాదాలు చేశారు.

### అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

దొనకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆపార్టీ సీనియర్ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మల్లంపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మల్లంపేట గ్రామం అభివృద్ధి బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆర్.వెంకటయ్య, మోడి వెంకటేశ్వర్లు, కామేపల్లి చెంచయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వల్లపునేని ఆదినారాయణ, మూడమంచు పరిటయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

దొనకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఆసంఘం అధ్యక్షురాలు పగిడిపోగు షాలమికుమారి అన్నారు. ఈక్రమంలో ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా దొనకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రమౌళికి ఆశ కార్యకర్తలు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. తమ డిమాండ్ల సాధనకై సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆశా కార్యకర్తల అధ్యక్షురాలు పగిడిపోగు షాలమికుమారి, కార్యదర్శి ఎండ్లూరి నాగేంద్రం, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా రమాదేవి బాధ్యతల స్వీకరణ

దొనకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ ఆరోగ్య సమస్యల కారణంగా గత రెండు నెలలు సెలవుపై వెళ్లిన రమాదేవి మంగళవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ దొనకొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు.

### రోడ్ల నాణ్యత పరిశీలన

తాళ్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మండలంలో పల్లెపండుగలో చేపట్టిన సీసీ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.3 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మాధవరం, కొత్తపాలెం, తాళ్లూరు తదితర గ్రామాల్లో యంత్రాలతో రోడ్డును తొలిచి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ ఎం.శివ ప్రసాద్, ఏఈ బి.రమేష్‌రెడ్డి, మండల ఏఈ వెంకటేశ్వర్లు, ఐశ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పరిశీలనలో వెల్లడయిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

### ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పామూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మానవుని మనుగడకు మొక్కలే జీవానోధారమని ఎంఈవో-1 పి.కోటిరెడ్డి అన్నారు. ప్రతిఒక్కరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ గుత్తి కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రవాణా రంగాన్ని కాపాడుకుందాం

పామూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మోటారు వెహికల్ చట్టంలో తగు మార్పులు చేయడంతో డ్రైవర్లకు జరిమానాలు, జైలు శిక్ష పడుతున్నాయని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన పామూరు ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ మండల రెండో మహాసభకు షేక్ నజీర్ అధ్యక్షత వహించారు. హనీఫ్ మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికి కేంద్ర సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి వారికి రక్షణ కల్పించాలన్నారు. ఈ నెల 9న జరిగే సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు కె.మాల్యాద్రి, దిండు సత్యనారాయణ, షేక్ నాయబ్‌రసూల్, బుజ్జి, షేక్ అల్లీబా, తదితరులు పాల్గొన్నారు,

### మండల సమావేశం మళ్లీ వాయిదా

సీఎస్‌పురం(పామూరు), జూలై 1(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం కూడా కోరంలేక వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో లెలిపారు. సోమవారం జరగాల్సి జనరల్‌బాడి సమావేశం కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశారు. ఎంపీపీ మాత్రమే హాజరు కావడంతో కోరం లేక మళ్లీ వాయిదా వేశారు. మరలా సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.

### హామీలను వెంటనే అమలుచేయాలి

ముండ్లమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్ధానాలను వెంటనే అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని శంకరాపురంలో మంగళవారం జరిగిన సీపీఎం శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణం జరిగేనా..!

- మూడేళ్ల క్రితం పాతది కూలిన వైనం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దొనకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): సాగర్ కెనాల్‌పై ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు నిర్మించిన వంతెన మూడేళ్ళ క్రితం కూలిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం దీనిగురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలకు చెందిన దాదాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్ కాలువకు అవతలివైపున ఉంది. దీంతో రాకపోకల నిమిత్తం దాదాపు 40 సంవత్సరాల క్రితం కాలువపై వంతెనను నిర్మించారు. 2022 ఫిబ్రవరిలో వంతెన కూలిపోవడంతో మూడేళ్లుగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు పడరాని పాట్లు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త వంతెన నిర్మాణం గురించి అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా వంతెన నిర్మాణంపై ఎటువంటి కదలిక లేకపోవటంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారు.

వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక కూలిన వంతెనపై నడిచి వెళ్లేందుకు నిచ్చెనలా కర్రలు ఏర్పాటుచేసుకొని ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఒకరిద్దరు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు ఉన్నాయి. పశుపోషకులు తప్పనిసరై పశువులను మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన గుండా ప్రతిరోజు వారి రాకపోకలు జరుపుకుంటున్నారు. సాగర్ కాలువలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తున్న సమయంలో కూలిన వంతెనపై నుంచి రాకపోకలు జరుపుకునేందుకు సాధ్యపడటంలేదు. కాలువలో నీటి ప్రవాహం తగ్గేవరకు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లటం తప్పడంలేదు. సాగర్ కాలువపై వంతెన నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో, తమ ఇబ్బందులు ఎప్పుడు తొలగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సాగర్‌కాలువపై నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చందవరం గ్రామానికి వెళ్లిన సమయంలో కూలిన వంతెనను పరిశీలించి ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకు న్నారు. వెంటనే వంతెన నిర్మాణంపై అధికారులతో అంచనాలు తయారు చేయించి కెనాల్‌పై వంతెన నిర్మాణ ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని ఆపార్టీ నాయకులు పేర్కొంటున్నారు. త్వరలో నిధులు మంజూరై నిర్మాణ పనులు జరుగుతాయని అంటున్నారు. దీంతో తమ ఇబ్బందులు తీరుతాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మూడేళ్ళ క్రితం సాగర్ కాలువపై కూలిన వంతెన

## సంక్షేమ పథకాల అమలుతో..

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

# పేదల ఇంట వెలుగులు

కనిగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుతో సీఎం చంద్రబాబు పేదల కళ్ళల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని శంఖవరం గ్రామంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా సీఎం చంద్రబాబు నెరవేరుస్తూ అమలు చేస్తున్నారన్నారు.

ఈసందర్భంగా శంఖవరం గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఎంతో భరోసా ఇస్తుందన్నారు. గత వైసీపీ పాలన ప్రచారానికి పరిమితమైందన్నారు. ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మున్సిపాల్టీ పరిధిలో మంగళవారం సాయంత్రానికి 94.2 శాతం మేర పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేసినట్టు ఇన్‌చార్జ్ కమిషనర్ తెలిపారు.

వృద్ధురాలికి పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

# పింఛన్లతో వృద్ధుల కళ్లలో ఆనందం

- మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పింఛన్లు వృద్ధులకు భరోసా ఇస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తెలిపారు. దర్శి పట్టణంలో మంగళవారం ఆయన వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా క్రమం తప్పకుండా 1వ తేదిన పింఛన్లు అందిస్తుండటంతో వృద్ధుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవణ్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతమైన పాలనను ప్రజలకు అందిస్తుందన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు, కౌన్సిలర్ నక్కా రంగా, మహమ్మద్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

**పామూరు:** పామూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంగళవారం జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాల్లో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. పింఛన్ పేదల జీవితాల్లో భరోసా కల్పిస్తుందని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో సర్పంచ్ వై.బాలతో కలిసి పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలో 90 శాతం పింఛన్‌లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు.

**పీసీపల్లి:** ఎన్టీఆర్ భరసా సామాజిక పింఛన్‌ల పంపిణీ పీసీపల్లి మండలంలో మంగళవారం 89.11 శాతం పూర్తయింది. మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత తదితర పింఛన్‌లకు సంబంధించి 4666 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 4158 మందికి మంగళవారం పింఛన్‌లు పంపిణీ చేశారు.

మండల ప్రత్యేక అధికారి పానకాలరావు పెద అలవలపాడులో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీడీ నాయకులు వారివారి గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీలో పాల్గొన్నారు.

దర్శిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య తదితరులు

# కౌలు రైతులు కార్డులు పొందాలి

కనిగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రతి కౌలు రైతు కార్డులు పొందాలని ఏవో జైనులాబ్దిన్ అన్నారు. మంగళవారం మండలంలోని గోసులవీడు, ఏరువారిపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కౌలుకు భూమి సాగు చేస్తున్న ప్రతిరైతు ఆగ్రామానికి చెందిన రెవిన్యూ అధికారితో కౌలు ధ్రువీకరణ పత్రాన్ని పొందాలన్నారు. కౌలు రైతు కార్డులు ఉన్నవారు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులన్నారు. కార్డులు పొందని రైతులకు పథకాలు వర్తించవన్నారు. ఉద్యాన ఏవో విష్ణుప్రియ మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్లను 90శాతం రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులు మాత్రం కేవలం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఉద్యానశాఖ ద్వారా పండ్లతోటలు, పూల మొక్కలు, కూరగాయలు సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు.

కాగా, ఏవోగా ఇటీవల బదిలీపై వచ్చిన షేక్ జైనులాబ్దిన్‌కు ఏడీఏగా అదనపు భాద్యతలు అప్పగిస్తూ జిల్లా అధికరులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు.

**పామూరు:** మండలంలో కౌలు రైతులు కార్డులు పొందాలని ఏవో టి.అబ్రహం లింకన్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతలపాలెం, బలిజపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కౌలురైతుల హక్కు పత్రాలను పొందాలని సూచించారు. కార్యక్రమాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏవో జైనులాబ్దిన్

# ‘నాణ్యతా ప్రమాణాలతో ఆధునికీకరణ పనులు’

ముండ్లమూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల ఆధునికీకరణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఎన్ఎస్‌పీ డీఈ పూర్ణచంద్ర, డీసీ ఛైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలోని మైనర్ కాలువలైన వేముల - 2, వేములబండ, మక్కెనవారిపాలెం, మారెళ్ళ, తూర్పుకంభంపాడు, పోలవరం -1, 2 కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ కాలువల ఆధునీకరణ పనుల్లో ఎక్కడా రాజీపడకుండా నాణ్యతా ప్రమణాలు పాటించాలన్నారు. చివరి భూములకు నీరు చేరటమే లక్ష్యంగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్టు చెప్పారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు నీరు అందించాలన్న లక్ష్యంతోనే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్టు చెప్పారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తే అవసరమైతే బిల్లులు నిలుపుదల చేయటం జరుగుతుందన్నారు. పనులు జరిగేంత వరకు కాలువలపై పర్యటిస్తామన్నారు. కార్యక్రమంలో జేఈలు కాంతి కుమార్, ప్రసాదు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించినా నోటీసులు

- పొదుపు మహిళల ఆందోళన

తాళ్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-1గ్రామ సంఘంలోని పొదుపు మహిళలు తీసుకున్న స్త్రీ నిధి బకాయిలు చెల్లించినా బాకీ ఉందంటూ మండల సమాఖ్య నోటీసులు ఇచ్చారు. దీంతో తాళ్లూరు కాలనీ పొదుపు మహిళలు మంగళవారం స్థానిక వెలుగుకార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కాలనీకి చెందిన ప్రసన్న పొదుపు గ్రూపులోని నలుగురు మహిళలు స్త్రీ నిధి రుణాలు తీసుకున్నారన్నారు. తాము తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తూ వీవోఏకు రసీదు కూడా పంపినట్టు వారు తెలిపారు. బకాయిపూర్తిగా చెల్లించినా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఒక్కొక్కరు రూ. 10,346ల బకాయి ఉన్నారని నోటీసులు ఇవ్వటం ఏమిటని సిబ్బందిని ప్రశ్నించారు. నిత్యం కూలీ నాలీ చేసుకుని జీవిస్తున్న తాము చెల్లించిన బాకీ తిరిగి తెమ్మంటే ఎక్కడి నుండి తెచ్చి చెల్లించాలని వాపోయారు. వీవోఏ అనూరాధకు బకాయి చెల్లించిన రసీదులు పంపినా తమ ఖాతాలో జమచేయకుండా తమకు అప్పుఉన్నట్లుగా చెప్పడమేమిటని ప్రశ్నించారు. దీనిపై మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎంసుజాత, ఏపీఎం దేవరాజ్‌లు రికార్డులు పరిశీలించి గ్రామ సంఘం ఆన్‌లైన్‌లో బకాయి ఉన్నట్టు చూపినందునే నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. రికార్డుల పరిశీలనలో స్త్రీ నిధికి జమచేయాల్సిన బకాయిని వీవోఏ సీఐఎఫ్‌కు జమ చేయటంవల్ల స్త్రీనిధి బకాయి పెండింగ్ ఉన్నట్టు గుర్తించారు. వీవోఏ చేసిన తప్పుకు తమ బాధ్యులన్ని చేసి నోటీసులు ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు.

వీవోఏ తనమకేమి సంబంధం లేదని, గతంలో పని చేసిన సీసీ కోటేశ్వరమ్మ చేసినట్లు చేశానని చెప్పటంతో దర్శిలో పనిచేస్తున్న కోటేశ్వరమ్మను పిలిపించి మాట్లాడారు. ఏపీఎం, మండల సమాఖ్య అధ్యక్షురాలు జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.



స్త్రీ నిధి బకాయిల దుర్వినియోగంపై విచారిస్తున్న అధికారులు

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీ

### విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

దర్శి, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా దర్శిలో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, విద్యుత్‌శాఖ ఈఈ పి.శ్రీనివాసులు, డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కరెంట్ ప్రజలకు ఎంత ఉపయోగమో, ఆదమరిస్తే అంతే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు. అక్రమ విద్యుత్ వాడకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులు కల్గితే తమ దృష్టికి తీసుకురావాలని ఈఈ స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇన్‌చార్జ్ ఎంఈవోగా కోటిరెడ్డి బాధ్యతల స్వీకరణ

పామూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పామూరు ఇన్‌చార్జ్ ఎంఈవో 1 గా పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న పి.కోటిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన డీవీ సుబ్బారావు ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. మార్కాపురం డిప్యూటీ ఈవో ఆధ్యర్యంలో కోటిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో -2 జి.కరణకుమారి, జిల్లా విద్యాధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు డి.రామిరెడ్డి, కనిగిరి ఎంఈవో2 యు.నారాయణ రెడ్డి, పీసీపల్లి ఎంఈవో1 ఆర్.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా మొహర్రం వేడుకలు నిర్వహించుకోవాలి

పామూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను భక్తి విశ్వాసాలతో జరుపుకోవాలని సీఐ ఎం. భీమానాయక్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మండలంలోని పీర్లచావిడి ముజావర్లతో శాంతి కమిటీ సమావేశం ఎస్ఐ టి.కిశోర్‌బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని మూడు పీర్లచావిడికి సంబంధించి శుక్రవారం గ్రామ ఉత్సవం జరిగే రూట్ మ్యాప్ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. సమయపాలన పాటించి ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ముజావర్లు పాల్గొన్నారు.

### శరత్‌పాల్ కుటుంబానికి అండగా ఉంటాం

ముండ్లమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని శరత్ పాల్ అనే బీటెక్ విద్యార్థి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ విద్యార్థి విగ్రహాన్ని తల్లిదండ్రులు నిర్మించగా మంగళవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శరత్ కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, మేడికొండ జయంతి, ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వేములబండలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఆవుల గౌతమ్ మృత దేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### మండల సర్వేయర్‌గా మహేష్‌బాబు బాధ్యతల స్వీకరణ

తాళ్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల సర్వేయర్‌గా ఎం.మహేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావును బాపట్ల జిల్లా అద్దంకి పట్టణ సర్వేయర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానయంలో రెగ్యులర్ సర్వేయర్‌గా బాపట్ల జిల్లా కొరిశపాడు మండల సర్వేయర్ మహేష్‌బాబును నియమించగా బాధ్యతలు స్వీకరించారు.

### బొద్దికూరపాడులో పర్యటించిన కేంద్ర బృందం

తాళ్లూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో బొద్దికూరపాడు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పర్యవేక్షణ కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. జి.సుధీర్, ఎం.ప్రశాంత్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, మురుగునీటి నిర్వహణ, తడి, పొడిచెత్త సక్రమ నిర్వహణ, మురుగుదొడ్ల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ ఎస్.వలి, సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ కన్సల్టెంట్ ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

### రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు

పీసిపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలను 50శాతం రాయితీతో అందజేస్తున్నట్టు ఏవో రంగాకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని నేరేడుపల్లి, పెద ఇర్లపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. పచ్చిరొట్టను భూమిలో కలియదున్నడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నగదు చెల్లించి పచ్చి రొట్ట విత్తనాలు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

పీసిపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 194, 195, 202, 209, 211 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సీహెచ్ ఉష మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల పరిధిలోని ఓటర్ల వివరాలను, వసతులను గురించి బీఎల్వోలను అడిగితెలుసుకున్నారు.

### వాహనాల తనిఖీ

ముండ్లమూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని తాళ్లూరు బస్టాండ్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ కె.కమలాకర్ వాహనాలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న వాహనాల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రతి వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బి.పవన్‌కుమార్, సిబ్బంది వెంకటనారాయణ, మహేష్, ప్రేమానిధి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముండ్లమూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం సబ్‌స్టేషన్ పరిధిలో నూజెండ్లపల్లి, భట్లపల్లి, తూర్పుకంభంపాడు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ పి.చినఅంకబాబు తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

## మోడల్ స్కూల్‌లో కోల్డ్‌వార్

- డిప్యూటీ ఈవో విచారణ

ముండ్లమూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇద్దరు ఉద్యోగుల మధ్య గత కొన్ని నెలలుగా వివాదం నెలకొంది. జిల్లా అధికారులకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు డిప్యూటీఈవో చంద్రమౌళేశ్వర్ మంగళవారం విచారణ చేపట్టారు. అందిన సమాచారం మేరకు.. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ కె. పూర్ణచంద్రరావు, పీడీగా పనిచేస్తున్న కొండారు రామారావు మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పీడీ రామారావు తన కాంట్రాక్టు ముగిసిందని మరలా విధులలో చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. తనకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని చెప్పటంతో డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని డిప్యూటీఈవో చంద్రమౌళేశ్వర్‌ను డీఈవో ఆదేశించారు. దీంతో ప్రిన్సిపాల్, పీడీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించారు. వారితో స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ విచారణలో ఎంఈవో కె.వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు.

## ఎంబీఏ అయితే హాస్టల్‌లో చేరాల్సిందే..

రాజధాని అమరావతి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి అక్కడ ఉన్న ఓ ప్రతిష్ఠాత్మక సంస్థలో ఎంబీఏలో చేరాడు. తొలి ఏడాదికి కోర్సు ఫీజు రూ.3.84 లక్షలకు సమ్మతిస్తూ ఆ విద్యార్థి రూ.10 వేలు అడ్మిషన్ ఫీజు చెల్లించాడు. ఇల్లు దగ్గరే కాబట్టి రోజూ కళాశాలకు వెళ్లి రావచ్చనుకున్నాడు. అయితే హాస్టల్‌లో చేరాలని, అందుకు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాను హాస్టల్‌లో చేరడమేమిటని ఆ విద్యార్థి వాపోతున్నాడు. డే స్కాలర్‌గా చదువుకుంటానని వేడుకున్నా వారు ఒప్పుకోలేదు. స్థానిక పెద్దలు ప్రశ్నించగా నిబంధనలు వర్తించవని యాజమాన్యం చెప్తోంది.

# హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

## రాజధాని విద్యార్థులపై.. ఫీజుల మోత

- స్థానికులన్నా హాస్టల్‌లో ఉండాలని మెలిక
- డే స్కాలర్ ప్రవేశాలకు అంగీకరించని ఓ విద్యా సంస్థ
- తమ భూముల్లో సంస్థను నడుపుతూ ఇదేమిటని రైతుల ఆగ్రహం



గుంటూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇది రాజధాని అమరావతి పరిధిలోని ఈ ఒక్క విద్యార్థి పరిస్థితే కాదు.. అందరిదీ. తమ సమీపంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.. దూరాభారం తగ్గుతుంది. పిల్లలు ఇళ్ల నుంచి వెళ్లి చదువుకుంటారు అని భావించిన తల్లిదండ్రుల ఆశలు నిరాశగా మారాయి. అడ్మిషన్ల నుంచి ఫీజుల రాయితీ వరకు అన్యాయం జరుగుతుందోని పలువురు వాపోతున్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతులు ఇచ్చిన భూమిలో 100 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వం కారు చౌకగా ఆ విద్యా సంస్థకు ఇచ్చింది. విద్యా సంస్థ రావడం ద్వారా రాజధానిలోని విద్యా ర్థులకు, చుట్టుపక్కల జిల్లాల వారికి విద్యావకాశాలు పెరుగుతాయని భావించింది. అయితే ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం మాటేమోగానీ ఇప్పుడు ఆ సంస్థ విద్యార్థుల నుంచి భారీగా ఆదాయాన్ని కోరుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. విద్యా సంస్థకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా హాస్టల్లోనే చేరాలని డిమాండ్ చేస్తోంది.గత ప్రభుత్వ హయాంలో కూడా ఫీజు రాయితీల విషయంలో సదరు విద్యా సంస్థ కఠినంగానే వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న ఒకరు రాజధానిలోని కొందరు విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వమని కోరగా, దాన్ని కూడా బుట్టదాఖలు చేసినట్లు రైతులు చెబు తున్నారు.

### పీ- 4 స్ఫూర్తికి దెబ్బ

ఇటీవల రాజధానిలోని ఓ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమానికి (మిగతా 6వ పేజీలో)

## హామీలెన్నో.. అమల్లో కొన్ని

- బాపట్లలో అదనపు సమ్మర్ స్టోరేజిట్యాంక్ నిర్మాణం ఏడాదిగా స్పష్టత లేదు. 2016 లో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించినా మెయిన్ పై పులైన్ ఏర్పాటు చేయలేదు. చందోలు నుంచి పొన్నూరు వెళ్లే రోడ్డును పునర్ నిర్మిస్తామని ధ్వంసం చేసి వదిలేశారు. సూర్యలంక అభివృద్ధి పనులు కార్యరూపం దాల్చలేదు.

- వేమూరు నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారుల దుస్థితిపై దృష్టి పెట్టలేదు. కొల్లూరు మండలం తాడిగిరిపాడులోని ఎత్తి పోతల పథకం పూర్తి కాలేదు. భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద చెక్‌డాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

- చీరాలలో హ్యాండ్‌లూమ్ పార్కు నిర్మా ణం, ఎత్తిపోతల మరమ్మతులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నివేశన స్థలాలు, గృహాల మంజూరు కల్పన జరగాల్సి ఉంది.

- పర్చూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు. వాడరేవు - పిడుగురాళ్ల హైవే నిర్మాణ పనులు సాగుతున్నాయి. తీవ్ర ఆందోళనలో ఉన్న బర్లీ రైతులకు ఉపశమనం కలిగిస్తూ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టారు.

- అద్దంకిలో అగ్రహారం భూముల సమస్యకు పరిష్కారం విషయంలో ఈ ప్రభుత్వంలోనూ రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ముంపు గ్రామాల సమస్య పరిష్కారం కొలిక్కిరాలేదు. కొరిశపాడు, భవనాసి రిజర్వాయర్ల పనులు కూడా అడుగు ముందుకు పడలేదు. నామ్ రోడ్డు బాధిత రైతులకు పరిహారం చెల్లింపులో తాత్సారం జరుగుతోంది.

- రేపల్లె పట్టణంలో వంద పడకల వైద్యశాలగా అభివృద్ధి హామీ అమలు కాలేదు. అరవపల్లి -లంకెవానిదిబ్బ, మోర్తోట -గంగడిపాలెం రహదారుల నిర్మాణం జరగలేదు. నిలిచిపోయిన టిడ్కో గృహాల నిర్మాణ పనులు చేపట్టేలేదు. నిజాంపట్నం హార్బర్‌ను మరింత అభివృద్ధి ప్రతిపాదనల దశలో ఉంది.

పెదపూడి-కూచిపూడి-అమృతలూరు ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి

# ప్రజల చెంతకు.. పాలకులు

చేసిన మంచిని వివరిస్తూ.. రాబోయే నాలుగేళ్లలో చేసే అభివృద్ధిని.. పనులను వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు పాలకులు ప్రజలను నేరుగా కలిసేందుకు సిద్ధమయ్యారు. కూటమి పాలనకు ఏడాది గడిచింది. గత వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలు తేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో గత వైసీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రజా పాలనకు తేడాలను వివరించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారు. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి బుధవారం నుంచి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేం దుకు నెల రోజుల కార్యక్రమం నిర్వహించేలా నేతలు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో నేతలతో పాటు కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజెప్పడంతో పాటు ప్రజల నుంచి సలహాలు స్వీకరించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 'చేసిన మంచి పనులు చెప్పుకోవాలి.. ఏ నాయకుడైనా ప్రజల్లోకి వెళ్లడానికి నామోషీపడకూడదు' అని చంద్రబాబు స్పష్టం చేయగా నేతలందరూ ప్రజలను ప్రత్యేకంగా కలిసేందుకు సమాయత్తమ య్యారు.

బాపట్ల : ఉప్పరపాలెంలో నిర్మించి నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

### నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు

- ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజాక్షేత్రంలోకి
- ఇంటింటికీ టీడీపీ పేరిట కార్యక్రమాలకు శ్రీకారం
- ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలూ భాగస్వామ్యం
- చేసిన మంచి వివరిస్తూ.. సమస్యలు తెలుసుకునేందుకు జనంలోకి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'సుపరిపాలనకు తొలి అడుగు' అంటూ ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రజలతో మమేకమవ్వడంతోపాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లేలా టీడీపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందించింది. ఈ ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గాల్లో చేపట్టబోయే పనులను ప్రజలకు వివరించి వారి స్పందన తెలుసుకోవడమే లక్ష్యంగా బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ పేరిట కార్యక్రమానికి అధికారపార్టీ శ్రీకారం చుట్టింది. చేసిన మంచి పనులను ప్రజలకు జెప్పాలని.. అదే సమయంలో (మిగతా 6వ పేజీలో)

## వారాహిదేవిగా శ్రీబగళాముఖి

పిట్లలవానిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారు శ్రీమత్స్య వారాహిదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని పసుపుకొమ్ములు, గజమాల, నాగవల్లి, పుష్పమాలలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీమత్స్య వారాహిదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు

## మోకాళ్లపై కార్మికుల నిరసన

బాపట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై వినూత్నంగా నిరసన తెలిపారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి కమిషనర్ జి.రఘునాథరెడ్డికి సమ్మె నోటీసు అందించారు. యూనియన్ అధ్యక్షుడు మురళి కృష్ణ మాట్లాడుతూ వాటర్, పార్కు, వెహికల్ డిపో, స్ట్రీట్‌లైటింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లోని కార్మికులతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

# చేతికి కంది ధరలేక..!

- కంది రైతు కంట నీరు
- కొనుగోళ్లు నిలిపివేసిన మార్క్‌ఫెడ్
- మార్కెట్‌లో పతనమైన ధర
- అమ్ముకోలేక అన్నదాతల అగచాట్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పండించిన కంది పంటను అమ్ముకోలేక అన్నదాతలు అల్లాడుతున్నారు. వేలాది క్వింటాళ్ల నిల్వలు లోగిళ్లలోనే ఉండిపోయాయి. ప్రభుత్వం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేసింది. మార్కెట్‌లో ధర పతనమైంది. దీంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ కూడా చేతులెత్తేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. కంది కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



### మార్కెట్‌లో ధర లేదు..

మార్కెట్‌లో కంది ధర పడిపోయింది. క్వింటా కందులు రూ 6,500 లోపే ఉందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించే పరిస్థితి (మిగతా 6వ పేజీలో)

# ఇంజనీరింగ్ సీట్లు 30,240

- ఉమ్మడి జిల్లా జాబితా విడుదల
- సెట్ అర్హత సాధించిన విద్యార్థులు 23,536
- అదనపు సీట్లు 6,700
- కౌన్సెలింగ్ ఆలస్యమైతే కళాశాలలకు నష్టం

గుంటూరు (విద్య) జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ సీట్ల జాబితాను సాంకేతిక విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. రెండు యూనివర్శిటీలు, 36 ఇంజనీరింగ్ కళాశాలల్లో 30,240 సీట్లు ఈ ఏడాది అందుబాటులోకి(ఇన్‌టెక్) రానున్నాయి. ఈ ఏడాది మేలో జరిగిన ఏపీ ఈఏపీ సెట్(ఎంసెట్) పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత నెల 8న విడుదలైన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 23,536 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తాజాగా సాంకేతి విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో సీట్లు 32,240 ఉన్నాయి. అంటే దాదాపు 6,700 సీట్లు అదనంగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

### కౌన్సెలింగ్ జాప్యం అయితే ఇబ్బందులే..

ఉమ్మడి జిల్లాలో ఏటా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ జాప్యం వల్ల భారీ స్థాయిలో సీట్లు (మిగతా 6వ పేజీలో)

# కరెంట్ తీగలపై బతుకు పోరు

- విద్యుత్ పనుల్లో ప్రమాదాలతో మరణాలు
- ఇటీవల విజయనగర్ కాలనీ వాసులు ఇద్దరి మృతి
- రక్షణ చర్యలపై పట్టని అధికారులు.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పాలకులు మారుతున్నా మారని కాలనీ వాసుల బతుకులు

విద్యుత్ తీగలపై వేలాడుతున్న కాకాణి శామ్యూల్ మృతదేహం (పాత చిత్రం)

విజయనగర్‌కాలనీ(చీరాల), జూలై 1 (ఆంధ్రజ్యోతి): చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీవాసుల బతుకులు కరెంట్ తీగలపై వేలాడుతున్నాయి. విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యానికి విద్యుత్ కార్మికులు బలవుతున్నారు. పనుల సమయంలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో వారు విద్యుత్ తీగలకు వేలాడుతున్నారు. విద్యుత్ పనులతో మనుగడ సాగుస్తున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గతంలో చీరాల మండల పరిధిలో పలు ప్రాంతాల నుంచి విద్యుత్ పనులపై ఆధారపడేవారు. ప్రమాదాలపై అవగాహన పొందిన అనేక మంది ఆ పనులకు దూరంగా ఉంటున్నారు. అయితే విజయనగర్ కాలనీవాసులు మాత్రం ఇప్ప టికీ ఆ పనులపైనే ఆధారపడి జీవనం సాగి స్తున్నారు. ప్రమాద సమయాల్లో అధికారులు, కాం ట్రాక్టర్‌లు బాధిత కుటుంబీకులతో బేరాలు చేస్తు న్నారే గాని ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించ డంలేదు. ఈ కారణంగానే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు.

### మారని బతుకులు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కాలనీవాసుల బతుకుల్లో మార్పు రావడం లేదు. విద్యుత్ కాంట్రాక్టర్లు పనుల సమయంలో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. పని చేసే వారికి సంబంధిత రక్షణ పరమైన పనిముట్లు అందజేయాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. ఫలితంగా కాలనీలో ఇప్పటికే ఇద్దరు వ్యృతి చెందగా మరో ఐదుగురు గాయాలతో శరీరంలో శక్తి కోల్పోయి జీవశ్చవాలుగా బతుకుబండి లాగుతున్నారు. 2022 అక్టోబరులో కాకాణి సామ్యేల్(45) మృతి చెందగా వారి కుటుంబసభ్యుల ఆందోళన చేయగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో తక్షణం కొంత ఆర్థికసాయం, కుటుంబంలో పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి హామీ మేరకు వైసీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ వారికి న్యాయం జరగలేదు.

### కుటుంబాన్ని ఆదుకోవాలి

ముగ్గురు కుమార్తెలతో బతుకు సాగదీస్తుండగా పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాం. అప్పటి వైసీపీ నేతలు ఆదుకుంటామని హామీ పత్రం అందజేశారు. అప్పటి మంత్రి చుట్టూ తిరిగితిరిగి కాళ్లు అరిగాయి. కూలీ నాలీ చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. కూటమి ప్రభుత్వమైన ఆదుకోవాలి.

- కాకాణి జయలక్ష్మి, సామ్యేల్ భార్య

# ఎండల తీవ్రత నుంచి ఉపశమనం

- చల్లబడిన వాతావరణం, పలుచోట్ల జల్లులు

ఒంగోలు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిని తలపించే రీతిలో ఉన్న ఎండల తీవ్రత నుంచి జిల్లా ప్రజలకు కాస్తంత ఉపశమనం లభించింది. జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడటంతో పాటు మంగళవారం చిరు జల్లులు పడ్డాయి. గతానికి భిన్నంగా ఈ ఏడాది రోహిణి కార్తెలో వర్షాలు కురిశాయి. అనంతరం వచ్చిన మృగశిర, ఆరుద్రకార్తెల్లో ఎండలు మండాయి. సాధారణంగా రుతువపనాలు విస్తరణతో ఆరుద్రకార్తె (ఈ సమయం)లో వర్షాలు పడాలి. అయితే గత నెల 22 నుంచి ఆరుద్రకార్తె రాగా నెలాఖరు వరకు ఎండలు మండాయి. జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో 38 నుంచి 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగైదు రోజులు వేడిగాలులు కూడా వీచాయి. ఆపై ఉక్కపోతతో ప్రజానీకం అవస్థలు పడ్డారు. అలాంటి వాతావరణం నుంచి సోమ, మంగళవారాల్లో మార్పు వచ్చింది. అత్యధిక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల దిగువకు రావడంతో పాటు మబ్బులు పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఒంగోలు అర్బన్ ప్రాంతంతో పాటు మద్దిపాడు, కొత్తపట్నం, ఎన్‌జిపాడు, సంతనూతలపాడు, వైపాలెం, దోర్నాల, పెద్దారవీడు, అర్థవీడు, రాచర్ల, గిద్దలూరు, కేకేమిట్ల, జరుగుమల్లి, చీమకుర్తి, దర్శి, కనిగిరి, దొనకొండ ప్రాంతాల్లో వాతవరణం చల్లబడటంతో పాటు చిరు జల్లులు పడ్డాయి.

దీంతో దాదాపు నెల రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోత వాతావరణంతో అవస్థలు పడుతున్న జిల్లా ప్రజానీకం తాజా వాతావరణ పరిస్థితితో కాస్తంత ఉపశమనం పొందింది.

ఒంగోలులో కురుస్తున్న జల్లులు

# మిద్దె మచ్చు పైనపడి బాలుడు మృతి

**ఇద్దరికి గాయాలు**

కురిచేడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం పడమర నాయుడు పాలెం పంచాయతీ వల్లెల యానాది కాలనీలో మంగళవారం సరదాగా ఆడుకుంటుండగా విషాద చోటుచేసుకుంది. చెట్టు, మిద్దెలు ఎక్కి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు పాత మిద్దె మచ్చు కూలి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

కాలనీలో బొజ్జా అంకారావు, బొజ్జా మూర్తెయ్య, బొజ్జా వెంకటేశ్వర్లు కుటుంబాలు నివాసం ఉంటున్నారు. అంకారావు కుమారుడు మహీధర్ (13) కుమారుడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. మధ్యాహ్నం పాఠశాల భోజన విరామ సమయంలో మహీధర్ తన స్నేహితులైన మల్లికార్జున, గంగా కార్తీక్‌లతో కలసి ఆటకు వెళ్ళాడు. వారి నివాసం ఉంటున్న గృహాలకు దగ్గరలో సేతు వెంకయ్య 20 సంవత్సరాల క్రితం నిర్మాణంలో ఉన్న గృహాన్ని సగంలో వదిలేసి త్రిపురాంతకం మండలం వెళ్ళాడు. ఆ ఇంటికి దగ్గరలో ఓ వేప చెట్టు కూడా ఉంది. ముగ్గురు స్నేహితులు చెట్టు ఎక్కి ఆడుకుంటూ నిర్మాణం ఆపిన ఇంటిపైకి ఎక్కాడు. మిద్దెకు శ్లాబ్ వేయకుండా మచ్చు మాత్రం నిర్మించి వదిలి వేశారు. ముగ్గురు పిల్లలు ఆడుకుంటూ ముచ్చమీద కూర్చొన్నారు. వీరి బరువుకు మచ్చు విరిగి పడింది. మచ్చు కింద మహీధర్ పడిపోగా, మల్లిర్జున, గంగాకర్తీక్‌లు చివరలో పడిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి ట్రాక్టరుతో కింద పడిన మచ్చును తొలగించారు. మచ్చు కింద పడిన మహీధర్ మృతి చెందగా మల్లికార్జున్, గంగా కార్తీక్ గాయపడ్డారు. కురిచేడు ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మల్లికార్జున్‌ను మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మహీధర్ మృతదేహానికి పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడి మృతితో మహీధర్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

# సంక్షోభంలోనూ మెరుగైన సంక్షేమం

- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి
- పొందూరులో అధికారులు, నాయకులతో కలిసి..

**పింఛన్ నగదు పంపిణీ చేసిన మంత్రి**

కొండపి(టంగుటూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గడిచిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా సంక్షోభంలోకి నెట్టినా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అన్ని సంక్షేమ కార్యక్రమాలను పేదలకు అందిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. టంటుగూరు మండలంలోని పొందూరు గ్రామంలో ఆయన మంగళవారం పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు కేంద్రం ప్రభుత్వం వాటా విడుదల చేసిన వెంటనే విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, టీడీపీ కొండపి నియోజకవర్గ పరిశీలకులు అడకా స్వాములు, టీడీపీ నాయకులు బెల్లం జయంతిబాబు, బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య ఆంధ్ర కూటమి లక్ష్యం**

ఆరోగ్య ఆంధ్ర కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. తూర్పు నాయుడుపాలెంలో మంళవారం క్షయ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన టీబీ ముక్తి భారత్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వామి మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీకి ఉచిత పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. టీబీ నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు.

# ప్రజల చెంతకు.. పాలకులు

(5వ పేజీ తరువాయి)

చేయలేకపోయిన పనులు ఎందుకు చేయలేదో వివరించాలని చంద్రబాబు ఇప్పటికే నేతలకు సూచించారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రేపోమాపో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరాలను అమలు చేయనున్నది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నో కష్టనష్టాల కోర్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తీరును నేతలు ప్రజలకు వివరించనున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ఎలా సాగాలన్న దానిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నేతలకు మార్గనిర్దేశనం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కరపత్రాలు కూడా ఆయా నియోజకవర్గాలకు మంగళవారం చేరాయి. బుధవారం ఉదయం నుంచే ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పరిధిలోని ఇళ్ల బాట పట్టనున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని, రాష్ట్రాన్ని గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రజల ముందుంచాలనే ఆదేశాలు నేతలకు వెలువడ్డాయి. ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు సమస్యలు చెప్పుకుంటే వాటిని సావధానంగా విని పరిష్కారం కోసం కృషి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధిష్ఠానం సూచించింది. ఏడాది వ్యవధిలో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఎన్నికలకు ముందు నేతలు ప్రధానంగా ఇచ్చిన హామీలు ఈ ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నేపథ్యంలో ప్రజల్లో చర్చకు రానున్నాయని, వాటిపై నేతలు కూడా సమగ్ర సమాచారం దగ్గర పెట్టుకోవాలని ఆదేశించింది. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని మై టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని సూచించింది. నెల రోజులు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, నేతలకు పిలుపిచ్చారు. కుటుంబ సాధికార సారథుల నుంచి పొలిట్ బ్యూరో సభ్యుల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**అక్కడక్కడ అసంతృప్తి**

బిల్లుల మంజూరు.. పనులు.. నామినేటెడ్ పదవుల విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. మన ప్రభుత్వం వచ్చింది పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయన్న విశ్వాసంతో అప్పులు చేసి మరీ సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గోకులాల నిర్మాణం తదితర పనులను పెద్దఎత్తున చేశారు. అయితే ఆయా బిల్లుల అంశాన్ని ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తే చూద్దాం.. చేద్దాంలే అంటున్నారని బాధిత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని, సొంతవారికి ఇలా మొండిచేయి చూపించడంపై నేతలు గుర్రుగా ఉన్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో రూ.154.46 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014 నుంచి 2018 వరకు టీడీపీ ప్రభుత్వం హయంలో కూడా పార్టీ నేతలు ఉపాధి పనులు చేసిన బిల్లుల చెల్లింపు నేటికి జరగలేదు. ఇలా పెద్ద ఎత్తున నష్టపోయిన నేతలు అసంతృప్తిలో ఉన్నారు. ప్రజాక్షేత్రానికి బయల్దేరిన ప్రజాప్రతినిధులు అసంతృప్తి నేతలపై దృష్టి సారించేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.

## ఆటోను ఢీకొన్న మోటార్‌సైకిలిస్టు

బాధితుడ్ని వైద్యశాలకు తరలింపునకు ఏర్పాట్లు చేసిన మంత్రి రవి

గాయపడ్డ యువకుడుని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న మంత్రి రవి

మేదరమెట్ల,జూలై1(ఆంధ్రజ్యోతి): ఆటోను మోటారుసైకిలిస్టు ఢీకొన్న ఘటన రావినూతల- మేదరమెట్ల రోడ్డులో మంగళవారం చోటుచేసుకొంది. ఈ ఘటనలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు కు చెందిన ఇస్తర్ల శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ సమయంలో దైవాలరావూరులో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని మేదరమెట్ల వైపు వెళ్తున్న మంత్రి రవికుమార్ ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఆగి క్షతగాత్రుడు శ్రీకాంత్‌ను వైద్యశాలకు తరలించేందుకు 108 కు ఫోన్ చేశారు. వాహనం అక్కడకు వచ్చి శ్రీకాంత్‌ను తీసుకు వెళ్ళేంతవరకు రవికుమార్ అక్కడే ఉండి పర్యవేక్షించారు. మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

ఇసుక రవాణా చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

చినగంజాం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, సోన పోరంబోకు భూములలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకొంటామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, ఎస్‌ఐ శీలం రమేష్‌లు హెచ్చరించారు. చినగంజాం గ్రామ సర్వే నెంబరు 829లోని సోన పోరంబోకు భూములలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న ప్రదేశాన్ని వారు మంగళవారం పరిశీలించారు. సోన పోరంబోకు భూములలో అక్రమ ఇసుక రవాణా జరుగకుండా కట్టలు(ట్రెంచ్) వేయించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములలో అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు, అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఐ బండారు దానియేలు, పోలీసులు పాల్గొన్నారు.

## శ్రీశైలాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లక్షలాది మందికి జీవనాధారం అయిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే సాగు, తాగునీరు సంబంధించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాబోయే మార్కాపురం జిల్లాలో శ్రీశైలం, సున్నిపెంటలను కలపాలని గౌడ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మార్కా పురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటులో భాగంగా జరుగుతున్న అనేక విషయ సేకరణలో శ్రీశైలం, సున్నిపెంట లాంటి ప్రాంతాలను మార్కాపురంలో కలపాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సులభతరంగా రేషన్ పంపిణీ

అవీఇవీ

**ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి**

బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణం ద్వారా రేషన్ సరుకులు సులభతరంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొంగళవీడు రోడ్డులో చౌకధరల దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.గతంలో ఆటోల ద్వారా రేషన్ పంపిణీ వలన పలువురు ఆ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియక పనులు మానుకుని మరీ వేచి చూసేవారన్నారు. ఆ ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేదలకు రేషన్ పంపిణీ సక్రమంగా అందించాలన్న ఉద్దేశ్యంతో డీలర్ల ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు రేషన్‌దుకాణం వద్ద బియ్యం తీసుకునేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణ, కౌన్సిలర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

## 4న డిప్యూటీ సీఎం వపన్‌కల్యాణ్ రాక

**ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్**

మార్కాపురం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పవన్‌కల్యాణ్ ఈనెల 4న మార్కాపురం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రానికి సమాచారం రావడంతో మంగళవారం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ త్రివినాగ్ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ గ్రామం వద్ద శిలాఫలకం ఆవిష్కరణ, జలజీవన్ మిషన్ పథకంలో మంజూరైన పనులను పవన్‌కల్యాణ్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. పట్టణ శివారు ప్రాంతంలోని బోడపాడు రోడ్డులో గల ప్లాట్లలో హెలీప్యాడ్ స్థలాన్ని, మార్కెట్ యార్డులో సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, నాయకులు పాల్గొన్నారు. బుధవారం కలెక్టర్ అన్సారియా స్థలాన్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.

## పంట సాగుదారు చట్టంతో చక్కని ప్రయోజనం

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పంట సాగుదారు చట్టంతో కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయని ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. చీరాల, వేటపాలెం మండలాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుదారు ధ్రువపత్రాలతో ప్రతి కౌలురైతుకు బ్యాంకు ద్వారా ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు. భూ యజమాని సాగులోని కౌలుదారులకు సహకరించాలన్నారు. తద్వారా యజమానులకు ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల కోటేశ్వరరావు, డీబీఆర్‌సీ ప్రతినిధి భగవాన్‌దాస్, సెక్రటరీ భారతి, లలిత, ప్రసన్న తదితర సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ

**డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డే నిర్వహణ**

డాక్టర్ ఫణీంద్రబాబును సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ నూతన అధ్యక్షుడిగా బాచిన శివధరపూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక క్రాంతి నర్సింగ్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఫణీంద్రబాబు, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మచౌదరిల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ ఫణీంద్రబాబు, డాక్టర్ ఖాజావలిలను సన్మానించారు. అకౌంటెంట్స్‌డే సందర్భంగా కోట శ్రీనివాసకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీసుధాకర్, మలాది శ్రీనివాసరావు,అలహరి హరిప్రసాద్, చామర్తి వెంకట గురుశేఖర్, మహ్మద్‌రఫీ, లేవి ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, దేవలపాలన, జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ ఖాజీవలి, సంకా బాబు, ఊటుకూరు రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యులకు రోటరీ సభ్యుల సత్కారం

మార్టూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): జాతీయవైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను పూలమాలతో, శాలువాలు కప్పి సత్కరించారు. ఆస్పత్రిలో వైద్యులుగా పనిచేస్తున్న అశోక్‌రెడ్డి, విష్ణుతేజ, కిషోర్ కుమార్, సాయి ప్రసాదరావు, గార్గేయి, సిద్దార్థ, సుబ్రమణ్యాంలను రోటరీ సభ్యులు సత్కరించారు. అనంతరం రోగులకు రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రవేటు వైద్యులు వి శ్రీనివాసరావు తదితరులను సత్కరించారు. అంతేగాకుండా జాతీయ చార్టర్డ్ అకౌంటు దినోత్సవం సందర్భంగా కె రాకేష్, వనజ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి సీహెచ్ నాగేశ్వర రావు, అసిస్టెంట్ గవర్నర్ ఆర్ అంకమ్మచౌదరి, మాజీ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, షేక్ కాజాహుస్సేన్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీకి 97శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు మంగళవారం 96శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. గత నెల 20న వాయిదా పడినపరీక్షను నిర్వహించారు. జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జరగ్గా 1015 మందికి 973మంది హాజరు కాగా 42మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 581మందికి 551, మధ్యాహ్న సెషన్‌లో 434మందికి 422 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో పేర్కొన్నారు.

## 8 కిలోలు గంజాయి పట్టివేత

- నిందితుడి అరెస్టు

ఒంగోలు క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో గల ఏబీఎం కాలేజి కాపౌండ్ వాల్ వద్ద అనుమానాస్పందగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 8 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.లీనా తెలిపారు. మంగళవారం నిర్వహించిన తనిఖీలలో భాగంగా చిత్తూరు జిల్లా నగిరి మండలానికి చెందిన ఎస్.మణిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అనకాపల్లి నుంచి నగిరికి గంజాయి తీసుకెళుతుండగా ఒంగోలులో రైలు దిగడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారిచామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు పి.రవిఆంజనేయులు, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ సీట్లు 30,240

(5వ పేజీ తరువాయి)

మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది ముందుగానే నోటిఫికేషన్ జారి చేసి కౌన్సెలింగ్ ప్రారంభించారు. అయితే ఈ ఏడాది వేర్వేరు కారణాల వల్ల నోటిఫికేషన్ ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఇందుకు మరో రెండు మూడు వారాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని సాంకేతిక విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అనేకమంది విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర జిల్లాల వైపు కూడా కొంతమంది వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భారీ సంఖ్యలో మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులందరూ.. కళాశాలలో చేరతారనే నమ్మకం కూడా లేదు. ప్రభుత్వం సత్వరం నోటిఫికేషన్ జారీ చేస్తే సీట్లు మిగులు తగ్గుతుందని యాజమాన్యాలు తొందరపడుతున్నాయి. కొన్ని పేరున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే 30 శాతం ఉన్న యాజమాన్య కోటా సీట్లు భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటాలో ఇక్కడ కూడా కెమికల్, మెకానికల్ సీట్లు భర్తీ కాలేదు. ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసి విద్యార్థులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అయితే ఏపీ ప్రభుత్వం ఇంకా ప్రక్రియ ప్రారంభం చేయకపోవడంపై యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సత్వరం నోటిఫికేషన్ జారీ చేసి, ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

## నాలుగు ట్రక్కుల వరిగడ్డి అందజేత



పశు గ్రాసం అందజేస్తున్న దాతలు

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ సమీపంలోని హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో ఆవులకు మంగళవారం గోపాలపురానికి చెందిన శింగమనేని నాగేశ్వరరావు, కోయ సాంబశివరావులు నాలుగు ట్రక్కుల వరిగడ్డిని అందజేశారు. మైలవరానికి చెందిన భీమని లక్ష్మయ్య, సయింపు పూర్ణచంద్రరావులు ఒక ట్రక్కు వరిగడ్డి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో గోశాల నిర్వహకుడు గోనుగుంట సుబ్బారావు, వాసు గురుస్వామి, వినుకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచే పీ- 4 కార్యక్రమం అమలు జరగాలన్నారు. రాజధానిలో ఏర్పాటైన ప్రతి విద్యాసంస్థ గ్రామానికి నలుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఈ సూచన చేసి రెండు నెలలు కూడా కాక ముందే ఆ పక్కనే ఉన్న మరో విద్యా సంస్థ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక కోర్సుతో మొదలైన ఈ విధానం ఆ తర్వాత అన్ని కోర్సులకూ విస్తరిస్తుందేమోనని, అన్ని విద్యాసంస్థలు అదే వైఖరిని చేపడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**స్థలాలు ఇచ్చిన రాష్ట్రానికి రాయితీ కరువు**

రాజధానిలో విద్యా సంస్థ నిర్మాణానికి వందల ఎకరాలు స్థలం కారుచౌకగా ఇచ్చిన రాష్ట్ర విద్యార్థులకు ఆ విద్యాసంస్థలో రాయితీ లేదు. 1 నుంచి 23 ర్యాంకులు సాధించిన వారికి ఫౌండర్ స్కాలర్‌షిప్ కింద నూరుశాతం, 24 నుంచి 68 ర్యాంకులు సాధించిన వారికి 100 శాతం మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. 69 నుంచి 5000 మధ్య ర్యాంకులు వచ్చినవారికి 90 శాతం, 5,001 నుంచి 13,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 75 శాతం, 13,001 నుంచి 23,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 50 శాతం, 23,001 నుంచి 30,000 మధ్య ర్యాంకులు వచ్చిన వారికి 25 శాతం ఈక్విటబుల్ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. అయితే రిప్రజంటేటివ్ రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదు. అంటే 68వ ర్యాంకు తరువాత వచ్చిన ఏపీలోని ఏ విద్యార్థికి ఈ రిప్రజంటేషన్ స్కాలర్‌షిప్ రాయితీ రావడం లేదు. దీంతో విద్యార్థులంతా మొత్తం ఫీజులు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

## హాస్టల్‌లో ఉంటేనే.. అడ్మిషన్

**ఇది న్యాయం కాదు**

రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని కూడా ఇలా హాస్టల్లో ఉండమని విద్యా సంస్థలు డిమాండ్ చేయడం న్యాయం కాదు. హాస్టల్లో ఉండాలా, వద్దా అనేది విద్యార్థి, అతడి కుటుంబం ఇష్టం. అదే ఊరి వారిని కూడా హాస్టల్లో ఉండమనడం మరీ విడ్డూరంగా ఉంది. విద్యా సంస్థ యాజమాన్యం దీనిపై ఆలోచించాలి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.

**: రాంబాబు, వెలగపూడి రైతు**

## చేతి'కంది'..ధర లేక..!

(5వ పేజీ తరువాయి)

లేదంటున్నారు. కంది క్వింటా మద్దతు ధర రూ.7,550గా ఉంది. పత్తి పంట సాగు చేసి ఏటా నష్టపోతున్న రైతులు.. ప్రత్యామ్నాయంగా కంది పెద్ద ఎత్తున సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం కంది సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేసింది. ప్రభుత్వ పోత్సాహం ఉండటంతో పాటు మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 66,273 ఎకరాల్లో కంది సాగు చేశారు. దిగుబడులూ అశాజనకంగా వచ్చాయి. అయితే.. మార్క్‌ఫెడ్ మొక్కుబడిగా కంది కొనుగోళ్లు చేసింది. రైతుల వద్ద వేలాది క్వింటాళ్లు నిల్వలు ఉన్నాయి. కందులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేరు. కంది పుచ్చే తత్వం అధికంగా ఉంటుంది. మార్కెట్‌లో విక్రయిద్దామంటే క్వింటా రూ.6,500 లోపే వ్యాపారులు అడుగుతున్నారని రైతులు అందోళ వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కంది నిల్వలంటినీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. తమను అదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**దళారులు తక్కువకు అడుగుతున్నారు**

కౌలుకు పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో దళారులు క్వింటా రూ.6,500కు కూడా కొనడం లేదు. ఎక్కువ కాలం ఇంటిలో కందులు నిల్వ చేయలేము. ప్రభుత్వం మద్దతు ధరకు రైతులు వద్ద ఉన్న కందులు కొనాలి.

**- గెల్లి యోగిరెడ్డి, తెలార్లపల్లి**

## సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

- పీడీసీసీ బ్యాంకు చైరన్ సీతారామయ్య

చీమకుర్తి, జూలై1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కోరారు. మంగళవారం చీమకుర్తి సహకార బ్యాంకును, మండలంలోని కేవీపాలెంలో సొసైటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారోత్సవాలను పుర స్కరించుకుని ఆయా సొసైటీల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. బ్యాంకు శాఖ పనితీరును పరిశీలించారు. రైతులకు బ్యాంకు, సొసైటీల ద్వారా మరింత సేవ చేసి వారి అభిమానాన్ని చూరగొనాలన్నారు. ఉద్యోగుల కు పలు సూచనలు చేశారు. కేవీపాలెంలో సాధారణ సమావేశానికి ఆయన హాజరయ్యారు.

## అవీ..ఇవీ..

### ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

గుంటుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

బల్లికురవ. జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు సరైన అవగాహనతో ముందుకు వెళ్లాలని ఏవో పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గుంటుపల్లి, బల్లికురవ గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ రైతులు ప్రణాళిక ప్రకారం వ్యవసాయం చేపట్టా లన్నారు. భూసార పరీక్షలు చేయించుకొన్న రైతులు వాటి ద్వారా వచ్చిన రిపోర్టుల ప్రకారం పంటలు సాగు చేసుకోవాలన్నారు. రైతులకు మినికంది విత్తనాల కిట్‌లు త్వరలో ఉచితంగా అందజేయనున్నట్లు తెలి పారు. సమావేశంలో ఏఈవో మౌలాలి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు మంత్రి చేతుల మీదుగా డ్రోన్ పంపిణీ**

బల్లికురవ మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ చేతుల మీదుగా వైదన గ్రామ రైతులకు డ్రోన్ పరికరాన్ని అందజేస్తామని ఏవో పి. శ్రీనివాసరావు తెలిపారు.

### పొగాకు సాగు చేయవద్దు

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి): రైతులు ఈ ఏడాది పొగాకు పంటసాగు చేయవద్దని అద్దంకి ఏడీఏ ఎప్రాయం అన్నారు. మండలంలోని వెంపరాల, చక్రాయపాలెంలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకును ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలన్నారు. రైతులు ప్రత్యామ్నాయంగా అపరాల సాగు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు పంటసాగు ధృవీకరణ పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొ ్రపాటి వెంకటకృష్ణ, శేషయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపాలి

● రైతులకు ఏవో భాస్కరరావు సూచన

ఎదుబాడు(పర్చూరు), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులు బర్లీ పొగాకు సాగుచేయవద్దని ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్న, జొన్న పంటలపై మొగ్గుచూపాలని వ్యవసాయాధికారి కె.భాస్కర్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని ఎదుబాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు రైతుల సమస్యపై ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుడుతోందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ ఏవిధంగా చేసుకోవాలని అన్న అంశంపై రైతులకు వివరించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వై.శ్రీకాంత్, ఎంపీఈవో లావణ్య సర్పంచ్ ఆళ్ల వెంకట్రావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

### రసాయన రహిత సాగుకు సిద్ధం కావాలి

పంగులూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రసాయన రహిత సాగు చేసేందుకు రైతులు సిద్ధం కావాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్న పంటను రైతులతో కలసి పరిశీలించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు, పచ్చిరొట్ట పంటల సాగు చేపట్టి పూతదశలో భూమిలో కలియదున్నాలన్నారు. తద్వారా భూసారం పెరుగుతుందని సూచించారు. పంటల బీమా పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధూళిపాళ్ల నారాయణస్వామి, వ్యవసాయ సహాయకురాలు శివాని పాల్గొన్నారు.

### పత్తి రైతులు బీమా నమోదు చేయించుకోవాలి

మాట్లాడుతున్న పర్చూరు ఏడీఏ ప్రవీణ

యద్దనపూడి, (మార్టూరు) జూలై1: ఆంధ్రజ్యోతి): పత్తిసాగు చేసే రైతులు పంటల బీమా నమోదు చేయించుకోవాలని పర్చూరు ఏడీఏ ప్రవీణ అన్నారు. మంగళవారం ఆమె యద్దనపూడి మండలంలోని యద్దనపూడి, యనమదల గ్రామాలలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిపంటసాగుచేసే రైతులు బ్యాంక్ రుణం తీసుకుంటే బ్యాంక్ లోనే బీమా ప్రీమియం తీసుకుంటారన్నారు. ఒక వేళ బ్యాంక్ రుణం తీసుకోని రైతులు మరియు కౌలు రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీ సేవా సెంటరులో ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.1900 బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. అందుకు తుదిగడువు ఈ నెల 15 వరకు తుది గడువన్నారు. ఏవో కుమారి మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పత్తి, శనగ, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న పంటలను సాగుచేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వీఏఏ వినయ్, నరేంద్ర, ఏఈవో మధుప్రియరైతులు సంగు చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు కేంద్రం ఏర్పాటుపై హర్షం

● ఆత్మస్థైర్యం నింపిందంటున్నరైతులు ● మండలంలో 1212 మంది సాగు

వరుసలో ఉంచిన పొగాకు బేళ్లతో రైతులు

పంగులూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు మార్కెట్ యార్డ్‌లో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో 1212 మంది రైతులు గత వ్యవసాయ సీజన్‌లో వేల ఎకరాలలో నల్లబర్లీ సాగు చేశారు. రైతుల వద్ద ఇంచుమించు 47,108 క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉన్నట్లు అధికారులు అంచనావేశారు. రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు జరగకపోవడంతో కష్టాలలో ఉన్న పొగాకు రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తమకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించడం బర్లీ పొగాకు రైతులలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. బర్లీ సాగుకు రైతులను ప్రోత్సహించిన కంపెనీ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి స్థైర్యం కోల్పోయిన రైతులకు ఈ కొనుగోలు కేంద్రాలు ధైర్యాన్ని నింపాయి. రైతువద్ద ఉన్న ఆఖరి పొగాకు బేలువరకు కొనుగోలు చేసి రైతును ఆదుకుంటామని, అండగా ఉంటామని ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు భరోసా ఇవ్వడంతో రైతులలో పొగాకు అమ్ముకోగలమనే నమ్మకాన్ని పెరిగింది. సోమ, మంగళ వారాలలో కొనుగోలు కేంద్రానికి పొగాకు బేళ్ల అమ్మకానికి తెచ్చిన రైతులు తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

**ప్రభుత్వం కొనకుంటే కోలుకొనే పరిస్థితి లేదు**

గత ఏడాది పొగాకు సాగు ఆశాజనకంగా ఉండడం, కొనుగోలుకు కంపెనీలు ఇచ్చిన భరోసాతో ఐదెకరాలలో నల్లబర్లీ సాగు చేశా. సాగును ప్రోత్సహించిన కంపెనీలు కొనుగోలుకు ముందుకురాలేదు. ఈ తరుణంలో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే కోలుకొనే పరిస్థితి లేదు.

**వై.పరుశురాం, రైతు, రాచపూడి, కొరిశపాడు మండలం**

**ప్రభుత్వ చర్యలతో జీవితంపై ఆశలు చిగురించాయి**

పొగాకు సాగు విషయంలో కంపెనీలు చెప్పిన మాటలు నమ్మి 11 ఎకరాలలో నల్లబర్లీ సాగు చేపట్టా. పంట చేతికందే సమయానికి కంపెనీ ప్రతినిధులు పంట కొనుగోలు చేయకుండా ముఖం చాటేశారు. అప్పుల బాధలు భరించలేక పొగాకు అమ్మకాల కోసం కంపెనీ చుట్టూ తిరగని రోజులేదు. కంపెనీ మాటలు నమ్మి మోసపోయానని అర్థమైంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకురావడం నాకు జీవితాన్ని ఇచ్చినట్లు అయ్యింది.

**కౌలురైతు నాయపాము రఘురాం, చందలూరు**

# పీహెచ్‌సీలో భయం భయం

**ఆరోగ్యకేంద్రం నలువైపులా దట్టంగా ఉన్న పిచ్చిమొక్కలు**

పీహెచ్‌సీ చుట్టూ దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

బల్లికురవ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్రతి నెల పరిశుభ్రం చేయిస్తున్నామని చెబుతున్న క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్దఎత్తున పిచ్చి మొక్కలు పెరిగిన అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో వైద్యం కోసం వచ్చే రోగులు దట్టంగా ఉన్న పిచ్చి చెట్లను చూసి భయాందోళన చెందుతున్నారు. వైద్యశాలలోనే ఇలా ఉంటే అంటువ్యాధులు ప్రబలవా..? అని వారు ప్రశ్నిస్తున్నారు.

బల్లికురవ మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. వైద్యశాల నలువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పాటు గోడలపైకి కూడా చెట్లు ఎగబాకాయి. దీంతో పీహెచ్‌సీలో దోమల బెడద కూడా అధికంగా ఉందని రోగులు వాపోతున్నారు. వైద్యశాల మాత్రం లోపల చాలా శుభ్రంగా ఉందని బయటకు వస్తే చూట్టుతా పనికి రాని పిచ్చి మొక్కలు చిట్టడవిని తలపించేలా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. వైద్యశాల ఆవరణ మెత్తం పారిశుధ్య పనులు చేయించాలని లేకుంటే ముందు భారీ వర్షాలు పడితే వైద్యశాలకు వచ్చే రోగులకు అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని వారు అంటున్నారు. అధికారులు కూడా ప్రతి నెల ఒక గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తున్నామని చెబుతున్న ఎక్కడ అమలు కావడం లేదని ఫోటోలు తీసి పంపడమే కాని క్షేత్రస్థాయిలో ఎక్కడ సరిగా పనిచేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో రోడ్లవెంబడి కూడా చెత్త రోజురోజుకు పేరకు పోతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి వెంటనే ప్రాథమిక అరోగ్య కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ గోడలపై ఎగబాకిన పిచ్చిమొక్కలు

# పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

ఇసుకదర్శిలో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు,జూలై1(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, పేద కుటుంబాలలోని మహిళలకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1వ తేదీనే పించన్లు పంపిణీ చేస్తూ అండగా నిలుస్తున్నారని, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం 1వ తేదీ కావడంతో మండలంలోని అన్నిగ్రామాలలో అధికారులు పెన్షనుదారుల ఇంటికి వెళ్లి వారికి పెన్షన్లను అందజేశారు. దీనిలో భాగంగా మండలంలోని ఇసుకదర్శి గ్రామంల అధికారులతో కలిసి పెన్షను దారుల ఇంటికి వెళ్లి వారికి పెన్షన్ నగదును అందజేశారు. గ్రామంలోని అర్హులైన వారికి త్వరలోనే కొత్త పెన్షన్లును ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రతి నెలా 1వతేదీ ప్రజలకు పెన్షన్లను అందచేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలపై నాయకులతో మాట్లాడారు. ఆయన వెంట పెన్షన్లు పంపిణీలో పాల్గొన్న పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణ చేతుల మీదగా కొంతమందికి పెన్షన్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, పాలెపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**

పర్చూరు : విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు, కారంచేడు ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టిన జీవీ.చౌదరి, ఖాదర్‌బాషా మంగళవారం మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరిని మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ నేరనియంత్రణలు, చోరీలు, శాంతిభద్రతల నిర్వహణలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

### పచ్చిరొట్ట పంటల సాగుకు రైతులు మొగ్గు

● భూములలో తగ్గిపోతున్న సేంద్రియ కర్బనం

పచ్చిరొట్టగా మినుమును కలియదున్నుతున్న రైతు

అద్దంకి,జూలై 1(ఆంధ్రజ్యోతి): పంట భూములలో సేంద్రియ కర్బనం నానాటికి తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పచ్చిరొట్ట పైర్ల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సాహకంగా రైతులకు రాయితీపై పచ్చిరొట్ట పంటల విత్తనాలు అందజేస్తోంది. అత్యధిక శాతం భూములలో ఏటా ఒకేరకమైన పంట సాగు చేపడుతున్నారు. దీంతో సమతుల్యత లోపించే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో పచ్చిరొట్ట పంటలు సాగుచేసి దుక్కిలో కలిసి పోయేలా దున్నుతున్నారు. పచ్చిరొట్ట ఎరువులుగా మారే మినుము, జీలుగ, పెసర, జనుము తదితర పంటలు సాగు చేస్తున్నారు. తద్వారా కాంప్లెక్స్ ఎరవుల వినియోగం తగ్గే అవకాశం ఉంది. రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఏవో వెంకటకృష్ణ తెలిపారు.

### ఘనంగా ఎస్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవం

చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్ రాజేష్

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఎస్‌బీఐ(మెయిన్), ఎస్‌బీఐ(ఏడీబి) శాఖలలో నిర్వహించారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో చీఫ్ మేనేజర్ రాజేష్ కేక్ కట్ చేశారు. ఖాతాదారులు ఇద్దరు మృతిచెందిన నేపథ్యంలో ఆ కుటుంబసభ్యులకు రెండు లక్షల రూపాయల చొప్పున బీమా పరిహారం చెక్కులు అందజేశారు. కార్య క్రమంలో వసంతకుమార్, అరవింద్, నరశింహరావు, రవితేజ, మస్తాన్‌రావు, పార్వతి, కిరణ్‌కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు బల్లికురవకు మంత్రి రవికుమార్ రాక

పంపిణీకి సిద్ధంగా ఉన్న తోపుడు బండ్లు

బల్లికురవ. జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నేడు బల్లికురవ గ్రామంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా బల్లికురవ గ్రామంలో ఇంటింటికి మంత్రి రవికుమార్ తిరిగి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలు తెలియజేయనున్నారు. అనంతరం చిరువ్యాపారులకు మంత్రి రవికుమార్ చేయుతతో తయారు చేయించిన తోపుడు బండ్లను అయన పంపిణీ చేయనున్నారు.

### చెత్త తొలగింపునకు చర్యలు

రోడ్డు వెంబడి ఉన్న చెత్తను యంత్రంతో తీయిస్తున్న అధికారులు

బల్లికురవ. జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం బల్లికురవ నుంచి చెన్నుపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో పెద్దగుంటను తీయించి గ్రామంలో ఉన్న చెత్తను గోతిలో ట్రాక్టర్ల ద్వారా తెచ్చి పడవేయించారు. గ్రామంలో ఎక్కడ చెత్త అనేది కనిపించకుండా చర్యలు చేపడతామని ప్రజలు కూడా తమకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుమతి, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న, డిజిటల్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### మోకాళ్లపై ఇంజనీరింగ్ కార్మికులు నిరసన

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

చీరాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం చీరాల మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మోకాళ్లపై నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిమటా వీరస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనబాట పట్టినట్లు వివరించారు. సమానపనికి సమాన వేతనం అందించాలని, గత ప్రభుత్వ హయాంలో 17 రోజుల సమ్మెకు సంబంధించిన జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సురేష్, చాంద్‌బాషా, కొండయ్య, కాంతారావు, క్రాంతి, విశ్వేశ్వరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

### యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై జనార్థన్

పందిళ్లపల్లి(చీరాల), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : యుక్తవయసు విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని వేటపాలెం ఎస్సై జనార్దన్ అన్నారు. మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 'సమాజంలో మోసపూరిత అంశాలు - అప్రమత్తం'పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీనేజీలో యువత ఆకర్షణకు లోనుకాకూడదన్నారు. ఈక్రమంలో తల్లిదండ్రులు శ్రమించి విద్యాబుద్ధులు నేర్పేందుకు పాటుపడుతున్న సమయాలను గుర్తుచేసుకుని భద్రంగా ఉండాలన్నారు. సామాజిక మధ్యమాలకు వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితరాలతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు 1930ను సంప్రదించి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆటోను వెనుక నుంచి ఢీకొన్న కారు

మార్టూరు, జూలై1(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న టాటాఏస్ వాహనాన్ని వెనుకనుంచి కారు ఢీకొన్న ఘటన జాతీయరహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం వేకువజామున చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవరు కొమెరా రవి, కారు డ్రైవరు మండరం రేవంత్‌లు గాయపడ్డారు. మార్టూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన ఆటో ఉలవపాడు వెళుతుండగా, నెల్లూరుజిల్లా, బుచ్చిరెడ్డి పాలేనికి చెందిన కారు ముందువెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. ఘటనలో డ్రైవర్లు ఇద్దరు గాయపడడంతో 108 వాహనంలో చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా హైవేపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలను సిబ్బంది తొలగించారు. పోలీసులు విచారిస్తున్నారు.

### బధిర విద్యార్థులకు స్వీట్లు పంపిణీ


స్వీట్లు అందజేస్తున్న కరూర్ వైశ్యబ్యాంక్ మేనేజర్ కేశవబాబు, సిబ్బంది

అద్దంకి, జూలై1 (ఆంధ్రజ్యోతి): కరూర్ వైశ్యబ్యాంక్ 109వ ఆవిర్భావ దినోత్సవము సందర్భంగా స్థానిక శింగరకొండ రోడ్డు లోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కేశవబాబు, పాఠశాల నిర్వహకులు పూనూరి ఆరోగ్యం, సురేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం

అద్దంకి, జూలై1(ఆంధ్రజ్యోతి): అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

### అద్దంకి ఎంఈవో-2గా శ్రీనివాసరావు బాధ్యతలు

అద్దంకి,జూలై1(ఆంధ్రజ్యోతి):అద్దంకి ఎంఈఓ2 గా ఏ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ2 గా విధులు నిర్వహించిన సుధాకరరావు సోమవారం ఉద్యోగ విరమణ చేయటం తో ఇంకొల్లు ఎంఈఓ 2 గా ఉన్న శ్రీనివాసరావు కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు ను ఏపిటీఎఫ్, యుటిఎఫ్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పండుగ శోభ!

మరో నాలుగురోజుల్లో రొట్టెలపండుగ ప్రారంభం కాబోతోంది. ఈలోపు పండుగ వేదిక అయిన బారాషహీద్ దర్గా, స్వర్ణాలచెరువు వద్ద ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. దర్గా, ముఖద్వారాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణ నగరవాసులను ఆకట్టుకుంటోంది. మరోవైపు మొహర్రం నెల ప్రారంభం కావడంతో యాత్రికుల రాక మొదలైంది. వచ్చినవారు చెరువులో స్నానమాచరించి, రొట్టెలు మార్చుకుంటున్నారు. ఇక దర్గాలో బారాషహీదులను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

ముఖద్వారాల వద్ద విద్యుద్దీప అలంకరణ

● నెల పాటు నిర్వహణ ● ఏడాది సుపరిపాలనపై వివరాలు సేకరణ

● సలహాలు, సూచనలు ప్రత్యేక యాప్‌లో నమోదు ● అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం

# నేటినుంచి జనంలోకి టీడీపీ

కందుకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తలపెడుతున్న 'సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ' కార్యక్రమం జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రారంభంకానుంది. నెలరోజుల వ్యవధిలో ప్రతి ఇంటికీ పార్టీ నాయకులు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించటంతోపాటు ఏడాదికాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తారు. ప్రతినెలా 1వ తేదీన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్లు వారి ఇంటివద్దనే అందజేస్తున్న తీరు, ఇటీవల తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఎంతమంది బిడ్డలు ఉన్నా అందరికీ రూ.13వేల చొప్పున తల్లుల ఖాతాలకు జమ, దీపం పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయటం వంటివాటిని వివరించనున్నారు. అలాగే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్న వైనాన్ని కూడా ప్రజలకు వివరిస్తారు.

**మండలస్థాయిలో ఇన్చార్జులు**

ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఇంటింటా సమర్థవంతంగా నిర్వహించే బాధ్యతను టీడీపీ మండల కమిటీల బాధ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, ప్రతి 30 ఇళ్లకు నియమించిన ఒక కేఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించేలా టీడీపీ అధిష్ఠానం రూపకల్పన చేసింది. బాధ్యులందరికీ వారి మొబైళ్లలో ప్రత్యేక యాప్‌ను డౌన్‌లోడ్ చేసింది. 'మై టీడీపీ యాప్'లో కేవలం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు మాత్రమే ఆపరేట్ చేయగలిగేలా వారు ఒక్కొక్కరు ఐదుగురి కేఎస్ఎస్‌లకి ఏకకాలంలో ఆ యాప్‌ను అందించగలిగేలా సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఒక్కో ఇంటివద్దకు వెళ్లాక కేఎస్ఎస్‌లు ఆ ఇంటిముందు నిలబడి ఫొటోతీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ ఇంటికి సంబంధించిన వివరాలన్నీ ఓపెన్ అవుతాయి. ఆ వివరాల ఆధారంగా ఆ ఇంట్లో ఎంతమందికి ఎన్టీఆర్ భరోసా ఫించన్ వస్తోంది, ఎంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ అయింది, ఇప్పటివరకు ఎన్ని సిలిండర్లకు సబ్సిడీ నగదు జమ అయింది వివరించటంతోపాటు మరే ఇతర ప్రభుత్వ పథకాల ద్వారానైనా ఆ కుటుంబానికి లబ్ధి చేకూరి ఉంటే ఆ వివరాలను కూడా వివరించనున్నారు. అలాగే ఏడాదికాలంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను కూడా కేఎస్ఎస్‌లు ఇంటింటా వివరించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయం, సూచనలను స్వీకకరించా ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతి ఇంటికీ ఇన్చార్జులు వెళ్లి ఫొటోతీస్తేనే ఆ ఇంటి సర్వే పూర్తయినట్లు సాఫ్ట్‌వేర్ నిర్ధారించేలా ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. అలాగే ప్రతి ఇంటివద్ద కనీసం మూడు నిమిషాలు ఉంటేనే మరో ఇంటి ఫొటోతీసేందుకు ఆ యాప్ అనుమతిస్తుంది. అంటే వీరు ప్రతి ఇంటికీ తప్పకుండా వెళ్లాల్సిందే. ఆ ఇంట్లో వారితో మాట్లాడి వారు చెప్పే వివరాలు అప్‌లోడ్ చేస్తే తప్ప మరో ఇంటికి వెళ్లే అవకాశం లేదు. ఈ మొత్తం కార్యక్రమాన్ని నెలరోజుల్లో పూర్తిచేసేలా రూపకల్పన చేశారు.

రొట్టెల పండుగ ఆహ్వాన వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

# రొట్టెల పండుగను విజయవంతం చేయండి

మంత్రి పొంగూరు నారాయణ ● బారాషహీద్ దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఖాదర్‌బాషా

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగను విజయవంతం చేసి అందరికీ మంచిపేరు తేవాలని బారాషహీద్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యులకు పురపాలక మంత్రి పొంగూరు నారాయణ సూచించారు. మంగళవారం రాత్రి బారాషహీద్ దర్గాలో నూతన ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, సభ్యులతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రొట్టెల పండుగకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఉత్సవ కమిటీ చిత్తశుద్ధితో సేవలు అందించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువ మంది భక్తులు రొట్టెల పండుగకు వస్తారని అందుకు అనుగుణం గా అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగ ఆహ్వాన పోస్టర్లు ఆవిష్కరించారు.

పెండ్లి కుమార్తెగా ద్రౌపదీదేవి

## వైభవంగా ద్రౌపదీ కల్యాణం

నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన బకాసుర వధ ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

- వివరాలు 8లో...

## సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తి

● 533 మందికి స్థానచలనం

- వివరాలు 8లో...

**పశువులపై థైలీరియా ప్రభావం**

# మినీ.. ఇక మెయిన్

● అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

● ఉన్నవారికి అదనం.. కొత్తవారికి కొలువు

● జిల్లాలో 229 మినీ అంగన్‌వాడీలకు ప్రయోజనం

నెల్లూరు (హరనాథపురం); జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్ వాడీలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఎన్నికల హామీలఅమలులో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని 229 మినీ అంగన్‌వాడీలకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో ఇప్పటికే 2705 ప్రధాన, 229 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఈ కేంద్రాలలో ఆరు నెలల నుంచి ఒక ఏడాది వయసున్న పిల్లలు 13,987 మంది నమోదై ఉన్నారు. 50,965 మంది పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణులకు ఈ సెంటర్ల ద్వారా అంగన్‌వాడీలు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు.

● **పెరగనున్న జీతాలు**

ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రస్తుతం నెలకు రూ.11,500 వేతనం ఇస్తుండగా, మినీ అంగన్‌వాడీలకు కేవలం రూ.7500 మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో మినీ కేంద్రాల్లో ప్రస్తుతం పని చేస్తున్న 229 మందికి ఇకపై రూ.11,500 ప్రకారం జీతం అందనుంది. అంటే.. ఒకేసారి వీరికి ఒక్కొక్కరికి రూ.4 వేల మేర వేతనాలు పెరగనున్నాయి.

● **229 పోస్టుల భర్తీ**

మినీ అంగన్‌వాడీల్లో కేవలం కార్యకర్త మాత్రమే ఉంటారు. అయితే ఇప్పుడు మెయిన్ అంగన్ వాడీ కేంద్రాలుగా మారుతున్న తరుణంలో సహాయకుల(ఆయాలు)ను నియమించేందుకు ప్రకటన కూడా వెలువడనుంది. దీంతో జిల్లాలో 229 మంది మహిళలకు ఉపాధి లభించనుంది. అంగన్‌వాడీకార్యకర్తల భర్తీకి చర్యలు చేపట్టనున్నారు. కార్యకర్తల సర్వీసు ఆధారంగా గ్రాట్యుటీ అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం కూడా తీసుకుంది. దీంతో మినీ కేంద్రాల అంగన్‌వాడీలకు ప్రోత్సాహంతో పాటు, బాలల వికాసానికి తోడ్పాటు కలగనుంది. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియకు చర్యలు ప్రారంభిస్తామని చెప్పారు.

# నాకు సంబంధం లేదు!

● పోలీసు విచారణలో కాకాణి సమాధానాలు

నెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : 'కృష్ణపట్నం పోర్టు వద్ద ట్రాన్స్‌పోర్టర్ల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసిన వ్యవహారంతో నాకు సంబంధం లేదు.. మీరు చెబుతున్న వ్యక్తులెవరో నాకు తెలియదు.. రాజకీయ కక్షతో నాపై అక్రమ కేసులు బనాయించారు.' ఇవీ అక్రమ టోల్‌గేట్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన సమాధానాలు. ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో పోలీసులు రెండో రోజు కూడా కాకాణిని విచారించారు. నెల్లూరులోని పీటీసీలో పోర్టు సీఐ రవినాయక్, ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డిలు పలు ప్రశ్నలకు కాకాణి ముందుంచారు. ట్రాన్స్‌పోర్టర్ల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యక్తులతో మీకు ఎటువంటి సంబంధం ఉందని పోలీసులు ప్రశ్నించగా.. అసలు వారెవరో తనకు తెలియదని కాకాణి సమాధానమిచ్చారు. ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్‌లో వైసీపీ నాయకులు భాగస్వాములుగా ఉన్నారుగా అని పోలీసులు ప్రశ్నించగా.. ఎవరెవరు ఎటువంటి వ్యాపారాలు చేస్తారో తనకెలా తెలుస్తుందని సమాధానమిచ్చారు. ఈ కేసులోని కొందరు నిందితులను విచారించిన సమయంలో మీరు వారితో కలిసి చెక్‌పోస్టులను సందర్శించినట్లు స్టేట్‌మెంట్ ఇచ్చారని, దీనికి ఏం సమాధానం చెబుతారంటూ పోలీసులు కాకాణిని అడగ్గా.. ఎవరో ఇచ్చిన స్టేట్‌మెంట్లపై తాను వ్యాఖ్యానించనని, సాంకేతికంగా తన పాత్రను రుజువు చేయాలంటూ కాకాణి రాతపూర్వకంగా పోలీసులకు సమాధానమిచ్చారు. రెండు రోజుల కస్టడీ ముగియడంతో కాకాణిని తిరిగి జైలులో అప్పగించారు.

# పెన్నా నదిలో దర్జాగా రోడ్డు

కలువాయి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాజుపాళెం సమీపంలో పెన్నానది లోపలకు ఇసుకాసురులు రోడ్డు నిర్మిస్తున్నారు. ప్రవాహం ఉన్న చోట సిమెంటు పైపులు వేసి పెద్ద పెద్ద బండరాళ్లతో జోరుగా పనులు చేయిస్తున్నారు. కలువాయి సమీపంలోని తెలుగుగంగ కాలువ నుంచి లారీలతో బండరాళ్లు, మట్టిని భారీ వాహనాలతో ఇక్కడకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల అధికారులు మానవశక్తితో పూడికతీతకు టెండర్లు పిలిచి ఇసుక రీచ్‌కు అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నది నుంచి ఇసుక తరలించేందుకు రోడ్డు పనులు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో ఇదే ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలించేంకు నదిలోనే రోడ్డు వేశారు. నదిలో ప్రవాహం పెరగడంతో ఈ రోడ్డు పలుచోట్ల కొట్టుకుపోయింది. మళ్లీ ఇప్పుడు రోడ్డు నిర్మిస్తున్నారు.

**పూడికతీత అనుమతులపై విమర్శలు**

రాజుపాళెం సమీపంలో పెన్నానదిపై ఎలాంటి బ్యారేజ్‌లు, కట్టడాలు లేవు. దీంతో ఈ ప్రాంతంలో నీరు నిల్వ ఉండే అవకాశం లేదు. కాబట్టి ఇక్కడ పూడిక ఉండే ఆస్కారం ఉండదు. అయినా అధికారులు సంగం బ్యారేజ్ అప్‌స్ట్రీమ్ అంటూ టెండర్లు పిలిచి అనుమతులు ఇచ్చారు. సోమశిల జలాశయానికి కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి సంగం బ్యారేజ్‌కి 50 కి.మీ పైగా దూరం ఉంటుంది. అక్కడ బ్యారేజ్ ఉంటే ఇక్కడ నదిలో పూడిక ఎలా ఉంటుందో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనికితోడు మానవశక్తితో నదిలో నుంచి ఇసుకను ఎలా బయటకు తీస్తా రో అధికారులకే తెలియాలి. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశీనాయక్ మాట్లాడుతూ రాజుపాళెం సమీపంలోని నదిలో రోడ్డు నిర్మాణానికి మేము ఎలాంటి అప్రూవల్ ఇవ్వలేదన్నారు.

రాజుపాళెం సమీపంలో నదిలో రోడ్డు పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

## 'విజయ' పాల సేకరణ ధర పెంపు

నెల్లూరు (వెంకటేశ్వరపురం): నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితికి (విజయ డెయిరీ) పాలు పోసే రైతులకు పాల సేకరణ ధర పెంచుతున్నట్లు ఆ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 10 శాతం వెన్న కలిగిన లీటరు పాలకు రూ.75.90 ఇస్తున్నారు. దానిని రూ1.50 పెంచి రూ.77.40 ఇవ్వనున్నట్లు తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి పెరిగిన ధర అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్ తదితరులు

# మొక్కుబడిగా దిశ

● సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల డుమ్మా

● కేంద్ర పథకాల అమలుపై జరగని చర్చ

నెల్లూరు (జడ్పీ), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలపై మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన దిశా సమావేశం మొక్కుబడిగా సాగింది. దిశా చైర్మన్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో సహా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు సభ్యులుగా ఉన్నారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నేరుగా మంజూరు చేస్తున్న 67 పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. వ్యవసాయం, హౌసింగ్, అంగన్వాడీలు, మహిళలు, పిల్లల భద్రత, జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన, విద్యాశాఖ, జలజీవన్ మిషన్ వంటి అనేక ప్రధాన పథకాలు ఉన్నాయి. అయితే ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు తిరుపతి ఎంపీ గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. దిశా చైర్మన్ వేమిరెడ్డితోపాటు కేవలం జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ ఆనంద్ ఇతర అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో పథకాలపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండాపోయింది. 67 పథకాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరాలు వెల్లడించినా అవి క్షేత్రస్థాయిలో సమగ్రంగా అమలు అవుతున్నాయా లేదా చర్చించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేకపోవడంతో కేవలం అధికారులు చెప్పిన వివరాలతోనే సమావేశం ముగిసింది. కేంద్ర పథకాల అమలు తీరు సమగ్రంగా ఉందా లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా!? ఉన్న పథకాలను ఏ సమయంలో పూర్తి చేయాలి, చేసేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించి ఉంటే జిల్లాకు ఎంతో మేలు జరిగేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఇవన్నీ క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతున్నాయన్న వివరాలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్దే ఎక్కువగా ఉంటాయి. దీంతో సభ్యులందరూ హాజరై ఉంటే జిల్లాకు ఎంతో మేలు జరిగేదన్న అభిప్రాయం కొంతమంది అధికారుల్లో వ్యక్తమైంది.

● **జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుదాం : ఎంపీ**

కేంద్రం అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసి జిల్లాను పూర్తి అభివృద్ధిపథంలో నడపాలని దిశా చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పథకాల అమలులో ఏమైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసార పరీక్షలు, ఈ మార్కెట్లు, డ్రిప్ ఇరిగేషన్, గ్రామాల్లో మౌలిక వసతులు, అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద మరింత మందిని చేర్చే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు కేటాయించి పెండింగ్ పనులు, ఫ్యాన్లు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల కుర్చీలు

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 114 |
| స్కిన్ చికెన్ | 210 |
| స్కిన్‌లెస్ | 232 |

కోడిగుడ్ల ధర (100): 590

## పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు న్యాయం చేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం రంగంలోకి రావాలని రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన స్థానిక కందుకూరు 2 వేలం కేంద్రంలో పొగాకు వేలంను పరిశీలించారు. లో గ్రేడ్‌లకు కనీస ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకు కొనుగోలు చేయటం ద్వారా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నోబిడ్‌లు, సీఆర్‌లు తగ్గేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వర్జీనియా పొగాకు రైతును ఆదుకునేందుకు ముందుకొచ్చే వరకు ఏపీ రైతుసంఘం రైతులకు అండగా పోరాటం సాగిస్తుందని తెలిపారు.

**న్యూస్ బాక్స్**

### ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగన్ పర్యటన ఆగదు

కావలిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన ఆగదని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు గురువారం నెల్లూరు రానున్న జగన్మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుటిల ప్రయత్నాలను చేస్తుందని విమర్శించారు. రైలు, బస్సెక్కయినా, నడిచైనా జగనన్న నెల్లూరు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు అక్రమ లేఔట్లు వేశారని, తాను ప్రభుత్వ భూమి 128 ఎకరాలు ఆక్రమించానని తేలుస్తామని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎందుకు మౌనం వహించారని, రియల్టర్లతో సర్దుబాటు చేసుకున్నారా అని ప్రశ్నించారు.

### పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులకు న్యాయం చేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం రంగంలోకి రావాలని రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన స్థానిక కందుకూరు 2 వేలం కేంద్రంలో పొగాకు వేలంను పరిశీలించారు. లో గ్రేడ్‌లకు కనీస ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకు కొనుగోలు చేయటం ద్వారా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నోబిడ్‌లు, సీఆర్‌లు తగ్గేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేవరకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వర్జీనియా పొగాకు రైతును ఆదుకునేందుకు ముందుకొచ్చేవరకు ఏపీ రైతుసంఘం రైతులకు అండగా పోరాటం సాగిస్తుందని తెలిపారు.

### అన్నదాత సుఖీభవ నమోదుకు మరో అవకాశం

కలిగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేని రైతులకు ఆన్‌లైన్ నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినట్లు మండల వ్యవసాయాధికారి జహీర్ మంగళవారం తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డ్, బ్యాంకు ఖాతాపుస్తకం, 1బి, అడంగల్ కాపీలతో రైతుసేవ కేంద్రాల్లో వీఏఏ లేదా వీహెచ్ఏఎస్‌లను సంప్రదించి ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు.

### హక్కులు కాలరాసేందుకే లేబర్ కోడ్ చట్టాలు

కావలిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు హక్కులు కాలరాసేందుకే కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ చట్టాలు తీసుకొచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మామిళ్లపల్లి మోహనరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్యతో కలసి విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చేందుకు 44 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ నల్ల చట్టాలతో కార్మికుల సర్వం కోల్పోయే ప్రమాదం ఉందని, సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రశ్నించే హక్కు కోల్పోతారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీపీఎం నేతలు ఎస్ వెంకయ్య, మధుసూదన్‌రావు, సీఐటీయు నాయకులు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

### 355 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 500 పొగాకు బేళ్లు తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీ ప్రతినిధులు పాల్గొని 355 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-116, ఆర్ఆర్-15, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 145 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.219.99గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

### అధికారులను కలిసిన జనసేన నేతలు

బిట్రగుంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డిని జనసేన మండల అధ్యక్షుడు టీ.వెంకటేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అదే విధంగా ఎస్ఐ ఎన్.ప్రభాకర్‌ను కలిసి పూష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో జనసేన సైనికులు హరీష్, కాలేబు, వేంకటేశ్వర్లు, శివ, రవి, చైతన్య, రాజేంద్ర, సురేష్, కార్తీక్, బాబు పాల్గొన్నారు.

## పెదపవని చెరువులో యథేచ్ఛగా
# గ్రావెల్ తవ్వకాలు!

- 40 నుంచి 50 ట్రాక్టర్లతో తరలింపు
- ఆందోళనలో సాగునీటి సంఘం అధ్యక్షులు, రైతులు

పెదపవని చెరువులో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

లింగసముద్రం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని సాగునీటి చెరువులో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం ఉదయం నుంచి చెరువులో రెండు ఎక్స్‌కవేటర్‌లతో గ్రావెల్ తవ్వి సుమారు 40 నుంచి 50 ట్రాక్టర్ల ద్వారా తరలించారు. రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ, ఆ కాలువ పరిధిలోని బ్రాంచి కాలువల రోడ్ల పేరుతో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయం తెలిసిన సాగునీటి సంఘం అధ్యక్షుడు మలిశెట్టి నాగేశ్వరరావు, సంఘం సభ్యులు, గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి, గ్రావెల్ తరలింపుపై అనుమతి పత్రాలను చూపాలని అడిగి, వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో గ్రావెల్ తరలించవద్దని చెప్పారు. అయినా వారు వినిపించుకోకపోవడంతో ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కూడా పట్టించుకోలేదని తెలిపారు. ఈ గ్రావెల్ ట్రాక్టర్లు గ్రామంలో ప్రధాన రహదారిలో చాలా వేగంగా పోతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువులో ఎక్స్‌కవేటర్ల ద్వారా పెద్ద పెద్ద గుంతలు చేస్తుండడం పట్ల కూడా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చెరువులోకి వచ్చే నీరు ఈ గుంతలలో మాత్రమే నిల్వ ఉండే అవకాశం ఉంది. గుంతలలోని నీరు తూము వద్దకు వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు కింద చిన్న సన్నకారు రైతులకు కలిపి సుమారు 400 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. దీంతో ఈ ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మైనర్ ఇరిగేషన్ ఏఈఈ బి. మనోహర్ మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈ ద్వారా ఒంగోలు ఇరిగేషన్ డివిజన్ ఈఈకి అనుమతుల కోసం లెటర్ పంపామన్నారు. అయితే ప్రభుత్వ పనుల కావడంతో ముందుగానే గ్రావెల్ తరలిసున్నామన్నారు. అయితే ఈ గ్రావెల్ తరలింపునకు సంబంధించి చెల్లించాల్సిన సీనరేజి ఆయా హెడ్ ఆఫ్ ఖాతాలో జమ అవుతాయన్నారు.

# పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభం

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధిగాంచిన మోపాడు, మాచవరం చెరువుల కింద పంట కాలువల్లో పూడికతీత పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. మోపాడు చెరువు ఆయకట్టు పరిధిలోని ఆనందపురం గ్రామం వద్ద పల్లెవాగులో ఆయన స్వయంగా ఎక్సకవేటర్ ఆపరేట్‌చేసి పూడికతీసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోపాడు, మాచవరం చెరువుల పరిధిలోని చివరి ఆయకట్టుకు కూడా సక్రమంగా నీ చూడటం కోసం పంట కాలువల్లో పూడికతీతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ రెండు చెరువుల పరిధిలోని ఏడు ప్రధాన కాలువల్లో పూడికతీయటం కోసం రూ.43 లక్షల ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి ఈ ప్రభుత్వం

ఎక్స్‌కవేటర్ ఆపరేట్ చేసి కాలువల్లో పూడికతీసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కట్టుబడి ఉందని, రైతులకు పంట పెట్టుబడి సాయంగా త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ. 20వేలు ఆర్థికసహాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వీఆర్ కోట ఆనకట్ట సిస్టం అధ్యక్షుడు తల్లపనేని రవీంద్ర, ఆయా గ్రామాల నాయకులు కంద్రా మాల్యాద్రి, తల్లపనేని మురళి, దామా మాధవరావు, రావుల నారాయణ, వడ్డెళ్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

**పింఛను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

పట్టణంలోని 25వ వార్డు కేసరిగుంట కాలనీలో మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఇతర స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, సురేష్‌కుమార్, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రియల్‌ఎస్టేట్ కోసం ఎస్సీ, ఎస్టీలను రోడ్డుకీడుస్తారా ?

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన పేరుతో రైతుల వద్ద వేలాది ఎకరాలు విలువైన భూములు ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని సీఐటీయూ అనుబంధ వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం కరేడులోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరేడులో అధిక శాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని, వారికి ఉన్న కొద్దిపాటి పంట భూములతోపాటు నివాస గృహాలు ఇండోసోల్ కంపెనీ నిర్మాణంకు భూసేకరణలో తీసుకుంటే వాళ్లంతా రోడ్డున పడతారని పేర్కొన్నారు. కరేడు పంచాయతీ పరిధిలో బలవంతపు భూసేకరణలో తొలుత ప్రధాన రహదారి వెంట ఉన్న రామకృష్ణాపురం, పొట్టేనుగుంట ఎస్టీ కాలనీలు, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీల గృహాలను లాగేసుకుని రోడ్డుకు ఈడుస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఎంతటి పోరాటానికైనా, త్యాగాలకైనా వెనుకాడమని, దుర్మార్గ చర్యలను ఎదుర్కొంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జీవీబీ కుమార్, పొన్నం రామలక్ష్మమ్మ, కత్తి మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్రసమరయోధుడు, పశ్చిమబెంగాల్ రెండవ ముఖ్యమంత్రి ప్రజా వైద్యుడు డాక్టర్ బీసీ రాయ్ జన్మదినంను జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు.

వైద్యులను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా తలసేమియా డేకేర్ సెంటర్‌కు స్వచ్ఛందంగా వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు పామూరు శ్రీధర్, శ్రీరాం మనోహర్‌బాబు, టీ. రమ్యలను సత్కరించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్ మాట్లాడుతూ కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రెడ్‌క్రా స్ సేవా కార్యక్రమాలకు అండ గా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏ. రమేష్ రెడ్డి, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, జిల్లా, కావలి కమిటీ సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్న కుమార్, జనిగర్ల మనోహర్, గొట్టిపాటి మనో రమ తదితరులు పాల్గొన్నారు.

## వెంకయ్యకు జన్మదిన శుభాకాంక్షలు

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును కందుకూరు నియోజకవర్గంకు చెందిన ప్రకాశం జిల్లా డెయిరీ మాజీచైర్మన్ చల్లా శ్రీనివాసరావు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై చర్చించిన వెంకయ్యనాయుడు పలు అంశాలను ప్రస్తావించినట్లు చల్లా శ్రీనివాసరావు తెలిపారు.

### మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నేతలు

కొండాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, తదితర నాయకులు మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు, బీజేపీ రాష్ట్రయువమోర్చా ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావు, సీనియర్ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చల్లా చిన మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాలేపాటి జన్మదిన వేడుకలు

బిట్రగుంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు బోగోలు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామ కోదండరామాలయ కమిటీ సభ్యులు పీ.వెంకటకృష్ణయ్య, టీ.వెంకటేశ్వర్లు, జీ.మల్లికార్జున, వీ.సాయినాగేంద్ర, జీ.గోపి, భాను తదితరులు పూలమాలు, శాలువలతో సన్మానించారు. నాల్గోసారి కూడా మండల టీడీపీ కన్వీనర్‌గా ఎంపిక కావడంతో నాగేశ్వరరావుతో పాటు మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఎల్.సుధీర్ బాబును ఘనంగా సన్మానించారు. పార్టీ నేతలు సీహెచ్. వెంకటేశ్వర్లు, కే.వెంకటేశ్వరరెడ్డి, ఆర్.విజయ్‌కుమార్, ఏ.ఆది శేషయ్య, పీ.హర్ష, ఎన్.పిచ్చయ్య, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలను సన్మానిస్తున్న శ్రేణులు

### సుపరిపాలనలో తొలి అడుగును
## విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పట్టణ టీడీపీ శ్రేణులతో జరిగిన కార్యక్రమంలో సుపరిపాలనకు సంబంధించిన టీడీపీ యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి తెలియపరుద్దామన్నారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే అభిప్రాయాలను సేకరిస్తూ వై టీడీపీ యాప్‌లో పొందపరచాలన్నారు. బూత్ లెవల్‌లోని కార్యకర్తలు, ఇన్‌చార్జిలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని, యూనిట్ ఇన్‌చార్జి లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు వారికి సహకారం అందించాలని తెలిపారు. ముసునూరులోని 15వ వార్డులో బుధవారం ఉదయం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి తిరిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య పోట్లూరు శ్రీనివాసులు, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

## కార్మికుల సమస్యలపై 9న దేశవ్యాప్త సమ్మె

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 184 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొంటారని, ఆరోజున సెంటర్లు మూతవేస్తున్నట్లు సీడీపీవో మాధవిలతకు యూనియన్ నాయకులు సమ్మె నోటీసులు అందచేశారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను విధించి కార్మికుల జీవితాలు వీధులపాలు చేస్తుందని దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొని వారి న్యాయమైన డిమాండ్లపై పోరాడాలన్నారు. సీఐటీయూ నాయకులు కుమార్, అంగన్‌వాడీలు ఇందిరావతి, తిరుపతమ్మ, గీత, కోటేశ్వరి, వరలక్ష్మీ, శైలజ తదితరులు సమ్మె నోటీసు ఇచ్చినవారిలో ఉన్నారు.

## నేడు వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణ

మాట్లాడుతున్న విగ్రహ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): కావలి ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పేద బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణ కల ఎట్టకేలకు నెరవేరతోందని రంగావిగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ట్రంకు రోడ్డులోని రైతుబజారు వద్ద రంగ విగ్రహావిష్కరణ జరుగుతోందన్నారు. విగ్రహావిష్కరణ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో రంగా అభిమానులతో కలసి ఆయన మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సారధ్యంలో జరుగు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఆవిష్కరణ అనంతరం అక్కడే బహిరంగ సభ అనంతరం రాత్రికి భోజన ఏర్పాట్లు చేశామని చెప్పారు. రంగా అభిమానులు, కాపునాయకులు, పార్టీలు, కులమతాలకతీతంగా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విగ్రహావిష్కరణ కమిటీ బాధ్యుడు బాబూరావు, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

మాట్లాడుతున్న ఉద్యాన అధికారి విశాల్

ఉలవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పంటకు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు విజయ్‌కుమార్, విశాల్ సూచించారు. మంగళవారం మన్నేటికోట, ఆత్మకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ-క్రాప్ నమోదువలన రైతులకు అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంట కొనుగోలు, పీఎం కిసాన్‌వంటి అనేక ప్రభుత్వ పథకాలకు అర్హత పొందతారాని తెలిపారు. వ్యవసాయ పంటలతోపాటు ఉద్యాన పంటలైన మామిడి, సపోటా, జామ, సరుగుడు, జామాయిల్ పంటలకు పంట నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎండీ షరిఫుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

## పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

లింగసముద్రం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమాకు రైతులు ప్రీమియం చెల్లించాలని పొలం పిలుస్తోంది మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కె.హర్షవర్ధన్ చెప్పారు. మంగళవారం మండలంలోని మాలకొండరాయుని పాలెం, లింగసముద్రం-1 రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండరాయునిపాలెంలో 56 మంది రైతులకు 23 క్వింటాళ్ల జనుము విత్తనాలు, ఇద్దరు రైతులకు 1 క్వింటా జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శ్రీహరి, మనుకిరణ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారిని కలిసిన మహిళా కండక్టర్లు

కావలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారిగా షేక్. షమీమ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం కావలి డిపోకు చెందిన మహిళా కండక్టర్లు నెల్లూరులోని ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ షమీమ్ మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ధనమ్మ, కే.గోవిందమ్మ, ఎస్.గీతాబాయి, ధనలక్ష్మి, ఎన్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## మెట్టినింటికి తరలిన కలిగిరమ్మ

కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరుణాళ్ల మూడవ రోజు మంగళవారం వైభంగా జరిగాయి. అమ్మవారికి ఆలయంలో అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా సోమవారం సాయంత్రం మేళతాళాల నడుమ పుట్టినిల్లైన పాపనముసిలిపాలెంకు తరలివెళ్లిన కలిగిరమ్మ అక్కడ గ్రామోత్సవం అనంతరం మంగళవారం సాయంత్రం తప్పెట్లు, మేళతాళాల మధ్య, ముద్రగడపావనం, వీరతాళ్లు, ఆవు, ఎద్దు వాహనాలు వెంటరాగా ప్రత్యేక పుష్పాలంకరణతో మెట్టినిల్లైన జిర్రావారిపాలెంలో గ్రామోత్సవానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ గ్రామోత్సవం అనంతరం తిరిగి బుధవారం ఉదయం కలిగిరిలో ఆలయానికి చేరుకుంటారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

## భళిరా భళి!

- ఆకట్టుకున్న బకాసుర వధ ఘట్టం
- వైభవంగా ద్రౌపదీ కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం వైభవంగా జరిగింది. నగరంలోని పత్తేఖాన్‌పేట వాసులు ద్రౌపదీదేవిని తమ ఇంటి ఆడపడచుగా భావించి పెండ్లి కుమార్తెగా అలంకరించి మంగళవాద్యాలు, విద్యుత్, పుష్పాలంకారాలు, బాణాసంచా వేడుకలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ద్రౌపదీ వివాహ ఘట్టానికి ముందు సాయంత్రం బకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. భీముని వేషధారి బకాసురునికి బండిపై ఆహారం తీసుకుని బయలుదేరడం, మార్గంలో ఆహారాన్ని భీముడు తినేయడం వంటి ఘట్టాలను మూలాపేట వీధుల్లో ప్రదర్శించారు. ఆలయం ముందున్న వేదికపై బకాసురుడు, భీముడి యుద్ధాన్ని ప్రదర్శించారు. భక్తులు చప్పట్లతో ఆసక్తిగా తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం విశేష పూజలు, చప్పర ఉత్సవం, భగవద్గీత పారాయణం, సాయంత్రం మహాభారతం ప్రవచనం, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

భీమ, బకాసురుల యుద్ధ సన్నివేశం



### రేపు వెంగమాంబ పేరంటాల

## పదహారు రోజుల ఉత్సవం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసి ఉన్న వెంగమాంబ పేరంటాల పదహారు రోజుల ఉత్సవం గురువారం నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కల్యా ణోత్సవం అనంతరం పదహార రోజుల తరువాత వచ్చే మొద టి గురువారం రోజున పదహారు రోజుల ఉత్సవం నిర్వహిం చడం ఆనవాయితీ. ఈ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ సంద ర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈ వో వెట్టిగుంట ఉషశ్రీ మంగళవారం తెలిపారు.

## జగన్ పర్యటన వాయిదా

- హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ

నెల్లూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన వాయిదా పడింది. 3వ తేదీన నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డిని జగన్ పరామర్శిం చాల్సి ఉంది. ఇందుకు వైసీపీ నేతలు జైలుకు దూరంగా పలు ప్రాంతాల్లో హెలిప్యాడ్ల ఏర్పాటుకు ప్రయత్నిం చారు. కానీ ఇందుకు పోలీసులు అంగీకరించలేదు. పల్నాడు జిల్లా పర్యటనలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతల దృష్ట్యా జైలు సమీపంలోనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసుకోవా లని వైసీపీ నేతలకు సూచించారు. స్వయంగా పోలీసులే ఓ ప్రాంతాన్ని చూపించారు. ఈ ప్రాంతాన్ని వైసీపీ ముఖ్య నేతలు పరిశీలించారు. కానీ వారు సుముఖత చూపలేదు. అయితే శాంతిభద్రతల విషయంలో రాజీప డేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. కాకాణి పరామర్శించేందుకు వచ్చే సమయంలో ఎక్కడో దూరాన ఎందుకు హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకోవాలని, తాము కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని వైసీపీ నేతలను పోలీసులు ఒప్పించే ప్రయత్నం చేశారు. కానీ ఇందుకు ఒప్పుకోని వైసీపీ నేతలు, జగన్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. నెల్లూరు పర్యటనకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలంటూ వైసీపీ నేతలు మంగళవారం హైకోర్టును ఆశ్ర యించారు.

## పశువులపై థైలీరియా ప్రభావం

- వ్యాధి సోకితే ప్రాణాలకే ముప్పు
- నివారణకు ఉచితంగా వ్యాక్సినేషన్
- మొట్టమొదటిసారి ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం

**పశువుల్లో చాలా మందికి తెలియని ఎంతో తీవ్రమైన థైలీరియా వ్యాధి వ్యాప్తి చెందుతోంది. దీన్ని గుర్తించడంతోపాటు నివారణ చాలా కష్టతరమైంది. అంతేగాక వాటి నివారణకు అవసరమైన మందులు కూడా ఎంతో ఖరీదైనవి. అవికూడా అరుదుగా దొరుకుతాయి. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా థైలీరియా నివారణకు ఉచితంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించింది.**

నెల్లూరు (వ్యవసాయం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ మీద ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. పశువులకు సాధారణంగా వచ్చే కొన్ని రకాల వ్యాధు లు, వైరస్‌లపై పాడి రైతులకు కొంతమేర అవగాహన ఉంది. వాటి నివారణకు ప్రభుత్వాలు కూడా ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాలు సీజన్ల వారీగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తోంది. అయితే చాలా మందికి తెలియని థైలీరియా వ్యాధి వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి పశువుల్లో ముఖ్యంగా తెల్ల పశువులకు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- **పిడుదులు(టిక్స్) ద్వారా వ్యాప్తి**

థైలీరియా అనే ఏకకణ పరాన్నజీవి ద్వారా థైలీరియా వస్తుంది. ఇది పిడుదులు (టిక్స్) అనే జీవి ద్వారా వ్యాప్తి చెందుతాయి. పిడుదులు కలిగిన పశువు ద్వారా మందలోని మిగతా పశువులకు వ్యాప్తి చెందుతుంది. ఈవ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరం, ఒంటిపై వాపు గడ్డలు కనిపిస్తాయి. పశువులు నీరసించి బక్కచిక్కిపోతాయి. దూడల్లో రక్త విరేచరణాలు కనిపిస్తాయి. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారుతుంది. ఈ వ్యాధి కారణంగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి.

- **ఉచితంగా వ్యాక్సినేషన్**

ఈవ్యాధి కారణంగా పశువుల్లో మరణాలు, పాడిరైతులకు జరుగుతున్న ఆర్థిక నష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా థైలీరియా నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మూడు నెలలు దాటిన దూడలకు, పశువులు, ఆవులకు ఏడాదికి ఒకసారి ఉచితంగా ఈ టీకా వేసే కార్యక్రమం జరుగుతోంది. ఇదే మార్కెట్‌లో రూ.వేలు ఖర్చయ్యే పరిస్థితి. అంతేగాక ఈ మందు అన్ని దుకాణాల్లోనూ లభించదు. ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేయడంతో పాడిరైతులకు కొంత ఉపశమనం కలుగుతోంది.

వ్యాక్సిన్‌తో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పాడిరైతు (ఫైల్)

- **ముందు జాగ్రత్తలు అవసరం**

థైలీరియా టీకా వేయించుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. బక్కచిక్కిన ఆవులకు టీకా వేయకూడదు. అదేవిధంగా టీకా వేసుకునే వారం ముందు నట్టల నివారణ మందు తాగించాలి. వాక్సిన్ వేసిన 21 రోజుల వరకు ఎలాంటి యాంటిబయోటిక్స్, ప్రోటోజోల్ మందులు వేయకూడదు. నిండు చూల ఆవులకు వేయకపోవడం మంచిది.

### పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

థైలీరియా వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతుంది. థైలీరియా వ్యాధి బారిన పడిన పశువులకు ఖరీదైన మందులు వాడాల్సిన పరిస్థితి. ఏడాదికి ఒకసారి ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయించుకోవడం వల్ల వ్యాధిని నివారించవచ్చు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టీకా అవసరమైన రైతులు 9989932893 నెంబరును సంప్రదించండి. ఉచితంగా ఇంటి వద్దకే వచ్చి పశువులకు టీకా వేస్తారు.

- చైతన్యకిషోర్, ఏడీ, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

### సోమశిలను సందర్శించిన

## మత్స్యశాఖ అధికారులు

అనంతసాగరం జూలై 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశ యంలో మూడు నెలలపాటు చేపలవేట నిషేధం విధించిన విష యం తెలిసిందే. కాగా కొందరు అక్రమంగా చేపలవేట కొనసాగిం చేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచు రితం అయింది. దీంతో మంగళవారం మత్స్యశాఖాధికారులు అప్ర మత్తమ య్యారు. ఏడీ శ్రీనివాసులు, ఎఫ్‌డీవో రమేష్ జలాశయాన్ని సందర్శించి జాలర్లతో మాట్లాడారు. ఎవరైనా అక్రమంగా చేపల వేట కొనసాగిస్తే సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

### కంకరు టిప్పరు

## బీభత్సం

- ఇంజన్‌లో వ్యాపించిన మంటలు
- డ్రైవర్ దూకేయడంతో చెట్టును ఢీకొని ఆగిన వైనం
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రోడ్డు పక్కన చెట్టును ఢీకొని ఆగిపోయిన టిప్పర్

కావలిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తుమ్మల పెంట రోడ్డు సెంటర్‌లో కంకర లోడుతో వెళ్తు న్న టిప్పర్ మంగళవారం బీభత్సం సృష్టించింది. స్థానికుల వివరాల మేరకు.. జీఎస్‌ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కి చెందిన టిప్పర్ తుమ్మలపెంట రోడ్డుకు కంకరు లోడుతో వెళ్తుండగా తుమ్మలపెంట రోడ్ సెంటర్ కు వచ్చేసరికి టిప్పర్ ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. దీంతో బ్రేకులు కూడా పడక టిప్పర్ ఆగకపోవడంతో డ్రైవర్ టేక్‌లాల్ లారీలో నుంచి కిందకు దూకేశాడు. నిత్యం రద్దీగా ఉండే ఆ మార్గంలో లారీ 30 అడుగుల మేరకు ముందుకు పోయి ఒక చెట్టును ఢీకొని ఆగిపోయింది. అనంతరం బ్యాటరీ వైర్లు తొలగించి మంటలు ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో ఒక ఆటో, బైక్ స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## ప్రతి నెలా పింఛన్ల పండుగ

- పెన్షన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), రాష్ట్రంలో ప్రతి నెలా ఒకటో తేదీ పింఛన్ల పండుగ రోజు అని మున్సిపల్ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని 42వ డివిజన్ మన్సూర్ నగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి పింఛన్లను పెంచి ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

**మానసిక దివ్యాంగురాలికి పింఛను...**

నగరంలోని గౌతమినగర్‌కు చెందిన మానసిక దివ్యాంగురాలు భానుశ్రీ ఇంటికి మంగళవారం కలెక్టర్ ఆనంద్ వెళ్లి పింఛను అందజేశారు. ఆ చిన్నారితో కాసేపు ముచ్చటించారు. భానుశ్రీని సమీపంలోని భవిత కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని, బాలిక ఆరోగ్యం మెరుగపడేందుకు వెంకటాచలంలోని సీఆర్‌సీ కేంద్రానికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స అందించాలని ఆమె తల్లికి సూచించారు. ఇందుకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, జిల్లాలో మంగళ వారం తొలిరోజు 95 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. బుధవారం మిగిలిన పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

వృద్ధురాలికి పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

### శాంతియుతంగా

## నిరసన తెలిపిన రైతులపై కేసులా?

- ప్రభుత్వం, పోలీసుల తీరుపై కరేడు రైతుల ఆగ్రహం

ఉలవపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి) : వందల ఏళ్లుగా బంధం ఏర్పచుకున్న మట్టిని, పచ్చటి పంట పొలాలను కాపాడుకోడానికి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసినందుకు గ్రామంలోని 38 మంది రైతులపై అక్రమంగా కేసులు పెడుతారా అని కరేడు గ్రామస్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి విలువైన, సారవంతమైన భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహ రించడం వెనుక మర్మం దాగిఉందనే అనుమానం రైతులపై కేసులు పెట్టి భయభ్రాంతు లకు గురిచేయడంతో బలపడిందన్నారు. బంజరు భూములను వదిలి ఏటా రెండు పంటలు పండే భూములను బలవంతంగా లాక్కోవాలని చూడటం దుర్మార్గమన్నారు. కరేడు పంచాయతీలోని పలు గ్రామల్లోని ప్రజలు స్వచ్ఛందంగా గత ఆదివారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు సైతం పార్టీలకు, కులమతాలకు అతీతంగా వందల మంది నిరసన కార్యక్రమంలో పాల్గొంటే ఒక వర్గంకు చెందిన వ్యక్తుల మీదనే అత్యధికంగా కేసులు పెట్టడంతో పోలీసుల పక్షపాత ధోరణి బయటపడింద న్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా గ్రామం, పంట పొలాలను నిలుపుకోవడానికి ఐక్యంగానే పోరా డతామని, మాయమాటలకు మతలబులకు లొంగమన్నారు. ప్రభుత్వం గ్రామసభల నిర్వహిస్తే ఏకతాటిపై గ్రామస్తులంతా ముక్తకంఠంతో మా ప్రాణాలైనా ఇస్తాము కానీ మా భూములు మాత్రం ఇండోసోల్ కంపెనీ రియల్‌ఎస్టేట్‌కు మాత్రం ఇవ్వమని గ్రామసభలో ప్రతిజ్ఞ చేస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న కరేడు రైతులు, గ్రామస్థులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదాశివరావు

## నా భూమిని ఆక్రమిస్తున్నారు!

- ఉదయగిరి ఎమ్మెల్యే, తమ్ముడిపై ఆరోపణలు
- పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు
- గారపాటి సదాశివరావు ఆవేదన

నెల్లూరు (హరనాథపురం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తన భూమిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన తమ్ముడు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని, తన భూమి తనకు దక్కేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చూడాలని నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాళెం గ్రామానికి చెందిన గారపాటి సదాశివరావు కోరారు. మంగళవారం టౌన్‌హాల్ మినీ సమావేశ మందిరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన కుటుంబం మొదటినుంచీ టీడీపీలో ఉందని అన్నారు. ప్రస్తుతం తాను ఏలూరులో ఉంటున్నానని, తన స్వగ్రామం చింతలపాలెంలో 88 ఎకరాల భూమి ఉందని చెప్పారు. అందులో మామిడి తోట సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లాకు చెందిన తలసిల వెంకట నరసింహారావుకు తనకు మధ్య ఆర్థిక లావాదేవీల సమస్య తలెత్తిందన్నారు. దీంతో నరసింహారావు రౌడీలతో తనపై దాడి చేయించాడని, గతేడాది కిడ్నాప్‌నకు కూడా పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు జలదంకి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, అది ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సంబంధించిన అంశమని పోలీసులు చెప్పడంతో ఎమ్మెల్యేను కలిసినట్లు తెలిపారు. తన మనుషుల చేత భూమికి సంబంధించి విచారిస్తానని ఎమ్మెల్యే చెప్పారని, ఆయన తమ్ముడు కూడా ఇదే చెప్పారని అన్నారు. తన తోటలో రూ. 36 లక్షల విలువైన మామిడి కాయలను కోసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు తమ భూమి మీదే కన్నేశారని ఆరోపించారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన ఎమ్మెల్యేనే ఇలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చర్యలు తీసుకుని నా భూమి నాకు దక్కేలా చూడాలని కోరారు.

## రొట్టెల పండుగలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగే రొట్టెల పండులో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్‌లో రొట్టెల పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఐదు రోజులపాటు జరిగే రొట్టెల పండుగకు గతానికంటే ఎక్కువగా భక్తులు విచ్చేసే అవకాశం ఉందని, అందుకనుగుణంగా అన్నీ చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. స్వర్ణాల చెరువులో తగినంత నీటిని ఉంచాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్లేసులు వద్ద, ఇతర అవసరమైన చోట మొబైల్ టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా పోలీసు అధికారులకు సూచించారు. రొట్టెల పండుగ ఏర్పాట్లలో భాగమయ్యే వివిధ శాఖల సిబ్బందికి ఆయా రోజుల్లో సెలవులు ఉండవని స్పష్టం చేశారు. అధికారులందరూ రొట్టెల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఏఎస్పీ సౌజన్య, నగర కమిషనర్ నందన్, నెల్లూరు ఆర్డీవో అనూష, విద్యుత్, ఇరిగేషన్ ఎస్‌ఈలు విజయన్, దేశ్‌నాయక్, డీఎంహెచ్‌వో సుజాత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

- విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తన
- మూకుమ్మడిగా దాడికి పాల్పడిన గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ప్రేమానురాగాలు పంచాల్సిన ఓ ఉపాధ్యాయుడు కీచక అవతారం ఎత్తి అనుచితంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన ఘటన అనంతసాగరం మండలం తూర్పుబోయమడగల ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం మేరకు.. ఆ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు లోకసాని వెంగయ్య విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుండటంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు మంగళవారం మూకుమ్మడిగా పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆ ఉపాధ్యాయుడిని నిలదీయగా, గ్రామస్థులతో వాదనకు దిగి దాడి చేసేందుకు పూనుకున్నాడు. అనంతరం గ్రామస్థులు ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడడంతోపాటు కారు అద్దాలను ధ్వంసం చేశారు. వారి నుంచి తప్పించుకున్న ఉపాధ్యాయుడు ప్రహరీ గోడ దూకి పరారయ్యాడు. గత విద్యా సంవత్సరం కూడా ఇలాంటి సంఘటనకు పాల్పడటంతో గ్రామస్థులు ఆందోళన చేయగా సహచర ఉపాధ్యాయులు సర్దుబాటు చేసి పంపించారు. ఆ సమయంలో ఎంఈవో సైతం ఉపాధ్యాయుడి నుంచి లిఖిత పూర్వక లేఖ రాయించుకున్నారు. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు వద్దకు చేరుకొని కారును స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరిపి నివేదికలను అందజేయడం జరుగుతుందని ఎంఈవో రమణయ్య తెలిపారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్థులు

### ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి

## ఆత్మహత్య

రాపూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగి ఒకరు మంగళవారం రాపూరులో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం వివరాల మేరకు, పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి బండి పెద్ద అంకయ్య (70) ఆర్టీసీలో డ్రైవర్‌గా రిటైర్డ్ అయి, లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం స్థానిక బంగ్లా క్వార్టర్‌లో పురుగుల మందు తాగినట్లు గమనించిన కొందరు స్థానికులు హుటాహుటీన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రికి వెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలతో ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తి

- 533 మందికి స్థాన చలనం

నెల్లూరు (జడ్పీ), జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. ఐదేళ్లు ఒకే చోట పని చేసిన వారందరిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. 20 రోజులుగా బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానించగా తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారంతా ముందుగా దరఖాస్తు చేసుకున్నారు. రిక్వెస్ట్ బదిలీలకు సంబంధించి కూడా దరఖాస్తులు వచ్చాయి. దీంతో గ్రేడ్-5 కార్యదర్శులుగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 114 మంది ఉండగా వారందరినీ వివిధ సచివాలయాలకు బదిలీ చేశారు. అలాగే రిక్వెస్ట్ ద్వారా 41 మంది దరఖాస్తు చేసుకోగా వారిని కూడా బదిలీ చేశారు. గ్రేడ్- 6 కార్యదర్శులకు సంబంధించి ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులు 270 మంది ఉండగా వారినీ బదిలీ చేశారు. అలాగే రిక్వెస్ట్ ద్వారా 107 మంది దరఖాస్తు చేసుకోగా వారికి కూడా స్థానచలనం కల్పించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం సాయంత్రం డీపీవో జారీ చేశారు. మొత్తంగా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 533 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 2 జూలై 2025

### కొనసాగనున్న వామపక్షాల ఆందోళనలు..

నిర్వాసితులు, రైతుల సమస్యలపై వామపక్ష నేతలు ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇటీవల పోర్టు నిర్వాసితులు, రైతులకు మద్దతుగా ఆందోళన చేస్తున్నారు. ఆమదాలవలసలో పవర్‌ప్లాంట్, పలాసలో కార్గో ఎయిర్ పోర్టు ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసనలు చేపడుతున్నారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ధోరణులను వ్యతిరేకిస్తూనే, మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీరుతెన్నులను ఎండగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఉద్యమాలను మరింత విస్తృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇటీవల జిల్లాలో పర్యటించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇలా అన్ని పార్టీలు జనం మధ్య తేల్చుకోవాలని మినీ ఫైట్‌కు సిద్ధమయ్యాయి.

- 2014-19 మధ్య కాలంలో చేసిన మంచి పనులను సరిగ్గా చెప్పుకోలేక.. వైసీపీ దుష్ప్రచారం తిప్పు కోలేక పోవడం వల్ల 2019 ఎన్నికల్లో ఓడిపోయాం. ఇకపై ఆ పరిస్థితి లేకుండా మనం చేసిన మంచి పనులన్నింటినీ ప్రజలకు వివరించండి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించండి. 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఈ నెల 2 నుంచి జనం మధ్యకు మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు కూటమి నేతలంతా వెళ్లండి.

  **- ఇటీవల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులకు సీఎం చంద్రబాబు ఆదేశాలివీ**

- 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో ఐదు వారాలపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ఏడాది కాలంలో సీఎం చేసిన మోసాలను, మాట తప్పిన విధానాలను ప్రజలకు వివరించండి. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ చేసిన శపథాలను గుర్తు చేసి ప్రజలకు తెలియజెప్పండి. హామీలను ఎందుకు అమలు చేయలేదంటూ ప్రశ్నించండి.

  **- వైసీపీ నాయకులకు మాజీ సీఎం జగన్ ఆదేశం**

- కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించట్లేదు. ఎన్నికల ముందో మాట, తర్వాత ఇంకో మాట. రైతులు నష్టపోతున్నారు. నిర్వాసితులకు, రైతులకు న్యాయం చేసేవరకూ మూలపేట పోర్టు, కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాలను అడ్డుకుంటాం. ప్రజాపక్షాన ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తాం. ఆమదాలవలస నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామంటున్న మినీ పవర్‌ప్లాంట్‌ను కూడా అడ్డుకుంటాం.

  **- పార్టీ అంతర్గత సమావేశాల్లో వామపక్షాల సంకేతాలివి..**

# జనం మధ్యకు నేతలు

- అభివృద్ధి, సంక్షేమం తెలియజెప్పేందుకు 'కూటమి' సన్నద్ధం
- 'సుపరిపాలనలో తొలి అడుగు' ఆరంభం
- జిల్లాలో నేటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన
- వైసీపీ నేతలు కూడా ఐదువారాలపాటు ఇంటింటికీ..
- ఆందోళనల స్పీడ్ పెంచాలని వామపక్షాల యోచన

శ్రీకాకుళం, జూలై 1(ఆంధ్రజ్యోతి):

కూటమి పాలన ఏడాదైన నేపథ్యంలో ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు విపక్షాల ప్రజాక్షేత్రం వైపు కదులుతున్నాయి. తాము చేసిన మంచి పనులతోపాటు వైసీపీ పాలనలో జరిగిన నష్టాన్ని పూడ్చుతున్న తీరును ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. నియోజకవర్గాల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఇప్పటికే **(మిగతా 6వ పేజీలో..)**

## జవాన్ కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా

- భూ సమస్య పరిష్కారంలో అండగా ఉంటామని స్పష్టం

బాధితుల పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

కోటబొమ్మాళి, జూలై 1(ఆంధ్రజ్యోతి): భూ సమస్య పరిష్కారంలో భాగంగా జవాన్ కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ద్వారా భరోసా ఇచ్చారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన గ్రామానికి ఎస్ఎస్ఎఫ్ జవాన్ రొక్కం అశోక్‌కుమార్ జమ్ము కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామంలో ఉన్న తన భూమి ఆక్రమణకు గురైందని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని సామాజిక మాధ్యమాల్లో ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 'చిన్నసాన గ్రామానికి చెందిన రొక్కం కరుణాకర్, రొక్కం వరప్రసాద్.. స్థానిక వైసీపీ నేతల అండతో దౌర్జన్యంగా మా భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ప్రశ్నించిన మా తల్లిదండ్రులు రొక్కం శివాజీ, సుగు ణమ్మను బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. నేను విధి నిర్వహణలో భాగంగా జమ్ముకశ్మీర్‌లో ఉంటున్నాను. నా కుటుంబానికి అండగా ఉండి, మా భూములను మాకు ఇప్పించాల'ని జవాన్ అశోక్ కుమార్ కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. 'దేశం కోసం మీరు చేసిన సేవకు, త్యాగానికి సెల్యూట్. మీ తల్లిదండ్రులకు రక్షణ కల్పించి, అండగా ఉంటాం. మీ గ్రామానికి అధికారులను పంపించి మీ కుటుంబానికి న్యాయం చేస్తా'నని తెలిపారు. అలాగే కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు జవాన్ అశోక్‌కుమార్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. అండగా ఉంటామని, అన్నివిధాలా భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

- కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, ఆర్ఐ పవిత్ర, వీఆర్వో అఖిల్ సోమవారం రాత్రి జవాన్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మాట్లాడారు. వారి ఫిర్యాదును రికార్డు చేసి.. ఉన్నతాధికారులకు అందజేశారు. మంగళవారం ఎస్ఐ సత్యనారాయణ కూడా గ్రామానికి వెళ్లి సంబంధిత పొలాన్ని పరిశీలించారు.

మూలపేట పోర్టు బెర్త్ పనులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

## అక్టోబరులో ట్రయల్‌రన్ షిప్ రాక

- మూలపేట పోర్టు పనులు 57శాతం పూర్తి
- బెర్త్‌ను పరిశీలించిన మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.1,450కోట్లతో 57శాతం పనులు పూర్తయ్యాయ'ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం పోర్టు బెర్త్‌ను, డ్రెడ్జింగ్, చాకాఫ్‌బ్యాచ్, డయాఫ్రమ్ వాల్ పనులు విశ్వసముద్ర యంత్రాంగంతో కలిసి ఆయన పరిశీలించారు. '91 శాతం సౌత్‌బ్రేక్ పనులు, 74శాతం డ్రెడ్జింగ్ పనులు జరిగాయి. అక్టోబరులో మొదటి ట్రైల్‌రన్ షిప్ తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. 54వేల ఇండోపాట్స్‌కుగాను 40 వేల ఇండో పాట్స్ పూర్తయ్యాయి. త్వరలో ఓడరేవు శాఖా మంత్రితో కలిసి మరోసారి పర్యటించి పోర్టు పనులు పరిశీలిస్తా'నని మంత్రి అచ్చెన్న తెలిపారు. మూలపేట రైతులకు చెట్ల పరిహారం అందజేయాలని ఆర్డీవో కృష్ణమూర్తికి సూచించారు. పోర్టు పనుల గురించి విశ్వసముద్ర సంస్థ జీఎం శంకరరావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు.

### సాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

టెక్కలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విశ్వసముద్ర, పోర్టు యంత్రాంగంతో పాటు వంశధార అధికారులకు ఆదేశించారు. పోర్టు రోడ్డు **(మిగతా 6వ పేజీలో..)**

ఆంధ్రజ్యోతి లేటెస్ట్

### నేడు 'వంశధార' విడుదల

హిరమండలం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా బుధవారం సాగునీటిని విడుదల చేయనున్నారు. జిల్లాలో వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ 104 కి.మీ. మేర విస్తరించి ఉంది. హిరమండలం, సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాల్లో 398 గ్రామాల్లో 1,48,200 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడుతుండటంతో నదిలో పుష్కలంగా నీరు చేరుతోంది. ఖరీఫ్ అవసరాల దృష్ట్యా కొన్నిరోజులుగా బ్యారేజీ ఎగువ ప్రాంతంలో నీటిని నిల్వ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 1060 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో 38.1 మీటర్ల మేర నీటిమట్టం ఉంది. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద పాతపట్నం, నరసన్నపేట ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులమీదుగా బుధవారం ఉదయం 10 గంటలకు ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయనున్నట్టు డీఈఈ సరస్వతి తెలిపారు.

గొట్టాబ్యారేజీ వద్ద నిల్వ ఉన్న నీరు

సగంలోనే వదిలేసిన కుడ్డబ రహదారి

# అప్పుడూ ఇప్పుడూ వారే!

అప్పుడూ.. ఇప్పుడూ ఆ కాంట్రాక్టర్లే చక్రం తిప్పుతున్నారు. వారికి ఓ అధికారి సహకరిస్తున్నారు. అధికారపార్టీ నాయకులకు వారికి 'దగ్గర'చేసి మరీ పనులు అప్పగిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులు చేసుకుని పనులు మధ్యలే ఆపేశారు. ఇది గిరిజనులకు శాపంగా మారింది. ఈ వ్యవహారాలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కలెక్టర్ రూ.20.3 కోట్ల విలువైన 16 పనులకు పీఆర్‌కు బదలాయించారు. ఇంతజరుగుతున్నా సదరు అధికారిపై చర్యలు తీసుకోవడం లేదు. కొందరు అధికారపార్టీ నేతలు ఆ అధికారికి అభయం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

- చక్రం తిప్పుతున్న వైసీపీ హయాంలోని కాంట్రాక్టర్లు
- రోడ్డు పనుల నిర్వహణలో ఓ అధికారి ఇష్టారాజ్యం
- అధికార పార్టీ నాయకులకు పరిచయం చేసి పనుల అప్పగింత
- కలెక్టర్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- 16 పనులు పీఆర్ శాఖకు బదలాయింపు

మెళియాపుట్టి, జూలై 1(ఆంధ్రజ్యోతి):

గిరిజన ప్రాంతవాసులకు రహదారి కష్టాలు తప్పడం లేదు. వైసీపీ పాలనలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గిరిజన శాఖఅధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. రహదారులు లేని గ్రామాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రతీ గిరిజన గ్రామానికి వాహనం వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, డోలీ మోతలు లేని గ్రామాలు కనిపించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాకు సంబంధించి సీతంపేట ఐటీడీఏ పరిధిలో తొలివిడతగా ఉపాధిహామీ నిధులతో 151 పనులకు సుమారు రూ.75కోట్లు మంజూరు చేశారు. ఇందులో పాతపట్నం నియోజకవర్గంలోనే 107 పనులకుగానూ రూ.56 కోట్లు కేటాయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే అంచనాలు రూపొందించి పనులు చేయాలని ఆదేశించారు. కాగా, ఐటీడీఏలోని ఓ ఇంజనీరింగ్ అధికారి.. పక్క జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లను అధికారపార్టీ నాయకులకు పరిచయం చేసి పనులు అప్పగించినట్టు తెలుస్తోంది. దీంతో వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారే నియోజకవర్గంలో అధికంగా పనులు చేస్తున్నారు. గతంలో వారు పనులు చేయకముందు అడ్వాన్స్‌ల రూపంలో బిల్లులు చేయించుకున్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా పనులు ప్రారంభించి.. మధ్యలోనే వదిలేశారు. యంత్రాలతో మట్టి తవ్వి రోడ్డుపై వదిలేయడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో 16 రోడ్లకు సంబంధించి రూ.20.30 కోట్లతో చేయాల్సిన పనులను ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ నుంచి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కేటాయించారు. మెళియాపుట్టి మండలంలో 11, హిరమండలం మండలంలో మూడు, కొత్తూరు మండలంలో రెండు రహదారుల పనులను పీఆర్ ఇంజనీరింగ్‌శాఖకు అప్పగించారు. ఈ మేరకు ఇటీవల పంచాయతీరాజ్ ఎస్ఈ జి.రవి ఐటీడీఏ పరిధిలో రహదారులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పనులు చేపట్టే అవకాశం లేదు. నిధులున్నా పనులు జరగడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రహదారులను పరిశీలిస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు (ఫైల్)

- **ఆ అధికారిపై చర్యలేవీ?**

రహదారుల పనుల బదలాంపు నేపథ్యంలో.. ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖలో ఏమి జరుగుతుందనేది చర్చనీయాంశమవుతోంది. ఐటీడీఏలోని ఒక ఇంజనీర్ పనుల వద్దకు వెళ్లకుండానే కాంట్రాక్టర్ ద్వారానే ఎం-బుక్‌లో వివరాలు నమోదు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందుకే గత ప్రభుత్వంలో పనిచేసిన ఇతర జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లు (ఆ అధికారి బంధువులే) ఇక్కడ పనులపై ఆసక్తి కనబరుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ అక్రమాల వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో పనులు బదలాయింపు **(మిగతా 6వ పేజీలో..)**

### సాంకేతిక అనుమతులు రావాలి..

ఐటీడీఏ శాఖ నుంచి పంచాయతీరాజ్ శాఖకు 16 రోడ్ల పనులు అప్పగించాం. వీటికి మళ్లీ అంచనాలు తయారు చేసి సాంకేతిక అనుమతులకు పంపించాం. ఇటీవల పంచాయితీరాజ్ ఎస్ఈ పనులు పరిశీలించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

**-ఆనంద్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, మెళియాపుట్టి**

### ఈ గుడ్లే తినమంటారా?

- పాఠశాలలకు పాడైనవి సరఫరా
- నిత్యం ఎక్కడో ఓచోట ఇదే తంతు
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

6లో

### ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి అనుమతి 6లో

**'మెగా' లక్ష్యంతో..**
- 10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్

6లో

**మూడు నెలలుగా పస్తులే!**
- రెన్యువల్‌కు కొర్రీలు
- ఆవేదన చెందుతున్న పారిశుధ్య కార్మికులు

8లో

**మంచం పట్టిన టీడీవలస**
- 50 మందికి జ్వరాలు
- సంచి వైద్యులే దిక్కు

7లో

ఉప్పు భూముల్లో మట్టిని తవ్వి.. ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

## ఉప్పు భూములనూ వదల్లే

- నౌపడలో మట్టి మాఫియా బరితెగింపు
- అనుమతులు లేకుండా తవ్వకాలు
- నేతల అండతో అక్రమాలు

సంతబొమ్మాళి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అక్రమార్జనే ధ్యేయంగా ఉప్పు భూముల్లో సైతం యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతోంది. రాజకీయ నేతల అండతో అక్రమార్కులు అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. మూడురోడ్ల కూడలిలో ఉన్న ఉప్పు భూముల్లో చెరువు చదును పేరుతో మట్టిని తరలించి ప్రైవేటు లేఅవుట్‌లకు అమ్ముకుంటున్నారు. రోజుకు 100 నుంచి 150 ట్రాక్టర్ల లోడు మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడు రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. వీరి అక్రమాలకు రాజకీయ నేతల ఆశీస్సులు ఉండటంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇంటి నిర్మాణాలు, భూమి చదును పనులకు మట్టి కావాలంటే.. అనుమతి కోసం గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖకు **(మిగతా 6వ పేజీలో..)**

# చూపులకు నలుపు.. సుగుణాల మేళవింపు

- ఇదీ నేరేడు పండ్ల ప్రత్యేకత
- మార్కెట్‌లో మంచి డిమాండ్

శ్రీకాకుళం కల్చరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి)

ఓవైపు మామిడి పండ్లు మార్కెట్‌లో సందడి చేస్తుండగా... మరోవైపు అదే స్థాయి డిమాండ్‌తో నేరేడు పండ్లూ ఆకట్టుకుంటున్నాయి. ఇవి చూడడానికి నలుపు ద్రాక్ష పండ్లలా కనిపిస్తాయి. కానీ రుచిలో తేడా. ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది. దీనిని పోషకాల గనిగా చెబుతారు. నేరేడు పండుతో పాటు ఆకులు, చెట్టు బెరడు కూడా ఆరోగ్యానికి మేలు చేసేవే. వీటి ధర అధికంగా ఉంటోంది. సిక్కోలు మార్కెట్‌లో కిలో నేరేడు పండ్లు రూ.180 నుంచి రూ.200 వరకు పలుకుతున్నాయి. ఇవి ఎక్కువ గా ఒడిశాలోని గుణుపూర్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి అవుతున్నాయి.



### ఇవీ ప్రయోజనాలు..

నేరేగు పండులో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు విటమిన్ ఎ, సి కూడా లభిస్తాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి... సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా మూత్ర సమస్యల నియంత్రణ, మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగు పరుస్తుంది. నేరేడు పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యంగా ఉంటాయని... చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుందని చెబుతారు. నోటిలో చెడు బ్యాక్టీరియాను నశింపజేస్తుంది. దుర్వాసన రాకుండా చేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## అప్పుడూ వారే.. ఇప్పుడూ వారే!

(ఐదో పేజీ తరువాయి)

జరిగినట్టు తెలుస్తోంది. కాగా, గతంలో ఆ అధికారి తీరుపై జిల్లాకు చెందిన అధికారపార్టీ నేత ఒకరు అమరావతిలో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ, కొంతమంది అధికారపార్టీ నేతలే ఇంతవరకూ ఆ అధికారిపై చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉర్లాం ఉన్నత పాఠశాల

# మెగా లక్ష్యంతో...

- 10న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్
- తల్లి ప్రాముఖ్యత తెలిపేలా విద్యార్థులకు పోటీలు
- ఈసారి ప్రైవేటు పాఠశాలల్లోనూ నిర్వహణ

నరసన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసుతులు... పరిసరాల పరిశీలనతోపాటు విద్యా ప్రమాణాలు పెంచే లక్ష్యంతో ఈ నెల 10న ప్రభుత్వం, ప్రైవేటు, సర్కారు పాఠశాల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించనుంది. ముందుగా ఈ నెల 5న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు భావించారు. జూలై 6న ముస్లింల మొహర్రం పండగ ఉండటంతో.. దీని ని పదో తేదీన నిర్వహించాలని తాజాగా ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలో 2,955 ప్రభుత్వ, 453 ప్రైవేటు పాఠశాలల్లో 2 లక్షల 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ఏడాదిలాగానే పాఠశాలలను అందంగా అలంకరిం చి... విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తారు. తల్లిదండ్రులు ఇచ్చే సూచనలు, సలహాలను తీసుకుంటారు. విద్యాబోధన విధి, విధానాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరిస్తారు. తల్లులకు ముగ్గులు, లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహిస్తారు. ఈ సమావేశంలో విద్యార్థుల ప్రతిభ బయటకు తెచ్చేలా పోటీలు నిర్వహించనున్నారు. ఇటీవల 'తల్లికి వందనం' పథకం విడుదల చేశారు. దీనిలో భాగంగా తల్లి ప్రాముఖ్యత తెలిపే విధంగా డ్రాయింగ్, గీతాలాపన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారు. గత ఏడాది పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను... ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన వారిని ఆహ్వానిస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఇప్పటి విద్యార్థులకు సూచనలు ఇస్తారు. ఈమేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## జనం మధ్యకు నేతలు

(ఐదో పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఏడాదిలో అమలుచేసిన పథకాలు, ప్రజలకు లబ్ధి విధానంపై వివరించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు పర్యటించనున్నారు. కొన్నింటిలో అడ్డం తగులుతున్న వైసీపీ తీరుతెన్నులను ప్రజల ఎదుటే చర్చించనున్నారు. పార్టీ సూచనల మేరకు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తమ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఉమ్మడిగానే ప్రజాక్షేత్రంలో పర్యటించి.. ఏడాది పాలన విజయాలను వివరించనున్నారు.

**● 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరిట కార్యక్రమం..**

కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో నెట్టేందుకు వైసీపీ విశ్వప్రయత్నాలు ఆరంభించింది. టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రజల మధ్యకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. మేమేమి తక్కువ అనే విధంగా వైసీపీ సైతం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఇంటింటా ప్రచారం చేయాలని నిర్ణయించింది. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 3 నుంచి ఐదు వారాలపాటు ఊరూరా ప్రచారం చేయాలని మాజీ సీఎం జగన్ పిలుపునిచ్చారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు ఎలా సాగాలో సంకేతాలిచ్చారు. కాగా, ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో వైసీపీ శ్రేణులు బలహీనపడ్డాయి. కన్వీనర్లు చతికిలపడ్డారు. శ్రీకాకుళంలో సగానికి సగం నియోజకవర్గాల్లో ఇదేతీరు. అయినా సరే పార్టీలో మరికొందరు ఇతర పార్టీల వైపు తొంగి చూడకుండానే ఉండేందుకు వైసీపీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



శ్రీకాకుళం కల్చరల్: నరసింహావతారంలో...

ఇచ్ఛాపురం: ఉగ్రనరసింహుడిగా...

ఎల్ఎన్‌పేట: వామనావతారంలో..

సోంపేట: నరసింహావతారంలో జగన్నాథ స్వామి

# వైభవంగా హీరా పంచమి పూజలు

జగన్నాథుని రథోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం హీరా పంచమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథుని దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. రథయాత్ర నుంచి ఐదో రోజున హీరా పంచమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఆషాడంలో ప్రకాశవంతమైన రోజుగా దీనిని భావిస్తారని అర్చకులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం

జలుమూరు (సారవకోట): అవలింగిలో వామనావతారంలో

టెక్కలి: నరసింహునిగా

కంచిలి: నరసింహావతారంలో..

# ఈ గుడ్లే తినమంటారా?

- పాఠశాలలకు పాడైనవి సరఫరా
- నిత్యం ఎక్కడో ఓచోట ఇదే తంతు
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

హిరమండలంలోని ఒక పాఠశాలలో గుడ్లు ఇలా..

జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో కుళ్లిన కోడిగుడ్లు

హిరమండలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం కోసం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు పాడైపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలకు కాంట్రాక్టరు సరఫరా చేసిన రోజు నుంచే నిత్యం ఏడెనిమిది గుడ్లు పాడైపోతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. తాజాగా మండలంలోని జగన్నాథపురం పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనంలో పెట్టిన గుడ్లు పాడైపోయాయి. గత ఆదివారం పాఠశాలలకు సరఫరా చేసిన గుడ్లన్నిటిదీ ఇదే పరిస్థితి. ఈ ఏడాది వేసవి సెలవుల తరువాత పాఠశాలలకు సరఫరా చేసిన మధ్యాహ్న భోజన పథకం గుడ్లు నాసిరకంగా వస్తున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. రోజూ కుళ్లిపోతున్నాయని చెబుతున్నారు. అనేక పాఠశాలల్లో 50 గుడ్లు ఉడకబెడితే సగటున 20 నుంచి 30 వరకు కుళ్లిపోతున్నాయని చెబుతున్నారు. ఓ పాఠశాలలో ఒక రోజు 20కి పైగా గుడ్లు ఉడకబెడితే అన్నీ కుళ్లిపోయాయి. హిరమండలం, పాతహిరమండలం, కొమనాపల్లి, జగన్నాథపురం, అంబావల్లి, రుగడ, దుర్బలాపురం పాఠశాలలకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా అయ్యాయి. దీంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఉడకబెట్టిన తరువాత గుడ్లు పాడవుతుండడంతో వంట నిర్వాహకులు ఉపాధ్యాయులకు తెచ్చి చూపిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు వాటిని బయట పడేస్తున్నారు. కాంట్రాక్టరు వేసవి సెలవుల్లో నిల్వ ఉంచిన కోడిగుడ్లను సరఫరా చేయడం వల్లనే ఇలా కుళ్లిపోతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ గుడ్లు తిని పిల్లలు అనారోగ్యం పాలైతే ఎవరిది బాధ్యతని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో కె.రాంబాబును వివరణ కోరగా... పాడైన గుడ్లు వస్తున్నాయని ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశానని అన్నారు.

## సాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

(ఐదో పేజీ తరువాయి)

ని ర్మాణ పనుల కార ణంగా సాగునీటికి ముప్పు ఏర్పడనుంది. దీనిపై '2,500 ఎకరాలకు సాగునీరు అందేనా' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై మంత్రి అచ్చెన్న స్పందించారు. మంగళవారం బన్నువాడ, అయోధ్యపురం, మోదుగువలస పిఠాపురం, తలగాం, వేములాడ తదితర గ్రామాల రైతులతో కలిసి పోర్టు రోడ్డు పక్కన ఉన్న కాలువలు పరిశీలించారు. పలువురు రైతులు సాగునీటి ఇబ్బందులు, 49ఆర్ కాలువ, దేశబట్టి, దాలిచెరువు సర్‌ప్లస్‌వైర్ వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో 22 కల్వర్టులు, రెండు అండర్‌పాసేజ్‌లు నిర్మించాలని పోర్టు జీఎం శంకరరావుకు మంత్రి ఆదేశించారు. రైతుల చెట్లుకు సంబంధించి నష్టపరిహారం ఇవ్వాలని సూచించారు. పోర్టు రోడ్డు పనులు పరిశీలించి యుద్ధప్రాతిపదికన కాలువ పనులు వేగవంతం చేయాలని వంశధార ఈ శేఖరరావుకు ఆదేశించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కందులు, మినుములు విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. టెక్కలి మేజర్‌పంచాయతీలో పశువులు రోడ్లపై తిరగకుండా చివరి అవకాశంగా మైక్‌ల్లో ప్రచారం చేయించాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సూచించారు. ఒకేరోజు ఎక్కువ మంది కార్మికులను పెట్టి పశువులను వాహనాల్లోకి ఎక్కించి దూరప్రాంతాల్లో ఉన్న గోశాలలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్, ఎల్ఎల్ నాయుడు, హనుమంతు రామకృష్ణ, సనపల మురళి, వట్టికూళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

## ఉప్పు భూములనూ వదల్లే

(ఐదో పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోవాలి. కానీ ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. ఇటీవల నౌపడ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల ధర విపరీతంగా పెరిగింది. దీంతో వ్యాపారులు ప్రధాన రహదారుల పక్కన ఉన్న భూములను ప్లాట్లుగా మార్చేందుకు ఉప్పుభూముల మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై నౌపడ ఉప్పు శాఖ సూపరింటెండెంట్ ఇష్లాం వద్ద ప్రస్తావించగా.. 'ఉప్పు భూ ముల్లో మట్టి తవ్వకం చట్టవిరుద్ధం. తవ్వకాలకు సంబంధించి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.



# ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి అనుమతి

- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 3,870 సీట్లకు ఆమోదం

ఎచ్చెర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్-2025 ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఏపీ ఈఏపీ సెట్ మే 21 నుంచి 27వ తేదీ వరకు జరిగింది. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఏపీ ఈఏపీ సెట్ ఆన్‌లైన్‌లో జరగగా.. 12,633 మంది రాశారు. ఇంకా కౌన్సెలింగ్ ప్రారంభం కావలసి ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీతో పాటు శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీ రింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (టెక్కలి), జీఎంఆర్ ఐటీ (రాజాం)లో ప్రైవేటు ఇంజ నీరింగ్ కళాశాలలు ఉన్నాయి. డాక్టర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 180 సీట్లు, నాలుగు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో కలిపి 3,690 సీట్లు ఉన్నాయి. జిల్లా మొత్తమ్మీద అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో కలిపి 3,870 సీట్లు ఉన్నాయి. ఏపీఈఏసీ సెట్ రాసిన విద్యార్థులు కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఈ నెల 17వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## గ్రామదేవతలకు చల్లదనం

సోంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పలాసపురం గ్రామ దేవతలు శ్రీసింధుపట్టపురాణి, కాళీమాత, నిమ్మాశిని, చింతామణి, భద్రకాళీ మాత అమ్మవార్లకు గ్రామస్తులు మంగళవారం చల్లదనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజముద్దలు, ఘటాలు, కాళికావేషాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సుజాత

# డెంగ్యూపై అప్రమత్తత అవసరం

- డీఎంహెచ్‌వో అనిత

అరసవల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. జూలై నెలను డెంగ్యూ వ్యాధి నివారణ మాసంగా పాటించాలన్నారు. ఇది సీజనల్ వ్యాధి కాబట్టి ప్రజలంతా డెంగ్యూ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ సుజాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య, మున్సిపల్, గ్రామీణ శాఖల సిబ్బంది డెంగ్యూ వ్యాధి నివారణపె అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. తాగునీటి నిల్వల వద్ద చెత్తను తొలగించడంతో పాటు దోమల నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాల నిర్వహణకు జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని డీఎంహెచ్ఓ చెప్పారు. ఏడురోడ్ల జంక్షన్ వద్ద డెంగ్యూ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరావు, వేంకటేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

● విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి):టీడీపీ శ్రేణులు సమన్వయంగా, సమష్టిగా పనిచేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.మంగళవారం చిలకపాలెంలోని టీడీపీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా ఇంటింటికీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం బుధవారం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతిరోజూ 30 నుంచి50 ఇళ్లను సందర్శించి ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సరైన గుర్తింపు లభిస్తుందని చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, లంక శ్యామ్, కుమరాపు రవికుమార్ పాల్గొన్నారు.

●రణస్థలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మంగళవారం కలిశారు.ఈ సందర్భంగా ఎచ్చెర్ల నియోజకవర్గం సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

## మసీదు వీధిలో రోడ్డు నిర్మించాలి

అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంతోష్

ఇచ్ఛాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని 17వ వార్డు లాలాపేట మసీదువీధిలో రోడ్డు నిర్మించాలని టీడీపీ వార్డు ఇన్‌చార్జి జన్నెల సంతోష్ కోరారు. ఈ మేరకు మంగళవారం రామయ్యపుట్టుగలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ జిలానీ, వార్డు అధ్యక్షుడు బి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విజయాలను వివరించాలి: కలమట

అరసవల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి, సంక్షేమం, విజయాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఒక ప్రకటనలో పార్టీ నాయకులను కోరారు.రానున్న రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలను కూడా వివరించాలని తెలిపారు. సుపరిపాలనతో ఏడాది అనే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరికీ తెలియజేయాలని, ఈ కార్యక్రమంలో బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలు, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, కేఎస్ఎస్‌సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు.వైసీపీ చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పేర్కొన్నారు.

## తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని మోసం

● కాకినాడ జిల్లా వాసులకు రూ.ఆరు లక్షలు టోకరా పెట్టిన వైనం

శ్రీకాకుళం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరి అన్నదమ్ములకు బంగారం తక్కువ ధరకు ఇప్పిస్తామని చెప్పి నకిలీ బంగారం అంటగట్టి ఆరు లక్షల రూపాయలు టోకరా పెట్టిన సంఘటన మంగళవారం శ్రీకాకుళంలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము కథనం మేరకు...కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలోని నామగిరి నరేంద్రపట్నం గ్రామానికి చెందిన చిన్న సూరిబాబు ఆటోడ్రైవర్‌గా, ఆయన తమ్ముడు చిన్నశ్రీను వ్యవసాయంచేసి జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరికి పాయకరావుపేటకు చెందిన దావతల్లి అనే మహిళతో కాకినాడ డి-మార్ట్ వద్ద పరిచయం ఏర్పడింది. ఆమె తన తమ్ముడు ద్వారా తెలిసిన వాళ్లతో తక్కువ ధరకు బంగారం అందిస్తానని నమ్మబలికింది. తులం బంగారం 50,000 రూపాయలకే వస్తుందని చెప్పడంతో సూరిబాబు, శ్రీను బంగారం కొనుగోలు చేసేందుకు మంగళవారం జిల్లాలోని ఆమదాలవలస రైల్వేస్టేషన్ వద్దకు వచ్చారు. బంగారం విక్రయిస్తామన్న వారితో ఫోన్ ద్వారా కాంటాక్ట్ అయ్యారు. వీరిద్దరిని శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడు గ్రామంలోని అప్పన్నమ్మ తల్లి ఆలయం వద్దకు రప్పించారు. అక్కడవారికి తొలుత నిజమైన బంగారు వస్తువులు నల్లపూస తాడు, ఒక లాకెట్, ఎరుపు పూసల లాకెట్‌చూపించి ఆరులక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సూరిబాబు, శ్రీనుకు నకిలీ బంగారం అప్పగించి పరారయ్యారు. దీంతో మోసానికి గురయ్యామని తెలుసుకుని శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రణస్థలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):బంటుపల్లి పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపై బీరు పరిశ్రమ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఎన్‌పురం గ్రామానికి చెందిన ఆదినారాయణకు గాయాలయ్యాయి. జేఆర్‌పురం పోలీసులకథనం మేరకు.. బీరుపరిశ్రమ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది దీంతో గాయపడిన ఆదినారాయణ శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసునమోదు చేశారు.

## బీపీఈడీ, డీపీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం పది నుంచిమధ్యాహ్నం ఒంటిగంటవరకు నిర్వహిస్తున్నపరీక్షలు ఈనెల నాలుగో తేదీ వరకు జరుగుతాయి. తొలి రోజు పరీక్షకు 359 మందికి 11 మంది గైర్హాజరయ్యారు.పరీక్షలను వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య పరిశీలించారు. అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని పర్యవేక్షిస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి):రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు టి.భవాని శంకరరావు కోరారు.మునిసిపాలిటీలోగల బెల్లుపడ, మండలంలోని కొళిగాంలో ఏవో అజయ్‌కుమార్ అధ్యక్షతన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

● కంచిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని ఏవో కొంక్యాన సురేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని జోలగోవిందపురం, పోలేరు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది గణేష్, మౌనిక, స్థానిక రైతులు పాల్గొన్నారు.

●కవిటి,జూలై1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో నారుమడుల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏవో పి.శ్రీదేవి కోరారు. మండలంలోని శిలగాం,బెలగాంల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీఈవోలలిత, పవన్‌కుమార్ పాల్గన్నారు.

## పదవీవిరమణ పొందిన ఏపీఎంకు ఘన సన్మానం



రవణమ్మకు సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సోంపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపీఎం వూనరవణమ్మ పదవీవిరమణ పురస్కరించుకుని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ మోహనరావు, ఎంపీపీ నిమ్మనదాసు, జడ్పీటీసీ సభ్యురాలు తడకయశోద, టీడీపీ రాష్ట్రకార్య దర్శి సూరాడ చంద్రమోహన్, పలాసపురం సర్పంచ్ జోగారావు పాల్గొన్నారు.

# అప్‌గ్రేడ్ చేశారు.. వసతులు మరిచారు

● నిధులు విడుదల కాకపోవడంతో నిలిచిన నాడు-నేడు పనులు ● ఇదీ చంగుడి ఉన్నత పాఠశాలలో పరిస్థితి

అర్థాంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

పాతపట్నం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంగుడి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్‌చేసినా వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. ప్రధానంగా గదులు చాలకపోవడంతో బోధన సక్రమంగా సాగడం లేదు. చంగుడి ప్రాథమికోన్నత పాఠశాలను గత ప్రభుత్వ హయాంలో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్‌చేశారు. అలాగే ఒడియా ప్రాథమిక పాఠశాలను కూడా ఏర్పాటుచేశారు. దీనికి తగినవిధంగా అదనపు గదులతోపాటు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బోధన సక్రమంగా సాగడంలేదు.ప్రాథమికోన్నతపాఠశాలగా ఉన్న సమయంలో ఇక్కడ అధికసంఖ్యలో విద్యార్థులు అభ్యసించేవారు. దీంతో వైసీపీ హయాంలో నాడు-నేడు పథకం కింద రూ.47లక్షలతో అదనపు భవననిర్మాణాలు ప్రారంభించారు. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్నతపాఠశాలకు అందుబాటులో ఉన్న నాలుగు గదులు చాలకపోవడంతో బోధనకు అవస్థలు తప్పడంలేదు. అంగన్‌వాడీ కేంద్రం కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు, అంగన్‌వాడీ కేంద్రం ఒకేచోట నిర్వహణకు అగచాట్లుతప్పడంలేదు.ఇక్కడ ఒడియా మీడియం చదువుతున్న విద్యార్థులు ఎక్కువసంఖ్యలో ఉన్నారు.అయితే పాఠశాల అప్‌గ్రేడ్ చేసినతర్వాత ఆంగ్లమాధ్యమంలో బోధిస్తుండడంతోఒడియా విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు.కాగా ఒడియాభాష ఉపాధ్యాయులను ఇప్పటికే నియమించమని, తల్లిదండ్రుల అభ్యర్థనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంఈవో సీహెచ్ తిరుమలరావు తెలిపారు

## మంచం పట్టిన టీడీవలస

● 50 మందికి జ్వరాలు ● సంచి వైద్యులే దిక్కు

జ్వరంతో బాధపడుతున్న చిన్నయ్య

టీడీవలస మధ్యలో పెంటకుప్పలు

జి.సిగడాం,జూలై 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని టీడీవలస జ్వరాలతో మంచం పట్టింది. ఇంటింటా జ్వరాలబారిన పడ్డారు. గ్రామంలో సుమారు 50 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన టంకాల చిట్టెమ్మ, టి.వెంకటేష్, బి.పాపారావు, టి.మోహనరావు, గిరిజాల శ్రీరాములు, సీహెచ్ శ్యామలరావు, టి.శ్రీరాములు, టి.అప్పలనరసమ్మ, టి.చరణ్, టి.మోహిని, మాచర్ల గోపాలం, టి.లక్ష్మీనారాయణ, టి.చంటి, టి.జయమ్మ, టి.ఉమా, బి.శ్రావణి, బి.రామచంద్రి నాయుడు, చెల్లూరి గుర్రమ్మ, టంకాల బానోజీ, సీహెచ్ చిన్నయ్య, జామి వరలక్ష్మిలతో పాటు మరో 30 మంది జ్వరాల బారినపడ్డారు. జ్వరాల బారిన పడినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని పలువురు వాపోతున్నారు.

### గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ

గ్రామంలోని కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కలు, చెత్త పేరుకుపోయాయి. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. వీధుల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవడంలేదని, నెలల తరబడి పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన వెలువడుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు కలుషిత తాగునీరు వల్ల జ్వరాలబారిన పడుతున్నామని వాపోతున్నారు.నాలుగురోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్నామని, వైద్యాధికారుల ఆచూకీలేకపోవడంతో ప్రైవేటు, సంచివైద్యులపై ఆధారపడాల్సివస్తోందని పలువురు చెబుతున్నారు.కాగాఅక్కడక్కడ జ్వరాలు ఉన్నాయని, చాలా వరకు తగ్గుముఖం పట్టాయని, ప్రస్తుతం ఆరుగురు జ్వరాలతో బాధపడుతున్నారని, సిబ్బందితో సేవలందిస్తున్నామని జి.సిగడాం పీహెచ్‌సీ వైద్యాధికారి యశ్వంత్ తెలిపారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయం /

● జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ

అరసవల్లి: దమ్మలవీధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యేలు, అధికారులు తెలిపారు. మంగళవారం జిల్లాలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీచేశారు.

● సరుబుజ్జిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మూలసవలాపురంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఎంపీడీవో ఎం.పావని, టీడీపీ నాయకులు అంబళ్ల రాంబాబు, నందివాడ గోవిందరావు, పల్లి సురేష్, తర్లాడ సురేం ద్ర, దవళ సింహాచలం పాల్గొన్నారు.

●అరసవల్లి జూలై 01(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని నగరపాలక సంస్థ పరిధిలోగల దమ్మలవీధిలో ఎమ్మెల్యే గొండు శంకర్ పింఛన్ల పంపిణీచేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరావు, ఇంజినీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## ఆమదాలవలసలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

● ఒకే వేదికపై ఎమ్మెల్యే రవికుమార్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పక్కపక్కన కూర్చొన్న తమ్మినేని, రవికుమార్

ఆమదాలవలస, జూలై 1(ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మంగళవారం మునిసిపాలిటీలోని పదో వార్డు హడ్కోకాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అయితే ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా హాజరయ్యారు. ఒకేవేదికపై మామ, అల్లుడు సీతారాం, కూన రవికుమార్ పక్కపక్కన కూర్చోవడం,వీరి కలయిక నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గటా మారింది. ఈ సందర్భంగా తొలుత నిర్వాహకులు రవికుమార్ ప్రసంగించాలని కోరారు. అనంతరం తమ్మినేనికి ప్రసంగించాలని కోరగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరైనప్పుడు తర్వాత తనను మాట్లాడమనడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని సూచించారు. దీంతో రవికుమార్ సర్దిచెబుతూ నిర్వాహకులు కొత్తవారు కావడంతో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ, బీజేపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జులు చింతాడ రవికుమార్, పేడాడ సూరప్పలనాయుడు, పేడాడ రామ్మోహన్‌రావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి ఘన స్వాగతం

పురుషోత్తంరెడ్డికి స్వాగతం పలుకుతున్న టి.బరంపురం గ్రామస్థులు

ఇచ్ఛాపురం,జూలై 1(ఆంధ్రజ్యోతి):దేశసేవలో 28ఏళ్ల పాటు నిమగ్నమై ఉద్యోగ విరమణ చేసి టి.బరంపురం గ్రామానికి మంగళవారం చేరుకున్న ఆర్మీ ఉద్యోగి తిప్పన పురుషోత్తం రెడ్డి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గ్రామ పొలిమేర నుంచి సభావేదిక వరకు బాజాభజంత్రీలు, శివరామడోలు, సన్నాయి, అసరమ్మతల్లి కోలాట బృందం, కల్యాణ వేంకటేశ్వర జానపద కళా బృందం, బొడ్డ కాళి దుర్గా పాండురంగ స్వామి కోలాట బృందం, గుడ్డిబద్ర కళాకారులతో అంగరంగ వైభవంగా కోలాట ప్రదర్శనచేసి సత్కరించారు. ఈ సందర్భంగా దేశసేవలో చేసిన సేవను కొనియాడారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, ఒడిశాలోని పాత్రపూర్ బ్లాక్ చైర్మన్ ఎదురు మోహన్‌రావు, సర్పంచ్ త్రినాథరెడ్డి, మహంతి సాంస్కృతిక కళాశాల సంస్థ అధ్యక్షుడు రంగాల జానికిరామ్‌రెడ్డి, తిప్పన దుర్యోధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈవో

కంచిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య కోరారు. మంగళవారం కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం మెనూ తప్పనిసరిగా అమలుచేయాలని, ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషిచేయాలని కోరారు. పురుషోత్తపురం ప్రభుత్వ పాఠశాలలో గతంలో 17మంది ఉండగా, ఈఏడాది 45 మందికి విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.అలాగే హెచ్ఎం శారద, ఉపాధ్యాయుడు నల్లాన రవికుమార్‌ను డీఈవో అభినందించారు.అనంతరం ఎస్ఆర్‌సీ పురం పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, ధనుంజయ మజ్జి, కె.అప్పారావు, ఎస్.జోరాడు,హెచ్ఎం చాణక్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు రుచికరమైన, సరిపడ భోజనం అందజేయాలని డీఈవో తిరుమల చైతన్య ఏజన్సీ నిర్వాహకులకు కోరారు. మంగళవారం పురుషోత్తపురం ఏపీమోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాల పరిశీలించారు.పాఠశాల ఉపాధ్యాయిని బి.అరుణకుమారి తన పిల్లలను అదే పాఠశాలలో చేర్పించడంపై డీఈవో ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.అప్పారావు పాల్గొన్నారు.

## పాఠశాల సమస్యల పరిష్కారానికి చర్యలు

బూర్జ, జూలై 1(ఆంధ్రజ్యోతి):అల్లెన ఉన్నత పాఠశాల సమస్యలపై అధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డిప్యూటీడీఈవో విజయకుమారి తెలిపారు.మంగళవారంమండలంలోని అల్లెన ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను స్కూల్‌లో సమస్యలు అడిగితెలుసుకున్నారు. విద్యాప్రమాణాలు మెరుగ్గా ఉంచాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. మెనూప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని సూచించారు.

## బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా వేణుగోపాలం

శ్రీకాకుళం, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పైడి వేణుగోపాలం నియమితులయ్యారు.ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటుగా 25 పార్లమెంట్ స్థానాలకు 25 మంది జాతీయ కౌన్సిల్‌సభ్యులను పార్టీ అధిష్ఠానం నియమించింది. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజవర్గం నుంచి బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలాన్ని నియమించారు. వీరికి త్వరలో జరగబోయే బీజేపీ జాతీయఅధ్యక్షుడి ఎన్నికకు ఓటు హక్కుఉంటుంది. వేణుగోపాలం గతంలో జిల్లాబీజేపీ అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పార్టీ కార్యదర్శిగా పదవులు నిర్వర్తించారు.

### మాధవ్‌కు అభినందన

బీజేపీరాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్‌ను ఆ పార్టీ నాయకులు కలుసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా పూర్వ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జి, కార్యవర్గ ప్రతినిధులు మాధవ్‌కు అభినందించారు.

## నీటితీరువా వసూలు వేగవంతం చేయాలి

కంచిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నీటితీరువా వసూలు వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కంచిలిలో వీఆర్వోలతో సమీక్షించారు. కార్యక్రమంలో డీటీ సంతోష్ పాల్గొన్నారు.

## సోంపేటలో వైద్యుల దినోత్సవం

సోంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సోంపేటలో డ్రగ్‌ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యుల దినోత్సవం నిర్వహించారు.ఈసందర్భంగా పట్టణంలోని వైద్యులను కలిశారు.

●శ్రీకాకుళం కల్చరల్,జూలై 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జాతీయ వైద్యుల, చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను సన్మానించారు. కార్య క్రమంలో రిటైర్డు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగన్మోహనరావు, సిం. దూర, నటుకుల మోహన్ పాల్గొన్నారు.

## శక్తియాప్‌పై అవగాహన

ఆమదాలవలస, జూలై 1 (ఆంధ్రజ్యోతి):శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని సీఐ పి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పట్టణంలో జూనియర్ కళాశాలలో శక్తిటీం ఇన్‌చార్జి ఎస్ఐ జి.వాసుదేవరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

గార, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని క్షేత్రంలో హుండీలను మంగళవారం తెరిచి లెక్కించారు. 98 రోజులకు రూ.14.16 లక్షలు ఆదాయం వచ్చిందని ఈవోకె.నరసింహనాయుడు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచి సేవలందిస్తాం

అరసవల్లి/శ్రీకాకుళం అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి సేవలందిస్తామని డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణలో 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకుని పండ్ల మొక్కలను నాటారు. కార్య క్రమంలో డీసీసీబీ సీఈవో దత్తి సత్యనారాయణ, జీఎం వరప్రసాద్, జగదీష్ పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి కృషి

మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం, జులై 1 ( ఆంధ్రజ్యోతి ) : తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మాధవ్‌కు మంగళవారంఈశ్వరరావు కలిసిశుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాధవ్ ఎంపికపై ఎచ్చెర్ల నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ నడుకుదిటి రజిని హర్షం వ్యక్తంచేశారు.

●గార, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గార మండల బీజేపీ అధ్యక్షురాలు మైలపల్లి లక్ష్మీజనార్దన్ మాధవ్‌ను విజయవాడలో కలిసి అభినందించారు.

## జీవో-110 అమలు చేయాలి

లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్‌ఫ్యాకల్టీ

ఎచ్చెర్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలో నాలుగు ట్రిపుల్ క్యాంపస్‌ల్లో చేస్తున్న తమను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా గుర్తించాలని ట్రిపుల్ ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు కోరారు.ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం అమరావతిలో రెడ్డి లక్ష్మణ్‌నాయుడు, పి.నవీన్, వై.నారాయణరావు, నజీర్, లోక్‌నాథ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా నియమించేందుకు ప్రకటన ఇచ్చి, గెస్ట్ ఫ్యాకల్టీగా కొనసాగిస్తున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని చెప్పారు. కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నా తమకు రూ.25 వేలు చెల్లిస్తున్నారని చెప్పారు. జీవో-110ను అమలుచేసి నెలకు రూ.39,000 జీతం చెల్లించాలని కోరారు. ఆర్జీయూకేటీ పరిధిలో 44 మంది గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారని తెలిపారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

# మూడు నెలలుగా పస్తులే..!

- రెన్యువల్‌కు కొర్రీలు వేస్తున్న డీపీవో కార్యాలయం
- ఆవేదన చెందుతున్న పారిశుధ్య కార్మికులు
- విధులు బహిష్కరించి నిరసన

పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించడంతో పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిలిచిన చెత్తసేకరణ ట్రాక్టర్లు

నరసన్నపేట, జూలై1(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. వారిని కొనసాగించేందుకు ఉద్దేశించి రెన్యువల్ చేయాల్సి ఉన్నప్పటికీ జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీవో) లో కొర్రీలు వేస్తుండడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని మంగళవారం పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. దీంతో పట్టణంలో పారిశుధ్య పనులు లేక ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తోంది. ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలిలా ఉన్నాయి..

నరసన్నపేట మేజర్ పంచాయతీలో 53 మంది పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టు విధానంలో పనిచేస్తు న్నారు. వీరికి పంచాయతీ నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. వీరి సేవలు కొనసాగించేందుకు ప్రతి ఏటా జిల్లా పంచాయతీ అధికారి అనుమతి పొందాల్సి ఉంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వేతనాల చెల్లింపునకు సంబంధించి రెన్యువల్ పత్రాలు డీపీవో కార్యాలయం నుంచి నేటివరకు అందకపోవడంతో వారంతా ఆవేదనకు గురవుతున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్‌లో రెన్యువల్ చేసే డీపీవో కార్యాలయ ఈ ఏడాది తాత్సార్యం చేస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రెన్యువల్‌కు కార్యాలయ సిబ్బంది రూ.లక్షల్లో చెల్లించాలని డిమాండ్ చేస్తుండడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. మా వేతనాలే అంతంతమాత్రమని, ఇక రెన్యువల్‌కు ఎక్కడి నుంచి తెచ్చేందంటూ వారు వాపోతున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం కనిపించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఈవో ద్రాక్షాయిణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఏప్రిల్‌లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల రెన్యువల్‌కు సంబంధించి డీపీవో కార్యాలయానికి పంపాం. అక్కడి నుంచి అనుమతులు రాకపోవడంతో వేతనాలు చెల్లించలేదు.

### మూడు నెలలుగా ఇబ్బందులుపడుతున్నాం

ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లించడం లేదు. వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు మాపై దయ లేకుండా పోయింది. కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**మురపాక శాంతమ్మ, పారిశుధ్య కార్మికురాలు**

### ఇలా అయితే బతికేదెలా?

పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు లేవు. ఎండకు ఎండుతూ, వర్షాలకు తడుస్తూ, చలికాలం లోనూ పారిశుధ్య పనులు చేస్తున్నాం. కనీసం గౌజ్‌లు, మాస్కులు ఇవ్వడం లేదు. కంపు అయినా భరించి పనిచేస్తున్నాం. అయినా సకాలంలో సకాలంలో వేతనాలివ్వకుంటే ఎలా బదికేది. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి

**-సిరిపురం నమో నారాయణ, పారిశుధ్య కార్మికుడు**

## గంజాయి నియంత్రణకు చర్యలు

వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీస్ డాగ్

టెక్కలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి తదితర మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, రవాణాలను అరికట్టే చర్యల్లో భాగంగా మంగళవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టినట్లు టెక్కలి అర్బన్ ఎస్ఐ రాము తెలిపారు. రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్, ముఖ్య కూడళ్లు, అనుమానిత ప్రదేశాలు, దుకాణాలు, వాహనాలను తనిఖీ చేపట్టారు. గంజాయి రవాణాకు పాల్పడితే కఠినంగా శిక్షలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా గంజాయి రవాణా చేపడితే సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

కోటబొమ్మాళి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై రిమ్స్‌లో చికిత్స పొందుతూ గ్రానైట్ కార్మికుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నిమ్మాడ గ్రామ సమీపంలోని కేఎల్‌ఆర్ గ్రానైట్ పరిశ్రమలో పశ్చిమ బెంగాల్‌కు రాష్ట్రం పురులియా జిల్లా బోరోర్‌మా గ్రామానికి చెందిన తారకేశ్వర మహతో (22) నాలుగు నెలల నుంచి పనిచేస్తున్నాడు. గతనె 29న రాత్రి 10 గంటల సమయంలో పని ముగించుకొని రూంలోకి నిద్రించారని, 30న వేకువజామున తారకేశ్వర మహతో తనకు పాము కరిచిందని అన్న రవి మహతోకు చెప్పడంతో వెంటనే పరిశ్రమ సూపరింటెండెంట్ కె.లక్ష్మణరావుకు అతడు సమాచారం ఇచ్చాడు. వెంటనే నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి సోదరుడు రవి మహతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## ఎయిర్‌పోర్టు సర్వే బృందం అడ్డగింత

సర్వే బృంద సభ్యులను ప్రశ్నిస్తున్న రైతులు

వజ్రపుకొత్తూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు, మందస మండలాల సమీపంలో తీరప్రాంత గ్రామాల్లో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి సర్వే బృందం మంగళవారం పర్యటించింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ సర్వే బృందం మట్టి నమూనాలను సేకరించాయి. ఈ నేపథ్యంలో అనకాపల్లి గ్రామంలో రైతులు అడ్డుకున్నారు. కేవలం ఈ ప్రాంతంలో ఉన్న ఇసుకను మాత్రమే పరీక్షిస్తున్నట్లు సదరు బృంద సభ్యులు తెలిపినా రైతులు అంగీకరించలేదు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించిన అనంత రమే సర్వే చేయాలని, అంతవరకు ఎలాంటి సర్వేలకు అనుమతించేది లేదని రైతులు స్పష్టం చేయడంతో వారు వెనుదిరిగారు.

## అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవు

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

హరిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): నల్లబొడ్లూరు కొండలో పట్టాలిస్తామని మోసం చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్ హెచ్చరించారు. ఇటీవల గ్రామంలో నెలకొన్న వివాదాల రీత్యా కొన్ని కుటుంబాలను కుల బహిష్కరణతోపాటు మరికొందరికి కొండపై పట్టాలి ప్పిస్తామని స్థానిక నాయకులు కొందరు అక్రమాలకు పాల్పడటంతో ఎమ్మెల్యే గౌతు శిరీషతోపాటు అధికా రులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహిం చారు. తమకు జరిగిన అన్యాయాన్ని, సమస్యలను బాధితులు ఏకరువు పెట్టారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ రామకృష్ణ, ఆర్ఐ చిన్నారావు, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, సాలిన మాధవ రావు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, నవీన్ పాల్గొన్నారు.

## 'షోలోయింగ్ ఇన్‌ఫాక్ట్' పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఇటువంటి పుస్తకాలు వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు ప్రపంచ ఆరోగ్యాన్ని పెంచుతాయని మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం టెక్కలిలో ప్రముఖ పర్యావరణ పరిశోధకుడు అబుదాబీలో ఆరోగ్య భద్రత, పర్యావరణ మేనేజర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మద్ది విశ్వనాథ రెడ్డి రచించిన 'షోలోయింగ్ ఇన్‌ఫాక్ట్' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతైన సైద్ధాంతిక పర్యావరణ ఆలోచ నలకు తగ్గట్టుగా పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్‌వీ ప్రసాద్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, బగాది శేషగిరిరావు, దేవకి, వందనారెడ్డి, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

హిరమండలం, జూలై 1(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరూక్ హుస్సేన్ అన్నారు. మంగళవారం డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాప్తి చెంద కుండా తాగునీటి నిల్వల పరిశుభ్రంగా ఉంచాలని, దోమల ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి

- మంత్రి అచ్చెన్నాయుడు
- జోరువానలో సాగిన మంత్రి పర్యటన

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి,జూలై1(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు పరిసర ప్రాంతాల్లో పరి శ్రమల ఏర్పాటుతో జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని తీరప్రాంత గ్రామ మైన ఉమిలాడలో 'ప్రజా సేవలో ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పింఛన్లను పంపిణీ చేశారు. జోరువానలో మంత్రి పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పది లక్షల పెట్టుబడులతో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, తాను కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో మాట్లాడి మూలపేట ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగా హల్దియా కంపెనీ ఈ ప్రాంతంలో పెట్రోకెమికల్స్ పరిశ్రమ స్థాపించేందుకు ముందుకు వచ్చిందన్నారు. అమెరికాకు చెందిన ఎక్సోజిల్ కంపెనీ రూ.80వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకుగాను ఇటీవల ఆ సంస్థ ప్రతినిధులు మూలపేటలో భూములను పరిశీలించారన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న పారిశ్రామిక వేత్తలు మళ్లీ జగన్ అనే భూతం వస్తే తమ పరిస్థితి ఏంటని భయాందోళన చెందుతున్నారని, అయితే జగన్ భూతాన్ని వెయ్యి అడుగుల గోతిలో సీఎం చంద్రబాబు కప్పేస్తారని భరోసా కల్పించామన్నారు. మరో రెండు నెలల్లో మూలపేట పోర్టులో తొలి షిప్ వచ్చేలా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. తీరప్రాంత అభివృద్ధి చెందే విధంగా మూలపేట పోర్టు నుంచి భోగాపురం ఎయిర్ పోర్టు వరకు నాలుగు రోడ్ల నిర్మాణం చేపడతామని, తద్వారా తీరం వెంబడి పరిశ్రమలు ఏర్పడి అందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. సమస్యలు లేని గ్రామాలను చేయడమే తన ధ్యేయమని, అందుకోసం అన్ని గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపడతామ న్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తి, టీడీపీ నేతలు కింజరాపు హరి వరప్రసాద్, జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, అట్టాడ రాంప్రసాద్, కూశెట్టి కాంతారావు, బాడాన రమణమ్మ పాల్గొన్నారు.

## నాణ్యమైన బోధన అందించాలి

- ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

బొమ్మిక తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధనను పరిశీలిస్తున్న ఏపీవో చిన్నబాబు

పాతపట్నం, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. లాబర, బొమ్మిక గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠ శాలలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల్లో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన చేపట్టాలన్నారు. వంట గదులను, పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. నాణ్యమైన వంట పదార్థా లను విద్యార్థులకు అందించాలని, లేకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఏటీడ బ్ల్యూవో పి.సూర్యనారాయణ, ఎస్.త్రినాథరావు తదితరులున్నారు.

## కలుపు నివారణకు చర్యలు తీసుకోండి

రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ జగన్మోహనరావు

కోటబొమ్మాళి, జూలై 1(ఆంధ్రజ్యోతి): వరి ఎదలో కలుపు నివారణకు ప్రిటిలాక్లోర్ మందును ఇసుకతో కలిపి జల్లుకోవాలని టెక్కలి ఏడీఏ కె.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం ఎత్తురాళ్లపాడులో ఏవో ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ..వరి ఎదకు అధిక దిగుబడి వచ్చేందుకు ఎద వేసిన 15 రోజుల్లోగా ఒక బస్తా డీఏపీ, 25 కిలోల యూరియా, 20 కేజీల పొటాష్ వేయాలని సూచించారు. మెట్ట భూముల్లో వరి పంటకు బదులు ఉద్యాన వన పంటలను వేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### ఎదలతో అధిక లాభం

పలాస, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో విత్తనాలు ఎద చల్లడం ద్వారా అధిక లాభం సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీ ఎం. రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మొగిలిపాడు, కైజోల గ్రామాల్లో రైతులకు వరి ఎద సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల సూచనలు, మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. ఎదలు వేయడం ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు కూలీల సమస్య ఉందన్నారు. వ్యవసాయాధికారి పోలారావు, శారద, రాధ పాల్గొన్నారు.

## ఘనంగా ఎంజీఆర్ పుట్టినరోజు వేడుకలు

ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వీరాభిమాని చందు దివి

పాతపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాత పట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పుట్టిన రోజు వేడుకలు పార్టీ శ్రేణులు కార్యకర్తలు, అభిమానుల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంజీఆర్ వీరాభి మాని చందు దివి శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శిం చుకుని, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేరున ప్రత్యేక పూజలు చేయించి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. స్వామి ప్రసాదాలను ఎమ్మెల్యేకి అందించి శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకకు హాజరైన అభిమానులకు కేక్, స్వీట్లు పంచి పెట్టారు. మధ్యాహ్నం వేలాది మందికి విందు ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలు, అభిమానులు ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆంజనేయ స్వామికి 10,116 వడల సమర్పణ

కాశీబుగ్గ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంకేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆంజనేయ స్వామికి 10,116 వడలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి వివిధ రకాల పూలు, పండల్లతో పూజలు నిర్వహించారు. ఆంజనేయ ట్రాలీ రిక్షా, హమాలీ వర్కర్స్ యూనియన్, కార్మిక, వర్తక సంఘాల గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ, నేతలు వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీధర్, రామానందస్వామి, లొడగల కామేశ్వర రావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్వరలో ఒంటరి మహిళలకు పింఛన్లు: బగ్గు

పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలు, వితంతువులకు కూటమి ప్రభుత్వం త్వరలో పింఛన్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం వనితమండలం, జొన్నాం గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను అందించారు. ఆయన వెంట కాయ రవి, మెండ రామారావు, కృష్ణారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## అభివృద్ధి, సంక్షేమంతో ఆనందం: ఎంజీఆర్

పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నా రు. పాతపట్నం దువ్వారి వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, టీడీపీ నేతలు సైల బాబ్జీ, సైలాడ సతీష్, మడ్డు రామారావు, అక్కంద్ర సన్యాసి, మంచు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పందుల బాధ నుంచి విముక్తి కలిగించండి

నరసన్నపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పందుల స్వైర విహారంతో ఇబ్బందులు పడుతున్నామని, వీటి నుంచి విముక్తి కలిగించాలని పట్టణ వాసులు కోరారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్థానిక కుమ్మరి వీధి వాసులు మాట్లాడుతూ.. సోమవారం రాత్రి కుమ్మరి వీధిలో పందులు దాడికి ప్రయత్నించాయన్నారు. తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రం అందించారు పాతబస్టాండ్, శ్రీరామనగర్, జమ్ము జంక్షన్ తదితర ప్రాంతాల్లో పందులు బెడద ఎక్కువగా ఉందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఉపాధి పథకంలో చేపట్టిన పనులు బిల్లులను అప్‌లోడ్ చేస్తున్నామని, రెండురోజుల్లో చెల్లింపులు జరుగుతాయని డ్వామా సిబ్బంది తెలిపారు. గ్రామసభకు సర్పంచ్ శంకర్ అధ్యక్షత వహించగా ఈవో ద్రాక్షాయిణి, ఉప సర్పంచ్ కృష్ణబాబు, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కాశీబుగ్గ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏఐఐఈఏ సంఘం నిరంతరం పోరాటంచేస్తోందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, మాధవరావు అన్నారు. కాశీబుగ్గ ఎస్ఐసీ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సంఘం 75వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎల్ఐసీలో శతశాతం ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేం దుకు అవకాశం ఇవ్వకూడదన్నారు. పాలసీలకు జీఎస్టీ తొలగించాలని, క్లాస్ 3, 4 ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ బి సాయి, ఏబీఎంలు రాజా గణపతి, సురేష్, పలువురు సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## నట్టల నివారణ మందు వినియోగించుకోండి

కోటబొమ్మాళి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మూగ జీవులకు గ్రామాల్లో వేస్తున్న నట్టల నివారణ, నీలి నాలుక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్థక శాఖ డీడీ డా.చందక నర్సిం హులు సూచించారు. ఈ మేరకు మంగళవారం పాకివలస, యకయ్యపేట గ్రామాల్లో టీకాల కార్యక్రమం పరిశీలించారు. కురుడు పశువైద్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి పశువులకు అందిస్తున్న సేవలపై పశువైద్యుడు డా.ఎల్.కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

ఎల్.ఎన్.పేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళా సర్పంచ్‌లకు బుధవారం నుంచి శుక్ర వారం వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఈవోపీఆర్డీ పి.శ్రీనివాసులు తెలిపారు. ఈ శిక్షణ సీతంపేట వైటీసీ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటలవరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళా సర్పంచ్‌లందరూ హాజరు కావాలన్నారు.

### పలాస ఏడీఏగా రామారావు

పలాస, జూలై 1(ఆంధ్రజ్యోతి): పలాస వ్యవసాయశాఖ ఏడీగా ఎం. రామారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రైతులకు ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరు వులు సరఫరా చేయడం చేస్తామని, రైతులకు తగు సూచనలు చేసి వ్యవ సాయ ఉత్పత్తులు పెంచేలా కృషి చేస్తామన్నారు.

### ఇన్‌చార్జి సీడీపీవోగా లక్ష్మీబాయి

కొత్తూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవోగా పి.లక్ష్మీబాయి పూర్తి అదనపు బాధ్య తలతో నియమితులయ్యారు. ఈ మేరకు పీడీ ఉత్తర్వుల మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసినవిమల కుమారి ఇతర జిల్లాకు బదిలీ అయ్యారు. ఇదే ప్రాజెక్టులో హిరమండలం గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న లక్ష్మీబాయి ఇక్కడికి వచ్చారు.

### నేడు మండల సమావేశం

హిరమండలం, జూలై 1(ఆంధ్రజ్యోతి): హిరమండలం మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాళీ ప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

### టార్పాలిన్లు పంపిణీ

నందిగాం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వెలుగు ఆధ్వర్యంలో మహిళా రైతు సంఘాల సభ్యులకు టార్పాలిన్లను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం పి.మనోరత్నం, వంశధార డీసీ చైర్మన్ మళ్ల బాలకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు పి.అజయ్ కుమార్ అందించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.అరుణ, ఉపాధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

### ఘనంగా అమ్మవారి సంబరాలు

వజ్రపుకొత్తూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పూండి అభిరాం ఆటో యూనియన్ సంబరాలు మంగళవారం నిర్వహించారు. బోగాదేవి, పాల పోలమ్మ ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు బొమ్మాళి కామేశ్వరరావు, గుంట మురళి, తిమ్మల గణపతి, భాస్కరరావు పాల్గొన్నారు.

### సబ్సిడీపై పశువుల దాణా



వజ్రపుకొత్తూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తున్న దాణాను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. పశు వైద్యశాల వద్ద మంగళవారం ఏడీ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాడిరైతులకు పశు దాణాను అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధి కారి మెట్ట పాపారావు, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి అర్నవెల్లి మోహనరావు, నెయ్యిల సూర్యనారాయణ, పోతనపల్లి షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం, పుట్టపర్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లనున్నారు. 'సుపరిపాలనలో... తొలి అడుగు' పేరిట బుధవారం నుంచి ప్రజల వద్దకు వస్తున్నారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలు, సూపర్ సిక్స్ అమలు, సమస్యల పరిష్కారం గురించి వివరించేందుకు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. వీటితోపాటు ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఐదేళ్ల పాలనలో చేసిన విధ్వంసాన్ని ప్రజలకు గుర్తు చేయాలని నిర్ణయించారు. చేసిన, చేయబోయే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి, 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగనున్నారు.

### ప్రధాన అజెండా ఇదే..

● వైసీపీ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినింది. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ కంపెనీలు (మిగతా 6వ పేజీలో...)

# నేడే.. తొలి అడుగు



● ఇంటింటికీ మంత్రులు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు

● ఏడాదిలో జరిగిన మంచి గురించి చెప్పేందుకు..

● వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు

● 'సుపరిపాలనలో.. తొలి అడుగు' పేరిట కార్యక్రమం

## నెల రోజులు ప్రజల్లో టీడీపీ

### పండగలా నిర్వహిద్దాం: సవిత

పెనుకొండ టౌన్: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పండగలా నిర్వహిద్దామని మంత్రి సవిత టీడీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఎన్నికల పరిశీలకుడ నరసింహరావు ఆధ్వర్యంలో మంగళవారం పెనుకొండ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇప్పటికే తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్, దీపం-2, యువతకు ఉద్యోగాలు కల్పించామని, త్వరలో ఉచిత బస్సు, 204 అన్న క్యాంటీన్‌లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏడాదిలో వచ్చిన పరిశ్రమలు, ఎస్సీ వర్గీకరణ, డ్వాక్రా మహిళలకు రుణాలు, గుంతలు లేని రోడ్లు.. ఇలా అన్ని అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

మాట్లాడుతున్న మంత్రి సవిత

### ఎందుకంటే..?

'సుపరిపాలనలో... తొలి అడుగు' అజెండాను సీఎం చంద్రబాబు ప్రజా ప్రతినిధులకు అందజేశారు. ప్రజలకు ఏఏ అంశాల గురించి వివరించాలో దిశానిర్దేశం చేశారు. స్థానిక అంశాలు, ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, హామీల అమలు ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని ఎమ్మెల్యేకు సూచించారు. 2014-19వరకు అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించని కారణంగానే 2019లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్న విషయాన్ని టీడీపీ అధిష్ఠానం గుర్తించింది. వచ్చే ఎన్నికల్లో అలా జరగకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.



### 10న సీఎం పర్యటన: కలెక్టర్

తలమర్లలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ చేతన్

కొత్తచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు కొత్తచెరువుకు ఈ నెల 10న వస్తారని కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం తెలిపారు. సీఎం పర్యటన కోసం స్థానిక హైస్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రావాల్సి ఉన్నింది. కానీ మొహర్రం కారణంగా పదో తేదీకి పర్యటన వాయిదా పడింది. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ టీఎస్ చేతన్ పర్యవేక్షించారు.

#### అర్హులందరికీ పథకాలు

ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరవేస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్తచెరువు మండలం తలమర్లలో సచివాలయ సిబ్బందితో కలిసి వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ సొమ్మును అందజేశారు. పింఛన్ సొమ్మును ఇచ్చేందుకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అని ఆరా తీశారు. ఎంపీపీ గాయత్రీదేవి, ఎంపీడీఓ నటరాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మొద్దునిద్ర..!

ఎస్కేయూ ఆవరణలో తొలగించిన మొద్దులు, చెట్లకొమ్మలు (6వ పేజీలో...)

## ఆశ తీరేనా..?

బైపాస్ కెనాల్ కోసం ప్రజల ఎదురుచూపు

నిర్మాణం పూర్తయితే 90 కి.మీ. తగ్గనున్న దూరం

ఆర్థికశాఖ అనుమతి కోసం నివేదిక

మడకశిర, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ దశాబ్దాల కల బైపాస్ కెనాల్ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని మడకశిర నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు మడకశిర ప్రాంతంలో పర్యటించినపుడు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణం గురించి ఆయనకు విన్నవించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈక్రమంలోనే మే నెలలో బైపాస్ కెనాల్ నిర్మాణానికి ఆర్థిక శాఖ అనుమతి కోసం నివేదికను పంపినట్లు తెలిసింది. ఈ బైపాస్ కెనాల్ పూర్తి అయితే గొల్లపల్లి నుంచి మడకశిర చెరువుకు కృష్ణా జలాలు చేరే మార్గం 40 కిలోమీటర్లలోపే ఉంటుంది. ప్రస్తుతం ఉన్న కాలువ ద్వారా అయితే హిందూపురం, పరిగి మీదుగా 130 కిలోమీటర్లు చుట్టి రావాల్సి వస్తోంది. దీంతో నీరు చెరువులకు చేరడం ఆలస్యమవుతోంది. నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ వేగంగా, సంపూర్తిగా నీరు ఇవ్వాలంటే బైపాస్ కెనాల్ పూర్తి కావాల్సి ఉంది.

హంద్రీనీవా కాలువలో కంప చెట్లు పూడిక పెరిగిన దృశ్యం

#### వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

వైసీపీ పాలనలో హంద్రీనీవా కాలువలకు మరమ్మతులు కూడా చేయకపోవడంతో కృష్ణా జలాలు చెరువులకు వదిలినప్పుడు గండ్లు పడి నీరంతా వృథా అయ్యింది. మరమ్మతుల కోసం అప్పట్లో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. గత ఏడాది కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ కింద రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మడకశిర బ్రాంచి కెనాల్ నుంచి మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ వరకు 238 కిలోమీటర్ల కాలువ ఉంది. నిర్వహణ లేకపోవడంతో కాలువలో కంప చెట్లు పెరిగి, పూడిక పేరుకు పోయింది. వీటిని తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మడకశిరకు రూ.1.32 కోట్లు, పెనుకొండకు రూ.1.8 కోట్లు, హిందూపురానికి రూ.1.65కోట్లు, కదిరి నియోజకవర్గానికి రూ.35లక్షలు, నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినట్లు అధికారుల సమాచారం. చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దల నుంచి గొల్లపల్లి రిజర్వాయర్, అక్కడి నుంచి పెనుకొండ, సోమందేపల్లి, చిలమతూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి మడకశిర, జంబలబండ వరకు హంద్రీనీవా కాలువ ఉంది. ఇంత పొడవైన కాలువలో పెరిగిన చెట్లు తొలగించడం, పూడకతీయడం పూర్తి చేస్తే కృష్ణా జలాలు వేగంగా ప్రవహించే అవకాశం ఉంటుంది.

#### నివేదిక పంపాం: నాగార్జున, ఏఈ, హంద్రీనీవా

బైపాస్ కెనాల్ నిర్మాణానికి సంబంధించి ఆర్థిక శాఖకు నివేదికను ఇప్పటికే పంపాం. ఆర్థికశాఖ అనుమంతించిన వెంటనే పనులు చేపడతాం. హంద్రీనీవా కాలువలో పూడిక, కంపచెట్లు తొలగించడానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

## అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఐపీ పీడీ సుదర్శన్

పెనుకొండ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే డ్రిప్, స్ప్రింకర్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) ఎంఐఓలను హెచ్చరించారు. మంగళవారం హార్టికల్చర్ కార్యాలయంలో స్ప్రింకర్ల కంపెనీ డీసీఓలు, డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్రిప్, స్ప్రింకర్ల సరఫరా సమీక్షించారు. డ్రిప్ పరికరాలు కావాల్సిన వారు రైతు సేవాకేంద్రాల్లోలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుల నుంచి సబ్సిడీయేతర సొమ్ము సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఎంఐ కంపెనీ, డీసీఓలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఐఓలు పాల్గొన్నారు.

## భూసేకరణ వేగవంతం చేయాలి

కలెక్టర్ టీఎస్ చేతన్

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంత చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారుల భూసేకరణలో పెండింగ్‌పై అధికారులు దృష్టి పెట్టి, అత్యవసరంగా పూర్తి చేయాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఎన్‌హెచ్342 ప్యాకేజీలోని ముదిగుబ్బ మండలంలోని దొరిగిల్లు ప్రభుత్వ కళాశాల ప్రహరీ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, పుట్టపర్తి మండలంలోని అమ్మగొండ్యపాళ్యం ప్రాతంలో పెడింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్య, ఎన్‌హెచ్ఏఐ పీడీ అశోక్‌కుమార్, డీఈ గిడ్డయ్య, ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు పాల్గొన్నారు.

## వైసీపీ నేత బత్తల ఇంటిపై సీబీఐ దాడులు

రాత్రి వరకూ కొనసాగుతున్న తనిఖీలు

ఇంట్లోకి ఎవరినీ అనుమతించని సీబీఐ

మెడికల్ కాలేజీలకు బి-పర్మిషన్ పేరిట లంచాలు

బత్తల ఇంటి బయట పోలీసులు, వైసీపీ నాయకులు

వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తల హరిప్రసాద్ ఇంటిపై సీబీఐ అధికారులు దాడులు నిర్వహించారు. కదిరి మండలం కుమ్మర వాండ్లపల్లిలోని ఆయన నివాసానికి బెంగళూరు నుంచి సీబీఐ అధికారుల బృందం మంగళవారం రాత్రి 8 గంటలకు చేరుకుంది. మెడికల్ కాలేజీలకు బి-పర్మిషన్ జారీ పేరిట ఆయన లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఢిల్లీలో సీబీఐ కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా బత్తల ఇంటిని సోదా చేయాలని బెంగళూరు యూనిట్‌కు సూచించింది. దీంతో ఆధారాల సేకరణ కోసం బత్తల ఇంటికి సీబీఐ బృందం వచ్చింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది బత్తల ఇంటి వద్దకు వెళ్లారు. అవసరమైతే పిలుస్తామని పోలీసులకు సూచించారు. దీంతో వారు ఇంటి బయటే ఉండిపోయారు. రాత్రి పొద్దుపోయేదాకా తనిఖీలు కొనసాగుతున్నాయి.

(వివరాలు మెయిన్‌లో)

# హాట్ సీటు..!

చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ పోస్టుకి పోటీ

తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ముగ్గురు

నేతలు, ఉన్నతాధికారుల ద్వారా పైరవీలు

కొనసాగేందుకు ప్రస్తుత అధికారి ఎత్తులు

'అడిగినంత ఇచ్చుకుంటా.. మీరు చెప్పిన పనులు చక్కబెడతా. చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపండి.'

'మిగతా వాళ్లు ఇచ్చేదానికంటే రెట్టింపు ఇస్తా. ఎలాగైనా అక్కడ పోస్టు మాత్రం నాకే కావాలి.'

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ సీటు దక్కించుకునేందుకు పోటీపడుతున్న అధికారులు ఇస్తున్న ఆఫర్లు ఇవి. ఈ సీటులోకి వచ్చేందుకు ఏకంగా ముగ్గురు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అధికారి కూడా ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారు.

చిలమత్తూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎక్కడాలేని డిమాండ్ చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకి ఉంటోంది. 15 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో భూముల ధరలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఊహకందని విధంగా పెరిగిపోయాయి. దీంతో కార్యాలయానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఆదాయం బాగా పెరిగింది. దీంతో ఇక్కడ పనిచేయడానికి చాలామంది పోటీ పడుతున్నారు. ఈ సీటు కోసం ఏకంగా నలుగురు సబ్‌రిజిస్ట్రార్లు పోటీలో ఉన్నట్లు సమాచారం. ఎవరి స్థాయిలో వారు పైరవీలు మొదలెట్టారని ఇప్పటికే టాక్. ఆ శాఖ ఉన్నతాధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలకు దిగినట్లు సమాచారం. రేటు ఎంతైనా ఫర్వాలేదనీ, అక్కడే పనిచేయాలని ముగ్గురు అధికారులు అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది.

### రావడానికి ముగ్గురు..

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ సీటు పట్టడానికి ముగ్గురు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వారిలో ఇద్దరు గతంలో చిలమత్తూరులోనే పనిచేశారు. ఒక మహిళా అధికారి కదిరిలో పనిచేస్తూ అవినీతి ఆరోపణలపై బదిలీ అయ్యారు. ఇప్పటికే వీరు పైరవీల్లో తలమునకలైపోయారు. రేపే.. మాపో.. పోస్టు భర్తీ అయ్యే అవకాశాలు ఉండటంతో ఎలాగైనా సీటు దక్కించుకోవాలని చివరి వరకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఆశీస్సులు పొందడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు పోస్టు వచ్చేలా చూస్తే అడిగినంత ఇవ్వడంతోపాటు చెప్పిన పనులను చక్కబెడతామని ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు సమాచారం. ఈ ముగ్గురిలో ఎవరు తూకం అధికంగా చెల్లించుకుంటే వారికి పోస్టు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.

### ఎందుకింత డిమాండ్?

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో చిలమత్తూరు, గోరంట్ల మండలాలు పూర్తిగాను, లేపాక్షి, సోమందేపల్లి పాక్షికంగా ఉన్నాయి. వీటిలో అధికంగా గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లోనే రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అందులో గోరంట్ల మండలంలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఎకరం కోట్ల రూపాయలు పలుకుతోంది. చిలమత్తూరు మండలంలో కూడా ఎకరం ధర రూ.కోట్లలోనే ఉంటోంది. దీంతోపాటు ఈ మండలాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి ఊహించని విధంగా జరుగుతోంది. దీంతో భూముల ధరలు ఆకాశాన్నంటే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ రెండు మండలాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, కోడూరు-ముదిగుబ్బ, హిందూపురం-కదిరి జాతీయ రహదారుల పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ మండలాల పరిధిలో భూముల ధరలు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉండడంతో రిజిస్ట్రేషన్లు ఊపందుకుంటాయని తెలుస్తోంది. మరోసారి పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇప్పటికే టేకులోడు రెవెన్యూ పొలంలో భూసేకరణ చేపడుతోంది. చిలమత్తూరు, కోడూరు, శెట్టిపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో భూసేకరణ వేగంగా సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రియల్ భూం వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆదాయం వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుండటంతో ఇక్కడ పనిచేసేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

### కళ్లు మూసుకుంటే లక్షలే..?

సాధారణంగా భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో అధికారులు నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం నిబంధనలకు పాతర వేస్తుంటారనే ఆరోపణలు మొదట్నుంచీ ఉన్నాయి. భూముల ధరలు కోట్లలో ఉండటంతో అవి రిజిస్ట్రేషన్ చేసే సమయంలో చిన్నచిన్న సమస్యలు.. నిబంధనలకు ఆటంకంగా మారుతుంటాయి. ఆ సమయంలో ఒక్క క్షణం కళ్లు మూసుకుంటే అడిగినంత వచ్చి పడుతుంది. అలాంటివే ఇక్కడ అధికారులకు ఆదాయ మార్గాలుగా మారుతున్నాయి. డాక్యుమెంట్లను పరిశీలించకుండానే కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ వ్యక్తి నుంచి అధిక మొత్తంలో లంచం డిమాండ్ చేసిన అధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. నిబంధనలకు పాతర వేసిన మరో అధికారి సస్పెండయ్యారు. అయినా, ఇక్కడ అక్రమాలకు అడ్డుకట్ట పడట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

APS RTC

పల్లె వెలుగు

టెండరు ప్రకటన

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన గ్యారేజీలలో మెకానిక్స్, ఎలక్ట్రీషియన్, ట్రిమ్మర్, శ్రామిక్స్, టైర్ మెకానిక్, బ్లాక్‌స్మిత్, హేమర్ మాన్, వెల్డర్ మరియు వెహికల్ వాషింగ్ మరియు స్వీపింగ్ చేయు నిమిత్తం స్కిల్డ్, అన్ స్కిల్డ్ వర్కర్లను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సరఫరా చేయుటకు అనుభవం, ఆసక్తి కలిగిన సంస్థలు/ ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయము లలో తేది.04-07-2025 నుండి తేది.16-07-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.17-07-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, పుట్టపర్తి నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు, నియమనిబంధనలకు మరియు కాంట్రాక్టర్స్/ ఏజెన్సీలు మరియు అభ్యర్థుల అర్హతల కొరకు మా వెబ్‌సైట్ : https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. P3/797(01)/2025-DPTO(S), తేది: 30-06-2025

సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, పుట్టపర్తి, శ్రీసత్యసాయి జిల్లా.

శిథిలావస్థకు చేరిన నింబగల్లు హెడ్‌రెగ్యులేటర్ షట్టర్లు

కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పూడిక

కోతకు గురైన కాలువగట్టు

# మరమ్మతులైనా చేయండి

## ఏళ్లు గడిచినా పూర్తికాని ఆధునికీకరణ పనులు

**కాలువలో పేరుకుపోయిన మట్టి, బండరాళ్లు.. ప్రశ్నార్థకంగా హెచ్చెల్సీలో నీటి పారుదల**

ఉరవకొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టి ఒకటిన్నర దశాబ్దాల కాలం దాటినా ఏమాత్రం ముందుకు సాగడం లేదు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టింది. అయితే ఏళ్లు గడిచినా ఆరో ప్యాకేజీలో పనులకు మోక్షం కలగలేదు. కొద్దివరకు పనులు చేసి వదిలేశారు. ఈక్రమంలోనే భారీ వర్షాల వల్ల ఏర్పడిన కోతలతో కాలువ అధ్వానంగా మారింది. గత పాలకులు ఎవరూ ఈ ఆధునికీకరణ పనుల గురించి పట్టించుకోలేదు. కాలువలో పూడిక పెరిగిపోవడంతో నీరు ముందుకు పారడం ప్రశ్నార్థకంగా మారింది. కాలువలో పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పెరిగిపోయాయి. హెచ్చెల్సీ ఆరో ప్యాకేజీలో 183వ కి.మీ నుంచి 189కి.మీ వరకూ పనులు నిలిచి పోయాయి. ఇంద్రావతి డీప్ కట్ వద్ద ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హెచ్చెల్సీ గట్టు కోతకు గురైంది. నింబగల్లు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం వల్ల కాలువలోకి మట్టి కొట్టుకు వచ్చింది. ఇది నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. హెచ్చెల్సీకి ఉన్న షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి. షట్టర్లకు ఉన్న రాళ్లు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేస్తే సాగునీరు పారే అవకాశముంది. ఇంద్రావతి వద్ద డీప్‌కట్‌లో అడ్డంగా పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి.

● ఈ విషయంపై హెచ్చెల్సీ ఏఈ నజీరుద్దీన్‌ను వివరణ కోరగా కోతకు గురైన కాలువగట్లు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీకి నీళ్లు వచ్చేలోపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



### నేడు అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీవీఈఓ గురుప్రసాద్ ప్రకటనలో తెలిపారు. స్టాక్ మేనేజ్‌మెంట్, డెయిరీ కోర్సులకు లెక్చరర్లు అవసరమన్నారు. ఇందుకు వెటర్నరీ, డెయిరీ సైన్స్ చదివినవారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల వారు బుధవారం ఉదయం 10.30 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని డీవీఈఓ తెలిపారు.

### నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించనున్నట్లు ఏపీసీ శైలజ వెల్లడించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న కేజీబీవీఎస్‌ఓలు, సీఆర్‌టీలు, ఐఈడీలు, ఆపరేటర్లు, ఇతర బోధనేతర సిబ్బంది నుంచి మ్యూచువల్స్, రిక్వెస్ట్ బదిలీలకు దరకాస్తులు స్వీకరించామన్నారు. వాటిని పరిశీలించి తుదిసీనియార్టీ జాబితాను తయారుచేసి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆ జాబితాలో పేర్లున్న వారందరికీ బుధవారం ఉదయం 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. సీనియారిటీ లిస్టులో అదనపు పాయింట్లు పొందిన అభ్యర్థులు అందుకు సంబంధించిన స్పౌజ్, మెడికల్, డెత్, లీగల్ సర్టిఫికెట్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఏపీసీ తెలిపారు.

### ప్రతి నెలా స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

**కలెక్టర్ వినోద్‌కుమార్**

అనంతపురం కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీన పేదల సేవలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్, మున్సిపల్, డ్వామా, జడ్పీ తదితర శాఖల అధికారులతో మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఓడీఎఫ్ ప్లస్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సాస యాప్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, ఇంకుడు గుంతలు, స్వచ్ఛత, పరిశుభ్రత, పారిశుధ్యం, అన్న క్యాంటీన్లు, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీ పేదల సేవలో ప్రభుత్వ కార్యక్రమాలు, 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, 30న సివిల్ రైట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నెలలో మూడు కార్యక్రమాల ద్వారా 36 గ్రామాలను కవర్ చేయాలని అన్నారు. ప్రతి నెలా నియోజకవర్గంలోని ఒక గ్రామానికి తాను వెళతానని అన్నారు.

### చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు (గైరంగాలు) టన్ను గరిష్ఠంగా రూ.28,200 అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలకు విక్రయాలు జరిగాయన్నారు. ఇక సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 16వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 792 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

# నేడే.. తొలి అడుగు

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రానికి వచ్చాయి.

● దేశంలోని ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా హామీ మేరకు... రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల పింఛన్లు అందజేస్తున్నారు.

● సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం ప్రారంభించారు. దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. మెగా డీఎస్సీలో భాగంగా 16,347 టీచర్ పోస్టు భర్తీకి చర్యలు చేపట్టారు.

● మత్స్యకార భరోసా, రూ.5కే అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం, అల్పాహారం. అర్చకులకు, నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేల చొప్పున ఆర్థిచేయూత అందిస్తున్నారు. పాస్టర్లు, ఇమామ్‌లు, మౌజన్లకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అమలు చేస్తున్నారు. పీ-4 ద్వారా నిరుపేదలకు ఆర్థిక చేయూతనందించి, ఆ వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

● ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నారు. అగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు.

● కరువు జిల్లా అనంతకు జీవనాడి అయిన హంద్రీనీవాను పూర్తిచేసి, ప్రతి ఎకరానరికీ సాగునీరు అందించేందుకు ఏకంగా రూ.3,800 కోట్లు బడ్జెట్లో కేటాయించారు. హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇదే నెలలో పనులన్నీ పూర్తిచేసి, ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించనున్నారు.

#### ఎవరెవరు ఎక్కడెక్కడ..?

● ఉరవకొండ ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడేరు మండలం జయపురంలో 'తొలి అడుగు' వేస్తారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగరంలోని 39వ డివిజన్‌లో లక్ష్మీనగర్ రామాలయం నుంచి ప్రారంభిస్తారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శెట్టూరు మండలం పెరుగు పాళ్యం నుంచి, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు గుమ్మఘట్ట మండలం కేపీ కుంట నుంచి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆత్మకూరు మండలం ముట్టాల నుంచి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గార్లదిన్నె నుంచి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కసాపురం నుంచి తొలి అడుగును ప్రారంభిస్తారు.

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత గోరంట్ల మండలం

కొలింపల్లిలో తొలి అడుగు ప్రారంభిస్తారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అమడగూరు మండలం కసముంద్రంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మడకశిర మండలం చందకచర్లలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలో ప్రారంభిస్తారు. హిందూపురంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ శ్రేణులు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ధర్మవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పిలుపునిచ్చారు.

### అర్హత ఉంటే.. హాస్టల్ సీటు

**బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి**

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి బీసీ సంక్షేమ హాస్టల్‌లో సీటు ఇస్తామని డీడీ కుష్బూ కొఠారి తెలిపారు. ప్రస్తుతం హాస్టళ్లలో అడ్మిషన్లు జరుగుతున్నాయనీ, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాస్టళ్ల మెరుగుకు తీసుకోబోతున్న చర్యలపై డీడీతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

**ప్రశ్న: జిల్లాలో ఎన్ని బీసీ హాస్టళ్లు ఉన్నాయి?**

**డీడీ:** జిల్లావ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ హాస్టళ్లున్నాయి. పట్టణాలు, నగరాల్లోని హాస్టళ్లలో చేరడానికే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మండల స్థాయిలోని కొన్ని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఆరింటిలో 50 మందికన్నా తక్కువగా పిల్లలు ఉన్నారు. అక్కడ అడ్మిషన్లు పెంచడానికి వార్డెన్లు, సిబ్బంది ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడతాం.

**ప్ర: హాస్టళ్లలో చాలినంత మంది సిబ్బంది ఉన్నారా?**

**డీడీ:** జిల్లాలో 55 హాస్టళ్లు ఉంటే 35 మందివార్డెన్లు మాత్రమే ఉన్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమీప హాస్టళ్ల వారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న: మెనూ నిబంధనల మేరకు భోజనం అందిస్తున్నారా?**

**డీడీ:** మెనూ తప్పనిసరిగా అమలు చేస్తున్నాం. హాస్టళ్లకు ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తోంది. దీంతో ఆ ఏడాది నుంచి అన్నం మరింత నాణ్యతగా, రుచిగా ఉంటోంది.

**ప్ర: బోగస్ పిల్లలను చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి కదా..?**

**డీడీ:** గతంలో అలాంటివి జరగి ఉండొచ్చేమోగానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. హాస్టల్‌లో ఉంటున్న ప్రతి విద్యార్థి ప్రతిరోజు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది. అలాంటపుడు బోగస్ విద్యార్థులను చూపించే అవకాశమే ఉండదు.

**ప్ర: వార్డెన్లు స్థానికంగా ఉండరనే విమర్శలున్నాయి. దీని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?**

**డీడీ:** వార్డెన్లు స్థానికంగానే ఉండాలి. ఇదే విషయం పదేపదే చెబుతున్నాం. కొందరు అలా ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్న విషయం వాస్తవమే. వారిపై ప్రత్యేక నిఘాఉంచుతాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

# పెద్దారెడ్డిని ప్రజలే రానివ్వడం లేదు

**భూములు, ఇళ్లు, ఇసుక అన్నీ దోచేశారు..**

**రికార్డులు, ఆధారాలూ పంపుతా.. చూడండి**

**ఐదేళ్లు నాపై, నా కొడుకుపై అనేక అక్రమ కేసులు పెట్టారు: జేసీ ప్రభాకర్ రెడ్డి**

అనంతపురం క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డిని ప్రజలే తాడిపత్రికిలోకి రానివ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దారెడ్డి పెద్ద కొడుకు ఒక రోగ్ అని, తాడిపత్రిని దోచేసి నాశనం చేశారంటూ మండిపడ్డారు. గత ఐదేళ్లు తనపై, తన కొడుకుపై కేసులు పెట్టి జైళ్లకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ ఉంటే జుట్టు, లేకుంటే కాళ్లు పట్టుకునే చందంగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. మంగళవారం ఆయన అనంతపురంలోని తన గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేతలకు తాను వ్యతిరేకం కాదన్నారు. నాడు తన అన్న దివాకర్ రెడ్డి శిష్యులుగా ఉన్న వారు ప్రస్తుతం వైసీపీలో ఉన్నారన్నారు. గత ఐదేళ్లలో చట్టాలను పక్కన బెట్టి తమపై కేసులు పెట్టారన్నారు. తనను 130 రోజులు, తన కొడుకు జేసీ అశ్మిత్ రెడ్డిని 75 రోజులు జైల్లో పెట్టారన్నారు. గత ఐదేళ్లలో కేతిరెడ్డి పెద్దారెడ్డి చేయని అరాచకం లేదన్నారు. తన ఉన్న ఇళ్లు 6 సెంట్లు ఫ్రాడ్ చేసి రిజిస్ట్రర్ చేయించారని, కోటమికుంట్లలో వందల ఎకరాల భూ అక్రమాలు జరిగాయన్నారు. రైతులు సోలార్‌కు ఇస్తే... వాటిని కన్వర్షన్ చేసిన తర్వాత కూడా అక్రమంగా పాసు పుస్తకాలు చేశారంటూ మండిపడ్డారు. తనకు గన్‌మెన్ కూడా లేరన్నారు. పెద్దారెడ్డి ప్రైవేటు గన్‌మెన్‌ను కూడా పెట్టుకున్నాడన్నారు. తననెవరూ చంపలేరనీ, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న పెద్దారెడ్డి ట్రై చేసేలా ఉన్నాడన్నారు. సూర్యప్రతాప్‌రెడ్డి లేకుంటే.. పెద్దారెడ్డి జీరో అన్నారు. తనను ముండమోపి అంటూ పెద్దారెడ్డి అంటున్నారనీ, ఆయన ఏ జెండర్ కూడా తెలియడం లేదన్నారు. ఆయన డాంకీ, క్రాస్ బ్రీడ్‌లా ఉంటాడనీ, అలాగే తింటాడంటూ ఎద్దేవా చేశారు. పెద్దారెడ్డి సారా కూడా కాచారని, ఇసుక అమ్మడంతోపాటు అనేక అక్రమాలు చేశాడన్నారు. తనకు ఆ అవసరం లేదనీ, మీసం మెలేసి బతుతున్నానంటూ మీసం తిప్పుతూ తెలియజేశారు. పెద్దారెడ్డికి ఇదే లాస్ట్ వార్నింగ్ అంటూ హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

# వారిని వదిలేసి.. నాపై నిందలా..!

**ఈ-స్టాంపులపై నేనే ఫిర్యాదు చేశా**

**టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీచౌదరి**

అనంతపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వారిని వదిలేసి, తనపై నిందలు వేయడం తగదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీ చౌదరి పేర్కొన్నారు. ఈ-స్టాంపుల వ్యవహారంలో అధికారులకు తానే ఫిర్యాదు చేశానన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎర్రప్ప అలియాస్ బాబు మీ-సేవలో అవినీతికి పాల్పడుతూ ఈ-స్టాంప్‌లలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తనకు సమాచారం అందిందన్నారు. దీనిపై ఎర్రప్ప అలియాస్ బాబును ఫోన్‌ద్వారా విచారించానన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు సైతం తన వద్ద ఉన్నాయన్నారు. ఆ విషయంలో తప్పు.. మీసేవ బాబును ఎప్పుడూ సంప్రదించలేదని తెలిపారు. ఇదే విషయంపై తాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు వివరణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై బాబుకు సంబంధించిన మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారన్నారు. ఈ కక్షతోనే తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. అసలైన బాధ్యులను వదిలేసి తనపై వేధింపులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వ్యక్తులను వదిలేసి కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తనపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఘటనపై మరోసారి ఆడిట్ నిర్వహించి, నిజానిజాలు నిగ్గుతేల్చాలనీ, వాటిని ప్రజలకు తెలియజెప్పాలని కోరారు.

మాట్లాడుతున్న మారుతీచౌదరి

# కుళ్లాయిస్వామికి నిత్యపూజ నివేదన

**భక్తులతో కిక్కిరుస్తున్న గూగూడు**

నార్పల, జూలై 1(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామికి మంగళవారం నిత్య పూజ నివేదన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తాదులు కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అధికారులు క్యూలైన్లు కూడా ఏర్పాటు చేయడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాలు చేసేందుకు నీరు కూడా లేదని వాపోయారు.

#### గూగూడు ఉత్సవాలపై డ్రోన్ నిఘా

అనంతపురం క్రైం(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలపై డ్రోన్ నిఘా ఉంచనున్నట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తవాలు ఆద్యంతం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల పరిసరాల్లో భక్తుల తాకిడిని పర్యవేక్షిస్తామన్నారు. ట్రాఫిక్, నేరాలను నియంత్రిస్తామన్నారు.

కొలువుదీరిన కుళ్లాయిస్వామి, గూగూడు కుళ్లాయిస్వామి దేవాలయం డ్రోన్ వ్యూ..

### వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ఆత్మకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సర్పసూక్త క్షీరాభిషేకం చేశారు. ఆకుపూజ, అలంకరణ, అర్చన, మహానైవేద్య సమర్పణ, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. కల్యాణ కట్టపై శ్రీవల్లీదేవసేనతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

# మొద్దు నిద్ర..!

● నెలలు గడుస్తున్నా తరలించకుండా నిర్లక్ష్యం
● విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్న వైనం
● పట్టించుకోని అధికారులు

**ఎస్కేయూ ఆవరణలో తొలగించిన మొద్దులు, చెట్ల కొమ్మలు**



కుప్పలు.. తెప్పలుగా తొలగించిన చెట్ల మొద్దులు

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎండిపోయిన మొద్దులను చూసి ఇదేదో కట్టెల డిపో అనుకుంటే పొరబడినట్లే. ఇది ప్రతిష్టాత్మక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆవరణం. క్యాంపస్‌లో ఎండిపోయిన భారీ వృక్షాలను కొట్టేసి, వేర్లతోసహా పెకలించారు. విద్యుత్ లైన్లను అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సైతం నెలల క్రితం తొలగించారు. వాటిని వర్సిటీ ఆవరణలో అలాగే వదిలేశారు. అవి పూర్తిగా ఎండిపోయాయి. వాటిలోకి విషపురుగులు చేరుకుని, ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. దీనిపై నిత్యం అక్కడే తిరిగే వేలాది మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు. వాటిని వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టర్ తరలించకుండా నెలలుగా అక్కడే వదిలేశాడు. కొన్ని మొద్దులతో షెడ్ల కింద వంటావార్పు కూడా చేశారు. అయినా వర్సిటీ అధికారులు వాటిని తరలించే ప్రయత్నాలు చేయరు. మొద్దునిద్ర వీడరు.

#### వర్సిటీ పునఃప్రారంభం నాటికి తొలగించేస్తాం

వర్సిటీ ఆవరణలో ఎండిపోయిన వృక్షాలు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాం. వాటిని అటవీశాఖ అధికారుల అనుమతితో బహిరంగ వేలం నిర్వహించాం. వేలంలో దక్కించుకున్నవారు వాటిని తరలించడంలో జాప్యమవుతోంది. ప్రస్తుతం వర్సిటీకి సెలవులు. పునఃప్రారంభమయ్యే నాటికి వాటిని తొలగించేలా చర్యలు చేపడతాం.

- రవిప్రసాద్‌రావు, వర్సిటీ ఎస్టేట్ అధికారి

ఇంజనీరింగ్ విభాగం సమీపంలోని వాహనాల పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటైన పాయ్యి

# సారు.. రిటైర్డ్ హర్ట్..!

● బదిలీలు ముగియకనే ఎస్ఈ ఉద్యోగ విరమణ
● త్రిశంకు స్వర్గంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

అనంతపురం న్యూ టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఇంజనీరింగ్ అసిసెంట్ల బదిలీలకు కొత్త చిక్క వచ్చిపడింది. బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సిన పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ గతనెల 30న ఉద్యోగ విరమణ చేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈఈకి ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించినా.. ఆయన కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి దాపురించింది. ప్రక్రియ మధ్యలో ఆయన ఏ నిర్ణయమూ తీసుకోలేక సతమతమవుతున్నట్లు తెలిసింది. బదిలీల ప్రక్రియ జూన్ 30వ తేదీకి పూర్తిచేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మొత్తం ప్రక్రియ అప్పటివరకు ఎవరు ఎస్ఈగా ఉంటే వారే పూర్తిచేయాల్సి ఉంటుంది. గతనెల 30వ తేదీ వరకు అన్నీ తానై ఎస్ఈ జమీర్ అస్లాం బదిలీల ప్రక్రియ చేపట్టారు. ప్రక్రియ ముగియకనే అదేరోజు ఉద్యోగ విరమణ పొందారు. ఈఈ ప్రభాకర్ రెడ్డికి ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు. బదిలీల మధ్యలో ఆయన ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతున్నారని తెలిసింది. సిఫార్సులపై ఒత్తిళ్లు వస్తుండటంతో సమాధానాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. మంగళవారం కూడా బదిలీల జాబితా ఫైనల్ కాలేదు. బుధవారం కూడా ఇదే పరిస్థి కొనసాగితే జాబితా తయారు కావడం కష్టమేనన్న ప్రచారం జరుగుతోంది. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో టెన్షన్ నెలకొంది. ప్రక్రియ ఎప్పుడు ముగుస్తుందో, కోరుకున్న ప్లేస్‌లు దక్కుతాయో, లేవోనని ఆందోళన చెందుతున్నారు. ఎస్ఈ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

# ఉద్యోగి బిజీనెస్..!

పని దినాల్లోనూ వ్యాపారాలు

లేపాక్షి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వోద్యోగి విధులను పక్కనబెట్టి, వ్యాపారాల్లో బిజీ అయిపోయాడు. స్థానిక వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చికెన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడుపుతున్నాడు. పనిదినాల్లో సైతం అక్కడే ఉంటున్నాడు. దీంతో మండల ప్రజలు విస్తుపోతున్నారు. కార్యాలయంలో సమావేశాలకు టీలు, టిఫిన్లు ఉద్యోగి హోటల్ నుంచే తీసుకెళ్లాలని హుకుం జారీ చేస్తున్నాడు. మహిళా గ్రూపు సభ్యులకు సైతం త్వరగా రుణాలు ఇచ్చేలా చూస్తానంటూ మాయమాటలు చెబుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఉద్యోగులు ఆడిందే ఆటగా తయారైందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**పనిదినాల్లో వ్యాపారాలు చేస్తే చర్యలు: రామిరెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్**

పనిదినాల్లో వ్యాపారాలు నిర్వహిస్తూ విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించినపుడు టీ, టిఫిన్లు ఒకేచోట తీసుకురావాలన్న నిబంధనలు లేవు. అలా ఒత్తిడిచేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం.




చికెన్ సెంటర్‌లో కూర్చున్న వెలుగు ఉద్యోగి

# ఏడాదిగా ఇన్‌చార్జే దిక్కు

యల్లనూరుకు రెగ్యులర్ తహసీల్దార్ ఏడీ..?

భూ సమస్యలతో ప్రజల అవస్థలు

తహసీల్దార్ కార్యాలయం

యల్లనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంవత్సర కాలం నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో రెగ్యులర్ తహసీల్దార్ బదిలీ కావడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జ్ పాలనే సాగుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే తహసీల్దార్‌గా నాగరాజును నియమించినప్పటికీ ఆయన పది రోజులు పని చేసి, దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాడు. అప్పటినుంచి పుట్లూరు తహసీల్దార్‌కే ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫాక్షన్ మండలం కావడంతో రెగ్యులర్ తహసీల్దార్ లేక భూ వివాదాలు జటిలమవుతున్నాయి. తహసీల్దార్ పోస్టుతోపాటు సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. మండలంలో సుమారు 40 రేషన్ షాపులు ఉన్నాయి. ఏదో ఒక గ్రామంలో నిత్యావసర సరుకుల సమస్య తలెత్తుతూ ఉంది. గత కొంతకాలంగా ఈ పోస్టుకు కూడా ఇన్‌చార్జ్ దిక్కయ్యారు.

## దీర్ఘకాలంగా పెండింగ్‌లో సమస్యలు

మండలంలో అనేక రెవెన్యూ సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. రీసర్వేలు జరిగిన గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. సర్వే జరిగిన గ్రామాల్లో ఒకే సర్వే నెంబర్‌లోని పూర్తి విస్తీర్ణ భూమిని విభాగాలు చేయాల్సి ఉండగా అలాగే ఉంచారు. దీంతో రైతుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి. రీసర్వే జరిగిన కాచర్లగుంట గ్రామంలో రైతు చంద్రశేఖర్‌రెడ్డికి సంబంధించిన భూమి కొనుగోలు రిజిస్టర్‌లో ఉన్నప్పటికి దాన్ని ప్రభుత్వ భూమిలోకి చేర్చారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆన్‌లైన్‌లో భూమి నమోదు కాకపోవడంతో రైతు బ్యాంకులో తీసుకున్న పంట రుణాన్ని రెన్యువల్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో వడ్డీ ఎక్కువ పెరిగిపోతోందని రైతు వాపోతున్నాడు. ఇలాంటి సంఘటనలు మండల వ్యాప్తంగా చాలా ఉన్నాయి. మండలంలో రెవెన్యూ సమస్యలు తరచూ తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరించే అధికారిని నియమించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జిల్లా అధికారులను కోరారు. అయినా ప్రయోజనం శూన్యం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మూడేళ్లు జేఎన్‌టీయూలో.. చివరి ఏడాది స్వీడన్‌లో..!

● జేఎన్‌టీయూలో స్వీడన్ బ్యాచ్ కోర్సు
● 10 వరకు దరఖాస్తు గడువు

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో స్వీడన్ బ్యాచ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఆ మేరకు 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను ఇటీవల ప్రారంభించింది. బీటెక్ మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూ కళాశాలలో చదవాల్సి ఉంటుంది. చివరి సంవత్సరం స్వీడన్‌లో పూర్తిచేసేందుకు అవకాశం కల్పించింది. అక్కడే ఎంటెక్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ కోర్సు ప్రవేశానికి ఈనెల 10వ తేదీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావు సూచించారు. మొత్తం 30సీట్లు ఉంటాయన్నారు. 60 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ చదివినవారు అర్హులన్నారు. జేఈఈ మెయిన్స్, ఏపీ, తెలంగాణ ఎంసెట్, తత్సమాన ప్రవేశ పరీక్షలో ర్యాంకు వచ్చి ఉండాలన్నారు. జేఈఈ మెయిన్స్ విద్యార్థులకు 50శాతం కేటాయిస్తామన్నారు. ఎంసెట్ విద్యార్థులకు 50 శాతం సీట్లు ఉంటాయన్నారు. వివరాలకు 8008802558, 9989944533, 9441889732 నంబర్లలో, జేఎన్‌టీయూలోని డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ విభాగంలో సంప్రదించవచ్చన్నారు. జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని వీసీ వివరించారు.

## రేపు ప్రైవేటు పాఠశాలల బంద్

అనంతపురం విద్య, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై అధికారుల నియంత ధోరణిని నిరసిస్తూ ఈనెల 3వ తేదీన ప్రైవేటు పాఠశాలల బంద్ పాటిస్తున్నట్లు ఆ యాజమాన్యాల సంఘం వెల్లడించింది. ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుసుమాపుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవిశంకర ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాయుడు, నగర అధ్యక్షుడు శశిభూషణ్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అధికారులు.. వివిధ కారణాలతో షోకాజ్‌లు ఇవ్వడం, గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం చేస్తున్నారన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు నిర్ణయించామన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను బంద్ చేసి, నిరసనకు సంఘీభావం తెలపాలని వారు కోరారు.

# ఇంటి గుట్టు..!

మూలన పడేసిన తలుపులు

మూలన పడిన వాకిలి ఫ్రేమ్‌లు

వైసీపీ రంగుల డబ్బాలు

వైసీపీ హయాంలో జగనన్న ఇళ్లు, లేఅవుట్లు, కాలనీలు అంటూ హంగామా చేశారు. ఏకంగా ఊర్లే కడతామంటూ ప్రగల్భాలు పలికారు. అన్ని కట్టాం.. ఇన్ని కట్టాం అంటూ కాకిలెక్కలు చెప్పారు. క్షేత్రస్థాయిలో మాత్రం చాలాచోట్ల ఇళ్ల నిర్మాణాలే మొదలవలేదు. కొన్నిచోట్ల పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో జగనన్న కాలనీల్లో కంపచెట్లు పెరిగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకనే తలుపులు, వాటి ఫ్రేమ్‌లు, వైసీపీ జెండా రంగులు, జగనన్న ఫొటోతో స్టిక్కర్లు సరఫరా చేశారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు మాత్రం ముందుకు కదలలేదు. దీంతో అప్పట్లో తెప్పించిన ఇంటి నిర్మాణ సామగ్రి మొత్తం మూలనపడేశారు. విడపనకల్లులోని ఓ గోదాములో జగనన్న ఇళ్ల సామగ్రిని మూలనపడేశారు. వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణాలు ఎలా సాగాయోనని చెప్పడానికి తుప్పు పట్టిపోతున్న ఈ సామగ్రే నిదర్శనం. జగనన్న ఇల్లు కట్టుకుంటే అందుకు అవసరమైన తలుపులు, వాకిలి ఫ్రేమ్‌లు, వైసీపీ రంగుల డబ్బాలు, ఆ ఇంటికి స్టికర్లు ప్రభుత్వమే అందిస్తుంది. మండలంలోని ఏ జగనన్న కాలనీలోనూ ఇంటి నిర్మాణాలు పూర్తికాలేదు. దీంతో చేసేదిలేక మండలానికి వచ్చిన ఇళ్ల సామగ్రిని మండలకేంద్రంలోని ఓ గోడౌన్‌లో దించి వదిలేశారు.

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు

# వైసీపీ సమావేశానికి వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హనుమంతరాయుడు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి వెళ్తూ సర్పంచ్ భర్త హనుమంతరాయుడు (39) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పట్టణంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం కంటైనర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయలపల్లి వైసీపీ మద్దతు సర్పంచ్ దుర్గమ్మ భర్త హనుమంతరాయుడు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో పట్టణంలోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైసీపీ విస్తృత సమావేశానికి బయల్దేరాడు. పట్టణంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కంటైనర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు.. ప్రమాదస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హనుమంతరాయుడుకు కుమారుడు ఉన్నాడు. సర్పంచ్ భర్త మృతిచెందడంతో బోయలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## రైలులో ప్రయాణికుడి మృతి

ప్రయాణికుడి మృతదేహం

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22157) రైలులో గుర్తు తెలియని ప్రయాణికుడు మరణించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మంగళవారం తెలిపారు. రైలులోని దివ్యాంగుల బోగీలో చనిపోయిన ప్రయాణికుడి వివరాలు తెలియరాలేదన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో మరణించినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. సంబంధీకులు గుంతకల్లు జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

# వైసీపీ కార్యకర్తలకూ సంక్షేమ పథకాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో అర్హులైన వైసీపీ కార్యకర్తలకూ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ముద్దుల మావయ్య, మేనమామ అంటూనే పిల్లల తల్లులను మోసం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాళ్యంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. మంత్రికి గ్రామస్థులు పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు వస్తున్నాయా అని ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది చిన్నారులుంటే అంతమందికీ రూ.13వేలు చొప్పున తల్లికి వందనం అందించిన ఘనత టీడీపీకే దక్కిందని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అందించడానికి ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని అన్నారు. రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా, అర్హులైన వైసీపీ కార్యకర్తలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనివిధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ఉచిత ఇసుక, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. వెంకటగిరిపాళ్యం నుంచి కోన మల్లికార్జున దేవాలయం వరకు, మక్కాజిపల్లి తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు సందర్శించారు. తల్లికి వందనం, యూనిఫాం, పుస్తకాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, టీడీపీ మండల కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వర ప్రసాద్, మాజీ ఎంపీపీ కేశవయ్య పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

# బళ్లారి లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు

గుంతకల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు-బళ్లారి సెక్షన్‌లో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. మోటార్ ట్రాలీలో బయలుదేరి డీఆర్ఎం, ఇతర అధికారులు ఈ సెక్షన్‌లోని హగరి వద్ద 17-బీ సిగ్నల్ పాయింట్‌ను పరిశీలించారు. రైల్వే గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా కమ్మీల కొలతలు, సిగ్నళ్ల వద్ద విద్యుత్ ఓల్టేజీ కనిష్ఠ, గరిష్ఠ స్థాయిలను పరిశీలించారు. డీఆర్ఎం మాట్లాడుతూ.. సిగ్నల్ లింకుల వద్ద భద్రతాప్రమాణాలను ఇంజనీరింగ్, సిగ్నలింగ్, టెలీకమ్యూనికేషన్స్ శాఖలు సంయుక్తంగా తనిఖీచేయాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే ఆపరేటింగ్, ఇంజనీరింగ్, సిగ్నలింగ్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హగరి వద్ద సిగ్నల్ లింక్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం

# సీసీ ఓవరాక్షన్..!

ఎవరితో చెప్పుకుంటారో.. చెప్పుకోండి..

ఆ స్థానం మీకు ఇచ్చేదే లేదు..

మహిళా డిజిటల్ అసిస్టెంట్‌తో దురుసు ప్రవర్తన

అనంతపురం న్యూటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజానాయుడు సీసీ.. ఓ మహిళా డిజిటల్ అసిస్టెంట్ పట్ల మంగళవారం దురుసుగా ప్రవర్తించారు. బదిలీల్లో తనకు కేటాయించిన స్థానాన్ని మరొకరికి ఇవ్వడంతో సమస్యను విన్నవించుకునేందుకు డీపీఓ కార్యాలయానికి వచ్చిన డిజిటల్ అసిస్టెంట్ పట్ల దురుసుగా ప్రవర్తించారు. బదిలీల్లో భాగంగా మెరిట్ ప్రాతిపదికన ఓ డిజిటల్ అసిస్టెంట్‌కు అనంతపురం రూరల్ మండలంలోని కురుగుంట కేటాయించారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండటంతో సదరు డిజిటల్ అసిస్టెంట్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. స్పౌజ్, మెడికల్ కేటగిరీలో ఆ స్థానాన్ని మరొకరికి కేటాయించారు. ఆ విషయాన్ని మెరిట్ ప్రాతిపదికన ముందుగా కేటాయించిన మహిళకు సమాచారం అందించారు. దీంతో ఆమె మంగళవారం డీపీఓ కార్యాలయానికి వచ్చి తనకు ఏస్థానం ఇస్తారని అడిగారు. డీపీఓ నాగరాజానాయుడు అందుబాటులో లేకపోవడంతో ఆయన సీసీగా కొనసాగుతున్న డిజిటల్ అసిస్టెంట్‌ను ఆరాతీశారు. తోటి డిజిటల్ అసిస్టెంట్ అన్న కనికరం లేకుండా తానే డీపీఓ అన్న రీతిలో సీసీ.. సదరు ఉద్యోగిపై చిందులు వేసినట్లు తెలిసింది. 'ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోండి.. ఆ స్థానం మీకిచ్చేది లేదు' అని దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా.. అక్కడే ఉన్న ఉన్నతాధికారులు వారించకపోవడం గమనార్హం.

# ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన బీటెక్ సెమిస్టర్ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు మంగళవారం విడుదల చేశారు. బీటెక్ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ రెండో (ఆర్20) సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్19) (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, ఒకటో సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ మూడో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ రెండో సెమిస్టర్ (ఆర్19), రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ (ఆర్15), ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ (ఆర్19), (ఆర్15) పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ కంట్రోలర్ శివకుమార్ పాల్గొన్నారు.

# జాతీయ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా వాసులు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించారు. నగరంలోని ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన సాద్విన్, ఆర్యన్, మోహన్‌కృష్ణ, నూర్ అబ్దుల్లా, దుర్గావిహాన్ యాదవ్, జస్వంత్‌రెడ్డి, బాబాఫకృద్దీన్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో చైత్ర, ముక్తామిహిక, వీక్ష ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన వారు ఈనెల 5వ తేదీ నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించే మినీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. (రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 237876

**ఉచిత విద్యావకాశాలు**

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజీఓథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి, అనంతపురం సెల్ :9030661651.

AJA- 237875

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

## న్యూస్ బాక్స్

### సుబ్రహ్మణేశ్వర స్వామికి షష్టి పూజలు

పూజలందుకున్న సుబ్రహ్మణేశ్వర స్వామి

ధర్మవరం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎల్వీ మార్కెట్‌వీధిలో వెలసిన సుబ్రహ్మణేశ్వర స్వామికి మంగళవారం ఘనంగా షష్టి పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు చేశారు. పంచామృతాభిషేకం, అర్చన చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు తీయండి: ఏడీఏ

బత్తలపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు తీసేలా వ్యవసాయం చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ లక్ష్మానాయక్ రైతులకు సూచించారు. మండలపరిధిలోని అనంతసాగరం గ్రామములో మంగళవారం 'పొలం పిలు స్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. రైతులు సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశమై ఏడీ పలు సూచనలు చేశారు. ప్రభు త్వం రైతులకు 80శాతం సబ్సిడీతో పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్లను ఇస్తోందని, కావలసిన రైతులు స్థానిక వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమములో ఏఓ ఓబిరెడ్డి పాల్గొన్నారు.

### 'స్కూల్ బస్సులన్నీ కండీషన్‌లో ఉండాలి'

ధర్మవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు పూర్తి కండీషన్‌లో ఉండాలని, లేకపోతే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాణి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక ఆర్టీఐ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యంతో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతనెల 23వతేదీ నుంచి స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు తొమ్మిది కేసులతో పాటు జరిమానావిధించామన్నారు.

### ధర్మవరానికి బీసీ ప్రీ-మెట్రిక్ హాస్టల్ మంజూరు

ధర్మవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో ధర్మవరానికి బీసీ ప్రీ - మెట్రిక్ హాస్టల్ మంజూరైందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బీసీ వెల్ఫేర్ అధికారులతో కలిసి హాస్టల్ భవనం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు.

### ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని నేసేపేటలో ఖాళీగా ఉన్న ఆశాకార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి గౌతమి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను శివానగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారికి ఈ నెల 4వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

### పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

కదిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మర వాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు స్టేట్ బ్యాంక్ వారు ఎనిమిది ఫ్యాన్లు మంగళవారం విరాళంగా అందించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలకు స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హరిప్రసాద్ హెచ్‌ఎం రాజగోపాల్‌రెడ్డికి ఫ్యాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

### జిల్లా సభలను విజయవంతం చేయండి: సీపీఐ

ముదిగుబ్బ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో జూలై 31వ తేదీ నిర్వహించనున్న సీపీఐ పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అన్నిటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, ఏఐటీయూసీ కార్యదర్శి రమణ, సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, నాయకులు తిప్పయ్య, ఈశ్వర్ నాయక్, ప్రసాద్ నాయక్, వెంకటేశ్వర్ నాయక్, శంకర్, నాయుడు, చెన్నప్ప, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : సీఐ

ముదిగుబ్బ, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ముదిగుబ్బలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదిగుబ్బ అప్‌గ్రేడ్ సీఐ శివరాముడు పేర్కొన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలలో, ఇతర వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. అనంతరం దుకాణాలకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు.

### విషపునీరు తాగి 11 గొర్రెల మృతి

తాడిమర్రి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూల ఓబయ్యపల్లికి చెందిన సురేశ్, ముత్యాలప్ప, సూరికి చెందిన గొర్రెలు విషపు నీరు తాగి 11 మృతిచెందగా, మరో 20 తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వారు మంగళవారం ఉదయం గొర్రెల మందను గ్రామ సమీపం లోకి మేతకు తీసుకెళ్లారు. అయితే అక్కడే ఉన్న పొలంలో.... ఓ రైతు తన పొలానికి వదిలేం దుకు సిద్ధం చేసుకున్న యూరియా ద్రావణాన్ని పొరపాటున గొర్రెలకు తాపారు. దీంతో 11 గొర్రెలు మృతిచెందగా మరో 20 తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. అస్వస్థతకు గురైన గొర్రెలకు ప్రభుత్వ వైద్యులు యూనస్ ప్రథమ చికిత్స చేశారు. అదేవిధంగా పిన్నదరి గ్రామంలో పఠాన్ బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తి రెండు పొట్టేళ్లను గ్రామ సమీపంలో మేపు తున్నాడు. అయితే అక్కడి విద్యుత్ వైరుకు ఎర్త్ కోసం నీరు పోసిన గుంతలో దిగిన ఆ రెండు గొర్రెలు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. ఆ రెండు గ్రామాలు పిన్నదరి పంచాయతీకి సంబంధిం చినవే. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని గొర్రెలు కాపరులు కోరుతున్నారు.


గొర్రెల కళేబరాలు

# నీరు పుష్కలం... తాగేందుకు శూన్యం

● అధికారుల నిర్లక్ష్యం వల్లే..: గ్రామస్థులు

నీరు పుష్కలంగా ఉన్న బోరుబావి

తాడిమర్రి, జూలై 1(ఆంధ్రజ్యోతి): బోరుబావిలో పుష్కలంగా నీరున్నా తాగేందుకు అవకాశం లేదని రామాపురం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. మండల అధికారుల వైఖరి వింతగా ఉంది. రూ.లక్ష లోపు ఖర్చు అయ్యే పనులకు నామినేషన్ ప్రాతిపదికన కేటాయించడానికి వీలున్నా వారు స్పందించడంలేదు. రామాపురం గ్రామంలో ప్రస్తుతం ఉన్న బోరులో అరకొ రగా నీరు వస్తున్నాయి. దీంతో గ్రామానికంతటికీ ఒకే సారి నీరు సరఫరా చేయలేకపోతున్నారు. దీంతో మూడు నెలల క్రితం నామినేషన్ ప్రాతిపదికన మరో బోరు వేశారు. పుష్కలంగా నీరు పడింది. దాని నుంచి గ్రామానికి నీరు సరఫరా చేస్తే గ్రామంలో నీటి సమస్యే ఉండదు. అయితే పైపులైన్ వేసే విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. టెండర్ అప్ లోడ్ చేస్తున్నాం అంటూనే వేసవికాలం దాటించారు. ఇక ఇప్పుడు కూడా ఆ పనిని నామినేషన్ కింద ఇవ్వలేమని, టెండర్ వసి ఇస్తామంటూ దాటవేస్తున్నారే కానీ ఆ దిశగా చర్యలు చేపట్టిన పాపాన పోలేదు. గత ఏడాది వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించిన బిల్లులు ఇప్పటి వరకు రాకపోవ డంతో.... ఈ ఏడాది ట్యాంటర్‌తో నీటిని తరలించేందుకు కూడా ఎవరూ ముందుకు రావడంలేదు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఎవరికీ కేటాయించలేదు. గ్రామానికి తాగునీటి కోసం బోరు వేసేందుకు ఉన్న ఉత్సాహం పైపులైన్ వేసేందుకు ఎందుకు చూపడం లేదో అర్థం కావడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇతర కాలనీలకు వెళ్లి అక్కడ అరకొరగా వస్తున్న నీటినే ఆ కాలనీ వాసులను అడిగి తాగునీరు తె చ్చుకోవాల్సి వస్తోందని బీసీకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులకు మూడు సార్లు ఫిర్యాదు చేయగా ఈ

### పనులకు వెళ్లకుండా ఉండాల్సి వస్తోంది

పాత బోరు నుంచి అరకొరగా వస్తున్న నీటిని ఎప్పుడు ఏ పక్కకు వదులుతారో తెలుసు కుని నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇందు కోసం వారంలో రెండు రోజులు కూలీ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాం.

- రాములమ్మ, రామాపురం

### నీటి కోసం పొలాలకు వెళ్తున్నాం

రోజు వారి అవసరాల కోసం దగ్గరలోని పొలాలకు వెళ్లి నీటిని తెచ్చు కుంటున్నాం. దగ్గరిలోని చీనీ తోటలోకి వెళ్లాలంటే కాయలు కోస్తారేమోనని వారు రానివ్వడంలేదు. దూరమైనా ఇతర పంటలున్న పొలాల వద్దకు వెళ్లి తెచ్చు కుంటున్నాం.

- సుబ్బరాయుడు, రామాపురం

### గత ఏడాది బిల్లులే రాలేదు

గత ఏడాది ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత నాలుగు నెలల పాటు గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలాం. ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా చెత్తకుప్పలో వేస్తున్నారేమోననే అనుమానం వేస్తోంది. మూడునెలల క్రితం వేసిన బోరులో నీరు బాగా వస్తోంది. దాని నుంచి పైపులైన్ వేసి, దాని ద్వారా నీటిని సరఫరా చేసేదుకు అధికారులు ముందుకు రావడంలేదు.

- రామ్మోహన్, మాజీ సర్పంచ్, రామాపురం

### జేజేఎం నిధులతో పూర్తి చేస్తాం

జలజీవన్ మిషన్ ద్వారా రామాపురం, చిల్లవారిపల్లి గ్రామాలకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్ పూర్తి అవుతుంది. ఆ నిధులు ఉపయోగించి పనులు పూర్తి చేయిస్తాం.

- విజయ్‌శేఖర్, ఈఓఆర్‌డీ, తాడిమర్రి

# ఇంటింటికి వెళ్దాం.. సుపరిపాలనను వివరిద్దాం

● ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

పుట్టపర్తిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకపాలనకు విసిగిన ప్రజానీకం కూటమికి అఖండ విజయం అందించారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. యేడాది రాష్ట్ర ప్రభుత్వ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్న సుపరిపాలనను ప్రజలకు తెలయచేద్దామని పిలుపునిచ్చారు. ఆమె మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'సుపరిపాలన తొలి అడుగు - ఇంటింటికి కూటమి ప్రభుత్వం' అనే కార్యక్రమలో భాగంగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి నియోజకవర్గం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలన రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి జరగకపోగా విధ్వంసం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యేడాది పాలనతో అమలుచేసిన అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేద్దామని వారు పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి రూ. 3,32,017 సీఎం సహాయ నిధి చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పుట్టపర్తి అర్బన్ కన్వీనర్ రామాంజినేయులు, రూరల్ కన్వీనర్ విజయ్ కుమార్, బుక్కపట్నం మండల కన్వీనర్ మల్లెడ్డి, కొత్తచెరువు మండల కన్వీనర్ రామకృష్ణ, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ చెన్నకేశవులు, గంగాధర్‌నాయుడు, శ్రీరాంరెడ్డి, పుల్లప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మంగళవారం మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐ కళాశాలలో టీడీపీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి యేడాది పాలనపై బుధవారం నుంచి ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని అమడగూరు మండలంలోని కసముద్రం నుంచి బుధవారం ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం మల్లాపల్లిలో వాల్మీకి మహర్షి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే డీలర్ ఓబులరెడ్డి చౌక డిపోలో వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మా జీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, పీట్ల సుధాకర్, తుమ్మల మహబూబ్‌బాషా, బూదిలి ఓబులరెడ్డి, నిజాం, రాజారెడ్డి, శివారెడ్డి, జాకీర్, మండోజీ ఆర్ఫీఖాన్, జౌలి బాబా, మిట్టపల్లి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

### నేటి సమావేశానికి తరలిరండి

● టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించే టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, పార్టీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ తదితరులు మంగళవారం స్థానిక గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు చేపట్టే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై చర్చించేందుకు బుధవారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని టీడీపీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పోతుకుంట లక్ష్మన్న, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, గొట్లూరు శీన, చింతపులుసు పెద్దన్న, అడ్డ మహేశ్, బొట్టు కిష్ట, బీరే శీన తదితరులు పాల్గొన్నారు.

### 'సమస్యలను పరిష్కరించే వరకు దీక్షలు'

ధర్మవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించేంత వరకు రిలేదీక్షలు ఆపే ప్రసక్తే లేదని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, బాబు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి ఆరో రోజుకు చేరాయి. కార్మికులు దీక్షా శిబిరం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్షలు కొనసాగుతాయని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం తేల్చి చెప్పారు. ఈ దీక్షల్లో కార్మిక సంఘం నాయకులు దస్తగిరి, యోగి, కాటమయ్య, పెద్దన్న, నరసింహులు పాల్గొన్నారు.

### రాష్ట్ర మహిళా క్రికెట్ పోటీలకు కదిరి క్రీడాకారిణి

కదిరి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నుంచి వైజాగ్‌లో జరిగే అండర్ 19 క్రికెట్ పోటీల్లో రాష్ట్ర ప్రాబబుల్ జట్టుకు కదిరి క్రీడాకారిణి తేజశ్వని ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఇటీవల నెల్లూరులో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో తేజశ్వని ప్రతిభ కనబరచి ఈ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ క్రీడాకారిణిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్మితా, పీడీ నరసింహచారి అభినందించారు.

### భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట

ఆంధ్రజ్యోతికి స్పందన

నల్లచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామం లో గత ప్రభుత్వంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజీ హెల్త్ కార్యాలయాలు నిర్మించారు. పూర్తి అయిన భవనాలు, కాంట్రాక్టర్ చేతిలో తాళాలు అన్న వార్త ఆంధ్రజ్యోతి దినపత్రిలో గత నెల 27న ప్రచు రితమైంది. ఈ వార్తకు స్పందించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఉబ్బిచెర్లలో పర్యటించిన సందర్భంగా పత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారా అని ప్రశ్నించారు. అనంతరం అధికారులు, నాయకులతో కలిసి కాంట్రాక్టర్‌తో చర్చించారు. పూర్తి అయిన భవనాలను అధికారులకు అప్పగించాలని, బిల్లులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో మంజూరు చేయిస్తామన్నారు. కాంట్రాక్టర్లు పూర్తి అయిన భవనాలకు తాళాలు వేస్తే క్రిమినల్ కేసులు నమోదుచేసి, వాటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, వైద్యాధికారి అలేఖ్య, ఏఓ లక్ష్మీప్రియ, పంచాయతీ ఏఓ రామక్రిష్ణ, ఇన్‌చార్జ్ ఎస్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వాల్మీకి సంఘం నేత జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు క్రిష్ణమూర్తి

కదిరి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో వివిధజిల్లాల నుంచి వచ్చిన నాయకుల మధ్య కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. అలాగే సేవా సంఘం ఏర్పాటు చేసి, యేడాది పూర్తికావడంతో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, శ్రావణ్, శివప్రసాద్, నరసింహులు, ఆంజనాదేవి, మోహన్, కేశవ, ప్రమీల, పరుశురాం. సురేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వైద్యుల దినోత్సవం

కాకతీయ పాఠశాలలో డాక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పట్టణంలోని కాకతీయ, రిషి పాఠశాలల్లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కాకతీయ పాఠశాలలో ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ శెట్టిపి నిర్మలాదేవి, పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రిషీ పాఠశాలలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ ఆదిశేషను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఆఫ్ అకడమిక్ కరణ్ స్వరూపాసింగ్, డీన్ భాస్కర్‌రెడ్డి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

● తనకల్లు: మండలకేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో మంగళవారం ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ డైరెక్టర్ సోంపాల్యం నాగభూషణం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కేక్ కట్ చేసి, డాక్టర్లును సన్మా నించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, డాక్టర్లు భాస్కర్‌నాయక్, రమేష్‌బాబు, సులోచన, షాదియా, కొక్కంటి పీహెచ్‌సీ డాక్టర్ ధర్మరాజు, వ్యవసాయాధికారి భారతి, ఆర్‌ఎంపీ వైద్యులు భాస్కర్, విశ్వనాథ్, క్రిష్ణమూర్తి, ఖదర్‌వలీ, కుళ్లాయప్ప, అబ్దులా, ఆశకార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

రిషీ స్కూల్‌లో డాక్టర్లను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

### ఏపీ అభివృద్ధి పట్ల చంద్రబాబుకే విజన్

● మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

బుక్కపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పల్లె

బుక్కపట్నం/కొత్తచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి విజన్ ఉన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలకేంద్రంలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయ ణ, నాయకులు గంగాధర్, చెన్నక్రిష్ణ, బాలు, సయ్యద్‌బాషా, ఎర్ర కేశి, వెంకటరాముడు, సాకే యశోదా, లావణ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తచెరువులోని పలు కాలనీల్లో ఆయన వృద్ధులు, వికలాంగులకు పింఛన్ డబ్బు అందజేశారు.

### మన రాష్ట్రంలోనే అధిక మొత్తంలో పింఛన్

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఉబ్బిచెర్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

నల్లచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామంలో టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలకంటే మన రాష్ట్రంలోనే అధిక మొత్తంలో పింఛన్ ఇస్తున్నామన్నారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం, తల్లికి వందనం గురించి అడిగితెలుసుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు గుప్త ప్రసాద్, అబ్దుల్‌ఖాదర్, అశ్వత్థనాయుడు, మాబూసాబ్, శివారెడ్డి, నాగభూషణనాయుడు, సతీష్‌చౌదరి, దేవేంద్రగౌడ్, రాజారెడ్డి, నాగార్జున, రమేష్‌నాయుడు తదితరులున్నారు. అలాగే గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ సీనియర్ నాయకుడు నరసారెడ్డిని ఎమ్మెల్యే కందికుంట ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కదిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 16మందికి సీఎంఆర్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో 16 మందికి రూ. 11,78,510 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సహాయంలో కులం, మతం, పార్టీ లాంటి భేదాలు లేవన్నారు.

### 'సుపరిపాలన తొలిఅడుగు'కు హాజరుకానున్న ఎమ్మెల్యే

నంబులపూలకుంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యేడాది సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు మంగళవారం తెలిపారు. మండలంలోని గౌకనపేట బూత్‌నెంబర్ 180లో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఇంటి వద్దే పింఛన్ ఇస్తున్నాం

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ఎద్దులవారిపల్లి తండాలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

నల్లమాడ/ఓబుళదేవరచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. ఆమె మంగళవారం నల్లమాడ మండలంలోని కొత్తపల్లితండా, రెడ్డిపల్లి బీసీకాలనీ, కమ్మవారిపల్లి, నల్లమాడ క్రాస్ బీసీకాలనీ, చౌటకుంట పల్లిల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్,బుట్టి నాగభూషణనాయుడు, కోట్టో మంజునాథ్ రెడ్డి, సలాంఖాన్, కులశేఖర్‌నాయుడు, కేశవరెడ్డి, డీలర్ సలీంబాషా, మంజునాథ్‌రెడ్డి, గుడ్ర శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలంలోని ఓడీచెరువు, గాజుకుంటపల్లి, మిట్టపల్లి, కొండకమర్ల పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, పీట్ల సుధాకర్, తుమ్మల మహబూబ్‌బాషా, బూదిలి ఓబులరెడ్డి, నిజాం, రాజారెడ్డి, శివారె డ్డి, జాకీర్, మండోజీఆర్ఫీఖాన్, జౌలి బాబా, మిట్టపల్లి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

### ఇప్పుడూ వైసీపీ వారికే పనులా?

కొత్తచెరువు, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 10వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉండగా అధికారులు ఏర్పాట్లను చేయిస్తున్నారు. అయితే ఈ ఏర్పాట్లకు సంబంధించి వైసీపీ కార్యకర్త అనిల్ దాదాపు రూ.2.75లక్షల పనులను చేపట్టడంతో అధికార పార్టీ నాయకులు అవాక్కయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కొందరు అధికారులు వైసీపీ కార్యకర్తలకే పనులను అప్పగించడం ఏమిటని మండిపడుతున్నారు. విద్యాశాఖ, ఎస్ఎస్ఏలోని కొంతమంది అధికారులు వైసీపీ కార్యకర్తలకే పనులు ఇస్తూ వారి వద్ద నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పనులను వైసీపీ కార్యకర్త అనిల్ చేయడమే నిదర్శనమని వారు వాపోతున్నారు. దీనిని అరికట్టాల్సిన ప్రజాప్రతినిధులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఎస్ఏ అధికారి దేవరాజ్‌ను వివరణ కోరగా... తనకు పనులు చేసే వారు కావాలన్నారు. అంతేగానీ వారు వైసీపీనా, టీడీపీనా అనే విషయం తమకు తెలియదన్నారు. అందుకే అనిల్ పనులు చేస్తున్నారని తెలిపారు. అయితే అనిల్ వైసీపీ కార్యకర్త అని కొందరు టీడీపీ కార్యకర్తలు మంగళవారం పనులను అడ్డుకోగా, పనులను నిలిపివేశారు.

ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న వైసీపీ కార్యకర్త

## అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేస్తాం

రైస్ కుక్కర్, స్టౌ అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జులై 1(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆలనాపాలనా చూసే అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బందికి ఎలక్ట్రికల్ స్టౌ, కుక్కర్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 25వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని వాటిన్నింటిలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వంట సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందికి ఆమె సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు మంత్రి పర్యటన

గోరంట్ల, జులై 1(ఆంధ్రజ్యోతి): మండలంలో మంత్రి సవిత బుధవారం పర్యటిస్తున్నట్లు టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి తెలిపారు. బూదిలి గ్రామం వద్దగల చిత్రావతినదిపై రూ.8.52కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారన్నారు. ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### పారిశుధ్య పనులు పరిశీలించిన డీపీఓ

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ సమత

గోరంట్ల, జులై 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వార్డులో పారిశుధ్యం పనులను డీపీఓ సమత మంగళవారం పరిశీలించారు. గోరంట్లలో పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఇంటింటికి వెళ్లి పంచాయతీ కార్మికులు, సిబ్బంది తడి, పొడి చెత్త ఎలా సేకరిస్తున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ, పారిశుధ్యం పనులపై పంచాయతీ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండో వార్డులో చిల్లర వ్యాపారులు తమ కార్యకలాపాలను రోడ్డుపై నిర్వహిస్తూ రాకపోకలకు, పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుండటంతో చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సాయిసుజయ్, టీడీపీ నాయకులు బాలక్రిష్ణ, సోమశేఖర్, నిమ్మల శ్రీధర్, వెంకటరెడ్డి, గిరిధర్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

### ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

పెనుకొండ రూరల్, జులై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం వైజంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మంగళవారం తెల్లవారు జామున ఓ ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. కియ స్టేషన్ పోలీసులు తెలిపిన మేరకు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు హరిపురం వైజంక్షన్ వద్ద మరమ్మతులతో ఆగిపోయిన లారీని ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న అమ్మవారిపల్లికి చెందిన సాయినాథ్‌రెడ్డి, హైదరాబాదుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయినాథ్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై కియ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రొద్దం నాయకులు

రొద్దం, జులై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు మండల బీజేపీ నాయకులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో రొద్దం మండల బీజేపీ నాయకులు వేణుగోపాల్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### చెత్త సేకరణకు సహకరించాలి

చిలమత్తూరు, జులై 1(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణకు ప్రతి ఒక్కరూ సహకరం చాలని ఎంపీడీఓ రమణమూర్తి కోరారు. మండలంలోని చిన్నపురెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేపడుతున్న చెత్త సేకరణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఇంటి వద్దే పొడి, తడి చెత్తగా వేరుచేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు.

### బీఈఓకు ఘనంగా వీడ్కోలు

ఇంద్రాణమ్మకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

పావగడ, జులై 1(ఆంధ్రజ్యోతి): పావగడ క్షేత్రశిక్షణాధికారి బీఈఓ ఇంద్రాణమ్మ వీడ్కోలు సభను ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించింది. పావగడ తాలూకా బీఈఓగా ఆమె సేవలు మరువలేనివని ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ బీఈఓ వెంకటేష్, ఉపాధ్యాయులు రామాంజినేయులు, దుర్గమ్మ, వేణుగోపాల్, బాలాజీ, ఓంకారప్ప, సావిత్రమ్మ, సంధ్యారాణి, అనేక మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పీర్ల ఊరేగింపు

పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

అమరాపురం, జులై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత మసీదు వద్ద రెండు చోట్ల ఏర్పాటు చేసిన పీర్లను మంగళవారం ఊరేగించారు. బీరదేవ్ ముస్లిం సోదరులు, భక్తులు పీర్లను ఎత్తుకుని మేళతాళాలతో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా పీర్లకు భక్తులు భక్తిశ్రద్ధలతో చక్కెర, పప్పులు చదివింపులు చేశారు. ఈ కార్యక్రమంలో రహమతుల్లా, చాంద్‌పాషా, చంద్రశేఖర్‌యాదవ్, గాదిరప్ప, ఓబులరాజు, శివన్న, శివన్న తదితరులు పాల్గొన్నారు.

# మనం సేఫేనా..?

- మన పరిశ్రమల్లో భద్రత ఎంత?
- గతంలో అనేక ప్రమాదాలు
- బయటికి రానివ్వని యాజమాన్యాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

హిందూపురం, జులై 1(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో మన ప్రాంతంలో ఉన్న పరిశ్రమల భద్రత ఎంత అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలో పరిశ్రమల భద్రతపై హైపవర్ కమిటీని నియమించింది. ఈ కమిటీ మొదట్లో హడావుడి చేసి తర్వాత మిన్నకుండిపోయింది.

**భద్రతా చర్యలు గాలికి**

వైసీపీ పాలనలో ఏ పరిశ్రమను కూడా తనిఖీ చేయలేదు. రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల జరిగిన సంఘటనలతో విపక్షల నిర్వహణాశాఖ, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలపై గెజిట్ రూపొందించింది. దీనిని వైసీపీ ప్రభుత్వం తొక్కిపెట్టింది. థర్డ్‌పార్టీ వారికి సేఫ్ ఆడిట్ బాధ్యతలు కట్టబెట్టింది. దీంతో పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు, ఏజెన్సీలు కుమ్మక్కయి అందినకాడికి దండుకున్నాయి.

**జిల్లాలో 150కిపైగా పరిశ్రమలు**

గత వైఎస్ శ్రీ సత్యసాయి జిల్లాలో తూమకుంట, గొల్లాపురంలో పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ స్టీల్ పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు అనుబంధ సంస్థలు, రబ్బర్‌ఫ్యాక్టరీ, గ్లాస్ తయారీ సంబంధిత పరిశ్రమలు సుమారు 150దాకా చిన్నా చితక కంపెనీలున్నాయి. సుమారు 20 ఏళ్లలో తూమకుంట, గొల్లాపురం పారిశ్రామికవాడలో సుమారు 40కిపైగా ప్రమాదాలు జరిగాయి. వీటిలో 2018లో పరిశ్రమలో వెల్డింగ్ చేస్తుండగా సిలిండర్ పేలి ఇద్దరు తీవ్రంగా గాయపడి కాళ్ల చేతులు పోగొట్టుకున్నారు. 2021లో గొల్లాపురం స్టీల్ పరిశ్రమలో క్రేన్ రోప్ చుట్టుకుని కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. 2024జూన్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు చని పోయాడు. 2024లో రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న తూమకుంట చెందిన హనుమంతప్ప అనే కార్మికుడు చేతిపై రసాయనం పడి తీవ్రంగా గాయపడ్డాడు. 2021లో రసాయన పరిశ్రమలో పనిచేసే కార్మికుడిపై రియాక్టర్ పడి మృతి చెందాడు. 2022లో స్టీల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన ముగ్గురు కార్మికులు మృతిచెందారు. ఇవి ఉదాహరణలు మాత్రమే..

వేల మంది కార్మికులున్నారు. గార్మెంట్స్‌లో పనిచేసేవారిని పక్కనబెడితే 16వేల నుంచి 17వేల మంది కార్మికులు స్టీల్, రసాయన, వివిధ ప్రమాదకరమైన పరిశ్రమల్లో పని చేసేవారున్నారు. ఇక పెనుకొండ, గోరంట్ల మండలాల్లో కియ అనుబంధ పరిశ్రమలున్నాయి. వీటితో పాటు జిల్లాలో మిగిలిన చోట మరిన్ని పరిశ్రమలున్నాయి. వీటన్నింటిని కలుపుకుంటే సుమారు ప్రత్యక్షంగా పరోక్షంగా 50వేల మందికిపైగా కార్మికులు ఉన్నట్లు సమాచారం.

**హడావుడి చేయడం తప్ప..**

పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అధికార యంత్రాంగం హడావుడి చేస్తుంది, తర్వాత దాని సంగతి మరచిపోతారనే విమర్శలు ఉన్నాయి. రసాయన పరిశ్రమలో చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రసాయనాల మధ్య ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందుకే కంపెనీకి సంబంధించిన ఇంజనీర్లతో యంత్రాలను తరచూ తనిఖీ చేయించాలి. జిల్లా అధికారులు పరిశ్రమలను తనిఖీ చేస్తుండాలి. కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌స్పెక్టర్, పరిశ్రమ అధికారి, అగ్నిమాపకశాఖాధికారులు తనిఖీలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే గతంలో జరిగిన ప్రమాదాలప్పుడు హడావుడి చేశారు తప్ప దిద్దుబాటు చర్యలు చేపట్టిన దాఖలాలులేవు.

తూమకుంట పారిశ్రామికవాడ

**కాగితాల్లోనే నిబంధనలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిశ్రమలను నిర్వహించాలి. నిబంధనలన్నీ కాగితాల్లోనే కనిపిస్తాయి. ప్రతి పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ వాహనాలు ఉండాలి. అగ్నిమాపక సిబ్బందిని వారే నియమించుకోవాలి. కానీ తూమకుంట పారిశ్రామికవాడలో ఒక్క అగ్నిమాపక వాహనం కూడా లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను పనిలోకి తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులు ప్రమాదాల్లో గాయపడి మృతి చెందుతున్నా బయటకు రాకుండా తొక్కి పెడుతున్నారు.

**చర్యలేవి ?**

పరిశ్రమలో ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేస్తారు తప్ప ఆ తరువాత అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎంతో మంది పరిశ్రమల్లో పనిచేస్తూ మృతి చెందారు. కానీ కొన్ని పరిశ్రమల్లో బయటకు పొక్కకుండా కప్పి వేస్తున్నారు. పరిశ్రమలకు చెందిన అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రవికుమార్, కార్మిక సంఘం అధ్యక్షుడు, తూమకుంట

# ప్రజల స్వేచ్ఛ.. సుపరిపాలన లక్ష్యం

**మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు**

మడకశిర టౌన్, జులై 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వేచ్ఛ కలిగించడమే సుపరిపాలన లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుపరిపాలన శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలు వాక్ స్వాతంత్ర్యం కోల్పోయి బిక్కు బిక్కుమంటూ జీవించారన్నారు. ఆరాచక పాలనలో ఉపాధి, ఉద్యోగాలు లేక యువత అల్లాడిపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన ఏడాదిలోనే 95గ్గిగ కంపెనీలను తీసుకొచ్చినట్లు తెలిపారు. రూ.5.34లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి సాధించిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వ లేని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి గడపకు వెళదాం.. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి వివరిద్దామని పిలుపునిచ్చారు. ఈ క్యాక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, మండలకన్వీనర్లు నాగరాజు, లక్ష్మీనారాయణ, తిప్పేస్వామి, కృష్ణమూర్తి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

పురం ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశమైన టీడీపీ నాయకులు

**ఎమ్మెల్యే కార్యాలయంలో..**

హిందూపురం, జులై 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సుపరిపాలన కార్యక్రమంపై స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. బుధవారం ఉదయం 9.30గంటలకు పట్టణంలోని సూగూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, సుపరిపాలనకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

### వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన చైర్మన్

హిందూపురం, జులై 1(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో మురుగు కాలువల శుభ్రతలో అక్రమాలు జరిగాయని వైసీపీ ఆరోపణలను చైర్మన్ ఆధారాలతో తిప్పికొట్టారు. సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ మురుగు కాలువల శుభ్రతలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై సమగ్రంగా నివేదిక ఇవ్వాలని మునిసిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జునలు హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం వైసీపీ సభ్యులను పిలిపించి అప్పట్లో వైసీపీ చైర్మన్ ఇంద్రజరెడ్డి ఉన్నప్పుడే డీసిల్టింగ్‌కు సంబంధించి టెండర్లు పిలిచారని, సింగిల్ టెండర్ కావడంతో రెండు దఫాలు వేశారన్నారు. అంతేకాక మునిసిపల్ నిబంధనల మేరకే పనులు జరిగి ఉంటేనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఎప్పుడు కూడా టీడీపీ పారదర్శకంగా ఉంటుందని బిజిప్తుల్లో కూడా ఇలాగే వ్యవహరిస్తుందని చైర్మన్ అన్నారు. అంతేకాక ప్రతినెలా మునిసిపల్‌లో ఖర్చుచేసిన జమ ఖర్చులను సభ్యుల ముందుంచుతామన్నారు. జియోట్యాగ్ ద్వారా చేసిన పనికి ఫొటోలు జతపరిచి బిల్లులు చేస్తామన్నారు. దీంతో వైసీపీ కౌన్సిల్ సమావేశంలో చేసిన ఆరోపణలు దూది పింజల్లా తేలిపోయాయి.

### మట్టి తరలించాలంటే అనుమతి తప్పనిసరి

మడకశిర టౌన్, జులై 1(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాలకు చెరువుల నుంచి మట్టిని తరలించాలంటే జలవనరుల శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలనిఇరిగేషన్ శాఖ డీఈ తిమ్మేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మడకశిర డివిజన్ పరిధిలోని ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు తహసీల్దార్ వద్ద వ్యవసాయ భూమికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆర్జీతో పాటు ఇరిగేషన్ శాఖకు పెట్టుకోవాలని తెలిపారు. అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కన్వీనర్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

పెనుకొండ టౌన్, జులై 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండ పట్టణ కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లోని తదితర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు. ఎర్రబడ్డ క్రిష్ణమూర్తి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

### ఘనంగా డాక్టర్ల దినోత్సవం

పెనుకొండలో బహుజన వైద్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. వైద్యులను ఘనంగా సత్కరించారు.

పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు స్వరూపారెడ్డి, ఆసుపత్రి సిబ్బందిని మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు సన్మానించారు.

### విద్యార్థులు బాగా చదవాలి

మడకశిర రూరల్, జులై 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప తెలిపారు. మంగళవారం గుండుమల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు చదువులకు కావలసిన అన్నీ సౌకర్యాలను కల్పించిందన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుక్కు ఉపాధ్యాయులువిద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

గోరంట్లలో టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న డీపీఓ సమత

### సజావుగా పింఛన్ల పంపిణీ

మడకశిర టౌన్/సోమందేపల్లి/గోరంట్ల/గుడిబండ, జులై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం సజావుగా సాగింది. మడకశిర నగరపంచాయితీ పరిధిలోని మాలెరొప్పం గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పాల్గొన్నారు. గోరంట్లలో డీపీఓ సమత టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన మండలాల్లో ఆయా మండల టీడీపీ నాయకులు, అధికారులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

మాగేచెరువులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

### ఎవరిది బాధ్యత..?

## ఆటోలో 30 మంది విద్యార్థులు

పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

పరిగి, జులై 1(ఆంధ్రజ్యోతి): చిన్న ప్రమాదం జరిగినా చిన్నారుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతాయి. పిల్లలకు మంచి చదువులు చెప్పించడం అవసరమే. అయితే ఇలా ఒకే ఆటోలో పరిమితికి మించి చిన్నారులను కుక్కేసి తీసుకెళ్లే వాహనాల్లో పంపడం సురక్షితమేనా? ప్రమాదం జరిగాక లబోదిబోమంటే ఏముస్తుందో తల్లిదండ్రులూ ఓసారి ఆలోచించండి. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటుకూరు, యర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల నుంచి దాదాపు 30 మంది పిల్లలను ఒకే ఆటోలో తరలిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే తల్లిదండ్రులు లేదా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

### భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

గోరంట్ల, జులై 1(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగానే పంటలకు ఎరువులు వాడుకోవాలని ఏడీ శంకర్‌నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని వడిగేపల్లి, కాటేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కాటేపల్లిలోని రైతు అశ్వత్థప్ప సాగు చేసిన రాగి పంటను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. రాగి, మినుముల మినీకిట్లు రైతులకు ఉచితంగా ఇవ్వడానికి అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవాలన్నారు. మొక్కజొన్న, వేరుశనగకు విత్తన శుద్ధి చేయాలని, కత్తెర పురుగు నివారణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహమూర్తి, టీడీపీ నాయకుడు బెల్లాలచెరువు చంద్ర, మనోహర్, రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులున్నారు.

### జాబ్‌మేళా పోస్టర్ల విడుదల

హిందూపురం, జులై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 4న జరిగే జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను మునిసిపల్ చైర్మన్ రమేష్, ప్రిన్సిపాల్ ప్రగతి మంగళవారం ఆవిష్కరించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరైన మునిసిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు 15కంపెనీల ప్రతినిధులు ఈజాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్, కౌన్సిలర్ నవీన్, బ్యాంక్ అధికారి రవినాయక్, కళాశాల సిబ్బంది నరసింహులు, రమేష్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

రొద్దం, జులై 1(ఆంధ్రజ్యోతి): రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి రాజేష్ పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌లోచర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటను పరిశీలించారు. పత్తిపంట మొగ్గదశలో ఉండగా తెగుళ్లు సోకకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ హేమనీలి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది జావేద్‌బాష, బీమా కంపెనీ సిబ్బంది, రైతులు మురళి, ముత్యాలప్ప, హనుమంతు, నరసింహులు, నాగరాజు, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

### సీటీ స్కాన్ యంత్రం ఏర్పాటు చేయించండి

హిందూపురం, జులై 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీస్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందించినట్లు పురం బీజేపీ నాయకులు తెలిపారు. మంగళవారం విజయవాడలో మంత్రిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, పురం బీజేపీ నాయకులు నగేష్, శివప్ప, వేణుగోపాల్‌రావు, చక్రపాణిరెడ్డి మంగళవారం కలిసినట్లు వెల్లడించారు. సీటీస్కాన్ యంత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

### ఉన్నత పాఠశాల మంజూరు చేయండి

పావగడ, జులై 1(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని లింగదహళ్లి గ్రామానికి ప్రభుత్వం ఉన్నత పాఠశాల మంజూరు చేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి మధుబంగారప్పకు పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ మంగళవారం వినతిపత్రం అందించారు. లింగదహళ్లి పర్యాటక కేంద్రంగా పెరుగుతున్నప్పటికీ అక్కడ ప్రభుత్వ పాఠశాలలు లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలవైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉన్నత పాఠశాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా యువజన శాఖ మంత్రి సుధాకర్ ఆయన వెంట ఉన్నారు.

**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

**ఆంధ్రజ్యోతి చెన్నై కార్యాలయం చిరునామా మార్పు..**

"జి.4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెంబరు:40, న్యూనెంబర్: 35, విజయరాఘవరోడ్డు, టి.నగర్, చెన్నై-600 017" చిరునామాలో మంగళవారం నుంచి చెన్నై కార్యాలయం పని చేయనుంది. పాఠకులు గమనించగలరు.

# ఉసురు తీసిన ఉపాధి

- బాణసంచా కర్మాగారంలో పేలుడు
- ఇద్దరు మహిళలు సహా 8మంది దుర్మరణం

శిథిలాలను తొలగిస్తున్న అగ్నిమాపక దళం - నేలమట్టమైన గది

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పిస్తున్న బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి ఇద్దరు మహిళల సహా ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలిలా... విరుదునగర్ జిల్లా శివకాశి సమీపం చిన్న కామన్‌పట్టిలోని గోకులేష్ టపాసుల కర్మాగారంలో మంగళవారం ఉదయం సంభవించిన పేలుడులో ఏడుగురు దుర్మరణం చెందారు. 8 గదులు నేలమట్టమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఆ కర్మాగారం ఫోర్‌మన్ రవి (36)ని సాత్తూరు నగర పోలీసులు అరెస్టు చేశారు. శివకాశి సాత్తూరు మధ్యనున్న చిన్నకామన్‌పట్టిలో కమల్‌కుమార్ అనే వ్యక్తి లైసెన్స్ పొంది, గోకులేష్ ఫైర్ వర్క్స్ పేరుతో బాణసంచా కర్మాగారాన్ని నడుపుతున్నారు. ఈ కర్మాగారంలో 50 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం కార్మికులు బాణసంచా తయారీ పనుల్లో పాల్గొన్నారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో బాణసంచా తయారీ రసాయనాలను కలిపే గదిలో ఉన్నట్టుండి పేలుడు సంభవించింది. దీంతో ఆ కర్మాగారంలోని ఎనిమిది గదులు నేలమట్టమయ్యాయి. ఈ సమాచారం అందుకుని శివకాశి, సాత్తూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్లి శిథిలాల్లో చిక్కుకున్నవారిని వెలికితీశారు. ఈ ప్రమాదంలో మీనంపట్టికి చెందిన మహాలింగం (55), రామసామిపురానికి చెందిన వైరమణి (32), శూలక్కరై ప్రాంతానికి చెందిన లక్ష్మి, అనుమంగుళంకు చెందిన చెల్లపాండి, రామమూర్తి (38), ఒ.కోవిల్‌పట్టికి చెందిన పుణ్యమూర్తి, రామజయం (27), అనే కార్మికులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఐదుగురు కార్మికులు శివకాశి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన రామమూర్తి అనే కార్మికుడు మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

**సీఎం సంతాపం**

ఇదిలా ఉండగా బాణసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో ఏడుగురు మృతి చెందటం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.4లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి తలా రూ.లక్ష, స్వల్పంగా గాయపడినవారికి తలా రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు.

నాన్ ముదల్వన్ పథకం ద్వారా ఉద్యోగావకాశాలు పొందిన వారితో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు

## మా పథకాలు విజయానికి సోపానాలు

- మూడేళ్లలో 3.28 లక్షల మందికి ఉద్యోగాలు
- యూపీఎస్సీలో 50 మంది ఉత్తీర్ణత
- 'వెట్రి నిశ్చయం' ప్రారంభోత్సవంలో స్టాలిన్

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాన్ ముదల్వన్ పథకం ద్వారా మూడేళ్లలో 3.28 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామని, యూపీఎస్సీ పరీక్షలో 50 మంది ఉత్తీర్ణులయ్యారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో నిరుద్యోగ యువతలో ప్రతిభాపాటవాలు పెంపొందించి, వారిని పోటీ పరీక్షలకు సిద్ధం చేసేలా ప్రారంభించిన 'నాన్ ముదల్వన్' పథకం ఇంతటి సత్ఫలితాలిస్తుందని తాను ఊహించలేదన్నారు. నెహ్రూ ఇండోర్‌స్టేడియంలో మంగళవారం ఉదయం జరిగిన నాన్‌ముదల్వన్ తృతీయ వార్షికోత్సవాల్లో సీఎం పాల్గొన్నారు. ఆ సందర్భంగా 'వెట్రి నిశ్చయం' (గెలుపు తథ్యం) అనే వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సభలో ఆయన ప్రసంగిస్తూ నాన్ ముదల్వన్ పథకం విజయం కావటం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని, ఈ పథకం ద్వారా పోటీపరీక్షలకు శిక్షణ పొంది పరీక్షల్లో ఉత్తీర్ణులైనప్పుడు వారి తండ్రిలా తాను సంతోష పడుతున్నానని చెప్పారు. దేశంలో ఏ పోటీపరీక్ష ఫలితాలు ప్రకటించినా అందులో నాన్ ముదల్వన్ పథకం ద్వారా ఎంత మంది పాసయ్యారా అని వెదకటం తనకు అలవాటుగా మారిందన్నారు. గత మూడేళ్లలో నాన్ ముదల్వన్ పథకం ద్వారా 3.28 లక్షల మంది ప్రముఖ సంస్థల్లో ఉద్యోగవకాశాలు పొందారని తెలిపారు. ఇక యూపీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన 57 మందిలో 50మంది నాన్ ముదల్వన్ పథకం ద్వారా శిక్షణ పొంది పాసయ్యారని, ఇంతటి గొప్ప విజయాన్ని అందించిన విద్యార్థులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్య, సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతిభాపాటవాల్లో ముందంజలో ఉంటూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

**మరో కొత్త పథకం...**

నాన్ ముదల్వన్ పథకం సత్ఫలితాలను ఇవ్వటంతో ప్రస్తుతం వెట్రి నిశ్చయం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. ఈ పథకం కింద 18 నుండి 35 యేళ్లలోపు నిరుద్యోగ యువతకు, మధ్యలో చదువులు మానేసిన వారికి స్వల్పకాలిక శిక్షణఇస్తామన్నారు. అంతర్జాతీయ గుర్తింపు కలిగిన శిక్షణా సంస్థల ద్వారా శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ శిక్షణకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దివ్యాంగులు, గిరిజనులు, శ్రీలంక తమిళులు, జాలర్ల కుటుంబాలకు చెందిన యువకులు, మైనారిటీ యువకులు ఈ పథకం ద్వారా శిక్షణ పొందటానికి అర్హులని చెప్పారు. ఈ శిక్షణకు ఎంపికైనవారికి రూ.12వేల ప్రోత్సాహక నగదు అందజేస్తామన్నారు. ఈ పథకం చేరడానికి 'స్కిల్ వాల్ట్' యాప్ కూడా రూపొందించినట్లు స్టాలిన్ చెప్పారు. ఈ యేడాది నుండి కాలేజీ విద్యార్థులకు లాప్‌టాప్‌లు పంపిణీ చేయనున్నామని స్టాలిన్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు పీకే శేఖర్‌బాబు, రాజకన్నప్పన్, గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్.ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, శాసనసభ్యులు పరంధామన్, ఆర్డీ శేఖర్, ఎంపీలు కళానిధి వీరాసామి, నవాజ్ ఖనీ, అదనపు ప్రభుత్వ కార్యదర్శి ప్రదీప్ యాదవ్, కార్యదర్శి శంకర్, సీఐఐ చైర్మన్ ఉన్ని కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తాం

- డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ట్రెండ్ మారిన 'తమిళనాడు ఇన్ యూనిట్' అనే ప్రచారం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకోనున్నట్లు డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ తెలిపారు. డీఎంకే ఆధ్వర్యంలో 45 రోజుల ప్రచార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. వేలూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దురై మురుగన్ మీడియాతో మాట్లాడుతూ... ఈ ప్రచార కార్యక్రమంలో అన్ని సారూప్య అభిప్రాయాలు కలిగిన వారిని కలుసుకుని పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అమలుచేస్తున్న పథకాలు వివరించనున్నామన్నారు. ప్రజలను కలుసుకున్న సమయంలో వారు తెలిపే అభిప్రాయాలను నేతలు, కార్యకర్తలు నమోదుచేసుకోవాలన్నారు. ప్రజలు చెప్పే సమస్యలు, సలహాలు, సూచనలను శ్రద్ధగా వినాలని పార్టీ శ్రేణులకు దురైమురుగన్ పిలుపునిచ్చారు.

## ఢిల్లీ వెళ్లిన గవర్నర్

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఢిల్లీ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య తలెత్తిన వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో, గత నెల 26వ తేది గవర్నర్ ఒకరోజు పర్యటనగా ఢిల్లీ వెళ్లగా, తాజాగా నాలుగు రోజులు పర్యటనగా మళ్లీ ఢిల్లీ వెళ్లారు. మంగళవారం ఉదయం 8.55 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో నగరం నుంచి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఒకే వారంలో రెండవ సారిగా గవర్నర్ ఢిల్లీ వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతోంది. తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా గవర్నర్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలుసుకోనున్నట్లు సమాచారం. ఆ సమయంలో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు గురించి గవర్నర్ కేంద్ర మంత్రికి తెలియజేయనున్నారు. తన పర్యటన ముగించుకుని ఈ నెల4వ తేది గవర్నర్ నగరానికి తిరిగి వస్తారని అధికారుల సమాచారం.

## 200 సీట్లకంటే ఎక్కువే గెలుస్తాం

- స్టాలిన్ ధీమా

అరివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 200 సీట్లకన్నా ఎక్కువ స్థానాలు గెలుచుకోవటం ఖాయమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో మంగళవారం ఉదయం 'ఏకతాటిపై తమిళనాడు' అనే పేరుతో ప్రతి పోలింగ్ కేంద్రంలోను 30 శాతం మంది ఓటర్లకు డీఎంకే సభ్యత్వం కల్పించే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో 45 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపోలింగ్ పరిధిలో 30 శాతం మంది ఓటర్లను పార్టీలో చేర్చుకునే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీకి చెందిన స్థానిక నాయకులు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి ఇళ్లకు కూడా వెళ్ళి, ద్రావిడ తరహా డీఎంకే పాలన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి వారిని ఆకట్టుకుని పార్టీలో చేరేలా ప్రేరేపించనున్నట్లు ఆయన చెప్పారు. తమిళ భాషా సంస్కృతి, సంప్రదాయాలకు హాని కలిగించడమే పనిగాపెట్టుకున్న బీజేపీ కపటనాటకాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివరించి, వారికి డీఎంకే సభ్యత్వం కల్పించాలని పిలుపునిచ్చారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే సిద్ధంగానే ఉందని, ఆ ఎన్నికల్లో గెలుపు ఖాయమని, గతంలో తాను చెప్పినట్లు 200 సీట్ల కంటే అధిక సీట్లలోనే గెలుస్తామని పేర్కొన్నారు.

**కూటమిలో కొత్త పార్టీలు..:** అసెంబ్లీ ఎన్నికల్లోగా డీఎంకే కూటమిలో కొత్త పార్టీలు కూడా చేరే అవకాశం ఉందని స్టాలిన్ పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే కొత్త పార్టీలు కూటమిలో చేరుతాయని ఆయన తెలిపారు. బీజేపీ తరపున ప్రచారం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రంలో తరచూ పర్యటించాలని, అప్పుడే డీఎంకే కూటమి గెలిచే సీట్లు క్రమంగా పెరుగుతాయని చెప్పారు.

## ప్రభుత్వ ఉద్యోగుల మ్యారేజ్ అలవెన్స్ పెంపు

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అవసరాలకనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ.5 లక్షలు మ్యారేజ్ అలవెన్స్ అందించనున్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత బడ్జెట్ సమావేశాల్లో, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమార్థం పలు ప్రకటనలు చేశారు. ముఖ్యమంత్రి 110వ నిబంధన కింద వెలువరించిన ప్రకటనలో... ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మ్యారేజ్ అలవెన్స్ రూ.5 లక్షలకు పెంచనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన జీవో మంగళవారం వెలువడింది. మహిళా ఉద్యోగులకు రూ.10వేలు, పురుషులకు రూ.6వేలు మ్యారేజ్ అల వెన్స్‌గా అందజేస్తుండగా, ప్రస్తుతం పలు రెట్లు పెంచారు. ఆ ప్రకారం, ఇకపై తమ కుటుంబ వివాహాలకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రూ.5 లక్షలు మ్యారేజ్ అలవెన్స్‌గా పొందవచ్చని జీవోలో పేర్కొన్నారు.

## కస్టడీ మృతిపై సీబీఐ విచారణ

- సీఎం స్టాలిన్ ఆదేశం

సీఎం స్టాలిన్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న అజిత్ తల్లి

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనంలోని అమ్మవారి ఆలయం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్న అజిత్ కుమార్ నగల చోరీ కేసు విచారణ సందర్భంగా పోలీసుల కస్టడీలో మృతి చెందిన సంఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుభువనం పోలీస్ స్టేషన్‌లో అజిత్‌కుమార్ పోలీసుల దాడిలో మృతి చెందారనే సమాచారం తెలియగానే తాను దిగ్భ్రాంతికి గురయ్యానని, ఈ సంఘటన దారుణమని భావించే తాను తక్షణమే చర్యలు చేపట్టానని చెప్పారు. ఆరుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. అదే విధంగా మంగళవారం డీఎస్పీని వీఆర్‌కు బదిలీ చేసి, ఏసీపీని సస్పెండ్ చేశామన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం అజిత్‌కుమార్ తల్లి, కుటుంబ సభ్యులతో తాను ఫోన్‌లో మాటాడి వారిని పరామర్శించానని, జరిగిన సంఘటనకు తీవ్ర సంతాపం ప్రకటించానని తెలిపారు. అజిత్‌కుమార్ కుటుంబానికి న్యాయం జరిగేందుకు తాను సీబీఐ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ సిబీసీఐడీ విచారణ కొనసాగించవచ్చని తెలిపినా, పోలీసు శాఖకు చెందిన ఐదుగురిపై తీవ్ర ఆరోపణలు రావటంతో నిష్పక్షపాతంగా విచారణ జరపాలనే సీబీఐ విచారణకు ఉత్తర్వులిచ్చానని స్టాలిన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**పోలీసుల దాడి వీడియో వైరల్...**

శివగంగ జిల్లా మతంపురం భద్రకాళి అమ్మన్ ఆలయంలో కాంట్రాకు సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ వచ్చిన అజిత్ కుమార్‌ను బంగారు నగల చోరీ కేసులో అదుపులోకి తీసుకున్న స్థానిక పోలీసులు దారుణంగా కొట్టారు. ఆ దాడులకు సంబంధించిన వీడియో ఒకటి ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలావుంటే, ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. శివగంగై దారుణ ఘటన విషయం తెలియగానే చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు చేయడంతో పాటు మంగళవారం కూడా కొన్ని చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## అన్బుమణికి పోటీగా సర్వసభ్యమండలి

- ఏర్పాటు దిశగా రాందాస్ చర్యలు

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు డాక్టర్ అన్బుమణికి వ్యతిరేకంగా పోటీ సమావేశాలు నిర్వహించాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా జిల్లాల వారీగా పార్టీ సమావేశాలను నిర్వహించాని రాందాస్ భావిస్తున్నారు. తండ్రీ కొడుకుల మధ్య ఏర్పడిన ఆధిపత్యపోరుతో పార్టీ నేతలు నలిగిపోతున్నారు. అదేసమయంలో అన్బుమణి తన మద్దతుదారులతో జిల్లాల వారీగా పార్టీ జనలర్ బాడీ సమావేశాలను నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు. దీంతో పార్టీ వ్యవస్థాపకుడిగా డాక్టర్ రాందాస్ కూడా జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు. అదేసమయంలో హస్తిన పర్యటనలో ఉన్న అన్బుమణి బీజేపీ నేతలను కలుసుకుంటూ మంతనాలు చేస్తూ, పార్టీని తన చేతుల్లోకి తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీంతో అప్రమత్తమైన రాందాస్.. ఈ నెల 10వ తేదీ తంజావూరు, తిరువారూరు, మైలాడుదురై తదితర జిల్లాల్లో పార్టీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ సమావేశంలో పార్టీ గౌరవాధ్యక్షుడు జీకేమణి, వన్నియర్ సంఘ అధ్యక్షుడు అరుల్‌మొళి, పార్టీ ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈ సమావేశానికి రాందాస్ కూడా హాజరుకానున్నారు. ఇదిలా వుంటే, వయోభారం కారణంగా తన తండ్రి రాందాస్ చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నారనీ, ఆయన గతంలో మాదిరిగా పార్టీని నడిపించలేరంటే అన్బుమణి ఆరోపిస్తున్నారు. కానీ, రాందాస్ మాత్రం తన కుమారుడి వ్యాఖ్యలకు ధీటుగా సమాధానమిస్తూ పార్టీ కార్యకర్తలను సమాయాత్తం చేస్తూ, తనవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## రామనాథపురం వరకూ జాతీయ రహదారి

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మదురై నుంచి పరమకుడి వరకు ఉన్న జాతీయ రహదారిని రామనాథపురం వరకు పొడిగించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మంగళవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ... సమావేశంలో రూ.1.07 లక్షల కోట్లతో ఉద్యోగావకాశాలు పెంచే పథకాలు, రూ. లక్ష కోట్లతో పరిశోధనల అభివృద్ధి, కొత్త పథకాలు, పరమకుడి-రామనాథపురం జాతీయ రహదారి పొడిగింపు తదితరాలకు ఆమోదం తెలిపిందన్నారు. మదురై-రామేశ్వరం-ధనుష్కోటి టెర్మినల్ తదితర పుణ్య స్థలాలను అనుసంధానం చేసేలా జాతీయ రహదారి ఏర్పాటుకానుందన్నారు. మదురై-పరమకుడి మధ్య ఇప్పటికే ఫోర్ వే ఉందని, ప్రస్తుతం రామనాథపురం వరకు రహదారి పెంచేందుకు ఆమోదం తెలిపిందని, మొత్తం 46.7 కి.మీ మేర రోడ్డు ఏర్పాటుకు రూ.1,853 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## విరుదునగర్‌లో రూ.1894 కోట్లతో టెక్స్‌టైల్ పార్కు

- మంత్రి టీఆర్‌బీ రాజా

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో రూ.1,894 కోట్లతో టెక్స్‌టైల్ పార్కు నెలకొల్పనున్నట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీఆర్‌బీ రాజా వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రటకన విడుదల చేశారు. జిల్లాలోని కుమారలింగపురంలో పీఎం మిత్ర అనే పథకం కింద ఉమ్మడి జౌళి పార్కు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. ఈ పార్క్ కోసం సిప్‌కాట్‌లో రాష్ట్ర ప్రభుత్వం 1,052 ఎకరాలను కూడా కేటాయించిందని, దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తాయని వెల్లడించారు. ఈ టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాన్ని సిప్‌కాట్ చేపడుతుందని మంత్రి వెల్లడించారు. అలాగే, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ అనే లేటెస్ట్ టెక్నాలజీతో మురుగునీరు శుద్ధీకరణ ప్లాంట్ నిర్మిస్తామని వెల్లడించారు. 1,052 ఎకరాలల్లో నెలకొల్పే ఈ టెక్స్‌టైల్ పార్కు ద్వారా రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని బావిస్తున్నట్టు తెలిపారు.

## సమాచార దర్శిని

### టైపింగ్, స్టెనోగ్రఫీ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో జరుగనున్న టైప్ రైటింగ్, స్టెనోగ్రఫీ పరీక్షలకు దరఖాస్తు స్వీకరణ మంగళవారం ప్రారంభమైంది. ఈ మేరకు సాంకేతిక విద్య కమిషనర్, సాంకేతిక పరీక్ష బోర్డు చైర్మన్ ఇన్నసెంట్ దివ్య విడుదల చేసిన ప్రకటనలో, ఆగస్టులో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేది వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోని వారు, జూలై 30, ఆగస్టు 1వ తేదీల్లో తత్కాల్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కోర్సులను బట్టి రూ.100-రూ.200 వరకు ఫీజు చెల్లించాలని ప్రకటనలో తెలిపారు.

### 7 నుంచి గ్రూప్-4 సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 విభాగంలోని ఖాళీ పోస్టులకు ఈ నెల 7వ తేది సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుంది. బ్రాడ్‌వేలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరిగే ఈ సర్టిఫికెట్ల పరిశీలనకు అర్హులైన అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు, అభ్యర్థులకు పంపే ఇ కాల్ లెటర్లలో ఉన్న తేది, సమయానికి హాజరుకావాలని, హాజరు కాని వారికి మరో అవకాశం ఉండదని టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి సుందరరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు.

### చెరకు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహక నిధి

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చెరకు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహక నిధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.349 కోట్లు కేటాయించింది. ఈ మేరకు పర్యాటక, చక్కెర ఉత్పత్తి శాఖ మంత్రి రాజేంద్రన్ విడుదల చేసిన ప్రకటనలో, 2025-26 వ్యవసాయ బడ్జెట్‌లో, ప్రభుత్వ, ప్రైవేటు చక్కెర కర్మాగారాలకు చెరకు సరఫరా చేసే రైతులను ప్రోత్సాహించేలా ప్రత్యేక సాయం అందజేస్తామని ప్రకటించామన్నారు. ఆ ప్రకారం, చెరకు రైతులకు టన్ను చెరకుకు రూ.349 చొప్పున అందించనున్నామని తెలిపారు. గత ఏడాది 4.9 లక్షల మంది రైతులకు రూ.848.16 కోట్లు ప్రత్యేక ప్రోత్సాహక నిధి అందించినట్లు మంత్రి తెలిపారు.

### ఈ నెలలో ఎండలే..!

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సహ దక్షిణాది రాష్ట్రాల్లో ఈ నెల (జూలై)లో ఎండలు సాధారణం కన్నా అధికంగా ఉంటాయని భారత వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని అధిక జిల్లాల్లో ఈ నెల వర్షపాతం సాధారణం కన్నా తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, అదే సమయంలో, ఎండ తీవ్రత సాధారణం కన్నా అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

### ఊటీలో షూటింగ్‌లకు అనుమతి

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో షూటింగ్‌లకు అనుమతిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరొందిన ఊటీని ఏడాదికి సుమారు 30 లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుండగా, వేసవి సీజన్‌లో మాత్రమే పర్యాటకుల సంఖ్య 8 లక్షలుంటుంది. వేసవి సీజన్ పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా ఊటీ బొటానికల్ గార్డెన్, రోజ్ పార్క్, కున్నూర్ సిమ్స్ పార్క్, తదితర పర్యాటక ప్రాంతాల్లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలు సినిమా షూటింగ్‌లకు నిషేధం విధించారు. ప్రస్తుతం సీజన్ ముగియడంతో సినిమా షూటింగ్‌లకు అనుమతించినట్లు, ఉద్యానవన శాఖ కార్యాలయాన్ని సంప్రదించి తగిన రుసుము చెల్లించి షూటింగ్‌లకు అనుమతి పొందవచ్చని అధికారులు తెలిపారు.

### తగ్గిన వాణిజ్య వినియోగ సిలిండర్ ధర

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య వినియోగ సిలిండర్ ధర రూ.57.50 తగ్గింది. ఆయిల్ సంస్థలు గృహ వినియోగానికి 14.20 కిలోలు, వాణిజ్య వినియోగానికి 19 కిలోల బరువు కలిగిన సిలిండర్లు అందజేస్తున్నాయి. అంతర్జాతీయ ముడిచమురు ధరలకు అనుగుణంగా సిలిండర్ ధరల్లో ప్రతినెల మార్పులు చేపడుతుంటాయి. ఆ ప్రకారం, జూలైకి సంబంధించి 19 కిలోల వాణిజ్య వినియోగ సిలిండర్ ధర రూ.57.50 తగ్గి రూ.1,823.50కు విక్రయమవుతోంది. ఇక, గృహ వినియోగ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేక రూ.868.50కు విక్రయమవుతోంది.

### వైద్య కోర్సులకు 72,943 దరఖాస్తులు

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తు విద్యా సంవత్సరంలో వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు 72,943 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని 36 ప్రభుత్వ కళాశాలల్లో, కేకే నగర్ ఈఎస్ఐ వైద్య కళాశాలలో 5,200 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అందులో 888 సీట్లు అఖిల భారత కోటాకు కేటాయించారు. ఇవి మినహా, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో 3,450 సీట్లు, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 550 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఆ ప్రకారం, మొత్తం 92,000 సీట్లకు భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వాటిలో 496 సీట్లు 7.5 శాతం కేటాయింపులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేటాయించారు. అలాగే, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో 2,276 బీడీఎస్ సీట్లు ఉన్నాయి. ఈ సీట్లకు దరఖాస్తు స్వీకరణ గత నెల 29వ తేదీతో ముగిసింది. ఆ ప్రకారం, మేనేజ్‌మెంట్ కోటాకు 30వేలు, ప్రభుత్వ కోటా సీట్లకు 42వేలు మంది దరఖాస్తు చేసుకున్నట్లు వైద్య విద్య డైరెక్టరేట్ అధికారులు తెలిపారు.

### మెట్రోలో గత నెల 92.19 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో జూన్ నెలలో 92.19 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) విడుదల చేసిన ప్రకటనలో... మెట్రో రైళ్లలో సౌకర్యవంతమైన ప్రయాణం చేసేలా పనులు కల్పించడంతో పాటు పలు రాయితీలు అందజేస్తున్నారు. ఆ ప్రకారం జూన్ నెలలో మెట్రో రైళ్లలో 92,19,925 మంది ప్రయాణించారని తెలిపారు. అదే నెల 27వ తేది అధికంగా 3,72,503 మంది ప్రయాణించారని తెలిపింది. అలాగే మే నెలలో 89,09,724 మంది ప్రయాణించారని తెలిపింది. మెట్రో రైలు ప్రయాణికులకు క్యూఆర్ కోడ్, ట్రావెల్ కార్డ్, వాట్సాప్ (83000 86000), పేటీఎం, ఫోన్ పే, సింగార చెన్నై కార్డ్ తదితరాల ద్వారా టిక్కెట్లు పొందుతున్నవారికి 20 శాతం రాయితీ కల్పిస్తున్నామని సీఎంఆర్‌ఎల్ తెలియజేసింది.

### పిండిమెషిన్‌కు సబ్సిడీ

● చెన్నై జిల్లా కలెక్టర్ ప్రకటన

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదకుటుంబాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించే పథకంలో పిండి మెషిన్ కోసం దరఖాస్తు సమర్పించే వారికి రాయితీ కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ రష్మీ సిద్దార్థ్ ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వెనుకబడిన వర్గాలు, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న మహిళలకు స్వయం ఉపాధి కల్పించే వారి జీవనాధారాన్ని మెరుగు పరచేందుకు రాష్ట్రప్రభుత్వం ఓ పథకాన్ని పరిచయం చేసింది. 2025-2026వ ఆర్థిక సంవత్సరంలో 500 మహిళలకు విద్యుత్ పిండి మెషిన్ కొనుగోలు చేయడానికి 50 శాతం రాయితీ కల్పిస్తారు. తమిళనాడులో జన్మించిన 25ఏళ్ళు నిండిన పేదకుటుంబాల మహిళలకు తమ పుట్టిన సర్టిఫికెట్ నకలును కలెక్టర్ కార్యాలయంలో సమర్పించి దరఖాస్తు పొందవచ్చును. వార్షిక ఆదాయం రూ.1,20,000లోపున్నవారు, ఈ నెల 14వ తేదీలోపు సమర్పించాలని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# టీవీకే ఏనుగు చిహ్నంపై నిషేధమా?

● రేపు తీర్పు చెప్పనున్న న్యాయస్థానం

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండాలో ఉన్న ఏనుగు చిహ్నాలపై వ్యతిరేకంగా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) దాఖలుచేసిన పిటిషన్‌పై గురువారం మద్రాసు హైకోర్టు తీర్పు వెల్లడించనుంది. బీఎస్పీ జెండాలోని ఏనుగు చిహ్నాన్ని టీవీకే వినియోగించకుండా నిషేధం విధించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇళంగోవన్ చెన్నై ప్రధమ శ్రేణి సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసులో టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో... పలు విషయాలు దాచి దాఖలుచేసిన ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదని, బీఎస్పీ జెండా, టీవీకే జెండాకు ఎలాంటి సంబంధం లేదని, పార్టీ సిద్ధాంతాలు, కట్టుబాట్లు, భవిష్యత్తు రాష్ట్రాభివృద్ధి తదితరాలు పరిగణలోకి తీసుకుని టీవీకే జెండా రూపొందించామని తెలిపారు. బీఎస్పీ జెండాలో ఒక ఏనుగును, టీవీకే జెండాలో రెండు ఏనుగులను వ్యత్యాసం ఉందన్నారు. ఓటర్లకు ఇబ్బంది కలిగించేలా రూపొందించలేదని, అందువల్ల ఈ పిటిషన్ తోసివేయాలని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే, బీఎస్పీ తరఫున... మా పార్టీ జెండాలోని చిహ్నాన్ని టీవీకే వినియోగించడం, ఉదయించే సూర్యుడు, అన్నా, హస్తం తదితర చిహ్నాల్లో మార్పులు చేసి జెండా రూపొందించేందుకు డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు అనుమతి స్వయా మా జాతీయ చిహ్నం ఏనుగు చిహ్నాన్ని ఏ పార్టీలు మార్పులు చేసి వినియోగించుకోలేవని వాదించారు. ఈ కేసులో టీవీకే జెండాకు బీఎస్పీ జెండాకు ఎలాంటి సంబంధం లేదని, ఎన్నికల సంఘం ఇప్పటికే తమకు సానుకూలంగా అనుమతులిచ్చిందని, ప్రచార ఆర్భాటం కోసమే ఈ పిటిషన్ దాఖలైందని మంగళవారం బుస్సీ ఆనంద్ తరపు న్యాయవాది వాదించారు. అన్ని తరపు వాదనలు ముగిసిన నేపథ్యంలో, ఈ కేసుపై గురువారం తీర్పు వెలువరించనున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

టీవీకే, బీఎస్పీ జెండాల్లోని ఏనుగు చిహ్నాలు

# తాగునీటి కోసం భవానీసాగర్‌లో రాస్తారోకో

ఖాళీ బిందెలతో రాస్తారోకో జరుపుతున్న గ్రామస్థులు

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలోని భవానీసాగర్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాస్తారోకో జరిపారు. ఆ ప్రాంతంలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి పది రోజులకొకమారు మంచినీరు సరఫరా చేస్తున్నారు. తమకు రోజూ మంచినీటిని సరఫరా చేయాలని కోరుతూ ఖాళీబిందెలతో పుళియంపట్టి రోడ్డు అన్నానగర్ బస్టాపు వద్ద రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బీడీవో ఇందిరా రాణి హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్ళి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. త్వరలోనే ఆ ప్రాంతానికి రోజూ మంచినీరుసరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళనను విరమించుకున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా అన్నవాసల్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులను మంత్రి రఘుపతి పరామర్శించారు. మేయ్యివళి రోడ్డులో 200లకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ప్రాంతానికి చేరువలోవున్న కులక్కరై డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను సోమవారం మున్సిపల్ సిబ్బంది తగులబెట్టారు. ఆ సమయంలో గాలి వేగంగా వీచడంతో మంటలు సమీపంలోవున్న నివాసప్రాంతాలకు వ్యాపించి ఇళ్లపై కప్పులు కాలిపోయాయి. సమాచారం తెలిసి సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అయినప్పటికీ 50కి పైగా ఇళ్లు నేలకొరిగాయి. అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు మంత్రి రఘుపతి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ . సినీ నటుడు విజయ్ నిర్వహిస్తున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే)ను తాము ఒక రాజకీయ పార్టీగా చూడటం లేదని, విజయ్ చెపుతున్నట్లు డీఎంకే ప్రభుత్వానికి ఎలాంటి నష్టం వాటిల్లబోదని మంత్రి ధీమా వ్యక్తంచేశారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రఘుపతి

### హొగెనెకల్‌లో పెరిగిన ప్రవాహం

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన హొగెనెకల్‌లో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. మంగళవారం లెక్కల ప్రకారం 65 వేల ఘనపుటడుగుల మేరకు నీరు వస్తోంది. అదేసమయంలో మేట్టూరు డ్యాం నుంచి సెకనుకు 48 వేల ఘనపుటడుగుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలుకురుస్తున్నాయి. దీంతో మేట్టూరు డ్యాంకు వరద నీరు భారీగా చేరుతోంది. డ్యాం నుంచి కిందికి 48 వేల ఘనపుటడుగుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 93.47 టీఎంసీల నీరు నిల్వవుంది.

# విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళవారం నుంచి అమలులోకి వచ్చిన విద్యుత్ ఛార్జీ పెంపుపై పలు రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలిపాయి. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, డీఎండీకే, టీఎంసీ, పీఎంకే, సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఇదే అంశంపై పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదని సోమవారం సాయంత్రం వరకు హామీ ఇచ్చిన డీఎంకే ప్రభుత్వం మాట నిలబెట్టుకోకుండా, అర్ధరాత్రి నుండి విద్యుత్ ఛార్జీలను 3.16 శాతం పెంచిందని, ఇప్పటికే పెరిగిన ధరలతో తల్లడిల్లుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు, చిరువ్యాపారులపై విద్యుత్ ఛార్జీల రూపంలో ఆర్థిక భారం మరింత పెంచడం ఖండించదగ్గదన్నారు. గత ఏడాది ఇళ్లకు 4.83 శాతం విద్యుత్ ఛార్జీలను పెంచిన ప్రభుత్వం వచ్చే ఏడాది అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నందువల్ల ఎలాంటి ముందస్తు ప్రకటన చేయలేదని వ్యాఖ్యానించారు.

# లంచం కేసులో ప్రత్యేక తహసీల్దార్ సహా ముగ్గురికి జైలుశిక్ష

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులో రోడ్డు విస్తరణ కోసం సేకరించిన స్థలానికి నష్టపరిహారం చెల్లించేందుకు రూ.75వేలు లంచం పుచ్చుకున్న ప్రత్యేక తాహసీల్దార్‌తో పాటు ముగ్గురికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఎన్నూర్ నుంచి మహాబలిపురం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా తిరువళ్లూరు నుంచి చెంగల్పట్టు జిల్లా శ్రీపెరుంబదూర్ వరకు గల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పథకం కోసం ఈ ప్రాంతాల్లో ప్రైవేటు స్థలాలను ప్రభుత్వం తీసుకుని నష్టపరిహారంగా రూ.45 లక్షలు ప్రకటించింది. ఆ మేరకు తిరువళ్లూరు సమీపంలోని బోలివాక్కం ప్రాంతంలోని వ్యాల్యూస్ బేస్ అనే సంస్థ నుంచి సేకరించిన స్థలానికి ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని చెల్లించే బాధ్యతను ప్రత్యేక తాహసీల్దార్ ఎడ్వడ్ విల్సన్‌కు ప్రభుత్వం అప్పగించింది. నష్టపరిహారం కోసం వెళ్లిన సంస్థ మేనేజర్ ఆసిన్ జోసఫ్ వద్ద రూ. లక్ష లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆసిన్ జోసఫ్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఏసీబీ డీఎస్పీ గణేశన్ ఉత్తర్వులతో మారువేషాలతో ప్రత్యేక బృందం నిఘా వేసింది. రసాయనాలు పూసిన రూ.75వేలు ప్రత్యేక తాహసీల్దార్ ఎడ్వడ్ విల్సన్‌కు ఏజెంట్లుగా వ్యవహరించిన గోమతి నాయగం, వెల్లదురై పుచ్చుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపరిచి తిరువళ్లూరు సబ్ జైలుకు తరలించారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**ఆలందూర్:** ఎంకేఎన్ రోడ్డు, డీవీపీసీ, పోలీసు క్వార్టర్స్, కుప్పుస్వామి కాలనీ, పుదుపేట వీధి, ఏకాంబర దబేదార్ వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, అళగిరి వీధి, వేదగిరి వీధి, మండి వీధి, జిన్నా వీధి, ముత్తమజి వీధి, గాజి సాహెబ్ వీధి, ఇబ్రహీం వీధి, అజర్‌ఖానా వీధి, లష్కర్ వీధి

**పల్లావరం:** కడప్పేరి అన్నై ఇందిరా నగర్, న్యూ కాలనీ 12 నుంచి 14 వీధులు, 6వ క్రాస్ వీధి, ఉమయాల్‌పురం, సారధి వీధి, పోస్టాఫీసు, ట్రంక్ రోడ్డు, పల్లావరం బస్టాండ్, జనత థియేటర్, శ్రీనివాస పెరుమాళ్ ఆలయ వీధి, రంగనాథన్ వీధి, పాత సండై రోడ్డు, చర్చి రోడ్డు, పోలీసు క్వార్టర్స్, ఆర్పీ రోడ్డు థెరెస్సా స్కూల్, పిళ్లయార్ ఆలయ వీధి, ఐజీ రోడ్డు, కన్నభిరాన్ వీధి, యూనియన్ కార్బైడ్ కాలని, కోవలన్ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, తిరువేంగడముడయాన్, నటేశన్ రోడ్డు, క్రష్ వీధి, పల్లావర్ ఈస్ట్ ఏరియా

**అంబత్తూర్:** అడయాలంపేట, కేజీ అపార్ట్‌మెంట్స్, ట్రాన్స్‌నేర్జి

**బీసెంట్ నగర్:** శాస్త్రి నగర్ కామరాజర్ రోడ్డు, వాల్మీకి వీధి, కళాక్షేత్ర కొంత భాగం, లక్ష్మీపురం, శ్రీరామ్ నగర్, కుమరగురు 1 నుంచి 4 వీధులు

**షోలింగనల్లూర్:** మాదంబాక్కం కన్నదాసన్ వీధి, కరుణానిధి వీధి 1 నుంచి 7, విశాలాక్షి నగర్, జాన్ వీధి, థామస్ వీధి, విఘనరాజపురం 6వ వీధి, గోపాలపురం నగర్, విఘనరాజపురం మోహి ఫ్లోరెన్స్, గురుగణేష్ నగర్, పార్థసారధి నగర్, కోవిలంబాక్కం పొన్నియమ్మన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, గాంధీ నగర్, సత్య నగర్, కొళత్తూర్.

## అక్రమ డ్రైనేజీ కనెక్షన్లకు జరిమానా పెంపు : జీసీసీ

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలో అక్రమ డ్రైనేజీ కనెక్షన్లకు జరిమానా పెంచుతూ గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఉత్తర్వులు జారీచేసింది. దీన్నిబట్టి భవనాల విస్తీర్ణం ప్రకారం అక్రమ డ్రైనేజీ కనెక్షన్లకు రూ.10వేల నుండి రూ.5 లక్షల వరకు జరిమానా పెంచింది. ఇంక సాధారణ గృహాలకు రూ.10వేలు, సాధారణ వ్యాపారుల కట్టడాలకు రూ.5వేలు జరిమానా పెంచింది. ప్రత్యేక గృహకట్టడాలకు రూ.50వేలు, ప్రత్యేక వాణిజ్య కట్టడాలకు రూ.లక్ష, అపార్ట్‌మెంట్లకు రూ.2 లక్షలు, షాపింగ్ మాల్స్‌కు రూ.5 లక్షలు జరిమానాను పెంచింది. చట్టవిరుద్ధంగా డ్రైనేజీ కనెక్షన్లు ఉన్నవారు 15 జోన్ల కార్యాలయాలను సంప్రదించి వాటిని క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టాలని జీసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

## చెట్టు నరికిన వ్యక్తికి రూ. లక్ష జరిమానా

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో రావి చెట్టు కొమ్మలు తొలగిస్తామని అనుమతి పొంది, చెట్టును పూర్తిగా నరికివేసిన వ్యక్తికి రూ.1,05,000 జరిమానా విధించారు. కోవై సౌత్ సర్కిల్ సౌరిపాళయం గ్రామానికి చెందిన కనకరాజ్ రావి చెట్టు కొమ్మలు ప్రభుత్వాసుపత్రి భవనంపై పడే అవకాశం ఉందని, అందువల్ల చెట్టు కొమ్మలు తొలగించేందుకు అనుమతించాలని తాలూకా కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు. ఆర్ఐ, వీఏఓ పర్యవేక్షణలో అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించాలని, చెట్టు కొమ్మలు తొలగించే దృశ్యాలు ఫొటోలు తీసి సమర్పించాలని తహసీల్దార్ ఉత్తర్వులు జారీచేశారు. కానీ, రాత్రి వేళ అధికారులు లేకుండా చెట్టు పూర్తిగా తొలగించారు. ఈ విషయమై అధికారులు అందజేసిన నివేదికతో... కనకరాజ్‌కు లక్షా 5 వేలు జరిమానా విధిస్తూ తహసీల్దార్ మహమ్మద్ సైఫ్ ఉత్తర్వులు జారీచేశారు.

## కోయంబేడులో పెరిగిన టమోటో, టెంకాయ ధరలు

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో టమోటో, టెంకాయ ధరలు మంగళవారం పెరిగాయి. టమోటా ధర కిలో రూ.20 నుంచి రూ.35కు పెరగినట్లు మార్కెట్ వ్యాపారులు తెలిపారు. గత రెండ్రోజులుగా కిలో టమోటో రూ.10 నుండి రూ.15 వరకు విక్రయించిన నేపథ్యంలో, ఒకే రోజులో ధర రెండింతలు పెరగడంపై కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. కాగా, చిల్లర విక్రయంలో కిలో టమోటా రూ.40కి విక్రయిస్తున్నారు. కోయంబేడు సంతకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులోని పలు జిల్లాల నుంచి ప్రతి రోజు 1,300 టన్నుల టమోటో దిగుమతి అయిన నేపథ్యంలో, మంగళవారం 1000 టన్నులు మాత్రమే దిగుమతయ్యాయి. ఇందువల్ల టమోటో ధరను పెంచాల్సివచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. అదేవిధంగా కిలో టెంకాయ రూ.70కు విక్రయిస్తున్నారు.

## పాండి బజార్‌లో టవర్ క్లాక్

టవర్ క్లాక్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని పాండి బజార్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ (టి.నగర్) టవర్ క్లాక్‌ను ఏర్పాటు చేయగా, దానిని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ (ఆర్ఐ డిస్ట్రిక్ట్ 3233) మహావీర్ బోత్రా, ఫస్ట్‌లేడీ జయశ్రీ బోత్రా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ డిస్ట్రిక్ చైర్మన్ పీపీ అంలవాణన్, రొటేరియన్లు క్రిష్ణ చందర్, దిలీప్, రాజేష్, ధరణి ప్రకాష్, అరుమైనాథన్ కాబోయే అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్ తెల్లకుల, సెక్రటరీ శోభా ఆనంద్, జీసీసీ అధికారులు పాల్గొన్నారు.

# ఏసీ కావాలంటూ నవ వధువుకు వేధింపులు

● పెళ్ళయిన నాలుగో రోజే ఆత్మహత్య

మృతురాలు లోకేశ్వరి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరకముందే ఆమెకు నూరేళ్లు నిండిపోయాయి. కేవలం ఏసీ కోసం ఆమెను వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా... తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి సమీపం ముస్లిం నగర్ ఏరికరై ప్రాంతానికి చెందిన లోకేశ్వరి (22) బీఏ పూర్తిచేసింది. ఆమెకు పొన్నేరి సమీపం కాట్టావూరు ప్రాంతానికి చెందిన పన్నీర్ (30)తో గత నెల 27వ తేది వివాహం జరిగింది. వివాహం అనంతరం లోకేశ్వరి సోమవారం భర్తతో కలసి పుట్టింటికి వచ్చింది. రాత్రి భోజనాలు చేసి అనంతరం అందరూ నిద్రపోతున్న సమయంలో లోకేశ్వరి బాత్రూమ్‌కు వెళ్లింది. చాలాసేపటి వరకు ఆమె బయటకు రాకపోవడంతో తండ్రి గజేంద్రన్ బాత్రూమ్ తలుపు తట్టినా ఎలాంటి శబ్దం రాలేదు. తలుపు నెట్టుకుంటూ లోనికి వెళ్లిన గజేంద్రన్, ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కుమార్తెను చూసి బోరున విలపించాడు. ఈ వ్యవహారంపై మృతురాలి తండ్రి గజేంద్రన్ పొన్నేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో తన కుమార్తెకు గత నెల 27వ తేది వివాహం జరుగగా, కట్నం కింద 4 సవర్ల నగలు, బైక్, రూ.1.50 లక్షల విలువైన గృహోపకరణాలు అందించామన్నారు. వివాహం జరిగిన రోజు నుంచి తమ కుమార్తెపై వరకట్న వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ముందు తెలిపిన విధంగా మిగిలిన సవర నగలు, ఏసీ, మరికొన్ని గృహోకరణాలు తీసుకురావాలని ఒత్తిడి తెచ్చారని, ఈ విషయాన్ని ఇంటికొచ్చిన కుమార్తెతో తనతో తెలిపి విలపించిందన్నారు. తన కుమార్తె ఆత్మహత్యకు పన్నీర్, అతని కుటుంబసభ్యులు కారణమని పిటిషన్‌లో తెలిపారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, పన్నీర్, అతని కుటుంబసభ్యులను విచారిస్తున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఐటీ ఉద్యోగి

● పోలీసులకు పట్టించిన భార్య

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న భర్తను ఓ మహిళ పోలీసులకు పట్టించింది. స్థానిక తిరువొత్తియూర్‌కు చెందిన రాజా ఐటీ ఉద్యోగం చేస్తూ, ఐటీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై అతడిని నిలదీయగా తనపై దాడి చేసినట్లు రాజా భార్య ప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రాజా ఇంట్లో తనిఖీలు చేపట్టి కిలో గంజాయి స్వాధీనం చేసుకుని, రాజాతో పాటు అతడితో ఈ పనిచేస్తున్న హరిహరన్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

● తిరుభువనం వాచ్‌మన్ మృతి కేసు..

## మదురై జిల్లా న్యాయస్థానం విచారణకు లాయర్ల సంఘం డిమాండ్

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా త్రిభువనం సమీపంలోని మడప్పురం ఆలయ వాచ్‌మన్ లాకప్‌డెత్‌పై మదురై జిల్లా కోర్టు విచారణ జరపాలని ఆ న్యాయస్థానం లాయర్ల సంఘం డిమాండ్ చేసింది. మడప్పురం ఆలయ సిబ్బంది బాత్‌రూమ్ నుంచి తీసిన 17 సెకన్ల వీడియో దృశ్యాల్లో అజిత్‌కుమార్‌ను పోలీసులు అమానుషంగా చిత్రహింసలు పాలుచేసిన దృశ్యాలు వెలుగు చూశాయి. పోస్టుమార్టం రిపోర్టులో అతని శరీరంలో 18చోట్ల గాయాలైనట్లు, నోరు, చెవులు, మూత్రనాళంలో మిరపపొడి చల్లినట్లు తెలిసింది. పోలీసులు విచారణ ఖైదీపట్ల దారుణంగా ప్రవర్తించి హతమార్చిన తీరుపై మదురై జిల్లా న్యాయవాదుల సంఘం ఆగ్రహించింది. ఆ సంఘ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది హెన్రీ జిల్లా న్యాయమూర్తి జాన్ సుందర్ లాల్ సురేష్‌ను కలిసి విచారణ జరపాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హెన్రీ మీడియాతో మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్ నమోదు చేయ్యకముందే మానామదురై డీఎస్పీ ప్రత్యేక పోలీస్ విభాగం విచారణ ప్రారంభించడంలో అనుమానాస్పదం కలిగించిందని, తప్పుచేసిన పోలీసులను కాపాడే విధంగా జరిగిన విచారణ న్యాయస్థానం అంగీకరించరాదని తెలిపారు. ఇదిలా ఉండగా న్యాయవాదుల సంఘం డిమాండ్ మేరకు అజిత్‌కుమార్ లాకప్‌డెత్ కేసును మదురై జిల్లా న్యాయమూర్తి జాన్ సుందర్‌లాల్ సురేష్ విచారణ జరుపుతారని, విచారణ నివేదికను ఈ ఎనిమిదిన దాఖలు చేయాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

● లైంగిక వేధింపుల వ్యవహారం..

## అన్నామలైని విచారించాలనే పిటిషన్ తిరస్కరణ

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనలో అన్నామలైని విచారించాలంటూ దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. అన్నా వర్శిటీలో విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపుల కేసు రాష్ట్రంలో సంచలనం రేపింది. ఈ క్రమంలో, ఈ కేసులో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలైను విచారించాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది ఎంఎల్ రవి దాఖలుచేసిన పిటిషన్‌లో... లైంగిక వేధింపుల కేసుకు సంబంధించి జ్ఞానశేఖరన్ ఎవరెవరితో ఫోన్ మాట్లాడాడో తన ఆధారాలున్నాయన్నారని, ఈ కేసులో అన్నామలైను విచారించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు పేర్కొన్న న్యాయస్థానం, రాజకీయనేతల అభిప్రాయాలకు కోర్టు సమాధానం చెప్పాలా? ఇలాంటి వ్యాఖ్యలు విస్మరించాలి. ఇలాంటి కేసులు దాఖలుచేయాల్సి వస్తే, ప్రతిరోజు వందలాది పిటిషన్లు దాఖలయ్యే అవకాశముందని న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేసింది.

## విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● దంత వైద్యుడి అరెస్టు

వాషర్‌మెన్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన దంత వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాంచీపురం సమీపం తిరుప్పరుత్తికుండ్రం ప్రాంతానికి చెందిన మణికంఠన్ (29) కాంచీపురం పూక్కడై సత్రం ప్రాంతంలో దంత వైద్యశాల నడుపుతున్నాడు. అతడి ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన విద్యార్థినిపై మణికంఠన్ లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. తప్పించుకున్న విద్యార్థిని, శివకాంజి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన పోలీసులు, మణికంఠన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

## నీట మునిగి విద్యార్థి మృతి

వాషర్‌మెన్‌పేట,జూలై1(ఆంధ్రజ్యోతి):నీటమునిగి విద్యార్థి మృతిచెందిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో చోటుచేసుకుంది. పుద్ధర్‌నగర్‌కు చెందిన హరిహరన్ 10వతరగతి చదువుతున్నాడు. ఘటన జరిగిన రోజున హరిహరన్ స్నేహితులతో కలసి ముడిచ్చూర్ చెరువుకు వెళ్లాడు. వారంతా సరదాగా స్నానం చేస్తున్న సమయంలో, హరిహరన్ లోతైన ప్రాంతంలో మునిగాడు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు గాలించి హరిహరన్ మృతదేహం వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించండి

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి మద్దతు పలికే ప్రాంతీయ పార్టీలను ఓడించాలని డీఎంకే ఎంపీ ఎ.రాజా పిలుపునిచ్చారు. తమిళ సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేయాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని కొన్ని పార్టీలు బీజేపీకి మద్దతుగా ఉన్నాయని, అలాంటి పార్టీలను ఓడించి రాష్ట్రాన్ని రక్షించాలని కోరారు. తమిళనాడు డీఎంకే కోసం కాదని, మొత్తం తమిళనాడు రక్షణ కోసమే పార్టీ ఉందని ఎంపీ రాజా తెలిపారు.

## 311 డిటోనేటర్ల స్వాధీనం

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా గోపిశెట్టిపాళెం సమీపంలోని టీఎన్ పాళెయం కొంగణిగిరి కుమారస్వామి ఆలయం ప్రాంతంలో వ్యానులో తరలిస్తున్న 311 డిటోనేటర్లు, 993 జిలెటిన్ స్టిక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో పేలుడు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సోమవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టగా వ్యానులో తరలిస్తున్న డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వ్యాను డ్రైవర్ ప్రకాష్ (25), పేలుడు పదార్థాల గోడౌన్ యజమాని సుబ్రమణిలను పోలీసులు అరెస్టు చేశారు.

'కయిలన్' ఆడియో రిలీజ్ దృశ్యం

## ప్రజలకు నచ్చింది చేయడమే మన కర్తవ్యం

● కె.భాగ్యరాజ్

సినిమాలకు తమిళంలో పేర్లు పెట్టకపోవడం అంటే మాతృభాషను ప్రజలకు దూరం చేసినట్టు కాదని, ప్రజలకు నచ్చింది చేయడమే మన కర్తవ్యమని సీనియర్ నటుడు, ప్రముఖ దర్శక నిర్మాత కె.భాగ్యరాజ్ అభిప్రాయపడ్డారు. బీటీకే ఫిలిమ్స్ పతాకంపై బీటీ అరసకుమార్ నిర్మాణంలో అరుల్ అజిత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం "కయిలన్". శివదా, రమ్య పాండ్యన్ ప్రధాన పాత్రలు పోషించగా, ఈ నెల 25వ తేదీ చిత్రం విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ముఖ్య అతిథులుగా కె.భాగ్యరాజ్, సీనియర్ నిర్మాత, నటుడు కె.రాజన్‌తో పాటు చిత్ర బృందం, దర్శక నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.రాజన్ మాట్లాడుతూ, 'చిత్రాలకు తమిళంలో పేర్లు పెట్టి, మాతృభాషను ప్రజలకు మరింత దగ్గర చేయాలి. తమిళంలో పేర్లు పెట్టే చిత్రాలకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలి' అని కోరారు. కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, గతంలో నేను పలు చిత్రాలకు ఆంగ్లంలో పేరు పెట్టాను. హిందీ పాట కూడా పాడాను. ఇదంతా ప్రేక్షకుల కోసమే చేశాను. ప్రజలకు నచ్చింది చేయడమే మన కర్తవ్యం. తమిళంలో పేర్లు పెట్టకపోవడం ద్వారా భాషను వారికి దూరం చేయాలన్న ఉద్దేశ్యం కాదు. మనల్ని పోషిస్తున్నది తమిళమే. మంచి సినిమా తీస్తే అది ఖచ్చితంగా విజయం సాధిస్తుంది. ఆ చిత్ర విజయాన్ని ఎవరూ ఆపలేరు. దీనికి మంచి ఉదాహరణే.. ఇటీవల వచ్చిన 'టూరిస్ట్ ఫ్యామిలీ'. ఆ చిత్ర దర్శకుడు అభిషన్ జీవింత్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇపుడు ఈ సినిమా పేరు వినగానే నాకు మళ్ళీ తమిళం నేర్చుకోవాలని అనిపించింది. 'కయిలన్' అర్థం కూడా దర్శకుడు వివరించాడు. సినిమా ప్రివ్యూ చూశాను. చాలా బాగుంది. చిత్ర సక్సెస్ సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అని పేర్కొన్నారు. నిర్మాత బీటీ అరసకుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కథ ఏంటో నాకు తెలియదు. దర్శకుడిపై ఉన్న నమ్మకంతోనే సినిమా తీశాను. మీడియాతో పాటు ప్రేక్షకులు ఆదరించాలి' అని పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.

# విజయకాంత్ తర్వాత స్థానం విమల్‌దే

● ఆర్వీఉదయకుమార్
● దర్శకుడుగా 25 యేళ్ళు పూర్తిచేసుకున్న ఎళిల్

ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

చాలా విషయాల్లో దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ తర్వాత స్థానం హీరో విమల్‌దేనని ప్రముఖ సినీ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ.ఉదయకుమార్ అభిప్రాయపడ్డారు. ఇన్ఫినిటీ క్రియేషన్స్ పతాకంపై పి.రవిచంద్రన్ నిర్మాణంలో, ఎళిల్ దర్శకత్వంలో విమల్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'దేశింగురాజా-2'. ఈ చిత్రం ద్వారా జనా అనే యువకుడు రెండో హీరోగా పరిచయమవుతున్నాడు. హీరోయిన్లుగా పూజిత పొన్నాడ, జూలీ, షర్మిత నటించారు. ఇతర పాత్రల్లో సింగంపులి, రవిమరియా, శామ్స్, రోబో శంకర్, స్వామినాథన్, మొట్టై రాజేంద్రన్, మదురై ముత్తు, విజయ్ టీవీ పుగళ్, కోదండం సహా భారీ తారాగణం నటించారు. 'మెలోడి కింగ్' విద్యాసాగర్ సంగీత స్వరాలు సమకూర్చారు. 'పూవెల్లాం ఉన్ వాసమ్' అనే చిత్రం తర్వాత అంటే దాదాపు 23 ఏళ్ల తరువాత ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. ఈ నెల 11న చిత్రం విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకని చిత్రం ఆడియోను సోమవారం రాత్రి నగరంలో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సినీ ప్రముఖులు ఆర్వీ.ఉదయకుమార్, ఆర్కే సెల్వమణి, పేరరసు తదితరులు పాల్గొని, ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'చాలా విషయాల్లో దివంగత విజయకాంత్ స్థానాన్ని విమల్ భర్తీ చేశారు. అందుకే కెప్టెన్ తర్వాతి స్థానం విమల్‌దే' అని పేర్కొన్నారు. ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి మాట్లాడుతూ, 'ఇళయరాజా తర్వాత సంగీతాన్ని అమితంగా ప్రేమించే వ్యక్తి విద్యాసాగర్' అన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, 'నన్ను 'కుత్తుపాటు' దర్శకుడిగా మార్చిన సంగీత దర్శకుడు విద్యాసాగర్' అని పేర్కొన్నారు. నటుడు శామ్స్ మాట్లాడుతూ, 'విమల్ కథ, పాత్ర ఎంపికలో అచితూచి అడుగులు వేస్తూ, హీరో కార్తి మార్గంలో నడుస్తున్నాడు' అని కొనియాడారు. నటుడు రవిమరియా మాట్లాడుతూ, 'దేశింగురాజా' తొలిభాగంగా కామెడీ గలాటా అయితే, ఈ మూవీ రెండోభాగం అంతకుమించి ఉంటుంది' అన్నారు. చిత్ర దర్శకుడు ఎళిల్ మాట్లాడుతూ, 'ఒక సినిమా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ సహకరించడం పెద్ద విషయం కాదు... కానీ, ఇలాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనడమే ఈ చిత్రం సక్సెస్. ఇందులో హాస్యం బాగానే వర్కవుట్ అయింది. నా మూడో చిత్రానికి విద్యాసాగర్ సంగీతం సమకూర్చారు. చాలాకాలం తర్వాత మళ్ళీ ఆయనతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. హీరో విమల్ మాట్లాడుతూ, 'ఇది దర్శకుడు ఎళిల్ 25వ చిత్రం. ఆయన గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవాలి. ఆయన తెరకెక్కించే కామెడీ చిత్రాల్లో అవకాశం ఇవ్వాలి' అన్నారు.

దక్షిణ్ విజయ్

## నటుడు దక్షిణ్‌కు వరుస ఛాన్సులు

ప్రముఖ నటుడు దక్షిణ్ విజయ్‌కు ఇటు తమిళం, అటు మలయాళం చిత్రపరిశ్రమల్లో వరుస అవకాశాలు వస్తున్నాయి. తమిళంలో బిజీ నటుడిగా కొనసాగుతూనే మరోవైపు మలయాళ చిత్రాల్లో వరుసగా నటిస్తున్నారు. తాజాగా ఆయన నటించే మరో మలయాళ చిత్రం ప్రారంభమైంది. ఈ చిత్రం పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. తమిళంలో ఆయన హీరోగా 'కబలిహారం' చిత్రంలో నటించారు. ఇందులో దక్షిణ్ విజయ్ వాస్తవిక నటనను ప్రతి ఒక్కరూ శెభాష్ అంటే ప్రశంసించారు. ఈ మూవీలోని పాత్రకు ఆయన సరిగ్గా సరిపోయారంటూ వ్యాఖ్యానించారు. 'ఐ యామ్ వెయిటింగ్' అనే చిత్రంలో నటించగా, ఇది త్వరలోనే విడుదలకానుంది. ఈ నేపథ్యంలో మరో మలయాళ చిత్రంలో నటించే అవకాశం రావడంపై దక్షిన్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కేపీవై బాలా 'గాంధీ కన్నాడి' ఫస్ట్‌లుక్ రిలీజ్

విజయ్ టీవీ ద్వారా గుర్తింపు పొందిన కేపీవై బాలా తొలిసారి హీరోగా నటిస్తున్న 'గాంధీ కన్నాడి' చిత్రం ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. బుల్లితెరపై నటుడుగా, రేడియో జాకీగా, యాంకర్‌గా, వెండితెరపై హాస్య నటుడుగా తన ప్రతిభ నిరూపించుకున్న కేపీవై బాలా... ఇపుడు కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఆదిమూలం క్రియేషన్స్ పతాకంపై నిర్మితమయ్యే ఈ చిత్రాన్ని జయకిరణ్ నిర్మించనున్నారు. 'రణం' మూవీ డైరెక్టర్ షెరీఫ్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేయగా, ఇందులో దర్శకుడు బాలాజీ శక్తివేల్, అర్చన కీలక పాత్రలు పోషిస్తున్నారు. చెన్నై, దాని పరిసరాల్లో చిత్రీకరణ చేపట్టారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరలోనే చిత్రాన్ని విడుదల చేయనున్నారు.


'గాంధీ కన్నాడి'లో కేపీవై బాలా

సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

## పోలీసు గ్రీవెన్స్‌లో 40 వినతులు

పెరంబూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయంలో బుధవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని, అధికారులు, పోలీసుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో, శాంతి భద్రతలు, నేరాలు, ట్రాఫిక్, సాయుధ దళం, ప్రత్యేక విభాగం తదితరాలకు చెందిన ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు, ఆరుగురు ఇన్స్‌పెక్టర్లు, 32 మంది పోలీసులు మొత్తం 40 మంది పాల్గొని, వేతనం పెంపు, బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు సహా పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సమస్యలు పరిశీలించాలని సంబంధిత విభాగాల అధికారులకు నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారని నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## వైద్యులు... ప్రత్యక్ష దైవాలు

● ఎస్‌కేపీడీ వైద్యుల దినోత్సవంలో వక్తలు

కార్యక్రమంలో ఎస్‌కేపీడీ నిర్వాహకులు, వైద్యులు

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవాలని అందువల్లే సమాజంలో వారికి ప్రత్యేక గుర్తింపు ఉందని వక్తలు కొనిడారు. షావుకారుపేటలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) ఆరోగ్యం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ట్రస్టీ ఊటుకూరు శరత్‌కుమార్ అధ్యక్షతన మాజీ ట్రస్టీ, ప్రముఖ వైద్యుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వైద్యులు పాల్గొని కేక్ కట్‌చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిదిన్ చంద్రరాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

## 'రోటరీ' ఆధ్వర్యంలో వైద్యులకు సత్కారం

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-3233 ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో ఉత్తమ సేవలందిస్తున్న వైద్యులకు సాధకుల అవార్డుల అందజేసి ఘనంగా సత్కరించారు. ఎగ్మూర్‌లోని అంబాసిడర్ పల్లవహాలులో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-3233, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ సర్వీసు హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో చెన్నైతో పాటు పలు రాష్ట్రాల నుండి 200 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డి.దేవేంద్రన్, డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, ముఖ్యఅతిథి డాక్టర్ మైల్‌వాహన్ నటరాజన్, గౌరవ అతిథి ఎమ్మెల్యే డాక్టర్ ఎలిల్ నాగనాథన్‌ను సభకు పరిచయం చేశారు. డాక్టర్ బిదిన్ చంద్రరాయ్ జన్మదినమైన జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినోత్సవంగా ప్రకటించిన మేరకు రోటరీ క్లబ్ తరుపున ఆ మహనీయుని సేవలను కొనియాడుతూ జరుపుకుంటున్న వేడుకలకు వాసవీ ఇంటర్నేషనల్ కోశాధికారి సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వృత్తి ధర్మాన్ని కర్తవ్యంగా భావించిన డాక్టర్ రేలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సెంటర్ సీఎండీ ప్రొఫెసర్ మహ్మద్ రేలా, వైద్యులు రవికన్నన్, టీఎస్ సెల్వవినాయగం, ఆర్.శ్రీరామ్, మోహన్‌రాజన్, ఆర్ ప్రేమ్‌శేఖర్, వసుపతి వేదాంతం, కార్తిక్ బాలాజీ తదితరులకు పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విక్టర్ మార్టిన్, కార్యదర్శి రామదాసు, సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



డాక్టర్ మహ్మద్ రేలాకు సాధక పురస్కారం ప్రదానం చేస్తున్న డి.దేవేంద్రన్, డాక్టర్ ఎస్.రమేష్‌బాబు

# చిదంబరంలో కోలాహలంగా రథోత్సవం

రథోత్సవంలో భక్తజనం

● పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరం శైవక్షేత్రంలో నటరాజస్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. చిదంబరంలో ఆనంద తాండవమాడిన నటరాజస్వామి ఆలయంలో గత నెల 23న ధ్వజారోహణంతో ఆణితిరుమంజనం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు పంచమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్నారు. ఈ వేడుకల్లో తొమ్మిదవ రోజైన మంగళవారం ఆణితిరుమంజన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మిగతా ఆలయాల్లో మూలవిరాట్ గర్భగుడిలో కదలకుండా భక్తులకు దర్శనమిస్తుండగా, ఒక్క చిదంబరం ఆలయంలో మాత్రమే మూల విరాట్ అయిన నటరాజ స్వామి రథంలో విహరించి భక్తులను కటాక్షిస్తున్నారు. రథోత్సవం సందర్భంగా ఉదయం 5.30 గంటల నుండి విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, శివకామ సుందరి, చండీకేశ్వరుడు, నటరాజస్వామి వార్లను అలంకరించిన ఐదు వేర్వేరు రథాల్లో ఆశీనులను చేశారు. శివాచార్యులు మహా దీపారాధన అనంతరం రథం కదిలింది. ఆలయ మాఢవీధుల్లో ఇరువైపులా వేచివున్న భక్తులు రథంపై పూలు చల్లి, టెంకాయలు కొట్టి, హారతులిచ్చి స్వామివారికి స్వాగతం పలికారు. రథోత్సవం అనంతరం శివకామ సుందరి సమేత నటరాజస్వామి, ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలోని వెయ్యికాళ్ల మండపానికి తరలించి పూజలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం ఆణితిరుమంజన దర్శనోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో మంచి నీరు, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతను పటిష్టం చేశారు.

## 7న తిరుచెందూర్ ఆలయ మహాకుంభాభిషేకం

యాగశాల పూజలు ప్రారంభం

ప్యారీస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సముద్రతీరంలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఈ నెల 7న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో యాగపూజలను శివాచార్యుల బృందం ప్రారంభించింది. దేశంలోని పవిత్ర నదీ జలాల 700 కలశాలతో 76 హోమగుండాలతో పూజారులు విఘ్నేశ్వరపూజతో ప్రారంభించారు. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు ప్రధాన క్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూర్ ఆలయంలో గత నెల కుంభాభిషేకం పూజలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకాలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో బంగారు ధ్వజస్తంభంవద్ద ఏర్పాటు చేసిన యాగశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతి నాథర్ సమేత వళ్ళీదేవసేన, కుమరవిడంగర్ పెరుమాళ్, ఆత్మనాథ పంచలింగం, నటరాజ తదితరులకు సుగంధద్రవ్యాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు కంకణధారణ అనంతరం తొలిజాము యాగశాల పూజలు ప్రారంభమయ్యాయి. షణ్ముఖ నాథుడికి 49 హోమగుండాలు, జయంతినాథుడికి 5 హోమగుండాలు, నటరాజపెరుమాళ్‌కు 5 హోమగుండాలు, పరివార మూర్తులకు 76 హోమగుండాలు, పెరుమాళ్లుకు ప్రత్యేకంగా 5 హోమగుండాలు మొత్తం 76 హోమగుండాల వద్ద 150 మంది వేదపండితులు పూజలు చేపట్టారు. మరోవైపు యాగశాలలో 96 రకాల మూలికలతో తయారుచేసిన ద్రవంతో షణ్ముఖనాథుడికి తైలాభిషేకం నిర్వహించారు. ఇదిలా వుండగా, వచ్చే 7వ తేదీ తెల్లవారుజామున 12వ జాము యాగశాల పూజల అనంతరం రాజగోపుర కుంభకలశాలు, సన్నిధులపై పవిత్ర జలాలు ప్రోక్షించి మహాకుంభాభిషేకం నిర్వహిస్తారు.

కుంభాభిషేకానికి సిద్ధం చేసిన 76 మహా కలశాలు

తిరువాన్మియూరులో జరిగిన చెన్నై కార్పొరేషన్ జోనల్ కమిటి అధ్యక్షుడు ఎస్వీ రవిచంద్రన్ కుమారుడు వైకుంఠ వివాహ వేడుకలో పాల్గొని, దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి .

ప్రపంచ వైద్యుల దినం సందర్భంగా వళ్లువర్‌కోట్టమ్‌లో జరిగిన సభలో ప్రముఖ నేత్ర వైద్యనిపుణుడు డాక్టర్ మోహన్‌రాజన్‌ను సత్కరిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం

చెన్నై ఒట్టేరి కున్నూరు రహదారిలో ప్రైవేటు గోశాలను పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, కమిషనర్ జే.కుమారగురుబరన్ తదితరులు

## హిందూస్థాన్ వర్సిటీలో స్ఫూర్తిదాయక ప్రసంగాలు

టెడ్‌ఎక్స్ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూస్థాన్ విశ్వవిద్యాలయం టెడ్ ఎక్స్ పేరుతో నిర్వహించిన సదస్సు ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రంగాలకు చెందిన 9 మంది ప్రముఖుల ప్రసంగ కార్యక్రమాలు సుమారు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులను ఆకట్టుకున్నాయి. 'నాసా'కు చెందిన ఏరోస్పేస్ ఇంజనీర్ డాక్టర్ రవి మార్గసహాయం, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.చొక్కలింగం, సంగీత కళాకారుడు రమేష్ వినాయకం, నైన్ ఓటు డిటాక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ అస్మితా బి మోటూరి, హిందూస్థాన్ ఇంటర్‌నేషనల్ స్కూలు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లెఫ్టినెంట్ జనరల్ బాబా మాథ్యూ, లీడర్‌షిప్ ఇంటర్‌నేషన్ డైరెక్టర్ ఇసబెల్లీ హస్లీడర్ తదితరులు ప్రసంగించారు.

## ప్లాట్ల బుకింగ్‌లో జీ స్క్వేర్ సరికొత్త మైలురాయి

అడయార్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో అగ్రగామిగా ఉన్న సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన జి స్క్వేర్ జెన్ ప్రీమియం రెసిడెన్షియల్ ప్లాట్, విల్లాల విక్రయాల బుకింగ్‌లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. రూ.200 కోట్ల విలువైన ప్లాట్‌లు కేవలం 72 గంటల్లోనే అమ్ముడుపోయాయి. తిరుచ్చి జిల్లా శ్రీరంగంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్లాట్ల విక్రయం సరికొత్త మైలురాయిని చేరుకుంది. శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న జి స్క్వేర్ సంస్థ వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు స్థానికులు అమితాసక్తి చూపడంతో కొన్ని గంటల్లోనే అమ్ముడుపోయాయని, ఈ మైలురాయి తమ కంపెనీపై కస్టమర్లకు ఉన్న విశ్వసనీయత, నమ్మకాన్ని రుజువు చేస్తోందని ఆ సంస్థ ఎండీ బాల రామజయం వెల్లడించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖ గాయని నిత్యశ్రీ తదితరులతో కలిసి సంగీత విభావిరి కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది.

గాయని నిత్యశ్రీని అభినందిస్తున్న నిర్వాహకులు

## 'సీమ'కు నీటికోసం సీఎం కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర

రాయలసీమకు నీరందించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్న ఆయన తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరు ఇచ్చేలా సీఎం ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికి స్వామి ఆశీస్సులు కావాలని వేడుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రముఖ వయోలిన్ వాయిద్య కళాకారిణి కుమారి కన్యాకుమారి, ప్రముఖ నృత్యకళాకారిణి ఆనంద శంకర్ జయంత్, తెలంగాణ ఎమ్మెల్యే బసవరాజు సారయ్య, ఆస్ట్రాలజర్ వేణుస్వామి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కుమారి కన్యాకుమారి - ఆనంద శంకర్ జయంత్

## సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,730**

**తలనీలాలు సమర్పించినవారు: 28,940**

# రామాపురం @ కందగడ్డ ఊరు

● 50 ఏళ్లకుపైగా ప్రధాన సాగు ఇదే

**కందగడ్డ పండిస్తారే ఆ ఊరు పేరేమిటి? ఎప్పుడైనా ఆ గ్రామం పేరు గుర్తురాకపోతే ఇలా అడిగితే చాలు.. ఠక్కున రామాపురం అని చెబుతారు. రామచంద్రాపురం మండలంలోని ఈ గ్రామం కందగడ్డ సాగుకు పెట్టింది పేరు. 50 ఏళ్లుగా కందసాగులో అధిక దిగుబడి సాధించి రైతులు లాభాలబాట పట్టారు.**

**- రామచంద్రాపురం, ఆంధ్రజ్యోతి**

రామచంద్రాపురం మండలం రామాపురం.. తిరుపతికి అతి సమీపంలో ఉందీ గ్రామం. ఇక్కడ జల వనరులు తక్కువగా ఉండటంతో ఎన్నో ఏళ్ల కిందటే తిరుపతి మార్కెట్‌లో వ్యాపారం చేసేవారు. ఈ గ్రామంలో 70 ఏళ్ల క్రితమే సుబ్బారెడ్డి, సైదారెడ్డి అనే వారు తమిళనాడు నుంచి కందగడ్డ విత్తనం తెచ్చి సాగు చేశారు. దీంతో పాటు పలు వాణిజ్యవ్యాపారుల వైపు రైతులు దృష్టి మరలిచారు. కందతోటను ఏప్రిల్, మే నెల మధ్య నాటాలి. ఎకరా సాగుకు 72 కిలోలవి 25 నుంచి 30 బస్తాలు కావాలి. విత్తనం బస్తా ధర రూ.1,700 నుంచి రూ.2వేలు వరకు ఉంటుంది. దున్నకం, ఎరువులు, మందులు, కూలీలు అన్ని కలిపి ఎకరా సాగుకు లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంట ఐదు నెలల నుంచి ఆరునెలల్లోపు తీయాలి. ఒకవేళ అనుకోని అవాంతరాలు ఎదురైనా రెండు నుంచి మూడు నెలలు భూమిలో ఉన్నా చెడిపోయే పరిస్థితి లేదు. తక్కువ నీటితో సాగయ్యే కంద మొండిపంట. పెద్దగా చీడపీడలు అంటవు. ఎకరా తోట 250 నుంచి 300 బస్తాలు దిగుబడి ఇస్తుంది. ఎకరా కందతోటలో అన్నిపోను రూ.3లక్షలు మిగులుతుందని రైతులు చెప్పారు. రామాపురంలో ఎన్నో ఏళ్లుగా 50 మంది రైతులు ఏటా కందసాగులో మంచి లాభాలు గడిస్తున్నారు. నీటి ఆధారం లేని గ్రామం కావడంతో పేదరికం ఎక్కువగా ఉండేది. ఎపుడైతే వాణిజ్యపంట సాగుతో మంచి లాభాలు గడించి లక్షాధికారులు అయ్యారు. మండలంలోనే రామాపురం ధనిక గ్రామంగా మారింది.

### కంద.. మొండిపంట

అన్ని పంటల్లాగా కంద నీర్పుడు దశకు వచ్చినా అప్పటికపుడు తీయాల్సిన పరిస్థితి లేదు. భూమిలో కొంతకాల్వ నిల్వ ఉన్నా చెడిపోయే పరిస్థితి ఉండదు. పెద్దగా చీడపీడలు ఆశించవు. రైతుకు మంచి లాభాలిచ్చే కంద.. మొండి పంట.

**- రంజిత్**

రామాపురంలో సాగు అవుతున్న కంద తోటలు

### 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం

మాకున్న రెండు ఎకరాల్లో.. కుటుంబం 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం. ఎకరా కందసాగుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. నల్లరేగడి భూమి అయితే మంచిదిగుబడి ఇస్తుంది. సంక్రాంతి సీజన్‌లో 70 కిలోల బస్తా ధర రూ.2వేల నుంచి రూ.3వేలు పలుకుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.3లక్షలు మిగులుతాయి. మాగ్రామమంతా కందసాగే చేస్తున్నాం.

**- కె.మునిరామిరెడ్డి**

## నకిలీలను నమ్మి మోసపోవద్దు

● భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం, బస, ఆర్జిత సేవల కోసం నకిలీ వ్యక్తులను నమ్మి మోసపోవద్దని టీటీడీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా భక్తులను కోరింది. పెద్దింటి ప్రభాకరాచార్యులు పేరుతో వైష్ణవ యాత్రాస్ అనే ఫేస్‌బుక్ పేజీని నడుపుతున్న ఓ వ్యక్తి శ్రీవారి అభిషేకం, ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కల్పిస్తామంటూ మోసం చేస్తున్న అంశం టీటీడీ దృష్టికి రావడంతో ఈ హెచ్చరిక చేసింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. టికెట్ల పేరుతో భక్తులను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## టీటీడీ చైర్మన్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

తిరుమల, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రీవారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఫొటో సహా ఎక్స్ ఖాతాలో చంద్రబాబు పోస్ట్ చేశారు.

చంద్రబాబు ఎక్స్‌లో పెట్టిన పోస్టు

## డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు వాయిదా పడ్డాయి. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు జూలై 7 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల వాయిదాను విద్యార్థులు గమనించాలని అధికారులు కోరారు. కొత్త షెడ్యూల్‌ను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

## మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

బాలాయపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను భర్త హత్య చేసిన ఘటన బాలాయపల్లి మండలం అంబలపూడి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు.. బాటా వెంకటేశ్వర్లు తన భార్య సిద్దమ్మతో కలసి అంబలపూడిలోని సురేష్‌కు చెందిన మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. ఇటీవల సిద్దమ్మ వెళ్లిపోవడంతో నచ్చజెప్పి కాపురానికి తీసుకొచ్చాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో సిద్దమ్మను వెంకటేశ్వర్లు హతమార్చాడు. తన భార్యను హత్య చేశానని స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి, ఎస్ఐ గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సిద్దమ్మ మృతదేహం

అవార్డు అందుకుంటున్న ఇసుజు ప్రతినిధులు

## 'ఇసుజు' పరిశ్రమకు ఎక్స్‌లెన్స్ అవార్డు

సత్యవేడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని కార్ల తయారీ పరిశ్రమ ఇసుజుకు ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆవరణలో 'సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత'పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడు సంస్థల్లో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్.దినకర్ సమక్షంలో గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా పరిశ్రమ ప్రతినిధులు అవార్డును అందుకున్నారు. ఇసుజు మోటర్స్‌తో పాటు అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, టీటీఈ ఎలక్ట్రానిక్స్, ఎంఎస్‌ఆర్ ప్రాజెక్ట్స్, పీవీఎస్ కెమికల్స్, లక్కీఫోర్‌యూ ఎగ్జిమ్స్ అండ్ మినరల్స్ తదితర సంస్థలు ఈ అవార్డులు అందుకున్నాయి.

## ముగ్గురు నిందితుల అరెస్టు

● 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో నేరాలు, ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను శ్రీకాళహస్తి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వండలూరు కండ్రిగకు చెందిన ముత్తం మణిమారన్, తిరుపతి జిల్లా వెంకటగిరి కోళ్లఫారానికి చెందిన మారి మాణిక్యం, శ్రీకాళహస్తి ఏనుగుల గుంటకు చెందిన కొట్టంబేడి రాజా ముఠాగా ఏర్పడ్డారు. కొంత కాలంగా తమిళనాడుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల తొట్టంబేడు, రేణిగుంట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి సమీపంలోని నంది రెస్టారెంటు వద్ద అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వీరు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్టు చేసి.. 140 గ్రాములు బంగారు నగలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

## భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలిసి నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులతో వర్చువల్‌గా సమీక్షించారు. శ్రీకాళహస్తి-నడికుడితో పాటు పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులను పూర్తిచేయాలని, భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాగరమాల కింద చేపట్టిన ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులను నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని ఆర్డీవోలకు సూచించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఏడీబీ రోడ్డు పనులనూ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్‌రెడ్డి, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో వర్చువల్‌గా సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

### ఎన్టీఆర్ వైద్యసేవలో డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఎన్టీఆర్ వైద్యసేవలో రక్తపరీక్షలు, చికిత్సలు, ఆర్థోపెడిక్ విషయంలో రోగులను తప్పుదోవ పట్టించి అనధికారికంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి కొన్ని ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తున్నాయని.. అలాంటివి పునరావృతం కాకుండా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శివకుమార్, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'జనసురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి జనసురక్ష బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో జనసురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే బీమా పథకాల గురించి తెలపడమే దీని ఉద్దేశ్యమన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.2లక్షల వరకు లబ్ధిదారులకు జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అటల్ పెన్షన్ యోజననూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షలో

## తిరుపతి విద్యార్థినికి ఫస్ట్ ర్యాంకు

● ఏపీలో విజయవాడ కేంద్రంగా తొలిసారిగా కోర్సు ప్రారంభం

త్రిపుర గవర్నరు ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ నుంచి ప్రవేశపత్రాన్ని అందుకుంటున్న శిరీష

తిరుపతి రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల (రఘునాథరిసార్ట్)కు చెందిన కంబాల వాణి, రాము దంపతుల కుమార్తె శిరీష ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నిర్వహించిన ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు రాగా.. ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభ చాటి మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. కాగా, రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా నడిచే ఇండ్లాస్ ఆస్పత్రిలో ఈ ఏడాది తొలిసారిగా ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ కోర్సు ప్రారంభించారు. ఈ కోర్సులో ప్రవేశానికి 12మంది విద్యార్థులు అర్హత సాధించగా..వీరిలో తిరుపతికి చెందిన శిరీష ఫస్ట్‌ర్యాంకుని సాధించారని పేర్కొన్నారు. మంగళవారం త్రిపుర గవర్నరు డాక్టర్ ఎన్.ఇంద్రసేనరెడ్డి, రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతులమీదుగా అడ్మిషన్ లెటర్‌ని ఆమె అందుకున్నారు. జైపూర్‌లోని మణిపాల్ వర్సిటీలో ఈమె ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సు చేశారు.

### తిరుపతి- అకోలా మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుపతి- అకోలా మధ్య నడుస్తున్న వారాంతరం ప్రత్యేక రైళ్లను జూలై 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేది వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం తిరుపతి నుంచి అకోలాకు ప్రత్యేక రైలు(07605) బయలు దేరుతుందన్నారు. అకోలాలో ఈ ప్రత్యేక రైలు(07606) ప్రతి ఆదివారం బయలుదేరి రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న కారణంగా ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంచుతున్నామని పేర్కొన్నారు.

### తిరుమలలో మరో కియాస్క్ ప్రారంభం

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల సౌకర్యార్థం మరో కియాస్క్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వితరణగా అందించిన ఈ మిషన్‌ను ఆ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్(బీ అండ్ వో) దినేష్ గులాటి ప్రారంభించారు. ఈ కియాస్క్ ద్వారా లడ్డూ కొనుగోళ్లతో పాటు విరాళాలు అందజేయవచ్చు.

కియాస్క్‌ను ప్రారంభిస్తున్న దినేష్ గులాటి

### ఇంజనీరింగ్‌లో 23,715 ఇన్‌టేక్‌కి అనుమతి

తిరుపతిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 2025-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ బ్రాంచీలలో ఇన్‌టేక్ అనుమతి వివరాలను పాత జిల్లాల వారీగా వెల్లడించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 1080 (ఇన్‌టేక్), 21 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో 22,635 చొప్పున 24 కళాశాలల్లో మొత్తం 23,715 ఇన్‌టేక్ కేటాయించినట్లు తెలిసింది.

పాడుపడిన భవనంలో గంజాయి తీసుకుంటున్న యువకులు

### గంజాయి తీసుకుంటూ డ్రోన్‌కు చిక్కిన యువకులు

తిరుచానూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పెద్ద చెరువులో పాడుపడిన భవనంలో కొందరు గంజాయి తీసుకుంటున్నట్లు గుర్తించిన పోలీసులు నిఘా పెట్టారు. పోలీస్ ఈగల్ టీం, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం డ్రోన్‌తో డ్రైవ్ నిర్వహించగా, ఆ భవనంలో నలుగురు యువకులు గంజాయి తీసుకుంటుండటం బయట పడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. వీరిలో బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది.

### గోవిందుడి పుష్పయాగానికి

## శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం జరిగే పుష్పయాగం కోసం మంగళవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం తిరువీధుల్లో సేనాధిపతి విష్వక్సేనుడి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో అర్చకులు మన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఇక, బుధవారం ఉదయం 9.30-11.30గంటల మధ్య శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు. సాయంత్రం 6-7గంటల మధ్య ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించే ఊంజల్ సేవను రద్దు చేశారు.

పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

సేనాపతి ఊరేగింపు

**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755

# ల్యాబ్ ఆన్ వీల్స్

మొబైల్ ల్యాబ్

బస్సులోపల ల్యాబ్

## ● పద్మావతి వర్సిటీ ఆధ్వర్యంలో ఫ్లో బస్ ప్రారంభం

విద్యార్థుల వద్దకు వెళ్లి సైన్సు పట్ల ఆసక్తి పెంచేలా ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో బస్)ను తీర్చిదిద్దారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో 'టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ (టీబీఐ)' ఆధ్వర్యంలో ఈ మొబైల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. రొబొటిక్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఆగ్మెంటెడ్, వర్చువల్ రియాలటీ (ఏఆర్-వీఆర్), త్రీడీ ప్రింటింగ్, హోల్ గ్రామ్‌లు, డ్రోన్లు, వాతావరణ పర్యవేక్షణ స్టేషన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ టూల్స్, మొబైల్ ప్లానిటోరియం, మేకర్స్ స్పేస్, స్టూడెంట్ ఇన్నోవేషన్ షోకేస్ వంటివి ఉన్నాయి. సౌరశక్తితో నడవడం ఈ మొబైల్ ల్యాబ్ ప్రత్యేకత. ఈ ల్యాబ్ బస్సును మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేశారు. సైన్స్‌కు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన కలిగించే లక్ష్యంతో ఈ బస్సు ఏర్పాటు చేసినట్టు వీసీ ఉమ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 40 వేలమందికి పైగా విద్యార్థుల చెంతకు వెళ్లి సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ బస్సు తోడ్పడిందన్నారు. రాష్ట్రంలోనూ విద్యార్థుల వద్దకెళ్లే క్రమంలో పద్మావతి వర్సిటీ నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించామన్నారు. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులందరికీ ఈ ఫ్లో బస్‌లో ల్యాబ్‌ను చూసే అవకాశం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్.రజని, ల్యాబ్ సీఈవో మధులాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

# సుపరిపాలనలో తొలి అడుగు

**నేటి నుంచి ఇంటింటికీ తెలుగుదేశం**

**అన్ని నియోజకవర్గాల్లో ముగిసిన కసరత్తు**

**జనం బాట పట్టనున్న అధికార పార్టీ నేతలు**

తిరుపతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట బుధవారం నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనికోసం అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విదేశీ పర్యటనలో ఉన్నందున.. ఆ నియోజకవర్గం మినహా మిగిలిన అన్నిచోట్లా అధికార పార్టీ నేతలు జనం బాట పట్టి.. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించనున్నారు. సమస్యలనూ తెలుసుకునే ప్రయత్నం చేయనున్నారు. పాడైన రోడ్లు బాగుపడడం, కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం, పెరిగిన సంక్షేమ పింఛన్ల మొత్తం, తల్లికి వందనం, ఉచిత వంటగ్యాస్ వంటి పథకాల అమలు నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ధైర్యంగా జనంలోకి వెళ్ళగలిగే వాతావరణం నెలకొని ఉండటంతో ఆ పార్టీలో ఉత్సాహపూరిత వాతావరణం కనిపిస్తోంది.

'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలను తిరుపతిలో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, టీడీపీ నేతలు

**తిరుపతి: సుందరయ్యనగర్‌లో మొదలు**

తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు పెద్ద కసరత్తే నడిచింది. పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా మంగళవారం తిరుపతి చేరుకుని పార్టీ నేతలతో సమావేశమయ్యారు. బుధవారం ఉదయం 8 గంటలకు 34వ డివిజన్ పరిధిలోని సుందరయ్యనగర్ నుంచీ జనంలోకి వెళ్ళనున్నారు. అనంతరం క్లస్టర్ల వారీగా ఆయా ప్రాంత నేతలు కార్యక్రమాన్ని చేపట్టేలా నిర్ణయించారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలతో పాటు ముఖ్య నేతలు హాజరు కానున్నారు.

**చంద్రగిరి: మంగళం షిర్డీసాయి మందిరం నుంచి..**

చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని షిర్డీ సాయి మందిరం నుంచీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే పులివర్తి నానీ పాల్గొననున్నారు. బుధవారం మొత్తం తిరుమల నగర్ పంచాయతీలోనే పర్యటించనున్నారు. వాస్తవానికి నెల రోజుల పాటే కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ నిర్ణయించగా.. పులివర్తి నానీ మాత్రం నియోజకవర్గం మొత్తం పర్యటించేందుకు మూడు నెలల పాటు కొనసాగించాలని నిర్ణయించారు.

**నగరి: పన్నూరులో ప్రారంభం**

నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం పన్నూరు గ్రామంలో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదివరకూ విజయపురం మండలంలోని కమ్మకండ్రిగ నుంచీ ఈ తరహా కార్యక్రమాలను ప్రారంభించడం ఆనవాయితీగా పాటించేవారు. ఈ సారి సెంటిమెంట్‌కు భిన్నంగా పన్నూరును ఎంచుకున్నారు.

**శ్రీకాళహస్తి: వీరభద్రస్వామి సన్నిధి నుంచీ..**

శ్రీకాళహస్తి నియోజకవర్గానికొస్తే తొట్టంబేడు మండలం చిన్న సింగమాల పంచాయతీ వీరభద్రస్వామి సన్నిధి నుంచీ కార్యక్రమాన్ని శుభారంభం చేయనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అంకయ్య చౌదరి, ముఖ్యనేతలు పాల్గొంటున్నారు.

**గూడూరు: తిక్కవరంలో ఆరంభం**

గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం తిక్కవరంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రోజూ రాత్రి 7 గంటల వరకూ పర్యటనలు కొనసాగించాలని, ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

**సత్యవేడు: రాజగోపాలపురం నుంచీ**

సత్యవేడు మండలం రాజగోపాలపురంలో సాయంత్రం 4 గంటలకు ఇంటింటికీ టీడీపీ ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన నేపథ్యంలో ఆయన ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతి బాబు, పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగనుంది. మండల పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

**వెంకటగిరి: ఒక రోజు ఆలస్యంగా..**

విదేశీ పర్యటనలో ఉన్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం రాత్రికి చేరుకుంటారని సమాచారం.ఈ కారణంగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమయ్యే అవకాశముంది.

**సూళ్ళూరుపేట: సెంటిమెంటుకు పెద్ద పీట**

సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి ఓజిలి మండలం కురుగొండ్లలో ఉదయం 8 గంటలకు ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈశాన్యం సెంటిమెంటుతో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఇక్కడ్నుంచే ప్రచారం ప్రారంభిస్తారు. అదే సెంటిమెంటుతో ఇప్పుడూ మొదలు పెడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులను అక్కడికి ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆహ్వానిస్తున్నారు.

## కిటకిటలాడిన జపాలి

తిరుమలలోని జపాలి అంజనేయుడి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. కొద్దిరోజులుగా సందర్శనీయ ప్రదేశాల్లో ఒకటైన పాపవినాశన మార్గంలోని జపాలికి భక్తుల తాకిడి పెరిగింది.ఇందులో భాగంగానే మంగళవారం ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు క్యూకట్టారు.సిబ్బంది క్యూలైన్ ద్వారా విడతలవారీగా భక్తులను అనుమతించి దర్శనం కల్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతి రూరల్ ఓటేరులో పింఛను అందజేస్తున్న కలెక్టర్

## 95.89 శాతం మందికి పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. 691 సచివాలయాల పరిధిలో ఉద్యోగులు ఉదయం 6.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారు. తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీలో కలెక్టర్ వెంకటేశ్వర్ పింఛన్లు అందజేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. జిల్లాలో 2,59,732మంది లబ్ధిదారులకుగాను రాత్రి 7గంటలకు 2,49,054మందికి పింఛన్లు అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు. రాష్ట్రంలో పింఛన్లు పంపిణీలో 95.89 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ అభినందించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

# మైనారిటీ నేతను అక్కున చేర్చుకుని..

● కుటుంబానికి అండగా ఉంటామంటూ మంత్రి లోకేశ్ హామీ

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో బెదిరింపులకు, కక్ష సాధింపు చర్యలక బెదరక.. ఎదురొడ్డి నిలబడిన మైనారిటీ నేత అల్లాబక్షు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ హామీ హామీ ఇచ్చారు. ఓజిలి మండలం ఆరిమేనిపాడుకు చెందిన టీడీపీ మైనార్టీసెల్ నాయకుడు అల్లాబక్షు.. 2021లో టీడీపీ నుంచి సర్పంచ్, ఎంపీటీసీకు పలువురిని బరిలో ఉంచారు. దీనిని సహించలేని వైసీపీ నాయకులు బెదిరించారు. అయినా, బెదరక పోటీలో నిలవడంతో ఆయన 3.50 ఎకరాల్లోని జామాయిల్ తోటలను నరికేశారు. ఆ భూములను నిషేధిత జాబితా 22ఏలో చేర్చారు. అల్లాబక్షు కొత్తగా కట్టుకున్న ఇంటి గోడను కూలగొట్టారు. అయినా అల్లాబక్షు లొంగక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి నుంచి మరింతగా టీడీపీ కోసం కష్టపడి పనిచేశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్.. కుటుంబం సహా తనను కలవాలని కబురు పంపారు. ఆ ప్రకారం మంగళవారం ఉండవల్లిలోని లోకేశ్ ఇంటికి అల్లాబక్షు దంపతులు, పిల్లలు వెళ్లారు. వీరి కుటుంబ వివరాలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న లోకేశ్.. పార్టీకి అండగా నిలిచి పోరాడిన అల్లాబక్షును అభినందించారు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరడంతో పరిశీలిస్తామని హామీఇచ్చారు. కుటుంబానికి అండగా ఉండటంతో పాటు పిల్లల చదువుకు తాను అండగా నిలుస్తానని లోకేష్ భరోసానిచ్చారు.

**ఆ ఏనుగు దంతాలు**

# భాకరాపేటలో చోరీకి గురైనవే

● రెండు గన్నులపై దర్యాప్తు కొనసాగుతోందన్న అటవీశాఖ అధికారి వివేక్

మంగళం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాదులో డ్రైవర్ ప్రసాద్ వద్ద దొరికిన ఏనుగు దంతాలు భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో చోరీకి గురైనవేనని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ తెలిపారు. తిరుపతిలో మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. 'భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో భద్రపరచిన ఏనుగు దంతాలు 2023లో చోరీకి గురయ్యాయి. ఆ సమయంలో ఏనుగు దంతాల పొడవు, వాటి చుట్టుకొలతలను రికార్డులో నమోదు చేసున్నారు. హైదరాబాదులో ప్రసాద్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాల పొడవు, చుట్టుకొలతతో ఇవి సరిపోయాయి. దీనిని మరింత శాస్త్రీయంగా నిర్ధారించడానికి డెహ్రాడూన్‌లోని ల్యాబ్‌కు ఏనుగు దంతాల యనామిల్‌ను పంపించాం. ఏనుగు దంతాలతో పాటు చోరీకి గురైన రెండు గన్నులు ఏమయ్యాయి? ఎక్కడున్నాయి? ఈ చోరీకి పాల్పడింది ఎవరనేది తెలియాల్సి ఉంది. దీనిపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ.. సంబంధిత పోలీసు అధికారులను కలిసి వివరాలను సేకరిస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి సమాచారం వెలుగులోకి వస్తుంది. డెహ్రాడూన్‌లోని ల్యాబ్ నుంచి రిపోర్టు రావడానికి నెల రోజులు పట్టే అవకాశం ఉంది' అని ఆయన వివరించారు. కాగా, ఏనుగు దంతాలను సొమ్ము చేసుకునే ప్రయత్నంలో హైదరాబాద్‌లో నిందితుడు పట్టుబడటంతో భాకరాపేట అటవీశాఖ కార్యాలయంలో రెండు ఏనుగు దంతాలతో పాటు రెండు గన్నులు కూడా అప్పట్లో చోరీకి గురైన అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టింది. హైదరాబాద్ పోలీసుల వద్దనున్న నిందితుడైన డ్రైవర్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉంది.

## మహిళా సంరక్షణ కార్యదర్శులకు
# రీకౌన్సెలింగ్ నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలని ఆ సంఘం నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల సంఘం నాయకురాలు నజమా మాట్లాడుతూ.. చిత్తూరు ఎస్పీ కార్యాలయంలో చేపట్టిన బదిలీల ప్రక్రియ, నిబంధనలను అనుసరించి జరగలేదని ఆరోపించారు. ఈ బదిలీల ప్రక్రియ సీనియారిటీ జాబితా ప్రామాణికంతో ఖాళీల వివరాలను తెలుపుతూ నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న మహిళా కార్యదర్శులను జీవో నెంబరు 6ను పరిగణనలోకి తీసుకుని వార్డు నుంచి వార్డుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. స్పౌజ్, మెడికల్ కేటగిరి కింద నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని విమర్శించారు. వీటిని పునఃపరిశీలించి రీకౌన్సెలింగ్ చేయాలన్నారు. ఈ నిరసనలో సంఘం నాయకులు ఊర్వశి, జ్ఞానాంబిక, విజయలక్ష్మి, మహిళ సంరక్షణ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయం నాయకుడు కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు

## నేడు, రేపు చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం/శాంతిపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో బుధ, గురువారాల్లో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. తొలిరోజున టీడీపీ కార్యక్రమమైన 'సుపరిపాలనలో తొలి అడుగు'ను తిమ్మరాజుపల్లెలో ప్రారంభిస్తారు. ముందుగానే నిర్ణయించిన 26 ఇళ్లకు వెళ్లి, వారిని పలకరించి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తారు. కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటారు. రాత్రికి స్వగృహంలో బస చేస్తారు. మళ్లీ గురువారం ఉదయం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. స్వగృహంలో నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తారు. అదయ్యాక టీడీపీ క్యాడర్‌తో సమావేశమై రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తారు. సాయంత్రం చంద్రబాబు తిరుగు ప్రయాణమవుతారు.

# ప్రవేశాలకు 'ఆధారం' లేదు

● ఆధార్ లేని విద్యార్థులు 500కి పైగానే ● జిల్లా వ్యాప్తంగా 7 పాఠశాలల్లో కేంద్రాలు

తిరుపతి(విద్య), జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1, 2 తరగతులకు సంబంధించి 500 మందికి పైగా విద్యార్థులకు ఇప్పటికీ ఆధార్ కార్డులు లేనట్టు విద్యాశాఖాధికారులు గుర్తించారు. 1, 2 తరగతుల్లో ప్రవేశాలకు వస్తున్న వారిలో అత్యధిక శాతం మందికి ఆధార్ లేకపోవడంతో ప్రవేశాల లెక్కలు నమోదు కావడంలేదు. ఆయా విద్యార్థులను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా చేర్చలేక పోతున్నారు. ముఖ్యంగా యుడైస్ నమోదు కావడంలేదు. దీంతో ఇప్పటి వరకు 1, 2 తరగతుల్లో ఎంత మంది చేరారనే లెక్కలు తేలడం లేదు. ఈ క్రమంలో ఏడు పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటుకు డీఈవో కేవీఎన్ కుమార్ చర్యలు తీసుకున్నారు. తిరుచానూరు జడ్పీ హైస్కూల్, తిరుపతి అర్బన్ ఎస్పీజేఎన్ఎం మున్సిపల్ హైస్కూల్, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ హైస్కూల్, పుత్తూరు బాలికల జడ్పీ హైస్కూల్‌లో, గూడూరులోని జడ్పీ బాలికల, బాలుర పాఠశాలలు, నాయుడుపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచే ఈ ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయని డీఈవో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేయించి ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలని సూచించారు. డీవైఈవోలు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలో ఆధార్ లేని విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి నమోదు చేయించాలన్నారు. ఆ వెంటనే యుడైస్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని సూచించారు.

**Required Staff**
• Store Keeper
• Site Supervisor
• Site engineer
For Hotel Construction at Tirupati
Call :080-22445889
hr@shravanthigroup.com

## ఏనుగు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సిద్దయ్య కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, తదితరులు

భాకరాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ దాసరిగూడెనికి చెందిన సిద్దయ్య కొద్ది రోజుల క్రితం ఏనుగు దాడిలో మృతి చెందాడు. దీంతో అప్పుడు ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. తిరుపతి డీఎఫ్‌వో కార్యాలయంలో మంగళవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ఆ చెక్కును సిద్దయ్య కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి మృతి చెందిన కొద్ది రోజులకే ఆర్థిక సాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు నాని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రగిరి జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర, టీడీపీ మండల అధ్యక్షులు బెల్లంకొండ మురళి, జనసేన అధ్యక్షులు జశ్వంత్ రాయల్, రూపేశ్, సాయి కిరణ్, కిశోర్, దొరబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

ఆసుపత్రిలో పింఛను అందజేస్తున్న రహంతుల్లా

భాకరాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు పంచాయతీకి చెందిన విత్తమ్మారెడ్డి అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సర్వేయర్ రహంతుల్లా అక్కడకు వెళ్లి ఆయనకు పింఛను అందజేశారు. తిమ్మారెడ్డి కుటుంబసభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## శాస్త్రోక్తంగా కాళీ హోమం

ప్రత్యేక అలంకారంలో వారాహి దేవి

రామచంద్రాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశక్తి పీఠం యాగశాలలో మంగళవారం కాళీ హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన దేవత మరకతశక్తి అమ్మవారితో పాటు శ్వేత భూవారాహిదేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. కర్ణాటక పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వారాహి దేవి గురించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. పీఠం కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విజయయాత్ర ముగించుకుని కంచికి బయలుదేరిన పీఠాధిపతి

కంచిపీఠాధిపతికి వీడ్కోలు పలుకుతున్న భక్తులు

రామచంద్రాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆరోస్టపురం మండలంలో విజయయాత్ర ముగించుకుని కంచిపీఠం శంకర విజయేంద్ర సరస్వతి మంగళవారం శిష్యబృందంతో కలిసి కంచికి బయలుదేరారు. వారం రోజుల పాటు మండలంలో కంచి పీఠం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. మిట్టకండ్రిగ ప్రాణయోగ ఆశ్రమం కామాయండిలో వారం రోజుల పాటు శంకరాచార్యులు కాలం నాటి రజిత శివలింగానికి భక్తుల సమక్షంలో నిత్యం తిరుమంజనం, యజ్ఞ, యాగాది క్రతువులు నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పీఠాధిపతి ప్రసంగాలు నిర్వహించారు. రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వరాలయాన్ని సందర్శించి విజయేంద్ర సరస్వతి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. చివర రోజైన మంగళవారం పీఠాధిపతి విజయేంద్రసరస్వతికి మంగళవాయిద్యాల నడుమ వందలాది మంది భక్తులు వీడ్కోలు పలికారు. ప్రాణయోగ ఆశ్రమ పీఠాధిపతి కైలాష్ గురూజీ పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న అభయం

హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూలై 1: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చిత ఇన్‌స్పెక్టర్ ధనశేకర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిగురువాడ పంచాయతీ ఖర్చుల వివరాలు నోటీసుబోర్డులో పొందుపరుస్తాం

తిరుపతి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో ఆదాయ, ఖర్చుల వివరాలను ఇక నుంచి ప్రతినెలా నోటీసుబోర్డులో పొందుపరచేలా చర్యలు చేపడతామని కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి తెలిపారు. పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. వైఎస్సార్ కాలనీ, దిగువ పల్లె, ఎగువపల్లెలకు సీసీరోడ్లు, కొత్తూరులో బోరుబావికి మోటారు ఏర్పాటు, చెత్తసంపదకేంద్రానికి పెన్సింగ్, గేటు, లైట్ ఏర్పాటు తదితర సమస్యలను గ్రామస్థులు సభ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థులు ముచ్చేలి కిరణ్‌కుమార్‌రెడ్డి, మురళి, వార్డుల శ్రీనివాసులు, వార్డుల శివాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా తుమ్మలగుంట గ్రామంలో సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పలు సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించారు. కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు బిరుదాల భాస్కర్‌రెడ్డి, పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలను కలిసిన డీపీటీవో

ఎమ్మెల్యే ఆరణితో జగదీష్

తిరుపతి(ఆర్టీసీ),జూలై1(ఆంధ్రజ్యోతి): డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్ మంగళవారం తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, నగర కమిషనర్ మౌర్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐస్టాండ్‌లలో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించాలని, మాట్ బస్సులపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. సీటీబస్‌ల పారిశుద్ధ్యంపై సహాయ సహకారాలు అందించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

## తోతాపురి.. 2,178 టన్నుల కొనుగోళ్లు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుజ్జు పరిశ్రమలు మంగళవారం 2,178 టన్నుల తోతాపురి రకం మామిడి కాయలను కొన్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. దీంతో ఇప్పటి వరకు పరిశ్రమలు 37,814 మెట్రిక్ టన్నుల కాయలను కొన్నాయన్నారు. ఇక, టాసా ఫుడ్స్(నారాయణవనం), (శ్రీవరాహజ్యూస్ ఫుడ్స్(కేవీబీపురం)లో 24గంటలు, లియాన్ ఫుడ్స్ (పుత్తూరు) 15గంటలు, నవ క్యాలిటీ ఫుడ్స్ (ఎర్రావారిపాళెం) 14 గంటలు, శ్రీవర్ష ఫుడ్స్ (రేణిగుంట) 12గంటలు, రాసా ఫుడ్స్ (బీఎన్‌కండ్రిగ) 8 గంటలు, క్యాపికాన్(సత్యవేడు) 3గంటలు, సుప్రీం క్యాలిటీ ఫుడ్స్ (పాకాల) గంట పాటు అన్‌లోడింగ్‌కు వాహనాలు వేచి ఉండే పరిస్థితి ఉందన్నారు.

## 'స్పర్స్' ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు

మంగళం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డ్వామా విభాగం ద్వారా 2024-25 జిల్లా పరిధిలో నిర్మించిన నీటి తొట్టెలు, గోకులాలు, సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్లకు కేంద్ర ప్రభుత్వం స్పర్స్ విధానం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు మంజూరుచేసే ప్రక్రియ ప్రారంభమైందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ విధానం ద్వారా గత ఆర్థిక సంవత్సరానికి రూ.40కోట్లకుపైగా నేరుగా లబ్ధిదారుల, వెండర్ల ఖాతాలకు జమచేసినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.100 కోట్లు రావాల్సి ఉండగా, అందులో రూ.40కోట్లు మంగళవారం విడుదల చేసినట్లు చెప్పారు.

## హెచ్ఎం, టీచర్లకు షోకాజ్

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో కుమార్

తిరుపతి(విద్య), జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ ముత్యాలరెడ్డి పల్లిలోని మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులకు డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ పాఠశాలను తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పలు అంశాలకు సంబంధించి హెచ్ఎం, ఉపాధ్యాయులు విధుల సక్రమంగా నిర్వర్తించలేదని గుర్తించినట్టు డీఈవో తెలిపారు. ఇతర పాఠశాలల్లో పోలిస్తే ఈ ఏడాది ఒకటో తరగతిలో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని, సంఖ్యను పెంచలేకపోయారని పేర్కొన్నారు. ఒకటో తరగతి విద్యార్థుల వివరాలను యుడైస్‌లో నమోదు చేయలేదని చెప్పారు. తరగతుల వారీగా బోధనకు సంబంధించిన ఉపాధ్యాయులు హెచ్ఎం విధులు కేటాయించలేదని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యతలూ అప్పగించలేదన్నారు.

## మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం

● ఎమ్మెల్యే పులివర్తి నాని



కొబ్బరి కాయలు కొడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం చంద్రగిరి మండలంలోని ఎం.కొంగరవారిపల్లి పంచాయతీ నడింపల్లి బీసీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగింది. నడింపల్లి బీసీ కాలనీలో అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నడింపల్లి బీసీ కాలనీలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, టీడీపీ నాయకులు గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, డొమ్మలపాటి సతీష్, పోతల ప్రవీణ్, సాగర్, కొండూరు ప్రవీణ్, రాజుల గారి వినోద్, గాలి సతీష్, అనిల్‌చౌదరి, పురుషోత్తంనాయుడు, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

### కొబ్బరి మొక్కులు చెల్లించుకున్న టీడీపీ కార్యకర్తలు

నడింపల్లి బీసీ కాలనీలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వినాయకస్వామికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బీసీ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మరం రమేష్ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రగిరిలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలుపొందాలని మొక్కుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని బీసీ కాలనీకి రావడంతో వినాయకస్వామికి పూజలు చేసి, ఆయన చేతుల మీదుగా కొబ్బరి కాయలను కొట్టించి, 116 కొబ్బరి కాయలను నాయకులు, కార్యకర్తలు కొట్టారు. టీడీపీ నాయకులు బాలకృష్ణమూర్తి, డొమ్మలపాటి సతీష్, పోతల ప్రవీణ్, సాగర్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఏఆర్ రెడ్డి, కార్పొరేటర్ నరసింహాచారి తదితరులు

తిరుపతి(విద్య), జూలై 1(ఆంధ్రజ్యోతి): శ్వేత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం స్థానిక బేరివీధి మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ ప్రైమరీ పాఠశాల, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు శ్వేత మల్టీ స్పెషాలిటీ వైద్యశాల అధినేత డాక్టర్ ఏఆర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ నరసింహాచారి, ప్రముఖ వైద్యులు పిరిడ్డప్ప చేతుల మీదుగా నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం భానుమతి, హైస్కూల్ హెచ్ఎం కృష్ణకుమార్, ఉపాధ్యాయులు హరికృష్ణబాబు, కవిత, యూటీఎఫ్ నాయకులు బండి మధుసూదనరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేష్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్(ఎఫ్ఏసీ)గా మంగళవారం ఎన్ సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## మూడు సీసీ రోడ్లు నేడు ప్రారంభం

సీసీరోడ్డు ప్రారంభానికి ముస్తాబు చేస్తున్న శిలాఫలకం

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గం మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో జీవకోన నిర్మించిన మూడు సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించనున్నారు. ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమానికి నాంది పలికే ముందుగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

## ప్రకృతిసాగులో పీఎండీఎస్ కీలకం

పీఎండీఎస్ విధానంతో తయారు చేసిన కిట్లతో వ్యవసాయ అధికారులు, రైతులు

తిరుపతిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని సాగుచేసే రైతులు తప్పనిసరిగా పీఎండీఎస్ విధానంలో ప్రారంభించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం తెలిపారు. తిరుపతి రూరల్ మండలం వేమూరులో రైతు అయ్యప్పనాయుడు బీఆర్ఎస్ కేంద్రంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, సిబ్బందితో కలిసి పీఎండీఎస్ కిట్ల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా 30రకాల విత్తనాలతో 200 కిట్లని రూపొందించారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ పీఎండీఎస్ విధానంవల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు శాస్త్రీయంగా.. సాంకేతికంగా వివరించాలని వ్యవసాయ కార్యకర్తలకు సూచించారు. ఆదిశనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, భూలక్ష్మి ఎఫ్‌పీసీ సీఈవో డాక్టర్ గంగాధరం, సిబ్బంది మధు, గీతారాణి, శ్రీదేవి, హరికృష్ణ, ఎస్ ఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాల, ఆస్పత్రిని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్

విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

భాకరాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పాఠశాలలు, కళాశాల, ఆస్పత్రిని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ మంగళవారం తనిఖీ చేశారు. చిన్నగొట్టిగల్లులో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలను పరిశీలించి, విద్యాబోధన ఎలా చేస్తున్నారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో భవిష్యత్తులో ఇంజనీరు, డాక్టరు ఎంత మంది అవుతారని అడిగా కొంత మంది డాక్టర్లు అవుతామని తెలియజేశారు. కళాశాల క్యాంపస్‌లో ఉన్న జూనియర్ కళాశాలను పరిశీలించి అక్కడ అధ్యాపకుల హాజరు పట్టిక పరిశీలించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రిలోని సౌకర్యాలు రోజుకు ఓపీ 200 మంది వస్తుంటారని తెలిపారు. రక్త పరీక్షల ల్యాబ్, టాయిలెట్స్, మందుల గది, ఎక్సరే, కాన్పుల గదిని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేష్ నాయుడు, ఎంపీడీవో గిడ్డయ్య, తహసీల్దారు భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, కార్యదర్శులు వెంకటేశులు, గిరిబాబు, అలీ, తదితరులు పాల్గొన్నారు.

## గీతం పాఠశాలలో ఘనంగా జగన్నాథ రథయాత్ర

తిరుపతి (విద్య), జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి భవానీనగర్‌లోని గీతం పాఠశాలలో పూరీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. పాఠశాల విద్యార్థులచే నెలకొల్పిన దేవతామూర్తులు, రథంతో ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఇస్కాన్ ప్రభు ధనగోపాల్ ఆధ్వర్యంలో ఇస్కాన్ ప్రతినిధులు వాసదేవ కృష్ణదాసు, తురానందదాస, రేవతిపతి, జగన్నాథరూప పూరీ జగన్నాథ రథయాత్ర పుట్టుపూర్వోత్తరాలను విద్యార్థులకు వివరించి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ కిన్నెర శ్రీదేవి మాట్లాడుతూ.. పిల్లల్లో చిన్నతనం నుంచే భక్తిభావాన్ని కల్పించాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ల పనితీరుపై సమీక్ష

అకడమిక్ కన్సల్టెంట్ల పనితీరును పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో 2024-25 అకడమిక్ కన్సల్టెంట్లు, అకడమిక్ కో-ఆర్డినేటర్ల పనితీరుపై సమీక్ష చేపట్టారు. విభాగాల వారీగా ఐదు రోజుల పాటు సాగే ఈ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్, హెచ్, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ వంటి ఐదుగురి బృందం పనితీరు సమీక్ష నిర్వహిస్తోంది. ఆంత్రోపాలజీ, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, జాగ్రఫీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, హోంసైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన కన్సల్టెంట్లు 43 మంది పనితీరును సమీక్షించారు.

## బీసీలంటే వైసీపీకి చులకన భావం

మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 1(ఆంధ్రజ్యోతి): బీసీలు అంటే వైసీపీకి చులకన భావం అని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో టీడీపీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బీసీ నాయకులను మానసికంగా బాధిస్తున్నారని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అర్హత లేని నాయకులను ముసలికొండలో ఉంచి పదవులు కల్పించారని, మహిళా మేయర్‌ను అవమానించిన ఘటనను ప్రజలు మరచిపోలేదన్నారు. బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది టీడీపీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ యాదవ్, ఆముదాల తులసీదాస్, వడ్డెర శ్రీరాములు, గోవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయ నమూనా హోటల్‌లో మాంసాహార విక్రయం బాధాకరం

సమావేశంలో మాట్లాడుతున్న సనాతన ధర్మపరిరక్షణ సంఘాల నాయకులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి హైవే మీద రాయుడు మిలిటరీ హోటల్ అంటూ తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయ నమూనాతో హోటల్‌ను నిర్మించి, మాంసాహార విక్రయించడం బాధాకరమని సనాతన ధర్మ పరిరక్షణ సంఘాల నాయకులు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కలియుగ శ్రీవెంకటేశ్వరస్వామి గుడి నమూనాను తీసుకుని దాని ద్వారా ముందు జయ విజయులను కూడా ప్రతిష్ఠించి లోపల మాంసాహారాన్ని విక్రయిస్తున్నారన్నారు. హిందూ ధర్మాన్ని అవహేళన చేస్తున్న హోటల్ నిర్వాహకులపై టీటీడీ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు బీసీవర్ల కిరణ్‌కుమార్, హిందూ చైతన్యవేదిక నాయకులు కుమారస్వామి, భజరంగదళ్ నాయకులు కిరీటి, సాయి, బాలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

● ఏపీ స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు హేమాద్రి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న హేమాద్రి యాదవ్ తదితరులు

తిరుపతిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏపీ స్టూడెంట్స్ జేఏసీ ఎప్పుడూ ముందుంటుందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో పలు కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్వాగతం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం జిల్లా నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. హేమాద్రి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆశయాల సాధనకు ప్రణాళికలు ఆచరించాలని తెలిపారు. విద్యాలయాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు పూర్తిసహకారం అందిస్తామని చెప్పారు. నాయకులు రాజేష్‌రెడ్డి, సురేష్‌యాదవ్, వెంకటేష్, జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కనే వ్యర్థాలు

రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు పక్కన పడేసిన కోళ్ల, చేపల వ్యర్థాలు - సామిరెడ్డి ఒడ్డు చెరువుకట్ట రోడ్డు మార్జిన్‌లో వేసిన పేడ దిబ్బలు

పాకాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలతో పరిసరాలు దుర్గంధమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాకాల - దామలచెరువు రోడ్డు అంజనేయస్వామి ఆలయ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న రోడ్డుపై కోళ్ల - చేపల వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాల్లో ప్రజలు ప్రయాణిస్తుంటారు. పరిసర గ్రామాల ప్రజలు నడిచి వెళ్తుంటారు. వ్యర్థాల వెదజల్లే కంపుతో అల్లాడిపోతున్నారు. అలాగే ఐరగాణిపల్లె పంచాయతీ పరిధిలోని పాకాల - తోటపల్లె రోడ్డు సామిరెడ్డి ఒడ్డు కట్టపై రోడ్డు మార్జిన్‌లో పేడదిబ్బలు వేశారు. ఎదురుగా వాహనాలు వస్తే పక్కకి తొలగాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కట్టపై భవన వ్యర్థాలు వేస్తుండడంతో క్రమంగా చెరువు పూడిపోతోంది. పాకాల - కొత్తకోట రోడ్డు మణిరెడ్డిపల్లి రైల్వే గేటు సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న పాకాల పెద్దచెరువు కాలువలో రోడ్డు పక్కన వ్యర్థాలు పడేస్తున్నారు. వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చికెన్ దుకాణాల యజమానులు, చేపలు అమ్మేవారిని కట్టడిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి ఆయన అభిమానులు పాలాభిషేకం చేశారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత కాలం ఘంటసాల స్వరం చిరస్థాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. అనంతరం గాయకులు సోమ ఉమాపతిని సత్కరించారు. కార్యక్రమంలో సుబ్రమణ్యంరెడ్డి, కృష్ణమూర్తి యాదవ్, వినాయకరెడ్డి, తిరుమలయ్య, పద్మనాభం, గురుస్వామి, ఆది, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం

డాక్టర్ మాధవీలతను సన్మానిస్తున్న తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆధార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రుయాస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రజల ప్రాణాలను నిలబెట్టే వైద్యులు దైవ స్వరూపులని, అటువంటి వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రుయాస్పత్రిలో ఉత్తమ సేవలు అందించిన వైద్యులను ఆయన ప్రత్యేకంగా సన్మానించారు. మాజీ ఎంపీ దివంగత ఎన్.శివప్రసాద్ కుమార్తె, ఎస్వీ వైద్య కళాశాల బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మాధవీలత సేవలను గురించి ప్రత్యేకంగా వివరించడంతోపాటు ఆమెను ఘనంగా సన్మానించి, ఉత్తమ సేవా అవార్డును అందించారు. అలాగే పలువురు వైద్య విభాగాధిపతులను సన్మానించి, అవార్డులను అందజేశారు. అనంతరం రుయాస్పత్రిలో 30 ఏళ్ల కిందట నిర్మించిన సిల్వర్ జూబ్లీ ఆడిటోరియాన్ని ఆధునికీకరించాలని సూపరింటెండెంట్ రాధ తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని కోరగా, తప్పక ఆడిటోరియం ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● స్విమ్స్‌లో శ్రీపద్మావతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్వీకుమార్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, అటువంటి వృత్తిలో రాణించే డాక్టర్లు నైతిక విలువలు పాటిస్తూ రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు శివకుమార్, కొవ్వత్, శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేని నిర్మాణాలు చేపడితే చర్యలు

45వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య, కార్పొరేటర్ అనీష్ రాయల్

తిరుపతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని 45వ వార్డులో శివజ్యోతినగర్, ప్రగతినగర్, అయ్యప్ప కాలనీ, అంధుల శరణాలయం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య, అభివృద్ధి పనులను కార్పొరేటర్ అనీష్ రాయల్, వివిధ శాఖల అధికారులతో కమిషనర్ పరిశీలించారు. శివజ్యోతి నగర్ వద్ద వేసిన కొత్త రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేయడం, మద్యం సేవిస్తున్నారని, రోడ్లలో ఎక్కువగా ఉన్న గుంతలను పూడ్చాలని ప్రజలు కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులకు కమిషనర్ ఆదేశించారు. బైపాస్ రోడ్డులోని ఓరియన్ హోటల్ నుంచి మురుగునీటి కాలువలో కలుస్తున్న వ్యర్థాలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డీఈలు రమణ, శిల్ప, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసీపీ మూర్తి తదితరులు ఉన్నారు.

## రమాదేవి ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శ్రీరమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మందికిపైగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, చిన్నపాటి శస్త్ర చికిత్సలను చేయడంతోపాటు అవసరమైన మందులను అందించినట్లు ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్ రెడ్డి తెలిపారు. తన తండ్రి, న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి స్ఫూర్తితో పేదల కోసం ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తాము ప్రజలకు అందించే ఉత్తమ సేవలకుగాను డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్టు నుంచి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డుకు రూ 5 లక్షల ఆర్థిక సాయం

పదవీ విరమణ పొందిన హోంగార్డుకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పనిచేస్తూ మంగళవారం పదవీ విరమణ పొందిన హోంగార్డుకు జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్పీ హర్షవర్ధన రాజు రూ.5 లక్షలు చెక్కును అందచేశారు. అలాగే అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి మరో రూ5 లక్షలు అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విశేష సేవలకు కానుకగా జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులందరూ తమ ఒక రోజు వేతనాన్ని ఆర్థిక సాయంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ఏవో సురేష్, హోంగార్డులు పాల్గొన్నారు.

## తిరుమలలో మరీచి మహర్షి జయంతి

ఆస్థానమండపంలో ప్రసంగిస్తున్న వక్తలు

తిరుమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మరీచి మహర్షి జయంతి కార్యక్రమం మంగళవారం తిరుమలలోని ఆస్థానమండపంలో ఘనంగా జరిగింది. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ పాజెక్ట్, వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల చిత్ర పటాలకు, మరీచి మహర్షి చిత్ర పటానికి మంగళ హారతులు ఇచ్చారు. ఈకార్యక్రమంలో వైఖానస ఆగమ పండితులు గంజాం ప్రభాకరాచార్యులు, వైఖానస ఆగమ సలహాదారు అర్చకం అనంతశయనం దీక్షితులు, ఖాద్రి నరసింహాచార్యులు, పీకే వరదన్ భట్టాచార్యన్, తదితరులు పాల్గొన్నారు.

## 9న సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు

తిరుపతి(ఆటోనగర్), జూలై 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరుగనున్న సార్వత్రిక సమ్మెలో సీపీఐ ప్రత్యక్షంగా పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పులు చేసి కార్పొరేటర్లకు అనుకూలంగా చేసినందుకు ఈ సమ్మె చేస్తున్నామని, ఈ సమ్మెలో సీపీఐ పాల్గొంటుందని ఆయన ప్రకటించారు.

# తిరుపతి

## బర్డ్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌ను సన్మానిస్తున్న ఐఎంఏ నేతలు

తిరుపతి(వైద్యం), జూలై 1 (ఆంధ్ర జ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నేతలు స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌ను ప్రత్యేకంగా సన్మానించడంతోపాటు ఉత్తమ సేవా అవార్డును ప్రదానం చేశారు. నిరుపేదలకు నిస్వార్థ సేవలు అందించడంలో డాక్టర్ జగదీష్ ఎంతో మంది వైద్యులకు ఆదర్శంగా నిలిచారని ఐఎంఏ తిరుపతి బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి కొనియాడారు.

## చంద్రగిరి అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు.

## ఏటీఎం భాస్కర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆర్టీసీ), జూలై 1(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టు స్టేషన్ ఏటీఎంగా భాస్కర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన మంగళం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ ఏటీఎంగా ఉన్న డి.ఆర్.నాయుడు సోమవారం పదవీ విరమణ చేయగా భాస్కర్‌ను ఆ స్థానంలో నియమించారు. ఈ సందర్భంగా కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు నూతన ఏటీఎంను పరిచయం చేసుకొని అభినందనలు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి కలిసికట్టుగా పనిచేయాలని, సమన్వయంతో వ్యవహరించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.

## 48మంది ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ

తిరుపతి(ఆర్టీసీ), జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజారవాణాధికారి, సీబీఎస్, తిరుమల, తిరుపతి, అలిపిరి, మంగళం, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, వాకాడు, సూళ్లూరుపేట డిపోలలో విధులు నిర్వహించే 48 మంది ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం పదవీ విరమణచేశారు. ఇందులో 20మంది డ్రైవర్లు, 15మంది కండక్టర్లు, ఒక ఏటీఎం, ఇతర విభాగాల నుంచి 12మంది ఉద్యోగులున్నారు. ఎక్కువ మంది పదవీ విరమణ పొందడంతో కొరతగా ఉన్న డ్రైవర్లు, కండక్టర్లతో తదిపరి కార్యాచరణ ఏంటో తెలియడం లేదంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

## బీజేపీ నూతన అధ్యక్షుడికి అభినందనలు

మాధవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జల్లి మధుసూదన్

తిరుపతి(విద్య), జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కు తిరుపతికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు జల్లి మధుసూదన్ అభినందనలు తెలియజేశారు. మాధవ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మధుసూదన్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తిరుపతిలో బీజేపీ సంబరాలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పోకల వంశీ నాగేంద్ర మాధవ్ ఎన్నికైన సందర్భంగా తిరుపతిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ స్థానిక గోవిందరాజస్వామి ఆలయ ఉత్తర మాడవీధిలో మాధవ్ ఫ్లెక్సీ ఏర్పాటుచేసి అందరికీ మిఠాయిలు పంచిపెట్టి ఆనందం పంచుకున్నారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుభాష్, రాజశేఖర్‌రెడ్డి, బంకు చంద్రారెడ్డి, సుధాకర్‌తదితరులు పాల్గొన్నారు.

## బీవీ పట్టాభిరాం మృతి పట్ల సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బీవీ పట్టాభిరాం మృతి పట్ల తిరుపతి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంతాపం వ్యక్తం చేసింది. తిరుపతిలో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వేదికగా చేపట్టిన అనేక కార్యక్రమాల్లో బీవీ పట్టాభిరాం పాల్గొన్నారని, తన ప్రసంగాల ద్వారా పట్టాభిరాం కోట్లాది మంది యువతకు ప్రేరణను, ఆత్మవిశ్వాసాన్ని కలిగించారని కొనియాడారు. పట్టాభిరాం మృతికి తిరుపతి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రధానకార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు, మాజీకార్యదర్శి ఆచార్య పెమ్మసాని దేవసేన నాయుడు, కోశాధికారి ఆచార్య కృష్ణమాచార్యులు, ప్రవచనకర్త ఆకెళ్ల విభీషణ శర్మ, మాజీ ఐఆర్ఎస్ అధికారి ఏపీ నాయుడు, జీఎల్ మనోహర్ తదితరులు సంతాపాన్ని వెలిబుచ్చారు. పట్టాభిరాం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియ చేశారు.

## ఆకలి లేని భారతదేశమే మా లక్ష్యం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 1 (ఆంధ్రజ్యోతి): భారతరత్న ఎంఎస్ స్వామినాథన్ భారతదేశంలో ఆకలిలేని రోజులు చూడాలని ఎంతో ముందు చూపుతో కటిక పేదరికంలో ఉన్న ప్రజల ఆకలి తీర్చాలని ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఆయన స్ఫూర్తితో వచ్చే నెల 7వ తేదీ ఆయన జయంతిని పురస్కరించుకుని తిరుపతి నగర పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజగోపాల్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వామినాథన్ జయంతిని పురస్కరించుకుని చిన్నారులకు పలు పోటీలు నిర్వహిస్తామన్నారు.

# శెట్టిపల్లిలో సమస్యల తిష్ఠ

నిల్వ ఉన్న చెత్తకుప్పలు, వర్షపునీరు

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి గ్రామం నగరపాలక సంస్థలో విలీనమైనప్పటి నుంచి పలు సమస్యలుపేరుకుపోయాయి. పూడిన సైడు కాలువలు, వీధుల్లో ఏర్పడిన గుంతలు, పల్లపు ప్రాంతాల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. వీధుల్లో పోగవుతున్న చెత్తను తరలించడం లేదు. ఎటుచూసినా చెత్త దిబ్బలే కనిపిస్తున్నాయి. దోమల నివారణ మందులు పిచికారీ చేయడంలేదు. బ్లీచింగ్ చల్లడం లేదు. దీంతో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఏ సమస్య వచ్చినా కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగితే గాని ప్రయోజనం ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి శెట్టిపల్లి గ్రామానికి, హరిజనవాడకు మధ్యలో వాటర్ ట్యాంక్ వద్ద నీరు నిల్వ ఉంటూ దుర్వాసన వెదజల్లడమేగాక దోమలకు అవాసంగా మారాయి. దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ రోగాలకు కారణమవుతున్నాయి. కొందరు పశువుల యజమానులు గోమయం ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తుండడం వల్ల కూడా పారిశుధ్య సమస్య ఏర్పడుతోంది. తెలుగుగంగ నీరు సరిగా సరఫరా కావడంలేదు. చేతిబోర్లు మరమ్మతులకు గురయ్యాయి. బుధవారం నుంచి గ్రామంలో నడివీధి గంగమ్మజాతర నిర్వహించనున్న దృష్ట్యా నగరపాలక సంస్థ అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# అప్పులున్నా హామీలు నెరవేరుస్తున్నాం

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను ఏడాదిలోనే 85శాతం నెరవేర్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికే దక్కిందని, అప్పులున్నా హామీలు నెరవేర్చుతున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంగళవారం 3వ డివిజన్‌లోని ప్రగతినగర్‌లో ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతిలో 18,664 వేలమంది పెన్షనర్లు ఉండగా వారికి రూ8.23కోట్లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైసీపీ పాలనలో పెన్షన్ రూ.2వేలు నుంచి రూ.3వేలు పెంచేందుకు ఐదేళ్ళు పట్టిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నాయకులు రాజా రెడ్డి, బండ్ల లక్ష్మీపతి, ఆనంద్, వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, బాబ్జి, నంద, శిరీష, పార్థు, మునస్వామి, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు సీపీఐ నాయకులు పెంచలయ్య కూడా పెన్షన్ల పంపిణీలో పాల్గొని స్థానికులతో కలసి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

● 97 శాతం పంపిణీ: తొలిరోజు 97.15 శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. నగర కమిషనర్ మౌర్య సోమవారం పెన్షన్ పంపిణీని పరిశీలించారు. వందశాతం పంపిణీ చేయాలని ఈసందర్భంగా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో 35వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ చేశారు. డివిజన్ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, జగన్నాథం, మహాలక్ష్మి, రవితేజ నాయుడు, మైనం సురేష్, సుజాతమ్మ, చంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘మనది మంచి ప్రభుత్వం’

● గడప గడపకు ఇదే నినాదం తీసుకెళ్లాలి

● టీడీపీ సర్వసభ్య సమావేశంలో నేతల పిలుపు

అలపాటి రాజాను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, జూలై1(ఆంధ్రజ్యోతి): ‘ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం.. జనాలకు ఏమి హామీ ఇచ్చామో అది నెరవేర్చుతున్నాం.. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారు.. మనది మంచి ప్రభుత్వం.. గడపగడపకు ఇదే నినాదం తీసుకెళ్లాలి’ అని నియోజకవర్గ ప్రధాన పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్‌లు పిలుపునిచ్చారు. తొలి అడుగు కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం కపిలతీర్థం సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ సర్వసభ్యసమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆలపాటి రాజా మాట్లాడుతూ ఎన్నికల హామీలను 85శాతం వరకు నెరవేర్చామని, మిగిలినవి కూడా త్వరలోనే అందుతాయని అన్నారు. ప్రతిపక్షంలోనూ జగన్ అరాచకాలు శృతిమించిపోతున్నాయన్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు వారి కార్యకర్తలు చనిపోయినా పరామర్శకు వెళ్లలేదని, ఇప్పుడు బలప్రదర్శనకు దిగుతూ విధ్వంసాలకు దిగుతున్నారని మండిపడ్డారు. సుగుణమ్మ, నరసింహ యాదవ్‌లు మాట్లాడుతూ గడప, గడప కార్యక్రమం ప్రతి డివిజన్‌లో జరగాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయి బ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, పరిశీలకులు జయప్రకాష్, గోపినాథ్ రెడ్డి, రాజా యాదవ్, విజయ్‌కుమార్, సుధాకర్, రమేష్, కూటమి నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాస్, ఇనుగొండ సుబ్రమణ్యం, విజయలక్ష్మి, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, పులుగోరు మురళీ, సూరా సుధాకర్‌రెడ్డి, చినబాబు, మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజాని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో ఇతర నాయకులు శ్రీవారి చిత్రపటం, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## ఘనంగా సీఏ దినోత్సవం

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు మధుసూదనబాబు

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అఖిలభారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ(ఐసీఏఐ) తిరుపతిశాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ కాలనీలోని మంగళవారం సీఏ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన సీఏ జెండాను తిరుపతి శాఖ అధ్యక్షులు బి.వి.మధుసూదనబాబు ఆవిష్కరించారు. అనంతరం సీఏ సభ్యులు, విద్యార్థులతో కలసి 5కె వాక్‌థాన్ నిర్వహించారు. గతంలో వివిధ క్రీడలు నిర్వహించి విజేతలుగా నిలిచినవారికి దాదాపు 30మందికి ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కొందరు మొక్కలునాటగా, మరికొందరు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. చివరగా సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ జి.రఘురామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఐసీఏఐ తిరుపతిశాఖ మాజీ అధ్యక్షులు పాల్గుణకుమార్, ప్రస్తుత ఉపాధ్యక్షులు సింహాద్రి నాయుడు, కార్యదర్శి బాలాజీ కామిశెట్టి, కోశాధికారి నరేంద్ర, సికాస ఛైర్మన్ తిరుమలేశ్వర నాయుడు, మధనమోహనరెడ్డి, సీఏ సభ్యులు, సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమలలోనూ ప్రెస్, పోలీస్ సిక్కర్ల తొలగింపు

ప్రెస్ స్టిక్కర్లను తొలగిస్తున్న పోలీసులు

తిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతితో పాటు తిరుమలలోనూ ప్రెస్, పోలీసు సిక్కర్లతో వస్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎస్పీ ఆదేశాలతో నాలుగురోజులుగా తిరుమలలోనూ పోలీసులు ఈ తనిఖీలు చేస్తున్నారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలతో పాటు తిరుమలలో వ్యాపారాలు, భవన కార్మికులు, హోటళ్లలో పని చేసే వ్యక్తుల వాహనాలపై ప్రెస్, పోలీసు స్టిక్కర్లు ఉంటే ఆపి తనిఖీలు చేపడుతున్నారు. సంబంధిత గుర్తింపు కార్డులుండే వారిని మినహాయించి మిగిలిన వాహనాలపై ఉండే స్టిక్కర్లను తొలగిస్తున్నారు. అలాగే టీటీడీ ఉద్యోగి కాకపోయినా టీటీడీ అని స్టిక్కర్ ఉంటే కూడా తప్పనిసరిగా తొలగిస్తామని పోలీసులు తెలిపారు.

## ఆముదాల మురళికి వానమామలై స్మారక పురస్కారం

ఆముదాల మురళిని సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అవధాని ఆముదాల మురళికి వానమామలై వరదాచార్యులు స్మారక పురస్కారం అందించనున్నారు. ఈ నెల 12వ తేదీన కరీంనగర్ జిల్లా కోరుట్లలో పురస్కార ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు పురస్కార ప్రదాత కంజర్ల రామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ తరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్, ఫారెస్టు రిటైర్డు ఆఫీసర్ చంద్రశేఖరపిళ్ళై సత్కరించారు.

## స్విమ్స్‌లో వన వారోత్సవాలు

మొక్కలు నాటుతున్న ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), జూలై 1(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు చెట్లు ప్రధాన కారణమని, అటువంటి చెట్లను పెంచి సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. వన మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆయన స్విమ్స్‌లో మొక్కలు నాటారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

**CHANGE OF NAME**
I, MUPPALLA GURU YAMINI (Old Name) W/o MUPPALLA VASUDEVA RAJU R/o D.NO:6/163, Balaji Nagar, Near Sangam Theater, Old GNT Road, GUDUR - 524101, TIRUPATI DIST, ANDHRA PRADESH. I Changed my name to MUPPALLA YAMINI. Henceforth, I will be known as MUPPALLA YAMINI.
AJT - 1395

**CHANGE OF NAME**
I,PARACHURU HRUSHEEKESAVULU (Old Name), S/o. KRISHNAMA NAIDU PARACHURU.R/o.D.No.11-28,Gollavanigunta,TN Palem, Tirupati Urban Mandal, TIRUPATI Dist, A.P. HEere by changed my name as PARUCHURI HRUSHIKESAVULU (New Name)
AJT - 400

**PLOTS FOR SALE**
అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సంప్ర: 91145 61456.
AJT - 1394

**CHANGE OF NAME**
I,PARACHURU SULOCHANA (Old Name), W/o. HRUSHEEKESAVULU PARACHURU, R/o. D.No. 11-28,Gollavanigunta,TN Palem, Tirupati Urban Mandal, TIRUPATI Dist, A.P. Here by changed my name as PARUCHURI SULOCHANA( New Name)
AJT - 399

**WANTED**
Wanted teachers for Higher class All Subjects and Computers Teacher,Hostel CooK, for a Reputed School in S.N Puram, Tirupati, Attractive Salary, Cell: 92908 98331,70138 81383.
AJT - 1393

**వెంటనే కావలెను**
లేసర్ మెషిన్ ఆపరేటర్, ఎంబ్రాయిడరీ మెషిన్ ఆపరేటర్, ఇన్వెంటరీ మేనేజర్, డేటా ఎంట్రీ, అర్హత : 10th Pass ప్రత్యేకమైన నైపుణ్యాలు అవసరం లేదు. పూర్తిస్థాయి ఉద్యోగం. మరిన్ని వివరాలకు సంప్ర. Darshan Dresses, Cell : 9505751243 / 9440250863.
AJT - 239882

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237881

క్లాసిఫైడ్స్

**పాఠకులకు ముఖ్యగమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక విషయాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పంపిణీ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

## 'సీమ'కు నీటికోసం సీఎం కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర

రాయలసీమకు నీరందించేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్న ఆయన తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరు ఇచ్చేలా సీఎం ప్రణాళిక రూపొందించుకుని కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికి స్వామి ఆశీస్సులు కావాలని వేడుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రముఖ వయోలిన్ వాయిద్య కళాకారిణి కుమారి కన్యాకుమారి, ప్రముఖ నృత్యకళాకారిణి అనంద శంకర్ జయంత్, తెలంగాణ ఎమ్మెల్యే బసవరాజు సారయ్య, ఆస్ట్రాలజర్ వేణుస్వామి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కుమారి కన్యాకుమారి - ఆనంద శంకర్ జయంత్

## సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు**

**సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,730**

**తలనీలాలు సమర్పించినవారు: 28,940**

# రామాపురం @ కందగడ్డ ఊరు

● 50 ఏళ్లకుపైగా ప్రధాన సాగు ఇదే

**కందగడ్డ పండిస్తారే ఆ ఊరు పేరేమిటి? ఎప్పుడైనా ఆ గ్రామం పేరు గుర్తురాకపోతే ఇలా అడిగితే చాలు.. ఠక్కున రామాపురం అని చెబుతారు. రామచంద్రాపురం మండలంలోని ఈ గ్రామం కందగడ్డ సాగుకు పెట్టింది పేరు. 50 ఏళ్లుగా కందసాగులో అధిక దిగుబడి సాధించి రైతులు లాభాలబాట పట్టారు.**

**- రామచంద్రాపురం, ఆంధ్రజ్యోతి**

రామచంద్రాపురం మండలం రామాపురం.. తిరుపతికి అతి సమీపంలో ఉందీ గ్రామం. ఇక్కడ జల వనరులు తక్కువగా ఉండటంతో ఎన్నో ఏళ్ల కిందటే తిరుపతి మార్కెట్‌లో వ్యాపారం చేసేవారు. ఈ గ్రామంలో 70 ఏళ్ల క్రితమే సుబ్బారెడ్డి, సైదారెడ్డి అనే వారు తమిళనాడు నుంచి కందగడ్డ విత్తనం తెచ్చి సాగు చేశారు. దీంతో పాటు పలు వాణిజ్యవ్యాపారుల వైపు రైతులు దృష్టి మరలిచారు. కందతోటను ఏప్రిల్, మే నెల మధ్య నాటాలి. ఎకరా సాగుకు 72 కిలోలవి 25 నుంచి 30 బస్తాలు కావాలి. విత్తనం బస్తా ధర రూ.1,700 నుంచి రూ.2వేలు వరకు ఉంటుంది. దున్నకం, ఎరువులు, మందులు, కూలీలు అన్ని కలిపి ఎకరా సాగుకు లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంట ఐదు నెలల నుంచి ఆరునెలల్లోపు తీయాలి. ఒకవేళ అనుకోని అవాంతరాలు ఎదురైనా రెండు నుంచి మూడు నెలలు భూమిలో ఉన్నా చెడిపోయే పరిస్థితి లేదు. తక్కువ నీటితో సాగయ్యే కంద మొండిపంట. పెద్దగా చీడపీడలు అంటవు. ఎకరా తోట 250 నుంచి 300 బస్తాలు దిగుబడి ఇస్తుంది. ఎకరా కందతోటలో అన్నిపోను రూ.3లక్షలు మిగులుతుందని రైతులు చెప్పారు. రామాపురంలో ఎన్నో ఏళ్లుగా 50 మంది రైతులు ఏటా కందసాగులో మంచి లాభాలు గడిస్తున్నారు. నీటి ఆధారం లేని గ్రామం కావడంతో పేదరికం ఎక్కువగా ఉండేది. ఎపుడైతే వాణిజ్యపంట సాగుతో మంచి లాభాలు గడించి లక్షాధికారులు అయ్యారు. మండలంలోనే రామాపురం ధనిక గ్రామంగా మారింది.

### కంద.. మొండిపంట

అన్ని పంటల్లాగా కంద నీర్చుడు దశకు వచ్చినా అప్పటికపుడు తీయాల్సిన పరిస్థితి లేదు. భూమిలో కొంతకాల్వ నిల్వ ఉన్నా చెడిపోయే పరిస్థితి ఉండదు. పెద్దగా చీడపీడలు ఆశించవు. రైతుకు మంచి లాభాలిచ్చే కంద.. మొండి పంట.

- రంజిత్

రామాపురంలో సాగు అవుతున్న కంద తోటలు

### 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం

మాకున్న రెండు ఎకరాల్లో.. కుటుంబం 30 ఏళ్లుగా కందసాగు చేస్తున్నాం. ఎకరా కందసాగుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. నల్లరేగడి భూమి అయితే మంచిదిగుబడి ఇస్తుంది. సంక్రాంతి సీజన్‌లో 70 కిలోల బస్తా ధర రూ.2వేల నుంచి రూ.3వేలు పలుకుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.3లక్షలు మిగులుతాయి. మాగ్రామమంతా కందసాగే చేస్తున్నాం.

- కె.మునిరామిరెడ్డి

## నకిలీలను నమ్మి మోసపోవద్దు

● భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం, బస, ఆర్జిత సేవల కోసం నకిలీ వ్యక్తులను నమ్మి మోసపోవద్దని టీటీడీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా భక్తులను కోరింది. పెద్దింటి ప్రభాకరాచార్యులు పేరుతో వైష్ణవ యాత్రాస్ అనే ఫేస్‌బుక్ పేజీని నడుపుతున్న ఓ వ్యక్తి శ్రీవారి అభిషేకం, ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కల్పిస్తామంటూ మోసం చేస్తున్న అంశం టీటీడీ దృష్టికి రావడంతో ఈ హెచ్చరిక చేసింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. టికెట్ల పేరుతో భక్తులను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

### టీటీడీ చైర్మన్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

తిరుమల, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'శ్రీవారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఫొటో సహా ఎక్స్ ఖాతాలో చంద్రబాబు పోస్ట్ చేశారు.

చంద్రబాబు ఎక్స్‌లో పెట్టిన పోస్టు

### డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు వాయిదా పడ్డాయి. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు జూలై 7 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల వాయిదాను విద్యార్థులు గమనించాలని అధికారులు కోరారు. కొత్త షెడ్యూల్‌ను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

## మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

బాలాయపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను భర్త హత్య చేసిన ఘటన బాలాయపల్లి మండలం అంబలపూడి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు.. బాటా వెంకటేశ్వర్లు తన భార్య సిద్దమ్మతో కలసి అంబలపూడిలోని సురేష్‌కు చెందిన మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. ఇటీవల సిద్దమ్మ వెళ్లిపోవడంతో నచ్చజెప్పి కాపురానికి తీసుకొచ్చాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో సిద్దమ్మను వెంకటేశ్వర్లు హతమార్చాడు. తన భార్యను హత్య చేశానని స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి, ఎస్ఐ గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సిద్దమ్మ మృతదేహం

అవార్డు అందుకుంటున్న ఇసుజు ప్రతినిధులు

## 'ఇసుజు' పరిశ్రమకు ఎక్సలెన్స్ అవార్డు

సత్యవేడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని కార్ల తయారీ పరిశ్రమ ఇసుజుకు ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి జీఎస్టీ కార్యాలయ ఆవరణలో 'సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత'పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడు సంస్థల్లో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్.దినకర్ సమక్షంలో గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా పరిశ్రమ ప్రతినిధులు అవార్డును అందుకున్నారు. ఇసుజు మోటర్స్‌తో పాటు అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, టీటీఈ ఎలక్ట్రానిక్స్, ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్, పీవీఎస్ కెమికల్స్, లక్కీఫోర్‌యూ ఎగ్జిమ్స్ అండ్ మినరల్స్ తదితర సంస్థలు ఈ అవార్డులు అందుకున్నాయి.

## ముగ్గురు నిందితుల అరెస్టు

● 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో నేరాలు, ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను శ్రీకాళహస్తి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు 140 గ్రాముల బంగారు నగలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వండలూరు కండ్రిగకు చెందిన ముత్తం మణిమారన్, తిరుపతి జిల్లా వెంకటగిరి కోళ్లఫారానికి చెందిన మారి మాణిక్యం, శ్రీకాళహస్తి ఏనుగుల గుంటకు చెందిన కొట్టంబేడి రాజా ముఠాగా ఏర్పడ్డారు. కొంత కాలంగా తమిళనాడుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల తొట్టంబేడు, రేణిగుంట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి సమీపంలోని నంది రెస్టారెంటు వద్ద అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వీరు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్టు చేసి.. 140 గ్రాములు బంగారు నగలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

## క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షలో తిరుపతి విద్యార్థినికి ఫస్ట్ ర్యాంకు

● ఏపీలో విజయవాడ కేంద్రంగా తొలిసారిగా కోర్సు ప్రారంభం

త్రిపుర గవర్నరు ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ నుంచి ప్రవేశపత్రాన్ని అందుకుంటున్న శిరీష

తిరుపతి రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల (రఘునాథరిసార్ట్)కు చెందిన కంబాల వాణి, రాము దంపతుల కుమార్తె శిరీష ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నిర్వహించిన ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు రాగా.. ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభ చాటి మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. కాగా, రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా నడిచే ఇండ్లాస్ ఆస్పత్రిలో ఈ ఏడాది తొలిసారిగా ఎం.ఫిల్ క్లినికల్ సైకాలజీ కోర్సు ప్రారంభించారు. ఈ కోర్సులో ప్రవేశానికి 12మంది విద్యార్థులు అర్హత సాధించగా..వీరిలో తిరుపతికి చెందిన శిరీష ఫస్ట్‌ర్యాంకుని సాధించారని పేర్కొన్నారు. మంగళవారం త్రిపుర గవర్నరు డాక్టర్ ఎన్.ఇంద్రసేనరెడ్డి, రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతులమీదుగా అడ్మిషన్ లెటర్‌ని ఆమె అందుకున్నారు. జైపూర్‌లోని మణిపాల్ వర్సిటీలో ఈమె ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సు చేశారు.

### భూసేకరణ, నిర్మాణ పనులను

# త్వరితగతిన పూర్తిచేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలిసి నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులతో వర్చువల్‌గా సమీక్షించారు. శ్రీకాళహస్తి-నడికుడితో పాటు పురోగతిలో ఉన్న రేణిగుంట, పూడి, గూడూరు రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులను పూర్తిచేయాలని, భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాగరమాల కింద చేపట్టిన ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులను నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని ఆర్డీవోలకు సూచించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఏడీబీ రోడ్డు పనులనూ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్‌భరత్‌రెడ్డి, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో వర్చువల్‌గా సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

### ఎన్టీఆర్ వైద్య సేవలో డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఎన్టీఆర్ వైద్యసేవలో రక్తపరీక్షలు, చికిత్సలు, ఆర్థోపెడిక్ విషయంలో రోగులను తప్పుదోవ పట్టించి అనధికారికంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి కొన్ని ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తున్నాయని.. అలాంటివి పునరావృతం కాకుండా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శివకుమార్, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'జనసురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి జనసురక్ష బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బుధవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో జనసురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే బీమా పథకాల గురించి తెలపడమే దీని ఉద్దేశ్యమన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.2లక్షల వరకు లబ్ధిదారులకు జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అటల్ పెన్షన్ యోజననూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## గోవిందుడి పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం జరిగే పుష్పయాగం కోసం మంగళవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం తిరువీధుల్లో సేనాధిపతి విష్వక్సేనుడి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో అర్చకులు మన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఇక, బుధవారం ఉదయం 9.30-11.30గంటల మధ్య శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు. సాయంత్రం 6-7గంటల మధ్య ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించే ఊంజల్ సేవను రద్దు చేశారు.

పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

సేనాపతి ఊరేగింపు

### తిరుపతి- అకోలా మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుపతి- అకోలా మధ్య నడుస్తున్న వారాంతరం ప్రత్యేక రైళ్లను జూలై 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేది వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం తిరుపతి నుంచి అకోలాకు ప్రత్యేక రైలు(07605) బయలు దేరుతుందన్నారు. అకోలాలో ఈ ప్రత్యేక రైలు(07606) ప్రతి ఆదివారం బయలుదేరి రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న కారణంగా ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంచుతున్నామని పేర్కొన్నారు.

### తిరుమలలో మరో కియాస్క్ ప్రారంభం

తిరుమల, జూలై1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల సౌకర్యార్థం మరో కియాస్క్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వితరణగా అందించిన ఈ మిషన్‌ను ఆ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్(బీ అండ్ వో) దినేష్ గులాటి ప్రారంభించారు. ఈ కియాస్క్ ద్వారా లడ్డూ కొనుగోళ్లతో పాటు విరాళాలు అందజేయవచ్చు.

కియాస్క్‌ను ప్రారంభిస్తున్న దినేష్ గులాటి

### ఇంజనీరింగ్‌లో 23,715 ఇన్‌టేక్‌కి అనుమతి

తిరుపతిరూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 2025-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ బ్రాంచీలలో ఇన్‌టేక్ అనుమతి వివరాలను పాత జిల్లాల వారీగా వెల్లడించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 1080 (ఇన్‌టేక్), 21 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో 22,635 చొప్పున 24 కళాశాలల్లో మొత్తం 23,715 ఇన్‌టేక్ కేటాయించినట్లు తెలిసింది.

పాడుపడిన భవనంలో గంజాయి తీసుకుంటున్న యువకులు

### గంజాయి తీసుకుంటూ డ్రోన్‌కు చిక్కిన యువకులు

తిరుచానూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పెద్ద చెరువులో పాడుపడిన భవనంలో కొందరు గంజాయి తీసుకుంటున్నట్లు గుర్తించిన పోలీసులు నిఘా పెట్టారు. పోలీస్ ఈగల్ టీం, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం డ్రోన్‌తో డ్రైవ్ నిర్వహించగా, ఆ భవనంలో నలుగురు యువకులు గంజాయి తీసుకుంటుండటం బయట పడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. వీరిలో బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది.

# పుత్తూరు వార్తలు

## మహిళా సాధికారతకు సాంకేతిక సహకారం

● ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, ఆర్థిక ప్రగతికి సాంకేతిక సహకారం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం స్వయం సహాయక సంఘాల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించే ఆర్పీలకు మెప్మా ఆధ్వర్యంలో ట్యాబ్‌లను ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ కార్యాల యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మా ట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం క్షేమంగా ఉంటుందన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారని కొనియాడారు. స్వయం సహాయక సంఘాల్లో ఆర్థిక మోసాలను అరికట్టేందుకే ట్యాబ్‌లు అందిస్తున్నామన్నారు. స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ గణేష్, టీడీపీ పుత్తూరు పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, కార్యదర్శి ధనపాల్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పెన్షన్‌తో భరోసా



పుత్తూరు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు పెన్షన్‌తో భరోసా కల్పించడంతో పాటు సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం చెర్లోపల్లి దళితవాడలో గంగమ్మ ఆలయ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

● సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

సిబ్బందికి సూచనలిస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజీకి లోబడి క్రిమినల్, సివిల్‌తో పాటు అన్ని రకాల కేసులను పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర పేర్కొన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో ఆయన ఈ నెల 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా అవుతాయని కక్షిదారులకు తెలియజేయాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమ్యసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే



కేక్‌ను కట్ చేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి

పుత్తూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డేను పట్టణంలోని సుభాషిణి ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రభుత్వ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి 84వ జన్మదినోత్సవంతో పాటు ఆస్పత్రి 31వ వార్షికోత్సవాన్ని జరుపుకన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌రాజు మాట్లాడుతూ... ప్రభుత్వ డాక్టర్‌గా శ్రీనివాసులురెడ్డి అవిశ్రాంత సేవలందించారన్నారు. 84 ఏళ్ల వయసులో కూడా నేటికీ వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. తన భార్య, విశ్రాంత డాక్టర్ సుభాషిణి సహకారంతో 31 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. తర్వాత డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రాజు, సుభాషిణిని సన్మానించారు. డాక్టర్ రవిరాజు, మాధవులు నాయుడు, కెవిఎన్ మూర్తి, రఫీ, యుగంధర్‌రాజు, వెంకట్రామయ్య, గోపీకృష్ణ, గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్య, కేకేసీ విద్యాసంస్థల యజమాని కుప్పయ్యశెట్టి, నరసింహారావు, స్వర్ణ రమేష్, రైల్వే స్టేషన్‌మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ

రేషన్ పంపిణీలో ధనంజయులునాయుడు, జరీనా తదితరులు

వడమాలపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం పంపిణీలో వడమాలపేట మండలం ముందంజలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉండాలని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు చెప్పారు. వడమాలపేటలోని దాసరి వీధిలో మంగళవారం నూతనంగా చౌక దుకాణాన్ని తహసీల్దార్ జరీనా ప్రారంభించి కార్డుదారులకు బియ్యం అందించారు. గతంలో సుమారు 150మంది కార్డుదారులు సమీపంలోని చౌక దుకాణంలో నిత్యావసర సరుకులు తీసుకొనేవారు. ప్రస్తుతం దాసరివీధిలోనే చౌక దుకాణం ఏర్పాటు చేయడంతో కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ మండల అధ్యక్షులు దాముయాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఢిల్లీప్రసాద్, నాయకులు లక్ష్మీప్రసన్న, శివ, బాస్కర్ రెడ్డి, రాధాకృష్ణ, గురునాదం బాబు, ఖాసీమ్, గురువులయ్య, రాజేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: పాశిం

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని నలజాలమ్మవీధిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికివందనం ద్వారా చదువుకునే పిల్లలందరి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలండర్లను అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తేస్తామని చెప్పారు.

# గూడూరు

### సూళ్లూరుపేట/వెంకటగిరి

## సుబ్రహ్మణ్యేశ్వరసామి ఆలయంలో 17నుంచి ఆడికృత్తిక వేడుకలు

వెంకటగిరి, జూలై1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర సామి దేవస్థానంలో ఈనెల 17నుంచి 21వ తేదీ వరకు ఆడికృత్తిక వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దొంతు శారద ఆవిష్కరించారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరావు, దొంతు బాలకృష్ణ, జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, న్యాయవాది కోటేశ్వరావు, డాక్టర్ ఆవుల రామాంజునేయులు, డాక్టర్ చల్లా సుమన్, డాక్టర్ రామారావు బాల, ఆలయ కమిటీ సభ్యులు కుసుమా రమేస్, గొల్లగుంట రాము, దోర్నాగల బాలయ్య, దొంతు మునివెంకటరత్నం పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి: విజయశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, రఫీ, పళణి తదితరులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ నాయకులు ఏమి చేయకుండా అన్నీ చేసినట్లు చెప్పుకుని ఐదేళ్ల కాలం గడిపి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం చేసిన పనులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు ఏజీ కిషోర్, వాకచర్ల రమేష్, బొమ్మన్ పళణి, శ్రీనివాసులునాయుడు, 786 రఫీ, శ్రీహరి రెడ్డి, పామంజి శ్రీనివాసులు, మురళీకృష్ణారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి పథకాల పరిశీలన



షార్ రోడ్డులో తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్, ఈఈ సుబ్బరాయుడు, డీఈ శ్రీనివాసులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నీటి పథకాలను మంగళవారం ప్రజా ఆరోగ్యశాఖ ఎస్‌ఈ మోహన్ అధికారులతో కలిసి పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని డేగలపాలెం చెరువు వద్దనున్న నీటి పథకం, పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో 2018లో ఏఐఐబీ నిధులతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించి తాగునీరందించే పనులు ప్రారంభించామని, 30 శాతం మేర పనులు జరిగి ఆగిపోయాయన్నారు. ఏఐఐబీ గడువు ముగియడంతో దాని స్థానంలో అర్బన్ యుఐడీఎఫ్ పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రతిపాదనలు సైతం పూర్తయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రాంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎస్‌ఈ చెప్పారు. కార్యక్రమంలో ఈఈ సుబ్బరాయుడు, డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటింటికీ మంచి ప్రభుత్వం

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరగనుంది. బుధవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించనున్నారు. తొలిరోజు బుధవారం ఉదయం ఓజిలి మండలం కురుగుండ్లలో, సాయంత్రం తన్నమాల గ్రామంలో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

## రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి



వెంకటసుబ్బయ్య (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని సోమవారం రాత్రి రైలు ఢీకొనడంతో టీడీపీ నాయకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు... వీరారెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన వెంకట సుబ్బయ్య(48) 27వ వార్డు టీడీపీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడు. ఆవులను పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గాంధీనగర్ సమీపంలోని పశువులను మేతకు తీసుకువెళ్లే క్రమంలో పట్టాల వద్ద దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య మృతిచెందాడు. స్థానికులు గుర్తించి రైల్వే జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్ పోలీసులు చెప్పారు. వెంకటసుబ్బయ్య మృతిపై ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సంతాపం తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య

ఆటోలో విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న సీఆర్పీ బాబు

వాకాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందిస్తున్నట్లు ఎంఈవో నసీం ఆలీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాయదుర్గం ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులను సీఆర్పీ బాబు ఆధ్వర్యంలో చేర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యతో పాటు పుస్తకాలు, బ్యాగులు, షూలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుమ్మరవీధి ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరవీధి ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, చంద్రనీల్, నయాం, రాజశేఖర్, చైతన్య, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రతను పాటించాలి



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు అన్నారు. మంగళవారం స్థానిక బాలసదనంలో తిరుపతికి చెందిన రుయా ఆస్పత్రి వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థునులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు ధరిచేరవన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రదీప్, ప్రత్యూష, గుణశేఖర్, ఝాన్సీరాణి, దీప్తి, మధుబాబు, వార్డెన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్‌కు సత్కారం

ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న కోటేశ్వరరావు

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని శ్రీభారత్ ట్రస్టు చైర్మన్ కె.కోటేశ్వర రావు సత్కరించారు. మంగళవారం హైదరాబాదులో ఇంద్రసేనారెడ్డిని కలిసిన కోటేశ్వరరావు శ్రీభారత్‌ట్రస్టు నిర్వహిస్తున్న విద్యా వికాశ కేంద్రాల గురించి వివరించారు.

## పొలం పిలుస్తోంది

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపాళెం, కోట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏవో సుచేంద్రప్రసాద్ ఎరువులు, పురుగుమందులు, యాజమాన్య పద్ధతులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకాలల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

**పెళ్లకూరు:** కొత్తూరు, పెళ్లకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పైరును పరిశీలించి సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. నాయుడుపేట ఏడీఏ నాగార్జున సాగర్, మండల వ్యవసాయాధికారిణి విజయకుమారి పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న లారీ

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వరదయ్యపాళెం మండలం చెదురుపాకం గ్రామానికి చెందిన మల్లి చల్లయ్య మంగళవారం చేనిగుంటలోని తన బంధువుల ఇంటికి వచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. చేనిగుంట వద్ద జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చల్లయ్యకు కాలువిరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాత కక్షలతో దాడి చేశారని ఫిర్యాదు

బాలాయపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడగుంట గ్రామానికి చెందిన కొమ్మల నాగరాజు పాత కక్షలతో తమపై దాడి చేశాడని అదే గ్రామానికి చెందిన మల్లారపు వెంకటాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం తాను, తన తల్లి రేణుకమ్మ తోట దగ్గరకు వెళ్లి వస్తుండగా నాగరాజు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంకటాద్రి, రేణుకమ్మకు గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం గ్రామానికి చెందిన సునీల్ ఉద్యోగం రాలేదన్న బాధతో ఇటీవల గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి ఆయనను రాయ వేలూరు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు.

## పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింగారావుపేటలో మంగళవారం పేదలకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు మాట్లాడుతూ రవాణాశాఖ అధికారి మురళీమోహన్ తల్లి కొర్రపాటి రాములమ్మ జయంతి సందర్భంగా ఆమె కుమారుల సహకారంతో దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రామ్మోహన్, చిరంజీవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటగిరి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపమాంబపురం, చింతగుంట గ్రామాల్లో మంగళవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారు. రేపు జంగాలపల్లి, పారవోలు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని బంగారుపేట పీహెచ్‌సీ డాక్టర్ శివకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జినీత, హిరత, పద్మావతి, సర్పంచులు మస్తాన్, చెంచు ప్రసన్న కుమార్, పీఎస్ కోటీశ్వరరావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య పరీక్షలు

వెంకటగిరి టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెగుంట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం డాక్టర్ డే సందర్భంగా డాక్టర్ రామాంజనేయులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం

ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్, బండారు ఆంజనేయులు, ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాంబట్టు గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 24 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన మునీంద్ర, సుబ్రహ్మణ్యం మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 24 బాంటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

చిల్లకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు(30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.... ఏడుకొండలుకు నెల్లూరు సమీపంలోని గురివిందపూడి గ్రామానికి చెందిన ఉషాతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెంలో కాపురం ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగా భార్య, పిల్లలను వదిలిపెట్టి నెల రోజుల క్రితం తన స్వగ్రామమైన తిప్పగుంటపాళెం వచ్చిన ఏడుకొండలు తన సొంత ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం మస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంట్లో పరిశీలించగా ఏడుకొండలు ఆత్మహత్య చేసుకున్న విషయం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ కోట తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో పేదలు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పలు కుటుంబాలకు రేషన్, ఆధార్‌కార్డులు లేవన్న సాకుతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, నారాయణ, శేషయ్య, భాస్కర్, కృష్ణ, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం

భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కోట మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పలగాటి భాస్కర్‌రెడ్డిని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధు యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం గజమాలతో సత్కరించారు. కొక్కుపాడులో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంపీటీసీ సురేష్‌బాబు, చాపల శ్రీనివాసులు, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, పల్లం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

గూడూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు ఈనెల 3న మాజీ సీఎం జగన్ వస్తారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం స్థానిక సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రమాదేవి ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని శ్రీరమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మందికి పైగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు, చిన్నపాటి శస్త్ర చికిత్సలను చేయడంతో పాటు అవసరమైన మందులను అందించినట్లు ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి తెలిపారు. తన తండ్రి, న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి స్ఫూర్తితో పేదల కోసం ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తాము ప్రజలకు అందించే ఉత్తమ సేవలకుగాను డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్టు నుంచి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి

## ముక్కంటి సేవలో టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్న అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయుడి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరుశ్రీనివాసులరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో చైన్ దోపిడీ

### చైన్ స్నాచర్‌ను వెంబడించి పట్టుకున్న యువకుడు

నాగమ్మకు చైన్‌ను అందిస్తున్న ఎస్ఐ

సత్యవేడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మహిళ మెడ నుంచి చైన్ లాక్కుని పరారవుతున్న వ్యక్తిని స్థాని కులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని పాపానాయుడు వీధికి చెందిన వృద్ధురాలు నాగమ్మ మంగళవారం ఉదయం బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కుని పరుగులు తీశాడు. గమనించిన యువకుడు జగన్ తన ద్విచక్ర వాహనంలో దుండగుడి వెంట పడ్డాడు. చెన్నై మార్గంలోని చాముండేశ్వరి థియేటర్ సమీపంలో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న చైన్‌ను ఎస్ఐ రామస్వామి వృద్ధురాలు నాగమ్మకు అప్పగించారు. దోపిడీకి పాల్పడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రం చెదులుపాకంనికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

## ఘనంగా పరాశరేశ్వరుడి రథోత్సవం

నారాయణవనం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నారాయణవనంలో కొలువై ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామిని అలంకరించి రథంపై అధిష్టింపజేసి గ్రామంలో మంగళ వాయిద్యాలు, కోలాటాలు నడుమ ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఏఈవో రవి, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో ఆగని బస్సు : తల్లిదండ్రుల ఆగ్రహం

నాగలాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బానాయుడుకండ్రిగలో విద్యార్థులు పాఠశాలకు వెళ్ళేందుకు బస్సును ఆపినా డ్రైవర్ ఆపకుండా వెళ్ళడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుబ్బానాయుడుకండ్రిగకు చెందిన పలువురు విద్యార్థులు కారణి జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్ళేందుకు ఆ మార్గంలో వస్తున్న తిరుపతి డిపో బస్సును ఆపారు. అయితే డ్రైవర్ బస్సును ఆపకుండా వేగంగా వెళ్ళాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు బస్సును వెంబడించి కొద్దిదూరంలో అడ్డుకు న్నారు. విద్యార్థులకు బస్సును ఆపకుంటే ఎలా అంటూ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు బస్సు ఎక్కించి పంపించారు.

## పాఠశాల విలీనం వద్దంటూ నిరసన

నారాయణవనం, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ గ్రామం లోని పాఠశాలలో 3, 4, 5 తర గతి విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముదాయంలో విలీనం చేయడంపై బొప్పరాజ పాళెం పంచాయతీ లక్ష్మీపురం వాసులు పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలకు వెళ్లే దారిలో అరుణానది వంతెన దాటాల్సి ఉంటుందని, చిన్నపాటి వర్షానికే వంతెనపై నీరు ప్రవహిస్తుందని చెప్పారు. తమ ఊరిలో ఉన్న పాఠశాలలో అన్ని మౌలిక వసుతులు ఉన్నాయని, విలీనం రద్దు చేయాలని కోరారు.

## మెరుగైన సమాజం కోసం కృషి

ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం కోసం యువత కృషి చేయాలని ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సామాజిక చైతన్యంతో మరింత మెరుగైన సమాజాన్ని యువత నిర్మించగలమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు తులసి, సతీష్‌కుమార్, బాపనయ్య పాల్గొన్నారు.

## లారీ ఢీకొని విద్యార్థికి గాయాలు

రేణిగుంట, జూలై 1, (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొనడంతో విద్యార్థి గాయపడ్డాడు. మంగళవారం ఉదయం గాజులమండ్యం వద్ద ఈ ఘటన జరిగింది. ఎల్లమండ్యం గ్రామానికి చెందిన యశ్వంత్ (16) గాజులమండ్యంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్నాడు. ఉదయం స్కూలుకి సైకిల్‌పై వెళ్తూ మరో వాహనాన్ని అధిగమించబోయి లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో యశ్వంత్ ఎడమ చెయ్యికి తీవ్ర గాయమైంది. లారీ డ్రైవర్‌ను పోలీసులకు అప్పజెప్పారు. యశ్వంత్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

నాగలాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... చెన్నైకు చెందిన విజయ్‌కుమార్ (62) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో కేవీబీపురానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో చెన్నై - పుత్తూరు హైవేపై నందనం వద్ద భారత్ గ్యాస్ గోడౌన్ సమీపంలో చెన్నై వైపు నుంచి వస్తున్న ఆయన్ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్‌కు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆయన్ను 108 అంబులెన్స్ సాయంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ సహా డ్రైవర్‌ను నాగలాపురం వద్ద పోలీసులు అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## గాయాలతో జింక: అటవీ శాఖ అధికారులకు అప్పగింత

నాగలాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందనం వద్ద మంగళవారం ఓ జింక అటవీప్రాంతం నుంచి తప్పి రోడ్డుపైకి వచ్చింది. గాయాలపాలైన జింకను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు జింకకు ప్రథమ చికిత్స నిర్వహించారు. పుత్తూరు అటవీశాఖ అదికారులకు సమాచారం అందించి వారికి జింక పిల్లను అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ హనీఫ్ తెలిపారు.

## చేతి బోరును బాగు చేయండి

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా మారిన చేతి బోరును బాగు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఎస్‌పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఉంది. సరిగ్గా కళాశాల ఎదుట ప్రధాన రహదారి పక్కనే చేతి బోరు నిరుపయోగంగా మారింది. నాలుగేళ్ల క్రితం రోడ్డు పక్కన పైప్ లైన్ కోసం గుంతలు తీశారు. ఆ సమయంలో మట్టిని బోరుపై వేసేశారు. దాంతో అప్పటి నుంచి చేతిబోరు నిరుపయోగంగా మారింది. ఈ మార్గంలో డిగ్రీ కళాశాలతో పాటు స్పోర్ట్స్ అథారిటీ క్రీడామైదానం ఉంది. అలాగే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చేతి బోరు అందుబాటులోకి వస్తే ఎంతోమంది దాహార్తి తీరే అవకాశం ఉంది.

### 96శాతం పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 96శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలో ఉదయం 6గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించారన్నారు.

## కమనీయం... ద్రౌపదీదేవి కల్యాణోత్సవం

కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం - సామిఅమ్మవార్లకు మాలలు సమర్పిస్తున్న అర్చకులు - ఉదయం స్వామిఅమ్మవార్ల పురవిహారం



శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ద్రౌపదీదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో కొలువై ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఐదవ రోజైన మంగళవారం రాత్రి ద్రౌపది కల్యాణం కన్నుల పండువగా సాగింది. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించారు. ముందుగా ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య మంగసూత్రాన్ని భక్తులకు చూపించి స్వామి,అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగించారు. అంతకుముందు ఉదయం చప్పరంపై స్వామిఅమ్మవార్లు పురవిహారం చేశారు.

## ప్రతి ఇంటికి వెళ్లి చేసిన మేలు చెబుదాం

సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు ప్రభుత్వం చేసిన మేలు చెబుదామని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. మంగళవారం బీసీ విభాగ నాయకులతో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరం అయిన సందర్భంగా ఈనెల 2నుంచి ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలే కాకుండా నియోజకవర్గ పరిధిలో చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరిద్దామన్నారు. ఉపాధి అవకాశాల కల్పన, పింఛన్ల పెంపు, ఉచిత సిలిండర్, తల్లికి వందనం అమలు చేసి సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. త్వరలో ప్రతి రైతు ఖాతాలో ఏడాదికి రూ.20 వేలు జమ, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు చెప్పారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నలరవి, మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, మురళినాయుడు, శివ, మునిశంకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

### 'తొలి అడుగు' విజయవంతం చేద్దాం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తున్నట్టు చెప్పారు.

### అవ్వతాతలకు పింఛన్ల పండుగ

లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తున్న గాలి మురళీనాయుడు

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 1వ తేదీ అంటేనే అవ్వతాతలకు పింఛన్ల పండుగ అని టీడీపీ తొట్టంబేడు మాజీ మండల అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు అన్నారు. మండలంలోని ఇలగనూరులో ఆయన పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎంకే దక్కిందన్నారు. నాయకులు గోగినేని భాస్కర్‌నాయుడు, నాని, సచివాలయ వీఆర్వో చరిష్మా, సర్వేయర్ ఆరిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

## సమస్యలపై సత్వరం స్పందించండి

గ్రామసభలో మాట్లాడుతున్న సుమన్‌కుమార్

నారాయణవనం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ తెలిపారు. మంగళవారం నారాయణ వనం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పలు శాఖలకు సంబంధించిన ప్రతినిధులు పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శంకర్, టీడీపీ నాయకులు ఆర్‌డీ ఏకాంబరం, మాజీ ఎంపీపీ భక్తవత్సలం, గోవిందస్వామి, కేజీ లక్ష్మణన్, పరుశురాం, కేఎస్.రవి, ఈవో షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఆదిమూలం

నారాయణవనం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మంగళవారం ఉదయం నారాయణవనంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎల్లవేళలా పేదవారికి అండగా నిలుస్తోందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చెంచయ్యనాయుడి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. శ్రీకాళహస్తి పట్టణం, మండల పరిధిలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్టీసీ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. కాసరం రమేష్, నింద్ర సుధాకర్, హరిబాబు, సిద్ధులయ్య తదితరులు పాల్గొన్నారు.

### పక్వానికి వచ్చాకే కాయలు తరలించండి

నారాయణవనం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మామిడికాయలను పక్వానికి వచ్చాకే గుజ్జు పరిశ్రమలకు తరలించాలని మామిడి రైతులకు శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి సూచించారు. మంగళవారం నారాయణవనంలోని లాసా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను ఆయన పరిశీలించారు. తోతాపురి మామిడి కాయలకు ముందుగా తీసుకుని వచ్చిన వారికి టోకెన్లు జారీ చేయాలని పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం ఫ్యాక్టరీలో మామిడి అన్‌లోడ్ ప్రక్రియను, రసీదులను పరిశీలించారు. తహసీల్దారు జయరాములు పాల్గొన్నారు.

### బీజేపీ అధ్యక్షుడికి సన్మానం

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌ను విజయవాడలో మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ... ఏపీ బీజేపీ పగ్గాలను సీనియర్ బీసీ నాయకుడు మాధవ్‌కు అప్పగించడం సంతోషకరమన్నారు. మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎన్వీ రమణ, కుప్ప ప్రసాద్, కొండేటి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు వాడితే వరిలో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం తెలిపారు. మండలంలోని గాజులపెళ్లూరు, నీర్పాకోటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రం సీడర్ పద్ధతిలో నాట్లు వేసిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అన్నదాత సుఖీభవకు పెండింగ్ ఉన్న రైతులు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఏఈవో రేవతి తదితరులు పాల్గొన్నారు.

### నాలుగు గంటలు పని చేయాల్సిందే

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నాలుగు గంటలు పాటు పని చేస్తేనే రూ.400 కూలి వస్తుందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని వీ ఎస్‌పురంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న చెరువు పూడిక తీత పనులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో ఆమె మాట్లాడుతూ... ప్రతి రోజు విధిగా కూలీ పనులు చేయాలన్నారు. పనులు జరిగే చోట వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో దేవరి పాల్గొన్నారు.

### కాళంగి యేరులో పాడిరైతు మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు గ్రామానికి చెందిన పాడి రైతు బాబురెడ్డి (54) కాళంగి యేరులో ఈత రాక మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన బాబురెడ్డి తన మూడు గేదెలను తోలుకుని మంగళవారం సమీపంలో ఉన్న కాళంగి యేరులోకి వెళ్లాడు. నీటిలో దిగిన గేదెలను తీసుకురావడానికి యేరులో దిగాడు. లోతు ఎక్కువగా ఉండడం, బాబురెడ్డికి ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. సమీపంలో ఉన్న రైతులు గమనించి బాబురెడ్డిని నీటి నుంచి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందారు. ఈ ఘటనపై ఎస్ఐ విశ్వనాథనాయుడు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని బీఎన్‌కండ్రిగ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### స్కూల్ అసిస్టెంట్ తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ను విధుల తొలగిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న హరిబాబును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు అందినట్లు హెచ్ఎం రమణయ్య తెలిపారు. హరిబాబు 2017 - 24 వరకు విధులకు గైర్హాజరు కావడంపై విచారణ జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయిన సంవత్సరం కంటే ఎక్కువ కాలం విధులకు హాజరు కాకపోతే సర్వీసు నుంచి తొలగిస్తారని హెచ్ఎం చెప్పారు.

## మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు సీజ్ చేశారు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... పట్టణ శివార్లలోని స్వర్ణముఖి నదిలో ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### నేడు 'తొలి అడుగు'

శ్రీకాళహస్తి, జూలై 1(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు చెప్పారు. ఎమ్మెల్యే సుధీర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 4.30గంటలకు సింగమాల పంచాయతీ వీరభద్రస్వామి ఆలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్, నియోజకవర్గ పరిశీలకుడు అంకయ్యచౌదరి హాజరు కానున్నట్లు చెప్పారు.

### శీతాలాంబకు పొంగళ్లు

కేవీబీపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కొలువై ఉన్న శీతాలాంబ ఆలయంలో అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అంబళ్లు పోశారు. సాయంత్రం భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

### సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం

సీఐటీయూ పిలుపు

పిచ్చాటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని సీఐటీయూ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీడీపీవో కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న పాలకులకు బుద్ధి వచ్చేలా నిర్వహిస్తున్న ఈ సార్వత్రిక సమ్మె దిగ్విజయంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతి, దేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే డాక్టర్లకు సన్మానం

రేణిగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే డాక్టర్లను ఘనంగా సన్మానించారు. మంగళవారం తిరుపతి - రేణిగుంట రోడ్డు మార్గంలోని సబ్ డివిజన్ రైల్వే హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ డాక్టర్లను రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా ఎస్ఎంఓ రెహానా పటాన్, డాక్టర్లు చంద్రశేఖర్, హిమజ, వెంకటపవన్, రెహమాన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జయంతి కుమార్, హసన్ సాహెబ్, సర్పంచ్ నగేష్, అన్బు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, MUPPALLA GURU YAMINI (Old Name) W/o MUPPALLA VASUDEVA RAJU R/o D.NO:6/163, Balaji Nagar, Near Sangam Theater, Old GNT Road, GUDUR - 524101, TIRUPATI DIST, ANDHRA PRADESH. I Changed my name to MUPPALLA YAMINI. Henceforth, I will be known as MUPPALLA YAMINI.
AJT - 1395

CHANGE OF NAME
I,PARACHURU HRUSHEEKESAVULU (Old Name), S/o. KRISHNAMA NAIDU PARACHURU.R/o.D.No.11-28,Gollavanigunta,TN Palem, Tirupati Urban Mandal, TIRUPATI Dist, A.P. HEere by changed my name as PARUCHURI HRUSHIKESAVULU (New Name)
AJT - 400

PLOTS FOR SALE
అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సంప్ర: 91145 61456.
AJT - 1394

CHANGE OF NAME
I,PARACHURU SULOCHANA (Old Name), W/o. HRUSHEEKESAVULU PARACHURU, R/o. D.No. 11-28,Gollavanigunta,TN Palem, Tirupati Urban Mandal, TIRUPATI Dist, A.P. Here by changed my name as PARUCHURI SULOCHANA( New Name)
AJT - 399

WANTED
Wanted teachers for Higher class All Subjects and Computers Teacher,Hostel CooK, for a Reputed School in S.N Puram, Tirupati, Attractive Salary, Cell: 92908 98331,70138 81383.
AJT - 1393

వెంటనే కావలెను
లేసర్ మెషిన్ ఆపరేటర్, ఎంబ్రాయిడరీ మెషిన్ ఆపరేటర్, ఇన్వెంటరీ మేనేజర్, డేటా ఎంట్రీ, అర్హత : 10th Pass ప్రత్యేకమైన నైపుణ్యాలు అవసరం లేదు. పూర్తిస్థాయి ఉద్యోగం. మరిన్ని వివరాలకు సంప్ర. Darshan Dresses, Cell : 9505751243 / 9440250863.
AJT - 239882

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237881

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక వివాదాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

## నరసింహ అవతారంలో జగన్నాథుడు

రథోత్సవంలో భాగంగా వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథుడు మంగళవారం నరసింహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అధికారులు, అర్చకులు పట్టువస్త్రాలు సమర్పించారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వాహక అధికారి రాజగోపాలరెడ్డి తదితరులు దర్శించుకున్నారు. - మహారాణిపేట/ఆంధ్రజ్యోతి

## తెరిపివ్వని వర్షం

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సాయంత్రం కొద్దిసేపు ఆగింది. రాత్రి మళ్లీ మొదలైంది. వర్షంతో నగరవాసులు ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగస్తులు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. రానున్న 24 గంటల్లో వర్షాలు కొనసాగుతాయని, ఉత్తరకోస్తాలో ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

## మాధవ్‌కు అభినందనలు

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఎన్నికయ్యారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాధవ్‌ను పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

## తేలిన ఇంజనీరింగ్ సీట్ల లెక్క

ఉమ్మడి విశాఖలో 20,460
ఏయూలో 1,020

- మరో 22 ప్రైవేటు కళాశాలల్లో 19,440...
- గడిచిన ఏడాది కంటే 2,370 సీట్లు పెరుగుదల

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల లెక్క తేలింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) రాష్ట్రంలోని ఇంజనీరింగ్ సీట్ల వివరాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని 24 కాలేజీల్లో 20,460 సీట్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొంది. ఇందులో ఆంధ్ర యూనివర్సిటీలోని రెగ్యులర్, మహిళా ఇంజనీరింగ్ కాలేజీల్లో కలిపి 1,020 సీట్లు ... మిగతా 6వ పేజీలో

## మాస్టర్ ప్లాన్-2041పై సమీక్ష

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించిన మాస్టర్ ప్లాన్-2041ను పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు, అవసరమైన మార్పులు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.**

- అవసరమైన మార్పులు చేపట్టేందుకు అధికారుల కసరత్తు
- ప్రతి అభ్యంతరానికి పక్కాగా సమాధానం
- ఏడుగురితో టెక్నికల్ కమిటీ నియామకం
- ప్రజలకు అవగాహన కల్పించే దిశగా యత్నం

వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్‌లో అనేక తప్పులు చోటుచేసుకున్నాయి. ఆ పార్టీ నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనుకూలంగా రహదారులను మార్చుకున్నారు. విశాఖ నుంచి భీమిలి మీదుగా భోగాపురం వెళ్లే కోస్టల్ కారిడార్‌ను నేరెళ్లవలస వద్ద లోపలకు తీసుకువెళ్లి వైసీపీ నాయకుల భూములకు లబ్ధి కలిగేలా చేసుకున్నారు. భీమిలి పట్టణంలో పురాతన నిర్మాణాలు పోకూడదనే ఉద్దేశంతో అలా చేశామని చెప్పుకున్నారు. భోగాపురం ప్రాంతంలో అయితే చెరువులు, వాగులు మీదుగా మాస్టర్ ప్లాన్ రహదారులను ప్రతిపాదించారు. ప్రభుత్వ సంస్థలే నీటి వనరులను కాపాడకపోతే ఎలా? అని విమర్శలు వెల్లువెత్తాయి. వీటిపై అప్పట్లోనే అభ్యంతరాలు స్వీకరించగా 19,460 మంది ... మిగతా 6వ పేజీలో

మాస్టర్‌ప్లాన్‌లో విస్తరించనున్న దత్ ఐలాండ్-ఆశీలమెట్ట రోడ్డు

### నగరంలో విస్తరించే రహదారులు

- మద్దిలపాలెం నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు ఉన్న రామా టాకీస్ రహదారి ప్రస్తుతం 24 మీటర్లు ఉండగా 45 మీటర్లు చేయనున్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఇటు ఏయూ క్వార్టర్లు, అటు సీఎంఆర్ సెంట్రల్, హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్, మసీదు, చాలావరకు షాపింగ్ కాంప్లెక్స్‌లు పోతాయి.
- డాబాగార్డెన్స్‌లో అంబేడ్కర్ విగ్రహం నుంచి పెన్ స్కూల్ వరకూ రహదారి ప్రస్తుతం 18మీటర్లు ఉండగా దానిని 30మీటర్లకు ప్రతిపాదించారు. ఈ పనులు చేపడితే ఆర్‌కే షాపింగ్ మాల్ నుంచి ఆ చివర ఉన్న షాపింగ్ మాల్ వరకు సగం సగం పోతాయి.
- సిరిపురంలో దత్‌ఐలెండ్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు రహదారి ప్రస్తుతం 24 మీటర్లు ఉండగా దానిని 45 మీటర్లు చేస్తారు. ఈ పనులు చేపడితే ఇటు జీవీఎంసీ కమిషనర్ బంగ్లా, అటు సంపత్ వినాయక ఆలయం, పలు షాపింగ్ మాల్స్ పోతాయి. ఈ మార్గంలోనే మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎంవీవీ పీక్స్ పేరుతో భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణం ప్రారంభించి...కొత్త మాస్టర్ ప్లాన్ రోడ్డు లెక్కల ప్రకారం తన భూమి పోతుందని పేర్కొంటూ సుమారుగా రూ.70 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు తీసుకున్నారు. ఇది వివాదాస్పదమైంది.
- జాతీయ రహదారిలో తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు ప్రస్తుతం 18 మీటర్లు ఉండగా దానిని 45 మీటర్లకు పెంచుతారు. ఈ విస్తరణలో రైల్వే ఆస్తులకు ఎక్కువ నష్టం కలుగుతుంది.
- దసపల్లా హిల్స్‌లో సర్ క్యూట్ భవనం నుంచి నౌరోజీ రోడ్డు వరకు మార్గం ప్రస్తుతం 12 మీటర్లు ఉండగా దానిని 30 మీటర్లకు ప్రతిపాదించారు. ఈ మార్గంలో రాకపోకలు తక్కువగా ఉన్నా... దసపల్లా భూములు కొట్టేసిన వైసీపీ ... మిగతా 6వ పేజీలో

## ముదురుగుతున్న కాలుష్య నియంత్రణ నిధులు

**2023-24 వరకు రూ.129.25 కోట్లు మంజూరు**

- వినియోగించింది రూ.39.53 కోట్లు మాత్రమే
- బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ల విముఖం
- రెండేళ్లుగా కేంద్రం నుంచి నిధులు నిలిపివేత
- గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఘనకార్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయలోపంతో నగరంలో కాలుష్య నియంత్రణ పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదు. నిధులు ఉన్నా వాటిని గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో ఇవ్వలేదు. దాంతో పనులు ఆగిపోయాయి. ఇచ్చిన నిధులు ఉపయోగించుకోలేదని కేంద్ర ప్రభుత్వం గ్రాంట్లు నిలిపివేసింది. చేసిన పనులకు బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్త పనులకు ముందుకురావడం లేదు. ఇదీ నగరంలో కాలుష్య నియంత్రణ తీరు.**

రాష్ట్రంలో ఏకైక పారిశ్రామిక నగరం విశాఖపట్నం. ఇక్కడ కాలుష్యం అధికం. విశాఖపట్నం పోర్టు ప్రధానంగా నగరాన్ని కాలుష్యమయం చేస్తోంది. ఇకపోతే గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, స్టీల్ ప్లాంటు కాలుష్యంలో మేమూ ఉన్నామంటూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటికి తోడుగా నిర్మాణ సంస్థలు, రహదారులపై తిరిగే వాహనాలు కాలుష్యం సృష్టిస్తున్నాయి. దీంతో ఇరవై ఏళ్ల క్రితమే విశాఖపట్నం కాలుష్యంలో దేశంలో తొమ్మిదో నగరంగా స్థానం దక్కించుకుంది. అప్పటి నుంచి కాలుష్య నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇస్తోంది. 2021 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.129.25 కోట్లు మంజూరు చేసింది. వీటిని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ అధికారులు కలిసి ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయాలి. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ నిధుల వినియోగంపై సమీక్షించినప్పుడు విశాఖపట్నంలో కాలుష్య నియంత్రణకు ఇచ్చిన నిధులను కేవలం 31 శాతమే వినియోగించుకున్నారని, ... మిగతా 6వ పేజీలో

## ఏసీ బస్సుల్లో చార్జీల తగ్గింపు

- నేటి నుంచే అమలు
- ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఏసీ బస్సుల చార్జీలు పది శాతం మేర తగ్గించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. రీజియన్‌లో అమరావతి, నైట్ రైడర్, ఇంద్ర కేటగిరీల్లో 16 ఏసీ సర్వీసులు ఉన్నాయి. ఇవి విశాఖ నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏసీ సర్వీస్‌లకు డిమాండ్ తగ్గింది. సగటు ఆక్యుపెన్సీ రేషియో 60 శాతానికి మించడం లేదు. ఈ విషయాన్ని రీజియన్ అధికారులు రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. చార్జీల్లో పది శాతం రాయితీ ఇస్తే ఆక్యుపెన్సీ రేషియో పెరిగే అవకాశం ఉందని సూచించారు. ఈ మేరకు దూర ప్రాంతాలకు తిరిగే ఏసీ సర్వీసుల టికెట్లలో పది శాతం రాయితీ ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ తగ్గింపు బుధవారం నుంచి అమలులోకి వస్తుందని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## మలేరియా పోస్టుల కోసం ఎమ్మెల్యేల పేచీ

తాత్కాలిక ప్రాతిపదికన 434 మందిని తీసుకునేందుకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం

- ఎమ్మెల్యేకి పది, కార్పొరేటర్‌కు మూడు చొప్పున కేటాయించిన మేయర్
- తమకు 40 పోస్టులు కావాలంటూ కొందరు ఎమ్మెల్యేల పట్టు
- జాబితా తయారుచేసి మేయర్‌కు అందజేత
- ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**నగరంలో దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు జీవీఎంసీ అధికారులు చేపట్టిన మలేరియా కార్మికుల పోస్టుల భర్తీ ప్రక్రియ కొందరు ఎమ్మెల్యేల కారణంగా ముందుకుసాగడం లేదు. ఐదు నెలల కాలానికి 434 మంది కార్మికులను నియమించుకోవాలని భావించిన అధికారులు ఇటీవల కౌన్సిల్ అనుమతి తీసుకున్నారు. ఆయా పోస్టులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఒక్కో కార్పొరేటర్‌కు మూడేసి, ఎమ్మెల్యేలకు పదేసి చొప్పున కేటాయించారు. కానీ కొందరు ఎమ్మెల్యేలు తమకు 40కిపైగా పోస్టులు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతుండడంతో ప్రజారోగ్య విభాగం అధికారులు తలలు పట్టుకుంటున్నారు.**

ఈ సీజన్‌లో వర్షాల వల్ల పారిశుధ్య నిర్వహణ పనులకు అంతరాయం కలగడం, నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతాయి. అందుకే సాధారణంగా వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు విజృంభిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాలను గుర్తించడం, వాటిని నిర్వీర్యం చేయడం, దోమలు వ్యాప్తిచెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఏటా మలేరియా విభాగంలో తాత్కాలిక కార్మికులను (ఐదు నెలల వ్యవధికి) తీసుకుంటారు. వారికి నెలకు రూ.15 వేలు ఇస్తారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జీతాలు చెల్లిస్తుంటారు. ఈ ఏడాది కూడా మలేరియా విభాగంలో దోమల వ్యాప్తి నియంత్రణకు 434 మంది కార్మికులను నియమించుకోవాల్సి ఉంటుందని ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అందుకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్నప్పుడు ఆమోదం తెలిపారు. గతంలో పనిచేసిన కార్మికులను తిరిగి తీసుకోవాలని అధికారులు భావించగా, కొంతమంది కార్పొరేటర్లు తమ వార్డులో తాము సూచించిన వారికే అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో ... మిగతా 6వ పేజీలో

## రౌడీషీటర్ ఎల్లాజీ హత్య

- జ్ఞానాపురం శ్మశానంలో పట్టపగలే ఘటన

మృతుడు ఎల్లాజీ (ఫైల్)

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నాగమణి ఎల్లాజీ (35) జ్ఞానాపురం శ్మశానవాటికలో మంగళవారం హత్యకు గురయ్యాడు. కొంతమంది స్నేహితులను వెంటేసుకుని శ్మశానవాటికకు వెళ్లిన ఎల్లాజీ...అక్కడ పనిచేస్తున్న వారిని డబ్బులు డిమాండ్ చేశాడు. తమ వద్ద లేవని వారు సమాధానం చెప్పగా... కత్తితో దాడికి యత్నించాడు. వారంతా ఎదురుదాడి చేయడంతో ఎల్లాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి కంచరపాలెం పోలీసులు గోప్యత పాటిస్తుండగా, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కలిగివున్న ఎల్లాజీ తన స్నేహితులైన నక్కిన యేసురాజు మరో ఇద్దరితో కలిసి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శ్మశానవాటిక లోపలకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ పనిచేసుకుంటున్న నరసింహమూర్తి, గణేష్, శ్రీను, కృష్ణ వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. వాళ్లు డబ్బులు ... మిగతా 6వ పేజీలో

## గిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు

- భక్తులు నడిచే 32 కి.మీ. మేర సీసీ టీవీ కెమెరాలు, వైద్య శిబిరాలు
- హనుమంతవాక, ఇసుకతోట జంక్షన్లలో తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు
- 9, 10 తేదీలలో మద్యం షాపుల మూసివేత
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి):

**ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే సింహగిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సింహాచలం దేవస్థానం అధికారులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, దేవస్థానం ఈఓ త్రినాథరావు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన మంగళవారం గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడెక్కడ ఏమేమి...అవసరమో సూచించారు. కలెక్టరేట్‌లో సాయంత్రం ఇతర అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.**

తొమ్మిదో తేదీ తెల్లవారుజాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఎవరికైనా అనారోగ్యం కలిగితే చికిత్స కోసం కిలోమీటరుకు ఒక శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. వాటిలో డాక్టర్, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ మందులతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రదక్షిణ ప్రాంతాల్లో విద్యుద్దీపాలన్నీ వెలగాలని, జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. హనుమంతవాక, ఇసుకతోట జంక్షన్లలో భక్తులు రోడ్డు దాటాల్సి ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

## నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

**జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సూచన**

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా తయారుచేయాలని సీఎం చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని, ఆ దిశగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్‌ను పల్లా శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ నగర అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాలకల్పన వంటి అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే పల్లా వెంట మేయర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## నరసింహావతారంలో జగన్నాథుడు

నరసింహ అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మండపంలో స్వామి భక్తులకు శ్రీనరసింహావతారంలో దర్శనమిచ్చారు. అంతకు ముందు తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలురాంపిల్లి లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి భక్తుల దర్శనాలు కల్పించారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, తగరపువలస, మధురవాడ, బీచ్‌రోడ్ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఇంద్రజ్యుమ్న మండపం ఆవరణలో జరిగిన శ్రీహరి కుసుమాంబ కోలాట ప్రదర్శన అలరించింది. అనంతరం, శివ, కేశవ ఆలయ సముదాయం ఎగ్జిక్యూటివ్ అథారిటీ రాంపిల్లి సింగరాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించి నరసింహావతార విశిష్టతను భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిస్వామివారిని దర్శించుకున్నారు.

## అర్జెంట్‌గా భద్రతపై సమీక్షించండి

» సిగాచీ పేలుడు ప్రమాద నేపథ్యంలో ఫార్మా కంపెనీలకు ఫ్యాక్టరీస్ విభాగం ఆదేశం

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం పాశమైలారంలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి భారీ సంఖ్యలో కార్మికులు మరణించిన నేపథ్యంలో విశాఖ జిల్లాలో ఫ్యాక్టరీల విభాగం అప్రమత్తమైంది. జిల్లాలో ప్రమాదకరమైన పరిశ్రమలతో పాటు ఫార్మా కంపెనీలన్నీ అత్యవసరంగా భద్రతా కమిటీలతో సమావేశం నిర్వహించి, గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలపై నివేదిక పంపాలని విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశించారు. ఆ సమావేశాల్లో చర్చించిన అంశాలు, రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక రెండు రోజుల్లో సమర్పించాలని కోరారు. అదే విధంగా అవసరమైన సంస్థలన్నీ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఇవన్నీ తక్షణమే చేయాలని, నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ : ఎమ్మెల్యే గంటా

గంభీరం పంచాయతీలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం/పద్మనాభం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆనందపురం మండలం గంభీరం, పద్మనాభం మండలంలోని పాండ్రంగి గ్రామంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో గంటా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రూ.మూడు వేల పెన్షన్‌ను నాలుగు వేల రూపాయలకు పెంచామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో 65.31 లక్షల మందికి రూ.4,408 కోట్ల పెన్షన్ అందజేస్తున్నామని తెలిపారు. సంక్షేమానికి నాంది పలికిన ఎన్టీఆర్ బాటలోనే పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తాన్ని పెన్షన్‌గా అందించడం లేదని చెప్పారు. అర్హులైన వారందరికీ పెన్షన్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తాతాజు అప్పారావు, సర్పంచ్ వానపల్లి లక్ష్మి, నేతలు ముత్యాలరావు, ఉప సర్పంచ్ బట్ట శ్రీనివాసరావు నాయకులు కోరాడ వైకుంఠరావు, అప్పలరాజు, కంచరాపు శ్రీనివాసరావు, చందక అప్పలరాజు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కళ్ల నగేష్ కుమార్, కరిమిని లీలావతి, రామరాజు, మొకర అప్పలనాయుడు పాల్గొన్నారు.

**భీమునిపట్నంలో..**

భీమునిపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. మంగళవారం ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఆయన అందించారు. అలాగే నాలుగో వార్డు మంగమారిపేటలో టీడీపీ నాయకుడు వాసుపల్లి ఎల్లయ్య ఆధ్వర్యంలో సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వార్డు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## తేలిన ఇంజనీరింగ్ సీట్ల లెక్క

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. మరో 22 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిర్వహించనుండటంతో ఉన్నత విద్యాశాఖ అనుమతిచ్చింది. గడచిన ఏడాది తో పోల్చితే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది 18,090 సీట్లకు మాత్రమే ఏపీఈఈటీ అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది ఈ సీట్ల సంఖ్య 20 వేలు దాటింది. గత ఏడాదితో పోల్చితే 2,370 సీట్లు పెరిగాయి. ఏయూలో గడచిన ఏడాది 900 సీట్లలో ప్రవేశాలకు ఏపీఈఈటీ అనుమతి ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్య 1,020 సీట్లకు పెరిగింది. అంటే 120 సీట్లు పెరిగాయి. అలాగే, గడచిన ఏడాది 21 ప్రైవేటు కాలేజీల్లో 17,190 సీట్లు ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 22కు పెరిగింది. మొత్తం 22 కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నట్టు వెల్లడించింది. గడచిన ఏడాదితో పోల్చితే 2,250 సీట్లు పెరిగాయి. ఈ నెలాఖరుకు తొలిదశ ప్రవేశాలు పూర్తి చేయాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తున్నట్టు చెబుతున్నారు.

## రౌడీషీటర్ ఎల్లాజీ హత్య

... 5వ పేజీ తరువాయి

ఇవ్వడానికి నిరాకరించడంతో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో ఎల్లాజీ తన జేబులో ఉన్న చాకు తీసి నరసింహమూర్తి, గణేష్‌లను చంపేస్తానని బెదిరించాడు. దీంతో గణేష్ కర్రతో ఎల్లాజీని తలపై కొట్టగా, నరసింహ మూర్తి తన చేతిలో ఉన్న గడ్డపారతో ఎల్లాజీ తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో నక్కిన యేసు కూడా వారిపై దాడికి యత్నించడంతో అతడిని కూడా గడ్డపారతో కొట్టడంతో తలకు గాయమైంది. మిగిలిన ఇద్దరు అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిన యేసుని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై కంచరపాలెం పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలావుండగా హత్యకు గురైన ఎల్లాజీ గత నెల 23న జైలు నుంచి విడుదల కావడం విశేషం. హత్య జరిగిందని, దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

## రాయితీపై వరి, వేరుశెనగ విత్తనాలు

» జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

భీమునిపట్నం (రూరల్) జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రోత్సహించేందుకు రాయితీపై విత్తనాలను సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్టు జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి తెలిపారు. మంగళవారం భీమిలి రూరల్ మండలం తాటితూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించి పంట పొలాలను సందర్శించారు. అనంతరం నగరపాలెంలో రైతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ వరి, వేరుశెనగ విత్తనాలను కిలో కేవలం రూ.5లకు రాయితీపై అందిస్తున్నామని, కావల్సిన వారు వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. వీటితో పాటు పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై అందిస్తున్నట్టు చెప్పారు. ఈ పచ్చిరొట్ట విత్తనాల వల్ల పంట పొలాలకు పోషకాలు అంది అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయాధికారిణి పి.శివకోమలి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ అధికారి సురేష్, చంద్రశేఖర్, రామలక్ష్మణరావు రైతు సేవా కేంద్రానికి చెందిన ఎన్.కృపామణి తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల కోసం దరఖాస్తులు చేసుకోండి

» కార్మిక సంఘాల ప్రకటన » నేటి నుంచి చిట్టివలసలో కౌంటర్ ఏర్పాటు

చిట్టివలసలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో పాల్గొన్న నాయకులు

తగరపువలస, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జూట్ మిల్లులో పని చేసిన కార్మికులు తమకు రావాల్సిన పెండింగ్ బాకాయిల కోసం ఈనెల 2 నుంచి 20వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవాలని మిల్లులో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. మంగళవారం వారు చిట్టివలసలో సమావేశాన్ని నిర్వహించి ఏ విధంగా ధరఖాస్తులను సమర్పించాలనే విషయమై సంయుక్తంగా ప్రకటించారు. యాజమాన్యం, కార్మికశాఖ అధికారులు, ఎమ్మెల్యే సమక్షంలో తీసుకున్న నిర్ణయం మేరకు కొన్ని పరిహారాలను చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని ప్రకటించారు. జూట్‌మిల్లు లేబర్ ఆఫీసు కార్యాలయం వద్ద ధరఖాస్తులు స్వీకరించే కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్మిక సంఘాల నాయకులు అందుబాటులో ఉంటూ ధరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. ఇంతవరకు ధరఖాస్తులు సమర్పించని పెర్మనెంట్, బదిలీ, అప్రెంటీస్ కార్మికులు వెంటనే ధరఖాస్తులు చేసుకోవాలని కోరారు. భర్తలు మరణించిన జూట్ మహిళా కార్మికులు రూ.5 వేలు పొందడానికి కూడా వివరాలు సమర్పించాలని కోరారు. 2008, జూలై 23 నుంచి 2019, జూలై 23 మధ్య సర్వీసులో ఉండి మృతి చెందిన కార్మికుల భార్యలు ఇంతవరకు పరిహారం పొందని వారు కూడా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తాము పని చేసిన సమయంలో మిల్లులో జీతం టిక్కెట్టు, డెత్ సర్టిఫికెట్, ఈఎస్ఐ కార్డు తమ ధరఖాస్తులతో పాటు జత చేయాలని సూచించారు. అలాగే గతంలో మిల్లు పని చేసిన సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన కార్మికులు తమ వివరాలను అందించాలని కోరారు. ప్రావిడెంట్ ఫండ్ కోసం ఇంతవరకు ధరఖాస్తులు పెట్టుకోని వారు కూడా తమ వద్దకు వస్తే వారి వివరాల మేరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తులను పింపిస్తామని తెలిపారు. మిల్లు క్వార్టర్లలో నివాసం ఉన్న సమయంలో కార్మికులు కరెంటు మీటర్ కోసం వెయ్యి రూపాయలు చెల్లించిన వారు క్వార్టరు ఖాళీ చేస్తే ఆ వివరాలతో వెయ్యి రూపాయాల కోసం దరఖాస్తు చేయాలని కోరారు. కాగా ఈ సంయుక్త సమావేశంలో ఐఎన్‌టీయూసీకి చెందిన కేవీ నర్సింహరాజు, జి.వెంకటరెడ్డి, సి.వెంకటరమణ, కాంగ్రెస్ కార్మిక సంఘానికి చెందిన డి.అప్పలరెడ్డి ఎం.ఆదినారాయణ, ఏఐటీయూసీకి చెందిన కె.ఈశ్వరరావు, సి.అప్పలసూరి, రాంబాబు, టీఎన్టీయూసీకి చెందిన ఎస్.అచ్చారావు, ఎం.దేముళ్లు, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా పోస్టుల కోసం ఎమ్మెల్యేలు పేచీ

... 5వ పేజీ తరువాయి

మేయర్ పీలా శ్రీనివాసరావు...ఒక్కో కార్పొరేటర్‌కు మూడేసి, ఎమ్మెల్యేలకు పదేసి పోస్టుల చొప్పున పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించారు. కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తమ కోటాలో ఎవరికి అవకాశం ఇవ్వాలనే జాబితాను ప్రజారోగ్య విభాగం అధికారులకు అందజేయాలని ఆయా జోన్‌ల ఏఎంహెచ్‌ఓల ద్వారా సమాచారం పంపించారు. కొంతమంది కార్పొరేటర్లు తమ వంతుగా ముగ్గురు పేర్లను పంపించేయడంతో వారంతా ఈనెల ఒకటి నుంచి విధుల్లో చేరిపోయారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా తమ కోటాలో ఎవరిని నియమించాలనేది సూచిస్తూ జాబితాలను పంపించేశారు. కానీ కొందరు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మాత్రం తమకు కేటాయించిన పోస్టులు సరిపోవని, తమ అనుచరులు, పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది కాబట్టి కోటాను పెంచాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. కార్పొరేటర్లకు ఏదోలా నచ్చజెప్పిన అధికారులు, ఎమ్మెల్యేల విషయంలో మాత్రం ఎదురు మాట్లాడలేకపోతున్నారు. ఒక ఎమ్మెల్యే 43 మంది పేర్లతో జాబితాను మేయర్‌తోపాటు ప్రజారోగ్య విభాగం అధికారులకు పంపించారు. మరో ఎమ్మెల్యే 32 మందితో, ఇంకో ఎమ్మెల్యే 28 మందితో కూడిన జాబితాలను అధికారులకు పంపించారు. వారందరికీ అవకాశం కల్పించలేమని అధికారులు అంటున్నారు. అలాగని ఎమ్మెల్యేలు చెప్పినట్టు చేయకపోతే తమ పోస్టింగ్‌కు ఎక్కడ ముప్పువస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైపోయినా సరే మలేరియా కార్మికుల సేవలను అందుబాటులోకి తెచ్చుకోలేకపోతున్నామని, దీనిప్రభావం జ్వరాల వ్యాప్తిపై పడుతుందని అధికారులు పేర్కొంటుండడం విశేషం. ఐదు నెలలు మాత్రమే పనిచేసే తాత్కాలిక కార్మికుల పోస్టుల కోసం ఇంతగా పంతాలకు పోవడం ఎమ్మెల్యేలకు సరికాదని, నగరవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత వేగంగా కార్మికులను తీసుకునేందుకు సహకరించాలనికోరుతున్నారు.

## మురుగుతున్న కాలుష్య నియంత్రణ నిధులు

... 5వ పేజీ తరువాయి

నిధులు మురుగుపోతున్నాయని తేల్చింది. గణాంకాలు పరిశీలిస్తే ఇచ్చిన నిధుల్లో రూ.39.53 కోట్లు మాత్రమే వాడుకున్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో 2024 ఏప్రిల్ నుంచి కొత్త నిధులు ఇవ్వడం మానేసింది. ఈ నిధులు వ్యయం కాకపోవడానికి అన్ని కారణాలు ఉన్నాయని అధికార వర్గాలు ఆరోపిస్తున్నాయి.

విశాఖపట్నంలో సింహభాగం కాలుష్యం పరిశ్రమలదే. విశాఖపట్నం పోర్టు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, కోరమండల్, స్టీల్ ప్లాంటు ద్వారా వచ్చే కాలుష్యాన్ని వారే నియంత్రించాలి. ప్రత్యేక చర్యలు చేపట్టాలి. దీనిని కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షించాలి. ఇక వాహనాలు, రహదారులు, భవనాల నిర్మాణం వచ్చే ధూళిని తగ్గించి గాలి నాణ్యత పెంపొందించాల్సి ఉంది. దీనికి ఎక్కడికక్కడ పరికరాలు పెట్టి అక్కడి గాలి నాణ్యత తెలిపే బోర్డులు ఏర్పాటుచేశారు.ఇవి సరిగా పనిచేయడం లేదు.

ఇక నగరంలో వ్యర్థాలు కాలుష్యం సృష్టించకుండా జీవీఎంసీ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. దీనికి వారు వేస్ట్ ఎనర్జీ ప్లాంటు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, బయో మైనింగ్ వంటి ప్రాజెక్టులు చేపట్టి కొంతవరకు ఫలితాలు సాధిస్తున్నారు. చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం సీఎంఎఫ్ఎస్ నుంచి సకాలంలో విడుదల కావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల నిధులు వాడేసుకోవడంతో వారికి అవసరమైనప్పుడు విడుదల చేయలేకపోయింది. దాంతో బిల్లులు అందక కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు. దాంతో ఆ తరువాత చేపట్టాలనకున్న పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సకాలంలో సమర్పించలేదని కేంద్ర ప్రభుత్వం ఆ తరువాత నిధులు ఇవ్వడం ఆపేసింది. వైసీపీ ప్రభుత్వం చేసిన పని వల్ల విశాఖకు కేటాయించిన నిధులు వినియోగించుకోలేని దుస్థితి ఎదురైంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించకుండా స్థానిక అధికారుల అలసత్వంగా పేర్కొనడమే అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి విశాఖలో కాలుష్యం తగ్గించడానికి నిధులు విడుదల చేయాల్సి ఉంది.

## నగరంలో విస్తరించే రహదారులు

... 5వ పేజీ తరువాయి

బ్యాచ్ భారీ భవనాల నిర్మాణాలకు అనుకూలంగా మార్పులు చేయించుకున్నారు.

- భీమిలి మండలం దొరతోట రహదారి ప్రస్తుతం 24 మీటర్ల నుంచి 30 మీటర్ల వరకు ఉండగా దానిని డబుల్ అంటే 60 మీటర్లకు ప్రతిపాదించారు. ఈ మార్గంలో ఎక్కువ రైతుల భూములు ఉన్నాయి. వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.
- రైల్వే ఆస్పత్రి నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వరకు 30 మీటర్ల రహదారిని 45 మీటర్లకు విస్తరిస్తారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని దీనిని ప్రతిపాదించారు.
- అక్కయ్యపాలెం జంక్షన్ నుంచి రైల్వే న్యూకాలనీ వరకు 18 మీటర్ల రహదారి ఉండగా దానిని 30 మీటర్లకు పెంచుతారు.
- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం మీదుగా మద్దిలపాలెం జంక్షన్ వరకు ప్రస్తుతం 18 మీటర్లు ఉండగా దానిని 30 మీటర్లు చేస్తారు.
- చావులమదుం జంక్షన్ నుంచి ఎల్ఐసీ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వరకూ ప్రస్తుతం రహదారి 18 నుంచి 24 మీటర్లు ఉండగా దానిని 45 మీటర్లు చేస్తారు.

## అప్పన్న సన్నిధిలో తిరునక్షత్ర పూజలు

వేదికపై స్వామి, అమ్మవార్లు

సింహాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశిష్టాద్వైత మతవ్యాపకులు పెరియాళ్వార్ తిరునక్షత్ర పూజలు వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఆషాడమాసంలో ఏటా పెరియాళ్వార్ తిరునక్షత్ర పూజలు ఐదురోజుల పాటు నిర్వహించటం ఆచారంగా వస్తోంది. దానిలో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులతో పాటు ఆళ్వార్ల ఉత్సవమూర్తులను కూడా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆలయ స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ఉపచారాలు జరిపిన తరువాత వేదపారాయణలతోపాటు నాలాయిర దివ్యప్రబంధంలోని నాలుగువేల పాశురాల పారాయణం ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక నివేదనలు చేసిన తరువాత భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## జగన్నాథునికి అప్పన్న సన్నిధి నుంచి పట్టువస్త్రాలు

నగరంలోని వన్‌టౌన్‌లో జగన్నాథుని సన్నిధిలో అప్పన్న ఆలయ అధికారులు

సింహాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుని వార్షిక ఉత్సవాలలో భాగంగా వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధి నుంచి పట్టువస్త్రాలను ఆలయ అధికారులు సమర్పించారు. ఏటా జగన్నాథ స్వామి ఉత్సవాలలో నారసింహ అవతారం రోజున అప్పన్న ఆలయం నుంచి పట్టువస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. అదే క్రమంలో మంగళవారం అప్పన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన తరువాత ఏఈఓ ఆనందకుమార్ సారథ్యంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర అధికారులు, పండితులు పట్టువస్త్రాలు, పండ్లు, పుష్పమాలికలను తీసుకుని వెళ్లి టర్నర్ చౌల్ట్రీలోని జగన్నాథస్వామి దేవాలయ అధికారులకు అందజేశారు. అర్చకస్వాములు పట్టువస్త్రాలను, ఫలాలను సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.

## అక్రమంగా మద్యం విక్రయం.. ఒకరి అరెస్టు

భీమునిపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు జేవీ అగ్రహారంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న కొంగరాని సంతోష్ (36)ను భీమిలి పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. పోలీసు ఎస్ఐ రాధాకృష్ణకు అందిన సమాచారంతో సిబ్బందితో ఆ గ్రామంలో ఉన్న ఒక రేకుల షెడ్డుపై దాడి చేయగా నిందితుడు అక్రమంగా మద్యంను అధిక ధరకు విక్రయిస్తూ పట్టుబడినట్టు తెలిపారు. భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన నిందితుడు జేవీ అగ్రహారంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నాడన్నారు. నిందితుడు సంతోష్ వద్ద 53 మద్యం నిబ్ బాటిల్స్ పట్టుకుని, అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాధాకృష్ణ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## సీఎంటీలో ఘనంగా వైద్యుల దినోత్సవం

వైద్యురాలిని సత్కరిస్తున్న దృశ్యం

మధురవాడ, జులై 1 (ఆంధ్రజ్యోతి): మధురవాడ సిమ్స్ కళాశాల్లో మంగళవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకంగా చర్చా కార్యక్రమం నిర్వహించారు. మహిళ ఆరోగ్యం ప్రతీ దశలో ముఖ్యమైనదనే అంశంపై పలువురు గైనకాలజిస్టులు మాట్లాడారు. ముఖ్య అతిథిగా డాక్టర్ శిల్పాహాస సమల్లా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులను సీఎంటీ బి-స్కూల్ కార్యదర్శి విజయారవీంద్ర, ఈడీ దీపికాదాస్ ఘనంగా సత్కరించారు.

## గిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఉన్నందున ఆ రెండు ప్రాంతాల్లో తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఆ రెండు రోజుల్లో మద్యం దుకాణాలను మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. సింహాచలం కొండపై ముందుజాగ్రత్త చర్యగా అగ్నిమాపక దళం, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అలసిన భక్తులు విశాంత్రి తీసుకోవడానికి హోల్డింగ్ పాయింట్లను పెట్టాలన్నారు. దారిపొడవునా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర సేవల కోసం 'అస్త్రం' యాప్ ఉపయోగించుకోవాలని విస్తృత ప్రచారం చేస్తామని సీపీ శంఖబ్రత బాగ్చీ చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టడానికి అనుమతులు ఇవ్వాలని, వారి కౌంటర్లు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాధుర్, జీవీఎంసీ, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్-2041పై సమీక్ష

మాస్టర్‌ప్లాన్ పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదులు చేశారు. వాటిలో వేళ్లపై లెక్క పెట్టగలిగిన సంఖ్యలోనే దిద్దుబాట్లు చేసి, మిగిలిన వాటిని పక్కన పడేశారు. అత్యధికుల అభ్యంతరాలకు న్యాయం జరగలేదు.

కొత్త ప్రభుత్వం వచ్చాక వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఎక్కువగా మాస్టర్‌ప్లాన్ పైనే ఫిర్యాదులు రావడంతో ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లారు. పురపాలక శాఖ మంత్రి నారాయణతో చర్చించి మాస్టర్ ప్లాన్-2041పై మళ్లీ అభ్యంతరాలు స్వీకరించాలని నిర్ణయించి ఆ ప్రక్రియ ప్రారంభించారు. అయితే నగరంలో ఏ రహదారులను ఎంత మేరకు విస్తరిస్తున్నారనే విషయం చాలామందికి తెలియదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆ రంగంలో ఆసక్తి కలిగిన ప్రజా ప్రతినిధులు మాత్రమే పూర్తి వివరాలు తెలుసుకొని వారి పనులు పూర్తి చేసుకోగలిగారు. ఇప్పుడు ప్రభుత్వం మరోసారి అభ్యంతరాలకు అవకాశం ఇచ్చినందున ఎక్కడెక్కడ ఏయే మార్పులు జరుగుతున్నాయో ప్రజలకు తెలియజేయాలని పలువురు డిమాండ్ చేయడంతో వీఎంఆర్‌డీఏ అధికారులు మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో జీవీఎంసీ కార్పొరేటర్లకు కూడా ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

### పారదర్శకంగా మాస్టర్ ప్లాన్ మార్పులు

ఎంవీ ప్రణవ్‌గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

గత ప్రభుత్వంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో తప్పులు అనేకం ఉన్నందునే సవరించడానికి ఈ ప్రక్రియ ప్రారంభించాం. దీనిని 100 శాతం పారదర్శకంగా నిర్వహించి, వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని పరిశీలించి సమాధానం ఇస్తాం. ఎక్కడా మళ్లీ తప్పులు జరగకుండా చూస్తాం.

### ఏడుగురితో టెక్నికల్ కమిటీ

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041పై వచ్చే అభ్యంతరాలను పరిశీలించి, మార్పులు, చేర్పులు చేయడానికి ప్రభుత్వం సీఆర్‌డీఏ కమిషనర్ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో జీవీఎంసీ కమిషనర్, డీటీసీపీ డైరెక్టర్, ఏయూ ప్రొఫెసర్, తదితరులు ఉంటారు.

### లైన్ విభాగాల మార్పులకూ అవకాశం

మాస్టర్ ప్లాన్ ఆమోదించిన తరువాత ఈ మూడేళ్లలో రెవెన్యూ అధికారుల రీ సర్వే, ఏపీఐఐసీ కొత్త లేఅవుట్లు, జీవీఎంసీ, ఆర్ అండ్ బి, రైల్వే, నేషనల్ హైవే అథారిటీ తీసుకున్న కొత్త నిర్ణయాలను కూడా పొందుపరుస్తాం.

- శిల్ప, సీయూపీ, వీఎంఆర్‌డీఏ

## పీఏసీఎస్ ఆవరణలో మొక్కలు నాటిన అధికారులు



మొక్క నాటుతున్న అధికారులు, సభ్యులు

మధురవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మధురవాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో మంగళవారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. పర్సన్ ఇన్‌చార్జ్ ఎమ్.రమేష్‌బాబు, అసిస్టెంట్ కోపరేటివ్ రిజిస్ట్రార్ కె.ఎస్.వి.జి.ప్రసాద్, సంఘం ముఖ్యకార్యనిర్వాహక అధికారి ఎం.అప్పలరాజు, బ్యాంకు సభ్యులు పోతిన యల్లంనాయుడు, నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన ప్రసాద్, పిళ్లా రాము, నాగోతి శివాజీ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

వస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ నరసింహం

సింహాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహావిశాఖ 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం ప్రజారోగ్యశాఖ ద్వారా సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను మంగళవారం అందజేశారు. కార్పొరేటర్ పి.వి. జన్మదినోత్సవం సందర్భంగా సుమారు వందమంది కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసి అన్నప్రసాదాన్ని వితరణ జరిపారు. నరసింహం తొలుత సింహాద్రినాథుని దర్శించుకున్నారు.

## ఏడాదిలో ఎన్నో హామీలు అమలు చేశాం : టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి పాలనలో ఏడాది కాలంలో రాష్ట్రంలో ఎన్నో హామీలు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం అమలు చేస్తున్నవి, భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్‌ప్లాంటు వస్తుందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని అన్నారు. దీపం మూడో సిలెండర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. వైసీపీ నేతల విమర్శలను పట్టించుకోనవసరం లేదని, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఆ పార్టీ నేతలకు లేదని, ప్రజలు వైసీపీని ఛీకొట్టారని గండి బాబ్జి అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు మల్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా యూజీడీ పనులు..
# అస్తవ్యస్తంగా పరిసరాలు

- మట్టి, వ్యర్థాలు తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు
- వర్షాల నేపథ్యంలో 22వ వార్డువాసులకు తప్పని అవస్థలు

గోతులు తీసి.. మట్టిని రోడ్డు మీద వదిలేయడంతో అధ్వానంగా మారిన పిఠాపురంకాలనీ

మద్దిలపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు అనేక సమస్యలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన అండర్ డ్రైనేజీ పనులు, ఈ పనుల కారణంగా అస్తవ్యస్తంగా మారిన అనేక ప్రాంతాలు, పాడైన రహదారులు... ఇలా ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని వాపోతున్నారు. ఈ వార్డులోని పలు ప్రాంతాల్లో యూజీడీ పనులు చేపట్టి పూర్తి చేయలేదు. దీనివల్ల తాము ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడి మంగాపురం కాలనీలో నెల కిందట డ్రైనేజీ పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా గోతులు తీసి కొద్ది రోజులుగా వదిలేశారు. తర్వాత పనులు చేపట్టి డ్రైనేజీల నిర్మాణం చేసి అండర్ డ్రైనేజీ పలకలు పైకెత్తారు. దీంతో చాలా రోజులు నుంచి మంగాపురంకాలనీ, శివాజీపాలెం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అండర్ డ్రైనేజీ పలకలు పైకి ఉన్నందున కార్లు వెళ్లలేని పరిస్థితి. దీంతో శివాజీపాలెం అపార్ట్‌మెంట్లకు వెళ్లే కార్ల యజమానులు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, క్రీటౌన్, డాక్టర్స్ కాలనీ మీదుగా సుమారు 3 కిలోమీటర్లు చుట్టూ తిరిగివెళ్లాల్సి వస్తోంది.

**అధ్వానంగా పిఠాపురం కాలనీ..**

పిఠాపురం కాలనీ పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఇక్కడ డ్రైనేజీ నిర్మాణాలకు ముందుగానే గోతులు తీశారు. కళాభారతి నుంచి జాతీయ రహదారి వరకు భారీగా గోతులు తీశారు. డ్రైనేజీ పనులు చేపట్టే ముందు గోతులు తీస్తే సమస్యలు ఉండేవి కావు. ముందుగానే గోతులు తీసి మట్టిని రోడ్డుపై వేశారు. కనీసం మట్టి కూడా తరలించకుండా అక్కడే పోగులుగా వదిలేశారు. దీంతో రోడ్డు మీద రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణం పేరుతో అపార్ట్‌మెంట్లు, నివాసాల మెట్లు విరగ్గొట్టడంతో నివాసితులు వాహనాలు బయటకు తీయలేకపోతున్నారు. రాజీవ్ గృహాల ముందు రోడ్డును తవ్వేయడంతో బురద నిల్వ ఉండిపోయింది. ఏటు వెళ్లడానికి వీలులేక దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా గోతులు తీయడం వల్ల మూడు రోజుల కిందట పడిపోయిన చెట్టు, విద్యుత్ స్తంభం ఇంకా తొలగించలేదు. మట్టితో పాటు వాటిని కూడా రోడ్డుపైనే వదిలేశారు. ఎప్పుడైనా... పనులు చేపట్టే ముందు గోతులు తీసి నిర్మాణాలు చేస్తే స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవు. కానీ ఎప్పుడు పనులు చేస్తారో తెలియకుండా గుత్తేదారులు ముందుగానే గోతులు తీసి రోడ్లన్నీ అధ్వానంగా మార్చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ, వ్యూహం లేకుండా నచ్చినట్టు పనులు చేయడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిఠాపురం కాలనీ రాజీవ్‌గృహాల ముందు నిలిచిన మురుగునీరు

మంగాపురంకాలనీలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ మూతల పనులు

## పింఛన్లు పంపిణీ చేసిన జీవీఎంసీ కమిషనర్

పింఛను అందిస్తున్న జీవీఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ఎంవీపీ కాలనీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీలో మంగళవారం జీవీఎంసీ కమిషనర్ స్వయంగా పాల్గొని కొందరు లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఫిషర్‌మెన్ కాలనీలోని దివ్యాంగులు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పింఛను సొమ్మును అందించారు. ఈ ప్రాంతంలోని దివ్యాంగురాలైన చిడతా దాసమ్మకు రూ.6 వేలు, అలాగే వితంతువురాలైన దౌలపిల్లి నాగరత్నం, రాగతి చిట్టి అనే మహిళకు రూ.నాలుగువేలు చొప్పున అందించారు. లబ్ధిదారులతో కమిషనర్ మాట్లాడారు. వారి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీనే పింఛను అందించాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణిని ఆదేశించారు. ఈ వార్డులోని పలు ప్రాంతాలను పరిశీలించి, పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్య పరిస్థితి సక్రమంగా ఉండేలా చూడాలని, వీధుల్లో, రహదారులపై చెత్తాచెదారం వేసేవారికి అపరాధ రుసుంను వసూలు చేయాలని సహాయ వైద్యాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏపీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

## మోటుల వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలి

- జూ అధికారులకు రాష్ట్ర అదనపు ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే ఆదేశం

జూ అధికారులకు సూచనలిస్తున్న అదనపు ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే

ఆరిలోవ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకులు వీక్షణ అనుభవం కలిగించేలా జంతువుల ఆవరణ సుందరీకరణ చేయాలని రాష్ట్ర అదనపు ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే జూ అధికారులకు సూచించారు. మోటుల నిర్వహణ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన మంగళవారం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలను సందర్శించారు. ఈ సందర్భంగా రాహుల్ పాండు మాట్లాడుతూ ప్రతి విభాగంలోనూ అవసరమైన ఫైనెన్ క్లోజర్లు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా జూ అక్వేరియం, అడవి పిల్లుల ఎన్‌క్లోజర్ స్లాత్ బేర్ ఎన్‌క్లోజర్ సీఎస్ఆర్ నిదుల ద్వారా సుందరీకరణ చేయాలని, అంచనా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జూలో రాబోయే ప్రాజెక్టుల గురించి రాహుల్ పాండేకు జూ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన జూలో జరుగుతున్న రెల్ మంకీ, బర్డ్స్ ఆఫ్ ప్రే డక్‌ఏవియరి ఎంక్లోజర్ నిర్మాణపు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అటవీ సంరక్షణాధికారి మొహమ్మద్ దివాన్, మైథీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేటర్ జోక్యంతో నిలిచిన వ్యర్థాల తొలగింపు

వ్యర్థాలు తొలగించేందుకు వచ్చిన జీవీఎంసీ సిబ్బంది

వెంకోజీపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఇళ్ల మధ్య వ్యర్థవస్తువుల నిల్వ కేంద్రాన్ని సోమవారం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చేరుకున్నారు. ఈ వ్యర్థాల వల్ల తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామంటూ స్థానికులు జోన్-3 కమిషనర్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ వ్యర్థాల తొలగింపునకు పారిశుధ్య సిబ్బంది చేరుకోగా, ఆ స్థల యజమాని స్థానిక 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యను ఆశ్రయించాడు. ఆమె జీవీఎంసీ సిబ్బందితో మాట్లాడి ఒక రోజు సమయం కోరారు. దీంతో పారిశుధ్య సిబ్బంది వ్యర్థాలను తొలగించకుండా వెనుదిరిగారు.

## వర్షాలకు కుంగిన ఫుట్‌పాత్

ఎంవీపీ డబుల్ రోడ్డులో వర్షానికి కుంగిన ఫుట్‌పాత్

ఎంవీపీ కాలనీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్నవర్షానికి ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఓ చోట ఫుట్‌పాత్ కుంగిపోయింది. రహదారిని ఆనుకుని భూగర్భ విద్యుత్తు కేబుల్ పనులు జరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌ను ఆనుకుని కొంతమేర తవ్వడంతో మట్టి బాగా నానిపోయి జారిపోయింది. దీంతో సుమారు వంద మీటర్ల మేర ఓ పక్కకు టైల్స్ జారిపోయాయి.దీనిపై నడిచే వీలు లేకుండాపోయింది. టైల్స్ కింద భాగంలో కాంక్రీట్‌తో పక్కాగా నిర్మించాల్సి ఉంటుంది. చిన్న వర్షానికే ఇలా కుంగిపోవడంతో పలువురు పనుల్లో నాణ్యత బాగులేదని వాఖ్యానిస్తున్నారు.

## సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 42, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్ కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**
(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 585 |
| విజయనగరం | 589 |
| శ్రీకాకుళం | 589 |

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 70 |
| లైవ్ ధర | 90 |
| విత్ స్కిన్ | 150 |
| స్కిన్‌లెస్ | 160 |

## తిరుమల పుష్పయాగానికి కలువలు, తామరలు తరలింపు

పుష్పయాగానికి తరలింపునకు సిద్ధం చేసిన కలువ, తామరలు సిద్ధం చేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలోని శ్రీ గోవిందరాజు స్వామివారి పుష్పయాగానికి మంగళవారం విశాఖ నుంచి కలువలు, తామరలు పంపించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విశాఖలోని వేంకటేశ్వరస్వామి భక్తులు హిమాంశు ప్రసాద్‌కు వచ్చిన లేఖ మేరకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణమండపం వద్ద మూడు వేల కలువ పూలు, రెండు వేల తామరలు సిద్ధం చేసి తిరుపతి పంపించారు.

కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు

వెంకోజీపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు ప్రభావవంతంగా పని చేస్తున్నాయని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు వారాల వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ శరవేగంగా మార్పు చెందుతున్న సాంకేతికతలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి తరం సాంకేతికత యుగంలో ప్రయాణిస్తోందని అనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల నూతన జ్ఞానాన్ని అందించడం, జ్ఞానాన్ని పెంపొందించడం సాధ్యపడుతుందని తెలిపారు. దేశంలో ఉన్న అత్యుత్తమ వర్సిటీలో ఒకటిగా ఏయూ నిలుస్తోందని చెప్పారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతా మాణిక్యం మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలకు తమ కళాశాల విద్యార్థులకు సైతం అవకాశం ఇవ్వాలని కోరారు. అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో యువతకు ఉపయుక్తంగా నిలిచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడాన్ని ప్రశంసించారు. అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన నైపుణ్యాలను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి నిర్వహించామన్నారు. విద్యార్థులు చదువుతూ తమ స్వశక్తితో ఎదిగే విధంగా ఈ శిక్షణ కార్యక్రమం నిలిచిందని చెప్పారు. రెండు వారాల శిక్షణ ముగించుకున్న విద్యార్థులు సొంతంగా వెబ్ డిజైనింగ్ చేసే సామర్థ్యాన్ని పొందారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 55 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

## వర్షాలతో పర్యాటక ప్రాంతాలు వెలవెల

సందర్శకులు లేక వెలవెలబోతున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్, జూలై1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. రుషికొండ బీచ్‌కు నిత్యం వేలాది మంది సందర్శకులు వస్తుండగా సాగర్‌నగర్, తదితర బీచ్‌లను కాస్త తక్కువ సంఖ్యలో ప్రతి రోజు సందర్శిస్తుంటారు. సందర్శకులు ఎక్కువగా ఉంటే రుషికొండ బీచ్‌లో వ్యాపారాలు బాగా సాగుతుంటాయి. సందర్శకులు రాకపోవడంతో బీచ్ వెలవెలబోవడంతో వ్యాపారులు ఆందోళనచెందుతున్నారు. వర్షంతో పాటు ఈదురు గాలులు వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు సాధారణంకంటే అధిక ఎత్తులో ఎగసిపడుతున్నాయి. ఇదే వాతావరణం మరో రెండు రోజులు కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

వారాహీ మాత అవతారంలో
## భూలోకమాత


వారాహిమాతగా ప్రత్యేక పూజలు అందుకుంటున్న భూలోకమాత

ఎంవీపీ కాలనీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని పదకొండో సెక్టరులో ఉన్న భూలోకమాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వారాహీ అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలకు సమీప ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

## తల్లీకుమార్తె అదృశ్యం

ఎంవీపీ కాలనీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తల్లీ కుమార్తెలు అదృశ్యంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శివాజీపాలెం ఆరు కుళాయిల కూడలిలో నివాసం ఉంటున్న బమ్మిడి లక్ష్మి (42), కుమార్తె బమ్మిడి సాయి మధులత (20) సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచి కనిపించడం లేదని కుమారుడు బమ్మిడి అవినాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా తన నాన్నమ్మకు, తల్లికి మధ్య ఆర్థిక వ్యవహారాల్లో వివాద ఉన్నట్టు ఫిర్యాదులో అవినాశ్ పేర్కొన్నారు. పలు చోట్ల వెతికినా, బంధువుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్టు ఫిర్యాదుదారుడు పేర్కొన్నాడు. హెడ్ కానిస్టేబుల్ నూకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'రక్తదానానికి యువత ముందుకు రావాలి'

రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు

సిరిపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని రక్త నిల్వలు ఎంతో అవసరమని ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్.అంజిరెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం సిరిపురంలోని మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఛార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని చేపట్టడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందన్నారు.ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు సహకారంతో మాస్టర్‌మైండ్స్ సీఏ విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి, సభ్యులు, అకడమిక్ ప్రిన్సిపాల్ ఎస్.దినేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా పైడిమాంబ అమ్మవారి పండుగ

ఆరిలోవ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దీన దయాళ్‌పురంలో వెలసిన గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గౌతమీ సేవా సంఘం అధ్యక్షుడు యల్ల మల్లి సురేష్, కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఉత్సవాలను చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుమారు 60 రకాల పిండివంటలతో సారెను అందించారు. మంగళవారం ఉదయం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ 13 వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, 13వ వార్డు తెలుగుమహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

మహారాణిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల నుంచి మద్యం, డబ్బులు తీసుకున్న కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. వన్‌టౌన్‌లో కానిస్టేబుల్ అప్పల కొండ, ఇద్దరు హోంగార్డులు మద్యం షాపుల వద్దకు వెళ్లి అక్రమం గా మద్యం సీసాలు ఉన్నాయని బెదిరించి వారి వద్ద నుంచి మద్యం సీసాలు, డబ్బులు తీసుకున్నారు. ఈ విషయమై షాపు నిర్వాహకులు జూన్ 24న పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ చేయించిన విచారణలో వీరు అక్రమానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

## బెల్ట్‌షాపు నిర్వాహకుడు అరెస్టు

**16 మద్యం బాటిల్స్ స్వాధీనం**

భీమునిపట్నం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడలో పాన్‌షాపులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న జీరు రమణ రాజయ్య (60)ను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్ఐ జి. హరీష్ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి పైన్‌షాపుపై దాడులు నిర్వహించగా, నిందితుడు రాజ్యా వద్ద 16 విస్కీ బాటిల్స్ లభించాయి. అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తున్నాడని పోలీసులు తెలిపారు. భీమిలి పోలీసు సీఐ తిరుమల రావు ఆదేశాలతో నిందితుడిని ఎక్సైజ్ చట్టం ప్రకారం అరెస్టు చేసినట్టు తెలిపారు. కేసును ఎస్ఐ హరీష్ ధర్యాప్తు చేస్తున్నారు.

## గిరి ప్రదక్షిణకు 120 ప్రత్యేక బస్సులు

సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, జులై1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరగనున్న సింహగిరి ప్రదక్షిణకు 120 ప్రత్యేక బస్సులు నడపాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఆర్ఎం కార్యాలయంలో మంగళవారం ఆయన రీజియన్‌లో డిపో మేనేజర్లు అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాలు కల్పించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. సింహాచలం కేంద్రంగా బస్సులు నడపాలని, ఫిట్‌గా ఉన్న బస్సులను వినియోగించాలన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.రాజశేఖర్, డిపోమేనేజర్లు గంగాధర్ (విశాఖపట్నం), సుధాకరరావు (వాల్తేరు), శరత్‌బాబు (సింహాచలం), గౌతమ్ చటర్జీ (స్టీల్ సిటీ), పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వంశీమోహిని, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి'

మహారాణిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీలో ప్రత్యేక స్థానం, గుర్తింపు లభిస్తుందని ఏపీసీసీ స్పోర్ట్సు విభాగం చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ అన్నారు. మంగళవారం జగదాంబ జంక్షన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలకు తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగాచేసేందుకు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు వర్మ, గాదెం మహేష్, కె.వి.సూర్యనారాయణ, కస్తూరి వెంకటరావు, చెన్నా అప్పారావు, ప్రియాంక, వెంకటరమణ పాల్గొన్నారు.

## 5, 6 తేదీల్లో మాస్టర్స్ ఓపెన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్

క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మాధవధార, జూలై 1 ( ఆంధ్రజ్యోతి): శ్రీలంకలోని దియాగామా ప్రాంతం మహీంద్ర రాజపక్సే స్టేడియంలో జూలై 5, 6 తేదీల్లో ఇంటర్నేషనల్ మాస్టర్స్ ఓపెన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు ఇండియా టీమ్ మేనేజర్ మంగప్రసాద్ తెలియజేశారు. ఈ పోటీల్లో 210 మంది పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడా వేదికపై వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం అధ్యక్షుడుగా ఉన్న తాను టీమ్ మేనేజరుగానూ వ్యవహరిస్తానని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం వెటరన్ అసోసియేషన్ విశాఖ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, కార్యదర్శి ఎల్.సుధాకర్‌లు మురళీనగర్ కార్యాలయంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, దుస్తులను అందజేశారు. చాంపియన్‌షిప్‌లో మెరుగైన ప్రతిభ కనబర్చే విధంగా కృషి చేయాలని క్రీడాకారుల్ని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ యూత్ చైర్‌పర్సన్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## భద్రతపై సమీక్షించండి

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం పాశమైలారంలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో కార్మికులు మరణించిన నేపథ్యంలో విశాఖ జిల్లాలో ఫ్యాక్టరీస్ విభాగం అప్రమత్తమైంది. జిల్లాలో ప్రమాదకరమైన పరిశ్రమలతో పాటు ఫార్మా కంపెనీలన్నీ అత్యవసరంగా భద్రతా కమిటీలతో సమావేశం నిర్వహించి, గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలపై నివేదిక పంపాలని విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశించారు. ఆ సమావేశాల్లో చర్చించిన అంశాలు, రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక రెండు రోజుల్లో సమర్పించాలని కోరారు. అదే విధంగా అవసరమైన సంస్థలన్నీ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఇవన్నీ తక్షణమే చేయాలని, నిర్లక్ష్యం తగదని పేర్కొన్నారు.

## లలితా పారాయణం

పారాయణం చేస్తున్న మహిళలు

కంచరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కంచరపాలెం గ్రామ దేవత కుంచుమాంబ ఆలయంలో మహిళలు మంగళవారం సామూహిక లలితాపారాయణం చేశారు. పారాయణం, కోలాటంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో భక్తులకు శ్రీరామసేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు చైతన్య శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణ జరిగింది. శ్రీరామ సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు కోలాటం కర్రలు

కర్రలు అందిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు మంగళవారం కోలాటం కర్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి మాట్లాడుతూ సాంప్రదాయకతను విద్యార్థులకు తెలియజేస్తామన్నారు. కోలాటం వల్ల శారీరక, మానసిక వ్యాయామం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, విశ్వనాథం, కిశోర్, ప్రభాకర్, అప్పారావు, నిర్మల, గ్లోరీ, పీడీ ఎం.జ్యోతి పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఉన్నందున ఆ రెండు ప్రాంతాల్లో తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఆ రెండు రోజుల్లో మద్యం దుకాణాలను మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. సింహాచలం కొండపై ముందుజాగ్రత్త చర్యగా అగ్నిమాపక దళం, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అలసిన భక్తులు విశాంత్రి తీసుకోవడానికి హోల్డింగ్ పాయింట్లను పెట్టాలన్నారు. దారిపొడవునా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర సేవల కోసం 'అస్త్రం' యాప్ ఉపయోగించుకోవాలని విస్తృత ప్రచారం చేస్తామని సీపీ శంఖబ్రత బాగ్చీ చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టడానికి అనుమతులు ఇవ్వాలని, వారి కౌంటర్లు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, భీమిలి ఆర్డీఓ సంగీత్ మాథుర్, జీవీఎంసీ, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

▸ఎంపీ శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ల ఉద్ఘాటన

42వ వార్డులో పింఛన్ అందిస్తున్న ఎంపీ శ్రీభరత్

అక్కయ్యపాలెం/అల్లిపురం/సీతమ్మధార/మురళీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం వారు వివిధ ప్రాంతాల్లో పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూ కాలనీలోని ఇందిరానగర్‌లో ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడి చేతికి పింఛన్ అందేలా అధికారులు శ్రద్ధ వహించాలని చెప్పారు. అధికారులు ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్,

జోన్-4 పరిధిలో దివ్యాంగునికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

నాయకులు అకిరెడ్డి జగదీష్, షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు నక్కవానిపాలెం, క్రాంతినగర్ ప్రాంతాల్లో వార్డు అధ్యక్షురాలు బర్లా పద్మలత ఆధ్వర్యంలో ఎంపీ శ్రీభరత్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి గడగడపకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. తమకు పింఛన్లు రాలేదని 34, 42 వార్డులలోని పలువురు వృద్ధులు, వితంతువులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని ఎమ్మెల్యే వారికి తెలియజేశారు. జోన్-4 పరిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసిన సందర్భంగా కొందరు సమస్యలు ప్రస్తావించారు. జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఏపీడీ పద్మావతి, ఏఎంహెచ్‌ఓ కృష్ణంరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. గ్రేటర్ 45వ వార్డు సోనియాగాంధీ నగర్‌లో దివ్యాంగులు, వితంతువులకు బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక పింఛన్లను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు సూచన మేరకు 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కలిసి సీతంపేట, రాధాకృష్ణ మందిరం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు. జోరుగా వాన కురుస్తున్నా సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను మొత్తాల్ని అందజేశారు. మాధవధారలో బృందావన్ సచివాలయ పరిధిలో అడ్మిన్ సెక్రటరీ రాజేష్, నరేంద్రలతో కలసి 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్ పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని 17 సచివాలయ పరిధిలో దాదాపు 2,100 మందికి నగదు అందజేశారు.

# ఏడాదిలో ఎన్నో హామీల అమలు

▸ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి పాలనలో ఏడాది కాలంలో రాష్ట్రంలో ఎన్నో హామీలు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం అమలు చేస్తున్నవి, భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ వస్తుందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని అన్నారు. దీపం మూడో సిలెండర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. వైసీపీ నేతల విమర్శలను పట్టించుకోనవసరం లేదని, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఆ పార్టీ నేతలకు లేదని, ప్రజలు వైసీపీని ఛీకొట్టారని గండి బాబ్జీ అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు మల్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### దక్షిణ నియోజకవర్గంలో..

దక్షిణ నియోజకవర్గం నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ సమావేశమయ్యారు. బుధవారం నుంచి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. ఈ ఏడాది సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఏఐఐఈఏ కృషితోనే ఉద్యోగులకు పింఛన్ హక్కు'

సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్

డాబాగార్డెన్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఎల్ఐసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఐఈఏ ప్రతినిధులు మాట్లాడుతూ 1956లో భారతీయ జీవిత బీమా సంస్థ ఆవిర్భవించడానికి అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. బీమా రంగంలో ప్రాథమిక హక్కులైన వేతనం, ఉద్యోగ భద్రత, భవిష్య నిధి, గ్రాట్యుటీ, సెలవులు, అనారోగ్య సెలవులు వంటి వాటి కోసం నిరంతర పోరాటాలు చేసిన ఘనత ఏఐఐఈఏకు దక్కుతుందన్నారు. ఉద్యోగులకు పింఛన్ హక్కును సాధించి చారిత్రక విజయాన్ని అందించిందన్నారు. సరోజ్ చౌదరి, మన్‌చందా, చంద్రశేఖర్ బోస్, సునీల్ మైత్రా, ఆర్‌పీ మన్‌చందా, ఎన్.ఎం.సుందరం వంటి మహోన్నత నేతలు ఏఐఐఈఏ ద్వారా వెలుగులోకి వచ్చారన్నారు. వారి నాయకత్వంలో ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఐఈఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాద్, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

## వసూళ్లకు పాల్పడిన కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

మహారాణిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల నుంచి మద్యం, డబ్బులు తీసుకున్న కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. వన్‌టౌన్‌లో కానిస్టేబుల్ అప్పలకొండ, ఇద్దరు హోంగార్డులు మద్యం షాపుల వద్దకు వెళ్లి అక్రమంగా మద్యం సీసాలు ఉన్నాయని బెదిరించి వారి నుంచి మద్యం సీసాలు, డబ్బులు తీసుకున్నారు. ఈ విషయమై షాపు నిర్వాహకులు జూన్ 24న పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ చేయించిన విచారణలో వీరు అక్రమానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

## ప్రతిభ చూపిన రైల్వే సిబ్బందికి సన్మానం

సన్మానం పొందిన ఉద్యోగులతో డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలో నిరుడు జరిగిన నాన్ ఇంటర్ లాకింగ్ పనులను విజయవంతంగా పూర్తి చేయడంలో ప్రతిభ చూపిన సిబ్బందిని డీఆర్ఎం లలిత్ బొహ్రా మంగళవారం తన కార్యాలయంలో సత్కరించి అభినందించారు. ప్రధానంగా మార్షలింగ్ యార్డులో ఆటోమెటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, కొత్తవలస-కిరండూల్ లైను, కొరాపుట్-రాయగడ లైనులో పనులను విజయవంతంగా పూర్తి చేయడంతోపాటు డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా గూడ్స్ షెడ్‌లలో కొత్త లైనులను ప్రారంభించడంలో విశేష పనితీరును ప్రదర్శించిన డివిజనల్ ట్రాఫిక్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, టోకెన్ పోర్టర్లు, ఇతర రైల్వే సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, సీనియర్ డీవోఎం తన్మయ్ ముఖోపాధ్యాయ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైతాళికుడు చోడగిరి చంద్రరావు

మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

సీతంపేట, జులై 1 (ఆంధ్రజ్యోతి): బలమైన అంబేడ్కర్ వాద కవిత్వాన్ని చోడగిరి చంద్రరావు రాశారని, ఆయన వైతాళికుడు అని పలువురు వక్తలు కొనియాడారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో సమతా సాహితి సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ శతక కర్త చోడగిరి చంద్రరావు సాహిత్యంపై పరిచయ సభను మంగళవారం నిర్వహించారు. డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రధాన వక్తలుగా ఆర్.వేమన, నేలపూడి బాలరాజు, డాక్టర్ బండి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. పలువురు కవులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ఏపీసీసీ స్పోర్ట్సు విభాగం చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్

సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్

మహారాణిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీలో ప్రత్యేక స్థానం, గుర్తింపు లభిస్తుందని ఏపీసీసీ స్పోర్ట్సు విభాగం చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ అన్నారు. మంగళవారం జగదాంబ జంక్షన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, ఆమె సూచనల మేరకు నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పార్టీ పటిష్టానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలకు తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో వర్మ, గాదెం మహేష్, కె.వి.సూర్యనారాయణ, వెంకటరావు, అప్పారావు, ప్రియాంక, వెంకటరమణ, రామకృష్ణ, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

## సేవలతోనే గుర్తింపు

కంచరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సమయంలో అందించిన సేవలతోనే తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. కళాశాల్లో 34 సంవత్సరాలు విధులు నిర్వహించి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన జూనియర్ అసిస్టెంట్ పి.పార్వతిని ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్‌గా పార్వతి అందించిన సేవలను కొనియాడారు. కళాశాల సిబ్బంది,అధ్యాపకులు అభినందించారు.

# సమాజానికి వైద్యుల సేవలు అభినందనీయం

▸వైద్యుల దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు ప్రశంస

వైద్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.,సన్యాసినాయుడు, కె.జి.హెచ్. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, ఇతర ప్రముఖులు, నిర్వాహకులు

సీతంపేట, జులై 1 (ఆంధ్రజ్యోతి): సమాజానికి వైద్యుల సేవలు దిక్సూచి లాంటివని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అభివర్ణించారు. రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో మంగళవారం వైద్యుల దినోత్సవం నిర్వహించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.సి.రాయ్ జయంతిని డాక్టర్స్ డేగా జరుపుకొంటున్నామని, ఆయన పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా ఉంటూనే రోజూ రోగులకు వైద్య సేవలు అందించారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా బాధితులకు వైద్య సేవలు అందించిన ఘనత వైద్యులదేని, వారి సేవలు అభినందనీయమన్నారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ప్రసంగిస్తూ రోగికి ప్రేమాభిమానాలతో వైద్యం అందించాలని అన్నారు. కె.జి.హెచ్. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ సకాలంలో నాణ్యమైన వైద్యం అందిస్తే ప్రాణహాని నుంచి తప్పించవచ్చున్నారు. నిర్వాహకులు పలువురు వైద్యులను సన్మానించారు. ప్రభుత్వ ఘోషాసుపత్రి సూపరింటెండెంట్ ఉషాప్రసాద్, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ అధ్యక్షుడు ఆర్.రవికుమార్, నేత్ర వైద్యశాల ప్రొఫెసర్ జ్యోతిర్మయి, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ఏవీ రమణ, వెంకటేశ్వరరావు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొని డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మాస్టర్ ప్లాన్-2041పై సమీక్ష

(5వ పేజీ తరువాయి)

సమీక్షిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఫిర్యాదులు చేశారు. వాటిలో వేళ్లపై లెక్క పెట్టగలిగిన సంఖ్యలోనే దిద్దుబాట్లు చేసి, మిగిలినవి పక్కన పడేశారు. అత్యధికుల అభ్యంతరాలకు న్యాయం జరగలేదు.

కొత్త ప్రభుత్వం వచ్చాక వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఎక్కువగా మాస్టర్‌ప్లాన్‌పైనే ఫిర్యాదులు రావడంతో ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లారు. పురపాలక శాఖ మంత్రి నారాయణతో చర్చించి మాస్టర్ ప్లాన్-2041పై మళ్లీ అభ్యంతరాలు స్వీకరించాలని నిర్ణయించి ఆ ప్రక్రియ ప్రారంభించారు. అయితే నగరంలో ఏ రహదారులను ఎంత మేరకు విస్తరిస్తున్నారనే విషయం చాలామందికి తెలియదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆ రంగంలో ఆసక్తి కలిగిన ప్రజా ప్రతినిధులు మాత్రమే పూర్తి వివరాలు తెలుసుకొని వారి పనులు పూర్తి చేసుకోగలిగారు. ఇప్పుడు ప్రభుత్వం మరోసారి అభ్యంతరాలకు అవకాశం ఇచ్చినందున ఎక్కడెక్కడ ఏయే మార్పులు జరుగుతున్నాయో ప్రజలకు తెలియజేయాలని పలువురు డిమాండ్ చేయడంతో వీఎంఆర్‌డీఏ అధికారులు మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో కార్పొరేటర్లకు కూడా ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

### పారదర్శకంగా మాస్టర్ ప్లాన్ మార్పులు

గత ప్రభుత్వంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో తప్పులు అనేకం ఉన్నందునే సవరించడానికి ఈ ప్రక్రియ ప్రారంభించాం. దీనిని 100 శాతం పారదర్శకంగా నిర్వహించి, వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని పరిశీలించి సమాధానం ఇస్తాం. ఎక్కడా మళ్లీ తప్పులు జరగకుండా చూస్తాం.

-ఎంవీ ప్రణవ్‌గోపాల్, ఛైర్మన్, వీఎంఆర్‌డీఏ

### ఏడుగురితో టెక్నికల్ కమిటీ

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041పై వచ్చే అభ్యంతరాలను పరిశీలించి, మార్పులు, చేర్పులు చేయడానికి ప్రభుత్వం సీఆర్‌డీఏ కమిషనర్ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో జీవీఎంసీ కమిషనర్, డీటీసీపీ డైరెక్టర్, ఏయూ ప్రొఫెసర్, తదితరులు ఉంటారు.

### లైన్ విభాగాల మార్పులకూ అవకాశం

మాస్టర్ ప్లాన్ ఆమోదించిన తరువాత ఈ మూడేళ్లలో రెవెన్యూ అధికారుల రీ సర్వే, ఏపీఐఐసీ కొత్త లేఅవుట్లు, జీవీఎంసీ, ఆర్ అండ్ బి, రైల్వే, నేషనల్ హైవే అథారిటీ తీసుకున్న కొత్త నిర్ణయాలను కూడా పొందుపరుస్తాం.

శిల్ప, సీయూపీ, వీఎంఆర్‌డీఏ

## తేలిన ఇంజనీరింగ్ సీట్ల లెక్క

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. మరో 22 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లలో 2025-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు నిర్వహించుకునేందుకు ఉన్నత విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. గడిచిన ఏడాదితో పోలిస్తే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది 18,090 సీట్లకు మాత్రమే ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది ఈ సీట్ల సంఖ్య 20 వేలు దాటింది. గత ఏడాదితో పోలిస్తే 2,370 సీట్లు పెరిగాయి. ఏయూలో గడిచిన ఏడాది 900 సీట్లలో ప్రవేశాలకు ఏఐసీటీఈ అనుమతి ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్య 1,020 సీట్లకు పెరిగింది. అంటే 120 సీట్లు పెరిగాయి. అలాగే, గడచిన ఏడాది 21 ప్రైవేటు కాలేజీల్లో 17,190 సీట్లు ఉండగా, ఈ ఏడాది మరో కాలేజీ పెరిగింది. మొత్తం 22 కాలేజీల్లో 19,440 సీట్లు ఉన్నట్టు వెల్లడించింది. గడిచిన ఏడాదితో పోలిస్తే 2,250 సీట్లు పెరిగాయి. ఈ నెలాఖరుకు తొలి దశ ప్రవేశాలు పూర్తిచేయాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

## నగరంలో విస్తరించే రహదారులు

5వ పేజీ తరువాయి

బ్యాచ్ భారీ భవనాల నిర్మాణాలకు అనుకూలంగా మార్పులు చేయించుకున్నారు.

- భీమిలి మండలం దొరతోట రహదారి ప్రస్తుతం 24 మీటర్ల నుంచి 30 మీటర్ల వరకు ఉండగా దానిని డబుల్ అంటే 60 మీటర్లకు ప్రతిపాదించారు. ఈ మార్గంలో ఎక్కువ రైతుల భూములు ఉన్నాయి. వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.
- రైల్వే ఆస్పత్రి నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వరకు 30 మీటర్ల రహదారిని 45 మీటర్లకు విస్తరిస్తారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని దీనిని ప్రతిపాదించారు.
- అక్కయ్యపాలెం జంక్షన్ నుంచి రైల్వే న్యూకాలనీ వరకు 18 మీటర్ల రహదారి ఉండగా దానిని 30 మీటర్లకు పెంచుతారు.
- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం మీదుగా మద్దిలపాలెం జంక్షన్ వరకు ప్రస్తుతం 18 మీటర్లు ఉండగా దానిని 30 మీటర్లు చేస్తారు.
- చావులమదుం జంక్షన్ నుంచి ఎల్ఐసీ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వరకూ ప్రస్తుతం రహదారి 18 నుంచి 24 మీటర్లు ఉండగా దానిని 45 మీటర్లు చేస్తారు.

## రౌడీషీటర్ ఎల్లాజీ హత్య

(5వ పేజీ తరువాయి)

ఇవ్వడానికి నిరాకరించడంతో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో ఎల్లాజీ తన జేబులో ఉన్న చాకుతీసి నరసింహమూర్తి, గణేష్‌ను చంపేస్తానని బెదిరించాడు. దీంతో గణేష్ కర్రతో ఎల్లాజీని తలపై కొట్టగా, నరసింహమూర్తి తన చేతిలో ఉన్న గడ్డపారతో ఎల్లాజీ తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో నక్కిన యేసు కూడా వారిపై దాడికి యత్నించడంతో అతడిని కూడా గడ్డపారతో కొట్టడంతో తలకు గాయమైంది. మిగిలిన ఇద్దరు అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిని యేసుని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై కంచరపాలెం పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలావుండగా హత్యకు గురైన ఎల్లాజీ గత నెల 23న జైలు నుంచి విడుదల కావడం విశేషం. హత్య జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

## మురుగుతున్న కాలుష్య నియంత్రణ నిధులు

(5వ పేజీ తరువాయి)

నిధులు మురుగుపోతున్నాయని తేల్చింది. గణాంకాలు పరిశీలిస్తే ఇచ్చిన నిధుల్లో రూ.39.53 కోట్లు మాత్రమే వాడుకున్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో 2024 ఏప్రిల్ నుంచి కొత్త నిధులు ఇవ్వడం మానేసింది. ఈ నిధులు వ్యయం కాకపోవడానికి అన్ని కారణాలు ఉన్నాయని అధికార వర్గాలు ఆరోపిస్తున్నాయి.

విశాఖపట్నంలో సింహభాగం కాలుష్యం పరిశ్రమలదే. విశాఖపట్నం పోర్టు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, కోరమండల్, స్టీల్ ప్లాంటు ద్వారా వచ్చే కాలుష్యాన్ని వారే నియంత్రించాలి. ప్రత్యేక చర్యలు చేపట్టాలి. దీనిని కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షించాలి. ఇక వాహనాలు, రహదారులు, భవనాల నిర్మాణం వచ్చే ధూళిని తగ్గించి గాలి నాణ్యత పెంపొందించాల్సి ఉంది. దీనికి ఎక్కడికక్కడ పరికరాలు పెట్టి అక్కడి గాలి నాణ్యత తెలిపే బోర్డులు ఏర్పాటుచేసినా సక్రమంగా పనిచేయడం లేదు.

ఇక నగరంలో వ్యర్థాలు కాలుష్యం సృష్టించకుండా జీవీఎంసీ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. దీనికి వారు వేస్ట్ ఎనర్జీ ప్లాంటు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, బయో మైనింగ్ వంటి ప్రాజెక్టులు చేపట్టి కొంతవరకు ఫలితాలు సాధిస్తున్నారు. చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం సీఎంఎఫ్ఎస్ నుంచి సకాలంలో విడుదల కావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల నిధులు వాడేసుకోవడంతో వారికి అవసరమైనప్పుడు విడుదల చేయలేకపోయింది. దాంతో బిల్లులు అందక కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు. దాంతో ఆ తరువాత చేపట్టాలనకున్న పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సకాలంలో సమర్పించలేదని కేంద్ర ప్రభుత్వం ఆ తరువాత నిధులు ఇవ్వడం ఆపేసింది. వైసీపీ ప్రభుత్వం చేసిన పని వల్ల విశాఖకు కేటాయించిన నిధులు వినియోగించుకోలేని దుస్థితి ఎదురైంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించకుండా స్థానిక అధికారుల అలసత్వంగా పేర్కొనడమే అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి విశాఖలో కాలుష్యం తగ్గించడానికి నిధులు విడుదల చేయాల్సి ఉంది.

## మలేరియా పోస్టుల కోసం ఎమ్మెల్యేల పేచీ

(5వ పేజీ తరువాయి)

మేయర్ పీలా శ్రీనివాసరావు...ఒక్కో కార్పొరేటర్‌కు మూడేసి, ఎమ్మెల్యేలకు పదేసి పోస్టుల చొప్పున పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించారు. కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తమ కోటాలో ఎవరికి అవకాశం ఇవ్వాలనే జాబితాను ప్రజారోగ్య విభాగం అధికారులకు అందజేయాలని ఆయా జోన్‌ల ఏఎంహెచ్‌ఓల ద్వారా సమాచారం పంపించారు. కొంతమంది కార్పొరేటర్లు తమ వంతుగా ముగ్గురు పేర్లను పంపించేయడంతో వారంతా ఈనెల ఒకటి నుంచి విధుల్లో చేరిపోయారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా తమ కోటాలో ఎవరిని నియమించాలనేది సూచిస్తూ జాబితాలను పంపించేశారు. కానీ కొందరు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు మాత్రం తమకు కేటాయించిన పోస్టులు సరిపోవని, తమ అనుచరులు, పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది కాబట్టి కోటాను పెంచాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. కార్పొరేటర్లకు ఏదోలా నచ్చజెప్పిన అధికారులు, ఎమ్మెల్యేల విషయంలో మాత్రం ఎదురు మాట్లాడలేకపోతున్నారు. ఒక ఎమ్మెల్యే 43 మంది పేర్లతో జాబితాను మేయర్‌తోపాటు ప్రజారోగ్య విభాగం అధికారులకు పంపించారు. మరో ఎమ్మెల్యే 32 మందితో, ఇంకో ఎమ్మెల్యే 28 మందితో కూడిన జాబితాలను అధికారులకు పంపించారు. వారందరికీ అవకాశం కల్పించలేమని అధికారులు అంటున్నారు. ఎమ్మెల్యేలు చెప్పినట్టు చేయకపోతే తమ పోస్టింగ్‌కు ముప్పు వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైపోయినా సరే మలేరియా కార్మికుల సేవలను అందుబాటులోకి తెచ్చుకోలేకపోతున్నామని, దీని ప్రభావం జ్వరాల వ్యాప్తిపై పడుతుందని అధికారులు పేర్కొంటుండడం విశేషం. ఐదు నెలలు మాత్రమే పనిచేసే తాత్కాలిక కార్మికుల పోస్టుల కోసం పంతాలకు పోవడం ఎమ్మెల్యేలకు సరికాదని, నగరవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వేగంగా కార్మికులను తీసుకునేందుకు సహకరించాలని కోరుతున్నారు.

ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా రథాలమ్మ ఉత్సవాలు

కూర్మన్నపాలెం,జూలై 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డులో ఆరాధ్య దైవం రథాలమ్మ అమ్మవారి మారు వారం పండుగ మంగళవారం కణితి గ్రామ ఆలయకమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## ఉక్కు ఆస్పత్రిలో సేవలు మెరుగుపర్చాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగు పరచాలని ఉక్కు కార్మిక సంఘం నాయకులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఉద్యోగులు వీఆర్‌ఎస్, పదవి విరమణ చేయడంతో చాలా వరకు వైద్య సేవలు తగ్గిపోయాయని కార్మిక నాయకులు పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని అన్నారు.

## 6న అన్న కూటోత్సవం

అక్కిరెడ్డిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై వెంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 6న అన్న కూటోత్సవం (తిరుప్పావడ సేవ) నిర్వహించనున్నామని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కంకిపాటి పద్మావతి తెలిపారు. దేవస్థానంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కూటోత్సవ కరపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాడ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ నిర్వహించనున్నామని తెలిపారు.

## డెంగ్యూ నివారణ మాసోత్సవాలు ప్రారంభం

ప్రతిజ్ఞ చేస్తున్న మలేరియా విభాగ ఉద్యోగులు

మల్కాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం మహాత్మగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో జాతీయ డెంగ్యూ ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడువార్డుల మలేరియా విభాగం ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలై 1వ తేది నుంచి 31వ తేది వరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో డెంగ్యూ ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం డెంగ్యూ ఇన్‌ఫెక్షన్ విపరీతంగా పెరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో మలేరియా ఉద్యోగులతో ఆయ న ప్రతిజ్ఞ చేశారు.

## సినిమా గైడ్

● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),

● **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,

● **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,

● **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 42, దొండకాయలు 38, బంగాళ దుంపలు 18, అరటికాయ 10, మునక్కాడలు (కిలో) 90, అల్లం 50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి 90, కొబ్బరికాయ 24, బీన్స్ (పెన్సిల్) 95, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ 40, చేమదుంపలు 32, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 585 |
| విజయనగరం | 589 |
| శ్రీకాకుళం | 589 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 70 |
| లైవ్ ధర | 90 |
| విత్ స్కిన్ | 150 |
| స్కిన్‌లెస్ | 160 |

# దిక్కుతోచని స్థితిలో ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

» దఫదఫాలుగా తొలగించిన యాజమాన్యం

» తిరిగి విధుల్లోకి తీసుకుంటారనే ఆశతో జీవనం

» ఆందోళనలు చేపట్టినా కనిపించని స్పందన

ఉక్కుటౌన్‌షిప్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి దిక్కుతోచని స్థితికి చేరింది. ఇటీవల ఉన్న ఫళంగా దఫదఫాలుగా పలువురిని తొలగించడంతో కుటుంబాలతో సహా రోడ్డున పడ్డారు. దీంతో ప్రతిరోజూ కాంట్రాక్టర్ల చుట్టూ తిరగడంతో పాటు, ఉక్కు ప్రధాన గేటు వద్ద పడిగాపులు పడుతున్నారు. యాజమాన్యం తమను మళ్లీ విధుల్లోకి తీసుకుంటుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.స్టీల్‌ప్లాంటులో సుమారు 12 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తుంగా, వారిలో 1,750 మందిని మార్చి నెలలో తొలగిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత దపదపాలుగా మరో 1,500 మంది కార్మికులను తొలగించింది. అంతేకాకుండా టెండర్ గడువు పూర్తైన కాంట్రాక్టర్‌లకు తిరిగి పునరుద్ధరించకపోవడంతో సుమారు 700 మంది కార్మికులు విధులకు దూరమయ్యారు.

**కార్మిక నేతలపైనే ఆశ...**

ఈ నేపథ్యంలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పనిచేస్తున్న వారిని తొలగించవద్దని పేర్కొంటూ అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు ఉక్కు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా నిరవధిక సమ్మెకు కూడా దిగారు. అయినప్పటికీ యాజమాన్యం కనీసం స్పందించలేదు. సరికదా మరింత మంది కార్మికులను తొలగించే చర్యలు చేపడుతోంది. అయితే వారందరినీ మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కార్మిక నాయకులు యాజమాన్యాన్ని కోరడంతో కార్మికుల్లో ఆశలు రేకెత్తాయి. దీంతో ప్రతి రోజు కాంట్రాక్టర్ వద్దకు, స్టీల్‌ప్లాంట్ గేట్ల వద్దకు చేరుకొని తమను విధుల్లోకి తీసుకుంటారేమోనని ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో యాజమాన్యం కార్మికుల సంఖ్యను మరింతగా తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఇప్పటికే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునే అవకాశాలు కనిపించడం లేదని కొంతమంది కార్మిక నాయకులు చెబుతుండడంతో ఎటూ పాలుపోని స్థితిలో కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» పింఛన్లు పంపిణీ చేసిన నేతలు

గాజువాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 73వ వార్డులో పింఛన్ల పంపిణీని ఆయన మంగళవారం ప్రారంభించారు. ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతో చేస్తోందని, రాష్ట్ర ప్రగతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జోనల్ కమిషనర్ శేషాద్రి, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమానికి పెద్ద పీట : పి. గణబాబు**

**సింధియా:** జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి. గణబాబు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక సమస్యలున్నా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని, ప్రతి నెల క్రమం తప్పకుండా ఒకటవ తారీఖున పింఛన్లు అందిస్తూ లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 5 కమీషనర్ రాము, సచివాలయం సిబ్బంది, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ ఆర్‌పీ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివారావు, పి.గణబాబు

## వార్డులో సమస్యలు పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 68 వార్డులో కాలుష్య సమస్యతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ కార్గ్‌కు వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష కోరారు. మంగళవారం నగరంలో కమీషనర్‌ను కలిసి తమ వార్డులో ఉన్న సమస్యల గురించి వివరించారు. వీటితో పాటు అక్కిరెడ్డి పాలెం, గుడివాడ అప్పన్న కాలనీల ప్రధాన రహదారుల, కాలువలను మరమ్మతులు చేయాలని కోరారు.

కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష

## పైడిరాజు సేవలు ఆదర్శం: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డులో 40 ఏళ్లపాటు శానిటేషన్ విభాగంలో సేవలు అందించిన పైడిరాజును రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి. గణబాబు మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైడి రాజు శానిటేషన్ విభాగంలో మేస్త్రిగా సేవలు అందించి అందరి మెప్పు పొందారని తెలిపారు. ఆయన శేష జీవితం సంతోషంగా సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుమాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరీ, వార్డుటీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పొత్తబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిరాజును సన్మానిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

# వర్షంతో బురదమయంగా మారిన రోడ్లు

గాజువాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలతో పాటు మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి గాజువాక ప్రాంతంలో పలు రోడ్లు వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. రోడ్లన్ని బురదమయం కావటంతో దారిన పోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో పనులమీద బయటకు వెళ్లినవారు ఇబ్బందులు పడ్డారు. రోడ్లమీద ఎక్కువ గుంతలు ఏర్పడడంతో వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీరు సులువుగా గెడ్డల నుంచి పోయేందుకు జోనల్ సిబ్బంది చర్యలు చేపడుతోంది.

**ప్రయాణానికి కష్టంగా ఉంది**

**పెదగంట్యాడ:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పెదగంట్యాడ పారిశ్రామిక వాడలోని పలు రోడ్లు బురదమయంగా మారాయి. ఈ రోడ్ల మీద నుంచి భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్లన్ని ఇలా గుంతలమయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో అవి ఇంకా అధ్వానంగా మారాయి. అండర్ గ్రౌండ్ ఎల్రక్టికల్ లైన్లు వేసేందుకు తవ్విన కారణంగా మరికొన్ని రోడ్లు దెబ్బతిన్నాయి. పారిశ్రామిక వాడకు సంబంధించి నాలుగు ప్రధాన రహదారులు తప్ప మిగతా అన్ని రోడ్ల పరిస్థితి ఇంతే ఉంది. పరిశ్రమలకు రాకపోకలు సాగించే కార్మికులు ఆ రోడ్ల మీద ప్రయాణించడానికి బెంబేలెత్తిపోతున్నారు. ఏపీఐఐటీ అధికారులు, ఐలా పాలక వర్గం చర్యలు తీసుకొని రోడ్లను అభివృద్ధి చేయాలని స్థానికులు, పారిశ్రామికవేత్తలు కొరుతున్నారు.

బురదతో నిండిపోయిన పారిశ్రామికవాడ రోడ్డు

అధ్వానంగా జగ్గు జంక్షన్

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

గాజువాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక క్లబ్‌లో మంగళవారం నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోందని, ఈ క్రమంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహించనున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామిని ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. వైసీపీ హయాంలో గాడితప్పిన పాలనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి గాడిలో పెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలియ జేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. గాజువాకలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

# అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

వేపగుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులు హక్కుల సాధనకు జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిటూ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నాయుడు తోటలో మంగళవారం డివిజన్ 11వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు చేరుస్తున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాలను మార్చి, కార్మిక సంఘాలే లేకుండా చేస్తున్నారన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం సిటూ గోపాలపట్నం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోన్ అధ్యక్షుడిగా జె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.అనసూయ, శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకట్రావు తదితరులను ఎన్నుకున్నారు.

**కార్మిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ**

**మల్కాపురం:** దేశ వ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలనికోరుతూ వెంకన్నపాలెం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారంఅఖిలపక్ష యూనియన్ నాయకులు గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఏ ఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.సత్యనారాయణ, వైఎస్ఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆ మాట్లాడారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయవద్దని కాంట్రాక్టు కర్మికులను విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్లతో సమ్మెకు దిగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రామ, నరసింహ అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

## రామ, నరహింహ అవతారంలో జగన్నాథుడు

అగనంపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ స్వామి రథోత్సవాల సందర్భంగా స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో స్వామి వారు మంగళవారం రామా, నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. హీరా పంచమిని పురస్కరించుకుని మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని గరుడ వాహనంపై ఊరేగించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేపట్టారు. సాయంత్రం భజన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు అభినందనలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు అభినందనలు తెలుపుతున్న కార్యకర్తలు

మల్కాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ నియమితులైన సందర్భంగా పారిశ్రామిక ప్రాంతం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన ప్రమాణస్వీకారానికి అనేకమంది విజయవాడ తరలివెళ్లారు. అనంతరం వారు మాట్లాడారు. ఇప్పటికే బీజేపీ పట్ల రోజురోజుకు ప్రజలలో ఆదరణ పెరుగోతోందని భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. మాధవ్ అందరికి సుపరిచితుడేనని అందువల్ల పార్టీలో ఎక్కువ మంది చేరే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీను, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

**మాధవ్‌కు షిప్‌యార్డు యూనియన్ కృతజ్ఞతలు**

**మల్కాపురం:** రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడుగా నియమితులైన పీవీఎన్ మాధవ్‌ను షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా షిప్‌యార్డు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

## వార్డు అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలి

» జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ బొండా జగన్ వినతి

కూర్మన్నపాలెం,జూలై 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కార్పొరేటర్ బొండా జగన్ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వడ్లపూడి, కణితి గ్రామాల్లో డ్రైన్లు, రహదారులు, సెంట్రల్ లైటింగ్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమీషనర్ వడ్లపూడి నుండి గాంధీ బొమ్మ సెంటర్ కరకు తక్షణమే రోడ్ల నిర్మాణ పనులు జరిగే విదంగా చర్యలు తీసుకుంటాననీ హామీ ఇచ్చారు.

పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బొండా జగన్

## ఈ నెలలో 121 మంది ఉక్కు ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటులో 121 మంది ఉద్యోగులు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. సాధారణంగా ప్లాంటులో జూన్, జూలై నెలల్లోనే ఎక్కువగా పదవీ విరమణలు ఉంటాయి. అయితే ఈ ఏడాది జూన్‌లో రికార్డు స్థాయిలో 238 మంది పదవీ విరమణ చేయగా, ఈ నెలలో 121 మంది విధులకు దూరం కానున్నారు. ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో పాటు రానున్న రోజుల్లో రెండో వీఆర్‌ఎస్ ద్వారా మరింతమంది ఉద్యోగులు వెళ్లిపోయేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్లాంటులోని వివిధ విభాగాలు పూర్తిగా ఖాళీ కానున్నాయి.

## ఏరియా ఆస్పత్రిలో ఘనంగా 'డాక్టర్స్ డే' వేడుకలు

డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొన్న పి.గోపీకృష్ణ , వైద్యులు

అగనంపూడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో డాక్టర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి సూపరిండెంటెంట్ పి.గోపికృష్ణ డాక్టర్.బిదాన్ చంద్రరాయి చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అందరి ఆరోగ్యం బాగుండాలనే సంకల్పంతో వైద్యులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దేశేంద్ర, వైద్యులు ప్రత్యూష, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణకు 120 ప్రత్యేక బస్సులు

సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, జులై1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరగనున్న సింహగిరి ప్రదక్షిణకు 120 ప్రత్యేక బస్సులు నడపాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం ఆయన రీజియన్‌లో డిపో మేనేజర్లు అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాలు కల్పించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. సింహాచలం కేంద్రంగా బస్సులు నడపాలని, ఫిట్‌గా ఉన్న బస్సులను వినియోగించాలన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.రాజశేఖర్, డిపోమేనేజర్లు గంగాధర్ (విశాఖపట్నం), సుధాకరరావు (వాల్తేరు), శరత్‌బాబు (సింహాచలం), గౌతమ్ చటర్జీ (స్టీల్‌సిటీ), పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వంశీమోహిని, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కాఫీ ట్రయల్ అందాలను చూసొద్దాం

ప్రత్యేక ఆకర్షణగా కెనోపివాక్

- కాఫీ తోటల మధ్యలో ఉడెన్ బ్రిడ్జిపై నడవడం మరపురాని అనుభూతి
- ట్రీ డెక్, బర్డ్ నెస్ట్, ఉడెన్ వ్యూ పాయింట్లు ఏర్పాటు

అరకులోయ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అర కు నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎఫ్‌డీసీ) కాఫీ తోటల్లో ఏర్పాటు చేసిన కాఫీ ట్రయల్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అరకు అందాలను తిలకించేందుకు వచ్చే సందర్శకులకు మధురానుభూతిని కలిగిస్తుంది. కాఫీ తోటల మధ్యలో అర కిలోమీటరు పొడవున ఏర్పాటు చేసిన కెనోపివాక్ (ఉడెన్ బ్రిడ్జి) ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కెనోపివాక్‌పై నడుస్తూ కాఫీ తోటలు, సిల్వర్ ఓక్ చెట్లపై అల్లుకున్న మిరియాల పాదులను చూసి సందర్శకులు పరవశించిపోతున్నారు. రెండు, మూడుచోట్ల ఏర్పాటు చేసిన ట్రీడెక్‌లు, బర్డ్‌నెస్ట్‌లు, ఉడెన్ వ్యూపాయింట్లు మంచి అనుభూతిని కలిగిస్తున్నాయి. మంచు కురి సే సమయంలో కాఫీ ట్రయల్‌లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తుండడంతో పర్యాటకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. టికెట్ల రూపంలో ఏపీ ఎఫ్‌డీసీకి మంచి ఆదాయం వస్తోంది. ఈ కాఫీ ట్రయల్‌లో వెడ్డింగ్ షూట్, సీరియల్స్, రీల్స్ షూ టింగ్‌లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. వెడ్డింగ్ షూట్‌కు రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. కాఫీ ట్రయల్‌లో ప్రవేశానికి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20, బర్డ్ నెస్ట్‌కు రూ.100 చెల్లించాల్సి ఉంటుం ది. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శించే వీలుంది.

సుంకరమెట్ట కాఫీ ట్రయల్ ప్రవేశ మార్గం

బర్డ్ నెస్ట్‌లో సందర్శకురాలు

కెనోపివాక్ (ఉడెన్ బ్రిడ్జి)పై సందర్శకులు

ట్రీ డెక్‌పై పర్యాటకులు

## అల్లూరి జయంతిని పండగలా నిర్వహిస్తాం

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పాండ్రంగిలోని అల్లూరి జనన గృహంలో ఎమ్మెల్యే గంటా, తదితరులు

పద్మనాభం, జూలై1 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు జన్మ స్థలమైన పాండ్రంగిలో ఆయన జయంతి వేడుకలను పండగలా నిర్వహిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. పాండ్రంగిలోని మాజీ మంత్రి ఆర్ఎస్‌డీపీ అప్పలనర్సింహరాజు స్వగృహంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 4న సాయంత్రం 4 గంటలకు నిర్వహించే అల్లూరి జయంత్యుత్సవంలో పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొంటారన్నారు. టీడీపీ ప్రభుత్వం అల్లూరి జయంతిని పండగలా నిర్వహిస్తోందన్నారు. అసంపూర్తిగా ఉన్న అల్లూరి మ్యూజియం, చెరువు సుందరీకరణ, గ్రానైట్ బెంచీల ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, బుద్ధుడి విగ్రహం, విద్యుద్దీపాలంకరణ తదితర పనులు పూర్తి చేయడానికి రూ.2.5 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు తయారుచేశారు. ఈ నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయమని, పర్యాటకశాఖ అధికారులు, కాంట్రాక్టరుకు సూచించామన్నారు. పాండ్రంగిలో అల్లూరి మ్యూజియం, పద్మనాభంలోని అనంతుని ఆలయం, పొట్నూరు శ్రీకృష్ణదేవరాయుల విజయస్థూపం, పద్మనాభ యుద్ధ స్థలం, గుడిలోవ రంగనాథ స్వామి దేవాలయం తదితర ప్రాంతాలను కలిపి సర్క్యులర్ టూరిజంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందన్నారు. అనంతరం అల్లూరి జనన గృహం, అసంపూర్తిగా ఉన్న మ్యూజియం స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజనల్ డైరెక్టరు జగదీష్, అసిస్టెంట్ మేనేజరు బసంత్, జిల్లా పర్యాటకశాఖ అధికారి, మాధవి, ఎంపీడీఓ విజయకుమార్, టీడీపీ నాయకులు రమణ, నగేష్‌కుమార్, దామోదరరావు, సత్యనారాయణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌తో డీఆర్‌ఎం భేటీ

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా కార్యకలాపాల బలోపేతానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్టు) ఎ.కె.బాగ్చితో పలు అంశాలపై చర్చించారు. సరకు రవాణా, ర్యాక్ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం, ర్యాక్ డిటెక్షన్ సమయాన్ని తగ్గించడంపై సమీక్షించారు. సమన్వయంగా చేపట్టాల్సిన మార్గాలపైనా చర్చించారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు లాజిస్టిక్స్, వ్యాపారాన్ని పెంచే అవకాశాలను అన్వేషించి వాటి అమలుకు తగిన ప్రణాళికలు రూపొందించడంపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. సమావేశంలో వాల్తేరు రైల్వే డివిజన్, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుకు సమన్వయంతో పనిచేయాలి

- ప్రజారోగ్యానికి, సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- కేంద్ర సంస్థల ప్రతినిధులు, అధికారులతో సమీక్షించిన కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రజారోగ్య పరిరక్షణ తదితర అంశాల్లో కేంద్ర యాజమాన్య సంస్థలు, జిల్లా యంత్రాంగం, జీవీఎంసీతో కలిసి పనిచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సూచించారు. ఆయా సంస్థల పరిధిలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ఆయన కేంద్ర సంస్థల ప్రతినిధులతో మంగళవారం సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ, ఇతర అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా యంత్రాంగం, జీవీఎంసీ, కేంద్ర సంస్థల మధ్య సమన్వయం కొరవడకుండా ఇరువైపుల ప్రతినిధులను నియమించుకోవాలన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేంద్ర సంస్థలు జీవీఎంసీతో అనుసంధానమై పారిశుధ్యపరమైన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఆయా సంస్థల పరిధిలో ఉన్న డ్రెయిన్ల నుంచి మురుగునీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త, ప్లాస్టిక్ డబ్బాలు కాలువల్లోకి రాకుండా ఎక్కడికక్కడ మెష్‌లు ఏర్పాటుచేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రధానంగా పోర్టు, రైల్వే, ఎయిల్, ఎన్‌హెచ్‌ఏఐ, ఐఓసీఎల్, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్, గంగవరం పోర్టు పరిసరాల్లో ఉత్పన్నమవుతున్న పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆయా సంస్థల పరిధిలో సమస్యలను తెలుసుకుని సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదించాలన్నారు. ఎక్కడైనా డ్రెయిన్లు, గెడ్డలు, మురుగునీటి కాలువలు ఆక్రమణకు గురైతే యుద్ధ ప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినెలా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

### నాలుగు అంశాలపై దృష్టి సారించాలి

ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర సంస్థలు ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. కేంద్ర పరిశ్రమలు, సంస్థలు, యూనిట్ల పరిధిలో పక్కా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తరచూ పూడిక తొలగింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. పచ్చదనం పెంపుదలకు, సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యకలాపాల నిర్వహణలో జీవీఎంసీ నుంచి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో జీవీఎంసీ సీఎంవో నరేష్‌కుమార్, ఇతర అధికారులు, కేంద్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతి ప్రమోటర్స్ వార్షికోత్సవం

సీతమ్మధార, జులై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని రియల్ ఎస్టేట్ రంగంలో ప్రఖ్యాతి గాంచిన స్వాతి ప్రమోటర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వాతి సంస్థ వార్షికోత్సవంతో పాటు ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి ప్రమోటర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, సంస్థ ఛైర్మన్ స్వాతి కృష్ణారెడ్డిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాతి కృష్ణారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు, అభిమానులు

## యారాడలో జట్టీ ఏర్పాటుకు చర్యలు

- అధికారులతో గాజువాక ఎమ్మెల్యే పల్లా సమీక్ష

మత్స్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యారాడ సముద్రతీర ప్రాంతంలో జట్టీ ఏర్పాటు, బ్రేక్ వాటర్ ప్రాజెక్టుపై సోమవారం యారాడలో కేంద్ర, రాష్ట్ర మత్స్యశాఖల అధికారులతో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. గంగవరం తీరంలో పోర్టు ఏర్పాటుతో మత్స్యకారులు జీవనోపాధికోల్పోయారని, అయితే జట్టీ నిర్మాణం కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపై లోతైన అధ్యయనాలు జరుగుతున్నాయన్నారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత పోర్టు యాజమాన్యంపై ఉందని, ఈ విషయంలో ప్రభుత్వ పరంగా ఒత్తిడి తెస్తామన్నారు. యారాడ వద్ద జట్టీ, బ్రేక్ వాటర్‌కు సంబంధించి సాధ్యాసాధ్యాలపై సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీస్ (సీఐసీఈఎఫ్) బృందం ఆ ప్రాంతాన్ని తనిఖీ చేసి ప్రాజెక్టు అవసరాలను అంచనా వేసింది. మత్స్యకారులు సురక్షితమైన చేపల వేట సాగించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను పరిశీలించారు. సమీక్షలో సీఐసీఈఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ.బెల్జియప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ గోపాలకృష్ణ, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల సంఘం నేతల విజ్ఞప్తి

సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలు చొరవచూపాలని ఆ సంఘం నేతలు విజ్ఞప్తిచేశారు. సంఘ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దాల రమేష్ మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 400 మంది కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడం, రివర్స్‌టెండరింగ్‌తో అతలాకుతలమైపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారుతుందని భావించినా ఇంతవరకు సమస్యలను పట్టించుకోలేదన్నారు. రూ.450 కోట్ల బిల్లులు, రూ.8.5 కోట్లు ఈఎండీలు, ఎస్‌డీఎఫ్ బిల్లులు రూ.7.5 కోట్లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. చిన్న పనులు రద్దుచేసి రాష్ట్రస్థాయిలో ఒకే వర్కు కింద టెండరు పిలవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోందని, అలా జరిగితే చిన్నకాంట్రాక్టర్లు రోడ్డున పడతారన్నారు. యోగాంధ్ర కోసం జీవీఎంసీ షార్ట్‌టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు చేతిడబ్బులు పెట్టుకుని పనులు పూర్తిచేశారని, దీనిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సమస్యలపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేశ్, నారాయణలను కలిసి వివరిస్తామన్నారు. సమావేశంలో సంఘం కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణ మార్గంలో వసతులు కల్పించాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

సింహాచలం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సింహగిరి ప్రదక్షిణకు భక్తులకోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఈవో వేంద్ర త్రినాథరావుతో కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. సింహాచలం తొలిపావంచా, లుంబినీ పార్కు, వెంకోజీపాలెం, సీతమ్మధార, మాధవధార, ప్రాంతాలన్నింటినీ పరిశీలించి ఏర్పాట్లను తెలుసుకున్నారు. లుంబినీ పార్కు వద్ద స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేందుకుఅదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించాలన్నారు. నడకకు ఇబ్బంది లేకుండా బారికేడ్లు ఏర్పాటుచేయాలని, వ్యర్థాలు వేసేందుకు చెత్తడబ్బాలు ఉంచాలన్నారు. ఎక్కడా చీకట్లు లేకుండా విద్యుత్ దీపకాంతులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్గ సూచికలు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. తాగునీరు, వైద్యవసతి అందుబాటులో ఉంచాలన్నారు. ఈ పర్యటనలో దేవస్థానం ఈఈ సీహెచ్ వెంకటరమణ, ఏఈ రవిరాజ్, జోనల్ కమిషనర్లు బి.రాము, కె.హైమావతి, కె.శివప్రసాద్, ఎస్ఈ పీవీవీ సత్యనారాయణ, సంపత్‌కుమార్, కె.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పరిశీలనలో అధికారులతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

## క్రైం... crime news

### గెడ్డలో పడి వ్యక్తి దుర్మరణం

వడ్డికాసులు మృతదేహం

కంచరపాలెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి గెడ్డలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఊర్వశి జంక్షన్ సమీప నలందనగర్ నివాసి కట్ట వడ్డికాసులు (48) ఆటో నడుపుతూ, స్క్రాబ్ వస్తువులు కూడా అమ్మేవాడు. మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారి వద్ద గల ప్రధాన గెడ్డకు వెళ్లాడు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి గెడ్డలో మురుగు ప్రవాహం పెరగడంతో కాలుజారి పడిపోయాడు కొట్టుకుపోతూ కేకలు వేయడంతో భార్య రుక్మిణి అక్కడకు చేరుకుని చున్నీని అందించింది. అప్పటికే వడ్డికాసులు డ్రైనేజీ లోపలకు జారిపోయి, జాతీయ రహదారి కింద కాలువలో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ ఐదో జోన్ జడ్సీ రాము, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాదాపు ఆరు గంటలు గెడ్డలో పూడికలు తీసి సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు చేసిన ప్రయత్నం విఫలమై వడ్డికాసులు విగతజీవిగా మారాడు. కళ్లముందే జరిగిన ఈ ఘటనను చూసి వడ్డికాసుల భార్య రుక్మిణి కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు.

### కుప్పకూలిన వాటర్ ట్యాంకు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

శిథిలమైన ట్యాంకు (ఇన్‌సెట్‌లో) కుప్పకూలిన దృశ్యం

పెందుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న తాగునీటి పథకం వాటర్ ట్యాంకును తొలిగిస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలడంతో ఇద్దరు కార్మికులకు తీవ్రగాయలయ్యాయి. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి మండలం ముదపాక పంచాయతీ బొడ్డునాయుడుపాలెంలో వాటర్ ట్యాంకు శిథిల స్థితికి చేరింది. ఈ నేపథ్యంలో దానిని తొలగించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కాంట్రాక్టర్ ముగ్గురు కార్మికులతో పనులు చేపట్టారు. వాటర్ ట్యాంకు పైభాగంలో మూడు రంధ్రాలు పెట్టి పనులు చేస్తున్నారు. అయితే రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ట్యాంకు నానిపోయింది. దీంతో అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న దొగ్గవానిపాలేనికి చెందిన దమ్ము శ్రీను, ఆర్.శివప్రసాద్ శిథిలాల కొంద చిక్కుకున్నారు. స్థానికులు వారిని బయటికి తీసే ప్రయత్నం చేయగా అప్పటికే తీవ్రంగా గాయపడడంతో కేజీహెచ్‌కు తరలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### స్నేహితురాలే దొంగ

ఛేదించిన పోలీసులు ▸▸ 18 తులాల ఆభరణాలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపిస్తున్న క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు

పెందుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి బంగారు ఆభరణాలు కాజేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 18 తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు మంగళవారం వివరాలను వెల్లడించారు. సుజాతనగర్ సమీప విరాట్‌నగర్‌కు చెందిన రెయ్యి జ్యోతి, చినముషిడివాడ శాంతినగర్‌కు చెందిన ఎస్.వాణి కుటుంబాల మధ్య స్నేహం ఉంది. తరచూ ఒకరి ఇంటికి మరొకరు వెళ్లి వచ్చేవారు. ఈ నేపథ్యంలో గత నెలలో జ్యోతి ఇంటికి వాణి వెళ్లింది. ఆ సమయంలో జ్యోతి తన ఒంటిపై ఉన్న ఆభరణాలను తీసి పడక గదిలోని కప్‌బోర్డు లోపలి అరలో భద్రపరిచి స్నానానికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన వాణి వాటిని కాజేసింది. ఆ తరువాత ఇద్దరూ మాట్లాడుకుని అత్యవసర పని ఉందని వాణి వెళ్లిపోయింది. కాగా జూన్ 9న ఫంక్షన్‌కు వెళ్లేందుకు తయారవుతున్న జ్యోతి కప్‌బోర్డు తెరిచి చూడగా ఆభరణాల్లో కొన్ని కనిపించలేదు. వాణిపై అనుమానం రావడంతో తన భర్తకు విషయం చెప్పింది. అతడి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సూరిబాబు కేసు దర్యాప్తులో భాగంగా వాణి కదలికలపై నిఘా పెట్టారు. ఓ బ్యాంకులో వాణి బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టడాన్ని గమనించి, అవి జ్యోతి ఇంట్లో చోరీకి గురైనవిగా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. ఆమె నుంచి 228.73గ్రాముల (18 తులాలు) బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

### చురుగ్గా అర్చకుడి అదృశ్యం కేసు దర్యాప్తు : సీఐ

భీమునిపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక చోడేశ్వరాలయం అర్చకుడు ఏడిద సుబ్రమణ్యశర్మ అదృశ్యం కేసును చురుగ్గా దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మీడియాతో మాట్లాడారు. దర్యాప్తు అధికారి హెచ్‌సీ ప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి వెళ్లిన ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదన్నారు. అర్చకుడు వినియోగించిన సెల్‌ఫోన్ లభ్యమైందన్నారు. అర్చకుని భార్య మాధేరి ఫిర్యాదుతో జూన్ 13న కేసు నమోదు చేశామన్నారు. తిరుపతి బస్టాండ్‌లో బస్సు చార్జీకి డబ్బులు లేవని సెల్‌ఫోన్‌ను ఓ ఆటో డ్రైవర్‌కు అమ్మేశాడని, అది నలుగురు చేతులు మారిందన్నారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లో ఏప్రిల్ 25న ఒక కాల్ నమోదైందని, ఆ నంబరుకు కాల్ చేయగా ఆమె భీమిలికి చెందిన వ్యక్తి అని ప్రస్తుతం శ్రీకాకుళంలో ఉంటున్నామని, శివాలయానికి దర్శనానికి వస్తున్నట్టు తెలిపామన్నారు. ఈనెల 26వ ఆఖరిగా సెల్‌ఫోన్ లొకేషన్ తిరుపతి బస్టాండ్‌లో వచ్చిందన్నారు. మే 4న అర్చకుడి మేనల్లుడు, తర్వాత అర్చకుని భార్య తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో సీపీ సూచనల మేరకు ఎస్ఐ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి తిరుపతి పిపంస్తామన్నారు.

### మందుబాబులకు రూ.3 లక్షల జరిమానా

ఆనందపురం జులై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 30 మందికి కోర్టు రూ.3 లక్షలు జరిమానా విధించింది. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాల మేరకు ఆనందపురం స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మంది నిందితులకు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ భీమిలి 15వ అదనపు మెజిస్ట్రేట్ పి.స్వాతీభవాని మంగళవారం తీర్పునిచ్చారన్నారు.

### వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మద్దిలపాలెం, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. రౌడీ షీటర్ బోన రామకృష్ణ రేసపువానిపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని చింతపల్లి గిరిజ నాగలక్ష్మి అనే మహిళ సహాయంతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి రామకృష్ణ, నాగలక్ష్మి, వ్యభిచారం చేస్తున్న యువతి, ఒక విటుడ్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిర్వాహకులు, విటుడిపై కేసు నమోదుచేశారు.

### చోరీ కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్టు

పెందుర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రెండు చోరీ కేసుల్లో ముగ్గురి నిందితులను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి రూ.46 వేల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... చినముషిడివాడ శాంతినగర్‌కు చెందిన జయేశ్వరి పోర్టులో పనిచేస్తోంది. జూన్ 23న ఆటోలో ఇంటికి వెళ్లిన జయేశ్వరి హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా అందులో రూ.50 వేలు మాయమయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసిన ఎస్ఐ సూరిబాబు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం ముషిరాం గ్రామానికి చెందిన పాత నేరస్థురాలు మాకిరెడ్డి గని గా గుర్తించి ఆమె నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని చోరీచేసిన గంటే ఏలేసు, మర్రి సతీశ్‌లను అరెస్టు చేశారు. మండలంలోని రాంపురానికి చెందిన కర్రి హేమంత్ మే 24న ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్ చోరీ జరిగిందని ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేయగా పాత నేరస్థుల పనేనని గుర్తించి, బైకును స్వాధీనం చేసుకున్నారు.

CLASSIFIEDS

**CHANGE OF NAME**

I, BHEEMARA SETTY SRI VARA LAKSHMI (New Name) W/o. Bheemara Setty Krishna Sai Adinarayana previously called Bheemarasetty Vara Lakshmi (Old Name), Resident of 5-150/1/3/GF, Kaushiki Arcade, Teachers Layout, Sujathanagar, VSKP-530051. Now changed my name from Bheemarasetty vara lakshmi To BHEEMARA SETTY SRI VARA LAKSHMI. Hence forth will be called as BHEEMARA SETTY SRI VARA LAKSHMI for all purpose.

**FLAT FOR SALE**

అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK Flat, 52 లక్షలకే అమ్మకమునకు కలదు Contact : 9866321992

AJV_241292

**దస్తావేజులు పోయినవి**

నేను NISHEK BATHULA S/o. వెంకటరమణ, డో.నెం.4-55-2/5, లాసన్స్‌బే కాలని, విశాఖపట్నం కాపురస్తుడను. నేను తేది 05-05-2025న బాలయ్య శాస్త్రీ లేవుట్ నుండి అక్కయ్యపాలెం మార్గమధ్యలో బైక్‌లో వెళ్తుండగా నా ఇంటి స్థలం తాలూకు దస్తావేజు నెం. 1462/2023, 2170/2023రు గల దస్తావేజు పడిపోయినవి. దొరికినవారు ఈ ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు : 8790573192.

AJV_241690

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 2 జూలై 2025

## 95 శాతం పింఛన్ల పంపిణీ

విజయనగరం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిరోజు 95.21 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 2,72,322 పింఛనుదారులు ఉండగా 2,59,616 మందికి అందజేశారు. మిగతా వారికి బుధవారం అందజేయనున్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఏపీడీ సావిత్రి, సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించారు. స్పౌజ్ కోటా కింద ఎంపిక చేసిన వారికి పింఛన్ ఇవ్వకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు.

# నేటి నుంచి ప్రజల్లోకి..

- సిద్ధమవుతున్న పార్టీలు
- 'సుపరిపాలనలో తొలి అడుగు'తో కూటమి
- 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో'తో వైసీపీ
- జనం మధ్యలో ఉండేలా ప్లానింగ్



- కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం లేదు. అందుకే ప్రజల మధ్యకు వెళ్లి చంద్రబాబు, పవన్ సర్కారు చర్యలను ఎండగట్టండి. ముఖ్యంగా కూటమి మేనిఫెస్టోను గుర్తుచేయండి. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో యాప్‌ను సద్వినియోగం చేసుకోండి. ఇటీవల జరిగిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, రీజనల్ కోర్డినేటర్ల సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ ఇచ్చిన పిలుపు ఇది.



- కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో గాడితప్పిన వ్యవస్థలను సరిచేస్తూనే ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం. కానీ, చేసిన పనిని చెప్పుకోవడంలో కొంత వెనుకబడి ఉన్నాం. అందుకే ప్రజల మధ్యకు మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లాలి. వారికి వాస్తవాలు తెలియజేయాలి. ఇటీవల అమరావతిలో జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలివి.

విజయనగరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అధికార, విపక్ష పార్టీలు ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. చేసిన మంచి పనులు చెప్పుకోవడానికి అధికార పక్షం సిద్ధమవుతుంటే.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు విపక్షం సన్నద్ధమవుతోంది. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు బుధవారం నుంచి ప్రజల మధ్యకు వెళ్లనున్నారు. ఏడాదిలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించనున్నారు. వైసీపీ నాయకులు కూడా 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో ప్రతి ఇంటికీ వెళ్లనున్నారు. దీంతో జూలై నెలలో జిల్లాలో ప్రకంపనలు రేగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### కూటమి శ్రేణులు సిద్ధం

ఉమ్మడి జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో బుధవారం నుంచి ప్రజల మధ్యకు వెళ్లేందుకు కూటమి శ్రేణులు సిద్ధమవుతున్నాయి. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పూసపాటి అశోక్‌గజపతిరాజు, కళా వెంకటరావు సూచనలతో ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించనున్నారు. పింఛన్ల మొత్తం పెంపు, అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం, ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, ఉచిత ఇసుక, సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం, డీఎస్సీ, రేషన్ షాపులు పునఃప్రారంభం, రహదారులు, గోశాలల నిర్మాణం, కంటైనర్ ఆసుపత్రుల ఏర్పాటు వంటి విషయాలను తెలియజేయనున్నారు. ఏడాది పాలనలో నమోదు చేసిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, రానున్న రోజుల్లో చేయబోయే కార్యక్రమాలను వివరించనున్నారు. అలాగే, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను కూడా ప్రజలకు చెప్పనున్నారు. కాగా, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని గంట్యాడ, బొండపల్లి తదితర మండలాల్లో

(మిగతా 8వ పేజీలో)

## విజయవంతం చేయండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి జరగనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఇతర నాయకులతో కలిసి మంగళవారం ఆయన టీడీపీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏడాది పాలన ప్రజా రంజకంగా సాగిందన్నారు. 'సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే కొన్ని హామీలు అమలయ్యాయి. మిగతా హామీలు అమలు దశలో ఉన్నాయి. వీలైనంత త్వరగా వాటినీ అమలు చేస్తాం. సామాజిక పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు ఇప్పటికే అమలు అయ్యాయి. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. చంద్రబాబు ఇచ్చిన హామీలు శతశాతం అమలు కానున్నాయి.' అని తెలిపారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ.. విజయనగరం నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కొండకరకాం గ్రామం నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఏడాదిలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇవి ఇంటింటికీ వెళ్లి వివరించ డమే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు వీరేష్ చంద్రదేవ్, నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా రవి, మాతా బుజ్జి, పీతల కోదండ రామ్, రాయపాటి సంతోష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, విజయనగరం ఎమ్మెల్యే అతిది గజపతిరాజు తదితరులు

## 6,780 ఇంజనీరింగ్ సీట్లకు అనుమతి

విజయనగరం కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 6,780 ఇంజనీరింగ్ సీట్లకు ఉన్నతి విద్యా శాఖ అనుమతి ఇచ్చింది. జిల్లాలోని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో 360, తొమ్మిది ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 6,420 మొత్తం 6,780 సీట్లుకు అనుమతి ఇచ్చింది. ఈ సీట్ల ప్రాప్తికి మాత్రమే ఆయా కళాశాలలు భర్తీ చేయాల్సి ఉంది.



## అభివృద్ధిపై ప్రచారం బాధ్యత కార్యకర్తలదే

- ఉత్తరాంధ్రపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

6లో

## 2.29 లక్షల మంది రైతుల ఈకేవైసీ పూర్తి

- 11,250 మందికి విత్తనాల పంపిణీ
- వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు

6లో

## వైభవంగా హీరా పంచమి పూజలు

6లో

## డ్రైనేజీల నిర్వహణ ఎక్కడ?

- చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి మురుగునీరు
- కాలువలపై నిర్మాణాలను తొలగించని మునిసిపాలిటీ
- పట్టణవాసులకు తప్పని ఇక్కట్లు

7లో

## తప్పిన పెనుప్రమాదం

- వ్యాన్‌ను ఢీకొన్న రైలు
- అరగంట పాటు రైలు నిలిపివేత

7లో

- రాజాం మండలంలోని ఓ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో వేతనదారులు ఇలా కూర్చొని మాట్లాడుకుంటున్నారు. పని ప్రదేశంలో కాస్తా ఉపశమనం పొందేందుకు కూర్చుంటే ఫర్వాలేదు. కానీ చాలాచోట్ల ఇలా గంటల తరబడి కూర్చోవడం కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షించడం లేదు. ఫలితంగా పథకం లక్ష్యం దెబ్బతింటోంది.

# 'ఉపాధి'పై పర్యవేక్షణ ఏదీ?

- సమయపాలన పాటించని వేతనదారులు
- సొంత పనుల్లో ఫీల్డ్‌అసిస్టెంట్లు
- పట్టించుకోని అధికారులు
- ఇంకా వైసీపీ ప్రభుత్వ జాఢ్యమే

రాజాం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వలసల నియంత్రణకు, కూలీలకు ఉపాధి, రైతులకు చేయూతనందించాలనే ఉద్దేశంతో అమలు చేస్తోన్న ఉపాధి హామీ పథకంపై పర్యవేక్షణ కొరవడుతోంది. కొన్నిచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో పథకం లక్ష్యం నీరుగారుతోంది. జిల్లాలో 6.85 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. 3.85 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. అయితే, చాలా గ్రామాల్లో ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించడం లేదు. పని ప్రదేశానికి చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉపాధి హామీ పనుల్లో క్షేత్ర సహాయకులు కీలకం. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడం, మస్టర్ల కేటాయింపు, కొత్త జాబ్‌కార్డుల మంజూరు, ఆధార్ అనుసంధానం, కూలీలకు వసతులు కల్పించడం వీరి ప్రధాన విధి. కానీ, ఫీల్డ్ అసిస్టెంట్లు సరిగ్గా పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సీనియర్ మేట్లకు పనులు అప్పగించి వారు సొంత పనులు చూసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా పనులు చేపట్టే వేతనదారుల బృందానికి సంబంధించి.. ఒక్కో మేట్ నేతృత్వంలో ఒక్కోలా వేతనాలు వస్తుండడంతో కొన్ని గ్రామాల్లో వివాదాలు కూడా నెలకొంటున్నాయి. కొన్ని గ్రామాల్లో వేతనదారులు సమయపాలన పాటించడం లేదని కూడా ఫిర్యాదులు ఉన్నాయి. ఉదయం గంట, సాయంత్రం గంట పనిచేసి చేతులు దులుపుకొంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే నిత్యం సమీక్షలు, సమావేశాలతో హడావుడి చేసే అధికారులకు ఇవేవీ పట్టకపోవడం విశేషం.

### గత ప్రభుత్వంలో అవినీతిమయం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం అవినీతిమయంగా మారింది. గత ఐదేళ్లలో కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టినట్టు సామాజిక తనిఖీ ప్రజా వేదికల్లో వెల్లడైంది. కానీ, రికవరీ మాత్రం శూన్యం. 2021-22లో జగనన్న పచ్చతోరణాల పథకం నిధులను అధికారులతో పాటు సిబ్బంది పక్కదారి పట్టించారు. మొక్కల కొనుగోలు, సంరక్షణ పేరిట కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారు. ఉపాధి పథకం దాని అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ పేరిట లక్షలాది రూపాయలు మింగేశారు. అప్పట్లో అర్హత లేనివారిని సైతం ఏపీడీలుగా నియమించారు. వారికి పదోన్నతులు సైతం కల్పించారు. రైతుల పంట పొలాలకు రోడ్లు పేరిట భారీగా అవకతవకలకు పాల్పడ్డారు. మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో

(మిగతా 8వ పేజీలో)

# రోడ్లు బాగుపడేదెప్పుడో?

గొర్లె సీతారాంపురం రోడ్డు ఇలా..

- దారుణంగా తయారైన రహదారులు
- నిధులున్నా చేపట్టని పనులు
- టెండర్ల ప్రక్రియ పూర్తయినా నిర్లక్ష్యం
- జనానికి తప్పనితిప్పలు

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గంలోని అంతర్రాష్ట్ర, రాష్ట్ర, స్థానిక రోడ్లు ప్రమాదకరంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో అవి నరకానికి నకళ్లుగా మారాయి. గోతులు, రాళ్లతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. వీటిపై ప్రయాణమంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఆ రోడ్లు ఇంకా బాగుపడడం లేదు. తమ నియోజకవర్గ పరిధిలోని రోడ్లన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన బాగుచేయండంటూ సాక్షాత్తూ ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో ప్రస్తావించడమే కాకుండా సంబంధిత మంత్రులు, అధికారులు, కలెక్టర్‌ను కలిసి పదేపదే కోరడంతో పలు రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా జరుగుతోంది. కానీ, పనులు మాత్రం చేపట్టడం లేదు. తాత్కాలికంగా బాగుచేసిన రోడ్లన్నీ ప్రస్తుతం వర్షాలకు మళ్లీ పాడైపోతున్నాయి. దీనివల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలువురి ప్రాణాలు కూడా గాలిలో కలిసిపోతున్నాయి. ఎందరో క్షతగాత్రులుగా మారుతున్నారు.

గోతులతో నిండిన బొబ్బిలి-తెర్లాం రహదారి

### ఇదీ పరిస్థితి..

బొబ్బిలి-తెర్లాం, బొబ్బిలి-రామభద్రపురం, పినపెంకి -ఆకులకట్ట, బొబ్బిలి-మక్కువ, బొబ్బిలి-డొంగురువలస వయా గిరిజనగ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బొబ్బిలి నుంచి గొల్లపల్లి, అలజంగి, కారాడ మీదుగా తెర్లాం వరకు ఉన్న రోడ్డు దారుణంగా ఉంది. బొబ్బిలి నుంచి రామభద్రపురం రాష్ట్రీయ రహదారి మీదుగా విశాఖ, విజయనగరం, రాయగడ, రాయపూర్ ప్రాంతాలకు ప్రతిరోజూ లెక్కకుమించి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ఛిద్రమైపోయాయి. పారాది బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ సమస్య మరింత తీవ్రతరమైంది. దీని సమీపంలోని కల్వర్టు ఇటీవల కూలిపోయింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రాష్ట్రీయ రహదారిపై ఉన్న కల్వర్టు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.8.5లక్షలతో, శాశ్వత పనుల కోసం రూ.92 లక్షలతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇప్పటికే ఉత్తరావల్లి నుంచి రామభద్రపురం మీదుగా బొబ్బిలి వరకు అక్కడక్కడ పాడైన రోడ్లకు మరమ్మతులు చేసేందుకు రూ.4.5 కోట్లు, ఆకులకట్ట-పినపెంకి రోడ్డుకు రూ.2.9 కోట్లు మంజూరయ్యాయి. అలాగే అత్యంత ప్రధానమైన బొబ్బిలి-తెర్లాం రోడ్డు పనులకు కూడా టెండర్ల ప్రక్రియ జరుగుతుంది. అయితే, వర్షాకాలంలో

(మిగతా 8వ పేజీలో)

# కొండల తోటి... మబ్బుల భేటీ

సాలూరు ఏజెన్సీలో తూర్పు కనుమలపై హిమపాతంలా...

మన్యం జిల్లా అంతటా విశాలమైన అటవీ ప్రాంతం ఉంది. దూరం నుంచి చూస్తే పచ్చని తివాచీ పరిచినట్టు కనిపిస్తుంది. ఇక కొండల శిఖరాలైతే ఆకాశాన్ని తాకుతున్నట్టు కనిపిస్తాయి. ఆ శిఖరాలపై... పచ్చని ప్రకృతిలో సేదదీరేందుకు వచ్చాయేమో అనేటట్టుగా మబ్బులు సందడి చేస్తున్నాయి. నీటిని మోసుకొచ్చి కొండలకు అభిషేకం చేస్తున్నట్టుగా వానజల్లులను కురిపిస్తున్నాయి. తూర్పు కనుమలను మంచు పరదాలు కప్పినట్టు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

-సాలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి)

పారమ్మకొండపై అందంగా...

## అభివృద్ధిపై ప్రచారం బాధ్యత కార్యకర్తలదే

- ఉత్తరాంధ్రపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం గంట్యాడ గ్రామంలో జామి, గంట్యాడ మండలాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో 'సుపరిపాలనకు తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.రెండు కోట్లతో 170 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న తాటిపూడి నుంచి మదుపాడకు రోడ్డు వేశామని చెప్పారు. తాటిపూడిలో బోటు షికారు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి గ్రామానికి రోడ్లు వేశామని... గోకులాలు నిర్మించుకున్నామని చెప్పారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తోందన్నారు. గ్రామంలోని ప్రతి కార్యకర్త బలంగా తయారు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులు భయపడేవిధంగా కార్యకర్తలు ఉండాలన్నారు. ఏ కార్యకర్త అయినా తనకు చట్టబద్ధమైన పనిని అప్పగిస్తే కచ్చితంగా చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌రావు, కొప్పలవెలమ డైరెక్టర్ అల్లు విజయకుమార్; తాటిపూడి ఆయకట్టు చైర్మన్ కె.జగన్నాథం, టీడీపీ నాయకులు రంది చినరామునాయుడు, బూడి అప్పలనాయుడు, కొరుపోలు కృష్ణమూర్తి, రంధి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

విజయనగరం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత సిటీ బస్టాండ్ సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్కంద షష్టి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గాయత్రీ శర్మ పర్యవేక్షణలో ఈ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

● బొబ్బిలి: గొల్లపల్లి దాడితల్లి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం స్కంద షష్టి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామిని పూలతో అలంకరించారు.

విజయనగరంలో అలంకరించిన దృశ్యం

## ఆకట్టుకున్న కోలాటం

విజయనగరం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులతల్లి పైడిమాంబ చదురుగుడి వద్ద మంగళవారం నగరంలోని ఉడా కాలనీకి చెందిన కోలాటం నృత్య శిక్షకురాలు లక్ష్మీ శ్రీనివాస్ బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారి పాటలకు అనుగుణంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఆలయ ఈవో శిరీష, ఉద్యోగులు, అర్చకులు, పైడిమాంబ సేవా సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి వద్ద పైడిమాంబకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పండ్లను నేవేద్యంగా సమర్పించారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి.. అమ్మవారిని దర్శించుకున్నారు.

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

జిల్లా ఆసుపత్రి రహదారిలో చీకటిగా ఉన్న దృశ్యం

## ఆస్పత్రి రోడ్డులో అంధకారం

పార్వతీపురంటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్రాసుపత్రికి రాత్రి పూట వెళ్లాలంటే రోగులు, వారి బంధువులు హడలిపోతున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత జిల్లా ఆసుపత్రి రహదారిలో ప్రయాణమంటే ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఆసుపత్రి రహదారిలో వీధిలైట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ పరిసరాల్లో అంధకారం అలముకుంది. చీకట్లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి తలెత్తింది. ఈ విషయమై మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావును వివరణ కోరగా వెంటనే వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపడతామన్నారు.

పాలకొండ: వరాహనరసింహావతారంలో జగన్నాథుడు

పాలకొండ: స్వామి వారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పార్వతీపురం టౌన్: నరసింహావతారంలో...

భామిని: బత్తిలిలో నారసింహావతారంలో...

## వైభవంగా హీరా పంచమి పూజలు

జగన్నాథుని రథోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం హీరా పంచమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథుని దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. రథయాత్ర నుంచి ఐదో రోజున హీరా పంచమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఆషాఢంలో ప్రకాశవంతమైన రోజుగా దీనిని భావిస్తారని అర్చకులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం

రథం వద్ద మహిళల పూజలు

వీరఘట్టం: వామనావతారంలో..

జియ్యమ్మవలస: చినమేరంగిలో...

విజయనగరం రూరల్:రామావతారంలో...

## వైభవంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

పాలకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో వారాహీదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం హారతులు సమర్పించారు. అర్చకులు శరత్ బృందం లలితా సహస్రనామ పారాయణం చేశారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కుమ్మరిగుంట గ్రామం వద్ద రోడ్డుపై గోతిలో దిగబడిన లారీ

బారులుదీరిన వాహనాలు

## గోతిలో కూరుకుపోయిన లారీ

- బారులుదీరిన వాహనాలు
- ఇదీ అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి

జియ్యమ్మవలస, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి అత్యంత దారుణంగా తయారైంది. వాహన చోదకులు ఈ రహదారిపై నిత్యం నరకం చూస్తున్నారు. మంగళవారం కుమ్మరిగుంట సమీపంలో ప్రధాన రహదారిపైన గోతిలో లారీ కూరుకుపోయింది. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు, అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటర్లకొద్దీ బారులుదీరాయి. దాదాపు 7 గంటల పాటు వాహనాలు కదల్లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రహదారిలో ఎక్కడో ఓ చోట తరచూ ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయని వాహన చోదకులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితికి భయపడి ఆర్టీసీ సర్వీసులనే రద్దు చేశారు. ఆటోలు కూడా నడపలేకపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి... నిధులు మంజూరు చేసి... త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## 2.29 లక్షల మంది రైతుల ఈకేవైసీ పూర్తి

- 11,250 మందికి విత్తనాల పంపిణీ
- వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విజయనగరం కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 29 వేల మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే రైతుల ఖాతాలకు జమవుతాయన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన నిధులు జూలైలో విడుదల అవుతాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు ప్రణాళికపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● **ప్రశ్న:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల పంపిణీ పరిస్థితి ఏంటి?

**జవాబు:** ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 97,216 హెక్టార్లలో వరి, 9,598 హెక్టార్లలో మొక్కజొన్న, 201 హెక్టార్లలో వేరుశెనగ, 1804 హెకార్లలో ప్రత్తి సాగుచేస్తున్నారు. అలాగే గోగును 118 హెక్టార్లు, చెరకు 3002 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 50,010 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా... ఇప్పటి వరకూ 42,735 క్వింటాళ్లు రైతు సేవ కేంద్రాలకు పంపించాం. ఇప్పటి వరకూ 11,250 మంది రైతులకు విత్తనాలు అందించాం. 30 కేజీల ప్యాకెట్ ధర రూ 1,260. ప్రభుత్వం ఇస్తున్న రాయితీ 300 తీసివేయగా... ప్రతి రైతు రూ.960 చెల్లించి విత్తనాలు తీసుకోవాలి. విత్తనశుద్ధిలో భాగంగా సుడిమాన్ మందును రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నాం. 1,121రకం 38వేల క్వింటాళ్లు, 1124 రకం 1,650, 3,291 రకం 2,500 , 5204 రకం 2,500 క్వింటాళ్లు అందిస్తున్నాం.

● **ప్ర:** విత్తనాలు వేసుకోవడానికి అనువైన సమయమేనా?

**జ:** ఈ ఏడాది మే నెలలో అధికంగా వర్షం కురిసింది. సాధారణం కంటే 40 మిల్లీమీటర్లు ఎక్కువగా కురిసింది. జూన్ నెలలో కురవాల్సిన వర్షంకంటే 19 మిల్లీమీటర్లు తక్కువ కురిసింది. ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. దుక్కిదున్ని పొలాలను సిద్ధం చేసుకోవాలి. విత్తనాలు వేసుకోవడానికి రైతులు సిద్ధంగా ఉండాలి.

● **ప్ర:** ఎరువుల పరిస్థితి ఏంటి?

**జ:** ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు కావలసిన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ కలిపి 19 వేలు మెట్రిక్ టన్నులు అవసరం. ప్రస్తుతం ప్రస్తుతం 21 వేల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి.

● **ప్ర:** కౌలు రైతుల విషయంలో ఏం చేయబోతున్నారు?

**జ:** జిల్లాలోని మొత్తం 15,650 కౌలుకార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకూ 10 వేల కార్డులను కౌలు రైతులకు అందించాం. ఈ కార్డులు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులు అన్నదాతా సుఖీభవ పథకానికి కూడా అర్హులు.

● **ప్ర:** భూసార పరీక్షలు పూర్తయ్యాయా?

**జ:** భూసార పరీక్షల కోసం పొలాల నుంచి మట్టి నమూనాలను తీసుకుని ల్యాబ్‌కు పంపించాం. జిల్లా వ్యాప్తంగా 21 వేల పరీక్షలు నిర్వహించాం. వీటి ఫలితాలు కొద్దిరోజుల్లో రానున్నాయి. వీటిని నాట్లు వేసుకునేలోగా రైతులకు అందిస్తాం. వీటి ఆధారంగా రైతులు ఎరువులు పిచికారీ చేస్తారు.

● **ప్ర:** సాంకేతికతను ఎలా వినియోగిస్తున్నారు?

**జ:** పంట పొలాలకు పురుగు మందులు పిచికారీ చేయడానికి రైతులకు డ్రోన్లు అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 24 డ్రోన్లు మంజూరయ్యాయి. వీటికి 19 డ్రోన్లకు రైతులు డబ్బులు చెల్లించారు. ఇంకా ఐదు డ్రోన్లకు రైతులు డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఒక్కొక్క డ్రోనుకు రూ.10 లక్షలు చొప్పున చెల్లించాలి. రైతులు రూ.5 లక్షలు చెల్లిస్తే బ్యాంకు మరో ఐదు లక్షలు రుణంగా ఇస్తుంది. తరువాత ప్రభుత్వం రూ.8 లక్షలు రాయితీ ఇస్తుంది. అంటే రైతుకు 80 శాతం రాయితీపై డ్రోన్లు అందించినట్టు అవుతుంది.

# డ్రైనేజీల నిర్వహణ ఎక్కడ?

శ్రీకాకుళం రోడ్డులో మురుగునీటి ప్రవాహం

● చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి మురుగునీరు
● కాల్వలపై నిర్మాణాలను తొలగించని మునిసిపాలిటీ
● పట్టణవాసులకు తప్పని ఇక్కట్లు

రాజాం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీలో డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లు, వీధులు చెరువులను తలపించడం సర్వసాధారణమైంది. దీంతో పట్టణవాసులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిస్థాయిలో కాల్వల నిర్మాణం జరపకపోవడం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడమే ఇందుకు కారణం. కాల్వల నిర్మాణాలకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, దాన్ని అమలు చేయాల్సిన మున్సిపల్ యంత్రాంగం చేతులెత్తేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వర్షం కురిస్తే బొబ్బిలి రోడ్డులోని సుమారు ఏడెనిమిది వీధుల్లోని మురుగునీరంతా మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తూ శ్రీకాకుళం రోడ్డులోని సప్తగిరి కాలనీలోని ఇళ్లను ముంచెత్తుతోంది. అక్కడ నుంచి అదే రోడ్డులోని పెట్రోల్ బంక్ వరకూ నీరు నిలిచిపోతోంది. ఇలాంటి సందర్భాలలో పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెతలు వర్ణనాతీతం. అలాగే వర్షం కురిస్తే ఈశ్వరనారాయణ కాలనీలోని ఆరు లేన్లు, బాబానగర్, నరసింహనాయుడు కాలనీలకు వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. మల్లికార్జున కాలనీలోని ఏడు వీధుల్లోనూ ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా వీరికి కష్టాలు తప్పవు. ప్రధానంగా బొబ్బిలి రోడ్డులోని మార్కెట్ యార్డు మొదలుకుని శ్రీకాకుళం రోడ్డులోని

అంబేడ్కర్ జంక్షన్ వద్ద ప్రధాన కాల్వపై అక్రమ నిర్మాణం

ఎల్‌ఐసీ కార్యాలయం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. కాల్వలపై శాశ్వత నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. మున్సిపల్

సామాజిక ఆసుపత్రి ఎదుట కాల్వపై ఆక్రమణలు

యంత్రాంగం ఆక్రమణదారుల జోలికి వెళ్లకపోవడంతో కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాంతో మురుగు నీరు ముందుకు సాగక రోడ్డుపైకి ఉప్పొంగుతోంది.

## 8న ఏఎంసీ పాలకవర్గం బాధ్యతలు?

విజయనగరం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 8న జరగనుంది. ఏఎంసీ చైర్మన్‌గా గాజులరేగ ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కర్రోతు నర్సింగరావు పేరును టీడీపీ ప్రకటించింది. వైస్ చైర్మన్‌తో పాటు, 18 మంది పాలకవర్గ సభ్యులు జాబితాను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు నెలరోజుల క్రితమే పార్టీ అధిష్ఠానానికి నివేదించారు. జిల్లాలోని తొమ్మిది ఏఎంసీలకు గానూ, ఇప్పటికే మూడు ఏఎంసీల పాలక వర్గాలకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే మిగతా ఆరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు ఉత్తర్వులు రావల్సి ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం బుధవారం సాయంత్రం నాటికి విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గానికి సంబంధించి ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే పాలకవర్గం ఈ నెల 6 లేదా 8న కొలువు దీరనుంది.

## సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయండి

లక్కవరపుకోట, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని దళిత ఉద్యమ జిల్లా నేత గంటాన అప్పారావు కోరారు. మంగళవారం ఎల్.కోటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయలేదన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ఉదయభాస్కర్, పి.సూరిదేముడు, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

డెంకాడ, జూలై1 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో ఆరోగ్యానికి ఎటువంటి అనర్థం జరగదని ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని డి.తాళ్లవలసలో ఆయన పర్యటించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ విధానం, వాల్వ్ పిట్స్, ట్యాంక్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సూచనలు చేశారు. సర్పంచ్ టి.త్రిమూర్తులు, పంచాయతీ సెక్రటరీ రజని ఉన్నారు.

## సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

విజయనగరం దాసన్నపేట, జూలై1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు తెలియజేసేందుకే రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు నెలకు రూ 1,500, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సాయం వంటి వాగ్దానాలు అమలు కాలేదన్నారు. ఈ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సమ్మె విరమించండి

రాజాం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిరవధిక సమ్మె విరమించాలని కమిషనర్ అప్పలనాయుడు మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని కమిషనర్ మంగళవారం సందర్శించారు. సమ్మెలో పాల్గొన్న సిబ్బందితో మాట్లాడారు. తక్షణమే సమ్మె విరమించాలని కమిషనర్ కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని వారు కమిషనర్‌కు స్పష్టం చేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడవాడ గ్రామానికి చెందిన కొణతాల అసిరితల్లికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.37100 మంజూరయ్యాయి. మంగళవారం పోలిపల్లిలోని నివాసంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సంబంధిత చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బీమా పథకాలను వినియోగించుకోండి

గుర్ల, జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష బీమా పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.వి.రమణమూర్తి, డీసీసీబీ జనరల్ మేనేజర్ కేవీవీఆర్‌ఎస్ సత్యనారాయణ సూచించారు. ఆనందపురంలో జన సురక్ష పథకాలపై వారు అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్ల సహకార బ్యాంకు మేనేజర్ ఎ.శ్రీనివాసనాయుడు, సర్పంచ్ సత్యవతి పాల్గొన్నారు.

## నేటి నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు'

● ఎంపీ కలిశెట్టి

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం నుంచి విజయనగరం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలన్నారు. మండల, పట్టణ, నగర అధ్యక్షుల ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌చార్జిలు ఇంటింటికీ వెళ్లి ప్రతి రోజు 30 నుంచి 50 కుటుంబాలతో మాట్లాడాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, కోదండరామ్ పాల్గొన్నారు.

## పింఛన్లతో ఆర్థిక తోడ్పాటు

పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక తోడ్పాటు లభిస్తోందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం నగరంలోని 28వ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీలో ఆమె లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని చంద్రబాబు పెంచారన్నారు. పేదల కళ్లల్లో ఆనందం నింపారన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు పాలవలస యశస్వి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు. ● నగరంలోని నాలుగో డివిజన్‌లోని మంగళ వీధిలో టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## 'సుపరిపాలన'పై శిక్షణ

మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

పూసపాటిరేగ, జూలై1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహణపై మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు 35 నుంచి 50 కుటుంబాలను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు ఎండీ నజీర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకరావు, నాయకుడు భాస్కరరావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారుల కళ్లలో సంతోషం చూస్తున్నాం..

● భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారుల కళ్లలో సంతోషం కనిపిస్తోందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని లింగాలవలసలో మంగళవారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుగత లలిత, బైరెడ్డి శ్రీను, బుగత రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కళా జన్మదిన వేడుకలు

కళాకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

గరివిడి, జూలై1 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాపు శంబాం సెంటర్ నుంచి చీపురుపల్లి మీదుగా గరివిడి వరకు పార్టీ నాయకులు ర్యాలీగా వెళ్లారు. నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● రాజాం: రాజాంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారంచీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్వాసితుల సమస్యను పరిష్కరించండి

శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలని కలెక్టర్, ఎస్పీలను కోరినట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ భూమి సమస్యను కలెక్టర్ అంబేడ్కర్‌కు వివరించేందుకు వెళ్లానన్నారు. అయితే వారు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో సిబ్బందికి లేఖ అందించానన్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి సమస్య వివరించామన్నారు. నిర్వాసితులు వారి సమస్యలు చెప్పుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని ఎస్పీని కోరినట్టు ఆయన చెప్పారు.

## మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో చేపట్టిన మంచి పనులు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సంబంధించి గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్టీఆర్ అమలు చేసిన రూ.70 పింఛన్‌ను రూ.4 వేల వరకు పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. తల్లికి వందనం పథకానికి రూ.10 వేలు కోట్లు వెచ్చించామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15వేలు చొప్పున అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను కలుపుకుని ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద అందజేయనున్నామన్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలు కానుందన్నారు. గడిచిన ఏడాదిలో ప్రతీ గ్రామంలో రోడ్లు, తాగునీరు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 300 సేవలు అందుతున్నాయన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ అందిస్తున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనపై విసిగిన ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

బొండపల్లి, జూలై1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని అంబటివలసలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కుల వృత్తిదారులు ఆత్మగౌరవంతో జీవనం సాగించాలనే లక్ష్యంతో పింఛన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాముల కావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల, ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

కొత్తవలస ఏఎంసీ పాలక మండలితో ఎంపీ భరత్

కొత్తవలస, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లిలో గల ఓ కల్యాణ మండపంలో మంగళవారం కొత్తవలస మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చొక్కాకుల మల్లునాయుడు, వైస్ చైర్మన్‌గా తూర్పాటి ఆదిబాబు, డైరెక్టర్లతో ఎంపీ భరత్, ఎమ్మెల్యే లలితకుమారి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడారు. మార్కెట్ కమిటీని అభివృద్ధి చేయడానికి పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కేబీఏ రాంప్రసాదః, ఇందుకూరి సుధారాణి, రాయవరపు చంద్రశేఖర్, గొరపల్లి రాము, గొంప వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

● శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ప్రతి కుటుంబం సీఎంని కుటుంబ పెద్దగా భావిస్తున్నారన్నారు. అలాగే పట్టణంలోని పుణ్యగిరి, బర్మాకాలనీ ప్రాంతాల్లో టూరిజం కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి సుధారాణి, ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి పింఛన్లను పంపిణీ చేశారు.

## సాగునీటిపై దృష్టి పెట్టండి

ప్రాజెక్ట్ వివరాలు చూపిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని ఇరిగేషన్ ఇంజనీర్లకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. ముంజేరు సమీపంలోని కార్యాలయంలో మంగళవారం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టల పునరుద్ధరణపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టల ప్రస్తుత పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలో నిలిచిన ప్రాజెక్టలను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈఈ త్రినాథులు, ఏఈ అరుణ్‌దీప్, నాయకుడు పి.జగదీశ్ తదితరులున్నారు.

## హరిత శోభకు శ్రీకారం

● కొవ్వాడ అగ్రహారంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
● నడుంబిగించిన సర్పంచ్ రఘు

శివాలయం ప్రాంగణంలో సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న రఘు

పూసపాటిరేగ, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు జనసేన మండల నాయకుడు, సర్పంచ్ కోట్ల రఘు నడుం బిగించారు. మంగళవారం స్థానిక శివాలయం నుంచి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో గ్రామస్థులను భాగస్వాములను చేశారు. రాజమండ్రి దరి కడియం నుంచి 4 వేల విభిన్న రకాల సుందరమైన మొక్కలను తెప్పించారు. గ్రామానికి చేరువలోని చెరువు గట్టుపై నాటి ఆహ్లాద వాతావరణాన్ని ప్రజలకు అందించనున్నారు. అలాగే గ్రామంలో రహదారులకు మొక్కలను నాటించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఆయన దాదాపు రూ.2లక్షలు వెచ్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోట్ల సత్యం నాయుడు, ఇజ్జరోతు సీతంనాయుడు, లెంక రామకృష్ణ, దేబారిక అప్పారావు, యువకులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య

సత్య (ఫైల్)

గంట్యాడ, జూలై1 (ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామానికి చెందిన చుక్క సత్య (24) కడుపునొప్పి తట్టుకోలేక మంగళవారం మధ్యాహ్నం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సాయికృష్ణ అందించిన వివరాల మేరకు.. సత్యవతి కొద్ది రోజులు నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. నొప్పి తగ్గకపోవడంతో ఇంటిలోని వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు కొన ప్రాణంతో ఉన్న ఆమెను ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. దాంతో ఆమె మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు సత్య లక్కిడాం పీఏసీఎస్‌లో చిరు ఉద్యోగి.

## పాముకాటుతో యువకుడి మృతి

సంతోష్ (ఫైల్)

సీతంపేట రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన ఓ గిరిజన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీతంపేట మండలం దోనుబాయి పంచాయతీ చెక్కాపురానికి చెందిన మండంగి సంతోష్‌కుమార్(31) సోమవారం రాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా పాము కాటువేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సంతోష్‌కుమార్‌ను దోనుబాయి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయానికి సంతోష్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం మృతి చెందాడు. చేతికి అందివొచ్చిన కొడుకు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు మండంగి బలరాం, సుభద్రమ్మలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. బలరాంకు ముగ్గురు కొడుకులు కాగా వీరిలో సంతోష్‌కుమార్ అందరికంటే చిన్నవాడు. దీనిపై దోనుబాయి ఎస్‌ఐ మస్తాన్ కేసు నమోదు చేశారు.

## తప్పిన పెనుప్రమాదం

● వ్యాన్‌ను ఢీకొన్న రైలు ● అరగంట పాటు రైలు నిలిపివేత

ప్రమాదానికి గురైన వ్యాన్

దత్తిరాజేరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌ను రైలు ఢీకొన్న ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలం లోని మరడాం సమీపంలో రైలు పట్టాల పక్కన వ్యాన్‌లో కూరగాయలు లోడ్ చేశారు. ఆ వ్యాన్‌ను వెనక్కి నడుపుతుండగా ఇటీవల కురిసిన వర్షాలకు నేల చిత్తడిగా ఉండటంతో బురదలో జారింది. వ్యాన్ వెనకభాగం పట్టాలకు చేరువైంది. వ్యాన్‌ను డ్రైవర్ రామునాయుడు వెనక్కి మళ్లించే క్రమంలో విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వస్తున్న గూడ్స్ రైలు దాన్ని స్వల్పంగా ఢీకొంది. దీంతో అరగంట సమయం రైలు నిలిచింది. పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే సిబ్బంది వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## శిథిలాల్లో చిక్కుకుని.. ప్రాణాలతో బయటపడి

● కూలిన పెంకుటిల్లు ● గాయాలపాలైన వీఆర్‌ఏ

కూలిన పెంకుటిల్లు, దాలయ్య (ఇన్‌సెట్‌లో)

రాజాం రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): శిథిలాల్లో ఓ వ్యక్తి చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన ఘటన రాజాంలోని హరిజనవీధిలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న దాలయ్య మంగళవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తిరిగి 12 గంటల సమయంలో ఇంటికి చేరాడు. ఇంట్లో భోజనం చేసి కాసేపు చేరబడ్డాడు. అయితే నాలుగురోజులుగా వర్షాలు కురవడంతో ఆయన నివాసం ఉంటున్న పెంకుటిళ్లు పైకప్పు ఆకస్మికంగా కూలింది. దాలయ్య ఆ శిథిలాల కింద చిక్కుకున్నాడు. క్షణాల్లో తేరుకున్న హరిజనవీధి వాసులు శిథిలాలను తొలగించి ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాలయ్యను కాపాడారు. ఈ ఘటనలో దాలయ్య గాయపడ్డాడు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

దత్తిరాజేరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరడాం గ్రామంలోని శివారు ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్‌ఐ జి.రాజేశ్ తెలిపారు. వారి నుంచి రూ.2800లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

## కళ్లకు గంతలతో నిర్వాసితుల నిరసన

శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలోని జిందాల్ నిర్వాసితులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్దిరోజుల కిందట ఎమ్మెల్యే వచ్చి, నాలుగు రోజుల్లో కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పి మాట ఆమె మరచి పోయారన్నారు. అలాగే పలువురు టీడీపీ, బీజేపీ నేతలు కూడా సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు పెట్టిస్తామని చెప్పి మిన్నకున్నారన్నారు. తమకు అండగా నిలిచిన ఎమ్మెల్సీపై పలువురు చేస్తున్న వ్యాఖ్యలు బాధ కలిగిస్తున్నాయని నిర్వాసితులు అన్నారు.

## చెవిలో పువ్వుతో కార్మికులు..

నెల్లిమర్ల, జూలై1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు మంగళవారం చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కాఆర్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు, శేఖర్, శ్రీను, పైడిరాజు, బాబూరావు, హరిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజల్లోకి..

(ఐదో పేజీ తరువాయి)

పార్టీ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

**వైసీపీ శ్రేణులు ముందుకొచ్చేనా?**

జూలై నెలంతా ప్రజల్లో ఉండేలా వైసీపీ నేతలు ప్లాన్ చేసుకుంటున్నారు. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐదు వారాల పాటు ప్రజల మధ్యలోనే ఉండేందుకు సిద్ధమవుతున్నారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో యాప్‌తో ప్రతి కుటుంబాన్నీ పలకరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో వైసీపీ శ్రేణులు ముందుకొస్తాయా? లేదా అన్నది అనుమానమే. ఇప్పటికే సీనియర్ నేతలు, కొందరు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు అంటీముట్టనట్టుగా ఉన్నారు. ఇటువంటి తరుణంలో అధినేత జగన్ ఇచ్చిన పిలుపు ఎంతవరకు విజయవంతం అవుతుందా? అన్నది చూడాలి. అలాగే, గురువారం వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో పాటు జిల్లా నాయకులు హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న స్థానిక ఎన్నికల కోసం ఇప్పటి నుంచే శ్రేణులను బూస్ట్ చేయడం, వారిని ఉత్తేజం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## ‘ఉపాధి’పై పర్యవేక్షణ ఏదీ?

(ఐదో పేజీ తరువాయి)

నాణ్యతకు తిలోదకాలిచ్చారు. ప్రజోపయోగం లేని పనులకు పెద్దపీట వేశారు. ఒక పనిచేయాల్సిన చోట రెండు, మూడు పనులు చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవినీతికి చెక్ పడుతుందని అంతా భావించారు. కానీ, అలా జరగలేదు. కొంతమంది అధికారులు, సిబ్బంది ఇప్పటికీ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికార కూటమి ప్రజాప్రతినిధులు సైతం దృష్టిపెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, పంచాయతీ కమిషనర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తినా సీనియర్ యాక్షన్‌లోకి దిగిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా కూటమి పాలకులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**పర్యవేక్షణ పెంచుతాం**

ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ పెంచుతాం. వేతనదారులు పని ప్రదేశానికి చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోతాం టే కుదరదు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా వారితో పనిచేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశిస్తున్నాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

**- ఎన్.రమామణి, ఇన్‌చార్జి ఏపీడీ, రాజాం**

## రోడ్లు బాగుపడేదెప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

ఈ పనులు జరిగే పరిస్థితి లేకపోవడంతో రహదారులు మరింత దారుణంగా మారనున్నాయి. దీంతో ఇంకెన్నాళ్లు సహవాసం చేయాలోనని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నరకం చూస్తున్నాం**

బొబ్బిలి-తెర్లాం రహదారి చాలా దారుణంగా ఉంది. వాహనచోదకులు, ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు నరకం చూస్తున్నారు. ప్రతి రోజూ నేను ఈ రోడ్డు సుమారు 20 కిలోమీటర్లకు పైగా బైక్‌పై వెళ్తుంటా. గమ్యస్థానం చేరుకునే వరకూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తలుచుకుంటే ఈ రోడ్డు సమస్య పరిష్కారం కావడం పెద్ద విషయమేమీ కాదు. ప్రభుత్వ పెద్దలు స్పందించి రోడ్డుని బాగు చేయాలి.

**- గంట సత్యనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బొబ్బిలి**

**వాతావరణం సమస్యగా మారింది**

రహదారుల మెరుగుకోసం మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం. కొన్ని రోడ్ల పనులకు టెండర్లు ఖరారయ్యాయి. మరికొన్ని చివరిదశలో ఉన్నాయి. పారాది కల్వర్టుకు రూ.92 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు మమ్మల్ని పరుగులు తీయిస్తున్నారు. ఆ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతూనే ఉన్నాం. నిధులు కూడా విడుదలవుతున్నాయి. వాతావరణం ప్రతికూలంగా ఉండడం పెద్దసమస్యగా మారింది.

**- ఎంఎస్ఎస్ఎస్ వెంకటరావు, డీఈఈ ఆర్అండ్‌బీ, బొబ్బిలి**

## జనసేనలో పలువురి చేరిక

భోగాపురం, జూలై1 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ పరిధిలోని పదో వార్డుకు చెందిన 30 కుటుంబాలు మంగళవారం ముంజేరు సమీప జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీలో చేరారు. పార్టీ నాయకులు ప్రసాద్ లోకం, బొల్లు త్రినాథ్, మాతా నవీన్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వందనాల రమణ, న్యాయవాది వరుపుల సుధాకర్, పల్లంట్ల జగదీశ్ ఉన్నారు.

## రామలక్ష్మణమూర్తికి నివాళి

విజయనగరం దాసన్నపేట, జూలై1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి రామలక్ష్మణమూర్తి చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లక్ష్మణమూర్తి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మజ్జి కాంతారావు, షన్ముఖరావు, చిన్నయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు. ● బాడంగి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమ నాయకు డు రామలక్ష్మణమూర్తి జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఆర్.దుర్గాప్రసాద్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వై.రవిబాబు ఆధ్వర్యంలో రామలక్ష్మణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

## జీజీహెచ్‌ను తరలించండి

విజయనగరం దాసన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)ని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మంగళవారం జిల్లా పౌర వేదిక కార్యాలయంలో ప్రజా సంఘాల రౌండ్ టేబిల్ సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో ఓపీ, ఐపీ లు పెరగడంతో రోగులు, వారి బంధువుల సంఖ్య నానాటికీ పెరుగుతోంద న్నారు. ఇరుకు గదుల్లో వైద్యం చేయలేక, వైద్యులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో సువిశాలమైన వైద్య కళాశాలకు సర్వజనాసుపత్రిని తరలించాలన్నారు. సమావేశంలో రామచంద్రరాజు, కొండబాబు, గోపాలరావు, వెంకటరమణ, తిరుపతిరావు, వీర్రాజు, కృష్ణవేణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహానికి వాటర్ ప్లాంట్

విజయనగరం దాసన్నపేట, జూలై1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోడెమ్మ బంగ్లా సమీపంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహానికి డాక్టర్ తిరుమల ప్రసాద్ రూ.3 లక్షల విలువైన వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. మంగళవారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరై వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాశాఖ అధికారి జ్యోతిశ్రీ, వసతి గృహ అధికారి కృష్ణవేణి, సహాయ అధికారి రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ పట్టణ కమిటీ ఏర్పాటు

రాజాం, జూలై1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాజాం పట్టణ కమిటీ నియామకం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీలో పట్టణ పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి నంది సూర్యప్రకాశరావును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శాసపు రమేశ్‌కుమార్, కోశాధికారిగా పిల్లా సత్యంనాయుడులను నియమితులయ్యా రు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కోండ్రును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో గిరడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది సీసీ రోడ్డే..

● బురదమయంగా గ్రామీణ రహదారులు

● తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

గరుగుబిల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ చూస్తున్నది సీసీ రోడ్డే.. వర్షాల కారణంగా ఇలా దర్శనమిస్తోంది. జిల్లాలోని చాలా గ్రామీణ రహదారులది ఇదే పరిస్థితి. గతంలో గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లన్నీ పాడయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా నిర్మాణాలకు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. అలాగే పంచాయతీల పరిధిలో పనుల నిర్వహణకు సిద్ధమవుతున్నా ఆర్థిక సంఘం నిధులు విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంది. గతంలో నిర్వహించిన పనులకు చెల్లింపులు కాకపోవడంతో గుత్తేదారులు పలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. మండలంలోని సాంబన్నవలస, శివ్వాం పంచాయతీ సీమలవానివలస, రావుపల్లి నుంచి కొత్తూరు, పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేట, రాయిందొరవలస, పెద్దూరు నుంచి బీవీ పురం, గరుగుబిల్లి నుంచి బీవీ పురంతో పాటు పలు గ్రామాల రహదారులు అత్యంత దారుణంగా దర్శనమిస్తున్నాయి. వర్షా కాలం వచ్చిందంటే గ్రామాల్లో రహదారుల ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రహదారుల మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బురదమయంగా సాంబన్నవలస రహదారి

# గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

● మంత్రి సంధ్యారాణి

● సామాజిక పింఛన్ల పంపిణీ

సాలూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట మండలంలోని పెద్దవలస పంచాయతీ తెటెడివలస, అమ్మవలస గ్రామాల్లో మంగళవారం ఆమె సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామానికి వచ్చిన ఆమెకు సాదర స్వాగతం లభించింది. గిరిజనులతో ఆమె థింసా నృత్యం చేసి, డప్పు వాయించి ఉత్సాహం నింపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దవలస, పద్మాపురం పంచాయతీలకు ఏది అవసరమైనా నేరుగా తనను సంప్రదించవచ్చునని చెప్పారు. ఇప్పటికే పాచిపెంట మండలంలో రూ.20 కోట్ల లింకు రోడ్ల మంజూరుకు నిధులు మంజూరు చేశామని ఆమె తెలిపారు. అలాగే తెట్టెడివలస గ్రామంలోని పాఠశాలకు ఇప్పటికే ప్రహరీ మంజూరు చేశామన్నారు. త్వరలో మరుగుదొడ్ల భవనాన్ని, మధ్యాహ్న భోజన వంట గది నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మండలంలో ఉన్న పలువురు గిరిజనులకు పోడు పట్టాలను మంజూరు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పాచిపెంట మండల ప్రధాన కార్యదర్శి గూడెపు యుగంధర్, సర్పంచ్ కుమారి పాల్గొన్నారు.

సాలూరు: తెట్టెడివలసలో వృద్ధుడితో ముచ్చటిస్తున్న మంత్రి సంధ్యారాణి

పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ కర్రక కళావతి, ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసీల్దార్ శేఖర్, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, కొత్తవలస మాజీ సర్పంచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

### రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం: కొత్తవలసలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం

గుమ్మలక్ష్మీపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

పార్వతీపురం రూరల్: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

### గ్రామాభివృద్ధికి కలిసి రండి: ఎమ్మెల్యే బోనెల

పార్వతీపురం రూరల్: రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రజలందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం కారాడవలస గ్రామంలో ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కారాడవలస అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందని, అందరూ కలిసివస్తే అన్ని విధాలా అభివృద్ధి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు వెంకటరమణ, సత్యనారాయణ, ఎంపీటీసీ వై.తవిటినాయుడు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలను
## ప్రజలకు వివరించండి

పార్వతీపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజలకు వివరించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ అధ్యక్షులతో మంగళవారం ఆయన పార్వతీపురంలో ‘సుపరిపాలన తొలి అడుగు’ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల సంక్షేమ కోసం నిరంతరం పాటుపడతారని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం శవాల వెంట వెళతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చినుకులతో అన్నదాతకు చికాకులు

పత్తి విత్తనాలు నాటేందుకు రైతుల అవస్థలు

భామిని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ చిరుజల్లులు కురవడంతో అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదు. జూలై నెల ప్రారంభం కావడంతో పలువురు పత్తి, మొక్కజొన్న, వరి నాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయానికే చిరుజల్లులు ప్రారంభం కావడంతో పొలాల్లో ట్రాక్టర్ దుక్కులు దున్నడానికి వీలు లేకపోవడంతో తాత్కాలికంగా కర్రలతో తయారు చేసి, అచ్చులు తీస్తున్నారు. మరి కొంతమంది తాళ్లతో కట్టి వరుస మొక్కలు నాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. కాగా పలు చోట్ల పదును చిక్కకపోవడంతో లివిరి, భామిని, ఘనసర, నులకజోడు తదితర గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

## మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల నాలుగు మండలాల మహిళా సర్పంచ్‌లకు బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు పాల్గొని, 73వ రాజ్యాంగ సవరణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సర్పంచ్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

సీతంపేట రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీడీ అన్నదొర ఆదేశించారు. సీతంపేట మినీ గురుకులం, దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, మెనూ, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. గిరిజన విద్యార్థుల కోసం వండిపెట్టిన వంటకాలను రుచి చూశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యా ప్రమాణాల స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మినీ గురుకులంలో చిన్నారితో మాట్లాడుతున్న డీడీ అన్నదొర

## సమ్మెను విజయవంతం చేయాలి

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వామపక్ష సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తెరమీదకి తెచ్చిందన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టనున్న సమ్మెలో కార్మిక, ఉద్యోగ వర్గాలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, పీకేఎస్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. ● సీతానగరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 9న సీఐటీయూ నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బైరిపూడి పద్మ, జి.పాప కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో సీహెచ్‌వో ఎస్‌వీ రమణకు సమ్మె నోటీసును అందజేశారు. ● గుమ్మలక్ష్మీపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలో గల ఆశా వర్కర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పీహెచ్‌సీ వైద్యుడు బుద్దేశ్వరరావుకు సమ్మె నోటీసు అంటించారు.

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. మూడో వార్డు సంఘ వీధిలో రూ.10.60 లక్షలతో సీసీ రోడ్డు, 25వ వార్డు సాయినగర్ రూ.3.60 లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టు, 19వ వార్డులో రూ.3 లక్షలతో కల్వర్టు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ పనులన్నిటినీ నాణ్య తగా సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సీనియర్ నేత రౌతు రామ్మూర్తి, డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ గుప్తా, కోటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు కళ్యంపూడి లక్ష్మీసత్యనా రాయణ, బొత్స సురేష్, కొల్లి రామారావు, బొత్స అప్పలు, రాయపురెడ్డి భాను పాల్గొన్నారు.

## కాజ్‌వేపై ట్రాఫిక్ జాం



పారాది వద్ద తాత్కాలిక కాజ్‌వే వద్ద వాహనాల రద్దీ

బొబ్బిలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పారాది గ్రామం వద్ద జాతీయ రహదారిపై వేగావతి నదిపై ఉన్న వంతెన పాడవడంతో పక్క నుంచి ప్రత్యామ్నాయ కాజ్‌వే ఏర్పాటు చేశారు. విజయనగరం నుంచి రాయగడ వైపు వెళ్లే ఈ జాతీయ రహదారిలో నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. అయితే తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే మీదుగా మంగళవారం భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు కాజ్‌వే వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే పనిలో నిమగ్నమయ్యారు.

## సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి దాడితల్లి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం స్కంద షష్ఠి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

రామభద్రపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలం లో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన పండ్ల తోట ల పెంపకంపై దృష్టి సారించాలని ఏపీడీ రమామణి సూచించారు. మండలంలోని కొత్తరేగ, పాతరేగ గ్రామా ల్లో ఉపాధిహామీ పనులను ఆమె మంగళవారం పరిశీ లించారు. ఈ ఏడాది పండ్ల తోటల పెంపకం కింద లక్ష్యాలను పూర్తిచేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫాంపాండ్స్, కంపోస్టు పిట్స్ పనులు పూర్తిచేయాలని ఆమె సూచించారు. ఇప్పటివరకు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈనెల 10వ తేదీలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఏపీవో త్రినాథరావు, ఈసీ సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి కృషి చేస్తా

శృంగవరపుకోట రూరల్, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శిథిలమైన గ్రంథాలయ భవనం స్థానంలో నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం ఆయన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లైబ్రేరియన్ శ్రీధర్‌తో మాట్లాడారు.

### ఘనంగా వైద్యుల దినోత్సవం

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సీహెచ్‌లో రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలు సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ప్రముఖ కంటి వైద్యనిపుణుడు కేవీ అప్పారావును సత్కరించారు. సీహెచ్‌సీ వైద్యుడు శశిభూషణరావు, రోటరీ క్లబ్ చైర్మన్ వారణాశి శ్రీహరి, కార్యదర్శి శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలి రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అలజంగి పంచాయతీ ఎ.వెలగవలస గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశి అన్నారు. ఆయన పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ఎ.వెలగవలస గ్రామంలో మంగళవారం పర్యటించారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా వ్యాధుల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వేడినీరు తాగాలని, వేడి ఆహారం తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూర్‌వైజర్ కన్నయ్య, నర్సింగ్ అసిస్టెంట్ తవిటినాయుడు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### గో సంరక్షణలో పద్మనాభం సేవలు ఆదర్శప్రాయం

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణలో స్థానిక సబ్‌ట్రెజరీ అధికారి వీవీ పద్మనాభం చేస్తున్న సేవలు ఆదర్శప్రాయం అని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌టీవో కార్యాలయానికి వెళ్లి ఆయన్ని సత్కరించారు. ఇటీవల ఢిల్లీకి చెందిన ఓ ధార్మిక సంస్థ పద్మనాభంకు గౌరవ్ వీరపురస్కార్ అవార్డు అందజేయడం హర్షణీయం అన్నారు. ఆర్ఎస్ఎస్ నేత చెలికాని కేశవ, వనమిత్ర కృష్ణదాసు, ఆరికతోట జడ్పీ హైస్కూల్ పీడీ బొత్స రత్నకిశోర్ పాల్గొన్నారు.

### బెల్ట్ షాపుపై దాడి

బొబ్బిలి రూరల్ జూలై 1 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం దాడి చేశామని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఈ దాడిలో నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని, 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులు నిర్వహించినా, బెల్ట్ షాపులను ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

సముద్రం ఒడ్డున గోడ నిర్మాణ పనులు

## సముద్ర కోతకు అడ్డుకట్ట

**పీఎం లంకలో రూ.13.5 కోట్లతో గోడ నిర్మాణం**

నరసాపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎంలంక వద్ద సముద్ర కోత నివారణకు గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ రీజనల్ మేనేజర్ రమేష్‌శెట్టి చెప్పారు. గోడ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తున్న డెలైట్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం పనులు పరిశీలించారు. కోత నివారణకు ఈ సంస్థ రూ.13.50 కోట్లు అందించడంతో సుమారు ఒక కిలో మీటరు గోడ నిర్మించనున్నారు. పూనేకు చెందిన గార్వేర్ సంస్థ చేపట్టిన నిర్మాణ పనులపై డెలైట్ సంస్థ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. రమేష్‌శెట్టి మాట్లాడుతూ సింగపూర్, మలేషియాలో సముద్ర కోత నివారణకు ఏ తరహాలో గోడ నిర్మించారో అదే టెక్నాలజీని ఇక్కడ వినియోగించామన్నారు.

## జిల్లాలో సాధారణం కంటే అధిక వర్షపాతం

తణుకు రూరల్/భీమవరం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడచిన నెలలో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షం కురిసింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 110.4 మిల్లీ మీటర్లు కాగా జూన్‌లో 125.5 మి.మీ వర్షపాతం నమోదైంది. నైరుతి రుత పవనాలు ముందుగానే ప్రవేశించినప్పటికీ మధ్యలో మంద గించడంతో వర్షం ఆశించితనం కురవలేదు. అయినప్పటికీ జూన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతంతో సార్వా సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. జూన్‌లో అత్యధికంగా పాలకోడేరు మండలంలో 221 మి.మీ., అత్యల్పంగా యలమంచిలి మండలం లో 52.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. పెనుమంట్రలో 11.2, పెనుగొండ 108.4, ఆచంట 105.4. పోడూరు 107.4, మొగల్తూరు 116.6, నరసాపురం 79.3, పాల కొల్లు 58.3, యలమంచిలి 52.9, గణపవరం 138.2, ఆకివీడు 113, ఉండి 129.4, పాలకో డేరు 221, వీరవాసరం 179.6, భీమవరం 152.7, కాళ్ల 101.7, తాడేపల్లిగూడెం 118.2, పెంటపాడు 116.4, తణుకు 128, అత్తిలి 113.4, ఇరగవరంలో 155.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో మంగళవారం అత్యధికంగా భీమవరంలో 20.2 మి.మీ., అత్యల్పంగా నరసాపురంలో 4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

# తొలి అడుగు

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు చేరువైంది. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. రాజకీయ కక్షలు, వేధింపులు, కేసులు లేకుండా సుపరిపాలనతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఏ కేసు పెడతారో.. ఎప్పుడు అరెస్ట్ చేస్తారో అనే భయం అందరినీ వెంటాడింది. ఇప్పుడు అంతా పారదర్శకం. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి తెలుగుదేశం పార్టీ ఇంటింటా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

### నేటి నుంచి ఇంటింటికి తెలుగుదేశం శ్రేణులు

- పార్టీ నాయకులు, కార్యకర్తలు నెల రోజులు ప్రజల్లోనే
- కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ
- సమస్యలపైనా ఆరా
- మై టీడీపీ యాప్‌లో నమోదు
- పరిష్కారం దిశగా ప్రభుత్వం
- జిల్లాలో పార్టీ శ్రేణులు సన్నద్ధం

పాలకొల్లులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**(భీమవరం-ఆంధ్రజ్యోతి)**

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈనెల 2 నుంచి ప్రజలతో మమేకం అవుతారు. ఇంటింటికి వెళ్లిన కేడర్ వారితో ఫోటో తీసుకుని ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరిస్తారు. అభిప్రాయాలు, సమస్యలపై టీడీపీ యాప్‌లో నమోదు చేస్తారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఏ సమస్యపై ప్రజలు స్పందిస్తారో వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. తదనుగుణంగా ప్రభుత్వం ఆయా సమస్యలు పరిష్కారం చేయనుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పార్టీ ఎమ్మెల్యేలు,

మిగతా 8వ పేజీలో..

### చేసిన మంచి ప్రజలకు చెబుదాం

**మంత్రి నిమ్మల రామానాయుడు**

పాలకొల్లు అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను టీడీపీ శ్రేణులు గడప గడపకు తీసుకెళ్లాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంపై మంగళవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త పాల్గొని ప్రభుత్వం చేసిన మంచి ప్రజలకు వివరించాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశాడని, పరిపాలనాదక్షుడు చంద్రబాబు నాయుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి మంచి పాలన అంది స్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతీ ఇంటికీ ప్రగతి, సంక్షేమం అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తోందని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, పీఎం మోదీ కలయికతో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, పెచ్చెట్టి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

### నేటితో ముగియనున్న డీఎస్సీ పరీక్ష

భీమవరం రూరల్, జులై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ 2025 పరీక్షలు బుధవారం ముగియనున్నాయి. గత నెల 6 నుంచి ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాల్లో జరుగుతోంది. ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లుగా జరుగుతున్న పరీక్షల్లో ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ నమోదు కాకుండా నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం గత నెల 30న పరీక్ష ముగియాల్సి ఉంది. గత నెల 20, 21 తేదీలలో జరగాల్సిన పరీక్ష ఈ నెల 1, 2 తేదీలకు వాయిదా పడ్డాయి. జిల్లాలో ఈ నెల 1 వరకు జరిగిన పరీక్షలకు 15,400 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 14,023 మంది హాజరయ్యారు. మొత్తం 1377 మంది గైర్హాజరుతో 91 శాతం మంది పరీక్ష రాశారు.

### ఇంజనీరింగ్ సీట్లు ఖరారు

**ఉమ్మడి జిల్లాలో 14 కళాశాలలు 12,990 సీట్లు**

ఏలూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాల వారీగా ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతించిన సీట్ల సంఖ్యను ఖరారు చేసింది. ప్రభుత్వం మంగళవారం జాబితా విడుదల చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా, అన్ని బ్రాంచ్‌లలో మొత్తం 12,990 సీట్లు అందుబాటులో ఉన్నట్టు నిర్ధారించారు.

భీమవరం మునిసిపాలిటీ వద్ద సమ్మె చేస్తున్న ఉద్యోగులు

## సమ్మె విరమించండి

**మునిసిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కమిషనర్ల సూచన**

భీమవరం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో ఔట్ సోర్సింగ్ టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె తొమ్మిది రోజులుగా కొనసాగుతోంది. సమ్మె విరమించి విధుల్లో చేరేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో మునిసిపల్ కమిషనర్లు మంగళవారం ఉద్యోగులతో మాట్లాడుతున్నారు. సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని సూచిస్తున్నారు. లేకుంటే తదుపరి చర్యలు ఉంటాయని చెబుతున్న ట్లు సమాచారం. సమ్మెలో ఉన్న సిబ్బంది మాత్రం తమకు రెండు రోజులు గడువు కావాలని, తమ నాయకులు చర్చలు జరుపుతున్నారని చెబుతున్నారు. సమ్మెను కొనసాగిస్తే ఉద్యోగులకు నోటీసు లు జారీ చేసే అవకాశం కనిపిస్తోంది.

జిల్లాలోని 5 మునిసిపాల్టీలు, ఒక నగర పంచాయితీలో మొత్తం 290 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. భీమవరం 59, తాడేపల్లిగూడెం 83, పాలకొల్లు 25, నరసాపురం 55, తణుకు 56, ఆకివీడు-12 మంది ఉన్నారు. సమ స్యల పరిష్కారం కోరుతూ గత నెల 14 నుంచి సమ్మె చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో..

**రైల్లో దొంగలు పడ్డారు..!**
రైళ్లలో పెరుగుతున్న చోరీలు
ఆదమరిస్తే అంతే సంగతులు 7

**నంబర్ లేని బైక్‌లో వచ్చి సెల్‌ఫోన్లు కొట్టేస్తారు**
కేసులు నమోదు చేయని పోలీసులు

**100 బస్సులు ఏమయ్యాయి ?** 6


**సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్**
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746
CUB TRUST AND EXCELLENCE SINCE 1904

**SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన**

దిగువ ఇందులో తెలిపిన రుణగ్రహీతలు / హామీదారుల ద్వారా బ్యాంకుకు ఉన్న తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలతోపాటు బ్యాంకుకు ఉన్న దిగువ తెలిపిన సెక్యూర్డ్ రుణాలను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

**భాగం - 1**
**రుణగ్రహీతల పేర్లు :నం.1) శ్రీ కుమ్మర పురుగు పరశురాం, తండ్రి కె. సోమ శంకర రావు, డి.నం. 3-17, కె.పి. పాలెం, మొగల్తూరు మండలం, పశ్చిమ గోదావరి - 534280. నం.2) శ్రీమతి కె.బి. రత్న మాణిక్యాంబ, భర్త కుమ్మర పురుగు పరశురాం, డి.నం. 3-17, కె.పి. పాలెం, మొగల్తూరు మండలం, పశ్చిమ గోదావరి - 534280. నం. 3) శ్రీ కుమ్మర పురుగు సుభాష్ చంద్రబోస్, తండ్రి సోమ శంకర రావు, డి.నం.3-7, కుమ్మర పురుగువారి మెరక, కుమ్మరపురుగుపాలెం సౌత్, మొగల్తూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534 280**
**బకాయి మొత్తం: 27.04.2025** నాటికి **రూ.1,46,99,799/- (రూపాయలు ఒక కోటి నలభై ఆరు లక్షల తొంభై తొమ్మిది వేల ఏడు వందల తొంభై తొమ్మిది మాత్రమే) + 28-04-2025** నుండి చార్జ్ చేయబడనున్న ప్రాప్తించిన వడ్డీ + రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంకుకు ఉన్న ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలు కలుపుకొని.

| మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల వివరణ | రిజర్వు ధర | వేలం తేదీ & సమయం |
|---|---|---|
| **షెడ్యూలు - A : (శ్రీ కుమ్మరపురుగు పరశురాం తండ్రి కె. సోమ శంకర రావుకు చెందిన ఆస్తి)** పశ్చిమ గోదావరి జిల్లా మరియు తాలూకా, నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ ఏరియా పరిధుల లోని చిన్న మామిడిపల్లి వద్ద గల ఆర్.ఎస్.నం.347/2లో ఎ.1.00 సెంట్ల విస్తీర్ణ భూమి, సరిహద్దులు: తూర్పు: వి.వి. దుర్గారావ్ భూమి, దక్షిణం: డ్రెయినేజ్ బోధి, పశ్చిమం: వై. దావిద్‌రాజు భూమి, ఉత్తరం: స్టేషన్ పేట రోడ్. | రూ. **38,00,000/-** (ముప్పై ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే) | 23.07.2025న మ.01.00 గం.కు |
| **షెడ్యూలు - B : (శ్రీ కుమ్మరపురుగు పరశురాం తండ్రి కె.. సోమ శంకర రావుకు చెందిన ఆస్తి)** పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల 5 ఐటంలలో ఎ.3.44 1/4 సెంట్ల విస్తీర్ణ భూమి అనగా ఆర్.ఎస్.నం. 32/1ఆర్, 36/1లో ఎ.0.40 3/4 సెంట్లు + ఆర్.ఎస్.నం. 36/3ఎలో ఎ.0.75 1/4 సెంట్లు, ఆర్.ఎస్.నం.68/4లో ఎ.1.75 సెంట్లు + ఆర్.ఎస్.నం.147/13లో ఎ.0.22 1/4 సెంట్లు, ఆర్.ఎస్.నం.146/4బిలో ఎ.0.31సెంట్లు. **ఐటం నం.1:** పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల ఆర్.ఎస్.నం. 32/1ఆర్, 36/1లో ఎ.0.40 3/4 సెంట్ల విస్తీర్ణానికి సరిహద్దులు: ఎ.0.40 3/4 సెంట్లు: తూర్పు: నీటి పారుదల కాలువ, దక్షిణం: కె.వి.వి. శేష ప్రసాద్ యొక్క బి షెడ్యూలులో ఆస్తి. పశ్చిమం: అల్లం నాగరత్న ప్రసన్న భూమి, ఉత్తరం: కె.సుభాష్ చంద్రబోస్ యొక్క డి.షెడ్యూలులో ఆస్తి. **ఐటం నం.2:** పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల ఆర్.ఎస్.నం.36/3ఎలో ఎ.0.75 1/4 సెంట్ల విస్తీర్ణానికి సరిహద్దులు: ఎ.0.75 1/4 సెంట్లు. తూర్పు: ప్రభుత్వ భూమి, దక్షిణం: కె.వి.వి. శేష ప్రసాద్ యొక్క బి షెడ్యూలులో ఆస్తి, పశ్చిమం: రోడ్, ఉత్తరం: కె.సుభాష్ చంద్రబోస్ యొక్క డి షెడ్యూలులో ఆస్తి. **ఐటం నం.3:** పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల ఆర్.ఎస్.నం.68/4లో ఎ.1.75 సెంట్ల విస్తీర్ణానికి సరిహద్దులు: ఎ.1.75 సెంట్లు, తూర్పు: కె.సుభాష్ చంద్రబోస్ యొక్క డి షెడ్యూలులో ఆస్తి, దక్షిణం: రోడ్, పశ్చిమం: కె.వి.వి. శేష ప్రసాద్ యొక్క బి షెడ్యూలులో ఆస్తి, ఉత్తరం: అందే వీరస్వామి భూమి. **ఐటం నం.4:** పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల ఆర్.ఎస్.నం.147/13లో ఎ.0.22 1/4 సెంట్ల విస్తీర్ణానికి సరిహద్దులు: ఎ.0.22 1/4 సెంట్లు. తూర్పు: ఇ. సత్య నారాయణ భూమి, దక్షిణం: కె.వి.వి. శేష ప్రసాద్ యొక్క బి షెడ్యూలులో ఆస్తి, పశ్చిమం: రోడ్, ఉత్తరం: కె.సుభాష్ చంద్రబోస్ యొక్క డి షెడ్యూలులో ఆస్తి. **ఐటం నం.5:** పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల ఆర్.ఎస్.నం.146/4 బి లో ఎ.0.31 సెంట్ల విస్తీర్ణానికి సరిహద్దులు: ఎ.0.31 సెంట్లు. తూర్పు: రోడ్, దక్షిణం: కె.వి.వి. శేష ప్రసాద్ యొక్క బి షెడ్యూలులో ఆస్తి, పశ్చిమం: జి. రాధాకృష్ణ భూమి, ఉత్తరం: కే. సర్వేశ్వర రావు భూమి. | రూ. **36,00,000/-** (ముప్పై ఆరు లక్షల రూపాయలు మాత్రమే) | 23.07.2025న మ.01.00 గం.కు |
| **షెడ్యూలు - C : (శ్రీ కుమ్మరపురుగు సుభాష్ చంద్రబోస్ తండ్రి సోమ శంకర రావుకు చెందిన ఆస్తి)** మొగల్తూరు ఎస్.ఆర్.ఓ. పరిధులలో పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, కుమ్మర పురుగు పాలెం వద్ద గల ఆర్ఎస్ నం. 36/3ఎలో ఎ.3.01 సెంట్లలో నుండి ఎ.0.75 1/4 సెంట్ల విస్తీర్ణం. టైటిల్ డీడ్ యొక్క డి షెడ్యూలులో 2వ ఐటం ప్రకారం ఆస్తి. సరిహద్దులు: తూర్పు: సర్కారు భూమి, దక్షిణం: కె. పరశురాం యొక్క సి.షెడ్యూలులో ఆస్తి, పశ్చిమం: రోడ్, ఉత్తరం: కె. మురళీకృష్ణ యొక్క డి షెడ్యూలులో ఆస్తి. | రూ. **25,00,000/-** (ఇరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే) | 23.07.2025న మ.01.00 గం.కు |

**భాగం-2**
**రుణగ్రహీతల పేరు: నం.1) శ్రీమతి కొల్లాటి రామలక్ష్మి, భర్త. కొల్లాటి ధర్మరాజు, డి.నం.4-144/1, మెయిన్ రోడ్, మొగల్తూరు మండలం, ముత్యాలపల్లి, పశ్చిమగోదావరి-534281. నం.2) శ్రీ కొల్లాటి ధర్మరాజు, తండ్రి నరసింహ స్వామి, డి.నం.4-144/1, మెయిన్ రోడ్, మొగల్తూరు మండలం, ముత్యాలపల్లి, పశ్చిమగోదావరి-534281.**
**మిగులు బకాయి మొత్తం:** రుణగ్రహీతలు / హామీదారుల నుండి **09.02.2025** నాటికి **రూ.40,13,948/- (రూపాయలు నలభై లక్షల పదమూడు వేల తొమ్మిది వందల నలభై ఎనిమిది మాత్రమే)తో 10.02.2025** నుండి చార్జ్ చేయబడే తదుపరి వడ్డీ, బ్యాంకుకు ఉన్న ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలు.

| మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తి వివరణ | రిజర్వు ధర | వేలం తేదీ & సమయం |
|---|---|---|
| **(శ్రీమతి కొల్లాటి రామలక్ష్మి భర్త కొల్లాటి ధర్మరాజుకు చెందిన ఆస్తి)** ఆం.ప్ర. పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం యొక్క డి.నం.20-50 సమీపాన గల ఆర్ఎస్ నం.481/2ఎ ఇల్లులోని ఖాళీ స్థలం విస్తీర్ణం 484 చ.గ.లు, ఇల్లు. సరిహద్దులు : తూర్పు : కాంతం శెట్టి పద్మజ స్థలం 73-00 అ.లు, దక్షిణం : కారుమూరి వెంకటేశ్వర్లు స్థలం మరియు హైవే రోడ్ 65-00 అ.లు, పశ్చిమం : ఆదుర్తి రామాంజనేయులు స్థలం 67-00 అ.లు, ఉత్తరం : పొన్నపల్లి జయప్రకాశ్ మిగిలిన స్థలం 67-00 అ.లు. | రూ.**33,00,000/-** (రూపాయలు ముప్పై మూడు లక్షలు మాత్రమే) | 23.07.2025న మ.02.00 లకు |

**రీ-టెండరు-సహిత-వేలం ప్రదేశం: సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, భీమవరం శాఖ, శాంతి నివాస్, 17-2-50, రెస్ట్ హౌస్ రోడ్, భీమవరం, పశ్చిమ గోదావరి-534201. టెలిఫోన్ నం.:08816-230280, సెల్ నం.9397121831**

**రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :**
**1.** కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. **2.** కాగోరు బిడ్డర్లు **మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, భీమవరం శాఖ, శాంతి నివాస్, 17-2-50, రెస్ట్ హౌస్ రోడ్, భీమవరం, పశ్చిమ గోదావరి-534201** వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. **3.** కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను **"సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్"** పేరున తీసిన రిజర్వు ధరలో **10 శాతం** బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **భాగం-1కి మ.12.00 గం.కు లేదా ఆలోగా, భాగం-2కి మ.01.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్** వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. **4.** ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు **టెలిఫోన్ నం.:08816-230280, సెల్ నం.9397121831** లను సంప్రదించవచ్చును. **5.** ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. **6.** ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **భాగం-1కి మ.01.00 గం.కు, భాగం-2కి మ.02.00 గం.కు మరియు** కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. **7.** గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన **వెంటనే** అమ్మకం మొత్తంలో **25% (చెల్లించిన బయానా కలిపి)** చెల్లించాలి మరియు మిగిలిన **75%** మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి **15 రోజులలోగా** చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన **25%** మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. **8.** ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. **9.** చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. **10.** ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి.**11.** ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

**ప్రదేశం : కుంబకోణం,**
**తేది : 30.06.2025**

అధీకృత అధికారి
సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

**నమోదిత కార్యాలయం:** 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, **CIN** - L65110TN1904PLC001287
**టెలిఫోన్ నం.**0435-2402322, **ఫ్యాక్స్:**0435-2431746, **వెబ్‌సైట్:**www.cityunionbank.com

ఆలమూరులో పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

### జిల్లాలో 94.26శాతం పింఛన్ల పంపిణీ

భీమవరం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 94.26 శాతం పూర్తయింది. జిల్లాలో 62,81,768 లబ్ధిదారులకు మంగళవారం సాయంత్రానికి 59,27,885 మందికి రూ.25,50,85,195 అందించారు. ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మిగిలిన వారికి బుధవారం కూడా పెన్షన్‌ల పంపిణీ జరుగుతుంది. పట్టణాల్లో మునిసిపల్ అధికారులు, మండలాల్లో ఎంపీడీవోలు పర్యవేక్షించారు.

**స్వయంగా పింఛన్లు అందించిన కలెక్టర్**

పెనుమంట్ర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు ఇందిరమ్మ కాలనీలో పింఛన్ లబ్ధిదారులకు కలెక్టర్ నాగరాణి మంగళవారం స్వయంగా పింఛన్లు అందజేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి వారి యోగ క్షేమాలను, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా అని ఆరా తీశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీవో జీఎస్.ప్రభాకర్‌రావు, సర్పంచ్ మేడపరెడ్డి వెంకటరమణ, పితాని వెంకట సురేష్, పంచాయతీ కార్యదర్శి ఎం.సుధారాణి, ఎంపీటీసీ పలివెల ఆశాలత పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

### పాఠాలు బాగా చెబుతున్నారా?

**విద్యార్థులను ప్రశ్నించిన జేసీ**

అత్తిలి, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బోధన, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రతపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విద్యార్థులను ఆరా తీశారు. అత్తిలి జడ్పీ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా? పాఠశాల ఆవరణ ఎలా ఉంది? మౌలిక సదుపాయాలు, ఆట స్థలం, మధ్యాహ్న భోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా హిందీ పదాలు నేర్పించాలని హిందీ ఉపాధ్యాయుడు సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం వంటలు చేయాలని ఎండీఎం వర్కర్లకు సూచించారు. భోజనాన్ని విద్యార్థులకు ఆయన స్వయంగా వడ్డించారు. ఎంఈవోలు రమేష్, ప్రసాద్, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇంటి స్థలాలకు అర్హులను గుర్తించండి**

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అత్తిలిలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి జేసీ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించడంపై వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. అత్తిలిలో 450 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ వంశీ జేసీకి వివరించారు.

## జనంతో..సీఎం!

- పేదల సేవలో చంద్రబాబు
- కొవ్వూరుకు వరాల జల్లు
- సీఎంను చూసేందుకు జనం క్యూ

కొవ్వూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు పర్యటన ఆసక్తికరంగా సాగింది. పేదల సేవలో.. కార్యక్రమంలో ఆయన పేదలతో మమేకమయ్యారు. పేదలు ఆత్మ గౌరవం, విశ్వాసంతో ముందుకు సాగాలని, దేవుడింతే ఇచ్చాడు. ఇది మా ఖర్మ అనే ఆలోచన వద్దని ఆయన పిలుపునిచ్చారు. చర్మకార పింఛనుదారు పోసిబాబును కొవ్వూరు మండలం ధర్మవరంలో కారులో ఎక్కించుకుని తాళ్లపూడి మండలం మలకపల్లి వరకూ రెండు కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. కారులో పక్కనే కూర్చోబెట్టుకుని వృత్తి, జీవన స్థితిగతులపై ఆరాతీశారు. అతడి ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చి పోసిబాబు డప్పు తీసుకుని ఎలా కొట్టాలో అడిగి కాసేపు డప్పు వాయించారు. అతడి భుజంపై చేయి వేసి వీధిలో నడిచి వెళ్లారు. మరో పింఛన్‌దారు పసిబిడ్డను ఎత్తుకుని ఆడించారు. అక్కడ సామాన్య ప్రజలతో మాట్లాడారు. ఒక దివ్యాంగుడిని తీసుకుని తండ్రి రావడంతో వివరాలు తెలుసుకున్నారు. సమస్యలు విని అందరికీ అండగా ఉంటానని చెప్ప డంతో ప్రజలంతా ఆనందపడ్డారు.

చిన్నారిని ఎత్తుకున్న చంద్రబాబు

# రేపు ప్రైవేటు పాఠశాలల బంద్

**ఆర్టీఈ ఉచిత అడ్మిషన్లకు ఫీజులు, బకాయిల చెల్లింపునకు డిమాండ్**

**కలెక్టర్, ప్రజాప్రతినిధులు, డీఈవోలకు వినతిపత్రాల అందజేతకు నిర్ణయం**

ఏలూరు అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం 12 (1)సి ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి 25 శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలన్న నిబంధన అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల సంఘం (అపుస్మా) ఉద్యమ బాట పట్టింది. ఇందులో భాగంగా గురువారం అన్ని ప్రైవేటు పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేసి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాల కలెక్టర్లు, డీఈవోలకు వినతిపత్రాలను ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీఈ ఉచిత అడ్మిషన్ల అమలుకు ఎదురవుతున్న సమస్యలు, ఆర్థికపరమైన బకాయిల చెల్లింపులు నిలిపివేత, తదితర అంశాలపై అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీశ్రీ శర్మ మంగళవారం వివరించారు. ఆర్టీఈ చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లు, సంబంధిత స్కూలు పరిధిలోని ఒక కిలోమీటరు దూరంలో నివసించే కుటుంబాల పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని, ఆ మేరకు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం లేనపుడు మాత్రమే ప్రైవేటు స్కూలులో అడ్మిషన్ ఇచ్చేందుకు షరతులు ఉన్నాయన్నారు.దీనికి భిన్నంగా 15 కిలోమీటర్ల దూరంలోని పిల్లలను కూడా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లకు పంపించడం సరికాదన్నారు.ఆర్టీఈ అడ్మిషన్లకు కేంద్ర ప్రభుత్వం కొంత గ్రాంట్‌ను ఇస్తే, దానికి రాష్ట్రప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంటును కలిపి ఉచిత అడ్మిషన్లు ఇచ్చిన ప్రైవేటు పాఠశాలలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఒక్కో విద్యార్థిపైన సగటున రూ.90,300 ఖర్చు చేస్తోందని, కాని ఉచిత అడ్మిషన్లకింద కేటాయించిన సీట్లు ఒక్కో దానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.7 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు ఇస్తామనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఉచిత అడ్మిషన్ల కింద కేటాయించిన సీట్లకు ఒక్కో దానికి కనీసం రూ.20 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం 2019లో అధికారంలో ఉన్నపుడు అమలుచేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద కేటాయించిన ఉచిత అడ్మిషన్ల ప్రకారం ప్రవేశాలు కల్పించిన ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర వ్యాప్తంగా చెల్లించాల్సిన రూ.350 కోట్ల బకాయిలను ఇంతవరకు ఇవ్వలేదని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆర్టీఈ చట్టంకింద ఉచిత అడ్మిషన్ల నిమిత్తం ప్రైవేటు పాఠశాలలకు మూడేళ్లలో రూ.250 కోట్లు బకాయి పడిందని వివరించారు. ఉచిత అడ్మిషన్లకు డబ్బుల చెల్లింపు అంశంపై కోర్టులో దాఖలైన వ్యాజ్యం పెండింగ్‌లో ఉండగానే తాజాగా ఆర్టీఈ ఉచిత అడ్మిషన్ల జాబితాలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తూ, సంబంధిత విద్యార్థులను చేర్చుకోవాల్సిందేనని అధికారులు ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి దృష్టి సారించకుండా షోకాజ్ నోటీసులిస్తామని, స్కూలు గుర్తింపు రద్దు చేస్తామని బెదిరింపులకు దిగటం సరైంది కాదన్నారు. గురువారం నిర్వహించనున్న స్వచ్ఛంద బంద్‌లో ఉమ్మడి జిల్లాలోని 1200 ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు పాల్గొంటాయని, అపుస్మా జిల్లాశాఖ సహా, మరో మూడు సంఘాలు పాల్గొంటాయని వివరించారు.

# క్రీడా వికాసం

**క్రీడా వికాస కేంద్రాలకు పూర్వ వైభవం**

**గత టీడీపీ హయాంలో మంజూరు**

**ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ పాలకులు**

**నూతన విధానం ప్రకటించిన ప్రభుత్వం**

**క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహం**

భీమడోలులో మధ్యలోనే నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రం

ఏలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) :: క్రీడల అభివృద్ధికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మినీ స్టేడియాలకు (క్రీడా వికాస కేంద్రాలు) మంచి రోజులు రానున్నాయి. క్రీడలను యువత భవిష్యత్‌కు బాసటగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన క్రీడా వికాస కేంద్రాలు ఇక పూర్వ వైభవం సంతరించుకోనున్నాయి.

### నూతన క్రీడా విధానం

ప్రభుత్వం ప్రకటించిన నూతన క్రీడా విధానంలో భాగంగా క్రీడల కోటాలో ఇచ్చే ఉద్యోగాలను 3 శాతానికి పెంచారు. జాతీయస్థాయిలో స్వర్ణం, రజత, కాంస్యం పతకాలు సాధించే వారికి వరుసగా రూ.10 లక్షలు, రూ.5 లక్షలు, రూ.3 లక్షలు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతీ నియోజకవర్గంలో క్రీడా వనరులను ప్రోత్సహించేందుకు వీలుగా సన్నాహాలు చేస్తున్నారు. తాజా క్రీడా విధానం ప్రకటనతో సగంలో నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రాలు పూర్తవుతాయన్న ఆశలు క్రీడాకారుల్లో కనిపిస్తోంది.

### ఏలూరు జిల్లాలో ఇలా..

జిల్లాలో 2014-19 మధ్య ప్రతీ నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్ర నిర్మాణం జరపాలని నిర్ణయించారు. తొలి దశలో ఏడు నియోజకవర్గలలోని 5 ప్రాంతాలలో వికాస కేంద్రాలు, ఒక చోట వాటర్ స్పోర్ట్స్ అకాడమీ పనులకు శ్రీకారం చుట్టారు. ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్లు చొప్పున జిల్లాకు రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇండోర్ స్టేడియం, పెవిలియన్, 200 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, లాంగ్ జంప్, కబడ్డీ, క్రికెట్ ప్రాక్టీస్ పిచ్, వాలీబాల్ కోర్టు, కోకో ప్రాంగణం వంటివి నిర్మించాల్సి ఉంది. అయితే జిల్లాలో పనులు ప్రారంభమైనా, 2019 సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడం ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో టీడీపీ హయాంలో చేపట్టిన పథకాలకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో క్రీడాకారులలో కొత్త ఆశలు చిగురించాయి.

### ఎక్కడెక్కడ ఎలా..

భీమడోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏలూరు కోట దెబ్బలోని జూనియర్ కళాశాలలో, దెందులూరు గోపన్నపాలెంలో, చింతలపూడి గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో, పోలవరం నియోజకవర్గం కోటరామచంద్రాపురంలోని గురుకుల పాఠశాలలో క్రీడా వికాస కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంతో పాటు ఐదు నియోజకవర్గాల్లోనూ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భీమడోలులో ప్లాస్టింగ్ పనులు పూర్తిగా, గ్రౌండ్ ఫ్లోర్ పనులు 50 శాతం పూర్తవగా దెందులూరులో అసంపూర్తిగా, చింతలపూడి కోట రామచంద్రాపురంలోను పునాదులకే పరిమితం అయ్యాయి. తదుపరి నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు పడకేశాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే క్రీడాకారులు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ శ్రీకారం చుట్టిన పనులు అదే ప్రభుత్వం పూర్తిచేసి క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తారన్న నమ్మకం వారిలో నెలకొంది.

**ప్రభుత్వానికి ప్రతిపాదించాం**

జిల్లాలో అసంతృప్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రాల పునర్నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎక్కడెక్కడ ఏమేర పనులు జరిగాయి ? ఇంకా ఏమేరకు పనులు పూర్తి కావాల్సి ఉంది. అందుకు ఎంతెంత విధులు అవసరమవుతాయనే వివరాలతో ప్రతిపాదనలు పంపించాం.

**బి.శ్రీనివాసరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, ఏలూరు.**

# 100 బస్సులు ఏమయ్యాయి ?

**ఫిట్‌నెస్ ఉందా.. సర్టిఫికెట్ లేకుండానే తిప్పుతున్నారా ?**

**స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ**

తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ సిబ్బంది

(భీమవరం-ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రైవేటు విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు 1300 బస్సులున్నాయి. ఈ ఏడాది 1200 బస్సులకు ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తయ్యింది. సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. మరో వంద బస్సులు పెండింగ్‌లో ఉన్నాయి. మరమ్మతులు చేపట్టడం వల్ల ఇంకా సర్టిఫికెట్‌లు పొందలేదు. మరోవైపు కాలం చెల్లిన బస్సులు తిప్పకూడదు. ప్రధానంగా విద్యా సంస్థలకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నారు. పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న వాహనాలను విద్యా సంస్థలు వినియోగించకూడదు. అటువంటి బస్సులను పక్కన పెట్టేయాలి. జిల్లాలో ఇంకా వంద బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు మంజూరు కాలేదు. తనిఖీలకు రాలేదు. దాంతో రవాణా శాఖ రంగంలోకి దిగింది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే తిప్పితే చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. రవాణా శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరరావు ఆ దిశగా ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్‌లు, ఇతర సిబ్బంది జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కంబైన్డ్ పశ్చిమ గోదావరి) ఆధ్వర్యంలో సీనియర్ పురుషుల మల్టీడే క్రికెట్ జట్టు ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు ఆర్ఎస్ఆర్ మూర్తి, అశోక్‌కుమార్‌గౌడ్, ఎస్‌కే షాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్నీష్ వర్మ (కెప్టెన్), జివిఎస్ స్వామినాయుడు (వైస్ కెప్టెన్), రావంత్ నాగకుమార్, కెకెఎస్ఎన్ హరీష్, ఎం.హర్షవర్ధన్, జస్వైన్, డెనిష్, భువనేశ్వర్, బి.చరణ్ సాయితేజ, ఎండీ మెహబూబ్ అలీ, ప్రేమ్ చంద్, రుతీష్క్, దీపక్‌చంద్, రక్షణ్, జయకృష్ణ ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూలపాడులో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

## రాజమండ్రిలో 6న రజక ఆకాంక్ష సభ విజయవంతం చేయండి

భీమవరం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఈనెల 6 తేదీన నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభను జయప్రదం చేయాలని ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ కోరారు. భీమవరం పట్టణం పేరంటాల చెరువు ఆదిలక్ష్మి రజక సంఘ భవనంలో నిర్వహించిన రజక నాయకుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజమండ్రి నగర రజక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు రజక కార్పొరేషన్ చైరపర్సన్ సి.సావిత్రి సభాధ్యక్షురాలిగా, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, మంత్రి కందుల దుర్గేష్ ఎంపీ పురందేశ్వరి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్, మీడియా కోఆర్డినేటర్ అమనాపు వెంకటేశ్వరరావు, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం పాత ఓవర్ బ్రిడ్జి వద్ద కాలువలో చెత్త వేయవద్దని సూచిస్తూ వేసిన పెయింట్

# కాలువలను నాశనం చేయకండి

తాడేపల్లిగూడెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : : తాడేపల్లిగూడెం నియోజకర్గంలో నీటి కాలుష్య నివారణ మునిసిపాలిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఏలూరు కాలువపై ఉన్న పాత బ్రిడ్జి గోడపై కాలువలో చెత్త వేయవద్దని..అది మంచినీరు రూపంలో ప్రతి ఒక్కరూ తాగు తారని మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తూ పెయింటింగ్‌తో రాయించారు.. ఇలాంటి సందశాలు చదివి కొంతమందిలో మార్పు వచ్చినా అది సమాజానికి హితంగా ఉంటుం దని భావిస్తున్నారు. పార్టీలకు ప్రచారాలకు ఉపయోగించే ఇలాంటి గోడలను పట్టణ ప్రజలకు సందేశం ఇచ్చే దిశగా అడుగులు వేశారు. తడిచెత్త పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ఆకుపచ్చ, ఎరుపురంగు డస్ట్ బిన్స్ పంపిణీ చేశారు. దీంతో ప్రజల్లో చాలా వరకు మార్పు వచ్చింది. చెత్త బయట వేయ కుండా శానిటేషన్ సిబ్బందికి ఇస్తున్నారు. దీంతో పట్టణంలో చెత్తకుప్పలు కనిపించడం లేదు. పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఇప్పటికే ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఏలూరు కాలువ ప్రక్షాలన కార్యక్రమం చేపట్టారు. దీంతో ఏలూరు కాలువలో ఉన్న చెత్తను తొలగించారు. కాలు వల్లో చెత్తవేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు కాలు వను ఆనుకుని ఉన్న గ్రామాల పంచాయతీ కార్య దర్శులు ప్రత్యేకంగా గ్రామాల్లో అవ గాహన కల్పించారు. నవాబ్‌పాలెం నుంచి ఉప్పాక పాడు అండర్ టన్నల్ వరకు పూడిక తీశారు.

**ప్రజల్లో అవగాహన పెంచాలి**

పట్టణ ప్రజల్లో నీటి కలుషిత విషయంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఏలూరు కాలువలోకి చెత్త పారవేస్తున్నారు. దీంతో నీరు కలుషితం అవుతోంది. దీన్ని గుర్తించి పాత ఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోడపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాయించాం. దీన్ని చూసి కనీసం కొంతమంది మారినా మిగిలిన వారిలో అవగాహన పెరుగుతుంది.

**-మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు**

తణుకు బాలురున్నత పాఠశాల్లో నిర్మాణంలో ఉన్న వాకింగ్ ట్రాక్

# రెడీ అవుతున్న వాకింగ్ ట్రాక్

తణుకు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తణుకు నడి బొడ్డున ఉన్న బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా క్రీడాకారులకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైస్కూలు గ్రౌండులో వందలాది మంది విద్యార్థులు, వివిధ క్రీడాకారులు, ఆటలు ఆడుతుంటాయి. అలాగే అన్ని వయసుల వారు నిత్యం ఇక్కడ వాకింక్ చేస్తుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకుని యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు 5 లక్షలు వెచ్చించేలా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృషి చేశారు. ఇందులో బాగంగా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ద్వారా స్కూలు ఖాతాలో నిధులు జమ చేస్తారు. ఆ నిధులతో ఇప్పటికే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ట్రా చుట్టూ సిమెంటు ఇటుకలతో నిర్మించారు. దానికి ఫినిషింగ్ చేయాల్సి ఉంది. ట్రాక్ మధ్యలో వాలీబాల్, హకీ, కోకో, క్రికెట్ వంటి ఆటలు ఆడుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు.

**త్వరలోనే ప్రారంభిస్తాం**

**ఎమ్మెల్యే ఆరిమిల్లి**

బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మించే వాకింగ్ ట్రాక్‌ను సాధ్యమైనంత తొందర్లోనే పూర్తి చేసి ప్రారంభించి ప్రజలకు, క్రీడాభిమానులకు అందుబాటులోకి తీసు కొస్తాం. క్రీడల్లో యువత రాణించాలంటే కనీస వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని వాకింగ్ ట్రాక్ ఏర్పాట చేస్తున్నాం. రెండో విడతలో తణుకు, ఇరగవరం మండలాలకు 24 లక్షలు చొప్పున రూ.48 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.

# తణుకు ఆసుపత్రిలో రూ.28 లక్షలతో అభివృద్ధి పనులు

తణుకు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర ప్రభు[illegible]పత్రి పాత భ[illegible]లో [illegible] పాటు స్వా[illegible]పత్రి [illegible] ఆరిమిల్లి [illegible]. పాత [illegible] కు [illegible] చర్య[illegible] లో కొత్తగా పైపు[illegible], [illegible] గదులు టైల్స్ [illegible] విధంగా ఏర్పాటు [illegible] ఇంటర్నల్ డ్రైనేజ్ [illegible] అయ్యిందు [illegible] నాలుగు సిమెంటు [illegible] ఓలను మర[illegible] అలాగే కొత్త [illegible], మరు[illegible] కొత్త సిమెంటు రోడ్డు [illegible] అలాగే ఆసుపత్రిలో [illegible] ప్రైవేట్ [illegible] సమస్యల [illegible].

ఆసుపత్రి ప్రాంగణంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

# నిగ్గు తేలేనా.?

**ద్వారకాతిరుమల పంచాయతీలో రూ.2 కోట్ల నిధుల దుర్వినియోగం**

**సర్పంచ్, గత కార్యదర్శి, ఎంపీడీవోలే బాధ్యులంటూ తేల్చిన విచారణాధికారులు**

**తాజాగా ప్రధాన విచారణ..పంచాయతీరాజ్ కమిషనర్‌కు తుది నివేదిక అందజేత**

**ఏం చర్యలు తీసుకుంటారో ..?**

ద్వారకాతిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల పంచాయతీలో కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేసినట్టు ప్రాథమిక విచా రణలో తేలినా ఇప్పటివరకూ పూర్వపు అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి పైసా రాబట్టలేక పోయారు. ప్రాథమిక విచారణ అనంతరం ఇటీవల పూర్తయిన ప్రధాన విచారణ తర్వాత పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి వీరిపై తీసుకోనున్న చర్యల ఉత్తర్వులు ఇంకా వెలువడక పోవడం ఓ కారణమైతే ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ కుంటం స్వర్ణలత కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై కోర్టును ఆశ్రయించి తాత్కాలిక ఊరట పొందడం మరో కారణం. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయాలని సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు విచారణ ముగిసేవరకు ఆమె సర్పంచ్‌గా కొనసాగవచ్చని గతేడాది అక్టోబరు 26న మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో స్వర్ణలత ఈ ఏడాది మార్చిలో సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. లింగపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఇక్కడి పూర్వపు ఎంపీడీవో ఆశీర్వాదాన్ని సస్పెండ్ చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం ఈ దుర్వినియోగంపై మరోసారి ప్రధాన విచారణ కొనసాగింది. జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు విచారణ అధికారిగా, డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా ప్రిసైడింగ్ అధికారిగా విచారణ చేపట్టి తుది నివేదికను కొద్దిరోజుల క్రితం పంచాయతీ రాజ్ కమిషనర్‌కు అందజేశారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు వీరిపై చర్యలు ఉంటాయని అనుకుంటున్నారు.

### రూ.2.03 కోట్లు దుర్వినియోగం

సమాచారహక్కు చట్టం క్రింద అముక్తకు అందించిన నివేదికతోనే అసలు నిజం బట్టబయలైంది. పంచాయతీ సర్పంచ్ కుంటం స్వర్ణలత, కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, అప్పటి ఎంపీడీవో ఆశీర్వాదంలు పంచాయతీ నిధులను రూ. 2 కోట్ల 25లక్షల 33 వేల 822 దుర్వినియోగం చేసినట్లు తేలింది. అయితే విచారణలో నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. ఆ సమయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న లంకలపల్లి వెంకటేశ్వరరావు 2019-2024 వరకూ గ్రామపంచాయితీ సాధారణ నిధుల దుర్వినియోగం, ఇంటి, కుళాయి పన్నులు ద్వారా, లైసెన్స్ ఫీజుల వసూలులో నిర్లక్ష్యం, 14, 15 ఆర్థిక సంఘ నిధులు దుర్వినియోగం వంటి అంశాల ద్వారా కైంకర్యం చేసిన రూ.1, 30, 85, 013 సొమ్ము వసూలు చేయాలని సూచించారు. అలాగే ఇదే అంశాలపై 2021 నుంచి సర్పంచ్‌గా విదులు నిర్వర్తిస్తున్న కుంటం స్వర్ణలత రూ.53,57,376 దుర్వినియోగం చేసిందని దుర్వినియోగం చేసిన సొమ్మును వసూలు చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నివేదికలో సూచించారు. అలాగే 2019 జూలై 10 నుంచి 2021 ఏప్రిల్ 2 వరకూ విదులు నిర్వర్తించిన పూర్వ ఎంపీడీవో ఆశీర్వాదం రూ. 18,73,538 సొమ్ము దుర్వినియోగం చేసారని ఈ అవినీతికి ఆయనను బాధ్యులుగా చూపారు. కార్యదర్శి, పూర్వ ఎంపీడీవోలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో పాటు, దుర్వినియోగమైన పంచాయతీ నిధులను రాబట్టాలని సూచిం చారు. అయితే ప్రాథమిక విచారణ అనంతరం జరిగిన ప్రధాన విచారణ పూర్తయి తుది నివేదిక అందుకున్న పంచాయతీ రాజ్ కమిషనర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ద్వారకాతిరుమల గ్రామ సచివాలయం

**అసలు గుట్టు రట్టయిందిలా..**

ద్వారకాతిరుమల పంచాయతీలో అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త గతేడాది జనవరి 29న ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ ఆదేశాల మేరకు విచారణాధికారిగా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో రజావుల్లా గతేడాది ఫిబ్రవరి 17న విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఖర్చులు, జమలు, వసూళ్ల రికార్డులను పరిశీలించారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఈవోపీఆర్డీ సుబ్బరాయన్ తదితరుల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. విచారణాధి కారి తన నివేదికను 2024 ఏప్రిల్ 26న జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. ఆ తర్వాత కార్యాలయాల చుట్టూ నివేదిక కోసం తిరిగిన అముక్తకు ఎట్టకేలకు సమాచార హక్కు చట్టం కింద దానిని అందజేశారు. .

# వామనమూర్తిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వామనమూర్తిగా జగన్నాథుడు మంగళవారం భక్తజనులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో కమండలం, పాత్రను ధరించి బలిచక్రవర్తిని పాతాళంలోకి తొక్కివేస్తున్నట్లున్న అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. గత నెల 27న ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఈ అలంకారాలు భక్తులను అల రిస్తున్నాయి. ఇందులో భాగంగా జగన్నాదుడు ప్రతీరోజూ దశావతారాల్లో సాక్షాత్కరిస్తున్నారు. ప్రత్యేక అలంకారాలను భక్తులు దర్శించి తరించాలని ఆలయ అధికారులు, అర్చకులు కోరుతున్నారు.

**పానీ పాట్లు**

నరసాపురం మునిసిపల్ కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె బాట పట్టడంతో నీటి సరఫరా నిలిచింది. దీంతో ప్రజలు తాగునీటికి కటకట లాడుతున్నారు. మునిసిపల్ కార్యాలయంలోని ట్యాప్ వద్ద తాగునీటి కోసం పట్టణ ప్రజలు టిన్నులతో ఇలా బారులు కట్టారు.

-నరసాపురం, ఆంధ్రజ్యోతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

## వీఆర్వోలను యథావిధిగా కొనసాగించాలి

ఏలూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులను యథావిధిగా కొనసాగించాలని, వీఆర్వో సిబ్బంది తగ్గకుండా చూడాలని కోరుతూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ విషయంలో జరుగుతున్న పరిణామాలపై మంత్రితో చర్చించారు.రవీంద్రరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులను యథావిధిగా కొనసాగించాలని, అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలుకు వన్‌టైం సెటిల్మెంట్ కింద వెంటనే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రేడ్ 2 వీఆర్వోలకు గ్రేడ్ 1 ప్రమోషన్లు కల్పించి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని రవీంద్రరాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు బి.సుగుణమ్మ, నాయకులు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీ నారాయణ, వి.శ్రీనివాస్, సురేశ్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మండల పరిషత్ అధికారుల జిల్లా నూతన కార్యవర్గం

## ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమోహన్

భీమవరం రూరల్/ఆచంట, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆచంట ఎంపీడీవో బి.కృష్ణమోహన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళవారం భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆచంట ఎంపీడీవో బి.కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గంగాధరరావు(భీమవరం), ఉపాధ్యక్షుడిగా జి.స్వాతి(కాళ్ల), ఎ.శ్రీనివాస్(ఇరగవరం), కోశాధికారిగా సీహెచ్ త్రిశూలపణి (మొగల్తూరు), ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్(ఉండి), సంయుక్త కార్యదర్శిగా శామ్యూల్ (అత్తిలి)తో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజీనామా

పాలకోడేరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలానికి చెందిన వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటూరి నరసింహమూర్తి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం తెలియజేశారు. ఈ మేరకు తన రాజీనామా సమాచారాన్ని విలేకరులకు తెలిపారు. 2009లో వైసీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీ కోసం కష్టపడ్డానని, కానీ పార్టీలో సముచిత స్థానం లేదని, అంతేకాకుండా పార్టీని నడిపించే సరైన నాయకుడు లేడని, పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రొటోకాల్ అనేది పార్టీలో లేదని, నిజమైన కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యత లేదని, ఎస్సీలకు ప్రాధాన్యం తగ్గిందని, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడికి పంపినట్టు తెలిపారు.

## వైభవంగా జగన్నాథ రథయాత్ర

ఏలూరు కార్పొరేషన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్, హరేకృష్ణ క్షేత్ర బృందం సంయుక్తంగా మంగళవారం ఏలూరు నగరంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రకు అపూర్వ ప్రజాస్పందన వచ్చింది. రథంపై జగన్నాథస్వామి, మరో రథంపై రాధాకృష్ణుల విగ్రహాలతో మేళతాళాలు, బాజాభజంత్రీలతో శోభాయాత్రగా పలు డివిజన్లలో కొనసాగింది. కోలాట నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో నగరంలో సందడి నెలకొంది.

## సీఎంను కలిసిన జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్ళపూడి మండలం మలకపల్లి గ్రామంలో నిర్వహించిన పెన్షన్ పంపిణీకి మంగళవారం హాజరైన సీఎం చంద్రబాబుకు రాజమండ్రి విమానాశ్రయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ హృదయ పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందనడానికి పింఛన్ల పంపిణీయే నిదర్శనమని అన్నారు. సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమం పట్ల చూపిన నిబద్ధత ప్రభుత్వ సంకల్పాన్ని మరింత బలపరుస్తుందన్నారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో రెండో రోజు ప్రవేశాలు

నూజివీడు టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రెండో రోజు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగింది. రెండవ రోజు 555 మందికి కాల్ లెటర్లు పంపించగా 444 మంది రిపోర్ట్ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు శాక్ బిల్డింగ్‌లో మొత్తం 25 కౌంటర్లను ఏర్పాటు చేశారు. వర్షం పడుతున్నా విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**రెండో రోజు 434 మందికి ప్రవేశాలు :** ప్రధాన అడ్మిషన్ల ప్రక్రియలో సోమ, మంగళ వారాల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌తో పాటు ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోను అడ్మిషన్లు నిర్వహించారు. రెండో రోజు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొత్తం 434 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా బాలురు 134 మంది, బాలికలు 300మంది అడ్మిషన్లు పొందారు.

**నేటి నుంచి శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్లు :** బుధ, గురువారాల్లో నూజివీడులోని ఎస్ఏసీ ఆడిటోరియంలో శ్రీకాకుళం క్యాంపస్ ప్రవేశాలకు కౌన్సిల్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్ర కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

**CHANGE OF NAME**

★ నేను చిలకపాటి సుబ్బారావు, చిలకపాటి దుర్గారావు కుమారుడిని, 22/07/1995న జన్మించాను. ప్రస్తుతం 10-4-3/1, సూర్యప్రకాశ్ వీధి, చర్చ్ పేట, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 534301లో నివసిస్తున్నాను. నేను నా పేరుని చిలకపాటి సుభాష్‌గా మార్చుకున్నాను. ఈ మేరకు నిడదవోలులో 30/06/2025న నోటరీ ద్వారా ప్రతిజ్ఞ పత్రం సిద్ధం చేశాను. AJH-2524

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

# రైల్లో దొంగలు పడ్డారు..!



రైళ్లలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి..కాస్త ఆదమరిస్తే చాలు విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు, నగదు దోచుకుపోతున్నారు. ఎక్కువగా మహిళలనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. సాధారణంగా ప్రయాణ సమయంలో మహిళలు బంగారాన్ని హ్యాండ్ బ్యాగ్‌లో భద్రపరుస్తారు..దీన్ని గమనించి దొంగలు చోరీలకు దిగుతున్నారు. అలాగే రైళ్లు ఆగినప్పుడు కిటికీల దగ్గర మహిళలు కూర్చున్నప్పుడు వారి మెడలోని వస్తువుల్ని లాక్కుని ఉడాయిస్తున్నారు. ఇలాంటి చోరీలు కూడా గతంలో ఎన్నో వెలుగుచూశాయి

**రైళ్లలో పెరుగుతున్న చోరీలు**
**ఆదమరిస్తే అంతే సంగతులు**
**ప్రయాణికుల్లో భయాందోళనలు**
**ఎక్స్‌ప్రెస్‌లలో తగ్గిన బందోబస్తు**

భీమవరం క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు సౌత్ సెంట్రల్ రైల్వే (దక్షిణ మధ్య రైల్వే) లైన్‌లో తిరిగే రైళ్లను చోరీలకు ఎంచుకుంటున్నారు. ముందుగానే పక్కా ప్లాన్‌తో సిగ్నల్‌ను టాంపరింగ్ చేసి రైళ్లను స్లో చేయించి అనంతరం వారి పని కానిచ్చేస్తున్నారు. రైల్వే పోలీసులు సిబ్బంది కొరత వల్ల రైళ్ళలో అంతంత మాత్రంగానే నిఘా ఉండటంతో వారి పని సులువుగా అయిపోతుంది. ఇటీవల పల్నాడు జిల్లాలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన ఉదంతమే దీనికి ఉదాహరణ. అక్కడ రైళ్ళ సిగ్నల్‌ను ట్యాంపరింగ్ చేసి రైలును స్లో చేసి నగదు దోచుకునేందుకు ప్రయత్నించగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కాల్పులు జరపడంతో దొంగలు పారిపోయారు. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి ప్రాంతాల నుంచి దొంగలు ఈ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. రైళ్ళను ఆపి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసి వారి వద్ద ఉన్న నగదు, బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు వంటివి దోచుకుంటున్నారు. చోరీలు చేసేందుకు ఏకంగా దొంగలు ట్రైనింగ్ తీసుకుంటారంటే దానిని బట్టి దొంగతనాలు ఎలా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు. రైలు స్టేషన్ శివారు ప్రాంతాల్లో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపిన తర్వాత వారే ఒకరిపై ఒకరు నిచ్చెనలా ఎగబాకి కిటికీల వద్ద మహిళల మెడలోని బంగారు వస్తువులను, విలువైన వస్తువులను దోచుకుని ఉడాయిస్తున్నారు.

### సిబ్బంది కొరతతో ఇబ్బందులు

రైళ్లు వేగంగా వెళ్లే సమయాల్లో దొంగలు సిగ్నల్ ట్యాంపరింగ్ చేయడం జరుగుతూ ఉంటుంది. అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్ళల్లో ఏసీ బోగీలకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు ఎక్కువ భద్రత ఇస్తూ ఉంటారు. దానిని అదునుగా చేసుకుని దొంగలు సెకండ్ క్లాస్ రిజర్వేషన్‌లోకి వెళ్లి దొంగతనాలకు పాల్పడతూ ఉంటారు. ఆర్పీఎఫ్ పోలీసులు సెకండ్ క్లాస్ రిజర్వేషన్‌లో కూడా భద్రత కల్పించవలసిన అవసరం ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వల్ల అది సాధ్యం కావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్ళలో ఇలాంటి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సాధారణ రైళ్ళు, పాసింజర్లు, డెమో, మెమో రైళ్ళల్లో కూడా దొంగతనాలు జరుగుతున్నప్పటికీ అవి చిన్నవి కావడం వల్ల చాలా వరకు పోలీసులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉదాహరణకు భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ అది ఇటు కైకలూరు, అటు నరసాపురం, కాల్దరి వరకు విస్తరించి ఉంది. ఈ స్టేషన్‌కు 26 మంది సిబ్బంది అవసరం ఉన్నప్పటికీ ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇలా ప్రతి గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లోను, రైల్వే ప్రొటెక్షన్ పోలీస్ స్టేషన్‌లోను సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది.

### ప్రయాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

రైలు ప్రయాణాలు చేసేటప్పుడు ముఖ్యంగా మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. కిటికీల పక్కన ఎట్టి పరిస్థితుల్లోను తలపెట్టి పడుకోకూడదు. అలాగే ప్రయాణాలు చేసేటప్పుడు మెడలో, చేతికి విలువైన వస్తువులు ధరించరాదు. నిద్రపోయేటప్పుడు తలకింద విలువైన వస్తువులు ఉన్న బ్యాగులను పెట్టుకోకూడదు. విలువైన వస్తువులు ఉన్న బ్యాగులతో ప్రయాణిస్తే మాత్రం తప్పనిసరిగా ఒకరు నిద్రపోయినా మరొకరు మేల్కొని ఉండాలి.సెల్‌ఫోన్లు కూడా ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి. అపరిచితులు వస్తున్నప్పుడు వారి పట్ల జాగ్రత్త వహించి దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలి. లేదా 139 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే రైల్వే పోలీసులు సకాలంలో స్పందిస్తారు. అలాగే పురుషులు కూడా ఎక్కువ సొమ్మును జేబుల్లో పెట్టుకుని ప్రయాణించకూడదు. చేతికి, మెడలోను కూడా బంగారు వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో ఉంచకూడదు.

### ఇటీవల జరిగిన కొన్ని చోరీలు

- ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నం దువ్వాడకు చెందిన ఒక మహిళ రైలు ఎక్కేందుకు టౌన్ రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఎక్కి దిగుతున్న సమయంలో ఆమె బ్యాగును గుర్తు తెలియని దుండగుడు లాక్కుపోయాడు. అందులో సుమారు ఐదు కాసుల బంగారు వస్తువులు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- ఈ ఏడాది జనవరి 8వ తేదీన విశాఖపట్నంకు చెందిన మహిళ మచిలీపట్నం రైలులో బ్యాగును పక్కనే పెట్టుకుని సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆదమరిచింది. దీంతో దొంగలు బ్యాగును దొంగిలించారు. ఆ బ్యాగులో సుమారు మూడు కాసుల బంగారు వస్తువులు ఉన్నాయి.
- ఫిబ్రవరి 23న మచిలీపట్నానికి చెందిన మహిళ ఎల్‌టీటీ రైలులో ప్రయాణిస్తుంది. ఆకివీడు దగ్గర ఆమె బ్యాగు చోరీకి గురైంది. ఆ బ్యాగులో 73 గ్రాముల బంగారం, 90 గ్రాముల వెండి, ఒక ఐఫోన్, రూ. 6 వేలు నగదు దోచుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మార్చి 22వ తేదీన భీమవరానికి చెందిన మహిళ కాకినాడ నుంచి భీమవరం సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నది. అయితే మార్గమధ్యలో ఆమె బ్యాగు కనిపించలేదు. దానిలో 88 గ్రాముల బంగారం ఉన్నట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- ఇటీవల ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుంచి వస్తున్న ప్రయాణికురాలు నిద్రపోతున్న సమయంలో మెడలో ఉన్న బంగారాన్ని తీసి హ్యాండ్ బ్యాగ్‌లో భద్రపర్చుకుంది. నిద్రపోతూ బ్యాగ్‌ను చేతికింద పెట్టుకుంది. రైలు వీరవాసరం వచ్చే సమయానికి లగేజీ చూసుకోగా హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు, దొంగలు ఎప్పుడు ? ఎక్కడ కొట్టేశారో ఇంకా తేలలేదు.
- గత నెలలో లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ కోచ్‌లో ఒక ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్ కూడా పోయింది. ఆమె కూడా ఇదే తరహాలో మెడలోని బంగారాన్ని హ్యాండ్‌లో భద్రపర్చుకుని పడుకుంది. ఆకివీడు వచ్చేసరికి బ్యాగ్ లేదు.. గుడివాడ నుంచి ఆకివీడు వచ్చేలోపు బ్యాగ్‌ను అపహరించారు.
- ఈ ఏడాడి మార్చిలో లింగంపల్లి నుంచి నరసాపురం వస్తున్న ఓ ప్రయాణికురాలు ఏసీ బోగీలో ఖరీదైన ఫోన్‌ను చార్జింగ్ పెట్టి నిద్రలోకి జారుకుంది. దీన్ని గమనించిన బెడ్ రోలర్ ఫోన్‌ను దొంగలించే ప్రయత్నం చేశాడు.. వెంటనే ఆమె మేల్కొని కేకలు వేయడంతో భర్త లేచి దొంగను పట్టుకునే ప్రయత్నం చేసినా అతను తప్పించుకున్నాడు. గుంటూరులో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో బెడ్ రోలర్ ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. దాదాపు 20 ఫోన్లపైనే ఇదే తరహాలో చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలడంతో పోలీసుల సైతం అవాక్కయ్యారు.

**- నరసాపురం (ఆంధ్రజ్యోతి)**

### అపరిచితుల పట్ల జాగ్రత్త వహించాలి

ఎక్కువగా మహిళలు రైలులో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండి, వారి కదలికలపై నిఘా ఉంచాలి.అనుమానం వస్తే 139 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. దొంగలు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైళ్లను ఆపి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఉంటున్నారు. వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. పాత నేరస్తులను బైండోవర్ చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దొంగతనాలు అరికట్టేందుకు రైల్వే రక్షణ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది.

**- దస్తగిరి, భీమవరం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ**

ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ కె.బెన్నయ్య(ఫైల్)

## జాగ్రత్తలు తీసుకుంటే సేఫ్

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణం అంటే సులువైనది.. చౌకైనది. సుదూర ప్రాంతాలు సైతం తక్కువ సమయంలో సురక్షితంగా చేరుకోగలమని నమ్మకం. అయితే రైళ్లలో ఇటీవల చోరీలు పెరగడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో పొలాలు, అటవీ ప్రాంతాల మధ్య చైన్ లాగి రైలు ఆపి దోపిడీకి పాల్పడుతుంటారు. ఆయుధాలతో ప్రయాణికులను బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, బ్యాగ్‌లను తస్కరించి చీకటిలో కలిసిపోతారు. 2002 వేసవి కాలంలో బాదంపూడి సమీపంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును చైన్‌లాగి ఆపై ప్రయాణికుల నుంచి వస్తువులు తస్కరించడానికి ప్రయత్నించగా ప్రయాణికులు తిరగబడ్డారు. రైలులో ఉన్న పోలీసులు గాలిలో కాల్పులు జరపడంతో రైలుపై దొంగలు రాళ్లు విసురుకుంటూ పొలాల్లోకి వెళ్లిపోయారు. రైళ్ళల్లో సెల్‌ఫోన్లు తస్కరించడం, హ్యాండ్ బ్యాగ్‌లను తస్కరించడం వంటి సంఘటనలు ఈ మూడేళ్లలో 15 వరకూ ఉన్నాయి. 2023లో నూజివీడు రైల్లే స్టేషన్ సమీపంలో రైలులో ప్రయాణిస్తున్న ఒక మహిళ వాష్‌రూమ్‌కు వెళ్ళిన సమయంలో ఒక వ్యక్తి ఆమె మెడలోని బంగారు చైన్ తెంపుకుని రైలు దిగి పారిపోయాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆ నేరస్తుడిని మొత్తం మీద అరెస్టు చేశారు. 2023 ఆగస్టు నెలలో ఒక జ్యూవెలరీ వ్యాపారి తన వద్ద ఉన్న వివిధ రకాల మోడల్స్ 1 కేజీ 670 గ్రాములు బరువు ఉన్న బంగారపు వస్తువులను తన గుమస్తాకు ఇచ్చి విశాఖపట్టణంలో బంగారు వ్యాపారులకు చూపించడానికి పంపించారు. నాలుగు రోజుల తరువాత ఆ గుమస్తా తన స్నేహితుడితో కలిసి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ వెళుతున్న సమయంలో వారిద్దరు నిద్రపోవడంతో వారి వద్ద ఉన్న నగల సూట్‌కేసు అపహరణకు గురైంది. ఈ సంఘటనపై విజయవాడలో ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదు చేసిన తరువాత ఏలూరుకు బదిలీ చేశారు. మొత్తం మీద ఈనేరం మహారాష్ట్రలోని షోలాపురి గ్యాంగ్‌నకు చెందిన ఆరుగురు వ్యక్తులు పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించి ఒక వ్యక్తిని అరెస్టు చేయగలిగారు. మిగిలిన ఐదుగురి కోసం వేట కొనసాగిస్తూనే ఉన్నారు.

### అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

నడుస్తున్న రైళ్ళకు ఎక్కడైనా సిగ్నల్ వ్యవస్థలో సమస్య ఏర్పడి రైళ్ళు మధ్యలో ఆపాల్సి ఉంటే ఆ సమాచారం ముందుగానే ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులకు తెలియజేయాలని స్టేషన్ మాస్టర్లకు, సూపర్‌వైజర్లకు చెప్పాం. నేరాల నియంత్రణ కోసం ప్రయాణికులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తున్నాం. కిటికీ వద్ద కూర్చునేవారు బంగారు ఆభరణాలు ధరించి ఉంటే అవి కనిపించకుండా చున్నీ కాని, చీర కొంగు కాని కప్పి ఉంచుకోవాలి. రైలులో వాష్‌రూమ్‌కు వెళ్ళేటప్పుడు తోడుగా మగవారిని తీసుకువెళ్లాలి. బంగారపు వస్తువులు జాగ్రత్తగా తీసుకువెళ్ళాలని తెలియజేస్తున్నాం. కొవ్వూరు గోదావరి బ్రిడ్జి నుంచి విజయవాడ సమీపంలోని ముస్తాబాద వరకూ రైళ్లలో పూర్తి భద్రత కల్పిస్తున్నాం.

**- కె.బెన్నయ్య, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్**

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గాలిముట్టి పండు మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ బ్రిడ్జిని ఢీకొన్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణా జిల్లా పెడన గ్రామానికి చెం దిన గాలిముట్టి పండు (19) అతని బంధువు ఏసుపోగు చిన్నారావు తాపీపనులు చేస్తుంటారు. వీరు గతంలో రాజమండ్రిలో తాపీ పనులు చేసినప్పుడు ఏలూరుకు చెందిన మేస్త్రి సొమ్ములు ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ము తీసుకోవడానికి వీరు మంగళవారం మోటారు సైకిల్‌పై ఏలూరు వస్తూ ఏలూరు కలపర్రు టోల్‌గేటు సమీపంలోని మద్యం దుకాణం వద్ద మద్యం తాగారు. అక్కడ నుంచి బైపాస్‌లో బయలు దేరగానే కొద్దిదూరం వెళ్ళగా బైక్ అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీ కొన్నారు. ఈ ఘటనలో మోటారు సైకిల్ నడిపిన పండు అక్కడికక్కడే మృతి చెందగా, వెనక కూర్చున్న చిన్నారావు స్వల్ప గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఏలూరు త్రీ టౌన్ సీఐ వి. కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళి కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## భార్య మద్యం తాగవద్దన్నందుకు..

ఆత్మహత్య చేసుకున్న హానక్ మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన భర్త పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగపాలెం మండలం అయ్యప్పరాజ గూడెం గ్రామానికి చెందిన కొప్పాల హానక్ (25)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతను కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన హానక్ పనులకు వెళ్ళకుండా ఉండడంతో భార్య మంగళవారం ఉదయం మందలించింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. మనస్థాపానికి గురైన హానక్ పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ధర్మాజీగూడెం ఆసుపత్రికి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో పట్టపగలు దొంగలు రెచ్చిపోతున్నారు. ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై వెళ్తున్నారంటే క్షణాల్లో బైక్‌పై వచ్చి వారి చేతిలో ఫోన్ తస్కరించి పరారవుతున్నారు. బైక్ నంబర్ గుర్తించడానికి ప్రయత్నిస్తే అసలు నంబర్లే ఉండడం లేదు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కేవలం సెల్‌ఫోన్ పోయిన పోర్టల్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సలహా ఇస్తున్నారే తప్ప పట్టపగలు రోడ్లుపైన ఫోన్లను బలవంతంగా తస్కరిస్తుంటే కేసులు నమోదు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

### నంబర్ లేని బైక్‌పై వస్తారు...

# సెల్ ఫోన్లు కొట్టేస్తారు..!

నంబరు ప్లేట్‌లేని బైక్‌పై వచ్చిన సెల్ ఫోన్ దొంగలు

● కేసులు నమోదు చేయని పోలీసులు ● అదే నేరస్థులకు వరం!

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో గతంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నంబర్ లేని వాహనాలను గుర్తించి వాటికి ఈ-చలానా విధించే వారు. అంతేకాక ఆ వాహనం ఇంజన్‌ను బట్టి నంబర్‌ను, సీ-బుక్‌లో ఉన్న నంబర్‌ను పరిశీలించి ఆ నంబర్ ప్లేటు బిగించిన తరువాతే మోటారు సైకిల్‌ను విడిచిపెట్టేవారు. ఒక వేళ సీ-బుక్కు లేదంటే ఖచ్చితంగా తీసుకురావాలని తెలిపి వాహనాన్ని తమ అధీనంలోకి తీసుకునే వారు. దీంతో దొంగ మోటారు సైకిళ్ళు పోలీసు లకు అనేకం చిక్కేవి. అయితే నేడు నగరంలో పోలీసుల వాహనాల తనిఖీ కొడవడింది. దీంతో నంబర్ లేని వాహనాలతో చక్కర్లు కొడుతున్నారు. ఇక ఈవ్ టీజింగ్‌కు కూడా పాల్పడుతున్నారు. ఎవరైనా ఆ వాహనాన్ని గుర్తించడానికి ప్రయత్నిద్దామన్నా నంబర్ లేకపోవడంతో ఏమీ చేయలేని దుస్థితి. ఒక న్యాయవాది మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద వెనుకగా మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు న్యాయవాది జేబులో ఉన్న ఫోనును తస్కరించి మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సలహా ఇచ్చారు. వాస్తవానికి దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఒక రిటైర్డ్ ఎంఈవో నాలుగు రోజుల క్రితం శాంతినగర్‌లో ఒక చర్చి వద్ద నిలబడి ఉండగా పట్టపగలు ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఒక యువకుడు ఆయన పక్కగా వచ్చి జేబులో ఉన్న ఫోన్‌ను తస్కరించి మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. ఇలాంటి ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేయకపోవడంతో ఆ నేరస్థులకు వరంగా మారింది. దీంతో నేరాలకు తెగబడుతున్నారు. నేరాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి తమ ఫోన్లు ఇప్పించాలంటూ బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నెంబర్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో భయాన్ని తొలగించాలి.

## అత్తింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు

ఏలూరు క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టి. నర్సాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన వెల్లంపల్లి సుజాతకు వెంకటరమణతో 2012లో వివాహమైంది. వీరికి సంతానం లేదు. సుజాతను భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు సూటిపోటు మాటలతో శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. సీఐ ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెల్లపు ఊట ధ్వంసం.. సారా స్వాధీనం

కుక్కునూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కుక్కునూరు మండలంలో సారా స్థావరాలపై దాడులు చేసినట్టు కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం సీఐ తన సిబ్బందితో కలిసి కిన్నెరసానివాగు ఒడ్డున దాడులు చేసి 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారుల సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి సారా స్థావరాలపై దాడులు చేస్తామన్నారు.

మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం

నరసాపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): నరసాపురం ప్రధాన పంట కాలువలో మంగళవారం గుర్తుతెలియని మహిళ (35) మృతదేహం కొట్టుకువచ్చింది. రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద కాలువలో తేలుతున్న ఈ మృతదేహన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాలువ నుంచి బయటకి తీయించి పోస్ట్‌మార్టం నిమి త్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ యాదగిరి తెలిపారు.

## పుణ్య క్షేత్రాలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు దోచేశారు..

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలు దర్శించేందుకు వెళ్లిన వారు తిరిగొచ్చేసరికి ఇల్లు దోచేశారు. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణ ఎస్సై ఎం. నాగరాజు వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం సుబ్బారావు పేటకు చెందిన బల్ల లలిత కుటుంబంతో కలిసి తిరుపతి తదితర పుణ్యక్షేత్రాలు దర్శించుకు నేందుకు జూన్ 24న వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పరిశీలించగా 6 కాసుల బంగారు వస్తువులు, కేజీ వెండి చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు వివరించారు.

## స్కూల్ బస్సుల్లో ఎంవీఐ తనిఖీలు

పాలకొల్లు టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖాధికారి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజ్మీర బద్దు ఆధ్వర్యంలో పలు పాఠశాలల బస్సులను తనిఖీలు నిర్వహించారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ బాక్సులు, పిట్నెస్‌లు, అగ్ని ప్రమాద నివారణ పరికరాలు, డ్రైవర్ లైసెన్స్ వంటి పలు అంశాలను తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా లేని వాహనాలపై జరిమానాలు విధించినట్టు తెలిపారు.

## 'ఆమరణ దీక్షలు చేపడతాం'

నరసాపురం టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణం పరిష్కరించక పోతే ఆమరణ దీక్షలు చేపడతామని మునిసిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు హెచ్చరించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏనిమిదో రోజు మంగళవారం రిలే దీక్ష చేపట్టారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వ పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రత్నం, కాశీ, కిషోర్, సత్యనారాయణ, సుజాత, శ్యామ్, బత్తుల శ్రీను, కల్యాణి పాల్గొన్నారు.

నరసాపురంలో చెరువును పరిశీలిస్తున్న విప్ నాయకర్, పొత్తూరి రామరాజు

## తాగునీటి ఇబ్బందులు తలెత్తకూడదు : నాయకర్

నరసాపురం, జూలై1(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విప్ నాయకర్ ఆదేశించారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఆయన మునిసిపల్ చెరువును మంగళవారం పరిశీలించారు. వాటర్‌వర్క్స్‌లో నీటి శుద్ధిని తనిఖీ చేశారు. అనంతరం నాయకర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని విని యోగించి అన్ని వార్డులకు నీటి సరఫరా జరిగే విధంగా చూడాలన్నారు. అనంత రం మునిసిపల్ కౌన్సిల్‌హాల్‌లో సీసీ కెమెరా ప్రాజెక్టు ఫండింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటికి దాతల సహకారంతో నిధులు సమకూర్చడం అభినంద యమన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పెద అమిరంలో గ్రామ కమిటీకి ఎంపికైన సభ్యులతో నాయకులు

కాళ్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్ అన్నారు. కాళ్ల మండలం బొండాడ, వేంపాడు, పెద అమిరం గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీ ఏర్పాటుకు మంగళవారం కమిటీల ఎన్నికల పరిశీలకుడు గోపాలకృష్ణంరాజు సమక్షంలో సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోనూ కమిటీలకు సంబంధించి పేర్లను నమోదు చేసుకున్నామని, ఏకగ్రీవంగా నాయకులు కమిటీలకు పేర్లు అందించినట్లు వారు స్పష్టం చేశారు. ఆకివీడు, ఉండి డీసీ చైర్మన్లు గోకరాజు వెంకట శివరామరాజు, తోట ఫణిబాబు, మండల అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, కఠారి వెంకట నరసింహరాజు, ఆముదాలపల్లి వీరబ్రహ్మం, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథ రాజు, జడ్పీటీసీ సోమేశ్వరరావు, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది

## 'విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి'

పెంటపాడు, జూలై1(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంఈవో -2 టి.వీరమల్లయ్య అన్నారు. రావిపాడు నెంబర్-1 మోడల్ ప్రైమరీ పాఠశాలలో సుమారు ఏనిమిదేళ్ల పాటు విద్యార్థులకు బోధించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు నెక్కంటి చందూర్‌బాబు, జి.పద్మజ, టి.సత్యనారాయణలను పాఠశాల హెచ్‌ఎం కె.శేషగిరిరావుతో పాటు గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ములగాల సుబ్రహ్మణ్యం, కాజులూరి మల్లేష్ పాల్గొన్నారు.

## ఏఎస్ఐకు స్వల్ప అస్వస్థత

ఆకివీడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఏఎస్ఐ బండి సత్యనారాయణ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సందర్భంగా స్థానిక ఏఎస్ఐ సత్యనారాయణ మంగళవారం బందోబస్తుకు వెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా ఏఎస్ఐ స్వల్ప అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు.

# తొలి అడుగు

(5వ పేజీ తరువాయి)

నేతలకు ఇంటింటా తెలుగుదేశం, సుపరిపాలన, తొలి అడుగుపై కర్తవ్యబోధ చేశారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటి గడపను తాకాలని హిత బోధ చేశారు. సుపరిపాలనపై ప్రజల అభిమతాన్ని ప్రభుత్వం తెలుసుకుంటుంది. ప్రభుత్వ పనితీరు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం పాలన తీరు, అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిపై ప్రజలను చైతన్య పరచనున్నారు. విపక్షాలపై విమర్శల కంటే కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని దిశా నిర్దేశం చేశారు. ఇటీవల రాష్ట్ర కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు హితబోధ చేశారు.

### జిల్లాలో సన్నద్ధం

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమానికి నేతలు సన్నద్ధమయ్యారు. క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించనున్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందరికీ వివరించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లు మంగళవారం సన్నాహక సమావేశాలను నిర్వహించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు తమ మొబైల్ ఫోన్‌లో ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను అప్‌లోడ్ చేసుకున్నారు. ఒక్కో బూత్ ఇన్‌చార్జ్ ప్రతిరోజు 50 ఇళ్లకు వెళ్లి వారితో ఫోటో తీసుకుని సమ స్యలను అడిగి తెలుసుకుంటారు. వాటిని యాప్‌లో వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. మండల, పట్టణ, గ్రామ కమిటీలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించాలని అధిష్ఠానంతోపాటు, నియోకవర్గ బాధ్యులు దిశానిర్దేశం చేశారు. మై టీడీపీ యాప్‌ను అప్‌లోడ్ చేసుకుని నెలరోజులపాటు ప్రజలతో మమేకం అయ్యేలా సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు.

### ఏడాది పాలన ఎలా ఉంది..

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఎలా ఉందనే దానిపై ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల మనోగతాన్ని తెలుసుకుంటారు. బాగుంది, బాగోలేదు, పర్వాలేదు అనే మూడు ఆప్షన్‌లు ఉంటాయి. ప్రతి ఇంటిలో అభిప్రాయాలను మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇంటికి వెళ్లినప్పుడు పెన్షన్, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలెండర్లు, రేషన్ కార్డు, మత్స్యకారుల సేవలు, చేనేతలకు ఉచిత విద్యుత్, టిడ్కో ఉచిత ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలపై సమస్యలు చెబితే వారి వివరాలను నమోదు చేస్తారు. వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయనుంది. సమస్యలపైనా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సరైన సమాధానం చెపాల్సి ఉంటుంది. ప్రజల్లోకి ప్రభుత్వ పాలన తీసుకువెళ్లడానికి సుపరిపాల నపై తొలి అడుగు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని భీమవరం, ఉం డి, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, పాల కొల్లు, నరసాపురం నియోకవర్గాల్లో కేడర్ సర్వసన్నద్ధమైంది. నియోజకవర్గాల వారీగా తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లు విస్తృతస్థాయి సమావేశాలను ఏర్పాటుచేసి కార్యకర్తలను సమాయత్తపరిచారు.

# సమ్మె విరమించండి

(5వ పేజీ తరువాయి)

వారు విధులకు హాజరు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్న నేపథ్యంలో సమ్మె విరమించేలా చర్యలు చేపడుతున్నారు. ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేసినా అధికారుల సూచనల మేరకు ఏమి జరుగుతుందో వేచి చూడాలి.

### ప్రధాన డిమాండ్స్ ఇవీ..

- అత్యవసర విభాగంలోని నీటి సరఫరా, ఫిట్టర్స్, ఎలక్ట్రీషియన్, టౌన్ ప్లానింగ్, సెక్యూరిటీ గార్డ్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఆఫీస్ అటెండర్స్, ఇంజనీరింగ్ అన్ని విభాగాల టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్‌కు రూ.24,500 జీతం అమలు చెయ్యాలి.
- 10 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఇంజనీరింగ్ మునిసిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి.
- ఆప్‌కాస్‌ను రద్దుచేసి కార్మికులను పర్మినెంట్ చెయ్యాలి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చెయ్యాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లు చెయ్యాలి
- రిటైర్డ్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.10 లక్షలు గ్రాడ్యుటీ, నెలకు రూ.10వేలు పింఛన్ ఇవ్వాలి.

తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరంలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి.. వలవల బాబ్జి, టీడీపీ నాయకులు.. తోట సీతారామలక్ష్మి

# పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా

» తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, జూలై1(ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని నాలుగో వార్డులో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 35 వేల పింఛన్లకు రూ.150కోట్లు పైగా అందిస్తున్నట్లు వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు:దేశంలోనే రికార్డు స్థాయిలో పింఛన్లను పెంచి అవ్వా, తాతలకు అందిస్తున్నామని భవన, కార్మికుల వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని పలు వార్డులలో, పెంటపాడు మండలం, పుల్లాయిగూడెంలలో పింఛన్ల పంపిణీ ఆయన పాల్గొన్నారు. కె.పెంటపాడులో పింఛన్ తీసుకున్న వృద్ధురాలు తన ఇంట్లో ఉన్న దివంగత ఎన్టీఆర్ చిత్రపటం తీసుకుని కృతజ్ఞతలు తెలిపింది. టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, నాయకులు మైలవరపు సుబ్బారాయుడు, ఆలపాటి రాంబాబు, మేకా నరేష్ పాల్గొన్నారు. కిలపర్తి వెంకట్రావు, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, పాల్గొన్నారు.

● ఆచంట/మొగల్తూరు/నరసాపురం టౌన్:ఆచంట మండలంలో 92 శాతం పింఛన్లు పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. మొగల్తూరు మండలంలో 87 శాతం పూర్తి చేశామని ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం త్వరలో కొత్త పింఛన్లు అందిస్తుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో మత్స్యకార సహకార సమాఖ్య సంఘాల చైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, మావూరి ఆనంద్ ఉన్నారు.

● పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణంలోని బ్రాడీపేటలో వృద్ధులు, దివ్యాంగులకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పింఛన్లు అందజేశారు.

● ఆకివీడు : ఆకివీడు ఆరో వార్డులో మంగళవారం ఇవ్వాల్సిన పింఛన్లు అధికారులు ఇవ్వలేదు. దీనిపై అధికారులను ప్రశ్నించగా ఆ వార్డుకు సంబంధించిన సిబ్బంది డీఎస్సీ పరీ క్షకు వెళ్లారని, సాయంత్రం ఐదు గంటలకు వచ్చి అందించారని స్థానిక జనసేన కౌన్సిలర్ గుర్రాని సత్యవతి తెలిపారు.

## నేటి నుంచి 'సుపరిపాలన, తొలి అడుగు'

భీమవరంటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భీమవరం నియోజకవర్గంలోని గ్రామాలు, వార్డులలో బుధవారం నుంచి 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని నియోజక వర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. భీమవరం పట్టణం బలుసుమూడిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాన్ని అందజేసి ప్రత్యేక యాప్‌లో ప్రజల అభిప్రాయాలు సలహాలు సూచనలు నమోదు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు ఉప్పులూరి చంద్రశేఖర్, బొక్క శ్రీను, బొల్లా రాంబాబు, గంధం రాధ, వీరమల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

### 'సుపరిపాలన తొలి అడుగు' విజయవంతం చేయాలి : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. ఈ కార్యక్రమంపై మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, సబ్నీసు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మంచినీళ్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

## తండ్రి పేరిట ఏటా సేవా కార్యక్రమాలు

నరసాపురం రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తన తండ్రి బండారు ప్రతాప్‌నాయుడు పేరిట ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. మంగళవారం సరిపల్లిలో ప్రతాప్‌నాయుడు జయంతి పురస్కరించుకుని ఉచితంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. మహిళలకు స్వచ్ఛమైన నీరును సర్పంచ్ ఈదా సురేష్‌తో కలిసి అందించారు. బండారు పటేల్‌నాయుడు, కేదాసు కనకరాజు, నాని, నాగేశ్వరరావు, రత్నరాజు, మైలాబత్తుల ఉమా, హరి, రాంబాబు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'అల్లూరి' జయంత్యుత్సవాలు

భీమవరంటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి):భీమవరంలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్టు అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తెలిపారు. మంగళవారం భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడారు. 2న క్విట్ ఇండియా స్తూపం వద్ద జయంత్యుత్సవాలు ప్రారంభిస్తామని, 2,3 తేదీల్లో అన్ని విగ్రహాలకు నివాళులు, విద్యార్థులకు పోటీలు, 4న ప్రధాని మోదీ ఆవిష్కరించిన సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జనసేన పార్టీ నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, మందిర కార్యదర్శి కుక్కల బాల, జనపాటి మధుసూదనరావు, ఫణి పాల్గొన్నారు.

## 'విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి'

భీమవరంటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసేటువంటి ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ స్మార్ట్ మీటర్లను పెట్టాలనుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అమలు చేయడం సిగ్గుచేటన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, చింతకాయలు బాబూరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 'కార్మికుల సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలి'

తాడేపల్లిగూడెం రూరల్,జూలై 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునః ప్రారంభిస్తారని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పాలరాతి ఆదినారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మిక భవనంలో మంగళవారం యూనియన్ వర్కింగ్ ప్రసిడెంట్ పడాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా సంక్షేమ బోర్డు ప్రారంభం పెండింగ్ లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అత్తిలి బాబి, కోశాధికారి కోడే సాయిబాలాజి, కార్యవర్గ సభ్యులు మెండెన్ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

## గురుభక్తిని చాటిన పూర్వ విద్యార్థులు

పెనుగొండ, జూలై 1(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం జిల్లా పరిషత్ హైస్కూలులో 1975-76లో చదువుకున్న విద్యార్థులు అప్పటి తెలుగు మాస్టర్ గాదే శ్రీరామచంద్రమూర్తి (రాము మాస్టారు) సిద్ధాంతం గ్రామంలో ఒక ఆధ్యాత్మిక ప్రవచనం చెప్పడానికి రావడంతో అప్పటి పూర్వ విద్యార్థులకు తెలిసి ఆయన సత్కరించి ఆశీస్సులు పొందారు. తమకు విద్య నేర్పిన రాము మాస్టారును చూసి పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురై వారికి పాదాభివందనాలు చేశారు. పూర్వ విద్యార్థులు ర్యాలీ సాయిబాబు, కలగ గణేష్, జయవరపు నానాజీ, పాతపాటి రామరాజు, పిల్లి విష్ణుమూర్తి, కరీముల్లా షా, కలగ సత్యనారాయణ, కోట్ల సత్యనారాయణ ఉన్నారు.

పాలకోడేరులో వైద్యులకు మొక్కలు అందిస్తున్న సిబ్బంది, తాడేపల్లిగూడెంలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

# ఘనంగా ప్రపంచ వైద్యుల దినోత్సవం

భీమవరంటౌన్, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా ప్రపంచ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. వైద్యులు ప్రాణదాతలని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అన్నారు. భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ చీడే సత్యనారాయణను సత్కరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి సలీంఖాన్, తదితరులు పాల్గొన్నారు. భీమవరం జేపీ రోడ్డులోని జేపీ కంప్యూటర్స్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.గోపాలకృష్ణంరాజు, డాక్టర్ ఎన్.శంకర్ కుమార్ వర్మ, డాక్టర్ చుండూరి మల్లీశ్వరి, లయన్ ఆడిటర్ కేఎస్ఎన్ రాజులను సత్కరించారు. పట్టణంలోని మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, సీఏ డే సందర్భంగా నడింపల్లి రామకృష్ణ, లయన్ సీఏ మండా శ్రీకాంత్ గుప్తా, సీఏ గుండా ప్రతాప్‌లను సత్కరించారు.

● పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రి ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు శిడగం సతీష్ అధ్యక్షతన నరసాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేదను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాస్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి హాజరయ్యారు. 15 మంది వైద్యులను సత్కరించారు.

● ఆచంట : ఆచంటలో ఉల్లం రామాంజనేయులు క్లినిక్‌లో తణుకు ఆపిల్ ఆసుపత్రి వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శివ నాగరాజు, డాక్టర్ కోటేశ్వరరావు, ఎండీ పల్మా పలువురికి వైద్యం అందజేశారు.

● తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో మహిళా అధ్యక్షురాలు డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పిజసత్యప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.పద్మజ, డాక్టర్ షమిరాణీలను సత్కరించారు. జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారా యణ, వైద్యులను సత్కరించారు.

● గణపవరం: గణపవరంలో పీఎంపీల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు నిడమ ర్తి జయసూర్యను గణపవరం పీహెచ్‌సీలో జరిగిన వేడుకల్లో జిల్లా పీఎంపీల అసోసియే షన్ అధ్యక్షుడు ఏఆర్‌కే.పరమేశ్వర్లు, గణపవరం మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి తదితరులు ఘనంగా సత్కరించారు. గణపవరం, పిప్పర ప్రభుత్వ వైద్యాధికారులు గోకర్ణ, శ్రీదివ్యలను సత్కరించారు.

● తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు శిబిరం మంగళవారం నిర్వహించారు. డాక్టర్. బి.రమేష్‌చంద్రబాబు 27 మందికి పరీక్షలు చేసి రిపోర్టులు అందజేశారు. అనంతరం ఆయనను సంఘ ప్రతినిధులు సత్కరించారు.

●ఉండి / కాళ్ల / ఆకి వీడు / పాలకోడే రు: ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉండి ఎంపీపీ హరినాధరాజు ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు గాదిరాజు రంగరాజు అధ్యక్షతన వైద్యులు సాయచంద్ర, సునందలను ఘనంగా సన్మానించారు. కాళ్ల మండలం కాళ్ల ప్రభుత్వాసుపత్రిలో వీహెచ్‌సీ డాక్టరు సీహెచ్. రంగనాయుడు, ఎస్.సునీల్‌ను సత్కరించారు. వైద్యులను ఆకివీడు, ఆదర్శ, అభయా క్లబ్ అధ్యక్ష-కార్యదర్శులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పాలకోడేరు మండలం పాలకోడేరు పీహెచ్‌సీలో సంబంధిత సిబ్బంది డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, డాక్టర్ స్వర్ణ నిరంజనిలను ఘనంగా సత్కరించారు.

## 6 వరకు పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

తణుకు/తణుకురూరల్,జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 6 వరకు పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీరేబిస్ టీకాలు వేస్తామని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్. డాక్టర్.వి. ప్రసాదు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తణుకు పరిసర ప్రాంత పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## రేపు ట్రస్టు ఆసుపత్రికి వైద్యుల రాక

పెంటపాడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 3వ తేదీన రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసర మైన వారికి అన్నిరకాల రక్త పరీక్షలతో పాటు, ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారన్నారు.

## వాండ్రంలో సీసీఆర్‌సీ కార్డులు

ఉండి,జూలై1(ఆంధ్రజ్యోతి):కౌలు రైతులంతా విధిగా సీసీఆర్‌సీ కార్డులను తీసుకోవాలని సర్పంచ్ దాసరివెంకటకృష్ణ అన్నారు. మంగళవారం వాండ్రంలో గ్రామ సచివాలయం వద్ద కౌలు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ కౌలుదారునికి సీసీఆర్‌సీ కార్డులను అందించామన్నారు. ఆర్ఐ కార్తీక్, వీర్వో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఉత్తమ ప్రెసిడెంట్‌గా సతీశ్‌కు అవార్డు

పాలకొల్లు టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రోటరీ క్లబ్‌కు ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు సతీశ్‌కు లభించింది. రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ రావాడ సతీశ్‌కు మంత్రి కందుల దుర్గేష్, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరావు అందజేసినట్టు సతీశ్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా తమ క్లబ్‌కు 17 అవార్డులు లభించాయన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీల పోస్టులకు దరఖాస్తులు

పాలకొల్లు అర్బన్, జూలై1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి ఈనెల 8వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. అయా సెబ్జెక్ట్‌లలో పీజీ డిగ్రీలో 55శాతం పైన మార్కులు కలిగి ఉండాలని, అదనపు అర్హతలుగా పీహెచ్‌డీ, నెట్, ఏపీసెట్, బోధన అనుభవం కలిగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 70136 29841 నంబరులో సంప్రదించాలన్నారు.


CUB TRUST AND EXCELLENCE SINCE 1904

**సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్**
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in, ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

**SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన**

దిగువ ఇందులో తెలిపిన రుణగ్రహీతలు / హామీదారుల ద్వారా బ్యాంకుకు ఉన్న తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలతోపాటు బ్యాంకుకు ఉన్న దిగువ తెలిపిన సెక్యూర్డ్ రుణాలను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

**భాగం - 1**
రుణగ్రహీతల పేర్లు :నం.1) శ్రీమతి సింహాద్రి భవాని, భర్త సింహాద్రి పోతురాజు, డి.నం. 15-138, గొల్ల గూడెం, మొగల్తూరు పోస్ట్, మొగల్తూరు - 534281, నం.2) శ్రీ సింహాద్రి పోతురాజు, తండ్రి పాండు రంగా రావు, డి.నం. 15-138, గొల్ల గూడెం, మొగల్తూరు పోస్ట్, మొగల్తూరు - 534281, నం.3) శ్రీమతి కె. లీలా కామాక్షి, భర్త సురేష్ బాబు, డి.నం.7-2-109, వైద్యనాథం వీధి, విద్యానగరం, అమలాపురం - 533201
బకాయి మొత్తం: 23.03.2025 నాటికి రూ.1,67,93,458 (రూపాయలు ఒక కోటి అరవై ఏడు లక్షల తొంభై మూడు వేల నాలుగు వందల యాభై ఎనిమిది మాత్రమే) + 24-03-2025 నుండి చార్జ్ చేయబడనున్న ప్రాప్తించిన వడ్డీ + రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంకుకు ఉన్న ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలు.

| మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల వివరణ | రిజర్వు ధర | వేలం తేదీ & సమయం |
|---|---|---|
| (కె. లీలా కామాక్షి భర్త సురేష్ బాబుకు చెందిన ఆస్తి) ఆం.ప్ర, పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు, డి.నం.15-6 సమీపాన గల ఆస్తి మరియు ఆర్.ఎస్ నం.501/9, ఆస్‌బెస్టాస్ షీట్స్ రూఫ్ షెడ్ తో726 చ.గజాలు లేదా ఎ.0.15 సెంట్ల విస్తీర్ణ స్థలం. సరిహద్దులు: తూర్పు: ఈ ఆస్తి 12.00 అడుగుల వెడల్పు ఉమ్మడి దోవ తర్వాత తోట వెంకట లింగేశ్వర రావు స్థలం, దక్షిణం: సింహాద్రి వెంకట నరసింహారావు స్థలం, పశ్చిమం: కట్టోజు సురేష్ బాబు స్థలం, ఉత్తరం: సింహాద్రి జల దుర్గ స్థలం. | రూ.40,00,000/- (నలభై లక్షల రూపాయలు మాత్రమే) | 24.07.2025న మ.01.00 గం.కు |

**భాగం - 2**
రుణగ్రహీతల పేర్లు : నం.1) శ్రీ కొప్పాడి చెన్నకేశవ రావు, తండ్రి సామోరు, డి.నం.10-168, చిన్న గొల్లపాలెం, కృతివెన్ను, కృష్ణా-521324. నం.2) శ్రీమతి కొప్పాడి జయలక్ష్మి, భర్త కొప్పాడి చెన్నకేశవరావు, డి.నం.10-168, చిన్న గొల్లపాలెం, కృతివెన్ను, కృష్ణా-521324. 3) శ్రీ కొల్లేటి ధర్మరాజు, తండ్రి నరసింహస్వామి, డి.నం.4-144-1, మెయిన్ రోడ్, ముత్యాలపల్లి,మొగల్తూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ -534281. నం.4) శ్రీమతి కొల్లేటి రామలక్ష్మి, భర్త. కొల్లేటి ధర్మరాజు, డి.నం.4-144-1, మెయిన్ రోడ్, ముత్యాలపల్లి,మొగల్తూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ -534281
బకాయి మొత్తం: 20.05.2025 నాటికి రూ.62,14,113/- (రూపాయలు అరవై రెండు లక్షల పద్నాలుగు వేల ఒక వంద పదమూడు మాత్రమే) + 21-05-2025 నుండి చార్జ్ చేయబడనున్న ప్రాప్తించిన వడ్డీ + రుణగ్రహీతలు/హామీదారులు బ్యాంకుకు ఉన్న ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయిలు.
గమనిక: మా 127-భీమవరం శాఖ 13.75% వంతున ROI తో రూ.35,00,000/- మొత్తం సౌకర్యానికి కో-ఆబ్లిగెంట్‌గా ఉన్న మీలోని నం. 3 కొరకు మీలోని నం.4 అభ్యర్థన ప్రకారం ఆర్థిక సహాయం కూడా (AGRI SECOD MONTHLY : 512120020026063) తేది 28.06.2023న అందించింది. మరియు 20.05.2025 నాటికి మిగిలిన బకాయి మొత్తం రూ.41,77,348/-.

| మా బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల వివరణ | రిజర్వు ధర | వేలం తేదీ & సమయం |
|---|---|---|
| ఆస్తి-1 : (శ్రీ కొల్లేటి ధర్మరాజు తండ్రి నరసింహ స్వామికి చెందిన ఆస్తి) ఐటం నం.1 : పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, ముత్యాలపల్లి గ్రామ పంచాయతి, ముత్యాలపల్లి గ్రామం, డి.నం.1-24 సమీపమున, ఆర్ఎస్ నం.110/3లోని ఎ.2.49 సెంట్ల మొత్తం స్థలం ఎ.0.23 సెంట్లు లేదా 1,113.2 చ.గ.లు, విస్తీర్ణ మొత్తం. సరిహద్దులు : తూర్పు : కోపనాటి సూర్యప్రకాశ్‌రావు సన్స్ స్థలం 18 అ.ల వెడల్పు ఉమ్మడి మార్గం దక్షిణం : కొల్లేటి సుధాకర్ మరియు ఇతరుల స్థలం. పశ్చిమం : కొల్లేటి రామలక్ష్మి స్థలం. ఉత్తరం :సాధనాల మనిబాబు స్థలం 10 అ.ల వెడల్పు ఉమ్మడి మార్గం. ఐటం నం.2 : పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబ్‌రిజిస్ట్రీ ముత్యాలపల్లి గ్రామ పంచాయతి, ముత్యాలపల్లి గ్రామం, డి.నం.1-24 సమీపమున, ఆర్ఎస్ నం.110/2లోని ఎ.1.42 సెంట్ల మొత్తం స్థలం యొక్క ఎ.0.23 సెంట్లు లేదా 1,113.2 చ.గ.లు, విస్తీర్ణ మొత్తం. సరిహద్దులు : తూర్పు : కొల్లేటి రామలక్ష్మి స్థలం మరియు 10 అ. వెడల్పు మార్గం, దక్షిణం : సాధనాల వెంకటస్వామి నాయుడు మరియు ఇతరుల స్థలం. పశ్చిమం : అద్దాల పెద్దిరాజు మరియు ఇతరుల స్థలం, ఉత్తరం : సాధనాల మణిబాబు స్థలం. | రూ. 80,00,000/- (ఎనభై లక్షల రూపాయలు మాత్రమే) | 24.07.2025న మ.02.00 గం.కు |

**రీ-టెండరు-సహిత-వేలం ప్రదేశం: సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, భీమవరం శాఖ, శాంతి నివాస్, 17-2-50, రెస్ట్ హౌస్ రోడ్, భీమవరం, పశ్చిమ గోదావరి-534201. టెలిఫోన్ నం.:08816-230280, సెల్ నం.9397121831**

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, భీమవరం శాఖ, శాంతి నివాస్, 17-2-50, రెస్ట్ హౌస్ రోడ్, భీమవరం, పశ్చిమ గోదావరి-534201 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన భాగం-1కి మ.12.00 గం.కు లేదా ఆలోగా, భాగం-2కి మ.01.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.:08816-230280, సెల్ నం.9397121831 లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన భాగం-1కి మ.01.00 గం.కు, భాగం-2కి మ.02.00 గం.కు మరియు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 30.06.2025

అధీకృత అధికారి
సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com